TELUGU ENC

A DICTION

Arts, Sciences, Literature,
Informa

EDITOR-IN

K. V. LAKSHMA

VOLUM

Atak—

THE

ELUGU ENCYCLOPÆ

A DICTIONARY OF

Arts, Sciences, Literature, History and Ge
Information.

EDITOR-IN-CHIEF

K. V. LAKSHMANA RAO, M. A

VOLUME 2

Atak—Abul

'నహి జ్ఞానేన సదృశం పవిత్ర మిహ విద్యతే'

ఆంధ్రవిజ్ఞానసర్వస్వము

ముఖ్యసంపాదకుడు

కే. వి. లక్ష్మణరావు, ఎం. ఏ.

సంపుటము ౧

అటక — అబుల్

ప్రకాశకులు.

ఆంధ్ర విజ్ఞానసర్వస్వ కార్యాలయము

మౌంటురోడ్డు, మదరాసు.

౧౯౧౬.

౧౮౭-౭౧౮ పుటలు పియర్ లెసు ముద్రాలయమందును

తక్కినదంతయు

ఇండియా ప్రింటింగు వర్క్సు ముద్రాలయమందును ముద్రితము.

అటకమా. ఇది దక్షిణఅమెరికాలోని యుత్తరచిలీలో నొక మాగాణము. ౭౦౭౨౫ చదరపుమైళ్లు విస్తీర్ణము గలది. ఇందు వెండి గనులును, రాగిగనులును విశేషము గలవు. ఉప్పువిశేషముగ నెగుమతిచేయఁబడుచున్నది. ఈ ఫేర నొక యెడారిగూడ గలదు. అందు అగ్ని పర్వతములు గలవుగాని, యీ ప్రాంతమున వెండి, రాగి, సీసము, నిక్కెల్ లోహము వెలిగారము, ఇనుము, ఉప్పు మొదలగునవి దొరకును. ఈయెడారి అటకమా, లాస్ ఆండిస్, మున్నగు మాగాణములకు వ్యాపించి యున్నది.

అటగడ (జమీందారి.) ఇది చెన్నపురి రాజధానిలోని గంజాము జిల్లాకుం జెందిన యొక జమీను. ౧౮౭౪వ సం॥న కల్లికోట రాజాగారు దీనిని క్రయమునకుం గొనిరి. అప్పటినుండి యిది వారిస్వాధీనము లోనె యున్నది.

అటబాపో. ఇది వెనిజూలాలో నొకనది. ఉత్పత్తిస్థానమునకు నూటనలువది మైళ్లక్రింద సాన్ ఫెర్నాండోడీ అటబాపోవద్ద ఒరినోకో నదితోఁ గలియుచున్నది. ఇది కొంతవఱకు కొలంబియా వెనిజూలాలకు మధ్య యెల్లగ నున్నది.

అట్లలంటా. ఆర్కేడియాలోని అటలంటా అనుయువతి. ఈ సస్ కును క్లైమీనా కును బుట్టిన కూతురని లోకోక్తి. ఈమె పుట్టినతోడనే ఈమెతండ్రి ఈమెను పార్థినియన్ కొండలపై విడిచిపెట్టెనఁట. ఒక ఆడు యెలుఁగుపాలిచ్చి ఈమెను గాపాడెనఁట. ఈమెక్కు కాలిడ్లోనియన్ అడవిపందుల వేఁటాడుటయందలి చోద్యము. ఈమెతండ్రి ఈమెను పెండ్లి చేసికొమ్మని చెప్పఁగా ఈమె తన్ను నడకలో గెల్చునట్టివానినే పెండ్లాడెదనని ప్రతిజ్ఞ చేసెనఁట. మానవులలో నీమెను గెల్చునంతటి పురుషుఁడు లేనందునఁ దుదకు మిలానియన్ (Milanion) అను వాఁడు బంగారుపండ్లను మూడింటిని అక్కడక్కడ త్రోవలోఁ బారవేసి, వానిని నెత్తుకొనుటకు ఆమెవంగినప్పుడు ఆమెపరుగు నధిగమించి మాయోపాయముచేత గెల్చి ఆమెను పెండ్లియాడెను. వెనుక వీరిరువురు నొకా నొక ప్రదేశమున నొక దేవాలయములో మైథున మొనరించినందున శపింపఁబడి సింహములైరఁట.

౨. బియోటియన్ అటలంటా అనుయువతి యొకతె గలదు. ఆమె కథలను ఇట్లె చిత్రముగా నుడివెదరు. ఈమె స్కోనియస్ అను వాని కూతురు. ఈమె హిప్పోమెంసు అను వానిని బెండ్లాడెను. అటలంటా, అట్లాంటా అను రెండు పేరులును ఆర్టిమిస్ అను పేరునకు మాఱునామములే.

అటవీపురి. పాండవుల కాలమునందు కళింగదేశమునకు దక్షిణమునం దుండెను.

అటహాల్పా. పెరూదేశమును ఇంకా జాతీవారు పాలించుచుండిరి. వారిలో అటహాల్పా తండ్రియైన హైనా కేపెక్ ప్రసిద్ధి బడసి యుండెను. అతఁడు చనిపోయిన తో

డనే అటహాల్పాకు దాయాదియగు హాస్కారు అనువాఁడు రాజ్యమును గైకొనెను. అందువలన అటహాల్పా హాస్కారుతోఁ గొన్ని యుద్ధములు జేసి, తుదకు పూర్ణజయముఁ బొంది పెరూదేశమును బాలించుచుండెను. తరువాత కొంత కాలమునకు కాజామర్కా యందు ఫిజారోకును అటహాల్పాకును సమావేశము గల్గెను. అప్పుడా స్పెయినుదేశపు నాయకుఁడు అటహాల్పాను క్రీస్తుమత మవలంబింపుమనియు ౫-వ చార్లెసునకుఁ గప్పము గట్టుమనియు నిర్బంధింపఁగా అటహాల్పా దీని కెంతమాత్రమును సమ్మతింపక తిరుగఁబడెను. కావున స్పెయిను సైన్యము ఇంకా రాజును పట్టుకొని అతనిపరివారమును హింసించెను. తరువాత నొక సంవత్సరములోపల అటహాల్పాను నామకార్థముగా న్యాయస్థానమున విచారించినట్లు విచారణచేసి చంపించిరి.

అట్టకట్టుట. పుస్తకసంరక్షణార్థమై చేయుసదుపాయము లీశీర్షిక క్రింద వర్ణింపఁబడును. అట్టలచేతనే కాక పుస్తకములననేక విధముల రక్షించు మార్గములున్నవి. కావున పైశీర్షికయొక్క పేరు పూర్తిగసార్థకము కాదు. లిపి కనిపెట్టి వ్రాతప్రతులు ఆచరణములోనికివచ్చిన వెంటనే వానిని కాపాడుమార్గములఁగూడ కనిపెట్టియుండవలెను. వ్రాతప్రతులుగాని, ముద్రితగ్రంథములుగాని చెడపట్టకుండుటకును, పురుగు తినకుండుటకును, అనాదినుండి వివిధదేశములలో వివిధోపాయములున్నవి. పుస్తకములు క్రిమికీటకాదులచే నశింపకుండఁ జేయుటకు నాంగ్లభాషలో "బైండుచేయుట" యని పేరు.

బైండుచేయునప్పు డుపయోగించు అట్టలయొక్క పదార్థమును, ఆకారమును, పుస్తకములయాకృతినిబట్టి యుండును. పుస్తకములయొక్క యాకృతి దేశములనుబట్టి మాఱుచుండును. పెక్కుదేశములలో పురాతనశాసనములు రాతిమీఁదఁగాని రాగిరేకుల మీఁదఁగాని వ్రాయుచుండెడివారు. మనదేశములోఁగూడ నిదియే యాచారము. ఇట్టి శాసనములు శిథిలము కావుఁగాన నేవిధమైన రక్షణమును అవసరము లేదు. శాసనములుగాక యితర గ్రంథములు భూర్జపత్రముల మీఁదఁగాని తాటియాకుల మీఁదఁగాని వ్రాయునాచారము మనదేశములో నుండెడిది. ఉత్తరహిందూస్థానములో ముఖ్యముగ భూర్జపత్రములే వాడెడివారు. ఇదియొక విధమైనచెట్టుయొక్క తాట. దక్షిణహిందూదేశములో తాటియాకు విశేషముగ వాడుకలోనున్నది. ఇట్లే వివిధదేశములలో వివిధములగు సాధనములుండెడివి. ఈ యాకులమీఁదఁగాని తాటలమీఁదఁగాని వ్రాయుట మూఁడు విధములుగనుండెడిది. మనదేశములో ఆకులమీఁద నిలువుగ వ్రాయుట యాచారము. బౌద్ధులయొక్కయు, హిందువులయొక్కయు పురాతన గ్రంథములిట్లు వ్రాయఁబడినవియే. ఇతర దేశములలో ఆకులమీఁద అడ్డముగ వ్రాయుటయు, నిలువుగ పొట్టిపంక్తులలో వ్రాయుటగూడ వాడుకలో నుండెడివి. ఈ రెండు విధములుగ వ్రా

సిన దేశములలో వ్రాతప్రతులు చుట్టలుచుట్టి గొట్టములలోను కొయ్యపెట్టెలలోను భద్రపరిచెడివారు. వ్రాతగ్రంథములు అమూల్యములగుటచే ప్రతిదేశములోను ప్రాణతుల్యముగం జూచెడివారు. మనదేశములోంగూడ కొన్ని, ఖరారునామాలు, పత్రములు చుట్టలుగం జుట్టి గొట్టములలో దాచుట యాచారమై యున్నది. తాటియాకు గ్రంథములను భద్రపఱచుటకు ఎడమవైపునను, కుడివైపునను బెజ్జములువేసి యినుపకడ్డీలనుదూర్చి, కఱ్ఱపలకలతో నిరుప్రక్కల బంధించెదరు. అచ్చుకూటములు వెలసిన తరువాత ఇప్పటికిని సంస్కృతగ్రంథములు కొన్ని విడిపత్రములపై నచ్చొత్తి కొయ్యపలకలనడుమ భద్రపరచు నాచారముగలదు. ముద్రణయంత్రములు కనుంగొనక పూర్వమె బైండుచేయువారు కంటి కింపగునట్లు అట్టలపై చిత్రించుట కుపక్రమించిరి. ఇవి దేశాంతరములలో చిత్రకారుల యభిరుచినిబట్టి యుండెడివి. మనదేశములో పుస్తకములపై చిత్రవిచిత్రమైన పూజలుగాననగును. ముద్రణయంత్రములు ప్రబలి కాగితము వ్రాతకు సాధనమైనప్పటికిని బైండుచేయు వ్యాపారములో చిత్రకా[illegible]ని జీవనముపోలేదు. ఇప్పటికిని పుస్తకముల యట్టలపైచిత్రవిచిత్రములగు బొమ్మలుండును. మతగ్రంథముల మీందను, శుభకార్యముల పట్ల బహుమతి చేయుటకేర్పడిన పుస్తకములమీందనుముఖ్యముగచిత్తరువులుండును. అందునకై విదేశములలో గొప్ప గొప్ప బైండు వ్యాపారస్థు లీపాపులకు నెక్కుడు జీతములనిచ్చిచిత్రకారుల నేర్పఱచుకొనెదరు. ఈవ్యాసములో బైండుచేయునప్పు డుపయోగించు నవీన పద్ధతులు మాత్రము వర్ణింపంబడును.

అట్టలుకట్టు మార్గములు.

అట్టకట్టుటకు ప్రథమమున చేయవలసిన పని పుస్తకముకొఱకు ముద్రితములైన కాగితములను మడచుట. ఈ మడతలనే విభాగములు (Sections) లందురు. అచ్చువేయునపుడివి యొక్కొక్క కాగితముగానుండును. ఈ కాగితమును సగమునకు మడచి ఆ మడతను తిరిగి సగమునకు మడవవలయును. రాయల్, (Royal) ఆక్టేవో (Octavo) సైజు పుస్తకముల విభాగములకు పై విధమున రెండు మడతలుండును. క్రౌన్ (Crown) సైజు పుస్తకముల విభాగములకు మూండు మడతలుండును. మడచు విధము క్రిందిపటములోం జూపంబడినది.

(౫౯వ పుటలో ౧, ౨ పటములుచూచునది.)


ఈ ప్రకారము మడతపెట్టంబడిన విభాగములనన్నిటిని వరుసలెక్క ప్రకారముసరిగా బొత్తిపెట్టి చక్కగానణగియుండుటకు ఇందుకొఱకు నిర్మింపబడిన యొకప్రెస్సులో బాగుగా నొత్తవలయును.

ఈ ప్రెస్సుయొక్క పటము క్రిందంజూపంబడినది.


(౫౧వ పుటలో 3వ పటమును చూచునది.)

౧౨-వ పటము.


రాయల్, ఆక్టేవో సైజులకు.



మడవబడని కాగితము.




(మొదటి) సగము మడత.




(రెండవ) పాతిక మడత.

౧౩-వ పటము.


క్రౌన్ సైజుకు.




మడవబడని కాగితము.




మొదటి మడత.



రెండవ మడత.




మూడవ మడత.



3-వ పటము.

తరువాత వానిని ఆ ప్రెస్సులోనుంచి తీసి మడవఁబడిన వానియొక్క భాగములు ముందు వెనుకలకు హెచ్చు తక్కువలుగా కనుపడకుండులాగున సమముగా బొత్తిపెట్టి కుట్టుటకు వీలగులాగున రంధ్రములు చేయు నిమిత్తము యీబొత్తిని ఒక ప్రెస్సులో బిగించవలయును. పిమ్మట కుట్టఁబడువైపున పైభాగమున నొక యంగుళమును క్రిందిభాగమున ఒకటింబాతిక అంగుళమును విడచి తక్కిన ప్రదేశమును సమానాంతరములుగా నాలుగు భాగములుచేసి గురుతు నిమిత్తము పెన్సిలుతో అడ్డముగా గీతలుగీచి ఆగీతలవెంబడిని జవరంపముతో పీసము అంగుళమున్న నెక్కువలోతు పెగకుండులాగున మట్టముగా కోయవలయును. ఇట్లు కోయఁబడిన పిమ్మట నీ విభాగములను విడదీయునపుడీ కోతలు దాటి వెనుకభాగమున రంధ్రములవలె నేర్పడి వీనియందు సూదిని జొన్పి కుట్టుట కుపయోగపడును. దీని వివరమీ క్రిందిపటమునఁ జూపఁబడినది.



౪-వ పటము.


ఏ. ఏ. ప్రెస్సుదిమ్మలు.
బి. విభాగముల బొత్తి.
సి. జవరంపము.

ఈ ప్రెస్సు పుస్తకములకు వీపు చేయుటకు కూడ నుపయోగపడును.

రెండవపని కుట్టుట. ఇందుకొరకు నిర్మింపబడిన ప్రెస్సులో నూలు దారములనుగాని పటములో చేపునుగానిజూపఁబడిన ప్రకారముదృఢముగా కట్టవలయును. వీనిని విభాగములవీపుపై నెంతెంత దూరములలో కోతలు కోయబడియున్నవో అంతే దూరములలో

పైకోత క్రిందికోతలను విడిచిపెట్టి మధ్యనున్న మూఁడు కోతలకు మూఁడింటిని కట్టవలయును. ప్రెస్సుయొక్క స్తంభములకమర్పఁబడినమర దిమ్మెలను పైకి త్రిప్పుటవలన దారములను ఇష్టము వచ్చినంత బిగింపవచ్చును. తరువాత నావిభాగములలో చివరసంఖ్యతో కుట్టుకు మొదలిడవలయును. అనగా నొక పుస్తకమునకు ౧౨ విభాగములున్నయెడల ముందుగా ౧౨ నెంబరుగల విభాగముతో ప్రారంభించి దానివెనుక ౧౩ దానితరువాత, ౧౨. యీప్రకారముగా తీసికొని కుట్టుచుండవలయును గావున కడపటి విభాగమును తీసికొని దానిపైపుపై కోయఁబడిన ౫ కోతలలో పైక్రింది కోతలను రెంటిని వదలి వానిమధ్య నున్న 3 కోతలును కుట్టుప్రెస్సుకు కట్టఁబడిన 3 దారములకు సరిగా చేర్చియుంచి పుస్తకములను కుట్టుట కేర్పడిన దారమును రెండు మూఁడడుగులు తీసికొని సూదిలో నెక్కించి ముందుగా క్రిందువైపు మొదటి రంధ్రము ద్వారా పైభాగమునుంచి లోనికి సూదిని పోనిచ్చి అక్కడనుంచి దానిపై రంధ్రము ద్వారా వెలుపలకు రానిచ్చి అక్కడనున్న ప్రెస్సుకు కట్టబడిన దారమును లోగొనితిరిగి ఆ రంధ్రముద్వారానే సూదిని లోపలకు రానియ్యవలయును. అక్కడనుంచి దానిపై రంధ్రమునకును దాని తరువాత దానిపై రంధ్రమునకును పైప్రకారముగానే దారమునుతీసి దానిపైనున్న మొట్టమొదటి రంధ్రముద్వారా వెలుపలకు తీయవలయును. పిమ్మట దారముయొక్క కొసను ప్రారంభించినచోట రెండంగుళములు మిగులులాగున దారమునంతయులాగి ఆకొసను వ్రేలితో నొక్కిపట్టి రెండవకొసను గట్టిగా లాగినయెడల నీకుట్టుదారము చక్కగా ప్రెస్సు దారములతో బిగియును. పిమ్మట దానివెనుకటి సంఖ్యగల విభాగమును తీసికొని వెనుకటివలెనే ప్రెస్సుదారముల దగ్గరగా చేర్చి కుట్టు దారమునకు సమీపముగా నీవిభాగము యొక్క పైవైపు మొదటి రంధ్రమునను గనుక నిప్పుడు సూదిని ఆరంధ్రము ద్వారా బోనిచ్చి వెనుకటివలెనే దారమును యీ ౫ రంధ్రములలోనుంచి తీసి బాగుగా బిగించి లాగవలయును. అప్పుడు యీరెండు విభాగములును కలసి యుండును. మొదట కుట్టు ప్రారంభించినచోట మాత్రము యీ రెంటికిని సంబంధము విడియుండును గనుక మొదట విడచిపెట్టిన ౨ అంగుళముల దారపు కొసను యీ కుట్టుదారముతో చేర్చి ముడివేయవలయును. ఇప్పుడివి పూర్తిగా నేకమై యుండును. తరువాత నింకొక విభాగమును తీసికొని పైప్రకారముగానే వెనుకటివానితో చేర్చి కుట్టవలయును. ఇంతటినుంచి ఒక్కొక విభాగమునుకుట్టి దారమును బిగలాగిన వెంటనే దానిక్రింది భాగముయొక్క కుట్టులోనుంచి సూదినిపోనిచ్చి దానితో నీదారమును ముడివేయుచుండవలయును. ఈలాగు చేయని యెడల విభాగములన్నియు నంతటకు కలసి యుండవు.

ఈ విధమున నొక్కొక విభాగమును కుట్టుచు మొదటివిభాగము వచ్చునప్పటికి కుట్టు పూర్తియగును. విభాగముల యొక్క గి రంధ్రములనుంచి దారమును పోనిచ్చు విధము క్రింది పటముతో స్పష్టముగా చూడనగును.




౫-వ పటము.

కుట్టు ప్రెస్సు.

ఏ.ఏ. మరస్తంభములు. బి.బి. మరదిమ్మలు. వీటిని పైకి త్రిప్పుటవలన దారములు బిగియును.

సి. అడ్డు కమ్మి. డి.డి. ప్రెస్సుదారములు. వీటిని ప్రెస్సుయొక్క పీఠము క్రిందనుండితీసి సి. అడ్డుకమ్మికి కట్టవలయును.



౬-వ పటము.

ఏ. విభాగము. బి. విభాగముయొక్క పైభాగము.


సి. విభాగపు మడత లోపలిభాగము.

డి. దారము- ...... ఈ గీటు విభాగము లోపలనున్న దారముయొక్క స్థితిని తెలుపును.

ఈ విధమున కుట్టుపనిముగించిన తరువాత కుట్టఁబడిన విభాగము లన్నియు దగ్గఱగా నుండులాగున చేతిప్రేళ్లతో బాగుగా దట్టించి, వెనుకభాగమున నంతటను సమముగా జిగురును పూసి, ఆరినతరువాత కుట్టుప్రెస్సుకు కట్టఁబడిన దారములను పుస్తకమున కిరువైపులను ఒక్కొక యంగుళము కొనలుండు లాగున కత్తిరించి వేయవలయును. ఇప్పుడు కుట్టు ప్రెస్సులో నుంచిపుస్తకము పైకివచ్చును. ఈ కుట్టులలో నింకను మరికొన్ని విధములు కలవు గాని వానిలో నీవిధమే దృఢమైనది గనుక నిది యేయిందు తెలుపఁబడినది. తక్కిన వానిని ప్రత్యేకముగా వ్రాయఁబడిన పుస్తకబంధనమను గ్రంథమునఁ జూడనగును.

కుట్టుపని పూర్తియైనపిమ్మట పుస్తకపు అంచులు సరిగానుండుటకు కోత కోయవలసి యున్నది. అంచులుకోయుటకు ముందుగా పుస్తకారంభమున ముఖపత్రమును

(Titlepage) అంటించి పిమ్మటపుస్తకమునకిరు
వైపులను రెక్కకాగితములు (Fly leaf) నం
టించవలయును. ఇవి పుస్తకముల కట్టలనంటిం
చుటకు పయోగపడును. ఈ కాగితములు
సాధారణముగ్గ తెల్లగానున్ను; వివిధములగు లతా
చిత్రములతోనున్ను, యిందునిమిత్తము నిర్మిం
పబడియుండును. వీనిని యెండుపేపర్సు (End-
papers) అనగా చివరకాగితములనివాడుదురు.
దృఢమైన తెల్లకాగితమునైనను వాడవచ్చును.
యెండు కాగితములకు రంగులుగాని చిత్తరువు
లుగాని యొకవైపుననే యుండుట వలన నీకాగి
తములను వాడునెడల చిత్తరువులు లేనివైపుననే
పుస్తకమున కంటించవలయును. పుస్తకపు కొ
లతకు రెట్టింపుగా నీకాగితములను రెండిటిని దీసి
కొని సగమునకు మడచి మడతవద్ద కాలంగుళ
ము వెడల్పున కాగితము పొడుగునను జిగురు
రాచి పుస్తకపు వీపు ప్రక్కనని రువైపులనొక్కొ
కటివంతుననంటించవలయును. తరువాత కోత
నిమిత్తము కొయ్యతో జేయబడిన పలకలను
(Cutting Boards) కోయవలసిన యంచు
దగ్గర కోసివేయవలసిన భాగమును ఘట్టము
గా నొకగీతగీచి యీ గీతకుసరిగా కోతపలక
యొక్క పై అంచువచ్చు లాగుననుంచి రెండ
వవైపున పుస్తకపు అంచుకుసమముగా
నేదేని యట్టనొక దానిని దాపుచేసిదాని వెనుక
రెండవకోతపలకనుచేర్చి వీనినన్నిటిని కదిలి
పోకుండులాగున జాగ్రత్తగా కోత ప్రెస్సులో
జేర్చి బిగింపవలయును. పిమ్మట దానిని కోయ
నిమిత్తము నిర్మింపబడిన చిత్రికవంటి సాధన
ము కోతప్రెస్సుపైనున్న కాలువవంటిగాడి
లో కత్తితోనివైపును తగిలించిదానిపిడిని రెండు
వైపుల రెండుచేతులతో బట్టుకొనిముందు
కు వెనుకకు త్రోయుచు చేతిలోనున్న పిడిని
కొంచెముకొంచెముగా త్రిప్పుచుండవలెయును.
ఇట్లు త్రిప్పుచుండుటచే దానిలో నమర్చబడిన
కత్తికొంచెముకొంచెముగా ముందుకు జరుగుచు
చిత్రికను త్రోయుచుండుటవలన పుస్తకపు కా
గితములకు రాచుకొని వానిని తెగకోయు
చుండును. పూర్తిగా తెగువరకు నీలాగు కోసి
ప్రెస్సులో నుంచి పుస్తకమును తీసి పై ప్రకా
రముగా నే మరియొక యంచును కోయవల
యును. ఈ విధముగా పుస్తకముయొక్క
మూడంచులను కోయవలయును. ఈపని
చేయునపుడు ముద్రితభాగమునకు వెలుపలి
భాగము (Margin) అన్నివైపుల సమము
గానుండు లాగునను, పుస్తకమునకై మూలలు
లేక ఘట్టమునకు సమముగానుండు లాగునను
సరిచూచుకొని జాగరూకతగా నుండవలయు
ను. ఈకోతప్రెస్సును సాధారణపుస్తక బంధ
కులు మాత్రమే వాడుదురు. గొప్పముద్రణ
యంత్రాలయములలో నీపనికి కట్టింగు మెషీ
ను (Cutting Machines) లను వాడుదురు.
అవి యీపనిని శ్రమముగా నెరవేర్చి వందల
కొలది పుస్తకముల నతిశీఘ్రకాలమున కోయ
గలవు. వీనిరూపమీ ప్రక్కపటములో జూపబ
బడినది.



౭-వ పటము.

ఏ. ఏ. ప్రెస్సుదిమ్మలు.


బి. చిత్రిక.

సి. చిత్రికయొక్క పిడి కోయునప్పుడు దీని రెండువైపులను రెండు చేతులతో పట్టుకొని ముందుకు కొంచెము కొంచెముగా త్రిప్పుచుండవలయును.

డి. చిత్రిక సరిగా ముందు వెనుకలకు నడచుట కుపయోగపడు కాలువ.


౮-వ పటము.

కట్టింగు మెషీను.



ఇకను పుస్తకమునకు వీపునేర్పరుప వలయును. దీనిని(Backing) అందురు. పుస్తకములకే పనిచేయుటచే క్రింది పటములో చూపఁబడిన ప్రకారముగా సొగసైన రూపమేర్పడి చదువుటకు చాల నుపయోగకరము గానుండును.


౯-వ పటము.



పుస్తకమునకు వీపునేర్పరచుటకు ముందుగా ౧౦ వ పటములో కనుపరచిన రీతిని వీపుభాగమున నర్ధవలయాకారమైనగూనును, ముందుభాగమున నదేవిధమైన పల్లమును వచ్చులాగున చేతివ్రేళ్లతోఁ బుస్తకపుకాగితములను మెలకువగా లాగియును వీపుభాగ

మున నిరువైపుల ముందుకు నొక్కియును పైనచెప్పబడిన ధ్యాకృతి వచ్చులాగున చేసి. (Backing Boards) అనిచెప్పబడు కొయ్యపలకలను పుస్తకముయొక్క వీపునకు ముప్పీసము అంగుళము యెడమున నిరువైపులను పటములో కనుపరచిన విధమునచేర్చి ప్రెస్సులో బిగింపవలయును.

౧౦-వ పటము.



ఏ. వీపుచేయబడిన భాగము.

బి.బి. వీపుచేయుటవలన పుస్తకపు వీపు భాగమున నిరుప్రక్కలను పైకిపెరిగిన కోణములు. (ఇవి పైకిపెరుగుటచే పుస్తకముపై కట్టబడు నట్టలయొక్క దళసరి వీనిలో నిమిడియుండి పుస్తకపు వీపు అట్టలతో కలసి మట్టముగానుండును).

సి.సి. వీపు పలకలు. (Backing Boards).


డి.డి. ప్రెస్సు దిమ్మలు.

ఇందుకు ౧వ పటములోఁ గనుపరచిన ప్రెస్సు నుపయోగింపవచ్చును. తరువాత వీపుచేయుసుత్తితో (Backing Hammer) పైనచెప్పబడిన విధమున వీపుభాగమున దృఢముగాను, నున్నగాను అర్ధవలయాకారము పటములో చూపబడిన విధమున వచ్చువరకు మెల్లగా కొట్టుచుండ వలయును. తరువాత దీనికంతటను జిగురురాచి యీవీపుయొక్క కొలతకు సరిపోగా నిరుప్రక్కల నొక్కొక యంగుళమెక్కువగాను, పైభాగమునను క్రింది భాగమునను ¼ అంగుళము తక్కువగా నుండునంత సైజుగుడ్డనుగాని మరియేగట్టి గుడ్డనుగాని దానిపై నంటించ వలయును.

వీపు యేర్పడిన తరువాత చేయుపని అట్టల నతికించుట. ఇందుకు మిల్బోర్డ్లు (Millboards) లనఁబడునట్టలు మిక్కిలి ప్రశస్తమైనవి. ఇప్పుడు వీనికంటె తక్కువ వెలగల గడ్డియట్టలను (Straw boards) వాడు చున్నారు. ఇవి ౨౫ x ౩౦ అంగుళముల కొలతగలిగి ౪ పౌను మొదలు ౨౪ పౌనులవరకు బరువు కలిగి యుండును. బరువు హెచ్చినకొలఁది వీని దళసరి హెచ్చుచుండును. మిక్కిలి పలుచని పుస్తకములకు ౪పౌను అట్టలను సాధారణపు పుస్తకములకు ౧౦పౌను అట్టలును పెద్దపుస్తకములకు ౨౦ లేక ౨౪ పౌనుఅట్టలునుఉపయోగించఁబడు చుండును. పైన చెప్పఁబడిన యట్టలలో దేనినైనను తెచ్చి పుస్తకముయొక్క కొలతకు వీపు భాగమునకు గాక తక్కిన మూఁడు భాగములకంటె సుమారు ముప్పీసము అంగుళముపైని మిగిలి యుండులాగున కొలత వైచి ఆకొలతకు సరిగా రెండుముక్కలను తెగకొట్టవలయును. తరువాత వీనినిపుస్తకమున కిరువైపుల సమముగాజేర్చి పుస్తకము కుట్టునప్పుడు ఒక్కొక్క యంగుళము కొస మిగిలియున్న యడ్డదారములనువీపుపై నంటింపఁబడిన గుడ్డకు బెజ్జముచేసి దాని ద్వారమునపైకి తీసి వీనికి సరిగా నట్టలకు పైనుంచి యేటవాలుగా నొక బెజ్జము చేసిపై దారములను దానినుండి పైకిలాగి వానిపైన విప్పి

యట్టలపై నంటించవలయును. వీపున కంటిం చిన గుడ్డయొక్క రెండంచులను పుస్తకము యొక్క రెండు రెక్క కాగితములకు (Fly leaf) నంటించవలయును. తరువాత పుస్తకముల నిమిత్తము సిద్ధము చేయబడిన తోలునుగాని కాలికో గుడ్డనుగాని అన్ని వైపుల నట్టలకంటె ౛ అంగుళము యొక్కువగా నుండులాగున కొలతవైచి రెండువైపులను నిటి యొక్కటే వచ్చులాగునజూచి కత్తిరించి క్రింది ౧౧ వ పటములోఁ గనబడుచిన విధమున ముందుగా నొక యట్టపై నంటించి పుస్తకపు వీపుతో సమాన కొలతగల బిరుసైన దళసరి కాగితము ను పుస్తకపు వీపు భాగమును కప్పునట్లుగుడ్డ లోపల నంటించి పిమ్మట రెండవవైపుననున్న యట్టకు తక్కిన గుడ్డనంటించవలయును.

౧౧-వ పటము.




ఎ. పుస్తకము. బి.బి. అట్టలు. సి. కాలికోగుడ్డ.

డి. అట్టలోపలకు మడచి యంటింపబడిన కాలికో గుడ్డయంచు. (మిగిలిన యంచులను కూడనిట్లేయంటించ వలయును) ఇ. అట్టలలోనికి యెక్కించ బడిన (పుస్త కపు) అడ్డుదారములు. ఫ. రెక్క కాగితముల కంటించ బడిన వీపుగుడ్డ.

తరువాత గుడ్డయొక్క యంచుల నన్నిటిని మూలలనుకత్తిరించి యట్టలలోపలకు మడచి యంటించి పుస్తకమునకు రెండువైపుల నం టించబడియున్న రెక్క కాగితముల పైపొరటల నట్టలకంటించి చక్కగా నణగియుండుటకు ప్రెస్సులో నదిమి యుంచి తీయవలయును.

ఇప్పటికి దాదాపుగా నట్టకట్టుటపూర్తి యైనదనియే చెప్పవచ్చును. ఇంకను దీని పై యలంకరణములు కొన్నియున్నవి. అవేవన అట్టలపై నంచులను చిత్రించుట, వీపుపైఁగొన్ని మట్టములను, చిత్తరువులను, పేరును వేయుట మొదలగునవి. వీనిలో నట్టలపై నంచులు వేయుటకుఁ బ్రథమమున నీక్రింది పటములోఁ

౧౨-వ పటము.



పుస్తకపు అట్టపైచేయబడు చిత్రములు.

జూపఁబడిన రీతినినాలుగు మూలలయందును తీపనికొరకు నిర్మింపఁబడిన యచ్చుదిమ్మెలను సమముగాఁజేర్చి గట్టిగా నదుమగాఁ వాటియా

క్కృతి దానిపైనొక్కఁడు పడియుండును. ఈ మూలలమధ్య నుండుమట్టములను గాని, లత లనుగాని, వానికొఱకుఁ జేయఁబడిన పిడిగల చక్రములు నదుముచు దొర్లించుట వలనఁగాని (Palettes) పేలట్లతో నదుముట వలనఁగాని యేర్పరుప వచ్చును. ఈపనిముట్లలో పెక్కు రకముల చిత్తరువులు చెక్కఁబడి యుండును. ఈ పనినంతయు నట్టలకు గుడ్డనంటించిన పిమ్మట నాతడిటూరకుండు లోపల నెఱవేర్చ వలయును. (నవీన పుస్తకములకు సాధారణ ముగా నీపనిచేయ) బడుటలేక పోయినను పని వారలకు తెలియు నిమిత్తము వ్రాయఁబడినది.

పుస్తకపు వీపునమట్టములను గాని చిత్ర ములను గాని పేరునుగాని క్రింది పటములోఁ గనఁబఱచిన విధముగా వేయఁదలఁచినయెడల పుస్తకమును వీపుభాగముపైకి కనుపడులా గున నొకప్రెస్సులో బిగించి బంగారు రేకును (Gold leaf) సన్న పేలికలుగాఁగత్తిరించిపైన చెప్పిన మట్టములు, పేర్లు, మొదలగు చోట్ల నతి జాగ్రత్తగాఁజేర్చి పైన పేర్కొనఁబడిన పేలట్లను బాగుగా వేడియెక్కునటులఁగాచి వెం టనే బంగారు రేకుపైనుంచి గట్టిగానదుముట వలన నీ పనిముట్టుయొక్క వేడిచే బంగారు రేకుకఱఁగి యచ్చుతో నొక్కఁబడినంత భాగ మును జక్కగాపుస్తకమున కంటుకొని యుం డును. పేరు వేయుటకుని త్తడితోఁజోయఁబడిన యక్షరములను పిత్త లాక్షరభాజన (Brass Type holder) అను పనిముట్టులో సరిగాఁ గూర్చిపైప్రకారము వేడిచేసి బంగారు రేకు మీఁదుగా నదుమవలయును. అచ్చుతోనొక్క

౧౩-వ పటము.



పుస్తకపు వీపుపై చేయబడు చిత్రములు, పేరు మొదలగునవి.

బడిన భాగమునకుపైగానున్న నొక్కఁబడని బంగారు రేకునుకుంచెతో మెల్లగాఁదుడిచిన యెడల రాలిపోవును.

శ్రీ. తి. పి.

అట్టపాడి లోయ... ఇది యొక లోయ, లేక, కనుమకు పేరు. చెన్నరాజధానిలోని మలబారు జిల్లాకు చెందిన వలవనాడు జిల్లాలో నున్నది. దీని వైశాల్యము సుమారు ౨౫౦ మైళ్లు. భవాని నది దీనిలో ప్రవహించుచున్నది. ఈ ప్రదేశమునందు జనులు చలిజ్వరములుచే బాధపడెదరు.

అట్టహాసము. భారత వర్షీయ తీర్థము.

అటారి. ఇది పంజాబు రాష్ట్రమందలి మూల్టానుజిల్లాకుం జెందిన కబీర్ వాలాతాలూకాలోని యొకగ్రామము. మహాఅలెగ్జాండరు హిందూదేశముపై దండెత్తివచ్చి స్వాధీనపఱచుకొనిన పట్టణములలో మూడవది ఇదియే. ఇప్పుడిచ్చట శిథిలమగుచున్న కోటయొకటి కలదు.

అట్బారానది. అబిసీనియాలోనిది. నైలునది యొక్క ఉపనది, పొడవి ౮౦౦ మైళ్లు. దీనియొద్దను అట్బారా యుద్ధము జరిగెను.

అట్లాంటా. అమెరికా యందలి యునైటెడ్ స్టేట్సులోని జార్జియాయను భాగమునకు ముఖ్యపట్టణము. ఇచ్చట నుండి పొగాకు, ప్రత్తి, ఎగుమతి యగును. ఇచ్చట యంత్రములు విక్రయించుట, యంత్రసాధనములు చేయుట, స్నున్నితమైన కొయ్యసామానులు చేయుట, కాగితములు చేయుట, ప్రత్తిపనులు, ప్రత్తిగింజలు నూనెతీయుట, మొదలగువ్యాపారములుగలవు. ఇచ్చట ౧౮౬౭వ సంవత్సరమున క్లార్కు సర్వకళాశాల ప్రతిష్ఠింపబడెను. ౧౮౮౧వ సంవత్సము నీగ్రో జాతివారైన నల్లమనుష్యులకు అట్లాంటా సర్వకళాశాలయు నిచ్చట స్థాపింపబడియుండెను.

అట్లాంటిక్ మహాసముద్రము.

మన ప్రపంచము భూభాగమనియు జలభాగమనియు వ్యవహరింపబడు రెండుముఖ్యవిభాగములుగ కన్పించుచున్నది. అందు జలభాగము మూడింట రమారమిగ రెండుపాళ్లని చెప్పవచ్చును. స్థూలదృష్టితో వర్ణించవలసినచో భూ భాగమంతయు జలభాగమునుండి పైకుబికి వచ్చియుండు ద్వీప మనిన నంతవిపరీతముగా నుండదు. ఈ ద్వీపముయొక్క చుట్టును వంకర టింకరగా సముద్రము ఆవరించియున్నదనుట పై వర్ణనచేతనే స్పష్టము. ఇట్లావరించియుండు జలభాగమును ఒక్కటిగ వ్యవహరించుటగాని అనామకముగా వ్యవహరించుటగాని మానవుని కార్యములకు అనుకూలము కానందుచేత భూభాగమును ఖండములుగా విభజించి వ్యవహరించు నట్లే దీనినికూడ ఖండములుగా విభాగించి వ్యవహరించుచున్నాము. ఈ ఖండములకే మహాసముద్రములని పేరు.

ఇట్టి మహాసముద్రములలో నొకటి అట్లాంటిక్ మహాసముద్రము. విస్తీర్ణమున అట్లాంటిక్ మహాసముద్రము మొదటిది కాకున్నను ఇతరవిధముల నిదియే మిక్కిలి ప్రముఖమనుటకు సందేహము లేదు. ఆకారమున నీ మహాసముద్రము అవగ్రహమును S పోలియుండును. ఇది ఉత్తర అమెరికా దక్షిణఅమెరికా తూర్పు తీరములను ఐరోపా ఆఫ్రికాల పశ్చిమతీరమును నొరసికొని ఉత్తరమున ఉత్తరమహాసముద్రముతోను దక్షిణమున దక్షిణమహాసముద్రము హిందూమహాసముద్రముల తోను కలిసిపోవుచున్నది. ఈ మహాసముద్రపు విస్తీర్ణము రెండుకోట్ల యేబదిలక్షల చదరపు మైళ్లు. ఈ మహాసముద్రమున నుండు గొప్పవిభాగములు కొన్ని కలవు. అట్టివానిలో పడమటి పార్శ్వమున కరిబియన్ సముద్రమును మెక్సికో సింధుశాఖయు సెంటులారిన్సు సింధుశాఖయు హడ్సను మహాఖాతమును తూర్పుప్రక్కన మధ్యధరా సముద్రమును నల్లసముద్రమును ఉత్తరసముద్రమును బాల్టిక్ సముద్రమును పేర్కొనదగినవి.

ఈ అట్లాంటిక్ మహాసముద్రమును రెండుముఖ్య విభాగములుగ వర్ణింపవచ్చును. ఉత్తరఅట్లాంటిక్ మహాసముద్రము, దక్షిణ అట్లాంటిక్ మహాసముద్రము. ఉత్తర అట్లాంటిక్ మహాసముద్రమును ఉత్తరమహాసముద్రముతో కలుపునట్టి మార్గములు నాలుగు కలవు. ౧ హడ్సను జలసంధి; వెడల్పు రమారమి అరువదిమైళ్లు. ౨ డేవిస్ జలసంధి; వెడల్పు రెండువందలమైళ్లు. 3 డెన్మార్కుజలసంధి; గ్రీన్లాండు ఐస్లాండుమధ్య వెడల్పు ౧౩౦ మైళ్లు ౪ నార్వేజియన్ సముద్రము; ఐస్లాండు నుండి నార్వే ఉత్తరతీరము వరకు వెడల్పు రమారమి ౪౦౦ మైళ్లు. ఈ నాలుగు మార్గములు అట్లాంటిక్ మహాసముద్రము నుండి ప్రారంభమగు ప్రదేశమున ఉత్తరట్లాంటిక్ వెడల్పు ౬౦వ అక్షాంశము వద్ద ౨౦౦౦ మైళ్లు; ౫౦వ అక్షాంశమునకు వచ్చునప్పటికి ఐర్లాండు న్యూఫౌండులాండ్లకు మధ్య ఈ వెడల్పు ౧౭౫౦ మైళ్లకు తగ్గుచున్నది. అచ్చటనుండి మరల హెచ్చుచు ౪౦ వ అక్షాంశము వద్ద ౨౫౦౦ మైళ్లు అగుచున్నది. భూమధ్య రేఖ వద్దకు వచ్చునప్పటికి దక్షిణ అమెరికా యందలి స్వాన్ రోక్ అగ్రమునుండి పశ్చిమ ఆఫ్రికాలోని పాల్మస్ అగ్రమువరకును ౧౬౦౦ మైళ్లు వెడల్పు కన్పించుచున్నది. ఈ విధముగా వెడల్పు విభేదములచేతనే ఉత్తరట్లాంటిక్ చుట్టునుండు తటరేఖ యెంతవంకరటింకర అయినదియు నెంతనిడివైనదియు సూచితమగుచున్నది.

ఈ విషయమున ఉత్తరట్లాంటిక్ నకును దక్షిణట్లాంటిక్ నకును మిక్కిలి తారతమ్యమున్నది. దక్షిణట్లాంటిక్కు నందు భూమిలోనికి చొరబడు అఖాతములుగాని సముద్రములుగాని సింధుశాఖలుగాని లేనే లేవు. దానినానుకొని యుండు తటరేఖయు నే మాత్రమును వంకర టింకరలను ప్రదర్శిం

చుట లేదు. దక్షిణమహా సముద్రముతో చేరుచోట వెడల్పు ఎక్కువ. దక్షిణ అక్షాంశరేఖ ౩౫ న వెడల్పు ౩౭౦౦ మైళ్లు.

ఈ మహాసముద్రమునకు తూర్పు పడమరలలో నుండు భూఖండముల ఏటవాలు ఈ సముద్రపు వైపునకే అగుటచేత ఆ భూఖండములయందు ప్రవహించు ముఖ్యనదీనదములలోననేకములు ఇందు ప్రవేశించుచున్నవి. అందుచేత ఆ భూఖండములపైబడు వర్షపాతమున విశేషభాగము ఈ మహాసముద్రమును చేరుచున్నది.

సెంట్ లారిన్సు, మిసిసిపీ, ఒరినాకో అమెజాన్, కాంగో, నైజర్, ల్వారు, రైను, ఎల్బు, మధ్యధరా సముద్రమున సంగమించు రెండు నదులు బాల్టిక్ సముద్రమున సంగమించునదులు ఇవన్ని యును అట్లాంటిక్ మహాసముద్రములోనికి తమజలములను జేర్చునవియె. రమారమి ౧౩౫౦౦౦౦ చదరపుమైళ్లు భూభాగమునుండి ప్రవహించు జలమంతయు ఈమహాసముద్రములోనికి చేరుచున్నవని లెక్క వేసియున్నారు.

సముద్రభాగమును భూభాగమువలె మిట్ట పల్లములై చిత్ర విచిత్రములుగా పరగుచున్నది. భూతలముపై సముద్రమట్టము మొదలు హిమాలయమునందలి ఎవరెస్టు శిఖరము (రమారమి ౬ మైళ్లవరకును) మిట్ట పల్లములేర్పడునట్లు జలభాగమునందును భూమట్టము మొదలు పసిఫిక్ మహాసముద్రమున ఒక్కెడ ౬ మైళ్లకు పైబడి పల్లము వరకును మిట్టపల్లములు కలవు. ఈ కారణము చేత సముద్ర మట్టమునకు పైన గన్పించు భూభాగమువలెనే సముద్రమున లోపలగూడ నొక్క భూభాగ మున్నది. ఇది ఎత్తుగనుండి భూఖండమునకు అంటి కొంత దూరము మిక్కిలి యెక్కువగు పల్లముగ మారువరకును కాంటినెంటల్ షెల్ఫు (అనగా భూఖండ సంలగ్నమను) పేరున బరగుచున్నది. ఈ భూఖండసంలగ్నముగాక అచ్చుటచ్చుట భూతలముపై కొండవరుసలు, పీఠభూములుండురీతినే సముద్రాంతర్భాగమునను ఉచ్చస్థానములును మిట్టవరుసలును గలవు.

అట్లాంటిక్ మహాసముద్రమున పైన జెప్పబడిన అవగ్రహాకారమును అనుసరించుచునే ఆవలి ఈవలిగట్టులకు నట్టనడుమున ఉత్తరము ౫౦ వ అక్షాంశరేఖకును దక్షిణము ౫౦ వ అక్షాంశరేఖకును మధ్య నొక మిట్టలవరుసగలదు. ఈవరుస యున్నంతదూరమును సముద్రపులోతు రమారమి ౧౭౦౦ బారలు. ఈ మిట్టలవరుస ఉత్తరపు చివరను విరివియై ఎత్తై సముద్రముమీదికి పొడసూపి అజోర్సు దీవులుగా పరిణమించుచున్నవి. ఆ ప్రాంతమునుండి ఈవరుస తూర్పుపడమరలకు తిరిగి ఐరోపాలోని ఐర్లాండునుండి ఉత్తర అమెరికాలోని న్యూఫండులాండువరకును వ్యాపించుచున్నది. సముద్రముగుండా వార్తలనంపవలసివచ్చినయెడల తంత్రులనువైచుటకు సముద్రములోనిఎత్తుప్రదేశము లేఆధారముకావలెను. అట్టి ఆధారముతూర్పు పడమరలకువ్యాపించిన

మిట్టలెషరుస. అయ్యుండుటచేత దానికి తెలి గ్రాఫుల మిట్టయని పేరుపడియున్నది.

పైన వర్ణింపబడిన అవగ్రహాకారమగు మిట్టలవరుసల కిరుప్రక్కలను కొలచి క్రమముగా భూఖండముల దరివరకును అనగా నిదివరకుచెప్పిన భూఖండ సంలగ్న మట్టుదాకువరకును అగాధమగు లోతులు కలవు. ఇవి ఒక్కొక్క ప్రదేశమున నొక్కొక విధమగుచు కన్పించుచున్నవి.

దక్షిణాట్లాంటిక్ అంతర్భాగము నందలి మిట్టపల్లముల విషయమై ఇంకను పరిశోధనలు జరుగుచునే యున్నవి.

అట్లాంటిక్ మహా సముద్రము నందు విశేషముగా పేర్కొనదగిన దీవులెన్నో లేవు.

మధ్య ధరాసముద్రమునందలి కొన్ని దీవులును, ఐసులాండును, బ్రిటిషుదీవులును, అమెరికాలోని న్యూఫౌండులాండు పశ్చిమ ఇండియా దీవులును ఫాక్లాండుదీవులును, భూమండలమునకు అనతిదూరమున భూఖండమునకు చేరినట్లే యున్నదగి యున్నవి. మధ్య సముద్రమునందు దీవులగుంపులును కలవు. అందు:—అజోర్సుదీవులు, మెడీరాదీవులు, కన్నరీదీవులు, కేప్ వర్డుదీవులు, అసెంషన్ దీవి, సెంట్ హెలీనాదీవి మున్నగునవి కలవు.

ఉష్ణత:—సముద్రజలమునకు వేరువేరు భాగములయందు వేరువేరు ఉష్ణము కాన్పించుచున్నది. ఇట్లగుటకు కారణము లనేకములు కలవు. భూమధ్యరేఖకు సమీపమునందుండుట దూరమున నుండుట మాత్రమేగాక ఆయా ప్రాంతములయందు సముద్రములోనికి పడు నీటిప్రవాహములను బట్టియు, అందు కలిసి వచ్చు ఉప్పు మొదలగుపదార్థముల పరిమాణమును బట్టియు, సముద్రపునీటికి ఉష్ణతను గ్రహించు విడుచు శక్తులు మారుచుండును. అట్లగుటచేత సముద్రపునీటిని పరిశీలించినప్పుడు ఉష్ణతభిన్నభిన్నముగా వ్యాపించుట కాననగుచున్నది. అట్లాంటిక్ మహాసముద్రము నందలి ఉష్ణతను వర్ణింపవలసినచోట ఉత్తర దక్షిణములను వేరుచేసివర్ణింపవలసియున్నది.

ఇందులో ఉత్తరట్లాంటికున అధికతమోష్ణత ఆఫ్రికాఖండ పరిసరమున అయిదవ ఉత్తరఅక్షాంశరేఖకడ ప్రారంభించి రమారమి పడమటి ౪౦-వ ధ్రువరేఖ వరకును పోయి అచ్చటనుండి కరీబియన్ సముద్రప్రాంతమున జేరుచున్నది.

అచ్చట ఉష్ణత ౮౦ డిగ్రీలు ఫారన్‌హీటు; అచ్చట నుండి కొంచెము ఈశాన్యమునకు పోయినయెడల ఉష్ణత తూర్పువైపునకు తక్కువగుచు పడమటివైపునకు హెచ్చుగను కన్పించుచు ఉ. అ. ౪౦ చేరునప్పటికి తూర్పునుండి పడమరనును ఒక్కసమానముగా ౬౦ డిగ్రీలు అగుచున్నది.

ఇదేరీతిని కొన్ని విభేదములతో తగ్గుచు ఉత్తరమహాసముద్రము చేరుసప్పటికి ఉష్ణత కొంచె మించుమించుగా క్షానరాక పోవు చున్నది.

దక్షిణ అట్లాంటిక్ మహాసముద్రము నందు ఉష్ణత ఉత్తరట్లాంటిక్ నందువలె మిక్కిలి విభేదములకు ఆకరముగాదు. భూమధ్యరేఖకు దగ్గిరగానుండు ప్రదేశములలో ఉష్ణమెక్కువగాను సమోష్ణతారేఖ వంకరగాను కన్పించుచున్నది.

ఇంకనుదక్షిణమునకు పోయినకొలఁదియుష్ణము తగ్గుచు సముద్రమున తూర్పునుండి పడమరకు సమానమగుచున్నది.

సముద్ర పదార్థములలో ఉప్పు మిక్కిలి సాధారణమైనది. అదెచ్చటెచ్చట ఎక్కువగా నుండునో అచ్చటచ్చటజలము ఎక్కువకటువుగానుండును. అట్లాంటిక్ సముద్రమంతయు మొత్తముమీద అన్నిమహా సముద్రములకంటె ఉప్పు దనమునకు పేరుపడియున్నది. ఈ అట్లాంటిక్ మహాసముద్రమునకునుకూడ ఉత్తరట్లాంటిక్ మహాసముద్రమున ఉ-అ-౨౦-౩౦ లకునడుమనుండు భాగమును, దక్షిణ మహాసముద్రమున ద-అ-౧౦-౨౦ కి మధ్యనుండుభాగమును ఈ రెండు భాగములును పేర్కొనదగినవి.

ఈ భాగములకు ఉత్తరమునను దక్షిణమునను పోనుపోను ఉప్పుదనముతగ్గుచు హెచ్చుచున్నది.

ఉష్ణతయందువలె ఉప్పుదనము విషయమునఁగూడ కొన్ని విభేదములు ఉ. అ. మహాసముద్రమున కన్పించుచున్నవి.

అందులో నుత్తరమున తూర్పుభాగమున నెక్కువ ఉప్పుదనమును కన్పించుటయు పశ్చిమభాగమున అట్లు లేకుండుటయు కానవచ్చును. ద-అట్లాంటిక్ నందు ఇట్టి భేదము లేక తూర్పునుండి పడమరవరకును ఒకేవిధముగు ఉప్పుదనము దక్షిణమునకు పోయినకొలఁదియుతగ్గుచు దక్షిణ అమెరికా దక్షిణతమ భాగములయందు సముద్రజలము కొంచమించుమించుగా ఉప్పులేనిదనియే చెప్పవలసియున్నది.

"సముద్రములయందు జలమొకచోట నుండి మరియొకచోటికి ప్రవహించుచున్నది. ఇట్టి ప్రవాహములకు ముఖ్యకారణములు రెండు.

(౧) వాయువులు :—వాయులేవైపునకు వీచునో నావైపునకే సముద్రమందలి జలము కూడ ప్రవహించుచుండును.

(౨) ఉష్ణత:—భూమధ్యరేఖసమీపమందుష్ణత మెండగుటచే, నచ్చటిజలము వేడియెక్కి పలుచనయి, ధ్రువములవైపు ప్రవహించును. భూమి పడమరనుండి తూర్పునకు తిరుగుచుండుటచే నీప్రవాహములదిక్కులకు కూడ మార్పులు గలుగుచున్నవి."

అట్లాంటిక్ మహాసముద్రమున వాణిజ్యవాయువులను వాయువులు వీచుచున్నవి.


ఇందులోనొక్కటి ఉత్తరార్ధ గోళమున ౩౦ వ అక్షాంశమున ప్రారంభమయి ఈశాన్య మూలనుండివీచును. మరియొక్కటిదక్షిణగోళమున ౩౦ అ నుండి ప్రారంభమయి ఆగ్నేయము నుండివీచును.

ఈ వాయువులచేతను భూభ్రమణము చేతను పై చెప్పిన ఉష్ణతకారణము చేతను అట్లాంటిక్ మహాసముద్రమున ప్రవాహము లేర్పడి యున్నవి.

ఈ వాణిజ్యవాయువులును భూభ్రమణమును, కలిసి ఆఫ్రికాఖండతీరములనుండి దక్షిణఅమెరికా తీరములవరకు ఉష్ణజలప్రవాహములను పుట్టించుచున్నవి. బ్రెజిలులోని సెంటురోకు అగ్రసమీపమున, పడమటికిపోవుచున్న ప్రవాహము రెండుపాయలుగాచీలి, యందొకటి బ్రెజిలుతీరముల మీదుగాను, రెండవది గయానాతీరముల మీదుగాను పోవుచున్నవి. (పటమును చూడుడు) అందు రెండవపాయ, ఈశాన్య వాణిజ్యవాయువుచే గలిగిన ప్రవాహముతో కలిసి, మెక్సికో సింధుశాఖ [illegible] ములోనికి పోయి, అచ్చటనుండి ప్రసిద్ధిగాంచిన గల్ఫ్‌స్ట్రీమ్ అనుపేర, ముప్పదిమైళ్ల వెడల్పును, ౮౮౦ గజములలోతును, గంటకు నాలుగుమైళ్ల వేగమును, ౮౦ డిగ్రీలవేడిమియును, మనోహరమైన నీలవర్ణమును గలిగి బయలుదేరుచున్నది. ఇట్లు బయలుదేరి ఈశాన్యమూలకు, వెడల్పు అధికమగుచు వేడిమియు, లోతును, వేగమును తగ్గుచుపోవును. న్యూఫౌండులాండు సమీపమున దీనివెడల్పు ౩౨౦ మైళ్లు. అట్లాంటిక్ సముద్రమందు, ౪౮ అక్షాంశమందు రెండు భాగములుగా చీలి, యొకటి, బ్రిటిషు దీవుల యొక్కయు, నార్వేదేశముయొక్కయు, పశ్చిమతీరములందు ప్రవహించును. ఈ ప్రవాహమందలి ఉష్ణతయు జలముచేతనే; పైదేశములయందు అక్షాంశమునుబట్టి యుండవలసినంత చలిలేదు. రెండవభాగము దక్షిణమునకు తిరిగి, పోర్చుగలు దేశముయొక్కయు, ఆఫ్రికాఖండముయొక్కయు, పశ్చిమ తీరముల ప్రవహించి, ఈశాన్యవాణిజ్య వాయువుచే కలిగినప్రవాహముతో కలిసిపోవును.

ఉత్తరమహాసముద్రమునుండి, గ్రీన్‌లాండు దేశమునకు పడమటి ప్రవాహమును, తూర్పుప్రవాహమును, కలియుటచే నేర్పడిన శీతజల ప్రవాహము, లాబ్రెడారుప్రవాహమను పేర, ఉత్తరఅమెరికాతీరములకును గల్ఫ్‌స్ట్రీమునకును మధ్యను ప్రవహించి, గల్ఫ్‌స్ట్రీము ప్రవాహములో కలిసి నశించిపోవుచున్నది. [గా. హ.]

అట్లాంటిక్ సిటీ. అమెరికాలోని యునైటెడ్ స్టేట్సునందలి న్యూజర్సీ మండలమున కలదు. ఆరోగ్యవంతమగు పట్టణము. వినోదార్థము జనులు అచ్చటకిబోయి యుందురు. ౧౯౦౨ వ సంవత్సరమున నీ పట్టణమునకు అగ్నిబాధ కలిగెను.



అట్లాంటిక్ మహాసముద్రమునందలి ప్రవాహములు.

అట్లాసుపర్వతములు. ఆఫ్రికాఖండమునందు వాయవ్య భాగముననుండు పర్వత సమూహమునకు నీపేరు. మొరాకోయందలి నన్ను అనుఅగ్రమునుండి ట్యూనిసునందలి బానుఅగ్రమువరకును నీపర్వతములు కలవు. దీని యొక్క పంక్తియని వర్ణించుటకు వీలు లేదు. పీఠభూములును ఉచ్చ్రయ భూములును మధ్య మధ్యను నొప్పుచుండ గుములుగుములుగానుండు పర్వతసమూహములన్నిన వీనిని వర్ణించినవార మగుదుము. ఈ పర్వతములను రెండువిభాగములు చేయవచ్చును.

౧: మొరాకో అట్లాసుపర్వతములు ౨. టూనిస్‌ఆల్జీరియాల్ల అట్లాసుపర్వతములు ఈరెంటనెచ్చటను ౧౪౫౦౦ అడుగులకు మించిన యెత్తుగల శిఖరములేదు. మొరాక్కొ అట్లాసులోని టిజిటూంజుర్తు అను శిఖరమును టిజిలుకూంటుఅను శిఖరమును పేర్కొనదగినవి. ఈ అట్లాసుపర్వతములలో అగ్నిపర్వతములు భయమేమియును లేదు. మంచు ఎల్లప్పుడును కప్పియుండు శిఖరములు యెన్నియో లేవు. ఈపర్వతములయందలి యుపత్యకములు మిక్కిలి ఫలవంతమ్ములు. ఉపత్యకముల నానుకొనియుండు పర్వతముల కీభాగములు మంచి యడవులచే నావృతములై యున్నవి. ఈ పర్వతములందలి లోహ గనులనింకను త్రవ్వియుండ లేదు.

అట్కిన్‌సన్ (ఎడ్విన్ ఫెలిక్సుతామస్.) ఈతఁడు బాల్యమునందు డబ్లిను నగరమందలి ట్రినిటీ కళాశాలలో విద్య నభ్యసించెను. ఇండియను సివిలు సర్వీసుపరిక్షలో కృతార్థుఁడైనతర్వాత ౧౮౬౨ లో హిందూదేశమునకు వచ్చి పశ్చిమోత్తర పరగణాల నుద్యోగమునఁ బ్రవేశించెను. ౧౮౭౧ లో అక్కడనే సెన్ససు ఆఫీసరయ్యెను. ఈతఁడే ఆపరగణాల ఇంపీరియల్ గజటీర్ అను గ్రంథమునకు సంపాదకుఁడు. తరువాత కొంతకాలము ఈతఁడు బంగాళా దేశములోను, పశ్చిమోత్తర పరగణాలలోను అకౌంటెంట్లు జనరలుగ నుండెను. ౧౮౯౦ సం॥ లో మరణించెను.

అట్కిన్‌సన్ జేమ్సు. (౧౭౮౦-౧౮౫౨.) ఈతఁడు ౧౭౮౦ లో జన్మించెను. బాల్యమున లండను, ఎడింబరో నగరముల వైద్యవిద్య నభ్యసించి ౧౮౦౫ లో బంగాళా మెడికలు సర్వీసులోఁజేరి ౧౮౧౩ లో బకర్‌గంజ్‌లో సివిల్ సర్జనుఆయెను. ఈతఁడు పెర్షియను భాషనభ్యసించి ఆభాషలోనె చాలగ్రంథముల రచించుటయేగాక ఆ భాష లోని చాల గ్రంథములను ఇంగ్లీషులోనికి తర్జుమా జేసెను.

కొంతకాల మీతఁడు ఫోర్టు విల్లియము కళాశాలలో పెర్షియను భాషను బోధించు ప్రొఫెసరుగనుండెను. తరువాత నీతఁడు తిరిగి సర్జను పదవిలోచేరి ఉత్తర ఇండియాలో చాలచోట్ల ఉద్యోగముఁ జేసెను. ౧౮౪౨లో ఈతఁడు 'ఆంగ్లేయులు ఆఫ్ఘని స్థానముపై దండువెడలుట,' అను గ్రంథమును వ్రాసెను. ఈతఁడు ౧౮౫౨ సం॥ మున చనిపోయెను.

అటిట్లన్. మధ్య అమెరికా గాటిమాలలో నొక సరస్సు. ౨౪ మైళ్లు నిడివి; వెడల్పు ౧౦ మైళ్లు. దీనికి దక్షిణకొనను అటిట్లన్ అగ్నిపర్వతముగలదు. దాని యడుగున సాంటియాగోడి అటిట్లన్ అను పట్టణమున్నది.

అట్టిలా. హూన్సు అను ఒకజాతివారి నాయకుడు (క్రీ. ము. ౪౦౬-౪౫౩) ౪౩౪-వ సంవత్సరమున బలవంతముగా రాజ్యము

గాని తన సహోదరునితో కలహము చేసితుదకు మోసముగా చంపించెనని సహితము కొందరు చెప్పుదురు. తన జీవితకాలమంతయు దండయాత్రలు చేయుటయందును, యుద్ధములు చేయుటయందును కాలముగడుపుచుకొంతవరకును ఏకచ్ఛత్రాధిపత్యముగా నేలెననియే చెప్పవచ్చును. ఇటలీ, రోం, మొదలగు దేశములసహితము నితడనిన భీతి చెందియుండిరి. ఇతడు రోంమీదికి దండయాత్రకు వెళ్లదలచి ప్రయత్నము చేయుచుండెనుగాని అకస్మాత్తుమరణము తటస్థించెను.

౪౫౩-వ సంవత్సరము బర్గండిరాజపుత్రికను వివాహమాడి ఆరాత్రియె అకస్మాత్తుగ మృతిజెందెను. హున్సుతెగవారికి మిగుల ధీరులని ప్రఖ్యాతిగల్గుటకు ఇతని ధైర్యసాహసములే కారణము.

ఈ జాతివారిలో కొందరు హిందూదేశ దండయాత్ర సహితము చేయ సమకట్టిరి.

అటోక్లిసు. క్రీ. పూ. ౪-వ శతాబ్దమున నితఁడు గొప్పవక్తయు, సేనానాయకుఁడుగను నున్నవాఁడు. ౩౭౧-వ సంవత్సరమున స్పార్టను జాతివారితో స్నేహము చేసి ౩౬౨-వ సంవత్సరమున గ్రీసుదేశము మీఁదికి దండయాత్ర వెడలెను.

ఆటోలికస్. ఇతఁడు గ్రీసుదేశముయొక్క పురాణపురుషుఁడు. ఇతని తండ్రిపేరు హెరంసు. ఇతని కూతురగు అంటిసీలియాకు ఒడీసియస్ అనుపౌత్రుఁడు పుట్టెను. ఇతఁడు టక్కు, టమార విద్యల సాటిలేని శూరుఁడు. మాయయు, మోసమును నితనికిపుట్టినిల్లు. ఇతఁడొక సమయమున దొంగిలించి దొంగిలించిన సొత్తులను చాటుచేర్చి తానుసహితము దాఁగికొనెను. తుదకు సిసిఫస్ అను వాఁడితని గనిపెట్టెను.

౨. అటోలికస్. పై శకయందు నున్న గ్రీకుదేశీయుఁడు. గొప్పజ్యోతిష్కుఁడు. ఇతఁడు సూర్యాది గ్రహములను గుణించి రెండు పుస్తకములను వ్రాసియున్నాఁడు.

అరిదము. భారత వర్షీయదేశము. (భార. భీష్మ. అ. ౯.)

అడవులు. మామూలు మాటలలో అడవిలనగా నేమో అందరు ఎరిగినదేగాని సర్కారు లెక్కలు దాఖిలాగాగాని, శాస్త్రరీత్యాగాని అడవిలనగానేమి అని ప్రశ్న వేసినయెడల నీదిగువ విధమున వివరింపవచ్చును. ఒక దేశమునందు కలపయొక్కగాని, అడవిదినుసులయొక్కగాని శీతోష్ణాది స్థితులయొక్కగాని అభివృద్ధినిమిత్తమై ప్రత్యేకముగ నిరూపణ చెందియున్న ప్రదేశములకు అడవులని పేరు. ఒకానొకప్పుడు వర్షములు సరిగా లేని దేశములలో వర్షములు సరిగా కురియుటకును, దేశమునందలి నీటిప్రవాహములు అభివృద్ధి యగుటకును కొన్నిచోట్ల అడవులను పెంచుదురు.

పేరు.

మఱికొన్నిచోట్ల పశువులమేత కొఱకును, అడవిజంతువుల అభివృద్ధికొఱకును, అడవులను పెంచుదురు. ఇట్టి ప్రదేశములన్నియు అడవులు అనుశీర్షిక క్రిందనే చేరును. ఒకానొకప్పుడు పశువుల మేతకొఱకేర్పడిన కొన్ని అడవులలో ఏవిధమైన చెట్లును లేక పోవచ్చును. అట్టి చెట్లులేని ప్రదేశములనుకూడ శాస్త్రరీత్యా అడవులనియే చెప్పవలెను.

పుట్టుక.

ప్రపంచారంభమున మానవుడు నాగరికత నెఱుగని దినములలో నీరులేని భూమియంతయు అడవిగనేయుండి యుండవచ్చును. అట్టి అడవులలో ఆయా ప్రదేశములయొక్క వర్షపాతమునుబట్టియు శీతోష్ణస్థితిని బట్టియు, భూసారమును బట్టియు, నదులయొక్కయు సముద్రములయొక్కయు కొండలు గుట్టలు మొదలగువానియొక్కయు సామీప్యమును బట్టియు ఒక్కొకచోట చిన్నచిన్న పొదలును, తుప్పలును, ఒక్కొకచోట వెడల్పు అయిన ఆకులతో నిండియుండు మఱ్ఱులు మద్దులు మామిళ్లు టేకులు మొదలగు పెద్దపెద్ద చెట్లును, ఒక్కొకచోట ఆకాశమువంకనే బోవు ఈతలు తాళ్లు వెదుళ్లు మొదలగునవియు, మఱికొన్నిచోట్ల బ్రహ్మజెముళ్లు, తుమ్మలు, మొదలగు ముండ్లచెట్లును, వృద్ధిబొందుచుండును. ఈ చెట్లన్నియు యెవ్వరు పెంచకయే పెరుగుచు, చంపకయే చచ్చుచు భూమిపయి బడి య్యెండుచు క్రుళ్లిపోవుచుండి యుండును. ముసలిచెట్లు ముదిమిచే జచ్చినచోట్ల పిల్లచెట్లు సవవవలాడుచు బుట్టుకొని వచ్చి యుండును. ఇట్లు రాగారాగా భూసారమధికమై మానవుడు నాగరికుడై ఈ అడవుల నాశముచేయ ప్రారంభించెను. బహుశః మొట్టమొదట తన నివాసము కొఱకును, తాను పెంచిన ఆవులు, దూడలు, మేకలు మొదలగువాని నివాసము కొఱకును ఇతడు కొద్దిమాత్రపు అడవిని కొట్టుటకు ప్రారంభించి యుండును. పిమ్మట తనపశువుల మేతకొఱకు కొంతఅడవినికొట్టి బయలుగాఁజేసి తరువాత ఆ ప్రదేశమునందు వ్యవసాయమునకు ప్రారంభించి యుండును. ఇట్లు దేశదేశములందలి ప్రజలునువారివారి దేశములలో అడవులనుకొట్టి అదేప్రదేశములందు పట్టణములను కట్టియుందురు. ప్రజాభివృద్ధి హెచ్చినకొలదిని యెంతకొట్టినను తరుగక చీమలుదూరని చిట్టడవులును, కాకులుదూరని కారడవులును ఇంకననేకము లీ ప్రపంచమున గలవు. గోదావరీ ప్రాంతములందలి రంప, భద్రాచలము మూలలకొన్ని అడవులలో నిప్పటికిని మానవసంచార మెఱుగని ప్రదేశములనేకములఁగూర్చి మీరువినియుండవచ్చును.

జాతి భేదములు.

భూసారమును, వర్షపాతమును, శీతోష్ణస్థితులను బట్టి ఒక్కొక అడవిలోని చెట్లు ఒక్కొకరీతిగ నుండునని చెప్పియుంటిమి. స్వతస్సిద్ధముగ పెరుగుచుండు అడవులలోని చెట్లు నానాజాతులుగ నుండును. కాని ఒక్కొక అడవియందు ఆయాచెట్ల అభి

వృద్ధికి అనుకూలముగ నుండుకొన్ని కారణము లనుబట్టి కొన్ని చెట్లు తక్కిన వానికంటె హెచ్చుగ పెరుగును. ఎట్లన సముద్రతీరముల యందు నారికేళవృక్షముల అభివృద్ధి హెచ్చుగ నుండును. మదరాసు రాజధానిలో తూర్పు సముద్రమువద్ద అనగా మద్రాసులో బయలుదేరి అడ్డముగా బోవుచు పశ్చిమ సముద్రమువరకు చూచినయెడల సముద్ర తీరమున ఇసుకనేలలుండువరకే తాటిచెట్లు కనబడునుగాని ఆగ్నేయము దాటిన తరువాత మలబారు చేరువరకు తాటిచెట్లే కనబడుట అరుదుగ నుండును. ఇట్లే కొన్ని అడవులలో టేకును, కొన్ని అడవులలో మద్దియు వేగిసలును, కొన్ని అడవులలో మంచిగంధపు వృక్షములును, మఱికొన్ని అడవులలో వెదురు పెడెములును హెచ్చుగనుండును. ఈ భేదములు మనదేశములో సామాన్యముగ వర్షపాతమునుబట్టియు భూమియొక్క ఎత్తునుబట్టియు నేర్పడి యుండును. ఇందులో జేర్చిన పటము జూచినచో నీదేశమునందలి హెచ్చువర్షములకును అడవులకునుగల సంబంధము తెలియగలదు.

వర్షముయొక్క హెచ్చుతగ్గులను బట్టియు, నదులయొక్కయు సముద్రముయొక్కయు సామీప్యమును బట్టియు, ఎత్తునుబట్టియు అడవులీదిగువ నుదహరించిన ప్రకారము ఏడు తరగతులుగ విభజింపనగును.

వర్షమునుబట్టి:—	1. నిత్యము పచ్చని యడవులు (Evergreen).
	2. ఆకురాల్చు అడవులు (Deciduous).
	3. మెట్ట అడవులు (Dry).
ఎత్తునుబట్టి:—	4. హిమాలయపు అడవులు (Alphine).
నదీప్రవాహముల ముంపునుబట్టి:—	5. ముంపు అడవులు (Riparian).
సముద్రపు పోటునుబట్టి:—	6. పోటు అడవులు (Tidal).
రాతినేల, అనావృష్టి, నీటిముంపులనుబట్టి:—	7. గొడ్డునేలలు (Barren lands).

నిత్యము పచ్చని అడవులు (evergreen)

1. వర్షములు అధికముగనుండు ప్రదేశములలోనున్న అడవుల యందునిత్యమును పచ్చగనుండు (evergreen) చెట్లయొక్క అభివృద్ధి హెచ్చుగ నుండును. నిత్యము పచ్చగనుండు అడవులు హిందూదేశమునందు పశ్చిమ తీరముల యందును, బర్మా, అండమాన్ దీవుల యందును, హిమాలయ పర్వత క్రిందిభాగముల యందు కొంతవరకును కర్ణాటక దేశమున† కొంతవరకును వ్యాపించి యున్నది. నిత్యము

† మహానది మొదలు దక్షిణమున ఆర్కాటు వరకును పడమర కోయంబుత్తూరు వరకునుండు ప్రదేశములలో నీయడవులు ఖండఖండములుగా నున్నవి.

పచ్చనిఅడవులని చెప్పుటచే ఆకులను రాల్చు చెట్లు ఈ అడవులలో నుండనే యుండవని తలపకూడదు. ఈ అడవులందు ముఖ్యముగ మద్ది, చీని* ధూప* కొంగు* ఎణ్ణె* అశోకము, గుగ్గిలము, నేరేడు, అడవిమామిడి, పొన్న, పనస, వేగిస మొదలగు జాతుల చెట్ల యభివృద్ధి హెచ్చుగ నుండును. కాని, అక్కడక్కడ దేశస్థితినిబట్టి ఈ అడవులలోకూడ టేకు, పాల, విరుగుడుచేవ, తుమికి, చందనము, దిరిసెన, చిందుగ, మొదలగు ఆకురాలు చెట్లుగూడ కలిసియుండును.

ఆకురాలు అడవులు (Deciduous). 2. పైనిచెప్పిన నిత్యముపచ్చని అడవులకంటె సంవత్సరమునందు కొంతకాలము తమ ఆకులనురాల్చి తిరిగి చిగుర్చు స్వభావము గల చెట్లుండెడు అడవులే హిందూదేశము నందు హెచ్చుగ నున్నవని చెప్పవచ్చును. ఇవి వర్షపాత మంతగ లేని ప్రదేశములలోకూడ వర్ధిల్లును. ఈ అడవులు హిమాలయ పర్వతపు క్రిందిభాగము మొదలు కన్యాకుమారి వరకు దేశము పొడుగునను తగిన వర్షములును నేలలునుగల చోటులందెల్ల గలవు. ఈ అడవులలోనే విలువగల కలపయంతయు దొరకును. ఇందు టేకు, మద్ది, వేగిస, కొండ తంగేడు, సాలు, (గుగ్గిలము లేక అందుగ ఘ్రాసు) పాల, చందనము, తుమికి (నల్లచేవ లేక కోవిదార) మంచిగంధము, విరుగుడుచేవ, కొంగు, చెన్నంగి, నరవేప, ఊటి, మొదలగు విలువగల వృక్షములును, ఇవిగాక, ఇప్ప, బిల్లు, సోమి, బాదము, తాడి, కరక, చిరుమాను, తుమ్మ, చండ్ర, కవిడి, శీకాయి, జాలె, కోరింద, కొండ తామర (పొలికి), గులిబూరుగ, నేరేడు, చింత, కడిమి, మొదలగు ననేక రకముల చెట్లును, ఇంకను కత్తిరినూనెలు, వార్నిసులు మొదలగు వస్తువులనిచ్చు అనేకములైన ఇతర చెట్లును ఈ ఆకురాలు అడవులలోనుండును.

మెట్ట అడవులు (Dry Forests). 3. ఇంతకంటెను వర్షము తక్కువగల ప్రదేశములలో నుండు అడవులలోని చెట్లు అంతగా పెరుగక గిడసబారి యుండును. ఇట్టి అడవులలోని ఫలసాయము విలువగలదిగ నుండదు. ఇందు అక్కడక్కడ పైనిచెప్పినజాతుల చెట్లు ఒక్కొక్కటి చొప్పున పలుచగనుండును. ఈ అడవులలో తరుచుగ తుమ్మ, చండ్ర, శీకాయి, కరక్కాయి, మోదుగ, తంగేడు, వేప, సోమి, బిల్లు, గుమ్మడి, కుంకుడు, గానుగ, రేల, చింత, దిరిసెన, సీమచింత, చీకరేణి, జమ్మి, ఇప్ప, సిస్సు మొదలగు ననేక జాతుల చెట్లుండును. ఇందే నక్కెరి, బలుసు, వెలుతురు, రేగు, కాకపాల, పరికి, గొట్టి, ముసిడి, నేపాళం, జెముడు, ఉప్పి, పురుగుడు, జిల్లేడు, మొదలగు తుప్పలు హెచ్చుగ నుండును.

ఎత్తు. 4. వర్షము మూలమున అడవులలోని చెట్ల బ్రింక జాతుల భేదములేర్పడుచున్నవో అట్లే ఆయా ప్రదేశముల యెత్తునుబట్టికూడ జాతిభేద

* అరవము. పశ్చిమతీరమందలి అడవులలోని చెట్లు.

ములు పెర్వడుచుండుటకు త్రిగపవలయునుపమును తో కొంచ మించుమించుగ సమానమైన ఎత్తుగల బట్టగుంట మొదలగు ప్రదేశములలో తుప్ప అడవులు మొదలుకొని నీలగిరి కొండలమీద నుండు వివిధజంతులగు నిత్యము పచ్చగనుండు వృక్షములవరకు నీ భేదము గమనింపనగును. ఎత్తు అధికమైనకొలది చల్లదనమధికమగును. చల్లదన మధికమైన కొలది చెట్ల అభివృద్ధి హెచ్చుచుండును. సముద్రపు లెవలులో నుండు తుప్పలు నీలగిరికొండలలో గానరావు. నీలగిరి కొండలలోనుండు పర్ణములు (Ferns) సముద్రపు లెవలులోనుండు అడవులలో పెరుగవు. ఇట్లే హిమాలయపర్వత ప్రాంతములలో అడుగుభాగమున ఉష్ణప్రదేశములందు పెరిగెడిచెట్లు పెరుగును. మీదికి పోనుపోను మిక్కిలి శీతల ప్రదేశములగు ఐరోపాలోని నార్వేవంటి ప్రదేశములలోని పెరిగెడిదేవదారు వృక్షములు పెరుగును. ఇట్టి ప్రదేశముల ఎత్తునుబట్టి వృద్ధిబొందెడు అడవులను హిమాలయపు అడవులని చెప్పవచ్చును.

హిందూదేశము సందలి హిమాలయపు అడవులలో రెండు విభాగములుగలవని చెప్పవచ్చును.

౧. పడమరహిమాలయపుఅడవులు:—

హిమాలయపు అడవులు. (Alpine).

ఇందు క్రింది భాగమున నుండు ప్రదేశములలోని యుష్ణము బయళ్లలోనుండు ఉష్ణముతో సమానముగనుండును. ఎత్తు భాగములు ౨౦,౦౦౦ అడుగులవరకుపోవుచు సంవత్సరము పొడుగునను మంచుతో కప్పబడియుండును. ఇందు తూర్పువైపున వర్షము హెచ్చుగను ఆఫగనిస్థానమువైపున వర్షములు తక్కువగను ఉండును.

౨. తూర్పు హిమాలయు పర్వతపు టడవులు:—ఇందు సింధూరపు (Oak) అడవులు ౩,౦౦౦ అడుగుల మొదలు ౯,౦౦౦ అడుగుల ఎత్తువరకును, గన్నేరు (Rhododendron) అడవులు ౯,౦౦౦ అడుగుల పైఎత్తుమీదను పెరుగును. దేవదారు (Deodar) అడవులును ఇందు తరుచుగ గానవగును.

పైనిచెప్పిన పర్వతపు టడవులలో ముఖ్యముగ జ్యూనిపర్ (బదరి), బిర్చి, స్ప్రూసు, ఫిర్, దేవదారు (కొరివి పాలకర్ర), సీడరు, సైప్రసు (తమాల లేక శోకవృక్షము లేక నల్లచీకటి ప్రమాను), ఓకు (సింధూరము లేక అల్లోనుచెట్టు), రోడోడెండ్రను (గన్నేరు), పైను, మొదలగు చెట్లుండును. తగిననేలయు శీతోష్ణస్థితియు గలచోట్ల ఐరోపాలో విస్తారముగ పెరుగు, యూ, బాక్సు, అక్రోటు, ఐవి (తీగె), మిసిల్టో, రోజా (గులాబి) మొదలగునవికూడ ఈ అడవులలో పెరుగును.

5. బంద అడవులు. (Riparian).

అప్పటప్పటి నదీప్రవాహముల ముంపుచేగాని, చెరువులలో నుండియు, నదులలోనుండియు వచ్చు ఊటవలనగలిగిన ముంపుచేగాని సంవత్సరములో చాలకాలము బంద బందగా నుండునేలలోని అడవులొక తరహాగా పెరుగును. ఈఅడవులకు ప్రత్యేకలక్షణములుకొన్ని

యుండుటచేత వీనిని ప్రత్యేకముగా నొక తరగతిగా జేర్పదగియున్నది. ఈ అడవుల యొక్క వృద్ధి ఆ ప్రదేశములయొక్క వైసర్గికస్థితిని బట్టియుండును. బర్మాలోని బంద నేలలోనుండు అడవులును, సింధునదియొక్క క్రిందిభాగము లందలి పల్లపు నేలలందుండు అడవులును వేర్వేరు స్వభావములు గలిగి యున్నవి. బర్మాలోని బందలు సంవత్సరము పొడుగునను తడిగానుండుటచేత ఈ అడవు లలో పొచిమాను, చిరిమాను, అడవిమామిడి, నేరేడు, మోవి, రుద్రాక్ష, రేల, సీమతంగేడు మొదలగు చెట్లుండును. తుప్పలలో ఆదొండ, బూదరేణి, రేగుత్తి, నల్లుప్పి తడిక, బొద్దు తంగ్రెడ, బిక్కి, చిరిబిక్కి, చిట్టమట్ట, కొండ పాపిడి మొదలగునవి యుండును. ఈ అడ వులలో తీగెలు దట్టముగ, అల్లుకొని లోపలి కెవ్వరును చొర శక్యముగాకుండ జేయును. ఈతీగెలలో మల్లె, గుముడు, ముల్లుకోరింత, తీగెలు ముఖ్యములైనవి.

ఇట్లుగాక సింధునది తీరముల నుండు బంద అడవులలో వర్షము హెచ్చుగనుండదు. అప్పు డప్పుడు పొంగివచ్చు సింధునదియొక్క వరదలచే నివి ముంపు నొందుచుండును. ఇందుచేత పెద్దపెద్ద తుమ్మలిక్కడి బంద నేలలలో పెరుగును. ఈ అడవుల పంచలయందు పల్లిగి (ప్రక్కి), సిస్సూ మొదలగు చెట్లు విస్తార ముగ నుండును. మెట్టనేలలు సమీపించు నేరికి జమ్మి, పెన్నేగు, చేకోడి, నల్లుప్పి, ఆదొండ, మొదలగు చెట్లు కానవచ్చును.

౬. **పోటు అడవులు. (Tidal)** ఈ అడవులు సముద్రతీరము నందున్నను బందుగు నేలలలో నుండును. ఇవి నదీముఖములను బట్టియు ఉప్పుటేళ్లను బట్టియు కాల్వలను బట్టియు ఆయా ప్రదేశముల లోపలిభాగ ములకు చొరచుకొని పోవును. ఈ అడవులు సముద్రపు పోటు పాటులవలన హెచ్చుచు తగ్గుచుండు నీటిముంపుయొక్క స్వభావమును బట్టి వృద్ధిక్షయముల నొందుచుండును. ఈ నీటిలోనుండు ఉప్పుయొక్క హెచ్చు తగ్గు లను బట్టియే ఆయా ప్రదేశము లందలి చెట్లును మారుచుండును. సముద్రపుముఖము లోని నేలలలో 'ఉప్పుపొన్న' మొదలగు చెట్ల ధికముగ నుండును. నేలమీదకు పోను పోను తిల్ల, మడ, ఈత, దాసాన, కొండ గోగు, కుక్కలి (తిలక), మొగిలి, అడవిబెండ, కొండ పత్తి, గంగరావి, గానుగ, మొదలగు చెట్లు కానవచ్చును.

7. **బొత్తుగ చెట్లు లేక గొడ్డు నేలలు. (Barren)** వర్షము లేని నేలలు యెడారులుగ నుండును. ఇట్టి యెడారులు సింధు, రాజపుత్రస్థాన ప్రాంతములయందు గలవు. మిక్కిలి నిలువుగనుండు కొండల మీదమట్టి నిలుచుటకు తగినంత పదును లేక పోవుటచేత వర్షము కురిసినప్పుడెల్ల నున్నగ కడిగివేసినట్లు గును. ఇట్టిబండరాళ్లమీదనుకూడ చెట్లు మొల వవు. బొత్తుగ పల్లముగనుండి సంవత్సరము పొడుగునను నీటిముంపులోనేయుండు ప్రదేశ ములలోకూడ చెట్లు మొలవవు. ఇట్టిప్రదేశ

ములు మనజిల్లాలలో కొండగుమాలల కొద్దిగను, అస్సాము, బెంగాలు, బర్మాలలో హెచ్చుగను ఉన్నవి. ఈ ప్రదేశములలో కూడ అప్పట ప్పట వాని స్వభావము మారుచుండుటచే జమ్మి, గడ్డి, తుప్పలును మొలుచుచుండును. రయితాధీనములో లేని ఇట్టి ప్రదేశములన్నియు సర్కారు లెక్కల దాఖలా అడవులుగానే జేరునుగాన వీనినిగూడ నిక్కడ నొకతరగతిగ నేర్పరచితిమి.

భూమధ్యరేఖ.

ఈ భేదములుగాక భూగోళముయొక్క మధ్య భాగమున నుండు భూమధ్యరేఖ మొదలు, కొనలయందుండు ధ్రువముల వరకును శీతోష్ణస్థితి ఎట్లు మారుచుండునో అడవులయొక్కస్థితియు అట్లే మారుచుండును. భూ మధ్యరేఖకు దగ్గర నుండు అడవులలో వందలకొలది జాతుల చెట్లు పెరుగును. పోనుపోను చలిప్రదేశములకొసగా ధ్రువముల వైపునకుపోగా అడవులలో చెట్లజాతులు తగ్గిపోవును. ధ్రువమునకు దగ్గరనున్న నార్వే దేశము నందలి అడవులలో ఐదారు జాతుల చెట్లే యుండును. ఇదిగాక మధ్యరేఖకు సమీపముననున్న ఇండియా, బర్మా దేశములలోని అడవులలో వెడల్పైన ఆకులు గల టేకులు, నారికేళములు మొదలగు చెట్లును, మిక్కిలి చేవగలిగి విలువగల చెట్లును హెచ్చుగనుండును. ధ్రువము సమీపమునకు పోనుపోను చేవలేనట్టియు సూదివంటి ఆకులు గలిగినట్టియు, దేవదారు మొదలగు తేలిక జాతులు హెచ్చుగనుండును.

ఉపయోగములు.

ప్రజలకు కావలసిన కలప నిచ్చుటయు, పశువులకు కావలసిన మేత నిచ్చుటయు, వివిధములగు అడవి పదార్థముల నిచ్చుటయు అందరు నెరిగిన ఉపయోగములే. వర్షములు సరిగా కురియక క్షామభయముగల సంవత్సరములలో అడవి ప్రదేశముల సమీపమునందున్న ప్రజలు తమ పశువులను అడవులకు తోలి వానిని కాపాడుకొనుచుండుట మనమందర మెరిగినదే. క్షామకాలములం దేల! జిల్లా తాలూకాలలోని కాపులు వ్యవసాయపు పనులున్నంత కాలము పశువుల చేపనులు చేయించుకొని పనిలేని దినములలో ప్రతిసంవత్సరము పశువులను మెట్ట గ్రామములయందలి బీటి మేతనిమిత్తము కంచెలకు తోలుటలేదా? అడవి పంచలనుండు ప్రజలు తమకు కావలసిన తలుపులకు దూలములకు ప్రాకులను, పూరిండ్లకు వెదుళ్లు తాటాకులును, గడ్డియు, ఆవములకు పొయిలకు కర్రలను కంపలను సులభముగ తెచ్చుకొనుచున్నారు. నాగళ్లకును, బండ్లకును కావలసిన యావత్తు కలపయును అడవిప్రక్కనుండు వ్యవసాయదార్లకు కొనక యే వచ్చును. ఇప్పుడిప్పుడు కొందరు వ్యవసాయదార్లు తమభూములకు ఆకుపెంటవలన గలుగు బలమును గ్రహించి పచ్చిఆకులను విరివిగ తెచ్చి తమ పొలములలో వేసికొని బలపరచుకొనుచున్నారు.

అనేకులీ ప్రాంతముల వారలు కట్టెలు

కొట్టి కావిళ్లమీదను బండ్లమీదను యేబది నూఱు మైళ్లవరకును తీసికొనిపోయి అమ్ముకొనుచు తమ జీవనము గడపుచున్నారు. మఱికొందరు అడవులలోనిత్రోళ్లు, కొమ్ములు, మైనము, తేనెయ్యి, జీడిగింజలు, కరక్కాయలు, ముసాంబరము, ముసిడిగింజలు మొదలగుమందుదినుసులను, శీకాయి, కుంకుడుకాయలు, గుగ్గిలము, సాంబ్రాణి, తంగేడుపట్ట, లక్క, జిగురులను, త్రోళ్లూర వేయుటకును రంగులు వేయుటకును ఉపయోగించు చెట్లబెరడులను, లెక్కలేని చిల్లరవస్తువులను, అడవులనుండి తెచ్చి అమ్ముకొనుచు జీవించుచున్నారు.

ఇట్టి చిల్లర యుపయోగము లిట్లుండగా అడవియుండు స్థలమును బట్టియు, దానియందుండు వివిధపదార్థములను ఇతరప్రదేశములకు చేర్చుటకుతగిన రహదారీలను బట్టియు అడవులయొక్క ఉపయోగములను నిర్ణయింపనగును.

అడవులనుండి వచ్చు ఫలసాయమును మొత్తముమీద మూడువిభాగములగ నెంచవచ్చును.

౧. కలప; ఇందు వంటచెరకుకూడ జేర్చనగును.

౨. వెదురు.

3. ఇతరఫలసాయములు. ఇందు గడ్డి మేకలమేతయేగాక అడవిలో దొరకెడి ఇతరవస్తువులను, వానినుండి తయారగు అన్ని వస్తువులను చేర్చనగును.

కలపలో ముఖ్యమైనవి:—

టేకు, మద్ది, వేగిస, దేవదారు, సాలు, గుగ్గిలపుకఱ్ఱ, విరుగుడుచేవ, సిస్సు, తుమిద, (నల్లచేవ లేక కోవిదార), కాచు, మంచిగంధము, ఎఱ్ఱచందనము, తుమ్మ, కొండతంగేడు, మొదలగునవి.

ఇవిగాక వందలకొలది ద్రాకులు మంచి గుణములుగలవి హిందూదేశపు అడవులలో గలవు. కాని వానియుపయోగములంతగా ప్రజలకు దెలియకపోవుటచేతను, ఒక్కొకచోట తగినంత లాభమువచ్చు వ్యాపారము నడపు వర్తకస్థానములును, ఖారుఖానాలును లేకపోవుట చేతను, విలువగల రకముల ద్రాకులు కొన్ని అడవులలోనే మడసిపోవుచున్నవి.

ఇగ్లాండులో బక్కింగు హాంషైరులోనున్న హైవెకోంబు అనునొకగ్రామము చుట్టును ౨౦,౦౦౦ పనివారలు ఒక్క బీచ్ కఱ్ఱనుండి కుర్చీలు వగైరా సామానులను నిరంతరము తయారు చేయుదురు. కాబట్టి అడవులనుండి వచ్చురాబడి, వాని విస్తీర్ణమునుబట్టిగాక వాని ఫలసాయమును ఉపయోగపరచుకొను పద్ధతులను బట్టియుండును. ఈదేశములలోనొక్క అడవి ఫలసాయమునుండి సర్కారువారికి ౧౮౬౪ సంవత్సరము మొదలు ౧౯౧౦ సంవత్సరమువరకు వచ్చునికరాదాయమును ఈ క్రిందిపట్టీలో చూపియున్నాము.

సంవత్సరములు.		శిస్తు.
౧౮౬౫- ౭౦	రూ॥	౧౩,౭౨,౭౩౩
౭౦- ౭౫	,,	౧౭,౮౩,౨౪౮
౭౫- ౮౦	,,	౨౨,౨౪,౬౮౭
౮౦- ౮౫	,,	౩౩,౮౫,౭౪౫
౮౫- ౯౦	,,	౫౦,౬౬,౬౭౧
౯౦- ౯౫	,,	౭౩,౭౦,౫౭౨
౯౫-౧౯౦౦	,,	౭౯,౨౩,౪౮౪
౧౯౦౦-౧౯౦౫	,,	౯౧,౧౪,౩౬౭
౧౯౦౫-౧౯౧౦	,,	౧,౧౬,౦౫,౯౪౩

ఈ నికరాదాయముగాక ఉచితముగగాని తక్కువ ఖరీదులకుగాని అడవుల ప్రాంతములందుండు జనులకిచ్చిన ఫలసాయముయొక్క వెలగూడ లెక్కలోనికి తీసికొనవలయును. ౧౯౧౧ వ సం॥ లెక్కలనుబట్టి అడవుల మీద నికరాదాయము ౧౨౧ లక్షల రూపాయలును, ప్రజలకు ఉచితముగగాని తక్కువ వెలకుగాని ఇచ్చిన ఫలసాయముయొక్క వెల రు. ౫౩,౫౮,౫౫౪ లును మొత్తము రు. ౧,౭౪,౧౯,౯౮౫ లును ఉన్నట్టు తెలియుచున్నది. ఈ అడవులలో ౨౬౦౫ లక్షల ఘన అడుగుల ప్రమాకులును ౨౨౪౮ లక్షలవెదుళ్లను ఫలించినట్లు సర్కారు లెక్కకు వచ్చియున్నది. ఇదిగాక ఇతరచిల్లర ఫలసాయముయొక్క అమ్మకమువలన ఈ సంవత్సరములో సర్కారునకు ౯౫,౨౭,౮౨ రూపాయలు జమ వచ్చియున్నది. ఈ చిల్లర ఫలసాయములో ముఖ్యమైనవి పశువులమేతవలన వచ్చినపన్ను, అమ్మినగడ్డి, రబ్బరు, లక్క, రంగుపదార్థములు, కాచు, కాంభోజిబంక, ఏలకులు, కరక్కాయలు, తోళ్లూరవేయుట కుపయోగించు చెట్లపట్టలును; ముఖ్యములైనవి.

ప్రస్తుతోపయోగములు, నైసర్గికోపయోగములు.

పైజెప్పిన ప్రస్తుతోపయోగములు గాక ప్రతి దేశమున కింతకంటె అనేకరెట్లు ఎక్కువ యుపయోగములు అడవులవలనగలుగుచున్నవి. ఒక దేశముయొక్క శీతోష్ణస్థితియు, ఎండవానలును, భూసారమును, నీటివసతులును, ఆరోగ్యమును, అందమును ఇవియన్నియు కొంతవరకు అడవులవలనే గలుగుచున్నవి. చెట్లుచేమలులేని ఎడారిసేలలు సంవత్సరము పొడుగునను ఎండచే కాలుచు వానచే కొట్టుకొని పోవుచు సంపూర్ణమైన దెబ్బల ననుభవించుచుండును. వృక్షసహితమైన సేలలట్లుగాక కొంతవర కెండను కొంతవరకు వానను అనుభవించుచు, సమశీతలమైన వాయుప్రచారముగలిగి శోభిల్లుచుండును. ఈప్రకారము దేశముయొక్క నైసర్గికగుణములను అభివృద్ధిజేసెడు ఉపయోగములకు నైసర్గికోపయోగములని పేరు. వీనిని క్రింద వివరించెదము.

నైసర్గికోపయోగములు.

చెట్లకొమ్మలు ఎండనువానను కూడ కొంతవరకడ్డ సేయుటే, వాని యుద్రుతమంతగా భూమినిచేరకుండ చేయును. అధికమైన గాలిదెబ్బతగలకుండ చెట్లును, గడ్డియు, భూమిని కాపాడును. భూమినిచేరిన వేడి వెంటనే చల్లారిపోకుండగను, తేమ వెంటనే హారించిపోకుండ

గను కూడ చెట్లే భూమికి సహాయపడును. పెద్దచెట్లనుండి రాలెడు ఆకులు, పూవులు, కాయలున్ను, పెద్దచెట్ల నీడలలో పెరుగు చిన్న మొక్కలును, గడ్డి మొదలగునవియు భూతలముననొక కవచముగ నేర్పడి భూమికెక్కువ చలిగాని, ఎక్కువ వేడిగాని తగలకుండ సమశీతోష్ణముగా నుంచును. భూమిలోపలను, భూమిమీదను ప్రవహించు నీటియూటలను గంటిపోయి భూమి వేడెక్కిపోకుండ ఈ కవచము కాపాడును. మిట్ట ప్రదేశములు వానలచే కరిగి కారిపోకుండగను, ఎండలచే పొడిపొడియై రాలిపోకుండగను చెట్లవేళ్లు భూమియందలి వెవ్వేరు భాగములను దగ్గరకుచేర్చి కట్టియుంచి భూతలమునందు హెచ్చుమార్పులు కలగకుండ కాపాడును. కొండలమీది రాళ్లు విరిగి ప్రక్క గ్రామములమీద పడకుండ ఒక్కొకచో అడవులే కాపాడును. ఇట్టి యుపయోగములు చిరకాలమునుండి ప్రజలకు తెలియును కాని ఇప్పటి శాస్త్రజ్ఞులు ఒక అడవిప్రదేశమును దాని ప్రక్కనున్న మరియొక బయలు ప్రదేశమును రెంటిని సమమైన స్థితిగతులు గల్గవానిని శోధించి ఈ క్రిందివిషయములను కనిపట్టి యున్నారు.

౧. అడవులు దేశముయొక్క ఉష్ణాధికమును శీతలాధికమును తగ్గించి నేలను గాలిని సమశీతోష్ణ స్థితికి దెచ్చి దేశముయొక్క ఆరోగ్యమును వృద్ధిచేయును.

మన హిందూ దేశమున ఎండకాలము రాకమునుపే చెట్లన్నియు చిగిర్చి పచ్చని ఆకులతో నిండియుండుట మనమందర మెరిగినదే. పచ్చని చల్లనినీడచే గాకపోయిన యెడల ప్రజలింకను మలమల మాడవలసినదే. ఇట్లే పెద్దపెద్ద అడవులు దేశమధ్యమున అక్కడక్కడ నున్న యెడల వేసవికాలపు యుపద్రవ మింకను తగ్గియుండవచ్చునని గ్రహింపనగును.

౨. దేశమునందలి గాలిలోని తడిని హెచ్చించి నేలలు వెంటనే పొడియారి పోకుండ కాపాడును.

3. దేశమునందలి వర్షమును హెచ్చించును. అడవులులేని చోట్లకంటె అడవులున్న చోట్ల వర్షములు హెచ్చుగ కురియునని చెప్పుదురుగాని దీని నిశ్చయమును ఋజువుపరచుటకంతగా నిదర్శనములులేవు. ఒకవేళ అడవులున్న ప్రదేశములలో కొంచ మెక్కువ వానలు కురిసినను కురియవచ్చును. అడవులుండు కొన్ని కొండలమీద వర్షములు హెచ్చుగ కురియుచుండుట చూచుచున్నాము. అట్టి హెచ్చు వర్షములు ప్రత్యేకము అడవులక్కడనుండుటచేత నెంతవరకు కురియుచున్నవో ఆయడవులక్కడ లేనిచో యెంతతక్కువ కురిసి యుండునో నిర్ధారణ చేయుటకు తగిన నిదర్శనములింకను సరిగా తెలిసియుండలేదు. ఏలయన వర్షముయొక్క హెచ్చుతగ్గులు ప్రత్యేకము అడవుల మూలముననే గాక ఆయా ప్రదేశములయొక్క యెత్తు, వాయుప్రచారము, భూమధ్యరేఖనుండి దూరము, సముద్రతీరమునుండి దూరము మొదలగు అనేక

స్థితిగతులనుబట్టి ఏర్పడియుండుటచే అడవుల వలన ఎంతమార్పుగలుగుచున్నదియు, ఇతరకారణములచేత నెంతమార్పుకలుగుచున్నదియు చెప్పుటకష్టము.

౪. అడవులు లేనిదేశములయందు నీటిపారుదల వర్షకాలములో మిక్కిలి హెచ్చుగను, ఎండకాలములో మిక్కిలితక్కువగను ఉండును. అడవులు గలదేశములలో వర్షకాలమునందు కురియునీరు కొంతవరకు భూమిలోనికిదిగి కొంతకాలము అక్కడదాగియుండి సంవత్సరము పొడుగునను ప్రవహించెడి యూటలుగను నదులుగను బయలువెడలి నిరంతరమైన ప్రవాహమును దేశమునకిచ్చును. అడవుల మూలమున వరదలయుపద్రవము కొంతవరకు తగ్గును. చెట్లుచేమలులేని బోడిరాళ్లమీద వానకురిసిన యెడల వాననీరంతయు వెంటనే వెల్లువలుగా క్రిందికి దొర్లిపోయి వరదలై గ్రామములను ముంచివేయును.

౫. కొండలు విరిగిపడిపోకుండగను, నేల కరగిపోకుండగను చెట్లు కొంతవరకు కాపును. నదులును పల్లపుభూములును వరదలచే వరగోసికొనిపోకుండ చెట్లు కొంతవరకు సహాయపడును. బందనేలలలో నొందుమన్ను చేరి మెరకెక్కుటకును, భూసారమధికమగుటకును అడవులు సహాయపడును.

౬. వాయుప్రచారమధికతీవ్రముగాకుండ అడవులు కాపాడును. చుట్టుపక్కల నుండు ప్రదేశములలోని ప్రజలకును పైరులకును అధికమైన వేడిగాలిగాని, అధికమైన చలిగాలిగాని తగులకుండ అడవులు కాపాడును. పశువులకును, మృగములకును, పక్షులకును నిలువ నీడనిచ్చి కాపాడును. కొన్ని అడవులు అనారోగ్య ప్రదేశములను సాధారణముగ ఆరోగ్యవంతములుగ మార్చును. కొన్నిచోట్ల అడవులు దేశమును శత్రువులనుండి కాపాడును.

౭. అడవులు దేశముయొక్క అందమును హెచ్చించును. ఒక్కటే బట్టబయలుగనున్న ప్రదేశములలో నక్కడక్కడ నొక్కొక అడవి ప్రదేశమున్న యెడల ప్రజల మనస్సులకు నొకతరహా విశ్రాంతియు ఉత్సాహమును ఆనందమును కలుగును.

అడవుల పరిపాలన.

అనాదియందు సాధారణముగ అడవులకు పరిపాలనయే యుండియుండదు. అడవు లెక్కువగనుండి మానవులు తక్కువగ నున్నపుడు సృష్టియందు మానవునకుగాలియు, నీరును, ఎట్లుఉచితగ దొరకుచున్నవో అట్లే అడవియందలి కందమూలాది ఫలసాయములును కర్రకంపలును ఉచితముగనె దొరికియుండును. ఇప్పటికూడ కొన్నియడవులలో నేవస్తువునకుగాని వెలయేలేదు. అరటిపండ్లు, పనసపండ్లు, నారింజపండ్లు మొదలగుననేకపండ్లును, కాయలును, పువ్వులును, ఇవియవి యననేమి ఎనుములు, ఏనుగులు, గుఱ్ఱములు, మేకలు, మొదలగు జంతువులును, చూచువారులేక మడసిపోవుచున్నవి. కాని మానవాభివృద్ధి హెచ్చి అడవి తగ్గియున్నచోట్ల, ఇది నాది, అది నీది అను ఏర్పాటులు పుట్టినవి. తోడనే ఎవరిది

వారు సంరక్షితపెట్టుకొనవలెనను తలంపును పుట్టియుండును. దీనినిబట్టియే చట్టములును, ఆచారములును నేర్పడియుండును. నాగరికత చెందిన ప్రతిదేశమువారును తమ అడవులు నాశముకాకుండ కాపాడుకొనవలయు నని గ్రహించిరి. ఈవిషయమున జర్మనిదేశీయులు ప్రథమున మార్గదర్శకులు. జర్మని దేశములో స్వతహాగా అడవులు హెచ్చుగ నుండెను. మిక్కిలి చలిదేశమగుటచే వారికి ఆహారమెంత అవసరమో చలిమంటలకు కట్టెలును అంతే అవసరమయ్యెను. ఇందుచేత వారు వ్యవసాయమునకుతగిన భూమిని ఎంత ఫలవంతము జేయుటకు ప్రయత్నించిరో, వారల అడవులను అంతఫలవంతముగ జేసికొనుటకు మొదటినుండియు ప్రయత్నపడిరి. ప్రతిజిల్లాయందును అధికారులను, పాఠశాలలను, ఏర్పరచి అడవులు వృద్ధియగునట్లు చేసి ప్రయత్నము లొనరించిరి.

ఇట్లుచేసియు దేశములో రమారమినాలవ వంతుభాగము అడవులుగాబెంచియు, తమకు కావలసిన కలప దేశములో దొరకకపోవుటచే ప్రతిసంవత్సరమును ౪౬ లక్షలు టన్నుల కలపను ఇతరదేశములనుండి రవాణా చేసికొనుచున్నారు. వీరిదానిని కనిపట్టి ఫ్రెంచివారును, ఆస్ట్రియా, డెన్మార్కు, బెల్జియం దేశస్థులును వారివారి కనుకూలమగు రీతిని అడవులను సంరక్షించుకొనిరి. కాని ఇంగ్లండు దేశములోను ప్రజాభివృద్ధి మిక్కిలిఅధికమగుటచేతను, వ్యవసాయమునకును ఇతరవర్తక వ్యాపారములకును భూమి అధికముగ కావలసివచ్చుటచేతను, నలుప్రక్కల సముద్రతీరముగలదై ఇతరదేశములనుండి కలప అతిసులభముగ సంపాదించుకొనగలిగియుండుటచేతను, ఆదేశమునందలి ప్రజలు మొదటనుండి అడవుల నాదేశములో పెంచుటకంతగా శ్రద్ధచేసినవారుకారు. కాని మన హిందూ దేశమునందలి అడవులను బ్రిటిషు ప్రభుత్వమువారు మిక్కిలి శ్రమజేసి వృద్ధిచేసియున్నారు. జర్మనీదేశములోని శాస్త్రవేత్తల వద్దకు ప్రత్యేకము విద్యార్థుల బంపించియు, జర్మనీదేశపు శాస్త్రవేత్తల నీ దేశమునకు రప్పించియు మనదేశపు పరిపాలకులు మన అడవులను లాభకరముగ పెంచుటయేగాక సింహళము, మలయా, జపాను మొదలగు దేశములవారికికూడ నిప్పుడు మార్గదర్శకులైయున్నారు.

మనదేశమాదియందు దండకారణ్యాదియడవులచే నిండియుండెను. ఆర్యాదులు నదీతీరములయందుండెడి ఫలవంతములగు అడవులను కొట్టుకొనుచు వ్యవసాయమున కుపయుక్తముగ జేసికొనుచురాగా అనార్యులగు అడవిజాతులవారలు అడవులకాల్చుచు బయళ్లేర్పరుచుకొనుచు, కొంతకాల మక్కడ నివసించి చుట్టునుండు వేట జంతువులు తగ్గిపోయిన తరువాత వేరొకచోటికి తమ నివాసస్థానమును మార్చుకొని క్రొత్త అడవులను కాల్చి, కొట్టి బయలు జేసికొనుచు, కొండనక బయలనక దేశమునందలి అడవు

లను కొంతవరకు నసింపుఁజేయుచు వచ్చిరి.

ఇట్లు ఖాండవదహనము మొదలుగా వేల కొలది సంవత్సరములు గడువగా, బ్రిటిషు ప్రభుత్వము వచ్చిన తరువాత ప్రజాభివృద్ధి హెచ్చుగుటచేతను, వ్యవసాయముచేయు ప్రదేశ మధికమగుటచేతను, పశువుల అభివృద్ధి యగుటచేతను; నాగరికులు అడవులను కాల్చు ఆచారముచేతను, అడవులకు నాశనము కాజొచ్చెను. రైళ్లు వచ్చి క్రొత్త మార్గము లేర్పడిన కొలది ఆ మార్గముల వెంట క్రొత్త ప్రదేశములు వ్యవసాయమగుటచేతను, కలప వ్యాపారమునకు సదుపాయములు హెచ్చుటచేతను అడవులన్నియు మరింత నాశనము కాజొచ్చెను. ఇట్లు కొంతకాలము జరుగగా సర్కారు పనులకు సహితము కలప దొరకకపోయిన ప్పుడు అడవులన్నియు అకారణముగా నశింపు జెందినందులకు వారు పశ్చాత్తాపమును జెంది పునరుద్ధారణ చేయుటకు ప్రారంభించిరి.

౧౮౦౫వ సం॥ రములో ఈస్టు ఇండియా కంపెనీయొక్క డైరెక్టర్లు, ఇంగ్లాండులో ఓడకు చెట్లు ఖర్చు అయిపోవుటచేత రాజుగారి ఓడలకు కలప కావలసి యున్నదనియు, మలబారునుండి ఓడకు ఎంత పంపగలరనియు ఇక్కడి కంపెనీ అధికారులకు వ్రాసిరి. అంతట కొంత విచారణజరిగి తుదకు ౧౮౦౬వ సం॥ రములో క్యాప్టెన్ వాట్సన్ అను పోలీసు యుద్యోగస్తుని మలబారులో ఫారెస్టు కాన్సర్వేటరుగా నియమించిరి. ఆయన ౧౭ సంవత్సరములు పనిచేసి అడవి లోనుండు టేకుచెట్లు సర్కారు సొత్తనియు, వానిని ప్రజలు కొట్టకూడదనియు శాసించెను. కాని, వర్తకులయొక్కయు, రయితులయొక్కయు అసంతృప్తి హెచ్చుగుటచే అప్పటి మదరాసు గవర్నరగు సర్ తామస్ మన్రోగారిని ౧౮౨౩ సంవత్సరములో ఈశాసనములను రద్దుచేసిరి. క్యాప్టెన్ వాట్సన్ తరువాత ఆపని కెవ్వరు నేర్పడకయుండక పోవుటచే పూర్వపు ప్రకారమే అడవులను లెక్కలేకుండ నరకివేసిరి. ౧౮౫౨ సం॥ మున బర్మాలోని పెగ్గు రాజ్యము బ్రిటిషు పరిపాలనలో చేరిన పిమ్మట గొప్పగొప్ప అడవులు సర్కారునకు చేరియుండెను. లార్డుడాల్ హౌసీగారి ప్రభుత్వములో జర్మనీనుండి డాక్టరు బ్రాండిస్ అను ఆయనను రప్పించి పెగ్గుదేశమందలి అడవులకు సంరక్షకునిగా నేర్పరిచిరి. ౧౮౪౭వ సం॥ రమున బొంబాయి రాజధాని కొక సంరక్షకుని, ౧౮౫౬ సం॥ లోనే మదరాసు రాజధాని కొక సంరక్షకుని నియమించిరి. పిమ్మట బ్రాండిస్‌గారినే ౧౮౬౪వ సం॥ న హిందూదేశము నందలి అడవులకు ఇన్‌స్పెక్టరు జనరల్‌గా నేర్పరిచిరి. వీరు ఈ యుద్యోగమున ౧౯. సంవత్సరములు మిక్కిలి శ్రమపడి కీర్తివహించిరి. వీరును, వీరి తరువాతవచ్చిన వీరి శిష్యులే ప్రస్తుతపు ఫారెస్టు డిపార్టుమెంటునకంతకును నిర్మాతలని చెప్పవచ్చును. ౧౮౬౯వ సం॥ మున సాలునకు ౧,౯౪,౦౦౦ రూపాయల జీతముమీద

[illegible] ఇంపీరియల్ ఫారెస్టు ఆఫీసర్లను [illegible]. అప్పటినుండియు ఈ డిపార్టు [illegible] ఆరంభము [illegible] సర్వీసు ఆఫీసర్లను ౧౩౮ [illegible] సర్వీసు ఆఫీసర్లను,౧౮,౮౨౮ [illegible] ఉద్యోగస్థులును ఫారెస్టు డిపార్టు [illegible] పనిచేయుచుండిరి. వీరిజీతముల [illegible] సంవత్సరముల్లో ౭౩ లక్షల రూపాయలకుపైగా ఖర్చైయుండెను.

[illegible] ఇండియా గవర్నమెంటువారికి [illegible] ఇన్స్పెక్టరు జనరల్ [illegible] అను అధికారిగలడు. వీరికి నెలకు [illegible] వీరికిలోబడి, ప్రతిరాజ [illegible] ఆ రాజధానుల [illegible] ఈరాజ ధానిలో [illegible] వారికి లోబడి సర్కిలు [illegible]. వీరు ఉత్తరసర్కిల్, [illegible] సర్కిల్, పడమరసర్కిల్, దక్షి [illegible] అను నాలుగు [illegible] ములలో [illegible] పరిపాలించుచున్నారు. ఈ [illegible] క్రింద అవసరమునుబట్టి కొం [illegible] డిప్టీ కాన్సర్వేటర్లును, అసిస్టాంటు కాన్సర్వేటర్లు ఉన్నారు. వీరిక్రింద రేంజ [illegible] ఫారెస్టర్లును, వారిక్రింద [illegible], వారిక్రింద అవసరమైనచో [illegible] వాచర్లును, కూలీలును, ఏర్పడి [illegible].

ఈ రాజధానిలో ఈప్రక్క పట్టికలోనుదహ రించినప్రకారము ఫారెస్టు డిపార్టుమెంటులో ౩౦౬౪ మంది పనిచేయుచున్నారు. వీరి జీతములక్రింద ౧౪,౭౯,౪౯౩ రూపాయలు ఖర్చు అగుచున్నది.

ఒక్కొక జిల్లాయందు ఆయాజిల్లాలకు సంబంధించిన ఫారెస్టుపనులు నెరవేర్చుటకై డిస్ట్రిక్టు కలెక్టరుకులోబడి ఒకరిద్దరు డిస్ట్రిక్టు ఫారెస్టు ఆఫీసరను అధికారులుందురు. ఈ ఫారెస్టు ఆఫీసర్లు ప్రజల సంబంధము వచ్చినపుడెల్లను ఆయాప్రాంతముల రివిన్యూ ఉద్యోగస్థులతో సంప్రతించి పని చేయుచుందురు.

ఇంపీరియల్ సర్వీసులోని ఉద్యోగస్థులను, ఇంగ్లాండులో పరీక్ష ఇచ్చినవారలనే నియమింతురు. అట్లు నియమింపబడినవారు ౧౯౦౬ వ సంవత్సరమునకుపూర్వము ఉత్తరహిందూస్థానమున కూపర్సుహిల్ అనుచోటనున్న రాయల్ ఇండియన్ ఇంజనీరింగు కాలేజిలో మూడుసంవత్సరములు చదివినపిమ్మట కొంతకాలము ఐరోపాలోని అడవులకు తరిఫియత్తు నిమిత్తము పంపబడుచుండిరి. పై సంవత్సరములో ఆకాలేజికూడ మూసివేసిరి. ఇప్పుడు ఇండియన్ ఫారెస్టుసర్వీసునకు కావలసిన ప్రొబేషనర్లను సెక్రెటరీ ఆఫ్ స్టేట్సువారు శివిల్ సర్వీసు కమీషనర్లుచేసిన పరీక్షనుబట్టి నియమించుచున్నారు. ఇట్లు నియమింపబడినవారు రెండుసంవత్సరములు ఆక్సుఫర్డులోను, ఒక సంవత్సరము ఐరోపాఖండ మందలి అడవులలోను తరిఫియతునుబొంది ఆక్సుఫర్డు యూనివర్సిటీలో పట్టాను పొంది హిందూదేశమునకు అసిస్టాంటు కాన్సర్వేటరు ఉద్యోగములకు వచ్చెదరు.

[illegible], ప్రావిన్షియల్, వీని భేదములకు ౧౬వ [illegible].

1914 సం॥ రములో ఈ రాజధానిలో ఫారెస్టు డిపార్టుమెంటులో పనిచేయుచున్న ఉద్యోగస్తుల పట్టీ.

హోదా.	యూరోపియనులు.	స్వదేశీయులు.	మొత్తము.	ఒక్కొంటికి నెలకు జీతము.
ఇంపీరియల్ సర్వీసు ఆఫీసర్లు—				
కాన్సర్వేటర్లు ...	4	...	4	రూ. 1500 మొ. 1900 వరకు.
డిప్టీ కాన్సర్వేటర్లు ...	24	...	24	,, 580 మొ. 1250 వరకు.
అసిస్టెంటు కాన్సర్వేటర్లు ...	3	...	3	,, 380 మొ. 540 వరకు.
ప్రావిన్షియల్ సర్వీసు ఆఫీసర్లు—				
ఎక్స్ట్రా డిప్టీ కాన్సర్వేటర్లు ...	3	2	5	,, 575 మొ. 850 వరకు.
,, అసిస్టెంటు కాన్సర్వేటర్లు.	13	12	25	,, 250 మొ. 550 వరకు.
సబార్డినేట్లు—				
రేంజర్లు ...	7	164	171	,, 50 మొ. 150 వరకు.
డిప్టీ రేంజర్లు ...	...	173	173	,, 30 మొ. 40 వరకు.
ఫారెస్టర్లు ...	...	257	257	,, 15 మొ. 25 వరకు.
గార్డ్లు ...	...	1422	1422	,, 6 మొ. 12 వరకు.
ఆఫీసు ఎస్టాబ్లిష్మెంటు—				
అకౌంటెంట్లు ...	...	37	37	,, 30 మొ. 60 వరకు.
గుమాస్తాలు ...	...	480	480	,, 20 మొ. 150 వరకు.
జవానులు ...	...	463	463	,, 6 మొ. 8 వరకు.
మొత్తము ...	54	3010	3064	

ప్రావిన్షియల్ సర్వీసులోని ఉద్యోగస్తులను డేరాడూనులోనున్న ఫారెస్టు కాలేజీలో పరీక్షనిచ్చినవారినుండి ఎత్తుకొనెదరు. సబార్డినేటు ఉద్యోగస్తులను కాన్సర్వేటరులు నియమించి వారలకు ఫారెస్టుపనులను నేర్పెదరు.

డేరాడూనులోనున్న ఫారెస్టు కాలేజీగాక బొంబాయి రాజధానిలోని పునహాలోగూడ ౧౮౮౭వ సంవత్సరము మొదలు సాలుకు ౫౦ మంది విద్యార్థులకు అడవివిద్యను నేర్పెదరు. ౧౯౧౨వ సంవత్సరములో నీ రాజ

థానిలోని కోయంబుత్తూరులో నొక ఫారెస్టు కాలేజి నేర్పరచియున్నారు. ఈ ఫారెస్టు కాలేజిలోనుండి గతసంవత్సరములో ౨౩ రు సబార్డినేటు ఆఫీసర్లు కృతార్థులైరి. ఇవిగాక ప్రతిసర్కిలునందును సంవత్సరములో ఆరుమాసములు ఫారెస్టుస్కూలుపెట్టి దేశభాషలో అడవివిద్యను నేర్పెదరు. ఈస్కూళ్లయందు ఉచితముగ విద్యచెప్పుచు, ఉద్యోగములమీదనుండి అడవివిద్యను అభివృద్ధి చేసికొనువారలను చదువుచుండు కాలములోకూడ ఆయాగ్రేడులనుబట్టి జీతములు నిచ్చుచున్నారు. ఇంకను, ఈ విద్యచాలదు. స్కూలు ఫైనలువరకు చదివి వచ్చిరాని ఇంగ్లీషుతో వృత్తి యేమియును లేక దేశము నందసంతృప్తితో తిరుగుచున్న వందలకొలది విద్యార్థులను ఈదారికిత్రిప్పి ప్రతిసంవత్సరము ఈరాజధానియందు ౫౦౦కాదు ౧౦౦౦ మందివరకైనను ఫారెస్టువిద్యలో తరిఫీయతు చేసివారి కీపనియందు నుత్సాహము గలుగునట్లుచేయవలెను. దేశభాషలయందీవిద్య నేర్పినగాని ఇట్టి స్థితికలుగదు. ఇక్కడి కళాశాలలలో ప్రకృతి శాస్త్రమునందు గొప్ప పరీక్షలిచ్చినవారికి ప్రోత్సాహమునిచ్చి వారికిఅడవివిద్య చెప్పించి విరివిగ సుపీరియర్ సర్వీసులోని యుద్యోగముల నిచ్చినయెడల ఎవరో యెక్కడనుండియోవచ్చి దేశముయొక్క స్థితిగతులనుగాని, దేశభాషలనుగాని ప్రజల స్వభావములనుగాని యెరుగని యుద్యోగస్థులకంటె నెక్కువలాభకరముగ సర్కారు పనులు నెరవేర్పగలరని నిశ్చయముగ చెప్పవచ్చును. అడవులలోని అధికారులకెవ్వరికి నిప్పటికిని తెలియని విషయములెన్నియో అడవిజనులకు తెలియును. ఒకకఱ్ఱ తలుపులు చేయుటకుగాని, నిప్పుపుల్ల చేయుటకుగాని మంచిదాకాదాయని ప్రశ్న వచ్చినపుడు దానికొకానొకప్పుడు ఫారెస్టు ఉద్యోగస్థులకంటె పల్లెటూరివడ్రంగియే సరియైనజవాబు చెప్పగలిగియుండును. ఈకఱ్ఱలో చమురున్నది, ఆకఱ్ఱలోలేదు, దీనికి చెదలంటును, అది చీకిపోవును అను విషయములు ఆయా ప్రదేశములలో నుండువారలకు పసితనము నుండియు స్వాభావికముగ తెలిసియుండును. అదేప్రశ్నను ఫారెస్టు యుద్యోగస్థుని అడిగినయెడల వృక్షశాస్త్ర గ్రంథములన్నియు త్రిప్పి ఇదినాకు సంబంధించినదికాదు "ఫారెస్టు ఎకానిమిష్టు" అను ప్రత్యేక శాస్త్రవేత్త నడుగవలెనని జవాబుచెప్పును. *ఇట్టిలోపములను నివారించుటకు ఆయా ప్రదేశములందలి లోకానుభవమే ముఖ్యము.

ఇట్టిలోకానుభవమును సంపాదించుటకు దేశభాషాజ్ఞాన మవసరము. స్వస్థలములోని అడవులందు ప్రజలకుతగినంత ప్రోత్సాహము కనుపరచి ఆయాప్రదేశములయందు కార్ఖానాలను వృద్ధిచేసి ఒక్కొక అడవిలోని ఫలసాయమును అక్కడనే తగురూపములగు సామానులుగ మార్చి అవసరమైనచోట్ల కెగుమతి చేసినయెడల ఇప్పటికంటె అడవులు

* G. O. నెం. 3142 ది 8-11-1914 చూడుము.

కొద్దికాలములో ననేకరెట్లు సర్కారునకు ఫలము నొసగుననియు, దేశమును భాగ్యవంతముగ జేయ గలుగుననియు నిశ్చయముగ చెప్పవచ్చును. ప్రస్తుతము అడవి అధికారుల పేరుచెప్పిన ప్రజలకుగల భయమును అసంతృప్తియు, నశించిపోవును.

గలదు. ఇది ఈదేశముయొక్క మొత్తపు పరిమాణములో రమారమి అయిదవవంతుం డుటచేత ఈదేశమునకు తగినంత అడివి యున్నదని కొందరనుచవచ్చునుగాని యది సరిగాదు. ఏలయన నీ దేశమునందలి యడవి సర్వత్ర సమముగా పంచబడియుండక ఒక

ప్రదేశము.	చదరపు మైళ్ళ వైశాల్యము	జనసంఖ్య.	ప్రతి 1 చదరపు మైలుకు జనసంఖ్య	అడవి చదరపు మైళ్ళు	ఒక్కొక్క చదరపు మైలు అడవికి జనసంఖ్య	ప్రతి 1 మనిషికి అడవి ఎకరములు.	
						ఎ.	సెం.
సంయుక్తరాష్ట్రము	106,402	46,835,108	440	4174	3 పాళ్ళు.	0	5
బంగాళాదేశము ...	111,447	52,468,818	470	7011	6 ,,	0	8
పంజాబు ...	97,218	19,731,722	230	8733	8 ,,	0	25
బొంబాయి ...	122,978	19,587,383	159	12379	10 ,,	0	39
మదరాసు ...	129,870	40,347,357	391	20030	14 ,,	0	31
మధ్యపరగణాలు.	99,803	13,916,308	139	21384	21 ,,	0	96
అస్సాము ...	74,501	33,229,865	446	28905	30 ,,	0	53
బర్మా ...	108,837	9,878,593	91	137227	80 ,,	8	96
ఇండియా మొత్తము	868,763	238,688,118	245	243,478	23 ,,	0	65

అడవులవిస్తీర్ణము.

హిందూదేశములోని అడవులలో కొన్ని సర్కారు స్వాధీనములోను, కొన్ని స్వదేశరాజుల స్వాధీనమునందును, కొన్ని ప్రజల స్వాధీనమునందును వున్నవి. 1911 సంవత్సరపు లెక్కల ప్రకారము 243,478 చదరపుమైళ్ల విస్తీర్ణముగలఅడవి హిందూదేశము నందు ప్రదేశములో అడవిమిక్కిలి హెచ్చుగను,మరియొక ప్రదేశములో అడవిపొత్తుగ లేకయు నుండుటచేత పైపట్టీలో చూపిన ప్రకారము ఆయా రాజధానుల లెక్కలను మనము గమనించిన యెడల అడవులయొక్క హెచ్చు తగ్గులు తెలియగలవు.

1914 సంవత్సరపు లెక్కల ప్రకారము ఈరాజధానిలోని అడవుల విస్తీర్ణమును లక్షల ఎకరములలో తెలుపుపట్టీ నీప్రక్క చేర్చియున్నాము.

జిల్లా.		జమీందారీలు ఇనాములు మినహావిస్తీర్ణము.	వ్యవసాయపు భూమిని విస్తీర్ణము.	గవితాధీనము కాని భూమి విస్తీర్ణము.	రిజర్వు అడవుల విస్తీర్ణము.	మొత్తము విస్తీర్ణములో నూటికి అడవి ఎన్ని పాళ్ళు.
ఉత్తరఖండము:	గంజాం ...	29.2	4.4	24.8	4.0	13.9
	విశాఖపట్నం ...	8.4	1.8	6.6	6.6	23.6
	గోదావరి ...	21.2	6.0	15.2	15.2	37.9
	కృష్ణా ...	16.7	10.1	6.5	6.5	10.6
	కర్నూలు ...	40.3	15.2	25.0	25.0	41.8
	మొత్తము ...	116.0	37.7	78.2	32.7	28.2
మధ్యఖండము:	బళ్లారి ...	29.8	19.5	10.2	4.4	14.7
	అనంతపురం ...	37.1	17.8	19.2	4.8	12.9
	గుంటూరు ...	29.1	18.4	10.7	5.2	17.8
	కడప ...	32.2	9.6	22.5	11.6	36.1
	నెల్లూరు ...	23.2	9.4	13.8	4.7	20.2
	చెంగల్ పట్టు ...	12.8	6.7	6.1	1.3	10.4
	చిత్తూరు ...	17.5	4.5	12.9	5.3	30.5
	మొత్తము ...	182.0	86.3	95.7	37.5	20.6
దక్షిణఖండము:	నార్తార్కాడ్ ...	25.5	10.9	14.5	7.7	30.2
	సవుతార్కాడ్ ...	24.1	15.2	8.8	2.1	8.9
	సేలం ...	31.2	11.1	20.0	9.2	29.4
	తిరిచినాపల్లి ...	22.5	15.5	6.9	2.1	9.7
	తంజావూరు ...	15.8	11.4	4.3	0.1	0.7
	మధుర ...	20.7	11.5	9.2	4.2	20.3
	రామనాడు ...	4.4	2.6	1.8	0.4	10.4
	తిరునల్వేలి ...	17.9	12.0	5.9	22.7	12.6
	మొత్తము ...	162.0	90.5	71.8	28.3	17.4
పడమరఖండము:	దక్షిణకన్నడము.	25.7	8.2	17.5	5.1	19.8
	మలబార్ ...	36.9	13.3	23.5	3.5	9.7
	నీలగిరి ...	6.5	1.9	4.5	3.4	52.5
	కోయంబుత్తూరు.	45.5	25.1	20.4	15.0	33.0
	మొత్తము ...	114.0	48.6	66.1	27.2	23.7
	రాజధాని మొత్తము ...	575.0	263.2	312.0	125.8	21.8

జనసంఖ్య హెచ్చిన కొలది అడవుల యొక్క ఉపయోగము హెచ్చుగ నుండును గాని అడవు లున్న చోట జనసంఖ్య హెచ్చుగ నుండదనియు జనసంఖ్య హెచ్చుగ నున్న చోట అడవు లుండవనియు తెలియగలదు.

అడవుల తరగతులు.

ఫారెస్టు డిపార్టుమెంటువారు అడవులను రిజర్వు అడవు లనియు, సంరక్షణాలోనున్న అడవు లనియు పబ్లికుఅడవులనియు మూడువిధము లుగ విభజించియున్నారు.

రిజర్వు.

కలపకొఱకుగాని, ఇతర అడవిపదార్థము లకొఱకుగాని, నీటి ప్రవాహములను సంరక్షించుటకుగాని, మఱియే ఇతరకారణములవలన గాని శాశ్వతముగ అడవులుగ నుండుటకు ఏర్పాటుకాబడిన భాగములు రిజర్వు అడవులనబడును.

సంరక్షణ.

శాశ్వతముగ అడవులుగ నుంచుటయు నిశ్చయముగ నేర్పడక, ప్రస్తుతము ప్రజలు తమ ఇచ్చ వచ్చినట్లు నరికివేసి అడవియొక్క పెంపును నాశనము చేయకుండ కొన్ని తగు నిబంధన లేర్పరచి ఏవోకొన్ని చెట్లనేకొట్ట నిచ్చుచు సర్కారు సంరక్షణలో నుంచు కొనిన అడవులకు సంరక్షణాలోనున్న అడవు లనిపేరు. సంరక్షణాలోని అడవులలో అవసర మునుబట్టి కొన్ని అడవులను రిజర్వుగా మార్చుదురు. మఱికొన్ని అడవులు ప్రజల కుపయోగపడునట్లు కొన్ని నిర్ణయములతో నట్లేయుంచుదురు.

పబ్లికు.

పబ్లికులేక తరగతి విభాగముకాని కొన్ని యడవులపై వానికంటె ఎక్కువగా ప్రజలకువిడిచి వేయబడును. ఇందు కొన్నిటిలోని. ఫలసాయ మునుబొత్తుగ నిబంధన లేకుండ ప్రజలుతమ ఇచ్చవచ్చినట్లుపయోగపరచుకొనవచ్చును.

1901-వ సం॥ పు లెక్కల ప్రకారము సర్కారు క్రిందనున్న 2,08,398 చదరపు మైళ్ల అడవులలో 88,140 చదరపుమైళ్లు రిజర్వుగాను 10,488 చదరపుమైళ్లు సంరక్షణాలోను మిగిలిన 1,09,741 చదరపుమైళ్లు తరగతి విభాగము లేని పబ్లికు అడవులు గానుపుండెను. 1911 సం॥ రపు లెక్కల ప్రకారము 2,43,478 చదరపుమైళ్ల అడవులలో 96,337 చదరపుమైళ్లు రిజర్వుగాను, 8057 మైళ్లుసంరక్షణాలోను, 138,584 మైళ్లు తరగతి విభాగములేని పబ్లికు అడవులుగా నున్నది. ఈపదిసంవత్సరములలో అడవుల విస్తీర్ణము నూటికి 15-వంతు హెచ్చినట్లును తెలియ గలదు. కాని తరగతిలేని యడవులలో చాల భాగము జనసంఖ్యలేని బర్మా మొదలగు ప్రదేశములలో చేరియుండుటచేత తరగతి లేని అడవులు లెక్కకు హెచ్చుగా నున్నట్లు కనబడుచున్నను జనసంఖ్యగలచోట్ల లెక్కలు చూచిన తరగతివిభాగముకానిఅడవి బొత్తుగ తక్కువగ నున్నట్లు తెలియగలదు.

1911 సం॥ రపు లెక్కలప్రకారము తర గతిలేని 138వేల చదరపుమైళ్ల బర్మాదేశము

నందు 111 వేల చదరపుమైళ్లును, అస్సాము నందు 22 వేల చదరపుమైళ్లును తరగతిలేని అడవియున్నది.

సంయుక్తరాష్ట్రముల యందు 30 చదరపు మైళ్లును, పంజాబునందు 1319 చదరపు మైళ్లును, మదరాసు నందు 1401 చదరపుమైళ్లును, మాత్రముగలవు. మధ్య పరగణాల యందును, బొంబాయి యందును, బంగాళాయందును, ఈబాపతు అడవి లేనే లేదు.

దీనినిబట్టి జనసంఖ్య హెచ్చుగలేని దేశములో తరగతి విభాగములేని అడవులు హెచ్చుగనున్నట్లును ప్రజాభివృద్ధి హెచ్చిన చోట్ల బొత్తుగ అడవి లేనట్లును తెలియగలదు.

ఫారెస్టు డిపార్టుమెంటువారిపని మూడు విధములైనది.

౧. మొత్తము మీద దేశమునకులాభము గల్గునట్లు అడవులను వృద్ధిజేయుట.

౨. అడవుల సమీపములోనుండు ప్రజలకా యడవుల వలని సదుపాయములు ఎక్కువగా కలుగునట్లు చేయుట.

3. అడవులలో నుండివచ్చు ఫలసాయమును ఎట్లు ఖర్చుపరచిన ఎక్కువ యుపయోగకరమో ఆపద్ధతుల వెంబడిన దానిని వ్యయ పరచి సర్కారునకు అడవులవలని ఆదాయము హెచ్చు అగునట్లు చేయుట.

ఈ మూడువిధులను ఫారెస్టు డిపార్టుమెంటువారు మనరాజధానిలో నెట్లు నెరవేర్చుచున్నారో క్రింద చూడగలరు.

అడవి చట్టములు. హిందూదేశములో అడవులను గూర్చిన మొదటిచట్టము ౧౮౬౫వ సం॥ రములో పుట్టియున్నది. రయితాధీనముకాని భూమియంతయు సర్కారు సొత్తుఅనే పునాదినిబట్టి ఈఅడవుల చట్టములు ఏర్పడినవి. మధ్యరాష్ట్రములలోను, పంజాబులోను, బర్మాలోను, బేహారు, కూర్గు, సంయుక్త రాష్ట్రములలోను మొదట కొన్ని నిబంధనలీచట్టమునుబట్టి పుట్టినవి. పిమ్మట ౧౮౭౮ సం॥ రము ౭వ నెంబరు ఆక్టు ప్రకారము [మద్రాసు రాజధానియు, బర్మా తప్పతక్కిన] హిందూదేశములోనిఅడవులన్నియు ఫారెస్టు చట్టములలో చేరినవి.

౧౮౮౧, ౮౭ సంవత్సరములలో లోయర్ బర్మా, అప్పర్ బర్మాలకును, ౧౮౮౨ మద్రాసునకును,* ౧౮౭౮ సంవత్సరములో పల పైఆక్టులు అములులో లేని అన్ని ఇతర దేశములకు ఫారెస్టు చట్టము లేర్పడెను. ఈ చట్టము లేర్పడిన తరువాత ఏయే అడవులు ప్రత్యేకము సర్కారువారివో, ఏయే అడవులు ఇతరులవో అను విషయము నిర్ధారణ కావలసి వచ్చెను. కొన్ని అడవులు సర్కారు వారివైనను ప్రజలు వానిలో కొంతవరకు కొన్ని హక్కులను ఆనుపూర్వముగా గలిగియుండిరి.

---

* ఇది 1882 సం॥ రపు 5 నెంబరు ఆక్టు. ఈఆక్టు 1885 సం॥ రము డిసంబరు నెల 3-వ తేది గల గవర్నమెంటు నోటిఫికేషనుబట్టి మదరాసు రాజధానిలో భద్రాచలము, రేకపల్లి, తాలూకాలకు మొట్టమొదట అములులోన్నికి వచ్చినది.

ఆహక్కులు వారి కెంత వరకు గలవో అట్టి అడవులలో సర్కారువారి కెంతహక్కు గలదో యను విషయములను నిర్ధారణచేయ వలసివచ్చెను.

ఏదైనను ఒక అడవిని సర్కారువారు స్వంత అడవిగా నేర్పరచ నెంచిన యెడల ఆ ప్రదేశములోని జనులకును, ఆ ప్రదేశము నందు హక్కుగలదని తోచినవారి కెల్లరకును తమ అభిప్రాయమును వెల్లడిచేసి, ఆ ప్రదేశము నందలి వారలు తమహక్కులను, అభ్యంతరములను తెల్పుకొనుటకు, మూడు నెలల వరకు గడువిచ్చెదరు. ఫారెస్టు సెటిల్మెంటు ఆఫీసరు అనుపేరుగల నొక రెవిన్యూడిపార్టుమెంట్ ఆఫీసర్నును, ఒక ఫారెస్టు డిపార్టుమెంటు ఆఫీసరును జేరి తగవులన్నియు తీర్చిన మీదట ఫలాని ప్రదేశములు సర్కారు వారిస్వంత ఫారెస్టు అనియు, ఫలాని ప్రదేశములు వారి సంరక్షణ లోని ఫారెస్టు అనియు నిర్ధారణచేయుదురు.

సర్కారువారు రిజర్వు చేయదలచుకొన్న అడవులసరిహద్దులు స్పష్టముగా తెలియుటకుగాను గుర్తులేర్పరుచుదురు.

డిమార్కేషన్ (సరిహద్దుగుర్తులు.)

ఈగుర్తులు జనసంఖ్య విస్తారముగాలేని పెద్దపెద్ద అడవులలో నెట్లున్నను జనసంఖ్యయు పశువులును హెచ్చుగల ప్రదేశములలో మిక్కిలి స్పష్టముగ నుండవలెను. లేనియెడల ఆక్రమణలను సులభముగ కనిపట్టుటకు ఫారెస్టు అధికారులకును కష్టమే. ప్రక్కభూముల అధికారులకును గుర్తులకనిపట్టుట కష్టమే. గ్రామములసమీపములో రిజర్వు అడవులున్న యెడల వాటి సరిహద్దుల వెంబడిగ రంగుపూసిన పెద్దపెద్ద నోటీసు పలకలను కట్టవలెను. దూరమునుండి పశువులకాపరులు చూచుకొనుటకు స్పష్టముగ తెలియవలెను.

ఫారెస్టురిజర్వుల సరిహద్దులు వంకరటింకరలుగానుండక తిన్నగానుండవలెను. కొంత భాగము రిజర్వులోనుండి బయటకు పోవుట కైనను సర్కారువారు ఒప్పుకొనవలసి వచ్చును. వంకరటింకరలుగానున్న యెడల అడవిని కాయువారలకును కష్టము. బైటవారలు తమ పశువులు వగైరాలు రిజర్వులోనున్నవో బైటనున్నవో తెలిసికొనుటయు కష్టము. అడవులసరిహద్దులు గ్రామముల సరిహద్దులవరకు వ్యాపించి యున్నయెడల చెదరుపశువులువచ్చి అడవిని పాడుచేయుటకు వీలు హెచ్చుగానుండును. ప్రజలకును పరిపాలకుల వలన బాధలు హెచ్చుగనుండును. కాబట్టి రిజర్వుఅడవులను డిమార్కేషన్ చేయునపుడు సాధ్యమైనంతవరకు అడవికిని రైతాధీన భూములకును అరమైలుదూరమయినను పబ్లికు ఫారెస్టుగా నుండవలెను.

ఒక్కొక సంవత్సరమునకు లక్షలకొలది మనుష్యులను జంతువులనుశిక్షించి వేధించుటకంటె (పట్టీచూడు) అరణ్యపాలకులు తమ సరిహద్దులనుదిట్టపరచుకొని, సిబ్బంది యొక్క యుపయోగము తగ్గింప ప్రయత్నింపవలెను. జనసంఖ్య హెచ్చుగనున్న చోట్లడవిచుట్టును

వలెను. ఆగ్రామములోనుండు పశువులకు, సదరు అడవిలోనుండు మేతచాలదని తోచిన యెడల సదరు అడవిలో మేపుకొనదగిన పశువుల సంఖ్య యింతని యేర్పరచి, ఆ సంఖ్యకు తగిన పశువులను విడదీసికొను హక్కు గ్రామ పంచాయితీదార్లకు యిచ్చివేయవలెను. అయినను తరగతి అడవులలో సామాన్యముగా కట్టుబాట్లేమియు చేయనక్కరలేదు. అనేకచోట్ల గ్రామస్థులే ఆకట్టుబాట్ల నేర్పరుచుకొనెదరు.

vii. ప్రస్తుతము ఉపయోగములో నున్న మేత చీట్లను (పర్మిటు) పంచిపెట్టుటలో ఏదేని మార్పు చేసినయెడల చక్కగనుండునా? ఏవిధమున మార్పు చేయవలయును.?

జవాబు: చేయవచ్చును. అనేకచోట్ల పర్మిటు పద్ధతినే తీసి వేయవలెను. ఎక్కడైన నుంచిన యెడల వానిని పంచిపెట్టు ఏర్పాటులు గ్రామస్థులకే విడిచి పెట్టవలెను.

viii. కొన్ని గ్రామముల సమీపమున చిన్నచిన్న రిజర్వు అడవులు చెల్లాచెదురుగానున్నవి. అట్టి అడవులను ఫారెస్టు డిపార్టుమెంటు సంరక్షణలో నుంచుకొనవలెనా? లేక రివిన్యూ డిపార్టుమెంటువారికి ఇచ్చివేయవచ్చునా? లేక గ్రామస్థులకే యిచ్చి వేయవచ్చునా?

జ॥ సామాన్యముగా ఏదో కొంత శాశ్వతమైన మొత్తమును ఏర్పాటుచేసి, గ్రామపంచాయితీదార్లకే యిచ్చివేయుట మంచిది. లేని యెడల అట్టివానిని అడవుల పట్టీలో నుంచి తగ్గించుట యుక్తము.

ix. ప్రస్తుతము అడవులలోనుండు వంట చెఱకును అమ్మివేయు పద్ధతులలో ఏవైనను లోపములున్నవా? అట్లున్నచో అట్టిమార్గములను సులభపరచుటకు ఫారెస్టు కమిటీవారేదైన సలహాను చెప్పగలరా.?

జ॥ ఇప్పుడు సర్కారువారి పద్ధతి సరిగానేయున్నది. ఇట్లే సరిగా నడిపించిన యెడల ముందు ముందు వంట చెఱకుయొక్క సప్లయి వృద్ధికాగలదని తోచుచున్నయది.

x 1911 సం॥ మే నెల 29 తేదీని వెలువడిన 1605 రివిన్యూ నెంబరులో నుదహరించిన గవర్నమెంటు తీర్మానములో మార్పులేవైనను చేయవలెనా? ఎట్టిమార్పులు చేయవలెను.?

జ॥ అడవులలో పసిరక ఎఱువును పెంచుటకు కావలసినవిత్తనములను పంచిపెట్టు పెత్తనమును ఫారెస్టు డిపార్టుమెంటువారి చేతులలో నుండి తీసివేసి, వ్యవసాయపు డిపార్టుమెంటువారికిని, రివిన్యూ డిపార్టుమెంటువారికిని ఇయ్యవలెను. ఇదితప్ప వేరేమియు మార్పుల క్కర లేదు.

xi. గ్రామముల ప్రక్కనుండు అడవులు గ్రామస్థులకు కావలసిన పశువుల మేత, వంట చెఱకు, పిసిరికఎఱువు, మొదలగువానిని తగినంత సప్లయి చేయ లేకపోయిన చోట్ల అది యేకారణములచేత కలిగినదని కమిటీవారి అభిప్రాయము? ఉన్న లోపములను తీర్చుటకును,

శాశ్వతముగ ప్రజలయుపయోగార్థ మేర్పాటుకాబడిన అడవులు నాశనము కాకుండునట్లుటకును కమిటీవారేమి సలహానిత్తురు?

జ॥ అడవులన్నిటినిఒక్కటే విధముగఁజూచుటచేత నిదివరకున్న లోపములు కలుగుచున్నవి. ఈలోపమును సవరించుటకే కమిటీవారు అడవులను తరగతివారిగా విడదీసియున్నారు. తాముచెప్పినప్రకారము అన్ని అడవులను విడదీసి సాధ్యమైనంతవరకు క్రిందితరగతి ఫారెస్టు వుద్యోగస్థులకును పల్లెటూరి ప్రజలకును సంబంధము లేకుండ జేసిన యెడల పైని చెప్పిన లోపములు నివారణ అగునని కమిటీవారి అభిప్రాయము.

xii. కమిటీవారుసలహాయిచ్చు, ఒక్కొక పనివలన, సర్కారుకుఎంత తగులుబాటగును?

జ॥ మొట్టమొదట సర్కారునకు జమవచ్చు సొమ్ములో కొంతనష్టము రావచ్చును. అది యెంత యుండునో ఉజ్జాయింపుగనైనను చెప్పలేము. కాని దీనివలన గలుగు నష్టము హెచ్చుగానుండదు. కొంతవరకున్న సుప్రజలకుగలుగు సుఖమునుబట్టి పోల్చినయెడల మొత్తముమీద చాల లాభకరముగనుండునని తలచుచున్నాము.

ఈపైనజెప్పిన పండ్రెండుప్రశ్నలును కమిటీవారు నాల్గుతరగతులుగ విభజించిరి. (1) పశువులమేతకు సంబంధించిన విషయములు (2) వంటచెఱకునకు సంబంధించిన విషయములు (3) పసరుఎరువునకు సంబంధించిన విషయములు (4) ఇతర విషయములు. ఈనాల్గు విషయములలో నొక్కొకదాని నెత్తుకొని కమిటీవారు విమర్శించిరి. అందు మొదటి రెండు విషయములనుగూర్చి కమిటీవారి అభిప్రాయములు ప్రజలకు తెలిసియుండవలసిన యుక్తమనియెంచి వానిని క్రింద సంగ్రహముగ తెలిపితిమి.

పశువుల మేత.

"పశువులమేతవిషయములో తక్కినవానిలోనన్నిటికంటె ప్రజలకెక్కువగునొత్తుడు కలిగినదనుమాటవాస్తవము. ప్రస్తుతము ప్రజలవద్దవసూలుచేయబడు కొద్దిపాటిరుసుమువలన వారికేమియు నొత్తుడు కలుగలేదనియు, వారికి కలిగిన కష్టములన్నియు నీ రుసుము వసూలగు పద్ధతులను బట్టి పుట్టినవి కాని పన్ను ఇచ్చుకొనుట యందు వారికి భారమేమాత్రము లేదనియు కమిటీవారి అభిప్రాయము. నెల్లూరు జిల్లాలోని అనేకశ్రోత్రియ గ్రామములలో, సర్కారు అడవులవంటి అడవులుగల స్వంతదారులు పశువు ఒక్కంటికి రూపాయిన్నరవరకును వసూలు చేయుచున్నారనియు, చెంగల్పట్టుజిల్లాలో ఒకజత ఎడ్లు ఒకదినమునకు ఎనిమిదణాల పాటు పడుచున్నవనియు, అందుచేత ఒక సంవత్సరపు మేతకగు, ఖర్చును ఒక్కొక పశువు కొద్దిగంటలలోనే సంపాదించుకొనగలిగియున్నదనియు కమిటీవారుఅభిప్రాయపడుచున్నారు."

"ప్రజలకష్టములుపన్నువలనకలుగుటలేదని మొత్తముమీదకమిటీవారుఅభిప్రాయపడియున్నను, మధుర, అనంతపురముజిల్లాలలోనిప్రజలు అందరును మేత నుచితముగా నియ్యవలసిన దని అడిగినట్లు వారు ఒప్పుకొనుచున్నారు. రామ్‌నాడ్ జిల్లాలో ఒకరిద్దరు రయితులు ఉచితముగా అడవులలో పశువులను మేపుకొననీయవలసిన దని కోరుచు ఢిల్లీ దర్బారు సమయమున కింగు ఎంపరరు గారికి టెల్లిగ్రాము పంపుకొని యున్నారు. కొందరు కాన్ఫరెన్సులలో తీర్మానములును చేసియున్నారు. ఇవియన్నియు కమిటీవారి నోటీసులోనికి వచ్చియున్నవి. పశువుల నుచితముగ మేయనిచ్చుటయే గాకయుచితముగవంటచెఱకును తీసికొనిపోనిచ్చుటకును

ఉచితముగ ఆకు వెంటను ఎత్తుకొని పోనిచ్చుటకును, వ్యవసాయపు పనిముట్లకు కావలసినకలపను తీసికొని పోనిచ్చుటకును, ఇది యుది అననేల, సర్కారుతాలూకు అడవులలోని యావత్తు సొత్తును తాము ప్రయోగించు కొనుటకు గాని, పొద్దు జేసికొనుటకు గాని, తమ కే స్వాతంత్ర్యముండవలసినదనియు, సర్వవిధములైన కట్టుబాట్లను తీసివేయవలసిన దనియు, అనేకచోట్ల, ప్రజలందరు కోరుచువచ్చిరి. అయితే అనంతపూరు జిల్లాలో మాత్రము మేకలను అడవులలోనికి రానియ్యకూడదని చెప్పుకొనుచు నచ్చిరి."

"మధురజిల్లాలో కొందరు జమీందారుల అడవుల లోనిరయితులు ఏ కట్టుబాట్లును లేక అడవిని కొట్టుకొనిపోవుటచేత సదరు అడవులు శీఘ్రముగ నశించి పోవుటయేగాని దగ్గరనున్న మధుర పట్టణములో వంటచెఱకు వెలయెంతమాత్రము మారలే దనియు అదే జిల్లాలో అయ్యలూరువద్ద తొప్పసామి కొండమీద కలపతో నిండియున్న సర్కారు అడవులను, బోడిగా నిలుచున్న జమీందారుల అడవులును, ఒకదానిప్రక్క నొకటి యుండుటజూచిన ఆశ్చర్యకరముగా నున్న దనియు" కమిటీవారు చెప్పిరి.

పైని చెప్పిన ప్రకారము ప్రజలు అడివి ఫలసాయమును చితముగా నెత్తుకొనిపోవుటకుతమకు హక్కు ఎందుచేతకలదని మొరపెట్టుకొనుచున్నారో యను విషయమును కమిటీవారు ఆలోచించి ఈక్రింది రీతిని తెలిపిరి.

"చిరకాలమునుండి, అడవి ఫలసాయమును వారనుభవించు చుండుటయు, ఒకయూరినిచేరిన యడవి ఆ యూరివారలు తమదేయని తలంచు చుండుటయు, నిట్టి యాశకు కారణమని తోచుచున్నది. ఏబది సంవత్సరముల కిందట దేశములో సగభాగము అడవిచే గప్పబడియున్నప్పుడు అడవిని కొట్టుకొని పోయినవారలు ప్రజలకొక యుపకారమే చేసినారని చెప్పవచ్చును. ఇప్పుడు ఒక్కొక జిల్లాలోనిరయితా ధీనపు భూమి రెట్టికిరెట్టు హెచ్చియున్నది. మనము పీల్చు గాలికెట్లు వెలలేదో అట్లే వెలలేక పడియుండెడి వంటచెఱకునకు టన్ను ఒకటికి 15 రూపాయల చొప్పున ఇప్పుడు వెలయేర్పడినది. దీనినిబట్టి ప్రస్తుతపు స్థితిగతు లెట్లు మారిపోయినవో తెలిసికొన వచ్చును."

"పూర్వకాలములో గూడ, ఈరాజధానిలోనియడవులలోనుండుసొత్తును ప్రజలు ఉచితముగ తీసికొని పోయిరని చెప్పుటకువీలు లేదు. 1634 వ సం॥లో బందరులోని ఈస్టిండియా కంపెనీవారికి గోల్కొండ సుల్తాను యిచ్చిన ఫర్మానాలో పశువుల మేతకును వంటచెఱకునకును ఇయ్యవలసిన యొకపన్నును వారికి తీసివేసినట్లు కనబడుచున్నది. గుంటూరుజిల్లాలో 1797 సం॥ లో పశువుల మేతకు పన్నున్నట్టు అప్పటి లెక్కల వలన కనబడుచున్నది. 1886 సంవత్సరములో ఆజిల్లామీద సర్కారునకు లక్షరూపాయలును, నెల్లూరుజిల్లామీద లక్షా ఏబది వేలరూపాయలును జమవచ్చియున్నట్లు తెలియుచున్నది. ఇతర జిల్లాలలో కూడ మైనము, వంటచెఱకు, గొర్రెల మేత, మేకలమేత, చెట్లబంక, బెరడు మొదలగు వానిమీద కొంతపన్ను విధింపబడి యున్నట్లు తెలియుచున్నది."

వ్యవసాయపు పశువులను ఉచితముగా మేయనిచ్చుటనుగూర్చి కమిటీవారిట్లభిప్రాయపడిరి.

"సామాన్యముగా మంచివ్యవసాయపు పశువులను మేతకొరకు అడవులకు పంపనే పంపరు. ఇందులకు నాలుగు కారణములు కనబడుచున్నవి. (1) పశువులకు వ్యాధిపట్టునని భయము (2) అడవిమృగముల వలని భయము (3) పశువులకు తగినంత మేత అడవులలో దొరకదని భయము (4) మెత్తని నేలలలో నడుచుటకు అలవాటుపడినబరువైన జంతువుల కాళ్లు బండరాళ్లమీద నెక్కుటవలన చెడిపోవునను భయము. కాని, నెల్లూరుజిల్లాలో 'కంచెలపద్ధతి' అనగా కంచెఒక్కంటికింతయని, గడ్డి పెంచిన బీళ్లను గుత్తకు తీసికొని వ్యవసాయపు పశువులను అక్కడిరయితులు మేతకు తోలుచుండుటను మేము గమనించియున్నాము. ఇంటివద్ద మేపుటకు నెల 1 కి 5 రూపాయలగు పశువునకు సర్కారువారువిధించిన మూడణాల పన్నో ఎనిమిదణాల పన్నో తీసివేసిన ఎంత? విధించిన ఎంత? దీని నొక లాభముగా ప్రజలు గ్రహింపరు. ఒకవేళ ఈస్వల్ప పన్నును కొట్టివేసినను అడవులలో కాపురములుండి కూలికి పశువులను మేపు లంబాడీ వాళ్లకు లాభమే

గాని, నిజముగ పశువుల అధికారుల కేమియు లాభము కలుగదు. ఈలంబాడీ వాళ్లు పశువులకు తలకింతని యేర్పరచుకొని అన్ని కచ్చులతోపాటు సర్కారు క్షేత పన్ను కూడ తామే పెట్టుకొందురు. ఒక్కవేళ ఈ పన్ను హెచ్చే అని కమిటీవారు తలచినను, వ్యవసాయపు పశువులకు పన్ను లేకుండ జేయవలెనని దొరాబించినను, వ్యవసాయపు పశువులేవో యితర పశువులేవో తెలిసికొనుటకు సర్కారు ఉద్యోగస్థులకు తగిన సదుపాయములు లేవు. ఒక్కొక్కరైతు వ్యవసాయము చేయు భూమిని పట్టివాని పశువులను, లెక్కప్రకారము కొన్నిటిని అడవిలో మేయ నీయవచ్చునని తలచినను, అదికూడ రైతులకు అనేక విధములగు చిల్లరవ్యయములకును, ఒత్తుడులకును కారణమగును. కాబట్టి ఉచితముగా మేయనిచ్చుట వలన ప్రజలకింత గా లాభముండదని కమిటీవారి అభిప్రాయము."

అడవి ప్రక్కలగాని అడవిమధ్యను గానియున్న గ్రామములలోనుండు పశువులకన్నిటికిని మేత నుచితముగా నిచ్చుటను గూర్చి కమిటీవారి అభిప్రాయము.

"కమిటీవారు పరీక్ష చేసిన రయితులందరును, ఏకగ్రీవముగ అడవిప్రక్కనుండు గ్రామపు పశువులకే, మొదటి హక్కు నీయవలసినదని అభిప్రాయపడి యున్నారు. ఈవిషయమును 1895 సం॥ లోనే, రవిన్యూ బోర్డు వారు గమనించిరి. ఫలానా అడవియందు ఇన్ని పశువులకు దగిన మేతగలదని డిస్ట్రిక్టు ఫారెస్టు ఆఫీసరు మొట్ట మొదట నేర్పరచుకొని చీట్లను (Permits) గ్రామములోని పశువులకే మొదట ఇచ్చుచున్నారు. అయినను ఈప్రెసిడెంసీలోని అనేక అడవులగతి చూడగా, ఏవో కొన్నిటిలో తప్ప తక్కిన అడవులలో తగినంత మేత అన్ని పశువులకును దొరకదని తెలియుచున్నది. ఒకవేళ అన్ని పశువులును ఉచితముగానే మేయవచ్చునని సర్కారువారు అభిప్రాయపడినను, ప్రక్క నుండు గ్రామముల వారి పశువులే ఎక్కువగ మేయుచుగాని, దూరదేశపు పశువులంత ఎక్కువగ రానేరవు. అడవులలోనికి మితముగానే పశువులను రానిచ్చుటానికి పూర్తిగ మేత దొరకునట్లు సర్కారువారు చేసినప్పుడు ఊరి పశువులను గూడ నుచితముగ మేయనిచ్చుటకంతగ అవసరేము కనపడదని కమిటీ వారి అభిప్రాయ పడుచున్నారు."

"ఒకవేళ రయితుల కింత సదుపాయము చేసినను అనాది నుండియు అడవులను పాడుచేయు నలవాటు గలవారగుటచేత వీరికి తమ చేతిలోని సొమ్ము పెట్టి కొనుక్కొనినప్పుడుగాని సర్కారు కూరిచ్చే సదుపాయములయొక్క విలువ తెలియదు. ఏదో కొంత రేటు ఏర్పరచి అడవులను గ్రామస్థులు బాగుగ పెంచినప్పుడు ఆ రేటును తగ్గించునట్లును, నాశనము చేసినప్పుడు దానికి శిక్షగా ఆ రేట్లను హెచ్చించునట్లును, చేసిన యెడల ప్రజలకు ప్రోత్సాహముగానుండును. బొంబాయి రాజధానిలో ఈ ప్రకారము చేసియున్నారు."

ప్రజలుపంపుకొను అర్జీలు ఎంత వరకు నిజము అను విషయము కమిటీవా రాలోచించి యిట్లనిరి.

"ఒక్కొక రైతు ఏబది, అరువది మైళ్ల దూరము నడచి వచ్చి వందలకొలదిగా గూడి కమిటీవారితో మనవిచేసి కొనుటకై రోజులకొలది కమిటీవారి మకాములందు పడియుండెడివారు. ప్రయాణమై పోవుమార్గములలో అడ్డములుగొట్టుచు తమ బాధలను ఆలకింపవలసినదని బ్రతిమాలుకొనెడివారు. ఒక్కొకచోట కమిటీ వారా చోట్లకుబోయి పరీక్షించినప్పుడు వారు చెప్పు బాధలన్నియు వారి తలలలోగాని నిజముగా నేలమీద కనబడలేదు. కాని యేదో యొక బాధ లేనిదే, రైతులింత కష్టపడి బహుదూరము లేల వచ్చెదరు? ఇదిగాక అడవుల పరిపాలన విషయములలో గవర్నమెంటు వారియొక్కయు బోర్డు వారి యొక్కయు తీర్మానములును, కాంగ్రెసులలోను కాన్ఫరెంసులలోను శాసననిర్మాణ సభలలోను జరుగుచుండు తీర్మానములును ఇవి యన్నియు, ఒక్కటేపాట పాడుచున్నవి. ఎన్ని సదుపాయములు ప్రజలకిచ్చినను ఈ దేశములోని అన్ని డిపార్టుమెంటులలోను ఫారెస్టుడిపార్టుమెంటును ప్రజలు నానాటికి ఎక్కువగనే దూషించుచున్నారు. ఫారెస్టు చట్టములను అతిక్రమించి సందులకై శిక్షలు అంతకంతకు హెచ్చుచున్నవి. దీనిని బట్టిచూడ ఈ అసంతృప్తికి తగినంతకారణమేదో యుండవలయును. అడవి ప్రదేశములను నిర్ణయించుటయందు గాని ఆ అడవు

లలో పనిజేయు పద్ధతులయందుగాని ఆ పద్ధతులను అమలులోనికి తెచ్చువిధములయందుగాని ఈ కారణ ముండవచ్చును."

కమిటీవారు పరీక్షించిన ప్రతిజిల్లా యందు ప్రజలిట్లు మొరపెట్టుకొనిరి.

"అడవులు గ్రామములకును, రైతాధీనపు భూములకును దగ్గిరనున్నవనియు, నల్లరాతి బండలు, బ్రహ్మజెముడు ముళ్లు,తప్ప వేరేమియులేని గొడ్డునేలలన్నిటిని అడవులుగామార్చితమ్ము బాధించుచున్నారనియు, అడవుల సరిహద్దులు పాము మెరికలవలె వంకరటింకరలుగా నుండుటచేత వ్యవసాయపు దారులు తమపొలములకు పోవుటకుగాని తమపశువులనిటునటు చెదరిపోకుండ తోలుకొని పోవుటకుగాని సాధ్యముగా నుండనున్నదనియు, తమకు దేవాలయములకు పోవుటకు మార్గము లేకుండ జేసిరనియు, పశువులుమేయు బీళ్లను అడవుల అధికారులు అడ్డదిడ్డముగ మూసివేయుచు పశువులకు మేతలేకుండ జేయుచున్నారనియు, సరిహద్దు గుర్తులుసరిగా తెలియకపోవుటచేత గొడ్లను కాయువారలు ఏప్రదేశము అడవిలోని భాగమో ఏది వెలుపలి భాగమో తెలిసికొనలేకుండనున్నారనియు, ఒకటిరెండు పశువులు చెదిరి అడవిలోనికి పోయినప్పుడు మంద అంతయుతోలుకొనిపోయి బందెలదొడ్డిలో పెట్టుచున్నారనియు,పన్నుఇచ్చి మేపుకొనువాడుక గల పశువులనుగూడ గొడ్లకాపరివాడు చీటిని తనతో తీసికొని వచ్చుటకు మరచిపోయిన కారణముచేతనో కొద్ది నిమిషములు దగ్గిర లేకపోవుటచేతనో మందనంతను బందిల దొడ్డిలో పెట్టుచున్నారనియు, అడవిసరి హద్దులలో ఆయాసము తీర్చుకొనుటకు విశ్రమించియున్న పశువుల మందలను గూడ అక్రమముగా బందెలి దొడ్డి యందు పెట్టుచున్నారనియు, అట్లుపెట్టినప్పుడు బందితీసికొనుట యేగాక జుల్మానాలనివరో ఒక కొద్ది తరగతి అడవి యుద్యోగస్థుడువచ్చి అక్రమముగా రెట్టికి రెట్టి వసూలు చేయుచున్నాడనియు, ఈ బాధలను పడలేక పశువుల మందలను అమ్ముకొనవలసి వచ్చుచున్నదనియు,ఒకవేళ మేజస్ట్రీటుల వద్దకు తీర్మానము నకు పోయిన యెడల ఆమేజస్ట్రీటు అడవి యుద్యోగస్థులకు భయపడు చుండుటచే అక్కడ వారు వేయు జుల్మానాలు వీరు వసూలుచేయుదానికంటె ఎక్కువగా నుండునన్నవనియు, తాముచేసినతప్పులకు అన్నిటికిని కారకుడైన అడవియుద్యోగస్థుని సాక్ష్య మొక్కటియే మేజస్ట్రీటు ఎదుట చాలుననియు, తనయూరిసాక్షులెవరైనను తన పక్షమునసాక్ష్యముచెప్పిన యెడల మేజస్ట్రీటులు నమ్మరనియు, ఎంతకష్టపడియైనను అడవిలోనికి పశువులను పోనీయక జాగ్రతపెట్టినను పర్మిట్ చీటినికూడనుంచుకొనినను అడవి గార్డునకు ఇయ్యవలసినఫీజు నీయకపోయినయెడల బందెలు జుల్మానాలు శిక్షలు తప్పవనియు, తమస్వంతఅడవులలోనుండి పుల్లలు తెచ్చుకొనినను దొంగతనమే యగుననియు, తప్పుచేసినను చేయకపోయినను గార్డు తృప్తియగువరకు అన్నియుతప్పులేననియు, ఇట్లు, అనేకరైతులు చెప్పుచు వచ్చిరి. ఒకరిద్దరు మాత్రము, ఈయుద్యోగస్థులకు తామిచ్చునదేదియోయిచ్చి తమయిష్టము వచ్చినట్లు చేసికొనెడి వారమనిచెప్పిరి."

"రైతులుచెప్పుకొను దానిలోగూడ చాలభాగము నిజమున్నదని కమిటీవారు తెలిసికొనియున్నారు. అడవులు గ్రామమున నంటియున్న మాట నిజమేకాని, అది అడవియుద్యోగస్థుల తప్పుకాదు. అడవి గ్రామమునకు అరమైలుకంటె దగ్గరగనుండ గూడదని చట్టములో నున్నది. గ్రామమును, వ్యవసాయపు భూములును అడవివరకును పెరిగినవి కాని, అడవి గ్రామము వరకును జరగలేదని కమిటీవారు చెప్పిరి."

"అడవియుద్యోగస్థులు ప్రజలమీద కొంచెము కఠినత్వమును చూపియున్నను, ఒక్కొక్కప్పుడు వారిపనులు మిక్కిలి కష్టమైనవి. ఫారెస్టు గార్డులయొక్కయు వాచెర్లయొక్కయు కూలీలనుగూర్చి వినియుండకపోలేదు. పశువులుతగ్గిపోయినవి, పశువులను అమ్ముకొంటిమి అనుమాటలబద్ధము. గుంటూరుజిల్లాలో మేతలేక పశువులు చనిపోయినవనిచెప్పు ఊరియందుమూడు వందల పశువులుండ వలసినచోట, తొమ్మిది వందలున్నవి. మాపశువులకు మేతలేదని రైతులు మొత్తుకొనిన కొన్నిచోట్ల, వేలకొలది యెకరముల కాలీస్థలములున్నవి."

"కాబట్టి కొంతవరకు ఈ తృప్తికరము అబద్ధములకైనను ఎడమిచ్చినను ఇప్పుడున్నంత లోతుగ వ్యాపించిన అసంతృప్తికి నిజమైన కారణములు లేకపోలేదు. ఒకానొకచోట వారు చెప్పుకొను మొరలన్నియు నిజమైనవే. పదహారు చదరపుమైళ్ళు యడవిని 8 రూపాయలు మొదలు 12 రూపాయలవరకు జీతముగల యొక గార్డు ఇద్దరు ముగ్గురు టెంపరరీ కూలీల సహాయముతో కాపాడవలసి వచ్చినప్పుడు, తనపనిని తాను చేసికొనలేక పోవుటయు, అప్పుడప్పుడు అప్రయత్నపూర్వకముగా చేతిలోనికి వచ్చిన నైకమును స్వీకరించుటయు, మానవజన్మస్వభావసిద్ధమైనవ్యక్తికి సహజముకాని అసహజము కాదని మా అభిప్రాయము. ఒక్కసారి అక్రమపు పద్ధతులకు దిగి అలవాటుపడినవాడు తరువాత వానినిమానుట దుర్లభము. ఇట్టి పరిస్థితి ప్రజలబలవంతముమీద తీసికొనువాడు కాలముగడచినకొలదిని వారలను బలవంతపెట్టి శిక్షించి తీసికొనును. ఇట్టి అసంతృప్తి కంతకు పరిహారము అడవియుద్యోగస్థులకును ప్రజలకునుగల సంపర్కమును తగ్గించుట తప్ప వేరేదియు లేదని యెంచి ఈ కమిటీవారు తమశక్తికొలదిని యోచించి కొన్ని సలహాలనిచ్చియున్నారు."

ప్రస్తుతము రిజర్వుగానున్న అడవులను ఆరు తరగతులుగా విభజించుటకు కమిటీవారు సిఫార్సు చేసియున్నారు.

i. దేశముయొక్క శీతోష్ణస్థితి అభివృద్ధి నొందుటకు గాని జలాధారములకు కాపాడుటకు గాని నిర్మితములైన అడవులును, గ్రామములకును వ్యవసాయపు భూములకును సమీపమునలేని అడవులును, మొదటి తరగతివి. ఈ యడవులు ప్రస్తుతమువలెనే ఫారెస్టు డిపార్టుమెంటు వారి స్వాధీనమునందుండవలయును.

ii. గ్రామములకును వ్యవసాయపు ప్రదేశములకును దూరముగ లేనప్పటికిని కలప మూలముగాని వంటచెరకు మూలముగాని విలువగల ఫలసాయము నిచ్చునట్టివియు, ఇట్టి ఫలసాయము నిచ్చుటకు ముందైనను తగియుండునట్టివియు, కొన్ని అడవులు రెండవతరగతిలోనివి. వీనిలో పశువులమేత అంత ముఖ్యమైనదిగాదు. మిక్కిలి తక్కువైన మితి యేర్పరచినగాని ఈ అడవులలోనికి పశువులను రానిచ్చినయెడల విలువగల యడవి ఫలసాయము చెడును. ఈ అడవులలో చెట్లు అధికముగ నుండుటచేత ఆనీడలో గడ్డికూడ సాధారణముగ మొలవదు. కావుననీ అడవులలో మేసినపశువులంతగా వృద్ధిబొందవు.

iii. సముద్రపుటొడ్డున నుండు ఇసుకపర్రలలో పెంచు సరుగు (చౌకు) తోపులు, తుమ్మతోపులు మొదలగునవి మూడవతరగతిలోనివి.

iv. గ్రామములను జేరియుండి ముఖ్యముగా పశువులు మేయుటకుపయోగించుచు కొంతవరకు చెట్లయభివృద్ధికిగూడ పనికివచ్చు అడవులు నాల్గవతరగతిలోనివి. వీనిని సరిగా నిర్ధారణచేయుట కష్టము. ప్రత్యేకము కలప కొరకు యేర్పడిన రెండవతరగతిలోని యడవులకును ప్రత్యేకము పశువులమేతకొరకు ఏర్పడిన అయిదవతరగతి యడవులకును మధ్యనుండు అడవులన్నియు ఈతరగతిలో చేరును.

ఈ యడవులలో కొన్నిటియందలి చెట్లు మిక్కిలి అభివృద్ధిజెంది మంచిఅడవులు కావచ్చును. ఆచుట్టునుండు ప్రదేశమునకు దగినంతకలపను సప్లయిచేయుటకు చాలి యుండవచ్చును. కాని, ఇందుచే పశువులమేతను బొత్తుగ నశింపుచేయుటకు చాలినంత కారణము లేకపోవచ్చును. కాబట్టి ఈ యడవులు కొంతవరకు మేతకొరకును కొంత అడవి ఫలసాయముకొరకును ఏర్పడినవి. నెల్లూరుజిల్లాలోని కావలియందును, చెంగల్పట్టు జిల్లాలోని గూడలూరునందును ఇట్టి అడవులను కమిటీవారు చూచియున్నారు.

v. మఱియెందుకునుగాక పశువులమేతకొఱకే యెక్కువ యుపయోగకరమగు అడవులు ఈయైదవ తరగతిలోనివి. ఈ తరగతియడవి రాజధాని పొడుగునను కలదు. 1890 సం॥ ఉత్తరవులప్రకారము క్రొత్తగా జేర్చిన ప్రదేశములన్నియు ఈతరగతిలో చేరును. గ్రామములప్రక్కనుండుతుప్పలు, దుబ్బులు, మొదలగునవన్నియు వీనిలోనివే. వీనిలో సర్కారువారు పనిచేసినను లాభముండదు. వంటచెఱకు స్వల్పముగా దొరికినను, అమ్ముప్రదేశములకు దూరమగుటచేతను, అడవి పెరుగు ప్రదేశములలో దానికి వెలలేకపోవుటచేతను, సర్కారునకు కూలిగిట్టదు.

పశువులు మేయుటకు తగు బీళ్లుగా నేర్పరుచుటయేవీనిని రిజర్వు ఫారెస్టులుగా నుంచుటయందలి యుద్దేశముగాని మ రేదియును గాదు.

vi. ఎందునకును పనికిరాని బండభూములుఆరవతరగతిలో చేరును. ఇవి పశువుల మేతకుకూడ పనికిరావు.

ఇట్లు విభజించిన ఆరు తరగతుల అడవులను ఎట్లు పరిపాలింపవలెనను విషయమునుగూర్చి కమిటీవారిట్లు జెప్పిరి.

1. మొదటి తరగతి అడవులను ఫారెస్టు డిపార్టుమెంటువారే పరిపాలించుకొనవలెను. ఏయే పశువులను ఎన్నిటిని ఎప్పుడు ఈ అడవులలోనికి రానియ్యవలెనో వారే నిర్ణయించుకొనవలెను. ఈ అడవులలోనికి సాధారణముగ దూరమునుండి కంచెలకు తోలు మందలను చేర్చుకొనవచ్చును.

2. రెండవతరగతి అనగా వంటచెఱకు, కలప అడవులుకూడ ఫారెస్టువారి పరిపాలనలోనే యుండవలెను. ఇందు తమ అడవియొక్క వృద్ధిచెడకుండ ఎన్ని పశువులను చేర్చుకొనవచ్చునో అంతకంటె ఎక్కువ పశువులను రానియ్యకూడదు. ఒకవేళ యడవులు గ్రామములను జేరియున్నయెడల వానిలోనికి కొన్ని పశువులను రానిచ్చునపుడు ఆయాప్రదేశముల జనసంఖ్యనుబట్టియు వ్యవసాయదార్ల అవసరమునుబట్టియు ఏయే అడవులలోనెన్ని పశువులను రానియ్యవచ్చునో నిర్ణయించుటకు, ఆయా ప్రదేశముల రివిన్యూ అధికారులతో ఫారెస్టు అధికారులు సలహాచేయవలెను. ఇద్దరునుచేరి ఏయే గ్రామములకు ఎన్నిచీట్లు ఇయ్యవలెనో ఏయే బ్లాకులలోనికి ఏయేగ్రామముల పశువులను రానియ్యవచ్చునో నిర్ధారణచేయవలెను. అడవుల సరిహద్దులలోపలనున్న గ్రామముల పశువులకును సరిహద్దు నంటియున్న గ్రామముల పశువులకును ముందు హక్కు ఇయ్యవలెను. కొద్దిపశువులనే అడవులలో మేయనిచ్చునెడల, మంచి మేత పట్టుననియు అట్టిమేతను ఏలమువేసి యెవరు హెచ్చుసొమ్మిచ్చుటకు తయారుపడుదురో వారికేల ఈ యడవుల నియ్యకూడదనియు కొందరడుగవచ్చును. కమిటీవారు ఆపద్ధతి నంగీకరింపరు. అడవిప్రక్కనున్న ప్రజలకు దరినున్న అడవులలో లాభమున్నప్పుడా యడవులను రక్షించుట సులభమనియు, గ్రామములలో ప్రజలిట్టి సదుపాయములచే మిక్కిలి తృప్తిపొందుదురనియు యోచించి కమిటీవారు ఏలపుపద్ధతికి అంగీకరింపలేదు. ఒక గ్రామమున కిచ్చినమేతచీట్లను ఆ గ్రామములోనుండు రైతులలోనుండి యేర్పడిన పంచాయితీదార్లు తమ గ్రామములలోని పశువులకు పంచవలెను.

3. ప్రత్యేకము వంటచెఱకుకొరకై యేర్పడిన మూడవతరగతి అడవులను ఫారెస్టు డిపార్టుమెంటువారి పరిపాలనలోనుండి బొత్తిగా తొలిగించివేయవలెను. అనేకచోట్ల ప్రయివేటుగా రైతులు పెంచుచున్న వంటచెఱకు అడవులు సర్కారు అడవులకంటె అనేకరెట్లు బాగుగనున్నవి.

ఇతరులకుమార్గమును చూపుటకుగానిఎక్కడనైనను క్రొత్తపద్ధతులమీద అడవి పెంచుటకుగాని, వ్యాధులను కుదుర్చుటకుగాని, తమ పరిపాలనలో కొద్దిగ ఈబాపతు అడవిని పెట్టుకొనవచ్చునుగాని వంటచెఱకును పెంచి అమ్మువ్యాపారము సర్కారువారు విరివిగా పెట్టుకొనకూడదని కమిటీవారి అభిప్రాయము. తామిట్లెక్కడనైనను పెట్టుకొనునెడల ఆ అడవుల చుట్టును దట్టముగ కంచెలువేసికొని కాపాడవలెను.

4. నాలుగవ తరగతి అడవులవిషయమే ముఖ్యముగ యోచింపదగినది. గ్రామస్థులకు విడిచిపెట్టితిమా చెట్లు పాడయిపోయి అడవివిలువ తగ్గిపోవును. ఫారెస్టు డిపార్టుమెంటుకు విడిచిపెట్టితిమా పశువుల మేత కూడదనిన తప్ప పూర్వపు తగవులు తప్పవు.

గ్రామముల దరినున్న అడవులలో పశువులమేతబొత్తిగ కూడదనుటకు వీలులేదు. ప్రస్తుత మొకవేళ కొంతవరకు నష్టముకచ్చినట్లు కనబడినను ప్రజలకు అడవుల పరిపాలనలో కొంతవరకు స్వతంత్రము కలుగజేసిన యెడల కొద్దికాలములో అడవులు తప్పక బాగుపడుననే యుద్దేశముతో కమిటీవారు పశువులమేతపూచి గ్రామ పంచాయితీదార్లయందే యుంచి యున్నారు.

ఒక్కొక్క గ్రామములోని అడవి పరిపాలనకు ఆ గ్రామముయొక్క పంచాయితి వేరుగా నుండవలెనుకాని, కొన్ని గ్రామములొక గ్రూపుగాచేసి, ఒక్కొక్క గ్రూపునకొక పంచాయితి యేర్పాటుచేయకూడదు. ఏగ్రామముతో సంబంధించిన యడవికి ఆగ్రామపు పంచాయితి వేరుగనున్నయెడల వారు ఇతరగ్రామముల పశువులను తమ గ్రామపు అడవిలోనికి రానియ్యకుండ చూచుకొనెదరు. సులభముగను చూడగలరు. ఒకానొకప్పుడు ఆ గ్రామములోనున్న పశువులే అడవిలోనున్న గడ్డికి మించియుండునని తోచిన యెడలసర్కారు వారు ఎన్నిపశువులను ఆయాగ్రామపు అడవిలో మేయనియ్యవచ్చునో యేర్పాటుచేసి అన్ని మేతచీట్లనే గ్రామ పంచాయితీదార్లకియ్యవలెను.

ఈ చీట్లను పంచాయితీదార్లే వారి గ్రామములో తగిన పశువులకు పంచిపెట్టుకొనెదరు. ఫారెస్టు వుద్యోగస్థు లప్పుడప్పుడు తామిచ్చిన చీట్లకుమించి పశువు లడవిలో మేయకుండ చూచుకొనవచ్చును. గార్డులను వాచర్లను తీసివేయవలెను. గ్రామస్థులే అడవులకు కావలసినచోట్ల కంచెలు చేసికొనవలయును. ఫారెస్టువారుగాని, కంట్రాక్టర్లుగాని వేసిన కంచెలను కాపాడవలెను. అడవులలో క్రొత్తగా మొక్కలు పెరుగుటకై వానిని మూసివేయు నప్పుడు సామాన్యముగా నొక గ్రామమునకు చేరిన అడవిలో సగభాగము ఒకసారియు రెండవసగము మరియొకసారియును మూయవలెను. అడవిలోని చెట్లనుకూడ తామే కాపాడెదమని ఆయా గ్రామముల పంచాయితీదార్లు కోరినయెడల వారిని ప్రోత్సాహము చేయవలెను. బాగుగ కాపాడిన గ్రామముల వారికి ఆ అడవులను కొట్టినప్పుడు కలపలో కొంతభాగము ఉచితముగ బహుమానముగా నియ్యవలెయును. లేదా రాగల సంవత్సరముల పశువుల మేతపన్ను తగ్గించవలెను. ఇట్లుచేసినయెడల వారికిని ప్రోత్సాహము కలిగి అడవుల వృద్ధివలన తమకును లాభము కలుగునని యెంచి కష్టపడి అడవులను వృద్ధిచేయుదురు. మేతకు మించిన పశువులను రానియ్యరు. అడవిని "ఇక్కడ మూసినారు, అక్కడ మూసినారు" అనరు. ఎంత అడవిని పనులకై మూసివేసి కాపాడిన, అంతలాభము వారికిని ఉండును గనుక జాగ్రత్తగ చూచుకొనెదరు. ఇతర గ్రామముల పశువులమందలువచ్చి అడవిని పాడుచేయనియ్యరు. మేతచీట్లుకూడ మితముగానే యుండును గాన పశువులున్ను బాగుపడును. ఒకానొకచో పంచాయితీదార్లు బాగుగా పనిచేయక అడవి చెడిపోవుచున్నట్లు తోచినయెడల రాగలవరతులో మేతపన్ను హెచ్చు చేయవచ్చును. ఇంకనువారు సరిగా పనిచేయనియెడల పంచాయితీదార్లను తీసివేసి ఫారెస్టు డిపార్టుమెంటు వారు ఆ అడవిని తమ పాలనలోనికి తీసికొనవచ్చును.

5. అయిదవ తరగతిఅనగా మేతఅడవులు. ఈ అడవులను కాపాడుపని పూర్ణముగా పంచాయితీదార్లకే ఇచ్చివేయవలెను. మేతపన్ను వసూలుచేయుట, తగినన్ని పశువులనే మేయనిచ్చుట, చెట్లపెంపును కాపాడుట మొదలగు పనులన్నియు, పంచాయితీదార్లే చూచుకొనవలెను. ఫారెస్టుగార్డులను తీసివేయవలెను. ఒక్కొక్క గ్రామములోనుండు రిజర్వుకాని భూములు కూడ ఈపంచాయితీదార్ల పరిపాలనలోనే యుండవలెను.

6. ఆరవతరగతిలోజేరిన అడవులన్నిటినిసర్కారు వారుఫారెస్టు డిపార్టుమెంటువారినుండి తీసికొని తమ స్వాధీనములో నుంచుకొని రైతాధీనముకాని బంజరు భూములతో పాటు చూచుకొనవలెను.

పైనిజెప్పినప్రకారము పంచాయితీదారులచేతులలో అడవి పరిపాలనయంతయు నిచ్చినయెడలసాధారణముగా పంచాయితీదారుగా గ్రామములోభాగ్యవంతులే వచ్చుటచేత భాగ్యవంతులందరును జేరిఅడవిలోని ఫలసాయమునంతయు ననుభవించిబీదవారలకు బొత్తుగాలేకుండ జేయుదురేమొ యను భయము కమిటీవారికి లేకపోలేదు. అయినను గొప్పఅన్యాయముగాని, పక్షపాతముగాని ఏదైనను జరిగినట్లు తోచినయెడల రెవిన్యూ డివిజనల్ ఆఫీసరు తిట్టి పంచాయితీదార్లను తమహోదాలోనుండి తొలగింపవచ్చుననియు, మూడు సంవత్సరముల కొకసారి పంచాయితీదార్లనుతిరిగి ఎన్నుకొనుచుండవలెననియు ఏర్పాటుచేసినయెడల మొత్తముమీద సర్వ

గానే ఉచితమని కమిటీవారి అభిప్రాయము. ఏలయన ఒక పంచాయితీదారుడు తన పనిని సరిగా నెరవేర్పని యెడల రాబోవు ఎలెక్షనులో తన్ను తిరిగి ప్రజలెన్నుకొనరని యెరిగి జాగ్రత్తగానే పనిచేయును.

ఇదిగాక కొన్ని గ్రామములలో రెండుపార్టీలుండిబల మైనపార్టీవారిలో పంచాయితీదార్లు చేరియున్న యెడల రెండవపార్టీవారికి నష్టము రావచ్చునని కమిటీవారెరుగుదురు. అట్టిదేయయి యున్న యెడల గ్రామములో పార్టీలున్నట్లు తప్పకుండా ఆవిషయము పై అధికారులకొరకేసులోనికి వెంటనేవచ్చును. ఏలయనతేడా లున్నచో ఫారెస్టు డిపార్టుమెంటు సబార్డినేటు ఉద్యోగస్థులు ప్రజలను పెట్టుకష్టములకంటె ఈకష్టములు హెచ్చుగానుండవని కమిటీవారి అభిప్రాయము.

పంచాయితీ సభ్యులు. ఫారెస్టుపనులకొరకు ఏర్పరుపబడు పంచాయితీలకు ఈఫారెస్టుపనులుతప్ప వేరేపనులుండగూడదు. ఇట్టి పంచాయితీలలో పశువులున్న రయితులనే చేర్పవలెను. ఇందులో వ్యవసాయముచే జీవింపని స్కూలుమాస్టరులు, పురోహితులు, మొదలగు వారలెవ్వరును ఉండగూడదు.

పంచాయితీదారులను ఎన్నుకొనువారెవరు? వీరిని ఎన్నుకొనుటకు విపులమైన లాంఛనము అవసరములేదు. గ్రామములోనికి తహసీలుదారు వెళ్ళినపుడు ఆయన యెదుట గ్రామములోని పశువులఖామందు లందరుచేరి పంచాయితీదారులను ఏరుకొనవలెను. గ్రామములో కాపురముండని భూమి ఖామందులకు ఈ ఎలెక్షనులో ఏమియుసంబంధముండకూడదు. విలేజిమునసబు, కరణములు పంచాయితీదారులలో నుండవచ్చును. వీరికి పలుకుబడి హెచ్చుగానుండుటచే వీరు పంచాయితీ యందున్న ఇతరులను బాధించుటకంటె పంచాయితీలలోనేరని తక్కినవారిని తమస్వాధీనము చేసికొన్నను అంత కష్టములేదని చెప్పవచ్చును. బలవంతులైన యొక గ్రామస్థుడు దుర్మార్గుడని తెలిసియును వానిని ఎన్నుకొనపోయినయెడల ప్రజలను అట్టివాడు బాధించునేమోయను భయముచేత గ్రామములోని ప్రజలు తప్పక పోయినాగాని వానినే ఎన్నుకొనవలసి వచ్చును. ప్రజలచేనియమింపబడిన ఏ పంచాయితీదారుని ఐనను రివిన్యూ డివిజనల్ ఆఫీసరు నిరాకరించి వేరొకరిని ఎన్నుకొనుడనిచెప్పుటకు యత్నించి యధికారగము కలయెడల పైనిచెప్పిన దుర్మార్గులను పంచాయితీలోనుండి తొలగించుటకువీలగును.

1. పంచాయితీ దార్ల పరిపాలనలోనున్న ఖండములయందలి పశువుల మేత యొక్క స్వాతంత్ర్యము వారికే యుండవలెను. పంచాయితీ దారులకిచ్చిన ఖండములలోనికి మేకల రానీయకూడదు.

పంచాయితీదారుల విధులు.

ఒక గ్రామములో నుండు పశువులను కొన్నిటిని గాని అన్నిటినిగాని అడవిలోనికి రానిచ్చుటకును రానీయక పోవుటకును వీరికే స్వాతంత్ర్యముండవలెను. ఎరోజే తొరగతి పశువులను ఎప్పుడెప్పుడు ఎన్నింటిని అడవులలోనికి విడువవచ్చునో పంచాయితీ దారులు చక్కగా తెలిసినొని వారే ఈ పనిని నెరవేర్పవలెను. వారి యధికారమునకు తిరగబాటుచేసిన రయితులయొక్క పశువులను అడవిలోనికి రాకుండ జేయుటకువారికి స్వాతంత్ర్యముగలదు.

2. ఒకగ్రామముమీద ఏర్పడిన మేతపన్నును వసూలు చేయుటకు పంచాయితీ దారులదేపూచి. ఒకా నొకచో సొమ్ము వసూలు అగునటుకును పశువులను అడవిలోనికి రానీయకుండ చేయవలసి వచ్చును. ఇట్లు చేసినయెడల పన్ను వెంటనే వసూలుకాగలదని కమిటీ వారి అభిప్రాయము.

3. మేత భూములు చెడిపోకుండగను, అడవి ఫలసాయమును ఇతరులు ఎత్తుకొనిపోయి అమ్ముకొనకుండగను జేయుట పంచాయితీ దారుల జవాబుదారిద్వయున్నది. తమసొంత ఉపయోగము నిమిత్తము అడవిలోని సొత్తును ఏదైనను గ్రామస్థులు తీసికొనినను తప్పులేదు కాని అమ్ముకొనకూడదు.

4. తమ పరిపాలనలోని ఖండములను శుభ్రపఱచుటయు వాని సరిహద్దులను సరిగానుంచుటయు ఫారెస్టు డిపార్టుమెంటు వారు అప్పుడప్పుడు జారీచేయు ఉత్తరవుల గమనించుటయు పంచాయితీదారుల విధి.

5. అడవులలోని చెట్లను అక్రమముగా నరికిగాని అడవికి నష్టమగు ఇతర పనులనేవైన చేసిగానితనభాగ

మునకు వచ్చుచున్నను ఇంకొక్కరిగాని పంచాయితీ దారు లు న్యాయముగా చెప్పవలెను. దేనినైనను చేయకగాని తిరుగుబాటు చేసినవారి యొక్క పశువులను అడవి లోనికి రానీయకుండుటకును పంచాయితీ దారుల కధి కారముగలదు.

6. వారియొక్క తగవులు లేకుండ అడవిలో మేయుచుం డిన పశువులను బందెల దొడ్డిలో పెట్టుటకు వారికి అధి కారము గలదు.

7. ఇంటి పనులకు గాని వ్యవసాయపు పనులకు గాని కావలసిన కలపను ఇచ్చుటకును దాని పరిమాణమును హెచ్చించుటకును తగ్గించుటకును పంచాయితీదారుల కధికారముకలదు.

పైని చెప్పిన విషయములలో ఏదైనను తగవులున్న యెడల పంచాయితీ దారులే తీర్చుకొనుటకు వారికి సర్వ స్వాతంత్ర్యములుండవలెనుగాని వారిపైని అప్పీలు ఉండ కూడదు. మొత్తము మీద పంచాయితీ దారులు చక్కగా పనిచేయనియెడల వారిని తీసివేసి క్రొత్త పంచాయితీ దారులను ఎన్నుకొనవలెను. క్రొత్త పంచాయితీ దారు లుగూడ సరిగా పనిచేయనియెడల ఆగ్రామమున పంచా యితీ పద్ధతి తీసివేసి అడవిని ఫారెస్టువారి పరిపాలనలో నుంచవలెను.

గడచిన 5 సంవత్సరములలో సర్కారువారు ఒక్కొ క్క ఖండముమీదనగుచున్నవెం తజమవచ్చినదో ఆ మొత్తమును సాధారణముగ విధింపవచ్చును.

మేత పన్ను విధించు పద్ధతులు.

ఒకానొకప్పుడు కాలమునుబట్టియు ప్రజల బీదరికమునుబట్టి యును కొంచెము తగ్గించవలసివచ్చును. కొన్నిచోట్ల ఎక రాకు ఇన్ని అణాలని ఏర్పాటుచేయవచ్చును.

పంచాయితీదారులు తమ గ్రామము నందలి యడవిని వృద్ధి పఱచినందులకు వారికేమియు ప్రతిఫలము ప్రత్యేకముగా నీయ నక్కరలేదు. క్రొత్త మొక్క లను వేసి అడవులను వృద్ధిచేయుటకై వారికి సొమ్ము ఇయ్యకూడదు. ఇచ్చినయెడల దానికి వారు లెక్కలు పెట్టవలెను. అధికారుల తగాదా లెక్కువగును.

పంచాయితీలకు ఇచ్చుప్రతిఫలము.

చేతులలోని సొమ్మును అపహరించుటకుగూడ పంచా యితీ దారులలో కొందఱకు బుద్ధి పుట్టవచ్చును. అడ వులను ఇప్పటిస్థితిలో నుంచుట్టకంటె వృద్ధిపఱచుట మిక్కిలి అవసరమైనచోట్ల ఒక్కొక్క పనికి కొంత సొమ్ము ఏర్పాటుచేసి ఆ పనిని చక్కగా నెరవేర్చిన పిమ్మట పంచాయితీ దారులకు ఆ సొమ్మునిచ్చి వేయ వచ్చును. పంచాయితీదారులెవరైనను తమంతటతామే తమగ్రామపు టడవులను వృద్ధిచేసికొనుతలంపుతో క్రొత్త మొక్కలను వేసి పెంచుకొనుచున్నయెడల అట్టివార లకు ఫారెస్టువారు విత్తనములను సలహానుఉచితముగా నిచ్చుచు సాధ్యమైనంతవఱకు సహాయపడవలెను. ఏగ్రా మస్థులయినను తమ అడవిని చక్కగా పెంచుకొను చున్నయెడలగాని లాభమునంతను శాశ్వతముగా ఆగ్రా మము వారే పొందవచ్చుననియు వారిమూలమున అభి వృద్ధియైన అడవులకు పన్ను ఎన్నడును సర్కారువారువృద్ధి చేయగనియు స్పష్టముగా చెప్పవలెను.

ఫారెస్టు కమిటీవారిచ్చిన అభిప్రాయము లలో గవర్నమెంటువారు చాలభాగమంగీ కరించి అడవులను వారుచెప్పినరీతిని విభాగ ము చేయుటకు గత సం॥ లో ప్రారంభించి యున్నారు. 8 జిల్లాలలో 50 పంచా యితీల నేర్పాటు చేయుటకు ఉత్తరవులు ఇచ్చియున్నారు. చిన్న చిన్న అడవులనుకొన్ని టిని ఫారెస్టు డిపార్టుమెంటుయొక్క పరిపా లననుండి తొలగించి యున్నారు. సర్కారు వంటి చెఱకు వర్తకము చేయుటమాని ప్రయి వేటు కంట్రాక్టరుల కాపనిని విడచివేసిరి. ముందుముందైనను ప్రజలకును ఫారెస్టువారి కినిగల తగవులు తగ్గిపోగలవని తలచెదము.

iii. అడవులశత్రువులలో మూడవది అగ్ని.

అగ్ని.

అడవి ఉద్యోగస్థులపను లలో ముఖ్యమైనదియు

మిక్కిలి కఠినమైనదియు నగుపని అడవులను అగ్ని నుండి కాపాడుట యేయని చెప్పవచ్చును. వేసవి కాలములలో నీపని మఱింత కఠినముగా నుండును. ఈ దేశమునందు అడవులను గొట్టి వ్యవసాయము చేయువారు కొందరు తాము పండించుకొను భూమిలోని బలము తగ్గిపోయి నపుడు దానిని బలపరచుకొనక ఇందులకు బదులుగా క్రొత్త అడవులను కాల్చి ఆభూమిలో వ్యవసాయము చేయుదురు. ఈ క్రొత్త భూములు రెండుమూడు సంవత్సరములవరకు బాగుగ పండింపవచ్చునుగాని కాలిపోయిన అడవి యొక్క విలువను ఆ అడవిలోని వ్యవసాయదారులు కనిపెట్టుట లేదు. ఒకానొకప్పుడు ఒక్కటి రెండెకరముల అడవిని కాల్పవలెనని యొక చోట నిప్పు అంటించగా నూఱెకరముల అడవి కాలిపోవచ్చును. దీనినాపుట కెవ్వరి తరమును కాకపోవచ్చును. ఇట్లు అడవులను కాల్చు దురభ్యాసము చిరకాలము నుండి ఈ దేశమున పాతుకుని యుండుటచేత అడవులలోని యుద్యోగస్థుల కీయడవి నిప్పుల నార్పుపని మిగుల కఠినమగు చున్నది. ఇట్లు ప్రయత్నపూర్వకముగా పెట్టిన నిప్పుగాక అప్రయత్నముగ అడవులకు నిప్పు అనేక విధములుగ నంటుకొను చున్నది. ఈ దిగువ నుదహరించిన పట్టీవలన ఈ రాజధానిలోని అడవులలో నిప్పు ఏ ప్రకారము వ్యాపించు చున్నదో తెలియగలదు. బయిట నుండి వచ్చు నిప్పునుండి అడవిని కాపాడుటకుగాను అడవి చుట్టును కొంత భాగములో నుండు చెట్లను పొదలను నఱికివేయుదురు. ఇందలి కలపలను, తీసిన పిమ్మట నేలమీద ఎంత మాత్రము కాలిపోవు తుక్కు లేకుండగను, తిరిగి మొలవకుండగను, ఆ భాగములకు నిప్పంటించి, తగిన యుద్యోగస్థులును కూలీలును దగ్గరనుండి చూచుచు, కాల్చివేయుదురు. ఒకవేళ ఈ ప్రదేశములను దాటి అడవిలో నిప్పు ప్రవేశించినయెడల ఆ నిప్పు అడవియంతటను వ్యాపించకుండ అడవిలోపల అక్కడక్కడ పెద్ద పెద్ద వీధులు వీధులుగా ఖాళీ స్థలములుండునట్లు అడవిని నఱికి నేలనుకాల్చి పరిశుభ్రముగ నుంచుదురు.

ఇట్లు కాల్చినభాగములకునిప్పు * పుంతలని పేరు. ఈ ప్రకారము నిప్పుపుంతల నేర్పరచి అడవిని నిప్పునుండి సంరక్షించుటకు మన హిందూ దేశములో 1911 వ సంవత్సరములో 6,91,309, రూపాయలు ఖర్చుఅయి యున్నది. మనరాజధానిలో గడచిన సంవత్సరము ప్రత్యేక మిందులకు 1,34,269 రూపాయలు వ్యయపడి యున్నది.

జనసంఖ్యఅధికముగానున్నప్రదేశములలో ఈ నిప్పు పుంతలను ఏర్పరుప బోవుస్థలముల లోని చెట్లయొక్క కలపను ఇతరులకు వెంటనే కొట్టి తీసికొని పోవుషరతులతో అమ్మివేసిన సర్కారునకుఖర్చు లేకుండనిప్పుపుంత

* అడవి వెలుపలి పుంతలు సామాన్యముగా 66 అడుగులును, లోపలి పుంతలు 33 అడుగులును వెడల్పుగ నుండును.

1912_13 సం॥ రములో ఈరాజధానిలోని అడవులను కాల్చిన నేరములను, అడవులపై విస్తీర్ణమును ఎకరములలో జూపు జాపితా.

A. అజాగ్రత్తగాను లేక కాలువలకు నియమించిన ప్రాంతములను అతిక్రమించి కాల్చుటచేతను.		B. బయటి ప్రదేశములనుండి నిప్పు వ్యాపించుటచేతను.		C. రిజర్వులలోనే నిప్పు ఆరంభమగుటచేతను. — అజాగ్రతవలనను, అకాస్మాత్తుగను — అడవి పనులకు నియమించిన కూలివాండ్లు, సర్కారు నౌకర్లు, గుత్తదారులు మొదలగు వారివలనను.		అడవులలో సంచరించు గ్రామస్థులు, బాటసారులు మొదలగువారివలనను.		ప్రకృతి జనితమువలనను.		మంటలువేసి లేక రాగానుండుట వలనను.		ఉద్దేశ్యపూర్వకముగను — క్రొత్తగడ్డి మొలచుటకొరకును.		వేటకొరకు గాని పగతీర్చుకొనుటకు గాని.		మరి యితరకారణములచే.		మొత్తము.		D. తెలియని కారణములవలన		A, B, C, D, మొత్తము.	
1	2	3	4	5	6	7	8	9	10	11	12	13	14	15	16	17	18	19	20	21	22	23	24
నెంబరు.	విస్తీర్ణము.	నెంబరు.	విస్తీర్ణము.	నెంబరు.	విస్తీర్ణము.	నెంబరు.	విస్తీర్ణము.	నెంబరు.	విస్తీర్ణము.	నెంబరు.	విస్తీర్ణము.	నెంబరు.	విస్తీర్ణము.	నెంబరు.	విస్తీర్ణము.	నెంబరు.	విస్తీర్ణము.	నెంబరు.	విస్తీర్ణము.	నెంబరు.	విస్తీర్ణము.	నెంబరు.	విస్తీర్ణము.
45	23601	166	52494	32	44309	254	53965	9	215	23	628	158	13350	32	11752	68	57376	578	159595	187	428879	1420	664068

[illegible] మేగాక లాభమునువచ్చును. కొన్ని ప్రదేశములలోని అడవులలో ఇప్పుడు [illegible] చేయుచున్నారు. జనసంఖ్యాబాహుళ్యములేని ప్రదేశములలో అక్కడక్కడ నివసించు కోయ, చెంచు, లంబాడీ మొదలగు అడవి జాతుల [illegible] మంచిమాట లాడువారలకు బహుమతులిచ్చి, అడవిని కాపాడవలసినదని చెప్పిన యెడల అడవియందలి నిప్పులు తగ్గిపోవును. [illegible] కొనవచ్చును కూడమంటచల్లార్చు [illegible]లు సహాయకరములు. ఇందుకొరకు వారికి [illegible] విశేషధనమును వ్యయపెట్టవలసినది లేదు. అడవులలోనిప్పు అంటు కొనక సంవత్సరములో ఒక్కొక్క గూడెము [illegible] కట్టుకొనుటకు బట్టలు [illegible]. మిక్కిలితృప్తి నొందుదురు. [illegible] యెడల అడవికి వారెం[illegible] ఉపకారము చేయగలరు. ఇట్టివార[illegible] చక్కగ బోధించి [illegible] పెట్టుకొనకపోయినచో [illegible] వారలకు లాభము [illegible] సంతోషముగ అడవిని [illegible] చూచుకొనవలయును.

[illegible] కాలిపోవుటవలన నష్టము [illegible] అగ్నివలన ఈ క్రింద నుదహ[illegible] అనేకవిధముల నష్టముగలుగునని [illegible].

1. [illegible]ని చెట్లఆకులు నేలమీదపడి [illegible] మొన్నపడుమన్న మిక్కిలి సారవంతమై నేలమీద సంవత్సరముల కొలది పొరలు పొరలుగా పెరిగి అడవిలోని చెట్లకు అధికమగు బలమునిచ్చును. ఇట్లు తుక్కు క్రక్కుట వలన నేర్పడినమన్ను ఆకుల క్రింద బడి యుండుటచే వర్షముచే కొట్టుకొని పోక నేలకు మెత్తనితడియైన కవచముగానే ర్పడును. వీరేట అడవి కాలుచుండిన ట్లీ యిసి ఆకులన్నియు కాలిపోయి మిగిలినబూడిద మిక్కిలి తేలికయగుటచే మిక్కిలి సులభముగ కొట్టుకొనిపోయి ప్రాతినేల బయల్పడును. ఇందుచేత క్రొత్తచెట్లు మొలచుటకు గాని ప్రాతచెట్ల అభివృద్ధికిగాని అవకాశము తక్కువగా నుండును.

ఎరువు నశించుట.

2. అడవి కాలిపోయినప్పుడు కొన్ని పెద్ద చెట్లు నిలిచినను నేల బారుననుండు చిన్న మొక్కలన్నియు నశించిపోవుటచే అడవిమొక్క అభివృద్ధికి కావలసిన లేత చెట్లు తగినన్ని యుండవు.

లేతచెట్లు నశించుట.

3. చెట్టుచుట్టును మండుచుండు మంటల వేడికి కాలిపోక నిలిచిన పెద్దచెట్లుగూడ ఉడికివాని మధ్యనుండు చేవలో పెద్ద పెద్ద తొర్రలును, పగుళ్లును యేర్పడును. ఎన్నడును కాలని అడవులలోని కలపలో నిట్టి చెరుపు కానరాదు. ప్రానుమధ్యనుండు ఈపగుళ్లచే కలపవిలువ మిక్కిలితగ్గిపోవును.

చేవలో తొర్రలుపుట్టుట.

4. నార్లు మొక్కలు వేయుటకు నాళ్ళు కొనని చెట్లుగూడ పూర్వమునకు తెప్పుగాఁ బెరుగ నేరవు. నిప్పు

పెంపుతగ్గుట.

సలుపగ విగిన నారేసినుండి తెప్పరిల్లుటకు ఒక్కొక నిర్మాణము చాలకాలము పట్టును. కొన్ని చెట్లు ఎన్నఁడు మొలచనేరవు.

5. కాలిపోయిన యడవిలోని నేల గట్టిబడి చెట్లకు గట్టిపట్టుగా నుండుటచేత అట్టి నేల

నేలగట్టిపడు గట్టుట.

మీఁద పడిన విత్తులు మొలచుట కష్టము. కాబట్టి యడవులలోని క్రొత్తమొక్కల యభివృద్ధికి ఎక్కువ నష్టము కలుగును.

1911 సం॥ రములో సర్కారువారి క్రిందనున్న 20,030 చద. మైళ్ల రిజర్వు అడవిలో 12,067 చద. మైళ్లు అనగా నూటికి 68 పాళ్లలో నిప్పు ప్రవేశింప కుండ కాపాడబడియున్నవి. అడవి స్వంతదారులగు ఇతరులు కూడ స్వల్పవ్యయముతో అడవులకు నిప్పుభయము లేకుండఁ జేసినయెడల అడవి నుండి ఆదాయములోనికి వచ్చిన లాభమును పొందవచ్చును.

iv. అడవుల యొక్క శత్రువులలో నాలుగవది వ్యాధులు. చెట్లవ్యాధులు సామాన్యముగా వానిమీఁ

వ్యాధులు.

దనివసించి యుండు పురుగుల* మూలమున వచ్చును. క్రొత్తకఱ్ఱ బెరడులోనికి దొలుచుకొనిపోయెడు పురుగుయొక్క ఆకారమును, రూప నిష్పత్తియు చెట్లు కదిచేయు అపకారమును పటములో చూపియున్నాము. ఈ చెట్ల యొక్క ఆకులను తినివేయు మఱియొకచిడ పురుగుయొక్క రూపనిష్పత్తియు అది ఆకులలోని గుంజునంతయు తినివేసి-ఈనెలను మాత్రము విడచివేయు పద్ధతియు తెల్పుటకు మరి యొక పటమునుచూపియున్నాము. ఇవిగాక నేలమీఁద చెదలును, నీటిలోనూరవేస్లి నప్పుడు నత్తలు మొదలగు జంతువులును ఎంతవరకు అపకారము కలుగఁజేయునో చెప్పుటకు ఇక్కడ స్థలము చాలదు. టేకుచెట్టు సామాన్యముగా నిట్టినాని కోలోంగక పోవుటచేతనే దాని విలువ యధికముగుచున్నదని గ్రహింపనగును. ఇవి గాక ఉడతలు చిగుళ్లను తినివేయును. వడ్రంగి పక్షి చెట్లపట్టలను కొట్టివేయును. ఏనుగులు కొమ్మలను విరిచివేయును. ఇంకనిట్లే అడవికి నేక శత్రువులుగ్గలరు. వీనినిగూర్చి తెలిసికొనగోరువారు స్టెబ్బింగుగారి "మాన్యూలు ఆఫ్ ఫారెస్టు జూ ఆలొజి" అను పుస్తకములో జదువుకొనవలెను.

ఒక అడవి యందలి ఫలసాయమును రాబట్టి సొమ్ముచేయుటకు సామాన్యముగ మూఁడుపద్ధతులిప్పుడు అమలులోనున్న

అడవిఫలసాయమును రాబట్టు పద్ధతులు.

వని చెప్పవచ్చును.

* ఈ పురుగులలో కొన్ని మిక్కిలి సూక్ష్మముగ నుండి వట్టి కంటికి కానరావు. వీనికి సూక్ష్మజీవులని పేరు వీనినిగూర్చి జీవశాస్త్రములో జూడఁదగును.

డిపో పద్ధతి.

1. సర్కారువారే అడవులలోని ఫలసాయమును చేర్చి వెలుపలకు తీసికొనిపోయి తాము ఏర్పరచిన డిపోలలో ఆయా ప్రదేశములలో నుండు బజారు వెలలకు అమ్మికొనుట.

చీటి లేక పర్మిటుపద్ధతి.

2. కలప కొట్టి తీసికొనిపోవువారలకుగాని చిల్లర ఫలసాయమును తీసికొని పోవువారలకు గాని కొన్ని నిబంధనలకు లోబడి, చీట్లనిచ్చి వారివద్దనుండి సొమ్ము వసూలుచేసికొనుట.

గుత్తలేక కంట్రాక్టు పద్ధతి.

3. ఒకానొక ఖండమునందలి ఫల సాయము నంతను కొంత మొత్తమునకు గుత్తగా నిచ్చివేసి కొన్ని నిబంధనల ప్రకారము గుత్తదారులను అడవి ఫలసాయమును తీసికొని పోనిచ్చుట.

ఈ పద్ధతులు ఆయాదేశము నందలి ఆచారమును బట్టి ఏర్పడి యుండును. ఈ రాజధానిలో గత సంవత్సరములో వచ్చిన అడవి ఫలసాయము కొంత సర్కారు ఉద్యోగస్థుల మూలమునను కొంత కంట్రాక్టరుల మూలమునను వచ్చియున్నది. కొంత ఉచితముగ తీసికొనిపోబడియున్నది. సగటున హిందూ దేశములోని అడవులమీద సర్కారునకుచదరపుమైలునకు రు 50 ల చొప్పున రాబడివచ్చుచున్నది. అనగా ఎకరము అడవిభూమికి సగటున 0-1-3 రాబడి వచ్చుచున్నది.

పర్మిటుపద్ధతివలన నష్టములు.

పూర్వము సాధారణముగా పర్మిట్లమీద అడవి ఫలసాయమును అడవి ప్రక్క నుండు గ్రామములవారు కొట్టుకొనుచు అమ్మికొనుచు నుండిరి. కాని అట్టి ఆచారమువలన అడవులకు ఎక్కువ నష్టము వచ్చుచుండెను. పర్మిటులు పొందినవారలు సామాన్యముగా పర్మిట్లమీద తాము తీసికొనిపోవుకలపకంటె హెచ్చుగ దొంగిలించుకొని పోవుచుండిరి. లెక్కలేనంతమంది ఎవరికివారు తీసికొనిపోవుచున్నప్పుడు అడవిని భద్రపరచుట ఫారెస్టు అధికారులకును కష్టమే. ఒక్కచెట్టు కొట్టుటకు పర్మిట్టుగలవాడు తనకు కావలసిన కఱ్ఱను ఏరుకొనులోపల పది చెట్లను కొట్టి పారవేయును. ఈ ఎండిన చెట్లన్నియు నేలమీద బడి యుండి అడవికాలి పోవుటకు సహాయపడును. పర్మిటు పొందిన వాడు న్యాయస్థుడై జాగ్రతగలవాడైనను ఏ చెట్టును ఎట్లు కొట్టవలెనో తెలియక పోవుటచేత అడవి యొక్క వృద్ధికి కావలసిన లేతకొమ్మలను మంచికొమ్మలను నరికివేయును. ఇట్లు చేయుటచేత అధిక విలువగలఅడవి సరిగా పెరుగక కొద్దికాలములో నాశనము చెందును. అడవి చక్కగ, పెరుగవలెననిన అడవిలోనున్న వంకరచెట్లను నీరసపుచెట్లను కొట్టివేసి బలముగ నున్న చెట్లను విత్తనముకొఱకును, చిన్న చెట్లు పెరుగుటకు కావలసిన నీడ కొఱకును తగు రీతిని పెంచవలెను. పర్మిటు పొందిన వాడన్ననో ఏచెట్టు కంటికి బాగుగానుండిన

దానిని ముందునరికి వేయును. కొన్నిచోట్ల ఎండి పడిపోయిన చెట్లను మాత్రము పర్మిటుగలవారు తీసికొని పోవచ్చునని ఏర్పాటు చేసియుండిరి. అట్టిచోట్లగూడ అడవులకునష్టమేవచ్చుచుండెను. అడవిలో దూరముగా పోయి ఎండుకట్టెలను ఏరుకొనుటకు ఇష్టము లేక దారిని పోవునపుడు ప్రతిదినము కొన్ని కొమ్మలను నరికివేసి తానువారముదినములకు తిరిగి వచ్చునప్పటికి ఇవి యెండి తయారుగా నుండునట్లు చూచుకొనును. ఇట్టి వారల నందరిని పట్టుకొనుటకు 16 చదరపు మైళ్లకు ఒక్కడై యున్న ఫారెస్టుగార్డులు ఏమి పని చేయగలరు? కాబట్టి పర్మిటు పద్ధతివల్లన అడవులకు అనేక విధముల నష్టము వచ్చును.

పర్మిటు పద్ధతివలన లాభములు.

అడవి ప్రక్కలనుండు పట్టణములలోని ప్రజలకు తమగడపవద్దనే వంటచెరకు చౌకగా దొరకును. వేరేమియుసంపాదనలేని బీదవారలు అనేకమంది అడవికి పోయి కట్టెలుకొట్టి అమ్ముకొని, తమకు అదినమున కావలసిన దానిని తిండికి సులభముగా సంపాదించి జీవనముచేయగలరు. ఇట్టి జీవనము లేని యెడల వీరందఱు దొంగతనమునకు ప్రారంభింతురు. కాబట్టి అట్టివారికిని బీదరయితులకును ఈ పద్ధతిచాల యుపయోగముగా నుండునని కేశవపిళ్లగారు నొక్కి చెప్పిరి.

సర్కారు డిపోపద్ధతి

ఈపద్ధతివలన ప్రజలకు కావలసిన కట్టె అంతయు వెలలోహెచ్చుమార్పులులేకుండ సాధారణముగ సంవత్సరపు పొడుగునను దొరకును. ఈ పద్ధతివాడుకలోనికి వచ్చి 10 సంవత్సరములు కావచ్చినది. దీనివలనసర్కారునకు లాభముగా నున్నదని చెప్పుటకువీలు లేదు. ఏలయన ఫారెస్టు అధికారుల జీతము వగైరా ఖర్చులన్నియు కలుపుకొని చూచిన యెడల బజారులో నమ్ముధరలకు సర్కారు డిపోలో వంటచెఱకు అమ్మినప్పుడు సాధారణముగా సర్కారునకు నష్టము వచ్చునుగాని లాభము హెచ్చుగా కనుపడదు. ప్రజలకు కొంతవఱకు దీనివల్లన సదుపాయములు కనపడుచున్నను ఫారెస్టు ఉద్యోగస్థులపని దీనివలన చెడిపోవుటచేతను తత్కాలమునకు ఏర్పఱచినక్రిందిఅధికారులు మోసముచేసి నప్పుడు వారిని పట్టుకొనుటకు మిక్కిలి శ్రమకలుగుచుండుట చేతను ఈ డిపోపద్ధతి మొత్తముమీదఫారెస్టు డిపార్టుమెంటు వారికి నష్టమే యనిచెప్పవచ్చును. కలపకొట్టుపని అంతయు కంట్రాక్టు పద్ధతిమీద విడిచినయెడల ఫారెస్టు అధికారులు తమ కాలమునంతయు అడవిని పెంచుటయందును క్రొత్తపద్ధతు లేర్పరచి వృద్ధిచేసికొనుటకును ఉపయోగపరచుకొన వచ్చును.

గుత్తపద్ధతి.

అడవులలోకొంతభాగమును ప్రత్యేకపరచి దానిని కొంతకాలము లోపల కొన్ని షరతుల మీద పట్టుకొని పోవుటకు కొంతసొమ్మునకు అమ్మివేసిన యెడల ఆ యడవులనుకొనుక్కొనిన వారు కొట్టుకొని పోయి వారికి లాభము

వచ్చునని తోచిన చోట్ల అమ్ముకొందురు. ఇట్టి పద్ధతివలన పైనిచెప్పిన ప్రకారము కొన్ని లాభములున్నవిగాని కొన్నిచోట్ల కంట్రాక్టుదారులందరు ఏకమై వెల హెచ్చించి వంటచెఱకు దొరకని కాలములలో ప్రజలను బాధింపవచ్చును. ఇట్టివి జరుగకుండ అవసరమైనచోట్ల సామాన్యపు ఖరీదునకు కలప దొరుకునట్లు సర్కారువారు అవసరమైనప్పుడు డిపోలను పెట్టవలెను. ప్రస్తుతము కంట్రాక్టు పద్ధతియే ఈ దేశములో బాగుగనుండునని తోచుచున్నది. సర్కారువారికంటె కంట్రాక్టుదారులు అడవులను చవుకగా కొట్టుకొనగలరు. చవుకగా చేరవేసికొనగలరు. దొంగతనము జరుగకుండ కాపాడుకొనగలరు. అడవిచుట్టు నుండు గ్రామములలోని బీదవారలకు సంవత్సరము పొడుగునను పనిచూపించి జీవనము ఏర్పరచగలరు. అడవి పరిపాలకులు తీరికగా ఇతర పనులను చేసికొనవచ్చును. కింది తరగతి యుద్యోగస్థులు పెట్టుబాధలను తగ్గింపవచ్చును. కాని కంట్రాక్టరులకు అడవులను ఇచ్చివేయునప్పుడు అవసరమైనచో అడవి చుట్టునుండు గ్రామములోని ప్రజలకు కావలసినకఱ్ఱను స్వల్పకరీదునకు నిర్ణయముగా నిచ్చుచుండుటకు ఏర్పాటుచేయవలసి యుండును.

గడచిన 5 సంవత్సరములలో ఈ రాజధానిలో ఫారెస్టు డిపార్టుమెంటువారు అడవి ఫలసాయమును సాధ్యమైనంతవఱకు కంట్రాక్టుదారులకు ఇచ్చి వారి మూలముననే సర్కారునకు రావలసినసొమ్మును చాల భాగమును వసూలుచేసిరి. ప్రక్క పట్టీ సూచించిన ఈ విషయము బోధపడగలదు.

తగిన కంట్రాక్టరులు దొరకనిచోటులందేగాని తక్కినచోట్ల డిపార్టుమెంటువారు స్వయముగా ఫలసాయమును రాబట్టి అమ్మరు. కాని పట్టణములకు దూరముగనున్న అడవులలోను, చలిజ్వరపు బాధలు హెచ్చుగనున్న అడవులలోనువచ్చు ఫలసాయమును కొనుటకు కంట్రాక్టుదారులు సాధారణముగా నొప్పరు. కావున తగిన వెలరానిచోట్ల డిపార్టుమెంటువారే ఈపనులన్నియు చేయవలసివచ్చును. ఇప్పటికిని కొన్ని జిల్లాలలో ఫారెస్టువారే ఈ వ్యాపారమును చేయుచున్నారు. మఱికొన్ని జిల్లాలలో అక్కడక్కడ పర్మిటుపద్ధతినిబట్టి అడవి ఫలసాయమును ఖర్చుచేయుచున్నారు. 1914 వ సం॥ రములో సర్కారువారికి వచ్చిన ఆదాయము ఏయేమార్గముల నెంతెంతవచ్చినదో తెలియుపట్టి నీక్రింద చేర్చియున్నాము ౬౧౨-వ పుటచూడుము.

అడవిలాభమా సేద్యములాభమా.

మానవ సంచారములేని ప్రదేశములో నెవ్వరు పెంచకయే చెట్లు తమంతటతామే పెరుగును. దాని పెంపునకు అనుకూలమగుస్థితి గతులున్న చోట్ల ఏచెట్టుగాని సేవళముగ పెరుగును. లేనిచోట్ల పెరుగక నేలబారుననేయుండును. మానవుల సంపర్క-

1914 సం॥ రములో సర్కారు స్వయముగా వసూలుచేసిన మొత్తములు 1913 సం॥ రమున కన్న తగ్గియున్నవి; కంట్రాక్టరుల మూలమున వసూలయిన మొత్తములు 1913 సం॥ రమునకంటె హెచ్చినవి.

ఫలితము వసూలుచేయు ఏజంసీ.	మంచిగంధముతప్ప యాకత్తు కలప. ఘ. అడుగులు		వంటచెరకు ఘ. అడుగులు.		వెదుళ్లు సంఖ్య.		చిల్లరఫలసాయములు (గడ్డి మేతపన్ను వగయిరా) విలువ రూ. పాయలు	
	1912–13	1913–14	1912–13	1913–14	1912–13	1913–14	1912–13	1913–14
సర్కారువలన ...	7,10,239	5,79,081	53,03,751	32,59,127	43,46,266	10,55,627	54,744	58,626
కంట్రాక్టరులవలన ...	39,42,873	47,34,744	1,55,28,347	1,86,78,505	2,98,31,911	4,01,21,724	17,79,763	15,09,322
హక్కుదార్లవలన ...	34,193	2,38,584	1,54,854	7,92,444	18,685	2,163	26,274	28,044
ఉచితముగా అనుభవించిన బాపతు ...	1,19,098	1,88,684	1,05,296	30,104	1,08,106	79,283	12,676	6,682
రాజధాని మొత్తము ...	48,06,403	57,41,093	2,10,92,248	2,27,60,180	3,42,99,968	4,13,38,797	18,73,457	16,02,674

మదరాసు రాజధానిలో 1913-14 సం॥ రములో అడవి ఫలసాయమువలని ఆదాయము.

ఫలసాయముయొక్క వివరము.	సర్కారు మూలముగా	వర్తకుల మూలముగా	ఉచితముగా నిచ్చినది	హక్కుదార్లు కొట్టుకొనినది.	మొత్తము.
కలప :—					
గుగ్గిలపుచెట్టు రూ.	26,359	1,68,522	...	...	1,94,881
టేకు ...	1,73,935	49,726	2,261	1,725	2,27,647
నల్లమద్ది ...	48,638	56,711	...	...	1,15,349
వేగిస ...	12,490	47,179	...	275	59,944
ఏపి, (నరేపి) ...	216	1,159	...	...	1,375
విరుగుడుచేవ ...	4,915	5,872	...	725	11,512
కొండతంగేడు ...	5,971	1,237	...	600	7,808
మంచిగంధము ...	15,607	14,751	...	...	30,358
తుమికి (కోవిదార*) ...	...	325	...	...	325
కొంగు † ...	12	4,060	1,180	725	32,877
చెన్నంగి, వెంతేకు, వరగోగు ...	4,353	974	...	...	5,327
ఇతరజాతులు ...	2,86,585	43,74,228	1,85,243	2,07,634	50,53,690
కలప మొత్తము ...	5,79,081	47,34,744	1,88,684	2,38,584	57,41,093
వంటచెఱకు	32,59,127	1,86,78,505	30,104	7,92,444	7,60,180
వెదుళ్లు ...	20,282	2,13,800	899	342	2,35,323
చిల్లరఫలసాయములు :—					
మేకగడ్డి ...	8459	6,81,849	5,815	2,066	6,98,689
ఆవురుగడ్డివగైరా ఇండ్లపైకప్పు ...	842	9,219	93	69	10,228
చింతపండు, కరక్కాయి, కుంకుడుకాయలు, ముష్టివిత్తనములు ...	13,342	97,456	...	...	1,16,798
కొమ్ములు, తేనె, మైనము, బంక ...	4028	4,506	...	...	8534
దూపదామర, ఏలక్కాయలు, మిరియములు ...	279	22,820	...	...	18,099
తంగేడుచెక్క వెంపాందం ...	426	2,45,945	1	...	2,46,372
మైకా, రాయి, కంకర ...	1	66,669	512	...	67,182
Platters వగైరాలకు ఆకులు ...	...	567	...	...	567
ఈత, తాటి ఆకులు ...	9	9,056	644	...	9,709
ఎరువు, చెత్త ...	...	87,876	...	...	87,876
కచ్చూరము ...	13,995	...	...	...	18,095
ఇతరపదార్థములు ...	11,245	3,43,359	117	25,909	3,80,630
చిల్లరఫలసాయముల మొత్తము ...	53,626	15,09,822	6,682	28,044	16,02,674

* శ్రౌత నిఘంటు † అరవమునుండి.

ముగల అడవులలో నిల్వగాదు. మానవుడు తనకు కావలసిన కఱ్ఱను అడవినుండి తెచ్చుకొనునప్పుడు ఆ అడవికి ఒకానొకప్పుడు ఉపకారమును చేయును. మఱియొకప్పుడు అపకారమును చేయును. ఎట్లనగా చెట్లు చిక్కగా నుండి యొకదాని వృద్ధికి మరియొకటి ఆటంకముగానున్న చోట్ల బలహీనమైన చెట్లను కొట్టివేసిన యెడల బలముగల చెట్లు మరింత వేగముగా పెరుగును. బలముగల చెట్లనన్నిటిని నరికొట్టి వేసినయెడల బలహీనమగు చెట్లును, వ్యాధి పీడితమైన చెట్లును అడవియందు జేరి అడవి శీఘ్రకాలములో నాశనమగును. ఇది గాక చెట్లుదట్టముగనున్న అడవిలో వంకరటింకరలుగానున్న చెట్లనుకొట్టివేసిన యెడలతిన్నగనున్న చెట్లు చక్కగా పెరుగును. వంట చెఱకు కావలసినప్పుడు వ్యాధి పీడితమైన కొమ్మలను నరికిన యెడల తల్లిచెట్టు బాగుగా పెరుగును. చెట్లు నరకువానికి అడవి పెంపునందభిలాష లేని యెడల తన కంతగా లాభము లేక పోయినను సులభముగా అడవిని పాడు చేయ వచ్చును. పర్మిటు పద్ధతిని అడవిలోని కలపను కొట్టుకొని పోనిచ్చుచోట్ల ఇట్లే అడవులు దినదినమునకు క్షీణించుచున్నవి.

ఒక ప్రదేశమునందు అడవిని పెంచవలెనా, లేక చెట్లను నరికి వ్యవసాయము చేయవలెనా అనువిషయమును మొదట అడవిశాఖవారు ఆలోచింప వలెను. దేశముయొక్క శీతోష్ణస్థితి, వర్షము, జలాధారముల సంరక్షణ మొదలగు పైనిజెప్పిన నైసర్గికోపయోగములకుగాను మనము పెంచు అడవులుపోగా మిగిలినచోట్ల ఎక్కడ అడవులను పెంచిన లాభము కలుగును? ఎక్కడ పెంచిన నష్టము కలుగును? లాభమునకై వ్యవసాయపు నేలలలో క్రొత్త అడవులను పెంచుకొనువారును ప్రాతఅడవులను వృద్ధి చేయువారును దిగువ చూపినవిషయములను గమనింప వలెను.

౧౬ 1. తమ ప్రదేశములో కావలసిన జాతి అడవులనెక్కడ పెంచిన లాభమువచ్చును కలప ఆ ప్రదేశములో సహజముగా పెరుగునా పెరుగదా? అను విషయము మొదట చూచుకొనవలెను. ఇది భూసారము, వర్షస్థితి, సముద్రపు మట్టమునుండు ఎత్తు, మొదలగు వానిని బట్టి మారుచుండును. టేకు చెట్లు ముంపు నేలలలో పెరుగవు. యూకలిప్టసు చెట్లు ఎత్తు ప్రదేశములలోనే గాని పెరుగవు. మంచి గంధపు చెట్లను సముద్రపు మట్టములోనుండు భూములలో పెంచిన యెడల ఆ మ్రానులందు సువాసనయుండదు. కొన్ని జాతుల చెట్లు అన్ని నేలలయందును ఏదోయొక విధముగ పెరిగినను కొన్ని భూములలో మంచి కలప తయారుకాదు. చెట్లు గిడస బారి నేలనంటియుండును. ఇవే చెట్లు మరికొన్ని నేలలలో మిక్కిలి చక్కగనభివృద్ధి జెందును. కాబట్టి ఏయే స్థలములలో నే యే జాతి చెట్లను పెంచనగునో అడవి శాస్త్రి

సంచు చక్కగ నెరిగి వారి నుండి తెలిసి కొనవలెను.

2. అడవులను పెంచుటకు తగినస్థితిగతులు పైని చెప్పిన ప్రకారమున్నను కొన్నిచోట్ల అడవిని పెంచుటకంటె వ్యవసాయముచేయుటయే లాభకరముగ నుండును. వ్యవసాయము వలనగాని, పశువులమేతవలనగాని, ఇతర ఉపయోగముల వలనగాని ఒకానొక భూమి మీద సగటున లాభమెంత వచ్చునో చూచుకొనవలెను. వీనివలన కంటె, అడవులను పెంచుటవలననే యెక్కువ లాభమున్న యెడల నక్కడ అడవులను పెంచ నగును. తంజావూరు జిల్లాలో సం॥ రము పొడుగునను నీరు పారుదలయగు చోట్ల వ్యవసాయము చేయుటయే లాభకరముగాని అడవినిపెంచుట ప్రయోజనకారికాదు. సముద్ర తీరముల నేమియు ఫలింపని ఇసుక నేలలందు సరుగు (చౌకు) మొదలగు అడవులను పెంచుటవలన లాభము కలదు. వరదముంపు గల ప్రదేశములలో కొన్నిచోట్ల పైరులు పెట్టుకొనుట కంటె తుమ్మ, మడ, తిళ్ల మొదలగు కలపను పెంచుట లాభకరముగ నుండును.

3. అడవులవలని లాభములు కొన్నిచోట్ల పట్టణ సమీపమును బట్టిగాని, రహదారీలను బట్టిగాని, పడవలు, తెప్పలు పోదగిన కాలువల సమీపమును బట్టిగాని, యేర్పడియుండును. కలపను బండిమీద చేరవేయుటకు నీటిమీద జేరవేయుటకంటె, సామాన్యముగా నాలుగు రెట్లు అధికముగ కూలి యగును.

4. వ్యవసాయపు భూముల ఫలసాయము ప్రతిసంవత్సరమును అనుభవమునకు వచ్చును. అడవిలోని ఫలసాయము అనుభవమునకు వచ్చుటకు అనేక సంవత్సరములు పట్టును. సరుగు చెట్లు వేసిన తరువాత 7 సం॥ రములకు ఫలితము నిచ్చును. తుమ్మలకు 10 లేక 15 సం॥ రములు పట్టును. టేకు చెట్లు వేసిన 70 మొదలు 100 సం॥ రములకు గాని పూర్తిగా ఫలము నియ్యవు. కాబట్టి అడవి పెంచువాడు తత్కాల ఫలితమును గోరు వాడు గాక ధనికుడుగా నుండవలెను.

5. అడవియొక్క విలువ ఆయా ప్రదేశములలో నుండు జనసంఖ్యనుబట్టి యుండును. కూలి పనులకు చాలినంత మనుష్యులు దొరకనిచోట్ల భూమి ఖామందు లెంతఆశపడినను కొన్ని భూములు వ్యవసాయముకాక అడవులుగానే యుండును. అట్టిచోట్ల నుండు నేలలను అశ్రద్ధగా విడిచివేయక అడవులుగా పెంచుట లాభకరము. వ్యవసాయమునకు కావలసినంత మంది అడవి పెంచుట కక్కర లేదు. కొద్దిపాటి జన సంఖ్య యుండిన చాలును. కాబట్టి చలి జ్వరాది వ్యాధులు ప్రబలముగనున్న కొండప్రదేశములలో వ్యవసాయము చేయుట కంటె అడవులను పెంచుటయే లాభకరము.

6. ఇతర ప్రదేశముల నుండి సులభముగా కలప దిగుమతియగుటకు తగిన వీల్లు గల

చోట్ల క్రొత్తగ అడవులను పెంచిన లాభ ముండదు. ఇంగ్లాండు దేశము నల్దు ప్రక్కల సముద్రతీరము గల ద్వీపమగుటచేత నాదేశ మున కితర దేశములనుండి కలప నీటిమీద సులభముగను చౌకగను దిగుమతి కాగలదు. కాబట్టి ఈ దేశమునందుండు విలువగల భూము లలో అడవి పెంచి వానినుండివచ్చు కలపను పైనుండి వచ్చు కలపతో సమానమైన వెలకు కమ్మిన ఎడల నేమియు లాభ ముండదు. అట్టి చోట్ల అడవులను పెంచుట వలన నష్టమేవచ్చును. కాని ఇంగ్లాండులో కూడ విలువలేని కొండ నేలలు కొన్ని గలవు. అట్టి చోట్ల అడవులను పెంచిన ఎడలకొంత వరకు లాభము రావచ్చును.

కాబట్టి ఏ ప్రదేశములందు అడవులను పెంచిన లాభమో తెలిసికొనుటకుసామాన్య సూత్రము లేవియును పనికిరావు. ఆయా దేశ ముల స్థితిగతులను బట్టియు, భూమి విలువ, శీతోష్ణస్థితి, జన సంఖ్య మొదలగు పైని జెప్పిన కారణముల నన్నిటిని బట్టియు నాలో చించి ఆయా ప్రదేశములకు తగిన పద్ధతుల నేర్పరచుకొనవలెను.

ప్రాత అడవులను వృద్ధిచేయుట.

ఇదివరకే కొంత కాలమునుండి పెరుగు చున్న అడవిని మనము పెంచవలెననిన మనమే పద్ధతిని పనిచేసిన హెచ్చు లాభము హెచ్చు కాలము వరకు వచ్చునో చూచుకొనవలెను. కర్రకు సమీపములో తగినవెల యున్నయెడల అడవిలో మనకు పనికిరాక కొట్టివేసిన కర్రల అమ్మకమువలననే అడవిని పోషించుటకుకావలసినసొమ్మంతయు వచ్చివేయును. ఈ మరమ్మతులవలన అడవికి శాశ్వతలాభము కలుగుటయేగాక మనకు ప్రస్తుత లాభముకూడకలుగును.

పనికిరాని కలపను ఏరికొట్టివేయుట.

మనము పనికిరాదనికొట్టి పారవేసినకర్ర లను కొన్నవారు చుట్టు ప్రక్కల లేనియెడల కొట్టి వేయుటకేగాక ఈకర్రను అడవిలోనుండి బయటకు తీసివేయుటకును కాల్చివేయుటకును తిరిగి కొంత ఖర్చులగును. కొట్టిపారవేసినకర్ర చిల్లరగాపడియున్న ఎడల నిప్పంటుకొని అడవియంతయు నాశనమై పోవచ్చును. కాబట్టి యెంతఖర్చు అయినను ఈ యెండు కర్రలను, కంపలను అడవిలో నుంచకూడదు. కాబట్టి ఒకఅడవిలో మనము చేయదలచినపనులు మన కర్రకుగాని ఇతర ఫలసాయమునకుగాని రాబోవు ఖరీదులను బట్టియు ఆయా దేశములందుండు కూలిపనుల రేటులను బట్టియు నుండును. ఒక పట్టణపు సమీపమున అడవి యున్నయెడల పనికిరాని కర్రను మనమెంత కొట్టిన మన కంతయు లాభమే. అగమ్యమైన ప్రదేశములోనే ఈ అడవి యున్నయెడల మనముచేయునదంతయు దండగయే అగును.

మొదలంట నరుకుట.

కొన్ని చెట్లను విత్తనము వేసి పెంచుటకంటె ప్రాత చెట్లను మొదలంట నరికి వాని మొండెములను చిగుర్చుకొననిచ్చినయెడలచాల లాభకారిగా

...ను. ఈచిగురుకొమ్మలు క్రొత్తమొక్కల కంటె మిక్కిలి వేగముగ పెరిగి ఎక్కువ కలప నిచ్చును. గింజనుండి బయలుదేరిన మొక్క సంవత్సరముల మొక్క కంటె మొండెము నుండి బయలుదేరిన పేరుమొక్క ఒక్క సంవత్సరములో నెక్కువ వృద్ధిని పొందును. మొండెము నుండి బయలు దేరు మొక్కకు అనేక వేరులనుండి ఆహారము దొరకుటచే పెద్ద ఆకులతో ఏపుగ పెరుగును.

పైని చెప్పిన ప్రకారము నూతనవృద్ధి కొరకై అడవిలోని పాతచెట్లను మొదలంట నరుకుటకు కాప్పిసు (Coppice) చేయుట అని పేరు. ఒక అడవిని కాప్పిసు చేయుటలో అడవిలోని చెట్ల నన్నిటిని మొదలంట సామాన్యముగా నరికి వేయుదురు. కొన్ని చోట్ల మంచి చెట్లను ఎకరమునకు 15 మొదలు 25 చెట్ల వరకు విడిచి వానిని మాత్రము కొట్టక మిగిలిన చెట్లనన్నిటిని కొట్టివేయుదురు. ఇట్టి అడవులు కొంతవరకు కలపకును, కొంతవరకు వంట చెరుకునకును యేర్పడియుండును. నరికిన మొండెముల నుండి సామాన్యముగా అన్ని చెట్లును చక్కగి పెరుగును. కొన్ని ... పాలుగారు చెట్లు ఇట్టి వృద్ధికి పనికిరావు. ముఖ్యముగా వంట చెరుకునిమిత్తమై ... మద్ది, సీమచింత, మొదలగుచిన్న అడవులలో సక్కటి మిక్కిలి లాభకారిగాను ... ఉపయోగించు పేరు, మద్ది మొదలగు ... మొండెములనుండి పెరిగినను మొదటిభాగమున, ఒకానొకప్పుడు 5-6 అంగుళములెత్తువరకు పెద్దతొర్రగా నేర్పడుటచేత చేవ చెడిపోవును. అందుచే నీ పద్ధతి యంతగ కలపఅడవులలో నుపయోగపడదు. అడవులను క్రొత్తవృద్ధికొరకై ఈ ప్రకారము అప్పుడప్పుడు నరుకు అడవులలో చెట్లను సామాన్యముగా నేలతో బరాబరిగా నరికివేయుదురు. కాని నీటిముంపుగల నేలలలో మాత్రము మొండెములు వరదవలన మునిగియుండు నీటిమట్టము పైని 5,6 అంగుళముల ఎత్తుననుండునట్లు ఈచెట్లనునరకవలెను. లేనిచో మొండెములు కుళ్లిపోవును.

మిక్కిలి ముదురు చెట్లను ముసలిచెట్లను నరికిన మొదలవానినుండి క్రొత్తమొక్కలంతగా వృద్ధికావు. కాబట్టి సామాన్యముగా 8 అంగుళముల కంటె హెచ్చుగ మధ్య కొలతగల చెట్ల మొదళ్లను చిగుర్చు నుద్దేశముతో మొదలంట నరకకూడదు.

మొదలంట నరికిన చెట్ల మొండెముల నుండి అనేక మొక్కలుపుట్టును. ఇందేదో బలమైనదాని నొకదానినుంచి తక్కిన వానిని క్రమముగా చంపివేయుదురు. ఇట్లు మిగిలిన చెట్టు విత్తనమునుండి పుట్టిన చెట్టు కంటె వేగముగ పెరుగునని చెప్పియుంటిమి.

తుప్పనరకుట, గింజనాటుట. ఒకానొక అడవిలో తుక్కును, పొదలును అధికముగా పెరుగుచు విలువగల చెట్లను పెరగనీయకుండ చేయు-

యుండవచ్చును. అట్టి అడవులలో నేల నంటియున్న తుప్పలను కొంతవరకు నరికివేసి అవసరమైన చోట్ల విలువగల టేకు మొదలగు చెట్ల విత్తనములను తగిన తరుణములో నాటవలెను. అడవి విస్తారముగ నుండి నాటుట కసాధ్యముగా నున్న యెడల విత్తనములను అక్కడక్కడ నొక్కొకటి చల్లవలెను. కాని ఇట్లు చల్లిన గింజలనేకములు మొలవవు. కొన్నిటిని ఎలుకలు తినివేయును. కొన్ని తగిన వానలు లేక యెండిపోవును.

కొన్ని అడవులలో నెల లేని కొన్ని చెట్లు ఎత్తుగా చిక్కగా పెరిగి నేలమీద నీడ హెచ్చయి తగినంత వెలుతురు లేకపోయిన యెడల వెల గల చెట్లు పెరుగకపోవచ్చును. లేతే చెట్లు అడవిలో నొత్తుగా నొకదానిపైనొకటి యున్న యెడల చెట్లు సన్నబారి పోవుచుండ వచ్చును. ఇట్టి

పలుచన జేయుట.

చోట్ల కొన్ని కొమ్మలనుగాని, కొన్ని చెట్లను గాని నరికి అడవిని పలుచన జేసి ఎండయును తుగును నేలకు జేరనీయవలెను.

ఇట్లు పలుచన చేయునప్పుడు కొన్ని చోట్ల చెట్లను పూర్తిగా కొట్టి వేయరు. ఏయే చెట్లను

వడ్డాణము నరుకుట.

కొట్టివేయవలెనో వానిని నిర్ధారణచేసి వానికి గుర్తులు వేయుదురు. పిమ్మట ఆచెట్ల మొదట చెట్టుచుట్టును వడ్డాణమువలె చేవవరకు కాటు పెట్టుదురు. ఇట్లు కొట్టిన చెట్లకు తగినంత ఆహారము వేళ్లనుండి కొమ్మలకు ప్రవహింపక పోవుటచేత చెట్టు క్రమముగా చచ్చిపోవును. ఒకానొకప్పుడు చెట్టిట్లు చచ్చుటకు రెండు సంవత్సరములు పట్టును. కొట్టిన చెట్లు నేలమీద చెత్తలో పడియున్న యెడల అగ్నిభయము హెచ్చుగనుండును. వడ్డాణమునరికిన చెట్లు నిలువబడియున్నంతకాల మంతగా అగ్ని వలనియుపద్రవముండదు. బర్మాదేశములో కూడ టేకుచెట్లకిట్లు వడ్డాణము నరుకుదురు. * ఈచెట్లు క్రమముగ రెండుసంవత్సరములలో చచ్చి ఎండిపోయి చెట్టుకొట్టునప్పటికి మిక్కిలి తేలికయయి నీటిమీద రవాణా చేయుటకు అనుకూలముగనుండును కాని ఇట్లు నెమ్మదిగా చచ్చుటచేత చెట్టులోనుండెడు చమురు హరించిపోయి టేకుయొక్క విలువ తగ్గిపోవును. ఇందుచేతనే బర్మా టేకుకంటె మలబారు టేకు మంచిదని చెప్పుదురు. వడ్డాణము నరుకుటవలన ఎండిన చెట్లు అడవిలో నెక్కువగానున్నప్పుడు అడవికి అగ్నిభయము హెచ్చుగా నుండుననియు, ఎప్పటిచెట్లనప్పుడు కొట్టగనే అడవిలో నుండి తీసివేయునెడల మంచిదనియు కొందరి యభిప్రాయము.

కొన్నిచోట్ల చెట్లమీద తీగెలు అల్లిబిల్లిగ నలుముకొని తల్లిచెట్లను పెరుగ నియ్యవు. కొన్ని

తీగెలను చంపుట.

చోట్ల బదనికలు అనగా చెట్లమీదనే పుట్టిన

* పచ్చి కర్రలను నీటిమీద రవాణాచేయుటకు మిక్కిలి బరువైనయెడల కొన్ని వెదుళ్లను జేర్చి తెప్పకట్టిన తేలికగాపోవును. కాబట్టి టేకుచెట్లకీ రాజధానిలో వడ్డాణము నరకరు.

తీగెలును, ఇతరచెట్లును, తల్లిచెట్లు యొక్క బలమునంతయు పీల్చివేసి దానిని కృశింప జేయును. ఇట్టి తీగెలను, బదనికెలను చంపి వేయవలెను. కాబట్టి ప్రాతఅడవుల వలన శాశ్వతము లాభము వచ్చునట్లు జేయుటకు 1. పనికిరానిచెట్లను నరికివేయుట, 2. మొదలంట నరుకుట 3. తుప్పనరకుట 4. గింజ నాటుట 5. పలచనజేయుట 6. వడ్డాణము నరుకుట 7. తీగెలను చంపుట ఇవి యేడును ముఖ్యమైన పనులు.

క్రొత్త అడవులను పెంచుట.

ఈరాజధానిలో 1914 సం॥ రములో 2,02,097 ఎకరముల నేలయందు క్రొత్త అడవులను పెంచి యున్నారు. హిందూ దేశములో బర్మాతప్ప తక్కిన రాజధానుల యందుకంటె ఈ రాజధానియందే ఇట్టిఅడవుల పెంపుహెచ్చుగ జరుగుచున్నది.

పెంపుడు అడవులు.

తగిననేలయు, వర్షమును గలిగి మనకు కావలసినచెట్లులేని అడవులలో మనము క్రొత్త చెట్లను పెంచవలసి వచ్చును. ఇట్లు పెంచిన అడవులలో మలబారులోని నిలాంబూరు టేకు అడవులు మిక్కిలి పురాతనమైనవి. 1840 సం॥ రములో అప్పటి మలబారు కలెక్టరు వీనిని పాతించుటకుప్రారంభించెను. 4200 ఎకరముల నేలలో నీపెంపుడు టేకు అడవులవు. ఈ అడవుల మీద 1894 సం॥ రమునాటికి $10\frac{1}{2}$ లక్షల రూపాయలు ఖర్చు అయియుండెను. అప్పటికి ఆయడవిమీద ఖర్చుపడిన సొమ్మంతయు తిరిగి జమ వచ్చెను. ఈ అడవికి పూర్ణమైన వయస్సు అనగా 95 సం॥ రముల వయస్సు వచ్చు వరకు సం॥ రము ఒక్కంటికి అడవిమీద 5 లక్షల రూపాయల లాభము రాగలదని ఫారెష్టు అధికారములు లెక్కించియున్నారు. అనగా సంవత్సరమునకు ఎకరమునకు 100 రూపాయలకు పైగా లాభమేర్పడియున్నది.

బర్మా దేశములోకూడ పెంచిన టేకు అడవులు మిక్కిలి హెచ్చుగ నున్నవి. అక్కడి రయితులకుకూడ అడవి నేలను మార్చి మార్చి వ్యవసాయము చేయు అధికారముగలదు. కాని వారు వ్యవసాయము చేయు భూమిలో తాము చల్లుపైరు విత్తనములతో పాటు టేకు విత్తనములను చల్లి ఆ చెట్లుచక్కగ పెరుగునట్లు వారు చూచుకొనుచుండు షరతుతో వారికానేల లియ్యబడును. అడవి పెరిగినపుడు వారా నేలలనువిడిచి క్రొత్త నేలలకు వ్యవసాయమునకుబోవుదురు. ఈరాజధానిలో కొన్ని జిల్లాలలోకూడ నిప్పుడీపద్ధతి ప్రకారముకొన్ని అడవులను పెంచుచున్నారు.

ఒక ప్రదేశములో చెట్లు వృద్ధికావలెననిన సాధారణముగా ఆ ప్రదేశము లోనికి మనిషినిగాని జంతువునుగాని పోనియ్యకుండ కాపుదలచేయుచు అగ్ని భయము లేకుండ జూచుకొనిన యెడల అడవి తానే పెరిగి పోవును. 1878 సంవత్సరములోని కరవులకు

జననష్టముచే పాడుపడిన గ్రామము లుండు ప్రదేశము లనేకములు కడప, బళ్లారి ప్రాంతములయందిప్పుడు దట్టమైన అడవులతో నిండియున్నవి. గహనమైనయడవిమధ్యనుండు దేవాలయములు, చింతలు మామిళ్లు మొదలగు పెంపుడు చెట్లు, పాటిసేలలు వీనివలన ఈ ప్రదేశములు గుర్తింప నగును. ఇవిగాక, రాజకీయ సంబంధమైనకారణములచే ప్రజలు తమతమ గ్రామములు విడిచి పోవలసి వచ్చిన కొన్నిచోట్ల దట్టమైన అడవులిప్పుడు అల్లుకొని యున్నవి. పూర్వ మొకప్పుడు జగత్ప్రసిద్ధమైన విజయనగర సామ్రాజ్య వైభవములను సాటించు హంపీలోని పురాతనపు కట్టడములు ఇప్పుడు అరణ్య మధ్యమున గన నగును. వీనిని బట్టి మానవుని సంపర్కము లేనిచో ఈ హిందూదేశమున అడవి తనంతట తానే పెరుగ గలదనిస్పష్టముగ చెప్పనగును. కాని ఇట్లు సహజ వృద్ధిగల అడవులలో టేకు మొదలగు విలువగలచెట్లు మిక్కిలి నెమ్మదిగ వ్యాపించును.

టేకు అడవులు.

ఒక తల్లి టేకుచెట్టునుండిపడిన గింజ తల్లిచెట్టునువీడి విస్తారముదూరముపోజాలదు. ఈ గింజ బరువైనదగుటచే తినుటకుపక్షులయిననుదీనిని దూరమున కెత్తుకొనిపోవు. ఎలుకలు, ఉడతలుమాత్రము కొంతదూరమెత్తుకొనిపోయి పడవేయవచ్చును. కానివీనినోటబడినగింజలు చాలభాగము మొలవనేరవు. ఇందుచేత టేకు అడవుల్లను మనము పెంచవలెననిన మనము టేకువిత్తనములను అడవిలో నాటవలెను. లేదా మొక్కలను పాతవలెను. గింజలను మనము విచ్చలవిడిగ చల్లినయెడల అందులో పదింటతొమ్మిది గింజలు మొలవవు. కాబట్టి మనము వేయదలచిన గింజలను మే, జూను, నెలలలో నొక వర్షదినమున గోరువెచ్చని నీళ్లలో 24 గంటలకాలము నానబెట్టవలెను. పిమ్మట ఈగింజల నొక పోగుగాపోసి ఆపోగును తడిఇసకతో మూసిపెట్టవలెను. అంతట ఈగింజలు మొలకలెత్తును. ఇంతకు పూర్వమే అడవిలో ఆరు అడుగులకొకటి చొప్పున గెడ్డపారతో ఆరు అంగుళములు లోతుగల దోలకలనుచేసి యుంచవలెను. ఈ దోలకలలో అయిదంగుళములవరకు మట్టి వేసిపూడ్చి పిమ్మట మొలకయెత్తిన గింజను పెట్టి దానిపైని తిరిగి మట్టితో పూడ్చివేయవలెను. ఇట్లు ఒక్క ఎకరమునకు రమారమి వేయిచెట్లు వేయవచ్చును. ఇదివరకేచెట్లున్న చోట వాని నీడలో మొలకలువేయకూడదు. ఈ మొక్కలు పెరుగుచురాగా 10 లేక 12 సంవత్సరములలోపల వీనిలో నాదారు చెట్ల నన్నిటిని కొట్టివేయవలెను. మొట్టమొదట ఒత్తుగాపాతిపెట్టుటచే చెట్లువంకరటింకరలుగా పోకుండ నిలువుగా పెరుగును. ప్రక్కలకు పెరుగు చిన్నకొమ్మలను చిటికినవ్రేలులావు కాక పూర్వమే మొదటినుండి అంగుళము దూరములోకోసివేయవలెను. ఇట్లు కోయుట చేత కూడ చెట్లు నిలువుగా పెరిగిపోవును.

టేకు. కర్రకు వంకరలున్న కొలది వెలతగ్గి పోవును. పైనిజెప్పినట్లు మొదట ఒత్తుగపాతి పిమ్మట ప్రక్క కొమ్మలను శ్రద్ధగ కోసివేసిన యెడల. మంచి నేలలో టేకుచెట్టును ఒక్క కొమ్మయినను లేకుండ 60 లేక 70 అడుగుల ఎత్తువరకును పెంచవచ్చును. కాని చెట్లు కొంతవరకు పెరిగిన తరువాత ఒత్తుగానున్నయెడల వానికి తగినంత వెలుతురు చాలక చక్కగా పెరుగవు. కాబట్టి చక్కగ తెలిసినవారలు ఏయే చెట్లను కొట్టవలెనో యోచించి నాదారువాటిని జబ్బువాటిని కొట్టివేసి మిగిలినవి పెరుగుటకు తగినసదుపాయములు చేయవలెను.

టేకుచెట్లు సామాన్యమైన నేలలలో ఏడాదికి ఒకఘన అడుగు సాఫయిన కర్రనిచ్చును. నిలంబూరు పెంపుడు అడవులలో కొన్నిచోట్ల చెట్లు ఒక్కొంటికి ఏటేట రెండు ఘనఅడుగులకంటె ఎక్కువగా తేలుచున్నది.

ఎకరము నేలలో టేకుఅడవివేయుటకు అగు ఖర్చును దానివలనవచ్చు రాబడియు తెలియజేయుపట్టీనిక్రింద జేర్చియున్నాము.

దానిని పట్టిచూడగా 10 సంవత్సరముల లోపల అడవిమీద ఖర్చుపరచిన సొమ్మంతయు వడ్డీసహా వచ్చివేయు నని తెలియగలదు. 10 సంవత్సరముల పిమ్మట సామాన్యముగ ఎకరము 1-కి సం॥రమునకు 3 రూపాయలకంటె యెక్కువఖర్చు కాదు. కాబట్టి అడవి 100 సంవత్సరములు వరకు పెరుగునని తలచినయెడల మొదటి 10 సంవత్సరములుపోగా మిగిలిన 90 సంవత్సరములకు ఎకరాకు 270 రూపాయలు ఖర్చుఅగును. అప్పటికి ఎకరానేలలో కొట్టనవికొట్టగా చచ్చినవి చావగా 40 చెట్లు నిలిచియుండునని చెప్పవచ్చును. 90 సంవత్సరముల లోపలకొట్టిన చెట్లవలన వచ్చురాబడి ఖర్చులు పోగా 2000 రూపాయలకుతక్కువయుండదు. కడపటి ఫలసాయము చెట్టు 1-కి సగటున నూరేండ్లకు 80 చ. అ. లెక్క ప్రకారము లెక్కవేసినను 40 చెట్లకు 3200 ఘ. అడుగులకలప రావచ్చును. ఈకలప ఘ. అడుగు 1-కి 2 రు చొప్పునలెక్క వేసినను 6400 రూపాయలు జమ రాగలదు. కావున మొత్తముమీద ఎకరా అడవికి నికరాదాయము 6400+1200=8400 రూపాయలువచ్చును. అనగా సంవత్సరము 1-కి $\frac{8400}{100}=84$ రూపాయలుకంటె తక్కువగాకుండ రాబడి వచ్చునని చెప్పవచ్చును.*

టేకు చెట్ల వృద్ధి కనుకూలమగు నేలలు స్థితిగతులు.

నీటిముంపులేని నేల లెట్టివైనను తగినట్లు వర్షములు కురియు ప్రదేశములలో టేకు యొక్క పెంపునకు త్తమమైనవి. వేసవికాలాంతమున అధిక వర్షములు కురిసెడు మలబారు మొదలగు దేశములీ చెట్లవృద్ధికి మిక్కిలి ప్రసిద్ధమైనవి. ఉత్తర హిందూదేశమున 25 డిగ్రీలవరకు టేకు అడవులుగలవు, 75డిగ్రీలు మొదలు 81

* ఈలెక్కలు బోర్డుఆఫ్ రివిన్యూ ఫారెస్టు నెం. 258 తే 10-6-96 ప్రొసీడింగ్సు ననుసరించి వ్రాయబడినవి.

సీలాంబూరు, ఫారెస్టు, డిప్టికాన్సర్వేటరు జే. ఫర్గూసన్ గారివలన తయారు చేయబడిన టేకు అడవుల జమా ఖర్చు పట్టీ.

ఒకయకరము అడవిని పెంచుటకు జమాఖర్చు.

				రూ.		
చెట్లు కొట్టుటకు పూర్వము తుప్పు నరకుటకు	...	...	రూ.	2	0	0
చెట్లుకొట్టుటకు	...	...	...	5	0	0
కాల్చుటకు	...	...	...	0	4	0
కాల్చినమోళ్లు నరకుటకు	...	...	...	3	8	0
గుట్టపేర్చికాల్చుటకు	...	...	...	10	0	0
గుస్తులుపెట్టి గుంటలు త్రొవ్వుటకు	...	...	...	3	8	0
మొక్కలు నాటుటకు	...	...	...	2	8	0
రెండవకలుపుతీత	...	...	...	1	4	0
మూడవకలుపుతీత	...	...	...	1	4	0
నాలుగవకలుపుతీత	...	...	...	1	4	0
టేకువిత్తనము (2పరలు)	...	...	...	0	8	0
దున్ని మడిచేయుటకు	...	...	...	3	0	0
ఇతర ఖర్చులు	...	...	...	2	0	0
మొత్తము.	...	...	...	36	0	0

తరువాత ప్రతి సంవత్సరమునకు ఎకరా 1-కి.

	రెండవ సంవత్సరము.			మూడవ సంవత్సరము.			నాలుగవసంవత్సరము.			ఐదవసంవత్సరము.			ఆరవసంవత్సరము.		
మొదటివ కలుపు తీతకు ...	2	8	0	1	8	0	1	0	0	0	12	0	0	12	0
రెండవ కలుపు ,, ...	2	8	0	2	4	0	0	12	0	1	4	0	1	4	0
మూడవ కలుపు ,, ...	2	8	0	2	0	0	1	4	0	1	0	0			
నాలుగవ కలుపు ,, ...	2	8	0												
కొమ్మనరుకుటకు ,, ...	0	4	0	0	8	0	0	8	0	0	12	0	0	12	0
మొత్తము ...	10	4	0	6	4	0	3	8	0	3	12	0	2	12	0

మొదటి పదిసంవత్సరములలోపల ఒక ఎకరా టేకు అడవివలన ఆదాయ వ్రయములు తెలుపు జాబితా.

		రూ.	అ.	పై.			రూ.	అ.	పై.
1. సంవత్సరము.	ఖర్చు.	36	0	0	తప్పనరుకుటవలన	జమ.	36	0	0
2. ,,	,,	9	4	0					
3. ,,	,,	6	8	0					
4. ,,	,,	5	12	0					
5. ,,	,,	4	4	0					
6. ,, మొదలు 10 సం॥ వరకు		16	8	0					
	మొత్తము.	78	4	0	300 కర్రలు 1-కి 8 అణాలవంతున		150	0	0
11 సం॥	,,	3	0	0					
నరుకుటకు	,,	2	0	0					
300 చెట్లు లాటువేయుటకు	,,	7	8	0					
తెప్పలేకబండిమీద చేరవేయుటకు		27	0	0					
	మొత్తము.	39	8	0					
	మెట్టువెరసి.	117	12	0		మొత్తము.	186	0	0

విస్తారల వేసవి ఈచెట్టుయొక్క వృద్ధికి మిక్కిలి అనుకూలము. 50 అంగుళములకంటె వర్షము ఎక్కువగాగలచోట్ల టేకుఅడవులు మిక్కిలి యభివృద్ధిజెందును. 30 అంగుళములలోపు గలనేలలలో టేకుఅడవులు పెరుగవు. నిలాంబూ ర్లోయ సముద్రపుమట్టము నందును, అనామలె కొండలలో 2500 అడుగుల ఎత్తునను వైనాడులో 3000 అడుగుల ఎత్తునను, కూడ టేకు చెట్లు చక్కగ పెరుగుచున్నవి. కాబట్టి సామాన్యమైన ఎత్తుగల నేలలలో టేకు పెరుగు నని చెప్పవచ్చును. కాని నేల బొత్తుగ బందగ నుండుచోట్ల టేకు బాగుగ పెరుగదు. టేకు చెట్లే ప్రత్యేకముగ నుండుచోట్ల కంటెచల్లని నీడనిచ్చు ఇతరచెట్లు కొన్ని వానికి సహాయ ముగ నున్న చోట్ల టేకుచెట్లు బాగుగ పెరుగునని తోచుచున్నది. ఒక టేకుచెట్లే యున్న అడవిలో వేసవి కాలములో అన్ని చెట్ల ఆకులు ఒకేసమయమున రాలిపోవుట వలన నేల కాలి చెట్లకు ఉడుకు ఎక్కువ కావచ్చును: అందుచేత ఆకులు రాలని ఇతర చెట్లున్న ఎడల వేసవి కాలములో కొంత వరకు టేకుచెట్లకు నీడ యుండును. అనేక రకముల నేలలలో టేకుచెట్లు పెరుగవచ్చును గాని దీని పెంపునకు నీటి ముంపు బొత్తుగ

పనికిరాదని చెప్పియుంటిమి. ఇతర చెట్లు మిక్కిలిచిక్కగనున్న చోట్లను, వెడ్డగు వట్టముగ నల్లుకొని యున్నచోట్లను తేకుఅభివృద్ధి కాదు. విస్తారము నీడగాని, పొదలుగాని, చిక్కని గడ్డిగాని తేకు మొక్కలు చిన్నవిగ నున్నపుడు వాని వృద్ధిని ఆటంక పరచును.

మంచి గంధపు అడవులు.

మైసూరును, మలబారును వీనికి పుట్టినిండ్లని చెప్ప వచ్చును. ఇవి రెండు మొదలు నాలుగు వేల అడుగుల ఎత్తుగల నేలలలో పెరుగును. ఈ అడవుల వలనసంవత్సరమునకు ఎకరాకు 282 రూపాయలు ఆదాయము రాగలదని ఫైకొకరు లెక్కపెట్టి యున్నారు.* బజారులో అమ్ము మంచిగంధపు చెక్కలలో తెల్లని చెక్కలు కొన్నియు, పసిమి వర్ణముగలవి కొన్నియు నుండును. అందు తెల్లనివి లేతకర్ర. పసిమి వర్ణముగలవి చెట్లమధ్యనుండు చేవకర్ర. సముద్రపు మట్టమునకుపై 3000 అడుగుల కంటె క్రిందిభాగములలో మంచి గంధపు తోటలను పెంచిన ఎడల ఆకర్రలలో సువాసన యుండదు. కాబట్టి మైసూరు మొదలగు కొన్ని దేశములనే దీని యభివృద్ధి హెచ్చుగ నున్నది.

యూకలిప్టసు చెట్ల అడవులు.

యూకలిప్టసు అను ఒక దేవదారు జాతి చెట్లను నీలగిరి కొండలలో అడవులుగా పెంచుచున్నారు. ఈ చెట్లు 7000 అడుగుల ఎత్తుమీద చక్కగ పెరుగును. ఈ అడవుల వలన ఎకరమునకు 273 రూపాయల చొప్పున రాబడి రాగలదని ఫైకొకరు వ్రాసియున్నారు.* ఈ చెట్లకర్రకు సులభముగ చెదలు పట్టుటచేత చెదలువలని భయములేని నీలగిరి వంటి మిక్కిలి చలిప్రదేశములలోతప్ప ఈ కర్రయొక్క ఉపయోగమంతగ మనకు లేదు. దీని ఆకులనుండి ఔషధముల కుపయోగించు నొకవిధమైన తైలమును తీయుదురు.

సరుగు అడవులు తుమ్మ అడవులు.

క్యాజురీనా, లేక, చౌక చెట్లు. వీనినికొందరు సరుగు చెట్లందురు. ఇవి, సముద్ర తీరమునందలి ఇసుక పర్రలలో చక్కగ పెరుగును. ఈ అడవుల వలన సంవత్సరమునకు ఎకరము ఒక్కంటికి 3-12-9 ఆదాయము వచ్చునని ఈ క్రిందిపట్టీవలన తెలియగలదు. బందలలో తుమ్మ అడవులవలన నాలునకు ఎకరమునకు 48 రూపాయలు వచ్చునని ఫైకొకరు లెక్కించియున్నారు*. కాబట్టి అడవులను పెంచ దలచువారు ఆయాస్థలములనుబట్టి ఏయేజాతి చెట్లను ఎక్కడ పెంచిన లాభమో తగిన అడవిశాస్త్రజ్ఞులనుండి తెలిసికొన నగును.

ఎకరము నేలలో సరుగుచెట్లు పెంచుటకు అయ్యే జమాఖర్చుల పట్టీ.

	రు—అ—పై.	
నారు పెంచుటకు	0—9—0	
గోతులు త్రవ్వుటకు	0—6—0	
మొక్కనాటుటకు	0—6—0	
ఘాతులకు	2—0—0	
		3—5—0

* Forestry in Southern India, by Morgan.

బ్రాటోవరు	3—5—0
2 నెలలు 600 చెట్లకు ప్రతి దినము నీరుపోయుట్కు కూలి 1-కి 1 దినమునకు 0—2—0 చొప్పున	6—12—0
మూడు నెలలుదినము విడిచి దినము నీళ్లుపోయుటకు	5—1—0
మూడు నెలలు మూడు దినముల కొకసారి నీళ్లుపోయుటకు	3—6—0
మొదటి సం॥ కు అగుఖర్చు మొత్తము.	15—3—0
రెండవ సంవత్సరము మూడు దినములకు 1 సారి ఆరు నెలలు నీరుపోయుటకు	6—12—0
మూడవసంవత్సరము మూడు దినములకొకసారి నాలుగు నెలలు నీరుపోయుటకు	4—8—0
మొత్తము	29—12—0
100 కి 10 చొప్పున ఇతర ఖర్చులు	3—4—0
మొత్తము ఖర్చు.	33—0—0

10 సంవత్సరములకు సామాన్యముగా 1 సం॥ రమునకు 40 టన్నులు వంట చెరుకు తయారగును. చెట్లుకొట్టుటకు, జేరవేయుటకు అగు ఖర్చులుపోగా టన్ను 1-కి రు 3-0-0 వెలవేసి కొన్నను 40 టన్నులకు రు 120-0-0

ఇందులో పెంపకపు ఖర్చు	33-0-0
వడ్డీ నూటికి 5 వంతున 10 సం॥ లకు	16-0-0
పైతన్కీదార్ల ఖర్చు 100 కి రు 10 చొప్పున 10 సంవత్సర ములకు	33-0-0
మొత్తము రు.	82-0-0

పోగా 38-0-0 నికరము ఆదాయమువచ్చును. అనగా సంవత్సరమునకు ఎకరము1-కి 3-12-9 నికరాదాయము వచ్చునని చెప్పవచ్చును.

పైని జెప్పినవిగాకగృహోపకరణముల కుపయోగపడు అడవికర్రలపట్టీ నొకదాని 2-వ అనుబంధముగా జేర్చియున్నాము.

సర్కారు అడవులలో నితరులు కొట్ట కూడని చెట్లయొక్క జాబితాయును, సొమ్మిచ్చి కొట్టుకొనిపోతగిన చెట్లజాబితాయును, గోదావరి కృష్ణా జిల్లాలలో అడవి ఫలసాయమును విక్రయించు వెలలను తెలియజేయు పట్టీలను 3-4 అనుబంధములుగా జేర్చియున్నాము.

అడవిలోనుండు కొన్ని పక్షులు పురుగులను తిని చెట్ల కుపకారముచేయును. అట్టిపక్షులను వేటకాండ్రు చంపకుండ సర్కారువారు కాపాడుదురు. ఇట్లుచంపకూడనిపక్షుల జాబితా నీక్రింద ఇచ్చియున్నాము.

చంప కూడని అడవిపక్షులు.

వానకోవిల	ఏటిఇన్క
లకుముకిపక్షి	పిగిలిపిట్ట
కప్పపిట్ట	పొన్నంగి పిట్ట
పసిరికిపిట్ట	చిన్న చింద
పాలపిట్ట	గెంటపిట్ట (బుల్ బుల్)
మానుతొలచి	చింద
కోకిల	అడవికంపజిత్త
కొండపిట్ట	నంబుడిగాడు
చెల్లంచి	

అడవులలో నివసించు క్రూర జంతువుల గూర్చి సంగ్రహముగనైన నిక్కడ వ్రాయుట యవసరమని తలచి గతసంవత్సరములో ఈ రాజధానిలో అడవి జంతువులవలన కలిగిన హానిని తెలుపుపట్టీ నీక్రింద జేర్చియున్నాము.

ఈరాజధానిలో 1914 సం॥ రములో అడవిమృగములవలన చంపబడిన జనసంఖ్య, పశువులసంఖ్య తెలుపు జాబితా.*

	ఏనుగులు.	పెద్దపులులు.	చిరుతలు	ఎలుగులు.	తోడేళ్ళు.	హైనాలు.	ఇతరమృగములు.	మొత్తము	పాములు.	మొత్తము
చచ్చినజనులు ...	1	156	115	18	5	11	43	349	1,514	1,863
చచ్చిన జంతువులు ...	...	2,290	9,079	18	80	16	92	11,575	1,712	13,287

ఈ వ్యాసములో నింతవరకే గ్రంథము పెరిగిపోయినది. వ్రాయవలసిన విషయము లింకను అనేకములు అగాధములుగా నున్నవి. వ్రాయవలయునను నుత్సాహము హెచ్చుగ నున్నను వ్రాయుటకిక్కడ ఎడము చాలదు. కాబట్టి నూతనవిషయములను తెలిసికొనగోరు వారీక్రింద నుదహరించిన 5-వ అనుబంధము లోని గ్రంథములను చదువుకొనవలెను.

[ఆ. ల.]

1-వ అనుబంధము.

ఇంపీరియల్ ఫారెస్టు సర్వీసు.

ఇండియా గవర్నమెంటు సెక్రిటరీ ఆఫ్ స్టేటువారు అప్పుడప్పుడు ప్రచురము చేయు నిబంధనల ననుసరించి ఈ ఉద్యోగస్థులనువిర్పరతురు. (ఇంపీరియల్ ఫారెస్టు సర్వీసు.) ఈ ఫారెస్టు సర్వీసునకు కొత్తగ పనులునేర్పుటకు నెన్నబడునట్టివారలకు నియమములు 1912 సం॥ అక్టోబరు 8 తేదిగల ఫోర్టు సెంటు జార్జిగజిటీ 1 భాగము సప్లిమెంటులో 1 మొదలు 7, వ పేజీవరకు ప్రచురింప బడియున్నవి.

అందులో ముఖ్యమైనవి:—

1. విద్యార్థులు 19 సం॥ ల వయస్సునకు లోబడియు 22-కు మించియు నుండకూడదు.

2. ప్రకృతి శాస్త్రములో నేదైన నొక దాని నెక్కువగ నేర్చి, యుండవలెను.

3. జర్మను భాషగాని, ఫ్రెంచిభాషగాని దెలిసి యుండవలెను.

4. కావలెసిన వారికంటె అధికముగ విద్యార్థులున్న యెడల వారిలో పోటాపోటీగా నొక పరీక్ష శివిల్ సర్వీసు కమిషనర్లు చేయుదురు.

5. సామాన్యముగా వీరికి రెండు సంవత్సరములు ఆక్సుఫర్డులోగాని, కేంబ్రిడ్జి లోగాని, ఎడింబరులోగాని విద్య నేర్పుదురు.

6. అనుభవము కొరకు సెలవు కాలములో ఐరోపాలోని అడవులలో త్రిప్పి విద్య గఱపుదురు.

*G. O. No, 989, dated 27th April 1915.

7. అడవి విద్య యందును, మరేదేని అప్పటికి నిర్ణయమైన ఇతర పాండిత్యమునందును పట్టము నిచ్చెదరు. ఇండియాలోని అడవి ఉద్యోగములలో అట్టివారికి అసిస్టెంటు కాన్సర్వేటరు పని నిచ్చెదరు.

8. వీరికి ఇండియా దేశమునకు వచ్చిననాటి నుండి జీతము నెల1-కి 380 రూపాయలుఇచ్చి, మద్రాసు ఫారెస్టుకోడ్ 9-వ అనుబంధములో ప్రకటించినట్లు ఈదేశ భాషల నేర్చుకొనుట కును, ఈదేశపుటడవుల విషయము బోధచేసి కొనుటకును, ఇచ్చటి రివిన్యూ విషయములు తెలిసికొనుటకును, ఆఫీసుపనులు, లెక్కలు వగైరాలు తెలిసికొనుటకును ఒక సంవత్సరము గడువిత్తురు.

మద్రాసు ఫారెస్టు కోడు 12-వ అనుబంధములో వీరికి తెలియగల దేశభాషలవివరమును ప్రకటించి యున్నారు.

ఈ రాజధానిలో నీక్రింద వివరించిన ప్రకారము ఇంపీరియల్ ఫారెస్టు ఉద్యోగస్తుల కుద్యోగములును జీతములును, ఏర్పడి యున్నవి.

1. అసిస్టెంటు కాన్సర్వేటరు.

రు 380-540. సం॥ రమునకు 40. వంతున వృద్ధి.

2. డిపిటీ కాన్సర్వేటరు.

రు 580-850. సం॥ రమునకు 40 వంతున వృద్ధి. తరువాత 50 వంతున 1250 వరకువృద్ధి.

3. కాన్సర్వేటరు:—

1. వ గ్రేడు 1500 రూపాయలు.

2. వ గ్రేడు 1700 రూపాయలు.

3. వ గ్రేడు 1900 రూపాయలు.

ప్రావిన్షియల్ ఫారెస్టు సర్విసు.

(a) డేరాడూనులో పరిశోధన విషయమై ప్రావిన్షియల్ ఫారె యేర్పడిన కళాశాలలో స్టుసర్విసు పూర్తిగా తేరిన వారిని,

(b) రేంజర్ల పదవినుండి రాదగినవారిని, ఈ ఉద్యోగముల కేర్పరుతురు.

2. ఉద్యోగస్థులు కావలసిన యవసరమునుబట్టి ప్రతి సంవత్సరము సెప్టంబరు నెలలో కొంతమందిని, ఫారెస్టు కమిషనరును మరియొకబోర్డు మెంబరును, మధ్యఖండపు కాన్సర్వేటరును చేరి చక్కని దేహారోగ్యమును, విద్యార్థిదశలో చక్కని నడ నడికయుగల పిన్నవారి నేర్పరుతురు. ప్రకృతి శాస్త్రముల పరిచయము ముఖ్యముగ గను నింతురు. ఇంగ్లీషునందును గణితమునందును చక్కని పరిశ్రమ గలవారుగా నుండవలెను. వీరిని రివిన్యూబోర్డువారు ఏర్పరచి జిల్లాల అడవి యుద్యోగస్తుల యభిప్రాయమునకు పంపుదురు.

3. దిగువ 6-వ కలములో నుదహరించిన ప్రకారము విద్యయందును, దేహాపటుత్వమునందును తగినపరీక్షల తేరవలయును.

4. వీరు 18 సంవత్సరములకులోబడిగాని 25 కు మించిగాని యుండకూడదు.

5. కాలేజిలో చేర్చుకొనుటకు పూర్వము 1 సంవత్సరము డిస్ట్రిక్టు ఫారెస్టు ఆఫీసరువద్ద తరిఫీయతు కావలెను. అప్పుడు వీరికి రూ. 40 జీతమును రూ. 20 ప్రయాణపు ఖర్చులకును ఇచ్చెదరు. తరిఫీయతు సమయములో

తృప్తిగా పని చేయనియెడల వీరిని త్రోసి వేయుదురు.

6. డేరాడూనుకు పోకమునుపే వీరిని దేహదారుఢ్యము, ఇంగ్లీషు, గణితములందు పరీక్ష చేయుదురు.

అచ్చట నేర్పు అడవివిద్యను బోధ చేసికొనునంత ఇంగ్లీషు, గణితపరిచయ మవసరము.

7. డేరాడూను పోవుటకుముందు 4000 రూపాయలకు, ఇద్దరినలనో జామీనును, 5 సంవత్సరములు పనిచేయుటకు ఒడంబడికయు నియ్యవలెను. ఈ జామీనుదార్లు ఇండియాం కాపురస్థులుగను ఇండియాలో ఆస్థిగలవారుగ నుండవలెను.

8. వీరికి డేరాడూనులో విద్య నేర్చుకొను కాలములో రైలు, ఓడ ప్రయాణపు ఖర్చులుగాక నెల 1-కి 80 రూపాయలను ఉచితముగా నిచ్చెదరు. పరీక్షయి మదరాసునకు రాగానే వారికికావలసిన దుస్తులు మొదలగు వాలు తీసికొనుటకు రు 480 లు ఇచ్చెదరు. డేరాడూనుకుపోయి కాలేజిలో చేరుటకును పరీక్షలో కృతార్థులైన పిదప తిరిగి వచ్చి చేరుటకును ప్రయాణపు ఖర్చులు శి. స. రెగ్యులేషన్ ప్రకార మిచ్చెదరు.

9. పరీక్షలో కృతార్థులుకాగానే వీరిని మొదట ప్రొబేషనరీ ఎక్స్ట్రా అసిస్టెంటు కాన్సర్వేటర్లుగా నియమింతురు. రెండు సంవత్సరములైన తరువాత క్రమముగాఖాళీలనుబట్టి ప్రావింషియల్ సర్వీసు పనులలో స్థిరముగా వీరిని నియమింతురు. ప్రొబేషనుకాలములో వీరికి జీతము రు 150 లు. అట్టి ప్రొబేషనులో రెండవ సంవత్సరముకూడ జరిగినయెడల 200 జీతము నిచ్చెదరు. ఈకాలములో వీరి స్వభాషగాక రెండవదేశభాషనుకూడ నేర్చుకొనిపరీక్షలో కృతార్థులు కావలయును.

10. 23 సంవత్సరముల వయస్సునకులోపల వీరికిస్థిరమైన ఉద్యోగము తేర్పడిన యెడల 23 వ సం॥ రము వయస్సు వచ్చువరకు వీరి యుద్యోగమే పెంషను కాలములో చేరదు.

11. చాలకాలము ఉద్యోగము చేసి, పేరుపొందిన రేంజర్లకు వేరేపరీక్షలు లేకయే ప్రావింషియల్ ఉద్యోగముల నిత్తురు.

12. ప్రోవిన్షియల్ సర్వీసు వారికిగాని రేంజర్లనుండి వచ్చినవారికిగాని ఎక్స్ట్రా అసిస్టెంటు కాన్సర్వేటరు పనులనిచ్చి నెల 1 కి 250 జీతమును, ప్రతి సంవత్సరము 20 వంతున 550 వరకు వృద్ధియును ఏర్పరచియున్నారు.

2-వ అనుబంధము.*

ఆంధ్రదేశమందు గృహోపకరణములు మొదలగువాని కుపయోగకరమగు అడవి వృక్షములు.

అందుగ—Boswellia serrata
అడవి గోరింట—Erythroxylon monogyum
అడవిమంగ—Randia uligniosa
అడవిమునగ—Limonia alata
అశోక—Polyalthia longifolia
ఇప్ప—Bassia latifolia

* G. O. నెం. 3142 తేది 3-11-1914 చూడు.

*ఇరుసు—Mesua ferrea (rare)
ఇషిరిషి—Erioglossum edule
ఉలిమిడి—(Craetava)religiosa
ఉసిరిక—Phyllanthus emblica
ఊడుగ—Alangium lamarckii
ఎర్రచందనము—Pterocarpus santalinus
ఎర్రజువ్వి—Ochna squarrosa
ఎల్లమద్ది—Anoguissus latifolia
ఏపి (నరేటి)—Hardwickia pinnata
కడమి—Barringtonia acutangula
కదంబ—Anthocephalus cadamba
కరక—Terminalia chebula
కరల్లి—Carallia integerrima
*కనకొ(కలిము)—Limenia americana
కలిగొట్టు—Stereospermum chelonoides
కాచు (కసిరి)—Acacia catechu
కానరేగు—Flacourtia ramoutchi
కాకరమ్మ—Atalantia monophylla
కొండ అడుగ—Aglia Roxburgbiana (rare)
కొండతంగేడు—Xylia dolabriformis
కొండనావిలి—Vitex leucoxylon
కొండవేప (మదుగ)—Chukrassia tabularis
కొండపాల—Ixora parviflora
కోడిశ—Cleistanthus collinus
గంగరావి—Thespesia populnea
గుండుగ—Casearia graveolens
గరుగ—Garuga Pinnata
గుంపెన—Odina wodier
గుమ్మడి—Gmelina arborea
గొట్టి—Ziziphus xylopyra
చంపకము—Michelia champaca
చారుమామిడి—Buchnania latifolia
చింత—Tamarindus indica
చిందుగ—Albizzia odoratissima
చినుమాను (కొడమద్ది)—Terminalia paniculata
చిలకదుద్దుగ—Polyalthia cerasoides
చీకరేణి—Albizzia amara
చిత్రిబిక్కి—Gardenia lucida
చేత్తిప్ప—Hymenodictyon excelsum
టేకు—Tectona grandis
తడ—Pterospermum suberiofolium
తాండ్ర—Terminalia belerica
తిల్ల—Excaecaeia agallocha
తుమ్మ—Acacia arabica
తుమికి—Diospryos melanoxylon
తురకవేప—Melia azedarach
* తూణు—Cedrela Tooua
తెల్లపాల—Wrightia tomentosa
తెల్లపుణికి—Givotia rottleviformis
తెల్ల విరుగుడు చేవ—Dalbergia lanceolaria
తొరెలగ—Limonia acidissima
దానిమ్మ—Punica granatum
దిరిసెన—Albizzia lebbek
దూదిప్పి—Careya arborea
నక్కరేణి (నల్లబలుసు)—Canthium didymum
నక్కరేగు—Artocarpus lakoocha
నల్లమద్ది—Terminalia tomentosa
నాగగోలుగు—Murraya exotica
నార్వొత్తు—Eirolaena condollei
నీటితుమికి—Diospyros ebenum
నీరిజ—Elaeodendron glaucum
నెమలి—Holoptereia integrifolia
పంతి—Gymnosporia poryleasa
పనస—Artocarpus integrifolia
పరిమి—Ziziphus atnoplia
పలపరేణి—Holarrhena antidysenterica
పల్లిగ—Tamarix gallica
పాలకరుడ—Alstonia scholaris
పాలరెంకి—Wrightia tinctor
పాసి—Anoguissus abirnenata

పుత్రజీవ—Putranjiva roxburghi
పురుగుడు—Dodonea viscosa
పెద్దబట్టు— Cordiamacliodii
పెద్దబిక్కి—Gardinia Catifolia
పెద్దమాను Ailanthus exelsa
*పైరు—Pleneostyla wightii
పొన్న—Calophyllum inophyllum
పొనికి—Gyrocarpus jacquini
పొలికి—Sterculia urons
బండారు—Adina cardifolia
బట్టగనపు—Stephegyne parvifolia
బాడిశ—Erythrina indica
బిల్లు (బిల్లుడు)—Chloroxylon switenia
బివ—Hemicyclia sepiaria
బుక్కపు—Caesalpinia sappan
బూసి—Schleichera trijuga
బొట్టుకూర—Cordia fulvosa
మంచిగంధము—Santalum album
మఱ్ఱి—Ficus bengalensis
మామిడి—Mangifera indica
మారేడు—Aegle marmelos
ముసిడి (ముష్టి)—Strychnos nuxvomica
మొక్కయేప(ముక్కడి)Schrebera swietenoides
రణబిళ్లి (పురుడొన)—Cipodessa fruticosa
రుద్రాక్ష—Guazuma tomentosa
రేగు—Zizephus jujuba
రేల—Cassia fistula
విరుగుడుచేవ—Dalbergia latifolia
వెన్తేకు—Legerstraemia lanceolata
వెలగ—Feronia elephantum
వేగిస—Pterocarpus marsupium
వేప—Melia azadirachata
సీమతంగేడు—Cassia saimea
సిస్సు—Dalbergia sissoo
సోమి—Soymida febrifuga

* అరవ పేర్లు.

3-వ అనుబంధము.

సర్కారు అడవులలో రిజర్వుడు అనగా కొట్టకూడని చెట్లు.†

1. తుమికి.
2. చందనము.
3. ఇప్టగి.
4. ఎఱ్ఱ చందనము.
5. వగి (వేగిస)
6. వవి.
7. కరక్కాయి.
8. చింత.
9. జల్లారి.
10. సాలువ.
11. తంబ.
12. ఇప్ప.
13. మామిడి.
14. పనస.
15. టేకి.
16. బిల్లు.
17. కొండతంగేడు.
18. కుంకుడు.
19. కాన్గుగ
20. చంద్ర.
21. అడవిజాజికాయ
22. *పుంగై.
23. *దాల్చిని.
24. ఇరుభోగం

† 1912 రపు ఫారెస్టు మాన్యుయల్ చూడు. * అరవ పేర్లు.

4-వ అనుబంధము.

సర్కారు అడవులలోనుండు చెట్లన్నియు రిజర్వుడు, క్లాసిఫైడు, అన్‌క్లాసిఫైడు అని మూడువిధములుగా విభజింపబడి యున్నవి. రిజర్వుడుచెట్లు అనగా నెవరును కొట్టకూడనివి. 3 వ అనుబంధమునందు క్లాసుసైజులనగా తరగతి విభాగము చేయబడి ఆయాజిల్లాలలో నియమితమగు ఖరీదునకు ప్రజలకు ఇచ్చునవి. ఇందు మూడు తరగతులున్నట్లుగా క్రిందిపట్టీవలన తెలియగలదు. అన్‌క్లాసిఫైడు అనగాతరగతి విభాగముకాని ఇతరచెట్లు. ఈజాతి చెట్లకు నిర్ణయమైన వెలలేదు.

గోదావరి కృష్ణాజిల్లాల అడవులలోని కలప మొదలగువానికి సర్కారు రేట్లు.

గోదావరి.	కృష్ణా.	
1వ క్లాసు.		
బండారు	తెల్లతుమ్మ	చెక్కినవి బండి 1-కి రూ. 5-0
చిరిమాను	తెల్లతుమ్మ	పలకలు తేర్చినవి ,, 7-8
బట్టగణప	బట్టగణప	నెత్తిమోత 0-4
చెనుగు	చిరిమాను	
తెల్లమద్ది	నెరేడు	
నల్లమద్ది	వెలగ	
నెమలి అడుగు	వేప	
	పగడ	
	పాల	
	సోమి	
	నల్లమద్ది	
2-వ క్లాసు.		
తుమ్మ	నల్లరేగు	చెక్కినవి బండి 1 కి రూ. 2-8
దిరిసెన	దిరిసెన	పలకలు తేర్చినవి ,, 3-12
చిందుగ	చిందుగ	నెత్తిమోత 0-2
నేరేడు	మద్ది	
వేప	రేల	
బూరుగ	జన	
ముషిడి	తడ	
	ముష్టి	
	చిల్ల	

3-వ క్లాసు.		గోదావరి. రూ.అ.పై.	కృష్ణా. రూ.అ.పై.
తాడి	చెట్టు 1-కి	2-8-0	2-8-0
ఈత	,,	1-0-0	1-0-0
తాటిఆకు.	1000-కి.	1-0-0	1-0-0
వంట చెఱకు (ఎండినదిమాత్రము)	బోటు టన్ 1-కి.	1-4-0	
	బండి 1-కి.	0-6-0	0-8-0
	ఎద్దుమోత	0-1-2	0-1-7
	గాడిదమోత	0-0-7	0-0-10
	నెత్తిమోత	0-0-3	0-0-3
బొగ్గు	బండి 1 కి	2-8-0	
	ఎద్దుమోత.	0-5-0	0-8-0
	గాడిదమోత	0-2-6	0-4-0
	నెత్తిమోత	0-1-3	0-2-0
లోహములు.			
చెక్కినరాయి.	బండి 1-కి.	0-1-0	0-1-0
చెక్కనిరాయి.	,,	0-2-0	0-2-0
కంకర.	,,	0-0-6	0-0-6
మన్ను.	,,	0-0-6	0-0-6
చిల్లర ఫలసాయము:			
తంగేడుపట్ట.	బండి1-కి.	1-8-0	1-8-0
	ఎద్దుమోత	0-5-0	0-5-0


2 నెత్తిమోపులు=1 గాడిదమోత.
2 గాడిదమోతలు=1 ఎద్దుమోత.
5 ఎద్దుమోతలు=1 బండి.
100 ఘనఅడుగులు=1 బోటు టన్ను.


ఈ వ్యాసము వ్రాయుటయందు పయోగపడిన పుస్తకముల జాబితా నీ క్రిందను దహరించియున్నాము. హెచ్చు విషయములు తెలిసికొన నభిలాష గలవారా గ్రంథములను చూచుకొన వచ్చును.

5-వ అనుబంధము.

గ్రంథము.	గ్రంథకర్త.
1 ఫారెస్ట్రీ ఇన్ బ్రిటిష్ ఇండియా.	బి. రిబ్బన్ ట్రాప్.
2. మాన్యుయల్ ఆఫ్ ఫారెస్ట్రీ (౫ సంపుటములు).	డబ్లియు. స్కిల్కు.
i. యుటిలిటీ ఆఫ్ ఫారెస్ట్సు అండు ఫండమెంటల్ ప్రిన్సిపిల్సు ఆఫ్ శిల్వికల్చర్.	
ii. ప్రాక్టికల్ శిల్వికల్చర్.	
iii. ఫారెస్టు మానెజ్మెంటు	
iv. ఫారెస్టు ప్రొటెక్షన్.	
v. ఫారెస్టు యుటిలైజేషన్.	
3. ఫారెస్టుఫ్లోరా ఆఫ్ ది స్కూల్ సర్కిల్, నార్తువెస్టుప్రావిన్సెసు.	ఉపేంద్రనాధ్ కంజీలాల్.
4. ఇండియన్ ట్రీస్.	సర్. డి. బ్రాండిసు.
5. ఫారెస్ట్రీ ఇన్ సదరన్ ఇండియా.	మార్గన్.
6. స్టాటిస్టిక్సు ఆఫ్ బ్రిటిష్ ఇండియా.	
7. శివిల్ యెస్టిమేట్సు.	
8. మదరాసురాజధాని ఫారెస్టుడిపార్టుమెంటు వారి ఆన్యుయల్ అడ్మినిస్ట్రేషన్ రిపోర్టు.	
9. మదరాసు రాజధానిలోని పబ్లికు సర్వీసు యెగ్జామినేషన్ రూల్సు యొక్క అభిప్రాయము.	
10. మాన్యుయల్ ఆఫ్ ఇండియన్ టింబర్సు.	జె. ఎస్. గ్యాంబెల్
11. మద్రాసు ఫారెస్టుఆక్టు.	
12. ఫ్లోరా ఆంధ్రికా.	ఎలియట్.
13. ఫ్లోరా శిలివటిక.	మేజర్ బెడ్డోం.
14. 1912 సం॥ ఫారెస్టు కమిటీవారి రిపోర్టు.	
15. ప్రిలిమినరీ లిస్టు ఆఫ్ వర్నాకులర్ నేమ్సు ఆఫ్ ఫారెస్టు ట్రీసు ష్రబ్సు అండ్ వుడి క్లైంబర్సు. మదరాసు రాజధాని.	
16. ది ఇంపీరియల్ గజటీర్ ఆఫ్ ఇండియా. 3-వ సంపుటము.	
17. ఎన్సైక్లోపీడియా బ్రిటానికా. ఫారెస్టుఅను వ్యాసము.	

1 పురప చెట్టు గోనకి తొల్చుకొనిపోవు విధము.





అడ్డతీగెల. గోదావరిజిల్లా ఎల్లవరం ఏజన్సీ డివిజనునకు ముఖ్యస్థలము. ఇదియొక చిన్నపల్లె. జనసంఖ్య 459. ఇచ్చట పోలీసు స్టేషను, రహదారి బంగళా, లోకల్ఫండు ఆసుపత్రియుం గలవు. ఇక్కడ వారమున కొకతూరి సంత జరుగుచున్నది. రంపయుద్ధములో నీగ్రామము ప్రఖ్యాతిగాంచినది. రంపపితూరీలకు నాయకుడయిన చంద్రయ్య మొట్టమొదట నిచ్చటి పోలీసుస్టేషనును ౧౮౭౯ వ సంవత్సరము ఏప్రిల్ మాసాంతమున తగులంబెట్టెను. ప్రభుత్వమువారు దీనిని వెంటనే మరమ్మతు చేయించి ఇందు పోలీసుసైన్యము నుంచిరి. కాని చంద్రయ్య మఱలజూన్ నెలలో ఈ గ్రామము మీఁదికివచ్చెను. ఆనెల ౧౨వ తేది ఒకయూరోపియను అధికారిని పోలీసువారిని గ్రామమునకు వెలుపల నెదుర్కొనగ వారు ౨౨ గంటలు తుపాకులతో యుద్ధముచేసి రక్షణార్థము పోలీసు స్టేషను లోనికిం జొచ్చిరి. తరువాత మూఁడు దినములు చంద్రయ్య ఆఠాణాను ముట్టడించెను. లోనిపోలీసువారు అగ్నిభయముచే నింటి పైకప్పును దీసివైచిరి. వారిసాహాయ్యార్థము వచ్చినభటులను చంద్రయ్య పాఱఁదోలెను. ఠాణాలోని భటులు ధైర్యముచేసి చంద్రయ్య మీఁదికుఱికి తాళలేక మఱల లోనికింజొచ్చిరి. అనేకస్థలములనుండి సిబ్బంది పోలీసువారికి సాయము రాఁగా చంద్రయ్య ఈ ఠాణాను వదలి పోయెను.

అడ్డసరపు కుటుంబము. అడ్డసరపు కుటుంబము కొంచెము పెద్ద కుటుంబములలో నొకటి. దీనిలో గుల్మములు, తీగెలు, గుబురుమొక్కలేగాని పెద్దవృక్షములులేవు. బురదనేలల బెరుగునవి రాతినేలలందును బెరుగునవి మొదలగు నన్నిరకములే కుటుంబమునఁగలవు. ఈమొక్కలు విశేషముగ నుష్ణప్రదేశములందు వర్ధిల్లును; కాని మధ్యధరాసముద్రతీరములు 'యునైటెడ్ స్టేట్సు' 'ఆస్ట్రేలియా' మొదలగు దేశములందుఁగూడ గలవు. ప్రపంచమందంతటను నూటముప్పది నాల్గుజాతులును బదునారువందల తెగలును గలవు. మన హిందూదేశమునందును బ్రిటిషుబర్మాదేశమునందును గలసి నలుబదియైదు జాతులును ఐదువందల పది తెగలునుగలవు.

ఈకుటుంబపు మొక్కలయాకులు:-అభిముఖచేరిక. లఘుపత్రములు. కణుపుపుచ్ఛము లుండవు. సమాంచలము. సాధారణముగఁ బలుచగనుండును. పుష్పమంజరులు:- సాధారణముగ మధ్యారంభమంజరులు, వ్యథాభిసారి మంజరులును గలుగుచుండును. చేటికలు ఉపచేటికలుతఱుచుగా నుండుచుండును. పుష్పము ఓష్ఠాకారముగనైనను, అసరాళముగనైనను నుండును. పుష్పకోశమును, దళవలయమును సంయుక్తములే. ఒక్కొకవలయమున నాలుగో ఐదో చేరియుండును. రెండో నాల్గో కింజల్కములున్నవి; తఱుచు పుష్పోష్ఠి తిత్తులలో నొకతమ్మి పెద్దదిగను రెండవది చిన్న

[illegible] నుండును. సంయోజకమ్ము పొడవు; వృన్తాకృతియుc బహువిధములుగ నున్నది. అండకోశమునందు త్రిపత్రములు రెండు. అండాశయము ఉచ్చము; రెండుగదులుగలది. ఒక్కొక్క గదియందు అండములు రెండు మొదలు అసంఖ్యములుగాcగూడ నుండును. స్తంభసంయోగము. కీలము పొడుగుగా నుండును. కీలాగ్రములు రెండు.

అష్టసరము చెట్టు ఈ కుటుంబమునందు మిక్కిలి యుపయోగమైన వానిలో నొకటి. ఇది సాధారణముగ నాలుగు మొదలెని [illegible] యడుగుల వఱకుc బెరుగును గాని [illegible] యడుగులవఱకును బెరుగుటకూడc [illegible]. ఆకులు పెద్దవి బల్లెపాకారము గను [illegible] నుండును. పుష్పము ఓష్ఠాకారము, తెలుపు. రెండు ఉపచేటికలుగలది యొక పుష్పమును మఱుగుపరచు చుండును. కింజల్కములు రెండు.

ఈ యాకులను [illegible] చెక్కల అంపపు [illegible] యొకవిధమగు పచ్చని [illegible]. ఈ యాకులతో దమ్ము చేసిన [illegible] లగును. అష్టసరపు [illegible] మొదలగు వానియందు నుపయో[illegible]. ఈ చెట్టుతోc గొన్నిరు ద్రాక్ష [illegible] చేయుచున్నారు. అన్ని రకముల [illegible] చేయుటలో అష్టసరపు చెట్టు [illegible] నున్నారు గాని క్షయరోగము [illegible] చేయుదురు.

నాగమల్లి ఇది దారడుగు లెత్తు పెరుగు గుబురు మొక్క. అది సంవత్సరము పొడవునc బుష్పించును గాని తఱుచు కాయలు గాయదు. తోటలలో దానిని గొప్పలు నాటి పెంతురు. దాని వేరులతోc గాచినపాలు వీర్యవృద్ధి చేయు నందురు. వేళ్లను నిమ్మ రసముతో నూరి పట్టించిన తామర పోవునని చెప్పుదురు. పాము కాటునకు నాగమల్లి మొక్క మంచి పని చేయు నందురుగాని చేసినట్లు వినవచ్చుట లేదు.

నేలవేము మెట్ట తావుల యందునుc బొట్లు నీడల్లను మూడడుగుల వఱకుc దుప్పవలెc బెరుగును. చిన్నపిల్లల కడుపునొప్పికిని, అజీర్ణముచేc గలుగు జ్వరములకును దీని యాకుల రసమునిత్తురు. ఈ రసము మిక్కిలి చేదుగ నుండునుగాన, ఒక్కొక్కప్పుడు ఏలకుల పొడుముతోc గలిపి మాత్రలు చేసియిత్తురు.

నేలవావిలి అందమైన మొక్క. అది వర్ష కాలములోc బుష్పించును.

నీలాంబరము నీలపు పుష్ప లందముగా నుండుగాన దానిని దోటలందుc బెంచుదురు.

చేబీర మొక్క డొంకలవద్దc బెరుగును అది (ఒక యేడాదిలోనె పుష్పించి కాయలుగాచి చచ్చిపోవును) ఏకవార్షికము.

జీమందార తీగె పుష్పము లోష్ఠాకారముగ నుండవుగాని మంచివాసన వేయును.

ములుగోరింట అందముగా నుండు చిన్న మొక్క. దీని పుష్పములు కొంచెము మించు మించుగ గోరాటివలెనుండును. నాలుగు కింజల్కములలోను రెండు పెద్దవి, రెండుచిన్నవి.

పెద్దములుగోరింట ఆకులకంటెఁ బొడుగుగా సన్నని ముండ్లుకలవు.

పల్లములుగోరింట వర్ష కాలములోఁ బుష్పించును. దీని కాయలలోఁగింజలు చాల గలవు.

పచ్చనాడాంబరము ఈపుష్పములో పైపెదవి పనుక ప్రక్కకు వంగియుండును.

తెల్లరంటు గోత్రచీమిడి మొదలగు మొక్కలింకను ఈకుటుంబమున గలవుగాని, వాని నన్నిటిని విచారించఁ బెనగ్కనుట యనవసరము.

అడిగళులు. ఈ జాతివారు సేవకావృత్తిచేత జీవించువారు. తిరువాన్కూరు ప్రాంతమున నుండు అంబలవాసుల వారిలో నొకశాఖ. పూర్వము శ్రీశంకరాచార్యులు కల్లుత్రాగగ వారిశిష్యులగు కొందఱు బ్రాహ్మణులును త్రాగిరట. అటుపైన శంకరుఁడు కొలిమిలో సీసము కరఁగుచుండగా దానిఁ దీసికొని నిర్లక్ష్యముగా త్రాగి తనతోటి శిష్యుల కీయ వారు భయపడి తమ తప్పు నొప్పుకొని క్షమింపుమని యాతని వేఁడి, తాముచేసిన పాపపరిహారార్థము బ్రాహ్మణేతరులైరట. వారే ఇప్పటి అడిగళులని యొక ప్రతీతి గలదు. వీరు భద్రకాళి దేవాలయములలోఁ పూజారులు. వీరు కాళి ప్రీత్యర్థము మద్యముల నివేదన మొనర్చుటఁ గలదు. వీరు మంత్రజ్ఞులును, శక్తి పూజాపరులునుగా నున్నారు. వీరికి నుపనయన సంస్కారమును యజ్ఞోపవీత ధారణమునుఁ గలదు. వీరికి, దశగాయత్రి జపము గలదు. వీరిలో సీమంతము సేయుట లేదు. పురుడు పాటింపు లేదుగాని సూతకము ౧౧ దినములు పట్టుదురు. పురోహితులును, ఆచార్యులును, వారికి వారిబంధువులలోనేయుండవలయును. నంబూద్రిస్త్రీలు బయట తిరుగునపుడు తాటియాకు గొడుగుచే బూనుటయు బుర్కా వేసికొనుటయు నాయర్ (శూద్ర) పనికత్తెను కూడ గొనిపోవుటయుఁ గలదు; అడిగళుల స్త్రీలకీయాచారము లేదు. నగలు మాత్రము నంబూద్రిస్త్రీలవలెనె ధరించుకొందురు.

అడిచనల్లూరు. చెన్నపురి రాజధానిలోని తిరునల్వేలి జిల్లాకు చెందిన శ్రీవైకుంఠము తాలూకాలోనున్న ఒక గ్రామము. గవర్నమెంటువారు ఈగ్రామ సమీప భూమిని త్రవ్వించి చూడఁగా ఇక్కడ శవములు చాల కనుపించుటచే నిది యొక గొప్ప శ్మశానవాటిక యని యూహించుచున్నారు. పూర్వమీసమీపమందున నేదియో యొక పట్టణ ముండి యుండవచ్చునని దానిని, పాండవులు లేక పల్లవులవంశము నకుఁ జెందిన వారలెవరో పాలించియుండు

రనియు వదంతి గలదు. ఇక్కడ దొరకిన వెండి, బంగారు, లోహపు వస్తువులను, అస్థులను ప్రోగుచేసి చెన్నపురియందున్న వస్తుప్రదర్శనాగారమునందుంచియున్నారు. ఈ అడిచనల్లూరు సమీపమున నిప్పటికిని ద్రవ్వించి క్రొత్త సంగతుల గనుఁగొనుచున్నారు.

అడిదము సూరకవి.

శుద్ధాంధ్ర రామాయణ మునురచించిన బాల భాస్కర కవికుమారుఁడు, ఆంధ్రకవి, లక్షణవేత్త.

ఇతనిచే రచింపఁబడిన కావ్యము కవిజన రంజనము, దీనికి చంద్రమతీ పరిణయమని మారుపేరు. ఇందు హరిశ్చంద్ర చక్రవర్తికిని ఉశీనరరాజ కుమార్తెయైన చంద్రమతి దేవికిని జరిగిన వివాహము వర్ణించి యున్నాఁడు. ఇందు హరిశ్చంద్రుని పూర్వచరిత్రమాత్రము గలదు. ఉత్తరచరిత్ర లేదు. ఇది మూడాశ్వాసములుగల చిన్న పుస్తకము. ఇందలి పద్య సంఖ్య స్వల్పమైనను కావ్యము మిక్కిలి రసాత్మకమును శబ్దార్థాలంకార భూయిష్టమును అయి యుండుటం బండితులు దానిని మొదటినుండియుఁ బిల్లవసు చరిత్రమని గౌరవించుచున్నారు.

ఇతఁడు రచించిన లక్షణగ్రంథములు, ఆంధ్ర చన్ద్రాలోకము, ఆంధ్రనామశేషము, కవిసంశయవిచ్ఛేదము.

ఆంధ్ర చంద్రాలోక మనునది అలంకారములయొక్క లక్షణలక్ష్యములను దెలుపు గ్రంథము. సంస్కృతమునందు చంద్రాలోక మను గ్రంథము గలదు. అది సాహిత్యవిషయములను జర్చించును. దానికి కర్త పీయూషవర్షుఁడని ఆ గ్రంథమునందే యున్నది. పీయూష వర్షుఁడనునది జయదేవునకు నామాంతరమనియుఁ బ్రసన్న రాఘవ కర్తయైన జయదేవుఁడే ఈ చంద్రాలోకమునకుఁ గర్తయనియు కొందఱు పండితుల యభిప్రాయము. ఇది ఇట్లుండ అడిదము సూరకవి చంద్రాలోకమును గాళిదాసుఁడు రచించెనని ఈ క్రింది పద్యమున చెప్పియున్నాఁడు.

గీ॥ బాలురకునైన దెలియఁగ గాళిదాసు
మును రచించె చంద్రాలోకమును ద్రిలింగ
భాష చేసితి నీ కృపభవ్యముగను
దీని గరుణించి గైకొమ్ము దేవదేవ॥

కాని కాళిదాసకృత చంద్రాలోకమున్న దెక్కడను గానరాదుగాన నీ చన్ద్రాలోకమే కాళిదాసునిదియని సూరకవి భ్రమపడెనని ఆన్ధ్ర చన్ద్రాలోకము నచ్చు వేయించిన అక్కిరాజు ఉమాకాంతముగారు వ్రాసియున్నారు. ఏది ఎట్లున్నను సూరన తెలిగించినది అప్పయదీక్షితులవారి కువలయానంద కారికావళి. దీక్షితుల వారు చంద్రాలోక మందలి చివరమయూఖమునుండి అలంకార లక్షణ లక్ష్య శ్లోకములను దీసికొని కొన్నిటి నూతనముగఁ గల్పి కువలయానందమును నిర్మించిరి. ఆకువలయానందమే సూరన కాలమున ఆంధ్రదేశమునందు చంద్రాలోకము పేరను కాళిదాస

కృతిమనియు వ్యాప్తిః జెందియున్నట్లుమనము పై పద్యమువలన నూహింపవలసియున్నది.

భాషాంతరము చేయుటలో నీకవి మూలమును తు,చ తప్పకుండ తెలిగించినట్లు గానవచ్చుచున్నది.

ఉదాహరణములు:—

ఉపమాయత్ర సాదృశ్య లక్ష్మీరుల్లసతిద్వయోః
హంసీవ కృష్ణ తే కీర్తిః స్వర్గంగా మవగాహతే
ఉపమానోపమే యత్వం యదేకస్యైవ వస్తున
ఇందు రిందురివ శ్రీమా నిత్యాదౌ తదనన్వయః

గీ॥ వర్ణ్య ముపమాన ముపమావాచకము స
మాన ధర్మము సంఘటింప నగునుపమ
హంసి చందాన నీకీర్తి యబ్జనాభ
యభ్రగంగావగాహనం బాచరించు

హేత్వలంకారము:—

హేతోర్హేతు మతాసార్థం వర్ణనం హేతు రుచ్యతే
అసావుదేతి శీతాంసుర్మాన చ్ఛేదాయ సుభ్రువామ్
హేతుహేతు మతోరైక్యం హేతుంకే చిత్ప్రచక్షతే
లక్ష్మీవిలాసా విదుషాం కటాక్షా వేంకట ప్రభో

గీ॥ కార్య కారణములు రెండు గలియఁబలికె
నేని యది హేత్వలంకృతి నానెసంగు
నుదయ మందెడు నీశశి మదవతీక
దంబమానముల్వాచ్చ సైదంబుకొఱకు

గీ॥ కార్యకారణములకు నైక్యము గనేని
గృతులఁగొందఱు హేత్వలంకృతియ యంద్రు
సత్కవులకుఁ గమావిలాసములు వేంక
టేశ్వర కటాక్షముల నంగ నిందుమౌళి.

ఆంధ్రనామ శేషము పద్యరూపమైన చిన్ననిఘంటువు.

---

* ఆంధ్ర చన్ద్రాలోకముయొక్క పరిశుద్ధమైన చక్కని ప్రతిని అక్కిరాజు ఉమాకాంతము గారు ప్రకటించి యున్నారు.

ఆంధ్రనామ సంగ్రహములో లేని కొన్ని పదము లిందు చేర్చఁ బడినవి. కవిసంశయవిచ్ఛేదము వ్యాకరణ సంబంధమైన మూడాశ్వాసములుగల లక్షణగ్రంథము.

ఈకవి రామలింగేశ శతకమను గ్రంథము సీస పద్యములతో రచియించి యున్నాఁడు. ఇందు రాజులు ప్రజలను బెట్టినట్టి బాధలు చక్కగ వర్ణింపఁ బడినవి. ప్రజాపీడకులైన రాజులను ధిక్కరించుటకే ఈశతకము పుట్టినట్టు కానవచ్చుచున్నది. అప్పటి జమీందారులవలనను వారి యధికారుల వలనను అప్పటి ప్రజలకుఁ బెక్కు కష్టములు సంభవించినట్లు శతకములోని వర్ణనలనుబట్టి మనమూహింపవచ్చును.

"మాన్యంబు లీయ సమర్థుఁడొక్కరుఁడును లేఁడు" మొదలగు సీసపద్యములు ఈ గ్రంథములోనివి, తెనుగు దేశమునందిదివఱకే వ్యాపించి యున్నవి. శతకము నందలిచివర పద్యమగు సీ క్రింది సీసమువలన అప్పటి జమీందారులు ప్రజల సొత్తును అపహరించుట ఇండ్లు తగులఁబెట్టుట మొదలైన ఘోరకృత్యములనుఁ జేయుచున్నట్లు కానవచ్చుచున్నది.

సీ. భయమేల కొండంతపగతుఁడునాకున్న
మేరువు వంచిన మేటికలుగ
నాకేల శోకసంతాపము నందఁగుంద
శీతాంశుమౌళినా చెంతనిలువ
తస్కర భీతికిఁ దల్లడిల్లగనేల
ప్రమథులతో శూలపాణి నిలువ

అగ్ని భీతికినాకు నలుకంగ నిక నేల
గంగాధరుండునా కడవనింప
నన్నుచు నెంతటి కెంతటి కలుకు లేక
నమ్మియుంటిని నీ ప్రాపు నా మనమున
జాగరూకుఁడ వైనన్ను సాకవయ్య
రామ లింగేశ రామచంద్రపురవాస

పై గ్రంథములుగాక శ్రీరామ దండకము పొణ్ణుగుపాటి వేంకట మంత్రిశతకమను రెండు శతకములీ కవిరచించెనని యొకరు వ్రాసియున్నారు కాని యాగ్రంథము లెచ్చటను గానరావు.

కవిస్థలము. ఈకవి, తనగ్రంథముల నన్నిటిని రామచంద్ర పురమునందలి రామలింగేశున కంకితము చేసినందున నాతఁడు గోదావరిమండలనివాసుఁడనిమనమూహింపఁపవలసియున్నది. దంతకథలవలననుచాటుపద్యముల వలనను ఇతఁడు విజయనగర సంస్థానమునందున్నట్లును అచ్చటిరాజులకు నాశ్రితుఁడుగనున్నట్లును పెద్దాపుర సంస్థానమునకు నప్పుడప్పుడు వచ్చుచున్నట్లునుకూడ గలదు. రామ చంద్రపురమతని జన్మస్థానమై యుండనోపు. పెద్దవాఁడైన తరువాత ధనార్జనకొఱకై విజయ నగరమునకు వెళ్లియుండవచ్చును.

కవికాలము. రాజులయందుగలయసూయచేని కవి తనకావ్యములేవియు రాజులకంకితము చేయలేదు. రామలింగేశునకే చేసెను. అందువలన నాతని గ్రంథములలో నాతనికాలనిర్ణయమునకు నాధారము లేవియుగానరావు. కావున కవికాల నిర్ణయమునకు కింవదంతులే యాధారములు. ఈతఁడు విజయనగరము రాజైన రెండవ విజయరామ రాజునకును పెద్దాపురసంస్థానాధిపతియైన వత్సవాయి తిమ్మజగపతికిని సమకాలికుడని పరంపరాగత వార్తగలదు. రెండవ విజయరామరాజు 1759 మొదలు 1794 వఱకు ప్రభుత్వము చేసెను. తిమ్మజగపతి 1759 మొదలు 1790 వఱకు రాజ్యమేలెను. కావున ఈ కవి పదునెనిమిదవశతాబ్దము మధ్యనుండి ఆ శతాబ్దాంతము వఱకు నుండెనని మనమూహింప వచ్చును.

అడిదానవుఁడు. అంధకునికొడుకు స్వస్వరూపమున మరణము చెందకుండునట్లు వరముఁ బొందియుండె. ఒకప్పుడు పార్వతీ దేవి వేషము ధరించి శివునిమోసము చేయ యత్నింపఁగా నితఁడు శివునిచేఁ జచ్చెను.

అడిలంగు. (౧) జోహాన్ క్రిస్టాఫ్. (౧౭౩౨-౧౮౦౬.) ఈతఁడు జర్మనీదేశస్థుఁడు. వైయ్యాకరణుఁడు; బహుభాషాకోవిదుఁడు. స్పాంటీకన్‌లో జనన మంది డ్రెస్డన్‌లో మృతినొందెను. ఈతఁడు తర్జుమాలయందును, శబ్దోత్పత్తి విచారమునందును, అనేక భాషలయందును ఆసక్తిగలిగి యా పరిశ్రమలయందుఁ దన కాలముఁ గడపెను. ౧౭౮౭-వ సంవత్సరము మొదలితఁడు డ్రెస్డన్ ఎలెక్టొరల్ పుస్తక భాండాగారమునందు నుద్యోగిగనుండెను. ఈతఁడు గొన్ని గ్రంథములను వ్రాసెను.

(౨) ఫ్రీడ్రిల్ వాన్ (౧౭౬౭-౧౮౪౫.) ఈతఁడు పైవాని మేనల్లుఁడు; స్టెటిన్‌లో జనించి సైంటు పీటర్సు బర్గులో మృతుఁడాయెను. సంస్కృతభాష, వాఙ్మయము రష్యన్ భాష, వీనిని గుఱించి ఈతఁడు కొన్ని గ్రంథములు వ్రాసెను.

అడిలేయిడ్ రాణి. (౧౭౯౨-౧౮౪౯.) ఇంగ్లాండును పాలించిన నాల్గవ విలియంరాజు భార్య; సాక్సుమీనింజన్ డ్యూకగు జార్జి క్లామార్టై. ఆకాలపు రాజ్య వ్యవహారములందు జోక్యము కలిగించుకొనెనను వదంతికి ఫలముగ నాయమయందు ప్రజలకుఁ గొంతప్రీతి తఱిఁగెనుగాని యీమె నిక్కముగ ధర్మకార్యములయందు చాల శ్రద్ధగలిగి ప్రవర్తించు చుండెను.

అడిలేయిడ్. దక్షిణ ఆస్ట్రేలియాసీమకు రాజధాని. ఈ పట్టణము టారెన్సు నదిచే ఉత్తర అడిలేయిడ్ దక్షిణ అడిలేయిడ్ అని రెండుభాగములుగ విభజింపఁబడియున్నది. ఒక్కంట నివేశములు గలవు. రెండవదాన వ్యాపారము జరుగుచున్నది. ఈ పట్టణాధికారు లెల్లరు ప్రజలచే నిర్వచింపఁబడుచున్నారు. ఇచ్చట నొక సర్వకళాశాల యున్నది. ఇందు రమారమి వేయి మంది విద్యార్థులు విద్య నభ్యసించు చుందురు. జనసంఖ్య 1,62,094.

అడ్వోవా. ఆఫ్రికా ఖండము నందలి అబిసీనియా దేశములోని టిగ్రిమండలమునకు రాజధాని. ఇది అరేబియాకును సౌడనుకును గల మార్గమధ్యమున నుండుటచేత మధ్యాఫ్రికాతో అరేబియా సలుపువర్తకమునకు ముఖ్యస్థానముగ నున్నది. అబిసీనియావారికిని ఇటలీ వారికిని జరిగిన యుద్ధములో నబిసీనియా వారు ౧౮౯౬ వ సంవత్సరమున నీపట్టణ ప్రాంతములలోనే ఇటలీవారిని పూర్తిగ నోడించిరి. ఈపట్టణము జనసంఖ్య 3000 మాత్రమె గలదు.

అణిమ. అష్ట మహా సిద్ధులలో నొక్కఁడు.

అణిమాండవ్యుఁడు. మాండవ్య ఋషికి నామాంతరము (చూడు 'మాండవ్యుఁడు'.)

అణుహుఁడు. (చం. వం) నహుషునికులజుఁడగు యయాతి పుత్రుఁడైన పూరుని కులమునందుఁ బుట్టిన విభ్రాజుని కుమారుఁడు. ఇతనికి నపుఁడను మారుపేరు కలదు. ఇతఁడు శుకుని కూఁతురగు కృత్వి నామాంతరము గల కీర్తిమతిని వివాహమాడెను. (చూడు 'నపుఁడు')

అతభాస్కానది. అతబాస్కా కెనడా లోని యొకనది. ఇది 740 మైళ్లు పొడవు.

ఈనది అతిభాస్క యను సరస్సులోనికిఁ బ్రవహించుచున్నది.

దీనికి మెన్నాండు, పెంబన, థైస్పుర్, స్లేపు, అను ఉపనదులు గలవు.

మొదట ఈ పేర నొక జిల్లాయుండెను. తరువాత కన్నడదేశమందొక రాష్ట్రమంతయు నీ పేరునఁ బిలువఁబడుచున్నది. ౧౯౦౫ సంవత్సరమున నీ రాష్ట్రము విభజన చేయఁబడి ఇతర రాష్ట్రములలోఁ గలుపఁబడెను.

అతలము. పాతాళ లోకములలో మొదటిది. దాని వైశాల్యము పదివేల యోజనములనియు అచ్చటినేల తెల్లగనుండుననియుఁ బురాణప్రతీతి.

అత్తరులు. "అత్తరు" అను నీ పదము "ఇతర్=Itar" అను పారశీక పదము నుండి జనించినది. దీనికిహిందువులు పర్యాయ పదములుగ పుష్ప సారము, పరిమళము, సుగంధ ద్రవ్యము, మొదలగు పదముల నుపయోగించెదరు. పాశ్చాత్య భాషలయందు "ఆటో=Otto" అను పదముకూడ అత్తరునకు పర్యాయపదముగా వాడుచున్నారు.

అత్తరు పదము.

అత్తరులను తయారుచేయుట మిక్కిలి పురాతనమైన పరిశ్రమ. మంచిదుస్తులు, ఆభరణములు మున్నగు అలంకరణముల యందు మనుష్యునకెంత యభిలాష యనాదినుండి కలదో భోగప్రధానములగు సువాసన ద్రవ్యములయందుఁగూడ నట్టి యభిలాష యుండును. కాఁబట్టియే ప్రతిజాతి యందును వారివారి నాగరికతనుబట్టి కొద్దియో గొప్పయో ఈ పరిశ్రమ యనాదినుండి గానవచ్చును. మిక్కిలి యనాగరికదశలోనుండు జాతులు ప్రకృతి యందుఁగల సుగంధద్రవ్యముల నట్లేవాడుక చేయుదురు. నాగరికత మీరిన జాతులు ప్రకృతియందుఁగల పదార్థములనుండి సారములుదీసి యనేకవిధములయిన యత్తరులను జేయుదురు.

మన దేశములో నీ పరిశ్రమ మహమ్మదీయుల దండయాత్రలకు పూర్వమే యున్నత దశయందున్నదని చెప్పుటకు అనేక నిదర్శనములు గలవు. వేదములలో చందనము, కస్తూరి మున్నగు పరిమళ ద్రవ్యముల పేళ్లు గలవు. ఇదిగాక పుష్పసారములు దీయుట చతుష్షష్టికళలలో నొకటిగ మనవారిచే పరిగణింపఁబడి యున్నది. మద్యసారములును, పుష్పసారములును ఒకేరీతిని వండుచుండినట్లు మన శాస్త్రగ్రంథములవలనఁ దెలియుచున్నది. వాసవదత్త, దశకుమారచరిత్ర, మున్నగు కావ్యములయందు కొన్ని పరిమళముల పేళ్లుగలవు. పదవశతాబ్దమునాటి వరహామిహిరుని బృహత్సంహితలో చంపక మున్నగు పుష్పముల వాసనగల కృత్రిమ పరిమళముల తయారుచేయు మార్గములు వర్ణింపఁబడి యున్నవి.

హిందువులపూర్వాధునిక వాఙ్మయమును పరిశీలించినయెడల కావ్యముల యందును పురాణముల యందేగాక ప్రాచీనములగు వేదముల యందును వివాహామంత్రములయందును, "అగరు, ధూపకర్పూర" ఇత్యాది పద ప్రయోగములను విరివిగ కనుగొన గలము. ఆర్యులకు పుష్ప సారములను గురించి తెలియుననుటకు మనవాఙ్మయమున ప్రబల నిదర్శనములు కలవు. అత్తరవులు భరతఖండము నుండి తమకు బహుప్రాచీన కాలమునుండియు వచ్చుచుండెడివనియు, వానిని వారు మిక్కిలి ప్రియముగకొని సేంతసించు చుండు వారనియు, గ్రీకు, రోమక, దేశ గ్రంథములయందు కనఁబడు చున్నది. క్రిస్తవుల వేదము (బహుప్రాచీన గ్రంథమునగు "బైబిలు") నందుఇండియా దేశము నుండి పాశ్చాత్యుల కత్తరవులు వచ్చు చుండెడివని వ్రాయఁబడియున్నది. ఇంక ననేక నిదర్శనము లున్నట్లు పాశ్చాత్యులు వాడుకొనియున్నారు.

హిందువులు పరిమళ పరిశ్రమల నెప్పటినుండి యెఱిగియున్నారు

ఇంకనుయాంధ్రులకీ పరిమళవిషయమును దెలియఁజాయని చూచిన శ్రీనాథాదుల "కస్తూరి భిక్ష"ను జూపించు కొన్ని చాటుపులును, స్వతంత్ర రచనాకౌశలములు నగువీధి నాటికాదుల యందును పరిమళ ప్రశంస గానవగును. మరియుపూర్వము

ఆంధ్రుల పరిమళ పరిశ్రమ

రాజుల కొలువునందు డెబ్బదిరెండు నియోగులలో పరిమళ కారకుఁడొకఁడని అయ్యలరాజు నారాయణామాత్య విరచితమగు హంసవింశతియను గ్రంథమున కనఁబడు చున్నది. గణపతిదేవుని కాలమునగూడ నైప్రబంధములో వర్ణించిన "గురు ప్రధాన, సామంత, పురోహిత, జ్యోతిషక, మాలకారక, పరిమళకారక" ఇత్యాది నియోగులు నియమింపబడి యున్నట్లు కనఁబడుచున్నది.*

ఈ పరిమళకారకవృత్తి యొకరివలనగాక యనేకమందివలన జేయఁబడు చుండినట్లును, ఒక రాజుక్రిందనే పలువురుద్యోగులీ వృత్తికై నేమింపఁబడుచుండినట్లును, కొందర త్తరులు చేయుటకు, కొందరు సంగ్రహ పరుచుటకు, కొందరు భాండాగారమున జాగ్రత పరుచుటకు, వారిపై నొక పెద్ద యధికారి కూడ నేర్పరుపఁబడియుండినట్లును, ఆపరిమళములకొర కేర్పరుపఁబడిన యుద్యోగు లమిత ధనవంతులుగ నుండుటయేగాక, వారియుద్యోగము మిక్కిలి గౌరవాస్పదమై యుండెడిదనుటకునుగూడ నిదర్శనములు కలవు. శ్రీనాథుఁడు వేమారెడ్డివద్ద నుండు సుగంధ భాండాగారాధ్యక్షుఁడైన సిరియాల తిప్పయ్య యను వైశ్యునకు తన హరవిలాసమును కృతి నిచ్చెనని నెఱిగినవారు పై సంగతులు

పరిమళకారకవృత్తి ఎట్టిది.

* ఆంధ్రుల చరిత్రము 263 పుట రెండవభాగము.

తెలిసికొనఁగలరు. వీనినిబట్టి పరిమళశ్రమ యాంధ్రులకు క్రొత్తగాదని మనము దెలిసికొనవచ్చును. ధర్మరాజాదిరాజసూయములు మొదలు (పురాణకాలమునుండి) మొన్నటి వరకు పరిపాలించిన యాంధ్రరాజుల వరకునుగల చరిత్రముల యందును, ప్రాచీన కాలమునందున్నుగూడ మనవారు పరిమళపరిశ్రమ నెరిగియుండిరి. మొన్న మొన్నటివరకు పరిమళ పరిశ్రమ మనదేశమున విచ్చలవిడిగ జరుగుచుండెడిది.

మహమ్మదీయుల దండయాత్రలు తరువాత మనదేశములో పరిమళ కళాపరిశ్రమ మిక్కిలి యభివృద్ధి జెందినది. సహజముగా మహమ్మదీయులును, ముఖ్యముగ మొగలాయిలును మిక్కిలి భోగపరాయణులు. అందుచేత రాజులును ప్రజలునుగూడ అత్తరుల విషయమై యెక్కువ శ్రద్ధ దీసుకొనెడివారు. "అత్తరు" అనుపదము మనకు వాసన వలననే లభించినది. అక్బరు మహా చక్రవర్తి కాలములో నత్తరులు తయారుచేయుటకు ప్రత్యేకమొక యుద్యోగ శాఖయుండెననియు, ఆ శాఖవారియొక్క పనిని తానే తరుచుగ తనిఖీ చేయుచుండెడి వాడనియు ఆయన యధికారులలో నొకడగు అబుల్ ఫజల్ వ్రాసిన "ఐని అక్బరి"యను గ్రంథము నుండి తెలియవచ్చుచున్నది. అక్బరు చక్రవర్తి పరిశ్రమ కళాభివృద్ధి నెరిగిన వారాతడి యత్తరుల కొరకెంతపని జేయించువాడో తెలిసికొనగును.

మరియు మహమ్మదీయులు వారి యత్తరులో నిజమైన పుష్పసారములు రాజేయక చందని*, వేలు, మొదలగు తక్కువ మూల్యముగల తైలములను పుష్పసారములతో గలిపి చౌకగనమ్మి, హిందువులయత్తరులకు పోటీ గల్పించిరి. నిజమైన పుష్ప సారములను మాత్రమే జేయుట నెరిగిన హిందువులా పోటీ కాగలేకపోయిరి. క్రమముగా హిందువులు పరిమళములచేయుటమానిరి. మహమ్మదీయు లప్పటినుండియు మన దేశమునందలి యత్తరు పరిశ్రమకు ప్రధానులైరి. ఏపుష్పసారమునైనను చందని యత్తరువంటి తైలముతోగలిపి నప్పుడు పరిమళమునకు చక్కని సుగంధము వృద్ధియగును. దీనికి కారణమా చందని తైలమునందుండు యణువులమిశ్రమ స్వభావగుణ సంపత్తియే.

కావుననే మహమ్మదీయులు తులమునకు రూపాయి ధరగల చందినితో తులముయేబది రూప్యముల వెలగల గులాబియత్తరును కలిపి చౌకగనమ్మిరి. ఆ యాచారములు మహమ్మదీయు లిప్పటికిని మానియుండలేదు. ప్రస్తుతము మనదేశమునందు మహమ్మదీయులుచేయు అత్తరవుల వర్తకములో నూటికి తొంబదిపాళ్లు చందినీ మిశ్రితమే.

* చందినీ యత్తరు మంచిగంధపు చెక్కనుండి తీయుదురు. దీనినన్ని యత్తరువులలోను కలుపుదురు.

అత్తరులు కనుగొనినట్లు చెప్పుకథ.

ఒకరాజ తనూజాత ప్రతిదినము తాను స్నానము చేయు నీటియందు రాత్రివేళ పుష్పములను వేయించి యుదయమున నా పరిమళోదకముల స్నానము చేయుచుండెడి దనియు, నాకనాడామె యా నీటిని పరిశీలింప జిడ్డుగ రంగుల తెట్టె కొంచెము పైన తేలి, పుష్పపరిమళము నధికముగ కలిగి యుండినదనియు, నామె సంతసించి యొక యీకతో నా తైలమునొక చిన్న గాజుకుప్పె లోనికెత్తి జనకునికివ్వ నాతఁడు సంతసించి యామెకు కొన్నికోర్కెలు తీర్చె ననియు, నప్పటినుండి యామె ప్రతిదిన మత్తరు చేయుచుండెడిదనియు క్రమముగ నా యత్తరు చేయుపద్ధతి ప్రకటితమైనదనియు, వాడుకగ చెప్పుకొందురు. ఈ కథయందలి బాలిక నూర్జహానని కొందరు వ్రాసియున్నారు. కొందరట్లు కనిపెట్టినబాలిక యొక శత్రు తనూజాత యనియు, ఈ క్రొత్త సంగతి కనిపెట్టుటవలన నామెకు చెరనుండి విముక్తి కలిగినదనియు చెప్పుదురు. ఇదియెంత వరకు సత్యమో మనము నిర్ణయించుటకు వీలులేదు.

పాశ్చాత్యుల అత్తరు.

రసాయనశాస్త్రాభివృద్ధినొనరించుకొనుచు నెరిగిన దెల్ల రాబోవు సంతతి వారికి గ్రంథరూపమున వెల్లడిబఱచుచు పాశ్చాత్యులభివృద్ధి పరచుచున్నారు. అందు పూర్వము రోమను దేశజులును, పిమ్మట పరాసు (French) వారి పరిమళపరిశ్రమ నత్యద్భుతముగ వృద్ధి చేసికొనిరి. పరాసులు కడచిన శతాబ్దమున నాగరికతయందు ప్రధానస్థానము నాక్రమించి ప్రపంచమునకే భయము నాశ్చర్యమును ఒనగూర్చిరి. అప్పుడే వారి పరిమళపరిశ్రమయు నగ్రస్థానమునకుఁ బోయినది. పరిమళ విద్యకు వారిప్పటికిని ప్రపంచమునకొరకు గురుస్థానము నాక్రమించుచుండిరిగాని ఇప్పుడా పేరిరువది సంవత్సరములనుండి తగ్గుచున్నది. క్రమముగా నాంగ్లేయులలో, నమెరికనులు నాగరికతయందును, దాని వెన్నంటియుండు పరిమళములయందును క్రొత్త సంగతులు కనిపెట్టి పెంచి వానిని మించుచున్నారు. జర్మనీవారు వెనుకఁబడి యుండ లేదు. మంచుప్రదేశము లగుటచే పాశ్చాత్యదేశములయందు పుష్పములు సర్వకాలములయందు దొరకవు. ఎల్లప్పుడు పుష్పగుచ్ఛయుతములగు వృక్షలతాదికేదారములు గలిగి తత్పుష్ప[illegible]సత పరిమళమిళిత వాయుమండల పరివృతులమై సుఖించు పూర్వదేశీయులమగు మనకు అత్తరులంతగా నవసరము లేదు, సంవత్సరమునకు రెండుమూడు మాసములు మాత్రమే పూవుల జూచు భాగ్యముగల పాశ్చాత్యులకు పుష్పసారముల యవసరమధికమయ్యెను. పుష్పములు లేనప్పుడు పుష్పము లుండునటుల జేయుటకు మొదట మానవుడెంతో శ్రమపడి యుండును. కావలసిన వస్తువులను పుష్పములతో కలిపియుంచి వానికి పరిమళము పట్టించు

టకు ప్రయత్నముచేయుటే దానికిక్కారణము. మొదట నెద్దియో పుష్పముతో నున్న వస్తువునకు దానిపరిమళము పట్టియుండుట, పిమ్మట మనుజుడు మొగలిమొదలగు పుష్పములుబట్టలతో నుంచి వానికి పరిమళమబ్బజేయుట, పుష్పముల నెండబెట్టి పొడిచేసికొనుట, తొక్కి రసము దీసికొనుట, ఇట్లె క్రమాభివృద్ధినొంది యుండును. ఈ ప్రాథమికావస్థ నూహించుట కష్టము.

పాశ్చాత్యులు క్రమముగ నత్తరవులను చేయుపద్ధతిని హిందువులవలన దెలిసికొనుటకు పారశీకముగుండ మెట్టదాటినవచ్చిరి. అందువలననే గ్రీసుదేశము వారు హిందువుల జ్ఞానములను పడమటి కంపుటకు మిక్కిలిసహాయ మొనరించిరి. గ్రీకునుండి రోమక పట్టణము ప్యారిసు నగరము మీదుగ యాంగ్లేయుల మన దేశమునకు నడచినట్లు విజ్ఞానయాత్రా చరిత్రమును వ్రాసినవారి యభిప్రాయము. ఆ జాతులకు గల పరిశ్రమా ప్రీతియే వారి నభివృద్ధికి దెచ్చినది. వారికి మనదేశమునందు గల కొన్ని పుష్పములు లేనందునను, వారిదేశమున పుష్పములు విరివిగా పెరుగ నందునను వారికి కొంతకాలము వరకు అత్తరువులు చేసికొనుట కష్టమే యైనది. పాశ్చాత్యు లిప్పుడు పుష్పములుగలదినములలో మంచియత్తరులు దీసికొని యుపయోగించుకొనుచు నమ్ముచు లాభమును పొందుచున్నారు. అంతేకాక క్రమముగా వారు కల్పిత పరిమళ ద్రవ్యములతో నత్తరులు చేసికొనసాగిరి. లవంగములు, ఏలకులు, పచ్చాకు వట్టివేరు, మొదలగు వస్తువుల నుపరదేశములనుండి తెప్పించుకొని వాని తైలములనుదీసి అత్తరులను జేయుచున్నారు. కొందరు రెండుమూడు మూలికల తైలములు గలిపి (Bouqets) మిళితము జేసి యమ్ముచుండిరి. కొంత కాలమునకుతరువాత కొన్ని మూలిక పరిమళసారములు గలుపగా నవి కొన్ని వింతపుష్పముల పరిమళముల నొసగినవి. క్రమముగా కొన్ని కృత్రిమ పుష్పసారములని చ్చుటకు కాధారమైనవి. ఇప్పుడందువలన వారు జీలకర్ర, వాము, మిరియాలు, మొదలగు వస్తువులను దిగుమతి చేసికొని, వాని సారములదీయు చున్నారు. మరియు గులాబీ, పొగడ, మొదలగు పుష్పములు లేని కాలములయందు కల్పిత పరిమళ సారములను జేసికొని స్వభావసిద్ధమైన పరిమళ సారముల కంటె ప్రశస్తమైన పరిమళమిదియేయని లోకమును సంతృప్తిచేయ గలిగిరి. ఈ కల్పిత పుష్ప సారములు నిజసారములను (అత్తరులను) మించియుండును. మరియునివి చౌకగ లభ్యమగుచున్నవి. మనకువచ్చు పాశ్చాత్యపుటత్తరులు, "హీకో" పరిమళములలో కొన్ని నీరకములోనివే. ఇదియునుగాక వారు మనదేశమున మహామ్మదీయు లమ్ముయత్తరులను, మాదిరితీసికొనిపోయి యట్టి యత్తరులను చౌకగచేసి, మహామ్మదీయుల యత్తరుల కంటె చౌకగ, మంచివిగ నొసగుచున్నారు. అందువలననే మనదేశమునందు మహామ్మ

దీయుల చేతులయందు మిగిలియున్న ఈ యత్తరుల పరిశ్రమ క్రమక్రమముగా సన్నగిలు చున్నది.

రూపములు.

ప్రపంచమునందలి యనేకవస్తువుల నుండియు, ఫల పుష్పముల నుండియు నత్తరులను తీయవచ్చును. ఏ వస్తువు నుండి తీసినయత్తరు కావస్తువ పేరు బెట్టిరి. కావున యత్తరవుల రకములిన్నియని నిర్ధారణచేయుటకు వీలులేదు. ఘనపదార్థములుగ నుండు యగరువడలు, కస్తూరి; చూర్ణరూపమునను౦డు బుక్కా, స్నానచూర్ణములు; నవనీతము వలె నుండు మొగముమెరుగులు; ద్రవరూపమున నుండు తైలములు, తలనూనెలు; గాక కేవలము అత్తరులని చెప్పుటకు వీలైన రూపములనే యత్తరులని నిర్ణయించ వలయును.

(1) సారము. (otto) పుష్ప తైలము లేక అసలు అత్తరు. దీనిని "మూలతైలము" (Essential oil) అని మూలికలనుండి తీసినచో చెప్ప నగును. ఒకవిధముగా సారముల క్రింద ప్రతిపరిమళముగల వస్తువునుండి తీసిన కలితీలేని తైలమును జేర్చనగును.

(2) అరకు. (Essence) పైజెప్పిన అత్తరు చిగురు సారాయముతో కలిసినప్పు డేర్పడు ఘాటైన ద్రవరూపము.

(3). టించరు (Tincture) పరిమళ భాగమును దంచిచేసిన కషాయము.

(4) తైలము. (Oil) చందిని మొదలగు తైలములతో కలసిన మహాన్మదీయులమ్ము అత్తరువులట్టిటి మిశ్రమ పరిమళసారము.

(5) ద్రావకము. పైని రెండవ సంఖ్య క్రింద చెప్పిన అరకునకెక్కువచిగురు సారాయము జేర్చినది. ఇవియే యాంగ్లేయులు వాడు "లవెండరు; ఉడుకులోం, చెర్రీబ్లాసం; నైటుకోజు" అను పాశ్చత్యపుటత్తరులు.

6. పరిమళోదకము. (Perfumed water) నీటితో గలసినది. ఇది అత్తరు తయారు చేయునప్పుడు మిగిలినది. ఇదియే పన్నీరు.

ఇంక ననేకరూపములుగలవు. వానిలో ముఖ్యమైన రూపములు పైన పేర్కొనబడినవి.

ప్రపంచము నందలి ప్రతివస్తువునకేదో యొక వాసనయుండుట స్వభావము. కాని మానవుల కుపయోగపడు పరిమళములనిచ్చు వస్తువులసంఖ్య మిక్కిలి స్వల్పము. కొన్ని పుష్పములు మిక్కిలి సున్నితములై సారములు గ్రహించుటకనువగు పద్ధతులు లేవు. కొన్నిటి నేకారణముననో మానవు లుపయోగించుకొనుట లేదు.

రకములు.

అత్తరులను జంతు, ఖనిజ, మూలికా, సంబంధములగు కొన్ని వస్తువుల నుండి తయారుచేయుదురు.

I. జంతు సంబంధమైనవి. (Animal) పునుగు, కస్తూరి, జవ్వాజి మొదలగునవి.

II. వృక్షలతా సంబంధమైనవి (Vegetable) ఇందు:—

1. గింజలు. మిరియములు, ఏలకులు, సోపు, జీలకర, వాము.

2. పుష్పములు. మల్లె, గులాబీ, పొగడ, మాలతి మొదలగునవి.

3. ఆకులు. పచ్చాకు, దవనం, కదంబము మొదలగునవి.

4. ఫలములు. నారింజ, నిమ్మ, దబ్బ, జాజికాయ.

5. వేళ్లు. వట్టివేరు, కచ్చూరము, దుంపరాష్ట్రము.

6. సమూలము. పుప్పరమెంటు, మంచిగంధము, దేవదారు.

7. పట్ట. దాల్చిన చెక్క.

8. మొగ్గలు. లవంగములు, జాపత్రి.

9. గడ్డి. నిమ్మగడ్డి, దబ్బగడ్డి.

III. ఖనిజ సంబంధమైనవి. గంధకము, రాతిసిబొగ్గు ఇత్యాదులు.

ఈ పై వస్తువులేగాక నింకను ప్రతిశాఖయందు ననేక వస్తువులు జేరును. కొన్ని వస్తువుల యందలి పరిమళములను మనుజులు గ్రహించుట లేదు. ఇట్టి వస్తువుల (Raw materials) నన్నిటినుండియు నత్తరులు తీయ నగును. ఇందు చిత్రములుకొన్ని కలవు.

కొన్ని వృక్షముల వేళ్లయందొక పరిమళము. ఆకులయందు మరియొకటి, పుష్పములయందొకటి, ఫలములయందు మరియొకటి యుండును.

ఉదాహరణముగ నారింజచెట్టు తీసికొనుడు.

(1) పుష్పములనుండి తీసినసారము (Neroli).

(2) ఆకుల నుండి తీసిన సారము (Petit grain)

(3) ఫలముల తొక్కలనుండి తీసినసారము (Bergamot.)

(4) ఇంకను గింజలు, ఫలమంతయు, వీటినుండి తీసినసారములు వేర్వేరు పరిమళముల నిచ్చును.

ఈ పదార్థముల నుండియు, మామిడి మొదలగు పుష్పముల నుండియు, మన పూర్వులును, మహమ్మదీయులును గూడ అసలు అత్తరులు తీయుచుండిరిగాని యవి మిక్కిలి వెల యధికముగ నుండి రాసాయన శాస్త్ర సహాయమున పాశ్చాత్యులు దీయు సారములతో పోటీకి నిలువజాలక యున్నవి.

తైల పదార్థము లెల్లయు సాధారణముగ నీటియందు మిశ్రమము నొందవు. కొన్ని కొంత భాగము మిశ్రమ మొంది

అత్తరుల రసాయన విభజనము.

దిగరు కొంతభాగమైన మిశ్రమ మొందక యుండును. అత్తరులును (అనగా కస్తూరి లేని

నిజమైన పుష్పసారములు=Essential oils) నీటియందుమిశ్రమ మొందవు కావున నివి తైలస్వభావముకలవి. మరియు నీయత్తరుల కొంచెమొక కాగితముపై వేసినచో నచ్చట మరకను కలుగఁజేయును. ఇతర తైలములు చేసిన మరక యెండలోనుంచిన పోదు కాని యత్తరుల మరకయెండలోఁబెట్టిన పోవును. కావుననే యత్తరులు మామూలు నూనెలకంటె కొంచెము విలక్షణమైన నూనె లని చెప్పవచ్చును. అత్తరులు గాలితగిలినచో హరించి పోవును, (Volatile) మరియొక భేదము. నూనెలు బట్టీ పట్టి సంధానించిన యెడల తప్పక చెడిపోవును. అత్తరులట్లుగాక నీటి యావిరితో గలసి యావిరిరూపము నొంది మరల చల్లబరుచుటతోడనే తైలరూపము నొందును.

అత్తరును చేయు స్థలములు.

హిందువులు అత్తరులను పూర్వమెంత విరివిగ చేసినవారైనను ప్రస్తుతముతోటలు పెంచి వ్యాపారము కొరకు ఒక్కటి రెండు ప్రదేశములయందు మాత్రము అత్తరులను చేయుచున్నారు. ఇందు "ఘాజీపూరు" ముఖ్యము. కనోజీ, హైదరబాదు, మైసూరులలోకూడ బహు స్వల్పముగ స్వదేశ సంస్థానముల స్వల్ప పోషణములో జరుగు చున్నవి. ప్రస్తుతము విరివిగ నత్తరులు తయారుచేయు స్థల మొక్క ఘాజిపురము (Ghazipore) మాత్రమే. ఇచ్చట గులాబీ తోటలు కొన్ని వాదల ఎకరములు గలవు. ఇందు అన్నియుకోసి సంధానపు పద్ధతినే యత్తరువులు చేయుదురు. ఈ పరిశ్రమకు ప్రముఖు లిచ్చట మహమ్మదీయులే.

అత్తరు తయారు జేయు పద్ధతులు.

పరిమళకారుఁడు ప్రస్తుత మీ క్రింది పద్ధతుల్లవలనత్తరుల తయారు చేయును. ఈ పద్ధతులు తయారు చేయవలసిన యత్తరు రూపమునుబట్టియు, నత్తరు నిచ్చు వస్తువుయొక్క గుణభేదమును బట్టియు మారుచుండును. ముఖ్యమైన నాలుగు పద్ధతులుమాత్ర మిందు వివరించెదము. (1) పిండి తీయుట (Expression) (2) స్రవము. (Distillation) (3) పీల్పించి తీయుట (Absorption)(4) చివుక పెట్టుట (Maceration) ఇవిగాక నానబెట్టుట (Difusion) కరగించుట (Dissolution) మొదలగు పద్ధతులు మరికొన్ని గలవు గాని యవియంతగా ప్రయోజనము కావు.

(1) పిండి తీయుట.

ఈ పద్ధతి నత్తరుతీయ వలసిన వస్తువునందు తైలము మిక్కిలి యధికముగ నున్నప్పుడవలంబింపఁబడును. పరిమళభాగమగు తైలమధికముగానుండి వస్తువును వ్రేళ్లతో నదిమిన నూనె పైకివచ్చునప్పుడీ పద్ధతి యవలంబింపఁబడును. ఈ పద్ధతి యందు పరిమళమును తీయవలసిన నారింజ, నిమ్మపండ్ల తొక్కలవంటి వస్తువుల నొక గుడ్డ సంచిలో పోసిగాని, పోయకగాని, ఒత్తుడు మరలో

పెట్టిగాని, గానుగలో వేసిగాని, యదిమి పరిమళభాగ మగుసువాసన తైలమును(అసలు అత్తరును) పిండుదురు. ఈ మర బలమగు ఇనుపపాత్రలం బోలియుండును. 6 అంగుళములు మొదలు వలయ ముండును. 12 అంగుళముల లోతుండును. సుమారు 5 మణుగుల పదార్థము పట్టుటకు వీలగునంత పెద్దదికూడ చేయ వచ్చును. ఆ పాత్రకు క్రిందనొక చిల్లియుండును, దానినుండి పిండఁబడిన తైలము క్రిందికి కారును. లోపల చిల్లులుగల కల్పితపీఠము (False-bottom) నొకటి యమర్చి దానిపైన నారింజ పండు తొక్కలు మొదలగు వస్తువులు నిలిచి మరియొక ఇనుప రేకును పైనవేయుదురు. ఆ ఇనుపరేకు వలయముగనుండి పాత్రలో నిమిడి యుండును. పైన మర త్రిప్పుట వలన క్రమముగా నారేకు క్రిందికి దిగును. అందువలన నారింజ తొక్కలయందు అసలు అత్తరు (Essential oil)ను కలిగియుండు గోళములు చితికి క్రిందికి రంధ్రముగుండ కాలువలు గట్టును. ఇట్లు తీసిన తైలముల యందు కొంతభాగము నీరు కలిసి యుండును. అదిస్వభావముగ కొద్ది కాల మొకపాత్రలో పోసి నిలువయుంచినచో నత్తరునుండి వేరు పడును. అప్పుడు నీరును తొలఁగించి తైలమును వడియఁబోసిన యెడల పరిశుభ్రముగ నుండును. తైలము స్వల్పముగ నున్నప్పుడు నోటిలో నొకగాజు గొట్టమును పెట్టుకొని నీటిపై తేలిన తైలపుటణువుల నొకచో బీల్చి సమీకరణ మొనర్చనగును.

(2) స్రవము.

6 శేర్లు మొదలు (ద్రవపదార్థమును గొలుచు శేరు) 120 శేర్ల వరకు పట్టురాగి, ఇనుము లేక గాజుపాత్రతో చేయఁబడిన వాలుకాయంత్రమ్ము నొకదానిని సంపాదించి, అత్తరు దీయవలసిన పదార్థము నందు వేసి కొంచెము నీళ్లతో నాపదార్థము మునుగునట్లు చేయవలయును. ఈపాత్రకు సూటిగా నొక బోలుగనుండు గొట్టమున కమర్చిన గిన్నె వంటిదమర్చవలయును. ఈగిన్నెనుండి పోవు గ[illegible]న గొట్టమును మరి మేకుచుట్లవలె గుండ్రముగ వంచి యొక నీటిపాత్రలోని కమర్చవలయును. ఆ నీటిపాత్రబయటికి గొట్టముకొన వచ్చియుండవలెను. ఈనీటి పాత్రయందెప్పుడును నీరు పడుచుండవలెను. పిమ్మట యంత్రమున కమర్చిన పదార్థములుగల పెద్దపాత్రయందలి నీరును ఉడకపెట్టవలెను. ఆవిరి తప్పిపోకుండ అదికిన భాగములన్నియు జాగ్రతగా మూయవలయును. అందువలన ఉడుకుపట్టినపిమ్మట నావిరి దారిలేక పాత్రనుండి పైనగప్పిన గిన్నెలోనికి, పిమ్మట గొట్టములోనికి, పిమ్మట నీరుపడు గొట్టముల వంకర ప్రదేశమునకు వచ్చి యచ్చట చల్లనినీరు పడుచుండుటచే నావిరి రూపముననున్న మేఘములు చలిగాలి తగిలి వానయైనట్లు ద్రవరూపమునొంది బయటికిగల కొనలోనుండి చుక్కలుచుక్కలుగా నీవ-

లకునచ్చును. అచ్చట నొక పరిశుభ్రమైన పాత్రలోనికి ద్రవమునుపట్టి యుంచవలెను. ఈయావిరితో బట్టీ యందున్న వేడి తగులగనే త్వరలో నావిరియగు పరిమళ భాగము కూడ నీటితో కలసి వచ్చుచుండును. ఇట్లుతీసిన ద్రవమును కొంత కాలము మూతవేసి నిలువ యుంచినచో పైకి తైలము తేలును. అదియే సుగంధ తైలము. అప్పుడడుగుననుండు నీరును క్రిందికి క్రిందియంత్రసహాయమున విడదీయుదురు. ఈ యంత్రమును విభజనకారి (Seperator) అందురు. దీని కడుగున బిరడా గల గొట్టముండును. ఆ బిరడా కొంచెము త్రిప్పినచో నడుగున గలనీరు క్రమముగ క్రిందికిఁబోవును. పైనిగల తైలము మాత్రము దిగపడునట్లు బిరడా సులభముగా మూసి వేయవచ్చును. ఈసంధానపు పద్ధతి వలననే అత్తరు లన్నియు సర్వసాధారణముగా తయారుచేయఁబడును. కొందరు వాలుకా యంత్రమున మొదటచెప్పినట్లు నీరుపోయక చిగురు సారాయము (Alcohol) ను పోసిబట్టీ తీయుదురు. అందువలన అత్తరు సారాయములోఁగలిసి పైకివచ్చును. ఈపద్ధతి యిప్పుడు వాడుకలోలేదు. నీళ్లకంటె సారాయము స్వల్ప వేడిమివలననే ఉడుకు పట్టుటవలన కొన్నిగింజలు, లవంగములు మొదలగు వస్తువులనుండి తైలము పూర్తిగా తీయుటకు సారాయము శక్తిలేక యుండును. మఱియు నీటితో తీసినపిమ్మట వలసినవారు సారాయములోగాని, తైలములోగాని కలుపుకొనవచ్చును. మిఛాం అనుచోట లవండరు తయారుచేయుట కుపయోగించు పెద్దయంత్రము మిక్కిలి గొప్పదికల్లదు. 100 మణుగుల వస్తువులనునిడి యొకేమారు అత్తరు తీయుటకు ఇదిపనికివచ్చును. ఇంత బ్రహ్మాండమయిన వాలుకా యంత్రములు ప్రపంచమున మిక్కిలి కొద్దిగా కలవు. ఇంతకంటె చిన్నవి ఫ్రాన్సు దేశమున నుపయోగించెదరు. అందువలన వివిధములగు నత్తరు లొకేమారు తీయఁగలరు. వారి బట్టీలు మనపూర్వు లుపయోగించు బట్టీ లంతమంచివి కావు. అత్తరుల తయారుచేయుపద్ధతి కనుగొనినవారలు మనవారేయైనను, మనదేశమున యంత్రము లభివృద్ధినొందక ప్రాథమికావస్థయందే యున్నవి. విదేశములయందు చల్లని నీరు పర్వతముల యందలి సెలయేళ్లనుండి తెప్పించి యావిరిని చల్లబరుతురు కాని ఇది యవసరముకాదు. ఉపయోగము మాత్ర మధికము. ప్రాంచివారు బట్టీక్రిందమంట బెట్టికాచెదరు. ఇందువలనపరిమళములకు మాడు వాసన రావచ్చును. లండనులోమాత్ర మట్లు చేయక 10 లేక 15 అశ్వశక్తిగల యావిరి యంత్రపు టావిరితో నీ పని నడుపుదురు ఇప్పుడు ఫ్రాంసులోగూడ నీపద్ధతి యవలంభించుచున్నారు. లండనులో నొక పెద్ద వర్తక సంఘమువారిటీవల నొక క్రొత్తవాలుకా యంత్రమును కనిపెట్టి యున్నారు. ఈ యంత్రమువలన సంధానింపఁబడిన నీరునుండి యత్తరు వేరుపఱచు శ్రమలేదు. ఆ పని

యంతయు యంత్రమే చేసికొన్నను. ఇది మిక్కిలి మంచిది.

(౩) చివుక పెట్టుట లేక నానబెట్టుట. ఘృతిమ్ము (Pomade) అను పరిమళ ముఖను ఫ్రెంచివారు చేయుదురు. ఇవి బజారుల లో అమ్మ అంగరాగ ముల వంటివి కావు. మంచి దూడ కొవ్వును, దుప్పికొవ్వును, పందికొవ్వును, పరిశుభ్ర పరచి కలిపి పింగాణి పాత్రలో వైచి వెచ్చ పెట్టుదురు. అట్లువెచ్చ పెట్టుటకు ఆవిరిగాని ఆవిరిస్నానము గాని యుపయోగింతురు. ఆ కొవ్వుకఱిగి వెచ్చగా నుండగా పుష్పములను దెచ్చి కఱిగిన కొవ్వులో వేయవలయును. అట్లు వానిని ఒకటి రెండు దినములుంచి నచో, కొవ్వునకు పరిళమును పీల్చుశక్తి గలిగి అది చాల పరిమళయుత మగును. ఈ కొవ్వు మరల స్వల్పవేడిమిగల యావిరితో కరిగించి, వడపోసి మరల క్రొత్తపుష్పములఁ జేర్చుచు వలసినంత పరిమళ వంతముగ చేసి కొన వచ్చును. పరిమళతైలములు ఈ పద్ధ తుల ననుసరించియేతయారు చేయుదురుగాని కొవ్వుకు బదులుగా నూనె నుపయోగించె దరు. అది ఆలివునూనెయైన ప్రశస్తము. మన నువ్వులనూనెయు నుపయోగించ వచ్చును. ఈ పద్ధతివలన నారింజ, గులాబీ, లవంగ పుటాకు, మొదలగు పరిమళములు తయారు చేయుదురు. పై పద్ధతులవలన తీయుటకు వీలు లేని అతిసున్నితములగు పరిమళ భాగములకు (పీల్చుట) అను నీ క్రింది పద్ధతి నుపయో గింతురు.

ఈ పద్ధతియందు ఫ్రెంచివారతి నిపుణులు

(4) పీల్చుట. ఈ పద్ధతి పరిమళ కారు నకు మిక్కిలి యుప యోగమైనది. ఫ్రెంచి ఘృతములు, తైలము లన్నియు నీపద్ధతి ప్రకారము తయారు చేసి నవియే. పైని జెప్పినమూడు పద్ధతుల యందలి స్వల్ప వేడిమికినికూడ చెడిపోవు గుణములు గల అతిసున్నితములగు పుష్పసారములీక్రింది పద్ధతిని యగ్నిసహాయము లేక తయారు చేయుదురు. నలుపలకలగు కమ్ములతో చేసినచట్టములను నిందు ఉపయోగిం తురు. ఈ చట్టములు మూడంగుళముల లోతుండును. అడుగుభాగముననద్దముండును. అది రెండడుగుల వెడల్పుండ వచ్చును. మూడడుగుల పొడవుండును. ఇట్టి చట్టము లను అద్దపుపలకలు బిగించినపిగా సంపాదించ వలయును. ఈయద్దపు చట్టములలో కొంచెము కొవ్వును కత్తితో నడుగున పట్టించి యద్దమంతయు కప్పవలెను. ఆ కొవ్వు అద్దము మీద పాతికయంగుళము దళసరిని పూయ వచ్చును. అందుపైని వికసించుటకు సిద్ధముగ నున్న మొగ్గలు వేసియుంచి 12 గంటల మొదలు 72 గంటలవరకు నుంచి, మరల నాప్రాతలోని పుష్పములుతీసి క్రొత్తమొగ్గలు వేయుచు వలసిన పరిమళమును కొవ్వుకు పట్టింపవచ్చును.

కొన్ని వర్తకసంఘములు బుత్తుకాలమునే నిట్టిచట్టములుమూఁడువేల వరకు నుపయోగింతురు.

పరిమళ పరిశ్రమ.

తైలములు చేయుటు కాచట్టములకు అద్దము బిగించుటకు బదులుగా తీగవల్లుదురు. ఆతీగ వలన పైని నూనెలో ముంచిన గుడ్డలువేసి ఒక్కొకగడి కొక్కొక పుష్పము చొప్పున పైకి తొడిమ యుండునట్లుపెట్టి ప్రతిదినము క్రొత్త పుష్పములనుమార్చి నూనెనుపరిమళ నంత మొనర్చుకొందురు. పరిమళముపూర్తిగా వచ్చిన పిమ్మట గుడ్డలను పిండి నూనెతీసికొని బుడ్లలో పోయుదురు. కొవ్వుకు బదులు కిరసనాయిలు సంబంధమైన (Parfine) అను వస్తువును వాడుటకు ప్రయత్నించిరి. కాని ఇందొక లాభమును, మరియొక చెడుగును కలదు. పారఫినుతో తయారుచేసినది మెతక వాసన వేయక యెంతకాలమైన నిలువయుండును కాని కొవ్వువలె పరిమళమునంతగా పీల్చుకొనలేదు.

పైన సర్వసాధారణమైన పద్ధతులుమాత్రము చెప్పఁబడినవి. కాని వివరముగ తెలిసికొనువారు పని ప్రారంభించవలయును. ప్రస్తుతము హిందూదేశమున నరణ్యముల యందును, ఇతర స్థలముల యందును విరివిగ పెరుగు పుష్పములు ఫలము లేగాక, తుంగకాయలు, కచ్చూరములు, మొదలగు వేళ్ల నుండియుదుంపలనుండియుకూడనత్తరులుచేసి లాభము పడయవచ్చును. కావలసిన రకముల యత్తరులను చేయఁగోరువారు కొన్ని ఎకరముల భూమియందు ముందు తోట అను పెంచి పుష్పములనుపొంది పిమ్మట యంత్రములను స్థాపించుట శ్రేయోదాయకము. మనదేశమునం దనేక ప్రదేశముల యందు కొన్నికొన్ని వృక్షములు పెక్కులు పెరుగును. వానినుండి తయారుచేసినచో తోటను పెంచవలసిన యగత్య ముండదు. యంత్రములకంతగా ఖర్చులేదు.

మన పూర్వుల పద్ధతులు.

తైలములో గింజలు, వేళ్లు, దుంపలు మొదలగునవివేసి కాచి తీయుటయేగాక అత్తరులు స్రవింపుపద్ధతినే తయారుచేయువారు. ఆ బట్టీలే యింతవరకు నభివృద్ధి పఱుచుకొనక మనవారు ఇప్పటి కొన్నికొన్ని స్వదేశ సంస్థానములయందును, ఘాజిపూరు, కనోజి పట్టణములయందును తయారుచేయుచున్నారు.

విదేశములయం దత్తరుచేయు ప్రసిద్ధ స్థలములు.

గ్రాసు, కేన్నెసు, నైసు అనుపట్టణములలో మిక్కిలి ప్రసిద్ధములగు నత్తరువులు చేయుదురు. మరియు నగ్ని పర్వతములనుండి వెలువడిన పదార్థములవలన భూములు సారవంతములై నారింజచెట్లు విరివిగ పెరుగు ఇటలీదేశమునందును, సిసిలీద్వీపము నందును నారింజచెట్లయొక్క వివిధ భాగములనుండి విరివిగ నత్తరులు చేయుదురు.

తూర్పు తురుష్కము నందును, బల్గేరియా దేశమునందును, గులాబీయత్తరు నిరివిగ తయారగును. ఆంగ్లేయ దేశమునందు లవండరు, పప్పరి మెంటు మిక్కిలి మంచిరకములు తయారగును. వీనికి ముఖ్యస్థానమగుమిఛాము నందలిలవండరు సుప్రసిద్ధము. వెల యధికముగ నుండును. ఇంకను నితరప్రదేశములు చిన్న వనేకములుగూడ గలవు.

కల్పిత పరిమళములు.

19,వ శతాబ్దాంతము నుండి కృత్రిమ పరిమళములు తయారు చేయుట పాశ్చాత్యులు కనుగొనిరి. అప్పటి నుండియు జర్మని, ఇంగ్లాండు, అమెరికా దేశములయందీ కృత్రిమ పరిమళము లనంతముగ తయారగుచున్నవి. సోడా దూకాణము లవా గుపయోగించు షర్బత్తులయందలి ఫలముల పరిమళములలో మూడువంతులు కల్పితములే.

ఇటీవలకని పెట్టిన క్రొత్త సంగతులు

పరిమళములను కొన్ని మయినములతోడను, కాగితములతోడను కలిపి ఇటీవల తైలరూపమున నుండునవి ఘన పదార్థములుగాఁ జేసి వానిని నుపయోగించుచున్నారు. ఇవి ఇంకను వర్తక రహస్యములుగా నుండుటచేత వానినిగురించి విపులముగ వ్రాయలేదు.

వం॥ సు॥ రా॥

అత్తలూరి పాపకవి.

కాశిక గోత్రుఁడు. అక్కిరాజు మనుమఁడు, శ్రీగిరి మంత్రిపుత్రుఁడు. ఈ కవి చెన్న బసవ పురాణమను గ్రంధమును వ్రాసి కందుకూరి అమృతలింగమునకుఁ గృతి నిచ్చెను. ఆ గ్రంథము పదునేడవశతాబ్ద ప్రారంభమున వ్రాసినట్లు తోచుచున్నదని బ్రౌన్ దొరగారును, ఈ కవి పదునెనిమిదవ శతాబ్దములోని వాఁడని మఱియొకఁడును జెప్పుచున్నారుగాని కవికాలము నిర్ణయించుట కెట్టి యాధారమును గనఁబడుటలేదు.

ఈ గ్రంధము అయిదాశ్వాసములుగల శైవపురాణము. అందలి కథను రేణుకమహర్షి అగస్త్యునకుఁ జెప్పినట్లుగా నున్నది. "ఓం" అనుదానికి నర్థము చెప్ప లేనందున బ్రహ్మను బ్రహ్మత్వమునుండి తొలఁగించి, తత్పదవిని బూనిన కుమారస్వామిని భూలోకమున జన్మించి ప్రజల నుద్ధరింపుమని పార్వతీ పరమేశ్వరులు వేడగ కుమారస్వామి చెన్నబసవన్నగఁ బుట్టెనని ఈ పురాణ సంప్రదాయము. ఈ పుస్తకమునఁ బురాణ లక్ష్యము లన్నియు గలవుగాని ఇతర పురాణములకంటె ఎఱుకల వర్ణన, తస్కరుల వర్ణన మొదలగు వాని మూలమున హాస్యరస మెక్కువగ నున్నది. కవిశైలి మృదువుగను మనోహరముగనే యున్నది.

అత్యగ్నిష్టోమము. యజ్ఞవిశేషము. అగ్నిష్టోమముకంటె నెక్కువ ఫలమిచ్చునది.

అత్పాడి. అత్పాడి యను గ్రామము బొంబాయిరాజధానిలోని అంధీ అను సంస్థానములో నున్నది. జనసంఖ్య ౧౯౦౧ లో ౫౦౨౭. ధంగాడీలనునొక తెగవారలిచ్చట ఖిలార్ అను పశువులను పెంచెదరు. అవియుండుటచేత నే ఈ గ్రామమునకు ప్రసిద్ధికలిగినది. ఈ గ్రామసమీపములో ఖక్సమేడ్ అను చోట నాథుఁడను దేవుని యాలయము గలదు. అందుచే అక్కడకు యాత్రికులు ప్రతిసంవత్సరము వెళ్లెదరు. అక్కడ గొప్ప పశువుల సంతగూడ జరుగును.

అత్రాఫ్-ఇ-బల్దాజిల్లా. ఈజిల్లా హైదరాబాదు సంస్థానములో నున్నది. దీనికి ఎల్లలు ఉత్తరమున మెదక్, ఎల్ గొన్డాల్ అనఁబడు జిల్లాలు. దక్షిణమున మహబూబునగరము. తూర్పున నల్లగొండ. పడమర గల్బర్గ బీడార్ అను నవి. ఈజిల్లా (1) మెడ్చాలు (2) అంబరుపేట (3) షాహాబాదు (4) అసఫీనగరము (5) పాట్లూరు జుమ్లాలు అను నైదు తాలూకాలుగ విభజింపఁబడియున్నది.

ఈ జిల్లాయంతయు మొత్తముమీఁద పర్వత మయము. ఇక్కడ అనంతగిరి, రాజకొండ అనుకొండలు గలవు. నదులు మూసి, మంజీర, అను నవి. మఱికొన్ని చెఱువులున్నవి. అడవులు చాలకలవు. వానిలో వన్యమృగము లుండును.

ఈ జిల్లాయొక్క వైశాల్యము ౩౩౯౯ చదరపుమైళ్లు. నదులు కాలువ లుండుటచే జిల్లాలో చాలభాగము తేమగనుండి చలిజ్వరములు, మన్యజ్వరములు తఱచుగ వచ్చుచుండును. అక్టోబరుమాసము నుండి మార్చినెలాఖరువఱకు మాత్రము చాల ఆరోగ్యముగ నుండును.

పూర్వ చరిత్ర. ఈ జిల్లాను (౧౧౫౦-౧౩౨౫) పూర్వము కాకతీయ వంశజులు ఓరగల్లు రాజధానిగ నేర్పఱచుకొని పాలించెడివారు. పదునాల్గవ శతాబ్దమునుండి ఇది మహమ్మదీయ పాలనములోనికి వచ్చెను. సుల్తాను మహమ్మదుషా భామినీ కాలములో (౧౫౧౨) తెలుఁగు జిల్లాలకు అప్పటి ఏలికయగు సుల్తాన్ కొలి కుతుబ్షాయను నతఁడు తన స్వాతంత్ర్యమును ప్రకటించెను. తరువాత ఔరంగజేబు దక్కను దేశమును స్వాధీనపఱచుకొనునంత పర్యంతము ఈకుతుబ్షా వంశస్థులే ఏలుచుండిరి. ఔరంగజేబు ఈజిల్లాను ఢిల్లీ సామ్రాజ్యమునకు చేర్చెనుగాని హైదరాబాదు సంస్థానము ఏర్పాటయినప్పుడు (అనఁగా పదునెనిమిదవ శతాబ్దములో) ఈ జిల్లా మరల దానినుండి వేఱుచేయఁబడెను.

ఇక్కడ ప్రసిద్ధికెక్కిన పట్టణములు రెండు కలవు. అందులో గోలకొండ యనునది యొకటి. దీనికే మహమ్మదు నగరమని పేరు.

ఈ పురము కుతుబ్ షాహి నవాబులకు రాజధానిగ నుండెడిది. హైదరాబా దిక్కడకు ఐదుమైళ్లలో యున్నది గోలకొండలో నవాబుల గోరీలును కోటయు జూడదగినవి.

రెండవదియగు మైసారమ్ నగరము హైదరాబాదునకు పది మైళ్లలో కలదు. ఇక్కడ, శిథిలములగు దేవాలయములును, ఔరంగజేబు చక్రవర్తిచే పడగొట్టబడిన దేవాలయముల చిహ్నములును కలవు. హిందూ దేవాలయములను పడగొట్టించి ఆ రాళ్ళతో ఔరంగజేబుచే గట్టింపబడిన మసీదుకూడ యొకటి గలదు. జనసంఖ్య ౧౯౦౧ లో (౮,౨౦,౭౦౨) ఈజిల్లాలో ౮౮౭ గ్రామములు కలవు. ఇక్కడ నున్న జనులలో నూటికి ౮౭ గురు హిందువులు. నూటికి ౮౬ గురు తెలుగుభాష మాట్లాడెదరు.

ఇచ్చటి జనులలో చాలభాగము కాపులు బ్రాహ్మణులును, కోమటులును, గాండ్లు (కల్లు గీయువారు), సాలెలును, చర్మము (తోలు)పనిజేయు గొడారి వాండ్లును గలరు. ఈ ప్రజలో నూటికి ముప్పదిమగ్గురు చొప్పున వ్యవసాయముచే జీవించెదరు. ఇక్కడ వరి వ్యవసాయము తక్కువ. కొన్ని చేతిపనులు గలవు. గుఱ్ఱములను పెంచెదరు.

అడవులలో మంచి కలపదొరకును. ఈ జిల్లాలో మంచిరోడ్లు ఉన్నవి. కాలువలును కలవు. ఇనుపదారి నూఱుమైళ్ల పర్యంతము వ్యాపించియున్నది. అందుచే జిల్లాలో వర్తకము బాగుగనే జరుగుచున్నది. కొద్దిపాటి ఎగుమతులును జనులకు కావలసిన పదార్థముల దిగుమతియును గూడ నున్నవి. దేశమునకు కఱవుబాధ విశేషించిలేదు.

పరిపాలన.

ఈ జిల్లా రాజకీక సదుపాయముల కై మూడు భాగములుగ విభజింపబడి యున్నది. రెండు తాలూకాలకొక తహశ్శీలుదారుండును. అనగా ఆఱు తాలూకాలకు ముగ్గురుందురు. మొదటియాతడు అంబరుపేట షాహబాదునకు అధికారి. తక్కిన ఇద్దఱు తహశ్శీలుదార్లు ఈతనికి లోబడియుండెదరు. కాని వారిద్దఱును తమ తాలూకాలలో రెండవక్లాసు మేజస్ట్రేటుగను మూడవక్లాసు తహశ్శీలుదారు అధికారిగను ఉండెదరు. మొదటి తహశ్శీలుదారే జిల్లాకు ముఖ్యాధికారి. మిగత తహశ్శీలుదార్ల తీర్పులపై అప్పీలు ఈతనికి చేయవలెను. ఈతనికి సహాయోద్యోగి యొకడుండును. ఈతడు గ్రామములో లేని సమయములలో ఈ అసిస్టెంటు ఆతనికి బదులుగ కేసుల విచారించును గాని అన్ని సివిలు వ్యాజ్యములకును మొదటి తహశ్శీలుదారే స్వంతముగ తీర్పు చెప్పవలెను.

ఈతనికి పోలీసు సూపరింటెండెంటు కూడ తోడ్పడి క్రిమినలు వ్యవహారముల నెఱపును.

ఇక్కడ పెద్దచెఱసాల లేకపోవుటచే ఖైదీలనందఱను హైదరాబాదునకే పంపుదురు. విద్యమిక్కిలి తక్కువ. ప్రాథమిక పాఠశాలలు తొమ్మిదియు నొక మిడ్డిల్ స్కూలును గలవు. హైస్కూలు లేనేలేదు. సర్కారువారు ధనము వ్యయపఱచుటకు పూనుదీయుట లేకపోయినను జదువుకొనువారిసంఖ్య తక్కువగుటయే దీనికిఁగారణము.

అతికాయుఁడు. రావణునకు ధాన్యమాలిని యను భార్యవలనఁ బుట్టిన పుత్రుఁడు. మిక్కిలి స్థూలశరీరము గలవాఁడు. వీఁడు తపస్సుచే బ్రహ్మదేవుని మెప్పించి దివ్యరథమును, అస్త్రంబును, కవచంబును, సురాసురులచే నవధ్యత్వంబును వడసి, ఇంద్రుని, వరుణుని నోడించెను. రామరావణ యుద్ధమునందు వీనిని లక్ష్మణుఁడు బ్రహ్మాస్త్రములోఁ జంపెను. (వా. రా. యుద్ధ. స. ౭౧)

అతిథి. ౧. అత్రిగోత్ర మందలి యొక ఋషి. (చూడుఁడు అత్రి.)

౨. (సూ. వం.) శ్రీరాముని పౌత్రుఁడు. కుశునిపుత్రుఁడు. ఇతని పుత్రుఁడు నిషధుఁడు.

అతినాముఁడు. చాక్షుష మన్వంతర మందలి సప్తర్షులలో నొక్కఁడు.

అతిభానుఁడు. కృష్ణునకు సత్యభామ యందు జనించిన పుత్రుఁడు.

అతిబాహువు. కశ్యప స్త్రీయైన ప్రాధకుఁ బుట్టిన గంధర్వులలో నొక్కఁడు.

అతిమధురము. ఇదియొక గురువింద జాతిచెట్టువేరు. ఈ వేరు నెండనిచ్చి చిన్న చిన్న ముక్కలుగాఁగోసి రవానా చేయుదురు. ఇది ఇండియాలోని యడవి భాగములయందుఁ దఱచుగాదొరకును. దీనికిఁగ్వాడ కఱ్ఱల కఱ్ఱవలెఁ బైబెరడు గోధుమవర్ణము కలిగి యుండును. నోటిలో వేసికొనిన నోరంతయు తియ్యఁగానగును. మిగిలినరసము లిందేవియుఁ గానరావు. ఇయ్యది మధుస్కంధములోనిది (అ. హృ- సూ- అ ౧౦). మిక్కిలి కఠినమ్ముగ నుండును. దీనినే యష్టిమధుకమనియు, మధుకమనియునందురు. చలువ, వీర్యవృద్ధి, బలము వీనిని గలుగఁజేయును. పైత్యము, రక్తపైత్యము, విదాహము, క్షయ, ఉబ్బసము, మేహము, ప్రదోషము, చర్ది వీని యందు దుపయోగింతురు. వ్రణములపై వస్తికర్మ (పిచికారీ) చేసినపిమ్మట నీ వేరుపొడి చల్లి కట్టుకట్టిన మలినమును శోధించును. దాహమును తగ్గించుటకింతటి యోషధి వేఱేదియు నింకను గనుఁబడలేదు.

అతిమాత్రము. సామాన్యముగా మానవులు దిన మొక్కంటికి 50 అవున్సులు, సేరు అనగా రమారమి ఒకటిన్నర సేరు మాత్రమును విసర్జింతురు. ఇంతకంటె నెక్కువ మాత్రము నొకమానవుడు విసర్జించునెడల నది వ్యాధిలో జేరును. మాత్రమును

హెచ్చుగవిసర్జించెడి యనేకులరోగులమూత్రములో చక్కెర యుండును. మూత్రమునందు చక్కెర లేని యతిమూత్ర వ్యాధియు గలదు. అట్టివ్యాధి వట్టి అతిమూత్ర వ్యాధి యనియు, చక్కెరగల అతిమూత్ర వ్యాధిని మధుమూత్ర వ్యాధియనియు చెప్పవచ్చును.

వట్టి అతిమూత్రము

వట్టి అతిమూత్రవ్యాధి చాల నరుదు. సామాన్యముగ నాడువారలలో కంటె మగవారలలో నీవ్యాధి రెట్టింపు హెచ్చుగ నుండును. ఇది సామాన్యముగ నొక కుటుంబములో ననేకులకు వచ్చుచుండును. ఆ కుటుంబములలో మతిభ్రష్టత, మూర్ఛ మొదలగు నరముల సంబంధమైన వ్యాధులు తరుచుగ కానన్గును. ఒక కుటుంబములోని నాలుగుతరములవారిలో 26గురు రోగులు లెక్కకు వచ్చిరనియు అందు 11 గురి కీజాతి అతిమూత్రము కనపడెననియు నొక వైద్యుడు వ్రాయుచున్నాడు. సవాయి, మెదడు జ్వరములు, నెత్తిమీద దెబ్బలు, పొట్టమీద దెబ్బలు, భయము, విచారము, చలి, అతి త్రాగుడు, తిండిలేక పోవుట, ఇవియన్నియును ఈ వ్యాధితో సంబంధముకలిగి యుండవచ్చును.

వ్యాధి లక్షణములు

1. మూత్రము మిక్కిలి హెచ్చుగ నుండుట 2. భరింపరాని దాహము. ఇవి రెండును ముఖ్యమైన చిహ్నములు. వ్యాధి కాలక్రమమున రోగికి దెలియకుండగ గాని, అకస్మాత్తుగగాని రావచ్చును. ఒకానొక రోగి యొక్క దినమునకు 10 లేక 12 సేర్ల మూత్రమును విసర్జించవచ్చును. త్రాగిన నీళ్లకంటె మూత్ర మెక్కువగ నుండి దేహమును క్రమముగ కృశింపజేయును. మూత్రముయొక్క బరువు నీటికంటె 'వేయింటికి రెండుపాళ్లు' మొదలు ఐదుపాళ్లవఱకు హెచ్చుగ నుండును (Sp Gr. 1002 to 1005). మూత్రములో చక్కెర యుండదు. దాహమధికముగ నుండును. నోరు, నాలిక, గొంతుక యారిపోవును. ఆకలి మిక్కిలి విపరీతముగ నుండును. మొట్టమొదట జీర్ణశక్తి సరిగా నుండునుగాని కొంతకాలమునకు తగ్గిపోవును. పిమ్మట కొన్నాళ్లకు కాళ్లనొప్పులు, నడుమునొప్పి మొదలగు గుణములు పుట్టును. తఱుచు తలనొప్పి వచ్చుట, శరీరముమీద దురదలు పుట్టుట, తిమ్మిరులుగ నుండుట, చూపు తగ్గిపోవుట, బుద్ధిబలము తగ్గుట, కోపము హెచ్చుగుట, విచార గ్రస్తముగ నుండుట, నిద్ర లేకపోవుట, సంభోగేచ్ఛ కృశించుట, ఇవన్నియు వ్యాధి హెచ్చినకొలది గనుపించవచ్చును.

సాధ్యాసాధ్య లక్షణములు

కొందఱ కీవ్యాధియందు దుర్గుణములు పుట్టకయే పోవచ్చును. కాని, బలహీనము హెచ్చయిన కొలది నితరవ్యాధులు కలిగి వానిచే బాధ కలుగవచ్చును. అన్నహిత వెపుడు తగ్గునో అప్పుడే వ్యాధి క్రూరరూపము

జెందుచున్నదని తలపవచ్చును. మెదడు చెడిపోయినట్లు సూచన లున్నయెడల, వ్యాధి కుదరదని చెప్పవచ్చును.

వ్యాధి కారణము

ఈవ్యాధియొక్క కారణ మింకను సరిగా తెలియలేదు. మూత్రతిత్తుల (Kidneys) సంబంధమైన నరముల పటుత్వము తగ్గిపోవుటవలన నాయూ యవయవములు సరిగా బనిచేయక పోవుటచేత నెత్తురులోని నీరు హెచ్చుగ బయలు వెడలిపోవును. క్రిందితరగతి జంతువుల మెదడులో నొకభాగమును మనము రేపినయెడల మూత్ర పరిమితి హెచ్చును. మానవులలో నట్టి రేపుదలకు గారణము శరీరములో నేదోయొక భాగమునందు బుట్టుచుండవచ్చును. చెవిలోపల చీముతో నిండుకొనియున్న కురుపున్నప్పుడు కొందఱకు మూత్రము హెచ్చుగ నున్నట్లును, కురుపు చితికి చీము బయటికిరాగానే మూత్రము సాధారణముగ నున్నట్లును, తిరుగ చీము చేరుకొనునప్పుడు మూత్రము హెచ్చుచు చీము పోయినప్పుడు తగ్గుచుండుటయు కొందఱు శోధకులు కనిపెట్టియున్నారు.

క్రిందితరగతి జంతువులలో జీర్ణకోశమునకు సంబంధించిన కొన్ని నరములను గోసివేసినప్పుడు మూత్రము హెచ్చగుటయు, మానవులలోగూడ జీర్ణకోశ సంబంధమైన కొన్ని నరములు చెడిపోయినప్పుడు మూత్రము హెచ్చగుచుండుటయు నొకరు కనిపెట్టియున్నారు. మెదడునందు పుట్టినపుప్పి, కంతులు, మొదలగువ్యాధులవలన మూత్రము హెచ్చు కావచ్చును. సవాయి మొదలగు వ్యాధులవలన మెదడు చెడిపోయినప్పుడు కూడ మూత్రము హెచ్చుకావచ్చును. కాని మూత్రపుతిత్తులలోని వ్యాధివలన నీవ్యాధి కలుగుచున్న దనుటకు నిదర్శనములు లేవు.

చికిత్స

కారణము సరిగా దెలియకపోవుటచేత చికిత్సయు సరిగా తెలియలేదని చెప్పవచ్చును. ఏమందులైనను నప్పటికి కొంచెము గుణము కలిగింపవచ్చునుగాని వ్యాధిని కుదర్చనేరవు. ఎర్గాటు, బెలడోనా, నైట్రోగ్లిసరిను, లోహము, బ్రోమయిడు, మొదలగునవి కొందఱకు ఉపయోగకరములు. విద్యుచ్ఛక్తివలన కొందఱకు గుణముకావచ్చును. ఆహారాదులను నిర్ణయముగానుపయోగించుటచే వ్యాధియొక్క క్రూరత్వము కొంతవఱకు తగ్గును. దాహము గలిగినపుడు త్రాగు నీటిని మిక్కిలి తగ్గించుటవలన ప్రయోజనములేదు. మంచుగడ్డ ముక్కలు తినుటవలన దాహము తగ్గవచ్చును. సారాయి, సోడావాటరు, కాఫీ, వీనిని వర్జింపవలయును. వీనివలన మూత్రము హెచ్చగును. ఆహారముతగ్గించునెడల తూనిక తగ్గిపోకుండ రోగినప్పుడప్పుడు తూచుచు సరి చూచుకొనవలయును.

కొద్ది వ్యాయామము, చక్కనిగాలి, తగిన దుస్తులు, వీనివలన రోగికి కొంత గుణముకలు

గును. శరీరమును పిసుకుట, గుద్దుట, పట్టుట మొదలగువానివలన సుఖముగలుగును. ఆవిరి పట్టుట, వేడినీళ్ల స్నానముచేయుట వీనివలన శరీరము, ఆరి షోకుండనుండును. మలబద్ధమునకు మిక్కిలి విరేచనకారియగు మందులను వాడకూడదు. ఎనీమా వలనగాని, మసాంబరము, కాస్కారాసెగ్రడా మొదలగు మాత్రలవలనగాని, కడుపుకదలించు వ్యాయామము వలనగాని, విరేచనము చేయించవచ్చును.

మధుమూత్రవ్యాధి

మధుమూత్రవ్యాధి, * అనగా మూత్రమునం దెల్లప్పుడు ద్రాక్షచక్కెర *కనబడుచుండు వ్యాధి. ఈ వ్యాధి ఆడువారలలో కంటె మగవారిలో నెక్కువగానున్నట్లు వైద్యుల యభిప్రాయము. చిన్నవయస్సు నందుకంటె 30 సంవత్సరముల వయస్సు గడచిన తరువాత నీ వ్యాధి హెచ్చుగనుండును. ఈవ్యాధి సామాన్యముగ భాగ్యవంతులలో హెచ్చుగనుండునని యనేకుల యభిప్రాయముకాని బీదవారలలో లేకపోలేదు. వృత్తిని బట్టిచూడగా

* ఆయుర్వేదవైద్యులు దీనినే మధుమేహమందురు.

* చక్కెరలలో ద్రాక్షచక్కెర, చెఱకు చక్కెర, పాలచక్కెర అని భేదములు గలవు. ద్రాక్షచక్కెర ద్రాక్షపండ్ల రసమునుండి తీయవచ్చును. చెఱకు చక్కెరను పాలచక్కెరను, అట్లే చెఱకునుండియు, పాలనుండియు తీయవచ్చును. ద్రాక్షచక్కెర మైలతుత్తపు ద్రావకముల కలిపివేసి దానినుండి రాగిని విడదీయును. చెఱకు చక్కెర, అట్లు చేయజాలదు.

విస్తారము బుద్ధి పరిశ్రమగల వారికే యీ వ్యాధి హెచ్చుగ గలుగునని చాలమంది వైద్యుల యభిప్రాయముకాని మనోవ్యాపారమంతగ లేని వ్యవసాయదారుల యందును, పనివారలయందునుకూడ, నీవ్యాధి గలదు.

వంశపారంపర్యము

వంశపారంపర్యముగనే కాని మధుమూత్రమురాదని చెప్పుటకు నిదర్శనములు లేవు. కొన్ని కుటుంబములలో రెండుమూడు తరములవఱకును నన్నగా తండ్రి, తాతలు మధుమూత్రవ్యాధిగ్రస్తులై తాముకూడ మధుమూత్రవ్యాధి పీడితులగువారి ననేకులను మనము చూడవచ్చును. ఒకానొకచో నన్నదమ్ములలో నందఱకు కొద్దిగనో హెచ్చుగనో పెద్దవయస్సునందు మధుమూత్రముండవచ్చును. ఇదిగాక తమ వంశములో మూత్రవ్యాధి యెంతమాత్రము కానరాకపోయినను తమకుమధుమూత్ర ముండవచ్చును. కాబట్టి మధుమూత్రము వంశపారంపర్యముగ వచ్చెనా? తండ్రికి మధుమూత్రమును కలిగించినకారణములే కుమారునికిని తటస్థించెనా? అను విషయములను తెలిసికొనుట కింకను దగిన యాధారములు కానరావు.

జాతి

ప్రపంచమునం దన్నిదేశముల యందు కంటె బహుశా హిందూదేశమునం దీవ్యాధి హెచ్చుగ నున్నదేమోయని తోచుచున్నది.

అందును మహమ్మదీయుల యందుకంటె హిందువులయం దీవ్యాధి హెచ్చుగనుండు నని కొందఱు చెప్పుచున్నారు. అడవిజాతుల యందుకంటె నాగరకత చెందిన జాతులలోను, హీన వర్ణములకంటె నగ్ర వర్ణములలోను, ఈవ్యాధి, హెచ్చుగనున్నట్లు నిదర్శనములు గలవు.

తలమీాద దెబ్బతగిలిన పిమ్మట మధుమూత్రము ప్రారంభించినట్లును, భయముచేగాని అధిక కామక్రోధములచేగాని, ధననష్టము, ఉద్యోగనష్టము, మొదలగువానిచే గలిగిన యధికమనోవిచారముచేగాని, మధుమూత్ర మకస్మాత్తుగా బుట్టినట్లును నిదర్శనములుగలవు. 40 మొదలు 60 సంవత్సరముల లోపుగానుండు స్థూలకాయులకును, మధుమూత్రమునకును, కొంతవఱకు సంబంధము కలదని తోచుచున్నది. కాని, ఎన్నడును లావుగనుండి యెరుగని వారి కనేకులకు గూడ మధుమూత్ర వ్యాధిగలదు.

ఆహారము

మనము తిను నాహార పదార్థములను నాలుగు విధములుగ విభజింపవచ్చును.

1. వరిపిండి మొదలగు పిండి పదార్థములు. 2. చెఱకు చక్కెర, పాలచక్కెర, ద్రాక్ష చక్కెర మొదలగు చక్కెరలు. 3. కండను వృద్ధిచేయు మాంసము, గ్రుడ్లు, మినుములు, గోధుములు మొదలగు మాంసకృత్తు పదార్థములు. 4. నెయ్యి, నూనె మొదలగు క్రొవ్వు పదార్థములు.

1. సామాన్యముగ వ్యాధిలేని మనుష్యుడు పిండి పదార్థము లెంతతిన్నను మూత్రములో చక్కెర కానరాదు. కాని మధుమూత్ర వ్యాధిగలవారలు పిండిపదార్థముల నెక్కువగ దినినకొలదిని మూత్రములో చక్కెర యెక్కువయగును.

2. ఆరోగ్యవంతుడైనను మిక్కిలి యధికముగా చక్కెరను దినిన యెడల వాని మూత్రములో చక్కెర కనపడును. చక్కెరను నధికముగా దినుట కలవాటుపడిన వారల మూత్రములో బహుశా కొంతకాలమునకు నెల్లప్పుడు చక్కెర కనబడవచ్చును. ఈ విషయ మింకను నిశ్చయముగా దెలియదు. కాని చక్కెరనెక్కువ తిను భాగ్యవంతుల యిండ్లలో నీవ్యాధి యెక్కువగా గనబడుచుండుటచేత సందేహమునకు గారణమగుచున్నది.

3. పిండి పదార్థములను, చక్కెరలను, తగ్గించి మాంసకృత్తులను నెక్కువ తినుటచే మధుమూత్రము కొందరకు తగ్గును. మరి కొందరకు పిండిపదార్థములను, చక్కెరలను తగ్గించినప్పుడు మాంసకృత్తు పదార్థముల నుండియే చక్కెర పుట్టి మూత్రములో విశేషక చక్కెర యుండును.

4. క్రొవ్వు పదార్థముల తినుటవలన మధుమూత్ర వ్యాధియందు హెచ్చు తగ్గులెంతగా గానరావు.

పైవిషయములను బట్టిచూడగా నాహార మువలన నెంతవఱకు మధుమూత్ర వ్యాధి నివృత్తి యగుచున్నదో తెలియదుగాని పిండి పదార్థములను, చక్కెరలను, తగ్గించినప్పుడు మూత్రములో చక్కెర తగ్గుచుండుట సాధారణముగా గానఁగుసని తెలియుచున్నది. తిండినెక్కువగా దినుచు లావుగ నున్నవార లకుమధుమూత్రవ్యాధి రావచ్చునని కొందఱు చెప్పుదురుగాని మొదటి నుండియు బొత్తుగ సన్నముగానున్న వారలుకూడ మధుమూత్ర రోగులుగ నక్కడక్కడనుండుటవలన స్థూల కాయమునకును మూత్రరోగమునకునుగల సంబంధ మింకను తెలియ లేదు.

సంభోగము

అధిక సంభోగమువలన నరముల పటుత్వముతగ్గి మధుమూత్ర వ్యాధి కలుగునని కొందఱ యభిప్రాయము. మధుమూత్రవ్యాధిగల రోగులనేకులు తమ కధిక సంభోగమువలన నీవ్యాధికలిగి యుండవచ్చునని తామే చెప్పుదురు. కాని బొత్తుగ నెన్నడును సంభోగ మెఱుగని బ్రహ్మచారులకుగూడ కొందఱకీ వ్యాధియుండుటచేత సంభోగమునకును, ఈ వ్యాధికిని, ఎంతవఱకు సంబాధమికలదో సరిగా జెప్పుటకు వీలు లేదు.

వివిధావయవముల యందలి వ్యాధులు

1. మెదడులో కొన్ని భాగములయందు వ్యాధి లేక దెబ్బలు.

2. వెన్నెముకలో కొన్ని స్థలములలో వ్యాధి లేక దెబ్బలు.

3. వెన్నెముక, ముందువైపున సింపతిటిక్ గాంగ్లియా (Sympathetic ganglia) అను నరస్థానముల వ్యాధులు.

4. జీర్ణకోశమునకు సంబంధించిన నరముల వ్యాధులు.

5. వృకమము (Panereas), అనగా నొకానొక జీర్ణరసమును తయారుచేయు నొక గ్రంథి, అందలి వ్యాధులు.

6. థైరాయిడు సూప్రారినల్ (Suprarenal) పిట్యూటరీ (Pituitary) మొదలగు శరీరములలోని కొన్ని యితరగ్రంథుల వ్యాధులు.

7. కాలేయము (Liver) నందలి కొన్ని వ్యాధులు.

ఇవి యన్నియు నేవిధముననో మధుమూత్రమును బుట్టించును. కాని, ఇంతవఱకు నిశ్చయముగ నాయావ్యాధుల కారణములుగాని, వానివలన మధుమూత్రము పుట్టు రీతులుగాని, మనకు సరిగా దెలియవు.

లక్షణములు

కొద్దిపాటి మధుమూత్రవ్యాధి యందు మూత్రమునందు చక్కెర యుండుట తప్ప యితర లక్షణము లేవియు కానరావు. ముఖవర్చస్సు మారదు. కాని, తీవ్రవ్యాధియందు రోగి యొక్క ముఖము ముడతలుపడి కృశించి పోయినట్లు స్పష్టముగా దెలియును. ఈలక్షణములు పెద్దతనములో మధుమూత్రముగల స్థూలకాయులలోకంటె, పసివారలలో నెక్కిలి

స్పష్టముగా దెలియును. కొందఱు లైఫ్ ఇన్ సూర్యరెన్సుకొఱకుగాని, రాచపుండ్లు, కంటి లోనిపువ్వు, మొదలగు నితరవ్యాధులకై గాని వైద్యునియొద్దకు వెళ్లినప్పుడు, వైద్యుడు తమకు చెప్పగా మధుమూత్రవ్యాధి తమకున్న దని తెలిసికొందురుకాని తమకట్టివ్యాధియున్న దని యనుమానమైనను పొందియుండరు.

మధుమూత్రవ్యాధి యొక్క ముఖ్య లక్షణములు

1. మూత్రములో ద్రాక్ష చక్కెరుండుట.

2. మూత్రము హెచ్చుగ బోవుట.

3. దాహము.

4. మిక్కిలి యాకలి.

5. కృశించి పోవుట.

చక్కెర

మూత్రములో చక్కెర యెప్పుడు పుట్టెనో యనేక రోగులకు మొట్ట మొదట తెల్సియదని పైని చెప్పియుంటిమి. బలహీనము, శరీరము కృశించి పోవుట, పనిచేయ లేకపోవుట, సంభోగమునందిచ్ఛ తగ్గిపోవుట, అధికముగా నాకలిచే అధికకోపము మొదలగు లక్షణము లను రోగి కనిపట్టవచ్చును. మూత్రములో చక్కెర పోవుట సాధారణముగా రోగులకు దెలియదు. కాని మూత్రము పోసినచోట్ల చీమలు పట్టుచుండుట కొందఱు రోగుల కను మానము కలిగించును. మూత్రమునందు ద్రాక్ష చక్కెరయున్నట్టు లీ క్రిందిశోధన వలన దెలియగలదు.

1. ఒక్కతులము మైలతుత్తమును 15 తుల ములవాన నీటిలోగలిపి ద్రావకము చేయుము.

2. నాలుగు తులముల పొటాసియము టార్ట్రేటును రెండు తులముల కాస్టిక్ సోడాను 15 తులములవాన నీటిలోగలిపి ద్రావ కము చేయుము.

ఒకటవద్రావకమును, రెండవ ద్రావక మును సమానభాగములుగ నెత్తి పోగించి, అందుకు సమభాగము మూత్రము చేర్చి తిరిగి కాచినయెడల మూత్రములో ద్రాక్షచక్కెర యున్న యెడల దానిలో పసుపుపచ్చనైనట్టి గాని యెఱ్ఱనైనట్టిగాని పదార్థమేర్పడును. ఇద్ది మైలతుత్తములోని రాగి.

మూత్రము హెచ్చుట

ఇదియు చక్కెరవలెనే దొంగతనముగా ప్రవేశించును. రాత్రుల యందు సామాన్యముగా నిద్రచెరుపుకొని మూత్ర విసర్జనకు లేవని వారలు లేవవలసి వచ్చుటచే కొందఱీ లక్షణ మును గుర్తింతురు. మరికొందఱికి వైద్యులు చెప్పినగాని తెలియక పోవచ్చును. సాధారణ ముగా మనము దినమున కొకటిన్నర సేరు మూత్రమును విసర్జింతుముకాని తీవ్రమైన అతిమూత్రవ్యాధిగల రోగులు దినమునకు 6 మొదలు 8 సేర్ల మూత్రము విడువవచ్చును. మూత్రముయొక్క బరువు సామాన్యముగా నీటికంటె వేయింటికి 10 మొదలు 30 వంతు లకు హెచ్చుగ నుండదుకాని మధుమూత్ర రోగుల మూత్రము వేయింటికి 25 మొదలు

50 రెట్లు హెచ్చుగ తూగవచ్చును. మధుమూత్రరోగుల మూత్రము సామాన్యముగా వట్టిగడ్డి వర్ణముగాను నిర్మలముగ నుండును.

అతిదాహము

మూత్ర మధికమైన కొలదిని దాహమధికమగును. ద్రవ పదార్థములు హెచ్చుగా త్రాగిన కొలదిని మూత్రమధికమగును. అందున, టీ, కాఫీ, మొదలగునవి మూత్రమును మరింత హెచ్చించును. దాహముచే నాలుక యెండిపోయి బెరడుకట్టును. శరీరముకూడ నెండిపోయి పొడిపొడి వుండుచుండును.

మితిమీరిన యాకలి

ఇది వ్యాధికొంతవఱకు ముదిరినతరువాత గాని యంతగ దెలియదు. మొట్టమొదట నాహారములోని పిండి పదార్థములుమూత్రము చక్కెరగా మారిపోవును. వ్యాధి ముదిరినకొలది మాంసకృత్తుపదార్థములుకూడ చక్కెరగా మారి మూత్రములో పోవుచుండుటచేత నాకలి యతితీవ్రమగును.

కృశించిపోవుట

సామాన్యముగా నాకలిబాగుగనుండి జీర్ణశక్తి సరిగా నున్నంత కాలము రోగులు కృశింపరు. కాని కొంతకాలమునకు జీర్ణశక్తియు నాకలియునుతగ్గును. దీనితో శరీరము శీఘ్రముగ కృశించిపోవును.

ఇతర లక్షణములు

చిగుళ్లుబ్బి, నాభి వ్రేళ్లుబడి మెత్తగనుండి నొక్కిన నెత్తురు చీము వచ్చుచుండును. పండ్లు పుప్పిపడి వదులై త్వరలో నూడిపోవును. సామాన్యముగా మధుమూత్ర రోగులకు మలబద్ధము హెచ్చుగనుండును. కాలేయము (Liver) వృకము మొదలగు నవయవములు చెడిపోవచ్చును. ప్రేగులలో క్షయసంబంధమైన పుండ్లు పుట్టవచ్చును. ఊపిరి తిత్తులలో క్షయ ప్రారంభము కావచ్చును. ఇది మధుమూత్రరోగులలో నూటికి 30 మందికి మరణకారణమగును. క్షయ హెచ్చినపిమ్మట కొందఱకు నతిమూత్ర లక్షణములుతగ్గి దాహమును, మూత్రములో చక్కెరయుగూడ తగ్గిపోవచ్చును. గుండెలలో సామాన్యముగా హెచ్చుజబ్బు కానరాదు. మూత్రపిండములలో (Kidneys) మొట్టమొదట నేవిధమైన వ్యాధియుగానరాదు. కాని, కొంతకాలమునకు మూత్రపు తిత్తులుబ్బి 'శ్వేతధాతువు' అను మాంసకృత్తు పదార్థము చక్కెరతోగూడ వెలువడును.

చర్మము

తీవ్రమైన వ్యాధిలో చర్మమెండిపోయి గరగర లాడుచుండును గాని సామాన్యముగా మెత్తగనే యుండును. దురద హెచ్చుగ నుండును. జననేంద్రియముల ప్రక్కను మూత్రము తగిలినంత లెక్క దురద మఱియు హెచ్చుగ నుండును. పురుషాంగము చివర పుండుపడి తోలుత్రిక్కిలినిపోయి పైకిరాదు.

కురుపులు, రాచపుండ్లు

ఇవి సామాన్యముగ వీపుమీదను, మెడమీదనువచ్చును. కొంతమందికి కాలిలో నేదో చిన్న దెబ్బతగిలి యాభాగము చచ్చిపోవును.

కొద్దిగ గోకినచోటగూడ పుండ్లై, చీముపట్టి, ఆ ప్రదేశము చచ్చిపోయి మరణమ్మునకుగూడ గారణ మగును. కొందఱకు నరికాలిలో పుండ్లుపుట్టి లోలోపలతొలుచుకొనిపోవును. కాళ్లు చేతులు వాపుకూడ కొందఱకు రా వచ్చును.

కండ్లు

నూటికి దొమ్మండ్రుగురకు, అతిమూత్ర రోగులకు, కంటిలో నీరు కాసులను పొరలు పుట్టి చూపు తగ్గిపోవును. కంటిలోని యితర భాగములలోగూడ వ్యాధులు పుట్టి చూపు తగ్గిపోవచ్చును.

సంభోగశక్తి

సంభోగశక్తి సాధారణముగ తగ్గిపోవును. వయస్సు ముదిరిన యాడువాండ్రలో గొందఱకు సంభోగేచ్ఛ మిక్కిలి యధికమగునని యొకరు వ్రాసి యున్నారు.

నరముల పటుత్వము

బుద్ధి బలము తగ్గుటయు, నిద్ర వచ్చునట్లు మత్తుగా నుండుటయు, సామాన్య గుణములు. కాని, కొందఱకు ఉత్సాహము తగ్గియున్నను బుద్ధి కుశలత మాత్రము చివరవఱకు జక్కగ నుండును. రాత్రులయందు పిక్కలు లాగుటయు, తిమ్మిరెక్కు నట్లుండుటయు గొందరకు వ్యాధియొక్క ప్రారంభావస్థలోనే కలుగును.

స్మారకము తగ్గుట

మధుమూత్ర రోగుల కంత్యమున సామాన్యముగ స్మారకము తప్పిపోవును. ఇదిచిన్న వయసు వారలకు, పెద్దవయస్సువారలకుగూడ సంభవించును.

చాలదూరము రైలుమీద ప్రయాణము అధికమైనను, శరీర పరిశ్రమ మొదలగు వాని వలనను నీయపస్మార మకస్మాత్తుగ గలుగ వచ్చును. ఒక్కసారిగా నధికమైన పథ్యము పెట్టినప్పుడుకూడ నిది కలుగవచ్చును. చాల దినములు విరేచనములు లేకుండ నున్న యెడల నిది యకస్మాత్తుగ గనబడవచ్చును. శస్త్ర చికిత్స (Operation) యయిన వెంటనే యొకానొకప్పుడు స్మారకము తప్పిపోవును.

సాధ్యాసాధ్యములు

ఇది వ్యాధియొక్క తీవ్రతను బట్టియు రోగియొక్క వయస్సును బట్టియు మారుచుండును. సామాన్యమై తీవ్రముగల వ్యాధి, అనగా పథ్యముమీదనే మూత్రములో చక్కెర లేకుండపోవు వ్యాధి శీఘ్రములో సుముఖమునకు వచ్చును. నడిమిప్రాయము తీరినతరువాత వ్యాధి ప్రారంభమైన రోగులలోగూడ వ్యాధి తీవ్రముగ నుండదు. కాని పసివారలయందును, కొందఱకుతీవ్రవ్యాధులయందును ఏమందును, ఏపథ్యమును ప్రయోజనకారి కాదు. మిక్కిలి కృశించిపోవుట, క్షయవ్యాధి పాలగుట, వంశపారంపర్యముగ వ్యాధి యుండుట, బీదవాడగుట, స్మారకము తప్పుట, శరీరమునం దేభాగమైనను చచ్చిపోవుట, ఇవి యన్నియు నసాధ్యమైన వ్యాధికిలక్షణములు.

శరీరము లావెక్కుచుండుట, వ్యాధి చిరకాలమున్నను శరీరము కృశింపకుండుట, భోజనసౌఖ్యమైన పక్వపానాదులకు కావలసిన యనుకూలములు గలిగియుండుట, వయస్సు మించినతరువాత వ్యాధికలుగుట, ఇవి సుసాధ్యమైనవ్యాధికి లక్షణములు.

చికిత్స

ఇది రెండు విధములు. 1. ఆహారము. 2. మందులు. వ్యాధియొక్క తీవ్రమునుబట్టి యాహార పద్ధతి మార్చుకొనవలయును. పిండి పదార్థములు మానిన వెంటనే గాని, తగ్గించిన వెంటనే గాని మూత్రములోని చక్కెర తగ్గిపోవు వ్యాధి తీవ్రముకాని వ్యాధి. ఆహారములోని పిండి పదార్థములను బొత్తిగ తీసివేసినను మూత్రములో చక్కెర తగ్గిపోనివ్యాధి తీవ్రమైనవ్యాధి. తీవ్రముగాని వ్యాధిగలరోగికిచ్చు ఆహారములో చక్కెరయు, పిండి పదార్థములును, క్రమముగ తగ్గించినప్పుడు మూత్రములో నెప్పుడు చక్కెర లేకుండనుండునో కనిపెట్టవలయును. ఆపద్ధతిమీద నాహారము నిచ్చుచు కొంతకాలము గడపవలెను.

ఆహారము

పిమ్మట ఆహారములో పిండిపదార్థములను, చక్కెరయు, కొద్దిగ చేర్చినను మూత్రములో చక్కెరగానరాక ఆహారమంతయు జక్కగ జీర్ణమగును. ఇట్లు యెంతవఱకు పిండి పదార్థమును చక్కెరను దినినప్పుడు మూత్రములో చక్కెరయుండదో చూచుకొనుచు ఆహారములో సాధ్యమైనంతవరకు మాంసకృత్తుపదార్థములును, క్రొవ్వుపదార్థములును హెచ్చుగ జేర్చుకొనుచుండవలయును. తీవ్రమైనవ్యాధులలో నెంత యాహారము తగ్గించినను, ఏపదార్థము నిచ్చినను మూత్రములో చక్కెర తగ్గకయుండును. ఇట్టివారలకు కఠిన పథ్యము పెట్టుటవలన నెంతమాత్రమును బ్రయోజనము లేదు. ఈ రాజధానియందు సామాన్యముగా అనేకరోగులకు వరియన్నమునుమార్చి గోధుమయన్నమును బెట్టినతోడనే గుణము కనబడుచున్నది. ఈవ్యాధియందు నుపయోగింపవలసిన ఆహారపద్ధతి గూర్చి యాంగ్లవైద్యుల కింతవరకు జక్కగ దెలియునని జెప్పుటకువీలు లేదు. కాబట్టి రోగి యాహారము బెట్టినను రోగియొక్క తూనిక తగ్గిపోకుండ దగినంత యాహారము పెట్టవలెనని యనేకులయభిప్రాయము. కాని, కొందఱు వైద్యులు, రోగికేమియు నాహార మీయకుండ లంకణములమీదనే బెట్టి మధుమూత్రమును తగ్గింప వచ్చుననియు, మఱికొందఱు అధికముగ విరేచనములకు మందులిచ్చుచు మధుమూత్రమును తగ్గింప వచ్చుననియు జెప్పుదురు.

ఆంగ్లవైద్యుల యభిప్రాయమును బట్టి తినవచ్చిన, తినగూడని, పదార్థములయొక్క పట్టిక నీ ప్రక్కపుటలో జూపియున్నాము.

తినవచ్చునవి.

1. మేక మాంసము, గొడ్డు మాంసము.
2. కోళ్లు, అడవిపిట్టలు.
3. చాపలు, పరిగెలు.
4. మాంసమునుండి జేసిన షేర్వాలు. (చక్కెరగాని, వరిపిండి గాని జేరగూడదు).
5. కోడి గ్రుడ్లు, మీగడ, వెన్న.
6. నెయ్యి, నూనె, క్రొవ్వు పదార్థములు.
7. తవిటిరొట్టెలు.
8 ఆకుకూరలు.
9. దోసకాయ, గుమ్మడి కాయ, అనపకాయ, వంకాయ, బీరకాయ, పొట్లకాయ మొదలగునవి. విస్తారగము పప్పుగింజలులేని కూరలు చిక్కుడు, బెండ, మొదలగు వాని లేత తొక్కలు.
10. ఊరుగాయలు.
11. ఉల్లిపాయలు.
12. బాదముక్కాయలు.
13. అక్రోటు.
14. మంచి నీరు, సోడా వాటరు, మొదలగు నీళ్లు (మితముగ.)
15. కాఫి, టీ మితముగ.
16. ద్రాక్ష మొదలగు బలహీనమైన తీపు లేని సారాయము (మిక్కిలి మితముగ.)
17. ఆపిలు, సీమరేగు.
17. అధికముగ పాలు.
18. కోకో.

తినకూడదు.

1. జంతువుల యవయవములలో కాలేయము మొదలగు తియ్యని పదార్థములు.
2. చక్కెర వరిపిండి గలిసిన రొట్టెలు.
3. వరి యన్నము, సగ్గుబియ్యము, ఆరోరూటు, టాపియోకో, వర్మిసల్లి మొదలగు బియ్యములు.
4. బంగళా దుంపలు.
5. గోధుమరొట్టె, బిస్కత్తులు.
6. కంద, పెండలము శిలగడ దుంపలు (గన్నుసు) మొదలగునవి.
7. చిక్కుడు గింజలు, పటాణి.
8. తేనె, తియ్యని పండ్లు, ఎండువి, పచ్చివి.
9 తియ్యని సారాయము.
0. లెమనేడు, కోలా, మొదలగు తియ్యని నీరు.

ఈ పట్టీవలన అతిమూత్రరోగులు తినవచ్చునను పదార్థములు చాల గనబడినను, ఈ రాజధానిలోని అతిమూత్రరోగులు విశేషముగ బ్రాహ్మణులేయై యున్నందున వరి అన్నముమాని గోధుమన్నము దినుమనిజెప్పుటయు, చేతనైనయెడలకొంచెముచే మాంసముగాకపోయినను కోడిగ్రుడ్లు తినిపించుటయు, దప్ప యిచ్చటి వైద్యులు వేరు విధానములేర్పరచలేక యున్నారు. నిజ మెంతవరకో నిశ్చయముగా దెలియదుకాని, వరియన్నముకంటె అతిమూత్రరోగులకు గోధుమన్నముపకారిగా నున్నదిట్లిచ్చటి వైద్యుల యభిప్రాయము.

మందులు

మందులలో నేదియును అతిమూత్రమును గాని, మధుమూత్రమును గాని, తప్పకకుదుర్చగలదని చెప్పదగినది యింతవరకు గానరాదు. నల్లమందును, దానినుండిబుట్టిన యనేకపదార్థములను, ఈవ్యాధియొక్క ప్రథమావస్థలయందు ప్రయోజనకారులుగా నున్నవి. సాలిసిలక్ ఆసిడ్ (Salicylic acid), సోడాబైకార్బనేట్ (Soda bicarbonate), యురే

నియం నైట్రేటు, (Uranium Nitrate), జాంబుల్ (Jambul), ఫిలోకార్పీన్ (Pilo-carpine), బంగారము, (Gold) మొదలగు నితర మందులను మఱికొన్నిటిని వైద్యులీ వ్యాధిలో వాడుదురు.

స్మృతిదప్పినప్పుడు సోడాపొడరు (Soda-bicorbonate) దిన మొక్కంటికి 500 గ్రెయినుల వఱకునిచ్చిన గుణమగును. విరేచనము, చేయుమందుల నియ్యవలెను. రాచపుండ్లకు శస్త్రవైద్యము చేయవలెను. శరీరముమీఁదదురదకు బోరిక్ ఆసిడ్ (Boric acid), కార్బాలిక్ ఆసిడ్ (Carbolic-acid) మొదలగువానితో జేరిన తైలములబూసిన నుపశమించును. థైరాయిడ్ సూప్రారినల్ (Thyroid Suprarenal) గ్రంథులనుండిదీసిన పదార్థములనుకొందఱుపయోగింతురుగాని, ఇంకను వీని గుణములు జక్కఁగ దెలియలేదు.

(ఆ. ల.)

ఆయుర్వేదీయ మతము

దీనినే "ప్రమేహ" మని యాయుర్వేద తంత్రము నందు వాడిన ట్లగపడుచున్నది. దీనిని గురించి చరకాచార్యుడను వైద్య గ్రంథకర్త మొట్టమొదట వ్రాసియున్నాడు.

సామాన్యముగా నే రోగమునకును నిదానము, సంప్రాప్తి, పూర్వరూపము, (వాని లక్షణములు,) ఉపద్రవములు, అవాంతర భేదములు, (వాని లక్షణములు,) చికిత్సలు, సాధ్యాసాధ్య విమర్శనము, అని యేడు విధములుగ సాధనగతి యుండును.

ప్రమేహసామాన్య కారణములు, దోష దూష్యములు

తఱుచు కూర్చొని యుండుట, తఱుచు నిద్రించుట, పెరుగు, గ్రామ్యములు, (గ్రామము లోనివి) ఔదకములు, (నీటిలోనివి) ఆనూపములు, (జలప్రాయప్రదేశములోనివి) అగు జంతువులమాంసములు, పాలు, క్రొత్తబియ్యపన్నము, క్రొత్తనీరు, చక్కెర, బెల్లముతో జేసిన పదార్థములు, ఇంకను కఫము, మేధస్సు, మూత్రము, వీనిని వృద్ధినొందించు పదార్థములు మున్నగువానిని అధికముగా నుపయోగించుటచే సామాన్యముగా నతిమూత్రము పుట్టును.

అతిమూత్రమునం దింకను దోషములు, దూష్యములు, నను రెండు విధములగు నాభ్యంతర (లోపలి) కారణములు కలవు. అవి యెవ్వియనగా:—

దోషములు-వాతము, పిత్తము, కఫము, అనునవి.

దూష్యములు-మేధస్సు (సన్నని యెముకలలోనుండు రక్తముతోగూడిన క్రొవ్వు,) మాంసము, క్లేదము (శరీరమునందలి నీరు) వస (మాంసములోని క్రొవ్వు) మజ్జ (పెద్ద యెముకలలోని క్రొవ్వు), శుక్లము, మేధస్సుతో గలిసియుండు రక్తము, లాలాజలము, (చొంగ-జొల్లు) మేధస్సు (హృదయమందలి చేరెడంత కఫరూపమగు పదార్థము) లసీకము (చర్మమునకును మాంసమునకును నడుమనుండు నీరు) అనునవి.

అట్టి పయిరోగము, కఫము ప్రధానమయి పుట్టినది, పిత్తము ప్రధానమయి పుట్టినది, వాతము ప్రధానమయి పుట్టినది, యని మూడు విధములు.

భేదములు

గోధుమలు మొదలగు గురువగుధాన్యములు, గురువగుమాంసములు, తీపు పదార్థములు, పాలు, మీగడ, జున్ను, మొదలగు వానిని దినుట, శుచి, వ్యాయామము, వీనిని వదలి, మితిమీరిన నిద్ర, ఎల్లపుడును పరుండియుండుట, ఇంకనుకఫము, మేధస్సు, మూత్రము, వీనినభివృద్ధి నొందించు విధుల నొనర్చుచుండుట, అనియెడు కారణములచే మిక్కిలి ద్రవయుక్తమగు కఫము, మిక్కిలి బంధింపబడిన మేధస్సు, క్లేదము, మాంసము, శుక్రము, రక్తము, వస, మజ్జ, శోంగ యను దూష్యవర్గమును, వాతపిత్తములు క్షీణించి యుండ నభివృద్ధినొందును. అట్లు వృద్ధిజెందిన కఫము శరీరమంతటనువ్యాపించుట కారంభమయి మేధస్సుతోగూడి దానితోసమానములగు నితరక్రొవ్వుపదార్థములతో గలియును. ఇట్లు దుష్టమయిన మేధస్సు శరీరమందలి యొకవిధమయిన క్లేదమను జలముతోను, మాంసముతోను సంసర్గమును బొందును. క్లేదము మాంసమును సమానమగు మాంసముతోగూడిపయినివివరింపబోవు పిటకాదుల జనింపజేయును. అంతటితో క్లేద మూర నుండక శరీరమునంతయుజెఱచి మూత్రముగామారి, గజ్జలు, పొత్తికడుపు మొదలగువాని యందుండు మూత్రనాడులయొక్క మేధస్సు, క్లేదము వీనివలన నడ్డగింపబడి వివృద్ధములగు మార్గములగుండ ప్రవేశించి వాని(మేదః క్లేదముల) తోగలసికొని మూత్రాశయము జేరి సరియయిన మూత్రముగామారి క్రింది వివరింపబోవుభేదములతో నధికముగ బయలు వెడలుచున్నది. (చ॥ ని॥ స్థా॥ ౪ ర)

కఫము వలని యతి మూత్ర సంప్రాప్తి

మిక్కిలి వేడిగానుండునట్టియు, మిక్కిలి పులుసు, ఉప్పు, క్షారము, కారముగానుండునట్టియు, పదార్థముల దినుట, జీర్ణముకాకుండ మరలదినుట, మిక్కిలివేడియగు నెండ, నిప్పు సెగ, వీనిని శరీరమునకు దగిలించుట, మనస్సంతాపము, మిక్కిలి శ్రమ, కోపము, విష మాహారము (సరికాని భోజనము) మొదలగు రూక్షకర్మలవలన పిత్తము ప్రకోపించి వాతకఫములు క్షీణించి యుండ పైనిచెప్పినట్లే మేధస్సు మొదలగు వాని జెఱచి దిగువ వివరింపబోవు లక్షణములతో మూత్రమును వెడలించును. (చ॥ ని॥ స్థా॥ అ ర॥ ౨౦.)

పిత్తమువలని యతి మూత్ర సంప్రాప్తి

కారము, ఒగరు, చేదు, ఈరసములతో గూడి రూక్షమైనట్టియు, మిక్కిలి లఘువుగను చల్లగనునుండునట్టియు, పదార్థముల సేవించుట, అతిమైథునము, అతి వ్యాయామము, వమన విరేచనముల నిరోధించుట, శిరోవిరేచనము నతిమాత్రముగా

వాతమువలని యతి మూత్ర సంప్రాప్తి

జేయుచుట, ఉపవాసము జేయుట్ల, దెబ్బ తగులుట, ఎండ తగులుట, ఉద్వేగమును జెందుట (కోపాదులకు లోబడుట) శోకించుట, రక్త మోక్షము (నెత్తురును శరీరమునుండి వెడలించుట) మేలుకొని యుండుట, విషమ (మెరక) స్థలములయందు శరీరము నుంచుట, మొదలగువానివలన వాతము ప్రకోపించి పై యటులనే శరీరమున వ్యాపించి పై కఫపిత్తములకంటె నధిక ప్రకోపముతో వసను గలసి కొని చెడిచి పై యట్లు మూత్ర కోశమును జెరిచి "వసా మేహమును" మజ్జను జెరిచి "మజ్జమేహమును" లసీకను జెరిచి "హస్తి మేహమును" మేధస్సును జెరిచి "మధు మేహమును" బుట్టించును. వాని లక్షణములు క్రింద వివరింపబడును.

పైనుదాహరించినమార్పులు శరీరములో జరుగుచుండు సమయమునందు, మేధో దోషము

పూర్వరూపము

వలన శరీరమంతయు బూతి గంధయుక్తమగు మలభూయిష్ఠమైయుండుటచే, దంతములు, కండ్లు, పెదవులు, చెవులు, గొంతు, నాలుక, మొదలగువాని యందు మిక్కుటముగ మలము (దుర్గంధయుక్తమగు పాచి) చేరును (సు. ని. స్థా. అ ౬). కఫాది దోషములవలన, కాలుసేతుల యందు మంటయు, శరీరము, మసృణమై (బంకగలిగి) యుండుటయు, మిక్కిలి దాహము, నోరుతీపు బారుట, మొదలగు గుణములును కలిగి యుండును. (మా. ని. మే. శ్లో ౫)

అదియునుంగాక యెవ్వానికి మూత్రరోగము జనింపబోవునో వాని మూత్రమునకు శరీరమునకును చీమలు, ఈగలు ముసరుకొని యుండును. వెండ్రుకలు చిక్కువడుట, గోళ్లు పెరుగుట, మొదలగునవికూడ నుండును (చ. ని. అ ౪).

పైనుదాహరించిన దూష్యద్రవసంబంధము వలన మిక్కిలి యధికముగ నుండునట్టియు, వాతాది

లక్షణములు

దోషములును దూష్యవర్ణములును, సంబంధించుటవలన గలుషముగ నుండునట్టియు, మూత్రము ప్రతిక్షణమందును వెలువడుచుండుట, శోష, తాపము, దప్పి, భ్రమ, సర్వావయవములు బలహీనములుగనుండుట, ఇట్టి లక్షణములు కలిగియుండునదియే యతిమూత్రమని యెఱుంగునది. (మా. ప్ర॥ శ్లో॥ ౬)

అట్టి యతిమూత్రము ఈప్రక్క జూపిన పట్టిక ప్రకారము ౨౦ భేదములు కలిగి యుండును. వాని లక్షణములు మొదలగునవి యీ పట్టికలో గొన్నింటెని గననగును. మిగిలినవాని నాయా శీర్షికల క్రింద గననగును.

అవాంతరభేదములు, వాని లక్షణములు

వాతమువలన జనించు నతిమూత్రపు భేదమగు మధుమేహము మిగిలిన భేదముల యొక్క ముదురుటవలన జనించును. దానికిపైగా పిటకలు (పుండ్లు) జనించును.

ఉపద్రవములు

అవాంతర భేదముల దెలుపు పట్టిక.

నంబరు.	పేరు.	ఏదోషమునకు యొక్క భేదము.	వర్ణము.	గంధము.	సాధ్యమా? యాప్యమా? అసాధ్యమా?	మూత్రా.
1	ఉదక మేహము.	శ్లేష్మము.	అచ్ఛసితము.	నిర్గంధము.	సాధ్యము.	చల్లగా నుండును.
2	ఇక్షు ,,	,,	చెరకు రసము వలె నుండును.	ఇక్షుగంధము.	,,	మధురము.
3	సాంద్ర ,,	,,	...	...	,,	పేరికొనును.
4	సురా ,,	,,	సురావర్ణము.	సురా గంధము.	,,	...
5	పిష్ట ,,	,,	తెలుపు	...	,,	...
6	శుక్ర ,,	,,	శుక్రవర్ణము.	శుక్రగంధము.	,,	శుక్రమిశ్రమము.
7	సికతా ,,	,,	...	...	,,	ఇసుకవంటి కప కండములతో కూడియుండును.
8	శీత ,,	,,	...	...	,,	మధురము, శీతము.
9	శనైః ,,	,,	...	...	,,	కొంచెము కొంచెముగా వెడలును.
10	లాలా ,,	,,	...	...	,,	జిగటగా తీగలు సాగును.
11	క్షార ,,	పిత్తము.	క్షారోదక వర్ణము.	క్షారోదక గంధము.	యాప్యము.	క్షార రసము.
12	నీల ,,	,,	నీలవర్ణము.	...	,,	...
13	కాల ,,	,,	భాగ్గురంగు.	...	,,	...
14	హారిద్ర ,,	,,	పచ్చరంగు.	...	,,	...
15	మాంజిష్ట ,,	,,	మంచి కషాయపురంగు.	దుర్గంధము.	,,	...
16	రక్త ,,	,,	ఎరుపు.	...	,,	వేడిగను, ఉప్పుగ నుండును.
17	వసా ,,	వాతము.	మాంస రసపు వర్ణము.	మాంస రసపు గంధము.	అసాధ్యము.	మాటిమాటికి వెడలును.
18	మజ్జ ,,	,,	మజ్జవర్ణము.	మజ్జ గంధము.	,,	,,
19	హాస్తి ,,	,,	లసీకా వర్ణము.	...	,,	అప్పుడప్పుడు నిలచి వెడలును.
20	మధు ,,	,,	తేనె రంగు.	మధుగంధము.	,,	మధురము.

అందు మధుమేహము ధాతుక్షయము వలన జనించిన వాత ప్రకోపమువలనగాని, వాతాదులిట్టే మూత్రద్వార మడ్డగింపబడుట వలనగాని, తేనెవలెనుండు మూత్రముగలిగి యుండును. ఇయ్యదికూడ వాతాదుల యావరణవలన క్షణము తగ్గినదిగను క్షణము వృద్ధి చెందినదిగ నుండును. (చ. సూ. అ॥ ౧౭).

దీనియందు తేనెంబలె మూత్రమును, శరీరము తియ్యబారుటయు, కలిగియుండుటచే నిద్దానికి "మధుమేహము" అని పేరుగలిగినది. (మా. ప్ర. శ్లో. ౨౬)

దీనిని గురించిన చికిత్సలు మొదలగునవి "మధుమేహము" అను శీర్షిక క్రింద నుండును.

పిమ్మట జనించు పిటక లీక్రింది భేదములు కలిగి యుండును.

౧. శరావిక ౨. కచ్ఛపిక ౩. జాలిని ౪. వినత ౫. అలజి ౬. మసూరిక ౭. సర్షపిక ౮. పుత్రిణి ౯. విదారిణి ౧౦. విద్రధి అని పది విధములు. వీని లక్షణములు మొదలగునవి "రాచపుండు" అనుశీర్షిక క్రింద జూడనగును.

చికిత్స

పైని వివరించిన యతిమూత్ర రోగము రాకుండుటకును, వచ్చిన యెడల శీఘ్రముగ హరించుటకును, తగిన ట్లీదిగువ వివరించినరీతిని నడవవలెను.

౧. ధాతుహితముగ వర్తించుట ౨. రోగముయొక్క పూర్వరూపమును దెలిసికొని వెంటనే తగుసాధనములను జేయుట ౩. వ్యాధిప్రబలించిన యెడలతగినయౌషధములు మొదలైన చికిత్సల నడపుట.

౧ ధాతుహితముగ వర్తించుట

ధాతువు లనగా శరీరములం దుండు రక్తాది ప్రసరణ మార్గములు, వాతపిత్త శ్లేష్మములును నిచ్చుట నర్థము. అట్టివానికి హితమనగా పై నుదాహరించిన పదార్థముల నెన్నడును మితిమీరి యుపయోగింపకుండుట (చ॥ సి॥ అ. ౪). మూత్రమునువృద్ధి పరుపకుండుట (అ. హృ. సూ. అ ౧౧. శ్లో ౧౩), గ్రీష్మఋతువునందుతప్ప దక్కినఋతువులయందు పగలుపరుండ కుండుట, మిత సంభోగము, వీనిని మిక్కిలి శ్రద్ధతో జరుపుచు సర్వవిధముల చేతను శరీరము నారోగ్యస్థితిలో నుంచుచుండ వలయును. తీపు పదార్థములను దినుట మిక్కిలి శ్రద్ధతో మానవలెను.

౨. రోగముయొక్క పూర్వరూపమును దెలిసికొని వెంటనే సాధనములను జేయుట

వెనుక నుదాహరించిన పూర్వరూపము వ్యక్తపడిన వెంటనే విశేషమగు సాధనమును ముందుగ జేయవలెను. (శా. ఉ. ఖం ౪ అ)

తరువాత నవసరమును బట్టి గుదము గుండలోనికి గాని మలముపట్టి యుండు నాయా యంగములయందు గాని యీ దిగువ నుదాహరించిన కషాయములతో నిరూహవస్తి (పిచికారీ) జేయవలెను. నిరూహవస్తిని

గురించి " వస్తికర్మ," అను శీర్షికలోఁ గనఁ దగును. [శా. ఉ. ఖ. క. అ ౬.

దీనినిగురించి మాతంగ్రడ్లిగా ర్వాయుర్వేదానుభూతియందిట్లు వ్రాయుచున్నారు. "కారణం వినా కార్యానుత్పత్తేః కఫదోష హరణం ప్రథమం మేదోదోషహరణం తతః" అని మొదలుకొని "తస్మాత్స్రోతః కర్మశనైః కరణమఫేనదధి యోగ ముపయుఞ్జాత్ " అను వఱకు దానియర్థమేమనఁగా * కఫమే బహుమూత్రమునకుఁ బ్రధానకారణ మగుటచేత దానిని తగ్గించు సాధనము తొలుత నుపయోగింపవలయును. దానికి మించి మేదోదోషము లోనికిఁ జేరినచో నద్దానికి సాధన మొనరింపవలయును. ఇట్లు వసామజ్జ క్లేద, మాంస, మూత్రదోష హరములగు నౌషధముల నొకదానిని మించి నప్పుడింకొక దానిని బ్రయోగింపవలయును.

3 వ్యాధి ప్రబలించిన యెడలఁదగిన యౌషధములు మొదలైన చికిత్సల నడపుట

అందు మొట్టమొదటనే స్రోతస్సుల (నాడుల) అతిప్రచారముయొక్క మితిమీరిన నడకను తగ్గించుటవలన వెనుక చెప్పిన దోషములొకదానితో నింకొకటి సంక్రమించుటకవకాశము చిక్కక యా యా దోషము లట్టె యుండి యుండును. పిమ్మట నుపయోగించు నౌషధమ్ములవలన నిలిచియున్న యా దోషములు స్వస్థలములోనే నశించిపోవును. కనుక నట్టి స్రోతస్సుల అతిప్రచారమును తగ్గించునట్టి 'అఫేనదధియోగమును' ప్రథమములో, అనఁగా దోషము లొకదానితో నింకొకటి సంక్రమింపఁబోవు సమయములో నుపయోగపఱుపవలెను.

అఫేనదధియోగ మనఁగా నల్లమందునొక పెసలగింజంత నొకకానితో నెత్తు యావుపెరుగుతోఁ గలిపి మర్దించినది. దానిని బుచ్చుకొనవలయును.

పిమ్మట నతిమూత్రము నడచునట్టి 'ధాన్వంతర ఘృతము' 'విడంగాది లోహము' 'మేహబద్ధ రసము,' 'లోధ్రాది కషాయము' మొదలగు నౌషధముల నాయా భేదములను బట్టి సేవించవలయును. ఈ యౌషధములను గురించి యాయా శీర్షికలలోఁ జూడనగును.

సాధ్యాసాధ్య వివరణము

అతిమూత్రము పుట్టునది మొదలు ౧ మాసములోపున సుసాధ్యము. అటు పిమ్మట సుమారు ౧ సం॥ రమువఱకు కష్టసాధ్యము. పిమ్మట మధుమేహముగా మారుటచే నసాధ్యము (ఆ. అ.)

అదిగాక శ్లేష్మముయొక్క ప్రబలత్వముచేత జనించిన ౧౦ భేదములును సుసాధ్యములు. పిత్తముయొక్క ప్రాబల్యము వలన జనించు భేదములు ౬ను, యాప్యములు (అనఁగా శరీర

* ఇయ్యది కఫమువలని అతిమూత్రమును జెప్పుచు వ్రాయఁబడినది.

ము [illegible] చూడవలెను - అ. హృ. స్థా. ౧ అ). వారియు ప్రబలుటచేత జనించిన [illegible] భేదములు [illegible] ములు. (మరుజుని జంపునవి) [illegible] లాయా భేదములు [illegible] స్ఫుటముగ వ్రాసి యున్నారు.

మఱియు [illegible] మేహవ్యాధి గలవానికి గాని, [illegible] మేహవ్యాధుల వంశమునందుగాని జనించిన వానికి బుట్టిన అతిమూత్ర [illegible] ము, [illegible]:—

[illegible] ము [illegible] యుండుటచే నట్టి [illegible] ములను జనించిన వానికిగూడ నాదోష ము కలుగును. కాబట్టి "పుష్టిగ్రుడ్డి" మొదలగు [illegible] సంతతి నొందజాలరు.

(తి. ప. రా.)

అతిరథుఁడు. (చం. వం) సత్య [illegible]. [illegible]. ఇతఁడు [illegible] కొనెను.

అతిరాత్రము. అత్యగ్నిష్టోమము [illegible] ఫలమిచ్చు నొక యజ్ఞ [illegible]ము.

అతిరాత్రుఁడు. స్వాయంభువ [illegible]. చక్షుర్మనువునకు నడ్వలయందుఁ [illegible] పుత్రులలో నెనిమిదవవాఁడు.

అతిసారము. ఒక దినమునందు సామాన్యముగా మనము ఒకటి రెండుసార్లు మల విసర్జనము చేయుదుము. అట్లు గాక యేకారణము చేతనైనను దినమున కెక్కువ సార్లు విరేచనము లగుచుండు నెడల నట్టి వ్యాధికి అతిసార మనిపేరు. ప్రేగులయొక్క నడ వడియందు చురుకు తన మధికమగుటచేగాని, ప్రేగులయందు అధికముగ ద్రవపదార్థములు స్రవించుటచేగాని ఇట్టి విరేచనములు కలుగ వచ్చును. ఇట్టిస్థితి అనేక వ్యాధులచేత గలుగు గుణములలో నొకగుణమేగాని విరేచనము లే యొక వ్యాధియని సామాన్యముగ జెప్పనలవు పడదు. కాబట్టి విరేచములకు గారణము లగు యావ్యాధుల శీర్షికలక్రింద జూచుకొనవలెను. రెండుసంవత్సరములలోపు పిల్లలకును, ముసలి వాండ్రకును, అతిసారము తరుచుగ వచ్చును. దేశమునందలి శీతోష్ణస్థితి అకస్మాత్తుగ మారి నప్పుడును అధికమగు వేసవికాలమునందును, విరేచనము లధికముగ నుండునని చెప్ప వచ్చును. ఆహారాదుల యశుభ్రతచేతను, జనసమ్మర్ద మధికమగుట చేతనుగూడ, అతి సారమధికము కావచ్చును.

కారణములు.

అనేకవ్యాధులలో అతిసారమొక గుణ మని చెప్పియుంటిమి. కాబట్టి వ్యాధి కారణమును బట్టి విరేచనములం దనేక భేదము లుండును.

కాని అకస్మాత్తుగవచ్చు నతిసారమనియు, చిరకాలమునుండి వచ్చుచున్న అతిసారమనియు రెండు విధములగు భేదములను మనము గమనింపవచ్చును.

పేగులలో నే భాగమైన ఏ పదార్థముచేత నైనను రేగి కందిపోయి యొకానొకప్పుడు పుండ్లు పడుటచేత అతిసారము పుట్టవచ్చును. ఇట్టి రేపుదలకు కారణములు 1. తగని ఆహారము, 2. పైత్యరసోద్రేకము, 3. పేగులయందు పెరిగిన రాళ్లు, 4. ఏలికపాములు నులిపురుగులు మొదలగు పురుగులు, 5. విరేచనకారులగు మందులు, 6. పాషాణము మొదలగు విషపదార్థములు. కొన్ని జ్వరములయందును, అతిమూత్రము మొదలగు కొన్ని వ్యాధులయందును, ఆయా వ్యాధులవలన బుట్టిన విషయములను తొలగించు నిమిత్తమై అతిసారమొకానొకప్పుడు పుట్టవచ్చును; భయముచే నతిసారము కలుగవచ్చును. సూక్ష్మజీవులచేగాని వానినుండిపుట్టు విషముచేగాని అతిసారము ఒకానొకప్పుడు కలుగును. ఇందులకు క్రుళ్లిపోయిన ఆహార పదార్థములలోని సూక్ష్మజీవులును, టైఫాయిడు, కలరా, క్షయ, మొదలగువాని సూక్ష్మజీవులును ముఖ్యమైన కారణములు. ఇట్లే ఇంక ననేక కారణములు గలవు.

లక్షణములు

విరేచనములగు నప్పుడు, సామాన్యముగా కొద్దిగనో గొప్పగనో నొప్పి, కడుపుబ్బరము, మొదలగు గుణము లుండవచ్చును. ఆసనమునకు సమీపమునందుండు వ్యాధిచే గలిగిన విరేచనములలో నెక్కువగా తినవలెనను నాసక్తియు, ఆసనమునొప్పియు నుండును వ్యాధియొక్క ఉధృతమును బట్టి విరేచనములు సంఖ్యయందును, పరిమాణమునందును, రంగునందును, వాసనయందును, అజీర్ణమైన ఆహారము, ఆమము, కొవ్వు మొదలగు పదార్థముల విసర్జనమునందును, భేదములు కనుపట్టును.

నిదానము

అతిసారము కనబడిన తోడనే చికిత్స చేయుటకు ప్రారంభించక దాని కారణ మేదియో కనిపెట్టవలెను. అకస్మాత్తుగా అతిసారము వచ్చియున్న యెడల, మితిమీరి భుజించుటచేతనో, ఆహార పదార్థములలో నేదియేని చెడిపోవుటచేతనో, సరిపడక పోవుటచేతనో, అధికమైన వేడిచేతనో, తడిచేతనో, కలిగియుండవచ్చునని జ్ఞాపక ముంచుకొనవలెను. వాంతియు, నొప్పియు, అధికముగానుండి, విరేచనములు తీవ్రముగానున్న యెడల, విషపదార్థముగాని, క్రుళ్లిన పదార్థముగాని, సూక్ష్మజీవుల ప్రవేశముగాని కారణమని గ్రహింపవలెను. విరేచనములయొక్క లక్షణములను సరిగా పరీక్షించుట వలనను సూక్ష్మదర్శ

నితో విరేచనమును పరీక్షించుట్క వలనను, కారణము తెలియగలదు. ఒకానొకప్పుడు ఆసనమువద్దనుండు కొన్ని వ్యాధులలో బెక్కు-సార్లు విరేచనమునకు బోవలసి వచ్చునట్లుండును. అట్టిది అతిసారములో చేరదు. ఆసనమును వ్రేళ్లచేగాని, యంత్రముచేగాని పరీక్షించిన యెడల నట్టివ్యాధి తెలియగలదు

చికిత్స ఆకస్మికముగా వచ్చిన అతిసారము, ప్రత్యేక చికిత్స అక్కర లేకయే, ఆహారమును నిలిపివేసి, ప్రేగులకు విశ్రాంతి కలిగించిన యెడల తగ్గిపోవును. ఒకానొకప్పుడు వ్యాధి ప్రారంభమైన వెంటనే విరేచనములకు మందు ఇచ్చుటచే మిక్కిలి గుణము కలుగును. ఆముదము, తులము లేక తులమున్నర యెత్తు ఇయ్యవచ్చును. నొప్పియెక్కువగా నున్న యెడల వైద్యుడు యోచించి నొక గ్రాములోపుగా నల్లమందును దానితో కలిపి ఇయ్యవచ్చును. విరేచనములకు మందిచ్చిన తరువాత 24 గంటలకు పిమ్మటగూడ నతిసారము నిలువని యెడల, సీమసున్నము, దాళిన చెక్క, శొంఠి, ఫలకులు, కవిరి, లేత దానిమ్మకాయ, బిస్మతుఓమము, మొదలగు మందులను యుక్తముగ చేర్చి ఇయ్యవచ్చును. నొప్పియున్న యెడల మందుగడ్డ మిక్కిలి ఉపయుక్తము. ఒకానొకప్పుడు బిస్మతు, డోవరు పౌడరు కలిపిన పొట్లమును, అప్పటప్పట నిచ్చిన మిక్కిలి అనుకూలముగ నుండును. ఆసనము నొప్పి అధికముగ నుండినచో నల్లమందు అరఖు కలిపిన గంజి ఒకటిరెండవున్సులు ఆసనముగుండ పిచికారి చేసిన యుక్తము. కడుపు నొప్పికి కదలకుండ పరుండుట, వెచ్చని యొత్తడము, పలవలె పలుచని యాహారము తప్ప ఇతర ఆహారములను వర్జించుట, ఈ మూంటి వలన విశేషముగ గుణమగును. భయముచే గలిగిన విరేచనములను అభ్యాసముచేసి నిలుపుకొనుటకు ప్రయత్నింపవలెను.

చిరకాలమునుండి వచ్చుచున్న అతిసారము నందు నాహార పద్ధతి సరిగా నడపుట మిక్కిలి ముఖ్యము. ఏయే పదార్థములు జీర్ణముకావో వానిని వెంటనే నిలుపవలెను. ఎల్లప్పుడు పడకలో పరుండి యుండుట వలనను, పాలుతప్ప ఇతర ఆహారములను వర్జించుట చేతను, అనేక వ్యాధులలోని అతిసారము నిలిచిపోవును. వ్యాధికి కారణమగు విషయమును కనిపెట్టితొలగింపవలెను. పైని చెప్పినమందులనన్నిటిని ఉపయోగింపవచ్చును గాని వ్యాధి కఠినమైనప్పుడు ఔషధచికిత్సను వైద్యునకే విడచుట మంచిది. మొండి వ్యాధులలో ఆసన మార్గముల నౌషధముల నుపయోగించుట మంచిది. (ఆ. ల.)

అతీతాధ్యాత్మము. ఒక యజుర్వేదోపనిషత్.

అతీశా. ఇయ్యది లక్నోనగర వాస్తవ్యుఁడగు ఖ్వాజాహైదరుఅలీ అను నితని విద్యావిషయక బిరుదము. ఆతఁడు కొన్ని గ్రంథములను నుర్దూభాషలోను, పెరిషియను భాషలోను రచించి కీర్తిగాంచెను. ఈతఁడు 1847 లో చనిపోయెను.

అత్తుంగల్. అత్తుంగల్ గ్రామము చెన్నపురి రాజధానిలోని తిరువాన్కూరు సంస్థానమునకుఁ జెందిన 'చిరయంకిల్' అను తాలూకాలో నున్నది. అత్తుంగల్ నది దీని సామీప్యములో నున్నది. 1901 లో జనసంఖ్య 3889.

అత్తుంగల్ ఎస్టేటు తిరువాన్కూరు రాణులకు వంశపారంపర్యముగ వచ్చునది. తిరువాన్కూరుపాలనము జేయుచున్నవారిలో జ్యేష్ఠకుటుంబీకులవంశ నామధేయమునకు, అత్తుంగల్ మూత్తాతంపూరమని పేరు. ప్రతిజనవరి మాసారంభములోను నా దేశపాలకుఁ డగు మహారాజు, ఈయత్తుంగల్ ను దర్శించి యా నెలదినము లచ్చటగడపును.

అత్యుష్ణము. భారతవర్షీయతీర్థము.

అత్రి. ౧ స్వాయంభువ మన్వంతరమునందు బ్రహ్మదేవునికిఁ గలిగిన పదిమంది మానస పుత్రులలో నొక్కఁడు. ఇతఁడు బ్రహ్మదేవుని నేత్రమునుండి పుట్టెను. కర్దమ ప్రజాపతికూఁతురు, అనసూయ యితని భార్య. దత్తదుర్వాససోములు పుత్రులు. ఇతఁడు శివుని శాపముచే మరణమ్ముఁ జెందెను (చూడు 'మహర్షులు')

౨. వైవస్వత మన్వంతరమునందు బ్రహ్మదేవునిచే మరలఁ బుట్టింపఁబడిన మహర్షి. ఇతఁడు బ్రహ్మదేవుని యజ్ఞమందలి యగ్నిజ్వాలలనుండి పుట్టెను. భార్య, అనసూయ. దత్తుఁడు, దుర్వాసుఁడు, సోముఁడు, అర్యమ్ను, అను వారు నలుగురు కుమారులు. అమల యను బ్రహ్మనిష్ఠయైన కూఁతురు గలదు. ఇతఁడు జ్యేష్ఠమాసము నందుండు నాదిత్యునితోఁ దిరుగుచుండును (చూడు శుక్రుఁడు ౫.)

రామాయణ కాలమునందు నితని యాశ్రమము చిత్రకూటపర్వతమునకు నాగ్నేయమునందుండెను. ప్రస్తుతపు రీవాప్రాంతమువఱకు నీయాశ్రమము వ్యాపించియుండెనని విద్వాంసుల యభిప్రాయము (హిందూ మహాయుగము. 3 వ ప్రకరణము.)

దాశరథియగు రాముఁడు దండకారణ్యమునకుఁ బోవునప్పుడీ ఋషియొక్క యాశ్రమమునందుఁ గొన్ని దినములుండి యాతనిచే గౌరవింపఁబడియెను. ఈతని భార్యయైన యనసూయ సీతకుఁ బాతివ్రత్యము బోధించి, రాక్షసులవలన బాధకలుగకుండ నంగరాగాదికముల నిచ్చెను. ఇతఁడు శ్రీరామునకు

[illegible] మార్గముఁ జూపెను. (వా. రా. అయో. స. ౧౧౭-౧౧౯.)

ఇతని [illegible] ముసంతతుఁడుగాక అర్థస్వన, శ్యావాశ్వి, [illegible], కర్ణిక, పూర్వాతిథులను [illegible] పుత్రులు కలరు. (మత్స్య. అ. ౧౯౮

ఈ గోత్రమును వృద్ధిచేసిన ఋషులు (౧) [illegible] (౨) గవిష్ఠిర, (3) వాధ్భుతక, (౪) ముద్గల, (౫) [illegible], (౬) వామరథ్య, (౭) సుమంగల, (౮) బీజవాప, (౯) ధనంజయులని [illegible] విధమైనది.

1. [illegible] గోత్రజులగు, ఉద్దాలక, [illegible], గార్గ్రీవ, గౌర [illegible], [illegible], వామరథ్య, [illegible], కర్ణజిహ్వ, హారప్రీతి, [illegible], [illegible], శైలప, నైతేయ, [illegible], [illegible], [illegible], భగపాద, [illegible] ములకు వారిందఱును ఆత్రేయ, శ్యావాశ్వ, ఆర్చనానసులను [illegible] కలవారలు.

2. గవిష్ఠిర కులోత్పన్నులయిన దాక్షి, [illegible], [illegible], [illegible], [illegible], బీజవాపి, [illegible], [illegible], [illegible] గవిష్ఠిర, భలం[illegible] ఋషులు, ఆత్రేయ, గవిష్ఠిర, [illegible] [illegible]; ఆత్రేయ గవిష్ఠిర, ఆర్చ[illegible] [illegible] విధములయిన త్రిప్రవ[illegible] కలవారు.

3. వాధ్భులకులజులు ఆత్రేయ, ఆర్చనానస, వాధ్భుతకులను త్రిప్రవరులు.

4. ముద్గలకులజులు ఆత్రేయ, ఆర్చనానస, పౌర్వాతిథులను త్రిప్రవరులు.

5. ధనంజయకులోత్పన్నులు. ఆత్రేయ, ఆర్చనానస, ధానంజయులన్న త్రిప్రవరులు.

6. అతిథి, 7. వామరథ్య, 8. సుమంగల, 9. బీజవాపగోత్రజులు, ఆత్రేయ, ఆర్చనానస, అతిథులనియు; ఆత్రేయ, ఆర్చనానస, గవిష్ఠిరులనియు, రెండువిధములయిన త్రిప్రవరులు. సుమంగల కులోత్పన్నులకు, ఆత్రేయ, సుమంగల శ్యావాశ్వులను విశేష ప్రవరకలదు.

అత్రిఋషియొక్క కన్యావంశము నందు కాలేయ, వాలేయ, వామరథ్య, ధాత్రేయ, మైత్రేయ, కౌంద్రేయ, శౌభ్రేయాది ఋషులు కలరు. వీరికి ఆత్రేయ, వామరథ్య పౌత్రీ యను ప్రవరులుకలవు. (మత్స్య అ. ౧౯౬) ఈకన్యా వంశజులకును విశ్వామిత్రవసిష్ఠ గోత్రజులకును సంబంధబాంధవ్యములు లేవు.

3. గౌతమ ఋషియొక్క మిత్రుఁడైన ఋషి. ద్వితీయార్థక శుక్రునియొక్క నల్గురు పుత్రులలో నొక్కఁడు. ఇతఁ డొకసారి ద్రవ్యార్జనమునకై వేనకులోత్పన్నుఁడైన యొకరాజు యజ్ఞమునకుఁబోయి 'రాజానీవు ఈశ్వరుఁడవు' అని స్తుతించెను. అంతగౌతముఁ డామాటలను దిరస్కరింప, సిద్ధత్రికి వ్యాదము

జరిగి, వివాదనిర్ణయమునకై వార్తు సనత్కుమారులయొద్దకుఁ బోయిరి. సనత్కుమారుఁడు అత్రిమాటయె నిజమని తీర్పుచెప్పెను. అంత నారాజు, అత్రికి మిగుల ధనంబొసంగి పంపెను. (భార. వన. అ. ౧౮౫.)

అత్రౌలీతాలూకా. ఈతాలూకా సంయుక్తరాష్ట్ర మందలి అలీఘుర్ జిల్లాలో నున్నది. అత్రౌలీ గంగలీయును పరగణా లిందులోనివి. దీని వైశాల్యము ౩౪౪ చదరపు మైళ్లు. జనసంఖ్య ౧౯౦౧ లో ౧౯౮౦౩౪. ఈ తాలూకాలో ౨౮౪ గ్రామములును నాలుగు పెద్దపట్టణములును గలవు. తాలూకా ఫలవంతమైనది.

అత్రౌలీపట్టణము. ఇదిసంయుక్తరాష్ట్రములోని అలీఘురీజిల్లా యందలి అత్రౌలీ తాలూకాకు ముఖ్యపట్టణము. ౧౯౦౧ లో నీ పట్టణ జనసంఖ్య ౧౬౫౬౧. సిపాయీల కల్లోలకాలములో తిరుగుపాటొనర్చిన వారలకుఁ దావగుటచే నిదిపేరు గాంచినది. ఇక్కడ పూర్వము హిందువులుగనుండి తరువాత మహమ్మదీయ మతము నవలంబించినవారలు గాపురమున్నారు. ఈ అత్రౌలీ పట్టణము ౧౮౬౫ నుండియుఁ బురపారిశుద్ధ్య సంఘము వారిచేఁ బాలింపఁ బడుచున్నది.

అథగడము. అథగడము ఎస్టేటు బంగాళా రాజధానికి చేరిన ఒరిస్సాలో నున్నది. దీనివైశాల్యము ౧౬౮ చ॥ మైళ్లు. జనసంఖ్య ౧౯౦౧ లో ౪౩౭౮౪. దేశము చాల ఫలవంతమైనది. ధాన్యము పండును. మహానదియని పేరుగలనది దీనిగుండ పారుచున్నది. అప్పుడప్పుడు వరదలు వచ్చుటచే జాలనష్టము గలుగుచున్నది.

ఈ ఎస్టేటు పూర్వము శ్రీకర నీలాద్రి బవార్త పాట్నాయక్ అనునాతనివలన సంపాదింపఁ బడినది. పూరిపట్టణ రాజునకీతఁడొక ప్పుడు మంత్రిగనుండి యాతనికిఁ జాల నుపకారము సేయుటచే నారాజీతనికీ యెస్టేటు బహుమతిగ నిచ్చెనఁట. రాజు సోదరిని పెండ్లి యాడుటచే నెస్టేటు కట్నముగ నీయఁబడె నని మరియొక వదంతిగలదు. ఏది నిజమో నిర్ధారణ చేయుటకు వీలులేనప్పటికిని పూర్వమీయెస్టేటు పూరి రాజులదని నమ్ముటకు నాధారముగలదు. ఈ యెస్టేటులో ౧౯౨ చిన్నగ్రామములుగలవు. రాఁబడి సంవత్సరమునకు నేఁబదివేల రూపాయలు. సాలునకు నేడువేల రూప్యములింగ్లీషు ప్రభుత్వమునకుఁ గప్పము చెల్లింపవలెను.

అథనతాలూకా. ఈ తాలూకా బొంబాయి రాజధానిలోని బెల్గాము జిల్లాకు నీశాన్యమూలగనున్నది. దీనిలో ౮౨ చిన్న గ్రామములు గలవు. తాలూకా వైశాల్యము ౮౧౬ చదరపుమైళ్లు. జనసంఖ్య ౧౧౭౧౭౭. ఈతాలూకా గుండ కృష్ణానది ప్రవహించుచున్నది. అయినప్పటికి నిక్కడ పంటలు చాల తక్కువ.

అథనేసియస్. ఇతఁడు ౩వ శతాబ్దమున అలెక్జాండ్రియాయందుఁబుట్టెను. ఇతఁడు మతద్వేషియు వితండావాదియును. ఈ విపరీతమువలననే యితనిని దేశమునుండి వెడలఁగొట్టిరి. అప్పుడు కొంతకాలమడవులలో దాగి కాలము గడపుచుఁ దుదకు మతాభిలాషియై రాజునొద్దకు నుత్తరము లంపెను. రాజాతని మన్నించి తిరుగ దేశమునం దుండుటకు నుత్తరు విచ్చెను.

అథమల్లిక్. ఇది బంగాళా రాజథానిలోని ఒరిస్సాయందలి యొకయెస్టేటునకు పేరు. దీనివైశాల్యము ౭౩౦ చ॥ మైళ్లు. జనసంఖ్య ౧౯౦౧లో ౪౦౭౫౩. రాఁబడి ౭౦౦౦. ఇంగ్లీషువారికి సాలునకు రూ ౫౦౦ లుపన్ను చెల్లింపవలయును. ఈఎస్టేటులో ౪౮౦ పల్లెలు గలవు.

అథర్టన్. (చార్లెసుగార్డను) ౧౮౦౫-౫౩. న్యూహేంప్‌షైరులోని అమ్హారస్టు పట్టణములోఁ బుట్టెను. రాజకీయ విషయాభిలాషి. అమెరికాదేశీయ మహాజనసభలోఁ జేరొందినవాఁడు. బానిసవ్యాపారమున కనిష్టుఁడై మహాసభలందుఁ బెక్కండ్రమాట సాగనీయక తన యిష్టమునే ఫలింపఁజేసెను.

అథీన పట్టణము. ఈ పట్టణము బొంబాయి రాజథానిలోని బెల్గాము జిల్లాయందలి అథీనతాలూకాకు ముఖ్యపట్టణము. జనసంఖ్య ౧౯౦౧ లో ౧౧,౦౦౨. ఇదిగొప్ప వర్తకస్థానము. అనాదికాలమునుండియుదీనికిఁ బ్రసిద్ధిగలదు. ౧౬౩౯ లో మందల్‌సోయను ఫ్రెంచిదేశపు బాటసారి యొకఁడు దీనిని గొప్ప వర్తకస్థానముగాఁ జేర్కొనియెను. ౧౬౭౦లో ఒగిల్‌బై యనునాంగ్లేయుఁడుగూడ దీనిని తాను రచించిన హిందూదేశ భూగోళములో వ్రాసియున్నాఁడు.

౧౬౭౯ లో దిలావర్‌ఖాన్ అను మొగలాయీయొకఁడు, ఈపురమును శివాజీయొద్ద నుండి సంపాదింపఁగలిగెను. ఆతఁడక్కడి ప్రజలను బానిసలుగ నమ్మ తలంచెను.

అప్పుడు శివాజీ కుమారుఁడగు శంభాజీ తండ్రితో విరోధించి ఈఖాన్‌దగ్గఱ నుండుట తటస్థించెను. ఆతఁ డీకర్మకుఁ దన యసమ్మతిని వెలిబుచ్చుటయేగాక ఖానందుల కియ్యకొనక పోవుటచే నాతనివిడచి తిరిగి తండ్రిని జేరెను. ౧౭౨౦ సంవత్సర ప్రాంతమున నీ పట్టణమును నైజాము స్వాధీనపఱచుకొని దానిని కొల్హాపురనవాబునకిచ్చెను. ఈ నవాబుదీనిని ౧౭౩౦ లో సాతారపాలకుడగు రాజాసాహు యను నతనికి నిచ్చెను. ఇది ౧౮౩౯ లో నింగ్లీషువారి స్వాధీనమయ్యెను.

అథర్వణాచార్యుఁడు. ఆంధ్రమునందు వ్యాకరణమును రచిఁచిన యొక విఖ్యాత లక్షణవేత్త. నన్నయభట్టు మొదట నాంధ్రశబ్దములను శాసించెను గనుక నాతఁడు ప్రథమాచార్యుఁడనియు, నాతని తరువాతఁ దెలుఁగు వ్యాకరణము వ్రాసినవాఁడు, భారతమును తెనిగింపఁ బూనినవాఁడు, అథర్వణాచార్యుఁడు గనుక నీతఁడు ద్వితీయాచార్యుఁడనియు నాంధ్రపండితులలోఁ బరంపరా గతమైన నమ్మకము కలదు. "ప్రథమాచార్యుఁడనఁబడు నన్నయ భట్టారకుని తరువాతనే యీతఁ డుండకపోయిన యెడల నీతనిని ద్వితీయాచార్యుఁడనుట యెట్లుతటస్థించును" అని ఆంధ్రకవుల చరిత్రమునందు వీరేశలింగముగారు.* "ఇతనిని ద్వితీయాచార్యుఁడని పేర్కొందురు. ఇతఁడట్లు పేర్కొనఁబడుటచే నన్నపార్యుఁడు ప్రథమాచార్యుఁడనుట స్పష్టమగుచున్నది" అని శబ్ద రత్నాకరమందు సీతారామాచార్యులు.

ఈ తఁడు రచించె నన్న గ్రంథములు రెండు కనఁబడుచున్నవి ; రెండు వినఁబడుచున్నవి. ౧. త్రిలిఙ్గ శబ్దానుశాసనము, ౨. కారికావళి, అనఁబడు వికృతి వివేకము, అను వ్యాకరణ గ్రంథములు రెండు కానవచ్చుచున్నవి. ౧. అథర్వణఛందస్సు, ౨. అథర్వణభారతము (విరాటాది పర్వములు) అను రెండు గ్రంథము లీతనిచే రచింపఁబడినట్లు, అప్పకవి మొదలైన లాక్షణికులు చెప్పుటవలనఁ దెలియుచున్నది.

అథర్వణుఁ డన్నది వింత పేరు. ఆంధ్ర దేశమునందు వినఁబడు పేరు నదికాదు. ఈపదము పెట్టుకొన్న బిరుదుగఁ గానవచ్చునది గాని, ఎల్లయ, మల్లయవలె వ్యక్తి నామముగఁదోఁచుటలేదు. తమ పేళ్లు ఘనముగ నుండవలయునని యిట్టి మారుపేళ్లను పెట్టుకొనుట మన దేశమునందు నాచారమె. 'గాలిసరసయ్య' యను పేరు పేలవముగ నున్నదని 'వాతూలాన్వయ అహోబలపతి' యని మార్పఁబడలేదా? 'కవిరాక్షసుఁడు' అన్న పేరును ఇట్టిదే. ఇతని మూలనామము మాత్రమింకను మనకుఁ దెలియలేదు. ఇట్లే ఈ గ్రంథకర్త 'అథర్వణాచార్యుఁ' డన్న బిరుదును తానే స్వయముగ ధరించియుండును, లేదా యతని భక్తులెవ్వరైన నాతనికి నొసంగియుందురు. ఈ బిరుదును బట్టి యీతఁడు అథర్వణశాఖవాఁడై యుండునని యూహింపవలసి యుండును. అట్లే పెక్కుజను లూహించుచున్నారు. కాని, ఆంధ్ర దేశమునందు నెచ్చటను అథర్వణశాఖ కానరాదు. ఒక్క యాంధ్రదేశమునందే కాదు,

* ఆంధ్రశబ్దచింతామణి నన్నయ ప్రణీతము కాదని వీరేశలింగముగారి యభిప్రాయము. అయిన్నను శబ్దములను శాసించి భారతము రచించినందున నాతనికిఁ బ్రథమాచార్యుఁడన్న బిరుదు వచ్చెననియు, ఆతని తరువాత అథర్వణాచార్యుఁడు భారతమును రచింపఁ బూనెఁగావున నితఁడు ద్వితీయాచార్యుఁ డనఁబడెననియు వారియూహ.

హిందూ దేశమునందలి యితర ప్రాంతములలోఁ గూడ నీశ్శాఖవారు కానవచ్చుట యతి దుర్లభము. ఇఁక నీ పేరెట్లు వచ్చియుండును? ఇందున గుఱించి పరిశోధించి చూడఁగా అథర్వణ కృతమైన త్రిలింగశబ్దానుశాసనమునందే యొక యాధారము దొరకినది. పంచమ కాండమునందు, అథర్వశిఖోపనిషత్తులోనిది యని "త్రిమూర్తులకు సంస్కృతాంధ్ర ప్రాకృతములు ప్రియకరములు. అనఁగా బ్రహ్మకు సంస్కృతము, విష్ణువునకుఁ దెలుఁగు, శివునకుఁ బ్రాకృతము ప్రియము" * ఈ వాక్య ముదాహరింపఁబడియున్నది. అథర్వ వేదమునందు నుదాహరింపఁ బడినది కావునను, విష్ణుదేవతాకము గనుకను, ఆంధ్రభాష అనాది యనియు, మిక్కిలి గౌరవము గలదియనియుఁ జూపుట యీగ్రంథకర్తయొక్క యుద్దేశముగాఁ గానవచ్చుచున్నది. ఆంధ్రభాషాప్రాచీనత్వము వైదిక ప్రాశస్త్యముచే సుసంగతమని కాఁబోలు పై యథర్వవచనమును శోధించిపట్టు కొన్నగ్రంథకర్త కథర్వణాచార్యుఁ డన్న బిరుదు పెట్టఁబడియుండును. "సంస్కృతమున ప్రమాదమున నపశబ్దము నుచ్చరించినను, విన్నను పాణినిని స్మరింపవలెను" (శృతేఽపశబ్దేచోక్తేవా ప్రమాదాత్ పాణినింస్మరేత్)

* అథర్వణ శిఖోపనిషది "త్రిమూర్తీనాం సంస్కృతాన్ధ్ర ప్రాకృతాః ప్రియంకరాః" ఈ వాక్యము ప్రస్తుత మచ్చుపడియున్న యే యథర్వణశిఖోపనిషత్తునందును గానరాదు!

అని యిడివఱకే యొక కారిక కలదు. దానికి జతగా నీతఁడు తన గ్రంథమునందు "ఆఱు విధములైన ప్రాకృతములలోఁ బొరపాటైన యెడల వాల్మీకినిగాని, మహేశ్వరుని గాని తలఁచుకొనవలెను. ఆంధ్రమునఁ బొరపడిన నన్నే (అథర్వణునే) స్మరియింప వలయు" (ప్రాకృతే షడ్విధేచాపి వాల్మీకిం వా మహేశ్వరం - ధ్యాయే దత్రతుమామేవ స్మరేత్పండిత సమ్మతః) అని శ్లోకపాదములు చేర్చియున్నాఁడు. కావునఁ దాను పాణిన్యాద్యాచార్యులతో సమానుఁడును, ఋషియునని స్వాధిక్యతవిశేషముగఁ జెప్పుకొనుచున్నాఁడు. లోకులు ఋషియని యెంచుటకు నెల్లయమల్లయ పేళ్లుపయోగకరములుగావు. 'అథర్వణుఁడు' అన్న పేరు గొప్పగాఁగానవచ్చును. అథర్వ వేదముతో సంబంధించిన ఋషియని ధ్వనించును. ఇట్టిపేరు కేవల కల్పితమని మనము నిశ్చయింపవచ్చును.

ఇతఁడు తన గ్రంథమునందుఁ బ్రతికాండమునకుఁ జివర "ఇతి చతుష్షష్టి కళాధురాథర్వణాచార్య విరచితే త్రిలిఙ్గశబ్దానుశాసనే" అని వ్రాసికొనియున్నాఁడు! అఱువది నాలుగు కళలును నీతనికివచ్చునని యర్థము.

ఈతని కాలము

ఇతఁడు మిక్కిలి పురాతనుఁడనియు, నన్నయతో సమకాలికుఁడనియుఁబురాతనపండితులయభిప్రాయము. వారిట్లొక కథ కూడఁ జెప్పుచున్నారు. "అథర్వణాచార్యుఁడు

భారతమును తెనిఁగించి దానికి రాజనరేంద్రుని కృతి కర్తనుగాఁ జేసి బహుమానము పొందవలయునని రాజమహేంద్ర వరమునకు వచ్చి నన్నయ భట్టునకు గ్రంథమునుజూపి తనకు రాజసందర్శనము చేయింపుమని వేఁడెననియు, ఆగ్రంథము సర్వోత్కృష్టముగా నున్నందున దానిని బ్రకటనపఱచిన యెడల స్వగ్రంథ ప్రాశస్త్యము చెడునని యతఁడాలాగుననే యనిచెప్పి త్రిప్పుచు నొక నాఁడథర్వణాచార్యుఁడింట లేని సమయమున నతఁడు బసచేసియున్న యింటివారికి లంచమిచ్చి యాపుస్తకమును కాల్పించెననియు, ఇల్లువిడిచి పోవునప్పు డథర్వణాచార్యుఁ డెవ్వరికో చూపుటకయి తనతోడఁగూడఁ దీసికొని పోయిన విరాట పర్వమొక్కటి మాత్రము నశింపక మిగిలెననియు, ఈదుర్ణయము నన్నయభట్టువలన జరిగినదని తెలిసికొని యథర్వణాచార్యుఁడాతనిని శపించుచు దుఃఖముతో లేచి పోయెననియు, సాధు పురుషునకు నిష్కారణముగా ద్రోహముచేసిన చింతచేత నన్నయ భట్టు మతిచెడివెఱ్ఱివాఁడై గ్రంథరచనకు సమర్థుఁడుకాక పోయెననియు చెప్పుదురు."*

కొందఱు పైకథవలన నన్నయభట్టారకుని యందు గొప్పదోష మేర్పడుచున్నదని దానిని నమ్మక, ఈ యాచార్యుఁడు నన్నయకుఁ గొంచెము తరువాతి వాఁడనియు, నన్నయ మూఁడు పర్వములను తెనిఁగించినందున నితఁడు విరాటపర్వము మొదలు తెనిఁగింపఁ బోడఁగెననియు, నన్నయ ఆంధ్రశబ్దచింతామణియను వ్యాకరణమును రచించినందున నీతఁడుదానికంటెఁబెద్దవ్యాకరణమునురచించెననియుఁ గావుననె యీతనికి ద్వితీయాచార్య బిరుదు వచ్చెననియుఁ జెప్పుదురు. ఇట్లుచెప్పువారందఱిది, అథర్వణుఁడు క్రీ.శ. పదునొకండవ, పండ్రెండవ శతాబ్దములవాఁడని భావము. కాని యీగాథలన్నియు నాధార రహితములుగనుక నమ్మఁదగినవికావు.

కాల నిర్ణయము

అథర్వణుఁ డీ కాలమువాఁడని నిశ్చయముగఁ జెప్పుటకు వీలు లేదు కానియీకాలమునకుఁబూర్వపువాఁడు కాఁడనిమాత్రము చెప్పుటకునాధారములున్నవి. అథర్వణుఁడు త్రిలింగ శబ్దానుశాసనము నందు ప్రథమ కాండము అయిదవ శ్లోకములోను, తృతీయ కాండము పదుమూఁడవ శ్లోకములోను హేమచంద్రుని పేరుదాహరించి యున్నాఁడు. ఇతఁడు విఖ్యాతిచెందిన ప్రాకృతభాషాలాక్షణికుఁడు. ఇతఁడు క్రీ. శ. ౧౧౭౨-వ సంవత్సరమునందు మృతి నొందెను. కావున నితనిని ఉదాహరించిన యథర్వణుఁడు పండ్రెండవ శతాబ్దమునకుఁ బూర్వపువాఁడు అయియుండఁడు.

కారికలలోఁ దెలుఁగక్షరముల స్వరూపమిట్లు వ్రాయఁబడియున్నది:—

"పంచవర్గముల ప్రథమాక్షరములు (కచటతపలు) శంఖశార్ఙ్గాదికములవలె నుండును.

*ఆంధ్రకవులచరిత్రము.

ఆయాక్షరములకు మీఁదిభాగమందు తిర్యగ్రేఖ లుండును. క్రింది భాగమందు దండరేఖ లుండును. ......"*

ఆంధ్రాక్షరములకు నీస్వరూపములు, పండ్రెండవ శతాబ్దాంతమువఱకుగాని ప్రాప్తింపవనుటచే నీగ్రంథకర్త యాకాలమునకుఁ బూర్వుఁడై యుండఁడనుటకు సందేహము లేదు.

క్రీ. శ. పదుమూఁడవ శతాబ్దము నందుఁ గూడ నథర్వణుఁడు లేనట్లు తోఁచుచున్నది. కేతన తిక్కనసమకాలీనుఁడు. పదుమూఁడవ శతాబ్ది మధ్యమువాఁడు. ఆంధ్రభాషాభూషణమను తెలుఁగు వ్యాకరణము వ్రాసినాఁడు. అందు నాతఁడిట్లు వ్రాసియున్నాఁడు.

1. మున్ను తెలుఁగునకు లక్షణ
మెన్నఁడు నెవ్వరును జెప్పరే జెప్పెద వి
ద్వన్నికరము మది మెచ్చఁగ
నన్నయ భట్టాది కవిజనంబుల కరుణన్.

2. సంస్కృత ప్రాకృతాది లక్షణము చెప్పి
తెలుఁగునకు లక్షణము మున్ను దెలుపకునికి
కవిజనంబుల నేరమి గాదు, నన్ను
నుద్ధరింపఁ దలఁచిన తలఁపుగాని!

ఈ పద్యములనుబట్టి చూడ కేతన యాథర్వణ వ్యాకరణములను, ఎఱుఁగఁడనుట స్పష్టము. కేతన యెఱుఁగఁడనఁగా తిక్కన యాస్థాన మెఱుఁగదన్నమాట. ఇట్టి లక్షణ గ్రంథములె యాకాలమందు నస్తిత్వమునందున్న యెడల తిక్కన యాస్థానపువారు వానిని, ఎఱుఁగకుండుట యసంభవము. కావున నథర్వణుఁడు పదుమూఁడవశతాబ్దానంతరము వాఁడని తేలుచున్నది. ఇట్లీతని కాలమునకు నొకపరిమితి ౧౩-వ శతాబ్ద మేర్పడినది. ఇఁక రెండవ పరిమితి దొరకునేమో చూతము.

నిశ్చయముగ నీకాలపువాఁడని మన మెఱింగినవాఁడు కాకునూరి-అప్పకవి. ఈతఁడు తన గ్రంథము శా. శ. ౧౫౭౮-వ సంవత్సరమునఁ బ్రారంభించితినని యందే వ్రాసియున్నాఁడు. శా. శ. ౧౫౭౮ అనఁగా క్రీ. శ. ౧౬౫౬. ఇతఁడు అథర్వణఛందస్సును, అథర్వణ భారతమును, ఉదాహరించియున్నాఁడు. ఇతని సమకాలికుఁడైన అహోబల పండితుఁడును, అథర్వణుని, అతని వ్యాకరణకారికావళినిస్పష్టముగఁ బేర్కొని యున్నారు. కావున నీతఁడు క్రీ. శ. పదునేడవ శతాబ్దమునకుఁ దరువాతివాఁడు కాఁడనియు, పదుమూఁడవ శతాబ్దమునకును, పదునేడవ శతాబ్దమునకును నడుమనున్న పదునాల్గు, పదునైదు, పదునాఱు శతాబ్దములలో నెప్పుడో యుండి యుండుననియు తేలుచున్నది.

ఈ రెండవ పరిమితిని నింకను గొంచెము వెనుకకులాగఁ బ్రయత్నింపవచ్చును. వెల్లంకి తాతంభట్టు కవిచింతామణియను లక్షణగ్రంథమునందు నథర్వణునిది యని యొక పద్యమును ఉదాహరించి యున్నాఁడు. కాని, తాతంభట్టు కాలమును నిశ్చయముగ

* [illegible] వలయు [illegible], ౧-వ సంపుటము, [illegible] పుటలు [illegible].

నిర్ణయించుటకు నాధారములు లేవియు లేవు. "ఈకవి కృష్ణరాయని రాజ్యారంభకాలము నందుండినవాఁడు" అని వీరేశలింగముగారు వ్రాసిరి. కాని, అందులకు నాధారమేదియుఁ గానరాదు. ఈ కాల నిర్ణయమే నిజమైన యెడల భారతమును రచించిన అథర్వణుఁడు క్రీ. శ. పదునాఱవ శతాబ్దమునకుఁ బూర్వపు వాఁడని చెప్పవలయును. ఇంతకుఁ బూర్వము వారెవరును నథర్వణుని స్తుతించి యుండ లేదు. పేరొక్కనియుండలేదు.

తత్కృత గ్రంథములు

అథర్వణుని పేరు మీఁదఁ బరంపరగవచ్చుచున్న గ్రంథములు నాలుగని యిదివఱకే చెప్పియున్నాము. అందు రెండు వ్యాకరణములు, ఒకటి ఛందస్సు, ఒకటి కావ్యము. చివరవి రెండును నామావశిష్టములు. మొదటి రెండును మిక్కిలి యపరిశుద్ధ స్వరూపముతోఁ గానవచ్చుచున్నవి. ఈ నాల్గింటికిని నొకఁడే కర్తయై యుండునా? లేక భిన్న కర్తృకములైన యీ గ్రంథములకు పొరపాటున గాని, బుద్ధి పూర్వకముగ గాని యేక కర్తృత్వ మారోపింపఁబడెనా? యని కొందఱు ప్రశ్నలడుగుచున్నారు. త్రిలింగశబ్దానుశాసనమను గ్రంథము మిక్కిలి పురాతనమైనదనియు, దాని కర్త యొకఁడనియు, కారికావళి మిక్కిలి యాధునికమనియు, దానికర్త భిన్నుఁడనియు, శ్రీ పాడి వెంకటస్వామిగారు, ఆంధ్రపత్రిక యొక్క ౧౯౧౧-౧౨ సంవత్సరపు సంవత్సరాది సంచికలో శోధకులచే గమనింపఁదగిన వ్యాసమును బ్రకటించియున్నారు. ఈగ్రంథమును గుఱించి క్రింద, వ్రాయునప్పుడు, ఈ విషయ మెక్కువగాఁ జర్చించెదము. ఇఁక గ్రంథములనుగుఱించి వేఱువేఱుగ విచారించెదము.

౧ త్రిలింగ శబ్దానుశాసనము

ఇదియే యథర్వణ వ్యాకరణమను పేరఁ బరగుచున్నది. దీని ప్రతిమాకు నొక్కటియే దొరకినది. ఇది ప్రాచ్య లిఖిత పుస్తక భాండాగారములోనిది. ఇది మిక్కిలి యపరిశుద్ధ ప్రతి. తప్పుల తడికగా నున్నది. పేరు పెద్దదే కాని గ్రంథము చిన్నది. ఇందుఁ బదికాండములు గలవు. కాండ మొకటింటికిని ముప్పది పంక్తుల కంటె నెక్కుడు విషయములేదు. గ్రంథము విశేషముగఁ బద్యాత్మకము; అచ్చటచ్చట గద్యముకూడఁ గలదు. పదికాండములలోను క్రమముగ ౧ సంజ్ఞా, ౨ సంధి, ౩ తత్సమ, ౪ ఆచ్ఛిక, ౫ తద్ధిత, ౬ సమాస, ౭ కారక, ౮ తిజంత, ౯ క్రియా, ౧౦ కృదంతములను గుఱించిన నియమములు గలవు. ఈ గ్రంథమందలి లక్షణము మొత్తము మీఁద స్వల్పము. సంజ్ఞాపరిచ్ఛేదమందు, అచ్చులలో వక్రవక్రతమ సంజ్ఞలుగల యక్షరము లున్నట్టు చెప్పఁబడి యుండలేదు; కచటతపలకుఁ బరుష సంజ్ఞలేదు; గజడదబలకు సరళసంజ్ఞ లేదు; మిగిలినహల్లులకు స్థిరసంజ్ఞలేదు; ద్రుత ప్రకృతికము లెవ్వియో, కళ లెవ్వియో వివరింపఁబడలేదు; తేనెటీఁగ, చిగురుటాకు, పేద

రాలు మొదలైన శబ్దములలోని టుగాగమ, రుగాగమములకు నియమములేదు; నామ ప్రత్యయములు చెప్పఁబడియుండలేదు; తిఙంతములందు లఙాదుల ప్రత్యయములను, రూపములను, చక్కఁగ వివరింపలేదు. ఇట్లిప్పటి వ్యాకరణమునందుఁ గానవచ్చెడు పెక్కు నియమము లీ వ్యాకరణగ్రంథమునందు లేవు. ఈ స్వల్ప లక్షణములను జూచి కొందఱు "ఈ గ్రంథము నన్నయభట్టునకుఁ బూర్వ మనఁగా నాంధ్రలక్షణము మిక్కిలి తక్కువగా నున్న కాలమున రచింపఁబడియుండు" నని యూహించియున్నారు. కాని యట్టియూహ సరియైనదికాదు. కేతనకృతమైన ఆంధ్రభాషాభూషణముకూడ మిక్కిలి చిన్నది. అందు నెన్నియో లక్షణములు లేవు. అందుచే నది నన్నయకుఁ బూర్వకృతమని చెప్పవచ్చునా? కేతన వఱకు నాంధ్రము పరిపూర్ణావస్థ నెందియుండెను.

ఈగ్రంథమునందుఁ బ్రాచీనాంధ్రలక్షణవేత్తలుగా నీ క్రిందివారు పేర్కొనఁబడి యున్నారు: 1 బృహస్పతి, 2 కణ్వుఁడు, 3 హేమచంద్రుఁడు, 4 పుష్పదంతుఁడు, 5 రావణుఁడు, 6 గౌతముఁడు, 7 ధర్మరాజు. వీరందఱును తెలుఁగు వ్యాకరణములను రచించినట్లును, ఆ గ్రంథము లథర్వణునకుఁ బూర్వముండినట్లును, ఈ గ్రంథమువలన సూచింపఁబడుచున్నది.

బార్హస్పత్యాని సర్వాణి
కాణ్వం వ్యాకరణంవిదన్
కరోమ్యాథర్వణం శబ్దం
'సర్వలక్షణ లక్షితం.' ౧-వ కాండము

అని ప్రథమముననే యున్నది. బృహస్పతి కృతమైన వ్యాకరణమును, కణ్వకృత వ్యాకరణమును జూచి యీ యథర్వణ వ్యాకరణమును రచించుచున్నాఁడనని దీని కర్థము.

హేమచంద్రాది మునిభిః
కథితం చాంధ్రలక్షణం. ౧-వ కాండము

హేమచంద్రాది మునులచే నాంధ్ర లక్షణము చెప్పఁబడినది.

ఇందలి హేమచంద్రశబ్దము లేఖకప్రమాదజనిత మనియు, 'సోమచంద్ర' అని యుండవలెననియు, శ్రీ పాడి వెంకటస్వామిగారు వ్రాసిరి. కాని, హేమచంద్రునిపేరు త్రిలింగశబ్దానుశాసనమునందుఁ బెక్కుచోట్ల వచ్చినందునఁ బ్రమాదమనుటకు వీలులేదు. ఇట్లే పైనిఁజెప్పఁబడిన యితర నామములు వచ్చుటచ్చట నుదాహరింపఁబడినవి.

కాని, పూర్వమిందఱు త్రిలింగలక్షణములు వ్రాసిరని మనము నమ్ముటకు వీలున్నదా? బృహస్పతి, కణ్వుఁడు, రావణుఁడు, పుష్పదంతుఁడు, అను నామములె వీరు కల్పితలాక్షణికులని సూచించుచున్నవి. ఇవి కాల్పనిక నామములనుటకు మఱియొక యాధారమున్నది. రావణుఁడనిన తోడనే మనము యీ పేరుగల మనుష్యుఁడొకఁడు వ్యాకరణము

రచించెనని అనుకొని పోవుదుమని గ్రంథకర్త యొకచోట (చతుర్థకాండమునందు). "అథ పౌలస్త్యరావణః" అనిచెప్పినాఁడు. అనఁగా 'శ్రీరాములవారి శత్రుఁడైన రావణుఁడు తెలుఁగు వ్యాకరణమును రచించెను. అందుండి నేను ఉదాహరించుచున్నాఁడను'. అని గ్రంథకర్తయొక్క అభిప్రాయము! పౌలస్త్య రావణుఁ డెక్కడ? ఆంధ్రవ్యాకరణ మెక్కడ? బృహస్పతి రచితమైన ఆంధ్రవ్యాకరణమును గాని,పుష్పదంతవ్యాకరణమునుగాని,ఎన్నఁడు నెవ్వరును చూచియుండలేదు. వినియుండలేదు. పూర్వకాలపు సంస్కృతాంధ్ర గ్రంథకర్త లెవ్వరును దీనిని బేర్కొనలేదు. బృహస్పతి దేవగురువు, పుష్పదంతుఁడు మహిమ్నము రచించిన యతుఁడు. కాణ్వవ్యాకరణమును గుఱించి యీ గ్రంథమునందే యిట్లుచెప్పఁబడియున్నది:—

"కణ్వోయథాహ:......ఆంధ్ర విష్ణోర నుజ్ఞాకృతస్య మద్వ్యాకరణస్యద్రోహీ [గురుద్రోహీ] తి."

అర్థము:—ఆంధ్రవిష్ణు నాజ్ఞవలనఁ జేయఁబడిన నావ్యాకరణమునకు ద్రోహము చేయువారు గురుద్రోహులు సుమీ.

ఆంధ్రవిష్ణువు, ఆజ్ఞయిచ్చినట్టును, కణ్వమహర్షి యాంధ్ర వ్యాకరణము రచించినట్టును, దానిని నెవరునుదాటి లక్షణము చెప్పఁగూడనట్టును, పై వాక్యము వలనఁ దెలియుచున్నది. ఈ "గురుద్రోహీ" అన్న తిట్టు వలననే యీ గ్రంథకర్తకుఁ దన వ్యాకరణమును 'ఎవరు లక్ష్యము చేయరు' అన్న భీతి కలిగి యున్నట్టును, అది మిక్కిలి ఆధునికమైనట్టును, బాగుగ ధ్వనించుచున్నది. ఇందలి యాంధ్రవిష్ణువు ఎవఁడని విచారింపఁగా నీ గ్రంథమునందే "పదుమూఁడు యుగములు నిశంభువను రాక్షసునితోఁ బోరాడి వానిని జంపినవాడు" అనియున్నది. *ఈ ఆంధ్రవిష్ణువు శ్రీకాకుళము వాఁడని తెలియుచున్నది. ఇతఁడునుచంద్రునికొడుకనుకొన్ననుఅట్టివాని యస్తిత్వమే సంశయాస్పదము. ఒక రాజట్టివాఁడు నిజముగా నుండెనని యనుకొన్నను ఆతఁడు మిక్కిలి పురాతనుఁడై యుండవలెను. మగధము పాలించిన యాంధ్రరాజుల కంటెఁ గూడ మిక్కిలి పురాతనుఁడై యుండవలెను. అప్పుడీ యాంధ్రభాషకలదా? ఉన్నను ప్రస్తుత రూపమునకంటె మిక్కిలి భిన్నరూపముతో నుండవలెను. కావున నిప్పటియాంధ్రమునకు నప్పుడు లక్షణమెట్లు వ్రాయుటతటస్థించును? హేమచంద్రుఁడు జైనపండితుఁడు. ప్రాకృత వ్యాకరణము, ప్రాకృతకోశము వ్రాసినవాఁడు. తెలుఁగునకు నతనికి నెట్టి సంబంధమును లేదు. ఆతఁడు తెలుఁగు దేశమువాఁడుకాఁడు. ఔత్తరీయుఁడు. ౧౨-వ శతాబ్దాంతము వాఁడు. ఇందు "హేమచంద్రాదిమునిభిః కథి,

* "ఆంధ్రవిష్ణుస్సురయుతో దనుజేన నిశంభునా। యుద్ధ్వాత్రయో దశయుగాన్ హత్వాతం రాక్షసోత్తమం (రాక్షసాధమం?)" 4-వ కాండము.

తం చాంధ్రలక్షణమ్" అన్న వాక్యమునందు హేమచంద్రునకు మునియన్న బిరుదు ఈయఁబడినది. కావున త్రిలింగశబ్దానుశాసనము వ్రాయునాఁటికి హేమచంద్రుఁడు మిక్కిలి పురాతనుఁడై యుండవలెను. అప్పటికాతఁడు చనిపోయి మూఁడు నాలుగు వందల సంవత్సరము లయినను అయిపోయి యుండవచ్చును. హేమచంద్ర పాఠము పొరబాటు. సోమచంద్రపాఠము నిజమనుకొనినను, ఈపేరుగల ఆంధ్రవ్యాకర్త యెచ్చటను ఖ్యాతి చెంది యుండలేదు. ఇతరు లెవరును ఈతనిని పేర్కొని యుండలేదు.

సంస్కృత వ్యాకరణమువలె నాయా భాషలకు ఋషి ప్రణీతములైన వ్యాకరణము లుండినఁగాని ఆయా భాషలకు గౌరవ ములేదని మనపూర్వ పండితుల యభిప్రాయము. అందుచేతనే యఱవవారు తమభాషకు అగస్త్యముని లక్షణము చెప్పెననియందురు. తెలుఁగు భాషకు నట్టి ఋషిప్రణీతమైన వ్యాకరణములేక పోవుట యొకలోపముగఁ దోచి మనవారిట్టి ఋష్యాదులను ఆంధ్రవ్యాకర్తలుగఁ గల్పించియుందురు.

ఈగ్రంథకర్తకెవరో ప్రతిపక్షులున్నట్టును, ఈతఁడు వారికి జవాబుచెప్పి ఖండించుచున్నట్టును, ఈగ్రంథమునందే నిదర్శనములు కానవచ్చుచున్నవి. తృతీయ కాండమునందు:—

> అత్రత్రిలింగ భాషాయాం
> లింగమర్యాద వాసితాః
> శబ్దాః కేచిత్తు నేత్యాహు
> రల్పజ్ఞామందబుద్ధయః ॥౧౨.

అర్థము:- ఈ త్రిలింగ భాషలో లింగ మర్యాదగలశబ్దములు * లేవని కొందఱు, అల్పజ్ఞులు, మందబుద్ధులు చెప్పెదరు.

> ప్రయోగమేవ పశ్యంతి
> మూఢా మేధావినస్తునః ॥౧౪.

అర్థము : — మూర్ఖులు ప్రయోగమునే చూచెదరు ; బుద్ధిశాలు రట్లుచూడరు. ‡

> ఆంధ్రసంస్కృత భాషాస్తు
> దేవతాస్థాః ప్రమోదదాః
> సుబంతైశ్చ కృదంతైశ్చ
> యుక్తాగస్వర్గప్రదానృణాం ॥౧౫.

అర్థము:—ఆంధ్రభాషయు, సంస్కృతభాషయు, దేవతలకుఁదగినవి. ప్రమోదమిచ్చునవి. అవి సుబంత కృదంతములతో నొప్పి లోకులకు స్వర్గమునిచ్చును.

> ఆంధ్ర సంస్కృత భాషాభ్యాం
> కవిత్వమృషితా ప్రదం ॥౧౬.

అర్థము:—ఆంధ్ర సంస్కృతభాషలలోఁ గవిత్వము చెప్పుటవలన ఋషిత్వము ప్రాప్తించును.

---

* లింగమర్యాద యనఁగా సంస్కృతమునందు నర్థమునుబట్టి లింగనిర్ణయములేదు ; శబ్దమునుబట్టియే యుండును. ప్రతిశబ్దముయొక్క లింగమును వ్యవహారమునుబట్టి యిదివరకే నిర్ణయమైయున్నది. వానిని కోశములవలనఁ దెలిసికొనవలయును.

‡ ముఖ్యమేది ? ప్రయోగమా? లక్షణమా ? అన్న పోరాటమది చదువరు లెఱిగియేయుందురు.

మఱికొన్ని విశేషములు

ప్రాకృత వ్యాకరణమును పూర్వులు సంస్కృతమున వ్రాసిరని వీరును తెలుఁగువ్యాకరణముఁ గూడ సంస్కృతముననే వ్రాసిరి. భాష సంస్కృతము, విషయ మాంధ్రవ్యాకరణ మయినందున నంతటను లక్షణము కానవచ్చును; లక్ష్యములు కానరావు. ఇందుచే సూత్రముల యర్థముకూడఁ బెక్కు తావుల సంశయమునకు నాస్పదమగుచున్నది. 'శ్లో. ఉంచికుండావల్లవలవ వంకయుండతి పంచమీ.' 'సిద్ధారణే కన్నకంటె దశ్యేపారుడి రిష్యదే' * అని ౪-వ కాండమునందు పంచమీ విభక్తిప్రత్యయములు పెక్కులు చెప్పఁబడినవి. ఇందు లేఖక ప్రమాదముచే రూపముమారిన వెన్నియో తెలియదు. లక్ష్యములు, ఉండిన యెడల నిట్టిసంశయమునకుఁ గారణముండదు. 'పారుడి' అనుప్రత్యయము 'దేశ్యము' నందుఁ గలదని వ్రాసినాఁడు. ఇది యొకానొక దేశభాగమునందలి జాతీయమైయుండునని తోఁచెడిని. అట్టిభాగమెద్దియో తెలిసిన నీగ్రంథకర్తయొక్క నివాసస్థలముకనుఁగొనవచ్చును.

"అన్యదేశాగతం గ్రామ్యం
కావ్యానర్హ మ లక్షణం" ౧౪.

అని ప్రథమకాండములో నున్నది. అనఁగా అన్యదేశమునుండి వచ్చిన గ్రామ్యము అలక్షణము, కావ్యమునందు నుపయోగింపఁ దగినది కాదు. ఇట్లనుటవలన నీగ్రంథకర్త యభిప్రాయ మేమైయుండవలెను? స్వదేశజములైన గ్రామ్యపదముల వాడవచ్చుననియా? అట్లనుటకు వీలులేదు. ఇతని మతమునఁ బ్రయోగమున్నను-అనఁగాఁ బూర్వసత్కవుల ప్రయోగమున్నను - ఒకానొక శబ్దరూపము లక్షణోక్తము కానియెడల నది గ్రామ్యమే. * ఇతని వ్యాకరణములో లేనిరూపమునకు సోమయాజి ప్రయోగమున్నను అది గ్రామ్యమే!

'కర్తృకర్మాదికం సర్వం
పాణినీయసమం మతం.'

కర్తృకర్మాదిక మంతయు ననఁగా తెలుఁగులోని కారకప్రకరణ మంతయు సంస్కృత వ్యాకరణమును అనుసరించి నేర్చుకొనవలసినదె; దీనికి దానికి భేదము లేదు; అని యీ గ్రంథకర్తయొక్క యభిప్రాయము! తెలుఁగు వ్యాకరణము మొదట వ్రాసినవారు సంస్కృత పండితులైనందున సంస్కృత వ్యాకరణమునకుఁ దెనుఁగు వ్యాకరణమును దాసిగఁ జేసిరి! కాని విభక్తులు, కారకములు మొదలైన విషయములయందు ఆంధ్రసంస్కృత భాషాసాంప్రదాయకములకు మిక్కిలి భేదమున్నది. దానిని వీరు గమనించినవారు కారు.

'అనుక్తం సర్వశాస్త్రంతు
రావణీయే విలోకయేత్' ౧-వ కాండము.

* 'కుండా' కు 'కుఁడా' 'ఫంకయుండితి' కి 'వంకడీతి' అనునవి పాడి వెంకటస్వామిగారి పాఠాంతరములు.

* 'అస్మన్మతేతు - అశాస్త్ర ప్రయోగో గ్రామ్య మితి' తృతీయకాండము.

ఈ వ్యాకరణమునందుఁ జెప్పఁబడని నియమములు రావణ వ్యాకరణము నందుఁ జూడవలసినదని యర్థము! ఈ రావణుఁడు పౌలస్త్య రావణుఁడు!!

'బాలానాం వ్యుత్పత్తి బోధార్థం
సంగ్రహః కృతమేవహి.' ౧౦ వ కాండము.

బాలురకు సులభముగా బోధయగుటకై యిది సంగ్రహించితినని గ్రంథకర్త చివర చెప్పియున్నాఁడు. ఇంతకంటెఁ బెద్దవ్యాకరణము వ్రాసితినని సూచించుట కాఁబోలును.

అథర్వణ కారికలు

ఈ గ్రంథము యొక్క ప్రతులు రెండు నాకు దొరకినవి. ఒకటి శ్రీ వీరేశలింగము గారు అచ్చువేయించినది; రెండవది ప్రాచ్య లిఖిత పుస్తక భాండాగారమునందలి వ్రాత ప్రతి. ఈ గ్రంథమంతయుఁ బద్యాత్మకము. ప్రథమ ప్రతియందు ౩౭౮ కారికలు కలవు; రెండవప్రతియందు ౨౨౨ కారికలు కలవు. ఇట్లీ రెండు ప్రతులకును ౧౫౬ కారికల భేదము కలదు. ఈ భేదమునకుఁ గారణమున్నది. మొదటి ప్రతియందుఁ దెనుగు వ్యాకరణమునకు సంబంధము లేనట్టియుఁ, గేవలము సంస్కృత వ్యాకరణమునకు, సాహిత్యమునకు, సంబంధించినట్టియుఁ గారికలు రమారమి నూఱువఱకు నున్నవి. ఇవన్నియుఁ బురాతన సంస్కృత లక్షణ గ్రంథములలో నుండి యెత్తి వ్రాయఁబడినవి.

'తదల్పమపి నోపేక్ష్యం
కావ్యే దుష్టం కథంచన
స్యాద్వపుస్సుందరమపి
శ్విత్రేణైకేన దుర్భగం'

అర్థము :- కావ్యమునందుఁ గొంచెమైనను తప్పు ఉండఁగూడదు. చక్కని శరీరమైనను ఒక్క కుష్ఠరోగముచే ద్వేషింపఁదగినది యగును.

అనిన మొదటి శ్లోకమే సంస్కృత సాహిత్య గ్రంథములోనిది.

'ఉపసర్గేణ ధాత్వర్థో
బలాదన్యత్ర నీయతే
ప్రహారాహార సంహార
విహార పరిహారవత్.'

(క్రియాపరిచ్ఛేదము.)

అర్థము:- ధాతువుయొక్క అర్థము ఉపసర్గచే బలవంతముగా మార్చఁబడును. ఇందునకు నుదాహరణములు: ప్రహారము, ఆహారము, సంహారము, విహారము, పరిహారము.

ఇది సంస్కృత శబ్దములకు సంబంధించిన నియమము. తెనుఁగున ధాతువులకుఁ దగులునట్టి యుపసర్గలు లేవు గనుక నీ నియమము తెలుఁగు భాషకుఁ గాఁ అగాదు. ఇట్టియసంబద్ధ కారికలిందెట్లు వచ్చినవని విచారింపవలసి యున్నది. ఈ కారికావళిని సంగ్రహించినవారు వానిని అహోబల పండితీయమునుండి యెత్తి వ్రాసినట్లు కానవచ్చుచున్నది.

అహోబల పండితుఁడు తాను రచించిన కవిశిరోభూషణమను ఆంధ్రశబ్ద చింతామణి వ్యాఖ్యానమునందు నిట్లు వ్రాసినాఁడు:—

'యస్సారోఽథర్వణగ్రంథే
సోప్యత్రైవ విధీయతే
తేనతత్ఫక్కికా కాలోక
లోలతా త్యజ్య తాం బుధైః.'

అర్థము:— అథర్వణుని గ్రంథ మండలి సారమంతయు నిందుఁ జేర్చఁబడినది. కావున నా కారికలను చూడవలయునన్న కోరిక పండితులు విడువ వలసినది.

ఇట్లు అహోబలుఁడు అథర్వణకారికలను- అనగాఁ దెనుఁగులక్షణ సంబంధమైన శ్లోకములను - ఉదాహరించుటయేకాక ప్రసంగము ననుసరించి సంస్కృత వ్యాకరణసంబంధమైన కారికలను గూడ నుదాహరించియున్నాఁడు. అహోబలపతి గ్రంథమునుండి కారికలను ఎత్తివ్రాసినవానికి నిది సంస్కృతసంబంధమైనది, యిది తెలుఁగునకు సంబంధించినది, యన్నభేదము తెలియసందున నందు గానఁబడిన శ్లోకములనన్నిటి నెత్తివ్రాసెను!

ప్రాచ్యలిఖిత పుస్తకభాండాగారమునందల్లి ప్రతియందుఁ బరిచ్ఛేద విభాగములేదు. కారికలన్నియు వరుసగా వ్రాయఁబడియున్నవి. వీరేశలింగముగారి ప్రతిలో నీకారికలన్నియు, సంజ్ఞ, సంధి, అజంతము, హలంతము, క్రియ, యనునైదు పరిచ్ఛేదములుగా విభజింపఁ బడినవి. ప్రతి పరిచ్ఛేదము క్రింద 'ఇతి శ్రీమదథర్వణాచార్య విరచితే...పరిచ్ఛేదః' అని యున్నది. ఇట్టి చివర వాక్యములుతప్ప, ఈ గ్రంథకర్త అథర్వణుఁడని తెలుపుటకు నీ గ్రంథమునందు మఱియే యాధారమును లేదు.

ఈ గ్రంథమునందుఁ బూర్వాంధ్రవ్యాకర్తలుగా హరి, శ్రీకవి, విష్ణుశర్మ, ధూర్వహుఁడు, శృంగారభూషణుఁడు, అనువారు పేర్కొనఁబడినారు. గ్రంథము చివరను "ప్రమాణ మకలంకస్య పూజ్యపాదస్య లక్షణం" అని యున్నది. ఇందువలన అకలంకుఁడను వాఁడితనికి గురువైనట్లును, అతఁడు తెలుఁగునకు వ్యాకరణము వ్రాసినట్లును సూచింపఁబడినది. కాని యీగ్రంథకర్తలలో నెవ్వరిదేని ఆంధ్రవాఙ్మయము కనివిని యుండలేదు. హరికారికలని యొక గ్రంథము కానవచ్చుచున్నది. అది చిన్నయసూరి తెలుఁగు వ్యాకరణమునకు సంస్కృత భాషాంతరము; శిష్టుకృష్ణమూర్తి రచితమని కొందఱయభిప్రాయము. సంస్కృత వ్యాకరణమునకు సంబంధించిన కారికల భర్తృహరి (7-వ శతాబ్దమువాఁడు) రచించెను. వానికిఁగూడ హరికారికలని పేరు.

త్రిలింగ లక్షణముకంటె, నీకారికలు మిక్కిలి యాధునికములనియు, వీనిని అహోబలపండితుఁడే కల్పించి యుండవచ్చుననియు, గొందఱ యభిప్రాయము. ఈ కారికలలో నాధునిక ప్రయోగములకు లక్షణము లున్నవని శ్రీ పాడి వెంకటస్వామిగారు పదునైదు ఉదాహరణము లిచ్చియున్నారు. అందు

ముఖ్యమైనవని తోఁచినవాని నిచ్చట నుదాహరించుచున్నాఁడను:—

1. ద్రుతమునకు నచ్చుపరమగు నపుడు ద్విత్వము వచ్చును; వచ్చెన్నతివ. కా. "నోవాద్విత్వం క్వచిచ్ఛిష్టం పరప్రాణేన సంగతేః" (అజంతపరిచ్ఛేదము 28)

2. సంబోధనమున 'కాన' యనునది తెలుఁగు పదములమీఁద వచ్చును. నాయమ్మకాన, నా తల్లికాన. కా. "క్వచిదా మన్త్రణే కానో వైకృతాత్పరతో మతః" (అజంత పరిచ్ఛేదము 75)

3. ఒకానొకచో నర్థభేదమున 'ఇగా' యనునది వచ్చును, డుజ్లునగును. ఎల్లిగా- ఎల్లిగాఁడు, పుల్లిగా- పుల్లిగాఁడు. కా. "అర్థభేదే క్వచిచ్ఛబ్దాదిగా స్యాచ్చతతో పిడుజ్" (అజంత పరిచ్ఛేదము 73)

4. పూజ్యార్థమున ద్రుత సహితమైన 'కారు' వచ్చును; రామయ్యఁగారు, వెంకయ్యఁగారు. కా. "పూజార్థే సద్రుతఃకారు ద్వైధకం తూభయాత్మకం" (అజంత 74)

5. మనుజ సంజ్ఞలయందు 'రాజా' ది పదములు పరమగునపుడు పూర్వవర్ణములోపించి, దానికి బదులు అ, ఆ, ఇ, మ మొదలయిన వర్ణములు వచ్చును; రామరాజు, రామరావు, రామశెట్టి, అయ్యపరాజు, కృష్ణమరాజు. కా. "ద్వ్యత్రరాది చతుర్వర్ణ పర్యంత జననామమ లోపస్స్యాదాది* వర్ణానాంశబ్దే రాజాదికేపదే ॥ క్వచిదత్త్వం క్వచిచ్చాత్వం క్వచిదిత్వం క్వచిద్ద్వితా। క్వచిన్మత్వం యథా యోగమన్యచ్చ వ్యవహారతః ॥" (అజంత ౧౦౯-౧౧౦)

పై నిచూపిన శబ్దరూపము లిట్టివలివి; పదునేఁడు, పదునెనిమిది శతాబ్దములలోఁ బుట్టిన రూపములు కాని పూర్వ ముండినవి కావు. కావున నీ గ్రంథ మాధునికమని వెంకటస్వామిగారు నిర్ధారణచేసిరి.

ఛందస్సు భారతము

అథర్వణుఁడనువాఁడు తెనుఁగు ఛందస్సొకటియు, మహాభారతమునందలి విరాటోద్యోగపర్వములును రచించినట్టుప్రతీతికలదు. ఈ రెండును తెలుఁగుభాషలో వ్రాయఁబడినవి. కానియెచ్చటను ప్రస్తుతముకానవచ్చుటలేదు. అందఱకుఁ దెలియునట్లు తెలుఁగున వ్రాయఁబడిన యీ గ్రంథములు లోపించుటయు, జనులకు సాధారణముగఁ దెలియనట్టిసంస్కృతమునందు వ్రాయఁబడిన రెండు వ్యాకరణ గ్రంథములు నిలిచియుండుటయు నాశ్చర్యము! అథర్వణఛందస్సును, విరాటపర్వమును అప్పకవి పేర్కొనియున్నాఁడు. త్రిలింగశబ్దానుశాసనమునుగాని, కారికలనుగాని పేర్కొనియుండ లేదు. ఈ రెంటిని ఆతఁ డెఱిఁగియున్నఁ బేర్కొనియుండక పోవునా? అథర్వణకారికావళిని బేర్కొన్నవాఁ డహోబలపతి. అప్పకవికిఁ దెలియకయుండుటయు, కొం

* 'ద్వ్యాది వర్ణానాం' అని పాఠాంతరము. వెంకట స్వామి గారిప్రతి.

చెను హెచ్చుతగ్గుగా సమకాలికుఁడును బ్రతిస్పర్ధియునైన అహోబలునకుఁ దెలిసియుండుటయుఁ జూడ నీకారికలకు నహోబలపతియే కర్త యేమో యన్న సంశయము దృఢపడుచున్నది.

అథర్వణఛందస్సులోనివియని కొన్ని పద్యములును, విరాటపర్వములోనివియని కొన్ని పద్యములును, లక్షణగ్రంథములు వ్రాసినవారు కొందఱు ఉదాహరించి యున్నారు. కాని యవి యన్నియుఁ గలిసి పది పద్యములకంటె నెక్కుడుండవు. వీనిని బట్టి యాగ్రంథముల యోగ్యత మనము కనుఁగొనుటకు వీలులేదు.

[కొ. ల.]

అథర్వతాపిన్యుపనిషత్తు.

అథర్వతాపిన్యుపనిషత్తను నామంబుచేఁ దాపినులని యథర్వణ వేదమునందుఁ బ్రసిద్ధిఁ గాంచినట్టియు నష్టోత్తర శతోపనిషద్రాజంబులలో వన్నెకెక్కినట్టియు నుపనిషత్సప్తకంబు గణనీయంబై యున్న యది. అట్టి యుపనిషత్సప్తకంబెద్దియనః—1. నృసింహపూర్వతాపిని. 2. నృసింహోత్తర తాపిని. 3. రామపూర్వతాపిని. 4. రామోత్తరతాపిని. 5. గోపాలపూర్వతాపిని. 6. గోపాలోత్తరతాపిని. 7. త్రిపురాతాపిని.

ఇందుఁ బూర్వోత్తరంబులను నుపరిభాగంబులను సరకుగొననిచో నియ్యవి నృసింహ రామ గోపాల త్రిపురా తాపనులను నాలుగు తాపినులుగ నొప్పుచుఁ దత్తన్నామకవాచ్యంబగు సగుణ బ్రహ్మను గూర్చి ముచ్చటింపుచు నట్టి సగుణ బ్రహ్మోపాసనంబును మందాధికారులకుఁ బ్రబోధింపుచుఁ గ్రమముగా నద్వైతతత్త్వము నుపదేశింపు మహోపనిషత్తులుగా నతిశయిల్లుచున్నయవి. ఈయుపనిషత్తుల యందు నుపదేశింపఁబడిన యుపాస్య దేవతలు నామమంత్ర వ్యవహారంబులచే నత్యంత భిన్నంబులుగాఁ దోచినను, ఉపనిషదంతర్గతంబులైన తత్తద్దేవతాకంబులగు హేతుస్వరూప కార్యంబులను, ఉపాసనావిధానంబులను, ఫలంబులను, విమర్శించినచో నట్టి భిన్నంబులుగాఁ దోఁచు నామమంత్రంబులచే సకల జగదంతర్యామియు, జగత్సృష్టిస్థితిధ్వంస హేతువును, బరమేశ్వరుండు నగు సగుణబ్రహ్మంబె యుపాస్యదైవముగా విధింపఁబడుచున్నాఁడని తేటతెల్లమగు. బ్రహ్మ విష్ణ్వీశ శక్త్యాది నామంబులు సగుణబ్రహ్మంబును బోధింపునను విషయమును విద్యారణ్యులవా రనుభూతిప్రకాశయందంతర్యామి బ్రాహ్మణ తాత్పర్య కథనావసరంబునఁ బుష్కలంబుగ ముచ్చటించి యున్నారు.

శ్లో॥ "వ్యాసస్తత్తత్పురాణేషు
తత్తద్రూపత మోచితవాన్"

ఇట్టి యాశయమునే శంకర భగవత్పాదాచార్యులవారు ప్రధానముగఁ జేకొని యద్వైతమతమున కంగభూతములుగ శైవ శాక్త వైష్ణవ కాపాలిక గాణాపత్య సౌరంబు

లను షణ్మతములు సిద్ధాంతీకరించి షణ్మత స్థాపనాచార్యులను సార్థక నాముల్తెనట్లు నెల్లరునెఱింగిన విషయమె. శంకర భగవత్పాదు లీ విషయమును విస్పష్టముగ దమ విష్ణు సహస్రనామ భాష్యంబున నీశ్వరుండు సర్వవాచకంబులకును వాచ్యుండని నుడువుచు వర్ణించి యున్నారు.

తాపిన్యుపనిషత్తులు తత్తద్దేవతాకంబులైన యుపాసనావిధానంబులఁ బుష్కలముగ వివరించి యున్నను అద్వైతతత్త్వమునే పరమావధిగాఁ గలిగియున్నటులు సుస్పష్టమగుటకు విద్యారణ్య గురుం డనుభూతిప్రకాశిక యొక్క యంతిమ యధ్యాయంబున నృసింహోత్తరతాపినియొక్క తాత్పర్యమును వివరించి యున్నారు.

శ్లో॥ అథాన్యేత్తాపనీయే తు త్ర్యంశస్త్రి ప్రజాపతిః
దేవా నబూబుధన్మంత్ర రాజప్రణవమార్గతః
మంత్రరాజం పూర్వతాపనీయంశ్రుత్వా తదాధియా
స్మరంతే సగుణంబ్రహ్మ దేవాధీశుద్ధిమాప్ను
యాత్
తతస్తే నిర్గుణం బ్రహ్మప్రపద్యుః శుద్ధబుద్ధయః॥'

ఇట్లు నృసింహ తాపిని సగుణ నిర్గుణ బ్రహ్మంబుల బోధించిన న్యాయముననే యితర తాపినులుగూడ సగుణ నిర్గుణబ్రహ్మంబుల బోధింపుటచే నయ్యవిగూడ నద్వైత మవధిగాఁగల్గియున్నవని నిర్వచింపుట కెంతయు సందియంబు లేదు. ఇట్టి సామరస్యంబును గుర్తెఱుంగుటకు నాయాయి యుపనిషత్తుల యందుఁ బ్రతిపాదింపఁబడిన విషయంబులఁ బ్రత్యేకంబుగఁ గొంతవఱకు నెఱుంగుట యావశ్యకము.

నృసింహపూర్వతాపినియందు నృసింహ మంత్ర రాజోపాసనా భేదంబులు, మంత్ర రాజంబునకు సగుణ బ్రహ్మపరంబుగనర్థము. మంత్రరాజంబు యొక్క శక్తి బీజములు, అంగమంత్రములు, ఉపాసనాంగ భూతంబై చక్రరాజంబగు సుదర్శన నిరూపణము పుష్కలంబుగ ముచ్చటింపఁబడియె.

నృసింహోత్తర తాపినియందు మాండూక్యోపనిషత్సంవాదముచే మంత్ర రాజపర్యాయంబును బీజంబునునగు ప్రణవంబును ముచ్చటింపఁబడి పాదక్రమంబున షోడశకలోపాసనంబు నిరూపింపఁబడి పర్యవసానంబున సర్వప్రపంచోపశమంబును శాంతమును సర్వమంగళప్రదంబును సజాతీయ విజాతీయస్వగత భేదరహితంబును పారమార్థికంబు నగు నద్వైతతత్త్వ ముపదేశింపఁబడియె.

రామపూర్వ తాపినియందు రామశబ్దము పరబ్రహ్మ పరమనియు నుపాసకులకు నాతనికి రూపకల్పనఁజేయఁబడెననియు నిరూపింపఁబడి రామోపాసనాంగ భూతమగు నర్చావిధానము సంక్షేపంబుగ ముచ్చటింపఁబడియె.

రామోత్తర తాపినియందు రామమంత్రమునకును బ్రణవమునకునుగల సామరస్యము

పుష్కలముగ వర్ణింపఁబడి యద్వైతతత్త్వము ప్రదర్శింపఁబడియె.

గోపాలపూర్వ తాపినియందు శ్రీ కృష్ణ మంత్రంబుచే నుపాస్యంబగు దైవము సగుణ బ్రహ్మంబని నిరూపింపఁబడియె.

గోపాలోత్తర తాపినియందు శ్రీ కృష్ణ మంత్రంబునకును బ్రణవంబునకునుగల సామరస్యంబు వివరింపఁబడి యద్వైత తత్త్వము ముచ్చటింపఁబడియె.

త్రిపురాతాపినియందు మొదటి నాలుగు ఖండములచే భువనేశ్వరీ గాయత్రీదుర్గాలలితాత్ర్యంబక మహామంత్ర పంచకంబునకును బ్రణవంబునకునుగల యర్థసామరస్యము విపులముగ వర్ణింపఁబడియె. ఐదవ ఖండమందున్ననో యద్వైత సిద్ధాంతములన్నియు సంక్షేపంబుగఁ బ్రదర్శింపఁబడియె. ఇయ్యైదవఖండమంతయు నించుమించుగా సర్వవిధంబుల నమృతబిందూపనిషత్తును బోలియున్నయది. దానంజేసి యిందలి సిద్ధాంతములను గూర్చి యమృతబిందూపనిషద్వివరణమున గుర్తెఱుంగునది. శుద్ధాద్వైత బోధకంబగు నీఖండమునకుఁ బూర్వమందలి నాలుగు ఖండంబులచే నుదాహరింపఁబడిన మంత్రరాజపంచకంబు మందాధికారులచిత్త శుద్ధికై యుపదేశింపఁబడినదను విషయమును వేఱ వచింప నక్కఱలేదు. పై మంత్ర పంచకంబునకుం గూడ నృసింహ గోపాల రామమంత్రములట్లు ప్రణవ సామరస్యము పుష్కలముగ నిరూపింపఁబడి యుండుటచే నట్టిశబ్దములు విషయలోలురగు కాముకులు దలంచునట్లు కచ కుచాదులతో నొప్పు మనోహరంబులగు స్త్రీ మూర్తులయందుఁ బర్యవసానములుగాక సగుణ బ్రహ్మవాచకంబులగుచు నద్వైతమవధిగాఁ గల్గియున్నవను విషయము నెల్లరు గుర్తెఱుంగునది.—

ఈ యుపనిషత్సప్తకంబున నాయాయి దేవతావాచకంబులగు మంత్రంబులును, దదర్థంబులును, దదుపాసనావిధానంబులును, విపులముగనుండినను సంక్షేపంబుగ నద్వైత తత్త్వమే ముఖ్యముగాఁ దెల్పఁబడియున్నది. ఈ యుపనిషద్రాజ సప్తకంబుచేఁ దెలియవచ్చు మహత్తమంబగు సిద్ధాంత మెద్దియనః- సచ్చిదానందంబును నిరవయవంబును నిష్కలంబును నిష్క్రియంబునగు పరబ్రహ్మకు నుపాసకుల సౌకర్యమునకై బహుభంగుల నామరూపంబులు గల్పింపఁ బడుటచే సకల శబ్దవాచ్యుండు బ్రహ్మ దక్క నన్యంబు లేదని. ఇట్టియాశయమును రామతాపిన్యుపనిషత్తు కంఠోక్తిగ వక్కాణింపుచున్నయది.

'శ్లో. చిన్మయస్యా ద్వితీయస్య
నిష్కళస్యా శరీరిణః
ఉపాసకానాం కార్యార్థం
బ్రహ్మణో రూపకల్పనా
రూపస్థానాం దేవతానాం
పుంస్త్ర్యంగాదికల్పనా.'

ఇట్టి సకలవేదసార భూతంబగు సకలలోక హితంబునగు సిద్ధాంతంబును గుర్తెఱుంగని యజ్ఞులచే నృసింహ రామతాపినులు వైష్ణవాద్వైత బోధకమ్ములనియు, గోపాలతాపిని వల్లభాచార్య మతబోధక మనియు, త్రిపురా తాపిని శాక్తాద్వైత ప్రతిపాదక మనియు నపార్థములు గల్పింపఁ బడుచున్నవి. ఇయ్యవి కేవల మజ్ఞానవిలసితంబులు. సకల జగదధిష్ఠానంబగు పరబ్రహ్మ యందుగాని సకల జగదంతర్యామియగు సగుణ బ్రహ్మయందు గాని యించుకంతయు స్త్రీ పుం భేదములఁ గల్పించుట కెంతమాత్రము నవకాశములేదు గదా! అట్టి విషయంబున నంతర్యామియగు సగుణ బ్రహ్మంబును, అధిష్ఠాన భూతంబగు నిర్గుణ బ్రహ్మంబును, నిరూపించు నుపనిషత్తులు, కరచరణాద్యవయవ యుక్తంబులును, సజాతీయ విజాతీయ స్వగతభేద సహితంబులును, స్త్రీపుంభేద యోగ్యంబులు, నగు నుపాధులనే దైవరూపములని త్రికరణశుద్ధిగ వక్కాణింపు మతముల కెంత మాత్రము నాధారములుగా నోపవు. శబ్దాంత మందలి స్త్రీపుంలింగ ప్రత్యయ గ్రహణంబుచే నంతర్యామి యందు స్త్రీపుం వివక్షఁ జేయఁ బూనుట సంస్కృతభాషా నియమాజ్ఞాన విలసితంబుగాని వేఱొండుగాదు. అద్వైత తత్త్వంబునకు శాక్తమనియు శైవమనియు వైష్ణవమనియు కాపాలికమనియు గాణాపత్యమనియు సౌరమనియు భేద మెంతమాత్రమును లేదు. ఇట్టిభేదము మందాధికారులకు శాస్త్రముచే విధింపఁబడిన వ్యష్టిమూర్త్యుపాసనయందకావున శాక్తాద్వైతములోనుగాఁగలశబ్దములు శశవిషాణ తుల్యంబులు. ఇట్టియంశంబున నీయుపనిషత్తులే తన్నామకంబులగు దేవతలను స్త్రీపుం వివక్షచే నిరూపించుననియు నేతన్మంత్రంబుల యుపాసనను బ్రతిపాదించుననియు, నశాస్త్రీయంబులును బతనహేతువులు, నగు దురాచారంబులఁ బ్రతిపాదించు మోహశాస్త్రంబులకు నాలవాలమన్నియు, నట్టిదురాచారంబులను శాస్త్రవిహితంబు లనియు, దలంచుట కేవల మజ్ఞాన విజృంభితము. విషయలోలురీకుమార్గముల శాస్త్రీయంబులుగఁ బరిగణించి యాచరింపసమకట్టుచుందురని శ్రీకృష్ణభగవానులు గీతాశాస్త్రమున వివరించియున్నారు.—

'శ్లో॥ యామిమాం పుష్పితాంవాచం
ప్రవదంత్యవిపశ్చితః'
"అధర్మంధర్మమితియామన్యతే
తమసావృతా
సర్వార్థాన్ విపరీతాంశ్చ
బుద్ధిఃసాపార్థతామసీ."

ఇట్లు భగవద్వాచకంబుల యందు స్త్రీపుం భేదములఁ గల్పించి తత్తదను గుణంబులగు పిచ్చితలంపులను దలంచుచు విషయములకు బానిసలై తమ తమ యిచ్ఛానురూపంబులగు దుశ్చేష్టితంబుల శాస్త్రసిద్ధంబులని మోహశాస్త్రంబుల శరణుసొచ్చి యనా

చారంబులం బాల్పడుటచే ననివార్యంబైన నరకంబులం బాల్పడు నవివేకు లీయుపనిషద్రాజ పుస్తకంబును బూర్ణముగ విమర్శించినచో నట్టి యుపద్రవములం బాల్పడకుండ సత్పథంబు ననుసరించి శ్రేయస్సు నందుటకు నెక్కుడుసావకాశము చిక్కుం గావున నీయుపనిషత్పుస్తకంబు శ్రేయోభిలాషుల కెల్లరకును సర్వవిధంబుల విచార రమణీయము. ఇంతి యెకాక పారమార్థికమును గుర్తెఱుంగక భగవన్నామ మాత్రైకశరణులై కుమతంబులం జొచ్చి దుష్టాచారంబులం బాల్పడి మద మాత్సర్యంబులకు లోనై యనిశము కలహాయత్తచిత్తులై భ్రంశము నొందు వారలు స్వస్థచిత్తత నొందుట కీయుపనిషద్రాజ విమర్శనంబు పర మౌషధమని విబుధు లెఱుంగునది. సకలామ్నాయసామరస్యంబును సకలపురాణ సామరస్యంబును బ్రతిపాదించు నీయుపనిషత్పుస్తకంబు సదా చింతనీయంబు.

(శ్రీ. క. భా.)

అథర్వవేదము. ఇది నాల్గవ వేదము.

ఇతర వేదముల వలెనే యిదియు సంహితా బ్రాహ్మణములన్న రెండు భాగములు కలది. అయినను సాధారణముగ, అథర్వవేదమన్న, అథర్వ సంహితయని యర్థము. చేసికొనవలె యును. ప్రతి వేదమునందును సంహితా భాగము బ్రాహ్మణభాగము కంటెం బ్రాచీనము. ఇచ్చట అథర్వణ సంహితను గుఱించి, మొదట సవిస్తరముగ వ్రాసి పిదపం దద్బ్రాహ్మణముల గుఱించియుం దదంతర్గతములైన యుపనిషత్తులను గుఱించియు నితరములైన యుపాంగములను గుఱించియు వ్రాయం బడును.

దీని అర్వాచీనత్వము

ఋగ్యజుస్సామ వేదములకంటె నీవేదము వెనుకం బుట్టినట్లు కానవచ్చును. కొంతకాలము వఱకు వేదములు మూండేయున్నటు లార్యులలోం బ్రతీతియుండెను :-

"ఋచ స్సామానిజజ్ఞిరే
యజుస్తస్మాదజాయత"

[ఋగ్వే. ౧౦, ౯౦. ౯.

ఋక్కులును సామములును బుట్టెను ; అందువలన యజుస్సు పుట్టెను.

"త్రయో వేదా అజాయన్త, ఋగ్వేద ఏ వాగ్నే రజాయత యజుర్వేదో వాయోః సామవేద ఆదిత్యాత్" [ఐత. బ్రా. ౫. ౩౨.

మూండు వేదములు పుట్టెను. అగ్నినుండి ఋగ్వేదము, వాయువునుండి యజుర్వేదము, ఆదిత్యునినుండి సామవేదము పుట్టెను.

"యమృషయస్త్రివిదావిదుః ఋచస్సామానియజూంషి"

[తైత్తి. బ్రా. ౧.౨.౧.౨౬.

ఋషులు మూండు నేర్చినవారు ఏ వేదమును ఋక్కులుగాను, సామములుగాను, యజుస్సులుగాను ఎఱింగియుండిరో

"త్రయీవైవిద్యా, ఋకోయజూంషి సామాని" [శత. బ్రా. ౪. ౬.౭. ౧.

మూఁడే విద్యలు: ఋక్కులు, యజస్సులు, సామములు.

"యదృచైవహౌత్రం క్రియతే
యజుషాధ్వర్యవం సామ్నోద్గీథం
వ్యారబ్ధా త్రయీవిద్యా భవతి
అథ కేన బ్రహ్మత్వం క్రియత ఇతి
త్రయ్యావిద్యయేతి బ్రూయాత్".

[ఐత. బ్రా. ౫. 33.

హోత చేయవలసినపని ఋగ్వేద మంత్రములతోను, అధ్వర్యుఁడు చేయవలసినపని యజుర్వేద మంత్రములతోను, ఉద్గీథ చేయుపని సామ మంత్రములతోను చేయునే! బ్రహ్మ చేయవలసిన పని యే మంత్రములతోఁ జేయవలెనని యడిగిన నీ మూఁడు వేదముల మంత్రములతోఁ జేయవలెనని చెప్పవలెను.

పైని ఉదాహరించిన వేదవచనముల వలననే మొదట, వేదములు మూఁడనియు, వానికి 'త్రయీవిద్య' యన్న బిరుదుండెననియు, యజ్ఞయాగాదికములందు నీమూటినే యుపయోగించు చుండిరనియు స్పష్టపడుచున్నది. మను స్మృతి యందుఁగూడ నీశ్లోకము కనఁబడుచున్నది :-

శ్లో. అగ్నివాయు రవిభ్యశ్చ
త్రయం బ్రహ్మ సనాతనం
దుదోహయజ్ఞసిద్ధ్యర్థ
మృగ్యజుస్సామలక్షణం. [౧. ౨. 3.

యజ్ఞసిద్ధి కొఱకు సనాతనములైన ఋగ్యజుస్సామము లనెడు మూఁడు వేదములను అగ్నివాయు రవులనుండి పితికెను.

మను స్మృతియందలి యీ శ్లోకమువలననే ఋగ్యజుస్సామములనఁబడు మూఁడు వేదములు, అథర్వ వేదముకంటెఁ బురాతనములనియు, యజ్ఞసిద్ధికి నవియే యుపయోగింపఁబడుచుండెననియు స్పష్టమగుచున్నది. మనుస్మృతి కాలమున నథర్వ వేదము కలదు. అయినను మొదటి మూఁడు వేదములనుగుఱించియే మనువు 'బ్రహ్మసనాతనం' అని వ్రాయుట విశేషాంశము.

ఇట్లు, అథర్వ వేదము వెనుకఁ బుట్టినందున నితరవేదములతోఁ బాటు గౌరవము సంపాదించుకొనుటకు దానికిఁ గొంత కాలము పట్టెను. యజ్ఞయాగాదులకు నర్హము కానిది క్రమక్రమముగ నందులకుఁ దగినదయ్యె. యజ్ఞము జరుపుటలో హోత, అధ్వర్యుఁడు, ఉద్గీథ, బ్రహ్మ అనువారు నల్గురు ముఖ్యులు. ఇదివఱకుఁ జూపఁబడిన నైతరేయ బ్రాహ్మణమును (౫.33) బట్టి హోత ఋగ్వేదము వచ్చినవాఁడుగను, అధ్వర్యుఁడు యజుర్వేదము వచ్చినవాఁడుగను, ఉద్గీథ సామవేదము వచ్చినవాఁడుగను, బ్రహ్మ, ఈ మూఁడు వేదములు వచ్చినవాఁడుగను, ఉండవలెను. అట్టి దానికిఁ గాలక్రమమున నథర్వ వేదమువారు బ్రహ్మస్థానము నాక్రమించిరి. అథర్వ వేదము వచ్చినవాఁడు బ్రహ్మగా నుండవలెనన్న స్వామ్యమును సంపాదించిరి. గోపథ బ్రాహ్మణమనునది అథర్వ వేదమునకు సంబంధించినది. అందు నీసంగతి స్పష్టముగఁ జెప్పఁబడి యున్నది:-

"ప్రజాపతిర్యజ్ఞమతనుత
సఋచైవహోత్రమ్ అకరోత్.
యజుషాధ్వర్యవం సామ్నోద్గాత్రమ్
అథర్వాంగిరోభిర్బ్రహ్మత్వమ్."

[గోపథ. బ్రా. 3.౨.

ప్రజాపతి యజ్ఞము చేసెను; అతఁడు ఋక్కులచే హోత్రమును (హోతపని), యజుస్సుచే అధ్వర్యమును, సామములచే ఔద్గాత్రమును (ఉద్గాతపని), అథర్వమంత్రములచే బ్రహ్మత్వమును (బ్రహ్మచేయవలసినపని) చేసెను.

"కంవో హోతారం వృణీయామ్
కం అధ్వర్యుం। కం ఉద్గాతారమ్।
కం బ్రహ్మాణం ఇతి। తదూచుః
ఋగ్విదమేవ హోతారం వృణీష్వ
యజుర్విదమధ్వర్యుం। సామవిదముద్గాతారం
అథర్వాంగిరోవిదమ్ బ్రహ్మాణమ్
తథాహాస్యయజ్ఞశ్చతుష్పాత్ ప్రతితిష్ఠతి"

[గోపథ. ౨. ౨౪.

ఎవనిని హోతగ, ఎవనిని అధ్వర్యునిగ, ఎవనిని ఉద్గాతగ, ఎవనిని బ్రహ్మగ నెన్నుకొనవలెను? ఋగ్వేద మెఱిఁగినవానిని హోతగ, యజుర్వేద మెఱిఁగిన వానిని అధ్వర్యునిగ, సామవేద మెఱిఁగినవానిని ఉద్గాతగ, అథర్వవేద మెఱిఁగినవానిని బ్రహ్మగ నెన్నుకొనవలెను. అప్పుడుమీనియజ్ఞము నాల్గుకాళ్ళుగలదియై నిల్చును.

ఇట్లు అథర్వవేదము యజ్ఞార్హమగుటయే గాక యదిలేనిది యజ్ఞము సంపూర్తికాకుండ నేర్పడెను. పురాణకాలమువఱకు నీవేదము ప్రతిష్ఠహెచ్చి రాజపురోహితాదు లీవేదము నెఱిఁగినవారుగనే యుండవలయునని యేర్పడెను :-

పురోహితం తథాథర్వ
మంత్ర బ్రాహ్మణ పారగమ్.

[మత్స్య పురాణము.

అభిషిక్తోఽథర్వమంత్రై
ర్మహీంభుంక్తేససాగరామ్.

[మార్కండేయ పురాణము.

'అథర్వ వేదమందలి మంత్ర బ్రాహ్మణములను బాగుగ నేర్చినవానిని బురోహితుని జేయవలయు'

[మత్స్య పురాణము.

'అథర్వమంత్రములచే నభిషిక్తుఁడైన రాజు సాగరయుక్తమైన భూమిని ఏలును'

[మార్కండేయ పురాణము.

అథర్వవేదము వెనుక పుట్టిన దన్న యభిప్రాయము కొందఱకు నిష్టములేదు. అట్లనుటవలన దీని యనాదిత్వమునకు (వేదత్వమునకు) భంగమువచ్చును. కావున నీ వేదముఁగూడ మిగిలిన మూఁడు వేదములతోఁబాటు అనాదియే యని వారితాత్పర్యము. ఇఁక "త్రయీవిద్య" యన్న వాక్యమునకు వారొకవిధముగ నర్థము చెప్పెదరు. ఋగ్యజుస్సామములనఁగా వేదములుకావు. వేదములోని మంత్రముల విధములు. ఒక విధమైన వృత్తము లనుకొన్నఁడు. ఋక్కనఁగాఁ బద్యము, యజుస్సనఁగా గద్యము, సామమనఁగా సంగీతము. జైమిని పూర్వమీమాంసా సూత్రములలో నిట్లువ్రాసెను :-

"ఋగ్యత్రార్థ వశేన పాదవ్యవస్థా".
"గీతిషు సామాఖ్యా"
"శేషేయజుశ్శబ్దః" [౨.౧.౩౫-౩౭.

'ఎచ్చట నర్థము ననుసరించిపాదములయేర్పాటు ఉండునో యది ఋక్కు. గీతములకు సామములని, మిగిలిన వానికి యజుస్సులనియుఁ బేళ్ళు.

ఇట్లు చెప్పియున్నది గనుక 'ఋగ్యజుస్సామము' లన్నప్పుడు, అథర్వవేదము నందలి ఋక్కులు,యజుస్సులుకూడ వచ్చినవి. అందుచే నీవేదము, ఋగ్యజుస్సామములను పదములందు లేదని చెప్పఁగూడదు, అనియీపక్షము వారు వాదించెదరు. సాయణాచార్యులవారు అథర్వభాష్య పీఠికలో నీవిధముగనే చర్చించి యీవేదముయొక్క పురాతనత్వమునుస్థాపింప యత్నించియున్నారు!

ఈ వేదము పేళ్లు

ఈ వేదమునకు సాధారణముగ 'అథర్వవేద' మనిపేరున్నను, మొదట దీనికి 'అథర్వాంగిరస' మనిపేరుండెను. ఈ వేదమునందే (౧౦-౭-౨౦) 'అథర్వాంగిరసాః' అన్నద్వంద్వ బహువచనాంతనామముగలదు. అథర్వుఁడు, అంగిరసుఁడు, అను నిద్దఱు ఋషులు, ఈ వేదమునకుఁ బ్రవర్తకులై నందున దీనికీపేరు వచ్చెను. పూర్వము సృష్టికాలమున స్వయంభువు బ్రహ్మ తపస్సు చేసెనఁట. అతని రోమకూపములలోనుండి చెమటపుట్టెనఁట. అందు నాతని ప్రతిబింబమునే చూచినందున నాతని రేతస్సు చలించెనఁట. ఆ రేతస్సుఁ జెమటయుఁ గలిసి రెండుభాగములయ్యెనఁట. ఒకదానినుండి, భృగుమహర్షి పుట్టెనఁట. అతఁడు బ్రహ్మను జూడఁగోరి 'అథర్వాఙ్ ఏనమ్...', (గోప. బ్రా. ౩-౪) అని అన్నందున నతఁడు అథర్వణుఁడయ్యెనఁట. మిగిలిన సగము రేతస్సుచేరుటవలన వరుణాఖ్య బ్రహ్మ నావరించి యాతఁడుతపస్సుచేయఁగ సర్వాంగమునందును రసమై ప్రసరించెనఁట. అంగరసమునుండి అంగిరసఋషి పుట్టెనఁట. వీరిద్దఱివలన నిరువదిమంది అథర్వాంగిరసులను ఋషులుపుట్టిరఁట. వారిరువదిగురు గనుక అథర్వాంగిరస వేదమునందు నిరువది కాండములుగలవఁట! ఇందుచే నీవేదము సర్వశ్రేష్ఠమఁట! [సాయణభాష్యపీఠిక.

పురాణములనుబట్టి చూడ అథర్వణఋషినిగుఱించి యీక్రిందిసంగతులు తెలియుచున్నవి. స్వాయంభువ మన్వంతర మందలి బ్రహ్మ మానస పుత్రుఁడు. కర్దమ ప్రజాపతి కన్యయైన శాంతి యీతనిభార్య. ఇతనికి చిత్తియను రెండవ భార్యయుంగలదు. ఆమెయందు నీతనికి ధృతవ్రతుఁడు, దధ్యంచుఁడు అథర్వశిరసుఁడు, అను ముగ్గురు పుత్రులు గలిగిరి. ఈ ముగ్గురికి ఆథర్వణులన్న సామాన్య నామము కలదు. రెండవ వాఁడగు దధ్యంచునకు దధ్యఙాథర్వణుఁడన్న వాడుక పేరుకలదు. ఈ అథర్వణఋషి బ్రహ్మవిద్య

నభ్యసించు నప్పుడు యజ్ఞుఁడను నింద్రునకు సహాధ్యాయిగా నుండెను. వీరికిద్దఱకును బ్రహ్మదేవుఁడు గురువుగా నుండెను (భా. ప్రా. కో.). అంగిరసుని గుఱించి యిదివఱకే వ్రాసియున్నాము.

అథర్వవేదమంత్రములలోఁ గొన్ని అథర్వణవంశజులచేతను, మఱికొన్ని అంగిరసవంశజులచేతను రచింపఁబడెనని అథర్వవేదమునందె కానవచ్చును. కొన్నిసూక్తములలో

"అథర్వణానాం చతుర్ఋచేభ్యస్స్వాహా పఞ్చర్చేభ్యస్స్వాహా!........." అని కొన్ని సూక్తములలోను (౧౯-౨౩),

"అఙ్గిరసానామాద్యైః పఞ్చానువాకైః స్వాహా షష్ఠాయస్వాహా......" అని ౧౯-౨౪)

కొన్నిసూక్తములలోను, ఈసంహితయందే కానవచ్చుచున్నది. ధోరణిని పట్టి చూడఁగా అథర్వణుల రచన యెక్కువగను, అంగిరసులరచన తక్కువగను, మొదట అథర్వణుల కావ్యమేర్పడినట్టును, పిదప అంగిరసుల కావ్యము ఇమిడ్చఁబడినట్టును ఊహ తట్టుచున్నది.

"ఏతద్వై భూయిష్ఠం బ్రహ్మయద్
భృగ్వంగిరసః । యేఙ్గిరసః సరసః
యేఽథర్వాణస్తద్భేషజమ్
యద్ భేషజం తదమృతం
యదమృతం తద్బ్రహ్మ"

[గోప. బ్రా. ౩.౪.

భృగ్వంగిరసమను వేదము పెద్దది, అంగిరసుఁడు రసము, అథర్వణుఁడు భేషజము, భేషజమే అమృతము, అమృతమే బ్రహ్మ వేదము.

ఈ గోపథబ్రాహ్మణములోని వాక్యము వలన నీవేదమునకు అథర్వాంగిరసమన్న పేరుగాక భృగ్వంగిరసమన్న పేరుకూడ నున్నట్టు కానవచ్చుచున్నది. ఇఁకఁ జరిత్రదృష్టితో విచారింపఁగా నథర్వణుఁడు, అంగిరసుఁడు, భృగువు, అనువారీ వేద ప్రవర్తకులైన కులపతులుగాఁ గానవచ్చుచున్నారు. కులపతి యనఁగా నొక కుటుంబమునకుఁ గాని శిష్యపరంపరకుఁగాని యధిపతి. అథర్వణుఁడు, అంగిరసుఁడు, భృగువు ఈ ముగ్గురును, వీరి గోత్రమువారును నగు ఋషులు ఋగ్వేదకాలము నుండియు విఖ్యాతిఁ జెందినవారే. *

అథర్వవేదమునకు 'బ్రహ్మవేదము' అని కూడఁ బేరుకలదు. ఇది చివరకువచ్చినది. యజ్ఞమునందు బ్రహ్మగానుండ వలసినవాఁడు, అథర్వవేదజ్ఞుఁడుగ నుండవలయునన్న నియమము పుట్టినతరువాతఁగాని యీపేరు దీనికి రాలేదు. గోపథ బ్రాహ్మణమునందు నీపేరు మొదటఁగానవచ్చుచున్నది.

"చత్వారో ఇమేవేదా ఋగ్వేదో యజుర్వేదః సామవేదో బ్రహ్మవేద:" [౨-౧౬.

ఈ వేదములు నాలుగు. ఋగ్వేదము, యజుర్వేదము, సామవేదము, బ్రహ్మవేదము.

---

* ఋగ్వే, ౬-౪౭-౨౪, ౮-౧౧-౨.

వేదముల కాలము నిర్ణయించుట మిక్కిలి కష్టము. నిశ్చయముగ

కాల నిర్ణయము

నీ వేద మిన్ని సంవత్సరములక్రింద వ్రాయఁబడినదని చెప్పుట యసంభవము. కాని పండితులు వలయునంత వఱకుఁ దమతమ బుద్ధిచాతుర్యమును ఉపయోగించి, యజ్ఞేయమైన వేదోత్పత్తి కాలమును గనుఁగొనుటకు యత్నించెదరు. అట్టి యూహాలు గుఱికిఁబెత్తెడు హెచ్చుతగ్గుగ సరిపోవుచుండును. కావునఁ జదువరులిట్టి కాలనిర్ణయములను నిశ్చయమైనవిగను, ఎన్నడు తిరుగనివిగను నెంచఁగూడదు. ఇంత కంటె నెక్కుడు నిశ్చయమైనకాలనిర్ణయ మెవ్వరైనఁ జేయువఱకు నీకాలనిర్ణయము గ్రాహ్యమని యెంచవలెను.

అథర్వవేదకాలమును నిర్ణయించుటకు నొక యాధారము పండితులు కనిపెట్టినారు. ౧౯-వ కాండమునందలి ౭-వ సూక్తమునందు ౨౮ నక్షత్రములపేళ్లు చెప్పఁబడినవి. * ఆ చెప్పుటలో నిప్పుడు మనము చెప్పునట్లు, 'అశ్విని,' 'భరణి' యని చెప్పియుండలేదు. 'కృత్తికా' నక్షత్రముతోఁ బ్రారంభింపఁబడి 'భరణి' నక్షత్రముతో ముగింపఁబడినది. ఇట్లు చెప్పఁబడుటయే కాలనిర్ణయమునకు నాధారము. ఇప్పుడు 'అశ్విని' నక్షత్రము 'రాశి చక్రము'నకు మొదటనున్నట్లు అప్పుడు 'కృత్తికా' నక్షత్రము రాశిచక్రమునకు మొదట నుండెను. 'అయన' మను శీర్షికక్రింద వ్రాయఁబడిన విషయమును చదివినయెడల, అయనమునకు చలనము కలదనియు, వృత్తమండలి యొక బిందువు చలించిన సన్నిబిందువులును చలించుననియు, అందువలన రాశిచక్రమందలి ప్రథమస్థానముననుండిన నక్షత్రముఁగూడ మారుననియు, చదువరులు తెలిసికొనఁగలరు. అయన చలనగతి సంవత్సరమునకు రమారమి ౫౦" వికళలు (Seconds).

కృత్తికా నక్షత్రము రాశి ప్రథమముననున్న కాలము మొదలు నేటివఱకు అయ

* చిత్రాణిసాకం దివిరోచనాని
సరీసృపాణి భువనేజవాని
అష్టావింశం సుమతిమిచ్ఛమానో
అహానిగీర్భిః సపర్యామినాకమ్. ౧
సుహావమగ్నే కృత్తికో రోహిణీ చాస్తు
భద్రం మృగశిరః శమార్ద్రా
పునర్వసూ సూనృతా చారు పుష్యో
భాను రాశ్లేషా అయనం మఖామే. ౨
పుణ్యంపూర్వా ఫల్గుణ్యౌ చాత్ర హస్త
శ్చిత్రా శివా స్వాతి సుఖో మేఅస్తు
రాధే విశాఖే సు వా నురాధా
జ్యేష్ఠా సునక్షత్ర మరిష్టమూలమ్. ౩
అన్నం పూర్వా రాస తాంమే ఆషాఢా
ఊర్జందే వ్యుత్తరా ఆవహన్తు
అభిజన్మే రాసతాం పుణ్యమేవ శ్రవణః
శ్రవిష్ఠాః కుర్వతాంసుపుష్టిమ్. ౪

నాంశము ఎంత చలించినదని చూడవలెను. కృత్తికా నక్షత్రమును కలుపుకొని లెక్క వేసిన ౪౫ నక్షత్రములు చలించినదనియు, కృత్తికను విడిచి లెక్క వేయఁగా ౩౫ నక్షత్రములు చలించెననియుఁగానవచ్చును. †ఒక నక్షత్రమనఁగా ౧౩°. ౨౦' (పదుమూఁడు అంశముల యిరువది కళలు) కావున ౪౫ నక్షత్రములు, అనఁగా ౬౦°(అఱువదిఅంశములు). అయనము (సంపాతము) సంవత్సరమునకు ౫౧'' (ఏఁబదియొక వికళలు) చలించుటకు నొక సంవత్సరము పట్టిన ౬౦° అంశములు (౬౧×౬౦×౬౦ వికళలు) చలించుటకు నెంత కాలము పట్టును, అని త్రైరాశికముఁ జేసి చూచిన ౪౩౨౦ సంవత్సరములువచ్చును. ౩౫ నక్షత్రములె చలించినదనుకొనిన ౩౩౬౦ సంవత్సరముల కాలము వచ్చును. కృత్తికయన్న నా నక్షత్రముయొక్క మొదలు కావచ్చును, తుద కావచ్చును, మధ్య కావచ్చును. అప్పు డేభాగము రాశి ప్రథమముగా నున్నదో చెప్పుటకు వీలులేదు. కావున అథర్వ వేదమందలి పై సూక్తము రచింపఁబడి నేటికి రమారమి ౩౩౦౦ సంవత్సరములు మొదలుకొని ౪౩౦౦ సంవత్సరములయి యుండునని మన మూహింపవచ్చును. ఈ సూక్తము ౧౯-వ కాండము నందలిది. ఈకాండ మితర కాండములకంటె నర్వాచీనమని పండితుల యభిప్రాయము. కావున నథర్వ వేదముయొక్క పూర్వభాగము లింతకంటెఁ బురాతనములై యుండవలెను. అంతకుఁబూర్వపువియైన ఋగ్వేదాదులింకను బ్రాచీనములై యుండవలెను.

ఆమేమహాచ్ఛతభిషగ్వరీయ
ఆమే ద్వయాప్రోష్ఠ సదానుశర్మ
ఆ రేవతీ చాశ్వయుజౌ భగంమ
ఆమేరయిం భరణ్య ఆవహన్తు! ౫
[౧౯-వ కాండము ; ౭-వ సూక్తము.

అర్థము :-౧. ఆకాశమునందుఁ జిత్రముగఁ బ్రకాశించునవియు, ఎల్లప్పుడును ఆకాశమునందుఁ గలిసి శీఘ్రముగఁ దిరుగునట్టివియునగు నిరువది యెనిమిది నక్షత్రములను వాని అనుగ్రహము కొఱకు స్తుతిరూపమైన వాక్కుచేఁ గొల్చెదను.

౨. కృత్తికారోహిణులు ఆహ్వానమునకునర్హములు, మృగశిర శుభప్రదము, ఆర్ద్రా సుఖకారి, పునర్వసులు రెండును సత్యవాక్కు కలవి, పుష్యమి చక్కనిది, ఆశ్లేష వెలుతురు కలది, మఘ గంతవ్యస్థానము నాకు నగును గాక.

౩. పూర్వోత్తరఫల్గునులు, హస్త, పుణ్యప్రదలు, చిత్ర శివప్రదము, స్వాతి సుఖము, రాధనామాంతరము గల విశాఖలు రెండును అనుగ్రహవంతులు, అనూరాధ పిల్చుటకు సులభమైనది, జ్యేష్ఠ మంచినక్షత్రము, మూల అరిష్టము లేనిది నాకగుఁగాక.

౪. పూర్వాషాఢ అన్నము, ఉత్తరాషాఢ బలము, అభిజిత్తు పుణ్యము, శ్రవణము శ్రవిష్ఠలు (ధనిష్ఠ) పుష్టి నాకు నిచ్చుఁగాక.

౫. శతభిషము గొప్పఫలమును, ప్రోష్ఠపదములు రెండు (పూర్వాభాద్ర, ఉత్తరాభాద్ర) సుఖమును రేవత్యశ్వినులు భాగ్యమును, భరణి ధనమును, నాకు నిచ్చుఁగాక !

† విశ్వకోశము, ౧-వ సంపుటము, ౧౨౯-వ పుట.

ఒకానొక పండితుఁడు అయన చలనము నకు సూక్ష్మగణితముచేసి పైని ఉదాహరింపఁబడిన సూక్తము క్రీ. శ. ౧౯౭౮౦-వ సంవత్సరమునకుఁ బూర్వము ౩౭౯౦ ఏండ్లక్రింద రచియింపఁబడియుండవలెనని సిద్ధాంతీకరించియున్నాఁడు.*

కొందఱు పండితుల యభిప్రాయానుసారము అథర్వవేదము సంహితా రూపమును ధరించుటకును, సొల్గవ వేదమన్న గౌరవమును బొందుటకును మిక్కిలి కాలము పట్టెనను అందలి విడివిడి సూక్తములు కొన్ని మొదటి నుండియు—ఒకవేళ ఋగ్వేదము సంహితగా నేర్పడిన కాలమునుండియు—సంఘముయొక్క తక్కువ జాతివారిలో వాడుకగానుండెను. కాని యివి కట్టుబోతు తనమును గుఱించిన క్షుద్రమంత్రములైనందున నార్యులగువారు వానిని పెక్కుదినములవఱకు గ్రహించియుండరు. క్రమక్రమముగ నామంత్రములుకూడ సంహితా రూపమును ధరించి యితర సంహితలతోఁ బాటు యోగ్యత వహించెను. అందువలననే పూర్వబ్రాహ్మణములలో అథర్వమును వేదముగఁ జెప్పకపోయినను, అథర్వణములను ఇతిహాస పురాణములతోఁ బాటుచెప్పిరి.

ఇప్పుడీ సంహితయొక్క శౌనకశాఖ యొక్కటే యగుపడుచున్నను చరణవ్యూహాది గ్రంథముల్లవలన దీనికి పూర్వము తొమ్మిది శాఖలుండినట్లు కనఁబడుచున్నది. అవియేవి యనః-౧ పైప్పలాద ౨ తౌద, ౩ మౌద, ౪ శౌనక, ౫ జాజల, ౬ జలద, ౭ బ్రహ్మవద ౮ దేవదర్శ, ౯ చారణవైద్యశాఖలు. ఈ తొమ్మిదిశాఖలవారికిఁ దొమ్మిది విధములైన సంహితలుండెనో, లేకయొక్కసంహితనే వారు కొంచెము మార్పుతో నుపయోగించుకొనుచుండిరో తెలిసికొనుట కిప్పుడు వేఱుసాధనమేదియు లేదు. పైప్పలాదసంహిత యొకటి యిటీవల కాశ్మీర దేశమునందు రాస్ దొర గారికి దొరకినది. దానియొక్క ప్రతికృతి (Photograph) అచ్చువేసి యున్నారు* ఇది భూర్జపత్రములమీఁద శారదలిపిలో వ్రాయఁబడియున్నది. ఈలిపి కాశ్మీర దేశమునందు వాడుకలోనున్నది. ఇందు ౨౦ కాండములుకలవు. కాని దీనికిని శౌనక శాఖ సంబంధమైు వాడుకలోనున్న సంహితకును జాలభేదము కలదు. ౧౯-వ కాండములోని పెక్కుసూక్తము లిందుఁగానరావు. ఇరువదవ కాండమందలి సూక్తము లీ గ్రంథమునందుఁ గానవచ్చినను, ఒక్కచోటఁగానరావు. పెక్కు కాండములలోఁ గానవచ్చును. ఋగ్వేదము నుండి తీసికొనఁబడిన మంత్రములు ౨౦-వ కాండమునందు లేవు. స్వతంత్రములైన కొద్ది

(అథర్వ వేదశాఖలు)

*The Theosophist, Sept. 1881, Vol. 2. No. 12.

*The Reproduction on 54 plates, edited by M. Bloomfield and R. Garth (Baltimore) 1901.

సూక్తములుమాత్రముకలవు. ఇందు రమారమి ఆఱువవంతు ప్రొక్తసూక్తములున్నవి. ఈ సంహితకును శౌనక సంహితకును గల భేదమును గుఱించి యింకను శోధింపవలసి యున్నది.

విష్ణుపురాణమునందు నీవేదము యొక్క ఈశాఖాభేదములు మఱియొకవిధముగఁ జెప్పఁబడియున్నవి. వేదవ్యాసుఁడు సుమంతుఁడను తన శిష్యునకు నథర్వవేదమునేర్పెను. అతఁడు కబన్ధుఁడను వానికి నేర్పెరు. కబంధుఁ డా వేదములను రెండు భాగములుగఁజేసి దేవదర్శుఁడనువానికి, పథ్యుఁడనువానికి నిచ్చెను. దేవదర్శుఁడు నాలుగు విభాగములుచేసి మేధ, బ్రహ్మబలి, శౌష్కాయనుఁడు* పిప్పలాదుఁడు అను నల్గురు శిష్యుల కిచ్చెను. పథ్యుఁడను వాఁడు మూఁడు విభాగములుచ్చేసి, జాబాలి, కుముదుఁడు, శౌనకుఁడు అనువారికిచ్చెను. శౌనకుఁడు రెండుగ విభజించి బభ్రువను వానికి, సైంధవుఁడనువానికి నిచ్చెను. సైంధవుఁడనువాఁడు తానొక శాఖా ప్రవర్తకుఁడై, ముంజకేశుఁడనువానిని మఱియొక శాఖా ప్రవర్తకునిగఁజేసెను. [విష్ణుపురాణము 3-౬.

శౌనకశాఖకు సంబంధించిన అథర్వవేద సంహిత మొదట జర్మనీరాజధానియైన బర్లినులో ౧౮౫౫-వ సంత్సరమునందు ఆర్. రాథ్, డబ్ల్యు. డి. విట్నీ అను పాశ్చాత్య పండితద్వయముచేఁ బ్రకటింపఁబడినది. ఈ సంహితయే సాయణభాష్యముతో ౧౮౯౫-వ సంవత్సరమున బొంబాయిలో 'శంకరపాండు రంగ పండిత' అను నాతఁడు ప్రకటించెను. కానిసాయణభాష్యము అన్నికాండములకును దొరకినది కాదు. ౫, ౯, ౧౦, ౧౨-౧౬ ఈ కాండములకు సాయణ భాష్యము ముద్రితము కాలేదు. ఎవరైనను సంపాదించి ముద్రింపించిన వైదిక పండితులమీఁది మహోపకారమగును.

చరణవ్యూహమను గ్రంథమున, నథర్వవేదమునందు ౧౨౩౦౦ మంత్రములు (ఋక్కులు) ఉన్నవి* యని యున్నను, ఇప్పుడు కానవచ్చెడు శౌనకసంహిత ననుసరించి యీవేదమునందు ౭౩౬ సూక్తములును, రమారమి ౬౦౧౫ మంత్రములునుగలవు. ఈ లెక్క బొంబాయిలో శంకరపాండురంగ పండితులచేఁ బ్రకటింపఁబడిన సంహిత ననుసరించి యీయఁబడినది. బర్లినులోఁ బ్రకటింపఁబడిన సంహితయందును, బంగాలి విశ్వకోశ ముఖ్య సంపాదకునిచే నుపయోగింపఁబడిన సంహితయందును గొంచెము కొంచెముగ భేదముకలదు. సూక్తాదిక వివరమును, బర్లిను బొంబాయి ప్రతులకుఁగల భేదమును, ఈ ప్రక్కనీయఁబడిన పట్టికయందుఁ జూపఁబడినది.

గ్రంథ విభాగములు

* 'మోద' అనిపాఠాంతరము. 'శౌల్కాయని' యని పాఠాంతరము.

* "ద్వాదశానాంసహస్రాణి మంత్రాణాం త్రిశతానిచ"

అథర్వవేద పరిమాణపట్టిక

(బొంబాయి ప్రతినిబట్టి)

కాండ సంఖ్య	సూక్త సంఖ్య	ప్రపాఠక సంఖ్య	అనువాక సంఖ్య	ఋక్ సంఖ్య	విశేషాంశములు
౧	౩౫	౧,౨	౬	౧౫౩	
౨	౩౬	౩,౪	౬	౨౦౭	
౩	౩౧	౫,౬	౬	౨౩౦	
౪	౪౦	౭,౮,౯	౮	౩౨౪	
౫	౩౧	౧౦,౧౧,౧౨	౬	౩౭౬	
౬	౧౪౨	౧౩,౧౪,౧౫	౧౩	౪౫౪	
౭	౧౨౩	౧౬,౧౭	౧౦	౨౮౬	బర్లిన్ ప్రతియందు ౧౧౮ సూక్తములే కలవు.
౮	౧౦	౧౮,౧౯	౫	౨౯౩	బర్లిన్ ప్రతియందు ౨౫౯ ఋక్కులు కలవు.
౯	౧౦	౨౦,౨౧	౫	౩౧౩	బర్లిన్ ప్రతియందు ౩౦౨ ఋక్కులు కలవు.
౧౦	౧౦	౨౨,౨౩	౫	౩౫౦	
౧౧	౧౦	౨౪,౨౫	౫	౩౬౭	బర్లిన్ ప్రతియందు ౩౧౩ ఋక్కులు కలవు.
౧౨	౫	౨౬,౨౭	౫	౩౦౪	
౧౩	౪	౨౮	౪	౧౮౮	
౧౪	౨	౨౯	౨	౧౩౯	
౧౫	౧౮	౩౦	౨	౨౨౦	బర్లిన్ ప్రతియందు ౧౪౧ ఋక్కులు కలవు.
౧౬	౯	౩౧	౨	౧౦౩	బర్లిన్ ప్రతియందు ౯౩ ఋక్కులుకలవు.
౧౭	౧	౩౨	౧	౩౦	
౧౮	౪	౩౩,౩౪	౪	౨౮౩	
౧౯	౭౨	....	౭	౪౫౬	
౨౦	౧౪౩	....	౯	౯౪౧	బర్లిన్ సంపాదకులు ఈకాండమునందు ౧౦ సూక్తములను [illegible] ఋక్కులను మాత్రము గ్రహించిరి.
౨౦	౭౩౬	౩౪	౧౧౧	౬౦౧౫	

౧౮-వ కాండము వఱకును బొంబాయి ప్రతికిని బర్లిన్ ప్రతికిని విశేష భేదములేదు. విషయము ఒక్కటియే. కాని ౭-వ కాండమంతయు బర్లిన్ ప్రతిలో ౧౧౮ సూక్తములుగనే విభజింపఁబడినది. బొంబాయి ప్రతిలో అనుక్రమణి ననుసరించి ౧౨౩ సూక్తములుగ విభజింపఁబడినవి. అట్లే ౮-వ, ౯-వ, ౧౧-వ, ౧౫-వ, ౧౬-వ కాండములందలి కొన్ని పర్యాయ సూక్తములలోని రెండు పర్యాయములకు బర్లిన్ ప్రతిలో ఒకే సంఖ్యయే యీయఁబడినందున మొత్తముమీఁద ౧౮౯ ఋక్కులసంఖ్య తగ్గినది. ముఖ్యభేదము ౨౦-వ కాండమునందున్నది. ఈ కాండము బర్లిను వారికిఁ బూర్తిగ దొరకినట్టులేదు. బొంబాయివారి ప్రతియుఁ [illegible] సంశయములతో నిండియున్నది. బర్లిను ప్రతి ననుసరించి చూడఁగా అథర్వ వేదమునందు ౫౯౮ సూక్తములును, ౫౦౩౮ ఋక్కులును గలవు. అనఁగా, అథర్వవేదసంహిత ఋగ్వేదసంహితలో సగమున్నదని తోఁచును.

సంహితయంతయు నిరువది కాండములు గను, కాండమొకటి యిన్ని సూక్తములుగను, సూక్తమొకటి యిన్ని మంత్రములుగను విభజింపఁబడినది. మంత్రములనే ఋక్కులనియెదరు. కాండమునకిన్ని సూక్తములుండ వలెననిగాని సూక్తమున నిన్నిమంత్రము లుండవలెననిగాని నియమములేదు. ౧౭-వ కాండమున నొక్కటే సూక్తము కలదు; ౨౦-వ కాండమున ౧౪౩ సూక్తములుకలవు! ౧-వ కాండమందలి సూక్తములలో నాలుగు నాలుగు ఋక్కులే యున్నవి; ౧౧-వ కాండమందలి సూక్తములు ౬౦ ఋక్కులుగలవి! ఇది ముఖ్య విభాగము. ఈ వేదము నందలి యే మంత్రమునైన నుదాహరింప వలెనన్న ఇన్నవ కాండము, ఇన్నవసూక్తము, ఇన్నవ మంత్రము అనినఁ జాలును.

ఇఁక నీకాండములయు, సూక్తములయు రచనను గుఱించి విచారింపఁగా, ౧-మొదలుకొని ౭-వ కాండమువఱకు సూక్తములు వానియందలి మంత్రముల సంఖ్య ననుసరించి యేర్పాటు చేయఁబడినట్టు కానవచ్చును. ౧-వ కాండమందలి ప్రతి సూక్తమందును సరాసరి నాలుగు ఋక్కులును, ౨-వ కాండమందలి ప్రతి సూక్తమందును అయిదు ఋక్కులును, ౩-వ కాండమందలి ప్రతిసూక్తమందును నాఱుఋక్కులును, ౪-వ కాండమందలి ప్రతిసూక్తమందు నేడుఋక్కులును, ౫-వ కాండమందలి ప్రతిసూక్తమందు నెనిమిదిమొదలు పదునెనిమిదివఱకు ఋక్కులును, ౬-వ కాండమందుఁ బ్రతిసూక్తము మూఁడు ఋక్కులును, ఏడవ కాండమందలి సగముకంటె నెక్కుడుసూక్తములందు నొక్కొక ఋక్కును గలవు. ౮-మొదలు ౧౨-వ కాండమువఱకుఁ బెద్దపెద్ద సూక్తములుకలవు. ఇందు విషయము ననుసరించి సూక్తములను ఏర్పాటు చేయలేదు. సమ్మిశ్రములుగ నున్నవి. ౧౩-౧౮ కాండముల వఱకు విషయముల ననుసరించి సూక్తము లేర్పాటు చేయఁబడినవి. ౧౪-వ కాండమందలి సూక్తములు వివాహ విషయకములు. అందలి ఋక్కులు చాలభాగమువఱకు ఋగ్వేదమందలి వివాహవిషయక ఋక్కులే. ౧౫-వ కాండమున 'వ్రాత్యస్తుతి' కలదు. ౧౬-౧౭కాండములలో నభిచారమంత్రములు కలవు. ౧౫-వ కాండమంతయు, ౧౬-వ కాండమందలి కొంతభాగమును గద్యముగా నున్నది. ఈగద్యము బ్రాహ్మణముల గద్య రచనవలె నుండును. ౧౬-౧౭-వ కాండములు మిక్కిలి చిన్నవి. ౧౬ నందు ౯ సూక్తములును, ౧౭ నందు ౧ సూక్తమును గలదు. ౧౮-వ కాండమునందు అంత్యవిధిని గుఱించియు, పితృగణములను గుఱించియుఁ గలదు. ఇవి ఋగ్వేదము ౧౦-వ మండలము నుండి గ్రహించినఋక్కులు. చివరవియైన ౧౯-౨౦ కాండములు రెండును వెనుకనుండి కలపఁబడినవి యని కొందఱు పండితుల యభిప్రాయ

ము. అథర్వవేదప్రాతిశాఖ్యమను వైదికవ్యాకరణమునందు నీరెండుకాండములును ఉదాహరింపఁబడియుండలేదు. ౧౯-వ కాండమునందు చిల్లరసూక్తములన్నియు మిశ్రమముచేయఁబడినవి. అందుఁ జాలభాగము పరిశుద్ధముగలేదు. కొన్ని సూక్తములు తప్ప ౨౦-వ కాండమందలి సూక్తము లన్నియు ఇంద్రసూక్తములు. ఇవి యేవిధమైన మార్పు చేయకుండ ఋగ్వేదమునుండి యెట్లున్నవట్లు ఎత్తి వ్రాయఁబడినవి. మొత్తముమీఁద నథర్వవేద మందలి ౬౦౦౦ మంత్రములలో ౧౨౦౦ మంత్రములు ఋగ్వేదమునుండితీసికోఁబడినవి. ఇతరకాండములలో ఋగ్వేదమునుండి తీసికొనఁబడిన మంత్రములలోఁ గొంతమార్పు చేయఁబడినది. ౨౦-వ కాండము నందలి ఋగ్వేదమంత్రములకు మార్పులేదు. ఇందువలన నీకాండము నూతనమనుట స్పష్టము. ఈ కాండమంతయు సోమయజ్ఞ విషయమైనది. అది యథర్వవేద విషయమునకు సంబంధించినది కాదు. ౨౦-వ కాండమందలి గద్యభాగమును (౪౮-౪౯ సూక్తములును), కుంతాప సూక్తములును (౧౨౭-౧౩౬ సూక్తములును) స్వతంత్రములు. అనఁగా నితర గ్రంథములనుండి తీసికొనఁబడినవికావు.

ప్రపాఠక విభాగము

ఈ వేదమునందు స్వతంత్రమైన ప్రపాఠక విభాగమొకటి కలదు. ప్రపాఠక మనఁగా నొక్కపాఠమునకుఁ దగినంతభాగ మని తోఁచుచున్నది. ఈవిభాగమునకు కాండములకును సంబంధములేదు. ఇన్నవ కాండమని చెప్పిన నిన్నవ ప్రపాఠకమన నవసరములేదు. ఇన్నవ ప్రపాఠక మనిన నిన్నవ కాండమన నక్కఱలేదు. ప్రపాఠకవిభాగము ౧౮-వ కాండమువఱకేయున్నది. ౧౯-వ, ౨౦-వ కాండములందు ఈ విభాగములేదు. ఇందువలనఁ గూడ నాకాండము లితరకాండములకంటె నాధునికములని యూహించెదరు. కాండమునకును ప్రపాఠమునకును సంబంధము లేకపోయినను ఒకకాండము చివరభాగము, రెండవకాండము మొదటిభాగముకలిసి ఒకప్రపాఠక మెప్పటికిఁ గాదు. కాండముచివర ప్రపాఠకముకూడ పూర్తియగును. మొత్తముమీఁద ౧౮-వ కాండము చివరవఱకు ౩౪ ప్రపాఠకములు కలవు. అనువాక విభాగముగూడ నొకటికలదు.

మొదటిమంత్రమేది?

రాథ్, విట్నీగార్లచే జర్మనీయందుఁ బ్రకటింపఁబడిన యథర్వసంహితయందును, బొంబాయిలో శంకరపాండురంగపండితునిచేఁ బ్రకటింపఁబడిన సంహితయందును సాధారణముగ నిప్పుడున్నొరకు నథర్వసంహిత ప్రతులయందును, ఈ క్రింది మంత్రము ప్రథమమంత్రముగ నున్నది:-

యే త్రిషప్తాః పరియన్తి విశ్వా రూపాణి బిభ్రతః। వాచస్పతిర్బలా తేషాం తన్వో అద్య దధాతు మే॥

అర్థము:—విశ్వమునందలి యన్ని రూపములను ధరించి తిరుగుచుండెడి త్రిసప్తుల (మూఁడు ఏడ్లు అనఁగా పెక్కు దేవతల) యొక్క బలమును తనువును వాచస్పతి నాకునిచ్చుఁగాక.

సాయణాచార్యులవారు ఈ మంత్రమునే ప్రథమ మంత్రముగా గ్రహించి భాష్యము చేసియున్నారు.

కాని యిప్పటి యథర్వసంహితలలో ౧-వ కాండమందు ౬-వ సూక్తమునకుఁ బ్రథమ మంత్రముగనున్న ఈ క్రిందిఋక్కు అథర్వ వేదమునకుఁ బ్రథమ మంత్రమని వాడుక వైదికపరంపరగ వచ్చుచున్నది:-

శం నో దేవీరభిష్టయ ఆపో భవన్తు పీతయే
శం యోరభి స్రవన్తు నః.

అర్థము:—దివ్యమైన యీజలములు మాఅభీష్టము కొఱకు, మాపానముకొఱకు శుభప్రదములగుఁ గాక; మాకు నవి యారోగ్యమును సుఖమును గుఱిపించుఁ గాక.

ఈమంత్రమును గుఱించి యొక విశేషము కలదు. ఇది నాల్గువేదములలోను గానవచ్చుచున్నది. ఋగ్వేదమందు (౧౦. ౯. ౪), శుక్లయజుశ్శాఖయగు వాజసనేయ సంహిత యందు (౩౬. ౧౨), కృష్ణయజుశ్శాఖయందు, తైత్తిరీయ బ్రాహ్మణమందు (౧. ౨. ౧.), సామవేదమునందు (౧. ౩౩) ఈ మంత్రము బహుస్వల్ప పాఠభేదములతో నగుపడుచున్నది. ఈమంత్రము అథర్వవేదమునకు మొదట నుండెనని యీక్రింది యాధారములవలనఁ గనఁబడుచున్నది:-

౧. శంనో దేవీ రభిష్టయేతి ఏవమాదిం కృత్వాథర్వ వేదమధీయతే. [గోపథ.౧.౨౯.

'శంనో దేవీరభిష్టయ' అనునది యాదిచేసికొని అథర్వవేదమును అధ్యయనము చేయుదురు.

౨. బ్రహ్మయజ్ఞమునందు నన్ని వేదముల ప్రారంభ మంత్రములను జెప్పెదరు. అందు నథర్వవేదము ప్రారంభము 'శంనో దేవీరభిష్టయ' అన్నమంత్రముగాఁ జెప్పెదరు. బ్రహ్మయజ్ఞవిధాన మేర్పడినపుడు యథర్వవేదమునకు మొదట నీమంత్ర ముండెనని యూహింపవలెను గదా?

౩. రాథ్, విట్నీలచే సంపాదింపఁబడిన కొన్ని అథర్వవేద లిఖితప్రతులలోఁ గొన్నింటిలోను, (I, R, O, Op)* శంకర పాండురంగ పండితునిచే సంపాదింపఁబడిన లిఖితప్రతులలో నొక్కదానిలోను (Sm**) 'శంనో దేవీ' యనునదియే మొదటి మంత్రముగనున్నది

౪. హలాయుధుఁ డనువాఁడు 'బ్రాహ్మణ సర్వస్వ' మను గ్రంథమును రచించెను. అందునాతఁడు,అథర్వవేదమునకు 'శంనో దేవీ' యనునదియె మొదటి మంత్రమనెను.

[విశ్వకోశము

౫. అథర్వ వేదముయొక్క పరిశిష్టములనఁబడు గ్రంథములలోఁ గొన్నిటిలో 'శంనో

* "*Sam no* as initial stanza of the Vulgate text—Whitney notes that this stanza is also found prefixed to the text of the Vulgate in four of the *mss* used by him, to wit, L. and R. and O. and Op." *Harvard Oriental Series*, Vol 7, p. C XVI.

** Critical notice P. 5.

దేవీ' యను మంత్రమును మొదటిప్రతీకముగ నీయఁబడినది. *

౬. మహాభాష్యమునందుఁ బతంజలి 'శంనోదేవీ'యను మంత్రమునుఅథర్వవేదమునకు మొదటి మంత్రముగ నిచ్చినాఁడనియు, నావేదమును, ఇతర వేదములకంటె శ్రేష్ఠమని చెప్పినాఁడనియుఁ గొందఱు పాశ్చాత్య పండితులు వ్రాసియున్నారు. ** కాని 'నవధాథర్వణో వేదః' అన్న వాక్యముతప్ప, ఈయర్థమిచ్చు వాక్యములేవియు మాకు నిప్పుడు బొంబాయిలో నచ్చుపడ్డ మహాభాష్యమునందుఁ గానరాలేదు. ఇతర ప్రతులలో నుండిన నుండవచ్చును.

పై ఆధారములన్నియుఁ బట్టిచూడఁగా నొకప్పుడు 'శంనోదేవీ' యను మంత్రము అథర్వ వేదమునకు మొదటిది అయినట్లును తరువాత 'యేత్రిషప్తాః' యన్న మంత్రము ప్రథమస్థాన మాక్రమించినట్లును కానవచ్చుచున్నది. కొందఱు "పైప్పలాదశాఖకు 'శంనోదేవీ' యనునది మొదటిమంత్రమై యుండనోపు, శౌనక శాఖకు 'యేత్రిషప్తాః' అనునది మొదటిమంత్రమై యుండనోపు" అని యూహించెదరు. పైప్పలాద సంహితప్రతి కాశ్మీరములో దొరకినదితప్ప వేఱులేదు. అందు మొదటిమంత్రము లేదు. కావున నిదమిత్థమ్మని స్పష్టముగఁ జెప్పుటకు వీలులేదు.

రచనా విశేషము

ఈవేదము ఋగ్వేదమువలెఁ బూర్తిగ ఛందోమయము కాదనియు, గద్యపద్యాత్మకమనియుఁజెప్పియున్నాము. మొత్తముమీఁద నిందలి యాఱవవంతు గద్యాత్మకము. ౧౫-౧౬-వ కాండములు పూర్తిగ గద్యమునందు వ్రాయఁబడినవి. ఈ గద్యము ఐతరేయాది బ్రాహ్మణముల గద్యమువలె నుండును. ఛందోమయమైన భాగమునందు ఋగ్వేదాదికములందలి త్రిష్టుప్‌గాయత్రి మొదలయిన ఛందస్సులే వాడఁబడినను, బుద్ధిపూర్వకముగనో అజ్ఞానముచేతనో ఋగ్ఛందశ్శాస్త్ర నియమములను బాటింపక యిష్టమువచ్చినట్లు మార్పులుచేయఁబడినవి. ౧౬-వ కాండమునఁ గొన్ని గద్యసూక్తములుగలవు. వానిలోఁ గొంతభాగము ఛందోమయముగ నుండును. మిగిలినది యట్లుండదు. పూర్తిగ ఛందోబద్ధములుకాని పద్యములును, గద్యములును, ఇష్టమువచ్చినట్లు ఈవేదమునఁ గలపఁబడినవి. ఒకప్పుడిదిగద్యమా? పద్యమా? యని కనుఁగొనుటకుఁ గూడ వీలుండదు.

* Bloomfield's Kausika Sutra, Introduction XXXVII & XXXVIII.

** "Mahabhashya not only mentions its Samhita (Saunakya or Paippalada) by the term 'అథర్వాంగిరసః' but is peculiar in placing it, or rather its opening Stanza, 'శంనోదేవీ' at the head of the list of Vedic writings. The scholialist explains this unusual position of the Atharvaveda on the ground that all sacrifices begin with the expulsion of demons (rakshasas and pisachas) from the sacrificial ground." [rundiss Indo-Arischen Philologie- The Atharvaveda, Strassburg 1899, p. 27].

వేద మంత్రములను రచించిన వారు మంత్రద్రష్టలు. వీరు ఆయా మంత్రములకుఁ గర్తలు. వేదము లపౌరుషేయములను వారు వీరిని కర్త లనక ద్రష్ట లనియెదరు. ద్రష్ట లనఁగాఁ జూచినవారు. వేదమంత్రము లంతకుఁ బూర్వమే యుండె ననియు, అవి యీ ఋషులకుఁ గానవచ్చిన వనియు వీరి తాత్పర్యము. ఏ యే మంత్రమునకుఁగర్తయెవఁడో సాధారణముగ ఋగ్వేదాది మంత్రములవలనఁ దెలియును. కాని అథర్వవేద మంత్రములవలనఁ దెలియదు. కొద్ది మంత్రముల కర్తలను మంత్ర మందలి విషయమువలనఁ గనుఁగొనినను పెక్కు మంత్రముల కర్తలఁ దెలిసికొనుటకు వీలు లేదు. ఇచ్చటఁ బూర్వ పరంపరయే యాధారము. అనుక్రమణు లన్న గ్రంథములలో ఏ యే సూక్తము లెవ్వరెవ్వరు రచించినది యీయఁబడును. మంత్ర ద్రష్టలఁ దెలిసికొనుటకు మనకు నివియే యాధారములు. బృహ దనుక్రమణిక (పంచ పటలిక) లో నథర్వవేదపు ఋషుల పేళ్ళీయఁబడినవి. ఇట్టి ఋషులు రమారమి యెనుబది మంది కలరు. వారి నామము లీప్రక్క పట్టికలో అకారాదిగ నిచ్చుచున్నాము. ఒక్క సూక్తమునందలి వేఱు వేఱు మంత్రములకు భిన్న ఋషులుండరు. ఒక్క సూక్తమునకుగాని పెక్కు సూక్తములకుగాని ఒక్కఋషియో, యిద్దఱు ఋషులు కలిసియో యుందురు.

అథర్వవేదపు మంత్రద్రష్టలు

పట్టికలోనీయఁబడిన ఋషినామములలోఁ గొన్నికల్పితములుగఁ గాన వచ్చుచున్నవి. అంత్యవిధికి యముఁడు, వివాహ మంత్రములకు సూర్యా సావిత్రి, షాముమంత్రములకు గరుత్మంతుఁడును, పురుషసూక్తమునకు నారాయణుఁడును ఋషులుగాఁ జెప్పఁబడుటచూడ అను క్రమణులు వ్రాసినవారు వారివారి యూహలనుబట్టి దేవతలనుగూడ మంత్రద్రష్టలుగఁ జెప్పిరని మనమూహింపవచ్చును. ఈ ఋషులలో 'బాద్దరాయణి' యన్న ఋషి యెవఁడై యుండనోపు? వ్యాసునకుఁ గుమారుఁడు శుకుఁడు లేక మఱియొక బాదరాయణి పూర్వఋషులలోనుండెనా?

వీరిలోఁ బెక్కుమంది ఋగ్వేదాది ఋషులే. ఈ వేదమునందలి యెక్కువసూక్తములను 'అథర్వ' ఋషియు, 'బ్రహ్మ' ఋషియు రచించినట్లు కానవచ్చుచున్నది. అథర్వఋషి ౧౭౪ సూక్తములకుఁగర్త. బ్రహ్మ ౧౦౦ సూక్తములనురచించెను. అథర్వాంగిరసులుకలిసి ౧౭ సూక్తములకు, అంగిరసుఁడు ౧౬ సూక్తములకుఁగర్తలు. భృగువు ౨౨ సూక్తములకు, భృగ్వంగిరసులు ౨౨ సూక్తములకును గర్తలు. మిగిలిన ఋషులందఱును పదిసూక్తములకు లోపు రచించినవారే కాని అధికము చెప్పినవారులేరు. ఇందువలన ఈవేదమునకు అథర్వవేదము, బ్రహ్మవేదము, అథర్వాంగిరస వేదము, భృగ్వంగిరసవేదము అనిపేర్లు ఎందుకు వచ్చెనో చదువరులకు విస్పష్టముగఁ దెలియఁగలదు.

అథర్వవేదఋషిపట్టిక

అ

అంగిరసుఁడు, అంగిరసప్రాచేతసుఁడు,
అగస్త్యుఁడు, అథర్వ వీతహవ్యుఁడు,
అథర్వాంగిరసుఁడు, అథర్వాచార్యుఁడు,
అథర్వణుఁడు, అథర్వుఁడు,
అప్రతీక్షుఁడు,

ఉ

ఉచ్ఛోచనుఁడు, ఉద్దాలకుఁడు,
ఉన్మోచనుఁడు, ఉపరి బభ్రువుఁడు.

ఋ

ఋభు కపింజలుఁడు

క

కబంధుఁడు, కశ్యప మారీచుఁడు,
కశ్యపుఁడు, కణ్వుఁడు,
కాంకాయనుఁడు, కారుపతి,
కుత్సుఁడు, కౌశికుఁడు.

గ

గరుత్మంతుఁడు, గార్గ్యుఁడు,
గోపథ భరద్వాజుఁడు, గోపథుఁడు.

చ

చాతనుఁడు

జ

జగద్బీజంపురుషుఁడు, జమదగ్ని,
జాతికాయనుఁడు.

త

త్వష్ట

ద

ద్రవిణోదానుఁడు, ధుృహవణుఁడు.

న

నారాయణుఁడు,

ప

పతివేదన, ప్రజాపతి,
ప్రత్యాంగీరసుఁడు, ప్రమోచనుఁడు,
ప్రశోచనుఁడు, ప్రస్కన్వుఁడు,

బ

బభ్రుపింగళుఁడు, బాదరాయణి,
బృహచ్ఛుక్రుఁడు, బృహద్దివ అథర్వణుఁడు,
బృహస్పతి బ్రహ్మ,
బ్రహ్మాస్కందుఁడు, భగుఁడు,
భరద్వాజుఁడు, భార్గలి
భార్గవవైదర్భి, భార్గవుఁడు,
భృగువు, భృగు అథర్వణుఁడు,
భృగ్వాంగిరసుఁడు భృగ్వాంగి రసబ్రహ్మ.

మ

మయోభువు, మాతృనామ,
మారీచుఁడు, మృగారుఁడు,
మేధాతిథి.

య

యముఁడు,

వ

వరుణుఁడు, వసిష్ఠుఁడు,
వామదేవుఁడు, విశ్వామిత్రుఁడు,
విహవ్యుఁడు, వీతహవ్యుఁడు.
వేనుఁడు,

శ

శంభువు, శాంతాతి,
శుక్రుఁడు, శునః శేపుఁడు,
శౌనకుఁడు,

స

సవిత, సావిత్రీ సూర్య,
సింధు ద్వీపుఁడు, సింధుద్వీప అథర్వాకృతి.

అథర్వవేదమందలి విషయములు

వింశతికాండాత్మకమై రమారమి యాఱు వేలమంత్రములుకలయథర్వ సంహితయందలి విషయము లివ్వియని చెప్పుట యెవ్వరికి సాధ్యము ? ఒక్కొక సూక్తమందలి విషయము కొద్దిలో వ్రాసినను నొక గ్రంథమగును. మొత్తముమీఁద సూక్తములను విషయమునుబట్టి వర్గములుగా విభజించి, యొక్కొక వర్గములోని విషయమును మొత్తము మీఁద సామాన్యముగఁ జెప్పిన నీవేదమందలి విషయము లిట్టివి గదా యని కొంతవఱకుఁ జదువరులకు బోధపడినఁ బడవచ్చును. ఆ విధము ననుసరించి యథర్వ సూక్తములు పదుమూఁడు వర్గములుగ విభజింపఁబడుచున్నవి. ఈ వర్గములు పరస్పరములు, అతివ్యాప్తి విరహితములు (mutually exclusive) కావు. ఒకవర్గములోని విషయము మఱియొక వర్గమునందు నొకప్పుడు కనఁబడవచ్చును. కాని మొత్తముమీఁద భిన్నవిషయ బోధకములు. అవియేవియనిన:-

౧. రోగనివారణమునకును, దయ్యములు వదలుటకును మంత్రములు (భేషజ్యాని) ; ౨. దీర్ఘాయువు, ఆరోగ్యమునిచ్చుటకుఁ బ్రార్థనలు (ఆయుష్యాణి); ౩. భూతములను, మంత్రగాండ్రను, శత్రువులను, పరిభవించుటకు శాపములు (అభిచారికాని,కృత్యాప్రతిహరణాని); ౪. స్త్రీసంబంధములైన మంత్రములు (స్త్రీకర్మాణి) ; ౫. ఐక్యాభివృద్ధికి, అధికారము హెచ్చుటకు మంత్రములు (సామనస్యాని) ; ౬. రాజునకు సంబంధించిన మంత్రములు (రాజకర్మాణి); ౭. బ్రాహ్మణులకు సంబంధించిన మంత్రములు; ౮. యోగక్షేమాభివృద్ధికి మంత్రములు (పౌష్టికాని); ౯. ప్రాయశ్చిత్త మంత్రములు (ప్రాయశ్చిత్తాని); ౧౦. సృష్టిసంబంధమైనవియుఁ బరతత్త్వ సంబంధమైనవియు నగు సూక్తములు; ౧౧. సంస్కార సంబంధమైన సూక్తములు; ౧౨. వేఱువేఱు విషయములను గుఱించి చర్చించు కాండములు (౧౩-౧౮ కాండములు); ౧౩. కుంతాప సూక్తములు. ఇఁక నీపదుమూఁడు విధముల సూక్తములను గుఱించి కొద్దికొద్దిగా విశదీకరించి, యొక్కొక విషయమును జూపుటకు రెండేసి గాని మూఁడేసిగాని సూక్తములాంధ్రీకరింపఁబడును.

౧. భేషజ్యాని

భేషజ్యాని, అనఁగా రోగనివారణ సంబంధములైనసూక్తములని యర్థము. ఈ వేదమునందు వేఱువేఱు రోగములు పోవుటకు వేఱు వేఱు మంత్రములు చెప్పఁబడియున్నవి. తరువాత నభివృద్ధిచెందిన యాయుర్వేదమను వైద్యశాస్త్రమునకు నివి బీజభూతములనిచెప్పవచ్చును. ఇందుఁజెప్పఁబడిన మంత్రములు, తాయెతులు, మూలికలు, మూఢ విశ్వాస పాత్రములై యుండును. కాని, మానవుల బాల్యావస్థలో నిట్టిమూఢవిశ్వాసములు సహజములు. ఇంగ్లీషువారి పూర్వులును, జర్మనీ

వారి పూర్వులును, ఇట్టి విశ్వాసములే కలిగి యుండిరి!

జ్వరము, వరుసజ్వరములు, పసరికలు, ... రక్తము కారుట, అజీర్ణము, జలోదరము, కుష్ఠు, గాయములు, క్రిములు పడుట, ... రోగములు, విషము మొదలయిన లెక్కకు మించిన రోగములకు నివారణోపాయముల యిన మంత్రములున్నవి. ఇవి మందులు కావు. మంత్రములు! ఈమంత్రపఠనమువలననవిపోవు ననితాత్పర్యము. కొన్నిచోట్ల సహజముగఁ గొన్ని మందులుగూడఁ జెప్పఁబడినవి. గాయములకు మిరపగింజమందనియు(౬-౧౦౯), చీమలు విషమును బోఁగొట్టుననియు (౬-౧౦౦), అజశృంగియను నోషధి గంధర్వాప్సరో రాక్షసులఁ బోఁగొట్టుననియుఁ (౪-౩౭) జెప్పఁబడియున్నది. సాధారణముగా నిందు మందులుగాని, ఇతరోపచారములుగాని చెప్పఁబడియుండక పోయినను సూత్రకారు లచ్చటచ్చట గొంతవఱకుఁ జెప్పుచుఁబోయినారు. సాయణాచార్యులు తన భాష్యమునందు వానిని సంగ్రహించుచుఁబోయినాఁడు. ఇందు నకు రెండుదాహరణములఁ జూపుచున్నాఁడ.

(౧) ౧-వ కాండమందలి ౧౭-వ సూక్తము, శస్త్రమువలనఁ దాకిన దెబ్బలోనుండి కారు రక్తమును నాపుటకుఁ బుట్టినది. దానికి సాయణాచార్యులవారు, ఉపోద్ఘాత మిట్లు వ్రాసిరి.

"శస్త్ర ఘాతాది రుధిర ప్రవాహస్య......నివృత్తయే సంచపర్వణాదండేన రుధిరవక్షానస్థానాభిమంత్రణం వ్రణముఖే రథ్యాపాంసుసికతా ప్రక్షేపణాదికమ్ । ఆర్ద్రక పాలికాబంధనంచ, ఇత్యేవ మాధికుర్యాత్."

సూత్రంచ "అమూర్యా ఇతిపంచ పర్వణాపాంసుసికతాభిః పరికిరత్యార్ద్రకపాలికాం బధ్నాతిపాయయతి" ఇత్యాది. [కా-౪.౨.

అర్థము:—ఈ సూక్తము శస్త్రఘాతముచేఁ గలిగిన రక్త ప్రవాహము నాపుటకు (ఉపయోగింపవలెను). అయిదు గణుపులు గలకఱ్ఱతో నెత్తురుకారుచున్న స్థలము నభిమంత్రించి, వ్రణముఖమున వీధిలోదుమ్ము, ఇసుక, చల్లవలెను. ఎండిసబురుద కట్టవలెను. [కా-౪.౨.

(౨) ౧-వ కాండమునందలి ౨౫-వ సూక్తము, శీతజ్వరాదికములు నివారించుటకునై ఉపయోగింతురు. దానికి ఈ ఉపోద్ఘాతము కలదు.

"ఏకాహికాది శీతజ్వరసంతతజ్వరవేలాజ్వరాదిశాంతయే 'యదగ్నిరాపః' ఇతిసూక్తం జపేత్ । లోహకుఠారమ్ అగ్నౌసంతాప్య ఉష్ణోదకమధ్యే స్థాపయిత్వా తేనోదకేన వ్యాథితమ్ అభిషిఞ్చేత్।తథాచకౌశికః యదగ్నిరితి జపతి పరశుంతాపయతి క్వాథయత్యవసించతి ఇతి" [కా-౪.౨.

అర్థము:—ప్రతి దినము, దినమువిడిచి దినము, వచ్చు జ్వరములు మొదలయినవి.

శాంతించుటకు, ఈసూక్తమునుబఠింపవలెను. ఇనుపగొడ్డలి నిప్పులోకాచి, వేడినీళ్లలో వేసి ఆనీళ్లతో రోగిని అభిమన్త్రింపవలెను.

ఇఁక నీవిభాగమును, ఉదాహరించు రెండు సూక్తముల భాషాంతరీకరించుచున్నాము.

౧. రక్తమును ఆపుటకు

(౧.వ కాండము; ౧౭-వ సూక్తము.)

౧. ప్రవహించుచున్నవియు, రక్తమునకు నివాసభూతములయినవియూ నగు నీరక్తనాడులు (సిరలు) తోడఁబుట్టినవాండ్రులేని చెల్లెండ్రవలె హతవర్చసలై యాగిపోవును గాక.

౨. ఓ అధోభాగవర్తినియైన రక్తనాడీ (సిరా, ధమనీ)! ఆగిపో, ఊర్ధ్వనాడీ! (రక్తము ప్రవహించుట) ఆగిపో, మధ్యమనాడీ! ఆగిపో, అన్నిటికంటెఁ జిన్ననాడీ! ఆగిపో, అన్నిటి కంటెఁ బెద్దనాడీ! ఆగిపో.

3. నూఱు ధమనులలో (హృదయ గతమైన ప్రధాన నాడులలో) వేయిసిరలలో (శాఖానాడులలో) ఈనడిమివి ఆగిపోయినవి, మిగిలిననాడులన్నియు నాగిపోయినవి.

౪. ఓ నాడులారా! మిమ్ము నిసుకతోఁ జేయఁబడిన పెద్దధనుస్సు చుట్టు నాక్రమించినది. కావున మీరు ఆగిపొండు. ఈ జనునకు సుఖమునీయుఁడి.

౨. జ్వరమును బోఁగొట్టుటకు

(౧-వ కాండము ; ౨౫-వ సూక్తము)

౧. అగ్ని నీటిలోఁ బ్రవేశించి దానిని దహించెను. ధర్మవిదులు దానిని గ్రహించిరి. ఆ అగ్నియందు, ఓతక్మన్ (జ్వరమా!) నీదిగొప్పపుట్టుకయని చెప్పెదరు. కావున మమ్ము విడిచివెళ్లుము.

౨. ఓ తక్మన్! నీవు జ్వాలారూపము కలదానవైనను, ఉష్ణగుణముకలదానవైనను, శరీరసంతాపకారిణివైనను, నీపుట్టుకస్థలము కాష్ఠములైనను, పచ్చటియో దేవా! నీనామము హ్రూడు. మమ్ము విడిచిపొమ్ము.

3. ఓతక్మన్! నీవు శరీరమును లోపలశోషింపఁజేయువాఁడవైనను, శరీరమంతట శోషింపఁజేయువాఁడవైనను, రాజయిన వరుణుని కుమారుఁడవైనను, 'హ్రూడు' అను నామము కలవాఁడా! మమ్ము విడిచిపొమ్ము.

౪. శీతమును బుట్టించు జ్వరమునకు నమస్కారము. ఉష్ణమును బుట్టించు జ్వరమునకు నమస్కారము. శరీరమును శోషింపఁజేయు జ్వరమునకు నమస్కారము. దినదినమువచ్చు శీతజ్వరమునకు, రెండు దినములకు నొకసారివచ్చు శీతజ్వరమునకు, మూఁడు దినములకువచ్చు శీతజ్వరమునకు నమస్కారము.

౩. దీర్ఘాయువు నారోగ్యమునిచ్చు సూక్తములు (ఆయుష్యాణి)

సామాన్యముగా వేలువేలు రోగములను బోఁగొట్టుటకై యుపయోగించునట్టి సూక్తములకును వీనికిని భేదముకలదు. రోగములతో సంబంధము లేకుండ సామాన్యముగా నారోగ్యమును, ఆయుస్సును, కోరునవి యీ 'ఆయుష్యాణి' సూక్తములు. ఆయుస్సు, ప్రాణము, వర్చస్సు, బలము, మొదలయినవానిఁ గోరు సూక్తములు, ఆయురాది శబ్దములతో బ్రారంభింపఁబడిన మంత్రములు, ఈ వేదమునందు ౨౦౦ కంటె నెక్కుడు కలవు. నూఱు సంవత్సరముల వార్ధక్యము వచ్చువఱకును, యజమానుఁడు, బిడ్డలు మొదలయిన వారు బ్రతుకవలెననియీమంత్రములయందు సాధారణముగాఁ గోరఁబడియుండును. మరణము నివర్తించుటకును నిందుఁగోరంబడియుండును.

ఘరణము లన్నియుఁగూడి నూటయొక్కవిధములని యీవేదాభిప్రాయము (౧. ౩౦. ౩; ౬.౧౧. ౫-౭.). యముఁడు, మృత్యువు, అంతకుఁడు, నిర్బతి అనువారు మృత్యుదేవతలు. ఋగ్వేదకాలపు యమునకును అథర్వకాలపు యమునకును భేదము కలిగినది. ఋగ్వేద మందలి యముఁ డంతభయంకరుఁడు గాఁడు.

ఈ సూక్తములలో నగ్నికిఁ బ్రాధాన్య మీయఁబడినది. 'అగ్ని' యే ఆయుస్సు. యజుర్వేదము నందును, గృహ్యసూత్రములందును, కొన్ని యుపనిషత్తులందును గూడ: ఆయుస్సంబంధమైన దేవత అగ్నిగానె యెంచఁబడినది.* ఇతర దేవతలనుగూడ నాయుస్సు అడిగినారు కాని అగ్నికి నెక్కువ అధికారమీ విషయములో నథర్వవేద మందీయఁబడినది (౭. ౫౩. ౬.). ఆయుర్వృద్ధికిఁ గొన్ని తాయెతులు మొదలయినవికూడఁ జెప్పఁబడినవి. దాక్షాయణులు శతానీకునకు దీర్ఘాయువునకై బంగారు తాయెతునిచ్చిరి (౧-౩౫). దానిని ధరించిన నేవిధమైనరోగములును, పిశాచాదికములును, ఆశింపవు. అంజనము (౪. ౯; ౧౯.౪౪) ముత్యము, ముత్యపుచిప్ప (౪.౧౦), ఒక వనస్పతి (౮. ౨), మేఖల (ఒడ్డాణము) (౬. ౧౩౩) మొదలయినవికూడ ఆయుర్వృద్ధికిని, ఆరోగ్య రక్షణమునకును, సహకారులయిన తాయెతులుగాఁ జెప్పఁబడినవి.

* వాజ. సంహిత. ౩. ౧౭; తైత్తి. సం. ౧. ౫. ౫. ౩; శత. బ్రా. ౨.౩.౪.౧౯; ప్రశ్న. ఉప. ౧౭;

౧. బాలునకు దీర్ఘాయువు కలుగుటకు

(౨-వ కాండము, ౨౮-వ సూక్తము.)

౧. ఓ ముసలితనమా ! నీకొఱకై యీబిడ్డఁడు వర్ధిల్లునుగాక. శతసంఖ్యాకములైన యన్యమృత్యువులు, (అపమృత్యువులు) అతనిని బాధింపక పోవునుగాక. ప్రసన్నుఁడైన మిత్రుఁడను దేవత తల్లివలె నీకుమారుని తనయొడిలోనుంచుకొని యేబాధలులేకుండ రక్షించునుగాక.

౨. మిత్రావరుణదేవతలు ఏకమై, యీపిల్లవానికి ముసలితనము వఱకు మరణము రాకుండఁజేతురుగాక. ప్రజ్ఞావంతుఁడును, దేవతలకు హోతయు, జన్మస్థానమును, అయిన అగ్నిదేవుఁడు ఈ బాలకుని రక్షించుఁగాక.

౩. ఓ అగ్ని ! నీవు భూమి మీఁది అన్నిప్రాణులకు అధిపతివి, వెనుక పుట్టినవారికి ముందుఁబుట్టిఁబోవువారికి నధిపతివి. కావున ఊర్ధ్వవాయువుగాని అధోవాయువుగాని వీనిని చంపకుండునుగాక. మిత్రులుగాని అమిత్రులుగాని వీనిని వధింపకుండుదురుగాక.

౪. ఓబాలుఁడా ! తండ్రియైన యాకాశమును తల్లియైన భూమియుఁ గలిసి నీకు ముసలితనమువఱకు మృత్యువులేకుండఁ జేయుదురుగాక. అదితియొక్క ఉత్సంగమునందు నీవు నూఱు హిమవంతములు ప్రాణాపానములతో రక్షింపఁబడుదువుగాక.

౫. ఓ అగ్నీ ! వరుణరాజువైన మిత్రమా ! ఈపిల్లవానినిదీర్ఘాయుష్మంతునిగా, తేజోవంతునిగాఁజేయుఁడి. పుత్రాదులు, కలుగునట్లుచేయుఁడు. ఓ అదితి ! తల్లివలె వీనికి సుఖమునిమ్ము. ఓ విశ్వేదేవతలారా ! మీరు వీనిని దీర్ఘాయుస్సుకలవానిగాఁ జేయుఁడు.

౨. దీర్ఘాయువునకు బంగారముతాయెతు

(౧౯-వ కాండము; ౨౬-వ సూక్తము)

౧. అగ్నిలోనుండిపుట్టిన బంగారము, మరణములేకుండుటకునై దేవతలు మానవులకిచ్చిరి. దీనిఁదెలిసి

కొనువాఁడు బంగారమును ధరించుటకుఁ దగినవాఁడు. ధరించువానికి ముసలితనమునందే మరణమువచ్చును.

౨. పూర్వము ప్రజావంతులైన మానవులు చక్కని వర్ణముగల బంగారమును, సూర్యుని వలనఁ బొందిరి.

3. ఆహ్లాద జనకమైన హిరణ్యము నీకువర్చస్సు కలుగఁజేయుఁగాక. దానినెవఁడు ధరించునో వాఁడు ఆయుష్మంతుఁడగును. అది నీకు నాయుస్సు, వర్చస్సు, ఓజస్సు (శరీరబలము) కలిగించునుగాక. బంగారము చాకచక్యమువలన నీవు జనులలో విశేషముగఁ బ్రకాశింతువుగాక.

౪. దీనిని శాజైన వరుణుఁ డెఱుఁగును. దేవుఁడైన బృహస్పతి యెఱుఁగును: వృత్ర్యహంతకుఁడైన యింద్రుఁడెఱుఁగును. అదినీకు నాయుస్సును, వర్చస్సును, ఇచ్చునది యగునుగాక.

అథర్వణ సూక్తముల మూఁడవ విభాగమునకు 'అభిచారికాని' అనిపేరు. 'కృత్యాప్రతిహారణాని' అనియు వీనికిఁబేరు.

3 అభిచారికాని, కృత్యా ప్రతిహారణాని

అభిచారిక కర్మయనఁగా, మన వాండ్రుసాధారణముగా శాతపొడి,మరిత్రము, ప్రయోగములు, అనునట్టి శత్రుమారణాది సంబంధమైన పనులు. ఇందు మానవులగు శత్రువులెగాక భూతపిశాచాది మానవేతర శత్రువులును, సూక్తవిషయముగా నుందురు. ఈ శత్రువులెంత నిజమో యాశత్రువులును అంతె నిజమని యీ సూక్తములు వ్రాసినవారి యభిప్రాయమైనందున మానవులతోఁ బాటు ఒక్కొక సూక్తములలో పిశాచాదులు గూడఁ జేర్పఁబడును. ౨-వ కాండమందలి ౧౮-వ సూక్తమున భ్రాతృవ్య సపత్నాదుల తోడ పిశాచాదులుగూడఁ జేర్పఁబడినవి. అథర్వవేదము ఘోరాఘోర రూపము కలది యని చెప్పఁబడినది. అందు అభిచారకమను నది ఘోరరూపము. యాతు విద్య యనఁబడు రక్షోవిద్య దీనిభాగము. అభిచారిక మనఁగా శాతపొడి, కట్టుబోతుతనము. యాతువిద్య యనఁగా దయ్యపు మంత్రములు. అథర్వవేదాది సూత్రములలో అభిచారికా కర్మ యొక్కభేదము లీవిధముగఁ జెప్పఁబడినవి. సపత్న బాధనము, వినాశనము, పీడనము, మారణము, వశీకరణము, విద్వేషణము, మోహనము, స్తంభనము, శాటనము, ఉచ్చాటనము. ఒకరిని చెరుపుటకై మనముచేయు కట్టుఁబోతు తనమునకు 'అభిచారిక' మని పేరు. ఒకరు మనకుఁ జేసిన ప్రయోగమును ద్రిప్పుటకుఁజేసిన దానికి 'ప్రత్యభిచారము' అనిపేరు. వీనినే 'కృత్యాప్రతిహారణాని' అందురు.

అభిచారిక విద్యయే యీ వేదముయొక్క ముఖ్య లక్షణము. ఇతర విధములైన సూక్తములందును ఈ అభిచారిక కర్మయొక్క వాసన కొంతయైనను ఉండకపోదు. బ్రాహ్మణ గౌరవమునకుగాని, రాజుల జయమునకు గాని, భార్యను సంపాదించుకొనుటకుగాని అభిచారము ఉపయోగించుచుండెను. అథర్వవేద మంత్రములలో నేవేవి యేయే అభిచార కర్మకై యెట్లెట్లు ఉపయోగింపవలెనో

సూత్రకారులు పద్ధతు లేర్పఱచిరి. ఇట్లు క్రమక్రమముగ నీ మారణవిద్య (అవిద్య?) అజ్ఞానులలోఁ బెరిగి యిప్పటి భూతవైద్యులకుఁ దిండి పెట్టినది!

శత్రువులను చంపుమని, కాల్పుమని, వ్రేల్చుమని కోరునట్టి మంత్రములు మిక్కిలి భయంకరములుగను, మనసునకు నుద్వేగకరములుగను ఉండును. మేను గగుర్పొడుచును!

తామెతులు మొదలయినవి యిట్టిసూక్తములయందుఁగూడ నుపయోగింపఁబడినవి.

౧ శత్రునాశనము

(౨-వ కాండము; ౧౯-వ సూక్తము)

౧. ఓ అగ్ని! మమ్మెవఁడు ద్వేషించునో, మేమెవనిని ద్వేషింతుమో వానిని నీతపస్సు (సంతాపన శక్తి) చేఁ దపింపఁ జేయుము.

౨. ఓ అగ్ని! మమ్మెవఁడు ద్వేషించునో, మేమెవనిని ద్వేషింతుమో వానిని నీహరస్సుచే (సంహరణ సామర్థ్యము) హరింపుము.

3. ఓ అగ్ని! మమ్మెవఁడు ద్వేషించునో, మేమెవనిని ద్వేషింతుమో వానిని నీఅర్చి (దీప్తి) చే మాడ్చివేయుము.

౪. ఓ అగ్ని! మమ్మెవఁడు ద్వేషించునో, మేమెవనిని ద్వేషింతుమో వానిని నీశోచి (శోకజనన సామర్థ్యము) చే శోకింపఁజేయుము.

౫. ఓ అగ్ని! మమ్మెవఁడు ద్వేషించునో, మేమెవనిని ద్వేషింతుమో వానిని తేజస్సుచే నతేజసునిఁ జేయుము.

౨. శత్రుయజ్ఞ వినాశము

(౭-వ కాండము; ౭౨-వ సూక్తము)

౧. దూరస్థుఁడైన మాశత్రుఁడు (మాకుఁ జేయవలెనని) మనస్సుచేతను, వాక్కుచేతను, యజ్ఞోచితములైన మంత్రములచేతను, ద్రవ్యములచేతను, ఏమేమి చేయఁదలపెట్టెనో, వానినన్నిటిని, నిర్ఋతియను దేవత మృత్యుదేవతతో నేకీభవించి, వానియుద్దేశ్యము సిద్ధింపక పూర్వమే వినాశము చేయుఁగాక.

౨. పరపీడాకారిణియైన నిర్ఋతి మాశత్రువుల యథార్థకర్మను అయథార్థకర్మగా నశింపఁజేయుఁగాక. ఇంద్రప్రేరితులైన దేవతలు (మాశత్రుఁడైన) వీని యొక్క ఆజ్యసాధనమైన హోమకర్మను వినాశముఁ జేయుదురుగాక.

3. అధిర, అధిరాజు అనునట్టి మృత్యుదూతలు రెండు శ్యేనపక్షులవలె నెగిరి (శత్రుని) మీఁదఁబడి మాకు నపకారము చేయఁదలఁచిన శత్రుని (హోమసాధనమైన) నేతిని నాశముచేయుఁగాక.

౪. నీకు పెడరెక్కలు కట్టితిని, నీనోరుమూసితిని, అగ్నిదేవుని కోపముచే నీహవిస్సును నాశము చేయుదును.

3. పిశాచ మంత్రము

(౨-వ కాండము, ౧౪-వ సూక్తము)

౧. భయమును బుట్టించు నిస్సాలయను పిశాచినిని, పరుషవాక్యము గలదియు, ఎప్పుడును తిండిపోతును అయిన ధిషణయను పిశాచినిని, నశింపఁజేయుదుము. వీరందఱును చండుఁడను వాని సంతానము. ఎప్పుడును ఆక్రోశము చేయుచుందురు.

౨. ముగుందియను ఆడుపిశాచము కూతులారా! మిమ్ము కొట్టమునుండియు, ద్యూతశాలనుండియు, ధాన్యగృహమునుండియు, గృహములనుండియు వెళ్ళఁగొట్టుదుము.

3. అదుగో! అధోభాగమునందున్న యింట్లో ఆరాయ్యులనఁబడు పిశాచినులు ఉందురుగాక; ఇతరములైన యాతుధానులును, పిశాచినులును గూడ అచ్చటనే యుందురుగాక.

౪. భూతపతి (రుద్రుఁడు) ఆక్రోశముచేయు పిశాచినులను ఇచ్చటినుండి వెడలఁగొట్టుఁగాక; ఇంటి

బునాదిమీఁదఁ గూర్చుండిన పిశాచములను నింద్రుఁడు వజ్రముతో నణఁగఁగొట్టుఁగాక.

౫. ఓ సదాన్వాయనము లనఁబడు దయ్యములారా! మీరు ఈభూమితో సంబంధించిన వారైనను, దస్యుల వలనఁ బుట్టిన వారైనను, మీరు ఇచ్చటినుండి వెడలి నశింపుఁడు.

౬. శీఘ్రగామియైన యశ్వము పరుగిడినట్లు నేను వీనితావులన్నియుఁ దిరిగి చూచితిని. మీ సంగ్రామము లన్నియు గెల్చితిని. కావున నిచ్చటినుండి పోయినశింపుఁడి, ఒసదాన్యులారా!

స్త్రీకర్మాణి యనఁగ స్త్రీలకుసంబంధించిన సూక్తములు.

౪. స్త్రీ కర్మాణి

ఈవేదమునందు స్త్రీలను గుఱించివచ్చిన సూక్తములను - ముఖ్యముగ మొదటి యేడుకాండముల యందలి వానిని- ఎత్తి కౌశిక సూత్రమునందు నేయేసూక్తము నెచ్చటెచ్చటనుపయోగించవలయునో సూత్రకర్తచెప్పియున్నాఁడు. ఇందలి వివాహాదిక సంబంధమైన మంత్రములు ఋగ్వేదమునుండి తీసికొనంబడినవి. పురుషుని స్త్రీన్ని వెదకుట, గర్భాదానాది కర్మలు, ఈవేదమునకును, ఇతరవేదమునకును సమానములే. ఈవేదమందలి విశేషములు, పురుషుఁడు స్త్రీని, స్త్రీ పురుషుని వశపఱచుకొనుట (౬. ౮; ౬. ౯; ౬. ౧౦౨; ౬. ౧౩౯), సపత్నీ బాధనము (3. ౧౮), అన్యస్త్రీయొక్క చక్కఁదనమును హరించుట (౧, ౧౪), పురుషుని మగతనము పోవునట్లుచేయుట (౬-౧౩౮;) మొదలయిన కర్మలను వర్ణించు మంత్రములు పెక్కులు కలవు.

౧. భర్తల్లభించుటకు మంత్రము

(౬-వ కాండము, ౬౦-వ సూక్తము)

౧. ఈకన్యకకుఁ బతినిఁగోరి, ఈ బ్రహ్మచారికి భార్యనుకోరి అర్యమ (ఆదిత్యుఁడు) విషితస్తువుఁడై పురోభాగమున వచ్చుచున్నాఁడు.

౨. అర్యమ! ఈపడుచు ఇతర స్త్రీల వివాహోత్సవములకుఁ బోయిపోయి విసివినది. ఇఁకఁ దప్పక యితరస్త్రీ లీమె వివాహోత్సవమునకుఁ బోయెదరు.

3. ధాత యీభూమిని, ఆకాశమును, సూర్యుని ధరించెను. (స్వస్వస్థానములయందు నిలిపెను.) ధాత యీ కన్యకకు నామె యభీష్టమైన వరుని నిచ్చుఁగాక.

౨. భార్యలభించుటకు మంత్రము

(౬-వ కాండము ; ౮౨-వ సూక్తము)

౧. ఇచ్చటికి వచ్చువాని, వచ్చినవాని, వచ్చుచున్నవాని పేరు తలఁతును; ఇంద్రుని, వృత్రఘ్నుని, వాసవుని, శతక్రతువును, యాచించెదను.

౨. సూర్యుని బిడ్డయైన 'సూర్య' ను అశ్వినులు భార్యగా నే త్రోవను తీసికొనిపోయిరో ఆత్రోవనే నీవు భార్యను ఇచ్చటికి తెమ్ము. అని భగుఁడు నాకుఁ జెప్పెను.

3. భార్యను కోరుచున్న నాకు నోయింద్రుఁడా! శచీపతి! నీయొక్క హిరణ్మయమును, ధనమిచ్చునదియునగు నీయంకుశముచే నాకు భార్యను ఇమ్ము.

సామనస్యమనఁగా మనసుకలిసియుండుట.

౫. సామనస్యాని

ఐకమత్యాభివృద్ధికి ఈ సూక్తముల నుపయోగించెదరు. కుటుంబమునందేమి, గ్రామమునందేమి, అందఱును ఏకాభిప్రాయులై

యుండుటయేయీమంత్రములప్రయోజనము. కొన్ని సూక్తములలో నైక్యభావమును గుఱించి చక్కని బోధకలదు. 3-వ కాండమందు 30-వ సూక్తమునందు కుటుంబమునందలి వారందఱును కలిసి యొక్కమాట మీఁదనుండవలెనని చేయఁబడిన బోధ మిక్కిలి హృద్యముగ నున్నది. ఇట్టి సూక్తములలోను అభిచారసంబంధము లేకపోలేదు. ఐక్యముండవలెనన్న నేమియర్థము? "నేను అనుకొని నట్లు నందఱు నను కొనవలెను. నేనుచెప్పినట్లు అందఱు వినవలెను. నాకు నందఱు వశులు కావలెను" అని భావము. అట్లగుటకు మంత్ర తంత్రములుచెప్పఁబడినవి.

సభలోని వారిని స్వాధీన పఱచుకొనుటకు రెండు సూక్తములు కలవు (౩, ౩౭;౭, ౧౩). ఇవి ముఖ్యమైనవియని యర్థము. మొదటిదానిలో 'పాతా'యను వనస్పతితోఁ బ్రతిపక్షులను జయించువిధమును, రెండవదానిలో సభలోనివారిశక్తియు, బుద్ధియు వశముచేసికొనువిధమును జెప్పఁబడియున్నవి.

౧. ఐక్యభావాభివృద్ధికి.

(౩-వ కాండము ; ౩౦-వ సూక్తము)

౧. మిమ్ము నేకహృదయముగల వారిగను ఏకమనస్సుగలవారిగను, ద్వేషరహితులుగను, చేసెదను. అప్పుడు పుట్టిన దూడను ఆవు ప్రేమించునట్లు మీరు ఒకరి నొకరు ప్రేమించుడి.

౨. పుత్రుఁడు తండ్రికి ననుకూలుఁడగుఁ గాక; తల్లితో సమానమనస్సు కలవాఁడగుఁ గాక; భార్య పతితో తేనెవంటి తియ్యని శాంతివచనములు మాట్లాడును గాక.

3. సోదరుఁడు సోదరుని, సోదరి సోదరిని ద్వేషింపక యుండురుగాక; వీరందఱును ఒక్కవ్రతోవఁ ద్రొక్కువారును, ఒక్కపని చేయువారును అయి కల్యాణ వాక్కులను బల్కుదురుగాత.

౪. ఏమంత్రమువలన దేవతలు వేఱువేఱు మార్గములఁబోరో, ఒకరినొకరు ద్వేషింపరో యట్టి సమాన జ్ఞానప్రదమైన (ఐక్యాభావ జ్ఞానమునీయఁగల) మంత్రమును మీయింట్లో మనుష్యుల (ఐక్యము) కొఱకుఁ జదివెదము.

౫. మీరు జ్యేష్ఠ కనిష్ఠ భావములతో నొకరి నొకరు అనుసరించి, సమాన చిత్తము, సమానకార్యము సమానభావముగల వారలయి కలిసిచనుఁడు; వేఱుపడకుఁడు; ఒకరితో నొకరు ప్రియవాక్యములు పల్కుచురండు. నేను మిమ్ము సమానకార్య ప్రవృత్తికలవారిగను, సమాన మనస్కులుగను చేసెదను.

౬. మీరందఱుకలిసి త్రాగుఁడు, తినుఁడు. అందునకు మిమ్ము నేనొక (స్నేహ) బంధనమునఁ గట్టెదను; నాభిని అరులవలె మీరందఱను (చుట్టుకూర్చుండి) కలిసి యగ్నిని బూజింపుఁడు.

౭. మిమ్ము నందఱను వశీకరణముచే సమాన ప్రవృత్తులుగను, సమాన మనస్కులుగను, సమానవ్యాప్తిగల వారిగను చేసెదను. అమృతమును రక్షించు దేవతలవలె మీరు సాయంప్రాత స్సమయముల యందును (సర్వకాలము) ఏకమనస్కులై యుండుఁడి.

౨. సభాజయమునకు

(౭-వ కాండము ; ౧౩-వ సూక్తము)

౧. ప్రజాపతికిఁ గూతులైన సభయు, సమితియు * నేకమనస్కులై నన్ను రక్షించుదురుగాత. సాకుఁగాన

* 'సభ' యనఁగా 'విదుషుల సమాజము', సమితి యనఁగా 'సంగ్రామీణ జనసభ' యని సాయణాచార్యులు.

వచ్చినవాఁడెల్ల నాకనుకూలుఁడగుఁ గాక? ఓ తండ్రులారా! సభలో నేను చారువచనములు పలికెదను.

౨. సభా! నీపేరు 'నరిష్టా' (అలంఘనీయ) యని యెఱుఁగుదును. ఈ సభలోని సభాసదు లందఱును నాతో నేకీభవింతురు గాక.

౩. ఇందలి సభాసదులయొక్క వర్చస్సును, విజ్ఞానమును నేను తీసికొనుచున్నాను. ఈసభయందలి యందఱిలోను, ఇంద్రా! నన్ను భాగ్యవంతుని (జయవంతుని) చేయుము.

౪. ఓ సభాసదులారా! మీమనసు ఇతరత్ర ఆసక్తమై యున్నను, ఇచ్చటచ్చట బద్ధమైయున్నను, మావైపునకుఁ ద్రిప్పెదము. అది నాయందు రమించుఁ గాత.

౩ కోపశాంతికి

(౬-వ కాండము. ౪౨-వ సూక్తము)

౧. వింటినుండి త్రాటిని దింపినట్లు నీహృదయము నుండి కోపమును తీసివేయుచున్నాను. ఇందువలన మన మేక మనస్కులమై స్నేహితులవలెఁ గలిసిమెలసి యుందుము.

౨. స్నేహితులవలె నుందము. నీకోపమును తీసి పెద్దబండక్రిందఁ బెట్టుచున్నాను.

౩. నీకోపమును నామడిమతోను, పాదాగ్ర భాగముతోను త్రొక్కెదను. ఇందువలన నీవు పరవశుండవై మాటలాడవు. నాచిత్తము ప్రకారము నడిచెదవు.

రాజునకు, రాజ్యమునకు, సంబంధించిన

౬. రాజ కర్మాణి

సూక్తములకు రాజకర్మాణి యని పేరు. రాజ్యాభిషేకము (౪-౮), రాజు యశోభివృద్ధి (౬-౩౮), ఇతర రాజులను వశపఱచుకొనుట, సార్వభౌమత్వము (౪-౨౨; ౬-౭౪ ; ౭-౮౪), యుద్ధములో జయము (౮-౮); యుద్ధమునకుంబోవునప్పటి మంత్రములు (౬-౮౬), యుద్ధమందలి ఘాతుక పిశాచాదులకు మంత్రములు (౧-౮-౧౦), యుద్ధదుందుభి ప్రార్థన మొదలయిన విషయములు, ఈ సూక్తముల యందుండును. ఇట్టిమంత్రముల వలననే రాజునకు అథర్వ పురోహితుఁడు తప్పక యుండవలయునన్న యాచారముపుట్టి యుండవచ్చును. యుద్ధములో బాణములు తగిలకుండ నుండుటకును, ఏవిధమైన దెబ్బ తగలకుండుటకును, మంత్రములు కలవు. వీని నన్నిటికి కౌశికసూత్రములో (౧౪-౧౭) విధాన క్రమము లేర్పర్పఁబడినవి.

౧. వర్చస్సు, సామర్థ్యము కావలయునని

(౬-వ కాండము ; ౩౮-వ సూక్తము)

౧. సింహమునందు, పెద్దపులియందు, పామునందు అగ్నియందు, బ్రాహ్మణునియందు, సూర్యునియందు నున్న దీప్తి మాకుఁగల్గుఁ గాక. సౌభాగ్య యుక్తయు, ఇంద్రునిఁ గన్నదియునగు దేవి వర్చస్సుతో మమ్ముఁ జేరుగాత.

౨. ఏనుఁగునందు, చిఱుతపులియందు, బంగారమునందు, నీళ్ళయందు, పశువులయందు, మనుష్యులయందు నున్న దీప్తి మాకుఁగల్గుఁగాక. సౌభాగ్య యుక్తయు, ఇంద్రునిఁ గన్నదియునగుదేవి వర్చస్సుతో మమ్ముఁ జేరుఁగాత.

౩. రథమునందు, పాచికలయందు, ఆఁబోతుబలమునందు, వాయువునందు, వర్షమునందు, వరుణునిశోషక బలమునందునున్న దీప్తి మాకుఁ గల్గుఁగాక. సౌభాగ్య యుక్తయు, ఇంద్రునిఁగన్నదియునగుదేవి వర్చస్సుతో మమ్ముఁజేరుఁగాత.

౪. క్షత్రియునియందు, (మ్రోయుచున్న) దుందుభియందు, అశ్వముయొక్క బలమునందు, పురుషునిఉచ్చ

ధ్వనియందు నున్న దీప్తి మాకుఁ గల్గుఁగాక. సౌభాగ్యయుక్తయు, ఇంద్రున్నిఁగన్న దియు నగు దేవి వర్చస్సుతో మమ్ముఁ జేరుఁగాత.

౨. శత్రుసేనకు మోహము కల్గించుటకు

(౩-వ కాండము ; ౧-వ సూక్తము)

౧. విద్వాంసుఁడైనయగ్ని మా శత్రువులమీఁదికి నెత్తిపోవును గాక ; ఎక్కువహింసకుఁడైన శత్రునిఁ గాల్చు గాక. సర్వజ్ఞుఁడైన యగ్ని మాశత్రువులను జేతులు లేనివారిగఁ జేయును గాక.

౨. ఓయుగ్రులైన మరుత్తులారా! ఇట్టి యుద్ధకర్మ యందు మీరు నాకు సాహాయ్యులు కండు. ముఖ్యముగ శత్రువుల మీఁదికిఁబోయి గెల్వుఁడు. అట్లేజయార్థమై వేఁడఁబడిన యావసుగణదేవతలు మాశత్రువులను జంపుదురుగాక. నీరిదూతయు, విద్వాంసుఁడును, అయిన యగ్నికూడ శత్రువులమీఁదికి దాడివెడలును గాక.

3. ఓ మఘవన్! వృత్రహంతకా! ఇంద్రా! అగ్ని! శత్రు సేనలను గాల్పుము.

౪. ఓయింద్రుఁడా! రెండు గుఱ్ఱములచే శీఘ్రముగా లాగఁబడుచు నీరథము శత్రువులను సమీపించు గాత. నీవజ్రము మాశత్రువులను మిక్కిలి హింసించును గాక. ఎదురుగవచ్చువారిని వెనుకనుండి వచ్చువారిని పాఱిపోవువారిని జంపివేయుము. నిశ్చయముగ నున్నవారి చిత్తమును గార్యాకార్య జ్ఞానముతేనిదిగఁ జేయుము.

౫. ఇంద్రా! శత్రువులసేనను విమూఢచిత్తము కలదిగఁ జేయుము. అగ్నివాయువులను గలిపి (వారి మీఁదికిఁ బ్రయోగించి) శత్రు సేనలను చెల్లాచెదరు చేయుము.

౬. ఇంద్రుఁడు (శత్రు) సైన్యమును మోహింపఁ జేయును గాక. మరుత్తులు బలముచే దానిని సంహరింతురుగాత ; అగ్ని శత్రువుల నేత్రములను దీసికొనును గాక. ఇట్లోడి యాసైన్యము తిరిగిపోవును గాక.

౭. బ్రాహ్మణులకు సంబంధించినవి

బ్రాహ్మణులకు సంబంధించిన సూక్తము లీ వేదమునందుఁ బెక్కులుకలవు. అందుఁ గొన్ని ఆజ్ఞార్థములు, కొన్ని శాపార్థములు. ఇతరుల కందఱికంటె బ్రాహ్మణులధికులనియు, నితరులకందఱికంటె వారికి హక్కులు పెక్కులుకలవనియు నథర్వకాల నిర్మాణకాలము వఱకు స్థిరపడిపోయినది! పురోహితుఁడందఱికంటె నెక్కుడనియు, నతని మూలముననే రాజునకు యుద్ధములలో జయము కలుగుననియు, నాతనికి నితరశుభంబులన్నియు సమకూరుననియు నొకసిద్ధాంతమును స్థిరపఱచిరి (3-౧౯). ఇట్లు పురోహితునిగాని, బ్రాహ్మణునిగాని పొగడినసూక్తము లీ వేదమం దచ్చటచ్చటఁ గానవచ్చును. బ్రాహ్మణ సంబంధమై మఱియొక విధమైన సూక్తములు, బ్రాహ్మణులకు దానమిచ్చుట యితరులకు విధియనియు, అట్లిచ్చుట వలన మిక్కిలి పుణ్యము కలుగుననియుఁ జెప్పునవి (౭-౧౦3) కలవు. ౫-వ కాండమందలి ౧౧-వ సూక్తమునందు అథర్వణుఁడను ఋషికిని వరుణదేవునకును జరిగిన సంవాదముకలదు. వరుణుఁడు మొదట అథర్వణునకొక ఆవునుదానముచేసి, మరల తీసికొనవలయునని యత్నించెను. అందుపై అథర్వణుఁడు, ఇచ్చిన దానము మరలపుచ్చుకొను పీనిష్ఠుల నిందించి, నీవట్టివాఁడవు కావలదనిచెప్పి తనయావును దాను దీసికొని, అన్ని సభలలోను వరు

ణుఁడు గొప్పదాతయని చెప్పెదనని యొప్పు కొనెను!

"బ్రాహ్మణుఁడువచ్చి అడిగినతోడనే ఆవును దానమీయవలయును. అట్లీయని యెడల నెన్నియో యాపదలు సంభవించును. ఋషిపుత్రులువచ్చి దానమడిగినతోడనేఆవును ఈయనివాఁడు దేవబ్రాహ్మణుల కోపమునకుఁ బాత్రుఁడగును. బ్రాహ్మణుఁ డడిగిన యావు తన కెంత యుపయోగకరమైనదైనను దానిని ఇచ్చి తాను వేఱు ఆవును జూచుకొనవలసినదే. ఆవు (ఎవరిదిగానైన నుండనిండు) బ్రాహ్మణులకు దాచుకొన్న సొమ్ము. ఆవున నెవరియింట నది పుట్టిననేమి? వారువచ్చి యడిగెదరు. ఇట్లువారు తమ ధనమునడుగుటకే వచ్చెదరు. దేవతలు బ్రాహ్మణ ముఖముతో ఆవునడిగెదరు. ఈయనివాని మీఁద వారికందఱుకుఁ గోపము." అని ౧౨-వ కాండమునందలి ౪-వ సూక్తమునందుఁ జెప్పఁబడినది. ఇది పెద్ద సూక్తము. బ్రాహ్మణులకుఁ బ్రపంచమందలి యన్ని ఆవుల మీఁదను హక్కుగలదన్న యందలివింత వాక్యములు మాత్రము మీఁదఁజూపఁబడినవి!

పై దానములుగాక ఓదనదానములు పెక్కులు చెప్పఁబడియున్నవి. ౧౧-వ కాండమందలి ౧-వ సూక్తమందు బ్రహ్మౌదనమును, ౧౨-వ కాండమందు స్వర్గోదనమును వర్ణింపఁబడినవి. ఈ ఓదన దానమునందు బంగారము మొదలయిన దక్షిణలుకూడ నిచ్చుచుండిరి. యజమానునిభార్య యన్నము వండి దానముచేయుచుండెను. తరతరము వారును ఈబ్రహ్మౌదనమను సవనవిశేషము సేయుచుండిరి. 'తాతలు, ముత్తాతలు, పదునైదుతరములనుండి యీబ్రహ్మౌదనమును వండుచున్నాము (౧౧-౧-౧౯)' అని చెప్పఁబడి యున్నది. ఇట్టి దానశ్రుతులన్నియు కౌశిక సూత్రమునందు నొక్కచోటికిఁ దేఁబడినవి. ఋగ్వేదాదికములయందును బ్రాహ్మణులకు దానమీయుటను గుఱించి దానశ్రుతులు కలవు. అవి ఆయాపట్టున వర్ణింపఁబడును. బ్రాహ్మణులకు నపకారము చేయఁగూడదనియు, అట్లు చేయు వారికిఁ బెక్కువిపత్తులు వచ్చుననియుఁ జెప్పెడి శాపాదులుగలవి బ్రాహ్మణుల గుఱించిన మూఁడవ విధమైన సూక్తములు. బ్రాహ్మణుని యావును అపహరింపఁగూడదనియు (౫-౧౮), బ్రాహ్మణుని భార్యను అపహరింపఁగూడదనియుఁ (౫-౧౭) జెప్పెడు సూక్తములలోఁ గొంత భాగము క్రిందఁ దెనిఁగింపఁబడినది. దానిని జూచిన నీ సూక్తముల స్వభావము గోచరమగును. బ్రాహ్మణుని భార్యసంబంధమైన సూక్తమందలి విషయములు విచారణీయములు. దానిని బట్టిచూడ నాకాలమందు, కన్యలు తక్కువయనియు, భార్యదొరకుటయరుదనియు, ఒక్క స్త్రీని, పొరపాటునగాని బలవంతముగా గాని బ్రాహ్మణ క్షత్రియ వైశ్యశూద్రులు పెండ్లియాడిన నది బ్రాహ్మణస్త్రీగానే యుండునది

యనియు, నూహింపవలసియున్నది. ఇప్పటి మనకు నివి విచిత్రములైన సాంఘికాచారములుగఁ గన్పట్టునుగదా!

ఒకసూక్తమునందు (౫-౧౯) "వైతహవ్యుఁడు, సృంజయులు, అనువారు ఆకాశమువఱకు రాజ్యముకలవారయ్యును, భృగువునకు నపకారముచేసి నాశమునొందిరి......ఏ రాజ్యమందు బ్రాహ్మణుఁడు బాధచెందునో దానికి గొప్ప ఆపత్తుసంభవించి, అట్టిపాపము చేసిన వానికి చెట్లుకూడ నీడనీయవు....బ్రాహ్మణుని ధనము విషము. బ్రాహ్మణుని బాధించినవానికై దేవతలు పీనుఁగుమీఁది నీళ్ళను ఏర్పఱచిరి" అని బ్రాహ్మణులను బాధపెట్టువాని విషయమై చెప్పఁబడియున్నది.

౧ బ్రాహ్మణుని యావును దీసికొనఁగూడదు

(౫-వ కాండము ; ౧౮-వ సూక్తము)

౧. ఓరాజా! ఈయావును నీకు తినుటకు దేవతలు ఈయలేదు. ఎవరును తినఁదగని యీ బ్రాహ్మణుని యావును మ్రింగఁగోరకుము.

౨. ద్యూతమువలన మోసపోయి, తనను తాను ఓడిన పాపాత్ముఁడైనరాజు, 'నేఁడు నన్ను బ్రతుకనిమ్ము; రేపు చచ్చినఁ జత్తును' అని తలఁచి బ్రాహ్మణుని యావును భక్షించును.

*　*　*　*　*

౬. శరీరము నందుఁ బ్రేమకలవాఁ డెవ్వఁడును, అగ్నివలె నంటరాని బ్రాహ్మణుని హింసింపరాదు. ఎందుకనఁగా సోముఁడతనికి దాయాదుఁడు, ఇంద్రుఁడు వానిని కీడునుండి కాపాడును.

౭. ఏమూర్ఖుఁడు నూఱు గాలములుగల బ్రాహ్మణుని యన్నము (ఆవును) తిని యది రుచికరముగనున్నదని యనుకొనునో వాఁడు దానిని హరించుకొనలేఁడు.

౮. బ్రాహ్మణుని నాలుక వింటిత్రాడుగను, వాక్కు శరము మొనగను, వాజ్నాడిక, దంతములు, తపస్సంజాతమైన అగ్నిగను మారును. ఇట్టి సాధనములచే బ్రాహ్మణుఁడు దేవనిందకులను కొట్టును. వానిబాణము హృదయముఁ దాఁకును.

*　*　*　*　*

౧౦. వేలప్రజలమీఁద రాజ్యము చేసినవారును పదివందలజనము కలవారును అగువైతహవ్యులు బ్రాహ్మణగోవును భక్షించి నాశముఁ జెందిరి.

*　*　*　*　*

౧౫. ఓరాజా! గోపతే! విషముపూసిన బాణము వలెను, పామువలెను బ్రాహ్మణుని బాణము (భయంకరము). దానితో నాతఁడు శత్రువుల సంహరించును.

౨ బ్రాహ్మణుని భార్య నపహరింపఁగూడదు

(౫-వ కాండము ; ౧౭-వ సూక్తము)

*　*　*　*　*

౨. సోముఁడు మొదట బ్రాహ్మణుని భార్యను వైరముమాని తిరిగి యిచ్చివేసెను; ఆమెవెంట వరుణుఁడు మిత్రుఁడు వెళ్ళినారు; అగ్నిహోతయై యామె చేయిపట్టుకొని తెచ్చెను.

*　*　*　*　*

౬. దేవతలు, తపస్సాచరించిన సప్తర్షులు, అపహరింపఁబడిన బ్రాహ్మణభార్య భయంకరమైనదని చెప్పిరి; ఆమె స్వర్గమందుగూడఁ గల్లోలము పుట్టించును.

౭. గర్భపాతములు, పశ్వాదుల నాశమును, వీరుల పరస్పర వినాశమును, ఈవిపత్తుల నన్నిటిని బ్రాహ్మణుని భార్యయే చేయును.

౮. పూర్వమందు స్త్రీకి పదిమంది యబ్రాహ్మణ పతులున్నను, బ్రాహ్మణుఁడు దాని కరగ్రహణము చేసెనేని వాఁడే దానికిభర్త.

౯. బ్రాహ్మణుఁడే దానిభర్త. క్షత్రియుఁడు కాఁడు, వైశ్యుఁడు కాఁడు. అని సూర్యుఁడు అయిదు విధముల మానవులకుఁ జెప్పెను.

౧౦. బ్రాహ్మణుని భార్యను దేవతలు తిరిగి యిచ్చివేసిరి; మనుష్యులు తిరిగి యిచ్చివేసిరి; క్షత్రియులు సత్యమును గ్రహించి యామెను తిరిగి యిచ్చివేసిరి.

*　　*　　*　　*　　*

౧౨. ఎవనిరాజ్యమందు బ్రాహ్మణునిభార్య అజ్ఞానవశమున నిరోధింపఁ బడునో వానిభార్య నూర్గురిని కనునది కాదు, కల్యాణి కాదు, వానిపక్క మీఁదఁ బడుకొనదు

*　　*　　*　　*　　*

౧౮. ఎచ్చట బ్రాహ్మణుఁ డొకరాత్రి భార్య లేకుండ దుఃఖముతో వసించునో యచ్చటి (ఆరాజు యొక్క రాజ్యమందలి) పశువులు కల్యాణప్రదములు కావు, ఎద్దులు కాడికి మేకొనవు.

౮. పౌష్టికాని

ధనధాన్యాదికముల యభివృద్ధికొఱకుఁ బుట్టిన మంత్రము లీ శీర్షిక క్రిందికివచ్చును. 'అదికావలెను, ఇదకావలెను, దానినిమ్ము, దీని నిమ్ము' అని కోరెడిమంత్రములన్నియు నీజాతివే. ౧౨-వ కాండముగాక యిట్టి సూక్తము లథర్వవేదములో నైదవ వంతు కలవు. ఋగ్వేదము మొదలుకొని, శ్రౌత గృహ్యసూత్రముల వఱకును వైదిక వాఙ్మయమంతయు ఈ 'పౌష్టికాని కర్మాణి' అనువానిచే నిండియున్నదనిచెప్ప వచ్చును. ఇల్లు వాకిలి, పొలము వర్షము, పైరు పంట, ధనము ధాన్యము, పశువులు, వర్తకము, ద్యూతము మొదలైన యైహిక సంబంధమైన సంపత్తు రావలెననియు, అభివృద్ధిచెందవలెననియు మానవుల కందఱకుఁగల యభిలాష యాకాలమందు నీసూక్తరూపముగ వెలువడినది. గృహనిర్మాణ సంబంధమైన సూక్తములు (౩-౧౨; ౭.౬౦), కాలువ త్రవ్వి యేటి నీళ్ళను త్రిప్పునప్పటి మంత్రము (౩-౧౩), పొలముదున్నునప్పుడు (౩-౧౭), విత్తనముఁ వేయునప్పుడు (౬-౧౪౨), పంటబాగుగఁబండుటకు (౩-౨౪), వర్షము వచ్చుటకు (౪-౧౫; ౬-౨౨; ౭-౧౮), పశుసంరక్షణమునకు (౬-౫౯), తప్పిపోయిన దూడతిరిగి వచ్చుటకు (౪.౩౮), దూడపై ఆవుకు ప్రేమ కల్గుటకు (౬-౧౪౧), దొంగలు, పులులు పశువులఁదీసికొని పోకుండనుండుటకుఁ (౪-౩) జెప్పఁబడిన సూక్తములు చూడఁదగినవి.

ఆరోగ్యము, ధనము, అభివృద్ధికల్గుటకును అనిష్టములు తొలఁగుటకును, సాధారణముగా వ్రాయఁబడిన సూక్తములు పెక్కులు కలవు. ధనసంబంధమైన సూక్తములుమూఁడు (౧-౧౫; ౨-౨౬; ౧౯-౧) సాంస్రావ్య హవిః కాలమందు నుపయోగింపఁబడును. అవి సంపత్ సర్వస్వము నిచ్చునఁట!

౧. నవగృహ ప్రవేశమంత్రము

(౩-వ కాండము ; ౧౨-వ సూక్తము)

౧. ఇచ్చటనే నేను స్థిరమైన శాలను నిర్మించితిని. అది ఘృతమును (సంపత్తును) ఇచ్చుచు క్షేమముగ నుండును గాక. ఓశాలా (గృహమా)! మేమందఱము వీరులమై, సువీరులమై, అరిష్టవీరులమై, (రోగరహిత వీరులమై) నీలోఁ గాపురముందుము.

౨. ఓశాలా! నీవు ఇచ్చటనే అసంఖ్యాశ్వములు, గోవులుగలదానివిగను, సూనృతవతివిగను, ఊర్జస్వతివిగను (ప్రభూతాన్న వతివిగను), ఘృతవతివిగను, పయ

స్వినివిగను, ధ్రువవై (అచలవై) యుండి, మాకు మిక్కిలి సౌభాగ్యము కలుగఁజేయుము.

౩. ఓశాలా! నీవు ప్రశస్త స్తంభములు కలదానవు, గొప్పకప్పుకలదానవు. పవిత్రమైన ధాన్యము గలదానవు. వత్సము, కుమారుఁడు సాయంకాలము తిరిగి వచ్చిన పాలిచ్చు యావులు నీయొద్దకు వచ్చునుగాక.

౪. (గృహనిర్మాణ పద్ధతులను జక్కఁగ) నెఱిఁగి సవిత, వాయువు, ఇంద్రుఁడు, బృహస్పతి, యీయింటిని నిర్మించుదురు గాత. మరుత్తులు దీనిని ఉదకముతోడను, నేతితోడను నింపుదురు గాత. రాజైన భగుఁడు మాకృషిని బాగుచేయుఁగాత.

౫. మాననీయుఁడగు వాస్తుపతి భార్యవైన యో శాలా! నిన్ను శరణాగత రక్షిణివిగను, సుఖకరివిగను దేవతలు పూర్వము నిర్మించిరి. నీవు తృణాచ్ఛాదన కలదానవై మాయెడలఁ బ్రసన్నురాలవుకమ్ము. మాకు వీరులను, ధనమును, ఇమ్ము.

౬. దూలమా! నీవు క్రమమైన పద్ధతిని శాలామధ్యస్తంభము ఎక్కు. ఉగ్రుఁడవై మాశత్రువులను వెడలఁగొట్టుము. నీయందు నివాసముండువారు, ఆర్తులుగాక యుందురుగాత. మేమందఱము వీరులము. నూఱేండ్లు బ్రతికియుందుము.

౭. ఈ యింటికి తరుణుఁడైన కుమారుఁడు, ఆవులతోఁగూడ వత్సలు, మధువుతో నిండిన కుండలు, పెరుగుతోఁ గూడిన కలశములు వచ్చును గాక.

౮. ఓయాఁడుదాన! నేతితోనిండి యమృతధార కారుచున్న యీకుంభమును తీసికొనిపో. త్రాగువారికి నమృతము పోయుఁడు. ఈశాల శ్రౌతస్మార్తకర్మను రక్షించును. చోరాగ్న్యాది భయములవలన రక్షించును.

౯. రోగములను బోఁగొట్టు నీ జలమును నేను తీసికొని పోవుచున్నాను. అమృతమైన అగ్నితోఁగూడ నేను గృహము ప్రవేశించుచున్నాను.

౨. బీజాభివృద్ధికొఱకు *

(౬-వ కాండము ; ౧౪౨-వ సూక్తము)

౧. ఓధాన్యమా! లే (ఎత్తుపెరుగుము), అనేకవిధములు కమ్ము (అభివృద్ధికమ్ము), స్వమహిమచే లోకమందలి పాత్రలనన్నిటి నింపు. ఆకాశమందలి పిడుగు నిన్ను నాశనము చేయకుండును గాక.

౨. ధాన్యరూపకదేవా! మేము నిన్ను ప్రార్థించినప్పుడు విని ఆకాశమంత యెత్తు పెరుగుము. సముద్రమంత అక్షయముకమ్ము.

౩. ఓధాన్యమా! నీసేద్యగాండ్రు అక్షయులు (తరగని ధాన్యముగలవారు) అగుదురు గాక. ధాన్యరాసులు, అక్షయమగుఁ గాక. నిన్ను నిచ్చువాఁడును, అనుభవించువాఁడును అక్షయధాన్యవంతుఁడగుఁ గాక.

౯. ప్రాయశ్చిత్తాని

దోషపరిహారార్థము చేయుకర్మ ప్రాయశ్చిత్తము. మానవుని నిత్యప్రవర్తనమందును నిత్యకర్మాచరణమందును, పెక్కులోపములుండవచ్చును. వానికి ప్రాయశ్చిత్తములుండ వలెను. తల్లిదండ్రుల విషయమై యాచరించిన పాపములు (౬.౧౧౬), ఋణము నెగఁగొట్టుట (౬.౧౧౭), మరుపువలన జరిగిన దోషములు (౭.౧౦౬), నిలుచుండి మూత్రోత్సర్జనము చేయుట (౭.౧౦౨), తమ్ముఁడు అన్నకంటెఁ బూర్వము వివాహముచేసికొనుట (౬.౧౧౨-౧౧౩) మొదలయిన స్వాచరణమందలి దోషములకుఁ బ్రాయశ్చిత్తములు పెక్కులు చెప్పఁబడి యున్నవి. ఇట్టిమంత్రముల పఠించుటయే ప్రాయశ్చిత్తము. ఇట్టివిగాక యజ్ఞ

* విత్తనము చల్లునప్పుడు చదివెడు మంత్రము.

యాగాదికర్మల యందుఁగలుగు లోపముల వలనఁ గలుగునట్టి దోషములు పోవుటకై యెన్నియో సూక్తములు రచింపఁబడినవి. ఇట్టివి ౪౦ సూక్తములకంటె నెక్కుడుగలవు. ౬-వ కాండమునందు (౧౧౦-౧౨౧), పండ్రెండుగలవు. సంహితలోని పెక్కుసూక్తములలో నవి ప్రాయశ్చిత్త విషయములని స్పష్టముగ లేకపోయినను, తరువాత వెలసిన సూత్రకారులు ప్రాయశ్చిత్త ప్రకరణమును నెక్కువగఁ బెంచిరి. వైతాన సూత్రమునందు ప్రాయశ్చిత్త విషయమై ఆఱు కండికలు, ఉన్నవి.

ఇవన్నియు మానవులు చేయుదోషములకుఁ బ్రాయశ్చిత్తములు. మానవుని దోషము లేకయే సంభవించు పాపములకు (౬.౬౩), ఆధివ్యాధులకు (౬.౧౧౦), దుస్స్వప్నములకు (౬.౪౬; ౭.౨౩), దుష్టపక్షులు మొదలయినవి కినఁబడిన శకునములకుఁ (౬.౨౭) గూడఁ బ్రాయశ్చిత్తములు చెప్పఁబడినవి.

౧. పాప పరిహారార్థము ప్రాయశ్చిత్తము

(౬-వ కాండము, ౧౧౩-వ సూక్తము)

౧. దేవతలీపాపమును త్రితో (దేవతావిశేషము) మీఁదఁగడిగిరి. త్రిత ఆపాపమును మానవులమీఁదఁ బాఱవైచి కడుగుకొనెను. కావున నన్ను గ్రాహి (పాపదేవత) ఆశించెను. మంత్రములతో దేవతలు దానిని పోఁగొట్టుదురుగాత.

౨. ఓ పాపమా! కిరణములఁ బ్రవేశింపుము; ధూమములోనికిఁ బొమ్ము. మేఘమునందుఁ జొరఁబడుము. మంచులోఁ జేరుము. నదులమీఁది నురుగులోఁ గలిసి పొమ్ము. ఓ పూషన్! భ్రూణహత్యచేసిన వానిదోషముఁ బోఁగొట్టుము.

౩. త్రితచే నపమృష్టమైన మానవుని పాపము పండ్రెండుచోట్లఁ బెట్టఁబడినది. కావుననిన్ను గ్రాహి (పాపదేవత) పట్టుకొన్నయెడల నీ దేవతలు మంత్రములతో దానిని బోఁగొట్టుదురుగాత.

౨. దుస్స్వప్నదోష నివృత్తి ప్రాయశ్చిత్తము

(౬-వ కాండము; ౪౬-వ సూక్తము)

౧. ఓస్వప్నమా! నీవు చచ్చినదానవు కావు; బ్రతికినదానవు కావు. నీవు దేవతలకు బంగారుకడుపువు. వరుణాని (వరుణునిభార్య) నీకుతల్లి; యముఁడు నీకు తండ్రి; నీ పేరు, అరరు.

౨. ఓ స్వప్నమా! నీపుట్టుకను మే మెఱుంగుదుము; నీవు దేవతాస్త్రీలకు పుత్రుఁడవు. యమునికి నీవొక సాధనము (కరణము). నీవు అంతకుఁడవు, మృత్యువవు. ఇట్లు నిన్ను మేము చక్కఁగ నెఱుంగుదుము. దుస్స్వప్నభయమునుండి మమ్మురక్షింపుము.

౩. అప్పు పదునాఱవపాలు, ఎనిమిదవపాలు, అంతయు, నిచ్చివేయుదుమో అట్లే దుస్స్వప్నదోషములన్నియు మాశత్రువులకు నిచ్చి వేసెదము.

౧౦ సృష్టి, తత్త్వ సూక్తములు

సృష్టియందలి స్వాభావిక శోభలను వర్ణించుటయు, వానిని బట్టి సృష్టికర్తయొక్క గుణాదుల నూహించి స్తుతించుటయు మానవజాతికి సహజము. సూర్యుఁడు, ఉషస్సు, మేఘములు మొదలైన వాని శోభలు ఋగ్వేదాదికములలో వర్ణింపఁబడియున్నవి. తిట్లు, శాపములు, మంత్రములు, తంత్రములు మొదలైన వానితో నిండియున్న అథర్వ వేదములోఁగూడ నచ్చటచ్చట నిట్టిపవిత్రమైన వర్ణనములఁ జూచిన

మనస్సునకు నెంతయో యానందమే కలుగును. ఇట్టి మహిత్రము లీ వేదమునం దెట్లు వచ్చెనాయని యాశ్చర్యముకూడ కలుగును! స్వాభావిక వైచిత్ర్యమును వర్ణించు సూక్తములు కొన్ని ఉన్నతములైన కవిత్వస్ఫూర్తికి నిదర్శనములుగ నుండును. ఇట్టి వానిలో 'పృథ్వీసూక్త' మను నది మిక్కిలి కొనియాడఁదగినది. ఇందు మనకు సర్వవిధముల నాధార భూతమైన పృథ్వి స్తుతింపఁబడినది. ఇది యఱువది మూఁడు ఋక్కులుగల పెద్ద సూక్తము. ఇట్లె అంతరిక్షము (౧.౩౨), సూర్యుఁడు (౧౩), మొదలగు ప్రకృతి పదార్థములు చక్కఁగ స్తుతి రూపమున వర్ణింపఁబడినవి.

ఇట్లు స్వభావ వర్ణనములుగాక పరతత్త్వ విచార సంబంధమైన సూక్తములు కూడఁ గలవు. ఉపనిషత్తులలోఁ గానవచ్చెడియుచ్చతరమైన తత్త్వవిచార మిందుఁగానరాదని వేఱుగఁ జెప్ప నక్కఱలేదు. ఋగ్వేదములోను వలెనే అగ్ని, ఇంద్రుఁడు ద్యావాపృథివి, సవిత, వరుణుఁడు, ఉషస్సు మొదలైన దేవతలు, ఈ వేదమునందును స్తోత్రములను బడసియున్నారు. వీరిని వేఱు వేఱు దేవతలుగాఁ బొగుడుటయేకాక ప్రపంచమంతకును ఏకకర్తయున్నట్లెంచి, యాయాది మతత్త్వము, ఒకప్పుడు సూర్య రూపముగను (౧౩-వ కాండము), ఒకప్పుడు కాలరూపముగను (౧౯. ౫౩, ౫౪), ఒకప్పుడు బ్రహ్మచారి రూపముగను (౧౧. ౫), ఇట్లు వేర్వేఱునామములతో స్తుతింపఁబడియున్నది. బ్రహ్మచారి సూక్తము బ్రాయునుద్దేశ్యము బ్రహ్మచారినిఁ బొగుడుటయైనను 'బ్రహ్మచారినుండియె సమస్త ప్రపంచము పుట్టినది, అతని మహిమచేతనే లోకములోని మంచికర్మలన్నియు జరుగుచున్నవి' యని వ్రాయుటవలన, లోకమందుఁ గానవచ్చెడి యుదాత్తవస్తువులన్నియు, సృష్టికర్తయొక్క యపరరూపములేయని కవియొక్క యాశయముగాఁ గానవచ్చుచున్నది. ఈశ్వరునియొక్క సర్వవ్యాపిత్వ సర్వశక్తిత్వములను చక్కఁగవర్ణించునట్టి 'కంవో దేవాయహవిషా విధేమ' (ఏదేవునకు హవిస్సు నిచ్చెదము) అను ఋగ్వేద సూక్తము(౧౦. ౧౨౧), ఈ వేదమునందు కొద్దిమార్పులతో గ్రహింపఁబడినది (౪. ౨.). ఇది యెంతయో గంభీరమైన సూక్తము. ఇట్లే ఋగ్వేదమునందలి పురుషసూక్తము (౧౦. ౯౦), ఈ వేదమునందుఁ గొన్ని మార్పులతోఁ బఠింపఁబడినది (౯. ౬.).

ఋగ్వేదమునుండి గ్రహింపఁ బడనదియు, కేవలము ఆథర్వణిక మనఁదగినదియు నగు సూక్తమొకటి (౪. ౧౬), ఈవేదమునందుఁ గలదు. దానికి 'వరుణ సూక్తము' అని పేరు. ఇందు 'వరుణుఁడు' పరబ్రహ్మగా గ్రహింపఁబడి, యతని సర్వవ్యాపిత్వము మిక్కిలి యుదాత్తముగఁ జెప్పఁబడినది. కాని యాథర్వణికభావన యుండవలయునని కాఁ

బోలు నిట్టిసర్వ వ్యాపిత్వముయొక్క ఫలము, తన శత్రుండెక్కడికి వెళ్లినను వానిని కట్టివేయుటగాఁ జెప్పఁబడినది. ఇట్టి స్పష్టార్థ సూక్తముగాక, స్పష్టముగ నర్థము కానట్టి గూడార్థములుగల సూక్తములు పెక్కులు పరతత్త్వమును గుఱించినవి కలవు (౧౧-౮). ఈ సూక్తము మానవుని శరీరావయవములను గుఱించినది. ఇందు నీక్రింది వాక్యములుగలవు. 'ఇంద్రుఁడు, సోముఁడు, అగ్ని, త్వష్ట్రి, ధాత; యెక్కడినుండి పుట్టిరి? ఇంద్రుఁడు ఇంద్రునివలన, సోముఁడు సోముని వలన, అగ్ని అగ్నివలన, త్వష్ట్రి త్వష్ట్రివలన, ధాత, ధాత వలనఁ బుట్టిరి......తొడలు, మోకాళ్లు,తల, చేతులు, ముఖము, ప్రక్కయెముకలు,ప్రక్కలు—వీని నన్నిటిని నెవఁడు సంధించెను?' ఇట్టి గూడార్థ సూక్తములకు భాష్యకారులు తమతమ యిష్టానుసార మర్థముల వ్రాసెదరు.

౧ పృథ్వీసూక్తము

(౧౨-వ కాండము ౧ వ సూక్తము)

౧. గొప్పసత్యము, ఉగ్రమైన ఋతము, దీక్ష, తపస్సు, యజ్ఞము - ఇవి యీపృథివిని ధరించుచున్నవి. భూత భవిష్యత్తులకుఁ బత్నియైన యీభూమి మనకు విశాలమైన స్థలమును ఇచ్చుఁగాక.

౨. ఈ భూమి యెక్కువ జనులతో నిండియుండ లేదు; ఇందు ఎత్తు ప్రదేశములు, ప్రవాహములు, మైదానములు పెక్కులుకలవు; అనేక గుణములు కలిగినట్టి యోషధులిందుపై నున్నవి. అట్టి పృథివి మనకు విశాలమై శోభనకరమగుగాక.

౩. ఏభూమిపై సముద్రము, నది, నీళ్ళు కలవో, దేనిమీఁద అన్నము, పొలములు పుట్టినవో, దేనిమీఁద ప్రాణముగలవి, కదలునట్టివి, జీవించుచున్నవో యాభూమి మాకు మొదట త్రాగుట (ఇతరులకంటె శ్రేష్ఠత్వము) నిచ్చునుగాక.

* * * * *

౫. దేనిమీఁద పూర్వము మనపూర్వులు నివసించియుండిరో, దేనిమీఁద దేవతలు అసురులను గెలిచిరో, ఏది గోవులకు గుఱ్ఱములకు, పక్షులకు నాధారమో, యట్టిపృథివిమాకు భాగ్యమును వర్చస్సును ఇచ్చుఁగాక.

౬. విశ్వమును భరించునది, సంపత్తు నిచ్చునది, గట్టిగానిల్చియున్నది, బంగారు వక్షములుకలది, సమస్త ప్రాణికోటికి విశ్రాంతి స్థలము, అగ్నివైశ్వానరుని భరించునది, ఇంద్రుని పత్ని, అయిన భూమి మాకు ద్రవిణమిచ్చుఁగాక.

* * * * *

౯. దేనిమీఁద (నదీరూపమైన) జలము రాత్రియుం బగల్లు పొరబాటులేకుండ సంతతము ప్రవహించుచుండునో, యట్టి భూమిమాకు పాలధార లనేకము లిచ్చుఁగాక; వర్చస్సును మాపైఁజల్లుఁగాక.

౧౦. దేనిని అశ్వినులు కొలిచిరో, దేనిపై విష్ణువు పాదమిడెనో, శచీపతి ఇంద్రుఁడు దేనిని తనకొఱకు శత్రురహితఁగఁజేసెనో, యట్టిభూమి, పుత్త్రినకు మాత వలె, నాకు పాలు ఇచ్చునుగాక.

౧౧. ఓ పృథివి! నీగుట్టలు, హిమవంతములైన పర్వతములు, అరణ్యము, ఆనంద కరములగుఁగాక. బభ్రు (కపిల) నల్లని, ఎఱ్ఱని, నానావర్ణములు కలదియు, ఇంద్రునిచే రక్షింపఁబడునదియు నగు ధ్రువమైన భూమి మీఁద నేను, అజేయుఁడను, అనాహతుఁడను, గాయము తగలనివాఁడనుగా నధి వసించియున్నాను.

౧౨. ఓ భూమి! నీమధ్య భాగమెద్దియో, నీ నాభియెద్దియో, అచ్చట మమ్ము నుంచుము; నీశరీరమునుండి యేపౌష్టిక పదార్థములు పుట్టెనో, వానిలో

మమ్ము నునుచుము. మమ్ము పూతులను జేయుము, భూమి తల్లి, నేను పుత్త్రుడను, పర్జన్యుడు తండ్రి, అతడు మమ్ము రక్షించుగాత.

౧౩. ఏభూమిపై వారు యజ్ఞవేదులను స్థాపించిరో, ఏభూమిపై మానవులందఱును క్రతువులను అభివృద్ధి చేసిరో, ఏభూమిపై క్రతువు నెదుట నిలువబడి యున్న ప్రకాశవంతములైన, యూపములు నిలుపఁబడెనో, యట్టిభూమి తాను అభివృద్ధియై మాకు నభివృద్ధిఁ గలుగఁజేయుఁగాక.

౧౪. ఓ భూమి! మమ్ము ద్వేషించువానిని, మాతోఁ బోరాడువానిని, మనస్సుతోగాని శస్త్రముతోగాని మమ్ము పీడించువానిని, వానికార్యము ఫలింపకమునుపే మాకు స్వాధీనునిఁ జేయుము.

౧౫. నీయందుఁబుట్టిన మర్త్యులు నీమీఁదఁ దిరుగుచుందురు. ద్విపాదులను చతుష్పాదులను నీవు భరించెదవు. ఎవరిమీఁద నుదయించు సూర్యుఁడు తన కిరణములచే శాశ్వతమైన ప్రకాశమును బ్రసరించునో యట్టి యీయైదువిధములైన మానవులు నీవారే.

* * * * *

౧౭. నిశ్చలము, విశాలము, ఓషధుల కన్నిటికిఁ దల్లి, ధర్మముచే (నియమముచే) ధరింపఁబడినది, అయిన భూమిమీఁద మేము శుభము కలవారముగను, ఆనందముగను, తిరుగుదుము గాక.

* * * * *

౨౩. ఓపృథివి! నీయందుఁబుట్టిన సుగంధమును ఓషధులు, నీళ్ళు, గ్రహించినవి. గంధర్వులును, అప్సరసలును, దానిని భజించిరి. నన్ను ఆసుగంధముతో నింపివేయుము. నన్ను నెవఁడును ద్వేషింపకుండును గాక.

౨౪. నీలోత్పలమునందుఁ బ్రవేశించిన నీసువాసనయు, సూర్యవివాహమప్పుడు అమర్త్యులు మొదట సంపాదించిన సువాసనయు, నాకుఁ గలుగఁజేయుము. మమ్ము నెవరును ద్వేషింపకుండుదురు గాక.

* * * * *

౨౯. శుద్ధయు, క్షమాశీలయు, బ్రహ్మతేజస్సుచే నభివృద్ధినొందినదియు నగు భూమితో నేను మాట్లాడుచున్నాను. ఓభూమి! శాంతి, పుష్టి, ఆహారము, నేయి, యిచ్చినట్టి నీయందు వాసము చేయుచున్నాము.

* * * * *

౩౨. పశ్చిమమునుండి మమ్ము వెడలఁగొట్టఁ బోకుఁడు; తూర్పునుండి మమ్ము వెడలగొట్టఁ బోకుఁడు; ఉత్తరమునుండి వెడలఁగొట్టఁ బోకుఁడు; దక్షిణమునుండి వెడలఁగొట్టఁబోకుఁడు. మాకు నీవాధారముకమ్ము. బాటదొంగలు మాయొద్దకు రాకుందురుగాక. వారిభయంకరమైన శస్త్రములు దూరముండుండుగాక.

* * * * *

౩౫. భూమి! నీలో నేను త్రవ్విన భాగము త్వరలో మరలఁ బూర్తియగును గాక. ఓపవిత్రమైనభూమి! నీప్రాణములుగాని, హృదయముగాని నేను పొడవక యుండును గాక.

౩౬. ఓభూమి! సంవత్సరమునందుఁ గ్రమముగా వచ్చు నీవసంతము, గ్రీష్మము, వర్షము, శరత్తు, హేమంతము, శిశిరము అను ఋతువులు, రాత్రియుంబవళ్లు, మాకుఁ బాలనిచ్చునవి యగుఁగాక.

* * * * *

౪౦. మేము కోరెడు ధనమును ఈభూమి మాకుఁ జూపునుగాక; భగుఁడు సాయము చేయుఁగాక; ఇంద్రుఁడు ముందుఁబోవుగాక.

* * * * *

౪౨. ఏభూమిమీఁద, అన్నము, వడ్లు, యవలు కలవో, దేనిపై పంచవిధమానవులు నివసింతురో, ఏది పర్జన్యుని భార్యయు, వానిచే పుష్టిగలదియు నయ్యెనో యట్టి భూమికి నమస్కారము.

* * * * *

౪౪. ఈభూమి రహస్య స్థలములలో ననేక విధములయిన ధనమ్ము, మణులు, బంగారము, దాచియుంచి

నది. వానిని నాకు నిచ్చునుగాక; ధనము నిచ్చునదియు నగు (భూ) దేవత మాకు ధనము నిచ్చుఁగాక.

౪౫. పెక్కుభాషలు, పెక్కుమతములు, పెక్కు నివాసములుగల మనుజులుగల యీభూమి, నమ్మిక గలదియు తన్నునిదియునగుపాడి యావువలె నాకు ధనముయొక్క వేయిధారలు పితుకుఁ గాక.

*   *   *   *   *

౪౭. నీమీఁదనున్న కాలిత్రోవలు, బండిత్రోవలు, రథమార్గములు, మంచివారికిఁ జెడ్డవారికి నుపయోగ పడుచున్నవి. ఇట్టి త్రోవలలో శత్రువులు లేకుండ, దొంగలు లేకుండ, క్షేమము నడచెదముగాక. నీలో శుభ ప్రదమేదియో దానిని మాకిమ్ము.

*   *   *   *   *

౫౬. భూమిమీఁదనున్న గ్రామములలో, అరణ్యములలో, సభలలో, జన సమూహములలో, సమితులలో మేము నీకు ప్రియమైనట్లు మాటలాడుదుము గాక.

*   *   *   *   *

౫౯. శాంతి, సువాసన, ఆనందము కలదియు, తన పొదుగులో తియ్యనిపానీయము కలదియు, సమృద్ధిగఁ బాలుకలదియు నగు భూమి నన్ను ఆశీర్వదించును గాక.

*   *   *   *   *

౨ వరుణసూక్తము

(౪-వ కాండము; ౧౬-వ సూక్తము)

౧. గొప్పవాఁడును, ఈలోకముల కన్నిఁటికి నియంతయు నగు వరుణుఁడు, రహస్యముగఁ బోవుచున్నవానినిగూడ దగ్గర నున్నట్లు చూచును; ఇదంతయు దేవత లెఱుఁగుదురు.

౨. నిలుచున్న వానిని, నడుచువానిని, మోసము చేయువానిని, రహస్యముగఁ జరించువానిని, దుర్మార్గవృత్తిని జరించువానిని వరుణుఁడు చూచును; ఇద్దఱు రహస్యముగ మాట్లాడునప్పుడు మూఁడవవాఁడగు రాజు -వరుణుఁడు- వినును.

౩. ఈభూమి, గొప్పదైనదియు మిక్కిలి విశాలమైనదియు నగు ఆకాశమును, రాజయిన వరుణినివియే; రెండు సముద్రములు వరుణుని ఉదరములు; ఈ కొద్ది జలమునందు నిలీనుఁడై యున్నాఁడు.

౪. ఎవఁడైన నాకాశముదాటి మిక్కిలి దూరము పోయినను, వరుణరాజు చేతినుండి వాఁడు తప్పించుకొనలేఁడు; ఇతని చారులు స్వర్గలోకము నుండి బయలుదేరి భూలోకమునఁ జరించెదరు. వేయికనులతో భూమినిఁ జూచెదరు.

౫. భూలోక స్వర్గలోకములకు నడుమనున్న దానిని వెలుపలనున్న దానిని వరుణరాజు చక్కఁగఁజూచును; లోకుల కనురెప్ప పాటులను అతఁడు లెక్కించును; జూదరి అక్షములనువలె నతఁడు వీనిని వేయును.

౬. ఓవరుణా! నీసప్తసప్త పాశములు మూఁడువిధములుగ జాల (వల) వలె బద్ధములైయున్నవి; పాపులను హింసించును; అసత్యమాడువారిని వానిచే బంధింపుము; సత్యవాదులను బంధింపకుము.

౭. అనృత వాక్కుఁగలవాని, మనుష్యులను జూచునో వరుణా! నూఱు పాశములచే బంధింపుము; వదల వద్దు; అపాపపరుఁడు జలోదరరోగముగలవాఁడై, చుట్టుకోయఁబడిన యోడవలె నుండుఁగాక.

౮. వరుణుఁడు వ్యాధులను తెచ్చును, వ్యాధులను బోఁగొట్టును; వరుణుఁడు స్వదేశజుఁడు, విదేశజుఁడు; వరుణుఁడు దేవుఁడు, మానవుడు.

౯. ఓరి (మాశత్రుఁడైన) అముక (ఫలానా) నామముకలవాఁడా! అముక వంశమువాఁడా! అముక మాతృపుత్రుఁడా! ఇవన్నియు-ఈ పాశము లన్నియు- నీకొఱకు నేర్పాటు చేయనైనది.

సంస్కారములు రెండువిధములు: శ్రౌత సంస్కారములు, గృహ్య సంస్కారములు.

౧౧ సంస్కార సంబంధమైన సూక్తములు

ఇవి వేదమంత్ర రచనా కాలమున నింత స్పష్టముగ విడివిడిగ లేక పోయినను, తరువాత సూత్రకారులు వానిని విడఁదీసిరి. 'ఈ మంత్రము హోమ సమయమున నుపయోగింపవలసినది, ఈ మంత్రము పెండ్లి సమయమున నుపయోగింపవలసినది' అని వారు విభజించిరి. కాని మూలమందు మనకు నివి శ్రౌతవిధికి, ఇవి గృహ్యవిధికిఁ బుట్టినవని తెలిసికొనుటకు నంతగా వీలుండదు. అథర్వవేదము, మొదట యజ్ఞమునకై పుట్టక పోయినను, అందు నచ్చటచ్చట యాగము చేయుటను గుఱించిన మంత్రములు కానవచ్చును (౬.౪౭-౪౮). సోమపానమునకు, ఇంద్రుని బిలుచుటయుఁ గలదు (౨.౫.౬). సవనాదులుకూడఁ బేర్కొనఁబడినవి. హావిర్ధానములు పెక్కుచోట్ల చెప్పఁబడియున్నవి. 'సాంస్రావ్య హావిస్సులు' (ధనమునిచ్చునవి ౧,౫; ౨.౨౬; ౧౯-౧), 'యశో హావిస్సులు' (యశస్సు నిచ్చునవి ౬.౩౯), సప్తర్షి హావిస్సులు (౬.౬౦), సమాన హావిస్సులు (సఖ్యత కలుగఁజేయునవి ౬.౬౪), ఇట్టివి పెక్కులు గలవు. ఇట్లు శ్రౌతవిధు లచ్చటచ్చట నథర్వవేదమునందుఁ గాన వచ్చును. గృహ్యసంస్కారములను గుఱించి 'స్త్రీకర్మాణి' అను ౩-వ ప్రకరణమునందుఁ గొంత చెప్పితిమి గాన విస్తర భీతిచేత విరమించెదము.

౧. ఇంద్రుని సోమపానమునకు నాహ్వానము

(౨-వ కాండము; ౫-వ సూక్తము)

౧. ఇంద్రుఁడా ! ప్రీతుఁడవుగమ్ము, అభిలషించిన ఫలమును మిక్కుటముగఁ బొందుము. ఓశూరుఁడా ! నీరెండు గుఱ్ఱములతో రమ్ము. తియ్యనిదియు, పిండఁబడినదియు, ప్రశస్తమైనదియు నగు సోమమును త్రాగుము. చక్కనిదియు, నిర్మలమైనదియునగు సోమము మత్తును గలిగించును గాక.

౨. ఇంద్రుఁడా ! క్రొత్తవానివలె, నీవు ఈతియ్యని అమృతముఁబోలిన సోమముతోఁ బొట్టపూర్తిగనింపుకొనుము; ఈపిండఁబడిన సోమముయొక్క మదకరములైనట్టియు, సువాక్కులతోఁ గలిసియున్నట్టియు రసములు స్వర్గములోవలెనే యిక్కడను నీతోవచ్చును గాక.

3. ఇంద్రుఁడు శీఘ్రవిజయశాలి, మిత్రుఁడు. యతులనెడి అసురులనువలె వృత్రునిఁజంపెను; భృగునివలె వలుని భేదించెను, సోమముయొక్క మత్తుమీఁద శత్రువులను పరిభవించెను.

౪. ఇంద్రా ! పిండఁబడిన సోమములు నీలోఁజేరును గాక; వానితో నీరెండు కుక్షులు నింపుకొనుము; వృద్ధిఁజెందుము; మాపిలుపులకు మాయొద్దకురమ్ము; మా ఆహ్వానమును వినుము; నా (స్తుతిరూపమైన) వాక్కును సేవించుము; ఇచ్చట స్వకీయులతో (సోమపానముచే) తృప్తిఁబొందుము; గొప్ప కర్మకొఱకు (తృప్తిఁబొందుము).

౫. వజ్రముతో నింద్రుఁడు మొదటచేసిన వీరకర్మములు చెప్పెదను; అతఁడు అహిని (మేఘమును, లేక వృత్రుని) జంపెను; తరువాత నీటిని విదారించెను; పర్వతముల సంబంధినదులను భేదించెను.

౬. పర్వతము నాశ్రయించిన పామును (వృత్రాసురిని లేక మేఘములను) చంపెను: త్వష్ట్రి వీనికిఁ దీక్ష్ణమైన వజ్రమును సానబట్టి యిచ్చెను; అఱచుచున్న గోవులవలె ప్రవాహముల నీరు వెంటనే సముద్రము ప్రవేశించెను.

౭. ఎద్దువలె నాచరించి యింద్రుఁడు సోమము నువరించెను; త్రికద్రుక (సత్రములందు) సోమము త్రాగెను; (త్రాగిలబ్ధబలుఁడై) వజ్రమును ధరించెను; అహులలో మొదటి వాఁడగు వీనిని వధించెను.

౧౨. వేఱువేఱువిషయములను గుఱించినవి

అథర్వ వేదముయొక్క మొదటి ౧౮ కాండములను మూఁడు తరగతులుగ విభజింపవచ్చును. ౧-వ కాండము మొదలుకొని ౭-వ కాండము వఱకు మొదటి తరగతి. ఇందు విషయ వివక్షత లేకుండఁ జిన్నచిన్న సూక్తములు చేర్పఁబడినవి. ౮-వ కాండము మొదలు ౧౨-వ కాండమువఱకు రెండవ తరగతి. ఇందు విషయ వివక్షత లేకుండఁ బెద్దపెద్ద సూక్తము లొక్కచోటఁ జేర్పఁబడినవి. ఈ రెండు విభాగములలోను పూర్వసూక్తమునకుఁ బరసూక్తమునకు విషయ సంబంధ మేమియునుండదు. కాండమంతయు విషయ సంబంధమున కలగూరగంపవలె నుండును. మూఁడవ తరగతి ౧౩-వ కాండము మొదలుకొని ౧౮-వ కాండము వఱకు. ఈ కాండములు (౧౫, ౧౬ తప్ప) విషయముననుసరించి యేర్పాటు చేయఁబడినవి. ఒక్కొక కాండమందు ముఖ్యముగ నొక్కొకవిషయము చర్చింపఁబడును. ౧౩-వ కాండమున రోహిత సూక్తములు, ౧౪-వ కాండమున వివాహ సూక్తములు, ౧౫-వ కాండమున వ్రాత్యస్తుతి, ౧౮-వ కాండమున నంత్యవిధులు, చెప్పఁబడి యున్నవి. ౧౬-వ, ౧౭-వ కాండములు మిక్కిలిచిన్నవి. మొదటి దానియందు రెండు సూక్తములును, రెండవ దానియందు నొక్కసూక్తమును, మాత్రము కలవు. ఈ రెండు కాండములును అంతముఖ్యమైనవికావు. ఇఁక ముఖ్యమైన కాండములను గుఱించి యధికముగ విచారింతము.

౧౩-వ కాండమున రోహిత ప్రశంస కలదు. రోహితుఁ డనగా నెఱ్ఱనివాఁడు. 'రోహిత' శబ్దోత్పత్తిని గుఱించియు నిందుఁ బెక్కువిధములఁ జెప్పఁబడినది. 'ద్యావాపృథివ్యాం రురోహేతి' భూమ్యాకాశమును బ్రాకినవాఁడు కావున 'రోహితుఁ'డనిపించుకొనెను, అని యొకచోనున్నది. మొత్తముమీఁదఁ జూచిన 'రోహితుఁ' డనఁగా సూర్యుఁడని తోచుచున్నది. రోహిణి, (సూర్య, ఉషస్సులు) వర్ణింపఁబడి యున్నది. ౧-వ సూక్తమందలి ౩౬-౪౪ మంత్రములు సూర్యుని రాక పోకలను గుఱించి చెప్పును. ౪౫-౫౫ లోఁగూడ సూర్యుని వర్ణనయే కానవచ్చును. రెండవ సూక్తమునందు సూర్యవర్ణన స్పష్టముగ నున్నది. నడుమ నడుమ రోహిత శబ్దముకూడ నుపయోగింపఁ బడినది (౧౩. ౨. ౨౫). మూఁడవసూక్తమునందు బ్రాహ్మణులకు నపకారము చేయువారిని రోహితుఁడు శిక్షించు

నని యు, నతఁడు బ్రాహ్మణపక్షపాతియనియుఁ జెప్పియున్నది. ఈగ్గోహిత వర్ణనము స్తోత్ర మువిూఁద, అథర్వ వేదమందలి యుత్తమ కావ్యములలో నొక్కటియని చెప్పుటకు సందేహము లేదు.

౧౪-వ కాండమందు వివాహ మంత్రములుకలవు. ఇందుఁ జాలభాగము ఋగ్వేదమందలి 'సూర్యా సూక్తము' (౧౦.౮౫) నుండి గ్రహింపఁబడినది. ఋగ్వేదమందలి యితర మంత్రములుగూడ తీసికోనఁబడినవి. (౧౦.౮౫.౧౦). ఋగ్వేదమునందు లేని మంత్రములుకూడఁ గొన్ని కలవు. ఈ కాండమునకు ఋషులు, ఆథర్వణులు. అయినను అనుక్రమణికా కారులు సూర్యుని పుత్రియైన సూర్యా దేవిని ఋషిగా నేర్పఱచిరి! వివాహ మంత్రముల యర్థము మిక్కిలి యాహ్లాదకరముగనుండును. కాని యివి నిజముగ ఋగ్వేదము నందలివి గనుక ఆ వేదమును గుఱించి వ్రాయునప్పుడు వీని విషయమై సవిస్తరముగఁ జెప్పఁబడును.

౧౫-వ కాండమున 'వ్రాత్య' మహిమ విశేషముగఁ జెప్పఁబడియున్నది. ఇది గద్యగనున్నది. వ్రాత్యుఁడనఁగా నుపనయనాది సంస్కార హీనుఁడైన పురుషుఁడు.* కావున యజ్ఞాది వేదవిహిత క్రియలకు అనధికారి. అతఁడు వ్యవహార యోగ్యుఁడు కాఁడన్న లోకవాడుకను మనస్సునందుంచుకొని 'వ్రాత్యుఁడధికారి; వ్రాత్యుఁడు మహానుభావుఁడు. వ్రాత్యుఁడు దేవప్రియుఁడు, బ్రాహ్మణ క్షత్రియులకు వర్చస్సునకు మూలము, దేవాధిదేవుఁడు' అని ప్రతిపాదింపఁబడినది. వ్రాత్యుఁ డెక్కడికిఁబోవునో యచ్చటికి విశ్వమంతయు, దేవతలును, వాని వెంట వెళ్లుదురు. వాఁడు కూర్చుండినఁ గూర్చుందురు, కదలినఁ గదలుదురు. వాఁడు రాజువలె నడుచును. ఇత్యాకములు చెప్పఁబడియున్నవి. ఇది యంతయు నందఱ వ్రాత్యులను గుఱించికాదు. విద్వాంసుఁడు, మహాధికారి, పుణ్యశీలుఁడు, విశ్వమాన్యుఁడు, అయినప్పటికి, కర్మపరులయిన బ్రాహ్మణులచే ద్వేషింపఁబడుచున్న యొకానొక వ్రాత్యుని గుఱించియై యుండవచ్చును*

*మనుస్మృతి. అధ్యా. ౨, శ్లో. ౩౮-౩౯.

* 'అత్ర కాండే వ్రాత్యమహిమా ప్రపంచ తే । వ్రాత్యోనామ ఉపనయనాది సంస్కార హీనః పురుషః। సోఽర్థాత్ యజ్ఞాదివేద విహితాః క్రియాః కర్తుంనాధికారీ । నసవ్యవహార యోగ్యశ్చేతి జనమతంమనసి కృత్య వ్రాత్యోఽధికారీ వ్రాత్యోమహానుభావో వ్రాత్యో దేవప్రియో వ్రాత్యో బ్రాహ్మణ క్షత్రియ యోర్వర్చసోమూలంకిం బహునా వ్రాత్యో దేవాధిదేవ ఏవేతి ప్రతిపాద్యతే । యత్రవ్రాత్యో గచ్ఛతి విశ్వంజగత్ విశ్వేచదేవా స్తత్ర తమను గచ్ఛన్తి తస్మిన్ స్థితే తిష్ఠంతి తస్మింశ్చలతి తేచలన్తి । యదాసగచ్ఛతి రాజివత్ సగచ్ఛతీత్యాది । నపునరేతత్ సర్వవ్రాత్యపరం । ప్రతిపాదనమపి తు కంచిత్ విద్వత్తమం మహాధికారం పుణ్యశీలం విశ్వసంమాన్యం కర్మపరైర్బ్రాహ్మణైర్విద్విష్టం వ్రాత్యం అనులక్ష్యవచనం ఇతిమన్తవ్యం.

[అథర్వసంహిత ౪-వ సంపుటము

అని అథర్వవేదమును సాయణ భాష్యము తోనచ్చొత్తించిన శంకర పాండురంగ పండితులవారు వ్రాసియున్నారు. సాయణాచార్యుల అభిప్రాయము కనుఁగొనుదమనిన నీ కాండముమీఁది వారి భాష్యము దొరకలేదు. భాష్య రహితముగనే యీ కాండము అచ్చు వేయఁబడియున్నది. కావున వ్రాత్యస్తుతి అథర్వ వేదమునందు నెట్లు వచ్చినది యన్నప్రశ్నకుఁ బూర్వాచార్యుల యభిప్రాయము కనుఁగొనుటకు వీలులేదు. మన్వాదుల యభిప్రాయాను సారము ఉపనయనాది సంస్కారములు లేని బ్రాహ్మణ క్షత్రియవైశ్యులు వ్రాత్యు లనఁబడుదురు. ఇంకను కొంచెము వెనకకుఁబోయి విచారించిన 'వ్రాత్యు' లని యొక జాతివారు ఆర్యులలోఁ జేరనివారు (కాని ఆర్యులలోఁ జేరఁదగిన వారు) న్నట్టు కానవచ్చుచున్నది. తాండ్య బ్రాహ్మణమునందు వ్రాత్యులు 'నహి బ్రహ్మచర్యం చరన్తి, నకృషిం నవాణిజ్యం', బ్రహ్మచర్యము చరింపరు, వ్యవసాయముచేయరు, వర్తకము చేయరు, అనిచెప్పఁబడియున్నది (౧౭.౧.౨). ఇట్టి వ్రాత్యులను ఆర్యులలోఁ గలుపు కొనుటకు వ్రాత్యస్తోమ మహా యజ్ఞముకూడ జెప్పఁబడి యున్నది. కావున మొదట 'వ్రాత్యు' లని యొక తెగవారుండిరనియు, వారిని నార్యులు ద్వేషించుచు, నిందించుచు నుండిరనియు, వారు విద్యాది కర్మములందు నార్యులకుఁ దీసిపోవువారు కారనియు, వారి పక్షమవలంబించి యొకఋషి (వారిలో నొక్కఁడై యుండిన నుండవచ్చును) ఈసూక్తమును రచించి వారిమహిమ వర్ణించెననియు; వారు క్రమక్రమముగ నార్యులలోఁ గలిసి పోయిరనియు, తరువాతఁ గొంతకాలమునకు, ఈ సూక్తములు అథర్వ వేదములలోఁ జేరెననియు మనమూహింపవలసియున్నది.

౧౮-వ కాండమునందు నంత్యవిధికిసంబంధించిన మంత్రములు కలవు. ఇందుఁ జాల భాగము ఋగ్వేదములోనిదే. ఆథర్వణికుల స్వంతము బహుస్వల్పము. ఋగ్వేద దశమ మండలమందుఁ బ్రఖ్యాతిచెందిన 'యమయమీసూక్తము' కూడ నిందు స్వీకరింపఁబడినది. యముఁడును యమియు కవలపిల్లలు, అన్నచెల్లెండ్రు. తనను వివాహము చేసికొనుమని యమి తన అన్ననడుగును. అతఁడు ఒప్పుకొనలేదు. వారి సంవాదమిందుండును; అంత్యేష్టి సంబంధములైన యప్పటి యాచారాదులు ఋగ్వేదము నందలివే గనుక నా వివరమచ్చటనే చూడనగును.

౧. రోహిత సూక్తము

(౧౩ వ కాండము; ౧-వ సూక్తము.)

౧. నీళ్లలో నున్న ఓవాజిన్ (బలవంతుఁడా) లెమ్ము; సూనృత వంతమైన యీ రాష్ట్రమును ప్రవేశింపుము; ఏ రోహితుఁడు ఈ విశ్వమును పుట్టించెనో వాఁడు నిన్ను రాష్ట్రమునకై చక్కఁగ భరించుఁ గాక.

౩. నీళ్లలో నున్న శక్తి వెలుపలికి వచ్చినది; నీలో నుండి పుట్టిన వాని నారోహింపుము; సోము నిధరించి, నీళ్లను, ఓషధులను, గోవులను, నాలుగు కాళ్ల జంతువులను, రెండు కాళ్ల జంతువులను ఇందుఁ బ్రవేశపెట్టుము.

* * * * *

౭. రోహితుఁడు ద్యావా పృథ్వులను ధరించెను. స్వర్లోకము వానిచేతనే స్థాపింపఁబడెను; అతనిచేతనే నాకలోకము (స్థాపింపఁబడెను); అంతరిక్షము, రజస్సులు అతనిచేఁ గొల్వఁబడెను; అతని వలననే దేవతలు అమృతమును దెలిసికొనిరి.

౮. రోహితుఁడు విశ్వరూపమును పరిశీలించెను; ఆరోహ ప్రరోహములఁ జేసెను; మహత్తరమైన మహిమచే ఆకాశము నెక్కి నీరాష్ట్రమును పయస్సు చేతను ఘృతము చేతను నింపుఁగావుత.

* * * * *

౨౨. రోహిణి రోహితునకు ననువ్రత (అనుకూలవతి), ఆమె సూరి (విద్వాంసురాలు), చక్కని వర్ణము కలది (సువర్ణా), గొప్పది (బృహతి), సువర్చస్సు గలది. ఆమె (యనుగ్రహము) వలన మనమనేక విధములయిన సామర్థ్యములను గెలిచెదము; ఆమె (యనుగ్రహము) వలన నన్ని సైన్యములను వశపఱచుకొనియెదము.

* * * * *

౨౪. ఆను పచ్చనివియు, కేతు మంతములును, అమృతత్వము గలవియు, నగు సూర్యుని గుఱ్ఱములు సుఖముగ రథము నెప్పుడును లాగుచుండును! నెయ్యి త్రాగువాఁడును, ప్రకాశవంతుఁడును, దేవుఁడును, అగు రోహితుఁడు ఆకాశమెక్కెను.

* * * * *

౩౫. రాష్ట్రమును భరించునే దేవతలు సూర్యుని వైపు వెళ్ళుదురో, వారితో నేకమై రోహితుఁడు మంచి మనస్సుకలవాఁడై నీకు రాష్ట్రము నిచ్చుగాక.

* * * * *

౩౭. సంపత్తు జయించినవాఁడును, గోవుల జయించినవాఁడును, ధనము జయించినవాఁడును, వేయిన్నెడు జన్మములు కలవాఁడు నయిన రోహితునియందు భూమియు నాకాశమును, ఆశ్రయించియున్నవి; నీ నాభి భువనముయొక్క మధ్యనున్నదని చెప్పెదను.

* * * * *

౩౯. అక్కడనుండి యిక్కడి సంగతుల నెఱుఁగుదువు; ఇక్కడనుండి అక్కడివానిఁ జూచెదవు; వారిచ్చటనుండి ప్రకాశవంతుఁడును చదువరియునగు సూర్యుని ఆకాశమునందుఁ జూచెదరు.

౪౦. దేవుఁడవై దేవతలను బాధపెట్టెదవు; అర్ణవమున లోపలఁజరించెదవు; సమానమైనయగ్నిని బ్రజ్వలింపఁ జేయుదువు; దీనిని పరము కవు లెఱుఁగుదురు.

* * * * *

౪౨. ఒక పదముగలది, రెండు పదములుగలది, నాలుగు పదములుకలది, ఎనిమిది పదములు కలది, తొమ్మిది పదములుకలది, ఆమె అయ్యెను; భువనము యొక్క వేయి అక్షరములుగల పంక్తి; అందుండి సముద్రములు పారెను.

* * * * *

౪౫. సూర్యుఁడు ఆకాశమును, సూర్యుఁడు భూమిని, సూర్యుఁడు జలములను బాగుగఁ జూచును. సూర్యుఁడు (మహా) భూతము (ప్రపంచము) యొక్క ఒకకన్ను; భూమిని, ఆకాశమును బ్రాకెను.

* * * * *

౪౭. చలివేడిమిని తీసికొని, పర్వతములను యూపములుచేసి, వర్షమును ఆజ్యముగ గ్రహించి, స్వర్గము నెఱింగిన రోహితుని రెండు అగ్నులు యజ్ఞముచేసెను.

* * * * *

౫౦. ఒకటి (అగ్ని) సత్యమునందు నుంచఁబడెను. ఇంకొకటి (అగ్ని) నీటియందుఁ బ్రజ్వలింపఁబడెను (ఇది బహుశఃవిద్యుత్తైయుండనోపు); స్వర్గమెఱింగిన

రోహితుని బ్రహ్మచే వేల్చఁబడిన రెండగ్నులు యజ్ఞముఁజేసెను.

*　　*　　*　　*　　*

౫౨. భూమిని (యజ్ఞ) వేదికగను, ఆకాశమును (యజ్ఞ) దక్షిణగను, ఉష్ణమును అగ్నిగను, వర్షమును ఆజ్యముగను కల్పించి, రోహితుఁడు ఆత్మగలవానిని (ప్రాణికోట్లను) జేసెను.

౨. వ్రాత్యసూక్తము

(౧౫-వ కాండము, ౪-వ పర్యాయ సూక్తము)

౧. ఎవరియింటికైనను విద్వాంసుఁడగు వ్రాత్యుఁడు అతిథిగావచ్చినయెడల

౨. స్వయముగా గృహస్థుఁడు అతనికెదురు పోయి యిట్లనవలెను:—వ్రాత్యుఁడా! నీ నివాసమేది? వ్రాత్యుఁడా! యిదుగో జలము; వ్రాత్యుఁడా! అవినీకు తృప్తిగలిగించుఁగాక; వ్రాత్యుఁడా! నీకుఁ బ్రియమెద్దియో యట్లగుఁగాక; వ్రాత్యుఁడా నీకు వశమెద్దియో యట్లగుఁగాక. వ్రాత్యుఁడా! నీకోరిక యెద్దియో యట్లగుఁగాక.

౩. 'వ్రాత్యుఁడా నీవాసమెద్ది' యన్నందున దేవయానమును పొందును.

౪. 'వ్రాత్యుఁడా యిదుగో జలము'యన్నందున జలము పొందును.

౫. 'వ్రాత్యుఁడా అవినీకు తృప్తిఁగలిగించుఁగాక' యన్నందున,దీర్ఘాయుస్సును జెందును.

౬. 'వ్రాత్యుఁడా నీకుఁబ్రియమెద్దియో యట్లగుఁగాక' యన్నందునఁ దన కేమిప్రియమో వానిఁబొందును.

౭. ఇట్లు తెలిసికొనిన వానియొద్దకుఁ బ్రియమువచ్చును, వాఁడు ప్రియునకుఁ బ్రియుఁడగును.

౮. 'వ్రాత్యుఁడా! నీకు వశమెద్దియో యట్లగుఁగాక' యన్నందున వానికి వశము వశమగును.

౯. ఇట్లు తెలిసికొనిన వానికి 'వశము' స్వాధీనమగును, వాఁడు వశులనుగూడ వశముచేసికొనును.

౧౦. 'వ్రాత్యుఁడా! నీకోర్కెయెద్దియో యట్లగుఁగాక' యన్నందున వాని కోర్కెలన్నియు సిద్ధించును.

౧౧. ఇట్లు తెలిసికొను వానియొద్దకు కోర్కె వచ్చును, వానికిఁగోర్కెలలోఁ గోర్కెలన్నియు ఫలించును.

౩. వ్రాత్యమహిమ

(౧౫-వ కాండము, ౬-వ పర్యాయ సూక్తము)

౧. ఎవనియింట్లో విద్వాంసుఁడైన వ్రాత్యుఁడు ఒకరాత్రి అతిథిగానుండునో

౨. వానికిఁ బృథ్వీమీఁదనున్న పుణ్యలోకములు ప్రాప్తించును.

౩. ఎవనియింట్లో విద్వాంసుఁడైన వ్రాత్యుఁడు రెండవరాత్రి అతిథిగానుండునో

౪. వానికి అంతరిక్షమందలి పుణ్యలోకములు ప్రాప్తించును.

౫. ఎవనియింట్లో విద్వాంసుఁడైన వ్రాత్యుఁడు మూఁడవరాత్రి అతిథిగానుండునో

౬. వానికి నాకమందు (దివి) నేపుణ్యలోకములు కలవో యవిప్రాప్తించును.

౭. ఎవనియింట్లో విద్వాంసుఁడైన వ్రాత్యుఁడు నాల్గవరాత్రి అతిథిగా నుండునో

౮. వానికి పవిత్రమైన వానిలోపవిత్రమైన (పుణ్యాత్పుణ్యాః) లోకములు లభించును.

౯. ఎవని యింట్లో విద్వాంసుఁడైన వ్రాత్యుఁడు అపరిమిత రాత్రులు అతిథియై నివసించునో

౧౦. వానికి నపరిమితములైన పుణ్య లోకములు లభించును.

ఇరువదవది యీ వేదము నందలి చివర ౧౩ వంతాప కాండము. ఇందు ౧౪౩ సూక్తములు సూక్తములు కలవు. వీనిలో ౧౩ సూక్తములు తప్ప మిగిలినవన్నియు ఋగ్వేదమునుండి గ్రహింపఁబడినవి.

వీనిలోను ఋగ్వేదముయొక్క యెనిమిదవ మండలమునుండి పెక్కుసూక్తములు తీసికొనఁబడినవి. ఋగ్వేదమునుండి గ్రహింపఁబడని సూక్తములలో 'కుంతాప సూక్తములు' ముఖ్యమైనవి. ఇరువదవ కాండమందలి ౧౨౭-వ సూక్తము మొదలు ౧౩౬-వ సూక్తము వఱకుఁగల పది సూక్తములకు కుంతాప సూక్తములని పేరు. వీనికి పదపాఠములేదు. అథర్వవేదమునందునివి మిక్కిలి చివరకాలమునఁ జేరినట్టు మనమూహింపవచ్చును. ఇట్టిసూక్తములుముఖ్యముగ దానాదులుచేసినరాజులను పొగడుటకుఁ బుట్టినవి. ఇవి భట్రాజుల పొగడ్తలవంటివి. కొన్ని మంత్రములలో (౨౦. ౧౨౭. ౧-౩) కౌరముఁడను రుశమ రాజును పొగడిరి. వీనికి 'నారాశంసము' లనిపేరు. కొన్నిచోట్ల (౨౦. ౧౨౭. ౭-౧౦) పారిక్షితు నిపొగడిరి. వీనికి 'పారిక్షిత్యాః' అనిపేరు. వీనిని ఋత్విక్కులు యజ్ఞ సమయమందు నిల్లెగిరిపోవునట్లు గొల్లుమని చదువుచుండిరి. ఇందు ధనమిచ్చువారి స్తుతులె గాకుండ నీయనివారినిందయుఁ బెక్కు చిత్రమైన ప్రశ్నలును, ఉత్తరములును, (౨౦-౧౩౩) ఉండును. ఇట్టి చిత్రప్రశ్నలుండు సూక్తములకు ప్రవలిహము లనిపేరు. 'అడ్డముగానున్న దానిలో నిలువుగానున్నది వాగినది; అది యెద్ది?' 'చెప్పులో కాలు' అని ఉత్తరము! ఇట్టి పొడుపు ప్రశ్నలుండును. ఈ కుంతాప సూక్తములలోఁ గొన్ని 'అశ్లీల భాషణము' లనఁబడునవి కూడఁగలవు. (౨౦-౧౩౬) వానిని భాషాంతరీకరించుటకు వీలులేదు. అశ్వమేధాది ప్రకరణములలో నితర వేదములందుఁగూడ నిట్టి 'అశ్లీల భాషణమ్' అన్న బిరుదుగల మంత్రము లుండును; కావున నథర్వ వేదమునందుఁ జివర నున్నవని యాశ్చర్యపడ నక్కఱలేదు. ఈ సూక్తములందు 'పోతశా ప్రలాప' మను పేరిట మూఁడు సూక్తము లున్నవి (౨౦, ౧౨౯-౧౩౨). ఈ భాగమంతగ నర్థ యుక్తమై యుండలేదు. ఇందునకొక కథ కలదు. పోతశుఁడను నొక ఋషియుండెను. అతఁడు మంత్రము ప్రారంభింపఁగా, నాతనికి పిచ్చియెత్తినదని తలఁచి యాతని కుమారుఁడు, అతని నోరు మూసెను. అతని తండ్రి 'నా వాక్కును బంధించితివ'ని అతనికి శాపమిచ్చెను. [పోత. ౬-౩౩.

౧. కుంతాప సూక్తము

(౨౦-వ కాండము; ౧౨౭-వ సూక్తము)

౧. ఓ జనులారా! దీని వినుఁడు. ఒక వీరుని యశస్సు గానము చేయఁబడును. అఱువదివేల తొమ్మిది (ఆవులను) రుశమదేశపు కౌరముఁడిచ్చెను.

౨. భార్యలతోఁగూడిన అతని రథము ఇరువది యొంటెలచే లాగఁబడును. అతనిరథము ఆ కాశమునకు తగులునంతయెత్తు కలది.

౩. ఇతఁడు ఋషికి నూఱు నిష్కములును (బంగారునాణెములును), పది స్రజములును, మూఁడువందల గుఱ్ఱములును, పదివేల గోవులును ఇచ్చెను.

౪. ఓకవి ! ఫలవంతమైన వృక్షముమీఁది పక్షివలె ననుభవింపుము. క్షురము (కత్తి) రాళ్లమీఁదనున్నటె నీ నాలుక నీయోష్ఠముల నడుమ శీఘ్రముగ నాడును.

౫. కవులు ఆవులవలె శీఘ్రముగా నడచుచు తమ పవిత్రమైన ఛందములను జదువుచున్నారు. వారి పుత్రాదులింటి యొద్దనున్నారు. పశ్వాదులను కాపాడుచున్నారు.

౬. ఓకవి ! గోవులను, సంపత్తును, ఇచ్చు నీ కావ్యమును ఈవలికి రానిమ్ము. వీరుఁడు తనబాణమును వేసినట్లు, దేవతలలో నీవాక్కును విడువుము.

౭. మనుష్యులలో దేవుఁడును, విశ్వమందలి జనులందఱను నేలువాఁడును, అగువైశ్వానరపరిక్షితుని యశోగానము వినుఁడు.

౮. 'పరిక్షిత్తు ఆసనమెక్కి మాకు క్షేమముకలుగఁ జేసెను' అని కురుదేశమందలి పురుషుఁడు, గృహనిర్మాణకాలమందు, తన భార్యతో నను.

౯. పరిక్షిత్తురాజుయొక్క రాజ్యమునందు భార్యభర్తను 'త్రాగుటకేమి తెచ్చెదను? పెరుగా! మంథనచేసి చల్లా ! లేక మధువా ! ' అనియడుగును.

౧౦. (ఈరాజ్యమునందు) యవలు (ధాన్య విశేషము) సూర్యకిరణములవలె, పెరిగి పైకిఁబోవును. పరిక్షిత్తుని రాష్ట్రమందు జనులందఱును శుభములఁబడయుదురు.

అథర్వవేద వాఙ్మయము

ఇదివఱకు నథర్వవేదము యొక్క సంహితను గుఱించి చెప్పితిమి. సంహిత గాక యీ వేదమునకు సంబంధించిన వాఙ్మయము చాలకలదు. 'మంత్ర బ్రాహ్మణయోర్నామధేయ' మని యున్నది గనుక బ్రాహ్మణము సంహితతో సమాన గౌరవము కల వేదభాగము. బ్రాహ్మణమునకుఁ దరువాతివి ఉపనిషత్తులు. వీనికి వేదాంతములనిపేరు. భిన్నభిన్న వేదశాఖలకు సంబంధించిన సూత్రాది గ్రంథములును గలవు.

అథర్వ వేద బ్రాహ్మణము

అథర్వ వేదమునకు నొక్క గోపథ బ్రాహ్మణమే వాడుకలో నున్నది. ఈబ్రాహ్మణమితర బ్రాహ్మణముల కంటె నిటీవలది యని చెప్పుటకుఁ బెక్కు నిదర్శనములు కలవు. ఈ బ్రాహ్మణమునందలి చాలి భాగ మింతకంటెఁ బూర్వ బ్రాహ్మణముల నుండి గ్రహింపఁబడినది. ఇందలి రెండు భాగములు (౨/3) పురాతన గ్రంథమునుండి గ్రహింపఁబడినవియు, ఒక భాగము (౧/3) స్వతంత్రముగ రచింపఁబడినదియు నగును. ఎక్కువ భాగము ఐతరేయకౌశీతకి బ్రాహ్మణము నుండియు, కొంత మైత్రాయణీ తైత్తరీయ సంహితలనుండియు, కొంచెము శతపథ పంచవింశ బ్రాహ్మణముల నుండియుఁ దస్కరింపఁబడినది.

ఇందు 'పూర్వబ్రాహ్మణము', 'ఉత్తర బ్రాహ్మణము' అని రెండు పెద్దవిభాగములు కలవు. పూర్వ బ్రాహ్మణమునందు నైదు అధ్యాయములును, ఉత్తర బ్రాహ్మణమునందు నాఱుఅధ్యాయములును గలవు. వైతాన సూత్రములని అథర్వవేదీయ సూత్రములు కలవు. అవి రచింపఁబడిన తరువాత వానిననుసరించి యీ బ్రాహ్మణము రచించినట్లు కానవచ్చుచున్నందున నిది యితర బ్రాహ్మ

ణములకంటె నర్వాచీనమని చెప్పవచ్చును. పూర్వ బ్రాహ్మణమునందలి విషయచర్చ యే శ్రౌతకర్మ గ్రంథమును ననుసరించలేదు; కొంత స్వతంత్రముగ నున్నది. మిగిలినది శతపథము నుండియు, ఐతరేయమునుండియుఁ దీసికొనఁబడినది. అథర్వవేదముయొక్క మాహాత్మ్యమును నధికముగ వర్ణించుటయు; యజ్ఞకర్మయందు నాల్గవ వాఁడైన 'బ్రహ్మ' యొక్క గుణవర్ణనముచేయుటయు నీ పూర్వ బ్రాహ్మణముయొక్క ముఖ్యోద్దేశములు. ఇందు 'శివుఁ' డను దేవుఁడు పేర్కొనఁబడుట వలన నీ బ్రాహ్మణమితర బ్రాహ్మణకాలీనము గాక వైదిక కాలము తరువాత సూత్రాది కాలమందు రచింపఁబడినట్లు కానవచ్చుచున్న దనికొందఱు పండితులయభిప్రాయము. ఉత్తర బ్రాహ్మణమునందు వైతాన సూత్రము ననునరించి శ్రౌతకర్మ సుసంగతముగ వర్ణింపఁబడియున్నది. ఇతర వేదశాఖల యందు మొదట బ్రాహ్మణము, తరువాత సూత్రములు ఏర్పడినవికాని యీశాఖయందు మాత్రము మొదటవైతాన సూత్రము లేర్పడుటయు, తరువాత వానిని సంహితాప్రాయముగ గ్రహించి యీ బ్రాహ్మణము రచింపఁబడుటయు తటస్థించినందున నితరశాఖలలోని బ్రాహ్మణ సూత్రక్రమమిచ్చట మారినది. ఈ బ్రాహ్మణమును గుఱించి గోపథ బ్రాహ్మణ మనుశబ్దముక్రింద వివరముగ వ్రాయఁబడును.

ఉపనిషత్తులు

అథర్వోపనిషత్తులసంఖ్యములు. ౧౮౭౬ లో వెబర్ గారు లెక్క వేయఁగా ౨౩౫ ఉపనిషత్తులు అథర్వవేదమునకు సంబంధించినవి యుండెను. అందు "అల్లోపనిషత్తు" కూడఁ గలదు! పక్షాభిమానముగల హిందూ మతములోని మతమతాంతరులందఱును తమతమ పక్షమునకు ననుకూలముగ నొకయుపనిషత్తు నురచించి, దానిని మఱియే వేదమునకు తోకఁగాఁబెట్టుటకు వీలులేనందునఁ జివరదియు, ఉపనిషత్సంఖ్యా నిర్ణయములేనిదియు నగు అథర్వవేదమునకు ననుబంధముగ వ్రాయుచు వచ్చిరి. అందుచే నీయుపనిషత్తుల సంఖ్య యింత పెరిగినది. చరణవ్యూహమను నొక పురాతన గ్రంథముకలదు. అది అథర్వవేద సంబంధమైన పరిశిష్ట గ్రంథము. దానినిబట్టి చూడ నప్పటికీవేదమునకు ౨౭ ఉపనిషత్తులే యున్నట్లు కనఁబడును. అవియెవ్వియన:— ౧ ముండక, ౨ ప్రశ్న, ౩ బ్రహ్మవిద్యా, ౪ క్షురికా, ౫ శూలికా, ౬ అథర్వ శిరస్ ౭ అథర్వశిఖా, ౮ గర్భ, ౯ మహా, ౧౦ బ్రహ్మ, ౧౧ ప్రాణాగ్నిహోత్ర, ౧౨ మాండుక్య, ౧౩ నాదబిందు, ౧౪ బ్రహ్మబిందు, ౧౫ అమృతబిందు, ౧౬ ధ్యానబిందు, ౧౭ యోగశిఖా ౧౮ యోగతత్త్వ, ౨౦ నీలరుద్ర ౨౧ పంకతాపినీ, ౨౨ ఏకదండి సన్న్యాస, ౨౩ అరుణి, ౨౪ హంస, ౨౫ పరమహంస ౨౬ నారాయణ, ౨౭ వైతథ్యము లనునవి.

పైనిజెప్పఁబడినవానిలో ప్రశ్న, ముండక మాండూక్యములను 'ఉపనిషత్తులు' మిక్కిలి పురాతనములైనవి, ఎక్కువగ నాదరింపఁ బడుచున్నవి. ఇవి వేదాంత సిద్ధాంతములను చక్కఁగఁ జర్చించును. బాదరాయణుఁడు తన వేదాంత సూత్రములనఁబడు నుత్తర మీమాంసయందు, నీయుపనిషత్తులలోని వాక్యము లనేకములు ఉదాహరించి యున్నాఁడు. ప్రశ్నోపనిషత్తు గద్యమయము. ఇది పిప్పలాదిశాఖదిగాఁ గానవచ్చును. ఇందు పిప్పలాది ఋషి తనశిష్యులు అడిగినట్టి యాఱు ప్రశ్నలకు సమాధానములు చెప్పినాఁడు. ముండకోపనిషత్తునకు వేదాంత సంప్రదాయమునందు మిక్కిలి గౌరవముకలదు. ఇది బృహదారణ్యక ఛాందోగ్యములకును, శ్వేతాశ్వతరమునకును నడుమ రచింపఁబడియుండును. మాండూక్యము గద్యాత్మకమైన మిక్కిలి చిన్న యుపనిషత్తయినను, దానిమీఁద శంకరాచార్యులవారి గురువునకుగురువైన గౌడపాదాచార్యులవారు కారికలువ్రాసినందున నిది మిక్కిలి విఖ్యాతిచెందియున్నది. అద్వైత వేదాంత సంప్రదాయమునందు 'గౌడపాద కారిక' లకు అనన్య గౌరవముకలదు.

పైని ఈయఁబడిన ౨౭ ఉపనిషత్తుల జాబితాగాక అథర్వోపనిషత్తులనఁబడునవి పెక్కులున్న వని యిదివఱకే వ్రాసియున్నాము. అట్టి జాబితాయొకటి ౯౭ సంఖ్యగలది యీక్రింద నుదాహరించెదము:—

౧ ప్రశ్న, ౨ మాండుక్య, ౩ పూర్వనృసింహతాపినీ, ౪ ఉత్తరనృసింహతాపినీ, ౫ అక్షి, ౬ అక్షమాలికా, ౭ అద్వయ, ౮ అధ్యాత్మ, ౯ అన్నపూర్ణా, ౧౦ అథర్వశిఖా ౧౧ అథర్వశిరః, ౧౨ అమృతనాద, ౧౩ అమృతబిందూ, ౧౪ అవధూత, ౧౫ అవ్యక్త, ౧౬ ఆత్మా, ౧౭ ఆత్మబోధ, ౧౮ ఆరుణి, ౧౯ ఏకాక్షర. ౨౦ కఠరుద్ర, ౨౧ కలిసంతరణ, ౨౨ కాలాగ్నిరుద్ర, ౨౩ కుండికా, ౨౪ కృష్ణ, ౨౫ కైవల్య, ౨౬ క్షురిక, ౨౭ గణపతి, ౨౮ గర్భ, ౨౯ గారుడ, ౩౦ గోపాలతాపనీ, ౩౧ చూడా, ౩౨ జాబాలదర్శన, ౩౩ జాబాల, ౩౪ జాబాలి, ౩౫ తాపనీ, ౩౬ భారసార, ౩౭ తురీయాతీత, ౩౮ తేజోబిందు, ౩౯ త్రిపురా, ౪౦ త్రిపురాతాపనీ, ౪౧ త్రిశిఖా, ౪౨ దత్తాత్రేయ, ౪౩ దక్షిణామూర్తి, ౪౪ దేవీ, ౪౫ ధాన్యబిందూ ౪౬ నాదబిందూ, ౪౭ నారాయణా, ౪౮ నిరాలంబ, ౪౯ నిర్వాణ, ౫౦ పంచబ్రహ్మ, ౫౧ పరబ్రహ్మ, ౫౨ పరమహంస, ౫౩ పరమహంసపరివ్రాజక, ౫౪ పరివ్రాజ, ౫౫ పాశుపత, ౫౬ పైంగల, ౫౭ ప్రాణాగ్నిహోత్ర, ౫౮ బృహజ్జాబాలి, ౫౯ బ్రహ్మ, ౬౦ జన్మజాబాల, ౬౧ భావనా, ౬౨ భిక్షు, ౬౩ మండల, ౬౪ మాత్రిక, ౬౫ మహత్, ౬౬ మహానారాయణ, ౬౭ మహావాక్య, ౬౮ ముక్తిక ౬౯ ముద్గల, ౭౦ మైత్రేయీ, ౭౧ యాజ్ఞవల్క్య, ౭౨ యోగకుండలీ, ౭౩ యోగతత్త్వ,

౭౪ యోగశిఖా, ౭౫ రహస్య, ౭౬ రామతాపనీ, ౭౭ రాష్ట్రరహస్య, ౭౮ రుద్రాక్ష, ౭౯ వజ్రసూచి, ౮౦ వరాహ, ౮౧ వాసుదేవ, ౮౨ విద్యా, ౮౩ శరభ, ౮౪ శాట్యాయనీ, ౮౫ శాండిల్య, ౮౬ శారీర, ౮౭ సన్యాస, ౮౮ సరస్వతీరహస్య, ౮౯ సర్వసార, ౯౦ సావిత్రీ, ౯౧, సీతా, ౯౨ సుబాల, ౯౩ సూర్య, ౯౪ సౌభాగ్య, ౯౫ స్కంద, ౯౬ హయగ్రీవ, ౯౭ హృదయ.

ఈ యుపనిషత్తు లన్నియు నెప్పుడప్పుడు రచింపఁబడిన వనుట స్పష్టము. కొన్నిటి భాషాశైలిని బట్టిచూడ నవి నూఱునూటయేబది యేఁడ్లకు లోపుగాఁ బుట్టియుండ వచ్చునని తోఁచుచున్నది. ఈ యుపనిషత్తు లన్నిటిని మనము నాలుగు గుంపులుగ వేఱుచేయ వచ్చును.

౧. వేదాంతోపనిషత్తులు:_ కేవలము వేదాంత విచారమును ప్రతి పాదించునవి. వీనిలో కేవలతత్త్వ విచారముండునేగాని, శివవిష్ణుస్తుతులుగాని, వారి యాధిక్యతను వర్ణించుటగాని యుండదు. ఇట్టివి ప్రశ్నముండక మాండూక్యాత్మ పిండోపనిషత్తులు.

౨. యోగోపనిషత్తులు:_ఇవియు వేదాంతమునే బోధించునుగాని యోగము వలనను, ఓంకారజపము వలనను ఆత్మను కనుఁగొనవలయునని ప్రతి పాదించును. బ్రహ్మ విద్యా క్షురికా నాదబిందు హంసా ద్యుపనిషత్తు లిట్టివి.

౩. సన్యాసోపనిషత్తులు :-ఇవిసన్న్యాసమును ఎక్కువగాఁ బొగడును. సన్యాసము ఉపనిషత్తుల సారమని చెప్పును. బ్రహ్మ సన్యాస పరమహంసోపనిషత్తు లిట్టివి.

౪. శైవ వైష్ణవా ద్యుపనిషత్తులు:_ శివుఁడే యెక్కువయని, విష్ణువే యెక్కువయని, అవతారాదులే యెక్కువయని ప్రతిపాదించి వితండావాదములకు మూలాధారములైనవి, యీ గ్రంథములు. అథర్వశిఖానీల రుద్ర కాలాగ్ని రుద్ర, రామతాపినీ నృసింహతాపినీ మొదలయినవి యిట్టివి. వీనియందలి విషయమును బట్టియే, శైవవైష్ణవ శాక్తేయ వైరములు ముదిరిన తరువాతనే యీ ఉపనిషత్తులు తత్తద్దేవతా భక్తులచేఁ గల్పింపఁబడిన వనుట స్పష్టము.

మొత్తము మీఁద పైని చూపఁబడిన నాలుగువిధముల గ్రంథములు, పూర్వము వానికన్నఁ బరమునన్నవి. వెనుకనుండి పుట్టినవని మనమూహించిన, మనయూహ సత్యమునకు దూరముగ నుండదని చెప్పవచ్చును.

ఉపవేదములు

ఈ వేదమునకు నుపవేదములుగా బ్రహ్మ అయిదు వేదములను నిర్మించెనఁట.

“పంచవేదాన్ నిరమమీత। సర్పవేదమ్। పిశాచవేదమ్। అసురవేదమ్। ఇతిహాసవేదమ్। పురాణవేదమితి”

[గో. బ్రా. ౧-౧౦.

అయిదు వేదములను నిర్మించెను. సర్ప వేదము, పిశాచవేదము, అసురవేదము, ఇతిహాస వేదము, పురాణవేదము.

గోపథ బ్రాహ్మణమునందుఁ జెప్పఁబడిన యీ యైదు ఉపవేదములలో, మొదటి మూఁడువేదముల విశేషసంహితలు ప్రఖ్యాతి గాంచి యుండలేదు. పాము మంత్రములు, దయ్యపు మంత్రములు సంస్కృతమునందు పెక్కులు గలవు. కాని వానిలో నే గ్రంథములను ఈ యుపవేదములుగాఁ బరిగణించిరో తెలియదు. ఇతిహాస వేదమనఁగా భారతమనియు, పురాణ వేదమనఁగా పురాణములనియుఁ దోఁచుచున్నది. గోపథ బ్రాహ్మణము అన్ని బ్రాహ్మణములకంటె నర్వాచీనము. సూత్ర గ్రంథములకుఁగూడ తరువాతది కావున నదిపుట్టిన కాలమువఱకు మహాభారతమును, కొన్ని పురాణములును పుట్టి యుండును.

ఆథర్వణిక సూత్ర గ్రంథములు

అథర్వణ వేద సంబంధమైన కల్పసూత్రము లైదని ఉపవర్షాచార్యుఁడు చెప్పెనని, విద్యారణ్యుఁడు తన భాష్యమునందు ఈ క్రింది శ్లోకము నుదాహరించి యున్నాఁడు:—

నక్షత్రకల్పో, వైతాన, స్తృతీయః సంహితావిధిః । తుర్య అంగిరసః కల్పః, శాన్తి కల్పశ్చ పంచమః ॥

అర్థము:-నక్షత్ర కల్పము, వైతాన కల్పము, సంహితా కల్పము, అంగిరస కల్పము, శాన్తి కల్పము, అనునవి యైదు. ఇందు సంహితా కల్ప మనఁగా కౌశిక కల్పసూత్రము.*

ఈకల్పసూత్రములు శౌనక,జాజల, జలద, బ్రహ్మవరులను ఈ నల్గురు శాఖవారికే ప్రమాణములంట. ఇతర శాఖల వారికే సూత్ర గ్రంథములు ప్రమాణముగ నుండినవో తెలిసికొనుటకు వీలులేదు.

ఈయైదు కల్పసూత్రగ్రంథములలో కౌశిక సూత్రమనునది మిక్కిలి ముఖ్యమైనది. విపులముగను సంపూర్ణముగను నిందు నథర్వవేద మంత్రముల కుపయోగము కల్పింపఁబడినది. కౌశికసూత్రము మొట్టమొదట అమెరికాలో బ్రకటింపఁబడినది†. ఇందు ౧౪ అధ్యాయము

* 'తత్ర సాకల్యేన సంహితామంత్రాణాం శాంతిపౌష్టికాదిషు కర్మసు వినియోగ విధానాత్ సంహితా విధిర్నామ కౌశిక సూత్రమ్ ।

[ఇతిసాయణాచార్యః.

† వేద సంబంధమైన ముఖ్య గ్రంథములు మొదట పాశ్చాత్య దేశములందుఁ బ్రకటింపఁబడుటయు, మన వారేమియుఁ జేయకుండుటయుఁ జూడఁ బాశ్చాత్యులకుఁగల జ్ఞానాభిలాషయు, మనకుఁగల యౌదాసీన్యమును జక్కఁగ వెల్లడి యగుచున్నవి. ఋగ్వేద సంహిత మొదట ఆక్స్‌ఫర్డులోను, (౧౮౫౦) శుక్ల యజుర్వేద వాజసనేయ సంహిత బర్లిన్‌లోను(౧౮౫౨) కృష్ణ యజుర్వేద తైత్తిరీయ సంహిత లిప్‌జిక్‌లోను (౧౮౭౧), సామవేద సంహిత లిప్‌జిక్‌లోను(౧౮౪౮), అథర్వవేద సంహిత బర్లిన్‌లోను (౧౮౫౬) ప్రకటింపఁబడినవి ! ఇంతియ కాదు. వీని కర్థములు, శబ్దకోశములుకూడ సిద్ధము చేయఁబడినవి !

లును, ౧౪౧ కండికలును గలవు. ఈ సూత్ర గ్రంథములలో నేయే విషయములు కలవో వాని పట్టిక, సాయణాచార్యులవారు తమ భాష్యభూమికలో నిచ్చియున్నారు. ఆ విషయ సూచికలవలన నథర్వ వేదమందలి విషయ ములను గుఱించియుఁ గొంత బోధ కలుగఁ గలదు కనుక వేఱు వేఱు సూత్రముల విషయ పట్టికలను సాయణభాష్యమునుండి యుదా హరించుచున్నాము. సంస్కృత పదములు సాధారణముగ నర్థమగునవి కావున వేఱుగఁ దెలుఁగర్థ మీయలేదు:-

"తత్ర తావత్ కౌశికసూత్రే క్రమేణ ప్రతి పాద్యా న్యేతానికర్మాణి । ఆదౌ స్థాలీపాక విధానేన దర్శపూర్ణ మాసవిధిః। తతో మేధా జననాని । బ్రహ్మచారి సాంపదాని । గ్రామ నగర దుర్గరాష్ట్రాది లాభార్థాని । పుత్రపశు ధనధాన్య ప్రజా స్త్రీ కరి తురగ రథాన్దోలికాది సర్వసంపత్సాధకాని । జనానామ్ ఐకమత్య సంపాదకాని సామనస్యాని । తతో రాజ కర్మాణి। తానిచ శత్రుహ స్తి త్రాసనాని సం గ్రామజయ సాధనాని ఇషునివారణార్థాని ఖ డ్గాది సర్వశస్త్ర నివారణాని పరసేనా మో హనోద్వేజన స్తమ్భనోచ్చాటనా దీని స్వసే నోత్సాహ పరిరక్షణా భయార్థాని సంగ్రామే జయపరాజయ పరీక్షార్థాని సేనాపత్యాది ప్ర ధానపురుష జయకర్మాణి పరిసేనా సంచరణ ప్రదేశేషు అభిమన్త్రిత పాశాసిక శాప్రక్షే పణాదీని జయకామస్య రాజ్ఞో రథస్యారోహ ణమ్ అభిమన్త్రిత భేరీపటహాది సర్వవాదిత్ర తాడనమ్ సపత్న క్షయకర్మాణి శత్రూత్సా దితస్య రాజ్ఞః పునః స్వరాష్ట్రే ప్రవేశకాని రాజాభిషేకః॥ పాపక్షయార్థాని। నిరృతికర్మా ణి। చిత్రాకర్మాదీని। పౌష్టికాని। గోసమృద్ధి కర్మాణి।లక్ష్మీకరణాని। పుష్టయర్థమణిబన్ధనాని। కృషిపుష్టికరాణి। అనడుత్సమృద్ధికరాణి గృహ సంపత్కరాణి నవశాలా కర్మాదీని । వృషో త్సర్జనమ్ । ఆగ్రహాయణీకర్మ॥ జన్మాంతరకృత పాపనిమిత్తా చికిత్స్య వివిధరోగభైషజ్యాని। తత్ర ప్రథమం సర్వవ్యాధి భైషజ్యం జ్వరాతి సార బహుమూత్రాది భైషజ్యాని శస్త్రాద్యభి ఘాతజ రుధిర ప్రవాహ నిరోధకాని భూత ప్రేత పిశాచాపస్మార బ్రహ్మరాక్షస బాలగ్ర హాది నివారణాని । వాతపిత్త శ్లేష్మ భైష జ్యాని । హృద్రోగ కామిలాశ్విత్ర నివార ణాని । సంతతజ్వరే కాహికాది విషమజ్వర రాజయక్ష్మ జలోదర నివారణాని గవాశ్వా దీనాం క్రిమి హరాణి నికన్దమల సర్ప వృశ్చిక స్థావర జఙ్గమవిషనివారణాని శిరోక్షి నాశికా కర్ణజిహ్వాగ్రీవాది రోగభైషజ్యాని బ్రాహ్మ ణాద్యాక్రోశ నివారణాని గణ్డమాలాది వివి ధరోగభైషజ్యాని॥ పుత్రాదికామస్త్రీకర్మా ణి। సుఖప్రసవ కర్మాణి।గర్భాధానగర్భ బృం హణ పుంసవనాదీని। సౌభాగ్యకరణాని । రా జాదిమన్యు నివారణాని। అభీష్టసిధ్యసిద్ధి విజ్ఞా నాని । దుర్దినాశన్యతి వృష్టినివారణాని। సభా జయ వివాదజయ కలహశమనాని । స్వేచ్ఛా

తో నదీప్రవాహ కరణాని। వృష్టికర్మాణి। అగ్న్యుత్థాపనకర్మ । ద్యూతజయకర్మ । గోవత్స విరోధ నివారణమ్ । అశ్వశాన్తిః ।, వాణిజ్య లాభకర్మ । స్త్రియాః పాపలక్షణ నివారణం । వాస్తుసంస్కారకర్మ । గృహ ప్రవేశకర్మ । కపోతవాయసాద్యుపహత గృహ శాన్తివిధిః। దుష్ప్రతి గ్రహాయాజ్య యాజనాదిదోషనివారణమ్ । దుస్స్వప్న నివారణమ్ । కుమారస్య పాపనక్షత్రజననశాన్తిః । ఋణాపనోదనమ్ । దుశ్శకునశాన్తిః॥ అభిచారికాణి । పరకృతాభిచారనివారణాని॥ స్వస్త్యయనాని । ఆయుష్యాణి । జాతకర్మ నామకరణ చూడాకర్మోపనయనాదీని। ఏకాగ్నిసాధ్యాః కామ్యా యాగాః బ్రహ్మౌదనస్వర్గౌదనాద్యా ద్వావింశతిః సవయజ్ఞాః॥ క్రవ్యాచ్ఛమనమ్ । ఆవసథ్యాధానమ్ । వివాహాః॥ పైతృమేధికాని । పిణ్డపితృయజ్ఞః॥ మధుపర్కః॥ పాంసురుధిరాధి వర్షణ యక్షరాక్షసాదిదర్శనభూకమ్పధూమకేతు చన్ద్రార్కోపప్లవాదిబహుృవిధోత్పాతశాన్తయః॥ ఆజ్యతన్త్రవిధిః । అష్టకాకర్మ ఇన్ద్రమహః । తతోఽధ్యయన విధిరితి॥

తథా వైతానసూత్రే దర్శపూర్ణమాసాదిషు అయనాన్తేషు త్రయీవిహితకర్మసు బ్రహ్మ బ్రాహ్మణాచ్ఛంసీ అగ్నీధ్రః పోతేతి చతుర్ణాం ఋత్విజాంకర్తవ్యం ప్రతిపాద్యతే । తత్ర అనుజ్ఞామన్త్రణాదీని బ్రహ్మణః । శస్త్రాదీని బ్రాహ్మణాచ్ఛంసినః । ఆగ్నీధ్రస్య అన్వాహార్య శ్రపణప్రస్థిత యాజ్యాదీని । పోతుః ప్రస్థిత యాజ్యాదీని । ఇతి విభాగః॥ తత్ర అయం కర్మక్రమః। ప్రథమం దర్శపూర్ణమాసౌ । తతోఽగ్న్యాధానమ్। అగ్నిహోత్రమ్ ఆగ్రయణేష్టిః । చాతుర్మాస్యాని । వైశ్వదేవ వరుణప్రఘాస సాకమేధ శునాసీరీయాణి పశుయాగః । అగ్నిష్టోమోక్థ్యషోడశ్యతిరాత్ర్యాత్మకః ప్రకృతిభూతశ్చతుస్సంస్థః సోమయాగః । వాజపేయః । అప్తోర్యామః। అగ్నిచయనమ్ । సౌత్రామణీ। మైత్రావరుణ్యామిక్షేష్టిః । గవామయనమ్ । రాజసూయః । అశ్వమేధః । పురుషమేధః । సర్వమేధః । బృహస్పతి సవగోసవాదయ ఏకాహాః సోమయాగాః । వ్యుష్టిద్విరాత్ర ప్రకృతయోఽహీనాః । రాత్రి సత్రాణి । సాంవత్సరికాణ్యయనాని । దర్శపూర్ణమాసాయనానీతి॥

నక్షత్రకల్పేఽపి ప్రథమంకృత్తికాదినక్షత్ర పూజాహోమాది । తతోఽద్భుత మహాశాన్తిః । నైరృత కర్మ। అమృతాద్యా అభయాన్తాస్త్రింశన్మహాశాన్తయో నిమిత్తభేదేన ప్రతిపాదితాః । తత్ర దివ్యాన్తరిక్షభౌమేషు ఉత్పాతేషు అమృతాఖ్యా మహాశాన్తిః । గతాయుషాం పునర్జీవనాయ వైశ్వదేవీ । అగ్నిభయనివృత్తయే సర్వకామావాప్తయే చాగ్నేయీ । నక్షత్రగ్రహోపసృష్టభయార్తరోగ గృహీతానాం తచ్ఛాంతయే భార్గవీ । బ్రహ్మవర్చసకామస్య వస్త్ర

శయనాగ్ని జ్వలనేచ బ్రాహ్మీ। రాజ్యశ్రీ బ్రహ్మవర్చస కామస్య బార్హస్పత్యా। ప్రజాపశ్వన్నలాభాయ ప్రజాక్షయ నివృత్తయే చ ప్రాజాపత్యా। శుద్ధికామస్య సావిత్రీ।ఛన్దో బ్రహ్మవర్చస కామస్యగాయత్రీ। సంపత్కామస్య అభిచరతోఽభిచర్యమాణస్య చ ఆఙ్గిరసీ। విజయ బలపుష్టికామస్య పరచక్రోద్వేజనకామస్య చ ఐన్ద్రీ। అద్భుత వికార నివృత్తికామస్య రాజ్యకామస్యచ మాహేన్ద్రీ। ధనకామస్య ధనక్షయనివృత్తి కామస్యచ కౌబేరీ। విద్యాతేజోధనాయుష్కామస్య ఆదిత్యా। అన్నకామస్య వైష్ణవీ। భూతికామవాస్తు సంస్కార కర్మణోర్వాస్తోష్పత్యా। రోగార్తస్య ఆపద్గ్రస్తస్య చ రౌద్రీ। విజయకామస్య అపరాజితా। యమభయే యామ్యా। జలభయేవారుణీ। వాత్యాభయే వాయవ్యా। కులక్షయనివృత్తయే సంతతాఖ్యా। వస్త్రక్షయనివృత్తయే త్వాష్ట్రీ। బాలస్య వ్యాధినివృత్తయేకౌమారీ। నిరృతి గృహీతస్య నైరృతీ। బాలకామస్య మారుద్గణీ। అశ్వక్షయనివృత్తయే గాన్ధర్వీ। గజక్షయశాన్తయే పారావతీ। భూమికామస్య పార్థివీ। భయార్తస్య అభయాఖ్యా మహాశాన్తిః। ఆసాం తన్త్రీభూతా మహాశాన్తిశ్చేతి॥

తథా ఆఙ్గిరసకల్పే ఆభిచారకర్మాదౌ కర్తృకారయితృసదస్యానాం స్వాత్మరక్షాకరణమ్। అభిచారోపయుక్తదేశకాలమణ్డప కర్తృకారయితృ దీక్షాదిధర్మసమిదాజ్యాది సంభార నిరూపణాదికమ్, తతః ఆభిచారిక కర్మాణి। పరకృతాభిచార నివారణాదీన్యన్యాన్యపి కర్మాణి॥

శాన్తికల్పేఽపి ప్రథమం వైనాయకగ్రహ గృహీతలక్షణాని। తచ్ఛాన్తయే సంభారాహరణమ్। అభిషేకవైనాయకహోమాః। తత్పూజా విధానమ్। ఆదిత్యాది నవగ్రహ యజ్ఞాదికమితి॥

ఇట్లు అయిదు కల్పములలోని విషయ సూచికలను కొద్దిలోనిచ్చి సాయణాచార్యుల వారు కల్పములలో లేనిదియు పరిశిష్టముల లోఁ జెప్పఁబడినదియునగు రాజ్యాభిషేక విషయసూచికఁగూడ నిట్లిచ్చియున్నారు:—

"ఏతేషు కల్పేష్వనుక్తాని యాని రాజాభిషేకోపయుక్త ద్రవ్యప్రకృతి ద్రవ్యపరిగ్రహ పురోహితవరణాదీని పరిశిష్టోక్తాని తాన్యపి అను క్రమ్యన్తే। ప్రథమం రాజ్యాభిషేకః। పాత్రితః పాత్రిమన్త్రి గన్ధాలంకారసింహాసనాశ్వగజాన్దోలికా ఖడ్గధ్వజచ్ఛత్ర చామరాదీనాం తత్తన్మన్త్రాభి మన్త్రితానాం రాజ్ఞే ప్రదానాదీని పురోహితకర్మాణి। సువర్ణధేను తిలభూమిదానాదీని రాజ్ఞః ప్రతిదివసకర్తవ్యాని। పూజిత పిష్టమయ్యా సదీపయారాత్రి ప్రతిమయా రాజ్ఞో నీరాజనమ్। రక్షాకరణం చ ఇత్యేవమాదీని పురోహితస్య రా

త్రికర్మాణి। రాజ్ఞః పుష్పాభిషేకః। రాజ్ఞో రాత్రౌ ఆరాత్రికవిధానమ్। ప్రాతః ప్రాతర్ ఘృతావేక్షణమ్। కపిలాదానమ్। తిలధేనుదానమ్। రసాదిధేనవః। కృష్ణాజినదానమ్। భూమిదానమ్। తులాపురుషవిధిః । ఆదిత్యమండలాకారాపూపదానమ్ । హిరణ్యగర్భవిధిః హస్తిరథదానమ్। కనకాశ్వాది దశ మహాదానాని। అశ్వరథదానమ్ । గోసహస్రవిధిః । వృషోత్సర్గః। కోటిహోమః। లక్షహోమః । అయుతహోమః। ఘృత కమ్బలవిధిః। తటాకప్రతిష్ఠా। పాశుపతవ్రతమ్ ।ఇత్యేవమాదీని ॥ అన్యాన్యపి దాన వ్రతాదీని॥*

అను క్రమణులు

అథర్వ వేదమునకు రెండు అను క్రమణులు కనఁబడుచున్నవి. ఒకటి పంచపటలిక, రెండవది సర్వాను క్రమణి. ఈ రెండవదానికే బృహదను క్రమణి యన్న పేరుకూడనున్నట్లు కానవచ్చుచున్నది. ఇవి అథర్వ వేదముయొక్క యొక విధమైన జమాబందిగోష్వారాలు. ఈకాండములో సూక్తములిన్ని, ఈ యాసూక్తములలో ఋక్కులిన్ని, ఈ సూక్తములీ యా విషయములకు సంబంధించినవి అను మొదలైన కట్టుబాట్లన్నియు వీనియందు జేయఁబడియుండును. అను క్రమణు లేర్పడిన తరువాత వేదమందలి మంత్రములు మార్పులకు వీలుండదు. పంచపటలికలో ౧౯-వ ౨౦-వ కాండములు ఉదాహరింపఁబడియుండలేదు. పంచ పటలిక కొంత పద్యాత్మకము, కొంత గద్యాత్మకము.

పరిశిష్టములు

అథర్వ పరిశిష్టములు ౭౨-వఱకు నున్నవి. వీనిలోని విషయము లనేకములు. ఇందుఁ గొన్ని వ్యాకరణ విషయమును, జ్యోతిషమును, అర్థవిషయమును, అన్యవిషయమును, అథర్వవేదమునకు సంబంధించిన వానిని చర్చించును. పైప్పలాద మంత్రము, ఇంద్ర మహోత్సవము, ధూర్తకల్పము, ఆసురకల్పము, జ్ఞానమాల, శ్రాద్ధకల్పము, ఉత్తమ పటము, చరణవ్యూహము, గ్రహయుద్ధము, అద్భుతశాంతి, అను పరిశిష్టములు ముఖ్యమైనవి.

వ్యాకరణ గ్రంథములు

అథర్వవేద సంబంధమైన వ్యాకరణ గ్రంథములలో, 'శౌనకీయచతురధ్యాయికా' యనఁబడునది యొకటి కానవచ్చుచున్నది. దీనికే అథర్వణ ప్రాతిశాఖ్యమని పేరు. ఇది అమెరికాలోఁ బ్రకటింపఁబడినది. ఆథర్వణ సూత్రములని పాణిని కృత గ్రంథ మొకటి కలదని చెప్పెదరు కాని యెచ్చటను కానరాదు. కౌత్సాయనకృతమైన నిరుక్త నిఘంటు వొకటికలదు. బృహత్ సర్వాను క్రమణియు నొకటికలదు.

*అథర్వ సంహితా, బొంబాయి ప్రతి, ౧-వ సంపుటము, సాయణభాష్యోపోద్ఘాతము, ౨౬-౨౯ పుటలు.

అథర్వ జ్యోతిషమను గ్రంథమొకటి కలదు. అందు ౪౦ ప్రకరణములును, ౧౬౨ శ్లోకములును కలవు.

అథర్వ జ్యోతిషము ఇందు గణిత జాతక స్కంధములు కలవు. దీనిని పితామహుఁడు కాశ్యపునకుఁ జెప్పినట్లున్నది. ఈ గ్రంథము ఋగ్యజుర్వేదాంగ జ్యోతిషముల కంటెను, ఇతర వేదాంగముల కంటెను,మిక్కిలి అర్వాచీనము. [కో. ల.

అథర్వశిఖ—అథర్వవేదోపనిషత్తు.

అథర్వశిఖోపనిషత్. అథర్వ శిఖోపనిష త్తథర్వవేదమండలి పంచరుద్రంబులలో నొక్కటియై యష్టోత్తర శతోపనిషత్తులలో నొప్పుచున్నయది. పైప్పలాద సనత్కుమారులును అంగిరసులు నొకప్పుడా యథర్వణ ఋషియొద్దకుఁ బోయి ధ్యాన ధ్యాతృ ధ్యేయవిషయకంబగు ప్రశ్నంబునడుగ నాతండు కృపచే వారలకు నుపదేశమొన రించిన తత్త్వమని యాఖ్యాయికా మూలకముగఁ దెలియవచ్చెడిని.

"అథ హైనం పైప్పలాదోంగిరా స్సనత్కుమారశ్చాథర్వణ మువాచ భగవన్కిమాదౌ ప్రయుక్తం ధ్యానం ధ్యాయితవ్యంకింతత్ ధ్యానంకో వాధ్యాతా కశ్చ ధ్యేయః స ఏభ్యో థర్వాఽ ప్రత్యువాచ."

ఇందు సాధనచతుష్టయసంపన్నులగుసర్వ కర్మ సన్న్యాసులకు శాస్త్రముచే విధింపఁబడు ప్రణవోపాసనంబు సూక్ష్మంబుగ వివరింపఁ బడియున్నది. మరియు బ్రహ్మవాచకంబులగు నోంకారప్రణవ ప్రళయతారవిష్ణు బ్రహ్మ ప్రకాశ మహాదేవాదిపదంబుల వ్యుత్పత్త్యర్థము లద్వైత తత్త్వము దేటపడునటులు నిరూపింపఁడియె. సర్వవాచకంబులచే గమ్యంబగు వాఁడు శివుండని నిగమనంబునఁ జెప్పంబడి యుండుటచే నీయుపనిషత్తునందు శివపదము తుర బ్రహ్మవాచకంబుగ నుచ్చరింపఁబడి యెనని యెఱుంగునది. ఇట్టి బ్రహ్మతత్త్వంబును దెలిసికొనుటచే జనన మరణప్రవాహరూప సంసారమునుండి ద్విజులు ముక్తులగుచున్నా రని ఫలశ్రుతిచేఁ దెలియవచ్చుచున్నయది.

"అథర్వశిఖాం తామ ధీత్యద్విజోగర్భ వాసాద్విముక్తో విముచ్యత ఏతామధీత్యద్విజో గర్భవాసాద్విముచ్యతే॥"

సర్వకర్మ సన్న్యాసమును గావించి గురుముఖమున మహావాక్యోపదేశమును బొందిన వారలకుఁ బ్రణవోపాసనంబు కర్తవ్యంబు గావున నట్టి వారలకీ యుపనిషత్తు విచారణీయంబు.

(శ్రీ. క. భా.)

అథర్వశిరస్సు—అథర్వ వేదోపనిషత్తు.

అథర్వశిరసుఁడు — అథర్వణ ఋషియొక్క ముగ్గురు పుత్త్రులలో మూఁడవ వాఁడు.

అథర్వశిరోపనిషత్ — అథర్వశిరోపనిషత్తు నామ మాత్రముననె యథర్వవేదాంతర్భాగమని సుస్పష్టమగుచున్నయది. ఇయ్యది యష్టోత్తర శతసంఖ్యాకంబులైన యుపనిష చ్ఛ్రేష్ఠంబులలో నొక్కటి. ఇయ్యది రుద్రునకును దేవతలకును జరగిన సంభాషణ రూపముగఁ గానంబడియెడి. ఇట్టి యాశయము నీయుపనిష దారంభమున నుండిన యాఖ్యాయిక బలపఱచుచున్నయది. దేవత లొకానొకప్పుడు రుద్రస్వరూపమును జిజ్ఞాస చేయఁదలంచి స్వర్గలోకంబునకుఁ బోయి రుద్రుని దర్శించి యాతని మీ రెవ్వరని యడుగ నారుద్రుండు సకల బ్రహ్మాండములును దానేయైయున్నాఁడననియుఁ దనకంటె నన్యమొండు లేదనియు, తాను త్రైకాలికాబాధ్యుఁడును, సర్వవ్యాపకుఁడును, సర్వాధారుఁడునైయున్నాఁడననియు, దన్ను దెలిసికొనిన వారలు సర్వము నెఱింగిన వారలగుదురనియు నుపదేశించినటులు బ్రప్రథమంబున వివరింపఁబడియున్నది.

"దేవావై స్వర్గం లోకమగమన్తే దేవారుద్ర మపృచ్ఛన్కో భవానితిసో బ్రవీత్."

ఇందుఁ బ్రప్రథమంబున విరాట్పురుష రూపంబు రుద్రరూపంబుగ వర్ణింపఁబడియె.

విరాడ్రూపమును ఉపాసించుటకు నోంకార మాలంబనముగా నుపదేశింపఁ బడియెను. పిమ్మట నోంకారశబ్ద వాచ్యుండగు రుద్రుని నామంబులుగ నోంకార ప్రణవ సర్వవ్యాపి యనంతతార సూక్ష్మశుక్ల వైద్యుత పరబ్రహ్మైక రుద్రేశాన భగవన్మహేశ్వర మహాదేవ శబ్దంబులు పదునైదును బేర్కొనఁబడి యవ్వానియొక్క లక్షణంబులుగా నొప్పు వ్యుత్పత్త్యర్థంబులు వివరింపఁబడియె. ఇట్టి శబ్దంబులయొక్క వ్యాఖ్యానంబుచే రుద్రుని యొక్క పారమార్థిక స్వరూపంబు విస్పష్టమగుచున్నయది. ఇంక బ్రహ్మజ్ఞాన ప్రాప్తికినంతరాయంబులగు దురితంబులనివృత్తికై యిందు భస్మధారణ లక్షణంబగు పాశుపత వ్రతంబొం డుపదేశింపఁబడి యున్నది. ఈ యుపనిషత్తునందు బ్రహ్మ శబ్దంబునకు మారుగ ప్రప్రథమంబున రుద్రశబ్దముండుటం జేసి నజ్ఞానులచే నీ యుపనిషత్తు శైవవిశిష్టాద్వైత బోధకంబని తలంచఁ బడుచున్నది. కాని పౌర్వాపర్య విమర్శనంబుచేతను ఇతర యుపనిషదాశయముచేతను బ్రహ్మసూత్ర సిద్ధాంతములచేత నట్టి యాశయంబు దప్పనియు శుద్ధాద్వైత తత్త్వమే యీ యుపనిషత్తాత్పర్యంబనియు నిరాటంకముగఁ జెప్పనగు.

కావున నీయుపనిషత్తు సాధన చతుష్టయ సంపన్నులగు జిజ్ఞాసువులకు శ్రేయోదాయకము.

(శ్రీ. క. భా.)

అథర్వాంగిరసుఁడు — ఒక బ్రహ్మర్షి. నహుషరాజు ఇంద్రపదవినుండి చ్యుతుఁడైనపిదప నింద్రుఁడు రాఁగా నీఋషి యాతని యశస్సును జక్కఁగ గానము చేయఁగా నింద్రుఁడు సంతసించి, యాతనికీ పేరును, అథర్వవేదమునకు నాచార్యత్వమును, యజ్ఞమునందు హవిర్భాగమును, ఇచ్చెను. [భార. ఉద్యో. అ. ౧౮.

అథీనా - ప్రాచీన గ్రీసు దేశపు స్త్రీదేవత. వ్యవసాయము, యుద్ధము, పట్టణ నివాసము, పారిశ్రామిక కళలు, వీనికి నీమె యధిష్ఠాన దేవతగా నెంచఁబడు చుండెను. ఈమె 'జ్యూయస్' (బృహస్పతి) అను దేవుని బిడ్డ. ఆతని తలలో నుండి పుట్టెను!

అథీనియస్. ఈజిప్టు దేశీయుఁడైన మహా విద్వాంసుఁడు. క్రీ. శ. ౨౩౦ ప్రాంతమున నుండినవాఁడు. ఇతఁడు తనచే రచింపఁబడిన గ్రంథమునకు 'పండితులకు విందు' అను నర్థముగల పేరు బెట్టెను. ఇందు నంతకుఁ బూర్వపు వారైన ఎనిమిది వందల గ్రంథకారుల గ్రంథములనుండి వాక్యము లుద్ధారింపఁబడినవి.

అథెల్ స్టన్ - ఇంగ్లండు దేశపురాజు. క్రీ. శ. ౯౨౫ మొదలు ౯౪౦ వఱకు రాజ్యముచేసెను. ఇతఁడు 'ఆల్ ఫ్రెడ్' మహారాజుని మనుమఁడు. 'పెద్ద ఎడ్వర్డు' కుమారుఁడు. ఇతఁడు రాజ్యమునకు వచ్చినపుడీరాజుల ప్రభుత్వ మింగ్లండు దేశమంతటికైన న్యాపించి యుండలేదు. ఇతఁడు డెవన్ షైరు, కారన్ వాల్, వేల్సు, నార్దంబ్రియా మొదలయిన ప్రాంతములను జయించి ఇంగ్లండు దేశమంతటికిని ఏకచ్ఛత్రాధిపత్యము వహించెను.

అద్దంకి — గుంటూరు జిల్లా ఒంగోలు తాలూకాలోని యొక గ్రామము. ఇది ఒంగోలు స్టేషనునకు, ఇరువదిమూఁడు మైళ్ళ దూరమున నున్నది. గుళ్ళకమ్మ యను ఏఱు, ఈ గ్రామ సమీపమున నుండి ప్రవహించును. ఈ గ్రామ సమీపమున పాడుబడిన కోట గలదు. అది రమారమి ఎనుబది యకరముల వైశాల్యము గలది. ఈకోట ప్రతాపరుద్రుని కుమారుఁడైన హరిపాలుఁడు కట్టించె నందురు. కోట యంతకంటె పూర్వముండెననియు, హరి పాలుఁడు పాడుబడిన కోటను బాగుచేయించెననియుఁ గొందఱు చెప్పుదురు. మందపాటివారు, ఇచ్చట కొన్ని దినములు ప్రభుత్వము చేసినట్లు తెలియుచున్నది.

ఈ గ్రామముచుట్టుపట్టు ప్రాంతమున చాల దూరమువఱకు, కాయధాన్యముల

వ్యవసాయము విశేషముగా నుండును. ఈ ప్రాంతముననే గోజాతియొక్క యభివృద్ధికైన పోషణము మిక్కిలి శ్రద్ధతోఁ జేయఁబడును. ఒంగోలు సంతలో నుత్తమోత్తమములని బహుమతులు వడయు పశువులలో పెక్కు లీ ప్రాంతమునుండి వచ్చునవియే. అద్దంకి ధాన్య వ్యాపారమునకు కూడలి స్థలము. ఇచ్చట డిప్యూటీ తహస్సీలుదారుఁడుండును.

అద్దంకి గంగాధరకవి - పదునారవశతాబ్దములో గోలకొండనవాబగు ఇబ్రహీమ్‌మల్లిక్ (మల్లి భురాము. 1550-81) ఆస్థానములో నుండెను. ఇతఁడు నియోగి బ్రాహ్మణుఁడు. వీరనామాత్యుని పుత్రుఁడు. ఈనవాబు తెలుఁగుకవుల నాదరించుచుండెడువాఁడు. గంగాధర కవి తపతీ సంవరణమను ఐదాశ్వాసములుగల శృంగార ప్రబంధము నాతనికిఁ గృతియిచ్చెను. మహమ్మదీయులకుఁ గృతినిచ్చిన వారిలో నీ గంగాధర కవియె ప్రథముఁడుగఁ దోచుచున్నాఁడు. సూర్యుని పుత్రికయగు తపతి సంవరణుని వివాహమాడుటయే యిందలి కథ. ఈకథ మహాభారతమున నాదిపర్వమందున్నది. ప్రబంధ లక్షణములను బట్టియు, శృంగారము ముదిర్చిన యాకాల పాచారములను బట్టియు నాతని గ్రంథమందు ఋతువర్ణన, విరహవర్ణన, చంద్ర దూషణ మొదలగునవి చాలఁగలవు గాని కథ చిన్నదియె.

తపతి పెంచుచుండిన చిలుక సంవరుణుని యొద్దకుఁబోయి యామెనుభోగానియాడి ఆతనిపై మోహము పుట్టించివచ్చును. ఈ సంగతి యెఱుఁగక తపతి,

తే॥ గీ॥ "నేమమే నీకు ముద్దుల చిన్నచిలుక !
ఎందువోయితి వోకదా యిన్నినాళ్లు
జీవ పదమైన ననుభాసి నీమగాని
నీమఁజరియింపఁ దగునట్టే రామచిలుక"

అని యడుగును. అంతటఁ జిలుకయామె కడ సంవరుణుని వర్ణించి అతనిపై ననురాగమును బుట్టించును. పతియుఁజెలికత్తెలును "కుసుమ కోమలి మీఁదఁ గోపింపఁజెల్లునే పోషింపనగుగానిపుష్పబాణ" యని మన్మథుని గూర్చి పూజింతురు. పదఁపడి సంవరణుఁడొక నాఁడు వేటకు రాగవీరిరువురొకతోటలోఁగలసికొందురు. తపతి యతనితో సూర్యునిగూర్చి తపమొనరించి అతని యనుజ్ఞనుబొందుమని చెప్ప సంవరణుఁడు తపస్సు చేయుచుండును. వసిష్ఠుఁడును, అరుంధతియు నాతనికడ కరుదెంచి, పిదప సూర్యునియొద్దకుఁబోయి తపతిని గొనివచ్చి సంవరణునకుఁ బెండ్లి సేయుదురు. పింగళి సూరనామాత్యుని ప్రభావతీ ప్రద్యుమ్నమునందువలె నాయకీ నాయకులమధ్య నొకదూతను గల్పించినాఁడు. మన్మథదూషణయేగాకుండ మన్మథపూజయు నీ గ్రంథమందుఁగలదు. ఈకవిశైలి మిక్కిలి మృదువుగను మనోహరముగను రసవంతముగను నుండును. కాని శృంగారేతరరసములు లేవు.

తపతీ సంవరణమను సంస్కృతనాటక మొకటి కులశేఖరవర్మచే రచియింపఁబడినది కలదు. ఈ కవికాలమును, కనుఁగొనవలసి యున్నది. ఈసంస్కృత నాటకమునకును మన గంగాధరుని కావ్యమునకును నెట్టి సంబంధ మున్నదో శోధింపవలసియున్నది.

అద్ధకము అనఁగా రంగులువేయుట.

హిందువుల విభజనప్రకార మిది చతుష్షష్టికళలలో నొకటి. రంగులువేయుట రెండువిధములుగా గనఁబడుచున్నది. గోడలకు తదితరములగు మరికొన్ని వస్తువులకు పూఁతఁబూయుట యొకటి, బట్టల కద్దకము వేయుట రెండవది. ఈ రెండు పద్ధతులకు నించుక భేదముగలదు. పూతపూయునపుడు ఆయారంగు పదార్థముల పొళ్ళు నీటితోగాని తైలములతోగాని కలిపి యాలేపనమును పదార్థములపైఁ బూయుదురు. ఈ రంగులలోఁ జాలభాగము కడిగి వేయవచ్చును. బట్టల కద్దకము వేయునప్పుడు రంగుపదార్థములను నీటిలో కరిగించి, బట్టలను నీటిలో ముంచుదురు. బట్టలకు వేసినరంగులు నీటిలో నుతికి యెండవేయుటవలన వెలియ కూడదు. వీని కే పక్కా-రంగులనిపేరు. పక్కా-రంగులు సిాలుగుడ్డలకే కాక శాలువలు, తివా-చీలు,కంబళ్లు మున్నగు ఉన్ని నేతలకును, గోనెసంచులు తదితరములగు నారబట్టలకును, పట్టువస్త్రములకును, ఇవిగాక టోపీలు చాపలు మున్నగువాని కుపయోగించుగడ్డి సంబంధమైన పదార్థములకును వేయుదురు. వస్తువుల నేతయందుపయోగించెడు పదార్థముల ప్రకృతిని బట్టి రంగులు వేయుపద్ధతులు మారుచుండును. ఇంతియకాక పక్కా-రంగులు వేయుట యనాదిగ రెండు విధములనున్నది. బట్టకంతయు నొకటే రంగువేయుట, రంగు నీటిలో బట్టను ముంచుటవలన నిదియేర్పడును. ఇది సాదా యద్దక మనిపించుకొనును. ఇందు నలుపో యెరుపో యేదోయొక రంగు మాత్ర ముండునుగాని బట్టలమీఁద వివిధవర్ణము లుండవు. కలంకారీయద్దకమని మరియొక విశేషము గలదు. ఇందొకే బట్టమీద వేర్వేఱు రంగులతోఁ జిత్రించిన వన్నెలు చిన్నెలు గాననగును. కలంకారీయద్దకము చేయువానికి కొంత చిత్రకళా జ్ఞానమును గలిగి యుండవలెను. లేనిచోఁ దనయద్దకములపైఁ బ్రజలకు మోజు పుట్టింపలేఁడు. సాదా యద్దకమునకుగాని, కలంకారీ యద్దకమునకుగాని చలువ చేయుట ప్రాతిపదికమై యున్నది. కోరాలకు, అనఁగా ముడిగుడ్డలకు రంగులంటవు. ముడిగుడ్డల నుడకవేసి మల్లులు చేసినప్పుడే రంగులు పట్టును. కావున చలువఁజేయుట(Bleaching), సాదా యద్దకము(Dyeing), కలంకారీయద్దకము (Calico-printing), అను మూఁడు భాగములుగ నీ వ్యాసమును విభజించి ఆయా శీర్షికలకు సంబంధించిన చరిత్రాంశములును, పాశ్చాత్యపౌరస్త్య పద్ధతులును, క్లుప్తముగ వర్ణింపఁబడును.

చలువ సేయుట

కోరాలను చలువచేసి మల్లులుగాఁ జేయుట మిక్కిలి పురాతనమైన పరిశ్రమము. పురాతననాగరక జాతులవారందఱు నిశ్రీ చేసెడివారు. అస్సిరియనులు, ఇజిప్షనులు, గ్రీకులు, రోమనులు, మున్నగు పురాతన నాగరక జాతుల వారివిద్యయందుఁ గొంతవఱకుఁ బ్రవీణతఁగాంచినట్లు వారివారి చరిత్ర గ్రంథముల వలన స్పష్టమగుచున్నది. పౌరస్త్యులలో హీబ్రూజాతివారి వేదగ్రంథమగు బైబిలునందు, చలువ బట్టలవిషయమై వ్రాయఁబడియున్నది. మన దేశములో మలినమునకుఁ బాపమనియు, స్వచ్ఛతకుఁ బుణ్యమనియు సంప్రదాయసంజ్ఞ గలదు. ఇదిగాక దిగంత విశ్రాంతకీర్తిని దెలుపుతోఁ బోల్చుట యను శ్రుతముగాఁగవి సమయమైయున్నది. ఇంకను నితరదృష్టాంతములను బట్టికూడ మనపెద్దలు రంగులలో నెల్లతెలుపునకు నెక్కుడు ప్రాముఖ్యము నిచ్చినట్లును, వారికి 'కోరాలను' మల్లులు జేయుటయందు సామర్థ్యమున్నట్లును, దాఖలాలున్నవి.

పద్ధతులు

రంగులు వేయుటయందువలెనె చలువచేయుట యందును వస్తువులనుబట్టి పద్ధతులు మారుచుండును. నూలుబట్టలను మల్లులు చేయుటలోను, రోమసంబంధమైన పదార్థములను తెలుపు సేయుటలోను భేదముగలదు. నార,దంతములు,ఎముకలు, ఈకెలు మున్నగు పదార్థములు గూడఁ జలువ చేయఁబడును.

చలువచేయుట కిప్పుడు రెండు పద్ధతులు వాడుకలోనున్నవి. మొదటిది పురాణపద్ధతి, రెండవది నవీనపద్ధతి. మొదటి దానిని పురాతననాగరక జాతులవారందఱు వాడుచుండిరి. రెండవది రసాయనశాస్త్రజ్ఞానాభివృద్ధినుండి పరిణమించినది. ప్రస్తుత మీ శాస్త్రీయ పద్ధతి పాశ్చాత్య నవనాగరిక జాతులయందు మాత్రము వాడుకలోనున్నది.

చలువచేయుటయందు ముఖ్యమైనపనులు మూఁడు :— ఉతుకుట, ఉడకవేయుట, నీటిలో జాడించియెండవేయుట. ఇది పురాణపద్ధతి. ప్రతిదేశమునందును బూర్వులు వాడిన పద్ధతి యిదియె. నీటిలో నుడకవేయుచు నెండకు నెండించినచో గుడ్డలు తెలుపగును. కాని దీనికి నెక్కువకాలము పట్టును. ఐరోపాదేశమునఁ బురాతన పద్ధతిప్రకారము నూలునుగాని గుడ్డలనుగాని సున్నపునీటిలో నుడకనిచ్చి యెండనిచ్చెడివారు. ఉన్ని సంబంధమగు వస్తువులకు సబ్బు, (చాకలి) చవుడు, కుమ్మరమట్టి, గచ్చేరునీరు మున్నగు క్షార పదార్థములను వాడెడివారు. అప్పుడప్పుడు గొడ్లరొచ్చును (పంచితము) గంధకపు పొగను పూర్వు లుపయోగించు చుండెడివారు. పూర్వపు గ్రీకు లీపద్ధతులన్నిటి నవలంబించెడివారని వారిపురాతన చరిత్ర గ్రంథముల వలనఁ దెలియుచున్నది.

చలువచేయుట మిక్కిలి పురాతన పరిశ్రమ మైనను సుమారు నూటయేఁబది సంవత్సరములక్రిందట నాంగ్లేయులకు మల్లులు తయారుచేయు పద్ధతి తెలియదు. అప్పటికాలములో డచ్చివారు; అనఁగా ఒలాందు (Holland) దేశీయులు, ఈ పరిశ్రమ యందు మిక్కిలి ప్రవీణతఁగాంచిరి. అందుచేత నింగ్లాండులోఁ దయారుచేసిన కోరాలన్నిటిని మల్లులఁ జేయుటకు హాలెండు దేశమునకుఁ బంపెడివారు. డచ్చివారియప్పటి పద్ధతి కొంచె మించుమించుగ మన దేశములో నిప్పుడు వాడుకలోనున్న పద్ధతియె యగుటచేత వారెట్లు చలువచేసెడివారో యించుక తెలిపెదము. కోరాలను క్షారోదకములోనుడకనిచ్చి కొన్ని రోజులు నానఁబెట్టెడివారు. తరువాత వానిని నీటిలోజాడించి వారమురోజులు మురిగిన కుడితిలోగాని లేక పులిమజ్జిగలోగాని నాననిచ్చెడివారు. ఇట్లు నానినగుడ్డల నుతికి గడ్డిపైఁ బఱచి, అప్పుడప్పుడు నీరుచల్లుచు నెండనిచ్చెడివారు. ఎంతయాలస్యముగ నెండిన మల్లుల కంత నిగనిగవచ్చును. అందుచేత కోరాలను మంచి మల్లులుగాఁ జేయుటకు సుమారు ఆఱుమాసములు పట్టెడిది. క్రీ॥ శ॥ ౧౭౪౯ సంవత్సరములో మొట్ట మొదట నాంగ్లేయులు చలువచేయుట కుపక్రమించిరి. ఆరంభదశలో వీరిపద్ధతికిని డచ్చివారిపద్ధతికిని, ఈమ ద్భేద మైన లేకుండెను. కాని కొలఁదికాలములోనె కొన్నిమార్పులు చేయఁబడినవి. కోరాలను బులియఁబెట్టుటకుఁ బులిమజ్జిగ వాడెడివారని. పైని వ్రాసియుంటిమి. పులి మజ్జిగకుబదులు గంధక ద్రావకము నుపయోగించుట కారంభించిరి. ఈమార్పువలన వారముల కొలఁది బులియఁబెట్టుట రోజులలోఁ బడియెను. కాని నవీనపద్ధతి కనుగుణ్యమగు మార్పు క్రీ॥ శ॥ ౧౭౮౬-వ సంవత్సరము వఱకును జరుగలేదు.

క్రీ॥ శ॥ ౧౭౭౪-వ సంవత్సరమున "షీల్" అను స్వీడను దేశీయుఁడు లవణవాయువు (హారినము-Chlorine) అను నొకక్రొత్తపదార్థమును గనిపట్టెను. ఉప్పునుండి తయారుచేయుట వలన దీనినిలవణవాయు వనవచ్చును. వాయుపదార్థమయినను లవణవాయువుగాలివలె వర్ణవిహీనమైనదికాదు. కొంచెము పసుపుపచ్చవర్ణము గలిగి యుండును. పీల్చుటకుగాని పీల్చినచో ముక్కునను కండ్లను నీరుగారి తలనొప్పివచ్చును. ఈనూతనవాయువుయొక్క కాంతినిజూచి యాంగ్లేయులు దీనిని "క్లోరీన్" అనిరి. పసుపుపచ్చరంగని యీపదమునకర్థము. ఈ కారణమునుబట్టియే మన దేశభాషలలోనికి 'హారిన' మనితర్జుమాచేస్తిరి. లవణవాయువు యొక్క ప్రధానగుణము రంగుల నపహరించుట. నీలిగుడ్డగాని చెంగావిగుడ్డగాని తడిపి లవణ వాయువున్న పాత్రలోవైచి మూతఁబెట్టిన యెడల కొలదికాలములో నాగుడ్డ యిస్త్రీచేసిన మల్లువలె స్వచ్ఛముగనుండును. తెల్లనగుటకు రెండు నిముసములకంటె నెక్కువ కాలము

పట్టదు. ఈయంశము దెలిసినవెంటనే వర్తకు లీవాయువుతో మల్లులఁజేయ నారంభించిరి. కాని, లవణ వాయువును నిరాఘాటముగ వాడుటకుఁగొన్ని విఘాతములు సంభవించెను. దీనిని పీల్చినయెడల పనివాండ్ర కపాయము గలుగుచుండెను. అపాయమునివారించుటకై లవణవాయువును నీటిలోఁగలిగించి యానీటి లో గుడ్డలు జాడించెడివారు. లవణమువలె లవణవాయువుకూడ నీటిలోఁగఱగును. లవణ వాయువువలెనే,యీ నీరుకూడరంగులఁ బోఁ గొట్టఁగలదు. క్రీ॥ శ॥ ౧౭౮౭-వ సంవత్సర మున నాంగ్లేయులీ నవీనపద్ధతి నవలంబించి కోరాలను మల్లులఁజేయ నారంభించిరి.

లవణ వాయువును వాడుటంత యపాయ కరము గాకపోయినను లవణవాయువుఁగలిపిన నీటినుపయోగించుటలోఁ గూడ కొన్ని యిబ్బందులుండెడివి. ఒకొ్కకప్పుడు బట్టలు చెడిపోవుచుండెడివి. అంతేకాక నిలువయున్న చో నానాటికి చలువచేసెడి శక్తి తగ్గును. ఈ యిబ్బందులఁ బోఁగొట్టుటకై 'బెర్తాలె'యను పరాసు వాస్తవ్యుఁడు లవణ వాయువుగల నీటితోఁ గొంచెము క్షారజలము గలిపెను. ఈ క్షారజలమునకు "పొటాస"ని పేరు. ఇది సున్నమువలె గాఢమైనపదార్థము. ఇదియు సున్నమువలె పసుపును వసంతముచేయును. పొటాసు నీటిని జేయుటకూడ సులభమే. ఉత్తరేణి బూడిదెగాని తెల్లగజ్జేరి బూడిదె గాని నీటిలోఁ గలిపి యానీటిలో సున్నపు తేటఁబోసిన యెడల క్షారజల (పొటాసు) మేర్పడును. ఈ క్షారోదకములో లవణ వాయువుఁ గలిపిన యెడల నానీరు చలువ చేయుట కుపయోగించును. దీని నుపయో గించినచో బట్టలు చెడిపోవు. కాని, లవణ వాయువుగల నీటివలెనే, యీక్షారజలము కూడ నిలువయుంచిన యెడలఁ జెడిపోయి చలువచేయుట కుపయోగపడదు. ఎప్పటి కప్పుడు తయారుచేసి వాడవలెనుగాని యొక దేశమునుండి మరియొక దేశమున కెగుమతి చేయుటకు వలనుపడదు. అందుచేత నీ క్షారో దకము వర్తకసరిలోఁ బ్రాముఖ్యము చెంద లేదు. వర్తకమున కుపయోగించి, యెగు మతి దిగుమతులవలనఁ జెడకుండ నుండుపదా ర్థమును గనిపెట్టినది 'హెన్రి, టెనెంటు' లను నాంగ్లేయ వర్తకులు.

వీరు మొట్టమొదట 'పొటాసుకు' బదు లుగ, చిక్కనిసున్న పునీరు వాడిరి. సున్నము నకు లవణవాయువును బీల్చుకొనుశక్తిగలదు. కాని,తరువాతసున్న పునీటికంటెపొడిసున్నమే మేలని గుర్తెఱిగి వారు దానినే యుపయో గించిరి. గదిలో సున్నముపఱచి యాగదిని లవణవాయువుతో నింపినయెడలఁ గొలఁది కాలములోనె యాసున్నము లవణవాయువు నాకర్షించి తెల్లనిచూర్ణమగును. దీనిని సీసాల కెక్కించి సీలువేసినచో నెంతకాలమైనను చెడక చలువచేయుట కుపయోగించును. దీనికే "చలువసున్నము" (Bleaching

Powder) అనిపేరు. చలువసున్నము నీటిలోఁగలిపి గుడ్డల నా నీటిలో ముంచి దానికి కొంచెము గంధక ద్రావకము గలిపినయెడల శీఘ్రకాలములో గుడ్డలు తెల్లఁబడును. ఇదియే ప్రస్తుతము పాశ్చాత్యులు మల్లులు చేయుట కుపయోగించుపద్ధతి.

బట్టలనుబట్టి చలువచేసెడి పద్ధతులు మారుచుండునని పైని వ్రాసి యుంటిమి. నూలు

నూలుగుడ్డల చలువ

కండెలుగాని నూలుబట్టలుగాని పూర్వ మీ విధముగఁ దెలుపుచేసెడివారు. మొట్టమొదట వేడినీటిలో జాడించుటవలన, క్రొత్తగుడ్డలో నుండుపిండివగయిరాలుకొంతవఱకుఁబోవును. తరువాత వానిని తౌరోదకములో ననఁగా చవుడు మొదలగు కారపునీటిలో నుడక వేయుటవలన నీటిలోఁగఱగని జిడ్డుపదార్థములు మున్నగునవి వీడిపోవును. తిరిగి యీగుడ్డలను మంచినీటిలో జాడించి గడ్డిమీఁద నెండవేసి నప్పుడు, ఎండకు, గాలికి, గాలియందున్న నీటియావిరికిని, గుడ్డలకుఁ దెలుపెక్కును. బాగుగఁ దెల్లఁబడువఱకును ఈపనులు సేయుచుండెడివారు. బాగుగ తెలుపెక్కినతరువాత నాగుడ్డలను గొంచెము గంధక ద్రావకము గలిపిన నీటిలో ముంచెడివారు. ఇందువలన గుడ్డలనుండి మాలిన్యమంతయు తొలఁగి పోయెడిది. ఇదియే పురాణపద్ధతి. ఈపద్ధతిలో రెండు మూఁడు నష్టములున్నవి. చలువ చేయుటకుఁ గాలమెక్కువపట్టును. అందుచేత గుడ్డయొక్క సత్తువ కొంతక్షీణించును. రెండవది శ్రమయెక్కువ. దీనినిబట్టి కర్చెక్కువగును. ఈ కారణములను బట్టి ప్రస్తుతము పాశ్చాత్యదేశములలో పురాణపద్ధతి యడుగంటి శాస్త్రీయపద్ధతియే అమలులోనున్నది. శాస్త్రీయపద్ధతి ప్రకారము బట్టలను మొట్టమొదట నీటిలోనుతికి చవిటినీటిలో నుడకవేసి తరువాత చలువ సున్నపునీటిలో కొంతసే పుంచెదరు. ఈగుడ్డలను తరువాత గంధక ద్రావకము గలిపిన నీటిలో ముంచి మంచి నీటిలో జాడించి యెండ వేయుదురు. సహజమైనమాలిన్యముగాని, మగ్గముమీఁద గలిగిన మాలిన్యముగాని పోఁగొట్టుటయే చలువఁ జేయుట యందలిముఖ్యోద్దేశము. శాస్త్రీయపద్ధతిననుసరించినచో నీమాలిన్యములన్నియు తక్కువ శ్రమతో శీఘ్రకాలములో పోవును. నూలు సంబంధమగు వస్తువులను తెలుపుచేయుట కిది సామాన్యపద్ధతి. కాని నూలును చలువ చేయుటలోను నూలుతో నేసిన గుడ్డలనుచలువ చేయుటలోను తబిసీలుగా పరీక్షించిన యెడల రెండుపద్ధతులలో కొంచెము భేదముగలదు. పైని వ్రాసిన పద్ధతిప్రకారము నూలుచలువఁ జేయఁబడును. ఈచలువచేయుటకు అరగంటకంటె నెక్కువ కాలముబట్టదు. కాని నూలు బట్టలను తెలుపు చేయుటకింతకంటె నెక్కుడు కాలము, శ్రమయుఁ గావలసి యుండును. నూలుబట్టలచలువ మూఁడువిధముల నున్నది. కోరాలను మల్లులఁజేసి యమ్ముటకొక పద్ధతి.

సాదాయద్దకములకై తెలుపుచేయుట కొక మార్గము. కలంకారీయద్దకముల కొఱకు చలువచేయు మార్గమువేఱు: ఇందు ముఖ్యమైనది యీమూఁడవది.ఏల్నయన బట్టయందే మాత్రము మలినమున్నను కలంకారీయద్దకములో రంగులు చెడి పోవును. కలంకారీ యద్దకపుచలువ విషయమై ముందుగ కొంచెము వ్రాసెదము.

చలువఁజేయుటకు పూర్వము నేతగుడ్డల నొకదానికొకటి చివరలుచేర్చి కుట్టి సాఫు చేయుదురు. అనఁగా ఎఱ్ఱగా కాల్చిన రాగి రేకులమీఁద గుడ్డనుపఱచి వెంటనే తీయుదురు. లేక రాగిరేకుగొట్టము నొకదానిని ఎఱ్ఱగాఁ గాల్చి యది తిరుగుచుండగ గుడ్డలను దాని పైఁబఱచి వెంటనే తీసెదరు. ఇట్లుచేయుట వలన గుడ్డలనంటియున్న కొన్ని మలినములు, దూదిపీచులు, ఎచ్చుతగ్గులు నశించిపోవును. ఇది జరిగినవెంటనే యాగుడ్డను నీటితొట్టిలో ముంచెదరు. ఒకవేళ నిప్పురవల్లు బట్టనంటి యున్నచో దీనివలన నవియారిపోవును. అటు తరువాత సాఫుచేసినగుడ్డల నొకరోజు నీటిలో నాననిచ్చి సున్నములో నుడకవేయుదురు. నీటిలో నానుటవలన గంజి, పిండి మున్నగు కొన్ని పదార్థములు చాలవఱకు పోవును. సున్నపునీటిలో నుడికిన తరువాత గుడ్డనంటుకొనియున్న జిడ్డుపదార్థములు విడిపోవును. నానఁబెట్టుటవల్లన విడిపోనిగంజి మొదలయినవి కూడ సున్నములో నుడుక వేసినప్పుడు హరించును. సున్నములో నుడకవేసిన తరువాత బట్టలు సాధారణముగ వలుపెక్కును. దీనిని పోఁగొట్టుటకై బట్టలను నీటిలోజాడించి గంధకద్రావకముగాని శంఖద్రావకముగాని గలిపిన నీటిలోఁ గొంతసేపు గుడ్డలనుంచెదరు. ఈద్రావకములు బట్టల నంటుకొని యున్న సున్నమును తదితరమలిన పదార్థములను కఱిగించును. కాని ఆబట్టలలో ద్రావకము లుండెనచో బట్టలు చీకి త్వరలో చినిగిపోవును. కావున వానినితిరిగి చక్కఁగా నీటిలో జాడించి తిరిగి మూఁడుసారు లుడకవేసెదరు. మొదటితూరి మూఁడుగంటలసేపుసోడాపొడి (Soda-ash) నీటిలోను, రెండవతూరి పంద్రెండు గంటలుసేపు సోడాపొడియు, సోడాక్షారము (Caustic soda) ను గలిపిననీటిలోను, మూఁడవతూరి తిరిగి సోడాపొడి నీటిలోమూఁడు గంటలసేపు ఉడకవేయుదురు. రెండవసారి యుడకవేయునప్పుడు కొంచెము సీమగుగ్గిలము (Rasive) కూడ నీటిలోఁగలిపెదరు. ఈ మూఁడుడుకులవలన రంగులను చెడగొట్టెడి మలినపదార్థములన్నియు గుడ్డలనుండి విడిపోవును. ఉడకవేసినగుడ్డలను శుభ్రమైన నీటిలో జాడించిన తరువాత చలువసున్నము (Bleaching powder) గలిపిననీటిలో కొన్ని గంటలు నానఁబెట్టెదరు. తరువాత నాగుడ్డలను పిండి శంఖద్రావకము (Hydrochlonic acid) గలిపిన నీటిలో మూఁడుగంటలసేపు నాననిచ్చెదరు. అప్పు డాబట్టలను నీటిలో

జాడించి యెండవేసినయెడల మలినపదార్థములన్నియుఁబోయి స్వచ్ఛమగు మల్లులగును. ఇట్లు చలువఁజేయుటకు రమారమి ఐదు రోజులు పట్టును.


సాదామెలుపద్ధకముకొఱకై చేసెడి చలువ కింతకష్ట మక్కఱలేదు. కాలముకూడ కొంచెమే పట్టును. ఈచలువలో బట్టలను సాఫు చేయనక్కఱలేదు. తెలుపుచేయుటకు చలువ సున్నము పనికిరాదు. చలువఁజేయుటకు లవణవాయువు నిచ్చు చలువసున్నము నుపయోగించిన యెడల నెఱుపు రంగుబట్టలకు బాగుగనంటదు. ఈబట్టలను నీటిలోనుడుకవేసి తరువాత రెండుపర్యాయములు సోడాక్షారోదకములో నుడుకపెట్టెదరు. ఇట్లుడికిన గుడ్డలను గంధకద్రావకముఁగలిపిన నీటిలో రెండు గంటలు నానఁబెట్టి మంచినీటిలో జాడించి యెండవేసెదరు. ఇందువలన బట్టల కొకవిధమైన తెలుపు వచ్చును. ఎరుపు రంగులు బట్టుట కీ తెలుపుచాలును.

రంగులు వేయుటకేగాక కేవలము మల్లుల మాత్రముజేసి వర్తకసరిలో నమ్ముటగలదు. మన దేశములో నమ్మెడి సీమమల్లు లీజాతిలోనివి. ఈమల్లుల తయారు జేయుటయందు పైనివివరించిన రెండు పద్ధతులకంటె కొంచెము భేదముగలదు. ఈమల్లులతయారు జేయుటకుఁగూడ చలువసున్నము నుపయోగింతురు. కాని మొదటఁజెప్పిన పద్ధతిలోవలె బట్టలను సాఫుజేయ నక్కఱలేదు. సోడాపొడిలోను, సోడాక్షారములోను ఉడకవేయునప్పుడు గుగ్గిలమును గలుపనక్కఱలేదు. కోరాలుమల్లులయిన తరువాత గంజిపెట్టెదరు. నిగనిగలాడు తెలుపురంగు వచ్చుటకుఁగాను వేడిగంజిలో కొంచెము నీలిమందుగాని లేక నీలివర్ణముగల మరియొకపొడిగాని కలిపెదరు. దీనివలన మల్లుల కొకవిధమగు తళుకుఁగలుగును. గంజిపెట్టినతరువాత ఇస్త్రీజేసి మడతలువేసి బజారులో నమ్మఁజూపెదరు.

శాస్త్రీయ చర్చ

చలువచేయుట యందుఁగల శాస్త్రభాగము బహుస్వల్పము. 'చలువఁజేయుట కాయా పదార్థములే యెందుల కుపయోగించవలెను? ఆయా పదార్థములు చేసెడి పనియేమి?' మున్నగు ప్రశ్నలవిచారణ ప్రకరణమునకు శాస్త్రభాగమని (Theory) పేరు. చలువసున్నము దప్ప తక్కిన పదార్థము లన్నియు బట్టల నంటియుండు మలిన పదార్థములఁబోగొట్టుటకే యేర్పడినవి. చలువ సున్నమునందు లవణవాయువు గలదని పైన వ్రాసియుంటిమి. ఈ లవణవాయువు తడిబట్టల నంటియున్న నీటి యందుఁగల ఉదజని (Hydrogen-జలవాయువు) తోఁగూడి ప్రాణవాయువును వెడలఁగొట్టును. ఆప్రాణవాయువు బట్టలయందుఁగల మలిన పదార్థములతోను, రంగులతోను గలియుటవలన క్రొత్తద్రవ్యము లేర్పడును. ప్రాణవాయు సమ్మేళనమువలనఁ గలిగిన నూతన ద్రవ్యములు రంగులేనివియై యుండును.

అందుచేత బట్టలు తెల్లనగును. లవణవాయువు ఉద్భిజ్జద్రవ్య జనితములగు రంగులను (Vegatble colours) మాత్రము పోగొట్టును గాని ఖనిజద్రవ్య జనితములగు రంగులను (Mineral colours) పోఁగొట్టఁజాలదు. నీలిమందు, రంగులను, తొగరుచెక్క మున్నగు మూలికలచే వేసెడి రంగులను, లవణవాయువు వలనఁ బోఁగొట్టవచ్చును. కాని గంగసిం



బట్టల నుడకవేయుటకు కాగు

ఈ, ఈ లు:_మనుష్యులు దూరుటకు సందులు.

ఋ:_ఆవిరిమార్గము.

ఎ:_ఆవిరి కాగులోనికి ప్రవేశించుదారి.

ఐ:_ఉడుకుపూర్తియైన తరువాత కాగులోని నీరుతీయుటకు గొట్టము.

ఋా:_చల్లనీరు వెలుపలికిఁబోవుదారి.

అ:_కావలసినప్పుడు క్రొత్తనీరు కాగులోఁ బోయుటకు గొట్టము.

ఇ:-కావలసినప్పుడు సున్నపునీరు కాగులోని కెక్కించుసాధనము.

1-వ పటము


దూరము, అన్నభేది, మున్నగు భూమినుండి త్రవ్వితీసిన వస్తువులచే వేయఁబడు రంగుల్లు లవణ వాయువువలన నశింపవు.

మనదేశములో రంగులు వేయుటకుగాను బట్టలు చలువఁ జేయుదురు. పాశ్చాత్య దేశములలో చలువఁ జేయుటయే ప్రత్యేకముగ నొక వ్యాపారమై యున్నది. అందుచేత ననేకులు శ్రమపడి యీవ్యాపారము నభివృద్ధిఁ జేసిరి. ధనవ్యయమును పనివాండ్రశ్రమయును తగ్గించుటయే వీరిముఖ్యోద్దేశము. ఈసౌకర్యములకై చలువఁజేయుటయందుఁ బెక్కు మార్పులు చేయుచున్నారు. చలువసున్నము వా

డుటవలన వెల యధికమగునని చలువఁజేయు
టకు కొందఱు సముద్రపునీటిని వాడుట కారం
భించిరి. విద్యుత్ప్రవాహము వలన (Electric
current) సముద్రపు నీటినుండి లవణ వా
యువును దీయవచ్చును. ఈ లవణవాయువునే
యుపయోగించి బట్టలను చలువఁజేయవచ్చు

ను. కాని కొన్ని సౌకర్యములు లేకపోవుట
చేత నీపద్ధతియంత పాటింపులోనికి రాలేదు.

పనివాండ్రశ్రమనుతగ్గించుటకై యనేక సా
ధనము లేర్పఱచిరి. బట్టల నుడకవేయుట కేర్ప
బడిచాకిబాన (Kier) యనుపరేకులతో జేయఁ
బడి యుండును. దీనియెత్తు పదిపండ్రెండడు
గులు, వెడల్పు ఆఱేడడుగులు.
మనుష్యుఁడు దూరుటకు మీఁది
భాగమున రెండుబెజ్జములు దప్ప
తక్కిన దంతయు మూసియుం
డును. (1-వ పటము చూడుము)
గుడ్డలనుడకఁబెట్టుటకు బానక్రింద
మంటవేయరు. ఆవిరిచేత బాన
లోని నీటినిగాచెదరు. ఈ కాగు
యొక్క యెడమభాగము క్రింది
గా నావిరిప్రవేశించి పైకిఁబోయి
బట్టలను పైనుండియుడకఁబెట్టును.
బట్టలు చక్కగ నుడికిన తరువాత
నానీటిని కాగుయొక్క కుడిప్రక్కన
నున్న గొట్టముగుండ తీసివేయు
దురు. ఈబట్టలను నీటిలోజాడించి
పిండుటయుఁగూడ యంత్రసహా



2-వ పటము

యము వలననె జరుగుచున్నది. నీటిలో జాడిం
చుట కుపయోగించెడి యంత్రము పత్తి
రాటమువలె నుండును. (2-వ పటము చూ
డుము) ఇది యంతయు నినుముతోఁ జేయఁ
బడును. రాటములో ముడిపత్తిని బెట్టినప్పుడు
గింజ లన్నియు నొకవైపునఁబడి దూదిపింజలు

వెలువడునట్లుమురికిబట్టల నీయంత్రములోనికిఁ
బంపినప్పుడు మురికి నీరంతయు వెనుకనిలిచి
స్వచ్ఛమైనబట్టలు వెలుపలికి వచ్చును. ఇట్లే
సాధ్యమయినంతవఱకు ప్రతిపనియు యంత్ర
సహాయమువలనఁ జేయుచున్నారు.

చలువఁజేయు నీసామాన్యపద్ధతి తెలియును గాని యందు కుపయోగించెడి వస్తువులపాళ్లు మున్నగు తప్పీళ్లు సర్వజనులకుఁ దెలియవు. పనివాని యనుభవమును బట్టియు నేర్పరితనమునుబట్టియు నివి మారుచుండును. అయినను మచ్చుకొఱకొక యోగము నీక్రిందఁ దెలిపెదను. కలంకారీ యద్దకముకొఱకు తయారు చేసెడి బట్టల నీవిధముగ చలువఁ జేయుదురు. 24 పౌనులు అనఁగా రమారమి మణుగు తూనికగల బట్టను చలువజేయుటకు:—

1. సాపుచేసిన తరువాత నీటిలో జాడించుట.
2. పౌనుసున్నము గలిపిన నీటిలో నుడక వేయుట (12 గంటలసేపు)
3. శంఖద్రావకము గలిపిననీటిలో నుతుకుట.
4. మూఁడుసారులు సోడాపొడిలోను సోడాక్షారములోను ఉడకవేయుట—మొదటి తూరి 4 పలముల సోడాపొడి నీటిలో మూడుగంటలు; రెండవతూరి 12 పలములు సోడాపొడి 5 పలములు గుగ్గిలము, రెండున్నర పలము సోడాక్షారము గలిపిన నీటిలో 12 గంటలసేపు; మూఁడవ తూరి 5 పలములు సోడాపొడి గలిపిన నీటిలో మూఁడుగంటలు.
5. రెండుపలములు చలువసున్నముఁ గలిపిన నీటిలోముంచి మంచినీటిలో జాడించుట.
6. మూఁడుపలములు గలిపిన శంఖద్రావకపు నీటిలో సుమారు మూఁడుగంటలుంచుట.
7. మంచినీటిలో బాగుగ జాడించి నీటిని పిండివేసి యారవేయుట.

మల్లుల యుపయోగమునుబట్టి చలువఁజేయు పద్ధతులు మారుచుండును. ఇదియొక ప్రకరణము. మరియు ననేక యోగములు గలవు.

నారబట్టచలువ

నారనుగాని, నారతో వడికిన నూలుగాని నారబట్టలనుగాని చలువఁజేయవచ్చును. పత్తికంటె నారయందెక్కువ మాలిన్యముండును. మలినపదార్థములేమి, రంగుపదార్థములేమి, నారయందు నాల్గవ వంతుకంటె నెక్కువయుండును. అందుచేత నారసంబంధమైన వస్తువుల చలువ నూలుబట్టల చలువకంటె మిక్కిలి కష్టము. ఎక్కువ శ్రమ నేర్పరితనము గావలసి యుండును. చలువఁ జేయుటయందు నారబట్టలకును, నూలుబట్టలకును పద్ధతులొక్కటియేయైనను తప్పీళ్ళలో భేదములుండును. ఏలయన లవణవాయువు, క్షారములు, ద్రావకములు మొదలగు గాటుపదార్థము లెక్కువ వాడుకఁ జేసినయెడల నారను తినివేయును. నారయొక్క సత్త్వ చెడకయుండుటకు చలువఁజేయుట కుపయోగించెడి పై మూఁడు పదార్థములను కొంచెము కొంచెముగా జాగ్రత్తతో వాడవలసి యుండును. అందుచేత నారసంబంధమైన వస్తువులను చలువఁజేయుటకెక్కువ కాలముపట్టును. ఉడకవేయుట నీటిలోజాడించుట, చలువసున్నపునీటిలో నానఁబెట్టుట

మున్నగు ప్రకరణములు నూలుచలువలో కంటె నారచలువల్లో నెక్కువసారులు గ్గావలసి యుండును. ఉడకవేసినకొలఁదీ తెలుపెక్కుచుండును. ఇంతియేగాక చిట్టచివర నారవస్తువులను గడ్డిపై నెండవేయుదురు. అప్పుడప్పుడు తడుపుచు నొకవారము గడ్డిపై నెండనిచ్చినఁగాని నారవస్తువులు పూర్తిగ తెల్లఁబడవు. మాదిరికొఱకై నారవస్తువులను చలువఁజేయుయోగము నొకటి నీ క్రిందఁ బొందుపరచెదము.

1. సోడాపొడినీటిలో (1 పాలుపొడి; 9 పాళ్లు నీరు) నాలుగుగంటలు ఉడకవేయుట.
2. చలువ సున్నపు నీటిలో నొకగంటసేపుంచుట.
3. గంధక ద్రావకపునీటిలో నొక గంట నానవేయుట.
4. తిరిగి సోడాపొడినీటిలో (1 పాలు పొడి, 19 పాళ్లు నీరు) నొకగంటసేపుడకనిచ్చి మంచినీటిలో జాడించుట.
5. తిరిగి చలువసున్నపునీటిలో గంటసేపుంచుట.
6. తిరిగి గంధకపుద్రావకపునీటిలో నాననిచ్చి మంచినీటిలో జాడించి యెండనిచ్చుట.

ఈ విధముగ రెండు పర్యాయములు చేసినను పూర్తియగు తెలుపురాదు. నారబట్టలకు పూర్తియగు తెలుపువచ్చుటకు పైనివివరించిన పనులయిదారు సారులు చేయుచు మధ్యమధ్య తడిగడ్డిమీఁద నెండవేయుదురు. అప్పటికిని పూర్తిగ తెల్లఁబడనిచో బట్టలను సబ్బునీటితో గట్టిగ తోమెదరు. అటుతరువాత నుడకవేయుట మొదలగు పనులు పైని వివరించిన ప్రకారము చేసినయెడల పూర్తియగు తెలుపువచ్చును. నారబట్టలను చలువచేయునప్పుడు చలువ సున్నమునకు బదులుగ మరికొన్ని పదార్థము లుపయోగించినఁ ద్వరితముగ తెల్లఁబడును. కాని కొన్ని సౌకర్యములనుబట్టి పైపద్ధతియే వాడుకలో నున్నది.

రంగులు వేయుటయేగాక యితరపనుల కుపయోగించెడివారు పదార్థములను గూడ చలువఁజేయుదురు. బట్టలనేతకుపయోగింపక పోయినను గోగునార, జనపనార మున్నగు నార పదార్థములు తెలుపుఁజేయఁబడును. గోగునార చలువ మిక్కిలి సులభము. నారను చలువసున్నపు నీటిలో నానవైచిన తరువాత గంధకద్రావకపు నీటిలోముంచి మంచినీటిలో జాడించెదరు. బట్టల చలువలోకంటె నారచలువలో చలువసున్న మెక్కువ వాడఁబడును. ఇట్లు మూఁడుసారులు సున్నపునీటిలో నుడకవేసిన తరువాత నారకు పూర్తియగు తెలుపు వచ్చును. సున్నమువలనను, ద్రావకమువలనను నారచెడిపోకుండుటకై యొకపర్యాయమొకగంటకంటె నెక్కువకాలము నాననీయరు. ఈ పద్ధతి సులభమైనను కొంతకాలమగు నప్పటికి నార పచ్చబడును. దీనిని నివారించుటకై తెలుపుఁబడిన నారను సబ్బులో నుడకవేసి యొకవిధమైన గోధుమవన్నె వచ్చులాగు జేయుదురు.

జనుపనారను సామాన్యముగ చలువఁ జేయరు. ఏలయన నది ముఖ్యముగ మోకుల కును బైనుదారముఁ జేయుటకును నుప యోగించుటచేత మిక్కిలి తెల్లఁగా నుండుట యనవసరము. చలువఁజేయవలసినచో గోగు నారవలెనే చలువఁజేయఁబడును.

జంతువులయొక్క రోమ భాగమునకు ఉన్నియని పేరు. ముఖ్యముగా గొఱ్ఱెల యొక్కయు మేకల

ఉన్ని చలువ

యొక్కయు బొచ్చు నుండి ఉన్ని తయారుచేయుదురు. బ్రతికియున్న జంతువులనుండి కత్తిరించి తీసిన ఉన్ని శ్రేష్ఠము. చచ్చిన తరువాత తోళ్ళను సున్న ములో నూరవేసి ఉన్నిలాగుదురు. కాని యిది బిరుసెక్కి రంగులు వేయుట కంతనాణ్య ముగ నుండదు. ఎట్లు తయారుచేసినను ఉన్ని యందు పత్తిలోకంటె నెక్కువ మాలిన్యముం డును. ఉన్నియందుఁగల చెమట, జిడ్డు, క్రొవ్వు మొదలగునవి జంతువులవలనఁ గలుగు చున్నవి. ఇవిగాక తయారుచేయుటలో మట్టి మున్నగు మరికొన్ని మాలిన్యములు ఉన్ని యందుఁజేరును. ఈ మలిన్న పదార్థములు కొంతవఱకైనఁ బోయినఁగాని ఉన్ని చలువఁ జేయుటకు యోగ్యము గాదు. అందుకని ఉన్నిని మొట్టమొదట "బెంజీను"లో నూర వేసెదరు. బెంజీను కిరస నాయిలువంటి ద్రవపదార్థము. కిరసనాయిలువలెనే యిదియు భూమినుండి తీయఁబడి దానికంటె నెక్కువ శీఘ్రముగ కాలును. బెంజీనులో నానుట వలన ఉన్నియందున్న క్రొవ్వు కఱగిపోవును. తక్కిన మాలిన్యములు చాలవఱకు నీటిలో కఱగును. కావున క్రొవ్వులేని ఉన్నిని సబ్బులో నుడుకవేయుదురు. తరువాత మంచినీటిలో నుదికి (కాళ్ళతోఁ ద్రొక్కుటవలన) జాడించు టవలన ఉన్ని శుభ్రమయి చలువఁజేయుటకు తగియుండునుగాని కొంచెము బిరుసెక్కును. దానిని మెత్తఁబరుచుటకు కొంచెము చమురు రాచెదరు.

ఉన్ని యెల్లప్పుడును దారముగగాని వస్త్రములుగగాని చలువఁ జేయఁబడును. ఒడకుటలోను, నేతలోను ఉన్నికి మాలిన్య మేర్పడును. దీనిని పోఁగొట్టుటకు తిరిగి సబ్బు లో నుడకవేసి తరువాత చలువఁజేయుదురు. ఉన్నిచలువకు లవణవాయువు పనికిరాదు. కావున చలువ సున్నము వాడకూడదు. ఉన్నిదారము నీటిలో నుడకవేసినప్పుడు ముడుతలు పడి రంగులు అన్ని భాగములకు చక్కగ నంటవు. అందుకని వడకిన దార మును ముందుగ 'ఆసు' బోయుదురు. ఆసు మీఁదనుండగనే దారమును వేడినీటిలో నొక గంటసేపు ముంచెదరు. చల్లారినతరువాత ఆసుమీఁది దారమును పిడియలుగ (దారపు పిల్లు) గట్టి సబ్బునీటిలో నుడకవేసి తరువాత మంచినీటిలో జాడించెదరు. అప్పటికి దారము ముడుతలు పడక మృదులముగ నుండును. ఉన్ని బట్టలకూడ నీతీరుననే ముందుగ శుభ్ర

పఱచెదరు. పడుగుపేకలు ఉన్నిగాక, ఉన్నియు, నూలును గలిపినేసిన వస్త్రము లుడకవేసినప్పుడు క్రుంగి ముడుతలుబడును. ఇవి వేడినీటిలో నున్నప్పుడే మడతవేయకుండ వెడల్పుగ నొక కఱ్ఱమీఁదఁ జుట్టి యట్లే చల్లారనిచ్చెదరు. రెండవ తూరి తిరిగియుడకవేయునప్పుడు మొదటి కఱ్ఱమీఁదినుండి వీడిపోవుచుండఁగా రెండవ కఱ్ఱపైఁజుట్టుకొను లాగున నేర్పాటు జేసెదరు. ఇట్లు రెండుమూఁడు సారు లుడకవేయునప్పటికి బట్టలు ముడుతలు పడక రంగులు వేయుటకు సాపుగనుండును. నూలుబట్టలు చలువఁజేసెడు పద్ధతులు ఉన్నిబట్టలకు పనికిరావని పైని వ్రాసియుంటిమి. నూలుబట్టలవలె సోడాపొడిలోగాని సోడాక్షారములోగాని యుడకవేసినయెడల ఉన్ని చెడిపోవును. ఈ పదార్థములు ఉన్నిని తిని వేయుటచేత సత్తువ తగ్గిపోవును. అందుచేత ఉన్ని సంబంధమగు వస్తువులు ముందుగ సబ్బునీటిలో నుడకవేయుదురు. ఇట్లు చేయుటవలన చాలవఱకు మురికిపోయి ఉన్ని శుభ్రమగును. సబ్బునీటిలో నుడకవేసి మంచి నీటిలో జాడించిన వెంటనే చలువఁజేయుటకు సిద్ధమగును. ఉన్ని వస్తువులను చలువఁజేయుటకు గంధకము నుపయోగించెదరు. గంధకముఁ గాల్చినప్పుడు గాటైన తెల్లని పొగ వచ్చునని యందఱకుఁ దెలిసిన విషయమె కదా. ఈ గంధకపు పొగ నీటిలో శీఘ్రముగఁగఱగి యొకపుల్లని ద్రావకమేర్పడును. ఉన్నివస్తువు లీద్రావకములోఁ దెలుపుజేయుదురు. సాధారణముగ గంధకపు పొగలోనే తెలుపుచేయవచ్చును. ఈ పద్ధతియే తఱుచుగా వాడుకలోనున్నది. ఇందుకొఱకు లోపలనంతయు బల్ల కూర్పుఁగల గది నొకదానిని ఇటికలతోఁ గట్టెదరు. దీని పొడవు 10 అడుగులు, వెడల్పు 6 అడుగులు, ఎత్తు 6 అడుగులు. గదిలోపల గోడలపైని కొయ్యవంకె లనేకములుండును. సబ్బులో నుడకవేసి శుభ్రము చేయఁబడిన "ఉన్ని పిళ్ళు" తడిగా నున్నప్పుడే యీ వంకెలపై వ్రేలాడవైచి గదిలో గంధకమును గాల్చి తలుపులు వేయుదురు. ఇట్లు మూసిన గదిలోనే దాని మీద గంటలుండునప్పటికి గంధకపు పొగ చక్కఁగఁబట్టి ఉన్ని తెలుపెక్కును. ఉన్ని బట్టలకుఁగూడ నిట్లె గంధకపు పొగఁబట్టించెదరు. బట్టను గోడకుఁగల నొక సన్నని గవాక్షము గుండలోనికిఁ దింపి గదిలోపల యంత్ర సహాయమువలన కఱ్ఱల పై వెడల్పుఁగ జుట్టుకొనులాగుఁ జేయుదురు. ఇట్లొక కఱ్ఱపైనుండి మరియొక కఱ్ఱపై కెక్కెడి సమయములో గంధకపు పొగయెక్కి బట్టకు తెలుపెక్కును. ఇట్లయిదాఱుసారులు చేయునప్పటికి బట్టలు చక్కఁగ చలువయగును. గంధకపు పొగకఱగిన ద్రావకము వాడినయెడల బట్టలు చలువఁజేయుట కొకరోజుబట్టును. గంధకపు పొగవలనఁ గలిగిన చలువ తాత్కాలికమేగాని శాశ్వతముగ నుండదు.

కొంతకాలమైన తరువాత బట్టలను సబ్బుతో నుతికినయెడల పూర్వపు పసుపు వన్నె వచ్చును.

చలువ శాశ్వతముగా నుండుటకు తఱుచుగ నింకొక పదార్థమును వాడుదురు. దీనికి "హైడ్రోజన్ పెరాక్సైడ్" (Hhdro-genperoxide) అని పేరు. ఇది నీటితో సంబంధించిన పదార్థము. నీటియందుఁ బ్రాణవాయువు జలవాయువును గలవు. ఈపదార్థమందు నీటియందున్నదానికంటె నెక్కుడు ప్రాణవాయు వుండును. ఇదియు నీటివలె పల్చగనుండును. నూటికి మూఁడు పాళ్ళవంతున నిదియును, రెండు పాళ్లవంతున "అమ్మోనియా" (నవాసారమును సున్నముతో రుద్దినప్పుడు వచ్చుగాటగు వాయువు) యునునీటితోఁగలిపి బట్టలనందులో నొకరోజు నానవేసిన యెడలఁ జక్కఁగ తెల్లబడును. ఈ తెలుపు శాశ్వతముగ నుండును.

పట్టు చలువ

ఉన్నివలెనే పట్టుకూడ జంతుసంబంధమయినపదార్థము. పట్టుపురుగులు గట్టుకొనిన గూళ్ళను నీటిలో నుడకవేసి యా గూళ్ళనుండి పట్టుదారమును దీయుదురు. ముడిపట్టునందుఁగూడ మలిన పదార్థము లెక్కువ యుండును. ఈ మాలిన్యములు పోయినఁగాని చలువఁ జేయుటకును రంగులు వేయుటకును వలనుపడదు. ద్రావకములు, సున్నము మొదలగు గాటువస్తువులు పట్టునూలిని వేయును. అందుచేత పట్టునందుఁ గలకొవ్వు జిడ్డు మున్నగు మాలిన్యములను విడఁగొట్టుట కీపదార్థము లుపయోగపడవు. ముడిపట్టుదారపువిచ్చెలను (దారపువిల్లు) సబ్బులో నుడకవేయుదురు. దీనివలన పట్టునందుఁగల జిగట పదార్థములు చాలవఱకు సబ్బునీటిలోఁ గఱిగి పట్టుదారమున కొకవిధమగు తెలుపును, తళుకును వచ్చును. ఇట్లు రెండుమూఁడు సారులు సబ్బునుఱుగులో నుడకవేసి ప్రతి పర్యాయము మంచినీటిలో జాడించు నప్పటికి దారము మెత్తఁబడి నిగనిగ లాడుచుండును. ప్రత్యేకము తిరిగి చలువఁ జేయకుండుటకై యీదారపు విచ్చెలను కట్టలుగఁగట్టి సన్నని నారసంచులలోవేసి సోడాపొడినీటిలో నొకమారుడకవేసి తిరిగి సబ్బునీటితో శుభ్రముచేయుదురు. ఇప్పటికి స్వచ్ఛమైన పట్టుదార మేర్పడును. కాని యిన్నిసారు లుడకవేయుటవలన పట్టుయొక్క తూనిక తక్కువై వర్తకులకు నష్టము సంభవించును. కాని రంగులు వేయునప్పుడు కొన్ని పదార్థములఁ గలిపిపట్టుయొక్క తూనిక నెక్కువ చేయవచ్చును.

పైని వ్రాసినప్రకారము శుభ్రపఱచిసాపు చేసినపట్టును చలువఁజేయుదురు. పట్టు చలువకు చలువసున్నము వాడకూడదు. పట్టుచలువకు సాధారణముగ మూఁడు పదార్థములు వాడుకలో నున్నవి. ఉన్నిని చలువఁ జేయునట్లు పట్టునుగూడ గంధకపు పొగతోను, హైడ్రోజన్ పెరాక్సైడుతోను చలువఁజేయవచ్చును.

ఈ వస్తువులు వాఁడునప్పుడు ఉన్నిచలువకును, పట్టుచలువకును భేదమేమియు లేదు. పట్టును ఉన్నికంటె నెక్కువ పర్యాయములు చలువచేయవలెను. ఈ రెండు పదార్థములుగాక మరియొక యోగము ప్రకారము పట్టును చలువఁజేయవచ్చును. ఈ యోగమునందు వాడెడి పదార్థమునకు "పొటాసియం పర్మాంగనేట్" (Potassium permanganate) అనిపేరు. దీనిని నీటిలోఁ గలిపినప్పు డొకవిధమైన యెఱ్ఱుపురంగుఁగలనీరేర్పడును. ఊరిలో కలరా యున్నప్పుడు సాధారణముగ దీనిని నూతులలోఁ గలిపెదరు. దీనియందు ప్రాణవాయు వెక్కుడు గలదు. అందుచేత నిది శీఘ్రముగ సూక్ష్మజీవులను జంపివేయును. దీనికి చలువఁజేసెడి గుణముగూడ ప్రాణవాయువు వలననే కలిగినది. పొటాసియం పర్మాంగనేటును కొంచెము నీటిలోఁ గలిపి యానీటిలోఁ గొంచెము గంధక ద్రావకముఁ గలపవలెను. ఈ నీటిలో పట్టుబట్టలనుగాని, దారపు విచ్చెలనుగాని కొంతసేపుంచి తరువాత గంధకపుపొగ కలిగించిన నీటిలో ముంచినయెడల పట్టుసంబంధమగు వస్తువులు తెల్లఁబడును. ఈ పద్ధతిప్రకార మొకపర్యాయము చలువఁజేసినఁ జాలును. కానియెక్కువ జాగ్రత్తతో పనిచేయవలెను. గంధక ద్రావక మెక్కువయిన యెడల పట్టును తినివేయును. కావున మితముగా వాడవలెను.

ద్రావకములవలన పట్టుచెడిపోవునని పైని వ్రాసియుంటిమి. పట్టు చలువకు లవణవాయువు పనికిరాదనికూడ వ్రాయఁబడినది. స్వల్పముగ నుపయోగించిన యెడల నీరెండును జాగ్రత్తతో వాడవచ్చును. ఐదుపాళ్లు శంఖద్రావకమును, ఒకపాలు "నైట్రికాసిడ్డు"ను (సురేకారద్రావకము - అనఁగా సురేకారమును (Nitre) గంధక ద్రావకముతోఁ గలిపినప్పు డేర్పడు ద్రావకము) గలిపి నాలుగయిదు రోజులు నులివెచ్చగ నుంచవలెను. ఈ రెండు ద్రావకములను గలిపినప్పుడు లవణవాయువేర్పడి మిశ్రణములో కలిగియుండును. ఈ మిశ్రణమునకు 15 పాళ్లు నీరు గలిపి కొంచెము వెచ్చఁబెట్టి పట్టునూలును గాని, గుడ్డలనుగాని యందులో ముంచిన కొలఁది కాలములోనే యివి తెల్లఁబడును. సాధారణముగా పావు గంటకంటె నెక్కువ కాలముపట్టదు. కొన్ని తరుణములయందు పూర్తిగ తెలుపెక్కకమునుపే పట్టును పైకి దీసి రెండుమూఁడు సారులు మంచి నీటిలో జాడించి గంధకపు పొగతో పూర్తిచలువఁ జేయుదురు. ఈయోగము ప్రకారము చలువఁ జేసినపట్టునకు పసుపురంగు దట్టముగఁబట్టును. అందుచేత సాధారణముగ నీపట్టునకు వెంటనే పసుపురంగు వేయుదురు.

"టాసాసిల్కు" అని వాడఁబడు టాసూరుపట్టు సాధారణ పట్టుకంటె భిన్నమైనది. ఇది మన దేశములో విస్తారముగఁ జేయఁబడు

చున్నది. మామూలు పట్టుకంటె దీనిని చలువఁజేయుట కష్టము. టాసూరు పట్టుచలువకును మామూలు పట్టుచలువకును కొంచెము భేదముండును. సోడాపొడి నీటిలో నుడకవేయుటవలన టాసూరుపట్టు కొంతవఱకు తెల్లబడును. తరువాత దానిని గంధక ద్రావకముఁ గలిపిన నీటిలో నానవేసినచో బాగుగ తెల్లఁబడును. కాని యీబట్టలకు రంగులు చక్కఁగపట్టవు. కావున రంగులు వేయఁదలచిన టాసూరుపట్టును వేఱుమార్గముల చలువఁ జేయుదురు. ఇందు ముఖ్యముగ నుపయోగించెడి పదార్థము "బ్రోమీనునీరు" (Bromine water). బ్రోమీను, లవణవాయువునకు సంబంధించి దానివలెనే చలువజేయు శక్తిగలిగియుండును. బ్రోమీను రక్తమువలె నెఱ్ఱని ద్రవపదార్థము. దీనినికొంచెము నీటిలోఁగలిపి యానీటిలో పట్టుబట్టలను కొంచెము సేపుంచి తరువాత గంధకపు ద్రావకముఁ గలిపిన నీటిలో నరగంటసేపు నానవేసినయెడల నది తెల్లఁబడి రంగులనాకర్షించు శక్తికూడ కలిగియుండును. ఇట్లు రెండు మూఁడు పర్యాయములు చేసిన యెడల బట్టలు మిక్కిలి తెల్లగనుండును. కొన్ని తరుణముల బ్రోమీనుకు బదులుగ ప్రాణవాయువుఁగలిగించిన "అమోనియనీటిని" వాడెదరు. ఈ నీటిలో బట్టలు కొంతసేపు నానిన తరువాత సబ్బులో నుడుకవేసి మంచినీటిలో జాడించినయెడల బాగుగ చలువయగును.

పట్టు సహజముగ లేతపసుపువన్నె గలిగియుండును. ఎన్నిమారులు చలువఁజేసినను ఈ సహజవర్ణము పూర్తిగపోదు. రంగులు వేయకుండ నమ్మెడిపట్టునకు నీసహజమయిన వన్నెపోయి అచ్చమగు తెలుపును నిగనిగయు వచ్చుటకు నీలిపెట్టెదరు. సబ్బులోనుడకవేసిన నూలును దారమగునట్లు పేనిబిగించి ఆసుబోసెదరు. అప్పుడు కళకళకాగెడు నీటియావిరిలో నీదారము నుంచినయెడల పట్టునకు తళుకువచ్చును. పట్టునకు సహజవర్ణముపోయి తెలుపెట్లు వచ్చునో యీక్రింది యోగము వలన తెలియనగును.—10 పౌనులు పట్టును చలువఁజేయుటకు:—

1. మూఁడు పౌనులు సబ్బునురుగులోఁ గలిపి పట్టును దానిలో నానవేయుట.
2. నానినపట్టును సంచులలోవేసి కుట్టి సబ్బునీటిలో నుడకవేయుట.
3. ఉడకవేసిన పట్టును మంచినీటిలో జాడించుట.
4. ఒకటిన్నరపౌను సబ్బు, కొంచెము నీలిమందు తొంబదిగేలముల నీటిలోఁ గలిపి యానీటిలో పట్టును నాననిచ్చుట.
5. తరువాత తులము గంధకముఁ గాల్చి ఈ పొగను పట్టునకుఁ బట్టించుట.
6. నూతినీటిలో జాడించి యారవేయుట.

అప్పటికి పట్టు బాగుగ తెలుపెక్కి నిగనిగలాడుచుండును. నీలిమందునకు బదులుగ జాభరాగింజ లుపయోగించినయెడల పైనాపట్టు

రంగువచ్చును. ఇట్లే లేతరంగులు వేయుట వలన పాలతెలుపు, అచ్చతెలుపు, నీలిగలిసిన తెలుపు మొదలగు కాంతులు వచ్చును.

ఇంతవఱకు బట్టలయొక్కయు, నూలుయొక్కయు చలువనుగూర్చి వ్రాయఁబడినది. ఇది ముఖ్యముగ రంగులు వేయుటకై వేసెడి చలువ.

ఇతరవస్తువుల చలువ

ఇవిగాక యలంకరణముల కుపయోగించెడి వస్తువు లనేకములు చలువజేయఁబడును. బుట్టలు, పెట్టెలు, సంచులు మున్నగునవి నేయుట కుపయోగించెడి యాకులు, పాశ్చాత్యులు పెట్టుకొనెడి టోపీలల్లుట కుపయోగించెడిగడ్డి, పాశ్చాత్యస్త్రీలు అలంకరణమునకై టోపీలపై గుచ్చెడి యీకలు,మున్నగు వస్తువులన్నియుచలువఁజేసి తరువాత రంగులు వేయుదురు. వాసలీను (Vaseline)జేయుటకుఁ గావలసిన మైనము, చెక్కడపు పనులఁజేసెడి దంతము గుండీలు మున్నగునవి చేయుట కుపయోగించెడి యెముకలు, కొమ్ములు మొదలగునవి యన్నియుఁ జలువచేయఁబడును. కుంచెలను జంత్రవాయిద్యములయం దుపయోగించెడు వెంట్రుకలను, పుస్తకములను బైండుచేయుటకుఁ గావలసిన చర్మములను గూడ చలువఁజేసెదరు. కాగితములు తెల్లగ నుండుటకు కాగితములు జేయుటయం దుపయోగించు పదార్థములు చలువఁజేయవలెను. ఈ పదార్థము లన్నియు చలువఁజేయు పద్ధతులు పైని వర్ణింపఁ బడినవియె. తప్పీళ్ళలో కొంచెము భేదముగాని పద్ధతులును, చలువఁజేయుట కుపయోగించెడి పదార్థములును, ఒక్కటియె. పైనిఁజెప్పఁబడిన చలువసున్నము, లవణవాయువు, గంధకపు పొగ, హైడ్రొజన్ పెరాక్సైడు, పొటాసియం పెర్మాంగనేటు చలువఁజేయుట కుపయోగించు పదార్థములు. సబ్బు, సోడాపొడి, సోడాక్షారము, చవుడు, గంధక ద్రావకము మొదలగునవి యుడకవేయుట కుపయోగించెడి పదార్థములు. జంతు సంబంధములగు పదార్థములను చలువఁజేయుటకు చలువసున్నముగాని లవణవాయువుగాని వాడక తక్కిన పదార్థములను వాడెదరు. కాగితములను చలువఁజేయు పద్ధతి నీక్రింద వ్రాసెదము. దీనినిబట్టి తక్కిన పదార్థము లెట్లు చలువఁజేసెదరో యూహింపవగును.

గుడ్డపేలికలు, గోగునార, జనపనార మున్నగు నారపదార్థములు, వెదురు, పేము, గడ్డిపరకలు, పనికిరానిప్రాతకాగితములు,మొదలగు పదార్థములతో కాగితములు చేయుదురు. వీనిని చలువఁజేసిన తరువాత కాగితములుచేయుదురుగాని ముందుగ కాగితములు చేసినతరువాత చలువఁజేయరు. కావున నాయాపదార్థములను చలువఁజేయుట కేర్పడిన పద్ధతుల ప్రకారము వానిని చలువఁజేయవలసి యుండును. గుడ్డపేలికలతో కాగితములు చేయునప్పుడు వానిని ముందుగ నీటిలోచీకనిచ్చి యంత్ర సహాయమువలన వెన్న

వలె మెత్తగ నగునట్లు పక్వము జేయుదురు. ఈ పాకమును సోడాపొడి నీటిలోనానిచ్చిన తరువాత చలువసున్నపు నీటిలో వుంచెదరు. సాధారణముగ నిప్పటికే యది తెల్లఁబడును. ఒకవేళ గుడ్డపేలికలు పక్కారంగులు వేసిన వైనయెడల చలువ సున్నములో ముంచిన తరువాత గంధకద్రావకముఁ గలిపిన నీటిలో కొంచెము సేపుంచినచో నెటువంటి రంగు లయినను పోయి కాగితపు పాకము (Paper-pulp) తప్పక తెల్లబడును. ఇట్లే నారపదార్థములతో కాగితములు చేయునప్పు డిదివరలో వర్ణింపఁబడిన యుక్తమార్గముల ప్రకారము నారపాకమును చలువఁజేయుదురు. నారకు తెలుపెక్కుట యాలస్యమగుటచే రెండు మూఁడుసారులు చలువఁజేసినఁగాని కాగితములు తెల్లఁగనుండవు.

హిందువుల చలువ పరిశ్రమ

కోరాలను మల్లులఁ జేయుట చలువయని మొట్టమొదటనే వ్రాసియుంటిమి. పాశ్చాత్య దేశములలో నిదియొక వ్యాపారముగ నున్నదని యిదివరలో వ్రాసినదానిని బట్టి చదువరులు గ్రహించఁగలరు. మన దేశస్థులకు చలువఁజేయుట యనాదిగఁ దెలిసియున్నను ప్రత్యేకముగ చలువబట్టల వ్యాపారము మన దేశమున లేకుండెనని చెప్పవచ్చును. ఇప్పుడిప్పుడు బొంబై మున్నగు నగరములలో యంత్ర సహాయమున నేతపనిజరుగుచున్నది. ఈ యంత్రములలో తయారగు కోరాలు పాశ్చాత్య పద్ధతుల ననుసరించియే చలువఁజేసి యమ్మఁబడుచున్నవి. అందుచేత వీనిని గూర్చి ప్రత్యేకించి వ్రాయనక్కఱలేదు. చేతి మగ్గములమీఁద నేసిన వస్త్రము లట్లే యమ్ముట యలవాటుగాని మల్లులఁజేసి యమ్ముట వాడుకలేదు. అట్లయిన మన దేశీయులకు చలువఁజేయుట తెలియదాయని శంకింపవచ్చును. అనాదినుండి మన దేశములో చలువఁజేయుట చాకలివాండ్ర పనియై యున్నది. ఇంతియగాక రంగులు వేయుటకు వస్త్రములన్నియు చలువఁ జేయవలెను. కావున మన దేశములో చాకలివాండ్రును, రంగిరేజులును (రంగులు వేసెడివారు) చలువ చేయ నేర్చియున్నారు. కొన్ని ప్రదేశములలో రంగుల వాండ్రు చలువఁజేయక యా పని చాకలులకే వదలివేయుట గూడఁగలదు. సాధారణముగ తురకలు రంగులు వేయునప్పుడు చలువపనిఁగూడ వారే చేయుదురు. హిందువుల చలువఁజేయు పద్ధతులు పాశ్చాత్యుల పురాణపద్ధతులఁ బోలియుండును. చాకలిచవుడు, సున్నము, కుంకుడుకాయలు, పులిమజ్జిగ, గేదెపేడ, సోడాపొడి (సజ్జయని బజారులో నమ్ముదురు) ఘుండ్లతోట కూర, తెల్లగజ్జేరు, ఉత్తరేణి మొదలగు శాకపదార్థముల బూడిదె, చలువఁజేయుటకు ముఖ్యముగా వాడెడి పదార్థములు. సాధారణముగ చాకలివాండ్రు చవుడును సున్నమును వాడెదరు. కోరాలను మొట్టమొదట నీటిలో

నుతికి, చవుడు సున్నము గలిపిన నీటినిచాకి బానయందుంచి యానీటిలో నుడకపెట్టెదరు. బట్టలున్నంత సేపు బానమూత వేసియుందురు. ఇట్లు మూతవేయుటవలన గుడ్డలకు వేడియెక్కువ తగిలి మురికి త్వరలో వీడిపోవును. తరువాత బట్టలను మంచినీటిలో జాడించి యిసుకపైగాని గడ్డిపైగాని యెండ వేసెదరు. అప్పుడప్పుడు నీరు చల్లుచు బట్టల నెండనిచ్చెదరు. ఇట్లు నాలుగైదుసారులుడిక వేసినంగాని బట్టలు పూర్తిగ తెల్లంబడవు. అందుచేత క్రొత్తబట్టలు నానవేయుట కెక్కువ కాలము పట్టును. ఒకవేళ త్వరగాం దెచ్చిన యెడల మొదటితూరి చలువ బాగుగానుండదు. కలంకారీ యద్దకములకై చేసెడి చలువలో గేదెపేడ విస్తారముగా వాడుదురు. గేదెపేడలో నొకటి రెండు రోజులు నాననిచ్చి మంచి నీటితో శుభ్రముచేసి గడ్డిమీంద నెండ వేయుదురు. ఎండచేతను, గాలిచేతను, అప్పుడప్పుడు చల్లనీటి చేతను బట్టలు క్రమముగా తెల్లంబడును. బాగుగ చలువయగుటకు రమారమి యొకమాసము పట్టును.

ప్రత్యేకించి ఉన్ని చలువ మన దేశీయపద్ధతులలోలేదు. ముఖ్యముగ కంబళ్ళకును,తివాసీలకును ఉన్ని యుపయోగపడుచున్నది. కాశ్మీర దేశములో పష్మీనాయను నొక యుత్తమ జాతి ఉన్నిగలదు. దీనితో శాలువలు, కండువాలు మున్నగునవి నేయుదురు. ఉన్నితోంగూడ కాశ్మీరపు శాలువలు నేయంబడుచున్నవి. దేనికి వాడినను రంగులువేసిన ఉన్నియె ముఖ్యమగుటవలన తెల్లనగువఱకు చలువంజేయుట యవసరములేదు. రంగులు పట్టుటకు ఉన్నికంటియున్న మలినములు పోయినజాలును. ఉన్నిని శుభ్రముచేయుటకు, చవుడు, సున్నపు తేట, కుంకుడుకాయ నురుగు, సబ్బు ఉపయోగించెదరు. ఇవి గలిపిన నీటిలో నుడకవేయుటవలన మలినములు పోయి ఉన్నిరంగులు వేయుటకు యోగ్యముగానుండును. తెల్లశాలువలు, ధావళులు సామాన్యముగ తెల్ల ఉన్నితో నేయుదురు. తెల్ల ఉన్ని చాల వెలయగుటచే ధావళులు చాలవఱకు పచ్చ గానుండు ఉన్నితో నేసెదరు.

మన దేశములో నారపదార్థములనుచలువంజేయుటకు ప్రత్యేక పద్ధతులులేవు. జనుపనార, గోగునార, కలబందనార, కొబ్బెరపీచు, త్రాటినార, ఇవి మన దేశములో నెక్కువవాడుకలోనున్న నారపదార్థములు. వీనితో ముఖ్యముగ మోకులు, పరజాలు, గోనెసంచులు చేయంబడుచున్నవి. వీనికొఱకు నార యెక్కువ తెల్లగనుండ నక్కఱలేదు. నారను నీటిలో నొకటిరెండు వారములుడకవేసి రాళ్ళపైనుతికి యెండవేయుటవలన చాల భాగము తెల్లంబడును. ఇంతకంటె వేఱు మార్గములం దెలుపుచేయుట మన దేశములో నలవాటులేదు.

ఉన్నికంటె పట్టుపరిశ్రమ మనదేశములో విస్తారముగ నున్నది. చెన్నపురికంటె బంగాళము, ఉత్తర హిందుస్థానము, బొంబై రాజధానియు, నెక్కువ పేరువడసిన పట్టువర్తకస్థానములు. ఉన్నివలెనే పట్టునుగూడ రంగులు వేయుటకే చలువఁజేయుదురు. కాని తెల్ల పట్టుబట్టలుకూడ విస్తారము వాడుకలో నుండుటచేత ప్రత్యేకముగ పట్టుకోరాలను చలువచేయు మార్గములు మనవారికి తెలిసి యున్నవి. ఉన్ని నుడకవేయుట కుపయోగించు వస్తువులే పట్టుచలువ కుపయోగించును.

రంగులువేయుపట్టును చలువఁ జేయుటకు, పట్టులో నైదవవంతు చాకలిచవుడు నీటిలో గలిపి యొకరాత్రి యంతయు తేరనిచ్చెదరు. మరుసటిరోజు చవిటితేట నొకబానలో మురగఁబెట్టి పట్టునూలు నందులో ముంచెదరు. కొన్ని తరుణములందు చవుడుతోఁ బాటు కొంచెము సున్నముకూడఁ గలిపెదరు. కాని యేది యెక్కువైనను, విస్తారము సేపు ఉడుకఁ బెట్టినను, పట్టు చెడిపోవును. అందుచేత పట్టువిచ్చెలను వంకెలవలె నుండు కొయ్యలకుఁ దగిల్చి యుడకవేయుదురు. అప్పుడప్పుడు పైకిఁదీసి వేలితోఁ బట్టిచూచుచు జిడ్డు పూర్తిగఁబోయి దారము మెత్తఁబడు వఱకును ఉడకనిచ్చెదరు. ఉడికిన తరువాత పట్టువిచ్చెలను మంచినీటిలో నుతికి బాగుగ జాడించి యెండవేయుదురు. ఇట్లు నాలుగుసారులు చేయునప్పటికి తెల్లపట్టు పూర్తిగ తెల్లఁబడి పసుపుపట్టు పచ్చవాగుగా నుండును. కాని రెండును రంగులు వేయుటకు యోగ్యముగ నుండును. ప్రత్యేకించి తెల్లపట్టుబట్టలు చేయుటకును పైపద్ధతికిని కొంచెము భేదముగలదు. వీసెడుపట్టును అనఁగా 120 తులములుపట్టును చలువఁజేయుటకు 30 తులముల చాకలి చవుడును 30 తులములు దేశవాళీ సబ్బును (Country soap) కావలసి యుండును. మనదేశములో సబ్బుచేయుటకు చవుడును సున్నమును మరగఁబెట్టి యిప్పనూనెగలిపి కలియఁబెట్టెదరు. సబ్బు తెట్టుగట్టిపైకి తేలును. ఈసబ్బు పట్టును చలువచేయుట కుపయోగింతురు. సబ్బును చవుడును గలిపిన నీటిని వెచ్చగా నుండగ తొట్లలోఁ బోసి పట్టుబట్టలనుగాని పట్టు నూలునుగాని కఱ్ఱలపైఁ దగిలించి తొట్లలో వ్రేలాడఁజేయుదురు. కఱ్ఱల రెండు కొనలను త్రిప్పుటవలన బట్టలయొక్క యన్ని భాగములును జక్కఁగ నానగలవు. చక్కఁగ నానినతరువాత బట్టలనుమంచినీటిలోజాడించి పిండెదరు. ఇప్పటికి పట్టు కొంచెము గౌరవర్ణము గలిగియుండును. దీనిని పూర్తిగ తెలుపుఁజేయుటకు గంధకపు పొగవేసెదరు. ఇందుకుఁగాను మూఁకుడులో కొంచెము గంధకమునుంచి దానిపై దట్టముగా నల్లిన యొక వెదురు పేళ్ళజల్లను బోలించెదరు. ఉడకవేసిన తడి పట్టుబట్టలను బల్లపై నుంచి పొగపైకిఁ బోకుండ నొకగుడ్డఁ గప్పెదరు. అప్పుడు గంధకమును వెలిగించినచో పొగ

గుడ్డలకు చక్కఁగఁబట్టును. ఒకగంటతరువాత మంచినీటిలో నుతికిన యెడల బట్టలుగ్గాని నూలు గాని పూర్తిగ చలువయగును. ఈ పద్ధతికిని పాశ్చాత్త్యుల నవీన పద్ధతికిని భేదము లేదని చదువరులు గ్రహింపఁగలరు.

సాదా అద్దకము

వస్త్రములకుగాని వస్త్రములు చేయుట కుపయోగించు నూలునకుగాని రంగులు వేయుటకు అద్దకమనిపేరు. అద్దకమను శబ్దము ముఖ్యముగ నూలునకు, ఉన్నికి, పట్టునకు, నారపదార్థములకును రంగులు వేయుటయందు వర్తించుచున్నను, తదితర పదార్థములకుఁగూడ రంగులువేయుటకలదు. కొయ్యలకు బచ్చెనఁబోయుట, చాపలు నేయుట కుపయోగించెడి గడ్డిపదార్థములకు దంతములు, ఎముకలు, కొమ్ములు, తోళ్ళు, కాగితములు మున్నగు వస్తువులకు రంగులు వేయుటఁగూడ అద్దకమనియే యనిపించుకొనును.

చరిత్రాంశములు

ఎంత యనాగరకదశయందున్నను మనుష్యునకు అలంకరణములయెడ మిక్కిలి ప్రీతి యుండును. బంగారము, వెండి మున్నగు లోహములు దొరికిన వెంటనే యాభరణములు చేయుట కుపక్రమించెను. లోహములు సులభముగా దొరకనిచోట యాకులతోను, కొయ్యలతోను, ఎముకలతోను అలంకరణములు చేసికొనుటకు మొదలు పెట్టిరి. మనుష్యుఁడు ఇల్లుఁగట్టుటకు నేర్చినప్పుడె గోడలపైఁ చిత్తరువులు వ్రాయుటఁగూడ నేర్పడినది. అట్లే బట్టలనేతతోడనే రంగులు వేయు విద్యకూడ పుట్టినదన్న నతిశయోక్తి కానేరదు. నేత తెలియక చర్మములతో శరీరమును ఎండనుండియు వాననుండియు గాపాడుకొనెడి కాలములో నయితము మానవ కోటికి రంగుల విషయమైన జ్ఞానము కొంచె ముండెడి దనుటకు తార్కాణము లున్నవి. ఏలయన వంటినిండబట్ట లేక కౌపీనములతో కాలము వెళ్ళబుచ్చు మిక్కిలి యనాగరక జాతులలోఁగూడ శరీరమంతయు పచ్చఁబొడుచుకొనుట యాచారములో నున్నది. వీనినిబట్టి రంగులు వేయుట మిక్కిలి పురాతనమైన విద్యయనుటకు సందియము లేదు.

శైశవావస్థలో రంగులు శాశ్వతముగ నుండక యుతికినతోడనే వెలిసిపోవునవియై యుండును. ఆకు పసర్లతోను, పండ్లరసములతోను ఉపక్రమించియుందురు. ఇప్పటికిని కాకరాకుపసరు, ఆకుపచ్చ రంగుకును, నాగజెముడుపండ్లు ఎరుపు రంగుకును వాడు సంప్రదాయము కొన్ని జాతులలో మనదేశమునఁగలదు. ఈ రంగు లెండకెండినను వానకుఁదడిసినను వెలిసిపోవును. ఇంతియఁగాక ప్రథమ దశలో రంగులువేయుట యొక వర్తకముగ నుండక యిండ్లలో నాడవాండ్రు పనిచేయుచుండిరి. ఏకు లొడుకుట, నేత నేయుట మొట్టమొదట గృహకృత్యము

లలోఁ జేరినట్లు, ఇంటివాడుకకుఁ గావలసిన బట్టలకు రంగులువేయుటఁగూడ గృహవ్యాయామములలో నొకటియై యుండుననుటకు సందియములేదు. పక్కా రంగులు వేయు పద్ధతులు గనిపెట్టిన తరువాతను సంఘబాహుళ్యమువలన వృత్తు లేర్పడిన తరువాతను నేతపనులవలెనే యద్దకపుపనులుగూడ వర్తక సరిలోనికి దిగియుండును.

రంగులు వేయుట మొదటినుండియు కేవలము పౌరస్త్యుల విద్యయైయుండెను. పాశ్చాత్యు లీ విద్యను పౌరస్త్యుల నుండియే గ్రహించిరి. చీనా, పర్షియా, ఇండియా దేశము లీ విద్య కుత్పత్తిస్థానములని చరిత్రకారుల యభిప్రాయము. చీనావారి నాగరికము మన నాగరికముకంటెఁగూడ పురాతనమైనది. కాగితములు చేయుట, అచ్చొత్తుట చీనారాజ్యములోనె మొట్టమొదట కనిపెట్టఁబడినది. రంగులు వేయువిద్య చీనాదేశీయుల నుండి హిందువులు గ్రహించిరనుట కాధారములు లేవు గాని మన దేశీయులనుండి పారశీకులు నేర్చుకొనిరనుటకు దాఖలాలున్నవి. హిందువులు తూర్పున చైనారాజ్యముతోను, పడమరపారసీ యరబ్బులతోను, అనాదినుండి వర్తక వ్యాపారములు నిరాటంకముగ నడుపుచుండెడివారు. మొదటినుండియు హిందూదేశము కళాకౌశల్యములయం దెక్కుడు పేరుపొంది యుండుటచేత అరబ్బీ వర్తకులు రంగుబట్టలయందు హిందూదేశముతో వ్యాపారము జేయుచుండెడివారు. ఇట్టి రాకపోకలవలన అరబ్బీవర్తకులు హిందువుల పరిశ్రమిక జ్ఞానమును సంపాదించి ఫోనీషియనులకును, ఈజిప్టు దేశీయులకును నేర్పిరి. ఈజిప్టు దేశీయులు మిక్కిలి పురాతన కాలమునసే పసుపు రంగును, నీలిరంగును బట్టలకు నెక్కుడు కౌశలముతో వేసెడివారని "ప్లిని" (Pliny) యను చరిత్రకారుఁడు క్రీ॥ శ॥ మొదటి శతాబ్దములో వ్రాసియున్నాఁడు. సుమారు నాలుగువేల సంవత్సరములకుఁ బూర్వమే యీజిప్టు దేశములో రంగులు వేయు నాచారము గలదని పరిశోధకులు చెప్పుచున్నారు. హిందూదేశము నుండియే యీ పరిశ్రమను అరబ్బీలద్వారా యీజిప్టువా స్తవ్యులు గ్రహించునట్లు చరిత్రకారులు నుడువుచున్నారు. దీనిని బట్టియె హిందువుల పరిశ్రమయొక్క పురాతనత్వమును గ్రహింపవచ్చును.

గ్రీసు దేశములో కాపురముండి వ్యాపారము జేయుచుండిన ఫోనీషియను వర్తకులును, ఈజిప్టు వర్తకులును రంగులను గ్రీసులోనికి దిగుమతి చేసెడివారు. కాని గ్రీకులయొక్కయు, రోమనుల యొక్కయు, రంగులువేయు పద్ధతులు మనకు బాగుగఁ దెలియవు. అలెగ్జాండరునకు పూర్వము అనఁగా క్రీ॥ పూ॥ ౩౩౬-వ సంవత్సరమునకు ముందు గ్రీకులకుఁ దెలిసిన రంగులు బహుస్వల్పమనియు, అతని తరువాత నీలి, నలుపు, పసుపు, పసరు రం

గులు వేయుపద్ధతులు గ్రీసులో నభివృద్ధిఁ జెంది నార బట్టలకుఁగూడ పక్కారంగులు వేయుట గ్రీకులు నేర్చిరనియు "ప్లినీ" యను చరిత్రకారుఁడు వ్రాసియున్నాఁడు. మహాపురుషుల జీవితములు వ్రాసిన "ప్లూటార్కు" అను చరిత్రకారుఁడు అలెగ్జాండరు చక్రవర్తి జీవితములో నిట్లు వ్రాసియున్నాఁడు. "పారసీకమునకు వెళ్లినప్పుడు (Persia) మహారాజుగారి సౌధములో నూటయెనుబదియేండ్లకుఁ బూర్వము తయారుచేసిన నలుపువాగుఁగల యెరుపు బట్టలు (Purple dyed material) అనేకము లుండెను. ఇంతకాలమైనను కాంతి చెడకుండుటనుబట్టి యీబట్టలు తేనెతో తయారు చేసియుండవలెను." అలెగ్జాండరు పౌరస్త్య దండయాత్రల తరువాతనే గ్రీసులో రంగుల పని యభివృద్ధియైన దనుటకు సందేహము లేదు. గ్రీకులు రంగులువేసిన పద్ధతులు మిక్కిలి సులభమైనవి. మొట్టమొదట క్రొత్త బట్టలను నీటిలోనుతికిసాగఁదీసెడివారు. ఇందువలన పుటరంధ్రములు పెద్దవగును. తరువాత బట్టలను రంగునీటిలో ముంచి రంగులు శాశ్వతముగ నుండుటకు వగరునీటిలో నాన వేసెడివారు. వగరు వేయుటకు సామాన్యముగ పటిక నీ రుపయోగించెడివారు. ఇదియే గ్రీకుపద్ధతియొక్క సారాంశము.

క్రీ॥ శ॥ ఐదవ శతాబ్దివరకును ఐరోపా ఖండములో అద్దకపు పరిశ్రమ లేదని చరిత్రకారుల యభిప్రాయము. క్రీ॥ శ॥ ఎనిమిదవ శతాబ్దమున ఇటలీ దేశములో కొన్ని కుటుంబములవారు మాత్రము రంగులు వేసెడి వారని చెప్పుదురు. పదునొకండవ శతాబ్దములో పాశ్చాత్యులు మతసంబంధమైన యుద్ధమునకై జెరుసెలముపై దాడివెడలిరి. ఈయుద్ధమునకు రామదండువలె యైరోపా ఖండము నందలి ప్రతి దేశమునుండియు యోధులు బయలుదేరిరి. ఈ యుద్ధానంతరము భటులచ్చట కొంత కాలముండి తిరిగి తమ దేశములకుఁ బోవునప్పుడు పౌరస్త్యపరిశ్రామిక పద్ధతులను కొంతవఱకు గ్రహించి వానిని తమ దేశములలో నుపక్రమించిరి. ఈరీతిని ఇటలీ దేశములో కొన్ని క్రొత్తరంగులును రంగులు వేయుటకు నూతన పద్ధతులును పదునొకండవ శతాబ్దమున వెలసినవి. పదుమూఁడవ శతాబ్దము నాటికి పరిశ్రమ కొంతయభివృద్ధియైవెన్నీసు పట్టణమునను, జర్మనీ దేశములోను రంగురేజులు తమ పరిశ్రమాభివృద్ధికై సంఘముల స్థాపించిరి. క్రీ॥శ॥ ౧౪౧౯-వ సంవత్సరములో నీ పరిశ్రమాభివృద్ధికిఁగాను బట్టల చలువ యొక పట్టణములోను అద్దకము మరియొక పట్టణములోను జరుగఁగూడదని జర్మను గవర్నమెంటువారొక శాసనముఁ జేసిరి. అప్పుడే రంగులువేయుట నేర్పుటకుఁగాను ఉపాధ్యాయులను ఊరూరికిఁ బంపఁదొడంగిరి. రంగులు వేయుటకు నీలిమందు వాడకూడదని కూడ తీర్మానించిరి.

క్రీ॥ శ॥ ౧౪౭౯-వ సంవత్సరములో ఇటలీ దేశము నందలి వెన్నీసు పట్టణమున రంగులు

వేయుటనుగూర్చి యొక పుస్తకము వెలువడె ను. ఐరోపా ఖండములో నీపరిశ్రమనుగూర్చి వ్రాసిన ప్రథమపుస్తక మిదియేయని చెప్ప వచ్చును. ఈ పుస్తకమునందు నప్పటికాలమున వాడుకలోనున్న పద్ధతులు వర్ణింపఁబడినవి. అప్పటినుండియు పాశ్చాత్య దేశములలో నద్ద కపు పరిశ్రమ శీఘ్రముగ వృద్ధిఁజెందినది. ఇటలీనుండి జర్మనికిని, జర్మనీనుండి ఫ్రాన్సు కును, ఫ్రాన్సునుండి బెల్జియమునకును అద్ద కపు పరిశ్రామిక జ్ఞానము అచిరకాలములోఁ బ్రాకెను.

ఇంగ్లండు దేశములో పదుమూఁడవ శతా బ్దికి పూర్వము రంగుబట్టలనియు,రంగులనియు, సారస్వతమునందు చూచాయగ నున్నను వానినిగూర్చి విశేష మేమియులేదు. కాని పదునాలవ శతాబ్దములో మూఁడవ యెడ్వర్డు ప్రభువు బెల్జియము నుండియు, హాలెండు నుండియు రంగురేజులను బిలిపించి వారి నాద రించెను. వీరివలన నింగ్లండులో అద్దకము కొంత యభివృద్ధియై క్రీ॥ శ॥ ౧౪౭౨-వ సం వత్సరములో నొకరంగురేజుల కంపెనియేర్పడి నది. క్రీ॥ శ॥ ౧౪౭౧-వ సంవత్సరములో నాల్గవ హెన్రీప్రభువు లండను పట్టణములోను చుట్టుప్రక్కల పదిమైళ్ళదూరమునను అద్దకపు పనులుజేయుట కొకకంపెనీకి సర్వస్వాతం త్ర్యమునిచ్చెను. అతని తరువాత ప్రభువు లీ హక్కునురద్దుచేయక అనులులో నుంచుచు వచ్చిరి. ఆహక్కువలన కంపెనీవారు నిర్దేశ స్థలములలో నద్దకములు వేయుటయేగాక తది తరులెవరైన చాటుగ రంగులు వేయుచుం డినయెడల నట్టివారిని సోదాచూచి పట్టుకొని సర్కారుకు నప్పగింతజేయునధికారము గూడ నుండెను. ఈరీతిని సర్కారువారి ప్రోత్సా హము వలనను ఆదరణము వలనను ఇంగ్లం డులో నద్దకపుపరిశ్రమ కొంతవరకు నభివృద్ధిఁ జెందినది.

ఇంతలో క్రీ॥శ॥౧౪౯౨-వ సంవత్సరములో కొలంబసు అమెరికా ఖండమునుఁ గనుఁగొ నెను. ౧౪౯౮-వ సంవత్సరములో వాస్కోడి గామాయను నతఁడు ఐరోపా ఖండమునుండి సముద్రము మీఁదనే ప్రయాణముఁజేసి హిం దూ దేశముఁ జేరవచ్చునని జూపెను. రమా రమి యేకకాలమునఁ జరిగిన యీ రెండు విష యములును పాశ్చాత్యుల యార్థికాభివృద్ధికిని, పరిశ్రామికాభివృద్ధికిని, నిరుపమానములగు దోహదములైనవి. అదివరకు పాశ్చాత్య ఖండములోలేని రంగు పదార్థములన్నియు నమెరికా దేశమునుండి దిగుమతిఁ జేయఁ దొడంగిరి. వాస్కోడిగామా సముద్రపుదారి కనుఁగొనుటకు పూర్వము హిందూదేశము నుండి యెగుమతియగు ప్రతివస్తువును పర్షి యా, ఇటలీ దేశములద్వారా ఐరోపా ఖండ మునకు రావలసి యుండెడిది. వాస్కోడిగా మా పోర్చుగలు దేశీయుఁడు. ఈ దేశ వాస్త వ్యులను మనవారు బుడతకీచు లనియెదరు. ఐరోపా ఖండములో పోర్చుగలు స్పెయిను

దేశము లిరుగుపొరుగున నుండును. ఈ రెండు దేశములు మొట్టమొదట హిందూ దేశము తో వర్తకమునారంభించిరి. హిందూ దేశము నుండి వచ్చెడి సరుకంతయు నీ దేశముల లోనికి పూర్వమువలెఁ గాక తిన్నగా సముద్రము మీఁదనే తెచ్చెడివారు. అద్దకపుబట్టలు, రంగులు మొదలగునవి హిందూ దేశమునుండి విధివిరామము లేక దిగుమతిఁజేసి యితర దేశములకు రవాణా చేసెడివారు. కొంత కాలమునకు హిందువులుపయోగించెడి యద్దకపు పద్ధతులుఁ గూడనేర్చి తమ దేశములలో రంగుల వ్యాపారమును సాగించిరి. కొలఁది కాలములో హాలెండు దేశీయులు అనఁగా డచ్చివారుకూడ హిందూ దేశముతో వర్తకము ప్రారంభించిరి. ఐరోపా ఖండమునందీ మూఁడు దేశములే మొట్టమొదట నద్దకములలో నెక్కువ ప్రవీణతఁ గాంచినవి. ఎరుపురంగు వేయుట కుపయోగించెడి మంజిష్టయు, కిరిమింజియు నితర దేశములనుండి తెచ్చి తమ దేశములలోఁ బెంచుటకు మొదలిడిరి. క్రీ॥ శ॥ ౧౬౩౦-వ సంవత్సరములో నొకడచ్చి శాస్త్రజ్ఞుఁడు కిరిమింజితో ఉన్నికి ఎరుపు రంగు వేసి యారహస్యమును వెల్లడి జేసెను.

క్రీ॥శ॥ ౧౬౦౩ సంవత్సరమువఱకు నింగ్లండులో నద్దకపు పరిశ్రమ విస్తారముగ లేనట్లు తోచుచున్నది. ఏలయన, ఆసంవత్సరములో "రాలీ" యను నతఁడు మొదటి జేమ్సు ప్రభువుతో నిట్లు విన్నవించెను. "ఇప్పటి వఱకు నాంగ్లేయులు ఉన్ని యద్దకమునందు కౌశల్యముఁ లేక యున్నారు. రంగులు వేయించుటకు వారు బట్టలను సామాన్యముగ హాలెండు దేశమునకు బంపుచున్నారు. ఈ రీతిని సాలుకు ౮౦,౦౦౦ బట్టలు రంగులు వేయించుటకై యితర చోట్లకు, బంపుచున్నారు!" ఈ మాటలు విని ప్రభువు తెల్లబట్ట లెగుమతి చేయఁగూడదనియు రంగు నింగ్లండులోనే వేయవలయుననియు నాజ్ఞాపించెను. ఈ హుకుమునకుఁ గోపించి హాలెండు, జర్మనీ దేశీయులు ఇంగ్లండులో రంగులు వేసిన గుడ్డలు కొనఁగూడదని నమ్మకట్టిరి. ఆంగ్లేయులు వేసిన రంగులు బాగుండక పోయెను. ఈ కారణముచేత జేమ్సుగారి హుకుము కొంత కాలము తరువాత రద్దు చేసిరి. ౧౬౨౪-వ సంవత్సరమువరకును ఇంగ్లండులో మంజిష్టను (మదారుచెక్క) బెంచినట్లు కనబడదు. ౧౬౭౦-వ సంవత్సరమునకు పూర్వము వ్రాసిన గ్రంథములలో నూలు బట్టలయద్దకమునుగూర్చియే లేదు. ౧౬౭౪-వ సంవత్సరమునకుఁ గూడ నాంగ్లేయులు వారి బట్టలను రంగుల నిమిత్తము హాలెండునకు, బంపెడివారు. ౧౬౬౨-వ సంవత్సరములో మొదటిపర్యాయము రాయల్ సొసైటీయను భౌతికశాస్త్ర సంఘమువారు అద్దకములను గూర్చియు, వానిపద్ధతులను గూర్చియు, నొకపుస్తకమును ప్రచురించిరి. ౧౬౬౭-వ సంవత్సర

ములో నొక డచ్చి యద్దకుఁడు ఇంగ్లండునకు వచ్చి ప్రభుత్వము వారి యాదరణమును బడసెను. ౧౬౮౫-వ సంవత్సరములో౨౦,౦౦౦ మంది పరాసు పనివాండ్రువచ్చి ఇంగ్లండులో నివాసము చేసికొనిరి. నాటినుండి యింగ్లండులోఁగూడ నద్దకపు పరిశ్రమ తదితర దేశములతోఁ బాటు వృద్ధిఁ జెంద నారంభించెను. ఫ్రాన్సు, ఇంగ్లండు, జర్మనీ మున్నగు నైరోపా దేశములలో ప్రభుత్వము వారే పుస్తకములు వ్రాయించియు నుపాధ్యాయుల నూరూరికిఁ బంపియు మరియు నితర ప్రోత్సాహములఁ బనివాండ్రకుఁ గల్పించియు నీ పరిశ్రమను త్వరితములో నభివృద్ధిఁ జేసిరి.

పదునెనిమిదవ శతాబ్దము రసాయన శాస్త్రాభివృద్ధి చరిత్రలో ముఖ్యమైన పట్టు. అద్దకపు పరిశ్రమలో నుపయోగించెడి సోడా యుప్పు, చలువసున్నము, గంధక ద్రావకము మొదలగు వస్తువులను సులభముగను, తక్కువ ఖరీదునకును, తయారుచేయు మార్గములఁ గనిపెట్టిరి. పందొమ్మిదవ శతాబ్దములో నర్ధభాగము గడచిన వఱకును స్వభావసిద్ధములగు మూలికలనుండి తీసిన రంగులనే వాడుక చేసెడివారు. కాని ౧౮౩౪-వ సంవత్సరములో నొక జర్మను శాస్త్రజ్ఞుఁడు "అని లీని" పదార్థము (Aniline) తోను చలువ సున్నము తోను ప్రశస్తమైన నీలిరంగును తయారు చేసెను. అని లీను మూలికలనుండి తయారు చేయఁబడిన పదార్థముగాదు. ఇది తారు(వాడకీలు) నుండి తయారుకాఁబడినది. తారెట్లు వచ్చునో కొంచెము విచారణ చేయుదము. మనవలెగాక ఐరోపా ఖండవాసులకు నేలబొగ్గు (Coal-రాక్షసిబొగ్గు) ముఖ్యమైనఆస్తి. నేలబొగ్గు సహాయమువలన యంత్రములను నడిపి పరిశ్రమలు వృద్ధిఁజేసిరి. మనవలె గాక వారు నేలబొగ్గునే వంటచెఱకుగ వాడెదరు. దానినుండి తీసిన వాయువుతో దీపముల వెల్గింతురు. వేయేల! వారి యార్థికాభివృద్ధికి నేలబొగ్గే యునికిపట్టు. దీపములకొఱకై వాయువును తయారు చేయుటకు నేలబొగ్గును, ఇనుపగొట్టములలో కూరి గాలి తగులకుండ మూతులు బిగించి కొలిములలోఁ గాల్చెదరు. ఈ వేడిమికి నేలబొగ్గు వాయువును, తారును ఏర్పడి యినుపగొట్టముల మూతులకుఁ దగిలించిన తూములవంటి సన్నని యినుప నాళికల గుండ పైకివచ్చును. వాడకీలను పేరుతో నమ్మఁబడు తారు కొంచెము ద్రవముగ నుండు నల్లని పదార్థమని యందఱు నెఱిగిన విషయమే. దీనిని తిరిగి పైనిఁజెప్పిన రీతిని నేలబొగ్గువలె గాలిసోకకుండ మరగఁబెట్టవచ్చును. అప్పుడు పైనిఁజెప్పిన "అనిలీను" పైకివచ్చును. అనిలీను రంగులేనిదై నీటివలె స్వచ్ఛముగ నుండుద్రవపదార్థము. చలువసున్నముదీనితో గలిపి యానీటిలో గుడ్డనుముంచినచో గుడ్డకు నీలిరంగువచ్చును. ౧౮౫౬-వ సంవత్సరములో "పెర్కిన్" (Perkin) అను నాంగ్లేయ శాస్త్రజ్ఞుఁడు అనిలీను నుండి "మావ" ను

(Mauve) నల్లవాగుగ నుండు ఎరుపురంగును సాధించెను. ౧౮౬౯-వసంవత్సరములో "అలిజరీన" ను, ఎరుపురంగు, జర్మనీ దేశములో తారునుండియే తయారుచేయఁబడినది. ఇంతకుపూర్వ మీరంగు మంజిష్టయను మూలికతో బట్టలకు వేసెడి 'వార్ను' అనఁగా అలిజరీను మదారుచెక్క యందున్న రంగుయొక్క సారమని గ్రహించునది. ప్రకృతిలోనున్న మూలికయందుఁగల స్వాభావ సిద్ధమగు రంగులయొక్క సారములను మూలికల సంబంధ మేమియు లేకుండ తయారుచేయుట కిదియే ప్రథమప్రయత్నము. ఓషధుల సంబంధమేమియు లేక వానియందు నిబిడీకృతమైయున్న రంగులవలెనుండి మనుష్యుని బుద్ధిబలముచేఁ జేయఁబడినరంగులకు "కల్పితపురంగులు" (Artificial dyes) అనిపేరు. మూలికల సహాయముచే వేయఁబడు రంగులకు "స్వాభావ సిద్ధమగు రంగులు" (Natural dyes) అనిపేరు. ౧౮౭౮-వ సంవత్సరములో బేయరను నతఁడు నీలిచెట్టు సంబంధము లేకయే తారునుండి తనబుద్ధికౌశలము నుపయోగించి నీలిపందును సాధించెను. కావున నిదియు కల్పితపు రంగనియే తెలిసికొనునది. ౧౮౫౬-వ సంవత్సరము మొదలుకొని తారునుండి వేలకొలఁది రంగులు చేయుచున్నారు. పైనివర్ణించినరీతి తారును మరగఁబెట్టినప్పుడు ముఖ్యమైన మూఁడు ద్రవ పదార్థములు వీడిపోవును. వీనికి "బెంజీను", "నాఫ్తలీను", "ఆంత్రశీను" అనిపేర్లు. ఇవి స్వచ్ఛముగ నుండి వాసనయందు కొంచెమించుమించుగ కిరసనాయిలును బోలియుండును. ఇవియు కిరసనాయిలువలె మండును. ఈమూఁడునుకల్పితపు రంగులకు గనులని చెప్పవచ్చును. ప్రతి సంవత్సరము వందలకొలఁది కల్పితపురంగులు క్రొత్త వితయారగుటవలన అద్దకములం దేఛాయమైనను తెప్పించుట కవకాశములుగలుగుచున్నవి. కల్పితపురంగులలో చాలభాగము పక్కారంగులు గాకపోయినను కావలసినన్ని పక్కారంగు లుండుటచేతను, కాంతిలోఁ దీసిపోకుండుట చేతను, రంగులయొక్క సంఖ్య మితిమీరి యుండుటచేతను, పాశ్చాత్య దేశములలో నిప్పుడు మొదటినుండియు వాడుకఁ జేయఁబడుచుండిన స్వాభావసిద్ధములగు రంగులగంటె ఈరంగులువానిస్థానము నాక్రమించినవి. మూలికలతోటి యద్దకము లిప్పుడు పాశ్చాత్య దేశములలోఁగానరావు. క్రొత్త రంగుల తోఁబాటు అద్దకములయం దుపయోగించెడి , పరికరములలోఁగూడ మార్పులు గలిగినవి. పూర్వ మద్దకములయం దుపయోగించెడి చేతిపాత్రలకు మారుగ యంత్రసామగ్రి యధికముచేసి మనుష్యునికష్టము తగ్గించిరి. రసాయన శాస్త్రాభివృద్ధియు, యంత్రశాస్త్రాభివృద్ధియు స్వల్పకష్టముతో తక్కువ వెలకు నిర్ణీత కాలములో నెక్కువపని జరుగుటకుఁ దోడ్పడినవి.

అద్దకపువిద్య రసాయనశాస్త్రమునకు సంబంధించినది. అద్దకము వేయఁబడు వస్తువుతో

రంగులకు సమ్మేళనముఁగూర్చుటయే యద్దకుని ముఖ్యోద్దేశ్యము.

సానమ్యా పద్ధతులు

అందునొకుఁగాను రంగు నీటిలో కరఁగిపోవునదియైయుండి యా నీటిలో వస్తువును ముంచినప్పుడు రంగుతిరిగి నీటినుండి విడిపోవలెను. లేనియెడల రంగులు పట్టవు. బొగ్గుపొడి నీటిలోఁ గలిపి యా నీటిలోబట్ట ముంచినచో బట్టమాయునుగాని రంగంటదు. ఏలయన నిచ్చట రంగుపదార్థమగుబొగ్గుపొడి నీటిలో కరగదు. కావున రంగులకును, రంగులు వేయఁబడు వస్తువులకును పరస్పరానురాగములేనిది సమ్మేళనమొనఁగూరదు. ఈ యనురాగము వస్తువు యొక్క స్వభావమును బట్టియుండును. పరస్పరానురాగ తారతమ్యమునుబట్టి రంగులు వేయుపద్ధతులుగూడ మారుచుండును. ఉన్నికిని, రంగులకును సాధారణముగ నెక్కువ యనురాగముగలదు. అందుచేత సామాన్యముగ ఉన్నివస్తువులను రంగునీటిలో ముంచిన చాలును. నూలునకును రంగులకును అనురాగము మిక్కిలితక్కువ. అందుచేత కొన్నిరంగులు నూలువస్తువులకు పట్టనే పట్టవు. తక్కినవి మరికొన్ని వగరుపదార్థములతోఁగలిపినప్పుడే యంటును. అనురాగ విషయమున పట్టువస్తువులు ఉన్నికిని నూలునకును మధ్యస్థముగ నుండును. రంగులనుబట్టికూడఅద్దకములపద్ధతులుమారుచుండును. కొన్నిరంగులు నేరుగ బట్టలకెక్కును. కొన్ని యితర పదార్థములతో దోహదముఁ జేసినఁగాని యంటవు.

రంగులు వేయుటకు సామాన్య పద్ధతులు నాలుగుగలవు:—

(1) రంగుకషాయములో బట్టనుముంచి యెండవేసినప్పుడు నీరినికిపోయి రంగుమాత్రము బట్టనంటియుండును. నీటికి బదులుగ నీటికంటె నెక్కువత్వరగా ఇనుకునట్టి మరియొక పదార్థములో (అమోనియా) రంగును కరిగించి యాకషాయములో బట్టనుముంచిన యెడల రంగు త్వరితముగఁ బట్టును.

(2) గాలియందుఁగల ప్రాణ వాయువు సహాయముతో రంగులువేయుట. కరకాయలూరవేసిన నీటిలో బట్టనునానవేసి తరువాత అన్నభేదిఁ గలిపిన నీటిలో ముంచిన యెడల మొట్ట మొదట రంగేమియుఁ గనుపడదు. కాని బట్టగాలి కారినకొలఁది రంగునకు కాంతిహెచ్చును.

(3) రెండు పదార్థములు గలిపినప్పుడు కొన్ని తరుణముల నీరెంటికంటె భేదమగు వేఱొక పదార్థ మేర్పడును. సున్నపు తేటకు చాకలి చౌడుఁగలిసిననీటి తేటఁగలపిన యెడల తెల్లని పదార్థమొకటి పెరుగువలె దిగును. ఇట్లే రెండు పదార్థములు గలిసినప్పుడు కొన్ని తరుణముల రంగుపదార్థము లేర్పడును. ఈ పద్ధతి ముఖ్యముగ ఖనిజ సంబంధములగు రంగులువేయుటకే యనుకరింపఁబడుచున్నది.

(4) బట్టలను వగరు, పులుపు గాని పదార్థములలో నానవైచి తరువాత రంగులు

వేయుట. ఈపద్ధతి ముఖ్యముగ నూలుబట్టల కవసరము.

రంగుల విభజనము

రంగులను అనేకవిధములుగ విభజింప వచ్చును. రంగులువేయు పద్ధతినిబట్టి వ్యష్టి రంగులనియు(Simple colours) సమష్టిరంగులనియు (Compound colours) నొక విభజనము. ఎరుపు, పసుపు, నలుపు, నేరుగ రంగు పదార్థములతో వేయవచ్చును. ఊదా, ఆకు పసరురంగులు నేరుగ నాయారంగుపదార్థములతోనైన వేయవచ్చును. లేక రెండు వ్యష్టి రంగుల మిశ్రణమువలననైనను వేయవచ్చును. ఎరుపుమీఁద నలుపు వేసినచో ఊదావచ్చును. లేక నేతలోపడుగునకు ఎరుపు, పేకకునలుపు నూలును,తీసికొనినచో నూదారంగేర్పడును. ఇట్లె పసుపుమీఁద నీలివేసినచో నాకుపసరు రంగువచ్చును. కావున ఊదాయును, ఆకు పసరును సమష్టిరంగులనవచ్చును.

పక్కారంగులు (Fast dyes) కచ్చారంగులు (Fugitive dyes), అని రెండవ విభజనము. చౌడులోనుడక వేసినప్పుడుగాని, ద్రావకములు సోకినప్పుడుగాని, సబ్బుతో జాడించినప్పుడు గాని, ఎండ కెండి, వానకుఁదడిసి, గాలికారి నప్పుడుగాని వెలిసిపోకయుండెడి రంగులకు పక్కారంగులని పేరు. ఇట్టి సందర్భములలో వెలిసిపోయెడివానిని కచ్చారంగులందురు.

రంగులయొక్క ప్రకృతినిబట్టి "సోపాధిక రంగులు" (ఉపాధికావలసిన - Adjective or mordant dyes) "నిరుపాధికరంగులు" (ఉపాధియవసరములేని - Substative or direct dyes) అని మరి యొకవిధము. సోపాధిక రంగులు వేయుటకుఁ బూర్వము బట్టలను ఉపాధులనఁదగు రంగులీయని పదార్థముల లో నుడకవేయవలెను. సాధారణముగ నుపాధులు (Mordant) వగరుగగాని పులుపుగ గాని యుండును. అందుచేత మనదేశము లో నుపాధులకు "కసటువస్తువు" లనియు ఉపాధులలో బట్టల నుడకవేయుటకు "కసటు వేయుట" యనియు పేర్లుగలవు. బట్టల నుపాధులలో నుడకవేసినఁగాని సోపాధిక రంగులంటవు. నిరుపాధికరంగులకు నుపాధు లనవసరము. బట్టలనురంగుకషాయములో ముంచిన చాలును. ఖనిజ సంబంధములగు రంగులలో చాలభాగము నిరుపాధికములు. ఇవిగాక నీలిమందు, పసుపు,జాభ రాగింజలు, కుసుంభా పూలు మొదలగు నోషధులును, తారు రంగులలో (కల్పితపురంగులు) చాలభాగ మును నిరుపాధికములే. కాని రంగులదీప్తి హెచ్చించుటకు నిరుపాధికములకుఁ గూడ నుపాధులఁ దగిలించు నాచారముగలదు. తరుచుగవాడెడి యుపాధులలో పటికయు, క్షరక్కాయలును ముఖ్యములు.

అద్దకములయం దనుకరించెడి పద్ధతులనుబట్టి రంగుల నైదువిధములుగ విభజింప వచ్చును. వీనినిగుఱించి యింకను కొంచెము యీక్రింద వ్రాయఁబడును. కల్పితపురంగులు వెలసినతరు

వాత పాశ్చాత్యులు మూలికల నద్దకములలో వాడుటలేదని పైని వ్రాసియుంటిమి. ఈ క్రింద వ్రాయఁబోవు విభజనము ముఖ్యముగ కల్పిత పురంగులకే వర్తించును. ఒకేరంగును వేయుటకు రెండుమూఁడు పద్ధతులుగూడఁగలవు.

(1) ద్రావకపురంగులు (Acid dyes) :- ఇవి ఉన్నికిని, పట్టునకును రంగులు వేయుటకుపయోగించును. సామాన్యముగ నూలుగుడ్డలకును, నారవస్తువులకును, ఈ రంగులుపట్టవు. ఈ రంగులను బజారులో పొడిరూపమున నమ్మెదరు. నీటిలో వేసిన వెంటనేకరుగును. ఈరంగులలోచాలవఱకు నెండలోను, కొన్ని యుడకవేయుటవలనను వెలిసిపోవును. కాని కొన్నిపక్కా రంగులు గలవు. ఉన్నినరమునకు (పీచు) రంగువేయుట కివి యోగ్యములుగావు. ఈ రంగులతో నద్దకము వేయునప్పుడు గంధకద్రావకముఁ గూడఁ గలిపినఁగాని రంగులంటవు. అందుచేత వీనికి ద్రావకపురంగులని పేరుబెట్టఁబడినది. ఈ రంగులలో బట్టల నుడకవేయునప్పుడు రంగుచక్కఁగ వచ్చువఱకును కొంచెము గంధకద్రావకము అప్పుడప్పుడు కలుపుచుందురు. గంధకద్రావకము రంగుపదార్థమును విడగొట్టి బట్టలకంటించును. నీలిమందు ద్రావకపురంగులలో నొకటి.

(2) క్షారపురంగులు (Basic dyes) :- ఇవియు ద్రావకపురంగులవలె నీటిలో కరిగెడిపొళ్లు. ఇందు క్షారభాగమునందు (Basic part) రంగుండును. ఇదియొక ద్రావకముతోఁ గలిసినఁగాని రంగేర్పడదు. ఉన్నియందును, పట్టునందును స్వభావసిద్ధముగ ద్రావకపదార్థములున్నవి. అందుచేత నీ రెంటికిని ఉపాధులు లేకయే యీ రంగు లెక్కును. దూదియందును, నారయందును ద్రావకములు లేవు. అందుచేత నీ రెంటికిని క్షారపురంగులు నేరుగనెక్కవు. రంగులువేయుటకు పూర్వము వానిని ద్రావకోపాధులతో నుడకవేయవలెను. ఇందుకు ముఖ్యముగ వాడఁబడునది కరక్కాయల కషాయము. కరక్కాయ నీటిలోనాన్చిన నూలుబట్టలుగాని నారవస్తువులుగాని క్షారపురంగులలో నుడకవేసిన యెడల రంగులు చక్కఁగనంటును. ఉన్నికంటె పట్టున కీ రంగుల నాకర్షించుశక్తి యెక్కువగలదు. రంగుల నెక్కువదీప్తిమంతముగఁ జేయుటకు, ఉన్నిబట్టలను పట్టుబట్టలనుగూడ సబ్బుతో నుడకవేయుదురు. లేదా కొంచెము ద్రావకములనైనను గలిపెదరు. ఈ రంగులు సామాన్యముగ సబ్బునకువెలియవు కాని యెండ కెండినప్పుడు చాలవఱకు వెలిసిపోవును.

(3) సోపాధికరంగులు (Adjective or mordant dyes) :- ఈ రంగులయొక్క స్వభావమునుగూర్చి పైని వ్రాయఁబడినది. బట్టలను సాధులలో నుడకవేసినప్పుడే యీ

రంగులు శాశ్వతముగనుండును. మఱియు నివి ద్రావకములవలె పనిచేయును. కావున వీని యుపాధులు భస్మముల (Metallic oxides) నిచ్చెడి పదార్థముగ నుండవలెను. ద్రావకములు భస్మములతోఁగలిసి లవణములగును. ద్రావక ప్రకృతిఁగల సోపాధికరంగు లుపాధుల యందుఁగల భస్మములతో సమ్మేళన ముల్లై లవణ (Salt) ప్రకృతిఁగల రంగు లేర్పడును. సోపాధికరంగు లన్నివిధములగు వస్త్రములకును వేయవచ్చును. స్వభావ సిద్ధములగు రంగులలో ననేకములు సోపాధికములే. మంజిష్ట, చిఱువేరు, పతంగి, కిరిమింజి మున్నగునవి సోపాధికములు. కల్పితపురంగులలో "టర్కీ-యెరుపులు" "అలిజరీనురంగులు"లోనగునవి సోపాధికములు.

(4) నిరుపాధిక రంగులు (Substantive or direct dyes) :—ఈరంగులను గూర్చి కూడ పైని వ్రాయఁబడినది. ఈరంగులు నూలుబట్టలకుఁగూడ, ఉపాధులు లేకయే వేయవచ్చును. స్వభావసిద్ధములగు రంగుల లోను, కల్పితపురంగులలోను నిరుపాధిక ములుగలవు. ఇవియన్నియుసామాన్యముగ నీటిలో కరగును. అందుచేత బట్టలకు హెచ్చుతగ్గులులేక రంగులు వేయవచ్చును. ఇవియన్నియు నెండకు వెలియకపోయినను కొన్నిరంగులు ద్రావకములుగాని క్షారములుగాని సోకినప్పుడు వెలిసిపోవును. శీఘ్రముగ నీ రంగులు బట్టల కెక్కకుండుటకై యీ రంగులతో సాధారణముగ కొన్నిమందపదార్థములను గలిపెదరు. ఉప్పు, టంకము, సోడా పొడి, సబ్బులోనగునవి యిట్టి సాహాయ్య పదార్థములు. ఇవి యాలస్యముగఁబట్టెడి రంగులను త్వరపెట్టుటకును, త్వరితముగ నెక్కెడిరంగుల నాలస్యముగ నంటునట్లు చేయుటకును, ఉపయోగించును. ఈరంగులు కలుపుడు నేతలకు(పట్టు, ఉన్ని కలిసినవి లేక నూలుపట్టుకలిసినవి) గూడవేయవచ్చును. కల్పితపు రంగులలో "కాంగో యెరుపు" "బెంజీను రంగులు" ముఖ్యములగు నిరుపాధికములు.

(5) దోహదపు రంగులు (Developed colours) :- అద్దకములయం దుపయోగించెడి కొన్ని పదార్థములు బట్టల యొక్క సంపర్కము గలిగినఁగాని రంగులేర్పడవు. రంగులనిచ్చెడి పదార్థముల కషాయములతో మరికొన్ని పదార్థముల గలిపి బట్టల నందులో ముంచినఁగాని రంగులేర్పడవు. కావున నిట్టిరంగులకు దోహదపురంగులని పేరుబెట్టవచ్చును. ఇందు రెండుమూఁడు తరగతులు గలవు. స్వభావ సిద్ధములగు రంగులలోఁ గొన్ని దోహదపు రంగులు. నీలిమం దిట్టి జాతిలోనిది. "అనిలీను నలుపు," "ఆజోరంగులు" మున్నగు కల్పితపురంగులీజాతిలోనివి. ఖనిజ సంబంధము

లగు రంగులన్నియు దోహదపు రంగులు. దోహదపురంగులు ముఖ్యముగ నూలు బట్టలయద్దకమునం దుపయోగించెదరు.

నీలిమందు చూచుటకు నల్లగానున్నను, ఈస్థితిలో రంగు వేయుటకుఁ బనికిరాదు. ఏలయన నీలిమందు నీటిలోకరగదు. కరిగినఁగాని రంగంటదు. అందుచేత రంగువేయుటకుఁ బూర్వము దానితత్త్వముమార్చిగుడ్డను దానిలో ముంచుదురు. గుడ్డను ముంచునప్పటికి తత్త్వము మారిన నీలిమందు రంగులేకయే యుండును. గుడ్డనుముంచియెండలోవేసినతరువాతగాలిసోకి నీలిరంగేర్పడును. నీలిమందును నీటిలో కరగునట్లు చేయుట కనేక పదార్థములుపయోగింతురు. అన్నభేది, సోడాపొడి గంధకపుపొగలు మున్నగువస్తువుల వాడెదరు. ఒకపద్ధతిలో బెల్లపునీరు, తవుడు, సున్నము, సోడాపొడి, నీలిమందుతోఁ గలిపి మురగఁ బెట్టెదరు. ఇట్లు మురిగినరంగు నీరు బూడిదె రంగుఁ గలిగియుండును. ఈ నీటిలో బట్టను ముంచి గాలిలో నారవేసిన యెడల నిగనిగలాడుచు నీలిరంగువచ్చును.

అనిలీను నలుపు (Ainline black):- అనిలీను నీటివలె స్వచ్ఛమైన ద్రవపదార్థమని యిదివరలో వ్రాసియుంటిమి. ఇది ప్రాణవాయువుతోఁ గలిసి అనిలీను నలుపను రంగగును. అనిలీను ప్రాణవాయువుతోఁ గలియుటకు కొన్ని వాహకము లవసరమై యున్నవి. అనేక వస్తువులు వాహకములుగ నుపయోగించుచున్నారు. మైలతుత్తమిట్టి వాహకములలోనొకటి. మైలతుత్తపు నీటిలో బట్టనుముంచిన తరువాత రంగునీటిలోముంచి ఎండవేసినప్పుడుగాలిలోనున్న ప్రాణవాయువు, అనిలీనుతో సంయోగమునొంది నల్లనిరంగు బట్టలకెక్కును. ఈరంగువేయుటకుఁగావలసిన తప్సీళ్లు స్థలాంతరములో వ్రాయఁబడును.

ఖనిజ జాతిరంగులన్నియు (Mineral colours) దోహదపురంగులని పైని వ్రాయఁబడినది. ఇందు ముఖ్యమైనవి యైదారుమాత్రముగలవు. అవి యిచ్చట వర్ణింపఁబడును.

క్రోముపసుపు (Chrome yellow) :-ఇది నూలుబట్టలకు వేసెడి రంగు. ఇది వేయుటకు బట్టను మొదట సున్నపు తేటలోనానవేసి, లెడ్డు ఆసిటేటులోగాని నైట్రేటులోగాని ముంచెదరు. (ఈ రెండును సీససంబంధమగు లవణ పదార్థములు. సీసము ఆసిటిక్ ద్రావకముతో గలిసి లెడ్డాసిటేటగును. అట్లే సీసమునైట్రిక్ ద్రావకముతోఁగలిసి లెడ్ నైట్రేటగును). తిరిగి యాబట్టను సున్నపు నీటిలోముంచి, పిండి,పొటాసియం బైక్రోమేటు (Potassium Bichromate) నీటిలో నానవేసెదరు. ఇట్లు కొంతసేపునానినగుడ్డను కొంచెముశంఖద్రావకము గలిపిన నీటిలోపిండి యారవేసెదరు. అప్పుడు తేటయగు పసుపుపచ్చరంగువచ్చును. ఈ పసుపురంగు వేసినబట్టను చిక్కని సున్నపు నీటిలో నుడకవేసినయెడల మంచి నారంజ పండువర్ణముగల రంగేర్పడును.

మండూరపువర్ణము — ముక్కుపొడివర్ణము (Iron buff):-ఇది నూలుబట్టలకు మాత్ర ముపయోగింపును. అన్నభేదిఁగలిపిన నీటిలో బట్టలను నానవేసి సోడాపొడినీటిలోగాని, సున్నపునీటిలోగాని యుడకవేసి యెండవేయుట వలన నీ రంగువచ్చును. ఉడకవేసిన బట్టలను నేరుగ నెండవేయుటకు బదులుగ కొన్నితరుణముల చలువసున్నములోఁగూడ నుడికించి తరువాత నెండవేయుదురు. అప్పుడు బట్టలకు ముక్కుపొడి రంగుపట్టును. ఈ రంగుతుకుట వలన గాని యెండవేయుటవలనగాని వెలియదు. కాని ద్రావకములు సోకినప్పుడు నిలువదు.

ప్రష్యను నీలి (Prussian blue):- ఇది యన్నివిధములగు బట్టలకును పనికివచ్చును. పట్టుయొక్క తూనిక హెచ్చించుటకీ రంగు వేసి వర్తకులు మోసముచేయుదురు. నూలు బట్టలకును పట్టుబట్టలకును ముందుగ పైనిఁ జెప్పినరీతిని మండూరపురంగువేసి తరువాత నీలివేయుదురు. నీలివేయుటకు మండూరపు రంగుబట్టను "పొటాసియం ఫెర్రోసయనైడ్" (Potassium ferrocyanide) అను లవణ మును శంఖద్రావకమును గలిపిన నీటిలో నుడకవేయుదురు. నీలిరంగు ముదురుగ పడవలెనన్నచో నిట్లు రెండుమూఁడు పర్యాయములు చేయవలెను. ఉన్నికి నీలివేయుటకు ముందుగ మండూరపు రంగువేయ నక్కఱలేదు. పొటాసియం ఫెర్రోసయనైడ్తో గంధక ద్రావకమును గలిపి నీటిలో కరగించి ఉన్ని నందులో వేసి క్రమముగ నానీటిని కళకళ కాగనిచ్చెదరు. ఇట్లు కొంతసేపుడికిన తరువాత ఉన్నిని పైకిదీసి నీటిలో జాడించెదరు. రంగును మిక్కిలి దీప్తిమంతముగాఁ జేయుట కుడుకుచున్నప్పుడు తగరపునీరు (తగరమును శంఖద్రావకములోఁ గరగించి నీటిలోఁ గలుపుట-(Stannous chloride) కొంచెము గలిపెదరు. ప్రష్యనునీలి సామాన్యముగ పక్వరంగైనను క్షారములుసోకినప్పుడు వెలియును.

మాంగనీసు బ్రౌను (Manganese brown):- ఇది కొంచె మించుమించుగ మాంసము వర్ణము గలిగియుండును. ఇది ముఖ్యముగ నూలుబట్టలకువేయుదురు. కదాచిత్తుగ ఉన్నికిని, పట్టునకును వేయు చున్నారు. ఈ రంగు వేయుటకు బట్టలను "మాంగనీసు క్లోరైడు" (Manganese chloride) అను లవణముఁ గలిపిన నీటిలోముంచి తరువాత సోడాక్షారమును (Caustic soda) చలువ సున్నమును గలిపిన నీటిలో నుడకవేయుదురు.

ఉపాధులు

బట్టలకు రంగు లంటుటకుఁగా నుపయోగించెడి కసటు వస్తువు లుపాధు లనవచ్చునని యిదివరలో వ్రాసియుంటిమి. ఇవి రెండు విధములు. ఖనిజ సంబంధములయినవి కొన్ని. వీనిని ఖనిజోపాధు (Mineral or inorganic mordants) లన వచ్చును. తక్కినవి మూలికల సంబంధములు. వీనిని మూలికోపాధు (Vegetable or organic mordants) లన

వచ్చును. మన దేశములో పటిక, సజ్జికారము, అన్నభేది మొదలగు రెండుమూఁడుపాధులు తప్ప నెల్లప్పుడు మూలికోపాధు లే వాడఁబడు చున్నవి. విదేశములలో నట్లుగాక రెండు విధములగు నుపాధులను సమముగ వాడుదురు.

ఖనిజోపాధులు:-గంధకద్రావకము, శంఖద్రావకము. నీటిలో వీనిని గలిపి బట్టలు ముంచుదురు.

పటిక:-ఇది అల్యూమినియమను లోహ సంబంధమగు లవణము. "అల్యూమినియం ఆసిటేటు" అను మరియొక లవణముగూడ వాడుటగలదు. ఇది విశేషముగ కలంకారీ యద్దకమునం దుపయోగపడుచున్నది. సాదా యద్దకమునందు దూది, నార, ఉన్ని పదార్థములను కసటువేయుట కివి యుపయోగపడును. కాని పట్టున కివి వాడరు. ఉన్నియద్దకమునందు పటికయు, నూలద్దకమునందు అల్యూమినియం ఆసిటేటును వాడెదరు.

క్రోమియము:- ఇది యల్యూమినియమువలె నొకలోహము. ఆసిటేటు, సల్ఫేటు, క్లోరైడు, క్రోమేటు, బైక్రోమేటు మొదలగు క్రోమియములవణము లుపాధులుగవాడెదరు. పటికవలె నివియు పట్టుబట్టలకుతప్ప తక్కిన యన్నివిధములగు బట్టలకు నుపయోగపడు చున్నవి.

ఇనుము:-దీనిలవణము లనేకము లుపాధులుగ నుపయోగించెదరు. ఇవి యన్నివిధములగు వస్త్రముల యద్దకమునందు నుపయోగపడుచున్నవి. ఇందు అన్నభేది ముఖ్యమైనది. ఇదిగాక నైట్రేటు, ఆసిటేటుగూడ వాడుచున్నారు. పట్టుకు నలుపురంగు వేయుటకు నీ యుపాధులే ముఖ్యముగ వాడుదురు.

రాగి:-మైలతుత్తము (మయూరతుత్తము) రాగి సంబంధమగు లవణము. గంధకద్రావకములో రాగిని కరిగించుటవలన నిది యేర్పడును. ఇదిగాక "కాపర్ ఆసిటేటు"(Copper acetate-రాగిని వినీగరులో కరిగించుటవలన నేర్పడిన లవణము) గూడ నప్పుడప్పుడు వాడుట గలదు.

ఆంటిమొని (Antimony):-ఇది యొక లోహము. సౌవీరము ఆంటిమొని సంబంధమగు భస్మము. ఇది చింతపండు పులుసుతోఁ గలిసి యొక యుపాధిగ వాడఁబడుచున్నది. పట్టు, ఉన్ని బట్టలకు దీనిని వాడరు.

తగరము:-క్లోరైడు, నైట్రేటు తగర సంబంధమగు నుపాధులు. తగరమును శంఖద్రావకములో కరిగించుటవలన మొదటిదియు నైట్రిక్ ద్రావకములో కరిగించుటవలన రెండవదియు నేర్పడును. రంగులను మిక్కిలి దీప్తిమంతములుగఁ జేయుట కీ యుపాధులు వాడఁబడుచున్నవి. తఱుచుగ ఉన్నికిని, పట్టునకును వీనిని వాడుదురు. నూలునకును, నారకును విశేషముగ వాడరు.

పై నుదాహరించిన ఖనిజోపాధులలో బట్టలను ముంచినప్పు డాయుపాధుల యొక్క భస్మములు (Oxide-లోహము, ప్రాణవాయు

వుగల పదార్థములు బట్టల నంటియుండును. ఇవి రంగుపదార్థముల యందుఁగల రాగభాగముల నాకర్షించి బట్టల కంటుకొని యుండునట్లుచేయును. ఇదియే యుపాధులయొక్క ముఖ్యోద్దేశ్యము.

మూలికోపాధులు:-ఇందు ముఖ్యమైనవి "వినీగరు" (Acetic acid), చింతపండు పులుసు, నిమ్మకాయలరసము, కరక్కాయలు, కాచు, డివిడివిగింజలు లోనగునవి. ఇవిగాక కొన్ని చెట్లయొక్క చెక్కలు, బెరడులు, పూలు గూడ వాడుకలోనున్నవి. మూలికోపాధులయొక్క సారములను వండి తీసి సీసాలలో నమ్ముచున్నారు. ఇందు మూలమున పనివాండ్రశ్రమ తగ్గును. అందుచేత మనదేశములో దొరకెడివస్తువులు సయితము విదేశములనుండి సారరూపమున దిగుమతి చేయఁబడుచున్నవి. కొన్ని తైలములు మూలికోపాధులుగ వాడుచున్నారు. ఇందు ముఖ్యమైనది "టర్కీమెరుపునూనె" (Turkey-red-oil). ఆముదముతో గంధకద్రావకమును గలిపి యుప్పునీరుపోసి కలియఁబెట్టుటవలన పైతైలమేర్పడును. ఇది ముఖ్యముగ నూలుబట్టలకుఎరుపురంగు వేయుటకుపయోగపడును. టర్కీమెరుపనునది యొక మెరుపురంగుపేరు. ఈరంగు వేయుట కుపయోగింతురుగాన దీనికి టర్కీమెరుపు నూనెయని పేరువచ్చినది.

బట్టలయొక్క స్వభావమునుబట్టి యుపాధులు వేయుపద్ధతులు మారుచుండును. ఉపాధులతత్త్వమునుబట్టికూడ పద్ధతులుమారును. ఉన్నిని కసటువేయునప్పుడు కొంచెము ఉపాధియు, నెక్కువనీరునుగలిపి ఉన్ని నందులో నుడకవేయవలెను. ఉపాధులు చక్కఁగఁ బట్టుటకు కొన్నితరుణముల సహకారవస్తువుల నుపాధులతోఁగలిపెదరు. గంధకద్రావకము, చింతపండు పులుసు, పులిమజ్జిగలోనగునవి ఉన్నికసటునందుపయోగించెడివస్తువులు. పట్టును కసటువేయుటకు నుపాధులలో నుడకవేయనక్కరలేదు. చల్లని నీటిలోనే చక్కఁగ నంటును. నూలునుగాని, నారవస్తువులనుగాని కసటువేయుపద్ధతులు రంగునుబట్టియు, రంగులయొక్క కాంతినిబట్టియు మారుచుండును. పటికను, కాంతిఁగల మెరుపు వేయుట కుపయోగింతురు. తగరపు సంబంధములగు నుపాధులు రంగులను దీప్తిమంతములుగఁజేయుటకు వాడుదురు. ఇట్లే మైలతుత్తము, అన్నభేది, మూగరంగులువేయుట కుపయోగపడును.

రంగులువేయుటకు పూర్వము చేయవలసినతంతు బట్టలయొక్క స్వభావమును బట్టియుండును. ఉన్నివస్తువులన్నియు క్షారములలో నుడకవేసి వానినంటియున్న మాలిన్యములను దీసివేయవలెను. పట్టుబట్టలను సబ్బులోనుడకవేసినగాని వానినంటియుండు కొవ్వు జిగురు మున్నగు జంతుసంబంధమగు దుర్వాసనవస్తువులుపోవు. నలుపురంగులు వేయునప్పుడు నూలు చలువ చేయనక్కరలేదు. కాని లేతరంగులుగాని మిక్కిలి కాంతిగల

రంగులుగాని వేయుటకు నూలుబట్టలనుచలువ జేసితీరుదురు. నూలుగుడ్డలు, ఉన్నిగుడ్డలు, ఉల్లాసీదాలు (పడుగుకు నూలు, పేకకు ఉన్ని) రంగులు వేయుటకుఁ బూర్వము సాపు చేయుదురు. నూలుబట్టలు సామాన్యముగ కసటు వేయుదురు. సాధారణముగ ఉన్నిబట్టలను పట్టుబట్టలను కసటు వేయ నక్కఱలేదు. రంగులు వేయుటకుఁ బూర్వము బట్టలను కసటు వేయుట సామాన్యాచారము. కాని రంగులను ఉపాధులతోఁ గలిపి యొకేమారు డకవేయుటయు, రంగులలో నుడకవేసిన తరువాత బట్టలను కసటు వేయుటయుఁగూడఁగలదు రంగులుచక్కఁగఁ బట్టుటకు చల్లనిరంగు కషాయములో బట్టలనుముంచి క్రమముగ నుడకఁ బెట్టుదురు. సాధారణముగ పట్టుబట్టల యద్దకములో రంగుకషాయము వేడిగనుండనక్కఱ లేదు. పాశ్చాత్యులిప్పుడు కల్పితపురంగులే వేయుచుండుటవలన నవివేయు యోగము లొకటి రెండిందుఁదెలిపెదము:—

నూలుబట్టలకు అనిలీనునలుపు (దోహదపురంగు) వేయువిధము:—

నవాసారము	10 పాళ్లు.
సోడియము క్లోరేటు	10 ,,
మైలుతుత్తము	10 ,,
రంగుపదార్థము (అనిలీను హైడ్రోక్లోరైడు)	35 ,,
అనిలీనునూనె(యథోచితము)	
నీరు	200 ,,

ఇవి నలుపువేయుటకుఁ గావలసిన వివిధ వస్తువులపాళ్లు. నవాసారమును సోడియము క్లోరేటునుగలిపి కొంచెమునీటిలో కరిగించెదరు.తరువాత ప్రత్యేకముగ మైలుతుత్తమును కొంతనీటిలోను,రంగుపదార్థమును మరికొంత నీటిలోను వేర్వేఱుగ కరిగించి దీని పులుపు విరుగునట్లు అనిలీనునూనె (Aniline oil) గలుపుదురు. ఇవియన్నియుఁజక్కఁగచల్లారిన తరువాత నవాసారమునీరు రంగుపదార్థముతోఁ గలిపి యటుమీఁద మైలతుత్తము నీరుగూడ నందులోఁబోసి చక్కఁగ గలియఁబెట్టుదురు. ఈ మిశ్రణములో కావలసిన నీరంతయుఁబోసి బట్టలను ముంచి యొకపూట యెండవేయుదురు. ఇప్పటికి రంగు పూర్తిగ బట్టునుగాని బట్టకు నిగనిగరాదు. ఇందులకుఁగాను పొటాసియం బైక్రోమేటు (10 పాళ్లు) సోడాపొడి (5 పాళ్లు) ఉప్పు (5 పాళ్లు) వేయి పాళ్ళ నీటిలోఁ గలిపి యానీటిలో రంగువేసిన బట్టల నుడికవేయుదురు.

ఉన్నిబట్టలకు ఆకుపచ్చరంగు వేయుట:- మూఁడు తానులకు,అనఁగా రమారమి రెండు మణుగుల యెత్తుగల బట్టలకు రంగువేయుటకిక్రిందఁజెప్పిన వస్తువులు కావలయును.

పటిక	3 వీసెలు.
నీలిమందుసారము	,,

పిక్రికుఆసిడ్డు 3 అరవీసె.
గంధకద్రావకము పావు శేరు.

ఈ వస్తువులకు రమారమి 50 కుంచముల నీటిలోఁ గలిపి బట్టల నా నీటిలో నొకగంట కాలముడక వేసినయెడల, ఆకుపచ్చరంగు బట్టలకు పట్టును.

పట్టుబట్టలకు నెమలి మెడరంగు (మైలతుత్తమురంగు) వేయుపద్ధతి:—

గంధకద్రావకము అర శేరు.
రంగుపొడి (మెథిలీనునీలి) శేరు.

ఈ రెంటిని నీటిలోఁ గలిపి నులివెచ్చగనుండగ బట్టలను నానఁబెట్టుదురు. ఈపాళ్ళతో 80 పౌనుల పట్టునకు రంగువేయవచ్చును.

నూలుబట్టలకు వంగపండుపసుపు (క్రోము పసుపు) వేయువిధము:—

ఇది ఖనిజసంబంధమగు రంగు. మూఁడు మణుగుల యెత్తుగల బట్టలకీ క్రిందఁ జెప్పినఁ వస్తువులు గావలసియుండును.

లెడ్ ఆసిటేటు శేరునకు రెండు పలముల చొప్పున నీటిలోఁగలిపి బట్టలనందులోముంచి తరువాత సున్నపుతేటలో జాడించ్చిన పిమ్మట నాలుగుకుంచముల నీటిలో నరవీసెడు పొటాసియము బైక్రోమేటుఁ గలిపి యానీటిలో ముంచవలెను. ఇట్లు నాలుగు పర్యాయములు ముంచిన యెడల చాలును. గన్నేరు పువ్వు రంగు రావలెనన్న కొంచెము శంఖద్రావకముఁ గలిపిన నీటిలో నొకటి రెండు పర్యాయములు ముంచవలెను.

ఇంతవరకు నద్దకాంశములు చర్చింపఁబడినవి. వస్త్రకసరిలో బాహ్యాళ్యముమీఁద రంగులు వేయునప్పు డుపయోగించెడి పరికరములు, పదార్థములయొక్కయు, రంగులయొక్కయు, తత్త్వముల ననుసరించి యుండును. వానిని గూర్చితప్పీళ్ళుచర్చించుటకిక్కడ నవకాశము చాలదు. కావున సంక్షేపముగ సూచింపఁబడును. వస్త్రకసరిలో చాలవఱకు పట్టును, ఉన్నిని కసటువేయకుండగనే రంగులు వేయుదురు. నూలుబట్టలను నారవస్తువులను రంగులువేయుటకుఁ బూర్వము కసటువేయుదురు. రంగులువేయుటయం దుపయోగించెడి నీటివిషయమై యద్దకములవారు చాలశ్రద్ధఁదీసికొనెదరు. ఏలయన తఱుచుగ నీటిలో కరిగియున్న పదార్థములవలన రంగులు చెడిపోవును. లోహసంబంధమగు పదార్థములు (అన్నభేది వగయిరాలు) కరిగియున్నయెడల నట్టి నీటిని వాడుకచేసినప్పుడు మూగరంగులేర్పడునుగాని దీప్తిమంతములగు రంగులుపట్టవు. ఇట్లే సీమసున్నముగూడ నీటిలో కరగియుండవచ్చును. ఈకారణములనుబట్టి యట్టినీటిని వాడుటకు పూర్వము వర్ణకారులు యుక్తమగు మార్గములచే శుభ్రముచేయుదురు. రంగులువేయుటకిదివరలో కొయ్యతొట్ల నుపయోగించెడివారు. కాని యిప్పుడు సామాన్యముగ నినుపతొట్లలో రంగులువేయుచున్నారు.

రంగులువేయఁబడు వస్తువులు మూఁడు స్థితులలోనుండివచ్చును. ఘుడివస్తువులను ఏకి


వడకకపూర్వము పీచుగనుండినప్పుడే రంగులు వేయవచ్చును. లేదా, వడికిన నూలునకును వేయవచ్చును. నేసినతరువాత బట్టలకు వేయవచ్చును. అద్దకపు పద్ధతులుగూడ తప్పీళ్ళలో నీపదార్థ స్థితినిబట్టియుండును. రంగులకును రంగులు వేయువస్తువులకును సంపర్కము గలుగఁ జేయుటకు రెండు మార్గములున్నవి. రంగు కషాయములో వస్తువులనుముంచి రంగు, బట్ట కంతయు సమముగఁ బట్టువఱకు రంగులో ద్రిప్పుచుండవలెను. లేదావస్తువులనుతొట్లలో స్థిరముగనుంచి రంగు కషాయమును బట్టల కంతయు సమముగనంటునట్లు ప్రసరింపఁజేయవలెను. యంత్ర సాహాయ్యమువలన నీరెండవ పద్ధతి సాధ్యమగును. వస్తువులను పీచుస్థితిలో (వడకక పూర్వము) నద్దునప్పుడీ పద్ధతి నవలంబించెదరు. నూలునకును నేసినబట్టలకును రంగులు వేయునప్పుడు మొదటిపద్ధతి ప్రకారము వేయుదురు.

పీచులయద్దకము:—ఉన్నిని, పత్తిని కొన్ని తరుణముల పీచుస్థితిలోనే యద్దుదురు. ఇందులకు మూతలేని కాగులలో వీనినుంచి రంగు కషాయముఁబోసి యుడకఁబెట్టెదరు. రంగు చక్కఁగనంటుటకు విరామములేకుండ కలియఁ బెట్టుచుందురు. అయినను సాధారణముగ కొంతపీచు జడలుగట్టి రంగు హెచ్చుతగ్గులుగఁ బట్టును. అట్లుగాకుండఁ జేయుటకై వేడిగనుండు రంగుకషాయమునే పీచుగుండ యంత్ర సహాయమువలన ప్రసరింపఁ జేయుదురు.

నూలద్దకము:—నూలనఁగా పత్తినూలే కాదు. ఉన్నినూలు, పట్టునూలు, నారనూలు (పురి) కూడ నిరిదులోఁ జేరును. నూలుకు లాడీలుగాకాని (నూలు పిల్లు) మగ్గముమీఁద నెక్కించిన తరువాతఁ గాని రంగు వేయుదురు. లాడీలకు రంగు వేయునప్పుడు ౩-వ పటములోఁ జూపినటువంటి తొట్లనుపయోగింతురు. ఈతొట్లు రాతితోఁ గాని కొయ్యతోఁ గాని కట్టెదరు. తొట్లలో రంగు కషాయమునుంచి నూలును పటములోఁజూపినరీతిని కొయ్యలనుండి వ్రేలాడఁ గట్టెదరు. తొట్లను రంగు కషాయముతో నింపి లాడీలనందులో ముంచెదరు. రంగును మరగఁ బెట్టుటకు పటములో జూపినటువంటి యొక గొట్టముద్వారా యావిరిని బంపెదరు. ఈ గొట్టము తొట్లయడుగు భాగమంతయు వ్యాపించుటచేత గొట్టముగుండ ప్రవహించెడి యావిరివేడిమికి రంగుకాగును. రంగుమరుగునప్పుడు లాడీలను క్రిందు మీఁదుఁ జేయుదురు. ఇందువలన రంగులు హెచ్చుతగ్గులు లేక చక్కఁగ నంటును. అద్దకముపూర్తియైన తరువాత లాడీలను నీటిలోఁజాడించి యావిరి వేడిమిచే నారవేయుదురు.

మగ్గముమీఁదనుండఁగనే నూలుకు రంగు వేయవచ్చును. ఇందులకు నిర్మించిన తొట్లు పడుగంతయు దూరుటకు తగినంత వెడల్పుగనుండును. వరుసగ రెండుమొదలు నాలుగు తొట్లవరకుండును. మగ్గములు కప్పీలమీఁద

తొట్లలో ముంచెదరు. ఒకతొట్టినుండి మరియొక తొట్టిలో ముంచుటకుఁ బూర్వము మగ్గము నంటియుండు రంగు నీరంతయుఁ బోవుటకు నీటిని పిండు యంత్రముండును. రంగులో ముంచుట—పిండుట—ఈ పనులు నాలుగు తొట్లున్న యంత్రములో నాలుగు పర్యాయములు జరుగును. అప్పటికి రంగులు చక్కఁగ నంటును.



3-వ పటము

తఱుచుగ, నేసినబట్టలకారంగులు వేయుదురు. సాదారంగులన్నియు బట్టలకే వేయుదురు. ఏలయన వ్యష్టిరంగులన్నియు నొక పర్యాయము వేసినచో నంటును. బట్టలకు రంగువేయుట యందు రెండుపద్ధతులు వాడుకలోనున్నవి. బట్టలను మడవకుండ వెడల్పుగ దూలములపైఁ జుట్టి యాదూలములు తిరుగుటవలన బట్టవిడిపోయి రంగులోమునిగి యంత్రసాహాయ్యమువలన మరియొక్క దూలముపైఁ జుట్టుకొనును. ఇందున కుపయోగించెడి తొట్టియొకటి 3-వ పటములోఁ జూపఁబడినది. ఈ తొట్లు కొయ్యతోగాని యినుముతో గాని చేయుదురు. ఈ పటములోఁజూపిన తొట్టియొక్క కడుపులో చిన్న చక్రములవలెనున్నది కప్పీలు. బట్ట వాని మీఁదుగ జారునప్పుడే కప్పీలుగూడ తిరుగును. తొట్టియొక్క పై భాగమున రెండువంకెలవంటి చేతులును, వానికి తగిలించిన యిరుసులపైఁ జుట్టుకొనియున్న బట్టచుట్టయుఁ జూడనగును. బెట్టుతప్పించినప్పుడు కుడియిరుసుపైఁ జుట్టుకొనియున్న బట్ట

క్రమముగ తొట్టిలోఁ బ్రవేశించియందున్న కప్పీల మీఁదుగ నెడమ యిరుసుపైఁ జుట్టుకొనును. తిరిగి మరఁద్రిప్పినప్పుడు ఎడమ యిరుసుపై నున్న చుట్ట విడిపోయి తొట్టిలోనున్న కప్పీల మీఁదుగ కుడియిరుసుపైఁజుట్టుకొనును. ఇట్లు ప్రతిబట్టయు రెండు పర్యాయములు రంగు కషాయములో ముంచఁబడును. సాధారంగుల కన్నిఁటికిని రెండుపర్యాయములు ముంచినఁ జాలును. రంగులు వేసినబట్టల నీటిలో జాడించుటకూడ యంత్రసాహాయ్యమునసే జరుగును.

బట్టలను నిలువునమడిచి యద్దవచ్చును. ఇందుకు తానులయొక్క కొనలను ఒకదానికొకటి వదులుగకుట్టి పెద్దమోకువలెఁ జేయుదురు. ఇట్టియద్దకములో నుపయోగించెడి తొట్లు పైనిఁజూపిన తొట్టికంటె పెద్దవిగ నుండును. పైనిఁజెప్పినరీతినేగుడ్డలుకప్పీలమీఁద రంగు కషాయములోముంచి, తరువాత నుతుకుటగూడ యంత్రసాహాయ్యమువలననేజరుగును. రంగులు వేయుట పూర్తియైన తరువాత బట్టలనెండవేయుటఁ గూడ యంత్రములతోనే చేయుదురు. ఇందుకుఁగాను పెద్దయినుప తూరలుచేసివానిపైనిబట్టలుచుట్టుకొనులాగుఁ జేయుదురు. తూరలగుండ నావిరి బ్రసరింపఁ జేయుటవలన నవి త్వరలో వేడెక్కును. ఈ వేడిమికి వానిపైనున్నగుడ్డలు శీఘ్రకాలములోనే యారును.

శాస్త్రచర్చ

రంగులనఁగానేమి? అవి యెట్లుగలుగుచున్నవి? బట్టలకు రంగులు వేయునప్పుడేమి జరుగుచున్నది? అన్ని రంగులును అన్ని బట్టలకెందుల కెక్కవు? కొన్నిబట్టల కుపాధులెందునకుఁ గావలెను? మున్నగు ప్రశ్నలకు జవాబులు రావలసియున్నవి.

ప్రపంచము నందుఁగల వస్తువులలో రంగుగలవికొన్ని, రంగులేనివికొన్ని. ఈ భేదమెట్లు గలుగుచున్నది? తేజస్తత్త్వ శోధనలనుబట్టి శాస్త్రజ్ఞులిట్లు సిద్ధాంతీకరించిరి. సూర్యకిరణములు మనకు తెల్లగఁ గనపడుచున్నవి. కాని నిశ్చయములో నేడు రంగులయొక్క మిశ్రణమునవలన సూర్యకిరణములకు తెలుపు వచ్చినది. ఊదా, నీలి, మబ్బు, ఆకుపసరు, పసుపు, పింగళవర్ణము, ఎరుపు, అను నేడు రంగులు సూర్యకిరణములయందిమిడియున్నవి. కొన్ని వస్తువు లద్దమువలె సూర్యకిరణములయం దిమిడియున్న రంగులనన్నిటిని ప్రతిబింబింపఁజేయును. అందుచేతనిట్టివస్తువులపైఁబడి ప్రసరించు కిరణములన్నియుఁ దెల్లగనుండును. ఇట్లు అన్నిరంగుల కిరణములను ప్రతిబింబించు వస్తువులు గాజువలె తేటపదార్థములయినచో నన్నిరంగులుగఁ గాన్పించును. తేటవస్తువులు గానిచో తెల్లగఁ గాన్పించును. కొన్నివస్తువులలో రంగుకిరణములు హరించును. పైనిఁ జెప్పిన ఏడురంగుల కిరణములును హరించిన యెడల వస్తువులు నల్లగనుండును. లేక కొన్ని రంగులు మాత్రము హరించినయెడల వస్తువులకు ప్రతిబింబించిన కిరణముల రంగుండును. ఎట్టిని వస్తువులన్నియు నాలురంగుల కిరణము

లనుహరించి యెఱుపు కిరణములను మాత్రము ప్రసరింపఁజేయును. ఇట్లే యూదావస్తువులు ఊదాకిరణములను మాత్రము ప్రసరింపఁజేసి తక్కినవానినన్నిటిని హరించుకొనును. కాని కొన్ని వస్తువు లన్నికిరణములను హరించుటయు, కొన్ని కొన్నివిధములగు కిరణములనే హరించుటయు మరికొన్ని వస్తువులే కిరణములనుహరింపక యన్నిటిని ప్రసరింపఁ జేయుటయు, నెట్లువాటిల్లెనను నంశము మాత్రము వేదాంతమే.

రంగుగల వస్తువు లన్నియు రంగులు వేయుట కుపయోగించునా ? ఎఱుపు వేయుట కన్ని యెఱ్ఱనివస్తువులు పనికివచ్చునా ? పనికి రావు. ఈ వ్యత్యాసమెట్లు గలిగెనని యడుగవచ్చును. కల్పితపురంగులు (తారురంగులు) విరివిగ వెలసిన తరువాత రసాయన శాస్త్రజ్ఞులీప్రశ్నకు నుత్తరమిచ్చుటకై యనేకపరిశోధనలుజేసి కొన్ని వాదముల నుపపాదించిరి. రంగులనిచ్చెడి గుణము పదార్థములయొక్క రసాయనిక తత్త్వమును (Chemical constitution) బట్టియుండునని శాస్త్రజ్ఞులు దేల్చిరి. వస్తుతత్త్వ విచారమున రసాయన శాస్త్రము పరమాణు వాదమునే (Atomic theory) యామోదించు చున్నది. ఈ మతమువారికి వస్తువు లన్నియు నణు సముదాయములు. అణువు (Molecule) పరమాణువుల (Atoms) సముదాయము. అణునిరూపణమును (Molecular structure) బట్టి రంగు లేర్పడునని వీరి మతము. రంగులిచ్చెడిపదార్థములలోనియభారము (Molecular weight) హెచ్చినకొలఁది రంగులు మారుచుండును. మిక్కిలి తక్కువ బరువుఁగల యణువులుగల రంగుపదార్థములు పసుపుగను, అణుభారము హెచ్చినకొలఁది నాపదార్థమునుండియె పింగళ,రక్త, ఊదా, నీలిరంగు లేర్పడు ననియు, ప్రత్యక్షముగఁ జూపిరి. రసాయన సమ్మేళనము వలన నణుభారము హెచ్చించవచ్చును. అసలు పదార్థము రంగులేనిదైనను కొన్ని యణువులఁజేర్చి దానిని రంగుపదార్థముగఁ జేయవచ్చును. ఇట్టి యణువులను రాగదాయకములని చెప్పవచ్చును. రాగదాయకము లైదాఱుకంటె నెక్కువలేవు. రాగదాయ కాణువులు లేని పదార్థములు రంగుఁగలవైనను రంగులువేయుటకు పనికిరావు. ఒకేరంగు అన్నివిధములగు వస్తువులకు నేకరీతి నెందుకుఁబట్టదు? సామాన్యముగ ఉన్నికిని పట్టునకును బట్టినన్నిరంగులు నూలునకుపట్టవు. ఈవిషయముఁ దెలిసికొనుటకు ముందు రంగులయొక్క స్వభావమును, రంగులు వేయఁబడు బట్టలయొక్క స్వభావమును, కొంత చెప్పవలసి యున్నది. రంగుపదార్థములు రెండువిధములుగనున్నవి. కొన్నిద్రావక స్వభావము గలవి. మరికొన్ని క్షార స్వభావము (Acid Basic) గలవి. జంతుసంబంధమగు పదార్థములలో (ఉన్ని, పట్టు) కొన్ని ద్రావక స్వభావముగలవి. మరికొన్ని క్షారస్వభావముగలవి. ఇట్టి సందర్భ

ములలో ద్రావక స్వభావముగల రంగులు క్షారస్వభావముగల పదార్థములకు చప్పున పట్టును. అట్లే క్షారస్వభావముగల రంగులు ద్రావకస్వభావముగల పదార్థములకు వెంటనే యంటుకొనును.

రంగులు బట్టలకెందున కంటుకొనవలెనను విషయమై రెండు మూఁడు వాదములున్నవి. ఇందు మొదటిది 'మిశ్రణవాదము'' (Mechanical theory). రంగు కషాయములో బట్టలను ముంచినప్పుడు రంగుయొక్క యణువులు బట్టలదారముల యందుండు మిక్కిలి సన్నని బెజ్జములలోనికిఁజొచ్చి యచ్చటఁజిక్కికొనియుండునని (అనఁగా నేదైనవస్తువును నీటిలో ముంచినప్పుడు నీరా వస్తువునంటినట్లు రంగులు బట్టలకంటుకొనునని) యీ మతమువారి యభిప్రాయము. అప్పుడు రంగులన్నిబట్టలకును సమానముగ నెందుకుఁ బట్టవని యడుగవచ్చును. అన్నిదారములయందుండు బెజ్జములొకేరీతిని యుండవు. ఉన్నిదారమునందుఁగల బెజ్జములకును నూలుదారమునందుఁగల బెజ్జములకును భేదముగలదు. ఒక జాతిదారముయొక్క బెజ్జములు పెద్దవిగనుండి తక్కినవి చిన్నవిగ్గావచ్చును. ఇంతియగాక వివిధములగు రంగులయొక్క యణువుల పరిమాణములలోఁ దారతమ్య ముండవచ్చును. ఇదిగాక బట్టలనుడక వేయుటవలన బెజ్జములు పెద్దవియై చల్లనినీటిలో ముంచినప్పుడుగాని కసట్లువస్తువుల నొనవేసినప్పుడు గాసి చిన్నవగును. ఇందుచేత నుత్తప్పుడు పట్టురంగులు కసటువేసిన తరువాత నంటుచున్నవి. ఈ కారణములనుబట్టి రంగులన్నివస్తువులకును ఏకరీతిని యంటవని మిశ్రణవాదులు తమవాదమును సమర్థింతురు.

రెండవది రసాయన సమ్మేళనవాదము. రంగులు బట్టలయందుండు కొన్నిపదార్థములతోఁగూడి క్రొత్తవస్తువులేర్పడుననియు, ఈ యేర్పడుటవలననే రంగులంటుననియు, వీరి మతము. ఈవాదము ఉన్నియద్దకమునందును పట్టు అద్దకమునందును వర్తించునని చదువరులు గ్రహించియుండవచ్చును. ఏలయన ద్రావకరూపమగు రంగు, దారము నందుఁగల క్షారముతో సమ్మేళనమై రంగురూపమున నొక క్రొత్తవస్తు వేర్పడును. బట్టముంచక పూర్వ మాద్రావక రూపమగు రంగున కేవిధమయిన రంగును లేకపోవచ్చును. కాని బట్టతో సంపర్కముగలిగిన తరువాత రంగువచ్చును. ఇట్టి ప్రమాణములు సమ్మేళనవాదమును బలపఱచుచున్నవి. కాని ప్రత్తిసంబధమైనట్టియు నారసంబంధమయినట్టియు వస్తువులయొక్క యద్దకమునకు సమ్మేళనవాదము విరోధించును. ఏలయన, ఉన్నికిని పట్టునకును, అంటెడిరంగులు వీనికంటుటలేదు. ఇదిగాక నిరుపాధికములగు రంగులు (Direct dyes) వీనికి వేయునప్పుడు రంగు పట్టునుగాని యుడకవేసిన యెడల వెలిసిపోవును. దీనిని బట్టి యీ పదార్థములకు రంగుల నాకర్షించుశక్తి తక్కు

నని స్పష్టమగుచున్నది. ఇంతియగాక నీటిలో నెక్కువ రంగు గలిపినప్పుడు రంగు బట్ట మునఁబట్టి, కలపనప్పుడు శ్వేతరంగుపడును. రంగంతయు బట్టకు పట్టక కొంతనీటిలో నిలిచి యుండును. ఇచ్చట రెండుశక్తులకుఁ బరస్పర విరోధమున్నట్లు గనపట్టుచున్నది. బట్టలకుఁ గల రంగుల నాకర్షించుశక్తికిని, తనయందు రంగుల నిముడ్చుకొను నీటిశక్తికిని, పోటీపడి నట్లు స్పష్టమగుచున్నది. ఇవి రసాయన సమ్మేళనముయొక్క లక్షణములు గావు.

కేవల మాకర్షణశక్తి వలననే యద్దకమగు నని మరియొక వాదముగలదు. బలహీనుని చేతిలోనుండి బలవంతుఁడు సులభముగ లాగి కొనఁగలిగినట్లు బట్టలయొక్క యాకర్షణ శక్తి నీటిశక్తికంటె నెక్కువయైనప్పుడు రంగంతయు బట్టలకంటును. ఆకర్షణశక్తి లేనప్పు డంటదు. బట్టలశక్తియు నీటిశక్తియు సరిసమము లయి నప్పుడు కొంతరంగు నీటిలో నిలిచియుండును.

పైనిఁజెప్పిన దానిని బట్టి యిదమిత్థమని యొక వాదమును నిర్ధారణ చేయుటకు వీలు లేదు. ఉన్నియద్దకము, పట్టు అద్దకమును, రసాయనసమ్మేళనము లనియు, నూలు యొక్కయు, నారయొక్కయు, నద్దకములు మిశ్రణములనియు పండితాభిప్రాయము.

హిందువుల పద్ధతులు

మన దేశమునందలి యద్దకపు పరిశ్రమ యొక్క పురాతనత్వమును గురించి చరిత్ర భాగమున నిదివరలో నించుకవ్రాసియుంటిమి. రమారమి యైదు వేల సంవత్సరములకుఁ బూర్వమే హిందువులు నీలిమందును మంజిష్ఠయును రంగులు వేయుటకుపయోగించెడి వారని నిదర్శనములున్నవి. మన దేశమునుండి యరబ్బీ వర్తకులద్వారా యీ పరిశ్రమజ్ఞానము, అరేబియా, పర్షియా, ఈజిప్టు దేశములకును, అచ్చటినుండి పాశ్చాత్యఖండవాసులకును వ్యాపించిన విధముఁగూడ పైనసంక్షేపముగఁ జెప్పఁబడినది.

మన దేశములోని ప్రతిరాజధానిలోను నేతపనులును, అద్దకపు పనులును గలవు. నూలుబట్టల యద్దకము ప్రతి పరగణాలోను కొద్దిగనో గొప్పగనో యున్నది. బంగాళము లో విశేషము పట్టు అద్దకము, పంజాబులో ముఖ్యముగ ఉన్ని యద్దకము, విస్తారముగ నున్నవి. బొంబై రాజధానిలో నూలు, పట్టు సమానమని చెప్పవచ్చును. మన రాజధాని లో నూలు అద్దకమే విశేషముగ నున్నది. తివాచీలు నేసెడి యేలూరు, అయ్యంపేట, రాయవేలూరు మున్నగు రెండుమూఁడు పట్టణములలోఁ దప్ప ఉన్ని యద్దకము సామాన్యముగ మనరాజధానిలో లేదు. బరంపురము, జగ్గయ్యపేట, కాంచీపురము, కుంభకోణము, బెంగుళూరు, పట్టణములలోఁ దప్ప తక్కినచోట్ల పట్టుబట్టల యద్దకము లేదు.

రంగులు వేయుటకుఁగావలసిన ముడిసరకు (Raw materials) మన దేశములో విస్తారముగనున్నది. అందుచేత ననాదినుండియు

మన దేశములో వ్యవసాయమువలె నద్దకములుగూడ నొక వృత్తియై దానివలన ననేకులు జీవించుచుండెడివారు. రమారమి నూరు సంవత్సరముల క్రిందట మన దేశమునకుఁ గావలసినవిపోఁగా విలువగల కోట్లకొలఁది బట్టలను ఇతర దేశములకు నెగుమతిఁ జేసెడివారు. ఇప్పుడు మన దిగుమతి వర్తకములో సుమారు సగముసొమ్ము బట్టలకె యిచ్చుచున్నాము.* నేత యంత్రములు వచ్చిన తరువాత చేతిమగ్గములు మూలఁబడినట్లు కల్పితపురంగులువచ్చి నాటురంగుల (Indigenous dyes) రూపు మాపినవి. వంశపరంపరగ వచ్చెడి యనుభవము గలవారు గాని నాటు రంగులు వేయలేరు. అందుచేత పూర్వము మన దేశములో రంగులు వేయుట యొక వృత్తియైనది. నాటు రంగులు వేయుటకు కాలమెక్కువ; శ్రమ యధికము; ఖర్చు విశేషము. కల్పితపు రంగులవెల స్వల్పము; శ్రమ తక్కువ; త్వరలో నద్దకము పూర్తి యగును. ఇంతియగాక యెవరిమట్టుకు వారే తమబట్టలకు కల్పితపు రంగులు వేసికొనఁ గలరు. ఈకారణములను బట్టి అదే వృత్తిగఁ జేసికొనిన అద్దకపు పనివాండ్రకు తగినంత యాదరణ క్రమముగఁ బోయినది. అదియుఁ గాక యద్దకముచేయువారు సామాన్యముగ విద్యావిహీనులగుటచేత నూతన పద్ధతులవలంబించుకొనక తాతలనాటి త్రోవలనే పోవుటఁబట్టియద్దకపువిద్య మన దేశములో వృద్ధి చెందలేదు. మనకంటె వేయిమడుంగులు వెనుక చిక్కియుండినను శాస్త్రజ్ఞానాభివృద్ధివలన పాశ్చాత్యులిప్పుడు పారిశ్రామిక విద్యలలో పౌరస్త్యుల తలఁదన్నఁగలిగిరి.

మన దేశములో సామాన్యముగ వేసెడి రంగలు పది పండ్రెండుగలవు :-నలుపు, నీలి, ఎఱుపు, పసుపు, ఆకుపచ్చ, తొగరు, గులాబి, జాభర, కుసుంబ, ఊదా, మామిడిచిగురు మొదలగునవి. ఇందు కొన్ని మిశ్రవర్ణములు గలవు. ముందుగఁ బసుపద్ది తరువాత నీలి వేసినయెడల ఆకుపచ్చ తయారగును. ఇంకొక రీతినిగూడ మిశ్రపురంగులు వేసెదరు. నేతలో పడుగునకుఎఱుపుదారము, పేకకునల్ల దారము, వేసినయెడల బట్టకుఊదారం గేర్పడును. రంగు పదార్థము కొంచెము వాడుకచేసిగాని లేక యితరపదార్థములను రంగులతోఁగలిపి గాని లేతరంగులు వేయుదురు. గులాబి, తేట పసరు, లేతపసుపు మున్నగు రంగులిట్లువేయుదురు. మిశ్రవర్ణములచేతనైననేమి లేతరంగులు వేయుటవలననేమి యనేక ఛాయలు(Shades) తీసికొని రావచ్చును.*

---

*1796-వ సంవత్సరములో మన దేశమునుండి యింగ్లండునకు మాత్రము ఎగుమతియైన బట్టల ఖరీదు 4,16,50230 రూపాయలు. 1912-వ సంవత్సరములో నితర దేశములనుండి మనము వాడుకొనుటకు దిగుమతియైన బట్టల ఖరీదు 60,82,00000 రూపాయలు.

* 1887-వ సంవత్సరములో 'సర్ తామస్ వార్డెల్' అనునతఁడు వ్రాయుచు మూలికలరంగులు చాల మంచివనియు, దొరతనమువారి యాదరణముండి

విదేశీయులకల్పితపురంగులు రాకపూర్వము మనదేశములో మూలికలతోనే రంగులు వేసెడివారు. ఇప్పుడు శైలసులభము, ఫల మధికమగుటవలన చాలవఱకు దేశీయులు గూడ ముఖ్యముగ పట్టు వస్త్రములకును, నూలుబట్టలకును విదేశపురంగులనే వాడుచున్నారు. విదేశీయులరంగులును గురించియు, వారి యద్దకపు పద్ధతులనుగురించియు పైని వ్రాసియుండుటచేత నిచ్చటస్వదేశపురంగులఁ గూర్చియు మనపద్ధతులనుగూర్చియు నించుక వ్రాసెదము. మనదేశములో సామాన్యముగ రంగులు వేయుటకు పూర్వము బట్టలను "కసటు వేయుదురు" (Mordanting). అనఁగా బట్టలను వగరుగాగాని పులుపుగాగాని యుండెడి పదార్థములలో నుడకపెట్టెదరు. కావున మనదేశీయులు వాడుకచేసెడి రంగుపదార్థములను గూర్చియు, "కసటువస్తువులను" (Mordants) గూర్చియు ముందుగకొంచెము వ్రాయవలసియున్నది.

రంగులు వేయుటకు మనదేశీయులు పండ్లు, పువ్వులు, ఆకులు, వేరులు, గింజలు, బెరడులేక తాట, చెక్కలు, పప్పు, వాడుకఁ చేయుదురు. ఇవిగాక క్రిమికీటకాదుల సంబంధము

రంగులిచ్చెడి వస్తువులు

లగు వస్తువులు, మట్టి సంబంధములగు పదార్థములుగూడ వాడెదరు. అందీక్రిందఁ జెప్పఁబోవునవి ముఖ్యములైనవి.

నీలిమందు:—ఇది నీలిచెట్టుయొక్క ఆకులనుండి తీయఁబడును. ఇతరపైరులవలె దీనిని గూడఁ బెంచెదరు. నీలియాకును గచ్చు కుండ్లలోఁ ద్రొక్కి నీటిలో మురగనిచ్చెదరు. తరువాత నానీటిని మరగఁ బెట్టుటవలనగాని, సున్నముఁగల కయ్యలలో నెండఁబెట్టుటవలన గాని నీలిమందు చేయుదురు. ఇది ముఖ్యముగ నూలు అద్దకములకును అప్పుడప్పుడు తివాచీలునేసెడి ఉన్ని యద్దకమునకును వాడఁబడుచున్నది.

లక్క:—ఇది పురుఁగులుబెట్టెడి యెఱ్ఱని వస్తువు. సామాన్యముగ బంకవలె రావిచెట్లు, మఱ్ఱిచెట్లు, మొదలగుచెట్లమీఁదను దొరకును. సాధారణముగ లక్కగూళ్లు అడవిచెట్లమీఁదనే దొరకును. చెట్లమీఁదినుండి యప్పుడేతీసిన దానికి పుడకలక్క యనిపేరు. కొయ్యముక్కలుగూడ దీని నంటియుండును. అందుచేత దానిని పొడిచేసి పుడకలు విడఁదీయుదురు. అప్పుడు దానిని గింజలక్కయందురు. గింజలక్కను చక్కఁగ పొడిచేసి నీటిలో నాననిచ్చి వడపోయుదురు. వడపోయఁగా వచ్చిన యెఱ్ఱ నీటిని యెండలోఁ గొంతసేపుంచినచో

నచో చవుకగ చేయవచ్చుననియు, పాశ్చాత్యులుగూడ కల్పితపురంగులు వాడుట్టమాని మూలికలనే వాడవచ్చుననియు నుడివెను. ఈయన యేడేండ్లు తదేకనిష్ఠతోపని చేసి 181 రంగుమూలికలనుండి 3500 రంగునమూనాలను తయారుచేసెను. వీనిని 354 కాగితములమీఁద నరిటించి కలకత్తా మ్యూజియములో 1886-వ సంవత్సరమున నుంచెను. తిరిగి 1908-వ సంవత్సరములోఁ జూచినప్పుడు స్వల్పసంఖ్య తప్ప తక్కినవి వెలియలేదు.

నెఱ్ఱ లక్క యచ్చులుగ నేర్పడును. దీనినే రంగులు వేయుట కుపయోగించెదరు. వడ పోయునప్పుడు రంగుపదార్థమంతయు నీటితోఁ బోయి గౌరవర్ణముఁగలతెట్టు బట్టలో నిలిచి యుండును. దీనికి "ష్లెల్లక్క" యనిపేరు. లక్క యనేక విధములుగ నుపయోగ పడు చున్నది. రంగులు వేయుటకేగాక బొమ్మలు చేయుటకును, గాజులు చేయుటకును సీళ్లు వేయుటకును వాడెదరు. షెల్లక్క సారా యిలోఁ గరిగించి వార్నిషుచేయుదురు. ఇది వడ్రంగమునందు మెరుగుపూతకు నుపయోగ పడుచున్నది. లక్క ముఖ్యముగ పట్టుబట్టల కెఱుపురంగువేయుట కుపయోగింతురు.

కిరిమింజి (Cochineal):—ఆరుద్ర పురుగులవంటి యెఱ్ఱని పురుగులనుండి తీయఁబడిన రంగు. ఈ పురుగులు మొట్టమొదట నమెరికా ఖండము నందలి మెక్సికో దేశములో కనుఁగొనఁ బడినవి. కంపెనీ ప్రభుత్వములో మన దేశములోని కాపురుగులఁదెచ్చి పెంచుట కారంభించిరి. అసలైన కిరిమింజి పురుగులు నల్లులకంటె కొంచెము పెద్దవిగ నుండును. పట్టుపురుగులవలెఁగొన్ని చెట్ల యాకులమీఁద జీవించును. పురుగులను చెట్లనుండితీసి సళసళ కాగెడి నీటిలో వేయుదురు. కొలఁదికాలము లోనే యవిచచ్చియుబ్బును. తరువాత నెండ బెట్టి గింజలవలెనుండు చచ్చినపురుగుల నమ్మెదరు. ఇది కీటక సంబంధమైన రంగని సామాన్యముగ నద్దకులకుఁ దెలియదు. వీసె పది రూపాయల వఱకును దీనికి ధరయుండును. అందుచేత ముఖ్యముగ పట్టునకు ఎరుపువేయుటకుమాత్రము వాడుదురు. ఉన్నికి నూలునకుఁగూడ నుపయోగించ వచ్చును.

చిరివేరు; తొగరుచెక్క:—దీనికి 'నూనా' యను పేరుగూడఁ గలదు. ఇందు చిరివేరు నిచ్చెడిచెట్టు రెండు మూఁడడుగులు కంటె నెత్తుపెరుగదు. తొగరుచెట్టు పెద్దది. మడ్డి జాతిలోనిది. తొగరుచెక్క రంగులు వేయుటకు పనికిరాదు. చిరివేరే వాడెదరు. దీనికి తెలుఁగు దేశములో సురంజియను హిందూస్థాని పేరుగూడఁ గలదు. వేళ్ళనుండి రంగు దీయుదురు. కొన్ని పదార్థములు గలుపుట వలన పసుపుగాని యెఱుపుగాని వేయ వచ్చును. చిరివేరు పొడి గొట్టి నీటిలో నానఁ బెట్టినచో పసుపునీరువచ్చును. దీనికి సున్నపు నీరుగాని, పాలజెముడు బూడిదెగాని కలిపినచో చక్కని యెఱ్ఱరంగు వచ్చును. దీనికి కొంచెము గంధక ద్రావకము గలిపినయెడల తిరిగి పసుపురంగగును. చిరివేరు ముఖ్యముగ నూలుబట్టలయద్దకములో నుపయోగింతురు.

పలాశము:—మోదుగపువ్వు. పచ్చిపువ్వు నిమ్మపండువలె పచ్చగానుండును. ఎండిన తరువాత నారింజపండువలె కొంచెము ఎఱుపు దాళుగ నుండును. రంగునకై ప్రత్యేకముగ మోదుగచెట్లను పెంచు నలవాటులేదు. అడవి నుండియే పూలుదెచ్చి యమ్ముదురు. ఉన్ని యద్దకమునకును, నూలు అద్దకమునకును

ఉపయోగించెదరు. ఎండుపూలను నీటిలో నుడకఁబెట్టుటవలన రంగు నీరేర్పడును. పటికతో పసుపురంగును సోడాపొడితో నారింజ పండురంగును వేయుదురు.

పతంగిచెక్క:—ఇదికూడ మోదుగువలె అడవిచెట్టు. కొయ్యను ముక్కలుగా గాని పొడియగు నట్లుగాని కొట్టి నీటిలో నుడక వేసినయెడల ఎఱుపురంగువచ్చును. కొయ్యకు చేవయెక్కిన కొలఁది రంగుముదురును. పటికతోఁ గలిపివేసినయెడల రంగునకు కాంతి హెచ్చును. పతంగిచెక్కతో ఉన్నికి, నూలునకు రంగు వేయవచ్చును.

కపిల:—దీనికి పున్నాగమను పేరుగూడఁ గలదు. ఇది వృక్షజాతిలోఁ జేరినది. రమారమి నలువది యడుగులుపొడవు పెరుగును. వర్షా కాలములోపూచి వేసవిలో కాయలుపుట్టును. దీనిపండ్లచుట్టు నేర్పడుపొడి రంగులు వేయుట కుపయోగపడును. ఈ పొడి కొంచె మెఱ్ఱ దాళుగనుండి పట్టునకు పసుపురంగును నారింజ రంగును వేయుటకుపయోగించును. ఈ పొడి నీటిలోగాని ద్రావకములలోగాని కరఁగదు. కావున మొట్టమొదట నీ పొడి నూనెతోను పటికతోను గలిపి ముద్దచేయుదురు. తరువాత చాకలి చవుడునున్నము గలిపిన నీటిలో నీ ముద్దను గలిపినయెడల కొన్నిగంటల కాలములో గన్నేరుపువ్వు రంగుగల తేటతేరును. ఈ నీటిలో బట్టనుకొంచెము సేపుంచినచో పసుపురంగును, రాత్రియంతయు నుంచినచో నారింజపండు వర్ణమును బట్టకెక్కును.

జాఫరాగింజలు:—ఇవి చూచుటకు తొగరు గింజలవలెనుండును. ఇందలి రంగు పదార్థము గింజలపైభాగమున నుండుటచేత వేడినీళ్ళతో నుడుకఁబెట్టుటవలన రంగునీరేర్పడును. పట్టుబట్టలకు పసుపురంగును కుంకుమ పువ్వురంగును వేయుట కుపయోగించును. కాని పక్కారంగుగాకపోవుటచేత విస్తారముగ వాడుకచేయుటలేదు. సన్న్యాసులు బైరాగులు మున్నగువా రుపయోగించెడి శాటీలకు రంగీవిత్తనములతో వేయుదురు.

పసుపు:—ఇది కొమ్ముపసుపనియు మానుపసుపనియు రెండువిధములు. కొమ్ముపసుపు నిత్యము వాడుకలోనుండి స్థిరుగ పెంచఁబడుచున్నది. మానుపసుపు అడవిలో పెరుగును. ఈ రెండును పసుపురంగు వేయుట కుపయోగించెదరు. కాని పక్కారంగుకాదు. ఆకుపసరురంగు వేయుటకును గూడ పసు పుపయోగింతురు. రంగు చక్కగఁ బట్టుటకుచేవఁగల కొమ్ములను పొడిచేసి నీటిలో నానవైచి యాకపాయసముతో బట్టలకురంగువేయుదురు.

కుసుంబ:— ఇది వృక్షజాతిలోనిది. ఈ చెట్టుయొక్క గింజలునుండి చమురుదీయుదురు. పువ్వులలో రెండురంగు పదార్థము లున్నవి. ఒకటి పసుపు, రెండవది యెఱుపు. పసుపు పక్కారంగు కాకపోవుటచేత వాడుకలోలేదు. ఎఱుపుమాత్ర మద్దకమున కుపయోగపడును. ఈపువ్వులనుండి రెండు విధములరంగులు దీయుదురు. పువ్వులను నీటితో

ముద్దలుగఁజేసి జల్లెడవంటి చట్రముపైనుంచి నీరుపోయుదురు. అప్పుడు పూతలోనుండు పసుపురంగు కొట్టుకొనిపోయి రంగు వేయుట కుపయోగించు పూతమాత్రము నిలుచును. లేదా పూలను ఎండబెట్టి చూర్ణముచేసి యాచూర్ణము నమ్మెదరు. ఈపొడిని గుడ్డలో మూటగట్టి నీటిలో జాడించెదరు. అప్పుడు పసుపురంగంతయుఁబోయి కావలసిన పూత మాత్రము గుడ్డలో నిలిచియుండును. పసుపు పోఁగా నిలిచినపూతను నీటిలో నుడకబెట్టిన యెడల ఎఱ్ఱని కషాయమేర్పడును. దీనితో ఎఱుపురంగును గులాబిరంగును వేయవచ్చును.

కాచు:—ఇది తెల్లకాచు, నల్లకాచు, అని రెండువిధములుగ బజారులో దొరకును. నల్లకాచు రంగులు వేయుట కుపయోగించెదరు. కాచు చెట్టునుండివండినపదార్థము. కాచు చెట్టు రమారమి 15 అడుగులయెత్తుపెరుగును. చెట్టుయొక్క అంతర్భాగము ముక్కలుగఁ గొట్టి బానలలోవేసి నీరు పోయుదురు. కొంత నీరినికి పోవులాగున మరగఁ బెట్టెదరు. తరువాత నాకషాయమును మట్టపళ్లెరములలోఁ బోసి మూఁడు వంతు లినికి పోవువఱకునుమరగఁబెట్టెదరు. అప్పుడేర్పడినకాచు పాకము కలియఁబెట్టుచు నెండలో నుంచుట వలన కాచు ముద్ద యగును. తరువాత దీని నుండి నీరుపీల్చుటకు బూడిదె చల్లిన గుడ్డ మీఁద నారఁబెట్టెదరు. కాచు కరిగిన నీటిలో ముంచిన గుడ్డలకు కపిలవర్ణము వచ్చును. కాచును పతంగి చెక్కతోఁగలిపి జేగురురంగును, మోదుగ పువ్వుతోఁ గలిపి గౌరవర్ణమును వేయుదురు.

చందనపు చెక్క:—దీనికే రక్తచందన మను పేరుఁగూడ గలదు. ఇది ముఖ్యముగ పులికాటు సమీపమునను, తిరుపతి కొండల యందును పెరుగును. తిరుపతిలో ముఖ్యముగ దీనిని బొమ్మలు చేయుట కుపయోగించెదరు. చూచుటకు ఏప చేవవలెనుండి యెఱుపురంగులు వేయుట కుపయోగపడును. కాని యిది పక్కారంగు కాదని మన దేశీయులు దీనినంతగ వాడరు. అందుచేత నిది విశేషముగ విదేశములకు నెగుమతి చేయఁబడుచున్నది. వారు మఱికొన్ని యితర పదార్థములతోఁ గలిపి ఉన్ని యద్దకముల యం దుపయోగించెదరు.

రేవలచిన్ని:—ఇది సయాము, సింహళము, మలబారు దేశములలోఁ గొన్ని చెట్లు పెట్టెడి జిగురు. కొంచె మించుమించుగ కుంకుమపువ్వు ఛాయనుండును. దానిమ్మ తొక్కతోను పటికతోను గలిపివేసినయెడల పక్కా పసుపు రంగువచ్చును.

దానిమ్మతొక్క:—దానిమ్మపండ్ల నెండఁ బెట్టి పైతోలుపొడిచేసి రేవలచిన్నితోఁగలిపి పసుపురంగు వేయుదురు.

అకల్బీరు:—ఇదిహిందూస్థానములోఁ బెరిగెడి చెట్టు. దీనికి తెలుఁగులేదు. దీని వేళ్ళు పట్టద్దకమున కుపయోగించును. దీనిని సాధారణ

ముగ పటికతోను, పసుపుతోను, దానిమ్మ తొక్కతోను, శేవలిచిన్నితోను గలిపి ఉపయోగించెదరు. దేనితో గలిపినను పక్కా పసుపురంగు వచ్చును.

కరక్కాయలు :—వీనితో పసుపు, నలుపు వేయుదురు. పటికతో నూలుపైని పసుపును దేనిపైననను అన్నభేదితో నలుపును వేయవచ్చును.

అన్నభేది :—ఇది యన్నివిధములగు వస్తువులకు రంగువేయుట కుపయోగపడును. నూలు, ఉన్ని, నార, పట్టు, చర్మములు నలుపుచేయుటకుఁగూడ నుపయోగించెదరు. కరక్కాయనీటితోఁ గలిపి వాడవలెను. పసుపు రంగులతో అన్నభేదిఁగలిపినచో కపిలవర్ణము (Brown) వచ్చును. అన్నభేది బజారులో దొరకును. కాని వెలయధికమగుటచేతఁ గొందఱు ఇనుపతుప్పును గంజిలో పులియఁబెట్టి యన్నభేదికి బదులుగ దానిని వాడెదరు. ఇది కూడ అన్నభేదివలెనే పనిచేయును.

మంజిష్ఠ :—మదారుచెక్క. ఇది రెండు విధములుగ నున్నది. ఇందు మొదటిది చిరివేరు. ఇది చిన్నచెట్టు. విశేషముగ నెల్లూరు, బందరు, చీరాల, వేటపాలెము మొదలగు పట్టణములలో రుమాలుల యద్దకమునందుపయోగించెడి వారు. రెండవది త్రామవల్లి. ఇది తీగెజాతిలోనిది. ఈ రెంటికిని వేళ్లే రంగువేయుటకు ప్రధానములు. వేళ్ల బెరడు నీటిలో నానవైచి పటికనీటితోఁ గలిపి మెఱుపు వేయుదురు. నూలద్దకమునందు మాత్ర ముపయోగించెదరు. ఇంతియగాక తలనూనెలకు రంగులువేయుటకుఁగూడ వీనిని నుపయోగించెదరు. కల్పితపు రంగులు రాక పూర్వము మన దేశమునుండి చిరివేరు, మంజిష్ట, విస్తారముగ విదేశముల కెగుమతి యగుచుండెడిది. సుమారు పది సంవత్సరములనుండి యెగుమతి దిగుమతులు లేవనియే చెప్పవచ్చును.

పైనివర్ణించినవి మన దేశములో వాడుక చేసెడి ముఖ్యమైనరంగు పదార్థములు. ఇవిగాక మరికొన్ని మూలికలు కొద్దిగొప్పలు కదాచిత్తుగ వాడుచున్నారు. ఇట్టివానిలో పేపలిచెక్క, తాండ్రకాయలు, బాదముచెక్క, నిమిరిచెక్క (నలుపురంగునకు) సల్ల మద్దితాలు, పచ్చపువ్వులగోరింటాకు (పసుపురంగునకు) పిస్తాపూలు, పారిజాతపు పూలతొడిమలు, నందివర్ధనాలు (పసుపురంగు) చెప్పఁదగినవి.

కసటువస్తువులు (ఉపాధులు)

కసటువస్తువులు (Mordants) రంగులకు ఉపాధులని చెప్పవచ్చును. ఇతరపదార్థములతోఁగలియ నక్కఱ లేకుండ తమంతటతా మంటెడిరంగులసంఖ్య మిక్కిలితక్కువ. ఇవియైనను సామాన్యముగ ఉన్ని, పట్టు అద్దకములయం దుపయోగపడును గాని నూలద్దకమునకు పనికిరావు. కాని యద్దకమునకు పూర్వము బట్టలను కొన్ని

పదార్థములతో నుడకవేసిన త్రరువాత రంగు నీటిలో ముంచినయెడల నన్ని రంగులను చక్కఁగఁ బట్టును. ఇట్టివి యుపాధిరంగు (Mordant dyes) లందురు. ఈయుపాధులు సాధారణముగ వగరుగను కొన్ని పులుపుగను ఉండుటచేత నీజాతి కంతకును కసటు వస్తువులని పేరుపెట్టఁబడినది. వీన్ని నుడక వేయుటకు కసటువేయుట (Mordanting) యనవచ్చును. రంగులు వేయుటకుఁ బూర్వము బట్టలను కసటు వేయవచ్చును. లేదా కసటు వస్తువును రంగులతోఁ గలిపి యుడక వేయవచ్చును. కొన్ని రంగుల విషయములో ముందుగ రంగునీటిలో నుడకవేసి తరువాత కసటు వేయవచ్చును.

కసటు వస్తువులలో కొన్ని రంగులనిచ్చెడి పదార్థములు గూడకలవు. కరక్కాయలతో పసుపురంగు వేయవచ్చును. కరక్కాయలతో కసటువేసి అన్నభేదితో నలుపు వేయవచ్చును. ఇప్ప దానిమ్మతొక్క, లద్దుగచెక్క మొదలగు కొన్ని మూలికలు కసటువేయుటకే గాక రంగు పదార్థములుగఁగూడ నుపయోగించవచ్చును. కొన్ని కసటువస్తువులు రంగుపదార్థములుగ వాడుటకువీల్లులేదు. పటిక, చౌడు మున్నగునవి యిట్టిజాతిలోనివి.

మన దేశములో తరుచుగ వాడెడి కసటు వస్తువులలో ముఖ్యములయిన వానిని గురించి కొంచెము వ్రాయఁబడును. కసటు వస్తువులన్నియు మూలికలు గావు. చాకలి చవుడు, పటిక లోనగు నవి మట్టివలె భూసంబంధము గలవి.

చాకలి చౌడు—దీనికే సజ్జమట్టి యనియు, సజ్జాకార మనియు పేరు. ఇదియే యితర పదార్థములతోఁ గూడుకొనియున్న సోడా పొడి (Impure carbonate of soda). చవిటి భూములపై పొక్కువలె బైలుదేరెడి మట్టి పోగుచేసి కొంచెము సున్నముతోఁ గలిపి యుడకఁబెట్టి ముద్దలుగఁజేసి యమ్ముదురు. మన దేశములో నిది రెండు విధములుగ నుపయోగపడుచున్నది. కోరాలను చలువ చేయుటకును, రంగులు వేయుట కుపాధిగను (Mordant) వాడుచున్నారు.

పటిక:—రాగోపాధులలో నెల్ల మిక్కిలి యుపయోగ కరమైనదియు, మిక్కిలి తరుచుగ వాడఁబడునదియు, మిక్కిలి పురాతనమైనదియు పటికారము. నూలు, ఉన్ని, పట్టు, నార మొదలగు పదార్థముల కన్నిటికిని రంగులు వేయుటయందిది యుపయోగించును. విదేశీయులు వాడుకచేసినంత తఱుచుగ మన రంగురేజులు పటికారమును వాడుటలేదు. ఇందునకు రెండు కారణములున్నవి. పటికారము సజ్జాకారము - కంటె ప్రియము. ఇంతియగాక సామాన్యముగ బజారులో నమ్మెడి పటికలో కొద్దియో గొప్పయో అన్నభేదియును గలిసి యుండును. నలుపు దప్ప తక్కిన రంగులయొక్క కాంతి, యన్నభేది తగ్గించుటచేత, బజారు పటికారమును తఱు

చుగ వాడుటలేదు. చిరివేరు, మంజిష్ట, కిరిమింజి, పసుపు మున్నగు రంగులకు పటికతో కసటు వేయుదురు. పటిక నీటిలో ముందుగ బట్ట నుడకవేసి తరువాత రంగులో ముంచెదరు. కిరిమింజితో ఎఱుపు వేయునపుడు రెండు పనులును ఏక కాలముననే జరుగవచ్చును. అనఁగా పటిక నీటిలో కిరిమింజిని గలిపి బట్టల నందులో ముంచవచ్చును.

తంటెపు విత్తులు:—తంటెపు మొక్కలు మొరక భూమిని పెరుగును. విశేషము ఎత్తు పెరగవు. దీని పూలు పచ్చగనుండి గింజలు ఎఱ్ఱ వాగుగ నుండును. నీటిలో నుడకపెట్టినప్పుడు గింజలుబ్బి పొట్టలుపగులును. అటుతరువాత నా గంజిని నీలి మందుతోఁగలిపి యద్దకము వేయుదురు.

పిస్తాపప్పు:—ఇది గింజలోనుండి తీసిన పప్పుకాదు. ఇది యాకులనుండి పులిపిరివలె పుట్టి లోపలగుల్లగా నుండును. పిస్తాపప్పు కిరుమింజి రంగు వేయుటకు మాత్ర ముపాధిగా వాడఁబడుచున్నది.

గొడ్డుపెంట:—ఎఱుపు వేయుటకు పూర్వము బట్టలను గొడ్డుపెంటలో నాన్పుట యనాదినుండి • వాడుకలో నున్నది. విదేశీయులుగూడ పూర్వము దీని నుపయోగించెడివారు. మన దేశములో చిరివేరుతో నెఱుపు వేయునప్పుడు గొడ్డుపెంట నుపయోగించెడి యాచారముగలదు. కొన్ని యమ్లములు (ద్రావకములు) గూడ కసటు వేయుటకుపయోగించెదరు. గంధక ద్రావకము నీలి మందుతో రంగులు వేయునప్పు డుపయోగించెదరు. అమ్లె చింతపండు లక్కతో నుపయోగించి మెరుపు వేయుదురు. ఇందునకు పాత చింతపండు శ్రేష్ఠము. చింతపండు పులుసులో బట్టలు నాన్పినతరువాత రంగులో ముంచెదరు. చమురు పదార్థములలోఁగొన్ని కసటువస్తువులుగా వాడఁబడుచున్నవి. నువ్వుల నూనె, ఆముదపుతొక్క కొన్నిసమయముల నుపయోగింతురు.

జెముడు కాడలు, ముండ్లగజ్జెరు, ఉత్తరేణి మొదలగు మూలికలనుగాల్చి యాబూడిదెను రంగుల కుపాధులుగా వాడుచున్నారు. ఇందు ముఖ్యముగ జెముడుబూడిదె తఱుచుగా వాడెదరు.

లద్దుగచెక్క, కరక్కాయలు, అన్నభేది, దానిమ్మతొక్క - ఇవి రంగు పదార్థములు. రంగుపదార్థములక్రింద వర్ణింపఁబడినవి. ఇవి రంగుల కుపాధులుగఁగూడ వాడఁబడుచున్నవి. పైని చెప్పినవిగాక తుమ్మయాకు, తుమ్మజిగురు, జీడిగింజలకషాయము, బట్టలకు కసటు వేయుట కుపయోగించెదరు.

మన దేశములో విస్తారముగ రంగులు వేయఁబడుపదార్థములు నాలుగు. నూలు, ఉన్ని, పట్టు, నార. ఆంధ్రరాష్ట్రములో నూలద్దకము చాలచోట్లఁగలదు. బురంపురం, జగ్గయ్యపేటలలో పట్టద్దకము విశేషము. తివాచీలు, కంబళ్ళు, గొంగళ్ళు మాత్రము నేయుటకు

ఉన్ని యుపయోగ పడుచున్నదిగాని శాలువలుగాని తదితరములగు దుస్తులకు పనికి వచ్చెడి బట్టలుగాని ఉన్నితోఁజేసెడి యాచారము మనరాష్ట్రమున లేదు. నారతో బస్తాలను పరజాలను నేయుటకలదు. ఇవిగాక చాపలు నేయుటకుపయోగించెడి చిరిగడ్డి, తుంగ, కొబ్బరాకులు, ఖర్జూరపాకులు మొదలగునవి కూడ రంగులు వేయఁబడును.

మనదేశములో రంగులువేయుటకు పెద్ద బానలుగాని రాగిగంగాళములుగాని వాడుక చేసెదరు. వీనికి మన రాజధానిలో "గోలాము" లనిపేరు. వీనిలో కొన్ని యిరువది కుంచములవఱకు పట్టును. రంగుకషాయములను వీనిలో తయారుచేసి లాడీలనువానిలో ముంచెదరు. మనరాజధానిలో విస్తారముగ దారపులాడీలకే రంగులు వేయుదురు గాని నేసినతరువాత బట్టలకు వేయుట యరుదు. ప్రదేశమును బట్టియు, సంప్రదాయములను బట్టియు రంగులువేయుపద్ధతులున్ను, రంగులపాళ్ళును మారుచుండును. ఇందులోఁజాల వఱకువర్తక మర్మములుగలవు. ఐనను దొరతనమువారు తమయుద్యోగులచే నీవిషయమై రిపోర్టుల వ్రాయించి ప్రచురించియున్నారు. మనదేశములోనున్న యద్దకపు పద్ధతులనన్నిటినిగూర్చి సంక్షేపముగ వ్రాసినను ఒకగ్రంథమగును. కాఁబట్టి మచ్చునకై యీదిగువనిచ్చిన యోగ్యములతోఁ దృప్తిఁజెందవలసి యున్నది:—

నూలద్దకము:—ఎఱుపు వేయుట.

ఎఱ్ఱరంగు వేయుట కనేక రంగుపదార్థములున్నవని పైనివ్రాసినదానిని బట్టి గ్రహింపఁగలరు. మనరాజధానిలో(ముఖ్యముగ బందరు, చీరేల, గొల్లపాలెము మొదలగుచోట్ల) నూలున కెఱుపు వేయుటకుఁబూర్వము నూలు నీవిధముగ తయారు చేయుదురు. వీసెడు నూలునకు:—

జెముడుకాడల బూడిదె	5 పళ్లు
నువ్వులనూనె	1 వీసె
గొఱ్ఱెపెంట	పావుసేరు

వీనిని చక్కఁగ నీటిలోఁగలిపి తేర్చెదరు. నూలు నీతేటలో కొన్నిగంటలు నానిన తరువాత పిండి యెండవేయుదురు. ఇట్లెనిమిది పర్యాయములు చేయుదురు. ఇందున కథమము నాలుగు రోజులు పట్టును. ఇట్లు తయారయిన నూలును 5 పలములు చిరువేరుపొడి గలిపిన నీటిలో నానఁబెట్టెదరు. కొన్ని గంటలు నానినతరువాత పిండియెండ వేయుదురు. ఈ రీతిని పదిసారులు రంగులో నాన్చి ఆఖరు తూరి పేపలి చెక్కతో నుడక వేయుదురు. అప్పటికి రంగున కొకవిధమైనకాంతివచ్చును.

గులాబిరంగు:—ఇందు కుసుంబా పూవులుపయోగింతురు. లేదా లేత యెఱుపువేసి గులాబీరంగు కలుగఁజేయవచ్చును. రమారమి యొకసేరు కుసుంబాపూలు (ఎండినవి) పొడి చేసి నీటిలోకడిగి చౌటినీటిలో నానవేయు

దురు. చక్కఁగ నానినతరువాత తేర్చి నిమ్మ పండ్ల రసముఁ గళిపెదరు. తెల్లఁగ చలువ చేసిననూలు నీకషాయములో ముంచినయెడల గులాబీరంగుపట్టును.

నీలిరంగు:—ఈ రంగు వేయుటకు మన దేశములో నీ మందొక్కటియే కలదు. నూలును చలువచేసిన మీఁదనే రంగు వేయుదురు. వీసెడు నూలునకు:—

నీలిమందు	4 చటాకులు
చాకలిసోడు	1 సేరు, 12 చటాకులు
సున్నము	8 చటాకులు
బెల్లము	2 చటాకులు

ఇవి యన్నియు చక్కఁగ నీటిలోఁ గలిపి నాలుగైదు రోజులు మురఁగఁ బెట్టెదరు. కొందఱు తంగెడు విత్తులును, అరిటాకు బూడిదెనుగూడ కలిపి మురగఁ బెట్టెదరు. కషాయము చక్కఁగ మురిగినతరువాత నూలును ముంచెదరు. రంగంతయు నూలున కంటువఱకు నానెదరు. ముదురురంగు పడవలెనన్నచో తిరిగి యీరీతిని రంగు కషాయము తయారుచేసి ముంచెదరు.

ఆకుపచ్చ:—నీలియద్దిన నూలునకు పసుపు వేసినయెడల ఆకుపచ్చ రంగువచ్చును. ఇందునకుఁగాను:—

పసుపు	అరవీసెడు
మోదుగపూవులు	వీసెడు
పటిక	సవాసేరు

ఇవి చక్కఁగ పొడిచేసి కలిపి సళసళ కాగుచున్న కరక్కాయ నీటిలోఁ బోయవలెను. ఇందునకు వీసెడుకరక్కాయలు వ్రేళ్లు గొట్టి తగినంత నీటిలో నాననిచ్చి కాచవలెను. ఈ కాగుచున్న కషాయములో నీలి వేసిన నూలు ముంచిన యెడల ఆకుపచ్చ రంగు పట్టును. ఇది పక్కారంగు కాదు.

ఉన్ని యద్దకము:—నీలిరంగు.

మనరాజధానిలో ఉన్నియద్దకము విశేషముగ ప్రభుత్వమువారి జైళ్లలో జరుగుచున్నది. జైళ్లలోకొంతవఱకు కల్పితపురంగులు వాడినను నీలిరంగు వేయుటకు నీలిమందు వాడుచున్నారు. నీలిలో లేత ముదురు ఛాయ లన్నియు నీలి మందునుండి సాధింపవచ్చును. ఈ రంగుయొక్క కషాయము రెండు విధముల తయారు చేయుదురు. ఇది మన దేశమున సర్వత్ర వాడుకలోనున్న రంగగుటచే నీరెండుపద్ధతుల నిందుఁ దెలిపెదము:-

(1) ఒకపౌను నీలిమందు మెత్తఁగ పొడిగొట్టవస్త్రఘూలితము పట్టెదరు. మూఁడుపౌనుల గంధక ద్రావకము గాజు పాత్రలోగాని కుండలోగాని తీసికొని నీలిమందుపొడి కొంచెకొంచెముగ నందులో కరిగించి మూతవేసి రెండురోజు లెండలో నుంచెదరు. 10 పౌనుల ఉన్నికి రంగు వేయుటకు 10 కుంచముల నీరొక బానలోఁబోసి మరగఁబెట్టి తయారైన రంగు కషాయము కొద్దికొద్దిగ మరుగుచున్ననీటిలో కలపవలెను. కషాయ మంత

యుఁ గరిగినతరువాత ఉన్ని నందులోముంచి కఱ్ఱలతో జాడించెదరు. రంగంతయు ఉన్నికి పట్టిన తరువాత నీటిలోజాడించి యారవేయుదురు. (2) పది పంద్రెండు కుంచములు బట్టెడి బానను కుతికలవఱకు భూమిలోపాతి వీసెడు నీలిమందుపొడియు కొంచెము నీరును అందులోఁ బోసి చక్కఁగ గిలకొట్టెదరు. 5 వీసెలు తంటెపువిత్తుల నొక బానలో పొట్టులుచితుకు దనుక ఉడకఁబెట్టి నీలిమందు బానలోఁ బోయుదురు. ఈ మిశ్రణ మొక పూటలో మురిగి పొంగువచ్చును. అప్పుడు క్రొత్తగాఁ జేసిన సున్నము నీటిలోఁగలిపి రంగు కషాయముయొక్క పులుపువాసనపోవువఱకును సున్నపునీరు గలిపెదరు. ఇట్లు రోజునకు రెండు పర్యాయములు గలుపునప్పటికి ఎనిమిది రోజులలో బాననిండి నురుగుకట్టి తంటెపువిత్తులు తేలును. వానిని చిదిపి తిరిగి బానలో వేసినప్పుడవి మునుఁగును. ఇప్పటికి రంగుకషాయము తయారైనదని చెప్పవచ్చును. లాడీలనీ కషాయములో ముంచి రంగు చక్కఁగఁ బట్టులాగున చేతులతో నుసుముదురు. ఇట్లు చేయుటలో బానలడుగున తేలిన సత్తు లాడీల కంటకుండ జాగ్రత్త పడవలసియుండును. ఇది మిక్కిలి పురాతనమైనపద్ధతి. జైళ్లలోఁదప్ప తక్కినచోట్ల యద్దకులందఱు నీపద్ధతిని రంగులు వేయుదురు. ఈ కషాయముతో నూలునకును, ఉన్నికిని గూడ రంగు వేయవచ్చును. ఇందులో ముంచిన లాడీలను అద్దకమైన తరువాత మంచినీటిలో జాడించకుండ నెండవేయుదురు.

లేతయెఱుపు:—మన రాజధానిలో లక్కతోను, పతంగి చెక్కతోను ఎఱుపు వేయుచున్నారు. రంగు నెక్కువ వాడినచో ముదురెఱుపు వచ్చును. లేతయెఱుపు నచ్చుటకు:-

లక్క	4 పౌనులు
చింతపండు	12 ,,
పటిక	సేరు

లక్కనీటిలోను నొకపూటనానినిచ్చి పల్చగ నూరెదరు. చింతపండును నీటిలోపిసికి పులుసు వడియకట్టి లక్కతోఁబాటు కాగులోఁ బోసెదరు. తరువాత పటికనీరు గలిపి మరగఁబెట్టి మరుగుచున్న రంగు కషాయములో లాడీలు ముంచెదరు.

జేగురులేక తొగరురంగు:—ఇది సమిష్టి రంగు. ఎఱుపుమీఁదగాని, గులాబిమీఁదగాని వేయుదురు. 10 పౌనుల ఉన్ని 5 పౌనుల పతంగిచెక్క పొడిని, పౌను పటికయుఁ గలిపి యుడకవేయుటవలన గులాబి యగును. దీనిని అరవీసెడు కాచును, మూఁడు పలముల అన్నభేదియుఁ గలిపిన నీటిలో నుడక వేసినచో తొగరు రంగుపట్టును.

పసుపు:—ఇందునకుపయోగించెడిముఖ్య పదార్థములు పలాశము, పసుపు, పటిక. వీని పరిమాణములు మార్చుటవలన పసుపులో ననేక ఛాయలువచ్చును. 10 పౌనుల యున్నికి వంగపండు రంగువేయుటకు

మోదుగ పూవు ....1 పౌను.

పసుపు.................. ౩ పలములు.

పటిక ....౩ ,,

పటికయు, పసుపును పొడిగొట్టి నీటితోఁ గలిపి కాగులోఁ బోయుదురు. మోదుగ పూలను గుడ్డతో వదులుగ మూటఁగట్టి యా నీటిలో విడిచి మరగఁబెట్టెదరు. మరుగుచున్న నీటిలో ఉన్ని లాడీలు ముంచెదరు. దీనికి పతంగిచెక్కఁగాని, లక్కఁగాని కలిపిన చో నారింజపండు రంగువచ్చును.

పట్టద్దకము:—ఉన్ని యద్దకమునకును, పట్టద్దకమునకును సామాన్యముగ భేదము లేదు. ఉన్ని యద్దకమునందుపయోగించెడి రంగు పదార్థములును, పద్ధతులును పట్టద్దకమునకుఁగూడ పనికివచ్చును. అందుచేత నిచ్చట నొకటి రెండురంగులు వేయు యోగములకంటె నెక్కువ చెప్పుట యనవసరము.

దీప్తిగల యెఱుపు:—ఎఱుపు వేయుటకనేక వస్తువు లున్నవి. ఇందు కిరుమింజితో వేయు మార్గముఁ దెలిపెదము. వీసెడు పట్టునకు రంగు వేయుటకు:—

కిరుమింజి.........నవా శేరు.

పిస్తాపప్పు..........ముప్పావు శేరు.

పటిక............ముప్పావు శేరు.

ఇందులో పిస్తాపప్పును, పటికయు నుపాధులు. శుభ్రము చేసినపట్టును ముందుగ నొకరోజు పటికలో నాన్పవలెను. పిస్తాపప్పును, పటికను వేర్వేరుగ పొడిచేసి నీటిలోఁ గలిపి మరగఁబెట్టవలెను. మరుగుచున్న రంగు కషాయములో పటికలో నాన్పిన పట్టులాడీలను ముంచి రెండు గంటలసేపుడుకవేయవలెను. రంగు చక్కఁగఁ బట్టినతరువాత మంచినీటిలో జాడించి యెండవేయుదురు.

ఆకుపచ్చ:—బంగాళములో పట్టున కాకుపచ్చ వేయుటకు పనసకొయ్యల కోతలో వచ్చెడి రంపపు పొట్టును, పసచెట్టుయొక్క ఆకులును, గలిపి మరగఁబెట్టి వడపోసి కొంచెము నీలిమందుఁ గలిపి యందులో పట్టును ముంచెదరు. లేత పసుపురంగు వేయుటకు కరక్కాయలు, అన్నభేది, పసుపు, దానిమ్మ తొక్కలు, పటిక—ఇవి సమపాళ్ళు తీసికొని నీటిలో మరగఁబెట్టి యా కషాయములో ముంచుటవలన లేత పచ్చరంగు పట్టును.

నలుపు (జీడినలుపు):—ఈ రంగు వేయుటకు పట్టును ఛలువ చేయనక్కఱలేదు. ముడి పట్టునే వాడవచ్చును. ఒక వీసెడుపట్టునకు రంగు వేయుటకు:—

తుప్పు పట్టిన యినుప ముక్కలను పులిసిన గంజిలో మూఁడు నాలుగు రోజులు మురగఁబెట్టిన తరువాత తేర్చెదరు. వీసెడు కరక్కాయ పెళ్ళు ఈ తేటలో నానవైచి పట్టునందులో నుంచి కాగఁబెట్టెదరు. కాగుచున్నప్పుడు పట్టును పైకిఁదీసి వీసెడు అన్నభేదిని ఆ మిశ్రణములో వేయుదురు. తిరిగి పట్టు నందులోముంచి యొకటిరెండు గంటల

సేపు కాచెదరు. రంగంతయుఁ బట్టిన తరువాత పట్టును మంచి నీటిలో జాడించి నీడన నెండ వేయుదురు.

ధూపుచాయ-ఊదారంగు:—ఇవి నమిష్టి రంగులు. వేరుపడుగులకు వేఱు వేఱురంగుల నూలు నుపయోగించుటవలన నీ రంగులు రాఁగలవని యిదివరలో వ్రాసియుంటిమి. ప్రత్యేకముగ ఊదారంగు వేయుట కెఱ్ఱపట్టును ముందుగ కరక్కాయ నీటిలో నానవైచి తరువాత నీలిమందులోగాని, అన్నభేది నీటిలో గాని ముంచినయెడల ధూపుచాయ వచ్చును.

నారవస్తువుల యద్దకమునకును, నూలద్దకమునకును భేదమేమియు లేదు. కావున నీ విషయమై ప్రత్యేకించి వ్రాయ నవసరము లేదు. అద్దకమునందు నారవస్తువులకెక్కువ యుడుకులు గావలసియుండును. చాపలల్లెడి యాకులకు, గడ్డికిఁగూడ నిట్లేరంగు వేయుదురు. ఇందునకు ముఖ్యముగ లక్క, పసుపు, నీలిమందు మొదలగు రెండు మూఁడు రంగులు మాత్ర ముపయోగింతురు.

ఉన్నిపట్టుకలిసిన బట్టలకు రంగు వేయుట

ఉన్నిదారములును, పట్టు దారములును కలిసి నేయఁబడిన బట్టకు రంగు వేయుట కొంచెము కష్టసాధ్యమైనపని. అందులో రెండు దారములకు నొక్క రంగే వేయుట కష్టతరము. ఎందుకనఁగా, ఉన్ని దారములకును, పట్టుదారములకును వేఱువేఱు రంగులతో స్నేహముండవచ్చును. ఉన్ని దారములకు బాగుగ పట్టెడిరంగె పట్టుదారములకుఁ బట్టక పోవచ్చును. అట్లే పట్టుదారములకు నక్కర వచ్చిన రంగు ఉన్నిదారములకు నక్కర రాక పోవచ్చును. కావున నిట్టివస్త్రములకు రంగు వేయుటలో రెండు విధములయిన దారములకును పట్టెడి రంగులను ఉపయోగింపవలెను.

ఆజోరంగులు (Azo Colours), క్షారపు రంగులు (Basic Colours) ఇట్టిబట్టలకు మిక్కిలి ఉపయోగించును. అలి రెండు దారములకు నొక్కరంగే వేయుట జరీను రంగులను (Alizarine dyes) కూడ వాడవచ్చును. నీలి రంగునకై ఆల్కలీ నీలము (Alkali blue), నలుపు, నీలము, కలిగిన రంగునకై నెపథాల్ నలుపు (Nappthol black), ఆకుపచ్చ రంగునకై నెపథాల్ పచ్చ (Nappthol green), ఎఱ్ఱరంగులకై ద్రావకపు మ్యాజంటా (Acid Magenta), అను ద్రవ్యములను వాడుకొనవచ్చును. ఇవి ఉన్ని దారములకును, పట్టుదారములకును సమానముగా పట్టును. టిటాన్ పసుపు (Titan Yellow), బ్రిలియంటు కాంగో (Brilliant congo), డయామైన్ కపిలవర్ణము (Diamine brown) మొదలైన నిరుపాధికపు రంగుద్రవ్యములు (Direct dyes) కూడ నిట్టిబట్టలకు ఉపయోగించును. ఇట్టి బట్టలకు నీలిరంగులు (Blue colours) అంత బాగుగఁ బట్టవు.

ఉన్ని పట్టుదారములు కలిసియున్న బట్టకు రెండు రంగులు వేసి మనోహరముగఁ జేయ వచ్చును. ఇట్లు రంగు వేయుట, బట్టను ఒక్క సారిగాని, రెండుసారులుగాని, పెక్కుసారులుగాని రంగులోముంచుటవలనఁ జేయవచ్చును.

బట్టకు రెండురంగులు వేయుట

౧-వ పద్ధతి:—ఒక్కసారియే బట్టను వేడి నీళ్ళలో నానఁబెట్టి కొంచెము గంధకద్రావకమును (Sulphuric acid) వేసి ఉతికి, చల్లనీళ్ళతో కొద్దిగా నబ్బుపెట్టి, వినీగరు లేక చింతపండుతో నునుపుచేయుటవలన ఉన్నిదారములకు నొకరంగు పట్టుదారములకు నింకొక రంగుపట్టును. ఏయేద్రవ్యములు వేసినందున పట్టుదారముల కేరంగు పట్టునది, ఉన్నిదారములకు నేరంగుపట్టునది ఈక్రిందఁ జూపఁబడినది.

పట్టుదారములకు పట్టెడిరంగు	ఉన్నిదారములకు పట్టెడిరంగు	ఉపయోగించిన సరుకులు
(1) గులాబి	ఎఱుపు	ఫ్లాక్సైన్ (Phloxine)
(2) బూడిదరంగు	(నీలి)	నీలి (Indigo extract 5%)
(3) పసుపు పచ్చ చాయ కలిసిన గోధుమవర్ణము	నీలవర్ణ మిశ్రితమైన గాఢమైన యెఱుపు	క్రైసాయిడైన్ అజోఫ్లవైన్, ఆసిడ్ మాజంటా (Chrysoidine Azoflavine and Acid magenta)
(4) బూడిద వర్ణము గలిసిన ఎఱుపు	నీలి	మెజంటా, నీలి (Magenta & indigo extract)
(5) గోధుమ	తమాల వర్ణము	ఆసిడ్ ఎల్లో, నీలి, ఆరంజిగ్రీన్ (Acid yellow, indigo extract orange green)
(6) గులాబి	ఎఱుపు	ఆసిడ్ మెజంటా (Acid magenta)
(7) పసుపు	గోధుమ వర్ణము	ఆసిడ్ ఎల్లో, ఆసిడ్ మెజంటా, ఆరానైన్, నీలి (Acid yellow, acid magenta, Auraneine indogo extract)
(8) నీలము	గోధుమ వర్ణము	మెలాకైట్ గ్రీన్ మెథిల్ మెజంటా, ఆసిడ్ ఎల్లో ఇండిగో, కార్మైన్ వైలెట్ (Malachite green methyl magenta, acid yellow, indigo, carmine vieolet)

౨-వ పద్ధతి:—రెండు తడవలబట్టను రంగులో నానవేయుట. మొదటితడవ, వేడినీళ్లలో ద్రావకముకలుపుదురు. అదిఉన్ని దారములకు వన్నె తెచ్చును. రెండవతడవ చల్లనీళ్ళలో తడిపెదరు. కొంచెము ద్రావకము కలుపుదురు. ఈతడవ పట్టుదారములకు వన్నె పట్టును. మొదటిసారి ఆసిడ్ రంగులను ఉపయోగించెదరు. అవి రెండుదారములకుఁ బట్టునుగాని, ఉన్ని దారములకు చక్కఁగఁబట్టును. పట్టుదారములకు, స్వల్పముగఁ బట్టును. రెండవతడవ క్షారపు రంగులను (Basic colours) ఉపయోగించెదరు. అవి పట్టుదారములకు బాగుగ నంటుకొనును. కొద్దిగ ఉన్ని దారములకు నంటుకొనును. అందు కొన్ని ప్రక్రియలు ఈ క్రింద నీయఁబడినవి.

పట్టుదారములకు పట్టెడి రంగు	ఉన్ని దారములకు పట్టెడి రంగు	మొదట పర్యాయము ఉపయోగించిన వస్తువులు	రెండవపర్యాయము ఉపయోగించిన వస్తువులు
(1) నీలము	ఎఱుపు	ఆసిడ్ మెజంటా (Acid Magenta)	అనిలైను (Aniline)
(2) ఆకుపచ్చ నీలము	ఆకుపచ్చ పసుపు	నైఫాల్ పసుపు (Naphol Yellow S.)	అనిలైను ఊదా (Aniline Blue)
(3) ఊదా	మడ్డిపచ్చ	ద్రావకపు పసువు (Acid Yellow)	మెథాల్ ఊదా (Methol Violet)
(4) ఆకుపచ్చ	పసుపు	Do.	న్యూ విక్టోరియా పచ్చ (New Victoria Green)
(5) ఆకుపచ్చ కలిసిన పసుపు	ఆకుపచ్చ	లేపచ్చ (Light Green S.)	అరోమిన్ (Auromine)
(6) ఊదా	ఊదా ఎఱుపు	ఆసిడ్ మెజంటా (Acid Magenta)	నిగ్రోసైన్ (Nigrosine)
(7) జిల్లేడు పూలవన్నె	ఆకుపచ్చ	లే పచ్చ (Light Green S.)	సాఫ్రనైన్ (Sapranine)
(8) ఆకుపచ్చ	ఆలివ్ వన్నె	ద్రావకపు పసుపు (Acid Yellow)	సాఫ్రనైన్ కరుగు ఊదా (Sapranine and soluble Blue)

కలంకారీ యద్దకము

బట్టలపైని కల్పిత రూపములను, వివిధములగు రంగులతో నద్దుటకు కలంకారీ యద్దకమని పేరు! నూలు, ఉన్ని, పట్టు, నార ఈ నాలుగు జాతుల బట్టలును కలంకారీ యద్దకమునకు పనికివచ్చును. కాని విశేషముగ నూలుబట్టలే వాడుదురు. బట్టల కొకవైపుననే యద్దకము వేసినప్పుడు "ఉల్టా సీదా" యందురు. సాధారణముగ రెండువైపుల నద్దుదురు. రెండువైపుల నొకేరూపముండవచ్చును లేక వేర్వేరు రూపముల నద్దవచ్చును. బట్టయంతయు తెల్లగనుండి బొమ్మలు మాత్రము రంగులు గలిగి యుండవచ్చును, లేక రంగు బట్టమీఁద తెల్ల బొమ్మలుండవచ్చును. అద్దినరూపములన్నియు నొకే రంగులో నుండవచ్చును. లేదా వివిధములగు రంగులలో నుండవచ్చును. ఒకే బట్టను ఇరువది రంగులలో నద్దుటకూడ గలదు.

సాదా యద్దకమునకును కలంకారీ యద్దకమునకును, సామాన్య శాస్త్రవిషయములలో భేదములేకున్నను సాదాయద్దకపు పద్ధతులీ యద్దకమునకు పనికిరావు. కలంకారీ యద్దకమునకు ప్రత్యేక పద్ధతులవసరము. ఏలయన కలంకారీ యద్దకమునం దొక బట్టమీఁద ననేక చిత్రరూపములుండి యొకదానిలో నొకటి కలిసిపోకుండ దేనికది వేరుగ నుండవలెను. ఇంతియగాక యద్దకము పూర్తియైన తరువాత బట్టమీఁదనున్న రూపసముదాయము చూచుటకు నందముగనుండవలెను. బట్టలమీఁద నేరంగు తరువాత నేరంగు నద్దవలెను? బొమ్మలయొక్క యాకృతు లెట్లుండవలెను? ఏబొమ్మ తరువాత నే బొమ్మయుండవలెను? ఈ విషయములు చక్కఁగ గమనించినఁగాని యద్దకము సొంపుగనుండదు. ఇందు కద్దకుఁడు మేధావంతుఁడై కల్పనాచమత్కృతియు, భావమును సంపూర్ణముగ వెల్లడి చేయఁగల చిత్రలేఖనా సామర్థ్యమును గలిగి యుండవలెను. ఈకారణములను బట్టి కలంకారీ యద్దకము సాదా యద్దకముకంటె వేయిమడుంగులు కష్టతరము.

నేతయొక్క యుత్పత్తి కాలమువలెనే యద్దకముల యుత్పత్తి కాలముగూడ నిర్ణయించుటకు వీలు లేదు. కాని సాదాయద్దకములోనే కలంకారీ యద్దకముగూడ పరిపాటియైయుండును. ఇది కేవలము పౌరస్త్య విద్యయనియు పాశ్చాత్యులుపౌరస్త్యులనుండి గ్రహించిరనియు చరిత్రకారుల యభిప్రాయము. హిందువులును, చీనా వాస్తవ్యులును ఈ విద్యయందు మార్గదర్శులు. కాని చీనావాస్తవ్యు లంత ప్రవీణతఁ జెందలేదనుటకు కారణములున్నవి. అమెరికా ఖండమునందలి పెరూ, చిలి, మెక్సికో దేశములలో చాలకాలము క్రిందటనే కలంకారీ యద్దకమున్నట్లు దృష్టాంతములున్నవి. రమారమి నాలుగువేల సంవత్సరముల క్రిందట నద్దినగుడ్డలు

ఈజిప్టు దేశములోని సమాధులనుండి యిటీవల తీయఁబడినవి. కాని దీనిని బట్టి వారద్దకపు బట్టల నుపయోగించెడివారని తెలిసది. కాని వారికీ యద్దకపు పద్ధతులు తెలియునని నిర్ధారణ చేయుటకు వీలులేదు. క్రీ. శ. మొదటి శతాబ్దము నాటికి ఈజిప్టుదేశములో నద్దకము లున్నట్లు ప్లినీయను చరిత్రకారుఁడు వ్రాసియున్నాఁడు. ఈతని యనంతరము మూఁడువందల యేండ్లకు ఈజిప్టునులు రోమనులు అద్దకమునం దుపయోగించినయచ్చులు దొరకినవి. మన దేశీయులనుండి యీజిప్టను లీ పరిశ్రమను గ్రహించిరనియు వారిద్వారా పాశ్చాత్యులు నేర్చుకొని రనియు చరిత్రకారుల యభిప్రాయము. పాశ్చాత్యులలో స్పెయిను, ఇటలీ, జర్మనీ దేశములలో మాత్ర మీ పరిశ్రమ యుండెడిదికాని క్రీ.శ. ౧౮-వ శతాబ్దము తరువాత నద్దకపు పరిశ్రమ పాశ్చాత్యులలో పూర్తిగ నంతరించినది.

తిరిగి ౧౬-౧౭-వ శతాబ్ద ప్రాంతములలో హాలెండు దేశీయులగు డచ్చివర్తకులు మన దేశపు టద్దకపు పద్ధతులను నేర్చుకొని జర్మనీ దేశీయులకుఁ జెప్పిరి.* ౧౭-వ శతాబ్దమున జర్మనీలోని "ఆగుస్బర్గ"ను పట్టణమున ప్రశస్తముగా కలంకారీబట్టలు, ఇతర దేశములకు రవాణా చేసెడివారు. వలసపోయిన పరాసులీ పరిశ్రమ నితరదేశములలో స్థాపించుటకు కారకులైరి. ౧౬౭౬-వ సంవత్సరమున నొక పరాసుయువకుఁడు మొట్టమొదట నింగ్లండులో తేమ్సునదీతీరమున అద్దకములు వేయుట కారంభించెను. అటు తరువాత క్రమముగ స్కాట్లెండు, లంకషైరు మున్నగు ప్రదేశములలో నుపక్రమింపఁబడినవి. ౧౯-వ శతాబ్దాంతమున అద్దకమునం దుపయోగించెడి యచ్చులలోను, తదితరపద్ధతులలోను మార్పులుగలిగి ప్రస్తుత పాశ్చాత్యకళాభివృద్ధికి కారకులైనవి.

* కలంకారీ గుడ్డలకు ఇంగ్లీషులో "క్యాలికో" లని పేరు. మన రాజధానిలో మలబారు ప్రాంతములనున్న "కాలికట్టు" పట్టణమునుండి కలంకారీ వర్తకము విశేషముగ జరుగుచుండెడిది. అందుచేత అద్దకపు బట్టలనన్నిటిని క్యాలికోలనిరి. ఇట్లే మనము "చీటీ" లను వాటిని పాశ్చాత్యులు "చింట్జు" అందురు. చీటీగుడ్డలు కూడ మొట్టమొదట మన దేశమునుండియే పాశ్చాత్య దేశముల కెగుమతి కాఁబడినవి.

తనభావమును చిత్రించి యా చిత్రితరూపమును రంగులతో బట్టలమీఁద ప్రతిఫలింపఁజేయుటయే యద్దకుని కర్తవ్యము. ఇందుకు ముఖ్యమైనవి యైదుసాధనములున్నవి. వానినీ క్రింద వివరించెదము.

ఉపకరణములు

౧. అచ్చులతో నద్దుట (Hand-block printing) :—ఇది మిక్కిలి పురాతనమైన పద్ధతి. పనికూడ మిక్కిలి సులభమైనది. బొమ్మలు అలికినట్లుండక చక్కఁగ నద్దకమగును. కాని పనియంతయు చేతితోఁ జరిగి యంత్రసంపర్కము లేకపోవుటచేత కాలహరణమగును.

కొయ్యలతో దిమ్మలుచేసి వానిమీఁద బొమ్మలను జెక్కుదురు. ఈ దిమ్మలు సాధారణముగ రెండు మూఁడంగుళముల కంటె నెక్కున మందముగనుండవు. ఒకకల్పన చిత్రించుటకు రెండుమూఁడచ్చులు కావలసినప్పుడు ఆ దిమ్మలన్నియు నొకదానిలో నొకటి బిగించి యేకదిమ్మగఁ జేయుదురు. దిమ్మలను చిత్రిపట్టి నున్నగఁజేసి కాటుకతో వానిపైని బొమ్మలయొక్క యాకృతిని వ్రాయుదురు. తరువాత దిమ్మలను తడిగుడ్డలలోఁజుట్టి బొమ్మలను చెక్కుదురు. తయారైన యచ్చులపైని కొన్నిభాగములు పల్లములుగను తక్కినభాగములు యథాప్రకారముగ మెరకగను ఏర్పడును. అచ్చులను రంగులోముంచి బట్టపై నద్దినప్పుడు రంగు మెరకభాగములకు మాత్రమంటి గుడ్డమీఁద బొమ్మ లేర్పడును.

చెక్కుటవలన అచ్చులపై నాజూకుపని చేయుటకు వీలుండదు. అందుచేత సన్నని పూలు, పూజలు చేయవలసినప్పుడు వానిని రాగితోఁజేసి దిమ్మలలోనికి దిగఁగొట్టెదరు. కొన్నితరుణముల బొమ్మలను సీసపురేకుపై చిత్రించి యారేకును కొయ్యదిమ్మమీఁద బిగించెదరు. అచ్చుఁబోసికూడ దిమ్మలను తయారుచేయుటగలదు.

అచ్చులతో బట్టలనద్దుటకొక యెత్తయిన బల్లకావలెను. ఈబల్లపై నొక చదరమైన రాయి పరచి రాతిపైని మెత్తనికంబళి ముడతలు లేకుండబిగించి కప్పుదురు. బల్లయొక్క రెండు వైపులను కప్పీలు బిగించి యాకప్పీలపైని బట్టనులాగి యద్దకమైన తరువాత రెండవ వైపునలాగి యారఁగట్టుదురు. ఈ బల్లగాక యద్దకమునకు రంగుతొట్టి యొకటి యవసరము.

అద్దకము వేయుటకు బల్లకు నెడమవైపున నున్న కప్పీలమీఁదుగా బట్టనులాగి ముడుతలు లేకుండ బల్లపైఁబరచును. తరువాత రూళ్లకఱ్ఱతీసికొని యెఱ్ఱనిసీమసున్నముతో నెక్కడ దిమ్మల నద్దవలెనో అక్కడ గుర్తులు పెట్టును. అచ్చులను రంగులలోముంచి గుర్తులుంచినచోటఁబెట్టి నొక్కును. రంగుచక్కఁగ నంటుటకై కొయ్యసుత్తెతో నొకటి రెండు సారులుకొట్టును. రెండవతూరి యద్దునప్పుడు రెండచ్చులనుగలిసి చక్కఁగ నుండవలెను గాని వంకరపోయి రెంటికిని మధ్యను సందు లుండఁగూడదు. సరిగా నద్దుటకు దిమ్మల యొక్క నాలుగు మూలలను గుండుసూదు లుండును. వీనిసహాయముతో నెక్కడ నద్దవలెనో యద్దకునికిఁ దెలియును. ఈరీతిని బల్లమీఁదఁ బరిచిన బట్టయంతయు నద్దఁబడినతరువాత నాభాగము నారుటకై జారవిడిచి యింకొక భాగము లాగుదురు.

అద్దకమునందు వేర్వేరు రంగులు బొమ్మ లుండిన యెడల మొట్టమొదట బట్టనంతయు నొకరంగుఁగల బొమ్మలతోనద్ది యారనిచ్చి తరువాత మరియొక రంగులోముంచి యద్దుదురు. రంగులన్నియు పూర్తియగు దనుక

నిట్లే చేయుచుందురు. ఏకకాలమునసే రెండు మూఁడు రంగులనద్దుటకు ప్రయత్నములు జరిగినవి. ఇందు దిమ్మలయొక్క వేర్వేరు భాగములు ఆయారంగులతో మాత్ర మేక కాలమున ముంచియద్దుదురు. ఈమార్పువలన నేకకాలమున ఆరురంగులుకూడ అద్దవచ్చును. కాని యీ యద్దకములో నచ్చులకు మధ్యను సందులుండుటచేత నంతఁగా వాడుకలోలేదు.


౨. పెఱ్ఱొటీను సాధనము (Perrotine printing):--ఇది యంత్రసాహాయ్యమువలన జరిగెడి యద్దకపు పద్ధతి. క్రీ. శ. ౧౮౩౪ సంవత్సరములో "పెఱ్ఱొ" యను నతఁడు నిర్మించుటవలన నీ యంత్రసాధనమున కాతని పేరిడిరి. ఇది యింగ్లండులో వాడుకఁ జేయకపోయినను పాశ్చాత్యదేశములలో కొన్నిటియందు వాడుకలోనున్నది. ఈ సాధనమునందు రూపములు చిత్రింపఁబడి మూఁడుదిమ్మలుండును. ఇవి సామాన్యముగ మూఁడడుగులు పొడవును మూఁడుమొదలు ఐదంగుళములవెడల్పును గలిగియుండును. ఈ మూఁడు దిమ్మలు సమభుజాకారమువచ్చునట్లు ఒకదానితో నొకటిచేర్పఁబడి యుండును. ఇటువంటిదియే మూఁడు ముఖములుగల మరియొక యినుప చట్రిమిందులో నిమిడియుండును. అద్దకమునం దొక్కొక్క దిమ్మదానికెదురుగనున్న పలుక పైనొక్కును. ప్రతిదిమ్మకును ఆయారంగులు గలతొట్టి కట్టఁబడును. అద్దకముగావలసిన్న బట్టదిమ్మలికును ఇనుప చట్రముయొక్క పలకలకును మధ్యనున్న స్థలములోగుండ జరిగి పోవుచుండును. యంత్రిము పనిచేయునప్పుడు ఎంతరంగు కావలెనో యంత దిమ్మలపై కుంచెలతో పూయుటయు, బట్టతనస్థలములోవచ్చినిలుచుటయు, అచ్చులు దానిపై నొక్కుటయు అద్దకమైనతోడనే బట్ట యావలికి జరిగిపోవుటయు మున్నగు క్రియలు అప్రయత్నముగ వాని యంతట యవే జరుగుచుండును.

ఈ యంత్రముతో నద్దుటకు నెక్కువ పనివాండ్రవసరములేదు. కాలహరణము గాక శీఘ్రిముగ నద్దకము ముగియును. బొమ్మలు కూడ ఏకధారగనుండి ఒకటేదిమ్మతో నద్దినట్లు కలిసియుండును. కాని, యీపద్ధతి ప్రకారము మూఁడురంగులలో మాత్రమద్దకము వేయుటకు సాధ్యమగును. అందుచేత నన్ని దేశములలో విశేషముగ వాడుటలేదు.

3. చిత్రితమైన రాగిరేకులతో నద్దుట (Engraved coperplate printing):—రాగిరేకులపై రూపములను చిత్రించి ముద్రణాయంత్రములలోవలె వీనితో గుడ్డలనద్దుదురు. ఈ పద్ధతి యనేక దేశములలో వాడుకలోలేదు. కాని చిన్నిరుమాలపై నాజూకుగల యంచుల నొత్తుట కెస్పిట్లరుల్యాండులో దీని నుపయోగించుచున్నారు.

౪. తిరుగుడు యంత్రముతో నద్దుట (Roller, cylinder or machine printing):- ఇదిప్రస్తుతము విశేషముగ వ్యాప్తిలో నున్న సాధనము. ఇది మొట్టమొదట ౧౭౮౫-వ సంవ

త్సరమునఁ గనిపెట్టఁబడి వెంటనే కొన్నిమార్పులతో నేకకాలమున రెండుమొదలుకొని యాఱు రంగులను ముద్రించుటకు యోగ్యమగునట్లుచేయఁబడెను. ఈయంత్ర సాధనమునందు మూఁడుభాగములు ముఖ్యములైనవి. ఇందుమొదటిది యొకగుండ్రని యినుపదూలము. యంత్రసహాయమువలన నిది పైకిఁగ్రిందికిఁబోవచ్చును. దీనికి క్రిందుగనొకరాగిదూలముండును. ఇదియు నినుపదూలమువలె గుండ్రముగనుండును. అద్దుటకుఁ గావలసిన బొమ్మలీరాగిదూలముపై చిత్రితములైయుండును. రాగి దూలమునంటుచు క్రింది భాగమున గుండ్రనికొయ్యయుండొకటిగలదు. ఇది సగము వరకు రంగుతొట్టిలో మునిగియుండును. ఈమూఁడును గుండ్రముగ నుండి యవసరమునప్పుడు గిరగిరఁ దిరుగును. వీనిని నింగ్లీషులో "రోలర్సు" అని పేరు. రోడ్డుమీఁద కంకరను దట్టించుటకు లాగెడి యినుపయంత్రములవలెనుండును. పైనిఁజెప్పిన మూఁడు రోలర్లును నొకయినుప చట్రములో బిగించియుండును. ప్రతిరంగుకు నొక్కొక్క యంత్రమిట్టిది యుండవలెను. ఈయంత్రముయొక్క నిర్మాణమును ఉపయోగించెడి పద్ధతియు నిందు వర్ణింపఁబడును. ఈ క్రిందఁజూపిన పటములో ౧-గుర్తుగలిగి చక్రమువలెనుండు పై భాగము ఇనుపదూలముయొక్క చివరభాగము. ౨-అనునది దీనిమీఁద జుట్టియున్న మెత్త. ఈ మెత్త ఉన్నితోను నూలుతోను గలిపిచేయుదురు. ఈమెత్త యద్దకముచేయవలసిన గుడ్డను బొమ్మలపై చక్కఁగ నొక్కును. ౩-గుర్తుగలిగి ఇనుపదూలము నంటియున్నది రాగి రోలరు. అద్దవలసిన బొమ్మలు దీనిపై చిత్రింపఁబడును. రాగి రోలరున కిరుప్రక్కలను ౪-౫ గుర్తుగల రెండు భాగములు వ్రేలాడుచున్నవి. ఇందొకటి యుక్కుతోను రెండవది



ఇస్త్రీపెట్టెను చేయబడును. కావలసి నంత రంగునుంచి యొక్కటైన దానిని గీచివేయుటకు ఉపయుక్త యంత్రము ఉపయోగించును. అద్దకమునందంటుకొను రాగములను ముస్సుగు వానిని ఇస్త్రీపెట్టె తీసివేయును. ఉక్కు స్టీలు కొయ్యరోలరు రాగిరోలరుకు రంగును పూయును. ఇట్టి ఉక్కు స్టీలు రంగు పెట్టెలో నగముమునిగి యుండును. ఛ... అనునది యద్దకము వేయవలసిన గుడ్డ. దీనికి ఇనుపదూలమునకును మధ్యగా కంబళీ ఛ... నొక రూపమున (అనగా బంపెళ్లమువలె) నుండు ఇనుప దూలమునందు లోపలగానుండును.

ఈ యంత్రమునకు పనిచేయునప్పుడు ఇనుప దూలమును రాగి రోలరుకు తగులులాగున బిగించి యంత్రమును త్రిప్పనారంభింతురు. అద్దవలసిన గుడ్డ ఇనుప దూలమునకును రాగి రోలరుకును మధ్యనుండును. యంత్రము పనిచేయునప్పుడు రంగు కొయ్య రోలనువలన రాగిరోలరుపై చిత్రములైన బొమ్మలపై బూయబడును. బట్టలు వీనిపైని నప్పుడు బొమ్మలు ముద్రితములగును. అద్దకమైన వెంటనే బట్టలు ఆవిరి గొట్టములపై నెండ వేయుదురు.

పైని వర్ణించిన యంత్రము ఒక్క రంగుతో నద్దుటకే పనికివచ్చును. ఎన్ని రంగులతో నద్దవలెనన్ని అన్ని రాగిరోలరు లుండవలెను. ప్రతి యంత్రము పైని జెప్పిన రీతినే యుండిన వీని కన్నిటికి పరస్పర సంబంధముండును. ఏకకాలమున పదునారురంగులతో నద్దుటకు వీలైనయంత్రములుగలవు. ఎంతపెద్ద యంత్రమైనను నిర్మాణవిధాన మొకటియే. కాని తప్పిళ్లలో నించుకు భేదముండును.

ఇటీవల నీ తిరుగుడు యంత్రములో ననేక మార్పులు జరిగినవి. వీనిలో రెండు ముఖ్యమైన మార్పులు చెప్పవలసియున్నది. ఇందొకటి "విరామ యంత్రము" (Intermitent machine). దీనివలన కొన్నిరంగు లంటకుండునటులుజేసి కావలసిన రంగులను మాత్రమే యద్దవచ్చును, లేదా యొకటేరంగును కొంతదూరమద్ది కొంత భాగము వదలివేసి తిరిగి యచ్చటినుండి యద్దుటకు వీలగును. మన దేశమునకుం బంపెడి శాలువులు చీరెలు మున్నగునవి ఇట్టి యంత్రములో తయారగుచున్నవి.

రెండవది "డూప్లె" యంత్రము (Duplex or Reversible machine). ఇందు రెండు రాగిరోలర్లుండును. ఈ రెండును ఏకరీతిని చిత్రితములై యుండును. ఈ యంత్రసాహాయ్యమువలన ఉల్టాసీదా లేకుండ బట్టలనద్దుటకు వీలగును. తిరుగుడు యంత్రములతో నద్దుటవలన మూఁడు లాభములున్నవి. పది గంటల కాలములో పండ్రెండువేల గజముల గుడ్డ నద్దవచ్చును. ఎంత సున్నితములైన బొమ్మలనైనను మోటబొమ్మలైనను బీరువోకుండ నద్దనగును. ఒకే బొమ్మను వివిధములగు రంగులతో నేకపర్యాయము రంగులు కలియకుండ నద్దవచ్చును.

రాగిరోలర్లపై బొమ్మలను చిత్రించుట

అద్దకముయొక్క ప్రాశస్త్యము చిత్రించిన బొమ్మలను బట్టియుండును. బొమ్మలు చక్కఁగఁ జెక్కినఁగాని యద్దకము తేటగానుండదు. రాగి రోలర్లపై బొమ్మలు చెక్కుటకు మూఁడు పద్ధతులున్నవి.

(i) చేతితో ఉలిచేత నగిషీ చెక్కుట:—ఇది మిక్కిలి పురాతనమైన పద్ధతి. కాని మిక్కిలి యాలస్యమగు పద్ధతియగుటచేత నిప్పుడంత వాడుకలో లేదు. చెక్కదలచిన రూపములను రోలరు మీఁద రంగుతో గీచి యాగీతలలో నొక యులితోటి చెక్కుదురు. చెక్కినచోట్ల రాగి లేచిపోయి రూపముల యొక్క యాకృతి యేర్పడును. ఎక్కువ యనుభవజ్ఞులుగాని యీ చెక్కడపుపని చేయఁజాలరు. చేతికిని కంటికిని నిలుకడ కుదురవలెను. మిక్కిలి చిక్కుఁగల నగిషీపనికిని యంత్రములకలవడని పెద్దవియగు రూపములకును ఈపద్ధతి యుపయోగపడుచున్నది.

(ii) ద్రావకముతో కరిగించి బొమ్మల నేర్పరచుట:—చిత్రకారునియొక్క రూపకల్పనను తుత్తనాగపు రేకుపై దింపి రాగిరోలరును చక్కఁగ నునుపుజేసి మైనముతోఁ గప్పుదురు. తరువాత నొకవాడిగల ఇనుపగంటముతోఁ నాతుత్తనాగపు రేకుమీఁది బొమ్మలను రాగిరోలరుపై వ్రాయుదురు. వ్రాసిన చోట్ల మైనమువిడిపోయి తక్కిన రోలరంతయు మైనముతోఁ గప్పఁబడియుండును. బొమ్మలను వ్రాసినతరువాత రోలరును నైట్రికుద్రావకములో ముంచి కొంతసేపుంచుదురు. అప్పుడు మైనములేనిచోట్ల రాగి యీ ద్రావకములో కరిగి గుంటలేర్పడును. అటుతరువాత మైనమును గోకివేసినయెడల రోలరుపై బొమ్మల యొక్క యాకృతి యేర్పడును.

(iii) యంత్ర సాహాయ్యముతో చిత్రించుట:—ఈ పద్ధతిప్రకారము మొట్టమొదట బొమ్మలను ఉక్కురోలరుపైఁ జెక్కి దానిని కాల్చి చల్లనీటిలో ముంచుటవలననది బిరుసెక్కును. దీనిని మరియొక యుక్కురోలరుపై నొక్కునట్లుజేసిన యెడల మొదటిబొమ్మ దీనిపైఁబడును. కాని మొదటి రోలరులోనున్న పల్లములకు మెరకలును, మెరకలున్నచోట్ల పల్లములును ఏర్పడును. ఈ రెండవరోలరునుగూడ మొదటిదానివలె బిరుసెక్కింతురు. తరువాత నీ రోలరుతో రాగి రోలరు పై నొక్కినయెడల మొదట వ్రాసిన బొమ్మ దీనిమీఁద నేర్పడును.

౫. చిల్లి రేకులతో నద్దుట:—ఇది మిక్కిలి పురాతనమైన సాధనము. జపాను దేశములో విస్తారముగ వాడెడివారు. మనదేశములో నిప్పటికి వాడుకలోనున్నది. అట్టలపై గాని సన్నని రేకులపై గాని బొమ్మలనువ్రాసి ఆయా చోట్ల కత్తితో కోయుదురు. వీనిని బట్టపైనుంచి కుంచెలతో రంగులు వేయునప్పుడు కత్తిరించినచోట్ల రంగంటి, తక్కినచోట్ల తెల్లఁగానుండును. ప్రతి బొమ్మయు నీపద్ధతి

వలన నద్దుటకుసాధ్యమగును. వేర్వేఱు రేకులు దీసికొని వివిధ రంగులుతోఁగూడ నద్ద వచ్చును. కాని యితరపద్ధతులకును దీనికిని చిత్రించుటయందు భేదమున్నది. ఎట్లన ఈ పద్ధతి ప్రకారము మామిడిపిందెల యంచు నద్దవలెనను కొందము. మామిడి పిందెలను అట్టచేయునప్పుడు మధ్య మధ్యను కొంచెము వదలి కత్తిరించనిచో పిందెలు అట్టలో నిలువవు. ఇట్టియట్టతోఁజేసినయంచు అద్దినప్పుడు బొమ్మలు ఏకధారగానుండక మధ్యమధ్యను తెల్లనిభాగములుండును.

పైని వర్ణించిన సాధనములు మాత్రమే గాక యితరసాధనములుగూడ కొన్నిగలవు. రూప కల్పనమును బట్టియు, బట్టలయొక్క సున్నితమును బట్టియు, నద్దకపు పద్ధతులు మారుచుండును. కొంతవరకు యంత్రములతోనద్ది తరువాత చేతిదిమ్మలతోనద్దుటగూడ కలదు. ఇట్లే సాదాబొమ్మలు యంత్రములో నద్ది యెక్కువ నగిషీగల వానిని చేతిదిమ్మలతోగాని చిల్లి రేకులతోగాని యద్దుదురు.

కలంకారీ యద్దకమున కుపయోగించు బట్టలను సాదాయద్దకము వేయునప్పటికంటె

బట్టలను తయారు చేయుట

నెక్కువ జాగ్రత్తతో చలువ చేయవలెను. కలం కారీబట్టలను ప్రత్యేకముగ చలువచేసి సాపుచేసినఁగాని యద్దకము చక్కఁగాపడదు. నేతలోవచ్చిన హెచ్చుతగ్గులనుదీసివేసి చలువ చేసిన తరువాత బట్టలను ముడుతలుపడకుండ ఇస్త్రపరోలన్నపైఁ జుట్టుదురు: తరువాత వానిని టర్కీయెరుపు నూనెలో (సోడా యద్దకము చూడుడు) ముంచి యెండవైచి ముడుతలు పడకుండ నుంచెదరు. ముఖ్యముగ నెరుపు రంగులును, రోజా రంగులును వేయుటకు నూనెలో నాన్పుట యవసరము. ఈపని వలన తక్కిన రంగులకుఁగూడ నొకవిధమగు తళుకు వచ్చును. అందుచేత సామాన్యముగ బట్టలను నూనెలో నాన్పుదురు.

సాదాయద్దకమునకును కలంకారీ యద్దకమునకును రంగులు తయారుచేయుటలో భేద

రంగులను తయారుచేయుట

మున్నది. కేవలము శాస్త్రజ్ఞానమే గాక యనుభవము కూడ లేనిదే రంగులను చక్కఁగఁ గలుపుట దుర్లభము. రంగుల యొక్క లేత ముదురులనుబట్టి వాని భాగములు మారుచుండును. ఇంతియగాక యొకే నమూనాలో రెండు మూఁడు రంగులుండునప్పుడు వానిలోనొకదానితోనొకటిపరస్పర వైషమ్యము లేకుండునట్లు రంగులును గలపవలసియుండును. "సాదాయద్దకము" లో వ్రాసిన రంగుల విభజన క్రిందఁగూడ వర్తించునుగాన నిక్కడ తిరిగి దానినిగూర్చివ్రాయ నక్కరలేదు. కొన్నిరంగులు తమంతటతామే బట్టల కంటుకొనును. కొన్ని యితర పదార్థముల సహాయమునగాని యంటుకొనవు. మరికొన్ని యుపాధులతో నద్దవలెను. కొన్ని

తరుణముల ఉపాధులను మాత్రము బట్టలపై నద్ది తరువాత రంగులో ముంచెదరు.

సాదాయద్దకమునందు రంగులు సామాన్యముగ కషాయ స్థితిలోనుండును. బట్టలను రంగులకషాయములలో ముంచినప్పుడు రంగు లంటును. కాని కలంకారీ యద్దకమునందు రంగులు కషాయములుగఁ జేయరు. దిమ్మలను ముంచి బట్టలపై నంటించుటకు వీలగునంత పల్చగ మాత్రముండును. ఇట్లు చేయుటకు రెండు ద్దేశములున్నవి. రంగులు నీటివలె పల్చగానున్న యెడల దిమ్మలను రంగులో ముంచి బట్టలపై నద్దులోపల కొంత క్రింద పోయి నష్టమగును. ఇంతియగాక రంగు పల్చగానున్నప్పుడు బట్టపైనద్దిన తరువాత నద్దిన చోట్లనేయుండక యిరుప్రక్కలకుఁ బ్రాకును. అందుచేత బొమ్మలుచక్కఁగ నుండక చెదరిపోవును. ఈ కారణములనుబట్టి కలంకారీ యద్దకమునందు వాడెడిరంగు లెప్పుడును గోదువలె జిగటగలిగియుంటుకొనుటకు వీలుగనుండును. ఇట్లు చేయుటకు రంగులను కొన్ని యితరములగు జిగటపదార్థములతోఁ గలిపెదరు. ఈ పదార్థములకు ''జిగురులు'' (Thickening agents) అని పేరు. వీనిని గూర్చి యించుక వ్రాయవలసియున్నది.

జిగురులు (Thickeners):— ఇవిరంగులను గట్టిపరచుటకై కలిపెడి జిగటగల వస్తువులు. గంజి, మైదాపిండి, తుమ్మజిగురు, సీమ జిగురు, సెనిగాలు జిగురు, జిగటమట్టి, సర్వీసు, బెల్లపునీరు, గ్లిసరీను, కోడిగుడ్లసొన మున్నగునవి తరుచుగ వాడఁబడు జిగురులు. కోడిగుడ్ల సొనతప్ప తక్కినవన్నియు నీటిలో కలిపి కాని ఉడకఁబెట్టి కాని పక్వమునకుఁ దేఁబడును. ఒక పెద్దగిన్నెలో నీరుఁ బోసి యందులో నొక చిన్నగిన్నెనుంచి దానిలో జిగురు పదార్థమునుంచి కొంచెము నీటితోఁ గలిపెదరు. పెద్దగిన్నెలోని నీరు మరగఁబెట్టినప్పుడు యీవిరికి జిగురు పక్వమునకువచ్చును. అన్ని జిగుర్లను అన్ని రంగులకు నుపయోగించుటకు వలనుపడదు. రంగుల స్వభావములను బట్టి జిగుర్లు మారుచుండును. కొన్ని జిగుర్లను జేయుపద్ధతులను వాని యుపయోగములను గూర్చి యిచ్చట సంక్షిప్తముగ వ్రాయఁబడును.

గంజి:—ఇది సర్వసామాన్యముగ ననేక రంగులకు వాడెడి జిగురు. ఎక్కువ క్షారస్వభావముగల (సున్నమువలె గాటయినవి) రంగులతోఁగాని ద్రావక స్వభావముగల (గంధకద్రావకమువలె పుల్లనివి) రంగులతో గాని కలుపుటకు పనికిరాదు. క్షారపు రంగులతోఁగలిపినప్పుడు గంజి ముద్దగట్టును. ద్రావకపు రంగులతోఁ గలిపినప్పుడు జిగురు చెడి బిరుసెక్కును. కాని తక్కిన యన్ని విధములగు రంగులతోఁగలిపి వాడవచ్చును.

గంజిచేయుటకు 15 పౌనుల మైదాపిండికి కొంచెము చల్లనీరు గలిపి మీగడవలె నగునట్లు చేయవలెను. తరువాత కొంచెము ''ఆ

లివు నూనె" (Olive oil) కలిపి పదిగ్యాలనుల నీటిలోఁ గలియఁబెట్టి, మరగఁబెట్టి చల్లార్చెదరు. అప్పటికి గంజి పక్వమునకువచ్చును.

గోధుమ పిండి:— ఇదియు గంజివలెనే పైనిజెప్పినరీతి నుడకఁబెట్టి తయారు చేయఁబడును. పటిక, అన్నభేది మున్నగు ఉపాధులను చిక్కఁగఁ జేయుటకు మాత్ర ముపయోగఁ బడుచున్నది. తక్కిన రంగులతోగాని యుపాధులతోగాని కలుపుటలేదు.

తుమ్మబంక ౹ సెనిగాలు జిగురు:—ఇవి యనాదినుండియు కలంకారీ యద్దకమునందు వాడుకలోనున్నవి. కాని వానివెల యధికమగుటచేత నిప్పుడు తరుచుగ వాడుటలేదు. లేతరంగుల నద్దుటకివి ప్రశస్తమైన జిగురులు. ముదురు రంగులువేయుటకు పనికిరావు. గంజిపెట్టిన బట్టలు నీటిలోజాడించి నప్పుడా గంజి పూర్తిగపోక బట్టలు కొంచెము బిరుసుగ నుండును. తుమ్మబంకపెట్టిన గుడ్డలట్లుగాక యుతికినవెంటనే జిగురు బట్టలనుండి విడిపోయి బట్టలు మెత్తగ నుండును. అందుచేత నివి మిక్కిలి సున్నితములగు బట్టల నద్దునప్పుడుపయోగపడుచున్నవి. ఆరులేక యెనిమిది పౌనుల బంకను గ్యాలను నీటిలోనుడకఁబెట్టిగాని చల్ల నీటిలో నాన్చిగాని తయారు చేయవచ్చును.

సీమజిగురు (British gum):—ఇది మైదా పిండివేయించి తయారుచేయఁబడును. ముదర వేగినయెడల నల్లగానుండును, లేనిచో నెఱ్ఱవాగుగానుండును. ముదర వేగినకొలఁది జిగట హెచ్చును. లేతగా వేగినపిండి మూఁడు పౌనులు గ్యాలను నీటిలోఁగలిపిన యెడల మంచి జిగురు తయారగును. ముదరవేగినది గ్యాలనుకు పదిపౌనులవరకుఁ గావలెను. ముదర వేగిన పిండితోఁజేసిన జిగురు ద్రావకపు రంగులకును క్షారపురంగులకుఁగూడ నుపయోగించును. గంజివలె నీజిగురు బట్టలకు దట్టముగఁ బట్టదు. అందుచేత నిది ముదురు రంగులు వేయుటకు పనికిరాదు.

"ట్రాగను" జిగురు (gum tragacanth): ఇది బజారులోదొరకును. కలంకారీ యద్దకునకిదియొక ముఖ్య పదార్థము. గంజితోగాని మైదా పిండితోగాని కలిపి వాడెదరు. పూత రంగులు (pigmet colours) వేయుటకును ఉపాధి రంగులువేయుటకును వాడవచ్చును. దీనితోఁ గలుపుటవలన గంజి బట్టలకు దట్టముగఁబట్టి యుతికిన తరువాత బట్టలు నున్నగా నుండును. చల్ల నీటిలోగాని వేడినీటిలోగాని నానఁబెట్టుటవలన నీజిగురు తయారగును.

కోడిగుడ్ల సొన:—ఇందులోని జిగురు గల భాగమునకు "అల్బుమిన్" (albumen) అని పేరు. దీనిని రక్తమునుండి కూడ తీయవచ్చును. ఇది రెండు విధముల నుపయోగపడుచున్నది. రంగులకు జిగురు బుట్టించఁగలదు, పూతరంగులను బట్టలకు దట్టముగ నంటునట్లును చేయఁగలదు. ఇది యెప్పుడు చల్ల నీటితోనే తయారుచేయఁబడును. చక్కఁగా

తయారగుటకు కొన్నిరోజులుకూడ పట్టును. రక్తమునుండి తీసిన అల్బుమిను గ్యాలనుకు నాలుగు పౌనులును కోడిగుడ్లసొనయైనచో గ్యాలనుకు ఆరు పౌనులును గావలసి యుండును. కోడిగుడ్ల సొనవెల యధికమగుటచేత లేతరంగులు వేయుటకు మాత్రము వాడుచున్నారు. "డ్రాగను" జిగురును కోడిగుడ్ల సొనను చెరిసగముగలిపి పూత రంగులు వేయుటకుపయోగించెదరు. ముదురురంగులు వేయుటకింతకంటె నెక్కువపాలు 'అల్బుమిను' కావలసియుండును. ఈ జిగురుతో రంగుల నద్దిన తరువాత బట్టల కావిరిఁబట్టెదరు. అట్లు చేసినప్పుడు 'అల్బుమిను' గడ్డకట్టి రంగులు బట్టలకు గట్టిగ నతుకుకొనును.

జిగురులను రంగులను కలిపి యుడకఁబెట్టి యద్దుటకు తయారుచేసి బట్టలకతుకుకొనుటకు ఇతర పదార్థములతోఁ గలిపెడివారు. కాని యిప్పుడు జిగురును,రంగులను అంటుడు పదార్థములను వేర్వేరుగతయారుచేసి యద్దునప్పుడు మాత్రము గలుపుదురు. రంగులతోఁ గలిపెడి జిగురులపాలు ఎక్కువైనచో లేత రంగులు వేయవచ్చును.

అద్దుటకు పూర్వము జిగురులు గలిపిన రంగులను వడకట్టుటముఖ్యము. ఇసుక మున్నగు గట్టిపలుకులు రంగులతోఁ గలిసియున్నయెడల రోలర్లపై గీతలుపడి బట్టలు చెడిపోవును. అందుచేత రంగులు మెత్తగనుండుట యత్యవసరము. వడకట్టుటకు రంగులను జిగురులతోఁ గలిపిన తరువాత గుడ్డసంచులలోగాని పట్టుసంచులలోగాని పోసి పిసికెదరు. ఇట్లొకటి రెండు సారులు చేయు సరికి గట్టి పలుకులన్నియు సంచులలో నిలిచి మెత్తని రంగులుమాత్రము వెలువడును.

అన్ని జిగురులు అన్నిరంగులతోఁ గలుపుటకు వీలులేదని పైని వ్రాయఁబడినది. రంగులు మిశ్రణముఁజేయుటకు జిగురులకును రంగులకును పరస్పరవైషమ్యములేకుండనుండవలెను. కొన్ని జిగురులకు మిక్కిలి వేడిబెట్టినఁగాని జిగటరాదు. కాని యావేడిమికి కొన్ని రంగులు చెడిపోవును. కావుననట్టిరంగులతో నీజిగురు గలుపఁగూడదు వేడిమికి చెడిపోవు రంగులతో గంజిని మైదాపిండిని గలపఁగూడదు.

జిగురులకును రంగులకును పరస్పరానురాగ ముండఁగూడదు. అట్లుగానిచో జిగురులు రంగులతో రసాయన సంయోగము నొంది రంగులు వర్ణములు మారిపోయి నూతన పదార్థములేర్పడును. ద్రావక స్వభావము గల రంగులతో గంజిఁ గలపఁగూడదు. క్షారస్వభావముగల రంగులతో తుమ్మ బంక మున్నగు జిగురులు మాత్రమే వాడవలెను.

జిగుర్లయొక్క పాకము జాగ్రత్తతోఁ గని పెట్టవలెను. ఏలయన జిగురుయొక్క పక్వమును బట్టి యవి యారుటకుఁ గావలసిన కాలము ఎక్కువ తక్కువ లగుచుండు. ఆ రెండుకాలమును బట్టి రంగులయొక్క కాంతి

హెచ్చుటయు తగ్గుటయు సంభవించుచున్నది. పటికతోను అన్నభేదితోను గంజినే వాడుదురు. ఏలయన నవి కొంచె మాలస్యముగ పనిచేయును. అందుచేత తుమ్మ బంక మొదలగు గోదులు పనికిరావు. ఇట్లే రంగులయొక్క లేతముదురుచాయలు జిగుర్ల యొక్క గట్టి పలుచఁదనములను బట్టి యుండును. గంజి వాడుటవలన వచ్చెడి ముదురు చాయలు గోదులవలన రావు.

కొన్ని తరుణములు జిగురులను రంగులతో గాని యుపాధులతోగాని కలిపినప్పుడా జిగుర్లు వానితో సంయోగము నొంది క్రొత్త రంగులను సృష్టించును. ఇట్టి స్వభావముగల జిగురుల నాపదార్థములతోఁ గలపఁ గూడదు.

అద్దకము పూర్తియైన తరువాత బట్టల నుతికినవెంటనే జిగురులుబట్టలనుండిశీఘ్రముగ విడిపోవలెను. లేనిచో రంగులయొక్క దీప్తి తగ్గిపోవును.

జిగుర్లతోఁ గలిపి యద్దినప్పుడు సామాన్యముగ బట్టలు కుంగును. జిగురు చిక్కనైన కొలఁది కుంగుట హెచ్చగును. ఇట్టి స్థితిలో రెండుమూఁడు రంగులల్లో నద్దినప్పుడవి సమానముగనుండక వ్యాప్తియందు హెచ్చుతగ్గులు గలిగి కాంతిలోఁగూడ భేదములుండును. ఇట్టి యవాంతరములు రాకుండుటకై రెండుమూఁడు జిగుర్లు గలిపిన మిశ్రణముల నుపయోగించెదరు. సామాన్యముగ తుమ్మ గోదుతో బంకమట్టిగలిపి వాడుదురు. అద్దకమునం దుపయోగించెడి రంగుల వరుసను బట్టికూడ జిగుర్లు మారుచుండును. ముదురు రంగులు గంజితోఁ గలిపి మొదట నద్దెదరు. లేతరంగులు గోదులతోఁ గలిపి తరువాత నద్దెదరు. నాజూకైన రూపకల్పనముల నద్దుటకు తుమ్మ బంక లోనగు గోదులను వాడుదురు గాని గంజి మైదా పిండిమున్నగు చిక్కని జిగుర్లను వాడుకఁ జేయరు.

అద్దకపు పద్ధతులు

ఇంతవఱకు బట్టలను, రంగులను తయారు చేయు పద్ధతులు వర్ణింపఁబడినవి. ఇఁక రంగుల నద్దెడి మార్గములు వర్ణింపవలసి యున్నది. రంగుల యొక్క తత్త్వమును స్వభావములను బట్టి యద్దెడి "సంప్రదాయములు" మారుచుండును. ఈ సంప్రదాయములకే "పద్ధతులు" (Styles of printing) అనిపేరు. ప్రస్తుతము రంగులయొక్క సంఖ్య మితిమీరి యుండుటచేత పద్ధతులు గూడ ననేకము లున్నవి. కాని రంగుల స్వభావములను బట్టి రెండు సామాన్య పద్ధతులు దేలుచున్నవి. కొన్నిరంగులు బట్టలకు తగిలినంత మాత్రముననే యంటుకొనును. ఇవి సామాన్యముగ ఖనిజ స్వభావము గల రంగులు. ఇంగిలీకము జేగుర్లు, గంగజిందూరము లోనగునవి యిట్టి జాతిలోనివి. ఇట్టి రంగులను జేగుర్లతో గలిపి చక్కఁగఁజేసి దిమ్మలతోనద్ది ఎండఁగట్టెదరు. సామాన్యముగ కోడిగుడ్ల సొనతోఁ గలిపి

యద్దుదురు. అప్పుడు పక్కారంగులు నిలిచి యుండును. వీనిని పూతరంగులన (pigments) వచ్చును. ఈ యద్దకమునకు 'పూయుపద్ధతి' (pigment style) యని పేరు.

కొన్ని రంగులు ముఖ్యముగ మూలికల సంబంధము లగునవి (vegetable dyes) పూతఁబూయుటకువలనుపడనివి. ఇట్టిరంగులకు సాదా యద్దకమునందు వర్ణింపఁబడిన పద్ధతు లన్నియు వర్తించును. ఇం దనేక పద్ధతులు గలవు. ఒక బట్టలో కొన్ని భాగములకే రంగు వేయుటవలన సాదా యద్దకమునందు వీలులేని పద్ధతులు గూడ నొకటి రెండున్నవి. ఈ పద్ధతు లన్నియు నీ క్రిగువ సంక్షేపముగ వర్ణింపఁబడును.

(1) పూతరంగుల పద్ధతి (pigment style):—ఇది పురాతన పద్ధతి. కల్పితపు రంగులు లేని కాలమున నీ పద్ధతి మిక్కిలి వాడుకలో నుండెడిది. బచ్చెన పోసినప్పుడు కొయ్య బొమ్మలకు రంగు లంటునట్లు ఇవి బట్టల కద్దుకొనును. రంగులను బట్టల కంటు కొనునట్లుచేయు జిగురులకు బంధనములని (fixingagents) పేరు. ఫూత రంగులతో వాడుకచేయు బంధన పదార్థము అల్బుమిను. ఇందుకు కోడిగుడ్ల సొనయైనను రక్తములో నుంచి తీసిన అల్బుమినైనను వాడవచ్చును. పూతరంగులతో నద్దిన బట్టలు సబ్బులో నుతికినప్పుడు గాని యెండవేసినప్పుడు గాని వెలిసిపోవు.

ఈ పద్ధతిలో ముఖ్యముగా వాడెడి రంగులు:-క్రోమ్ పసుపు(chrome yellow); క్రోమ్ ఆరెంజి (chrome orange); క్రోమ్ పచ్చ (Chrome green); అల్ట్రా మెరీన్ (ultra marine) (నీలము); దీపపు కొడి; జేగురు మన్ను; తుత్తనాగ భస్మము (Zinc oxide) (తెలుపు); ఇంగిలీకము మొదలగు నవి. ఇవియన్నియు నొకేరీతిని అద్దఁబడును. ఒకదానితో మరియొకటి గలిపి వేర్వేరు ఛాయలు తెప్పించవచ్చును. లేచాయలకు అల్బుమిను కొంచెముగను, ముదురు చాయ లకు నెక్కువగను వాడవలెను. రంగుల నెంత మెత్తఁగ పొడిజేసిన నంత దీప్తివంతము లగును. అద్దుటకుఁగూడ ననుకూలముగా నుండును. రంగులు మిక్కిలి మెత్తగ నుండనియెడల నద్దకములో ముద్దలుపడి హెచ్చు తగ్గులుగ నంటుకొనును. రంగుపొడిని అల్బుమిను నీటితో చిక్కఁగఁ గలిపి తరువాత గంజితోగాని యితర జిగుర్లతోగాని పలుచన చేసెదరు. ఈ క్రింది యోగములవలన నీ పూతరంగుల వాడెడి పద్ధతి తెలియును.

ముదురు పచ్చ :—

రంగు........8 తులములు

అల్బుమిను......1 గ్యాలను (5 తులముల అల్బుమను గ్యాలను నీటిలోఁ గలపవలెను)

ఈ రెంటిని చక్కఁగఁ గలిపి వడపోసి యద్దవలెను.

నీలము (Dark ultramarine blue):—

24 పౌనులు (మణుము) అల్ట్రామెరీను రంగును దీసికొని మెత్తగ పొడి జేసి

$4\frac{1}{2}$	గ్యాలనుల	అల్ప్బమిను నీటితోను
$2\frac{1}{2}$	,,	ద్రాగను జిగురు నీటితోను
$\frac{1}{32}$	,,	అమ్మోనియాతోను
$\frac{1}{16}$	,,	గ్లిసరీనుతోను
$\frac{1}{32}$	,,	కర్పూరతైలముతోను
$\frac{1}{16}$	,,	పత్తిగింజలనూనెతోను

చక్కఁగఁ గలిపి మొత్తము 8 గ్యాలను లగు వరకును నీరువోసి కలియ పెట్టవలెను. అప్పటికి రంగు పక్వమునకువచ్చి యద్దుటకు సిద్ధముగ నుండును. అద్దిన తరువాత బట్టలకు ఆవిరియైన పట్టెదరు, లేదా సలసలకాగెడి సున్నపునీటిలో స్నానముంచెదరు. ఇట్లుచేయుటవలన అల్బుమిను గడ్డకట్టి బట్టలకంటుకొనును. దానితోఁబాటు రంగులును బట్టల నంటియుండును. కాని యీ రంగులు వేయుటకు రెండాక్షేపణలు గలవు. పూతరంగులు వేయుటవలబట్టలుబిరుసెక్కును. ఇంతియగాక యివి పక్కారంగులైనను బట్టలకు రాపిడితగిలినప్పుడు రంగులు కొంతవరకు రాలిపోవును. ఈ కారణములను బట్టి యిప్పుడీరంగులు సామాన్యముగ నాటకపు తెరలకును కిటికీలకునుఅడ్డముగట్టుట కుపయోగించు గుడ్డలకును వేయుచున్నారు. దుస్తుల కుపయోగించెడి వస్తువుల కరుదుగవాడెదరు.

ఇతరములగు పూతరంగులు:—పైనిఖనిజ సంబంధములగు రంగులనద్దుటవర్ణింపఁబడినవి. మూలికల సంబంధములగు రంగులను గూడ కొన్నిటిని ఖనిజ సంబంధములగు రంగులవలె నద్దవచ్చును. ఇందు స్వాభావికపు రంగులును కల్పితపు రంగులును గలవు. ఇంతియగాక వీనిలో కొన్ని నిరుపాధికపు రంగులు. మరి కొన్ని సోపాధికపు రంగులు. ఇవిగాక మరి కొన్ని యితరజాతులలోఁ జేరిన కల్పితపు రంగులుగూడ కలవు. ఇవి యన్నియు పైని వర్ణించిన పూతరంగుల పద్ధతి ననుసరించియే యద్దఁబడును. వీనిలో కొన్నిటి నిచ్చటఁ దెలిపెదము.

నిరుపాధికపు రంగులపద్ధతి (Direct dyeing colours):—ఈ రంగులలో కొన్ని సాదా యద్దకమను భాగములోఁ జేర్చఁబడినవి. నూలునకును ఈ రంగులకును ఒక విధమైన యనురాగము గలదు. అందుచేత నివి యుపాధులు లేకయే బట్టలకంటును. అయినను నివి మిక్కిలి పక్కారంగులనిపించుకొనవు. అందుచేతప్రస్తుతమివి యద్దకమైనబట్టలకు మెరుగుఁ బెట్టుటకు మాత్ర ముపయోగించెదరు. ఈ రంగులతో గులాబి, మబ్బు, నీలము, పసుపు రంగులుమాత్రము వేయవచ్చును. ఈరంగుల నద్దునప్పుడు జిగుర్లనుమాత్రమేకాక కొంచెము క్షార స్వభావముగల లవణములను (alkaline salts) గూడఁగలిపెదరు. ఈ రంగుల నన్నిటి నీక్రిందఁజెప్పినపాళ్లు దీసికొని యద్దవచ్చును:-

$\frac{1}{4}$ పౌనురంగు	$\frac{1}{4}$ పౌను "సోడాఫాస్ఫేటు"
$\frac{1}{4}$ గ్యాలనునీరు	$\frac{1}{8}$ పౌను "సోడాసల్ఫేటు"
$\frac{3}{4}$ గ్యాలను గంజి	

వీనిని గలిపి యద్దిన తరువాత బట్టల కావిరిపట్టి

గోరువెచ్చని సబ్బునీటిలో నుతికి యెండవేయుదురు.

సోపాధికపు రంగులపద్ధతి (Mordant dye-stuffs):- ఇందు "అలిజరీన్" తరగతి రంగులు ముఖ్యమైనవి. మంజిష్ఠ లేక మదారు చెక్క దీనికి సరియైనమూలిక. దీనిసారమునకును "అలిజరీనుఎరుపు"నకును(alizarine red) భేదమేమియులేదు. వివిధములగు ఉపాధులతో అలిజరీనుఁ గలిపి యద్దిన యెడల వేర్వేరు చాయలు వేయవచ్చును. పటికతో నెరుపు రోజారంగులును, అన్నభేదితో ముదురెరుపును, ఈ రెంటియొక్క మిశ్రణముతోఁ గలిపినప్పుడు జేగురు కపిలవర్ణములను వేయవచ్చును. ఈతరగతిలోఁ జేరినపతంగిచెక్క, కాచు, లాగువుడ్డు, బ్రేజిలువుడ్డులోనగునవి కలంకారీ యద్దకమునం దుపయోగింతురు. ఈ రంగులన్నిటిలో నెరుపువేయుట కష్టము. అద్దకము పూర్తియైన తరువాత మెరుగుఁ బెట్టుటకు కొన్ని యితర పదార్థములుగలిపెదరు. ఇందు ముఖ్యములయినవి నూనె, చింతపండు మరి కొన్ని లవణములు. పటికయు, అన్నభేదియు నీరంగుల కుపాధులుగ వాడెదరని పైనివ్రాసితిమి. ఇవి గంధకద్రావక సంబంధములగు లవణములు. వీనికంటె వినీగరు సంబంధములగు "ఆసిటేట్లు" శ్రేష్ఠములయినవి. వీనితో నద్దిన తరువాత నావిరిపట్టినప్పుడు వినీగరు బట్టలనుండి శీఘ్రముగ విడిపోయి రంగులనాకర్షించెడు భస్మములు (oxides) మాత్రము నిలుచును. ఈ రంగులనద్దెడి పద్ధతులలో మచ్చుకొరకై యొకటి రెండిందుచూపెదము. ఈదిగువనిచ్చిన పాళ్లుస్థిరములుగావు. అద్దకులు తమతమ యిష్టానుసారముగమార్చుచుందురు:

అలిజరీన్ ఎరుపు (ముదురు చాయ — (purple):—

$9\frac{1}{8}$ గ్యాలనులు గంజి,
$\frac{1}{8}$,, అలిజరీను
$\frac{1}{2}$,, వినీగరు
$\frac{1}{8}$,, క్యాల్సియమ్ ఆసిటేటు
$\frac{1}{8}$,, ఐరన్ ఆసిటేటు

అలిజరీను నీలము (alizarine blue) :—

1 పౌను అలిజరీను బ్లూపొడి
1 గ్యాలను నీరు
$3\frac{1}{2}$,, చిక్కని గంజి
$1\frac{1}{2}$,, క్రోమియమ్ ఆసిటేటు

స్వాభావికపు రంగులలోఁ జేరిన "లాగువుడ్డు" (చెక్క) (log wood) తో నలుపద్దుటకు :—

లాగువుడ్డు నలుపు (log wood black) :—

15 పౌనుల గంజి
10 ,, సీమ జిగురు
$4\frac{1}{2}$ గ్యాలనులు నీరు
$\frac{3}{4}$ గ్యాలను వినీగరు
$1\frac{1}{2}$,, లాగువుడ్డు సారము
$\frac{3}{8}$,, క్వెర్సిట్రన్ సారము(Quercitran extract)
వీనిని చక్కఁగా కాచి చల్లారిన తరువాత
$\frac{1}{2}$ పౌను ప్రషియేటు ఆఫ్ పొటాసియము(Red prussiate of potash)
$\frac{1}{4}$ గ్యాలను నీరు
2 ,, క్రోమియమ్ ఆసిటేటు కలిపిననీరు
$\frac{1}{8}$ పౌను పొటాషియమ్ క్లోరేటును



యూరోప్ దేశమందలి పూర్వకాలపు కలంకారీ అద్దకము

గలిపి యద్దెదరు. అద్దకము ముగిసిన తరువాత బట్టల నెండవేసి గంటసేపు ఆవిరిఁబట్టి నీటిలో జాడించెదరు. పొక్కాఁనల్లు పేర్పడును.

అనిలీను క్షారపురంగులు (Basic aniline dyes) :- ఈ రంగులన్నియు కరక్కాయ నీటితోఁ నద్దెదరు. వీనితో నీలము, ఊదా, పసుపు, పచ్చ మున్నగు చాయలు వేయవచ్చును. ఇవి సబ్బులో నుడక వేయునప్పుడు వెలియక పోయినను ఎండసోకినప్పుడు కొంతవఱకు వెల వెలపోవును. రంగును గంజితోఁ గలిపి కరక్కాయ కషాయముతోఁ గలియఁబెట్టి యద్దెదరు. ఎక్కువ మొత్తము తయారు చేయునప్పుడీ మిశ్రణము నుడకఁబెట్టి పక్వము చేయుదురు.

మెథిలీన్ నీలము (Methylene blue) నద్దుటకు:-

2 గ్యాలనులు మెథిలీన్ నీలిరంగు (9 పాళ్లనీరు; 1పాలు రంగు కలిపి కొంచెము వినీగరు కలిపినది)

6 ,, చిక్కని గంజి

1 ,, డాగ్రను జిగురు నీరు

1 ,, గాఢమైన కరక్కాయ కషాయము.

తక్కిన క్షారపు రంగులన్నియు నీరీతినే పాళ్లు గలపఁబడును. అద్దిన తరువాత బట్టల కావిరిపట్టి "ఆంటిమొనిటార్ ట్రేటు" అను లవణము గలిపిన నీటిలో ముంచెదరు. ఇప్పుడు రంగు లెక్కువ పక్కాగానుండును.

నీలిమందుతో నద్దుట (Application of indigo): — కలంకారి యద్దకము నందు నీలిమందద్దుటకు రెండుమూఁడుపద్ధతు లున్నవి. అందు గ్లూకోజు పద్ధతియు, హైడ్రోసల్ఫైటు పద్ధతియు ముఖ్యములయినవి. ఈ పద్ధతులలో నీలిమందు మొట్ట మొదట తెల్లగనుండి బట్టలుముంచి యారవేసిన తరువాత గాలి సోకినప్పుడు నలుపెక్కును.

౧ గ్లూకోజుపద్ధతి:- గ్లూకోజనఁగా నొక విధమైన పంచదార. దీనికి బదులుగ మనదేశములో బెల్లము వాడెదరు. మూఁడుపాళ్లు గ్లూకోజును ఏడుపాళ్లు నీటిలో కరిగించి యానీటిలో బట్టనుముంచి యారవేయుదురు. ఆరిన బట్ట మీఁద రంగుల నీ క్రిందఁజెప్పిన పాళ్లు గలిపి యద్దెదరు.

7½ గ్యాలనులు సోడాక్షారము గలిపిన జిగురు

1 ,, సోడాక్షారము

1½ ,, నీలిమందు(1పాలుమందు; 4౦ పాళ్లనీరు)

ఇట్లద్దిన తరువాత బట్ట కావిరిపట్టి నీడను ఒకటి రెండురోజు లారనిచ్చి చల్లనీటిలో జాడించిన తరువాత సబ్బుపెట్టి మెరుగుఁబెట్టెదరు. ఎఱ్ఱ చీరమీఁద నల్లంచులు, నల్ల చుక్కలుగల బట్ట లీ విధముగనే తయారగును. తెల్ల బట్టకు బదులుగ నెఱ్ఱబట్టమీఁద పైనిఁజెప్పిన విధముగ నీలి యద్దెదరు. నీలిమందుతోఁ గలిపిన సోడా క్షారము ఎరుపురంగును తిని వేయునుగాన అట్టిచోట్ల నీలి చుక్కలుండి బట్టయంతయు నెఱ్ఱగ నుండును.

౨ హైడ్రోసల్ఫైటుపద్ధతి (Hydrosulphite process):- ఇది గ్లూకోజు పద్ధతికంటె

త్వరితముగ జరుగును. ముడి బట్టలనే యద్ద వచ్చును. అందుచేత విశేషముగా వాడుక లోనున్నది. రంగు నీ విధముగ, తయారు చేయవలెను:—

౨౦ పౌన్లు హైడ్రో సల్ఫైటు ౮౫ పౌన్లు సోడాక్షారముతోఁ గలిపి నూరవలెను. తరువాత ౧౫ పౌన్లు నీటియందు ౨౦ పౌన్లు సోడా క్షారముతోఁ గలిపి ప్రత్యేకముగ నూరవలెను. దీనిలో కొంచెము తుమ్మజిగురు గూడవేసి నూరెదరు. ౧౫ పౌన్లు సీమ జిగురును, ౮౫ పౌన్లు సోడాక్షారమును గలిపి వేరుగ నూరెదరు. ఈ మూఁటిని గలిపి యద్దెదరు. అద్దిన తరువాత బట్టల నావిరిఁబట్టి చల్లనీటిలో జాడించి తరువాత వేడి నీటిలోగాని సబ్బులోగాని యుదికి యార వేయుదురు.

ఆజోరంగులు (Azo-colours):— ఇవి దోహదపు రంగులలోఁ జేరినవి. అనఁగా రెండుమూఁడు పదార్థములు గలిపి యద్దిన తరువాత బట్టలమీఁదనే రంగు లేర్పడునుగాని వేర్వేఱుగ నీ పదార్థములు రంగులుగావు. ఈ రంగు లేర్పడుటకు రెండు తరగతుల పదార్థములుకావలెను. నాఫ్థలీను (కల్లరాయుండ లనియు పిలువఁబడునవి) సంబంధ ద్రవ్యములును, "డైయాజో" (Diazo-bodies) అనుమరి యొక పదార్థసంబంధములగు ద్రవ్యములును గలిసి ఆజోరంగులగును. ఈ రంగులతో నెరుపు, రోజా, నారింజ, కపిల, జేగురు, నీలి, నలుపు మున్నగు పక్కారంగులు వేయుదురు. మల్లులను సోడాక్షారములోఁ గలిపి నఫ్తాలు (B-Nappthol) లో ముంచియెండిన తరువాత డైయాజో రంగుతో నద్దెదరు. వేడిసోకినప్పు డీ రంగులు చెడిపోవునుగాన చుట్టు మంచు గడ్డవేసి చల్లగ నుంచెదరు.

గంధకపు రంగులు (Sulphur dyes):— ఇవియు పూతరంగులవలె బట్టల కుపాధులు లేకయే పట్టును. వీనిలో ననేక తరగతులు గలవు. కాని యద్దెడు పద్ధతులలో భేదము లేదు. వీనితో పసుపు, కపిల, ఊదా, నీలి, నలుపు, గోధుమ లోనగు రంగులు వేయ వచ్చును. ఈ రంగులలో గంధక ముండుట చేత నీపేరు గలిగినది. ఈ రంగుల కన్నిటికి నీ క్రింది యోగము వర్తించును.

3 పౌన్లు రంగుపొడి
5 ,, గ్లిసరీను
8 ,, నీరు
10 ,, నాముగడ్డ (సగముగడ్డ సగమునీరు గలిపినది)
4 ,, హైడ్రో సల్ఫైటు
70 ,, సోడాక్షారముతోఁ గలిపిన సీమ జిగురు

వీనిని గలిపి మల్లులమీఁద నద్దవచ్చును. అద్దిన తరువాత నావిరిబట్టి సబ్బు నీటిలో జాడించి యెండవేయుదురు.

అనిలీను నలుపు (Aniline black):— ఈ రంగుతో సాదాయద్దకము వేయు పద్ధతి యిదివరలోఁ జెప్పఁబడినది. ఇది పక్కా రంగు. ఉపాధికముగ నిరుపాధికముగను గూడ వాడవచ్చును. దీనినికూడ దోహదపు రంగని చెప్పవచ్చును. అనిలీను ద్రవపదార్థము ప్రాణవాయువుతో సంయోగముఁజెంది యీ నలు పేర్పడుచున్నది. "సోడియము

క్లోరేటు" అను పదార్థముతోఁ గలుపుట వలన దానికి ప్రాణవాయువు లభించును. ఈ రంగును వేయుమార్గము:—

10 (పౌనులు) గంజి, 2 సేరు జిగురు, 6 పొటాసియమ్ ఫెర్రోసైనైడ్, 7 గ్యాలనులు నీరును గలిపి సలసలకాచి 2¾ పౌనులు సోడియమ్ క్లోరేటు పొడిఁ గలపవలెను. చల్లారిన తరువాత 8¼ పౌనుల అనిలీను రంగును గలిపి యద్దెదరు.

అద్దుట పూర్తియైన పిదప నావిరిఁబట్టి కొంచెము పొటాసియమ్ బైక్రోమేటు గలిపిన నీటిలో ముంచి తరువాత సబ్బుతో జాడించి యెండ వేయుదురు. ఇది నలుపు వేయుటకేగాక మెరుపుమీఁదనట్టి ధూపు ఛాయ వేయుటకుఁగూడ నుపయోగింతురు.

(2) ఉపాధుల పద్ధతి (Printing of mordants):—పూతరంగుల నద్దుటయు, సోపాధిక రంగులైనచో రంగుల నుపాధులతోఁగలిపి యద్దుటయు నిదివరలో వర్ణింపఁబడినవి. ఉపాధులను మాత్ర మద్ది, తరువాత బట్టల సాదా యద్దకము నందువలె నద్దుటగూడ కలదు. ఇట్లద్దినప్పు డుపాధులున్నచోట్ల మాత్రము రంగులంటి తక్కిన బట్టయంతయు తెల్లగ నుండును. ఇది రెండవ పద్ధతి. మిక్కిలి పురాతనమైనది. విశేషముగ వాడుకలో నున్నది. ఈ పద్ధతివలన నద్దెడి రంగులన్నియు సోపాధికపు రంగు లేయని వేఱుగఁ జెప్ప నక్కఱలేదు. ఈ పద్ధతి రెండు విధములుగ విభజింపవచ్చును.

మంజిష్ఠ పద్ధతి (Madder style):— ఈ పద్ధతి ప్రకారము మదారు వేయుటకుగాని తొగరు(?)... అలిజరీను ... రంగులగాని యద్దుదురు. ప్రధానమైన యుపయోగింపబడు యుపాధులు రెండు - అసిటేటు, అన్నభేది. ఈ రెండును రంగుల ద్రావక సంబంధములగు లవణములు. పటికయు కసీసము సంబంధములగు లవణము లక్కువ రీతిగ పనిచేయునవియు అందుచేత పటిక, అన్నభేదికి బదులుగ అల్యూమినియము అసిటేటు, ఐరను అసిటేటులను ఉపాధులుగ నుపయోగింపవలెననియు నిదివరలో వ్రాసియుంటిమి. ప్రధానమైన యుపాధితో నెఱుపు రంగులను, రెండవదానితో నలుపును వేయవచ్చును. ఈ రెంటి మిశ్రణములను వాడిన యెడల నెఱుపునకును, నలుపునకును మధ్యనున్న ఛాయలన్నియు నుత్పత్తి చేయవచ్చును. ఈ రెండుపాధులకును అద్దకులలో సాంకేతిక నామములు గలవు. అల్యూమినియమ్ అసిటేటుతో నెఱుపురంగు వేయుదురుగాన దానిని "ఎఱుపుసార" (Red liquor) మనియు ఐరను అసిటేటులో నలుపు రంగువేయుదురుగాన దానిని "నలుపుసార" (Black liquor) మనియు పిలిచెదరు. కావున నికమీఁద నీసాంకేతిక పదములను వాడినప్పుడా యీ యుపాధులని గ్రహింపవలెను. ఈయుపాధులను జిగురులతోఁ గలిపి యద్ది తరువాత రంగుకషాయములో ముంచెదరు.

ఉపాధుల నద్దుట మిక్కిలి కష్టము. అనుభవజ్ఞులుగాని చాకచక్యముతో నద్దఁజాలరు. చక్కఁగా నద్దినగాని రంగులు మద్దలుకట్టక హెచ్చుతగ్గులు లేకుండ పడవు. అందుచేత నుపాధుల నద్దుటలో నద్దకు లొకటి రెండు విషయములలో నెక్కుడు జాగ్రత్తతో పని చేయుదురు. ఉపాధులనద్దిన తరువాత బట్టలను నీడన ఆలస్యముగ నారనీయవలెను. అట్లుగానిచో నుపాధు లెక్కువగ నెండి రంగుల స్థిరముగ నంటునుగాని సాపుగానంటవు. రంగు కషాయము పలుచనగనుండవలెఁగాని యెక్కువ చిక్కఁగనుండఁగూడదు. అద్దినబట్టలను రంగులో ముంచినప్పుడా కషాయ మెక్కువ వేడిగా నుండక నులి వెచ్చనగనుండవలెను. ఈ విషయము లుపేక్షించినచో బట్టలయందు తెల్లఁగనుండవలసిన చోట్లఁగూడ రంగులంటి తరువాతఁదెలుపుఁ జేయుట దుర్లభమగును. "నలుపుసారము" తో నద్దినప్పుడు రంగులు శీఘ్రముగ నంటును. రంగులయొక్క యుధృతమును తగ్గించుటకై నలుపు సారముతో కొంచెము "ఉల్లిపాషాణము" (White arsenic) కలిపి మరగఁబెట్టెదరు. అద్దినతరువాత రంగు వేయుటకుఁ బూర్వము బట్టల నొక చల్లనిగదిలో రెండుమూఁడు రోజులారనిచ్చెదరు. ఇట్లు చేయుటవలన నుపాధులయందుండు విసిగరు ఇగిరిపోయి రంగులంటుటకు సిద్ధముగనుండును.

నలుపు సారమును ఎరుపు సారమును గలిపి నమిశ్రణములతో నద్ది యనేకఛాయలు వేయవచ్చునని పైని వ్రాయఁబడినది. ఈక్రిందఁ జూపిన పట్టికలోఁ, దెలిపినవిధమున ఎరుపు నలుపు సారములపాళ్లు దీసికొని యద్దిన యెడల నేకకాలమున ఒకేరంగుతో ఆఱు వేర్వేఱు ఛాయలను బట్టపై నుత్పత్తి చేయవచ్చును.

వస్తువులు	ఎరుపు	రోజా	జేగురు తొగరు	ముదు రెరుపు	ఊదా	నలుపు
ఎరుపు సారము	౨ గ్యాలను	3 గ్యాలనులు	౧౦౪ గ్యాలనులు			
నలుపుసారము		...	౧౪ ,,	౧ గ్యాలను	౪ గ్యాలను	౮ గ్యాలనులు
నీరు	...	౮ గ్యాలనులు	...	౧౧ ,,	౧౧౪ ,,	౯ ,,
సీమజిగురు	...	౩౬ పౌనులు	...		౩౬ పౌనులు	
విసిగరు	...	౧ గ్యాలను	...		...	
తగరపు లవణము (Tin crystals)	౧౪ పౌను	౫ పౌను	...		...	
పత్తిగింజలనూనె	౹ గ్యాలను	...	౹ గ్యాలను	౫ గ్యాలను	...	౹ గ్యాలను
గంజి	౧౬ పౌనులు	...	౧౬ పౌనులు	౧౬ పౌనులు	...	౧౬ పౌనులు

ఈ పట్టికలోఁజూపిన యుపాధులు రెండే యైనను (ఎరుపు సారము, నలుపుసారము) రంగునుబట్టి పాళ్లు మారినవి. అందుచేత్త నివి యాఱు ఉపాధులుగనే భావింపనగును. పై పట్టికలో చుక్కలు పొడిచినచోట్ల నేమియు లేదని గ్రహించునది. అనఁగా ఆ యా రంగుల కాయా వస్తువు లక్కర లేదని తెలియనగును.

ఈపట్టికను పరీక్షించి చూచినయెడల కొన్ని ఛాయలకు నలుపుసార మక్కర లేదనియు, కొన్నిటికి నెరుపుసార మక్కర లేదనియు, మరికొన్నిటికి రెండునుగావలెననియుఁ దేలును. ఒక్క పర్యాయ మన్నిరంగులు, ఎట్లుపట్టు నని సంశయము దోపవచ్చును ఒకే గుడ్డ మీఁద నాలు ఉపాధు లున్నట్లుభావించునది. అద్దినతరువాత నొక దానితో నొకటి సంబంధములేకయుండును. ఇట్టి బట్ట రంగునీటిలో ముంచినప్పుడు ఉపాధియొక్క స్థితినిబట్టి రంగుల ఛాయలేర్పడును. ఈ యుపాధుల నద్దుటకు వేర్వేఱు తిరుగుడు యంత్రము లుండును. ఈ యంత్రముయొక్క నిర్మాణమును గూర్చియు, కార్యవిధానమును గూర్చియు నిదివరలో వ్రాసియుంటిమి. ఆఱు వేర్వేఱు ఉపాధుల నద్దుట కిట్టి యంత్రము లాఱు దేనికది ప్రత్యేకముగనుండి యన్నియుఁ గలిసి యొక పెద్ద చట్రమున బంధింపఁబడియుండును. ఈయంత్ర సహాయమున ఆఱుపాధులును ఒకేపర్యాయ మద్దకమగును.

పై పట్టికలోఁ జూపిన యుపాధులను మల్లుల పైనద్ది రెండుమూఁడు రోజులారనిచ్చి యావు పేడలో నూరవేసెదరు. ఊరినబట్టల కద్దకము వేసి నీటిలో జాడించి, సబ్బుతో నుదికి తిరిగి మంచినీటిలో జాడించెదరు. బట్టలకు మెరుఁగుఁ బెట్టుటకుఁ బూర్వము కొంచెము చలువసున్నముఁగలిపిన నీటిలోముంచెదరు. ఇట్లుచేయుట వలన ఉపాధులద్దని చోట్ల నంటిన రంగులు విడిపోవును.

ఉపాధుల నద్ది యూరవేసిన తరువాత రంగులు వేయుటకుఁబూర్వము బట్టలను సీమసున్నము, ఆవుపేడయును గలిపిన నీటిలో నొకటి రెండు గంటలసేపు నానైదరు. ఇట్లు చేయుటవలన నుపాధులతోఁ గలిపినరంగులు విడిపోయి యుపాధులు మాత్రము నిలిచియుండును. ఈస్థితిలో బట్టలు రంగులను జక్కఁగ నాకర్షించును. పేడనీటిని తొట్లలోఁగలిపి బట్టలనందులో నెడ తెగక త్రిప్పుచుందురు. సామాన్యముగ బట్టలను రెండు పర్యాయములు పేడలోనుడికించెదరు. మొదటిపర్యాయమున ఈ క్రిందనిచ్చిన భాగములను దీసికొనవలెను:—

10 గ్యాలనుల నీరు
1 పౌను సీమసున్నము
5 పౌనులు ఆవుపేడ

రెండవపర్యాయ ముడక వేయునప్పుడు,

10 గ్యాలనుల నీరు
$\frac{1}{2}$ పౌను సీమసున్నము
$2\frac{1}{2}$ పౌనులు ఆవుపేడయును

దీసికొని చక్కఁగఁగలిపి నిమ్మళముగ నుడక వేయవలెను. పేడలో నుడక వేసిన బట్టలను మంచినీటిలో జాడించి తరువాత నెర్రరంగు వేయుదురు. రంగువేయుట కుపయోగించెడి తొట్లు సాదాయద్దకమునందు వర్ణింపఁబడినవి. ఈ తొట్లపై కొయ్యల నడ్డముగ వేసి బట్టలను వానికి వ్రేలాడవేయుదురు. అప్పుడు

బట్టలో చాలభాగము రంగులోను కొంత భాగము రంగు వెలుపలను ఉండును. కొయ్యలను తరుచుగ త్రిప్పుటవలన బట్టలను పూర్తిగ రంగులో మునుగులాగు చేయవచ్చును. రంగు, సీమసున్నము, సర్వీసు (Glue) గలిపిన కషాయము, రంగు తొట్టిలో నుండును. వీనిపాళ్లు రంగువేయుటకుఁ గావలసిన బట్టయొక్క విస్తీర్ణమునుబట్టి యుండును. బట్టలో సగముభాగము రంగువేయవలసివచ్చినప్పుడీ క్రింది భాగములను దీసికొందురు.

$4\frac{1}{2}$ తులములు రంగు

$1\frac{1}{2}$ తులములు కాల్సియమ్ ఆసిటేటు

10 తులములు సర్వీసును

నూరుతులముల యెత్తుగల బట్టనద్దుటకుతగినంత నీటిలోఁ గలిపి బట్టల నందులోముంచి క్రమక్రమముగ నుడకబెట్టెదరు.

ఇట్లు రంగు వేయుటకు రమారమి రెండు గంటలు పట్టును. రంగు వేసిన తరువాత బట్టలను సబ్బులోనుదికి యెండ వేయుదురు.

ఇతరయుపాధులతో నద్దుట:—

మంజిష్టపద్ధతిలో వాడఁబడెడి యుపాధుల రెంటినిగూర్చి పైని వ్రాయఁబడినది. ఇదిగాక ఈపద్ధతి ప్రకారము రంగులద్దుటకు మరి కొన్నియుపాధులు గలవు. వీనిలో కరక్కాయనీరు, క్రోమియమ్ అనుధాతు సంబంధములగు నుపాధుల్ను, నాఫ్తాల్ అనునవిముఖ్యములయినవి. కరక్కాయల సారముతోనద్దుటకు

5 షౌనులు కరక్కాయలసారము

1 గ్యాలను వినీగరు

9 గ్యాలనులు గంజియ్ను, డ్రాగనుజిగురును

గలిపిన పాకమును, జక్కగఁ గలిపి యద్దిన తరువాత బట్టల నెండవేయుదురు. ఉపాధులను బట్టలకు బాగుగ బంధించుటకై.


1 పౌనుటార్టార్ ఎమెటిక్ (Tartar emetic- సౌవీరమును, పొటాసు క్షారమును, చింతపండు పులుసును, గలిపి తయారు చేసిన లవణము.)

$\frac{1}{2}$ పౌను సీమసున్నము


8 గ్యాలనులు నీరును

గలిపి బట్టలను దానిలో ముంచెదరు. ఎండినతరువాత నీబట్టలకు అనిలీను క్షారపురంగుల వేనినైనను అద్దవచ్చును. క్రోమియము సంబంధములగు నుపాధులలో క్రోమియమ్ క్రోమేటును (Chromium chromate) క్రోమియమ్ ఆసిటేటును(Chromium acetate) ముఖ్యములు. వీనిని గంజితోగాని తుమ్మ బంకతోగాని గలిపి యద్దిన తరవాత సోడాపొడి నీటిలో బట్టలనుముంచెదరు. ఇట్లు చేయుటవలన నుపాధి బట్టలకు బంధింపఁబడును. క్రోమియమ్ ఆసిటేటుతోనద్దిన బట్టలను సోడా నీటిలో నుడకవేయుటకుఁ బూర్వము ఆవిరిఁ బట్టుదురు. ఈయుపాధులతో సోపాధికపు రంగులన్నియు నద్దవచ్చును. రంగులలో నుడక వేయుటయందు పైనిఁజెప్పిన మంజిష్టపద్ధతికిని దీనికిని భేదములేదు.

బందరులో నుపయోగించు అచ్చుపుష్పములు



౫-వ పటము



౬-వ పటము

3 వివర్ణపద్ధతి (Discharge style):—

ఇదివరలో రెండుపద్ధతులు వర్ణింపఁబడినవి. అందు రెండవదానికి నుపాధిపద్ధతికి సరియైన వ్యతిరిక్తమని వివర్ణపద్ధతిని చెప్పవచ్చును. ఉపాధిపద్ధతిలో తెల్లబట్ట మీఁద రంగుబొమ్మలుండును. వివర్ణపద్ధతిలో రంగుబట్ట మీఁద తెల్లబొమ్మలువచ్చును. ఉపాధిపద్ధతిలో రంగు లుండవలసినచోట్ల నుపాధుల నద్ది రంగుకషాయములో బట్టనుముంచుటవలన నాయాచోట్ల రంగులంటును. వివర్ణపద్ధతి ప్రకారము బట్టకుయెందుగ సాదాయద్ద కము వేసి తెల్లబొమ్మలు రావలసినచోట్ల "వివర్ణకర ములు" (Discharges) అనఁగా రంగులను పోఁగొట్టు పదార్థములను అద్దెదరు. ఇట్లు చేయుటవలన వివర్ణకరముల నద్దినచోట్ల రంగులు విడిపోయి రంగు బట్టమీఁద తెల్లనిబొమ్మ లేర్పడును. లేదా మరియొక రీతిని యిదేఫలమును బొందవచ్చును. సాదాయద్ద కమునకుముందు బట్టను ఉపాధినీటిలో ముంచి యెండిన తరువాత నుపాధి నిర్మూలనములను (వివర్ణకరములను- ఉపాధుల గుణమును నశింపఁజేయునవి) బట్టపై నద్దె దరు. అప్పుడట్టిబట్టను రంగు కషాయములో ముంచిన యెడల నుపాధి నిర్మూలముల నద్దినచోట్లు తెల్లఁగ నుండి తక్కినబట్టంతయు రంగుఁగలిగి యుండును. ఇప్పుడును గూడ రంగుబట్టమీఁద తెల్లబొమ్మ లేర్పడును.

ప్రస్తుతమునం దీపద్ధతి మిక్కిలి ప్రాముఖ్యముఁ జెంది యున్నది. ఈపద్ధతివలన బట్టలమీఁద నద్దిన రంగులనుగాని యుపాధులనుగాని కోరినచోట్ల నిర్మూ లము చేయుటకు వీలగుచున్నది. రంగు బట్టలమీఁద తెల్లబొమ్మలనుగాని వేఱురంగుఁగల బొమ్మలనుగాని యద్దుట సాధ్యమగుచున్నది. ఇంతియగాక యీపద్ధతి నద్దినరంగులు ఇతరమార్గముల వేసిన రంగుల కంటె నెక్కువ కాంతిఁగలవిగ నగుపడును.

కోరినచోట్ల రంగులను గాని యుపాధులను గాని పోఁగొట్టెడి పదార్థములకు "వివర్ణకరముల"ను పేరు పైనిఁబెట్టఁబడినది. ఇందు ముఖ్యములై తరుచుగ వాడుకలోనున్న వివర్ణకరముల నిచ్చట చెప్పెదము:- చింతపండు ద్రావకము (Tartaric acid), నిమ్మ పండు ద్రావకము (Citric acid - నిమ్మయుప్పు), ఆక్సాలిక్ ద్రావకము (Oxalic acid), సోడాక్షారము (Sodium hydroxide), పొటాసియమ్ డైక్రోమేటు (Potassium dichromate), సోడియమ్ బైసల్ఫైటు (Sodium bisulphite), టిన్ క్లోరైడు (Stannous chloride), తుత్తినాగపుపొడి (Zinc dust) రంగులయొక్కయు ఉపాధులయొక్కయు తత్త్వము లనుబట్టి తన్నిర్మూలమునకై వాడెడి వివర్ణకరము గూడ మారుచుండును. ఇచ్చట కొన్ని యుపాధులను రంగులను వానినిపోఁగొట్టుటకు వాడెడి వివర్ణకర ములను చెప్పఁబడును.

పటిక ; అన్నభేది: - ఈ యుపాధులనుగాని యిదివరలోఁ జెప్పఁబడిన వీనిసంబంధములగు ఆసి టేట్లుగాని పోఁగొట్టుటకు నిమ్మఉప్పు చింతపండు వాడెదరు. బట్టల నుపాధులలో ముంచి యెండవేయు దురు. తరువాత నిమ్మయుప్పుగాని చింతపండు పులుసు గాని బంకమట్టితో చిక్కఁజేసి యారినబట్టపై నద్దెదరు. అద్దిన తరువాత బట్టకావిరిబట్టి యావుపేడ లో నుడకవేసిన పిదప యథాప్రకారముగ రంగు నీటి లో ముంచెదరు. ఈ ద్రావకములు (పులుసువస్తువులు) అద్దినచోట్ల యుపాధులు కరిగిపోయి రంగు వేసినప్పుడు తెల్లఁగ నిలిచియుండును. తక్కినచోట్ల రంగం టును. ఈ విధముగ రంగు గుడ్డపై తెల్లని బొమ్మ లేర్పడును. ఇందు పైనిజెప్పిన మంజిష్టపద్ధతి ప్రకా రము రంగు వేయఁబడును.

ఈరీతినే సౌవీర సంబంధములగు నుపాధులను (Antimony mordants) పోఁగొట్టుటకు సోడాక్షార మును, క్రోమియము సంబంధములగు నుపాధులకు (Chromium mordants) నిమ్మపులుసుమగాని, సోడి యము క్లోరేటు, పొటాసియమ్ ఫెర్రోసైనైడులను (Sodium chlorate and yellow prussiate

of potash) గాని వాడవలెను. ఇవి యుపాధులను పోఁగొట్టి రంగులద్దెడి పద్ధతులు. సాదాయద్దకము వేసినతరువాత కోరినచోట్ల నిరంగుఁగావించుటయు వేఱురంగుల నద్దుటయుఁగూడ కలదు.

టర్కీ-యెఱుపుపై తెలుపద్దుట:-నిమ్మఉప్పును జిగుర్లతోఁగలిపి యెఱ్ఱబట్టపై నద్ది యెండిన తరువాత చలువసున్నపు నీటిలో (Bleaching powder) ముంచవలెను. అప్పుడు బట్టంతయు నెఱ్ఱఁగనుండి యద్దిన చోట్లుమాత్రమే తెల్లఁగనుండును. చలువసున్నము బట్టనంతయు చలువసేయునుగదా యెఱుపెట్లు నిలుచునని శంకగలుగవచ్చును. ద్రావక సంబంధములగు పులుపువస్తువులతోఁ గలిసినప్పుడే చలువసున్నము పని చేయును, అందుచేత నిమ్మకాయపులుసు నద్దినచోట్లే తెల్లనగును. ఇందుకు పాళ్లు:—

6 పౌనులు నిమ్మపులుసు గాని చింతపండుపులుసుగాని

1 గ్యాలను నీరు

4 పౌనులు సీమజిగురు.

వీనిని గలిపి మరఁగఁబెట్టి యద్దవలెను. టర్కీ-యెఱుపుమీఁద పసుపద్దవచ్చును. ఇందుకు సీసపు సంబంధములగు లవణములను వివర్ణకరములతోఁగలిపి యద్దవలెను. పసుపద్దుటకు:—

15 పౌనులు సీమ జిగురు

$1\frac{1}{2}$ గ్యాలనులు సీమ జిగురు పాకము (నీటితోఁ గలిపినది)

$2\frac{1}{2}$ గ్యాలనులు నీరు

20 పౌనులు చింతపండు పులుసు

12 పౌనులు లెడ్నైట్రేటు (సీస సంబంధమగు లవణము) వీనిని గలిపి, యద్ది, ఆరిన తరువాత బట్టను చలువసున్నపు నీటిలోముంచి యెండనిచ్చి చివరకు పొటాసియమ్ బైక్రోమేటు నీటిలో ముంచెదరు. అప్పుడు సీసము క్రోమేటుతో సంయోగించి "క్రోమ్ పసుపు" (Chrome yellow) ఏర్పడును, అనఁగా నెఱుపు బట్టమీఁద పసుపురంగద్దకమగును. ఇట్లే, వివిధ పదార్థముల నద్ది యెఱుపుమీఁద తెలుపు, నీలి, పసరు, పసుపు మున్నగు రంగులు లేకేబట్టపై వివర్ణపద్ధతి మూలమునఁ దెప్పించవచ్చును.

నీలిమందుతో కలంకారీ యద్దకము చేయుట మన దేశములో ననాదిగ వాడుకలో నున్నది. నీలిమీఁద తెలుపద్దుటయు, తెలుపుమీఁద నీలినద్దుటయు ముఖ్యములయినవి. దీనికి విదేశీయులు "చీనానీలిపద్ధతి" (China blue style) యని పేరిడిరి. ఈపద్ధతిలో తెల్లబట్టలమీఁద చక్కని నీలిబొమ్మలద్దకమగును. ఇందుకు నీలిమందును అన్నభేదితోఁ గలిపి తెల్లబట్టపై నద్దుదురు. అద్దినబట్టను మొదట సున్నపుతేటలోను, తరువాత అన్నభేది నీటిలోను ముంచి యారవేయునప్పు డద్దినచోట్లకు నీలి రంగంటును. గాఁగు తేటగఁ గనఁబడుటకు నీలిమందుతో కొంచెము తాళకము (orpiment) గూడ కలిపెదరు.

ఎరుపుమీఁదవలె నీలిమీఁదఁగూడ తెలుపునుగాని యితర వర్ణములగాని యద్దవచ్చును. ఇందుకు రెండు విధములు గలవు. మొదటిదానిలో 'సోడియమ్క్లోరేటు' (sodium chlorate) వివర్ణకరము. దీనిని పొటాసియమ్ ఫెర్రోసైనైడ్తోను నిమ్మపులుసుతోను గలిపి యద్ది తరువాత బట్టల నావిరిఁబెట్టెదరు. రెండవపద్ధతిలో వివర్ణకరము పోటాసియమ్ క్రోమేటు (Potassium chromate). దీనిని సరియైన జిగుర్లతోఁగలిపి యద్దిన తరువాత బట్టలను గంధకద్రావకమును, ఆక్సాలిక్ ద్రావకమును గలిపిన వేడినీటిలో ముంచెదరు. కాని యీపద్ధతిలో గంధకద్రావకమువలన బట్టలకు సత్తువ తగ్గును. ఈ రెండుపద్ధతులవలన నీలి బట్టపై తెల్ల బొమ్మలువచ్చును. వివర్ణములతో పూతరంగులను (Pigment colours) గలిపి యద్దినయెడల నీలిపై వేర్వేఱు రంగుల నద్దవచ్చును.

ఇట్లే గంధకపురంగులు, క్షారపురంగులు మున్నగు కల్పితపురంగుల నన్నిటిని వానికై యేర్పడిన వివర్ణకరములచేత విడఁగొట్టి రంగుబట్టలమీఁద తెలుపద్దకము వేయవచ్చును.

4. ఆవిరి పద్ధతి (Steam style):—

ఇది యొక నూతనపద్ధతి. ౧౭౮౦-వ సంవత్సరములో మొదట వాడుకలోనికి వచ్చెను. రంగులను గాని యుపాధులను గాని బట్టలకు బంధించుటకై యావిరి నుపయోగించినయెడల యావిరి పద్ధతి యనవచ్చును. ఈ పద్ధతి కుదాహరణములు పైని చాలవఱకుఁ జెప్పఁబడినవి. ఈ పద్ధతి ముఖ్యముగ సోపాధికపు రంగుల నద్దుట కుపయోగపడుచున్నది. రంగును, ఉపాధిని జిగురుతోఁ గలిపి యద్దినమాత్రమున రంగు బట్టకంటదు. కాని యద్దినబట్టను ఆరనిచ్చి తరువాత నావిరిఁ బట్టినయెడల రంగుపట్టును. ఆవిరి పట్టిన తరువాత నంటుటచే నిట్టి రంగులకు "ఆవిరిరంగులు" (Steam Colours) అను పేరుగూడ కలదు. అద్దకముయొక్క వేగము తగ్గించుటకు రంగులతో కొంచెము వినీగరును, కరక్కాయల సారమును గలిపెదరు. నూనెఁగలిపి యుడుకవేసిన బట్టపై రంగుల నద్ది తరువాత నావిరిఁ బట్టెదరు. రంగులు చక్కఁగ నంటిన తరువాత బట్టలను సబ్బుతో నుతికి యెండవేయుదురు.

ఆవిరి పట్టకమునుపే యంటెడునవి యావిరి రంగులనిపించుకొనవు. "ఆవిరి నీలము" (Steam blue) వేయుటకు నీలి మందవసరములేదు. పొటాసియమ్ ఫెర్రోసైనైడు, చింతపండు గుజ్జు, గంధక ద్రావకములను గంజితో పక్వముచేసి యద్దిన తరువాత బట్టలను గాలి కారనిచ్చి యరగంటసేపు ఆవిరిఁ బట్టిన నీలి రంగువచ్చును. ఇట్లే "ఆవిరి పసుపు" (Steam Yellow), "ఆవిరి పసరు" (Steam Green), "ఆవిరి యెరుపు" (Steam red) మున్నగు రంగులు గలవు. అనఁగా నీ రంగులు అద్దిన మాత్రముచేత బట్టల కంటక యావిరిఁబట్టి నప్పుడే యంటునని గ్రహించునది.

5. నిరోధ పద్ధతి (Resist or reserve style):—

ఇదియు నొక ముఖ్యమైన పద్ధతియె. ఉపాధుల నద్దినప్పుడు బట్టలు రంగుల నాకర్షించునట్లు మరికొన్ని పదార్థముల నద్ది నప్పుడు బట్టలు రంగులను తమ దరిఁ జేరకుండఁ జేయును. బట్టలకు రంగు లంటకుండఁ జేయు సామర్థ్యముగల పదార్థములకు "నిరోధములు" (resists or reserves) అని పేరు. నిరోధములను బట్టపై నద్ది యా బట్టకు రంగు వేసినయెడల నా యద్దిన చోట్లకుఁ దప్ప తక్కిన ప్రదేశము లన్నిటికిని రంగంటును. రంగులనుగాని రంగు వేయుటకు సాధనములైన యుపాధులనుగాని బట్టల కంటకుండఁ జేయుటకే నిరోధముల నుపయోగింతురు. ఇదివరలో వ్రాయఁబడిన వివర్ణ పద్ధతియు, నిరోధ పద్ధతియు నొకటేయని మొదట తోపవచ్చును. కాని యా రెంటికి కొంచెము భేదమున్నది. వివర్ణ పద్ధతిలో బట్టలకు వేసిన రంగులను అద్దకుని యిష్టప్రకారము చ్చోటచ్చోట విడిపోవునట్లు చేయును. నిరోధ పద్ధతిలో నద్దకుని యిష్టము వచ్చిన చోట్ల బట్టలకు రంగు లంటకుండఁ జేయును.

కొన్ని రంగుల నద్దుటకు మాత్రము నిరోధ పద్ధతి నవలంబింతురు; మంజిష్ఠ, ఆలి జరీను ఎరుపు, కొన్ని క్షారపు రంగులు, నీలిమందు, అజో రంగులు, గంధకపు రంగులు. అని వీనునలుపురంగుల నద్దుటకు సామాన్యముగ నిరోధముల నుపయోగించెదరు.

నిరోధములు నాలుగు విధములు. ఇందు క్రొవ్వుఁ సంబంధములగు పదార్థములతోఁ జేసిన నిరోధములు మొదటి తరగతిలోనివి. మైనము, క్రొవ్వు, గుగ్గిలము, తుమ్మజిగురు, కొబ్బెర నూనెలో నగు పదార్థము లిందులోఁ గలియును. ఇవి ముఖ్యముగ పట్టు, ఉన్ని లయద్దకములయం దుపయోగింతురుగాని నూలుబట్టల యద్దకమునందు తరుచుగ వాడరు. వీనిని "తైల నిరోధములు" (Fatty resists) అన వచ్చును.

నీలి మందద్దుట యందు మైలతుత్తమును గాని, రాగి చిలుము (Verdigris) ను గాని నిరోధములుగ వాడెదరు. వీనిని బంకమట్టితోను, తుమ్మ జిగురు

తోను నూరి యద్దెదరు. ఇవి యద్దినచోట్ల నీలి రంగంటక బట్ట తెల్లఁగ నుండును. అందుచేత వీనిని "శ్వేత నిరోధములు" (White resists) అందురు.

సవర్ణనిరోధములు (Coloured resists) అనునవి మూఁడవ తరగతిలోనివి. వీని నద్దుటవలన నాయా ప్రదేశముల నీలి రంగంటక పోవుటయే కాక యితరరంగు లతుకునట్లు చేయవచ్చును. ఈ రీతిని నీలిగుడ్డమీఁద క్రోమ పసుపును, మందారపు రంగును అద్ద వచ్చును. నిరోధములను మరియొక రీతిని వాడుట కూడ కలదు. ఎఱుపు వేయుటకు వాడెడి యుపాధులను నీలి యద్దకమునం దుపయోగించెడి నిరోధములతోఁ గలిపి యద్దియుండుగ నీలితొట్టిలో ముంచెదరు. అప్పుడు నీలి బట్టమీఁద తెల్లబొమ్మ లేర్పడును. తరువాత నట్టి గుడ్డ కెరుపు వేసిన యెడల నీలిబట్టమీఁద నెరుపు బొమ్మ లద్దకమగును. ఈ పద్ధతివలన పక్కా రంగులు గూడ వేయుటకు వీలగుటచేత నిది విస్తారముగ వాడుకలో నున్నది. ఇందుపయోగించెడివి శ్వేత నిరోధములు.

పటికకు అన్నభేదికి నిరోధములు:—

ఈ యుపాధుల నంటకుండఁ జేయుటకు రెండుమూఁడు పదార్థములు గలవు. సామాన్యముగ పటికకు "సోడియమ్ సిట్రేటు" ను (Sodium citrate—సోడా క్షారమును నిమ్మయుప్పుతోఁ గలుపునప్పు డేర్పడు లవణము) అన్నభేదికి నిమ్మయుప్పును చింతపండుపులుసును (tartaric acid) గలిపిన మిశ్రణమును నిరోధములుగ వాడెదరు. మొట్టమొదట బట్టలను ఈ నిరోధములతో నద్ది యెండిన తరువాత నుపాధులతో నద్దెదరు. తరువాత బట్టల కావిరిబట్టి, పేడలో నుడక వేసి యుతికినతరువాత రంగు వేయుదురు. నిరోధము లద్దినచోట్లమాత్రము తెలుపుగనుండి తక్కినప్రదేశముల రంగంటును. ఈ పద్ధతివలన సాదారంగు బట్టమీఁద తెల్లబొమ్మలుగాని, రంగుబొమ్మలమధ్యను తెల్లబొమ్మలుగాని యద్దకుని యిష్టానుసారముగ తెప్పింపవచ్చును, బట్ట నంతయు నుపాధులలో ముంచుటకు బదులుగ బొమ్మలు చెక్కిన పలకలతో నద్దిన యెడల రంగులు వేసినప్పుడా బొమ్మలే యేర్పడును. ఇట్లు వేర్వేఱు నిరోధములను దీసికొని యొకేపర్యాయము ఎరుపు, నలుపు, ధూమ్రపు, తెలుపు రంగులను బట్టల కద్దవచ్చును.

అలిజెరీను ఎరుపు, రోజాలకు నిరోధములు:—

ఈ రంగులకు "క్రోమియమ్ సిట్రేటును" గాని, లేక సోడియమ్ సిట్రేటుతో దీనిని గలిపి కాని నిరోధములుగ వాడెదరు. మొట్టమొదట బట్టను నూనెతో తయారు చేసి యీదిగువ నిచ్చిన పాళ్లతో నిరోధ మిశ్రణమును సిద్ధముచేసి యద్దెదరు:—

20 పౌనులు జిగటమట్టి
1 గ్యాలను సోడియమ్ సిట్రేటు గలిపిన నీరు
1 ,, క్రోమియమ్ సిట్రేటు గలిపిన నీరు
1 ,, నీరు
5 ,, సిమజిగురు పాకము

వీనితో నద్దిన తరువాత బట్టల నెండనిచ్చి "అలిజరీను రోజా" (Olijarine Pink) రంగునద్ది యెండిన తరువాత నావిరిబట్టెదరు. అటుపిమ్మట బట్టలను సబ్బులో నుడక వేసి యెండనిచ్చెదరు. నిరోధముల నద్దినచోట్ల మాత్రము తెల్లఁగనుండి బట్ట కంతయు రోజారంగంటును.

"ఆజో రంగులకు" నిరోధములు:—

ఇందుకు ముఖ్యముగ వాడఁబడు నిరోధము 'స్టానస్ క్లోరైడ్' (Stannous chloride —తగరమును శంఖ ద్రావకములో కరిగించఁగా వచ్చిన లవణము). ఇందుకుఁగాను, ౫ గ్యాలనులు సెనిగాలు జిగురు నీరు, 30 పౌనులు స్టానస్ క్లోరైడ్, 5 పౌనులు చింతపండు పులుసును గలిపి బట్టపై నద్ది యెండిన తరువాత రంగుల నద్దెదరు. ఆరిన తరువాత బట్టలను సబ్బులో నుడక వేసి యెండ వేయుదురు.

ఈ రీతిని రంగులయొక్క తత్త్వములను బట్టి నిరోధములు మారుచుండును. ఇట్లు క్షారపు రంగులకు

గంధకపు రంగులకు నిరోధములు వేర్వేఱుగ నుండును కాని యద్దెడు పద్ధతు లొకటియే. నిరోధముల పాళ్లు మాత్రము మారుచుండును. కాని నిరోధ పద్ధతి ప్రకారము నీలిమందు నద్దుట మిక్కిలి పురాతనముగ వాడుకలో నుండుటచేత దానిని గూర్చి యిచ్చట వ్రాసెదము.

నీలి మందునకు నిరోధములు:—విస్తారముగ ప్రాణవాయువును గలిగియున్న వస్తువులు (Oxidising agents) నీలి మందద్దకము నందు నిరోధములుగ పనిచేయును. వీనికిఁ దోడుగ మరికొన్ని లవణములును (Salts), జిగుర్లును, కొవ్వు పదార్థములును, గంజి లోనగు పాకములును గలిపి యద్దెదరు.

తెలుపు నిలుచుటకు:—

15 పౌనులు మైదాపిండిని. 6 గ్యాలనుల నీటిలోఁ గలిపి, కాచి, చల్లారిన తరువాత,

18 పౌనులు మైలతుత్తపు పొడి,

$2\frac{1}{2}$ పౌనులు "కాపరునైట్రేటు" (Copper nitrate—రాగిని నైట్రేటు ద్రావకములోఁ కరిగించినది)

1 పైంటు అలిజరీను నూనె, వీనిని పైనిఁ జెప్పిన మైదాపిండి జావతోఁ గలపవలెను.

పసుపు రంగు నిలుచుటకు:—

$2\frac{3}{4}$ గ్యాలనులు సీమ జిగురు పాకము.

38 పౌనులు "లెడ్ సల్ఫేటు", (Lead sulphate—సీసమును గంధక ద్రావకమును గలియఁగా నేర్పడిన లవణము)

18 పౌనులు "జింక్ సల్ఫేటు" (Zinc sulphate—తుత్తినాగమును, గంధక ద్రావకముఁ గలిసినది.)

22 పౌనులు, 'లెడ్ నైట్రేట్' (Lead nitrate—సీసము నైట్రేట్ ద్రావకముతోఁ గలిసినది.)

ఇచ్చట నిచ్చిన రెండు యోగముల ప్రకారము నిరోధములను తయారుచేసి బట్టపై వేర్వేఱుగనద్ది, యెండిన తరువాత నీలిమందులో ముంచెదరు. నీలిమందునకు కొంచెము గంధక ద్రావకముఁగూడ కలిపెదరు. నీలి యద్దిన తరువాత బట్టను "సోడియమ్ బైక్రోమేటు" (Bichromate of soda) గలిపిననీటిలో ముంచెదరు. అప్పుడు పసుపు నిరోధమునద్దినచోట్ల (రెండవయోగము) పసుపురంగును, మొదటి నిరోధము నద్దినచోట్ల తెలుపును, బట్టయంతయు నీలియును నిలిచియుండును.

అనిలీను నలుపురంగునకు నిరోధములు:—

ఈ నలుపునంటకుండఁ జేయుట కనేక నిరోధములు గలవు. ముఖ్యముగ సోడాక్షారము, సోడాపొడి, సోడియమ్ సల్ఫైటు, తుత్తనాగభస్మము (Zinc oxide) లోనగునవి వాడెదరు. నలుపుబట్టలమీఁద తెలుపునిలుచుటకు గాని లేక యితర రంగులు నిలుచుటకు గాని యీనిరోధములవాడెదరు. అనిలీను నలుపు దోహదపు రంగులలో నొకటని యిదివరలో వ్రాయఁబడినది. కలంకారీ యద్దకమునందు రంగునద్దిన తరువాతనైన నిరోధముల నద్దవచ్చును, లేదా తెల్లబట్టపై నిరోధముల ముందుగనద్ది తరువాత రంగు వేయవచ్చును. మొదట పద్ధతిలో రంగు నలుపవన్నె కుమారక పూర్వమే నిరోధముల నద్దవలెను. నలుపెక్కిన తరువాత నిరోధములనద్దినచో నద్దకము చెడిపోవును.

మొదటిపద్ధతి రంగు కషాయము తయారుచేయుట:—24 పౌనులు "అనిలీన్ హైడ్రోక్లోరైడ్" (aniline hydrochloride).

$8\frac{1}{2}$ పౌనులు సోడియమ్ క్లోరేటు.

4 పౌనులు పొటాసియమ్ ఫెర్రోసైనైడ్.

10 గ్యాలనులు నీరు.

ఇవి కలిపిన రంగు కషాయములో బట్టనుముంచి వేడిగాలిలో నెండవేయవలెను. ఎండిన తరువాత నిరోధములనద్ది కొంచెము సేపు ఆవిరిపట్టి "పొటాసియమ్ బైక్రోమేటు" (Potassium bichromate) నీటిలో ముంచెదరు. తరువాత బట్టలను చక్కఁగ సబ్బునీటిలో జాడించి యెండవేయుదురు. ఆవిరిపట్టునప్పుడు బట్టకు నలుపెక్కును. నిరోధములద్దినచోట్ల

మాత్రము నలుపంటదు. అనిలీను నలుపునకు నిరోధమును తయారుచేయుపద్ధతి రెండు విధములు. తెలుపు నిలుచుటకు:—

మొదటిభాగము:-

8 పౌనులు గంధి

8 ,, సీమజిగురు

80 ,, పొటాసియమ్ సల్ఫైటు (Potassium sulphite.)

15 ,, సోడా అసిటేటు.

10 ,, సోడియమ్ బైసల్ఫైటు.

8 గ్యాలనులునీరు.

వీనిని గలిపి మురగబెట్టవలెను.

రెండవభాగము:—

10 పౌనులు తుత్తనాగభస్మము.

1½ గ్యాలనులు మెగ్నీసియమ్ అసిటేటు నీరు.

2½ ,, ద్రాగనుజిగురు పాకము.

1 ,, గంజిపాకము.

అద్దకమునందు నాలుగుపాళ్లు మొదటిభాగములోనిది, ఆరుపాళ్లు రెండవభాగములోనిది, నాలుగుపాళ్లు గంజితోఁగలిపి రంగువేసిన బట్టపైనద్దెదరు. అప్పుడు నల్లబట్టపై తెలుపద్దకమగును.

రెండవ పద్ధతి:—

ఈపద్ధతి ప్రకారము తెల్లబట్టపై ముందుగ నిరోధములనద్ది తరువాత రంగులో ముంచెదరు. నలుపుమీఁద పసుపు నద్దుటకు:—

40 పౌనులు క్రోముపసుపురంగు.

8½ గ్యాలనులు అల్బ్యుమినునీరు (4 పాళ్లు అల్బ్యుమిను, 6 పాళ్లునీరు).

2½ గ్యాలనులు ద్రాగను జిగురునీరు (గ్యాలనుకు 6 జౌన్సులచొప్పున).

6 పౌనులు సోడాపొడి.

1 గ్యాలను సోడియమ్ సిట్రేటు గలిపిన నీరు. వీనిని గలిపి తెల్లబట్టపైనద్ది యెండినతరువాత పైనిచెప్పిన రీతిని రంగు కషాయములో ముంచెదరు. అప్పుడు నలుపు మీఁద తెలుపద్దకమగును.

అద్దిన బట్టలను సరిచేయుట

అద్దకము ముగిసిన తరువాత బట్టలను సాఫుచేసి మెరుగుఁబెట్టుటకు చేయవలసిన పనులు చాలగలవు. అద్దకానంతరపు పనులు బట్టలయొక్క తత్త్వమును బట్టియు వేసిన రంగులనుబట్టియు మారుచుండును. ఇందు ముఖ్యమైనవి యావిరిపట్టుట, ఆవిరిగదిలో నారనిచ్చుట, ఆవుపేడలో నుడకవేయుట, సిమసున్నపు నీటిలో నాన్చుట, నీటిలో జాడించుట, సబ్బుపెట్టుట, మాలిన్యములను పోఁగొట్టి మెరుగుఁబెట్టుట.

అన్ని విధములగు బట్టలకును ఆవిరిబట్టుట యవసరము. అజో రంగులతో నద్దిన బట్టలకుమాత్ర మవసరములేదు. పైనిచెప్పిన పనులన్నియు యంత్రసహాయమువలనఁ జేయఁబడును. ఆవిరిఁబట్టుటకు రెండు మూఁడు రకముల యంత్రములుగలవు. ఇందొకటి "చలువ సేయుట" లోను, "సాదాయద్దకము" క్రిందను వర్ణింపఁబడినది. సామాన్యముగ కొంచము సేపు ఆవిరిపట్టుట కొక యంత్రమును చాలసేపావిరిపట్టవలెనన్న మరియొక యంత్రమును వాడెదరు. సాధారణముగ నీ యంత్రములో బట్టల నొకగంట యుంచెదరు. కాని యెంతసేపుంచినను బట్టలు చెడిపోకుండుటకు నేర్పాటుగలదు.

ఆవిరిగదిలో నెండించుట:— ఇది యొక యెత్తైనగది. పైనిబట్టలు తగిలించుటకు కొయ్యతోఁ జేసిన వంకెలుండును. క్రిందిభాగమున కొంచె కొంచముగ నావిరిఁబాఫుటకు గొట్టములుండును. ఈగదిలో పలివేడిమి శరీరము ఓర్చతగినంత యుండును. ఆవిరిఁబట్టినగుడ్డ లిట్టిగదులలో నారనిచ్చెదరు.

ఆవుపేడలో నుడకవేయుట:— ఇదివరలో సాదాయద్దకము క్రింద వర్ణింపఁబడినటువంటి తొట్లలో నీపనిజరుగును. వానిలో వలె నిచ్చటకూడ తొట్ల

యొక్క క్రిందిభాగమున బిగించియున్న గొట్టముల గుండ ఆవిరి ప్రవహింపఁజేసి బట్టల నుడకఁబెట్టెదరు.

సీమసున్నములో నాన్చుట :—ఇది ప్రతి విధమైన బట్టకు నక్కరలేదు. కరక్కాయ లుపాధులుగా వాడి యద్దిన బట్టలకు మాత్ర మీపని యవసరము. ఇందు,

1 పౌను "టార్టార్ ఎమెటిక్" (Tartur emetic- పొటాసుక్షారము, సౌవీరము, చింతపండు పులుసు గలిసినది).

1 పౌను సీమసున్నము.

8 గ్యాలనులు వేడినీరు.

వీనినిగలిపి తొట్లలోనుంచి బట్టలు ముడుతలు బడకుండ నందులో ముంచి తేల్చెదరు.

మంచినీటిలో జాడించుట :—ఇది యన్నిరకముల బట్టలకును జరగవలసిన ముఖ్యమైనపని. ఇది సాంతముగ జరుగనియెడల అద్దకమంతయు చెడిపోవును. పక్కారంగులు, అవి జరీను ఎరుపు, రోజా, అని లీనునలుపు లోనగు రంగులతో నద్దిన బట్టలను నిలువున మడతలువేసి యంత్ర సహాయమున జాడించవచ్చును. కాని తక్కిన గంగులతో నద్దిన బట్టలు ముడుతలు పడకుండ నిదివరలో వర్ణింపఁబడిన ప్రకారము రోలరుల సహాయమువలన జాడించెదరు. ఇందుకు వరుసగ కొన్ని తొట్లుండును. వీనికి క్రిందిభాగముననున్న గొట్టములద్వారా నీరు సప్లయికాఁగలదు. ఒకదానిలోనుండి మరియొక తొట్టిలోనికి నీరు ప్రవహించుటకు మార్గములుండును.

సబ్బు పెట్టుట :—మంచినీటిలో జాడించుట యెంత ముఖ్యమో సబ్బు పెట్టుటకూడ నంతముఖ్యము. ఇందువలన రంగులంటని తెల్లభాగములు శుభ్రమగును. రంగులకు కాంతి హెచ్చును. సామాన్యముగ బట్టకొక విధముగు తళుకువచ్చును. సబ్బునురగ చిక్కఁగానుండవలెనా, పల్చగా నుండుటమంచిదా, లేదా యెంత సేపు నానవలెను, బట్టలు మడతలు వేసి నానవచ్చునా, యను విషయములు రంగులయొక్క స్వభావములను బట్టి యుండును. పైనిఁజెప్పిన పక్కారంగులకు చిక్కని నురగ కావలెను. చాలసేపు నానవచ్చును. బట్టలను నిలువునుచుట్టి తొట్టిలోవేసికూడ నానవచ్చును. సున్నితములగు రంగులకు నురగ పల్చగనుండవలెను. బట్ట లెక్కడను ముడుతలు బడకుండ కొంచెముసేపు నానవలెను. వీని కన్నిటికి వేర్వేఱు యంత్రములు గలవు.

మాలిన్యములను పోఁగొట్టుట :—నీటిలో జాడించినను, సబ్బు పెట్టినను పోనిమాలిన్యము లిచ్చట పోవును. ఇందుకుఁగానుచలువసున్నము(Bleaching powder కొంచెము నీటిలోఁగలిపి బట్టలనందులో ముంచెదరు. అప్పుడు రంగులుకూడ వెలియవా యనవచ్చును. కొంచెము చలువసున్నముఁగలిపి క్షణమాత్రము బట్టలనందులో నుంచుటవలన అద్దినరంగులు పోవు. మాలిన్యములు గాఢముగనుండినచో చలువసున్న ప్రమాణము కొంచెముహెచ్చించెదరు. కావలసినంతసేపు మాత్రమీ సున్నపునీటిలోనుంచి యుత్తరక్షణముననే బట్టలను పైకిఁదీయుటకు యంత్రములు గలవు.

మెరుగుఁబెట్టుట: - ఈపని ప్రతివిధమైనబట్టకు నవసరము. ఇందు, బట్టలు మృదువుగనుండుటకును, కూరాకువలెనుండక బిగువుగ నుండుటకును తళుకువచ్చుటకును అనేకపదార్థములవాడుక చేయుదురు. బట్టలుమృదువుగనుండుటకు, చమురువస్తువులు, మైనము, కొవ్వుపదార్థములు, కొన్నిరకముల సబ్బులు వాడెదరు. బట్టబిగువుగనుండుటకు గంజిపెట్టుదురు. గుడ్డకు నిగనిగవచ్చుటకు గంజిపాకములో కొవ్వుకొంచెము గలిపెదరు. గంజిపెట్టినతరువాత బట్టలను చక్కఁగ నిస్త్రీచేయుదురు. ఇందుకు ప్రత్యేకముగ యంత్రములు గలవు. వీనితో నిస్త్రీచేసినబట్టల కొకవిధమగు మెరుగు వచ్చును. ఇస్త్రీయైనతరువాత బట్టలను కావలసిన పొడవునకు కత్తిరించి మడిచి యమ్మఁజూపెదరు.

ఉన్ని, పట్టువస్త్రముల కలంకారీయద్దకము

సామాన్యముగ నూలుబట్టల యద్దకమునకును, ఉన్ని బట్టల యద్దకమునకును భేదములేదు. నూలుకు వేసిన రంగులనే ఉన్నికు వేయుదురు. పద్ధతులలోఁగూడ మార్పులుండవు. కాని చలువయైన తరువాత ఉన్ని బట్టలను ప్రత్యేకముగ జాగ్రత్తతో తయారుచేసినఁ గాని రంగులు పూర్తిగ నంటవు.

ఉన్ని బట్టలకు రంగులు చక్కఁగ నంటుటకు వానిని రెండువిధములు తయారుచేయుదురు. మొదటి పద్ధతి ప్రకారము బట్టలను చలువ సున్నపు నీటిలో ముంచి పిండినతరువాత గంధకద్రావకము గలిపిన నీటిలో ముంచెదరు. అటుతరువాత ద్రావకమంతయు పోవునట్లు మంచి నీటిలో జాడించి యెండవేసెదరు. చలువసున్న మెక్కువైనయెడల ఉన్ని బిరుసెక్కును గాన తగినంతయే తీసికొనవలెను.

రెండవ పద్ధతిలో ఉన్ని బట్టలను "సోడియమ్‌స్టానేటు" (Sodium stannate- వంగభస్మమును సోడాక్షారములో కరిగించఁగా వచ్చిన లవణము) గలిపిన నీటిలో ముంచి పిండిన తరువాత గంధక ద్రావకపు నీటిలో ముంచి మంచినీటిలో జాడించి యెండ వేయుదురు.

ఉన్ని బట్టలపై ముఖ్యముగ ద్రావకము రంగులను క్షారపురంగులను అద్దుదురు. వీనిని కొంచెము వినీగరుతోను, నిమ్మపండ్లపులుసుతోను గలిపి జిగుర్లతో నూరి యద్దెదరు. క్షారపురంగుల నద్దినప్పుడు కొంచెము కరక్కాయ సారముగూడ కలిపెదరు. ఇతర రంగులు నూలద్దకమునందువలెనే యద్దెదరు.

ఉన్ని నద్దుట కుపయోగించెడి యంత్రములపై చిత్రించిన బొమ్మలు లోతుగ నుండవలెను. యంత్రముపైఁ జుట్టిన కంబళి మెత్తఁగనుండి యద్దినతరువాత నిమ్మళముగ నారవేయవలెను. ఆరిన తరువాత బట్టలకావిరి పట్టెదరు. ఆవిరి యెక్కువ తక్కువలులేకుండ తగినంతయుంచినఁగాని రంగులు చెడిపోవును. ఆవిరియెక్కువైనచో రంగులుపల్చనగును. తక్కువైనయెడల రంగుల కాంతి తగ్గును. ఆవిరి పట్టినతరువాత బట్టలను చక్కఁగ నీటిలో జాడించి యెండవేసి తైల సంబంధములగు పాకములతో మెరుగుపెట్టెదరు. ఉన్ని యద్దకమునందు వివర్ణపద్ధతిలో ద్రావకపు రంగుల నుపయోగింతురు.

కలంకారీయద్దకమునకై ఉన్నివలెపట్టును ప్రత్యేకముగ తయారుచేయ నక్కరలేదు. తక్కిన విషయములలో నీ రెంటికి భేదమేమియులేదు. ద్రావకపురంగులు క్షారపురంగులు ముఖ్యముగ నద్దఁబడును. పట్టద్దకము ముఖ్యముగ దుస్తులకేర్పడుటవలన సక్కారంగులనే వాడుకచేయుదురు. అలిజరీనురంగులు, సహాయకపు రంగులు వాడినప్పుడు నూలుబట్టల కుపయోగించిన పద్ధతులనే యవలంబింతురు.

వివర్ణపద్ధతియు, నిరోధపద్ధతియు పట్టద్దకమునందు ముఖ్యముగ యోగ్యములు. ఈపద్ధతులు ఉన్ని యద్దకమునందువలె నుండును. నిరోధముల నద్దినతరువాత పట్టుబట్టలను రంగు కషాయములో నుడక వేయనక్కరలేదు. కషాయము చల్లఁగనున్నను రంగుల నాకర్షించు శక్తి పట్టునకుఁగలదు. అద్దకమైన తరువాత బట్టలను మొదట చల్ల నీటిలోను, తరువాత వేడినీటిలోను జాడించెదరు. ఆవిరిపట్టిన బట్టలను వేడినీటిలోనుతికిన తరువాత సబ్బుపెట్టెదరు. ఇదివరలోఁ జెప్పిన ప్రకారము అద్దకమ్ముయిన బట్టలకు మెరుఁగుఁబెట్టుదురు.

హిందువుల పద్ధతులు

మనదేశములో కలంకారీయద్దకము మిక్కిలి పురాతనమైన పరిశ్రమయనియు మనదేశమునుండియే పాశ్చాత్యులీ జ్ఞానమును సంపాదించిరనియు నిదివరలో వ్రాసియుంటిమి. వ్రాతమూలములగు దాఖలాలు లేకపోవుటచేత నీ పరిశ్రమయొక్క యుత్పత్తి కాలమునుగాని పరిణామస్థితులుగాని యందాజాగాఁ జెప్పుటకు వీలగును గాని తృప్తికరముగ నిర్ణయించుట కాధారములు లేవు. దేశాంతరుల పురాతన గ్రంథములలో హిందువుల కలంకారీయద్దకము విషయమై ప్రశంసించి యుండుట

చేతను, మెగాస్తనీసు, ప్లూటార్కు మున్నగు ప్రాచీన చరిత్రకారులు తమ గ్రంథములలో హిందువుల యద్దకపు పరిశ్రమ మాహాత్మ్యమును గూర్చి కొనియాడుటచేతను మన పరిశ్రమ మిక్కిలి పురాతనమైనదని చెప్పవచ్చును. క్రీ. శ. ఏడవ శతాబ్దము మొదలు పదునేడవ శతాబ్దాంతరముల వఱకు విదేశయాత్రికు లనేకులు మనదేశమున సంచారము చేసియున్నారు. వారిలో పెక్కండ్రు మనదేశమునందలి సాలీలనైపుణ్యతను అద్దకుల చాకచక్యమును మిక్కిలి కొనియాడుచు అద్దకపు బట్టలను మిక్కిలి సన్ననైన మల్లులను తమ దేశములకు మచ్చుగ దీసికొని పోయిరి.

అద్దకపుపరిశ్రమ కొన్ని జాతులనే యాశ్రయించి యుండుటచేత నూతనాభివృద్ధిఁ జెందక సాంప్రదాయ పరంపరలుగ పురాతనపద్ధతులే యిప్పటికిని వాడుకలో నున్నవి. కల్పితపురంగులు విజృంభించి స్వాభావికరంగులకు గంటుటచేతను, యంత్రసహాయముతో ననేకరెట్లు పని మిక్కిలి శీఘ్రకాలములోఁ జేయుచున్న పాశ్చాత్యులతో చేతిపనివాండ్రు డీకొనలేకపోవుటచేతను మన దేశములోని యద్దకు లనేకులు తమవృత్తులను వదలివేయవలసినవారైరి. ఇంతియగాక తత్కాలమునకు కంటికింపుగనుండు విదేశపు రంగుగుడ్డల తళుకుపై మోజుపడి మన నవనాగరికులకు దేశీయవస్తువులయం దనురాగము పూర్తిగ నశించినది. ప్రజాసామాన్యము విద్యాధికుల నే యనుకరింపఁదొడంగిరి. భూస్వాముల పోషణముగూడ తగ్గిపోయినది. ఈ కారణములనుబట్టి మన దేశములోని యుత్తమజాతి యద్దకపు పరిశ్రమ కడచిన ముప్పదిసంవత్సరములలోఁ బూర్తిగ నశించినదని చెప్పవచ్చును. కావున నీ క్రింద వివరింపఁబోవు పద్ధతులం తకు పూర్వము వాడుకలోనుండినవనియే గ్రహించునది. ఇప్పుడద్దకమువలన జీవించెడివారిసంఖ్య మనదేశములో బహుస్వల్పమైనను వారు చాలవఱకు మన పురాతన పద్ధతులనే యాదరించుచున్నారని చెప్పవచ్చును.

వర్తకను మూలమున విదేశీయులతో సంపర్కము గలిగి యన్యభాషాపరిభాషికపదము లనేకములు మన దేశభాషలలోనికి వచ్చినవి. కలంకారీ యద్దకమునకు మనపూర్వులే పదమును వాడెడివారో తెలియదు. అద్దకపు బట్టలకు “కలంకారీలు” “చీటీలు” “పాలంపూర్లు” అను మూఁడుపేర్లు మనదేశములో వాడుచున్నారు. ఈ మూఁడును అన్యభాషాపదములే. ఆంగ్లేయ వర్తకసంఘము మనదేశమునకు రాకపూర్వము పోర్చుగీసు వర్తకులును, డచ్చివర్తకులును మనదేశముతో వర్తకము చేయుచుండిరి. అప్పుడు మలయాళము లోని “కాలికట్టు” అను పట్టణము ఎగుమతి దిగుమతులు చేయుటకు ముఖ్యమైన రేవుపట్టణముగ నుండెను. అందుచేత మనదేశమునుండి యెగుమతి కాఁబడిన యద్దకపు బట్టలన్నియు పాశ్చాత్యులచే “క్యాలికోలు” (Calicos) అని పిలువఁబడుచుండెడివి. ఇప్పటికిని మనదేశమునం దద్దెడిగుడ్డలకు క్యాలికో లనియే పేరు. ఈ యద్దకము “క్యాలికో అద్దకము” (Calico-printing) అనఁబడును. దీనినుండి “కలంకారీ యద్దకము” వచ్చినది (క్యాలికోకారి—కాలికారి—కలంకారిగా మారి యుండవచ్చును). పాశ్చాత్యులు మన దేశమునకు రాకపూర్వము అరబ్బీలతోను, పారసీకులతోను, మన దేశపు వర్తకము సాగుచుండెడిది. మన దేశపు అద్దకపుబట్టలకు పారసీకులు “పాలంగ్ పోష్” అని పేరుపెట్టిరి. పాలంగ్ అను ఉర్దూపదమునకు మంచమని యర్థము. ‘పోష్’ అను పారసీక పదమునకు పోషణమని యర్థము. ‘పాలంగ్ పోష్’ అనఁగా మంచమును పుష్టిచేయునది (పల్యంక పోషణము); దుప్పటి యని తాత్పర్యము. “పాలంగ్ పోష్” అను పదము “పాలంపూర్” అను పదముగ దేశభాషలలో మారినది. రానురాను రంగు నప్పెట్లకేగాక ప్రతి యద్దకపు బట్టకును పాలంపూరను పేరు వాడఁబడుచుండెను. చాందినీలు, చిత్రాసనములు, జమ్ముఖానాలు, రుమాళ్లు, ధోవతులు, చీరెలు, మొదలగు వివిధములగు వస్త్రములు గల చాపలు సయితము పాలంపూర్లనే వ్యవహరింపఁబడుచున్నవి. మన దేశమునుండి తీసికొని పోయిన

పాలంపూర్లను అరబ్బీ పారసీక వర్తకులు యూరపు దేశమునకు ఎగుమతిఁ జేసెడివారు. యూరపు దేశస్థులు పాలంపూర్లను "చింట్జు" (Chintz) అని పిలిచెడివారు. "చింట్జు" అను పదము మన భాషలో "చీటి" అను పదముగ మారినది. కావున పాలంపూర్లన్నను చీటీలన్నను కలంకారీ గుడ్డ లనియే యర్థము. పైని వ్రాసిన దానిని బట్టి కలంకారి యను పదము కంటె పాలంపూరును, చీటి యను పదమును పురాతనము లయినవని తేలుచున్నది.

వివిధవర్ణములుగల నేత బట్టలకును నిజమైన కలంకారీ బట్టలకును భేదముఁ జెప్పవలసియున్నది. నూలుకు రంగులు వేసి యా రంగుల నూలునే నేత యందుపయోగింతురు. తివాచీల రంగు లిట్లే యేర్పడును. కొన్ని రకముల పట్టుబట్టలు నూలుబట్టలుగూడ నిట్లు నేయుదురు. ఇట్లుగాక సాదా గుడ్డపై వివిధములగు రంగుల నద్దుదురు. ఇదియే కలంకారీ యద్దకము. కావున ప్రతి రంగుల బట్టయు కలంకారీ గుడ్డ కాదని గ్రహించునది.

మన దేశములో ప్రతి రాజధానిలోను కొద్దియొ గొప్పయొ కలంకారీ యద్దకము జరుగుచుండెడిది. వంగ దేశములోని ఢక్కా, సిరంపూరు మున్నగు పట్టణములలో నూలు గుడ్డలనేగాక పట్టుబట్టలకుఁగూడ కలంకారీ యద్దకము వేసెడివారు. పంజాబు కాశ్మీర రాజ్యములలో ఉన్ని యద్దకముండెడిది. సంయుక్త పరగణాలు, మధ్య పరగణాలు, బొంబై రాజధానిలోని బోర్చి, అహమ్మదాబాదు పట్టణములలోను, రాజపుత్ర స్థానములలోను, మున్నగు ప్రదేశములలో నీ పరిశ్రమవలన ననేకులు జీవించెడివారు. నిజాము రాష్ట్రములోని, హైదరాబాదు, ఓరంగల్లు, ఔరంగబాదు, నాందేడు మున్నగు పట్టణములలో నిప్పటికిని ఈ పరిశ్రమ గలదు. నిజాము రాజ్యములోని పైఠణ్ అను పట్టణము పూర్వకాలము నుండియు నద్దకపు బట్టలకు ప్రసిద్ధి. కాని యనాదినుండియు నూలు కలంకారిలకు ఆంధ్రరాష్ట్రమే మిక్కిలి పన్నెకెక్కియున్నది. బౌద్ధశకము నాటికే బందరు కలంకారీ బట్టలు జగద్విదితములైనవి. క్రీ॥ శ॥ మూఁడవ శతాబ్దమునాటి పెరిప్లసు (Periplus) అను చరిత్రకారుఁడు "మసాలియా మల్లులను" గూర్చి వ్రాసియున్నాఁడు. ఆతని తరువాత మార్కోపోలో (Marco Polo) యను విదేశ యాత్రికుఁడు వీనిని గురించి వ్రాయుచు నిట్లు కొనియాడి యున్నాఁడు. "ఈ రాజ్యములో (ఆంధ్రదేశములో) సాలిడు గూడువలె మిక్కిలి సున్నితములగు ఉల్లిపొర మల్లులు నేయుదురు. ప్రపంచములోని యే రాజాధిరాజులు వీనిని సిగసావహించి ధరింపకుందురు?" ౧౮౫౧వ సంవత్సరములో లండను పట్టణమున బ్రిటిషు సామ్రాజ్య పరిశ్రామిక ప్రదర్శన మొకటి జరిగినది. ఆ ప్రదర్శనమునకు మన యాంధ్ర రాష్ట్రము నందలి బందరు, కాళహస్తి, నరసాపురము దగ్గిర పాలకొల్లు మున్నగు ప్రదేశములలో నద్దిన కలంకారి బట్టలను దొరతనము వారు పంపియుండిరి ఆ సందర్భమున ఆరు గజముల చతురము గల బందరు పాలంపూరొకటి ౬౦ రూపాయలకును, భాగవత రామాయణములలోని బొమ్మల నద్ది రెండు గజముల చతురము గల కాళహస్తి చాందినీ యొకటి 3½ రూపాయలకును, పక్షులు, పిట్టలు, పూలు, కాయలు, లతలు మున్నగు చిత్రవిచిత్రములగు బొమ్మలనద్ది యుల్లిపొరవంటి బంగారు రేకుతో నంచుగట్టి రెండు గజముల చతురము గలిగిన పాలకొల్లు పాలంపూరొకటి (దుప్పటి) ౩౦౦ రూపాయలకును, మరియొకటి ౧౫౦ రూపాయలకును అమ్ముడు పోయినవి. ఈ గిరాకీని బట్టియైన మన యాంధ్రుల కలంకారీ యద్దకపు ప్రాశస్త్యమును కొంత యూహింపఁగలరు.

మన దేశములో కలంకారీ యద్దకులకు వేర్వేరు పేరులున్నవి. ఉత్తర హిందూస్థానములో వీరిని "ఛిపికారు" లందురు. అనఁగా అచ్చు వేసెడివారని యర్థము. ఆంధ్ర రాష్ట్రములో "జీనిగల"ని యొక

తెగ గలదు. వీరు ముఖ్యముగ కొండపల్లిలోను, గుంటూరు, నెల్లూరు, కర్నూలు జిల్లాలలోను పని చేయుచున్నారు. వీరినే కర్నూలు జిల్లాలో "చిత్రకారు" లందరు. మట్టితోను, కొయ్యతోను చేసిన విగ్రహములకు బచ్చెన పోయుట, నాటకపు తెరలు మున్నగు వానిపై చిత్తరువులు వ్రాయుట వీరివృత్తి. చిరిచాపలు, తుంగచాపలు నేసి రంగులు వేయువారికి నెల్లూరు, గుంటూరు జిల్లాలలో "పిచ్చి గుంట వాండ్రని" పేరు. ఈవృత్తులన్నియు కలంకారీ యద్దకమునకు సంబంధించిన వైనను, కట్టుకొనుట కుపయోగించెడి కలంకారీ బట్టలను వీరు తయారు చేయరు. ఆంధ్రదేశములో కలంకారీ యద్దకులు ముఖ్యముగ రంగురేజులలోనే ప్రస్తుతమనందున్నారు. కాని కలంకారీ యద్దకమునందారి తేరిన బందరు మొదలగు పట్టణములలో నితర జాతులవారే ముఖ్యముగ నద్దెడివారు.

మన దేశమున నద్దెడి కలంకారీ బట్టలు రెండు విధములుగ విభజింపవచ్చును. చీరెలు, రుమాలలు, చాందినీలు తెరలు మొదలగు నిత్య కృత్యమున వాడుకలో నున్నవి యొక తరగతి. రథములను, విగ్రహములను అలంకరించుట కుపయోగించెడి వితానములును (Canopies) మహమ్మదీయులు నమాజు చేయునప్పుడు పరచెడి చిత్రాసనములును (జానమాజులు) రెండవ తరగతిలోనివి. ఈ బట్టలపై సామాన్యముగ దిమ్మలతో నద్దక చేతితోనే బొమ్మలను వ్రాయుదురు.

మన రాజధాని యందలి కృష్ణా జిల్లాలోని బందరు పాలకొల్లు (నర్సాపురంవద్ద) లోను, గోదావరి జిల్లాలో కాకినాడ దగ్గరనున్న గొల్లపాలెములోను, తంజావూరు జిల్లాలోని నాగూరు, కుంభకోణములలోను, మధుర జిల్లాలోని పేర్మగుడి, పాంబను పట్టణములలోను, సైదాపేట, కరువూరు, కాళహస్తి, సేలము మొదలగు పట్టణములలోను కలంకారీయద్దకము గలదు. కాళహస్తి, సేలము, పాలకొల్లు, బందరు పట్టణములలో శ్రేష్ఠమైన వితానములను, జానమాజులను చేసెడివారు.

అనాదినుండి మన దేశములో కలంకారీ యద్దకమునందు నాలుగు పద్ధతులు వ్యాప్తికలోనున్నవి:—(1) బట్టలపై కుంచెలతో బొమ్మలను వ్రాయుట (2) దిమ్మలతో నద్దుట (3) కట్టద్దకము (4) తిరుకద్దకము. వీనిని గురించి సంక్షేపముగ క్రింద వ్రాయబడును.

౧. కుంచెలతో బొమ్మలను వ్రాయుట (Hand-Printing).—ఈ పద్ధతి దిమ్మలతో నద్దుట కంటె కష్టమైనది. అనుభవజ్ఞులు వ్రాసినప్పుడు బట్టలు అద్దిన వాటికంటె మిక్కిలి సుందరములుగ నుండును. దిమ్మలతో నద్దిన బట్టలకంటె కుంచెలతో వ్రాసిన బొమ్మలయందు పనితనము విశేషముగ నుండును. అందుచేత వీనిని తయారు చేయుటలో కాల మధికముగ పట్టును. బట్ట యొకటింటికి రెండుమూడు నెలలకు తక్కువ కాదు. కుంభకోణము, నాగూరు, కాళహస్తి, బందరు, పాలకొల్లు పట్టణములలో వితానములు మొదలగు పవిత్రమైన బట్టలు కుంచెలతో తయారు చేసెడివారు.

కుంచె యద్దకమునందు మల్లును మొట్టమొదట కరక్కాయ నీటిలో నాననిచ్చి తరువాత పాలలో నైదారు గంటల సేపుడికించి రెండు రోజులారనిచ్చెదరు. తరువాత నిసుకపై యెండలో నారవేసి కరిగిన మైనముతో కుంచెచేత బొమ్మలను వ్రాసెదరు. మైన మ్మారిన తరువాత బట్టలను రంగు కషాయములో ముంచి రంగు చక్కగ బట్టకు పట్టిన తరువాత వేడినీటిలో ముంచి మైనమును తీసివేయుదురు. అప్పుడు నీలిమీద గాని యెరుపుమీదగాని తెలుపద్దకమగును. ఒక రంగుమీద మరియొక రంగును గూడ నీ పద్ధతిని యద్దవచ్చును. అద్ద దలచిన బొమ్మలయొక్క యంచులను ముందుగ సిరాతో వ్రాసి యెరుపుండవలసిన చోట కుంచెలతో రంగునుపాసి బట్ట నదక వేయుదురు.

అప్పుడా యా ప్రదేశములలో నెరుపు గాఢముగ నంటును. తరువాత నెరుపుపై మైనముఁబూసి బట్టలకు నీలివేయుదురు. నీలి యంటిన తరువాత వేడినీటితో మైనమును దీసివేసి బట్టను సాఫుచేయుదురు. కాళహస్తిలోఁ మైనముఁరాయక యెరుపుతరువాత నీలి కూడ చేతితోనే వేయుదురు. ఈ పద్ధతి పాశ్చాత్యుల నిరోధపద్ధతికి సరియైనదని చదువరులు గ్రహించి యుందురు.

బందరు వితానములపై ముఖ్యముగ చెట్లు, పక్షులు, పిట్టలు, నెమళ్లు కూర్చుండినట్లు, ఎగురుచుండినట్లు చిత్రింపఁబడియుండును. చెట్ల మొదళ్ల దగ్గిర నది ప్రవహించునట్లును, అడవి మృగములు విహారము సేయునట్లును ప్రదర్శింపఁబడి యుండును. ఈ బట్టను తయారు చేయుటకు రమారమి మూఁడు నెలలుపట్టును.

కాళహస్తివితానములయందు తెలుపుమీఁద నీలి, పసుపురంగు లద్దెదరు. సామాన్యముగ భారత రామాయణకథలను వానిపై చిత్రించెదరు. పాలకొల్లు వితానములుగూడ నిట్లేయుండును. కాని కథలమధ్య ప్రకృతిసౌందర్యమును సూచించు వృక్షములు, నదులు మొదలగు వానిని చిత్రించెదరు.

. ఎరుపుమీఁద పసుపు బందరులో నీ విధముగ నద్దెదరు. బట్టను మొట్టమొదట పసుపురంగులోముంచి యెండినతరువాత కరిగిన తేనె మైనముతో బొమ్మలను వ్రాయుదురు. వీ రుపయోగించెడికుంచె యుక్కుతీగెలతోఁ జేయఁబడును. మిక్కిలి చిక్కులైన బొమ్మలను వ్రాయవలసినప్పుడు చిల్లులకాగితములఁగూడనుపయోగింతురు. బొమ్మలు ముగిసిన తరువాత బట్టలను ఎఱ్ఱరంగులోముంచి వేడినీటితో మైనమును పోఁగొట్టెదరు. బందరు కలంకారీబట్టలపైఁజేసెడి నగిషీపని చాలవఱకు పారసీక సాంప్రదాయముల ననుసరించి యుండును. కాని కాళహస్తి, పాలకొల్లు, గొల్లపాలెము మున్నగు పట్టణములలోని యద్దకుల రూపకల్పనలు కేవలము హిందూసాంప్రదాయకములైయుండును.

౨. దిమ్మలద్దకము (Block printing) :—

బందరు పాలంపూర్లు (నిత్యకృత్యముల నుపయోగించెడి కలంకారీబట్టలు) ముఖ్యముగ నీ పద్ధతిని తయారు చేయఁబడును. పాలంపూర్లలో రెండుమూఁడు రకములు గలవు. తెలుపుమీఁద నల్లనియంచులుగల యెఱ్ఱని బొమ్మలు. ఇవి పూర్తిగ దిమ్మలతో నద్దినవి. తెలుపుమీఁదగాని, రంగుబట్టమీఁదగాని వేర్వేఱు రంగు లద్దుట. ఇవి కొంతభాగము దిమ్మలతోను, కొంత భాగము కుంచెలతోను, అద్దఁబడును. కేవలము కుంచెలతో నద్దిన పాలంపూర్లుగూడఁ గలవు. ఆవుల చీరలును మామిడిపిందెచీరలును కేవలము దిమ్మలతో నద్దినవి.

ఈ యద్దకమున దిమ్మలుచేయుట ముఖ్యమైనపని. ఇవి మెత్తని కొయ్యతోఁ జేయఁబడును. ఇందుకు మనదేశములో పెద్దటేకు విస్తారముగ నుపయోగింతురు. అద్ద దలఁచిన బొమ్మలను మొట్టమొదట కాగితములను కత్తిరించి చేయుదురు. కాగితములతోఁ జేసిన యీబొమ్మలను దిమ్మలపైనంటించి వానిలోనికి చెక్కుదురు. బొమ్మలు లోతుగ చెక్కనకొలఁది యద్దకము నందు స్పష్టముగనుండును. సామాన్యముగ నొక యంగుళములోతు చెక్కుదురు. దిమ్మలపొడవు సాధారణముగ మూఁడు నాలుగంగుళములుండును. చిత్తరువు పెద్దదైనయెడల రెండు మూఁడు దిమ్మలనుచేర్చి యొకదానిగ బిగించెదరు. వీని ఖరీదు తొమ్మిదిరూపాయిల వఱకుండును. విరామములేకుండవాడినప్పటికిని దిమ్మలు మూఁడు సంవత్సరములుండును.

దిమ్మలతరువాత రంగులుతయారుచేయుట ముఖ్యమైనపని. ఎరుపు, నలుపు, పసుపు, పసరు, నీలి, ఊదా రంగులు విస్తారముగ వాడుకలోనున్నవి. సాదాయద్దకమునం దుపయోగించెడి మూలికలనే కలంకారీయద్దకమునకుఁగూడ నుపయోగింతురు. కాని పాళ్లు కొంచెము భేదముగనుండును. ఎరుపువేయుటకు చిరివేరు, నలుపునకు కరక్కాయలు, అన్నభేది, నీలికి నీలిమందు,

ఊదాను ఎరుపుమీఁద నలుపు, ఆకుపచ్చను పసుపు మీఁద నీలి—ఈ రీతిని సాధారణయద్దకమునందు వాడెడి రంగులనే కలంకారీ యద్దకమునకుఁగూడ నుపయోగింతురు.

అద్దకపు పద్ధతులు కొంచెమించు మించుగ మన దేశమునందంతట నొక్కటిగ నుండును. బట్టను ముందుగ గేదెపేడలోనాన్చి, నీరు చల్లుచు నేలమీఁద నాగవేయుదురు. తరువాత నా మురికి బట్ట నొకటి రెండు రోజులు కరక్కాయ నీటిలో నాననిచ్చెదరు. బొమ్మలయొక్క యంచులు నల్లఁగ నుండవలసినప్పుడు ఇనుపతుప్పు, బెల్లము, పులిసిన కల్లును మరఁగనిచ్చి యా మిశ్రణము నొక పళ్లెములోనుంచి మెత్తని కంబళి ముక్క నందులో ముంచి యుంచెదరు. దిమ్మెల నీ కంబళిపై నొక్కి తరువాత బట్టపైనద్దెదరు. అప్పుడు తెలుపుమీఁద నల్లని యంచులుగల బొమ్మలద్దకమగును. తెలుపుమీఁద నెరుపు కావలెనన్నచో పైని చెప్పిన మిశ్రణమునకు బదులుగ పటిక నీటిలో దిమ్మలను ముంచి యథావిధిగ నద్దుదురు. ఆరిన తరువాత బట్టలను చిరివేరు, జాజియాకులు వేసి మరఁగఁబెట్టిన కషాయములో ముంచెదరు. అప్పుడు పటిక యంటిన చోట్ల యెరుపద్దకమగును. సాపు చేయుటకు అద్దకమైన బట్టలను సున్నము, చౌడు, సబ్బు గలిపిన నీటిలో నుడకవేయుదురు. ఇది మిక్కిలి పురాతనమైన పద్ధతి. పాశ్చాత్యులు కలంకారీ యద్దకమన నేమియో తెలియని కాలమునఁగూడ నీ పద్ధతియే మన దేశమున వాడుకలో నుండినది. ఏలయన ౧౭-వ శతాబ్దాంతమున, అనఁగా రఘూరమి ౧౭౧౦ సంవత్సరములనాఁడు "ఫాదర్ కొర్డో" అను క్రైస్తవ మతాచార్యుఁడొకఁడు మన రాజధానిలోని కలంకారీ యద్దకపు పద్ధతి నిట్లు వర్ణించియున్నాఁడు. "ఒకమోస్తరుగ చలువచేసిన క్రొత్త గుడ్డలను అద్దకులు వారము పదిరోజులు కట్టుకొని మాపుదురు. మాసిన గుడ్డలను మేక పెంటతోఁగాని గొర్రె పెంటతోఁగాని నాన్చి నీటిలో జాడించి యెండవేయుదురు. తరువాత [illegible] పాలలోను, కరక్కాయ నీటిలోను [illegible] బట్టల నెండ నిచ్చెదరు. నున్నని [illegible] బట్టలను నునుపుచేయుదురు. [illegible] బట్టలపైని చిల్లిరేకులతోఁగాని, చిల్లులు [illegible] బట్టలతోఁగాని యుపాధుల నద్దెదరు. నలుపురంగు వేయుటకు ఇనుపతుప్పును, పులిసినకల్లు, [illegible] బెట్టి తయారుచేసి యద్దెదరు. నీలియద్దుటకు బట్టను మేక పెంటలోఁగాని గొర్రెపెంటలోఁగాని నాన్చి, మంచినీటిలో జాడించి యెండవేయుదురు. బట్టలపై బొమ్మలను ముందుగ బొగ్గుతోఁగీచి బొమ్మలను [illegible] తక్కిన భాగములన్నియు కరఁగిన మైనముతోఁ గప్పి వేయుదురు. తరువాత బట్టను నీలిరంగులోముంచి వేడి నీటితో మైనమును దీసివేసి బట్టలను [illegible]లో నుడకవేసి మంచినీటిలో జాడించి యెండవేయుదురు. అప్పుడు తెలుపుమీఁద నీలియద్దకమగును. అద్దిన గుడ్డలకు మెరుఁగుఁబెట్టుటకు బట్టలను తిరిగి పేడలో నుడకవేసి ఉతికి, జాడించి, తిరిగి గేదెపాలును కరక్కాయ [illegible]మును గలిపిన మిశ్రణములోనాన్చి యెండవేయుదురు. ఎరుపువేయుటకు పటికయు, ఊదారంగుకు పటికతో అన్నభేదిఁగలిపియు నద్ది యెండినతరువాత నీటిలో నాననిచ్చి కొన్ని వేళ్లయొక్క కషాయములో నుడికింతురు. అద్దకమైన గుడ్డలను మేకపెంటతో నుడికించి సబ్బునీటిలో జాడించి యెండలో చలువఁజేయుదురు. అప్పుడు బట్టయొక్క తెల్లనిభాగములు సరియగును. తరువాత తెలుపుమీఁద పసుపును, నీలిమీఁద ఆకుపచ్చయు నద్దుదురు. ఇందునకు పటికయు, కరక్కాయలును, దానిమ్మతొక్కలును, పసుపును వాడుకచేయుదురు." ఈ యుత్తరము పారిసు పట్టణములోని "శాస్త్రీయ విద్యాపీఠమునకు" (Paris Academy of sciences) పంపఁబడినది. ఈ యుత్తరములో వర్ణించిన పద్ధతులకును నేఁడు మన దేశములోనున్న పద్ధతులకును భేదమేమియులేదని చదువరులు గ్రహింపఁగలరు.

యోగములు :—మన దేశము నందలితటను పద్ధతు లొకటియే యైనను అద్దకమునం దుపయోగిం చెడి వస్తువులయొక్క ప్రమాణము ఊరూరను మారు చుండును. పద్ధతులు గ్రంథస్థములుగాక రహస్యములుగ నుండుటచేత నొండొరులకు తెలియక యద్దకులు వంశ పరంపరగా వాడుచున్న పాళ్ళే వాడెదరు. అందు చేత తప్పిళ్ళలో నాయా ప్రదేశములయందు భేదము లుండును. అయినను మచ్చునకై కొన్ని యోగము లీ క్రింద నీయఁబడును.

తెలుపుమీఁద నెరుపద్దుట :— మన రాజ ధానిలో నెరుపు వేయుటకు చిరివేరే వాడుక చేయు దురు. ఇందుకు,

1 సేరు గుగ్గిలము.

2 పలములు పటిక.

1 పలము లద్దుగ చెక్క.

1 పలము పసుపును పొడిచేసికలిపి 4 సేర్ల నీటిలో నానఁబెట్టి చక్కఁగఁ గలిపి వడపోయుదురు. ఈ సారమును దిమ్మలతో బట్టపై నద్ది యెండిన తరువాత బట్టను చిరివేరు కషాయములో నుడకవేయుదురు. అప్పుడు అద్దినచోట్ల నెరుపు రంగంటును.

ధూపుచాయ నద్దుటకు :—(ఎరుపు వాగుఁ గల నలుపు).

అర్ధసేరు చెరుకు పానకము.

1 చెటాకు ఇనుప తుప్పుపొడి.

1 చెటాకు అన్నభేది, వీనిని గలిపి 12 సేర్ల నీటిలో 12 రోజులు మురగఁబెట్టెదరు. మురిగిన తరువాత కొంచెము గుగ్గిలమును, నేతిని గలిపి వడపోయుదురు. వడపోసిన తరువాత నీ పాకమును దిమ్మలతో నద్దు దురు. ఎండిన తరువాత బట్టలను పైనిజెప్పిన ప్రకా రము చిరువేరు కషాయములో నుడకవేసి రంగంటిన తరువాత మంచినీటిలో జాడించి యెండ వేయుదురు.

ఉత్తర హిందూస్థానములో జమ్ముఖానాలు, పర జాలు మొదలగు ముతక బట్టలు కలంకారీ యద్దక ముతో తయారుచేయు నలవాటు గలదు. ఇందు కొన్ని తరుణముల నైదారు రంగులుగూడ నద్దెదరు. ఐదారు రంగు లద్దవలసినప్పు డొకదాని తరువాత నొకటి యద్దెదరు. ఎరుపును నలుపును అద్దుటకు చిరివేరు, నూనె, సజ్జాకారము, కరక్కాయలు, తుమ్మజిగురు, అన్నభేది కావలసియుండును. ఒక తాను నద్దుటకు (14 గజములు పొడవు, 2 అడుగులు వెడల్పు):—

అర్ధసేరు నూనె

పావుసేరు సజ్జాకారము

మూఁడు శేర్లు నీటిలోఁ గలిపి నక్కఁగ కలియఁబెట్టి తాను నందులో నానవైదరు. ఎండిన తరువాత, పావు సేరు కరక్కాయలను చితకఁగొట్టి మూఁడు సేర్లనీటిలో నాననిచ్చి తానునందులో ముంచి యారవైచెదరు.

పావుసేరు అన్నభేది, పావుసేరు తుమ్మజిగురు, సేరున్నర నీరును చిక్కఁగఁ గలిపి పాకము చేసి దిమ్మల నీ పాకములోముంచి పై ప్రకారము తయారైన తా నుపై నద్దెదరు. తెల్లబట్టపై నల్లనిబొమ్మ దిగ్గుడును. ఎండిన తరువాత, అర్ధసేరు పటికను,మూఁడు సేర్ల నీటిలో కరిగించి నలుపద్దకమైన తాను నా నీటిలోముంచి యార వేయుదురు. ఆరిన తరువాత, సేరు చిరివేరు పది సేర్ల నీటిలోవైచి దిగ్గాచి తాను నీ కషాయములో ముంచె దరు. అద్దకమైన తరువాత తానును మంచినీటిలో జాడించి యెండవేయుదురు. ఇచ్చట నద్దకమైన యెరుపు నలుపులు రెండును సక్కఁగంగులు.

ఎరుపు, నలుపు, పసుపు, ఆకుపచ్చ, నీలి, తెలుపు గల యారురంగుల జమ్ముఖానాను తయారుచేయుటకు (ఒకతాను) :—

$\frac{1}{2}$ సేరునూనె


$\frac{1}{4}$ సజ్జాకారమును గలిపి తానునందులో నానిచ్చి యెండినతరువాత పైనిఁజెప్పినపాళ్లతో ముందుగ నలుపు నద్దుదురు. తరువాత నెరుపునద్దుటకు,

$\frac{1}{4}$ సేరుపటిక,

4 చటాకులు తుమ్మజిగురు, 3 సేర్ల నీటిలోఁగలిపి దిమ్మల నీ పాకములో ముంచి యద్ది యెండినతరువాత పైని జెప్పిన ప్రకారము తయారుచేసిన చిరివేరు కషాయములోముంచి మంచినీటిలోజాడించి యెండవేయుదురు. అప్పటికి నలుపు,ఎరుపు పూర్తియగును. తక్కిన రంగులను వేర్వేరుగ తయారుచేసి దిమ్మల నారంగులలోముంచి విడివిడిగ నద్దెదరు. పసుపుతో పసుపును, నీలిమందుతో నీలిని, ఈ రెండు గలిపి యాకుపచ్చను అద్దెదరు, ఇందుకు ½ సేరురంగు. ¼ సేరు తుమ్మజిగురు, 8 సేర్ల నీటినిగలిపి రంగును పక్వమునకుఁ దెచ్చెదరు. ఈ యైదురంగులలో నలుపు, ఎరుపు మాత్రము పక్కారంగులు. తక్కినవి వెలిసిపోవును. అందుచేత నీరంగులనే యద్దుదురుగాని వాని కషాయములనువండి తొనుల నందులోముంచరు. కలకత్తాదగ్గిఱ శిరాంపుర ము (Serampore) పట్టణములో పట్టుమీఁద కలంకారీ పనిజేయుదురు. బదామిరంగు (cream colour) విస్తారముగ వేసెదరు. ఇదిగాక మంజిష్ఠ(మదారుచెక్క) కరిమింజిపసుపు, రంగు పదార్థములకును, పటిక, అన్నభేది యుపాధులకును వాడుకచేయుదురు; పట్టద్దకమున నుపయోగించు దిమ్మలు చింతకొయ్యతోఁ జేయఁబడును. బదామీ రంగు వేయుటకు ధాతకీకుసుమము (అగ్ని జ్వాలయని దీనికి మరియొకపేరు; ఇది యెఱ్ఱగనుండు అడవి పూవు), పటిక, పసుపు, తుమ్మజిగురు, "లెడ్ అసిటేటు" (Lead acetate -సీసపు సంబంధమైన లవణము)ను పొడిచేసి నీటిలోఁ గలిపినయెడల మీఁగడవలె నిగనిగలాడు పదార్థ మేర్పడును. తుమ్మజిగురు నీరు కొయ్య తొట్లలోఁబోసి వానిపై కొయ్య చట్రముల నుంచెదరు. ఈ చట్రముల యడుగు భాగమున నూలు గుడ్డయుని దానిపైని మెత్తని కంబళియు పరచెదరు. పైని తయారైన రంగునకు కంబళిపైఁబోసి కుంచెలతో సర్దెదరు. దిమ్మలను దీనిపై నొక్కి పట్టుబట్టలపై నద్దెదరు. దిమ్మలద్దకము నందు బట్టలు నలుచదరపు నేలపై నున్నగాని బొమ్మలు చక్కఁగ నద్దకము గావు. హెచ్చు తగ్గులున్న నేలపైఁ బఱచిన యెడల కొన్నిచోట్ల బొమ్మ లద్దుపడవు. అందువలనే యద్దకము కావలసిన గుడ్డను నలుచదరపు పెట్టె పైఁ బరచి నాలుగు మూలలగుండుసూదులతో ముడుతలు లేకుండ బిగించిన తరువాత దిమ్మల నద్దెదరు. నూలు బట్టలకు నిదియే పద్ధతి. ఇట్లద్దిన పట్టుబట్టను నీటిలో జాడించి యెండిన తరువాత మంజిష్ఠ కషాయములో నుడకవేయుదురు. రంగు పట్టిన తరువాత మంచినీటిలో జాడించి యెండవేసినచో దిమ్మలతో నద్దిన చోట్ల బదామి రంగేర్పడును.

3 కట్లద్దకము (Tie and dye work):— ఇది మన దేశమునకు విశిష్టమయిన పద్ధతి. పాశ్చాత్యులలో నీ పద్ధతిలేదు. బట్టల కచ్చటచ్చట ముడులు వేసి తరువాత నద్దకము వేయుటచేత నీ పద్ధతికి "కట్లద్దకము"ను పేరు పెట్టఁబడినది. పాశ్చాత్యులు

ఎనిమిదిరంగుల నద్దు యంత్రము



7-వ పటము

ఎక్కువ వెలయిచ్చి కొనెడి "బందానా రుమాళ్లు" (Bandana kerchiefs) ఈ పద్ధతినే యద్దఁబడును. మన దేశములో ఉత్తర హిందూస్థానమున నీ పద్ధతి విశేషముగ వాడుకలో నున్నది. రాజపుత్రస్థా

నము, పంజాబు, సంయుక్త పరగణాలు, కోటాసంస్థానము మొదలగు ప్రదేశములలో నీ యద్దకము మిక్కిలి వ్యాప్తిఁజెందియున్నది. మన రాజధానిలో గువ్వకన్ను చీరెలు, చుక్కల చీరెలు, రవికెలు, రుమాళ్లు మాత్రమే యీ పద్ధతి ప్రకార మద్దెడివారు.

ఉత్తర హిందూస్థానమున నీ బట్టలకు మిక్కిలి విలువగలదు. ఈ పద్ధతి ప్రకార మద్దిన బట్టలకు (తలపాగాలు, రుమాళ్లు, కండువాలు మొదలగునవి) "చూనారీ"లని పేరు. అద్దిన రంగులను బట్టి "పక్కా చూనారీలు" "కచ్చాచూనారీ" లని రెండువిధములు. హిందువులపండుగల సమయమున దర్బారుతీర్చునప్పుడు మహారాజుగారికి పక్కాచూనారీలను నజరానాగా దీసికొని వెళ్ళుటయు, మహారాజావారు తాబేదారీలకు పండుగల సమయమున చూనారీలను

బందరులో నుపయోగించు అద్దకపుదిమ్మెలు



౪-వ పటము

బహుమతిచేయుటయు ననుశ్రుతమైన యాచారము. కోటాసంస్థానములో మొన్నటి వఱకునిట్లుండెడిది. దర్బారుసమయమున సామంతులు చూనారీలను తప్ప మరియొక తలపాగాను చుట్టకూడదను నిర్బంధము గూడ కోటాసంస్థానములో నుండెడిదట. ఇప్పుడు తగినంత యాదరణములేక యీ సంస్థానములోఁగూడ నీ పరిశ్రమ యరుదైనది.

కట్లద్దకము రెండుభాగములు: ముళ్ళు వేయుట, రంగులద్దుట. సామాన్యముగ నద్దకులు ముళ్ళు వేయరు. ముళ్ళు వేయుటకు ప్రత్యేకముగ ఆడ కూలీలుందురు.

వీరికిదియే వృత్తి. ౫౦౦ ముళ్లకు కాని మొదలుకొని రెండుపణాలవఱకు దొరకును. ముళ్లు వేయుట విసువుబుట్టెడి పనియైనను అలవాటుపడిన స్త్రీలు రోజుకెనిమిదణాల వఱకు సంపాదింతురు. ముళ్లు నూలుదారములతో వేయుదురు. ముళ్ళు వేసినగుడ్డకు రంగు వేసినప్పుడు కట్లుగట్టినచోట్లుమాత్రము తెల్లఁగనుండి తక్కినబట్టకంతయు రంగులంటును. ఇది రంగు బట్టమీఁద తెల్ల చుక్కలు వచ్చుటకు పద్ధతి.

రంగుచీరమీఁద తెల్లచుక్కలువచ్చుటకు తెల్లచీరమీఁద నాయాచోట్ల నూలుదారముతో ముడివేసి ముళ్లతోఁగూడ చీరకు రంగువేయుదురు. రంగారిన తరువాత ముడులు విప్పినయెడల నచ్చట రంగంటక తెల్లఁగనుండును. ముళ్లు సమానమైన దూరములో వేసినయెడల సాదాచుక్కల చీరె యగును. ఒక్కొక్కచోట మూఁడేసిగాని యైదేసిగాని కట్లు గుమిగూర్చి కట్టినచో మూఁడుచుక్కలచీరెగాని యైదుచుక్కల చీరెగాని యద్దకమగును.

తెల్లచీరమీఁదగాని రంగుచీరమీఁదగాని వేఱొక రంగుఁగలచుక్కల నద్దవచ్చును. ఏ రంగులో చుక్కలుండవలెనో యారంగులో దారమునుముంచి తరువాత ముళ్లు వేయవలెను. ముళ్లారిన తరువాత బట్టకు వేయవలసినరంగు వేయవచ్చును. దారమునకు వేసినరంగు కట్లుగట్టినచోట్ల బట్టకంటును. చూనారీలను అద్దకపు బట్టలు విస్తారముగ నుత్తరహిందూస్థానములో తయారగునని పైనివ్రాయఁబడినది. ఇందునకు సామాన్యముగ ముతకబట్టల నుపయోగింతురు. పక్కా చూనారీలను (రంగువెలియనివి) జేయుటకు బట్టను మొట్టమొదట శుభ్రముగ నుతికి 2 చటాకులు ఆముదము 2 చటాకులు సజ్జాకారమును గలిపిన చల్లనీటిలో రాత్రిపూట నానుచు పగలెండలో నారవేయుదురు. ఇట్లు పది పదియైదురోజులు నానుచు నార్చుచుందురు. తరువాత దానిని పారుడునీటిలో నుతికి గాలికి నెండనిచ్చెదరు. బట్ట యెండిన తరువాత బొమ్మలను (అద్దతలచినవి) ఎఱ్ఱపెన్సిలుతోగాని సీసముతోగాని బట్టమీఁదవ్రాసి ముళ్లువేయుటకిచ్చెదరు. కట్లుకార్మికులు ఈ గీతలమీఁదనే ముళ్లువేయుదురు. కట్లుముగిసిన తరువాత పసుపద్దవలసిన భాగములు పసుపుఁగలిపిన మజ్జిగలోను, ఆకుపచ్చ నద్దవలసిన భాగములను పసుపు, నీలిమందుఁ గలిపిననీటిలోను ముంచి యెండలారినతరువాత నాయాభాగముల నచ్చటచ్చటనే ముళ్లువేయుదురు. తక్కిన భాగముల కెరుపు వేయుటకు :—

$1\frac{1}{4}$ సేరు చిరివేరు

2 చటాకులు పటికను పొడిజేసి నీటిలోఁ గలిపి మరఁగబెట్టెదరు. రంగుపాకమునకు వచ్చిన తరువాత దించి చల్లార్చెదరు.

8 పలములు చిరివేరు, 1 చటాకు పటికను మెత్తగ పొడిఁజేసి చల్లనీటిలో నెరుపువచ్చువఱకు నాననిచ్చి వడపోయుదురు. అప్పుడు మొదట మరఁగఁబెట్టి తయారుచేసిన కషాయమును దీనితోఁగలిపి బట్ట నామిశ్రణములో మూఁడురోజులూరనిచ్చి మంచినీటిలో జాడించి యెండవేయుదురు. అప్పటికి పసుపు,ఆకుపచ్చ,ఎరుపు రంగు లద్దకమగును. ఎరుపునకు బదులు నీలి యద్దవలెనన్న చిరివేరు కషాయమునకు మారు నీలిమందు పాకములో ముంచవలెను.

కట్లయొక్క సముదాయములనుబట్టి పక్కా చూనారీలకు పేర్లుగలుగుచున్నవి. ఒంటిచుక్క బట్టలకు (ఒక్కొక్కముడి) 'ఏక్బంది' యనియు, నాలుగు చుక్కల బట్టలకు 'చౌబంది' (నాలుగేసికట్లు) యనియు, ఏడుచుక్కలు బట్టలకు 'సాబంది' (ఏడేసికట్లు) యనియు పేర్లు. మనుష్యులు, మృగములు, ఈటెలు, బల్లెములు మొదలగు వేటసంబంధములగు పరికరముల బొమ్మలద్దినవానికి "షికారీచూనారీ" లని పేరు.

కచ్చాచూనారీలు చేయుటకు సన్నని మల్లు కావలెను. పద్ధతు లొక్కటియే యైనను సన్నబట్టపై పని చేయుటకు కొంత చాకచక్యముండవలెను. కచ్చా

మానాగిల రంగు లోని గంధస్వరము మాత్రము కాంతి వంతములై యుండును. రాజపుత్ర స్థానములో నీ యొక పద్ధతిని గుండ్ర మానాగీలను తయారుచేయుట గలదు. సన్నని కొయ్య పలకకొక వైపున దీనికొన యద్దకమున గావలసిన బొమ్మలయొక్క యాకార మేర్పడు లాగున నానులకు గుండు సూదులను గుచ్చెదరు. బట్టను తడిపి బల్లపై బరచినప్పుడు గుండు సూదులున్న చోట్ల పైకి లేచి తక్కిన భాగములు క్రిందకు వంగియుండును. అప్పుడు లేచినచోట్లందు బట్టకొని బట్టను నిమ్మళముగ పైకి లేవదీసి యాభాగముల ముళ్లు వేయుదురు. ఈ ముళ్లు వేసినచోట్ల రంగు అంటకుండుటకు గాను దారమునను పైనము యుదురు. ముళ్లు వేసిన తరువాత నా భాగమును రంగులో ముంచెదరు. ఇట్లే మరియొక బొమ్మ యేర్పడునట్లుగును సూదులు బల్లపై గుచ్చి ముళ్లు వేసి యొకరకము రంగు వేయుదురు. ఈ రీతిని బొమ్మలన్నియు నద్దకమైన తరువాత బట్టనంతయు రంగులో ముంచెదరు. అప్పుడు రంగు బట్టమీద నిలువుగను రంగు బొమ్మలద్దకమగును. ఎరుపు బట్టపై తెల్లచుక్కలు, పసుపు చుక్కలు వచ్చుటకు రెండు పర్యాయములు ముళ్లు వేయవలెను. ఇట్లే నలుపుమీద తెలుపు, పసుపు, ఎరుపు చుక్కలు వచ్చుటకు మూడు పర్యాయములు కట్లు కట్టవలెను.

౭ తళుకద్దకము (Tinsel printing):—ఇది యొక చిత్రమైన యద్దకపు పద్ధతి. ఈ బట్టలు విస్తారముగ మహమ్మదీయులు వాడుక చేయుదురు. దక్షిణ హైదరాబాదు, జయపూరు, లాహోరు, సాంగనేరు, అహమ్మదాబాదు, నాసిక్, త్ర్యంబకం మొదలగు కొన్ని పట్టణములలో మాత్రమిప్పుడీయద్దకము ప్రవారములో నున్నది. మన రాజధానిలో గోదావరిజిల్లా లోని కొన్ని పల్లెటూళ్లలో నిప్పటికిని తళుకద్దకము కొంచెము చేయుచున్నారు.

ఈ యద్దకమునందు బట్టలను బంగారు వెండి మొదలగు వస్తువులలో ముంచి యొకరకము తళుకు వస్తువులను చల్లుదురు. ఇందుకొరకు వాడు పట్టుల కంటె కాగితములమీద రంగుపొడి, చిక్కని గంజి, కొన్ని రకముల నూనెలు, కోడిగుడ్ల సొన మొదలగు జిగురు వస్తువులను హెచ్చుగా చేర్చి బట్టలపై వేయుదురు. అచ్చుకు పొడి, రాగి రేకులు తగుమాత్రము వాడుదురు. తళుకులు చల్లుటకు ముందు తళుకులు బట్టపై నంటుకొనుటకు జిగురు వస్తువును నేయుదురు. జిగురు పట్టిన తరువాత రేకుల నంటించి మిగిలిన పొడులను దులిపి వేయుదురు. ఎండిన తరువాత బట్టకు తళుకు భాగములు దిద్దుదురు. ఆ విధముగ తళుకుల బట్టలకు తయారు చేయుదురు.

పారిభాషిక పదములు

Acid dyes ద్రావకపురంగులు

Alum పటిక

Artificial dyes కృత్రిమపురంగులు, సీమరంగులు

Basic dyes క్షారపురంగులు

Black Liquor నలుపుసారము

Bleached clothes మల్లులు

Bleaching చలువచేయుట

Bleaching powder చలువచూర్ణము

Blue stone మయూరకతుత్థము

Boiled starch గంజి

Caustic potash పోటాసుక్షారము

Caustic soda సోడాక్షారము

Chlorine లవణవాయువు

Chemical theory సమ్మేళనవాదము, రసాయన వాదము

Cochineal కిరమంజి

Calico printing కలంకారీయద్దకము

Coloured resists వర్ణనిరోధము

Compound Colours సమ్మిశ్రరంగులు

Country Soap దేశవాళీసబ్బు; నాటుసబ్బు
Copperas అన్నభేది
Developed Colours దోహదపురంగులు
Deep shades ముదురుచాయలు
Dhobys' earth సజ్జాకారము, చాకలిచౌడు
Direct dyes నిరుపాధికపురంగులు
Discharge style వివర్ణపద్ధతి
Discharges వివర్ణకములు
Dyeing అద్దకము
Dyer రంగురేజు, అద్దకుడు
Dyes రంగులు
Engraved plate printing చిత్రితపు అద్దకము
Fast dyes పక్కా రంగులు
Fatty resists తైలనిరోధములు
Finished products తయారైన సరకులు
Fixing Agents బంధనములు
Fugitive dyes కచ్చారంగులు
Gum arabic తుమ్మబంక
Hand block printing దిమ్మలయద్దకము
Hanks లాడీలు, నూలుపిల్లు
Hydro-chloric acid శంఖద్రావకము
Indigenous dyes నాటురంగులు
Intermittent machine విరామయంత్రము
Kier (boiler) చాకిబాన
Light shades లేచాయలు
Linens నారబట్టలు
Madder style మంజిష్ఠపద్ధతి
Mechanical theory విశ్రీణవాదము
Metallic oxides భస్మములు
Mineral dyes ఖనిజపురంగులు
Mineral Mordants ఖనిజోపాధులు
Mordant (or adjective dyes) సోపాధికపు రంగులు
Mordants ఉపాధులు
Mordant style ఉపాధిపద్ధతి
Mordanting కసటు వేయుట
Natural dyes స్వాభావికపు రంగులు
Paper pulp కాగితపుగుజ్జు
Pigment colours పూతరంగులు
Pigment style పూతపద్ధతి
Plain dyeing సాదాయద్దకము
Raw-material ముడిసరకు
Red liquor ఎఱుపుసారము
Resin గుగ్గిలము
Resists or reserves నిరోధములు
Resist or reserve style నిరోధపద్ధతి
Roller printing తిరుగుడు యంత్రముల యద్దకము
Simple colours వ్యష్టిరంగులు
Soda-ash సోడాపొడి
Steam colours ఆవిరిరంగులు
Steam style ఆవిరిపద్ధతి
Steam Blue ఆవిరినీలము
Steam green ఆవిరిపచ్చ
Steam red ఆవిరియెఱుపు
Steam yellow ఆవిరిపసుపు
Styles of printing అద్దకపు పద్ధతులు
Stencil printing చిల్లుల యద్దకము
Substantive dyes నిరుపాధికపు రంగులు
Sulphuric acid గంధక ద్రావకము
Thickeners జిగురులు
Tie and dye work కట్లద్దకము ; ముళ్ళద్దకము
Tinsel printing తళుకద్దకము
Unbleached clothes కోరాలు
Vegetable dyes మూలికలరంగులు
Vegetable mordants మూలికోపాధులు
Verdis రాగిచిలుము
White arsenic ఉల్లిపాషాణము
White resists వివర్ణనిరోధములు; శ్వేతనిరోధములు
Yarn నూలు

గ్రంథావళి

అద్దకమును గుఱించి తెలుఁగులో గ్రంథములు లేవు. ఇంగ్లీషులోఁ పెక్కులు గలవు. తెలుఁగు విజ్ఞాన సర్వస్వములో నింగ్లీషు గ్రంథముల నామము లిచ్చుటవలన విశేష ప్రయోజనము లేకపోయినను, ఇంగ్లీషువచ్చిన యాంధ్రు లెవరైనను ఈ గ్రంథములలోఁ గొన్నిఁటినైనను చదివి, యింగ్లీషురాని రంగరేజులకుఁ జెప్పి, యీ విద్యయొక్క యభివ్యాప్తికిఁ గొంతవఱకైనను సాయముచేయుదురేమో యన్న యాశతో నీ వ్యాసమును వ్రాయుటయందు సంప్రతించిన పుస్తకములను ముఖ్యములనితోఁచిన మరికొన్ని గ్రంథముల నామముల నిచ్చట నిచ్చుచున్నాము:-

BIBLIOGRAPHY

Wagner.—*Manual of Chemical Technology.*

Thorpe.—*Outlines of Industrial Chemistry.*

Tapestry Studio.—*Art of Dyeing.*

Spons.—*Workshop Receipts, Vols. 1 and 2.*

Encyclopædia Britannica 11th Edition Vols. IV, VIII, and XXVI.

Journal of the Society of Dyers and Colourists December, 1913.

G. H. Hurst.—*Silk dyeing, printing and finishing.*

Bleaching, Dyeing and Calico-printing—*Edited by Gardner.*

Watt.—*Commercial products of India.*

M.' Cann.—*Dyes and tans of Bengal.*

Journal of Indian Art and Industry.

N. N. Bannerjee.—*Dyes and Dyeing in Bengal.*

Edwin Holder.—*Dyes and Dyeing in the Madras Presidency.*

Fawcett.—*Dyes and Dyeing in the Bombay Presidency.*

Edgar Thurston. *The Cotton fabric industry of the Madras Presidency.*

Upshon.—*Vegetable Dyes and Dyeing.*

Dr. A. Kumaraswamy.—*Arts and Crafts of Southern India and Ceylon.*

Birdwood.—*The Industrial Arts of India.*
Imperial Gazetteer of India Vol. III.

P. N. Bose.—*Hindu civilisation under British rule.*

S. H. Bilgrami.—*History of H. H. The Nizam's Dominions Vol. I.*

Rondal.—*Dyeing of the Chinese.*

Grace Calvert.—*Dyeing and Calico printing.*

Bird.—*The American Dyer's Companion.*

J. J. Hummel.—*Dyeing of textile fabrics.*

Benedikt Knecht.—*The Chemistry of the Coal tar Colours.*

Napier.—*Manual of Dyeing and dyeing receipts.*

Mathews.—*Laboratory manual of Dyeing and textile Chemistry.*

W. P. Dreaper.—*Lectures on the research chemist in the works with special reference to the textile industry.*

W. Crookes.—*Dyeing and Tissue printing.*

A. Sansone.—*Dyeing, comprising dyeing and bleaching of Wool, Silk, Cotton, Flax, Hemp, China grass &c.*

,, *Printing of Cotton Fabrics.*

Saiyerd Mahommad Hodi.—*A Monograph on the Dyes and Dyeing on the North Western Provinces and Oudh.*

F. A. Parnell.—*Dyeing and Calico printing.*

L. Liotard.—*Memorandum on Dyes of Indian Growth and Production.*

[వే. వి.

అద్దము. అద్దమునకుఁ దెనుఁగులో 'గాజు' 'దర్పణము' అని రెండర్థములు గలవు. అందు నిచ్చట దర్పణమను నర్థమందు వివరింపఁబడును. రెండవ అర్థము 'గాజు' శబ్దము క్రిందఁ జర్చింపఁబడును. ఏ వస్తువులో మన ప్రతిబింబము కానవచ్చునో దానిని అద్దమందురు. చలనము లేని నీటి యందుఁగూడ మన

ప్రతి బింబము కాన్పించును. కావున జలము మానవులకు దేవుఁడిచ్చిన మొదటి దర్పణము. ఈ విషయములో అట్టి నీటిని గూడ అద్ద మనవచ్చును. మనము వాడు అద్దములు, లోహములతో గాని, గాజుతో గాని చేయఁబడును. కాని, గాజుతో చేయఁబడిన వాటినే సాధారణముగ అద్ద మందురు.

చరిత్ర :—గాజద్దములు చేయుటకు పూర్వము, లోహపు టద్దములను వాడెడివారు. గుండ్రని చిన్న లోహపు రేకులకు మెరుగిడి, పైభాగము కొంచెము కుంభాకారముగఁజేసి దానిని అద్దముగ వాడెడివారు. అట్టి రేకులయందు మన ప్రతి బింబము కొంచెము చిన్నదిగాను, స్వచ్ఛముగాను కనఁబడును. క్రీస్తు శతాబ్దమునకు పూర్వము, గాజు దర్పణములు, అక్కడక్కడ తెలిసియున్నను, రేకుటద్దములు, పదిపండ్రెండవ శతాబ్దమువఱకు వాడుకలో నున్నవి. గాజు దర్పణములను చేయుటలో ఈజిప్టు దేశస్థులు ప్రాచీనులు. వారు చక్కఁగా చెక్కిన గాజు ముక్కలకు వెనుక భాగమున వంగలోహము నద్ది, దర్పణములుగ వాడెడివారు. ఇప్పటి రోజులలో గాజు దర్పణములనే సాధారణముగ వాడుదుము. లోహపు టద్దములను, శాస్త్రీయోపకరణము లందును (Scientific instruments) ఇతర పనిముట్లలోను వాడుదుము.

పరిశ్రమ:—గాజు దర్పణములు చేయు విధము. క్రీ. శ. ౧౮౪౦-సంవత్సరమువఱకు వంగ పారదసమ్మేళనమును (Amalgam of tin and mercury) గాజు దర్పణములను చేయుట కుపయోగించెడివారు. అప్పటి నుంచి ముఖ్యముగ రజిత లవణములనే (Silver salts) వాడుక చేయుచున్నారు.

వంగపారద సమ్మేళనముతో దర్పణములు చేయుట :—దర్పణముగా తయారుచేయు అద్దము కన్న కొంచెము పెద్దదిగానున్న పలుచటి వంగము (తగరము) రేకును దీసికొని ఒక చతురపు బల్లమీఁద పఱచుము. రేకులో ముడతలు లేకుండ తిన్నఁగఁజేసి, దానిపైని కొంచెము పాదరసమును [illegible] పైపైని త్వరలో పూయుము. [illegible] తేలిన మడ్డిని (Scum) తీసివేసి, దర్పణము చేయు అద్దమును తేల్చుటకు సరిపోవు పాదరసమును రేకుపైని పోయుము (సుమారు $\frac{1}{4}$ అంగుళము మందము గలది సరిపోవును). ఇట్లు చేయు సమయములోనే అద్దమును గూడ అతి శుభ్రముగ కడుగునట్లు ఏర్పాటు చేసి, అద్దమును పాదరసముపై నుంచి కొంచెము ఇటు అటు జరుపుము. అద్దము క్రింది పాదరసము చాలవఱకు పైకి వచ్చువరకు అద్దము పైని బరువు నుంచుము. అప్పుడు బల్లను కొంచెముగా కదల్చిన మిగిలిన పాదరసముకూడ పైకి వచ్చివేయును. అద్దమును బరువు క్రింద ౨౪ గంటలుంచి, బహు జాగ్రత్తతో పెత్తి స్రవితము చేయబడిన నీటిలో (Distilled water) కడిగి, ఆరబెట్టిన, అది ఆరి గట్టిపడును. ఇట్లు బహు జాగ్రత్తతోఁ జేసిన వెండివలె మెరయు తెల్లని భాగము అద్దముపై ఏర్పడును. అట్టి అద్దమును, దర్పణముగ వాడవచ్చును. కాని ఈ ప్రకారముచేసిన దర్పణము చెమ్మ తగిలిన గాని, వేడి తగిలిన గాని కొంచెము కొంచెముగా చెడిపోవును. ఇదియే గాక, అటులు చేయునపుడు పాదరసపు ఆవిరి తగులుటవలన పనివాండ్రకతి ఘోరమైన ఆపదలుసంభవించుచుండును.

వెండి పూతతో దర్పణములను జేయుట:— ౧౮౩౫ సంవత్సరములో 'వాన్ లీబిగ్' ఈ పద్ధతిని కనిపెట్టెను. అమ్మోనియా కలిపిన రజిత నత్రిత ద్రావణమును (Ammoniacal solution of $AgNO_3$) ఆల్డిహైడుతో (Aldehyde) కలిపి, గాజు గొట్టములో వెచ్చ పెట్టఁగా, గొట్టము లోపలి భాగమంతయు వెండి పూత పూయఁబడెను. ఈ పద్ధతిని దర్పణములు చేయుటలో ౧౮౪౦ సం॥లో ఉపయోగించెను.

దర్పణము చేయు విధానము :—ఇందు పంచదార, రజిత నత్రితమును ($AgNO_3$) విభజించు

(Reduce) గుణమును ఆధారముగ తీసికొనఁబడెను. ఇందుకు ఈ క్రింది వస్తువులను అందు చెప్పిన పరిమాణములతోఁ జేర్చి (Reducing solution) విభజన ద్రావణమును తయారు చేయవలెను.

౨౮౮ భాగముల జలము.

౨౦ ,, పంచదార.

౨౦ ,, ఆల్కాహాల్ (Alcohol).

౧ ,, బజారు నత్రికామ్లము.

(Commercial pure H no.₃.)

ఈ క్రింది రీతిగ రజిత నత్రితద్రావణమును కూడ తయారు చేయవలెను:—రెండు భాగముల రజిత నత్రితమును ౨౦ భాగముల జలములో కలిపి దానికి స్ట్రాంగ్ అమోనియా అను ద్రావణమును కొంచెము కొంచెముగాఁజేర్పుము (ఎఱ్ఱబడు ద్రావణము రంగు లేనిదిగ మారువరకును చేర్పవలెను). దీనికి ౨౦ భాగముల జలములో $1\frac{1}{2}$ భాగములు అతి శుభ్రమైన పొటాసు, (Potash) కలుపుటచే వచ్చిన ద్రావణమును జేర్పుము. దీనికి పై అమ్మోనియా ద్రావణమును రంగు లేనిదిగ మారువఱకుఁ జేర్పుము. పిమ్మట ౧౬ భాగముల జలములో $\frac{1}{4}$ భాగము రజిత నత్రితము కలుపుటచే కలిగిన ద్రావణమును, పై ద్రావణము వట్టిగడ్డిరంగుకు మారువరకును జేర్చి దానిని, జలశోధన పత్రమున (Filter paper) వడపోయుము. అట్లు వడగట్టిన ద్రావణమును ఒక బుడ్డిలో భద్రపరుపుము. పై విభజన ద్రావణమునుగూడ ఇంకొక బుడ్డిలో పోసియుంచుము.

నత్రితలవణమునకు సగము పంచదారయుండునట్లు రెండు ద్రావణములలోను భాగములను దీసికొని, రెండింటిని కలిపి దానికి జలమునుజేర్చి యింకొక బుడ్డిలో నుంచుము. ఈ ద్రావణమును దర్పణముచేయుట కుపయోగించవలెను.

దర్పణముగ తయారుచేయు అద్దమును (Glass piece) ఇటునటు ఊగు ఒక బల్లమీఁద (Rocking table) నిలిపి, దానిని నత్రికామ్లముతోను, పిమ్మట పొటాసుతోను కడపట స్రవిత నీటితోను కడుగుము. కడిగిన అద్దముపైని, తయారుచేసిన ద్రావణమును కొంచెము కొంచెముగా పోయుచు బల్లను ఇటునటు కదుపుము. అట్లు పోయఁబడిన ద్రావణము మొదట ఎఱ్ఱబురదవలెపోయి పిదప మూఁడునాలుగు నిమిషములలో రంగులేనిదిగ మారుచు, ౫ నిమిషములలో అద్దముపైని వత్తుగ పూతయేర్పడును. అట్లే ద్రావణమును మరియొకసారిపోసి ఒకగంట యుంచుము. పిమ్మట దానిపై నీళ్ళను వంచివేసి, ఆల్కాహాల్ (Alcohol)తో ౫ లేక ౬ సార్లుకడిగి గాలికి ఎండఁబెట్టవలెను. అట్లు ఎండిన దానిని షామోయి (Chamois) తోలుతో తుడిచి దర్పణముగ వాడవచ్చును.

ఇట్లు పూసిన వెండిపూత, ఎండతగిలినగాని, గంధకపొగ తగిలినగాని త్వరలో చెడిపోవును. అదియును గాక పూత పసుపు రంగుకుమారును. ఇట్లు గాకుండుటకై పాదరక, శినిద ద్రావణముతో (dilute solution of mercury cyanide) ఆ పూతను తుడిచిన, తెల్లబడి బాగుగ నద్దుకొనును. అట్టి పూతరసాయనవికారములకుగాని, రాపిడికిగాని చెడకుండుటకు, లక్కగాని (shellac) కోపల్ వార్నిష్ (copal varnish) గాని పైపూతపూసి, ఆరినపిదప, రెండు గంగసింధూరపు (lead paint) పూతలుగాని, విద్యుత్ ప్రవాహములవలన రాగి గిల్టుగాని వేయుదురు. అందుచేతనే మనము చూచు పెద్ద అద్దముల వెనుకభాగము ఎఱ్ఱగ నుండును.

ప్లాటినపు దర్పణములు చేయువిధము :—మనకు చవుకగా తీర్థములలోను, సంతలలోను దొరకు అద్దములు పై రీతిని విలువగల పదార్థములతో చేయఁబడవు. అట్టివి అరణాకు, అణాకుగూడ దొరకును. వాటి వెనుకభాగము విలువగల అద్దములకువలె ఎఱ్ఱగ నుండక, కొంచెము వెలవెలపోవు నల్లరంగుగా యుండును. అది ప్లాటినపుపూత. ఇట్టి చవుకదర్పణములు

ఎక్కుడు ఫ్రాన్సు (France) దేశములో చేయఁబడును. ఈ పూత మిక్కిలి పలుచగాను, గట్టిగాను ఉండునట్లు అద్దబడును.

సీస ఏకామ్లజనిదము (litharge) సీసపుబోరేటు (borate of lead) కలసిన ద్రావణమును (Essential oil of spike - ఎస్సిన్షల్ ఆయిల్ ఆఫ్ స్పైకు) లో కలిపి, అద్దమునకుపూసి దానిని అంచులపై (on edges) మఫుల్డు ఫర్నేసు (Muffled furnace) లో నుంచి, దానిలో ప్లాటినము కాల్చిన, అది అద్దమునకు బహు పలుచనిపూతగ ఏర్పడును. అట్టి అద్దమును దర్పణముక్రింద వాడవచ్చును. కాని అది చిరకాలముండక త్వరలో చెడిపోవును. ఇట్టి దర్పణములను బొమ్మలు చేయుటలోను, చవుక రకపు ప్లేట్లమూతలుగాను ఉపయోగించుదురు.

పలువిధములైన దర్పణములు :—దర్పణములు సమతల దర్పణములనియు, వక్రదర్పణములనియు రెండు విధములు. వక్రదర్పణములు, పుటాకారదర్పణములనియు, కుంభాకార దర్పణములనియు తిరిగి రెండు విధములుగ నేర్పరుపబడినవి.


సమతల దర్పణములు :—సాధారణముగ మనము వాడు చూపుటద్దములు సమతల దర్పణములు. ఇవి శాస్త్రీయోపకరణములలో (Scientific instruments) కూడ ఉపయోగింతురు.

సమతల దర్పణముల మీది కిరణ పరావర్తనము :—మన ముఖము మీది కాంతి కిరణములు, అద్దముపై పరావర్తనము చెందుటవలన, అద్దములో మన బింబము కాన్పించును. ౧. సమతల దర్పణమ్ము మీద కిరణము, పరావర్తనము చెందునపుడు, పతన కిరణము, పరావృత్త కిరణము, లంబముతో సమకోణములు చేయును. ౨. ఈ రెండు కిరణములును, లంబమును సమతలమునందుండును. అనఁగా ఒకటి యెత్తు ప్రదేశమునను, మరియొకటి తగ్గు ప్రదేశమునను యెన్నడును-నుండవు. 3. పదార్థము దర్పణమున కెంత దూరమున నుండునో బింబముకూడ దర్పణము వెనుక నంతే దూరమున నుండును. పదార్థము అద్దము పైప్రకు జరిగిన బింబముకూడ అద్దము పైప్రకు జరుగును. వెనుకకు జరిగిన అద్దముగూడ వెనుకకుఁ జరుగును. ఠ పదార్థముయొక్క కుడిభాగమున బింబముయొక్క ఎడమభాగముండును. ఎడమ భాగము పైపుఁ బింబము కుడి భాగముండును. ప్రతి బింబము మనకు కనబడుట తప్ప, అద్దములో నేమియులేదు. ఆ బింబమును తెరమీఁద చూపుటకు వీలులేదు. అట్టి బింబమును "మిథ్యాబింబ" మందురు. మనము తల యొక్క వెనుక భాగము చూచుకొనఁ దలచిన, ఒక యద్దము వెనుకను, మరియొకటి ముందును ఇడుకొనుదుము. తల వెనుకభాగమునుండి కిరణములు వెనుకటి అద్దముపైఁ బడి పరావర్తనము చెంది, ముందర అద్దముపైఁ బడి తిరిగి పరావర్తనము చెంది మన కంటియందు ప్రవేశించును అందుచే తల వెనుక భాగము మనము చూడఁ గలము.

వక్ర దర్పణములు:—ఇవి సాధారణముగా తళతళ మెరయు లోహములతోఁ జేయఁబడును. గాజుతో గూడను చేయుదురు. వీటికి ఆకారమును బట్టి ఈ పేరు వచ్చినది. ఇవి ఎప్పుడును గోళముల భాగములై యుండును. గోళము యొక్క మధ్య వీటికి మధ్యమై యుండును. పరావర్తన ప్రదేశము పైభాగమైన కుంభాకార దర్పణములనియు, లోపలి భాగమైన పుటాకార దర్పణములనియు పేరు. పుటాకార దర్పణములే ఎక్కువగ వాడుకలో నున్నవి. పుటాకార దర్పణములు కొంచెము కుంభాకారముగ నుండెడివని చెప్పియున్నాము.


పుటాకార దర్పణముల మీది కిరణ పరావర్తనము :—ఇట్టి దర్పణములు వలయాకార పదార్థముల భాగము లగుటచే ప్రతి దానికిని వలయ

"మధ్యము" (మ) ఉండును. దర్పణామధ్య (ద) ను వలయ మధ్యముతో కలిపిన, గీచినగీత (దమ) "ముఖ్యా



క్షము" (Principal axis) అనబడును. (మ) కును, (ద) కును సగము దూరమున దర్పణముయొక్క "కేంద్రిము" (focus) ఉండును. ముఖ్యాక్షముతో సమానాంతరముగా (parallel) పడు కిరణము లన్నియు కేంద్రముగుండ పోవును.


ఇట్టిదర్పణములవలన కలుగు బింబములు:—
౧. పదార్థమతిదూరమున నున్నప్పుడు దాని బింబము కేంద్రములో నుండును. కేంద్రములో పదార్థముండిన దాని బింబము మిక్కిలి దూరమున నుండును. అపుడు అద్దమంతయు వెలుతురుతో నిండినట్లు కనబడును. ౨. పదార్థము దర్పణముయొక్క 'మధ్యము' న కొంత దూరములో నున్నప్పుడు బింబము కేంద్రమునకు,



పప పదార్థము

బబ బింబము

మధ్యమునకు, మధ్యనుండును. ఈ బింబము చిన్నది గాను, తలక్రిందుగను ఉండును. పదార్థము మధ్యమును సమీపించినకొలఁది, బింబము కేంద్రమును విడిచి మధ్యమును సమీపించుచుండును. ౩. పదార్థము మధ్యము దగ్గఱనుండిన, బింబముకూడ మధ్యముయొద్దనే తలక్రిందుగను, సమానపొడవుగను ఉండును. ౪. పదార్థము 'కేంద్రిము', 'మధ్యము' నకు మధ్యనుండిన, మధ్యమునకావల, తలక్రిందుగ పదార్థముకంటె పెద్దప్రమాణముగల బింబముండును. ఈ బింబములున్నచోట తెరయుంచిన అవియన్నియు, తెరమీఁద తలక్రిందుగ కాన్పించును. కనుక పైఁజెప్పిన బింబములన్నియు నిజమైన బింబములు. ౫. పదార్థము కేంద్రమునకు, దర్పణమునకు మధ్యనుండిన, బింబము అద్దమునకావల నిలువుగాను, (erect) పెద్దదిగాను కాన్పించును. ఇట్టి బింబము తెరమీఁద వేయఁబడదు; గనుక ఇది చూపు-




పప పదార్థము

బబ బింబము

టద్దమునందలి బింబమువలె మిథ్యాబింబము. ఇట్టి అద్దములను ముఖమునకు దగ్గరగా పెట్టుకొని చూచుకొనిన వికృతములైన పెద్దబింబములు కాన్పించును. కనుక యిట్టి అద్దము లెన్నడును చూపుటద్దములక్రింద వాడరు.

కుంభాకార దర్పణములమీది కిరణపరావర్తనము:—పదార్థము అతిదూరముననున్న దర్పణముమీఁదఁబడు కిరణములు వ్యాపక కిరణములు

(Divergent rays) గా పోవును. కాని పదార్థము కొంచెము దూరములో నెక్కడున్నను, బింబము అద్ద




పప పదార్థము
బబ బింబము

మునకు వెనుకభాగమున చిన్నదిగాను, నిలువు (erect) గాను కాన్పించును. పదార్థము అద్దము దగ్గరకు వచ్చినకొలది, బింబము పెద్దదియగుచు అద్దము వైపునకు వచ్చును. ఇట్టి అద్దములవలన కలుగు బింబము తలక్రిందుగ నుండనేరదు. అందుచేతనే పూర్వపు రేకు టద్దములు కొంచెము కుంభాకారముగ నుండెడివి.

ఉపయోగములు:—సాధారణముగా అద్దములను, ముఖ బింబములను జూచుకొనుటకు ఉపయోగింతురని అందరకును తెలిసిన సంగతియే. పెద్ద అద్దములను గొప్ప భవనముల నలంకరించుటలో ఉపయోగించెదరు. ప్రస్తుతము అట్లు ఉపయోగించు అద్దములన్నియు సమతల దర్పణములు. వక్ర దర్పణములనుముఖ్యముగా శాస్త్రీయోపకరణములలోను (Scientific instruments) ఇతర పని ముట్లలోను వాడుదురు. గోడ దీపములలోను, తొక్కుడు బండ్ల మోటారుబండ్ల దీపములలోను, వెనుక భాగమున వక్ర దర్పణము లుండుట మన మెరుగుదుము. ఇట్టివి, దీపముల వెనుకనుండి, దీప కిరణములను, చక్కగ ప్రతిఫలింపజేసి, దాని కాంతిని ఎక్కువగజేయునట్లు కానబడును. అట్టి అద్దములు లేకపోయిన, దీపపు కాంతి అంత యెక్కువగ నుండదు. వాటి పని దీపపు కిరణములను అన్ని వైపులకు చెదరకుండ చేసి, వాటి మీద కను కిరణము లన్నిటిని ఒకే వైపునకు ప్రవర్తింపజేయుట. కనుకనే స్టేషనులలోని దీపములకు ముందు పెద్ద కాంతి కనబడును. ప్రక్కలకు అంతగా నుండదు. అట్టి అద్దములను ఈ క్రింది ఉపకరణములలోను గూడ ఉపయోగించెదరు.

దూరదర్శిని (Telescope):—సముద్రము మీదను పోవు ఓడలకు, ఆకాశము నందుండు నక్షత్రములను, యుద్ధము నందుకొని, దూరముగనున్న వస్తువులను చూచుటకు, దీని నుపయోగించుదురు. ప్రస్తుతపు దూరదర్శినులందు కటకము (Lenses) లను ఉపయోగించుచున్నారు. కాని పూర్వము, నక్షత్రమండలమును పరిశోధించుటకు కటక దూరదర్శినుల కన్న, దర్పణ దూరదర్శినులను ఎక్కువగా నుపయోగించెడివారు. అట్టి దూరదర్శిని నుపయోగించిన వారిలో న్యూటన్ (Newton) మొదటి వాడు.

'హెర్షల్' దూరదర్శిని:—దర్పణ దూరదర్శిని సహాయము చేత 'హెర్షల్' (Herschel) తన, వానితో బుట్టువారును, ప్రతిరాత్రియును పరిశోధించుచు, నిధి బృందము నంతయు రెండు సారులు గలిగిరి. వారి యుపకరణము ఈ క్రింది విధముగా నేర్పరచబడెను.



'అఅ' అనునది పుటాకార దర్పణము. 'మమ' అను గీత ముఖ్యాక్షముగునట్లు, దర్పణమును కొంచెము వంపుగా నుంచిరి. అట్లు వంపుగా నుంచుటవలన

దర్పణముయొక్క కేంద్రమునందు ఏర్పడు బింబము 'క' అను ద్వారము వద్ద చూచుటకు వీలగును. న్యూటన్ దూరదర్శినియందు సమతల దర్పణము మీఁద పరావర్తనముచే బింబముయొక్క కాంతి తగ్గును. బింబము కాంతి విహీనముగాకుండుటకు హెర్షల్ యీ పద్ధతిని అవలంబించెను. [చో. వెం. కృ.]

అదావత్. బొంబయిరాజధాని, తూర్పు ఖాందేశీజిల్లా, చోప్డాతాలూకాలోని గ్రామము. జనసంఖ్య రమారమి ఆఱువేలు. ఇందు పాడుబడ్డకోట యొకటి కలదు. గ్రామమున కుత్తరమున ౧౬౭౦ లో కట్టఁబడిన మసీదు ఒకటి కలదు. వాయువ్యదిక్కున మూఁడుమైళ్లదూరమున వేడినీళ్ళ జలలు కలవు.

అడాస్ (అడ్డాస్). బొంబాయి రాజధాని, కైరాజిల్లాలో నొకమైదానము. ఇది 'ఆనంద్' అను తాలూకా గ్రామమునకును 'మహీ' అను ఏటికిని నడుమనుండును. ఇటీవలి కాలమున నీయది మూఁడు యుద్ధములకు తావయ్యెను. మొదటి యుద్ధమున, సూరతు పట్టణములో ఢిల్లీశ్వరుని ప్రతినిధియైన 'రుస్తుమ్‌అలీ' అనువాఁడు 'పిలాజీగాయకవాడ్' అనువాని మోసముచే నిజాముల్ ముల్కునకు ప్రతినిధియైన అమిడ్‌ఖానునిచేఁ జంపఁబడియెను. (౧౭౨౩)

రెండవయుద్ధమున, ఇంగ్లీషువారిలోఁ గలిసిన రఘునాధరావును నానాఫడనవీసుపక్షపు మహారాష్ట్రవీరు లోడించిరి. (౧౭౭౫ ఫిబ్రవరి).

మూఁడవయుద్ధమున ఇంగ్లీషువారు మిక్కిలి కష్టము మీఁద మహారాష్ట్రుల నోడించిరి (౧౭౭౫ మే ౧౭ తేది). ఇంగ్లీషువారు గెలిచినను వారికే మిక్కిలినష్టము వచ్చెనని ఒక ఆంగ్లేయుఁడే వ్రాసియున్నాఁడు.*

*"Victory was dearly bought. Of 15 British officers in the advanced division, seven were killed and four wounded. Eighty Europeans, a number of native officers, and 200 men, were killed or missing."—

James Forbes.

అదితి. ప్రాచేతసదక్షునికన్య. కశ్యప మహర్షి యొక్క పదుమువ్వురు భార్యలలో నొకతె. ద్వాదశాదిత్యులకుఁ దల్లి.

అదిరామపట్టణము. ఈ పురము తంజావూరు జిల్లాలోని 'పట్టుకోట్టాయి' అను తాలూకాలోనున్నది. ఇదియొక ఓడరేవు. సింహళద్వీపముతో మంచి వర్తకము జరుగుచున్నది. జనసంఖ్య ౧౦౪౯౪. ఇక్కడ వర్తకము చేయువారలు మహమ్మదీయ మతస్థులగు లబ్బీలనఁబడు నొక తెగవారు. ఇక్కడ నొకఉప్పుఫ్యాక్టరీ గలదు. శివాలయ మొకటి యున్నది.

అదిల్‌ఖాన్ II, ఫరూకీ. ఈతఁడు గుజరాత్ దేశస్థుఁడు. క్రీ. శ. ౧౪౫౭లో దావుద్‌ఖాన్ మరణానంతరమున ఈతఁడు ఖాందేశ నగరమునకు అధిపతి అయ్యెను. ఈతఁడు తన ముఖ్యపట్టణమగు టల్నార్ అను పురమును విడచి బర్హాన్‌పురమును తనకు రాజధానిగ జేసికొనెను. పదిసంవత్సరముల కాలము ఖాందేశమును పాలించి ౧౫౦౧ లో మరణించెను. ఈతని యనంతరమున ఈతని అప్పకుమారుఁడగు బహదూర్‌షా యీదేశమునకు పాలకుఁడయ్యెను.

అద్రిక. ఒక యప్సరస శాపముచే మత్స్యయోనిం జెందినప్పుడు, దీని యుదరమున మత్స్యరాజను పుత్రుఁడును, మత్స్యగంధియను పుత్రికయుఁ బుట్టిరి. [చూడు. 'ఉపరిచరవసువు']

అదీసురుఁడు. బంగాళదేశపు రాజు. చాల చదువుకొనినవాఁడు. ఇతఁడు పదియవశతాబ్దాంతమునందుండి నట్లగపడుచున్నది.

అదృశ్యంతి. మైత్రావరుణి వసిష్ఠుని పుత్రుఁడైన శక్తియను మహర్షియొక్క భార్య. పరాశర మహర్షికిఁదల్లి.

అద్వైతము.

అసంఖ్యా చిదచిద్వస్తుభరితంబైన యీ ప్రపంచమునకు మూలకారణములు పెక్కులు గలవని మానవజాతియొక్క బాల్యావస్థయందు నమ్మినను, జ్ఞానాభివృద్ధియై తత్త్వవిచారము హెచ్చిన కొలఁదిని, ఈయనంతమైన సృష్టికి మూలకారణమొక్కటియే యనియు, నందుండియే ఇదియంతయు ననఁగా నసంఖ్యములయిన నామరూపములచేతను, వస్తుస్వరూపంబులచేతను, కర్తృభోక్తలచేతను, నిండియున్న యీవిశ్వమంతయుఁ బుట్టినదనియు, పండితులు నిశ్చయింపసాగిరి. 'ఏకంసత్ విప్రాబహుధావదన్తి' * (ఋగ్వే ౧౦-౮౨-౩) అను ఋగ్వేదమంత్రము, ప్రపంచోత్పత్తిని దెలిసికొనుటకు మానవబుద్ధిపడిన పాటుయొక్క పరమావధిని జూపును. ఇట్లు మూల కారణైకత్వము స్ఫురించినతోడనే, యాకారణముయొక్క స్వరూపమును గుఱించి తర్కములు ప్రారంభమాయెను. ఈకారణము జడమనికొందఱును 1, చైతన్యమని కొందఱును 2, జడచైతన్యాత్మకమని కొందఱును 3, నిర్గుణమని కొందఱును 4, సగుణమని కొందఱును 5, కారణమగు బ్రహ్మకార్యమైన ప్రపంచముకంటె భిన్నముకాదని కొందఱును 6, భిన్నమనికొందఱును 7, భిన్నాభిన్నమని కొందఱును 8, ప్రతిపాదింపఁదొడంగిరి.

ఇట్లు మనదేశమునందు అద్వైత మను పేరిటను, పాశ్చాత్య దేశములందు మోనిజమ్ (Monism-ఏకత్వవాదము), ప్యాంథీజమ్ (Pantheism - ప్రపంచపరమాత్మైక్యమతము), అను పేరిటను మిక్కిలి పురాతన కాలమునుండి పెక్కుదర్శనములు వెలసినవి. హిందూదేశమునందు బుద్ధుఁడు, శంకరుఁడు, నీలకంఠుఁడు, రామానుజుఁడు, వల్లభుఁడు మొదలగు నాచార్యులును, పాశ్చాత్య దేశమునందు జనోఫెనస్, ప్లాటినస్, స్పైనోజా, హేగల్, హేకెల్ మొదలైన తత్వవేత్తలనేకులును వేలువేలువిధములయిన అద్వైతసిద్ధాంతములను తమ బుద్ధిచాతుర్యములఁజూపుచుఁబ్రతిపాదించిరి.

వానినన్నిఁటిని ఇచ్చటచర్చించుట యనావశ్యకము. ఆయా తత్త్వవేత్తలనుగుఱించి వ్రాయునపుడు వారి వారి దర్శనములు వర్ణింపఁబడును. ఈ వ్యాసమునందు హిందూదేశమందలి ముఖ్యములగుమూఁడువిధములయిన యద్వైతదర్శనములను, పాశ్చాత్య దేశమందలి రెండు యద్వైతదర్శనములనువర్ణింపఁదలఁచినారము. ఈదేశమునందు మిక్కిలి ప్రఖ్యాతి చెందినదియు, పరదేశీయులచేఁ బొగడ్తగన్నదియు, నధికప్రచారము గలదియు నైనది శాంకరాద్వైతము. అద్వైతమనిన సాధారణముగ దీనికే పేరు. దీనిని మనము కేవలాద్వైతమందము. రామానుజాచార్యులవారిచేఁబ్రతిపాదింపఁబడినది కూడ అద్వైతమే; కాని దానియొక్క విశేషలక్షణమును బట్టి దానిని విశిష్టాద్వైత మందురు. వల్లభాచార్యుఁడు శంకరాచార్యుని మిక్కిలి ద్వేషించు వాఁడైనను, తనమతమునకు శుద్ధాద్వైతమనిపేరు పెట్టెను. కావున నిది మూఁడవయద్వైతము. హిందూదేశమందలి యీ మూఁడు అద్వైతదర్శనములను, క్రమముగ నిందు వర్ణింపఁబడును. పాశ్చాత్య శాస్త్రజ్ఞాన భాండారములనొక్కచోటికిఁదెచ్చుట మాప్రతిజ్ఞ. కావున పాశ్చాత్యతత్త్వవేత్తలలో నద్వైత తత్త్వమును చక్కఁగను పూర్తిగను మీమాంసించిన ప్లోటినస్ స్పైనోజా లనఁబడుమహర్షులయొక్క సిద్ధాంతములను గూడ నీవ్యాసమునందుఁ బొందుపఱిచెదము.

౧ శంకరాచార్యుఁడు మళయాళ దేశజుఁడు. క్రీ.శ. ౭-వ శతాబ్దము వాఁడని కొందఱును ౮-వ శతాబ్దము వాఁడని మఱికొందఱును చెప్పుదురు. రామానుజా

---

* 'ఒకటిగానున్నదానిని పండితు లనేకవిధములఁ జెప్పుచున్నారు.

1 బౌద్ధులు, సాంఖ్యులు, హేకెల్ వంటి పాశ్చాత్య భౌతిక శాస్త్రజ్ఞులు. 2 వేదాంతులు మొదలైనవారు. 3 విశిష్టాద్వైతులు, స్పైనోజామతస్థులు మొదలగువారు. 4 శాంకరాద్వైతులు, స్పైనోజా మొదలగువారు. 5 విశిష్టాద్వైతులు మొదలగువారు. 6 శాంకరాదులు. 7 మధ్వాచార్యులు. 8 నింబార్కుఁడు.

చార్యుఁడు ద్రవిడదేశమందు క్రీ. శ. ౧౦౧౭ (శా. శ. ౯౩౮)సం॥మున జన్మించినవాఁడు. వల్లభాచార్యుఁ డాంధ్రుఁడు, ఆంధ్రుఁడైనను తన మతమును గుజరాతుఁ దేశమునందు స్థాపించెను. ఈతఁడు క్రీ.శ. ౧౪౭౯ మొదలు ౧౫౩౦వఱకు నున్నవాఁడు. ప్లోటినస్, ఈజిప్టు దేశమందు క్రీ. శ. ౨౦౪ లో జన్మించి రోమపట్టణమునకు ౨౪౩ లోఁబోయి తన తత్త్వ జ్ఞానమును లోకులకు బోధించుటకై ఒక పాఠశాలను స్థాపించెను. ౨౭౦ లోఁ గాలధర్మము నొందెను. స్పైనోజా, ఆమ్‌స్టర్ డ్యాముపట్టణమందు క్రీ.శ.౧౬౩౨లో జన్మించి హేగ్ పట్టణమున క్రీ. శ. ౧౬౭౭ లోఁ గీర్తిశేషుఁడయ్యెను. ఈతఁడు వైరాగ్యాతిశయముచే భూషితుఁడై మన పూర్వ ఋషులను బోలియుండెను.

ఈ తత్త్వవేత్తలచరిత్రాదులుసవిస్తరముగా వారివారి నామములక్రింద వర్ణింపఁబడును. ఇచ్చటవారి తత్త్వ సిద్ధాంతములను వర్ణించుటయే ప్రయోజనము కౌన వారి చరిత్రాంశములు వ్రాయఁబడక వారి దేశకాలముల మాత్రము చదువరుల జ్ఞాపకార్థమై సూచింపఁబడినవి.

ప్రస్తుతము మాకు శంకర రామానుజాదులతత్త్వవిచారముతోఁ. బనికాని, మతమతాంతరులయొక్క, భస్మధారణము, ముద్రాధారణము మొదలయిన యాచారవ్యవహారములతోఁ బనిలేదు. కావున నిట్టి సంస్కారవిశేషము లాయామతములు వర్ణించునప్పుడు చెప్పఁబడును. ఇచ్చట వదలివేయఁబడును.

•[ము. సం.

౧. కేవలాద్వైతము

(శ్రీ శంకరాచార్య మతానుసారము)

ఇది ఈ హిందూదేశములోఁబుట్టి ఇప్పుడు సర్వదేశములయందుఁ బ్రసిద్ధినిపొంది శ్లాఘింపఁబడుచున్న ఒక మతముపేరు. జీవాత్మ పరమాత్మలు వేఱువేఱనియు, బ్రహ్మము జగత్తు రెండును సత్యపదార్థములనియుఁ జెప్పునది ద్వైతము. అందునకు వ్యతిరేకముగాఁ జెప్పునది అద్వైతము. అద్వైతముయొక్క పరమసిద్ధాన్తములను మూఁడు మాటలలో సంగ్రహించి చెప్పిరి. "బ్రహ్మసత్యం జగన్మిథ్యా జీవో బ్రహ్మైవ నాపరః":-అనఁగా బ్రహ్మమొక్కటియే సత్యము;జగత్తు సర్వముమిథ్య; జీవుఁడు బ్రహ్మమె, బ్రహ్మము కంటె వేఱు గాఁడు. ఇది శ్రీశంకరాచార్యులవారు నిశ్చయించి స్థాపించిన మతము. ఇంతమాత్రముచే నది వారు క్రొత్తఁగాఁ గల్పించిన మతమని చెప్పఁగూడదు. ఈ హిందూదేశములో ప్రధానముగాఁ బ్రచారములో నున్న మతముల వారెల్లరు వేదములను ముఖ్యప్రమాణముగా గ్రహించినవారే. వారందఱు తమతమసిద్ధాంతములకు శ్రుతి ప్రమాణములను జూపించుచు నందులకుదఁగిన యుక్తులను గూడఁ జేర్చిబోధించుదురుగాని, వేదమును వదలి కేవల యుక్తిని ఆధారముగాఁ జేసికొన్న వారుగారు. కాన అద్వైతమునకుఁగూడ శ్రుతియే ప్రధానమైన ప్రమాణము. వేదము లపౌరుషేయములు, స్వతఃప్రమాణము లని వారందఱును ఒప్పిన విషయము. అవి ప్రతిపాదించు విషయమును బట్టి ఆవేదములను కర్మభాగము జ్ఞానభాగమని రెండు భాగములుగా విభజించిరి. సాధారణముగా మంత్ర బ్రాహ్మణములు కర్మను బ్రతిపాదించునవి. ఉపనిషత్తులు జ్ఞానమును బ్రతిపాదించునవి. ఉపనిషత్తులు వేద

ములయొక్క చివర భాగములు లగుటంజేసి వేదాన్తము లనికూడ నుడువఁబడెను. ఆవేదాంతములలోఁ బ్రతిపాదింపఁబడువిద్య జ్ఞానవిద్య యగుటవలన, ఆవిద్యకుఁగూడ వేదాన్తమని వ్యవహారము గలిగినది.

ఆయా మతాచార్యులు, శ్రుతులనేగాక వ్యాస సూత్రములను భగవద్గీతలను గూడఁ ప్రమాణముగా గ్రహించియుండిరి. సంవాదార్థమయి స్మృతి పురాణేతిహాస వచనములనుగూడ నుదాహరించుట గలదు. వ్యాసులవారు, ఉపనిషత్తులయొక్క అర్థ విచారము చేసి వానినన్నిటిని సమన్వయింపఁజేసి ఉపనిషన్మతము ఎట్టిదో అను పూర్వికగా నిరూపించుటకు బ్రహ్మసూత్రములను రచియించిరి. కాని అవి అత్యల్పాక్షరములుగాను, అతిక్లిష్టముగాను ఉండుటచే వ్యాసులవారి తాత్పర్యము వానివలనఁగనిపెట్టుట దుర్ఘటమయినది. వానికంటెఁ బై యుపనిషత్తులు సుగమములు. అయినను 'అనంతా వై వేదాః' అనిచెప్పిన అనంత వేదములను క్రోడీకరించి వానిని విభాగముచేసి ఒకదారికిఁదెచ్చి ఇప్పుడు వాడుకలోనున్న ప్రకారము ప్రవర్తింపఁజేసిన శ్రీ వేదవ్యాసులు పై యుపనిషత్సారమును నేవిధముగా గ్రహించిరో అవశ్యముగాఁ దెలిసికొనఁదగినది. కాఁబట్టి 'శ్రుతులు ఏమిచెప్పినవి? వ్యాసులవారు, ఆశ్రుతులు ఏమిచెప్పినవని చెప్పిరి? సర్వజ్ఞుఁడు భగవంతుఁడు నయిన శ్రీకృష్ణ భగవానులు భగవద్గీతలద్వారమునలోకమున కేమి బోధించిరి?' అని ఈ దేశములోని మతాచార్యులందఱు విమర్శించిరి. నిజమునకు బ్రహ్మ ముఖమునుండి నిశ్శ్వాస రూపముగా వచ్చినవని చెప్పఁబడినట్టి, అతీంద్రియ జ్ఞానముగల ఋషులచే దృష్టములయియున్న, శ్రుతులకంటెఁ దత్త్వమును బోధించునవి ఏవి యుండును? అట్టి వ్యాసుల వారికంటె, ఆశ్రుతుల తాత్పర్యమును సరిగాఁ జెప్పఁగలవారెవ్వరు గలరు? శ్రీకృష్ణ పరమాత్మకంటె తత్త్వజ్ఞులు ఎవరు? కాన, అతీంద్రియ విషయమయిన ఆత్మ తత్త్వమును దెలిసికొనుటకు శ్రుతులను సూత్రములను గీతలను బ్రమాణముగా నంగీకరించుట న్యాయము.

ప్రస్థానత్రయము

కాని, విషయమతీంద్రియ మగుటవలన, ఆ శ్రుత్యాదులయొక్క తాత్పర్య నిర్ణయములో నాయా మత స్థాపకులకు, అభిప్రాయ భేదములు ఏర్పడి, వేలువేలు మతములు బయలు వెడలెను. వారిలో నొకరు శ్రీ శంకరాచార్యుల వారు. వారు నిర్ణయించిన మతమె అద్వైతము. దానిని శాంకర మతమనిగూడఁ జెప్పుదురు. శంకరాచార్యులవారు శ్రుతులు సూత్రములు గీతలు నన్నియు కేవలాద్వైతమును బోధించుచున్నవని అనేకోపపత్తులతో బహుధాఁ బ్రతిపాదించుచు, ఆ మూఁడు ప్రస్థానములకు భాష్యము రచియించిరి. వారు శ్రుత్య

అద్వైత గ్రంథకర్తలు

విరుద్ధమైన యుక్తులనుగూడ విశేషముగాఁ జూపిరి. విద్వదనుభవమును గూడ నొక ప్రమాణముగా నంగీకరించిరి. విద్వాంసులు అనఁగా తత్త్వజ్ఞులు. ఇవ్విధముగా, వారు అద్వైతమును గురించి సప్రమాణముగాను, సయుక్తికముగాను భాష్యములను,ఇంక ననేక స్వతంత్ర గ్రంథములను రచియించి యుండిరి. వారి తర్వాత, సురేశ్వరాచార్యులు, సర్వజ్ఞముని, వాచస్పతి మిశ్రులు, వివరణకారులు, విద్యారణ్యస్వాములు,మధుసూదనస్వాములు, అప్పయ్య దీక్షితులు, మొదలగువారు శంకర మతమును విశేషముగా బోధించుచు బహు గ్రంథములువ్రాసిరి. ఆగ్రంథకర్తలు,అద్వైత రహస్యమగు జీవబ్రహ్మైక్యమును శ్రోతల బుద్ధులకుఁ జక్కఁగా నెక్కునట్లు ఉపపాదించుటలో నొక్కొక రీతిని వెళ్ళిరి. అందువల్ల కొన్ని యవాంతర విషయములలో, వారిలో తాత్పర్య భేదములు గనఁబడును.* అయినను, ఆరంభములో సంగ్రహముగాఁ జెప్పిన ప్రధాన సిద్ధాంతములలో నందఱు నొక్కటిగానే వెళ్ళిరి. ఎవ్వరయినను, అద్వైత మతమును నుపపాదించువారు ముఖ్యముగా శాంకర గ్రంథముల ననుసరించియే వెళ్ళవలసి యుండును.

* శాంకరాద్వైతులలోఁ గల యీ మతభేదము లన్నియు అప్పయదీక్షితులచే రచియింపఁబడినసిద్ధాంతలేశ సంగ్రహమను గ్రంథమునందుఁ జక్కఁగ నీయఁబడినవి.

(ము. శం.)

"బ్రహ్మసత్యం".—బ్రహ్మము యొక్కటియె సత్యము. బ్రహ్మ మనఁగా నెద్ది?

బ్రహ్మము జగత్తునకుఁ గారణము

"యతో వా ఇమాని భూతాని జాయంతే ।
యేన జాతాని జీవన్తి ।
యత్ప్రయన్త్యభిసంవిశన్తి । తద్విజిజ్ఞాసస్వ । తద్బ్రహ్మేతి" (తైత్తి. 3-౧-౧) అను శ్రుతిలోఁ జెప్పఁబడినది బ్రహ్మము. ఈ సర్వభూతములు — ఈ సర్వ ప్రపంచము — దేనిలోనుండి పుట్టినవో, దేనియం దున్నవో, తుదకు దేనియందు లయించుచున్నవో, అది బ్రహ్మమని చెప్పఁబడినది. సర్వ ప్రపంచమునకు నుత్పత్తి స్థితి లయకారణము బ్రహ్మము. ఈ లక్షణము వలన బ్రహ్మము స్వరూపమిట్టి దని తెలియుట లేదు; కాని శాఖా చంద్ర న్యాయముగా - ఆ కొమ్మమీఁదుగాఁ గనఁబడునది చంద్రుఁడని చెప్పినట్లు - జగత్తునకుఁ గారణము బ్రహ్మ మని చెప్పఁబడినది. ఈ చెప్పినలక్షణమును శాస్త్రజ్ఞులు తటస్థ లక్షణ మని వాడుదురు. స్వరూపమును గుఱించి ముందుఁ జెప్పెదము. పైఁజెప్పినత్రివిధకారణత్వమువలన, జగత్తునకు బ్రహ్మము 'అభిన్న నిమిత్తోపాదాన కారణము' అనఁగా నిమిత్త కారణము, ఉపాదాన కారణము నుభయము నయినది. లోకములో ఘటాదులకు కులాలాదులు - (కుమ్మరి మొదలగు) నిమిత్త కారణముగాను, మృదాదులు (మట్టిమున్నగునవి) ఉపాదాన కారణముగాను వేఱు వేఱుగా

నున్నవి. జగత్తునకు రెండు కారణములు బ్రహ్మమే. ఉత్పత్తికారణమని చెప్పుటచే నిమిత్త కారణత్వమును, లయకారణమని చెప్పుటచే నుపాదాన కారణత్వమును, రెండును బ్రహ్మమునకు సిద్ధించినవి.

మనకు ననుభవములోఁ గనఁబడు నీ స్థూల ప్రపంచము కార్యరూపమనియు, దీనికి, ఆదిని సూక్ష్మరూపమగు పరమ కారణము ఉండి తీరవలెననియు, అన్ని దేశములలోని భౌతిక శాస్త్రజ్ఞులు, తత్త్వశాస్త్రజ్ఞులు, ఒప్పి విమర్శించియున్నారు. వారిలోఁ గొందఱు ఉపాదాన కారణమును మాత్రమే విమర్శించిరి. మరి కొందఱు ఉభయ కారణములను విమర్శించిరి. తుదకు వారు జగత్కారణముల వేఱు వేఱుగా నుడివిరి. సాంఖ్యులు ప్రధానమును, తార్కికులు అణువులను, ఆగమానుయాయులు హిరణ్యగర్భ తత్త్వమును, మరి కొందఱు కొన్నిటిని, పాశ్చాత్త్యులు కొన్ని తత్త్వములను,ఆదికారణముగా నిర్ణయించిరి. కాని వారెవ్వరును, అద్వైతులు వెళ్ళినంత దూరము వెళ్ళి విమర్శించినట్లు కనంబడదు. నానారూపములతో విజృంభితమయి ప్రతినియత దేశకాల నిమిత్త క్రియాఫలముల కాశ్రయమయి, అనేక కర్తృభోక్తృభూయిష్ఠమయియున్న ఈ విచిత్రప్రపంచమునకు, కేవల జడమయిన ప్రధానముగాని, పరమాణువులు గాని మరియొకటిగాని తగుకారణము కానేరదు. సర్వజ్ఞత్వసర్వశక్తిమత్త్వములుగల చేతనకారణమును ఒప్పి తీరవలె. అభావము పరమకారణమని శూన్యవాదులు చెప్పుమాట పాటింపులోనికి తేఁదగినది కాదు. "కథమసతస్సజ్జాయేత" (శూన్యములోనుంచి సత్పదార్థమెట్లుపుట్టును?) అనుశ్రుతి యట్లుండఁగా, ప్రపంచములేని కేవలశూన్యము అచింత్యము, అసంభావ్యము.

బ్రహ్మపదార్థము జగత్కారణమని పయిని జెప్పఁబడిన శ్రుతియేగాక, 'జన్మాద్యస్యయతః * అను బ్రహ్మసూత్రమును, (౧.౧.౨) 'అహంకృత్స్నస్యజగతః ప్రభవః ప్రళయస్తథా'† (౭-౬) అను గీతావాక్యమును, ప్రమాణములు. బ్రహ్మము జగత్కారణమని సర్వోపనిషత్తులలోను జెప్పఁబడియున్నది. దానినే ఛాందోగ్యములో నొకచోట 'ఆకాశ' (౧-౯-౧), మని మరియొకచోట 'ప్రాణ'(౧-౧౧-౫) మని, బృహదారణ్యకములో 'అంతర్యామి' (౩-౭-౧)అని,ముండకములో 'భూతయోని' (౧-౧-౬)అని, మొదలగు వేఱువేఱు పేర్లతో నక్కడక్కడ వాడిరి. సర్వ జగత్తునకు నుత్పత్తి స్థితిలయకారణమగునది నిత్యము, సర్వవ్యాపి, సర్వజ్ఞము, సర్వశక్తిమత్తు, సర్వాత్మకము నయియుండవలెను. ఈ ధర్మములతో శ్రుతులలోఁ జెప్పఁ

* ఈ ప్రపంచముయొక్క యుత్పత్తిస్థితిలయములు బ్రహ్మమువలనఁ గలిగినవి.

† నేను సమస్తజగత్తును బుట్టించువాఁడను, గిట్టించువాఁడను.

బడిన జగత్కారణము, అద్వైతులు ఒప్పిన బ్రహ్మముగాని సాంఖ్యులుచెప్పు ప్రధానము లేక అణ్వాదులును కానేరదు. ఈ సంగతినే బ్రహ్మసూత్రకారులుప్రథమాధ్యాయములో నిర్ణయించిరి. దానినే భాష్యకారులు భాష్యములో విపులముగఁ బ్రతిపాదించిరి.

భిన్నప్రకృతులయిన జగత్తునకు బ్రహ్మమునకుఁ గల సంబంధము

కారణము నిమిత్తమని ఉపాదానమని రెండు విధములు. బ్రహ్మము రెండు విధముల కారణమని చెప్పితిమి. మృత్సువర్ణాదులు ఘటకంకణాదులకు నుపాదానమయినట్లు బ్రహ్మము జగదుపాదానమంటిరిగదా! చేతనము, అత్యంత పరిశుద్ధమునయిన బ్రహ్మమునకును కేవలజడము, అత్యంతాపరిశుద్ధము, సుఖదుఃఖ మోహాత్మకము, రాగద్వేష ప్రీతి పరితాపాది విశిష్టము, అయిన ప్రపంచమునకును, కార్యకారణ భావములోఁ బ్రకృతివికార భావమెట్లు సంభవించును? ప్రకృతి ధర్మములు వికారమం దుండితీరవలయు. ఇక్కడ కార్యమగు ప్రపంచమునందుఁ గారణవిరుద్ధ ధర్మములు గనఁబడుచున్నవి. కాబట్టిబ్రహ్మ కారణవాదము సమంజసముకాదు. శాబ్దప్రమాణమెంతయుండినను, లోకానుభవమునకు విరుద్ధమయినది విశ్వసనీయము గానేరదు. అని పూర్వపక్షులాక్షేపించిరి.

ఇందునకు సమాధానము. అత్యంత సారూప్య మున్నచోట ప్రకృతి వికారభావము ఉండనే యుండదు. ప్రకృతి వికారభావమున్నచోట్ల కొన్నియంశములలో సారూప్యముండి మరికొన్ని యంశములలో వైరూప్యముండితీరవలయు! ప్రకృతములో బ్రహ్మమం దుండు సత్తాంశము జగత్తునం దనువర్తించుచున్నది. చైతన్యపారిశుద్ధ్యాదులు కారణగత విలక్షణాంశములు. అవి కార్యమునందు సంక్రమించలేదు. జాడ్యా పరిశుద్ధ్యాదులు కార్యభూత ప్రపంచముయొక్క విలక్షణాంశములు గాని కారణములోనుండి వచ్చినవిగావు. కానబ్రహ్మము జగత్కారణమనుటకు బాధ లేదు. ఇంతేగాదు.

ఉపాదాన కారణ భేదములు:
౧ పరిణామము
౨ వివర్తము

ఉపాదాన కారణము పరిణామోపాదానము, వివర్తోపాదానము, అని రెండు విధములు. 'కారణ సమసత్తాకమగు నన్యథాభావము పరిణామము. కారణవిషమ సత్తాకమగు నన్యథాభావమువివర్తము' అని యీరెంటికిభేదము. ఎట్లనఁగా మృత్తుఘటముగాను క్షీరములు దధిగాను, మారుట పరిణామము. రజ్జువు సర్పముగాను, శుక్తి రజితముగాను మారుట(అనఁగాఁ గనఁబడుటయె) వివర్తము. మృత్ క్షీరములెంత సత్యములో ఘటదధులు నంతసత్యములు. రజ్జుశుక్తులతోపాటు సర్పరజితములు సత్యములుగావు. కాకపోయినను రజ్జుశుక్తులు కారణములని ఒప్పిరి. కాఁబట్టి ఘటమునకు మృత్తు, దధికి క్షీరములు పరి

ణామోపాదానము ; సర్పమునకు రజ్జువు రజితమునకు శుక్తియు, వివర్తోపాదానమని వేఱు వేఱు వ్యవహారము కలిగియున్నది. కారణ గుణములు కార్యమందు సంక్రమింప వలయు నను నియమము ('కారణగుణాః కార్యే సంక్రామంతి') పరిణామోపాదాన విషయము గాని, వివర్తోపాదాన విషయము గాదు. ఈ ప్రపంచ విషయములో బ్రహ్మమువివర్తోపాదానము, మాయ పరిణామోపాదానమని కొందఱు, బ్రహ్మముకారణమయినను నందులకు మాయ సహకారియని, లేక ద్వారకారణమని మరికొందఱు, మాయయే ఉపాదాన కారణము; బ్రహ్మము తదధిష్ఠానముగాన నౌపచారికముగా నుపాదాన కారణమని ఇంకొకరు, ఇవ్విధముగా వేఱు వేఱుగా కారణ నిరూపణమును జేసిరి. కారణ నిరూపణలో నీ యభిప్రాయ భేదములు గలిగినను 'ఉన్నపదార్థము బ్రహ్మ మొక్కటి. ఈ ప్రపంచ మంతయు నెవ్విధముగా నయిననేమి దానియందు బయలు వెడలినది' అను సిద్ధాంతాంశమున నద్వైతులలో విప్రతిపత్తిలేదు. ప్రపంచగత జాడ్యాది దోషము లెట్లు వచ్చినవను శంకా నివృత్తికొఱకు, జగత్కారణములోనికి రాగ ద్వేష సుఖ దుఃఖాది సకలానర్థములకును, జాడ్యాది దోషములకును, ఆస్పదమగు మాయను నొక్కొక్క రొక్కొక విధముగఁ జేర్చి సమాధానము చెప్పిరి.

ఇందుమీఁద బ్రహ్మమెట్టిదనియడుగఁగా జగత్కారణమని చెప్పి, ఇప్పుడుదానిలోనికి మాయనుగూడఁ జొప్పించిరి. 'అసలుబ్రహ్మ పదార్థమెట్టిది? మాయ యనఁగా నెద్ది? ఆ రెంటికి సంబంధమేమి?' అని ప్రశ్నింప వచ్చును.

ఈ ప్రపంచకల్పనా ప్రారంభమునకుఁ బూర్వము 'ఏకమేవాద్వితీయ' మయి అనఁగా సజాతీయ విజాతీయ స్వగతభేద రహితమై

శుద్ధబ్రహ్మము

యున్న యొక్క వస్తువు బ్రహ్మ. అది నిర్గుణము, నిరవయవము, నిర్వికారము, నిష్క్రియము, నిర్విశేషము, అవ్యవహార్యము, కూటస్థము, దేశకాలవస్తు కృతపరిచ్ఛేదరహితము, అవాఙ్మనసగోచరము. "నేతినేతి" (ఇదికాదు ఇదికాదు) యని మాత్రము నిరూపించఁదగినది. ఈ ప్రపంచ మనృత జడదుఃఖాత్మకము; అట్లుకానిది యాబ్రహ్మము. అందుచే నది సచ్చిదానంద మనిరి. 'ఘటమున్నది', 'గృహమున్నది', 'ప్రపంచమున్నది' యని వ్యవహరింపఁబడు సర్వపదార్థముల యందను స్యూతంబగు సత్త (Existence) ఆ బ్రహ్మ సత్తకంటె ననతిరిక్తముగాన, బ్రహ్మము సద్రూపమనిరి. 'తమేవభాంత మను భాతిసర్వం' అను శ్రుతిచెప్పినట్లు, ఆ బ్రహ్మవస్తువు, తాను, స్వయంప్రకాశ మానమయి, సర్వజగత్తును సూర్యచంద్రాదులను సయితము ప్రకాశింపఁ జేయుచున్నది. కాన చిద్రూపమనిరి. సర్వ

విక్షేపనివృత్తికలిగినపుడుండు నిరతిశయసుఖానుభావము దానిదే; అందువలన దాని నానందరూపమనిరి. ఉన్నవస్తువు ఒక్కటి. అది సూదిమొనదూరునంత సందును విడువక సర్వత్ర నిండియున్నది. ఆవస్తువును గమనించుటలో నుండు రీతిభేదముల (Different Standpoints)వలన, సచ్చిదానందమని మూఁడు శబ్దములతో వ్యవహారము గలిగినదిగాని తత్త్వమున నావస్తువు మూఁడు భాగములుగాఁగాని, మూఁడవాంతర వస్తువులుగలిగిగాని లేదు. ఈచెప్పినది శుద్ధ బ్రహ్మము. ఇది సత్యము. అనఁగా త్రికాలాబాధ్యము. ఒకప్పుడుండి ఒకప్పుడు లేనిదిగాని, ఒకప్పుడులేక, మరియొకప్పు డుండునదిగాని కాదు.

మాయా స్వరూపము

అట్లు కూటస్థము నిర్వికారము అగు శుద్ధ బ్రహ్మము వలన జగదుత్పత్తి ఎట్లాయెను? ఇందుల కద్వైతులు మాయా సంబంధము వలన నయినదని నుడివిరి. ఆమాయకు, అజ్ఞానము, అవిద్య, అవ్యాకృతము, ప్రకృతి, బీజశక్తి, అవ్యక్తము, మొదలగుపేర్లు గలవు. అది, అందఱను మోహింపఁజేయునదిగాన మాయయనిరి. విద్యచే ననఁగా జ్ఞానముచే నివర్త్యముగాన నవిద్య, అజ్ఞానము, అనిరి. బహువిధముగా విజృంభితమయియున్న యీ వ్యాకృత ప్రపంచమునకుఁ బూర్వావస్థ గాన నవ్యాకృతమనిరి. వటవృక్షము వటబీజమందు సూక్ష్మ రూపముగా నిమిడియున్నట్లు, ఈ ప్రపంచము దానిలో సంస్కారరూపముగా నున్నదని బీజశక్తియనిరి. ఈ ప్రపంచము దాని వికారముగాన దానిని ప్రకృతియనిరి. అది, అతిసూక్ష్మము సదసద్విలక్షణముగాన నవ్యక్తమనిరి. ఈ శబ్దములవలననే మాయ యెట్టిదో తెలియఁబడును. జ్ఞానముచే దానికి నివృత్తికలదుగాన బ్రహ్మమువలె నది సత్పదార్థము కానేరదు. దానివలనఁ బ్రత్యక్షమగు ప్రపంచము బైలువెడలి యనుభవ విషయమగుచున్నదిగాన, కుందేటికొమ్మువలె, గగనకుసుమమువలె, అది కేవలాసత్పదార్థము నయితము కానేరదు. అందువలన మాయ, అనిర్వచనీయమగు ఒకభావ పదార్థమునుగా నొప్పిరి. అదిముఖ్యముగాఁ గార్యానుమేయము. నిద్రలో మనశక్తులు మనలో లీనమయియున్నట్లు, జగదారంభమునకుఁ బూర్వము నిర్గుణబ్రహ్మమందు మాయ లీనమయియుండును. అట్టిమాయను నొప్పినందువలన బ్రహ్మముయొక్క శుద్ధత్వమునకుగాని, అద్వితీయత్వమునకుగాని భంగము కలుగనేరదు.

సత్యత్వము, వ్యావహారికము, పారమార్థికము, ప్రాతిభాసికము

అద్వైతులలోఁ గొందఱు పారమార్థిక సత్యత్వము, వ్యావహారిక సత్యత్వము, ప్రాతిభాసికసత్యత్వము, అని మూఁడు విధముల సత్యత్వమును ఒప్పి, మొదటిదానికి బ్రహ్మమును, రెండవదానికి ప్రపంచమును, మూఁడవదానికిస్వప్నమును, రజ్జుసర్పమును, దృష్టాంతమిచ్చిరి. మరికొందఱు

రెండవదానిని మూఁడవదానిలోఁ జేర్చి, పారమార్థికము, ప్రాతిభాసికము, అని రెంటినే ఒప్పిరి. ఈ రెండవవారి సిద్ధాంతములో, జాగ్రత్స్వప్న ప్రపంచములకు భేదములేదు; రజ్జువునందు సర్పమువలె బ్రహ్మమందు ప్రపంచము భాసిల్లుచున్నది. ఇది మాయ వలనఁగలుగుచున్నది. శుద్ధబ్రహ్మ మిందున కధిష్ఠానముగాన బ్రహ్మము జగత్తునకు కారణమయినది. త్రివిధ సత్యత్వమును ఒప్పిన ఫక్కిలో ప్రపంచముయొక్క సృష్టిక్రమ మెక్కువ ఆనుపూర్వికముగా సిద్ధించుచున్నది. ఎట్లనిన:—

కూటస్థ బ్రహ్మమందు లీన మయియున్న మాయ ప్రపంచోత్పత్తి కలుగఁబోవునపుడు, లీనదశను వదలి, కదలిక పుట్టి కార్యోన్ముఖ మగును. అంతట దానితోఁ గలసిన బ్రహ్మమున కీశ్వర భావమేర్పడును. కాఁబట్టి మాయావిశిష్ట చైతన్య మీశ్వరుఁడనియు, ఈశ్వరునకు మాయ యుపాధి యనియుఁ జెప్పఁబడినది. సర్వజ్ఞుఁడు, సర్వశక్తిమంతుఁడు, సర్వనియంత, సర్వాంతర్యామి, అనఁబడువాఁడు ఈ ఈశ్వరుఁడు. ఈయనను శబల బ్రహ్మమనియు, మాయాశబలమనియు సగుణమనియుఁ గూడ వాడెదరు. ఈయనయే జగత్కారణము. ఇక్కడనుండి సృష్టి బయలు దేరుచున్నది. ఈశ్వరోపాధియగు మాయను వివక్ష సేయనియెడల, ఈశ్వరచైతన్యము

ప్రపంచోత్పత్తి విధము

బ్రహ్మచైతన్యమే. బ్రహ్మముకంటె వేఱుగాదు. ఇదియె బ్రహ్మ జగత్కారణమని చెప్పిన తాత్పర్యము. ఇవ్విధముగా నీశ్వరుని బట్టి, శాఖాచంద్రన్యాయముగా నిర్గుణబ్రహ్మమును దెలిసికొన వలయునని, బ్రహ్మమునకు జగత్కారణత్వమును లక్షణముగాఁ జెప్పిరి.

పైని జెప్పఁబడిన మాయ సత్వరజస్తమోగుణాత్మకము. మాయయం దావరణశక్తి విక్షేప శక్తి యని రెండు శక్తులు గలవు. ఉన్నవస్తువు నావరించి కనఁబడనట్లు (లేనట్లు) సేయునది ఆవరణశక్తి. లేని వస్తువును నారోపించి యున్నట్లు చూపించునది విక్షేపశక్తి. సత్వగుణాధిక్యమున్నచోట, ఆవరణ శక్తి తన పనిని జూపఁజాలదు. ఈశ్వరోపాధియందు సత్వాధిక్య ముండుటచే, ఆయనకు స్వస్వరూపావరణము లేదు. అందువలన మాయ ఆయనకు లోఁబడియున్నది గాని ఆయన మాయకు లోఁబడియుండలేదు. ఈశ్వరుఁడు స్వవశమయియున్న విక్షేప శక్త్యాత్మక మాయతోఁ బ్రపంచమును గ్రమముగా సృజించెను. అందులోని తమః ప్రధానభాగముతో ఆకాశము, వాయువు, అగ్ని, జలము, పృథివి యను పంచభూతములను, ఆ వరుసను నొకదానిలోనుండి రెండవ దానిని సృజియించెను. వీనిని, అపంచీకృత సూక్ష్మభూతములని వాడుదురు. ఈ క్రమములోఁ బూర్వపూర్వమది చిద్విశిష్టమయి యుత్తరోత్తరమునకుఁ గారణమయినదని గ్రహింప వలయును. అనఁగా,

చిద్విశిష్ట తమః ప్రధాన విక్షేప శక్త్యాత్మక మాయలో నుండి, ఆకాశతత్త్వము, చిద్విశిష్టాకాశములోనుండి వాయుతత్త్వము, ఇవ్విధముగా పంచభూతసూక్ష్మములు పుట్టినవి. ఇవి బహువిరళావయవములు గలవగుటం జేసి సూక్ష్మభూతములనిరి. వానియొక్క సాత్త్వికాంశములలో నుండి వేఱు వేఱుగాఁ బయి వరుసక్రమమున శ్రోత్ర త్వక్ చక్షు జిహ్వాఘ్రాణము లనఁబడు పంచజ్ఞానేంద్రియములు పుట్టినవి. ఆ సాత్త్వికాంశములు గలిసిన సముదాయములోనుండి మనస్సు బుద్ధియుఁ బుట్టెను. అవ్విధముగాఁ బైపంచభూతముల రాజసాంశములలోనుండి, వేఱు వేఱుగా నావరుసను వాక్పాణి పాదపాయూపస్థలను పంచకర్మేంద్రియములును, అవి కలసిన సముదాయములోనుండి ప్రాణాపాన వ్యానోదాన సమానములను పంచప్రాణములునుబుట్టెను. అంతట పంచ జ్ఞానేంద్రియములు, పంచ కర్మేంద్రియములు, పంచ ప్రాణములు, మనస్సు, బుద్ధి, ఈ పదునేడు గలిసి లింగశరీరములు (సూక్ష్మ శరీరములనిగూడ పేరు), అయినవి. ఈ ప్రకారముగా భూత సూక్ష్మములలోఁ గొంతభాగము లింగశరీరము లాయెను; మఱికొంత భాగము పంచీకరణము ద్వారా స్థూలభూతములాయెను.

పైని జెప్పిన పంచసూక్ష్మ భూతములను ప్రతిదానిని రెండు సమభాగములుగాఁ జేసి, రెండవ సగభాగమును నాలుగు భాగములుగాఁ జేసి, ప్రతిభూతసూక్ష్మముయొక్క యీనాలుగు భాగములలో నొక్కొక్క దానిని, తదితర భూతసూక్ష్మముల యొక్క యర్థాంశలలోఁ జేర్చుచుఁబోవఁబంచస్థూలభూతము లేర్పడును వానిలోని యర్థాంశముల పేర్లతో నవి పిలువఁబడును. ఇదిపంచీకరణము. ఇట్లు ప్రతి స్థూల భూతములలో సగమాపేరుగలసూక్ష్మ భూతమును, శేషించినదితక్కిననాలుగుసూక్ష్మ భూతములలోని యష్టమాంశములునయి యుండును. ఎట్లనఁగా.

పంచీకరణము

స్థూలాకాశము $= \frac{1}{2}$ఆ $+ \frac{1}{8}$వా $+ \frac{1}{8}$అ $+ \frac{1}{8}$జ $+ \frac{1}{8}$పృ

స్థూలవాయువు $= \frac{1}{2}$వా $+ \frac{1}{8}$ఆ $+ \frac{1}{8}$అ $+ \frac{1}{8}$జ $+ \frac{1}{8}$పృ

ఈ పంచీకృత స్థూలభూతములతోటి చతుర్దశ భువనములును, జరాయుజాండజస్వేదజోద్భిజ్జములగు సర్వ ప్రాణులయొక్క స్థూలదేహములును, సకలస్థూల ప్రపంచమును, సృజియింపఁబడెను.

అధ్యారోపము

ఈ ప్రకారముగా నీశ్వరుఁడు విక్షేపశక్త్యుపాధితో, నిఖిలజడ ప్రపంచమును సృజియించెను. సర్వత్ర నిండియున్న వస్తు(బ్రహ్మము) యొక్కటయి యుండఁగా దానివలన నింత చిత్ర విచిత్రముగానుండు ననేక భేదభిన్నమయి యున్న యీ ప్రపంచమెట్లుకలిగెనో యది ఇంతవఱకు నిరూపించఁబడినది. దీనిని వేదాంతులు, అధ్యారోపమని చెప్పుదురు. ఈ అధ్యా

రోప జ్ఞానమువలన ప్రపంచ భ్రమంతయు నేక వస్తువులోనుండి వచ్చినదని ధృవపడును.

ఇంక నీప్రపంచమును, ఉత్పత్తి వ్యుత్క్రమముగ విమర్శించెదము. దీనిని 'అపవాదము' అని చెప్పుదురు.

అపవాదము

కార్యము (ఉపాదాన) కారణ స్వరూపము. పేరునకును, రూపమునకును, మాత్రము వేఱుగాని వస్తు వదియె. మృత్తికతోఁజేసిన ఘటము నిజమునకు మృత్తిక. సువర్ణముతోఁజేసిన కంకణము నిజమునకు సువర్ణము. ఘటము, కంకణమనునవి వికార మాత్రములు; మృత్తిక, సువర్ణము, సత్యపదార్థములు. ఈ సంగతినే "వాచారంభణం వికారోనామధేయంమృత్తికేత్యేవసత్యం" (ఛాం.౬-౧-౪) అను శ్రుతి చెప్పుచున్నది. కాఁబట్టి యథార్థమునకు కార్యముకారణము కంటె పృథగ్వస్తువుకాదు. వికారనాశమే కార్యనాశము. అదిజరిగినపుడు కారణము పరిశిష్టమయి యుండును. కార్యము కారణములో లయించును. ఈ ప్రకార మీ ప్రపంచమును విమర్శించఁగా, వివిధముగా విభక్తమయి యనంతనామ రూపములతో ప్రతీయమానములగు చతుర్దశభువనములు, చతుర్విధ ప్రాణికోటి శరీరములు, నిఖిలస్థూల ప్రపంచము, దానికిఁ గారణమగు పంచీకృత పంచమహాభూతములకంటె వేఱుగావు. ఆ పంచమహాభూతములును, ఆప్రాణి కోట్ల యొక్క సూక్ష్మశరీరములును, దానికిఁ గారణమగు అపంచీకృతభూత సూక్ష్మముల కంటె వేఱుగావు. ఆ భూతసూక్ష్మములుసయితము, పృథివీతత్త్వము జలతత్త్వముకంటె, జలతత్త్వమగ్నితత్త్వముకంటె, అగ్నితత్త్వము వాయుతత్త్వముకంటె వాయుతత్త్వమాకాశతత్త్వముకంటె, వేఱుగావు. ఆకాశము త్రిగుణాత్మకమయిన మాయకంటె వేఱుగాదు. ఆమాయయును, తదుపహిత చైతన్యమగు నీశ్వరచైతన్యమును, ఆ రెంటికి అధిష్ఠానమగు శుద్ధచైతన్యముకంటె వేఱుగావు. ఇట్లువిమర్శించి చూడఁగాఁ బ్రపంచము నిజమునకుబ్రహ్మముకంటె వేఱుగాదని నిశ్చయమయినది.

ఇంతవఱకువివరించిన యధ్యారోపాపవాద ప్రక్రియలవలన బ్రహ్మతత్త్వము నిరూపితమయినది. "అధ్యారోపాప వాదాభ్యాం నిష్ప్రపంచం ప్రపంచ్యతే" అను న్యాయము సిద్ధించినది. ఎటుచూచినను ఉన్న వస్తువు బ్రహ్మము. వేఱొకటి తదతిరిక్తములేదు. బ్రహ్మము నెఱిఁగినయెడలసర్వము తెలిసినట్లే. కాఁబట్టి "కస్మిన్నుభగవో విజ్ఞాతే సర్వమిదం విజ్ఞాతంభవతి" అనిచేసిన శౌనకప్రశ్నసమంజసము. ప్రపంచముబ్రహ్మముకంటె వేఱుగాలేదు. ఈమాటనే బ్రహ్మసత్తకంటె జగత్తునకు పృథక్సత్తలేదని శాస్త్రరీతిగాఁ జెప్పుదురు. రజ్జుసర్పభ్రాంతి కలిగినచోట రజ్జుకంటె వేఱుగా సర్పములేదు. లేకపోయినను నున్నట్లు ప్రతీతి కలుగుచున్నది; భయకంపాదులును బుట్టుచున్నవి. కాఁబట్టి యాసర్పమసత్యమయినను,

కుండేటి కొమ్మువలెగా లేదు. ఈప్రపంచమునయిత మారజ్జుసర్పముల తోఁపాటయి యున్నది. కేవల సత్యముగాదు. శశవిషాణ ప్రాయమును గాదు. కాన నారంభములో నుదాహరించినసంగ్రహశ్లోకములోఁ జెప్పినట్లు " జగన్మిథ్యా " జగత్తుమిథ్య.

జగన్మిథ్యాత్వము

మిథ్యాత్వము ను శాస్త్రములో మూఁడు విధములుగా నిర్వచించిరి. (౧) 'సదసద్విలక్షణత్వంమిథ్యాత్వం' దీని తాత్పర్యము పైని జెప్పఁబడినది.(౨)'జ్ఞానైకనివర్త్యత్వం మిథ్యాత్వం'. రజ్జుజ్ఞానమువలన సర్పభ్రాంతినివృత్తియయినట్లు,అధిష్ఠాన బ్రహ్మపరోక్షజ్ఞానమువలనఁ బ్రపంచభ్రాంతినివృత్తి కలుగును. అన్యథా కలుగదు.కాన జగత్తు జ్ఞానైక నివర్త్యమయిన మిథ్యావస్తువు. (౩) "ప్రతిపన్నోపాధౌ త్రైకాలికనిషేధ ప్రతియోగిత్వం మిథ్యాత్వం'. ఆరోపిత సర్పమున కధిష్ఠానముగా నొప్పిన రజ్జువునందాసర్పము త్రికాలములలోను లేదు. అట్లె బ్రహ్మమందుఁ బ్రపంచములేదు. ఇది తృతీయ లక్షణముయొక్క పర్యవసానము. మిథ్యాత్వ విచారము శాస్త్రచర్చయని ఇంతటితో విరమింపఁబడినది. ప్రపంచము సత్యముకాదు. మిథ్యయనుటకు " నేహనానాస్తికించన ", " విద్వాన్నామ రూపాద్విముక్తః", " బ్రహ్మతం పరాదాద్యోన్యత్రాత్మనో బ్రహ్మవేద " మొదలగు శ్రుతుల ప్రమాణము నయితముగలదు. ఈదృశ్యమగు ప్రపంచముప్రపంచరూపముగా నిజముగాదు. బ్రహ్మ రూపముగా నిజము. భేదమంతయు మిథ్య. 'ఏకమేవా ద్వితీయమ్' సత్యము.

మాయ మొదలు బ్రహ్మాండాంతముగల జడ ప్రపంచమంతయు మిథ్యయనియు బ్రహ్మము కంటె వేఱుగాదనియు, తదధిష్ఠానమగు బ్రహ్మముమాత్రము సత్యమనియుఁ జెప్పఁబడినది. ఈ చెప్పిన జడప్రపంచము లోనికిఁ జేరని పదార్థ మొకటిమాత్రము తెలిసికొన వలసినది నిలిచి యున్నది. ఏదియనఁగా జీవాత్మ. జీవాత్మ ఎవ్వరు? ఎట్టిది?

జీవుఁడు సాక్షాద్బ్రహ్మమే

ఇందునకు "జీవోబ్రహ్మైవ నాపరః" అని పై సంగ్రహ శ్లోకములో నుత్తరము జెప్పఁబడెను. జీవుఁడు బ్రహ్మము. బ్రహ్మముకంటె నతిరిక్తుడు కాఁడు; బ్రహ్మమునకు సజాతీయుఁడు కాఁడు. సాక్షాద్బ్రహ్మము. ఈజీవబ్రహ్మైక్యము స్వరూపైక్యముగాని అన్యథా కాదు. ఇదియే తత్త్వమస్యాది మహావాక్యార్థము. ఇదియే యఖండైకబోధ. ఇదియే నిఖిల సంసారోచ్ఛేదియు, మోక్షదాయియు నగు తత్త్వజ్ఞానము. దీని నిమిత్తమే, ఋష్యాదులందఱు కర్మయోగము, భక్తియోగము, మొదలగు సాధనములనుచిరకాలమనుష్ఠించి, ఆ జ్ఞాన మనుభవమునకుఁ దెచ్చుకొని కృతార్థులయిరి. కాఁబట్టి వేదాంత శాస్త్రమునకు విషయము జీవబ్రహ్మైక్యమని పెద్దలు చెప్పిరి.

జీవేశ్వరభేదము

ఈశ్వరునివలె జీవుఁడు నయితమోపాధికుఁడు. పరమార్థదశయందుభయులు బ్రహ్మము; అయినను, వ్యవహారదశయందుభయులకు విశేష తారతమ్యము గలదు. ఈశ్వరుఁడు సర్వజ్ఞుఁడు, సర్వనియంత, సర్వవ్యాపి. జీవుఁడు కించిజ్ఞుఁడు, నియమ్యుఁడు, పరిచ్ఛిన్నుఁడు. ఈశ్వరునియందావరణశక్తికిఁ బ్రచారము లేదు. జీవునియందుఁ బూర్తిగాఁగలదు. ఈశ్వరుఁడు, ఇంత సృష్టి సేయుచున్నను, అకర్త; జీవుఁడు కర్త. ఈశ్వరుఁడు, ఉపాస్యుఁడు. జీవుఁడు, ఉపాసకుఁడు. ఈశ్వరుఁడు,సర్వప్రాణులకువారివారి కర్మానుసారముగ ఫలము నిచ్చువాఁడు. జీవుఁడాఫలమును బొందువాఁడు; కాన మంచి ఫలమును గోరునేని, అవ్యాజమయిన భక్తితో నీశ్వరునారాధించి వాని యనుగ్రహమునకు పాత్రుఁడయి యట్టి ఫలమును వానివలనఁ బొంది కృతార్థుఁడు కానయియున్నాఁడు. ఈశ్వరుఁడు మాయను లోఁబఱచికొని,ఆత్మారాముఁడయి స్వమహిమయందెల్లప్పుడు నున్నాఁడు. జీవుఁడు తాను నిత్యుఁడు,నిర్వికారుఁడు, సచ్చిదానంద స్వరూపుఁడగు బ్రహ్మమనుసంగతిని దెలిసికొనక, మఱచి, మాయావశుఁడయి, దేహాభిమానియయి, తాను కర్త భోక్త సుఖి,దుఃఖి, యని భ్రాంతిలోఁ జిక్కుకొని, బహ్వనర్థ పూరితమయియున్న యీ సంసారములో నల్లాడుచున్నాఁడు. కొందఱు వ్యవహార పరమార్థదశల భేదమును గని పెట్టక, జీవేశ్వరుల కభేదమును నెడల, ఈశ్వరుఁడు, తనకుతానే యట్టి సంసారమును ఏల సృజించెనని యాక్షేపించుదురు.

మాయ, అవిద్య

ఈ జీవేశ్వరుల తారతమ్య ముపాధికృత్యము. కొందఱు అద్వైతులు ఈశ్వరోపాధిని మాయయని, జీవోపాధిని నవిద్యయని వేఱుగా వ్యవహరించుచు, ఆ మాయావిద్యలను నిరూపించుటలో భేదించిరి. మూలప్రకృతిమాయ, దానియొక్క విక్షేపావరణాశక్త్యుపేతాంశము అవిద్యయని ఒకరు; శుద్ధసత్త్వప్రధానమయిన మూలప్రకృతి మాయ, మలిన సత్త్వ ప్రధానమయిన మూలప్రకృతి అవిద్యయని ఒకరు; విక్షేపశక్తిప్రధానమయిన మూల ప్రకృతిమాయ, ఆవరణశక్తి ప్రధానమయినది అవిద్యయని మఱియొకరు వక్కాణించిరి. సర్వజ్ఞముని, మాయావిద్యాభేదము చేయక, ఈశ్వరోపాధి అవిద్యయనియు జీవోపాధి అంతఃకరణమనియుఁ జెప్పిరి. ఈ పయిని జెప్పిన వారందఱు, శుద్ధచైతన్యము ఆయా యుపాధులయందుఁ బ్రతి బింబించినదనియు ఆ ప్రతి బింబములు జీవేశ్వరులని నిర్ణయించిరి. వివరణ కారులు, మూలాజ్ఞానములో భేదము జేయక,దానినే అవిద్యయని జీవోపాధినిగాఁ జెప్పి, దానిలో ప్రతి బింబించు చైతన్యము జీవుఁడని అందుకు బింబభూతమయిన చైతన్యము ఈశ్వరుఁడని నిశ్చయించిరి,

ఇంతవఱకు ప్రతి బింబపక్షము వారల మతములు జూపింపఁబడినవి. వాచస్పతి మిశ్రులు, అంతః కరణావచ్ఛిన్న చైతన్యమును జీవుఁడనీ, తదనవచ్ఛిన్న చైతన్యమును ఈశ్వరుఁ డని నిర్ణయించిరి. ఈ చెప్పిన మతభేదములుగాక, సమిష్టి అజ్ఞానము ఈశ్వరోపాధియని, వ్యష్టి అజ్ఞానములు జీవోపాధులనిగూడఁ జెప్పుట గలదు. ఏ పక్షమయినను జీవేశ్వరుల తారతమ్యము ఉపాధి కృతమనియు, జీవుఁడు నికృష్టోపాధికుఁడనియు సర్వసమ్మతము. ఈశ్వరుని ఒప్పిన ఈ పక్షములుగాక, ఈశ్వరుఁడని వేరులేడు, బ్రహ్మ మవిద్యవల్లన జీవభావమును బొంది ఈ ప్రపంచమును ఈశ్వరుని సహా కల్పనచేసికొని సుఖదుఃఖ సంసారానుభవమును బొందుచున్నదను పక్షముగూడ నొకటి కలదు.

అద్వైతులలో, ఈ మొదలగు అప్రధానాంశములలో మత భేదములుగలవు. వారికి అద్వితీయ బ్రహ్మాత్మైక్యము ప్రధానాంశము. దానిని స్థాపింపఁ గలందులకు, కల్పితభేదసిద్ధమయిన అనేక అప్రధానాంశములన్ను ఎత్తి సమాధానములు, సమన్వయములు చెప్పుకొని రావలసియుండె. ఆ చెప్పుటలో, ఎవరికి శిష్యబుద్ధికి ఎట్లు చెప్పిన పట్టునని తోచెనో, వారుఅట్లు వెళ్ళిరి. వారువారు వెళ్ళిన ప్రక్రియలలో భేదములవలన, ఆ మత భేదములేర్పడెను. కాని, ప్రధానాంశములో వారలకు విప్రపత్తిలేదు.

జీవపరస్పరభేద ముపాధికృతము

జీవేశ్వరులభేదము ఉపాధికృతమయినట్లు, జీవులలో పరస్పరభేదము సయితము ఉపాధి కృతము గాని వాస్తవము కాదు. జీవులందఱులోని ఆత్మ వాస్తవమునకు పరమాత్మ స్వరూపమయినపుడు, పరమాత్మ ఒక్కడే అయినందున, జీవులభేదము ఉపాధి భేదమువలన కలిగినదని ఒప్పితీరవలయును. ఉపాధి భేదమువలన సుఖదుఃఖానుభము ఎవరిది వారికి వేఱువేఱు అయినది. మరియు నేజీవుఁడు నాతని ఉపాధి సంబంధమును తీసివేయఁ గలుగునో ఆతఁడు ముక్తుఁడగుటయు, తదితరులు యథాపూర్వముగా బద్ధులయి యుండుటయు సంభవించుచున్నది.

స్థూలసూక్ష్మ కారణ శరీరములు, పంచకోశములు

జీవునియొక్క ఉపాధి, అనఁగా శరీరము, స్థూల సూక్ష్మ కారణ భేదములచే త్రివిధముగను, అన్నమయ ప్రాణమయమనోమయ విజ్ఞాన మయా నందమయ కోశములచే పంచకోశాత్మకముగను ఉన్నది. స్థూలశరీరముఅందఱకు తెలిసినదే. జననమరణములు దీనివి. మాతా పితృలయొక్క శుక్లశోణితములవలన స్థూలశరీరము ఉత్పత్తి నొందుచున్నది. తుదకు మరణము కలిగి నశించునది ఈస్థూలశరీరము. ఇదియె పంచకోశ విచారములో అన్నమయకోశ మనఁబడును. సూక్ష్మశరీరమనఁగా త్వక్చక్షుశ్శ్రోత్ర జిహ్వాఘ్రాణము లనఁబడు పంచ

జ్ఞానేంద్రియములును, వాక్పాణి పాదపాయూపస్థలనఁబడు పంచకర్మేంద్రియములును ప్రాణాపానవ్యానోదానసమానము లనఁబడు పంచప్రాణములును, బుద్ధి, మనస్సు, ఈపదియేడును గలసిన సముదాయము. దీనికి లింగశరీరమని గూడఁ బేరుగలదు. కోశవిచారములో దీనిని, ప్రాణమయ, మనోమయ, విజ్ఞానమయ కోశములని మూఁడు కోశములుగా విభజించిరి. పంచ ప్రాణములు పంచ కర్మేంద్రియములు గలసిన సముదాయము ప్రాణమయకోశము. పంచజ్ఞానేంద్రియములు మనస్సుకలసిన సముదాయము మనోమయకోశము. పంచ జ్ఞానేంద్రియములు బుద్ధిగలసిన సముదాయము విజ్ఞాన మయకోశము. క్షుత్పిపాసలు, మూఁగ, కుంటి, గ్రుడ్డి, చెవుడు, కర్తృత్వభోక్తృత్వములు, మొదలగునవి ఈ లింగశరీర ధర్మములు. జీవునకు లోకాంతర గమనాగమనములు, ఈసూక్ష్మోపాధితోఁ గలుగుచున్నవి. లింగశరీరమునకు స్థూలశరీరసంబంధము గలుగుట జన్మము. ఆ సంబంధము వదలిపోవుట మరణము. మనకు ప్రతి జన్మమునందు గలుగు సర్వానుభవములు వాసనారూపముగా, అనఁగా సంస్కారరూపముగా, ఈలింగ శరీరములో లీనమయి యుండి ఆయాజన్మములతో నాయూ ప్రారబ్ధానుసారముగా బయలు వెడలును.

ఇంకఁ గారణశరీరమును జెప్పెద. అవిద్యయని అజ్ఞానమని చెప్పినదే కారణశరీరము. 'నేను అజ్ఞుఁడను' 'ఇది నాకుఁ దెలియదు' అని దేనిని గుఱించి అయినను తెలియదను వ్యవహారము. ఈ కారణోపాధితో సంబంధించినది. ఈ ఉపాధిని ఆనందమయ కోశమనెదరు. ఈ మూఁడు శరీరములు జడములు. జీవాత్మ ఈమూటికి విలక్షణుఁడు, చిత్స్వరూపుఁడు. కాని అవిద్యవలన నతనికి ఆభావము తెలియకుండ జేయఁబడి, జీవభావము కలుగఁ జేయఁబడినది. విలక్షణ స్థితినుంచి తొలగి ఈ త్రివిధోపాధులతో తాదాత్మ్యాభిమానమును పొందుటయె జీవభావమును పొందుట. తాదాత్మ్యాభిమానమనఁగా, ఆయా శరీరమునె ఆత్మగా గ్రహించుట; తానని యనుకొనుట. అది ఎట్లనిన, కారణశరీర తాదాత్మ్యాభిమానముచే 'నేనజ్ఞుఁడను' అని లింగశరీరతాదాత్మ్యాభిమానముచే 'నేను కుంటివాఁడను, గ్రుడ్డివాఁడను, కర్తను, భోక్తను, నాకు క్షుత్పిపాసలు కలుగుచున్నవి' అని, స్థూలశరీరముతో తాదాత్మ్యాభిమానముచే 'నేను పురుషుఁడను, బ్రాహ్మణుఁడను, నేనుమృతినొందుదును, నాకు కుమారుఁడు గలిగెను' అని, మొదలగు వ్యవహారములు గలుగుచున్నవి. ఈతాదాత్మ్యాభిమానమును భంగ్యంతరముగాఁ గనుపరచెద. ప్రతిజీవునకు, జాగ్రత్ స్వప్న సుషుప్తులని అందఱకు తెలిసిన మూఁడవస్థలు గలవు. వానిలో సుషుప్త్యవస్థలో జీవుఁడు కారణశరీర మాత్రాభిమానిగా నుండును. ఏమియుఁ దెలియకుండుటయె అజ్ఞా

కారణ శరీరము

నానుభవము. జీవుఁడప్పుడు, ఆ యనుభవమును మాత్రము గలిగియుండును. కారణశరీరమాత్రాభిమానియై యుండు జీవునకు ప్రాజ్ఞుఁడని పేరు గలదు. ప్రాజ్ఞునకు స్థూల సూక్ష్మశరీరాభిమానము లేదు. స్వప్నమునందు జీవుఁడు, ఆ మెట్టుదిగి సూక్ష్మశరీరతాదాత్మ్యాభిమానమును గూడ పొందియుండును. ఈ యవస్థలో జీవునకు స్థూలశరీరాభిమానములేదు. తద్విలక్షణుఁడయి, వాసనామయ ప్రపంచానుభవమును గలిగియుండును. స్వప్నావస్థలోని జీవునకు తైజసుఁడనిపేరు. జాగ్రదవస్థలో, మూఁడవమెట్టుకు దిగి సాధారణముగా స్థూలశరీరతాదాత్మ్యాభిమానముతో వ్యవహరించును. అప్పుడతనికి విశ్వుఁడని పేరు. ఈ మూఁడవస్థలయందు జీవునకు నిజస్వరూపము అజ్ఞానముచే నావృతమయియుండును. ఇవిగాక, ఆయావరణమును తోసివేసి ఈ శరీరత్రయము కంటె తాను విలక్షణుఁడయి తత్సాక్షిగానుండు అవస్థ, తురీయావస్థయనిపేరు గలది మరియొకటి గలదు. అది, దాని పనిచేసిన వానికి మాత్రము గోచరముగాని అందఱకు గోచరముగాదు.

జీవునకువలె ఈశ్వరునకు నయితము, ఉపాధిత్రయమును చెప్పిరి. మాయ కారణోపాధి. సర్వజీవులయొక్క లింగశరీరముల సముదాయము ఆయన లింగశరీరము. సర్వస్థూల ప్రపంచము ఆయన స్థూలశరీరము. మాయోపాధికునకు ఈశ్వరుఁడని, సమిష్టి లింగశరీరోపాధికునకు హిరణ్యగర్భుఁడు, సూత్రాత్మ, అని, సమిష్టిస్థూలోపాధికునకు విరాట్టు అని ఆయా యుపాధులతోఁ జేర్చిన ఈశ్వరునకు జీవునకువలె వేఱువేఱు పేర్లు గలవు. బహు వృక్షములుగలసి వనమని, బహుజలములు గలసి జలాశయమని ఏకత్వ వ్యవహారమున్నట్లు నిఖిల శరీరములును గలసి సమష్టి సూక్ష్మ శరీరమనియు, నిఖిలస్థూల వ్యక్తులుగలసి సమష్టిస్థూలశరీరమనియు చెప్పినట్లు జీవుని కారణోపాధి వ్యష్ట్యజ్ఞానమని ఈశ్వరుని కారణోపాధియగు మాయ నిఖిలవ్యష్ట్యజ్ఞానములయొక్క సమష్టియని వ్యవహారము సమంజసము. అజ్ఞానమునకు గూఁడ సమిష్టి వ్యష్టివ్యవహారమును, కొందఱు ఒప్పిరి. కాని, జీవునకువలె ఈశ్వరున కుపాధిత్రయము ఉండినను ఈశ్వరునకుమాయావరణము లేనిహేతువుచే, ఆయన సర్వదా దేహత్రయ విలక్షణుఁడు, నిర్వికారుఁడు, స్వరూపనిష్ఠుఁడు, అయియుండును. ఈ చెప్పిన దేహత్రయమునకు విలక్షణమయి యుండు జీవేశ్వరుల చైతన్యము ఒక్కటి. అది బ్రహ్మచైతన్యము. ఆస్వరూప చైతన్యైక్యమును బుచ్చుకొని అద్వైతులు జీవేశ్వరులకు నభేదమును జెప్పిరి. సర్వప్రాణుల యొక్క స్థూల సూక్ష్మ శరీరములు పాంచభౌతికములు. అవిమిథ్య. అవిగాక యుండు ప్రత్యగాత్మ బ్రహ్మముకంటె అనతిరిక్తము.

ఈజీవ బ్రహ్మైక్యమును ఉపనిషత్తులును బహుగా బోధించినవి. ఈవిషయము శాంకర సూత్ర భాష్యమందు విపులముగా నిరూపింపఁబడినది. ద్వైతులు విశిష్టాద్వైతులు జీవ బ్రహ్మైక్యమును బోధించు శ్రుతులకు వేఱువేఱుగా నర్థమును జూపుటకు యత్నించిరి ; కాని నిష్పక్షపాతబుద్ధితో విమర్శించువారెల్లరు, ఆశ్రుతుల కద్వైతులు చెప్పిన సమన్వయమే సరియని కనిపెట్టుదురు. ఆప్రకారము మాక్సుముల్లరు, తీబా, గఫ్, డ్యూసెన్ మొదలగు పెక్కుమంది పాశ్చాత్యులుగూడ నుడివిరి.

శ్రుతిసమన్వయము

ఇంతవఱకు నాదియందుఁజెప్పిన సంగ్రహశ్లోకార్థమును వివరించుచు, ఈప్రపంచమునందున్న తత్త్వము అద్వైతబ్రహ్మమాత్రమనియు, ఆ బ్రహ్మమందు ఈ ప్రపంచమంతయు మరుమరీచిక వలెను (ఎండమావులు) రజ్జుసర్పమువలెను భాసిల్లుచున్నదనియు నిరూపించితిమి. ఇఁక నీజ్ఞానము ఎట్లుపురుషార్థమగునో చెప్పవలసియున్నది. పురుషార్థమునకుఁగాని జ్ఞానము నిరర్థకముగదా !

అద్వైత జ్ఞానము పరమార్థము

దేహాతిరిక్తాత్మను ఒప్పినవారందఱు ఇహలోకస్థితి ఎంతగొప్పదయినను నిరసనీయమనియు, ఈ జన్మము మెండనర్థములతో నిండియున్నదనియు, సుఖము ఆభాస, దుఃఖము ఎక్కువగాన నీజన్మము గర్హ్యమనియు, జీవాత్మకీజన్మాంతమందుఁబొందఁదగినఉత్తమస్థితి మోక్షమనునది ఒకట్టి గలదనియు, వివేకులయినవారు ఐహికమును నిరసించి ఆమోక్షమును సంపాదింప వలయుననియు నిశ్చయించిరి. ఇది సర్వమతస్థులు చెప్పు విషయమే కాని 'ఈజన్మములో దోషమేది? సర్వదుఃఖములకును సర్వానర్థములకును గారణమేది? దానిని నివృత్తిజేసికొని మోక్ష పదవినిబొందు మార్గమెట్లు ?' అను దానిలో మాత్రము వారు వేఱువేఱుగా వెళ్లిరి.

రోగముయొక్క తత్త్వమును(నిదానము) సరిగాదెలిసికొనక చేయు ఔషధసేవ ఆరోగమును నిర్మూలము జేయఁజాలనట్లు మనము ఈజన్మములోనసర్వానర్థమూలము ఏదియో సరిగాదెలిసికొనక, తన్నివృత్తికొఱకుఁ జేయు ప్రయత్నములు పూర్ణఫలమగు మోక్షము నియ్యఁజాలవు. ఈ సంసారరోగ నిర్ధారణలో మతాచార్యులు తలయొకరీతిని వెళ్లి, వేఱువేఱుగా తన్నివృత్తినిజెప్పిరి. శొంఠి, పిప్పళ్లు, మిరియాలు, మొదలగు అనుపానములు అన్నివైద్యములకు ఆవశ్యకమే. అట్లు సదాచరణము, సత్కర్మానుష్ఠానము మొదలగునవి అందఱునొప్పినవే. కాని రోగనిరూపణలోఁగలిగిన అభిప్రాయ భేదములవలన మోక్షసిద్ధికి తలయొక ఔషధమును(ఉపాయమును)జెప్పిరి.వారిలో నద్వైత మతాచార్యులగు శ్రీ శంకరులువారు, సర్వానర్థహేతువు

అధ్యాసయని, దానికి అజ్ఞానము కారణమని ఆత్మయాథార్థ్య జ్ఞానమువలన నా అజ్ఞానము నశించి, అధ్యాసవదలి, మోక్షము సిద్ధించునని నిశ్చయించిరి.

అధ్యాస యనఁగా "అతస్మిన్ తద్బుద్ధిః" అది కానిదానియందు అదియను జ్ఞానము.

అధ్యాస

"పరత్ర పరావభాసః" అనిగూడఁజెప్పిరి. "ఒకదానియందు మరియొకటి తోఁచుట". రెండు లక్షణములు ఒక్కటే. ఒకప్పుడు త్రాడును జూచి పాము అని భ్రాంతి గలుగుచున్నది; ఒక్క దీపము రెండు దీపములుగాఁగనఁబడుచున్నది; తగరపుముక్క వెండిగాను మ్రోయ్యి మొద్దు మనుష్యుఁడుగాను దోఁచుచున్నవి. ఇవన్నియు అధ్యాసకు దృష్టాంతములు. సర్పముకాని రజ్జువు యందు సర్పబుద్ధి, ఒకటిగానున్న దీపమునందు సద్వితీయత్వబుద్ధి, రజతముగానితగరమునందు రజతబుద్ధి,పురుషుఁడుగాని స్థాణువునందు పురుషబుద్ధి గలిగినవి. పైఁజెప్పినలక్షణములువీనియందుఁబట్టినందున, ఇవి అధ్యాసలు. అధ్యాసలో దేనియందు అన్యబుద్ధి పుట్టునో దానినిఅధిష్ఠాన మనెదరు. సర్పాధ్యాసకు రజ్జువు,రజతాధ్యాసకు తగరము అధిష్ఠానములు. ఈ చోట్ల అధిష్ఠాన జ్ఞానము సరిగా ఉన్నయెడల అధ్యాస పుట్టదు. త్రాడని సరిగా తెలిసి ఉన్నయెడల పామని తోఁచదు. కాఁబట్టి అధిష్ఠానవిషయ కాజ్ఞానము అధ్యాసకు కారణము. చూడఁబడునదిరజ్జువయినను దాని తత్త్వజ్ఞానములేక సర్పభ్రాంతి కలుగుచున్నది. ఇట్లు అధ్యాసఅజ్ఞానజన్యము. అయినను దానివలన సుఖదుఃఖాదులుగలుగుచున్నవి. సర్పాధ్యాస, పురుషాధ్యాసలవలన భయ కంపాదులు గలుగుచున్నవి. రజతాధ్యాసవలన, సంతోషము గలుగుచున్నది. ఈ సుఖదుఃఖములు, అధిష్ఠాన తత్త్వజ్ఞానము కలిగినతోడనే, భ్రాంతిజన్యములని తెలిసి, మరలి పోవుచున్నవి. ఇదేప్రకారము మనకు కలుగు సర్వదుఃఖములు, సర్వసుఖములు, అధ్యాస జన్యములు. ఆత్మకాని దేహేంద్రియాదులయందాత్మబుద్ధి,తద్ధర్మముల యందు ఆత్మధర్మబుద్ధి, దేహసంబంధులయిన పుత్రులు మిత్రులు, భార్య, ధనము, గృహము, మొదలగు వానియందాత్మీయబుద్ధి, అనునవి అధ్యాసకుఁ గొన్నియుదాహరణములు. ఆత్మ సచ్చిదానంద రూపము, సర్వసాక్షి, అసంగము, అకర్త, అభోక్త, నిత్యము, నిర్వికారము, సర్వప్రాణులయందును సర్వత్ర నిండియున్న ఒక్కపదార్థము. బుద్ధి,మనస్సు, ఇంద్రియములు, ప్రాణములు, దేహము, ఈమొదలు సర్వ ప్రపంచము అనాత్మ; ఇది జడము, మిథ్య, దుఃఖాత్మకము.

ఇట్లు ఆత్మానాత్మల విచక్షణ లేకపోవుట వలన, ఆత్మానాత్మలకు అన్యోన్యాధ్యాస

ఆత్మానాత్మలకు అన్యోన్యాధ్యాస

యేర్పడి, ఒక దాని ధర్మములు ఒకదానివిగా నను కొనఁబడి, సర్వవ్యవహారములు జరుగుచున్నవి. 'అహం

మిదం'—'ఇది(దేహాదులు)నేను'-'మమేదం' ''ఇది (దారాపుత్త్రాదులు)నాది'' అనియనుకొనుటవలన అన్నివ్యవహారములు అన్నిసుఖదుఃఖాద్యనుభవములు కలుగుచున్నవి. ఆత్మ ఇట్టిదని పయినిజెప్పినట్లు తెలిసినపిదప, దానియందు అనాత్మయొక్కగాని అనాత్మధర్మములయిన కర్తృత్వాదుల యొక్కగాని అధ్యాసయుండదు. అదేప్రకారము, అనాత్మయగు అంతఃకరణాదు లిట్టివని ఆత్మకంటె వేఱుగా తెలిసినపుడు, వానియందు ఆత్మాధ్యాసగాని వానితో సంబంధించిన దారాపుత్ర గేహాదులయందు ఆత్మీయబుద్ధిగాని ఉండదు. కాన, తాను యథార్థమునకు అంతఃకరణాదులకంటె విలక్షణుఁడు, అసంగుఁడు, సాక్షి, సచ్చిదానందుఁడని తెలిసికొనినవానికి దేహ గేహ దారా పుత్త్రాదుల యొక్క ఉపచయాపచయముల (వృద్ధిక్షయములు) వలన సుఖదుఃఖములు కలుగనేరవు. లోకములో సాధారణముగా 'మన' యను అభిమానములేనిచోట కలుగుహానివృద్ధులు, దుఃఖమును సంతోషమునుగలుగజేయవు. అదేప్రకారము, ఆత్మవేఱు, అంతఃకరణాదులువేఱని, మరియు అంతఃకరణాదులసత్యములని, అనుభవమునకు దెచ్చుకొన్నవారికి, దేహాదులతో సంబంధించిన హానివృద్ధులు స్వప్నమునందలి హానివృద్ధులవలెను, పరుల హాని వృద్ధులవలెను, ఎవ్విధముగ నంటవు, బాధించవు. ఆ.వివేచనలేకనే ఈసంసారములోఁ జిక్కుపడి, త్రాడునుద్రొక్కి పామును ద్రొక్కితినని భ్రాంతిపడిన వాఁడు తత్తరిల్లిపడి నురుగులు గ్రక్కునట్లు, అల్లలాడుచున్నాఁడు. దీనికంతకు పయినిజెప్పిన అధ్యాస కారణము. ఈ అధ్యాస నివృత్తమయినయెడల సర్వానర్థములు తొలగిపోవును; తిరిగి జన్మముండదు.

దాని నివృత్తి ఎట్లనఁగా:—

అధ్యాస నివృత్తి

ఆ త్రాడు త్రొక్కిన భ్రాంతునకు తెలిసిన వాఁడు ఆత్రాడునెత్తి వానికి చూపించి అది త్రాడేయని నిశ్చయజ్ఞానమును గలుగఁజేసిన యెడల, వాని భ్రాంతివదలి, భయకంపాదు లణఁగి స్వస్థతకలుగును. అంతకంటె దానికి వేఱు మణిమంత్రౌషధములు లేవు. అదే ప్రకారము 'బ్రహ్మసత్యం జగన్మిథ్యా జీవో బ్రహ్మైవనాపరః' అని ఎఱుగని సంసారి జీవునకు బ్రహ్మాభిన్న ప్రత్యగాత్మ జ్ఞానమువలన అజ్ఞానము నశించి, దేహాదులయందు అధ్యాస వదలి, సర్వానర్థనివృత్తి యగును. పునర్జన్మము తప్పును. మోక్షము సిద్ధించును. బ్రహ్మభావమే మోక్షము. అంతకంటె వేఱు గాదు. బ్రహ్మజ్ఞానమువలన జీవభావము వదలి బ్రహ్మభావము కలుగును. ఇదియే 'జ్ఞానాదేవతు కైవల్యం' (జ్ఞానమువలననే కైవల్యము కలుగును) అని చెప్పఁబడిన అద్వైత సిద్ధాంతము. ఇట్లు తత్త్వజ్ఞానము పరమపురుషార్థ సాధకము.

బ్రహ్మజ్ఞానము గలిగినపిదప, ప్రారబ్ధశేషమువలన ఈ దేహముండినను, ఉండవచ్చును.

జీవన్ముక్తి

కాని అట్టి జ్ఞానియొక్కదశ విలక్షణము. ఆ దశను జీవన్ముక్తావస్థయని చెప్పెదరు. జీవన్ముక్తునకు ఈ ప్రపంచమందు సత్యత్వబుద్ధి యుండదు. త్రాడు అని తెలిసినపిమ్మట సర్పమువలె తిరిగితోచినను, త్రాడను నిశ్చయము తొలఁగిపోదు. భయకంపాదులు పుట్టవు. అట్లు జీవన్ముక్తునకు ప్రపంచభావము ఆభాసగా నుండినను 'సర్వంఖల్విదం బ్రహ్మ' (ఇదంతయు బ్రహ్మ సుమా) అను నిశ్చయ జ్ఞానానుభవముబోదు. తిరిగిదుఃఖము అంటదు. ప్రారబ్ధశేషానుభవమయిన పిదప దేహత్యాగమగును. పునర్జన్మములేదు. బ్రహ్మముతో నైక్యమునుబొందును. ఇదియే ముక్తి.

మరణ కాలమునకు ప్రతి జీవునకును, ఏదోయొక ధ్యాస పుట్టును. ఏదోయొకదాని

జ్ఞాని యంత్యకాలస్థితి

మీఁదికి బుద్ధి పోయి తీరును. ఆ చరమబుద్ధిననుసరించి పైజన్మము వచ్చుననిసిద్ధాంతము. 'యంయంవాపి స్మరన్ భావం త్యజత్యన్తే కళేబరం। తంతమేవైతి కౌన్తేయ సదాతద్భావభావితః' (భగీ. ౮-౬) అను గీతావాక్యము గలదు. కాఁబట్టి సద్గతులుగోరువారు, తుదకు సద్వృత్తు లుద్బుద్ధములు కాఁగలందులకు, ఈజన్మము పొడుగునను సచ్చింతన, సదనుష్ఠానము జేయుచుందురు. అభ్యాస పాటవమువలన నట్లు చివర కాలమునకుజరుగును. యోగసిద్ధి గలవారికిఁ దప్ప, అన్యులచరమవృత్తులు స్వాధీనముగా బయలు వెడలవు. ఏదోయొక వాసన ప్రబలమయి, వెడలి, తదను కూలమయిన భావిజన్మము నందుకొనును. ఆ విధముగా పునర్జన్మమును దానితో సంబంధించిన సర్వానర్థములును గలుగును. ఇట్లు జన్మపరంపరయేబంధము. కాఁబట్టి ఏవాసనలును చరమకాలమున కుద్బుద్ధములు గానియెడల అట్టివానికి పునర్జన్మ ముండదు. బంధనివృత్తియగును. ఇట్లు జీవన్ముక్తునకు జ్ఞానికి సంభవించును. జీవబ్రహ్మైక్యసాక్షాత్కారము గలిగిన పిదప, ప్రపంచానుసంధానము వదలి ఆత్మానుసంధానము నిలుచును. అనాత్మ చింతలు మరలిపోవును. అందువలన సర్వవాసనలు నశించును. వాఁడు హేయోపాదేయరహితుఁడయిన బ్రహ్మమయియుండును. అంతఃకరణతో తాదాత్మ్యమువదలి తత్సాక్షియయి విలక్షణుఁడుగా నుండును. అట్టి దృఢాభ్యాసము వలన, లింగశరీరము శైథిల్యమును బొందును. అగ్ని సాన్నిధ్యము వలన దాహకత్వశక్తి గలిగిన అయః పిండమునకు ఆపిండమును అగ్నిని విడదీసిన పిదప ఆశక్తి బోయినట్లు, చిత్సంబంధము వలన గత్యాగతులు చేయఁగల లింగశరీరమునకు, హృదయగ్రంథివిభేదమయి, అనఁగా ఆత్మాంతఃకరణాదులకు అన్యోన్యాధ్యాసవదలి, అవివిడి, ఆత్మ సాక్షిభావములో నిలిచిపోయినపుడు,

ఈ దేహములోనుండి ఉత్క్రమణచేసి గత్యాగతులు చేయఁగలశక్తి నశించును. అంతట రేణువును, రేణువును కలిపియుంచెడు జిగురు (cohesion) పోయిన మృత్పిండములోని రేణువులు దేనికది విడిరాలిపోవునట్లు, లింగశరీరావయవములగు అంతఃకరణాదులు సంఘీభావమునువదలి విడిపోయి వానివానికారణములగు పంచభూతములలో లయించును. దీనినే "నతస్యప్రాణా ఉత్క్రామంతి అత్రైవ సమవనీయంతే" అను శ్రుతి చెప్పుచున్నది. ఇట్లు జ్ఞానికి పునర్జన్మము రాక మోక్షము లభించును.

బ్రహ్మానుభవము చిక్కనివానికి, లింగశరీరోత్క్రమణ మున్నది, పునర్జన్మముతప్పదు.

వేఱు వేఱువారికి వేర్వేఱు లోకములు, గతులు

కాని ఆ జన్మములలో పూర్వకర్మానుసారముగా తారతమ్యములుగలవు. అట్టివారికి మూఁడు విధముల గతులు జెప్పఁబడినవి. శ్రుతిచోదితమయిన కొన్ని ఉపాసనలు చేసినవారు సూర్యమండలముద్వారా బ్రహ్మలోకమును బొందుదురు. వారలు తిరిగి వెనుకకు వచ్చుటలేదు. ఆ లోకములోనే, అక్కడజ్ఞానమును బొందినవారయి, ఆ లోకాధిపతియగు చతుర్ముఖబ్రహ్మతో సహా ముక్తిని బొందుదురు. ఈ బ్రహ్మలోకమునకువెళ్లు మార్గమునకు అర్చిరాది మార్గమనిపేరు. ఆయుపాసనలు గాక యాగాది కర్మలు జేసినవారు ధూమాది మార్గముల ద్వారా చంద్రలోక పర్యంతము వెళ్లి ఫలోన్ముఖమయియుండు సుకృతమునకు అనురూపంబగు సుఖమును ఆయా లోకములలో ననుభవించి, పిమ్మట తిరిగి ఈ లోకములో జన్మించుదురు. ఈ రెండు మార్గములను వెళ్లుటకు యోగ్యత సంపాదించనివారు "జాయస్వ మ్రియస్వ"— పుట్టను చావను తరగతిలోఁ జేరుదురు. పాపాధిక్యమువలన నరకానుభవముగూడ నుండును.

కాఁబట్టి అన్ని తరగతుల కంటె తిరిగి జన్మములేనిస్థితి సర్వోత్కృష్టము. అది జ్ఞానైకసాధ్యము. ఆ జ్ఞానము

పరోక్షజ్ఞానము అపరోక్షజ్ఞానము

అనఁగా బ్రహ్మజ్ఞానము రెండు విధములు. పరోక్షము, అపరోక్షము. గ్రంథములవలన, ఇతరులు చెప్పిన దానివలన 'జీవుఁడు బ్రహ్మమొకటిగాని వేఱుగాదు' అని తెలియ వచ్చుచున్న జ్ఞానము పరోక్షజ్ఞానము. ఇదిగాక, అధ్యాసనువదలి, జీవభావమును విడచి, శరీరత్రయసాక్షియయి అఖండైక రసబ్రహ్మాత్మానుభవమును బొందినవాని యనుభవము అపరోక్ష జ్ఞానము. కేవల పరోక్ష జ్ఞానము బంధనివృత్తిని జేయఁజాలదు. మోక్షసిద్ధికి అపరోక్షజ్ఞాన మావశ్యకము. చీకటిలోఁ గూర్చుని దీపవార్త లెన్ని జెప్పినను తమోనివృత్తిగాదు. దీపము తెచ్చినపిదప యగును. అటువలె, పరోక్షాపరోక్ష జ్ఞానములయొక్క కార్యకారిత్వమును దెలిసి కొనవలయును.

పరోక్షజ్ఞాన మీజన్మమందు పూర్ణఫలము నీయఁజాలక పోయినను అద్వైతవాసనలను గలుగఁజేసి, ఉత్తర జన్మములయందు క్రమముగా అభివృద్ధిఁబొంది తత్త్వజ్ఞానోదయమునకు హేతువగును.

అపరోక్ష జ్ఞానము కలుగు సాధనములు

అట్లయిన నా యపరోక్ష జ్ఞానమెట్లు గలుగును? చిత్తశుద్ధి లేనివానికి అజ్ఞానముకలుగనేరదు. అంతఃకరణయందు రజోగుణమును తమోగుణమును తగ్గించి, సత్త్వగుణమును వృద్ధిఁజేయుట యే చిత్తమును శుద్ధిజేయుటఁ పలాభిసంధినివదలి చేయు. సత్కర్మలవలన, యోగాభ్యాసము వలన, సత్వగుణము వృద్ధిపొందును. వేదోక్త కర్మలు, ఈశ్వరోపాసనులు, ధర్మాచరణములు మొదలగునవి కర్మలనఁబడును. వీనినన్నిటికి చిత్తశుద్ధి పరమప్రయోజనము. కర్మకాండమంతయు, ఇవ్విధముగా జ్ఞానోపయోగి. ఉపాసనల వలన చిత్తైకాగ్ర్యము కుదురును. ఇవన్నియు బహిరంగ సాధనములు. ఇవిగాక, సాధన చతుష్టయమనఁబడు అంతరంగసాధనములు గలవు. అవి, ఏవియనఁగా ౧ నిత్యానిత్య వస్తువివేకము, ౨ ఇహాముత్రార్థ ఫలభోగవైరాగ్యము, 3 శమాది షట్కసంపత్తు, ౪ ముముక్షుత్వము. ఆత్మ నిత్యము, తదతిరిక్త మంతయు అనిత్యము అని వివేచన గలుగవలెను. అందువలన, మనలను విశేషముగా మోహింపఁజేయునవన్నియు - స్వర్గాది పరలోక భోగములు సయితము-అనిత్యములని నిశ్చయము కుదిరి, వానినన్నిటియందు వైరాగ్యము గలుగును. మనస్సునకు నిర్వేదము కలుగును. అందువలన బుద్ధి విషయములమీఁదికి ప్రసరించుట మానివేయును. శమాది షట్కమనఁగా, శమము, దమము, ఉపరతి, తితిక్ష, సమాధానము, శ్రద్ధ. అంతరింద్రియనిగ్రహము శమము. బహిరంద్రియనిగ్రహము దమము. ఉపరతియనఁగా కొందఱు సన్న్యాసమని చెప్పిరి. కొందఱు సర్వేంద్రియములు విషయముల మీఁదికి పోకుండ నాగిపోవుటయని చెప్పిరి. శీతోష్ణాదులనుసహించుటతితిక్ష. విషయములనుంచి పరావృత్తమయిన మనస్సును వేదాన్తశ్రవణాదులయందు నిలుపుట, సమాధానము. శాస్త్రమునందు,(గురువులు జెప్పు దానియందు) విశ్వాసము, శ్రద్ధ. జననమరణ ప్రవాహరూపమయి బహువిధ దుఃఖ సంకలితమయి, పయికి మేడిపండువలె నుండు ఈసంసారమును తప్పించుకొని మోక్షమునుపొందవలెనను ఇచ్ఛ ముముక్షుత్వము. ఈ జన్మమందు గాని పూర్వజన్మములయందుగాని క్రమముగా కర్మాదుల ననుష్ఠించి పైఁజెప్పిన సాధనచతుష్టయ సంపత్తిని సంపాదించిన పుణ్యాత్మునకు తత్త్వజ్ఞానము కరతలామలకప్రాయము. అతఁడే బ్రహ్మవిద్యకు ముఖ్యాధికారి.

అట్టివాఁడు తత్త్వజ్ఞానము కలిగి కృతార్థుఁడయియుండు గురుసన్నిధికింజేరి, వినీతుఁడయి,

ప్రార్థించి, కావలెననిగురువువల్ల ఉపదేశమును బొంది, గురూపదిష్టమార్గము నాశ్రయించి, తాను ప్రత్యగభిన్న సచ్చిదానంద సమరస బ్రహ్మమని తెలిసికొని, అనుభవమును బొంది, పునర్జన్మ రహితుఁడయి, బ్రహ్మకైవల్యమును బొందును. పైని జెప్పిన సాధనలన్నియు పూర్తిగా, ఏకజన్మలభ్యములు గాకపోవచ్చును. అనేక జన్మములమీఁద సమకూడినను తుదకు మోక్షరూప ఫలముండును. కాన ఒక్కొక్కజన్మములో వీలయినంతవఱకు సాధింపవలయును. "నహి కల్యాణ కృత్ కశ్చిత్ దుర్గతిం తాతగచ్ఛతి" (నాయనా! కల్యాణకరములయిన కర్మములఁ జేసిన వాడెప్పటికిని దుర్గతికింబోఁడు.) అను గీతావాక్యమును (౬.౪౦) ప్రమాణముగఁ జేసికొని, ప్రతి మనుజుఁడు ప్రవర్తింప వలయును.

సాధన సంపత్తు కలవాఁడు బ్రహ్మ విద్యాధికారి

పైఁజెప్పిన యధికారికి*"ఆత్మావారే ద్రష్టవ్యశ్శ్రోతవ్యో మన్తవ్యో నిదిధ్యాసితవ్యః" (బృహదారణ్యకోపనిషత్తు ౨-౪-౫.) అని, ఆత్మసాక్షాత్కారార్థమయి శ్రవణాదులు చెప్పఁబడినవి. శ్రవణమనఁగా, ఉపక్రమోపసంహారాది నిబంధనలను,న్యాయములను అనుసరించి, ఉపనిషదర్థ విచారము జేయుట. ఆ విచారమువలన, ప్రత్యగ భిన్నాద్వితీయ పరమాత్మయందు సర్వోపనిషత్తులకు తాత్పర్యమని స్పష్టపడఁగలదు. మనన మనఁగా, ఆ విచారమువలన తేలిన భావమును, యుక్తులతో సయితము నిశ్చయించి, ఎల్లప్పుడు అనుచింతనము జేయుట. నిదిధ్యాసనమును రెండు విధములుగాఁ జెప్పిరి. నిదిధ్యాసనమనఁగా, శ్రవణ మనన పరిపాకము వలనఁగలుగు జ్ఞానమని కొందఱును ధ్యానమని మరికొందఱును నుడివిరి. జ్ఞానమనిన వారి అభిప్రాయములో బ్రహ్మ సాక్షాత్కారమునకు శ్రవణ మననములు జాలును; అనఁగా ధ్యానరూపమయిన యోగము అనావశ్యకము. రెండవవారి యభిప్రాయములో ధ్యాన మావశ్యకము. ధ్యానమనఁగా విజాతీయ మగు దేహాది ప్రత్యయములు మధ్యమధ్య రాకుండ, తైలధారవలెనుండు సజాతీయాద్వితీయపరమాత్మ ప్రత్యయప్రవాహము. ఇది సమాధిలోనికిఁ జేరును. నూటికి కోటికి ఒకరుగా నుండు ఉత్తమాధికారికి ధ్యాన మనావశ్యకమయినను, సామాన్యులందఱకు ధ్యానముగూడనవసరము. అనేక జన్మముల నుంచి విషయాభిముఖముగ పరుగెత్తు స్వభావ మేర్పడియున్న చిత్తవృత్తికి, యోగసాహాయ్యము ధ్యానములేనిది,ఆప్రవాహము కట్టుఁబడి, ఆత్మాభిముఖమగు స్వభావ మేర్పడఁ జాలదు.

సమాధి సవికల్పము, నిర్వికల్పము అని రెండు విధములు. సవికల్పములో, జ్ఞాతృజ్ఞానాదిలయముగాకుండ, చిత్తవృత్తి అద్వితీ

* ఆత్మను వినవలెను, ఆలోచింపవలెను, ధ్యానింప వలెను.

యాత్మ వస్తువునందు తదాకారాకారిత

సమాధి సంకల్పము, నిర్వికల్పము

మయి నిలిచి, యుండుటు; ద్వైతభావము ఆభాసగ నుండినను, అద్వైత వస్తువు భాసిల్లును. నిర్వికల్ప సమాధియందు జ్ఞాతృజ్ఞానాది వికల్పములు సయితము లయము నొంది, అద్వితీయాత్మ వస్తువునందు తదాకారాకారితమయిన చిత్తవృత్తి పూర్తిగా లీనమయి కలసియుండును. ఇది సుషుప్తిగాదు. సుషుప్తిలో అంతఃకరణ వృత్తిలేదు. నిర్వికల్ప సమాధిలో నున్నది; ఆసమాధిలో చిత్తము; నివాత ప్రదేశమునందలి దీపమువలె, అఖండ చైతన్య మాత్రముగా నిలిచిపోవును. అద్వైత సచ్చిదానందాత్మానుభవము గలుగును.

నిర్వికల్ప సమాధికి, యమ, నియమాసన ప్రాణాయామ ప్రత్యాహార ధారణాధ్యాన సమాధులని ఎనిమిది అంగములు గలవు. వీని విచారము "యోగము" క్రిందఁ జూడవలయును.

శ్రవణమననజనిత జ్ఞానమువలనను సమాధ్యభ్యాసమువలనను అద్వితీయాత్మానుభవ

జ్ఞానమునకు మెట్లు

ము దృఢమయి అపరోక్షజ్ఞానము గలిగి మోక్షముసిద్ధించును. సర్వకర్మలకు సర్వోపాసనలకు, సర్వసాధనములకు, మోక్ష మందు పరిసమాప్తి. ఆ మోక్షపదవి తుదకు ఆత్మజ్ఞానమువలన కలుగునదయినను ఆ జ్ఞానము కలుగుటకు తగుయోగ్యత వచ్చువఱకు అనేకమెట్లు ఎక్కవలసియున్నది. ఎమ్. ఏ. మొదలగు ఉత్తమపరీక్షలలో నుత్తీర్ణుఁడు కాఁగలందులకు కొన్ని నియతగ్రంథములు మాత్రము జదువవలసియున్నను ఆగ్రంథములు తెలిసికొను యోగ్యత వచ్చుటకు అనేక సంవత్సరములు పూర్వము విద్యాభ్యాస మవశ్యమయి యున్నది. అట్లు బ్రహ్మజ్ఞానమునకు సయితము బహుగా పూర్వప్రయత్నము లవశ్యకములు. ఆధునికులు కొందఱు, ఆత్మ పుణ్యపాపములు లేనివాఁడు, అసంగుఁడు, సుఖదుఃఖము లెవ్వియు నంటనివాఁడు, ఈ మొదలగు నాలుగు మాటలు విని యోచదివియో, అంతటితో తత్త్వజ్ఞానము కలిగినదని, కృతార్థులమని సంతోషించి, కర్మోపాసనాదులను నిరసించి వదలివేసి, యథేష్టముగాఁ, బ్రవర్తించుచున్నారు. ఇది తప్పు. అద్వైతశాస్త్రమిట్లు చెప్పియుండలేదు. అందఱు మనుష్యు లేకరీతిగా ప్రజ్ఞావంతులుగారు. ఏకరీతిగా చిత్తశుద్ధి గలవారునుగారు. వారివారి అధికారములకు తగినతరగతులు మార్గములు వేఱువేఱుగాఁ జెప్పఁబడియున్నవి. కర్మ కధికారులు కొందఱు; భక్తికి కొందఱు; మంత్రోపాసనలకు మరి కొందఱు; ధర్మకార్యములకు కొందఱు; ఎందుకు కానివారు—"జాయస్వ మ్రియస్వ" తరగతిలోఁ జేరువారు గొందఱు, ఇట్లు గలరు.

లోకములో వైచిత్ర్యము (Diversity) మెండు. పూర్వ జన్మములనుంచి వచ్చుచున్న వాసనా భేదములవలన, సత్త్వరజస్తమోగుణములయొక్క పాళ్లలో వ్యత్యాసములవలన, అంతఃకరణాలు నానావిధములు. బుద్ధులలో భేదములవలన కొందఱకు గణిత శాస్త్రమందును, కొందఱకు భాషలయందును, కొందఱకు శిల్పశాస్త్రమునందును, మరికొందఱకు భౌతిక శాస్త్రమునందును, ప్రవేశము హెచ్చుగానుండి వానిలో దేని నభ్యసించినను, సరియైన శిక్షపట్టఁబడినయెడల, తుదకందఱకు బుద్ధివికాస వైదుష్యములు (Culture) ఏకముగానుండునట్లు, పరమార్థ కాములలో నయితము కొందఱకు కర్మలయందు, కొందఱకు భక్తియందు, మరికొందఱకు మంత్రోపాసనాదులయందు, ఇట్లు పలువిధముల అభిరుచిగలిగి, అవి వారలకు పట్టును. అధికార తారతమ్యమును రుచి తారతమ్యమును బుచ్చుకొని బహుమార్గములు జూపఁబడినవి. వానిలో దేనినిగాని నిరసింపఁగూడదు. ఏ యొక్కమార్గమునయినను భక్తివిశ్వాసములతో నవలంబించి దానికిఁ జెప్పినట్లు సక్రమముగా నభ్యసించినయెడల అది చెప్పినఫలము నియ్యకపోదు. దేనికయినను భక్తివిశ్వాసములు ప్రధానములు. ఏ పేరుతోనైనను, అవ్యాజముగా భగవంతునియందు భక్తినిగలిగి పాటు పడువాఁడు తప్పక నెప్పటికయినను, అనఁగా నేజన్మమునకయినను, జ్ఞానమార్గమునకువచ్చిచేరి కృతార్థుఁడగును. ఇట్లు అద్వైతమునకు సర్వమతములు, సర్వసాధనములు, వివిధపూజలు, సమ్మతము. (జ౯ం. గో.)

అధికారుల తారతమ్యము

అద్వైతగ్రంథావళి

[అద్వైతమునకు సంబంధించిన గ్రంథములు సంస్కృతమునందును, ఆంధ్రమునందును వేనవేలుగలవు. అట్టి గ్రంథముల నామములన్నియు నిచట నిచ్చుట మాయుద్దేశము కాదు. ఆయాసంప్రదాయములందు విశేషముగా వాడఁబడు గ్రంథములును, సంస్కృతాంధ్ర భాషలయందుఁ గొంతఁ బేరుం బ్రతిష్ఠఁగన్న గ్రంథములును, ఈ విషయము నభ్యసింపఁగోరువారి కుపయోగకరములుగనుండు గ్రంథములును మాత్ర మిందుఁ జేర్పఁబడును. ఉపనిషత్తులు, బ్రహ్మసూత్రములు, గీత మొదలగునవి ద్వైతాద్వైత విశిష్టాద్వైతాది మతముల వారందఱు నొప్పినవి గనుక వానిని ఏమతము క్రిందను ప్రత్యేకముగా నుదాహరింపలేదు. ఆయా మతములను గురించి విడిగా వ్రాయఁబడిన గ్రంథములే ఉదాహరింపఁబడును.]

సంస్కృతము

గ్రంథము	
మాండూక్యోపనిషద్ కారికలు	గౌడపాదాచార్యుఁడు
ఉత్తర గీతాభాష్యము	,,
సూత్ర భాష్యము	శంకరాచార్యుఁడు
గీతాభాష్యము	,,
అపరోక్షానుభూతి	,,
ఉపనిషద్భాష్యము *	,,

…YDERABAD-DN NILAYAM 1923

*ఈశ, కేన, కఠ, ప్రశ్న, ముండ, మాండూక్య, తైత్తిరీయ, ఐతరేయ, ఛాందోగ్య, బృహదారణ్యకములనెడి పదియుపనిషత్తుల మీఁదను శంకరుని భాష్యములుగలవు. శ్వేతాశ్వతరోపనిషత్తుమీఁదఁగూడ నొకభాష్యము కలదు. కాని వానికర్తృత్వమును గుఱించి పండితులు భిన్నాభిప్రాయులు.

గ్రంథము	కర్త
రత్నప్రభ (సూత్ర భాష్య టీక)	రామానందుఁడు
న్యాయనిర్ణయము (శ్రీ. భా. టీ.)	ఆనందగిరి
కల్పలత (సూ. భా. టీ.)	మధుసూదన సరస్వతి
పంచపాదిక (సూ. భా. టీ.)	పద్మపాదాచార్యుఁడు
భామతి (సూ. భా. టీ.)	వాచస్పతి మిశ్రుఁడు
గీతాభాష్యవివేచనము	ఆనందగిరి
శంకరభాష్యమునకు టీక	శంకరానందుఁడు
,,	మధుసూదనుఁడు
,,	శ్రీధరుఁడు
తైత్తిరీయోపనిషద్ వార్తికము	సురేశ్వరాచార్యుఁడు
బృహదారణ్యకోపనిషద్వార్తికము	,,
అద్వైతసిద్ధి	మధుసూదన సరస్వతి
ఖండన ఖండకాద్యము	శ్రీహర్ష మహాకవి
అద్వైత బ్రహ్మసిద్ధి	సదానందయతి
గౌడబ్రహ్మానందీయము	బ్రహ్మానందుఁడు
వేదాంత పరిభాష	ధర్మరాజాధ్వరి
సిద్ధాంత లేశ సంగ్రహము	అప్పయ్యదీక్షితులు
సిద్ధాంత బిందువు	మధుసూదన సరస్వతి
నైష్కర్మ్యసిద్ధి	సురేశ్వరాచార్యుఁడు
బ్రహ్మసిద్ధి	,,
సంక్షేప శారీరకము	సర్వజ్ఞాత్మాచార్యులు
పంచదశి	విద్యారణ్యుఁడు
జీవన్ముక్తివివేకము	,,
అనుభూతి ప్రకాశము	,,
వేదాంతసారము	సదానందయోగి
వాసుదేవ మననము	వాసుదేవయతి
అద్వైతామృతము	జగన్నాథకవి
భేదధిక్కారము	నృసింహాశ్రమి
వేదాంత సిద్ధాంతముక్తావళి	ప్రకాశానందుఁడు
మహావాక్యదర్పణము	భారతీ తీర్థుఁడు
మహావాక్యరత్నావళి	,,
ప్రబోధ చంద్రోదయము	కృష్ణ మిశ్రుఁడు
అద్వైతకల్పధేనువు	ఉమామహేశ్వరుఁడు
అద్వైత కౌస్తుభము	భట్టోజీదీక్షితుఁడు
,,	మహాదేవ సరస్వతి
అద్వైతరత్న రక్షణము	మధుసూదన సరస్వతి
అద్వైత రత్నకోశము	అఖండానందుఁడు

ఆంధ్రము

శంకర సూత్ర భాష్యము	దివాన్ బహదుర్ జగన్నాథరావు గారు
శాంకరగీతాభాష్యము	బాలసుబ్రహ్మణ్యస్వామి
పంచదశి	...
వాశిష్ఠ రామాయణము	మడికి సింగన్న కవి
,,	వేంకటరంగన్న కవి
సీతారామాంజనేయము	పరశురామ పంతులు లింగమూర్తి
రాజయోగసారము	తరిగొండ వేంకమాంబ
వాసుదేవమననము	...
కైవల్యనవనీతము	కనుపర్తి వేంకటరామ విద్యానందనాథులు
విచారచంద్రోదయము	జనార్దన చైతన్యస్వామి
విచారసాగరము	ఓ. వై. దొరస్వామయ్య
వృత్తిప్రభాకరము	వా. పట్టాభిరామయ్యశర్మ
ప్రభోదచంద్రోదయము	నంది సుబ్బరాయకవి, కం. విరేశలింగకవి
జ్ఞానవాసిష్ఠము	ముదిగొండ నాగలింగ శాస్త్రి
బ్రహ్మానంద ప్రకాశిక	పాప్పాక వేంకటరామయ్య
భగవద్గీతా భాష్యము (శంకర, రామానుజ, మధ్వాది భాష్యములకు తెలుగు)	చదలవాడ సుందరరామ శాస్త్రి గారు.

౨. విశిష్టాద్వైతము *

(శ్రీ రామానుజాచార్యుల వారి మతానుసారము)

శ్రీమద్రామానుజాచార్యులవారి మతము కూడ అద్వైతమే కాని యది యొక విధమైన అద్వైతము. విశేషణ యుక్తమైన యద్వైతముగాన విశిష్టాద్వైత మనఁబడును. ఈ మతప్రకారము పరబ్రహ్మము విశేషణ యుక్తము. అనఁగా గుణములు కలది.

బ్రహ్మము సగుణము, నిర్గుణము కాదు

శంకరాచార్యులవారి మతాను సారము బ్రహ్మము నిర్గుణము, నిర్విశేషము, జ్ఞానరూపము. రామానుజాచార్యులవారి మతమున బ్రహ్మము, సగుణము, సవిశేషము, జ్ఞాత. శంకరుని బ్రహ్మము గుణరహితము. రామానుజుని బ్రహ్మము అనంతగుణకల్యాణయుక్తము. ఆతఁడే గరుడ వాహనుఁడు, లక్ష్మీపతి, శ్రీమహావిష్ణువు. శంకరుని బ్రహ్మము స్త్రీ పున్నపుంసకము కాదు; రామానుజుని బ్రహ్మము మగవాఁడు.

ఏవస్తువైనను, జ్ఞానవిషయము కావలయు నన్న సవిశేషము అనఁగా గుణయుక్తముగ (కొన్ని ధర్మములు కలదిగ) నుండవలయును. అట్లులేక గుణశూన్యమైన వస్తువును ఇంద్రియములుగాని మనస్సుగాని గ్రహించుటెట్లు? గుణశూన్యమైన వస్తువున్నదనిగూడ మనము తెలిసికొనఁజాలము. రూపగంధాది విరహితమైనందున నది ప్రత్యక్ష ప్రమాణమునకు లోఁబడదు. అనుమానాదికములు ప్రత్యక్షమునకు సంబంధించినవి గనుక వానికిని లోఁబడదు. ఇట్లు సర్వప్రమాణములును సవిశేష వస్తువులే విషయములుగ గలవిగనుక ప్రమాణ శూన్యమైన నిర్గుణబ్రహ్మమున్నదని ఎవ్వరును చెప్పఁజాలరు.

నిర్గుణ బ్రహ్మము ప్రమాణసిద్ధముగాక పోయినను ఆత్మానుభవముచే నెఱుంగఁబడునని చెప్పెదరేమో. ఆత్మానుభవమైనను సవిశేషముగ నుండినఁ గాని అది జ్ఞానము కాఁజాలదు. నే నొకపదార్థము నెఱింగితి నననేమి యర్థము? దానిగుణధర్మముల నిదమిత్థమని తెలిసికొంటిననిగదా! గుణధర్మములు లేని బ్రహ్మము నెఱుంగుట యెట్లు? 'బ్రహ్మ మెఱింగితిని' అనిన తోడనే బ్రహ్మము సగుణమయ్యె!

భాష యంతయు సవిశేషక జ్ఞానమునే ఇచ్చునుగాని నిర్విశేషజ్ఞానము నీయఁజాలదు.

* విశిష్టాద్వైతము రెండువిధములు. శైవ విశిష్టాద్వైతము, వైష్ణవ విశిష్టాద్వైతము. మొదటి దానికి శ్రీకంఠ శివాచార్యునిచే రచింపఁబడిన బ్రహ్మసూత్ర భాష్యము ప్రమాణము. రెండవ దానికి రామానుజాచార్యకృత భాష్యాదులు ప్రమాణములు. శ్రీకంఠుఁడు శంకరాచార్యునకు సమకాలీనుండని శంకరదిగ్విజయము వలనఁ దెలియవచ్చుచున్నది. ఈరెండు విధముల విశిష్టాద్వైతములలో శ్రీరామానుజునిది విశేషవ్యాప్తిగలదియు, విశేషవాఙ్మయము గలదియు నగుటచే నిచ్చట నీయఁబడుచున్నది. ఈ రెంటికిని తత్త్వమందు భేదము లేదు. కాని పరబ్రహ్మము 'గ్రద్దనెక్కిన వాఁడా?' 'ఎద్దు నెక్కినవాఁడా?' యన్న విషయమునమాత్రము వీరుభయులును హోరాహోరిగఁ బోరాడుచుందురు.

౨. విశిష్టాద్వైతము *

(శ్రీ రామానుజాచార్యుల వారి మతానుసారము)

శ్రీమద్రామానుజాచార్యులవారి మతము కూడ అద్వైతమే కాని యది యొక విధమైన అద్వైతము. విశేషణ యుక్తమైన యద్వైతముగాన విశిష్టాద్వైత మనఁబడును. ఈ మతప్రకారము పరబ్రహ్మము విశేషణ యుక్తము. అనఁగా గుణములు కలది.

బ్రహ్మము సగుణము, నిర్గుణము కాదు

శంకరాచార్యులవారి మతానుసారము బ్రహ్మము నిర్గుణము, నిర్విశేషము, జ్ఞానరూపము. రామానుజాచార్యులవారి మతమున బ్రహ్మము, సగుణము, సవిశేషము, జ్ఞాత. శంకరుని బ్రహ్మము గుణరహితము. రామానుజుని బ్రహ్మము అనంతగుణకల్యాణయుక్తము. అతఁడే గరుడవాహనుఁడు, లక్ష్మీపతి, శ్రీమహావిష్ణువు.

* విశిష్టాద్వైతము రెండువిధములు. శైవ విశిష్టాద్వైతము, వైష్ణవ విశిష్టాద్వైతము. మొదటి దానికి శ్రీకంఠ శివాచార్యునిచే రచింపఁబడిన బ్రహ్మసూత్రభాష్యము ప్రమాణము. రెండవ దానికి రామానుజాచార్యకృత భాష్యాదులు ప్రమాణములు. శ్రీకంఠుఁడు శంకరాచార్యునకు సమకాలీనుండని శంకరదిగ్విజయము వలనఁ దెలియవచ్చుచున్నది. ఈరెండు విధముల విశిష్టాద్వైతములలో శ్రీరామానుజునిది విశేషవ్యాప్తిగలదియు, విశేషవాఙ్మయము గలదియు నగుటచే నిచ్చట నీయఁబడుచున్నది. ఈ రెంటికిని తత్త్వమందు భేదము లేదు. కాని పరబ్రహ్మము 'గ్రద్దనెక్కిన వాఁడా?' 'ఎద్దు నెక్కినవాఁడా?' యన్న విషయమునమాత్రము వీరుభయులును హోరాహోరిగఁ బోరాడుచుందురు.

శంకరుని బ్రహ్మము స్త్రీ పున్నపుంసకము కాదు; రామానుజుని బ్రహ్మము మగవాఁడు.

ఏవస్తువైనను, జ్ఞానవిషయము కావలయునన్న సవిశేషము అనఁగా గుణయుక్తముగ (కొన్ని ధర్మములు కలదిగ) నుండవలయును. అట్లులేక గుణశూన్యమైన వస్తువును ఇంద్రియములుగాని మనస్సుగాని గ్రహించుటెట్లు? గుణశూన్యమైన వస్తువున్నదనిగూడ మనము తెలిసికొనఁజాలము. రూపగంధాది విరహితమైనందున నది ప్రత్యక్ష ప్రమాణమునకు లోఁబడదు. అనుమానాదికములు ప్రత్యక్షమునకు సంబంధించినవి గనుక వానికిని లోఁబడదు. ఇట్లు సర్వప్రమాణములును సవిశేషవస్తువులే విషయములుగ గలవిగనుక ప్రమాణశూన్యమైన నిర్గుణబ్రహ్మమున్నదని ఎవ్వరును చెప్పఁజాలరు.

నిర్గుణ బ్రహ్మము ప్రమాణసిద్ధముగాక పోయినను ఆత్మానుభవముచే నెఱుంగఁబడునని చెప్పెదరేమో. ఆత్మానుభవమైనను సవిశేషముగ నుండినఁ గాని అది జ్ఞానము కాఁజాలదు. నేనొకపదార్థము నెఱింగితి నననేమి యర్థము? దానిగుణధర్మముల నిదమిత్థమని తెలిసికొంటిననిగదా! గుణధర్మములు లేని బ్రహ్మము నెఱుంగుట యెట్లు? 'బ్రహ్మ మెఱింగితిని' అనిన తోడనే బ్రహ్మము సగుణమయ్యె!

భాష యంతయు సవిశేషక జ్ఞానమునే ఇచ్చునుగాని నిర్విశేషజ్ఞానము నీయఁజాలదు.

ఇట్లు వ్యక్తిజ్ఞానముగాని, జాతిజ్ఞానముగాని, సవిశేషముగను, సధర్మముగను, ఉండును; నిర్విశేషముగను, విధర్మముగను ఉండవు.

ప్రత్యక్షము సన్మాత్రము గ్రహింపదు

వస్తువులయొక్క గుణ ధర్మములు మనకు ప్రత్యక్షమువలన బోధపడవనియు, వాని సత్తామాత్రముఅనఁగా ఉనికియే (Existence) మనము గ్రహించెదమనియు అద్వైతవాదులు చెప్పెదరుగాని దానిని గ్రహించుటకు వీలులేదు. ఏలయన వేఱు వేఱు వస్తువుల గుణధర్మములను మనము గ్రహింపలేక వాని యస్తిత్వమునే గ్రహింపఁ గల్గితిమేని అన్ని వస్తువులు మనకొక రీతిగనే కన్పడవలయును. ఇది ఘటము, ఇది పటము అను విభేదము తెలియరాఁగూడదు. అట్లుగాక మనకు ప్రత్యక్షమువలన అసంఖ్య వస్తువులయొక్క గుణధర్మ భేదములనుబట్టి వానిని వేఱువేఱుగ గ్రహించు శక్తి కలుగుచున్నది. 'ఘటమున్నది, పటమున్నది' అను జ్ఞానమునందు 'ఉన్నది' అను జ్ఞానమే సర్వమై, ఘటత్వ పటత్వ జ్ఞానమే లేనియెడల మనకు ఘటము, పటము ఒక్కటిగ కనుపడవలయును. అట్లు కనుపడక అవి భిన్నముగ గానవచ్చుననుట అందఱకుఁ దెలిసిన విషయమే. ఏదోగుణ ధర్మముచే పదార్థము ఇంద్రియముల నాకర్షింపనిచో దానియునికి మనస్సునకుఁ దెలియుటెట్లు?

శ్రుతులు సగుణబ్రహ్మమునే ప్రతిపాదించును, నిర్గుణ బ్రహ్మమును ప్రతిపాదింపవు

సగుణ బ్రహ్మమున్ను ప్రతిపాదించుటయే వేదాంత వాక్యముల (ఉపనిషద్వాక్యముల) తాత్పర్యము. నిర్గుణ బ్రహ్మముయొక్క సత్తామాత్రజ్ఞానము మనకు కలిగిన యెడల నేమి ప్రయోజనము? బ్రహ్మేతర పదార్థముల యొక్క గుణ దోషములు మనకు తెలియఁజాలవు. బ్రహ్మము మంగళ గుణముల నిధియనియు, సర్వదోష రహితమనియుఁ దెలుపుట శ్రుతుల యభిప్రాయము. అతనికేవిధమైన గుణములు లేవని తెలుపుట శ్రుతియొక్క తాత్పర్యముకాదు. పరబ్రహ్మమందు జగదుపాదానత్వము, జగన్నిమిత్తత్వము, సర్వజ్ఞత, సర్వశక్తియోగము సత్యసంకల్పత్వము, సర్వాధారత మొదలైన యసంఖ్య కల్యాణ గుణములున్నవని శ్రుతులు వేయినోళ్ల ఘోషించుచున్నవి. కొందఱు "నిర్గుణం, నిరంజనం, నిష్కలంకం, నిష్క్రియం, శాంతం" (శ్వేత. ౬-౧౯) మొదలైన శ్రుతుల గతియేమి యని అడుగవచ్చును. పైకి నిర్గుణ పరములుగా గనఁబడినను ఇట్టి వాక్యములు హేయమగు గుణములను బ్రహ్మమందు నిషేధించుచున్నవేగాని, పరమ మంగళ కరములైన గుణములను నిషేధించుచుండుటలేదు. నిర్గుణుఁడనఁగా గుణశూన్యుఁడని యర్థముకాదు. అమంగళ కరములైన గుణములు లేనివాఁడని యర్థము. ఇట్లు

నిర్గుణ, సగుణ పరములైన వాక్యములను సమన్వయింపఁగా బ్రహ్మము సగుణమేయని శ్రుతి తాత్పర్యము తేలుచున్నది. బ్రహ్మము శ్రుతికి మనస్సునకు గోచరము కాదని చెప్పెడి వాక్యములకు నర్థము, దానియందు నేగుణములు లేవనికాదు; ఉన్న గుణము లసంఖ్యములు, వాని ఆనంత్యమువలన మానవులకది తెలిసి కొనుటకు కష్టమైనదని యర్థము. బ్రహ్మముయొక్క గుణములన్నియు నాకుఁ దెలిసిన వనుకొను వాఁడజ్ఞుఁడు. బ్రహ్మముయొక్క గుణము లనంతములు, అన్నియు నాకుఁదెలియుట యసంభవము అని యనుకొనువాఁడు జ్ఞాని.

'తత్వమసి' (ఛాందో. ౬-౮-౭.) మొదలైన వాక్యముల కేమి యర్థమని ప్రతిపత్తు లడుగవచ్చును. ఇది నిర్విశేషవ స్త్వైక్యపరము కాదనియు, భేదశూన్యమైన ఏకత్వమును బోధించుట లేదనియు, ఇందు అనంతమంగళ గుణాకరమైన బ్రహ్మమునకును, అజ్ఞానియైన జీవునకును, సామానాధికరణ్యము కలదనియు తాత్పర్యము. ఈవాక్యము పరమేశ్వరునకును, జీవులకునుగల విశేష్యవిశేషణ భావములను తెలుపునుగాని జీవబ్రహ్మైక్యము తెలుపదు. ఒకవస్తువును రెండు ప్రకారములుగా చెప్పుటయే సామానాధికరణ్యమనఁబడును. 'ఘటము నీలము' అను వాక్యమునందు, నీలత్వ విశేషణ యుక్తమును ఘటత్వ జాతి యుక్తమునూ అగు ఒక పదార్థమే రెండు రూపములుగ ప్రకటింపంబడినది. దీనినే సామానాధికరణ్యమందురు. ఈ వాక్యము నీలత్వమంతయు ఘటత్వమనిగాని, ఘటత్వమంతయు నీలత్వమనిగాని, ఐక్యభావము బోధజేయుటలేదు. ఘటత్వము వేఱు; నీలత్వము వేఱు అని ఉన్నఁగాని ఈ సామానాధి కరణ్యవాక్యమే పొసఁగదు. విశేష్య విశేషణముల రెండింటికిని భేదము లేదనుకొన్న యెడల 'నీలోఘటః' అను వాక్యమెట్లు సిద్ధించును? అట్లే 'తత్వమసి' (అది నీవు అయియున్నావు) అను వాక్యమునందలి 'తత్' అను పదమునకు సమస్త కల్యాణ గుణాత్మకుఁడగు బ్రహ్మమనియు 'త్వం' పదమునకు జీవాత్మయనియు, 'అసి' పదమువలన బ్రహ్మము జీవాంతర్యామి యనియు బోధపడుచున్నది. జీవజడాత్మకమగు బ్రహ్మాండము శరీరమనియు, బ్రహ్మము దానికాత్మయనియు, జీవ బ్రహ్మములకుఁ గల సంబంధమును ఈ వాక్యము తెలుపుచున్నదే గాని జీవబ్రహ్మముల ఐక్యమును తెలుపుచుండుటలేదు. ఇట్లే జీవబ్రహ్మ సామానాధికరణ్యవాచకములగు నితర వేదాంత వాక్యముల యర్థముగూడ విశేష్య విశేషణభావ సూచకముగ గ్రహింపవలయునేకాని తాదాత్మ్య పదములుగ గ్రహింపఁగూడదు.

'తత్వమసి' అను దాని కర్థము 'నీవు వాఁడవు అయియున్నావు' అని కాదు, 'నీవు వాని వాఁడవు అయియున్నావు' అని. ఆత్మ, (జీవాత్మయు పరమాత్మయు) జ్ఞానమే యని

యద్వైతులు చెప్పునది సరికాదు. ఆత్మజ్ఞానవంతుఁడు, జ్ఞానము కలవాఁడు, జ్ఞాత, తెలిసికొనువాఁడు, జ్ఞానమును అనుభవించువాఁడు. సుఖదుఃఖములకు నొకపురుషుని

ఆత్మ కేవలము జ్ఞానము కాదు, జ్ఞాత; తెలిసికొనువాఁడు

ఆశ్రయమావశ్యకమైనట్లు, జ్ఞానమునకుఁగూడ జ్ఞాతయొకఁడు ఆధార ముండవలెను. అట్లుగాక స్వయం ప్రకాశమనునది ఆత్మయని చెప్పెడు పక్షమున స్వయంప్రకాశమానమగు దీపముకూడ ఆత్మకావలయును. జ్ఞానము జ్ఞాతకు గోచరమగు నన్నమాత్రమున జ్ఞాత జ్ఞానమే కాఁజాలఁడు. జ్ఞానమునకుఁగల ప్రకాశత దానికి జ్ఞాతను బట్టియే వచ్చినది. సుఖదుఃఖములవలెనే జ్ఞానము స్వాశ్రయమునకే (దేనిని అది ఆశ్రయించి యుండునో దానికే) ప్రకటమగును. ఇతరవస్తువునకు గోచరము కాదు. ఇట్టిది స్వతంత్రముగాక స్వాశ్రయైకతంత్రమనుట స్పష్టము. జ్ఞాతలేకుండ జ్ఞానము వేఱుగనుండదు.

బ్రహ్మము కారణమనియు, జగత్తుకార్యమనియుఁ జెప్పితిరి. ఈ జగత్తు బ్రహ్మముకంటె అన్యమా అనన్యమా? అన్యమని పూర్వపక్షము. కాని "వాచారమ్భణం వికారో నామధేయమ్మృత్తికేత్యేవ సత్యమ్" [ఛాంద్గో.] మొదలయిన యసంఖ్య శ్రుతులవలన జెప్పఁబడినట్లు కార్యమగు జగ

జగత్తు బ్రహ్మముకంటె వేఱా? ఒకటేనా?

త్తునకును, కారణమగు బ్రహ్మమునకును అభేమే యని విశిష్టాద్వైతుల సిద్ధాంతము. కాని లోకమునందు కార్య కారణములకును, బ్రహ్మజగత్తులకును వస్తువిరోధము కలదు. వీరిగుణములును వేఱువేఱు. బ్రహ్మ సర్వమంగళగుణములుకలవాఁడు, సర్వజ్ఞుఁడు. జగత్తు అట్టిదికాదు; జడము. ఒకటికారణము, మఱియొకటి కార్యము అయినయెడల రెండును ఒక విధముగ నుండనక్కఱలేదా? ఇట్లుభిన్నముగఁగానవచ్చునవి యొకటియేయని యెట్లు చెప్పవచ్చును? అని పూర్వ పక్షమురాఁగా సమాధానము: కార్య కారణములకు నభేదమే యైనను అవి యొక్కరూపముగ నుండవలయునన్న నియమములేదు. ముద్దవలెఁబడియున్న మట్టికిని దానితోఁ జేయఁబడిన కుండకును రూపభేదమున్నను వస్తుభేదమున్నదా? లేదు. మన్నె కుండయయ్యెనని అందఱకుఁదెలిసిన విషయమే. ఒక దేవదత్తుఁడె బాలత్వ యువత్వాద్యవస్థలయందు వేఱువేఱుగఁ గానవచ్చును. అప్పుడు బాలుఁడగు దేవదత్తుఁడు యువకుఁడగు దేవదత్తునకంటె భిన్నుఁడనిచెప్ప వచ్చునా? తంతువులన్నియు గలిసి పటాకారమగును. తంతురూపము, పటరూపము భిన్నముగఁ గానవచ్చినను అవి యొక్కటియనియే చెప్పవలెనుగాని భిన్నమనుటకువీలా? ప్రాణవాయువు ఒక్కటియైనను శరీరవృత్తి విశేషమునుబట్టి ప్రాణాపానాది భిన్నరూప కార్యముగఁ బరిణమిం

చును. అట్లే బ్రహ్మమునకు జగత్తునకు నభేదమని యెఱుంగునది. విరుద్ధ లక్షణములుగల మక్షికాదులవలన క్రిమ్యాదులు పుట్టుచున్నట్లు, అజ్ఞత్వము, అసుఖత్వముగల చిదచిన్మిశ్రమైన యీజగత్తు, తద్విలక్షణ లక్షణములుగల సర్వజ్ఞుఁడును ఆనందమయుఁడును అగు బ్రహ్మము వలనఁ బుట్టెనదనుటవలన విరోధమేమియులేదు. ఇట్లు కారణమగు నొక ద్రవ్యము కార్యావస్థను జెందునపుడు ఒకప్పుడు కారణమునకు సలక్షణావస్థనుబొందును; ఒకప్పుడు విలక్షణావస్థను బొందును.

సరె. సూక్ష్మచిదచిద్వస్తుశరీరముగల బ్రహ్మము కారణావస్థయనియు, స్థూలచిదచిద్వస్తు శరీరముగల బ్రహ్మము కార్యావస్థయనియు, అందుచే కార్యకారణములకు అభేదమనియు చెప్పితిరి.

బ్రహ్మమునకు దోషము అంటుకొనవు

అట్లయిన జగత్తునందుఁగల జడత్వము, జీవులుచేయు పాపపుణ్యాదులు, జీవుని అజ్ఞత్వము మొదలయినగుణములన్నియు ఈశ్వరునకుఁగూడ నున్నవని చెప్పవలెను అని కొందఱు చెప్పవచ్చును. కాని యట్లుకాదు. మానవుఁడు బాలుఁడుగను, యువకుఁడుగను, అంధుఁడుగను ఉండును. ఆ లోపములన్నియు శరీరమునకేగాని యవియాత్మనంటునా? అట్లే మనమనుభవించు జ్ఞానసుఖాదులు ఆత్మకేగాని శరీరము నంటవు. ఈవిధముననే చిదచిద్వస్తువులు శరీరముగాఁగల పరబ్రహ్మమునకు కార్య కారణోభయావస్థలున్నను, కర్మకు లోఁబడుట, అజ్ఞత్వము మొదలయినవి బ్రహ్మశరీరమైన చిదచిద్వస్తుగతములు; సర్వజ్ఞత్వము, పాపరహితత్వము మొదలైనవి అంతరాత్మయైన పరమాత్మ గతములు. ఇవి వానిని అంటవు. అవి వీనిని అంటవు. ఇదంతయు "యస్యపృథివీ శరీరం" (బృహ.3.౭.3) అన్న అంతర్యామి బ్రాహ్మణమునందున్నది.

బ్రహ్మస్వరూపములు

గరుడవాహనుఁడైన నారాయణుఁడే పరబ్రహ్మము. చతుర్ముఖబ్రహ్మ శివాదులు కారు. ఆ నారాయణుఁడు అయిదురూపములతోనుండును. వీనికే యవస్థలనియుఁ బేరు:—

౧. పరరూపము:—ఇతఁడే పరబ్రహ్మము, పరవాసుదేవుఁడు, నారాయణుఁడు. ఇతఁడు ద్వారపాలకులచే రక్షితమగు వైకుంఠమునందు శేషశయ్యపైఁ గూర్చుండి యుండును. శ్రీభూనీళ లితనిని సేవించుచుందురు. ఈతఁడు శంఖచక్రగదాద్యాయుధములధరించి యుండును. కౌస్తుభాదికములితని నగలు. ఇతనియందు అనంత కల్యాణ గుణములుకలవు. ఇతని సభయందు నిత్యముక్తులైన అనంత గరుడాదులు ఉందురు.*

* తత్ర పరోనామ త్రిపాద్విభూతౌ కుముదకుముదాక్ష పుండరీక వామన శంకుకర్ణ సర్వనేత్ర సుముఖ సుప్రతిష్ఠతాది భిర్దివ్యాయుధభూషణపరిజన పరిచ్ఛదాన్వితైర్దివ్యనగరపాలకైః పరిరక్షితే శ్రీమద్వైకుంఠాఖ్యపురే చండప్రచండ భద్రసుభద్ర జయవిజయ ధాత్ర్య

౨. వ్యూహరూపము:—ప్రపంచోత్పత్తి నిమిత్తమై పరుఁడు వాసుదేవ, సంకర్షణ, ప్రద్యుమ్న, అనిరుద్ధులను నాల్గురూపములను ధరించును. వీరిలో వాసుదేవుని యందు మిగిలిన ముగ్గురియందుఁగల ఆఱుగుణములు నుండును. సంకర్షునికి జ్ఞానబలములను గుణములును, ప్రద్యుమ్నునకు ఐశ్వర్యవీర్యములను గుణములును, అనిరుద్ధునకు శక్తి తేజస్సులను గుణములును కలవు.

3. విభవరూపము :— ఇందు విష్ణువు మత్స్యాది దశావతారముల నెత్తును.

౪. అంతర్యామి రూపము:— ఈ రూపమున ఈశ్వరుఁడు మానవుల హృదయము నందు పడును. యోగులకుఁ గానవచ్చును. జీవాత్మతోఁ గలిసియుండును.

౫. విగ్రహరూపము :—గుళ్ళలో మానవులచే నిర్మింపఁబడిన దారు శిలాధాతుమయములైన ప్రతిమల యాకారమున నుండునది.

పైని చూపఁబడిన పంచావస్థలయందును విష్ణువునకు లక్ష్మీదేవి భార్యగా నుండును.

విధాత్ర ప్రబృతిభిర్ద్వారపాలకైరుపేతే, శ్రీమద్దివ్యాలయే శ్రీమహామణిమండపే ధర్మాద్యష్టపాద విరచితే సింహాసనే శేషపర్యంకే దివ్యమంగలవిగ్రహ విశిష్ట చతుర్భుజ శ్రీభూలీలాసహితః శంఖచక్రాది దివ్యాయుధోపేతః శ్రీమత్ కిరీటాది దివ్యభూషణభూషితః అనన్తగరుడ విష్వక్సేనాదిభిర్నిత్యైః సామగానపరైరనైర్ముక్తైశ్చానుభూయమానో జ్ఞానశక్త్యాద్యనన్త గుణవిశిష్టః పరబ్రహ్మపరవాసుదేవాది వాచ్యోనారాయణః ”

[యతీంద్రమత దీపికా, నవమావతారము.]

ఒకప్పుడు విష్ణుఁడు శ్రీవిశిష్టుఁడుగ నుండఁడని ఏకాయనుఁడు చెప్పినమాట నమ్మఁగూడదు.

పరబ్రహ్మము చిదచిద్విశిష్టము. ఇది విశిష్టాద్వైతమునకు మూలాధారమైన సిద్ధాంత మన్నమాట చదు

ప్రపంచము

వరులకుఁ దెలిసియే యున్నది. చిత్తు అనఁగా జీవులు, అచిత్తనఁగా జడాత్మకమైన ప్రపంచమంతయు నని యర్థము. ఈ ప్రపంచమంతయు నీశ్వరుని శరీరమనియు, * ఈశ్వరుఁడు దీనియంతరాత్మయనియు, ఈశ్వరుఁడు కారణరూపుఁడనియు, ప్రపంచము కార్యరూపమనియు; కార్యకారణములకు నభేదమైనను రెండు భిన్నములనియు, వీనికి విశేషణ విశేష్యభావము కలదనియు, విశిష్టాద్వైత సిద్ధాంతము. శాంకరుల వలె వీరును బ్రహ్మము సృష్టికి నుపాదాన కారణమని యొప్పుకొనినను, వివర్తోపాదానమును ఒప్పుకొనరు; పరిణామోపాదానమును ఒప్పుకొందురు. పాలు పెరుగుగ మారును, మృత్తిక ఘటముగమారును. ఇదియే పరిణామము. పాలు, పెరుగునకు ఉపాదానము (material), మృత్తిక ఘటమునకు ఉపాదానము. అనఁగా పాలే పెరుగయ్యెను, మృత్తికే ఘటమయ్యెను. అంతమాత్రమున పాలుఁ

* శాంకర దర్శనమునందు 'బ్రహ్మేశ్వర' పదములకు భేదమున్నను, రామానుజ దర్శనమునందా భేదము లేదుగాన నిచ్చట 'బ్రహ్మము, ఈశ్వరుఁడు' అను పదములు సమానార్థములుగ నుపయోగింపఁబడినవి.

పెరుగులకును, మృత్తిక ఘటములకును భేదము లేదనిగాని, అవి సర్వథా యేకరూపములే యనిగాని, పాలును మృత్తికయు సత్యములు, పెరుగును ఘటమును అసత్యములు అనిగాని చెప్పుటకు వీలులేదు. పాలెంత సత్యమో, యందుండిపుట్టిన పెరుగును అంత సత్యమే, మృత్తికయెంతసత్యమో యందుండి పుట్టిన ఘటము అంత సత్యమె. కావున ఈ ప్రపంచమంతయు, నిందలివ్యాపారములన్నియు, నిందు జీవునకుఁగల్గుజ్ఞానమంతయు సత్యములేగాని, అసత్యములు, మిథ్యలుకావు.

మాయా వాదము అగ్రాహ్యము

మాయావాదులు ఈ క్రిందియేడు ప్రశ్నలకుఁ దగిన యుత్తరములనీయఁ జాలరు. కావున దానిని అంగీకరించుటకు వీలులేదు. (౧) మాయ దేని నాశ్రయించి భ్రమకలిగించును? దాని కాశ్రయమేది? (౨) తిరోధానమననేమి? (౩) మాయా స్వరూపమెట్టిది? (౪) అది అనిర్వచనీయమననేమి? (౫) దానికేమి ప్రమాణము? (౬) దాని నివర్తకుఁడెవఁడు? (౭) నివార్యమెద్ది? ఇఁక వీనినిగుఱించి కొంచెము వివరముగ చర్చింతము.

౧. మాయకు నాశ్రయమెవఁడు? జీవుఁడా? బ్రహ్మమా? జీవుఁడనుటకు వీలులేదు. జీవుఁడు మాయా నిర్మితుఁడని యద్వైతులే చెప్పుచున్నందున, తాను పుట్టించిన వస్తువు తనకు (మాయకు) ఆధారమెట్లగును? మాయకు బ్రహ్మమే యాశ్రయమని చెప్పుటకును వీలులేదు. బ్రహ్మము జ్ఞానస్వరూపుఁడు, స్వయంప్రకాశుఁడు. జ్ఞానస్వరూపము అజ్ఞానమునకు నాశ్రయ మెట్లు కాఁగలదు? జ్ఞానముచే నజ్ఞానము నాశనమందునని మాయావాదులే చెప్పుచున్నారు. కావున మాయకు నాధారమే లేదు. దీనికి ఆశ్రయానుపపత్తి యనిపేరు.

౨. తిరోధానమనఁగా, మాయ బ్రహ్మముయొక్క స్వస్వరూపమును కప్పివేయును, అని మాయావాదులు చెప్పెదరు. బ్రహ్మము జ్ఞాన స్వరూపము, స్వయం ప్రకాశము అని ఒకవైపుచెప్పుచు, మాయా రూపమైన అవిద్యదానిని కప్పివేయునని చెప్పుట పరస్పర విరుద్ధము కాదా? మఱియొకదానిచేఁ గప్పివేయఁబడునది స్వయంప్రకాశ మెట్లగును? ప్రకాశమునుకప్పివేయుటయనఁగా ప్రకాశమునకు నుత్పత్తిలేకుండఁ జేయుట, లేక యుత్పన్నమైన ప్రకాశమును నశింపఁజేయుట. బ్రహ్మము స్వయంభు వగుటచే బ్రహ్మప్రకాశమునకు నుత్పత్తిలేదు. కావున ప్రతిబంధములేదు. ఇట్లు బ్రహ్మ విషయమునందు ప్రకాశతిరోధానమనఁగా ప్రకాశ నాశనము - స్వరూప నాశనము - అనియే యర్థము. ఈదోషమునకు తిరోధానానుపపత్తియనిపేరు.

౩. బ్రహ్మమునిర్విషయము,నిరాశ్రయము స్వప్రకాశము. అయినను, స్వాశ్రయదోషము (మాయ) చేత అనంతాశ్రయము, అనంత

విషయము అయితినని తల్లంచుచునని గదా మాయావాదులు చెప్పుట. ఆ స్వాశ్రయ దోషము పరమార్థమా (నిజమా), అపరమార్థమా (అసత్యమా)? పరమార్థమనుటకు వీలు లేదు. అట్లన్న బ్రహ్మమందు శాశ్వతదోషమేర్పడును. అపరమార్థము(అసత్యము) అనుటకును వీలులేదు. అట్లన్నయెడల ఈ అసత్యత్వదోష మెవరిది? జ్ఞానముదా? జ్ఞాత (తెలిసికొనువాఁడు బ్రహ్మము)దా? లేక జ్ఞేయముదా? చెప్పవలెను. జ్ఞానమునందీ దోషముండఁజాలదు. ఏలయన నిర్గుణ నిర్విశేష జ్ఞానము భేదశూన్యమనియు, దోషరహితమనియు, మాయావాదులే చెప్పుచున్నారు.

శుద్ధజ్ఞానము స్వయంభువు, స్వయంప్రకాశము. కాన నందు దోషముండదు. రజ్జువు మీఁద సర్పముయొక్క ఆభాస కలిగి మిథ్యాజ్ఞానము కలిగినట్లు ఈ శుద్ధజ్ఞానము మీఁద ఆభాస కలిగి మిథ్యాజ్ఞానము పుట్టునన్నయెడల మిథ్యాజ్ఞానము, శుద్ధజ్ఞానము కన్న వేఱని చెప్పవలెను. అట్లైన నద్వైతమునకు భంగము కలుగును. అనఁగా శుద్ధజ్ఞానము, మిథ్యాజ్ఞానము అని రెండు జ్ఞానము లేర్పడును. ఈ రెంటికి భేదము లేదన్నయెడల శుద్ధజ్ఞానమునకు ననిత్యత్వము, మిథ్యాత్వము ప్రాప్తించి బౌద్ధుల శూన్యవాద ప్రసంగము వచ్చును. కావున ఈ దోషము జ్ఞానము నందు లేదనియే చెప్పవలెను.

ఇఁక జ్ఞాతృజ్ఞేయములందు నీ దోషమున్నదని చెప్పుటకును వీలులేదు. ఇట్లని చెప్పుటచే నొక దోషమునకు మఱియొక దోషము, దానికి నింకొక దోషము కారణమని కల్పించుకొనవలసివచ్చును. అందుచే అనవస్థాదోషము ప్రాప్తించును. ఈ దోషమునకు స్వరూపానుపపత్తియని పేరు.

(౪) మాయ అనిర్వచనీయ మననేమి? ఏది సత్తుకాదో, సదసత్తుకాదోయది అనిర్వచనీయమని యందురు. తమకు నేది తెలియదో, ఎందున గుఱించి తామేమియుఁ జెప్పలేరో యది అనిర్వచనీయము. ఇట్లు మనకుఁ దెలియనిది, ప్రమాణ కోటిలోనికి రానిది అయిన వస్తువును గుఱించి, ఉన్నదని చెప్పుట పొసఁగిన యెడల, వంధ్యాపుత్రుఁడును, శశవిషాణమును ఉన్నవని యేల చెప్పరాదు? ప్రమాణ మార్గమును వదలిన తరువాత నెవ్వరేమైనను చెప్పవచ్చునుకదా? ఇది అనిర్వచనీయతానుపపత్తి.

(౫) మాయయొక్క యస్తిత్వమునకు నేమి ప్రమాణముకలదు? మాయావాదులు ఈ మాయ అను అజ్ఞానము భావరూపము, అభావరూపము కాదు, అని చెప్పెదరు. భావరూపమైన అజ్ఞానము ఏ ప్రమాణముల వలనను సిద్ధింపఁజాలదు. అజ్ఞానమనఁగా, జ్ఞానముయొక్క ప్రాగభావము. కావున నది అభావరూపమని తెలుసుకొని భావరూపమని

ఎప్పుడును తేలఁజాలదు. ఇది ప్రమాణానుపపత్తి.

(౬) అజ్ఞానము దేనివలన నివర్తింపఁబడును? (౭) నివర్త్యమెద్ది? ఇచ్చట అజ్ఞానమనఁగా 'జగత్తుమిథ్య యన్న యజ్ఞానము, బ్రహ్మస్వరూప సంబంధమైన యజ్ఞానము. జ్ఞానమనునది తనంతట తాను స్ఫురించునట్టి భావపదార్థము, 'నేను అజ్ఞానిని' అని అజ్ఞాన సమయమందు నాత్మకు బోధయుండును అని శాంకర సిద్ధాంతమును, అజ్ఞానమనఁగా జ్ఞానములేమి, అది కేవలము అభావరూపము, జ్ఞానము కలిగినఁగాని నాకు నజ్ఞానముండెనని ఆత్మకు గోచరము కాదు అని రామానుజ సిద్ధాంతమును అయినందున, నివర్తక నివర్త్యములను గూర్చి వీరి యిద్దఱికిని, మిక్కిలి బుద్ధి సూక్ష్మతను తెలుపునట్టి వివాదములు జరుగుచుండును. అట్టివాద తాత్పర్యమంతయు నేమియన. ఘటము భావవస్తువు. ఘటము పోవలయునన్న, కర్రతోనో, రాయితోనో దానిని పగలఁగొట్టినఁ బోవునేకాని, జ్ఞానమువలన ఘట మిట్టిదని మనకెంత బోధ కలిగినను పోఁజాలదు. అట్లే అజ్ఞానము మాయావాదులు చెప్పినట్లు భావరూపద్రవ్యమేయైనయెడల, బ్రహ్మమును గుఱించి మనకెంత జ్ఞానము కలిగినను పూర్వమందుండిన అజ్ఞానము పోఁజాలదు. భావరూపము గలది గనుక వినాశముఁ జెందక యట్లేయుండును. కావున మాయావాదము ననుసరించినయెడల 'నివర్తక' ముండదు, 'నివర్త్య' ముండదు. ఈ రెండు దోషములకు నివర్తక నివర్త్యానుపపత్తులని పేళ్లు.

ప్రత్యక్షముగఁ గనఁబడు ప్రపంచమంతయు అసత్యమనియు, భ్రమయనియు శంకరులు ప్రతి పాదించిరి.

రజ్జుసర్పాది జ్ఞానము కూడ సత్యమె, మిథ్యకాదు

దానికి వ్యతిరేకముగ, రామానుజులు ప్రపంచ జ్ఞానమంతయు సత్యమే యని చెప్పుటయేగాక, నిజముగ మిథ్యాజ్ఞానము, భ్రమయని లోకమంతయు తలంచుచున్న, రజ్జుసర్ప శుక్తిరజత, ద్విచంద్ర, స్వప్న, మరుమరీచి కాది భ్రాంతులన్నియు భ్రాంతులు కావనియు, సత్యజ్ఞానములేయనియు సిద్ధాంతీకరించియున్నారు!

పృథ్వి, అప్పు, తేజస్సు ఈ మూఁడును భిన్నాంశములుగఁ గలిసి సమస్త పదార్థములైనవి. అనఁగా నొక్కొక పదార్థమునందు, ఇతరపదార్థముల అంశములు కూడనుండును. నామ రూపములు వేఱైనను అన్ని భూతములును త్రిరూపములే. కావున సర్వము సర్వమునందుఁ గానవచ్చును. ఆశ్చర్యమేమియు లేదు. శుక్తి (ముత్యపు చిప్ప) రజతమువలె గానవచ్చును. అది నిజమైన రజత జ్ఞానమే కాని మిథ్యాజ్ఞానముకాదు. శుక్తికయందు, రజతాంశమున్నది. శుక్త్యంశమున్నది. ఆ కాలమందు మన కన్నులు రజతాంశమును మాత్రము గ్రహించినవి. శుక్త్యంశమును

గ్రహింపలేదు. కావున రజతమే కానవచ్చి దానిని రజత మనుకొంటిమి. అసత్య రజతము మనకు రజతజ్ఞానమును ఈయలేదు. సత్యరజతమే సత్యజ్ఞానమును ఇచ్చినది. మిథ్యారజత మెప్పుడును రజతజ్ఞాన మీయఁజాలదు. ఇట్లే రజ్జుసర్పభ్రమ భ్రమ కాదని తెలిసికొన వలసినది.

స్వప్నగతానుభవముకూడ నిజమే. స్వప్నమందుఁగూడ, ప్రతి ప్రాణియొక్క పాపపుణ్యముల ననుసరించి, భగవంతుఁడు ఆయా పురుషుఁడా కాలము మాత్ర మనుభవించునట్లు సుఖదుఃఖాత్మకములగు పదార్థములను సృజించును. నిద్రా సమయమున పురుషుని శరీరము మంచముమీఁదనే పరుండి యుండఁగా నాతనికి రాజ్యాభిషేక మైనట్టును, శిరచ్ఛేద మైనట్టును కలలు పడునే యప్పుడు ఆ దేహముకూడ నిజమేనా? యని యడుగఁ బరమేశ్వరుఁడు ఆయాత్మకు, స్వప్న సమయమందు వాని కర్మానుసారముగ; నూతన శరీరము నిచ్చి సుఖదుఃఖముల ననుభవింపఁ జేయును, అని ప్రత్యుత్తరము. మరుమరీచికము (ఎండ మావులును) ఇట్లే నిజము. మరుత్ప్రదేశమునందు నెండ లెక్కువ కాఁగా నందలి పృథ్వీ తేజస్సులయొక్క యంశములు లోపించి జలముయొక్క యంశములు మాత్రము కానవచ్చును. కాని యవి నిజమైన జలములే. అసత్య జలములుకావు. ఇట్లు మానవునకు నేకాలమందే జ్ఞానము కలుగునో యది యాకాలమందు సత్యమేయని నిశ్చయము. దీనినే సత్ ఖ్యాతి పక్ష మందురు. కావున విజ్ఞానమంతయు సత్యమే, పరమార్థతః సత్యమే. నిజములో, వ్యావహారికమనియు, పారమార్థికమనియు రెండు భేదములు లేవు. జ్ఞానానుభవమంతయు పారమార్థికమే, నిజమే, సత్యమే.

జీవుఁడొక్కఁడు కాఁడు; జీవు లసంఖ్యులు. పిపీలికాది మొదలు చతుర్ముఖ బ్రహ్మపర్యంతము నందఱునుజీవులే.

జీవులు

వారి వారి కర్మ ననుసరించి వేఱువేఱు దేహముల నాశ్రయింతురు. జీవుఁడు అణువు. జీవులు, పరమేశ్వరుఁడు వేఱు. అగ్నినుండి స్ఫులింగములు పుట్టినట్లు ఈజీవములన్నియు బ్రహ్మమునుండియే పుట్టును గాని వానికి స్వతంత్రాస్తిత్వము ఉన్నది. 'అహంబుద్ధి' యే జీవత్వము. 'నేను' అన్నజ్ఞానముండుటయే జీవుని లక్షణము. ఈ అహంబుద్ధి జీవునకు సర్వదా సర్వావస్థలయందును ఉండును. ముక్తావస్థయందుఁగూడ ఈ యెఱుక వినాశము చెందదు. వేణు రంధ్రములలో నుండి వెలువడిన వాయువులు మూలమం దొకటియైనను, షడ్జాది పదములచే భిన్నమైనట్టు, విజ్ఞానవంతులైన జీవులు మూలమునం దొకటియైనను వారివారి కర్మ భేదములచే వేఱువేఱు వారగుదురు.

జీవులు అనాదులు. ఒక జీవునికంటె మఱియొక జీవుఁడు భిన్నుఁడు. మోక్షమువఱకు

జీవుఁడు ప్రకృతితోఁ గలిసియుండ వలసిన వాఁడే. ప్రకృతియొక్క ప్రతి పరమాణువు నందును జీవుఁడుండును. జీవాత్మకు ప్రకృతి యొక వాహనము వంటిది. ప్రతి జీవాత్మని లోను పరమాత్ముఁడంతర్యామిగ నుండును. జీవాత్మ శరీరము, పరమాత్మ శరీరి. జడము నందెట్లు పరమాత్మ నిండియుండునో జీవాత్మల యందుఁగూడ నట్లే నిండియుండును.

మన శరీరమునందు జీవాత్మ యుండెడు తావు హృదయము. జీవాత్మ పరమాణు రూపమైనను దాని జ్ఞాన మనంతము. అది ఆకాశమును, కాలమును అతిక్రమించి తాను తెలిసికొనఁదలచిన విషయమును నేరుగ సమీపించును.

జీవులు మూఁడు విధములుగనుందురు:—

౧. నిత్యులు : వీరెప్పుడును నిరతిశయా నందమును అనుభవించుచు, కర్మకుగాని ప్రకృతికిగాని లోఁబడరు. వీరు సర్వజ్ఞులు, వైకుంఠమునందుందురు. అనంతుఁడు, గరుడుఁడు, విష్వక్సేనుఁడు, మొదలయిన వారిట్టి వారు.

౨. ముక్తులు : బ్రహ్మజ్ఞానభక్తి ప్రపత్తులచే ఈ మహా యుగమునందు ముక్తులైన వారు. వీరికి సర్వజ్ఞత్వము కలుగును.

౩. బద్ధులు : ఇంకను సంసారమునందుఁ గొట్టుకొనుచున్నవారు. అజ్ఞానము వలనను, కర్మవలనను వీరు బద్ధులు. వీరిలో దేవతలు గలరు. మానవులు కలరు, పశ్వాదులుకలవు.

కేవల జ్ఞానమెప్పటికి మోక్ష మీయఁజాలదు. బ్రహ్మజ్ఞాన మావశ్యకమేకాని దానికిజత భక్తిప్రపత్తు లుండవలెను. పరమేశ్వరునకు నెల్లప్పుడును సేవచేయు చుండినయెడల నాతనికి దయగలిగి జీవునకు ముక్తివచ్చును. ఉపాసనలేనిది జ్ఞానమునకు దృఢతరాదు. కేవలము వాక్యార్థ జ్ఞానముచే భేదదృష్టినష్టమై మోక్షము ప్రాప్తించునని చెప్పుటకు వీలులేదు. మహావాక్యార్థజ్ఞానము చక్కఁగ కలిగిన పురుషులుకూడ భేదదృష్టి కలవారుగను సుఖదుఃఖములకు లోఁబడిన వారుగను కనఁబడుచున్నారు. శ్రుతి స్మృతులలోను బ్రహ్మజ్ఞానమనఁగా బ్రహ్మముయొక్క ఉపాసనయనియు, నిదిధ్యాస మనఁగా అఖండ స్మృతియనియు అందువలన మోక్షము ప్రాప్తించుననియుఁ జెప్పఁబడియున్నది. ఇట్లు జ్ఞానమనఁగా ధ్యానము, అఖండస్మృతి అని తెలిసికొనవలెను. దానికి భక్తితో లంకె కలిసినయెడల పరమేశ్వర సాక్షాత్కారము కలుగును. భక్తి జ్ఞానము లుదయించుటకు పూర్వసంచితమైన పాపపుణ్యాది జ్ఞానవిరోధి కర్మ నిరస్తము కావలయును. అదినిష్కామ కర్మచే నిరస్తమగును. వేదచోదితమైన కర్మను, నిష్కామబుద్ధితో చేసి సంచిత పాపమును పోఁగొట్టుకొనవలెను. ఇట్లు పాపక్షయమైన తరువాత బ్రహ్మ మీమాంస నభ్యసించి, బ్రహ్మ స్వరూపమును తెలిసికొని, దానిని

మోక్ష మార్గము

ధ్యానించుచు, ప్రేమించుచు, భజించుచు నుండినయెడల మోక్షమబ్బును. కావున బ్రహ్మసూత్రములందలి, 'అథాతో బ్రహ్మ జిజ్ఞాసా' అను ప్రథమ సూత్రములోని అథ శబ్దమునకు కర్మమీమాంసా నంతరము బ్రహ్మ మీమాంసఁ జేయవలయునని అర్థము స్పష్ట పడుచున్నది.

అథయనఁగా సాధన చతుష్టయా నంతరము కాదు

మాయావాదులు సాధన చతుష్టయము సాధ్యమైన తర్వాత బ్రహ్మ మీమాంసను జేయవలయునని చెప్పెదరు. కాని పూర్వోత్తర మీమాంసల నెఱింగిన తరువాతగాని నిత్యానిత్య వివేకాది సాధనచతుష్టయము సంప్రాప్తించదు; సాధన చతుష్టయమునకు మీమాంసా జ్ఞానమావశ్యకము. సాధన చతుష్టయమువలన మీమాంసా జ్ఞానముకలుగ నేరదు. మీమాంసా జ్ఞానమే సాధనచతుష్టయమును బుట్టించును. భోగమా, యోగమా, యజ్ఞమా ఉపాసనా, బుభుక్షువా, ముముక్షువా, అన్న ప్రశ్నలకు మీమాంసయే, సదుత్తర మీయఁగలదు. సాధన చతుష్టయము ఒక సాధనము. దాని విని యోగాదులు తెలిసికొనుటకుమీమాంసకే శరణుఁజొచ్చ వలయును. కావున సాధన చతుష్టయము బ్రహ్మమీమాంసకుఁ బూర్వముండ వలయునన్న మాట యసంగతము.

ఉపాసనా బలముచే నీశ్వరానుగ్రహము కలిగి జీవుఁడు ముక్తుఁడగును. అనఁగా నతఁడు

ముక్త జీవుఁడు

సర్వపాప రహితుఁడై, కర్మ వివర్జితుఁడై, జన్మాదిబంధములను ద్రెంచుకొని, పునరావృత్తిలేని శాశ్వతపదవికిఁ బోవును. అప్పు డతఁడు పరమేశ్వరునితో సరూపుఁడు - ఒకరూపముగలవాఁడు- అగును. కాని అతని తో సాయుజ్యముఁ జెందఁడు. అనఁగాఁ గలిసి పోఁడు. ఒక్క జగదుత్పత్తి విషయమైనశక్తి తప్ప, పరమేశ్వరునకుఁగల మిగిలిన శక్తు లన్నియు ముక్తజీవునకుఁ గలుగును. కాని యతఁడు పరమేశ్వరునితో నైక్యముఁజెందఁడు. ముక్తావస్థలోఁగూడ నతని "అహంబుద్ధి"- నేను అను ఎఱుక - శాశ్వతముగనుండును. అట్లులేక యాతని 'అహంబుద్ధి' పోయి మాయావాదులు చెప్పినట్లు అతఁడు పరమేశ్వరునిలో లీనమైపోయిన యెడల స్వరూప నాశమును ఆత్మనాశమును జెందును. ఇట్లు ముక్తి యనఁగ నాత్మవినాశమని యర్థము చేయవలసి వచ్చును. ఇట్టిముక్తిని ఎవ్వఁడును కోరఁడు. ముక్తియనఁగా స్వత్వనాశమని తెలిసినయెడల నెవనికిని ముక్తియందు నాపేక్ష కలుగనేరదు. కావున ముక్తావస్థలోఁగూడ జీవునకు "అహంబుద్ధి" లేక "అహంకారము" ఉండితీరు ననియే చెప్పవలెను. దీనినే సారూప్యముక్తి యందురు. విష్ణువుయొక్క రూపము ముక్త జీవునకుఁ బ్రాప్తించును. శంఖ చక్రాదికములు లభించును. కాని లక్ష్మీపతిత్వము రాదు!

విశిష్టాద్వైతులలో వడకలులు (ఉత్తరాది వారు) తెంకళ్లు (దక్షిణాదివారు) అను రెండు శాఖలు గలవు. వడకలులు పాదము లేనినామము పెట్టుదురు. తెంకళ్లు నామము క్రిందఁ బాదముధరించెదరు. ఇట్లు బొట్టును గుఱించిన భేదముగాక వీరికి తత్త్వమును గుఱించిన భేదముకలదు. ముక్తినిగాంచుటకు మనుష్య ప్రయత్నము ముఖ్యమా, ఈశ్వరానుగ్రహము ముఖ్యమా యన్న విషయమందు వీరు భిన్నాభిప్రాయులగుదురు. వడకలులు మర్కటకిశోరన్యాయమును అంగీకరింతురు. కోతిపిల్ల తల్లిపొట్టక్రింద ఉండి దానిని గట్టిగఁ బట్టుకొనును. తల్లి యెంత యెగిరినను విడువదు. ఇందు పిల్లపట్టేగాని తల్లిపట్టులేదు. అట్లు ముక్తినం పాదించుకొనుటకు జీవుని పట్టె యెక్కువగ నుండవలెను. అప్పు డీశ్వరుఁ డనుగ్రహించును. ప్రపత్తి ముక్తిమార్గమునకు నొకత్రోవ. అది జీవుని ప్రయత్నవశము. కర్మయోగ, జ్ఞానయోగ, భక్తియోగములచే ముక్తిని సాధింపలేని వారికి ప్రపత్తి మార్గము శరణము. అనఁగా నితరమార్గము లన్నియు కుంఠితము లయినప్పుడు ప్రపత్తిమార్గమును అవలంబింపవలెను. శూద్రులకు నష్టాక్షరిమంత్రము ప్రణవముతో చెప్పఁగూడదు. తెంకళ్లు తెగవారు మార్జాల కిశోరన్యాయమును అంగీకరించిరి. పిల్లి తన కూనను నోటితో కఱచుకొని యెత్తుప్రదేశములకు నెగురును. ఇందు తల్లిపట్టేగాని పిల్ల పట్టులేదు. అట్లే యీశ్వరానుగ్రహము వలన జీవునకు ముక్తి ప్రాప్తించవలసినదే గాని, జీవప్రయత్నమువలన నంతగఁ బ్రయోజనములేదు. ప్రపత్తియే ముక్తి సాధనము. కేవలము కర్మజ్ఞానాదులగు నితరసాధనముల వలనఁ బ్రయోజనములేదు. వానినాశ్రయించి ముక్తిఁ బొందినవారులేరు. జీవుఁడు ప్రపత్తి మార్గమునందుండి సర్వస్వము ఈశ్వరునే శరణుజొచ్చినపుడు ఈశ్వరుఁడా జీవాత్మను అనుగ్రహించి వానిని సంపూర్ణముగఁ దనవానిని చేసికొనును. ఇతరమార్గములు చేతగానపుడు ప్రపత్తిమార్గమును అవలంబించవలెనన్న మాట యంగీకరింపఁదగినది కాదు. కర్మ,జ్ఞాన, భక్తిమార్గము లందఱును అవలంబింప వలసినవే. అష్టాక్షరీ మహామంత్రము (ఓం నమో నారాయణాయ) అనునది శూద్రులకుఁ గూడ ప్రణవముతోఁ జెప్పవలెను.

[కో. ల.

విశిష్టాద్వైత గ్రంథావళి

సంస్కృతము

గ్రంథము	కర్త
శ్రీభాష్యము (బ్రహ్మసూత్రములమీఁది భాష్యము)	రామానుజుఁడు
గీతాభాష్యము	,,
వేదాంత దీపము (బ్రహ్మసూత్రములమీఁది లఘుభాష్యము)	,,
వేందాంత సారము	,,

వేదాంత సంగ్రహము	”
గద్యత్రయము	”
శరణాగతగద్యము	
వైకుంఠగద్యము	”
శ్రీరంగ గద్యము	
శ్రుత ప్రకాశిక	సుదర్శనభట్టు
సిద్ధిత్రయము	నాథయోగి
గీతాభాష్యము	యామునాచార్యుఁడు
ఉపనిషత్ వ్యాఖ్య	రంగరామానుజుఁడు
యతీంద్రమత దీపిక	శ్రీనివాసాచార్యుఁడు
గీతా తాత్పర్య చంద్రిక	వేదాంత దేశికుఁడు
అర్థపంచకము	”
తత్త్వముక్తా కలాపము	”
అధికరణసారావళి	”
శతదూషణి	”
రఘువీరగద్య	”
నిక్షేపరక్ష	”
ప్రసన్నామృతము	ఆంధ్రపూర్ణుఁడు
తత్త్వత్రయము	లోకాచార్యుఁడు

సూచన:—బ్రహ్మశ్రీ చదలవాడ సుందర రామశాస్త్రిగారిచేఁ బ్రకటింపఁబడుచున్న భగవద్గీత మీఁది రామానుజభాష్యముయొక్క తెలుఁగు భాషాంతరీకరణము తప్ప 'విశిష్టాద్వైత తత్త్వము'ను గుఱించి తెనుగున వ్రాయఁబడిన తత్త్వగ్రంథము మఱియొకటి మాకు తెలిసినంత వఱకాంధ్రమున లేదు. ద్రావిడ భాషయందు దసంఖ్యములు గలవు. వానిపేళ్ళిట నిచ్చుట యనావశ్యకము.

3. శుద్ధాద్వైతము

(శ్రీ వల్లభాచార్యమతాను సారము)

వల్లభమతము - శుద్ధాద్వైతమను నది- గుజరాత్ దేశమునందు వ్యాపించియున్నది. వల్లభాచార్యునకు శాంకరాద్వైతమును, విశిష్టాద్వైతమును అసమ్మతము లయినందున నాతఁడు ఈసిద్ధాంతముల ఖండించి శుద్ధాద్వైతమను సిద్ధాంతమును స్థాపించెను.

ఈ కనఁబడు ప్రపంచమంతయు సత్యమనియు నదిసూటిగ బ్రహ్మమేయనియు నీతని మతము. ఈతనికి మాయావాదముగాని, చిదచిత్తు లీశ్వరుని గుణములన్న వాదముగాని సమ్మతములుకావు. బ్రహ్మమందు మాయవలన ప్రపంచము కలిగినదన్నతోడనే బ్రహ్మము, మాయ యను ద్వైతము వచ్చినదిగనుక నది శుద్ధాద్వైతముకాదనియు, విశిష్టాద్వైతముకూడ నట్లె అనంగీకార్యమనియు ఈయన యభిప్రాయము. ప్రపంచమందలి చిదచిదాత్మకమంతయు శుద్ధ బ్రహ్మమేయనియు, ప్రపంచమునకును పరబ్రహ్మమునకును సంపూర్ణమగు నభేదమనియుఁ జెప్పుటచే నీమతమే శుద్ధాద్వైతమని ఈమతము వారనియెదరు.

ఈ సంప్రదాయమునందుఁ బ్రమాణగ్రంథములు నాలుగు. వేదములు, భగవద్గీత, వ్యాససూత్రములు, భాగవతము. మొదటి

ప్రమాణ గ్రంథములు

మూఁడునందఱకు సామాన్యములు. చివరదియగు భాగవతము వీరికి విశేషము. ఈ నాల్గుప్రమాణములలో నుత్తరోత్తరములు పూర్వపూర్వములకు సందేహనివారకములు. అనఁగా వేదమునందలి సందేహమును, భగవద్గీతవలనఁ దీర్చుకొనవలెను, భగవద్గీతయం

దలి సందేహము వ్యాససూత్రముల వలనను, వ్యాససూత్రముల యందలి సంశయములు భాగవతము వలనను తీర్చుకొనవలెను. అనఁగా సందేహ నివారణమునకుఁ జివర ప్రమాణము వీరిమతమునందు భాగవతము. వీనికి విరోధములుకానియెడల మన్వాది స్మృతులు ప్రమాణములు. విరుద్ధముగ నున్నవన్నియు నప్రమాణములే. ఈ నాలుగు ప్రమాణములలో శ్రుతి వ్యాససూత్రములు ఒక కోటి, గీతా భాగవతములు మఱియొక కోటి. పరమేశ్వరుని రూపమునందు క్రియా జ్ఞానవిభేదముచే మూఁడుభేదములు కలిగినవి. క్రియారూపమైన ధర్మమునందుఁ బ్రవిష్టుఁడైన ధర్మి యజ్ఞరూపుఁడు; జ్ఞానరూపమైన ధర్మమునందు ప్రవిష్టుఁడైనధర్మి బ్రహ్మము; జ్ఞానక్రియోభయ యుతుఁడు కృష్ణుఁడు. ఈ మూఁడు రూపములలో కృష్ణరూపము క్రియాజ్ఞానవంతము. ఇది విశిష్టరూపము. పైని చెప్పఁబడిన ప్రమాణగ్రంథములలో మొదటి రెండును యజ్ఞమును, బ్రహ్మమును ప్రతిపాదించును. చివర రెండు అనఁగా భగవద్గీతయు, భాగవతపురాణమును మూఁడవరూపుఁడగుకృష్ణుని ప్రతిపాదించును. వేదము కర్మకాండ ప్రతిపాదకము, బ్రహ్మ ప్రతిపాదకము, అని రెండు విధములు. సంహితా బ్రాహ్మణములు కర్మప్రతిపాదకములు. పూర్వమీమాంస అందుకు సంబంధించినది. ఉపనిషత్తులు బ్రహ్మప్రతిపాదకములు. ఉత్తరమీమాంస అందులకు సంబంధించినది.

వేదము, త్రయయొక్కయు నితరులయొక్కయు నిర్వాహము జేయుటకు సమర్థము కాదు. అంతకంటె భాగవత ముత్కృష్టము కలది. వేదములు కొందఱకే పనికివచ్చును. భాగవత మందఱికిఁ బనికివచ్చును. అది చదివినందుననే మానవుఁడు ముక్తుఁడగును. వేదము చదివి, దాని అర్థముఁగనుఁగొని, ఆ ప్రకారము అనుష్ఠించినఁగాని అందుఁ జెప్పఁబడిన ఫలము ప్రాప్తింప నేరదు.

పదమూఁడవ శతాబ్దమునందు విష్ణుస్వామి యనునొక యోగియుండెను. అతనిచేఁ జెప్పఁబడిన మతమే వల్లభాచార్యులవారిచే స్థాపింపఁబడెనని యీ మతమువారు చెప్పెదరు.

బ్రహ్మతత్త్వము

ఈ మతమునందు పరబ్రహ్మము మొదట నొక్కఁడే, సజాతీయ విజాతీయ స్వగతభేదము లేనివాఁడు. అట్టి అద్వితీయునకు సద్వితీయుఁడు, పెక్కుమందిగ మారవలయునన్న బుద్ధిపుట్టెను. ఇట్లు బుద్ధిపుట్టి యాతఁడు అంతర్యామి, జీవాత్మ, ప్రపంచము అన్న త్రిరూపములుగ మారెను. ఈమూఁడును, అగ్నినుండి విస్ఫులింగములు పుట్టినట్లు పుట్టెను. ఈ మూఁడును అతని భాగములు. అంతర్యామియైన పరమాత్మకు సత్తు, చిత్తు, ఆనందము అను మూఁడు ధర్మములును, జీవాత్మకు సత్తు చిత్తులను రెండుధర్మములును, ప్రపంచమునకు సత్తు అను ఒకధర్మమును కలవు. ఇట్లంతయు పరమాత్మయే యైనను జీవాత్మ కానందము

లేకుండఁజేయుటయు, జగత్తునకు చిత్తు, ఆనందములు లేకుండఁ జేయుటయు ఆ బ్రహ్మము యొక్క యచింత్యమైన యిచ్ఛవలననే కలిగినది. శుద్ధబ్రహ్మమునం దానందము తాండవమాడుచుండును.

ప్రపంచమున కంతకును ఉపాదానకారణము బ్రహ్మమే. బ్రహ్మమునకంటె వేఱుగ ఈ ప్రపంచము కనఁబడుట అజ్ఞానమువలన. బ్రహ్మముయొక్క నిజస్వరూపము తెలియకపోవుటయే యిందులకుఁ గారణము. జీవుఁడు బ్రహ్మమే. అతనియంశము, అణువు. పరబ్రహ్మమందు సచ్చిదానందములను మూఁడు గుణములుకలవని చెప్పితిమి. అందు సద్భాగ మెక్కువగనున్న యెడల ఆనందభాగము దానికి నగోచరమగును. అప్పుడు జీవులు, సత్తుచిత్తు మాత్రముగల వారుగ పుట్టుదురు. ఇట్లే జగత్తు పుట్టునని యెఱుంగునది.

తత్త్వదీపమను గ్రంథమునందు, వల్లభాచార్యుఁడు బ్రహ్మముయొక్క లక్షణములు ఈ క్రింది విధముగఁ జెప్పినాఁడు. బ్రహ్మము సచ్చిదానంద రూపము, వ్యాపకము, అవ్యయము, సర్వశక్తిమంతము, స్వతంత్రము, సర్వజ్ఞము, గుణవర్జితము, సజాతీయ విజాతీయ స్వగతద్వైత వర్జితము, సదా సత్యాదికము* లయిన యసంఖ్యగుణములచే యుక్తము, సర్వాధారము, ప్రాపంచిక పదార్థములకంటె విలక్షణము, జగత్తునకు సమవాయి నిమిత్తకారణములు. ఒకప్పుడు తనయందురమించును, ఒకప్పుడు ప్రపంచమునందు రమించును. ప్రకృతియుఁ బురుషుఁడును, గాలమును నీతఁడే. భాషయందుఁగల సర్వవిభక్తులచేఁ జెప్పఁబడు సర్వము సాక్షాత్ బ్రహ్మమే. ఇతఁడు సర్వపదార్థములయందు నుండును. ఈతనియందు సర్వపదార్థములు నుండును. ఇట్లు బ్రహ్మము సర్వవస్తువుల యెడ నాధారాధేయ భావముకలదియైనగూడ నావస్తువును స్పృశింపదు. బ్రహ్మము, కూటస్థము, స్వవాదానవసరము, నానావాదానురోధి, అనంతము, సర్వవిరుద్ధ ధర్మములకు నాశ్రయము, యుక్తికి నగోచరము. ఆవిర్భావ తిరోభావములచే బహురూపములను గ్రహించి మోహింపంజేయును. సామర్థ్యముచేత నింద్రియముల కగోచరముగనుండును. ఇందు బ్రహ్మమునకుఁ జెప్పిన ధర్మములలో విరుద్ధ సర్వధర్మాశ్రయత్వము, యుక్త్యగోచరత్వము అను నవి ఈ వల్లభ మతమువారు బ్రహ్మమునం దారోపించునట్టి విశేషగుణ

* సత్యాదిగుణములిట్లు భాగవత ప్రథమ స్కంధమునందుఁ జెప్పఁబడియున్నవి. "సత్యం శౌచం దయా క్షాంతి స్త్యాగః సంతోష ఆర్జవం। శమోదమ స్తపః సామ్యం తితిక్షోపరతిః శ్రుతమ్॥ జ్ఞానం విరక్తి రైశ్వర్యం శౌర్యం తేజో బలం స్మృతిః। స్వాతంత్ర్యం కౌశలం కాంతి ర్ధైర్యం మార్దవమేవ చ॥ ప్రాగల్భ్యం ప్రశ్రయః శీలం సహ ఓజో బలం భగః। గాంభీర్యం స్థైర్యమాస్తిక్యం కీర్తిర్మానో౽నహంకృతిః॥ ఏతేచాన్యేచ భగవన్నిత్యాయత్ర మహాగుణాః। ప్రార్థ్యా మహత్త్వమిచ్ఛద్భిర్న వియంతి స్మకర్హిచిత్॥

ములు. ఒకటితో నొకటి పొసగనట్టి పరస్పర విరుద్ధ ధర్మములుగూడ బ్రహ్మమునం దుండ వచ్చును.

ఈ భూమి యొక్కటియైనను, ఇది సహజ విరుద్ధములయిన సర్పమూషికాదులకు నాశ్రయమైనట్లు పరబ్రహ్మముగూడ విరుద్ధగుణముల కాశ్రయము. ఇట్లు విరుద్ధ ధర్మము లొక పదార్థమునందుండవచ్చునన్న యద్భుత సిద్ధాంతము నొప్పుకొనినందున వల్లభాచార్యున కుపనిషత్తులలోని ద్వైతాద్వైత వాక్యములన్నియు సమన్వయించుటకు నుపాయము దొరకెను. బ్రహ్మము యుక్తిగోచరుఁడు కాఁడు, అగమ్యుఁడు. ఇచ్చట యుక్తియనఁగా లౌకికయుక్తియని యర్థము. యుక్త్యగోచరత్వము బ్రహ్మమునకు భూషణమేగాని దూషణముకాదు. బ్రహ్మము సహస్రశీర్షుఁడని చెప్పఁబడియున్నది. వేయితలలఁ గలిగియుండుట లౌకికయుక్తికి గోచరమగు విషయముకాదు.

బ్రహ్మము తత్త్వతఃరూప రహితము. ఇఁక రూపమెట్లు వచ్చెను? అని ప్రశ్నరాఁగా రూపములేని వస్తువునకుఁగూడ రూపము ఉన్నట్లు కనఁబడుటకలదు. మేఘాది రహితమైన ప్రదేశములందు, ఆకాశము నీలవర్ణముఁగ గానవచ్చును. ఆకాశమునకు తత్త్వతః వర్ణము లేదుగదా! అట్లే యంధకారము. దానికి రూపము లేకపోయినను నల్లనిదిగ మనకుఁ గాన్పించును. ఆలాగుననే బ్రహ్మమునకు రూపాదులు లేకపోయినను, అతిగాఢమైన గంభీరముచేత నది నీలముగఁ గాన్పించును.

శ్రీ కృష్ణుఁడు పరబ్రహ్మము. ఇది బ్రహ్మముయొక్క యాదిరూపము. ఇది ప్రాకృత రూపముగాదు. కేవల దివ్యరూపము. ఇతఁడే పురుషోత్తముఁడు. అతని లీలలన్నియు శాశ్వతములు. ఇతఁడు గోలోకమునందు తన భక్తులతో లీలావిహారము చేయుచుండును. ఇందు విశాలమైన యరణ్యములుగల బృందావనమున్నది.

కృష్ణుఁడు పరమానంద ప్రియుఁడు. సత్యభాగ మతని యందలి యానంద భాగమును గప్పఁగా నాతఁ డక్షరబ్రహ్మమగును. అక్షర బ్రహ్మము రెండు విధములు. (1) భక్తులచేఁ బూజింపఁబడు కృష్ణపురుషోత్తమాది రూపములు గలది. (2) సచ్చిదానంద మయము, రూపరహితము, కాలమునకు నాకాశమునకు నతీతము, స్వయం ప్రకాశము, సర్వగుణరహితము.

జీవ తత్త్వము

జీవుఁడు ఆరె మొనయంత సూక్ష్ముఁడు. అనఁగా అణుస్వరూపుఁడు. అట్లయిన అణుస్వరూపుఁడు దేహమంతయు నెట్లు వ్యాపించి యింద్రియాది వ్యాపారములఁ జేయునని సంశయము కలుగవచ్చును. కాని జీవుఁడు అణువైనను గంధమువలె వ్యతిరేకవంతుఁడు. అనఁగా ద్రవ్యాపేక్షయా అధికప్రదేశము వ్యాపించువాఁడు. పుష్పముచిన్నదైనను దాని

గంధము చుట్టును ఎంతో దూరమువఱకు వ్యాపించును. అట్లే జీవుఁడణువైనను చైతన్య గుణముచే దేహమంతయు వ్యాపించి యిం ద్రియ వ్యాపారము చేయును. అణుత్వము ఉన్నను వ్యాపకత్వ ముండుట యసంభవము కాదు. కృష్ణుఁడు యశోదయొక్క యంక మునందుండియు సర్వవ్యాపియైనట్లు జీవుఁ డణువయినను వ్యాపకత్వముగల వాఁడగును. జీవుని రెండవ ధర్మము తేజోవంతమును ప్రకాశవంతమును అయిన చైతన్యము. ఈ తేజస్సు ప్రాకృతేంద్రియములకుఁ గనఁబడునది కాదు. యోగముచేతను, దివ్యదృష్టిచేతను దానిని చూడవచ్చును. జీవుఁడు కొందఱు చెప్పినట్లు పరమేశ్వరుని ఆభాసకాఁడు, ప్రతి బింబముకాఁడు. జీవుఁడు సాక్షాత్ బ్రహ్మమే.

జీవుఁడు ఆభాసగాని ప్రతి బింబముగాని అగునని చెప్పుటవలన జీవునకు స్వరూపనాశ ముగల్గి, జీవన్ముక్తి యనునదియే లేకపోవును. ఇట్లు పురుషార్థమునకే భంగము కలుగును.

'ఏకధా దశధా చైవదృశ్యతే జలచంద్ర వత్'* అని బ్రహ్మ బిందూప నిషత్తునందు నున్నందున జీవుఁడు ఈశ్వరునియొక్క ప్రతి బింబమని మాయావాదులు చెప్పెదరు. కాని యీ దృష్టాంతమునకు నానాత్వమే యర్థము కాని ప్రతిబింబత్వము అర్థముకాదు. అనఁగా చంద్రులవలె జీవులు పెక్కులు కలరని యర్థము కాని వారివలె ప్రతి బింబములని యర్థము కాదు.

తత్త్వ మస్యాది వాక్యములవలనను బింబ ప్రతి బింబభావమును గ్రహించుటకు వీలు లేదు. ఎందు చేతననఁగా నది మహావాక్య ముకాదు. విద్యాజనకత్వము మహావాక్య లక్షణము.

జీవులు రెండు విధములు. ఒకఁడు సంసారి రెండవవాఁడు ముక్తుఁడు. శరీరేంద్రియ ములే తానన్న భ్రమవలన దుఃఖమును చెందుచున్నవాఁడు సంసారి. జ్ఞానోత్పత్తి యగువఱకు వాఁడట్లే యుండును. జ్ఞానము తోడ వైరాగ్యమును, భక్తియుఁ గలిగిన వాఁడు ముక్తుఁడగును. ముక్తజీవులలో మర్యాదా జీవులనియు, పుష్టిజీవులనియు రెండు విధములు.

పుష్టి యనఁగా ఈశ్వరానుగ్రహము. ఇది ఫలము వలన వ్యక్తమగును. ఈ ఫలము ఐహికముగ నుండవచ్చును. పార

పుష్టి మార్గము

లౌకికముగ నుండవచ్చును. అజ్ఞానమును పోఁగొట్టి ఈశ్వర సాక్షాత్కారముఁ గలుగఁ జేయునది మహాపుష్టి. పుష్టివలన నాలుగు పురుషార్థములను సాధింపవచ్చును. విశేష పుష్టివలన భక్తి కుదురును. దీనిని పుష్టిఁ భక్తియందురు. అది యీశ్వర ప్రాప్తిఁగలి గించును. ఈ పుష్టి భక్తివలన, మనస్సు ఇతర వస్తువులందుఁ జొరక కేవల మీశ్వరునిఁజేరు

* నీళ్లలోని చంద్రునివలె ఒక విధముగను బదివిధ ములుగను కనఁబడును.

టయే కోరుచుండును. పుష్టి భక్తి నాలుగు విధములు. (౧) ప్రవాహపుష్టి భక్తి, (౨) మర్యాదా పుష్టిభక్తి, (౩) పుష్టిపుష్టి భక్తి, (౪) శుద్ధ పుష్టిభక్తి. సంసార ప్రవాహము నందు గొట్టుకొనుచు 'అహం' (నేను) 'మమ' (నాది) అని అనుకొను వా రీశ్వర ప్రాప్తిని గుఱించి పోవు మార్గము ప్రవాహ పుష్టి భక్తి. వైరాగ్యము కలిగి ఐహికవిషయములనుండి పరావృత్తుడైన జనుడు, ఈశ్వర భజన వినుట, ఈశ్వరనామ సంకీర్తనము చేయుట, మొదలయిన విధమున చేయు భక్తి మర్యాదాపుష్టి భక్తి. ఇదివఱకే యీశ్వరానుగ్రహము కలిగియుండి, మరల 'పుష్టి' కలిగి బ్రహ్మమును గుఱించి యంతయు, దెలిసికొనగలుగు భక్తి యబ్బుట పుష్టిపుష్టి భక్తి. వీరు ప్రయత్నముచేతనే యీ భక్తిని సాధింపవలెను. శుద్ధభక్తిచే దన్మయులై యెల్లప్పుడును నీశ్వరభజనయే చేయునట్టు ప్రేరేపించునది శుద్ధపుష్టి భక్తి. ఇది యీశ్వరానుగ్రహమువలన గలుగవలయునేకాని పుష్టిపుష్టి భక్తివలె మానవ ప్రయత్నముచే బుట్టునది కాదు. ఈశ్వరునికి ననుగ్రహ మెవని పై వచ్చునో వానికి నాతడిట్టి భక్తి కలుగజేయును. అంత నామానవుడు ఈశ్వరుని గుఱించి సంపూర్ణజ్ఞానము సంపాదించును. దీనినే ప్రేమ భక్తియందురు. ఇట్టి భక్తికి మూడు తంతెలుండును. ప్రేమ, అనుభక్తి, వ్యసనము. ఈశ్వర వ్యసనమే ముక్తికి గారణమగును. ఇట్టిభక్తి యబ్బిన వారు చతుర్విధ—సాలోక్య, సామీప్య, సారూప్య, సాయుజ్య—ముక్తులను లక్ష్యముచేయరు. ఎప్పుడును పాంచరాత్రాగమములలో వర్ణింపబడినట్టి, ఈశ్వర సేవయే కోరుచుందురు. హరియందుగల యధిక భక్తి వలన నిట్టి భక్తుడు అన్ని వస్తువులను ఈశ్వర రూపముగనే చూచును. అందుచే నన్నిటిని ఈశ్వరునివలనే ప్రేమించును. తాను గూడ నన్నిటితో నైక్యభావము చెందును. ఇట్టి భక్తియొక్క ఫలము, ఈభక్తునకు నక్షయ కృష్ణలీలలుదర్శించి సంతసించు సౌభాగ్యము కలుగుట. ఈ భక్తులు గోవులు, పశువులు, పక్షులు, చెట్లు మొదలయిన రూపములను ధరించి కృష్ణునితో లీలలాడుకొనుచుండెదరు. ఇట్లు పురుషోత్తముని సాంగత్యమున నెల్లప్పుడును యానందమును అనుభవించెదరు. కృష్ణుడు బృందావనమునందు నవతారమెత్తినప్పు డెట్టియాట లాడెనో యట్టివియే యీ లీలలు. ఆ దివ్యబృందావనములో గొందఱు భక్తులు గోవులయ్యెదరు, కొందఱు గోపికలయ్యెదరు. మర్యాదా భక్తులు సాయుజ్య ముక్తి బొందుదురు. కాని పుష్టిభక్తులు సాయుజ్య ముక్తినిగోరరు. వారితో శాశ్వత క్రీడ లాడుటయే కోరుదురు. వీరందఱును గోలోకమునందు నుందురు. నారాయణుడుండు వైకుంఠమునకు పైని ఈ గోలోకముండును. కావున గోలోకప్రాప్తియే పరమ పురుషార్థము. వైకుంఠప్రాప్తికంటె నధికము.

[కో. ల.

శుద్ధాద్వైత మతగ్రంథావళి

సంస్కృతము

గ్రంథము	కర్త
1 అణుభాష్యమ్ బ్రహ్మసూత్రములమీఁది భాష్యము	వల్లభాచార్యుఁడు
2 తత్వార్థదీపః	,,
3 సుబోధినీ భాగవత దశమస్కందము మీఁదిటీక	,,
4 సకలాచార్యమత సంగ్రహః	శ్రీనివాసుఁడు
5 శుద్ధాద్వైతమార్తాండః	గిరిధరుఁడు
6 ప్రమేయ రత్నార్ణవః	బాలకృష్ణభట్టు
7 గూఢార్థదీపికా భాగవత, దశమస్కందాంతర్గత మైన రాసపంచాధ్యాయిమీఁదిటీక	ధనపతిసూరి
8 విద్వన్మండనమ్	విఠలనాథ దీక్షితుఁడు
9 ప్రస్థానరత్నార్ణవః	పురుషోత్తముఁడు
10 పుష్టిమార్గః	...

(ఈ మతమునుగుఱించిన గ్రంథములు హిందీభాష లోఁ బెక్కులుకలవు. కాని వాని నామములిచ్చుట వలన ప్రయోజనములేనందున నిచ్చట నీయలేదు.)

౪. పాశ్చాత్యాద్వైతము

(ప్లోటినస్ మతానుసారము*)

ఈతని మతము ఆవిర్భావ తిరోభావాత్మకమగు సద్వైతమని (Emanatistic pantheism) అనిచెప్పవచ్చును. ఈ ప్రపంచ మంతయు ఈశ్వర పదార్థముయొక్క ఆవిర్భావమనియు (Over Flow), మరల నీశ్వరునిలో తిరోధానము (Re-absosrption) పొందుటయే పురుషార్థము (Final goal of existence) అనియు నీతని తాత్పర్యము.

ఈశ్వర తత్త్వము

ఈశ్వరుఁడు సృష్టికిఁగర్త, ప్రతి పదార్థమునుపుట్టించువాఁడు, చిచ్ఛక్తి కలవాఁడు. జడము మొద్దు, ఎట్లుమార్చిన నట్లు మారునది, అసంఖ్య విధముల మార్పులను జెందునది. సాంఖ్యులు చెప్పుదానిలో ప్రకృతి పురుషులిద్దఱుగలరు. కాని యచ్చట పురుషుఁడు సాక్షి. ప్రకృతియే యంతముఁ జేయును. ఇచ్చట పురుషుఁడే సర్వనిర్మాణకర్త, ప్రకృతి పురుషుని (ఈశ్వరుని) యిచ్ఛప్రకారము మారును. పురుషుఁడు కుమ్మరవాని వంటివాఁడు, ప్రకృతి మన్నువంటిది. కుమ్మరివాఁడు తన యిష్టప్రకారము మంటికి కుండ, చట్టు, మూకుఁడు మొదలయిన రూపముల నిచ్చును. అట్లే యీశ్వరుఁడు జడమును (ప్రకృతిని) తన యిష్టమువచ్చినట్లు మార్చి యీప్రపంచము నిర్మించును. ఇట్లనుటచే ఈశ్వరుఁడొకఁడు, జడము వేఱు అని తలపఁగూడదు. పరమ వస్తువు ఈశ్వరుఁడొక్కఁడే.

ఈశ్వరుఁడొక్కఁడే యనిచెప్పితిమి. కాని యీ యేకత్వము సంఖ్యాసంబంధమైనది కాదు. ఏకమను (ఒకటియను) సంఖ్య రెండు, అయిదు మొదలయిన అనేకత్వబోధకసంఖ్య

* ఈతనిచే రోమ్ పట్టణమునందు స్థాపింపఁబడిన పాఠశాలకు బీదవిద్యార్థులు మొదలు చక్రవర్తివఱకు వచ్చెడివారు. ఈతఁడు ౫౪ తత్త్వ గ్రంథములను రచించెను.

లున్నవని సూచించుచుండును. ఇదియుఁగాక ఈసంఖ్య భిన్నాంకములచే విభజితము. ఒకటికి సగము అర, అరకు సగము కాలు (పావు). ఇట్టి వైపిఁకమైనయేకసంఖ్య స్వజాతీయ విజాతీయ స్వగతభేదములను గలిగియుండును. ఈశ్వరు డిట్టిభేదములు లేనివాఁడు. సృష్టియంతయు నాతనియందు నన్యభేదములేక యిమిడియుండును. ఈశ్వరుఁడు తనకుపుట్టుకలేకయే యన్ని పదార్థములను పుట్టించును, తనకుఁ జక్కఁదనములేకయే యన్ని చక్కఁదనములకు నాధారము, రూపము లేకయే యన్నిరూపములకుఁ గర్త, తనకుఁ జిత్తబుద్ధ్యహంకారంబులు లేనివాఁడయ్యును, సకలచిత్తబుద్ధ్యహంకారాదులకుమూలము, తానుజ్ఞేయ పదార్థముగాక పోయినను సకల పదార్థములనుగొల్చు మానము; పరమసాధ్యము, అగును. ఈశ్వరుఁడు శుద్ధజ్ఞానము. ప్రాపంచక జ్ఞానమునకు నుత్పత్తిస్థానము. శుద్ధతేజస్సు, అన్ని పదార్థములను చూచుటకు మనకు సామర్థ్య మిచ్చునది. పరమ శుభము, శుభముయొక్క తత్త్వము (Principle of goodness) కాని ప్రాపంచిక శుభముకాదు. ఆ యీశ్వర తత్త్వము శుభముకలదికాదు, చక్కఁదనము కలదికాదు, జ్ఞానముకలదికాదు; అది శుభమే, చక్కఁదనమే, జ్ఞానమే. ఈయభిప్రాయము శాంకరాద్వైతమునందు బ్రహ్మము జ్ఞానమేగాని జ్ఞానవంతుఁడుకాదు అని చెప్పినదానిని పోలియున్నది. ఈశ్వరునకు మనోవ్యాపారములు కలవని చెప్పఁగూడదు. అట్లు చెప్పిన నాతఁడొకమానవుండని చెప్పుటయే, అతనియోగ్యతనుతగ్గించుటయే యగును. 'అహంకారము' లేక 'అహంప్రత్యయము' (Self-conceious-ness) మానవులకు నావశ్యకముకాని ఈశ్వరునకు కాదు. స్వయముగ ప్రకాశవంతులుకాని వారికిఁ జూచుటకుఁగన్నులుకావలయునే కాని వెలుతురునకుఁ గూడఁ జూచుటకుఁ గన్నులుకావలయునా? ఇందువలన నీశ్వరతత్త్వము చెట్టువలెగాని, గుట్టవలెగాని మొద్దు, చట్టు అని తాత్పర్యముకాదు. అది అహంకార అనహంకారములకు నతీతమని భావము. చేతనాచేతములకుఁగల వైరుధ్యము ఈశ్వర తత్త్వమందు లేదు. ఆ తత్త్వమునకుఁ గోరిక లేదు. మంచి చేయవలెనన్న యత్నములేదు. వేఱు కోరిక లేకపోవుటకుఁగారణము దానిలో నంతయు నుండుటచే వానికి వెలుపలఁ గోరవలసినదేమియులేదు. అది శాంతి, స్థాణుత్వపరిపూర్ణతృప్తి మయము. అది జీవునివలె స్వతంత్రముకాదు. శరీరమువలెఁ బరతంత్రమునుకాదు. ఈశ్వరునకు నేగుణ మారోపించినను అది యాతనిని పరిచ్ఛేదునిగాఁ జేయునుగాన నాతనికి గుణములు, ధర్మములు ఆరోపింపఁగూడదు. మనస్సునకు నేది యందునో, యేదియందదో యదియంతయు నాతఁడే. కాననాతనికి గుణముకలదని చెప్పుట యాతనికా గుణములేదని సిద్ధాంతించుటయే.

కావున, ఈశ్వరునకుఁ గలవని ప్లోటినస్ చెప్పునట్టి (ఏకత్వ, శుభత్వ, శుద్ధజ్ఞానమయత్వ-pure thought, శుద్ధ సత్తాకములను pure actuality) ధర్మములుగూడ, ఈశ్వర స్వరూపము వర్ణించుటకు పూర్ణముగ సమర్థములు కావని యాతఁడే యొప్పియున్నాఁడు. ఆతఁడు మానవుల వాఙ్మనస్సులకు నతీతుఁడని మాత్రము చెప్పఁగలము. నిజము పలుకవలెనన్న నతఁడు కలఁడనియు మనము చెప్పుటకు వీలు లేదు. ఏలయన నతఁడు సత్తు (ఉనికి-Existence) అను దానిని మించినవాఁడు. అనఁగా మానవబుద్ధికి సత్ స్వరూప మెట్లు తోఁచునో దానిని మించిన వాఁడని యర్థము. ఈశ్వరుఁడు పరమజాతి (Highest abstraction) లేక సూక్ష్మభావముకంటె సూక్ష్మభావము. అనఁగా పదిగోవులను చూచి యందలి సమాన ధర్మములను గ్రహించి, గోత్వమన్న జాతివిశేషము మనోభావనచే నేర్పఱచుకొందురు. ఇట్లే గోత్వ, అశ్వత్వ, శునకత్వాదులలోని సమాన ధర్మములను తీసికొని పశుత్వమను జాతిని కల్పించెదరు. పశుత్వమానవత్వాదులను పోల్చి కలిపి సమానధర్మమును విడఁదీసి ప్రాణిత్వమను జాతిని భావించెదరు. ఇట్లుపోఁగాఁబోఁగ చివర నేర్పడెడి జాతి (లేక భావవిశేషము-Abstraction) ఈశ్వరుఁడు. కావున, జాతుల కన్నిటికిని జాతి, భావముల కన్నింటికిని భావముఁగనుఁగొనినఁ గాని యీశ్వర స్వరూపము తెలియదు. ఇట్లు మన మనోకల్పనచే నన్ని జాతులను, అన్ని మనోభావములను తొలఁగఁ దీసినఁ గాని ఈశ్వర తత్త్వము తెలియనేరదు. మానవబుద్ధి యీ మెట్టుచేరిన తరువాత దానిని, (ఈ మెట్టును) త్రోసివేసి ఈశ్వరతత్త్వమును గూర్చి ధ్యానము (Meditation) మననము (Contemplation) చేయవలెను. ఇట్లు ఈశ్వరుని స్వానుభవముచే నెఱుఁగ వలసినదే గాని బుద్ధిచే నాతని లక్షణము నిర్ణయింపనెంచిన కొలఁదిని నాతఁడు బుద్ధికి లోఁబడక తప్పించుకొను చుండును.

సూర్యుని నుండి వెలుతురు, అగ్నినుండి వేడిమి, స్వతఃసిద్ధముల (Axiom)నుండి సిద్ధాంతములు (Conclusions) ఏలాగు స్వభావముగ వెలువడునో అట్లే నిరుపాధికుఁడు (Absolute) అగు ఈశ్వరుని నుండి యీ ప్రపంచ మావిర్భవించుచున్నది. అతఁడు శుభుఁడు, తండ్రి; అన్ని పదార్థములు ఉండవలయుననియే యాతని తలంపు. కాని యాతనినుండి యుత్పన్నమైన సకల పదార్థములకును అతనియందె మరల జేర్వలయునన్న స్పష్టమైన కోరిక యుండును. ప్రతి పదార్థమును అతనివైపు ఆకర్షింపఁబడును. అతనిని సమీపింపఁ గోరును. జీవభావము పరమార్థము కాదు. అనంతుఁడైన (Infinite) యీశ్వరుని నుండి వచ్చిన జీవుఁడు నిరుపాధికుఁడైన యీశ్వరుని జేరుటయే పరమార్థము. ప్రపంచమందలి వ్యాపారములన్నియు నొకటితో నొకటి అను

కూలముగ (Harmoniously) నుండుటకుఁ గారణమన్ని పదార్థములును ఈశ్వరునిఁ జేరఁ బోవ యత్నించుటయే. తన యుత్పత్తి స్థానమగు నీశ్వరునిఁ జేరుటకు జ్ఞానము (Thought), మననము (Contemplation), స్వయంస్ఫూర్తి(Intution) అను మార్గములు మూఁడు. చూచుట (to see), తెలిసికొనుట (to perceive), మననము చేయుట (to contemplate), సర్వ కర్మలకు (ప్రయత్నములకు) ఫలము. పురుషార్థములను సాధించుటకుఁ గొందఱు జ్ఞాన (Meditative) మార్గమును, కొందఱు (Practical) కర్మమార్గమును అవలంబించెదరు. రెండుమార్గములు సమానమైనను వానిలో జ్ఞానమార్గ మధికమైనదని చెప్పవలెను. ఈ మార్గమున త్వరగ సాధ్యమును (ఈశ్వరుని) జేరవచ్చును. మననమే (Contemplation) జీవిత సర్వస్వము (Life itself), జీవిత ఫలము (Goal of life). పశువులకు, చెట్లకు, సృష్టిలోని యన్ని పదార్థములకు, (Perception విజ్ఞానము) కలదు. విజ్ఞానమే జీవితము (life). ఈశ్వరుఁడుగూడ శుద్ధ విజ్ఞాన (చైతన్య) స్వరూపుఁడే.

జీవోత్పత్తికి మూఁడు మెట్లు కలవు.

౧ విజ్ఞాన తత్త్వము

౧. మనసు (విజ్ఞానము - Intelligence), ౨. ఆత్మ (The soul) 3. శరీరము. ఈశ్వరుని ఆవిర్భావములలో మొదటిది విజ్ఞానము. కావునసృష్టిలో నిది యన్నిటికంటె గొప్పది. తరువాత వచ్చిన ఆవిర్భావములు క్రమముగ అపరిపూర్ణత (లోపములు) నెక్కువ ఎక్కువగఁ గలిగియుండును. సృష్టియనఁగనే యది యీశ్వరుని పరిపూర్ణావస్థనుండి పతనమనియే చెప్పవలెను. ఇట్లు విజ్ఞానరూపమున ఆవిర్భవించినతోడనే యీశ్వరుఁడు శుద్ధ విజ్ఞానము, విజ్ఞానమయ ప్రపంచము అను రెండు తెఱంగులాయెను. ఇదియే విషయి (Subject) విషయము (Object) అను భేదమునకుఁ గారణము.

ఇట్లు ఏకమేవాద్వితీయముగనున్న యీశ్వరుఁడు మొదటి రెండుగ (ద్వైతముగ) ఎట్లు మారెనో చెప్పుట దుర్లభము. ఈ యావిర్భావవిధాన మొకవింత, మాయ(Mistery). ఎట్టి యుక్తులచే సాధించినను ఆయుక్తులలో లోపముండక పోదు. అణువు (monad) లో నుండి ద్వ్యణుకము (dyad) పుట్టినదని చెప్పినయెడల ద్వ్యణుకము బీజరూపమున అణువులో నుండెనని యర్థము. కాని యిట్లనుటచే మొదట అణువే ద్వ్యణుకము కాలేదా? కొందఱు ఏకమును (the one) దానితో సమస్తము (the all) నకు నైక్యము చెప్పెదరు. కాని ఈశ్వరుఁడీ ప్రపంచములోని యన్ని పదార్థముల సమూహమని చెప్పినయెడల, ఈశ్వరుఁడు కొన్ని యంకెలను కూడఁగా వచ్చెడి యొక మొత్తమగును. ఎందుండి యివన్నియుఁ బుట్టినవో యట్టి తత్త్వము కానేరఁడు. ఆ

విర్భావమనఁగా మూలములో నుండి చీలి వచ్చిన అంశమని కొందఱనెదరు. కాని యీశ్వరుఁడు స్వగత భేదములేని యేకము; తునకలు తునకలుగా భిన్నమగు అంశె కాదు. ఈశ్వరునినుండి సృష్టి పుట్టుటను, సూర్యునినుండి కిరణములుపుట్టుటతోను అక్షయముగాఁ బారెడి యేటితోను పోల్చెదరు. ఒక గిన్నెయందు అక్షయజలముకలదు. అది ఆ గిన్నెయందు నిమడని కారణమున నెడ తెగక ప్రవహించుచుండును. అట్టిదే యీ జగత్తు. అనంతమైన యీశ్వరుఁడే యీ రూపమున ప్రవహించుచుండునని చెప్పెదరు. ఈ యుదాహరణము లన్నియు బాగుగనే యున్నవి. కాని యివియన్నియు జడప్రపంచమునకు సంబంధించినవి. కావున అజడము చైతన్యరూపము నయిన ఈశ్వరుని ఆవిర్భావమును నెట్లుస్పష్టముగఁ దెల్పఁగలవు? అందుచే నీశ్వర తత్త్వమువలెనే, ఆ విర్భావముకూడ అజ్ఞేయమే.

మనోకల్పనలు (Ideas) రెండువిధములు. ౧ జాతి సంబంధమైనవి, ౨ వ్యక్తిసంబంధమైనవి. జాతిసంబంధమైనవానిలో జాతియొక్క స్వరూపము (Identity), ఇతరవస్తువులకు దానికిఁగలభేదము (Difference), నిశ్చలత (Rest), గమనము (Motion) మొదలైన వానిని గుఱించిన యూహాలిమిడియుండును. జాతి (Genera) సంబంధమైన కల్పనలన్నియు కేవల తత్త్వము (The only being) యొక్క విభేదములు, వ్యక్తి (Specific) సంబంధమైన కల్పనలన్నియు సృష్టిసంబంధమైన కల్పనా విభేదములు. ప్రపంచమునందుఁగల ప్రతి పదార్థమునకును ప్రతిగ మనో ప్రపంచమందు నొక కల్పన (Idea) యుండును. జాతి వాచకములకే గాక వ్యక్తివాచకములకుఁ గూడ సంబంధించిన కల్పన లుండును. మనుష్యత్వమునకు సరియైన కల్పనయుండుటయే గాక, సాక్రెటిస్, ప్లేటో, దేవదత్తుఁడు, యజ్ఞదత్తుఁడు మొదలయిన వ్యక్తులకు సరిపోవు కల్పన లుండును. ఎన్నివ్యక్తులో అన్ని కల్పనలుకలవు. మనలోఁ బ్రతివానికిని వేఱువేఱు కల్పనలు కనులయెదుట స్పష్టముగఁ గాన వచ్చును. ఈ కల్పన లప్పటి కప్పుడు పోవునవి కావు, శాశ్వతమైనవి.

విజ్ఞానమునకుఁగూడ నుత్పత్తిశక్తికలదు. కాని యది యీశ్వరునిశక్తికంటెఁ దక్కువ. ఈశ్వరునినుండి విజ్ఞాన మావిర్భవించినట్లు, ఇందుండి ఆత్మ ఆవిర్భవించును. విజ్ఞానమునకు స్వతఃసిద్ధజ్ఞానము (Intution) కలదు. ఆత్మ కదిలేదు. ఆత్మకు చర్చాత్మకజ్ఞానము (Discursive thought) మాత్రము కలదు.

౨ ఆత్మతత్త్వము

ఆత్మ విజ్ఞానమునకంటెఁ దక్కువగనుక, విజ్ఞాన మీశ్వరునిజేర యత్నించునట్లు ఆత్మ విజ్ఞానమునుజేర యత్నించును. ఒక్క యీశ్వరుఁడు (నిరుపాధికుఁడు - Absolute) ఒక్క విజ్ఞానము: ఒక్క విజ్ఞానవంతమైన,

జగత్తు (Intelligible world) ఉన్నట్లు తత్త్వము విచారింపఁగా ఒక్క యాత్మయే కలది. అదియే యసంఖ్యజీవాత్మలకుఁ బుట్టినిల్లు. విశ్వాత్మయే యిన్ని భిన్నరూపములుగఁ గాన వచ్చును. ఈ ఆత్మకు రెండు ధర్మములు. ఒకటి అంతర్విచారము. ఇందుమూలకముగ నది కల్పనలను (Ideas), నిరుపాధికుని గనుఁగొనును. రెండవధర్మము తాను ఆవిర్భావ పద్ధతిననుసరించి, శరీరమును పుట్టించుట. శరీరము ఆత్మకంటెఁదక్కువ యోగ్యతకలది.

అన్ని పదార్థములకుఁబుట్టిన తావైన నిరపేక్షమునకును (Absolute - ఈశ్వరునకును)

3. శరీర తత్త్వము

శరీరమునకును చాల అంతరముకలదు. ఈశ్వరుఁడు, విజ్ఞానము, ఆత్మ, శరీరము—ఇది క్రమము. కనుక ఈశ్వరుఁడొ చివరను దేహము చివరను ఉన్నవి. ఈశ్వరునకు నేకత్వము (అద్వైతము) గుర్తు; దేహమునకు ననేకత్వము, అసంఖ్యత్వము గుర్తు. ఈరెండింటికిట్టి భేదమున్నను దేహమునందు నీశ్వరాంశముండక పోలేదు. శరీరమునకు (నామ) రూపములు (Forms) ఉపలక్షణము. ఆకారము (లేక రూపము) అనునది మనఃకల్పన. విజ్ఞానమునకుజాతివిషయకకల్పనలును,ఆత్మకు వ్యక్తివిషయక కల్పనలును ఉన్నట్లు శరీరమునకు రూపములు (ఆకారములు) కలవు. వీని ద్వారా దానికి దనకంటెఁ బైవానితో (విజ్ఞానాదులతో) సంబంధము కలుగును. రూపమే శరీరముయొక్క నిజస్వరూపమును జూపును. ఏపదార్థముతో శరీరము చేయఁబడినదో దానిని జడము చూపఁజాలదు. రూపమే వస్తు తత్త్వము; జడద్రవ్యమే వస్తువుయొక్కయతత్త్వము. జడమెప్పుడును మారుచుండును ; దానికి నిలుకడలేదు. అసత్తునకు సత్తునకు నడుమనుండునది. శరీర ప్రపంచము తరువాతశుద్ధజడము (Matter) వచ్చును. జడమనఁగాఅసత్తు (Non - being), అంతులేని చీకటిగుహ. ఇందు జ్ఞానకిరణములు కొంతవఱకుఁబ్రవేశించును.

శరీరము జడము, ఒకటికాదు. శరీరమగుటకు రూపము జడపదార్థము ఈరెండును కావలయును. జడమునకు రూపము, పరిమాణము (పొడుగు, వెడల్పు మొదలయినవి), రంగు మొదలయినవేమియు నుండవు. ఇవన్నియు (నామ) రూపమునకుండును. ఇవన్నియు నిరపేక్షము (Absolute - ఈశ్వరుఁడు) నుండి పుట్టినవియే. జడమును చెప్పునప్పుడు ఇదికాదు ఇదికాదు అనియే చెప్పవలెను. ప్రాణులకుఁగల చైతన్యమునకు మూలమంతయు ఈశ్వరుఁడును, విజ్ఞానమును అయినందున జడము (ప్రకృతి) శక్తి హీనమును, మిక్కిలి బీదది, ఐక్యవిరోధి, అసంఖ్య శరీరములకుఁ గారణము, అసంబద్ధము (incoherence) ఆకారరహితము, కురూపి, దుస్స్వభావముకలది. వీరిమతమున ఏకత్వము, రూపము (Form), విజ్ఞానము, చక్కఁదనము, మంచి

తనము అనునవి పర్యాయ పదములు. బహుత్వము, జడము, కురూపము, చెఱుపు అనునవి కూడ పర్యాయ పదములు.

జడముయొక్క కార్యము శరీరము మీఁద నే జరుగునని తలపఁగూడదు. ఇది ఆత్మ మీఁదను,విజ్ఞానముమీఁదను కొంతపనిచేయు ను. శరీరము ఆత్మయొక్క ప్రతిబింబము. అట్లే ఆత్మజడమునకంటె నెంతశ్రేష్ఠమైనది యైనను, అది సంపూర్తిగ జడత్వమును వద లినదికాదు. మనస్సులోఁగూడ జడత్వముం డును. అది బహిస్సృష్టినందువలె జడ్డరూప మునునుండక విచారరూపమున నుండును. ఇంతియకాదు. ఇట్లు మనస్సు గ్రహించునట్టి జడత్వమిట్టిదియన్న యూహయేగాక మన స్సునందు జరుగునట్టి యన్ని వ్యాపారముల లోను, అన్ని ఆలోచనలలోను జడత్వ మవి నాభావ సంబంధము కలిగియుండును. జడాంశ మున్నగాని మనస్సునకును, ఈశ్వరునకును భేదము కలుగదు. కేవలాద్వైత మొక్క ఈ శ్వరుని గుఱించియే చెప్పనగును. విజ్ఞానము నకు నేకత్వ మీయర్థమునందుఁ జెప్పుటకు వీలులేదు. విజ్ఞాన విషయమున ఏకత్వము కల్పనా బహుత్వముగ మారును. ఈకల్పన లొక్క విధముగనుండవు. ఒకదానికంటె మఱియొకటి భిన్నముగనుండును. వీనికన్ని టికిని ఆధారమొక్కటియైనను ఈకల్పనలు (Ideas) వేఱు. మన మనస్సునందలి కల్పన లకు భౌతికరూపము లేనందున నవి వేఱు వేఱని చెప్పుటకు వీలులేదందురేమో, కాని యవి రూపములేక పోయినను వేఱు వేఱన్న మాట స్వయంస్ఫూర్తిగ, మనస్సునకే తెలియును. జడ మనేకమునకు మూలమని యిదివఱకె చెప్పియున్నాము. కాన జడత్వాంశముండినఁ గాని మనస్సులోన నీకల్పనలు పుట్టనేరవని మనముస్పష్టముగ నూహింపవచ్చును. ఈ ద్వైత సాధనమైన జడత్వాంశమే లేక పోయినయెడల ఈశ్వరుని అద్వైతమునకు నెన్నడును (ఒకవిధమైన) భంగము వచ్చి యుండదు.

ఆత్మ, ఇటు విజ్ఞానమునకు నిటు దేహము నకు నడుమనున్నందున దీనికి రెండిటిసొక్కు

నీతి తత్త్వము

కొట్టును, రెండింటి యంశములందుండును. ఇట్లు ప్రపంచము నందుండునది యంతయు నాత్మయం దుండును. ఆత్మ ప్రపంచము యొక్క యొకచిన్నప్రతిమ. ప్రపంచమందలి యన్నిశక్తులును ఆత్మయందు కేంద్రీభవిం చును (Focus) అని చెప్పినఁ జెప్పవచ్చును. మన స్సృష్టియందు తర్కవిధి (అలంఘనీయ ములైన తర్కశాస్త్రనియమములు,యుక్తి-Logical necessity) ననుసరించియు, బహి స్సృష్టియందు భౌతిక విధి (Physical necessity) ననుసరించియు వ్యాపారములు జరుగు చుండును. ఆత్మయే యాచరణ స్వాతంత్ర్య మునకు (free will) తావు. దానిని శారీరిక భోగములును విజ్ఞానానందములును ఆకర్షించు

చుండును. అది విజ్ఞానానందమునందే రమింపవచ్చును ; లేదా భౌతిక భోగములకాశపడి శరీరిగనే శాశ్వతముగ నుండవచ్చును. ఆత్మలు మూఁడు విధములు. (౧) దివ్యాత్మలు, ఎప్పుడు విజ్ఞానానందమునందే యుండి, యీశ్వరుని సమీపించువారు (౨) శరీరసౌఖ్యములలోఁ గొంత సేపు చవిగొనుచు, మానసికానందమును గొంతసేపు రుచిచూచుచు, ఇటు అటు ఉండునట్టి యాత్మలు. కొంతమంచి కొంత చెఱుపు చేయునట్టి యక్షులు, దయ్యములు, భూతములు మొదలయిన విట్టివి. (౩) ఎప్పుడు శరీరసౌఖ్యమునే కోరుచు క్షుద్రమైన శరీరముల నాశ్రయించునవి. పరమార్థవిచారములేక పుట్టుచుఁగిట్టుచు నుండెడి వారిట్టివారు. మొదటి తరగతివారనఁగా దివ్యాత్మలు నిరతిశయానందమును (Supreme happiness) అనుభవించు చుందురు. నిరతిశయానంద సుఖమనఁగా సుఖ దుఃఖములకు నతీతులై యుండుట, దివ్యవిజ్ఞాన (Divine-reason) నియమముల ననుసరించుట, నిరామయుని ధ్యానించుట. వారి శరీరములు తేజోమయములు. అందు భౌతికాంశ మెంత మాత్రమును ఉండదు. వారు శాశ్వతముగ నుండి పరిపూర్ణతను(Perfection) చెందియుందురు ; కావున వారి కెన్నడును మార్పులేదు. వారికి స్మృతి (memory) గాని, ఆశకాని, చింతగానిలేదు. ఏలయన మార్పు ఉండినఁగాని అయిపోయిన వానింగూర్చి స్మృతి, రాఁబోవు దానింగూర్చియాశ(కోర్కె,ఇచ్ఛ) కలుగుటసంభవింపదు. ఈదివ్యాత్మలకు 'అహం ప్రత్యయము' కూడనుండదు. అవన్నియు నిరామయుని ధ్యానించుటలోఁ దల్లీనమై తమ్ముఁదాము మరచును. ఇట్లు తమను తాము మరిచి ఈశ్వరునియందుఁ దల్లీనమగుటయే నిరతిశయానందము.

అన్ని ఆత్మలును మొదట దివ్యాత్మలే. మొదట ఈశ్వరునితో నొక్కటిగానే యుండును. కాని క్రమముగ నవి ఈశ్వరునినుండి విడివడి శరీరధారులగును. శరీరధారియైనందునకు శిక్ష యీ జన్మమందలి దుఃఖములే. శరీరము వచ్చుట మన యిచ్ఛాకర్మల ననుసరించి వచ్చినదిగాని వేఱులేదు. ప్రతివాఁడును తన గతికి నుత్తరదాత. వాని గతి వాని శీలమును అనుసరించియుండును.

ఇదియుఁగాక, జడమునకుఁ గూడ దివ్యభావము కలుగఁజేయుటకు నాత్మ యత్నించునేని జన్మమెత్తుటకూడ అనిష్టమని చెప్పుటకు వీలులేదు. తన పని అయినతోడనే ఆత్మ మరల దివ్యధామమునకుఁ బోవ యత్నింపవలెను. శరీరముతో సంబంధముగలిగినందున ఆత్మకు దనశక్తి బాగుగఁ దెలిసి, వేరు విధముగ నుపయోగింపలేని స్వశక్తిని ఉపయోగింపవచ్చును.

ఆత్మను పరిశుద్ధము చేసికొనుట, ఈశ్వరునితో క్రమముగ తాదాత్మ్యము (Assimilation) చెందుట మానవులయొక్క పరమపురు

ప్రార్థము. దేవునిఁ జేరుటకు మార్గములు మూఁడు: సంగీతము (కళ), ప్రేమ, (తత్త్వ) జ్ఞానము. వీనిని మూఁడు మార్గము లనుట కంటె నొక మార్గమందలి మూఁడు అంచెలని చెప్పవచ్చును. సంగీత పాఠకుఁడు ఇంద్రియ జన్యజ్ఞానమునందును, ప్రేమగల భక్తుఁడు తన ఆత్మయందును, తత్త్వజ్ఞాని యేవిధమైన కల్మషములేని యీశ్వరునియందును తత్త్వ మును వెతుకుచుందురు. ధ్యాన నిదిధ్యాసల యానంద మెఱిఁగినవాఁడు కళాప్రేమలను వదలును. రాజమందిరమును చూచినపుడున కలిగిన సంతోషము, రాజును చూచిన ప్పుడు మరుపునకు వచ్చును. తత్త్వజ్ఞానికిఁ గాన వచ్చు నిర్మలమైన చక్కఁదనము ముందట, ఐహికములైన చక్కఁదనములును ప్రేమసం బంధమైన చక్కఁదనమును వెలవెల బారు చుండును. వినాశములేని నిత్య వస్తువుమీఁద నే చిత్తమంతయు నిలిపి తత్త్వజ్ఞుఁడు దేహమును, విషయ సుఖములను తిరస్కరించును. (తత్త్వ) జ్ఞానానందము అనిర్వాచ్యము. ఈ ఆనంద ములో నాతఁడు ప్రపంచమును మరచుటయే గాక, తనను తానే మరచును! ఈశ్వరుని అఖండైక్యాను భవమునందు నతఁడు లీనమై యదృశ్యుఁడగును. జీవాత్మయు, పరమాత్మయు నైక్యము చెందుటయే, యాత్మ తన దివ్య గృహముఁ జేరుట. (కొ. ల.)

౫. పాశ్చాత్యాద్వైతము

(స్పైనోజా మతానుసారము)

సత్ పదార్థ (Substance) మొక్కటి యే కలదు. సత్ పదార్థమనఁగా దాని యునికికి (అస్తిత్వమునకు) మఱి యొక పదార్థముయొ క్కయపేక్ష లేనిది. స్వయంభువు (Which exists in itself). ఇది యిట్టిదని తెలిసికొ నుటకు స్వస్వరూప జ్ఞానమే తప్ప యన్యపదార్థ జ్ఞానము సహకారి కానేరదు. ఈ సత్తునకు నన్యకారణములేదు. దీనికిదియే కారణము. ఇది యనంతము. అట్లుకానిచో నిది దేశకా లాదులచేఁగాని యితర పదార్థములచేఁగాని పరిచ్ఛిన్నము కావలసివచ్చును. కాని యిది యపరిచ్ఛిన్నము. ఇదియొక్కటియే, అద్వి తీయము. అట్లుగాక రెండు సత్ పదా ర్థములున్న వనుకొనిన నొకటి రెండవదాని యనంతత్వమును, రెండవది మొదటిదాని యనంతత్వమును పోఁగొట్టును. ఆ రెండును అస్వతంత్రములై సాపేక్షములు (Relative) అగును. సత్తునిరపేక్షము. కావున నన్ని పదార్థములకు నాధారముగనుండి, తాను మా త్రము నిరాధారముగ నుండును. సత్పదార్థ మొక్కటియే. ఈ పరిభాషయ దు సత్తను శబ్దమొక పరమేశ్వరునకు ననఁగా స్వయంభు పదార్థమునకుఁదప్ప, ఒకానొక కారణము నుండి పుట్టిన కార్యమునకుఁ జెల్లదు. కావున సత్తనఁగా పరమేశ్వరుఁడు, పరమేశ్వరుఁ

డనఁగా సత్తు. ఈ రెండును ఒక పదార్థము యొక్క పర్యాయపదములు.

ఇతరసాహాయ్య మపేక్షింపక స్వతఃసిద్ధమైన సత్తా (ఉనికి-Existence) గలపదార్థ మొక సత్తేయైనందున, దానికి సంపూర్ణస్వాతంత్ర్యముగలదు. అనఁగా దానివ్యాపారములు (నడకలు) స్వనియమితములు. తానేర్పఱచుకొనినవేకాని యితరులచే నియమింపఁబడినవికావు. స్వాతంత్ర్యమనఁగాఁ బిచ్చివానివలె సంబంధములేని స్వేచ్ఛా విహారమని యర్థముకాదు. ఇతరు లెవరును దానిని ప్రేరేపింపలేదని మాత్రము స్వాతంత్ర్యమున కర్థము. సత్తు ఎల్లప్పుడును తనధర్మములను బట్టి యొకవిధముగ ప్రవర్తించునేగాని, యొకప్పుడొక విధముగను మఱియొకప్పుడు మఱియొకవిధముగను ప్రవర్తింపదు. త్రికాలాబాధితమై యొక విధముగనుండుట దానిస్వభావము, ప్రకృతి. వర్తులము(Circle)యొక్క వ్యాసములన్నియు, వ్యాసార్థము (Radii) లన్నియు సమానముగ నేలయుండును? అని అడిగిన నట్లుండుటయే వర్తులము యొక్క స్వభావము, అట్లుండనిచో నదివర్తులమనిపించుకొనదు అని ప్రత్యుత్తమిచ్చెదరు. అట్లే సత్తు నిజమైన సత్తుకావల యునన్న నదిపూర్ణస్వాతంత్ర్యముకలదిగ నుండవలెను.

సత్తు స్వభావసిద్ధము, శాశ్వతము. ఇతర మతములలోని యీశ్వరులవలెనదిపురుషవిశేషముగాని, స్త్రీ విశేషముగాని, వ్యక్తివిశేషముగాని కాఁజాలదు. అట్లయిననదిపరిచ్ఛిన్న (Determined) పదార్థమగును. పరిచ్ఛిన్నత్వము సాపేక్షము (relative) లైన పెక్కు అభావములకు (negative) తావు. సత్తు స్వయముగ నపరిచ్ఛిన్నమయ్యును, అసంఖ్యాములైన పరిచ్ఛిన్న పదార్థముల కన్నిటికి నొకటె కారణము. సత్తుకు చిత్తము (మనస్సు-intellect) గాని, ఇచ్ఛ (will) గాని లేదు. ఏలయన ఈరెండుండినచో నది యొక పురుష విశేషమగును. మనోవ్యాపారము లేనందున సత్తుయొక్క వ్యాపారము బుద్ధిపూర్వకము (with an end in view) కాదు. ఈశ్వరుఁడు స్వేచ్ఛగ, ఇది యిట్లు చేయుదమన్న యూహతోఁగాక, యిష్టము వచ్చినట్లు ప్రవర్తించునని యొక మతము వారి యభిప్రాయము.* అట్లుగాక, సత్యము, దయ, లోకక్షేమము మొదలయిన యూహలఁ గన్నుల యెదుటనుంచుకొని వానికి ననుకూలముగ నీశ్వరుఁడు ప్రవర్తించును అని మఱియొక మతము వారందరు.§ ఈ రెండు మతములు స్పైనోజాకు పూర్తిగ సమ్మతములు గాక పోయినను, స్వతఃసిద్ధమైన పదార్థమును గుఱించి చెప్పునప్పుడు ఈ రెంటిలో మొదటి మతమే సత్యమునకు మిక్కిలి సమీపమని యాతని యభిప్రాయము. రెండవ పక్షమవలం

* జనూయిట్సు డికార్టె మొదలయిన వారు.

§ ప్లేటో మొదలయిన వారు.

బించినయెడల ఈశ్వరుని వెలుపల సత్యమునునది, దయ యనునది, లోకక్షేమ మనునదియు, వేఱుగ నుండవలెను. అవి యీశ్వరుని వ్యాపారమునకు ప్రేరకములుగ నుండవలెను. అప్పు డీశ్వరుఁడు వానికి లోఁబడిన వాఁడగును. వాని యపరిచ్ఛిన్నత్వము, సర్వశక్తిత్వము పోవును. సత్య, దయాదికములయిన నైతిక తత్త్వము లన్నియు మానవుఁడు సత్తుయొక్క స్వభావమునుండి గ్రహించి తన యాచరణకు మార్గదర్శములుగ నేర్పఱచుకొనెనేగాని, యవి యీశ్వరుని యాచరణమునకు మార్గ దర్శకములు కానేరవు అని స్పినోజా యభిప్రాయమైనట్లు కానవచ్చుచున్నది.

సత్తు ప్రపంచమున కంతటికిని కారణము. ఇచ్చట 'కారణ' శబ్ద మేయర్థమునందు నుపయోగింపఁబడినదో కనుఁగొనవలయును. సత్తే (ఈశ్వరుఁడె) అన్నిటికిఁ గారణమనియు, వికారములన్నియుఁ గార్యములే యనియు, స్పినోజా తాత్పర్యము. ఒక పండు అందున్న యెర్ర రంగునకును, పాలు అందున్న తెలుపు, తీపి, పలచదనములకు నెట్టి కారణమో ప్రపంచమునకు నీశ్వరుఁడట్టి కారణమే. తండ్రి కుమారునకు, సూర్యుఁడు వేడిమికి కారణములేకాని యీశ్వరుఁడు ప్రపంచమున కట్టి కారణము అని చెప్పుటకు వీలు లేదు. ఏలయన కుమారుఁడు తండ్రినుండి పుట్టిన వాఁడైనను తండ్రికంటె భిన్నుఁడు. అట్లే వేడిమి, తన జనన స్థానమైన సూర్య గ్రహమునుండి భిన్నమై పోవును. ఇట్లీ రెండు విధములైన కార్యకారణములును భిన్న భిన్న సత్తాకములై (వేఱువేఱు ఉనికి) యుండును. ప్రపంచమునకును ఈశ్వరునకును గల కార్య కారణ సంబంధ మిట్టిదికాదు. కుండలకుఁ గుమ్మరివానివలెను, నగలకుఁ గంసాలివలెను, ఈశ్వరుఁడు ప్రపంచమునకు నిమిత్త కారణముకాఁడు. కుండలకు మట్టివలెను, నగలకు బంగారమువలెను, అతఁడు ప్రపంచమునకు ఉపాదాన కారణము (material or immanent cause). ఈశ్వరుఁడు మఱియొక పదార్థముతో ప్రపంచమ్మును చేసి, దానికి వెలుపలఁ గూర్చుండి చిత్రమును జూచుచున్నవాఁడు కాఁడు. అతఁడు ప్రపంచమునకు నంతరాత్మ, దాని సత్తాకు (పుట్టుకకు, ఉనికికి) మూలభూతమైన పదార్థము. క్రైస్తవులు, ద్వైతులు అనుకొను నట్లు ఈశ్వరుఁడు ప్రపంచమునకు నిర్మాతకాఁడు, తండ్రి కాఁడు. అతఁడు ప్రపంచమే, శాశ్వతమైన ప్రపంచమే. ఈశ్వరుఁడు, ప్రపంచము అను పదద్వయమునకు నర్థమొక్కటే. ఈ రెంటికిని ప్రకృతి స్వభావము (Nature) అని అర్థము. ఇది కార్యకారణములు రెండును తానే అయి యున్నది. ప్రాణులందఱికిఁ గారణము తానే, కార్యరూపమైన ప్రాణికోటి సమూహము తానే. ఇదే శంకర రామానుజ సిద్ధాంతము.

సత్తునకు (ఈశ్వరునకు) అనంతమైన ధర్మములు (గుణములు, విశేషణములు) కలవు. ఇందుఁ బ్రతిధర్మమును ఈశ్వరునియొక్క స్వభావమును (Essence) ఒక విధముగఁ దెల్పును. ఈ యనంత ధర్మములలో మనకు-మానవులకు - రెండు ధర్మములు మాత్రము తెలియును. అవి యెవ్వియన చైతన్యము, జడత్వము (చిత్, అచిత్). రామానుజాచార్యుల వారిసంప్రదాయముగఁ జెప్పవలెనన్న స్పైనోజా యొక్క సత్పదార్థము చిదచిద్విశిష్టము. జడము (అచిత్తు) నకు పొడవు, వెడల్పు మొదలైన పరిమాణములున్నవి. అందుచే నది యాకాశమును కొంతవఱకునాక్రమించును. చిత్తునకట్టి పరిమాణములు లేవు. ఇట్లు సత్తు జడపదార్థముల ద్రవ్యమునకును చేతన పదార్థముల చైతన్యమునకును ఉపాదానకారణము అగుచున్నది. చిత్తు అచిత్తు అనునవి పరస్పర విరుద్ధములైన పదార్థములు కావు. ఒక పదార్థమునే మనము గ్రహించునట్టి రెండు మార్గములు; ఒక్క పదార్థమునకుఁగల భిన్ననామములు. మనకుఁ దెలిసినట్టి యీసదసత్తు లనఁబడు రెండు ధర్మములును, దేనికది, సాపేక్షముగ అనంతము. అనఁగా చిత్తునటుండనిచ్చి, అచిత్తును విచారించినను, అచిత్తు నటుండనిచ్చి చిత్తును విచారించినను, అవి అనంతములు. ఒకదానితో నొకటికి సంబంధము

సత్తుయొక్క గుణధర్మములు (Theory of attributes)

వచ్చినప్పుడా రెండును సాంతములే, ఒకదానిచే నొకటి పరిచ్ఛిన్నము. సత్తు ఇట్లు సాంతముగాని, పరిచ్ఛిన్నముగాని కానేరదు. దానికి వేఱు పోటీ లేనందున నది యెప్పుడును అనంతమే, అపరిచ్ఛిన్నమే.

ఇచ్చట నొక సంశయము రావచ్చును. స్పైనోజా సత్పదార్థమపరిచ్ఛిన్నమని చెప్పి మరల గుణవిశిష్టమని చెప్పుచున్నాఁడు. గుణములు కలవాఁడు పరిచ్ఛిన్నుఁడగును గాని అపరిచ్ఛిన్నుఁ డెట్లగును? కావున స్పైనోజా యొక్క దేవుఁడు నిర్గుణుఁడని చెప్పవలెను. అనంతగుణములు కలవాఁడనియుఁ జెప్పవలెను! ఈ రెండును పరస్పర విరుద్ధములుగదా? స్పైనోజాగ్రంథమందు నీప్రశ్నకుఁదగిన సమాధానము స్పష్టముగఁ గానరాకపోయినను, ఆతని శిష్యులు కొందఱిట్లు సమాధానము చెప్పెదరు:- అపరిచ్ఛిన్నము, అనంతము, అవాఙ్మానసగోచరము నయిన సత్తునందు ఈగుణములు పారమార్థికముగ నివసించి యున్నవని యాతనియభిప్రాయముకాదు. ఇవి మానవబుద్ధిచే నీశ్వరస్వరూపము గ్రహించు విధములు. ఇవి మానవులచే నీశ్వరునియందు నారోపింపఁబడిన ధర్మములు. ఇట్లొకరు సమాధానము చెప్పెదరు. ఇది శాంకరమతమును పోలియున్నది. స్పైనోజా యీశ్వరుఁ డపరిచ్ఛిన్నుఁడన్నప్పుడు, ఈశ్వరుఁడు అన్నిగుణముల యభావమనియు, అప్రమేయుఁడనియు,

అతనినిగుఱించి మాటలాడుటకుఁగూడ వీలు లేదనియు నతని భావముకాదు. ఈశ్వరుఁ డనంతుఁడు, అపరిచ్ఛిన్నుఁడు అనఁగా నాతని యందు అనంతగుణము లున్నవనియు, అతఁడు అపరిమితమైన పరిపూర్ణత్వమును కలవాఁడ నియు, అతఁడు భావపదార్థమనియు, స్థిర పదార్థమనియు, సత్తుల కన్నిటికి సత్తనియు స్పైనోజా యభిప్రాయమని కొందఱు చెప్పె దరు. ఇది రామానుజమతమునుపోలియున్నది.

ఈశ్వరుఁడు పరిచ్ఛిన్నుఁడగునన్న యాక్షేపము రాకుండ స్పైనోజా, ఈశ్వరునికి అనంతగుణములును, ఒక్కొక్క గుణమునకు అనంతత్వమును చెప్పియున్నాఁడు. ఇట్లు ఈశ్వరుఁడు వేలువేలు గుణములచే పరిచ్ఛిన్నుఁడుగాఁడు. అట్లు పరిచ్ఛిన్నుఁడగునేని పురుషవిశేషుఁడగును. అనంత గుణములును, ఒక్కొక్క గుణ మనంతముగను తనయందుఁ గలిగియున్నవాఁడు సాంతుఁ డెట్లగును? పరిచ్ఛిన్నుఁ డెట్లగును? ఈశ్వరునియందలి యొక్కొక్క గుణ మనంతమగుటచే నది యొక్కొక్క సృష్టియని చెప్పవలెను. అచేతనము జడప్రపంచము. ఇది యెంత విస్తీర్ణముకలదో, ఎట్ల నంతమో తెలిసికొనవలెనన్న రాత్రి ఆకాశము వంకఁజూచిన జాలును. చేతన సృష్టియు నిట్టిదే. దీని యనంతత్వ మెఱుఁగవలెనన్న సూక్ష్మదర్శినితో జలబిందువులోని సూక్ష్మ జీవులఁ జూచినఁ జాలును. మనకుఁ దెలిసిన యీ రెండుగుణములుగాక మఱి యసంఖ్య గుణము లీశ్వరునియందున్నందున, మనకు గోచరములుగాని యజ్ఞేయప్రపంచము లెన్నియో యుండవచ్చును. ఆప్రపంచములు జడాత్మకములుకావు, చేతనాత్మకములుకావు!

ఇచ్చట మరియొక సంశయము కలుగ వచ్చును. ఈశ్వరునకు మనోవ్యాపారముకాని, ఇచ్ఛకాని లేదని స్పైనోజా చెప్పియున్నాఁడు. అట్లు చెప్పియు, నీశ్వరుని నాతఁ డపార జ్ఞానము (infinite intelligence) కలవానిగఁ జెప్పెను. ఈ రెండును ఎట్లు పొసగును? కాని యప్పటి క్రైస్తవ, యహూదీ తత్త్వవేత్తల యభిప్రాయానుసారము మానవ జ్ఞానమునకును, ఈశ్వరుని జ్ఞానమునకును భేదముకలదు. మనకు నొకానొక జ్ఞానము కలుగవలెనన్నఁ బూర్వము మనసులోఁ గొంత తర్కవితర్కము (discursive knowledge) కలిగి, యుక్తివాదము జరపవలెను. అప్పుడు గాని యిద మిత్థమన్న జ్ఞానము కలుగదు. ఈశ్వరునకో స్వయంస్ఫూర్తిజ్ఞానము (intutive understanding) కలదు. ఏవిధమైన తర్కములేకుండగనే యీశ్వరునకు జ్ఞానము కలుగును. కనుక ఈ పూర్వసిద్ధాంతములనే గ్రహించి స్పైనోజా యీశ్వరునకు మనోవ్యాపారమును, ఇచ్ఛయు లేవని చెప్పెను. స్పైనోజా యొక్క సత్తు సృష్టియే, సృష్టికి వెలుపల నున్నది కాదు. సృష్టికిఁగూడ జ్ఞానముకలదు. కాని యది మనోవ్యాపారజనితము కాదు, స్వాభావికము. సాలీఁడు రేఖాగణిత జ్ఞానము

లేకుండఁగనే చక్కని గూఁడు అల్లును. గృహ నిర్మాణ విద్య నెఱుఁగకయే పక్ష్యాదులు గూళ్లను, తేనెటీగలు తేనెతెట్టెలను, నిర్మించును. ఇది నేర్చుకొనిన జ్ఞానము కాదు ; స్వాభావిక జ్ఞానము. సృష్టికి నాలోచనకలదు ; కాని తన కాలోచన కలదనిసృష్టికిఁ దెలియదు. అది స్వభావసిద్ధము. ఇట్టి స్వాభావికజ్ఞానమే ఈశ్వరుని యందుండును. కావున మానవుల మనోవ్యాపారములతో దానిని పోల్చుటకు వీలులేదు. అందుచే స్పైనోజా యీశ్వరునకు మనోవ్యాపారము, ఇచ్ఛ లేదని చెప్పెనే గాని, ఆతని తాత్పర్య మీశ్వరుఁడు జ్ఞానవిహీనమైన జడమని కాదు.

ఈతత్త్వవేత్త చేతన జడపదార్థముల లోని భేదమును (వైరుధ్యమును), ఒకవిధముగఁ బోఁగొట్టెను. ఇతనికిఁ బూర్వముండిన తత్త్వవేత్తలకంటె నితనియం దిదియొక విశేషము. ఇతఁడు చెప్పునట్లు, చిదచిత్తులు రెండును ఒక్క సత్తుయొక్క విశేషణములు - విషయములు, విధేయములు - గాన, ఈ రెంటికిని సామానాధికరణ్యము(Consubstantiality) కలిగినది. ఇందుచే నిది జడవాదమును (materialism) కాదు, విజ్ఞానవాదమును(idealism) కాదు. ఈ రెండువాదములలోని దోషము లన్నియు లోపించి, వానిలోని మెరుగులు మాత్రి మీ వాదమున నేకీభవించినవి. జడవాద మగుటకు జడమునుండియే చైతన్యము పుట్టినది. జడపదార్థముల కదలిక (Motion) వలన జీవము పుట్టినది అని అనవలెను. విజ్ఞాన వాదమగుటకు జడమంతయు విజ్ఞానోత్పన్న మనవలెను. ఇట్లు స్పైనోజా చెప్పియుండలేదు. చిదచిత్తులను వేఱువేఱుగ నాతఁ డొప్పుకొనెను. కాని యీ రెండును సత్తు (ఈశ్వరుని) యందు నేకీభవించినందున వానికి నొకవిధమైన నైక్యమును, అభేదమును కలిగెను. ఇట్లు జడచేతనములకు నొకవిధమైన నైక్య ముండుటవలననే, మనుష్యాదుల మనస్సు, దేహము కలిసి పరస్పరాను కూలముగఁ బనిచేయుట తటస్థించుచున్నది. మనస్సు పొమ్మనగనే కాళ్లు నడుచును. శరీరమునకు దెబ్బతగలగనే మనసునకు వేదన బుట్టించును. చిదచిత్తులకు సామానాధికరణ్యము లేనిచో యిట్టి సంబంధ మెట్లుకలుగును? ఈశ్వరుఁ డీ రెండు విధములను ఒక నియమము ననుసరించియే ప్రవర్తించును.

ఇట్లీతత్త్వవేత్త, స్పష్టముగఁ గాకపోయినను కొంతవఱకునైనను, జడత్వ చైతన్యములను ధర్మముల భేదభావమును బాపి, చిదచిత్తులు వేరుకావు, జడవిరహిత చైతన్యమును, చైతన్యవిరహిత జడమును ఎచ్చటఁ గానరావు, ప్రతిపదార్థమును జడచేత నాత్మకము అని స్పష్టముగఁ బ్రతిపాదించునట్టి, తదుత్తరకాలీనులైన తత్త్వవేత్తలకుఁ బురోమార్గదర్శియయ్యెను.

ఈ చిదచిత్తులను గుణములయందు వికారములు (Modes, modifications) కలిగి

యీ ప్రపంచ మంతయుఁ బుట్టుచున్నది.

వికారవాదము
(Theory of modes)

జడత్వముయొక్క వికారములు రెండు, చలనము(Motion) స్థిరత, (స్థాణుత్వము-Rest). చిత్తుయొక్క వికారములు రెండు జ్ఞానము, ఇచ్ఛ. ఇట్లు, స్థిరత్వము నట్లుంచ, సత్తుయొక్క గుణములకుఁ గల చలనము, జ్ఞానము, ఇచ్ఛ అను మూఁడు వికారములు సమస్త ప్రపంచమును పుట్టించుచున్నవి. గుణములవలెనే తద్వికారములు కూడ నసంఖ్యములు, అపరిమితములు. చేతనాచేతన ప్రపంచమును వ్యాపించి యున్న గమన జ్ఞానేచ్ఛ లనఁబడువానికి నాదిలేదు, అంతము లేదు. అనంతములైన యిట్టి యొక్కొక వికారమునందు, సాంతములయిన వికారము లనంతము లుండును. చలనము అను వికారమనంతము. కాని అందుండి, శరీరము లనఁబడు అంతముగల వికారము లనంతములు పుట్టుచున్నది. జ్ఞానేచ్ఛ లనఁబడు చిద్వికారము లనంతవిధములై, అంతముగల (మానవుల) మనస్సులుగను, బుద్ధులుగను, ఇచ్ఛలుగను అసంఖ్య విధముల పరిణమించుచున్నవి. సాంత భౌతిక మనశ్శరీరములు, ఎల్లప్పుడును మారుచుండెడి వికారములు.

జీవాత్మ అనంత చిదాత్మకమైన (infinite (thought) పరమాత్మయొక్క వికారము. మానవదేహము కూడ అనంతజడాత్మకమైన పరమాత్మయొక్క వికారమే. చిదాత్మకసృష్టియు, జడాత్మకసృష్టియు, పరమాత్మయైన సత్తే సమానాధికరణములుగఁ గల్గవి గనుక, జీవజడములు భిన్నములైనను, ప్రతిశరీరమునకును, అందలిజీవమునకును సంబంధముగలిగి, యవి యన్యోన్య వ్యాపారఫలములను పొందుచున్నవి. అందుచే, ఆత్మ యనఁగా శరీరముయొక్క చిదాత్మక ప్రతిబింబమని (idea corporis) చెప్పవచ్చును. అట్లనుటచే జడమైన శరీరమునకు చైతన్యము కలుగునని కాదు. శరీర మెప్పుడును అస్మత్ప్రత్యయ గోచరమైన విషయమును గ్రహించు వాఁడు (Concious Subject) కానేరదు. శరీరము ఆత్మయొక్క విషయము (Subject) అగుననియు శరీరము లేనిదే మనోవ్యాపారము జరుగనేరదనియు తేలుచున్నది. ఆత్మ తన్నుదా నెఱుఁగదు, శరీరవ్యాపార సంబంధమును మాత్ర మెఱుంగును.

ఇంద్రియ జన్యమైన ప్రత్యక్షజ్ఞానము(Sensative) శరీరమునకు సంబంధించినది. ఇది మానవులకు, పశ్వాదులకు సామాన్యము. వీని శరీర రచనయొక్క యాధిక్యతనుబట్టి యిట్టి ప్రత్యక్షజ్ఞానము కలుగుచున్నది. పరిజ్ఞానము (Perception) ఆత్మవిషయము* (మనసునకు

* మనతత్త్వశాస్త్రమునందు ఆత్మకు, మనస్సునకు భేదము కలదు. మనసు ఆత్మయొక్క యొక యింద్రియము. కాని పాశ్చాత్య తత్త్వశాస్త్రమునందు, ఆత్మ (Soul) మనసు (Mind) సమానార్థకములు.

సంబంధించినది). ఒకానొక బహిర్విషయము వలన నింద్రియమునకు చలనము కలిగినపుడు మనసు తత్క్షణమే యాబహిర్విషయము యొక్క మానసిక ప్రతిబింబమును కల్పించుకొనును. ఇట్టి శారీరక మానసిక వ్యాపారములు రెండును ఏకసమయావచ్ఛేదమునందు నెట్లు జరుగును? అను ప్రశ్నమునకు, జీవజడములు - మనశ్శరీరములు - పైని వర్ణించినట్లు ఐక్యభావము కలవనుటయే ప్రత్యుత్తరము. మనశ్శరీరములు ఒకటి నొకటి యనుసరించి, కలిసి క్రమముగ నభివృద్ధిఁ జెందును. శరీరము అభివృద్ధిచెందిన కొలఁదిని మనసు అభివృద్ధిచెందును. మెదడెంత అభివృద్ధిచెందునో, పరిపూర్ణతఁ బొందునో, ఆరోగ్యముగ నుండునో, మనస్సంత అభివృద్ధిఁ జెందును, పరిపూర్ణతఁబొందును, ఆరోగ్యముగనుండును. ఇంద్రియములవలనఁగల్గు జ్ఞానము తొల్త అస్పష్టముగను,అనిశ్చయముగను ఉండును. వీనికిఁదగిన మానసిక ప్రతిబింబములేర్పడి కల్పనా (Imagination) సామ్రాజ్యమునందు యవి భ్రమప్రమాదములకుఁ (అజ్ఞానమునకు) గారణమగును. వ్యక్తికి వేఱుగ జాతియున్నదనియు, శరీరములులేని భూతములుకలవనియు, సృష్టి నిర్మాణమంతయు బుద్ధిపూర్వకమనియు, మానవస్వరూపమును గుణాదులును ఈశ్వరునకు నుండునేనియు, కర్తకుఁ క్రియా స్వాతంత్ర్యమున్నదనియుఁ జెప్పఁబడు అపసిద్ధాంతముల కన్నిటికిని ఈ కల్పనా సామ్రాజ్యమే కారణము.

వివేకము (reason) భ్రమాత్మక జ్ఞానమును గ్రహింపదు, ప్రమాత్మకజ్ఞానము (Adequate and perfect ideas) నే గ్రహించును. విషయమును (Object) దాని కారణమును సమ్యగ్విధమున గ్రహించును. సత్యము స్వతఃప్రమాణము; దానికి నదియే ప్రమాణము. సత్యమును గ్రహించినవానికి నది సత్యమని స్వయముగ స్ఫురించును. సత్యముయొక్క సత్యత్వము నిల్పుటకు వేఱుప్రమాణ మక్కరలేదు. అట్లయిన నా రెండవ ప్రమాణమే సత్యమగును. వెలుతురు స్వతః ప్రకాశముగలదియై తానందఱకుఁ గనఁబడుటయేగాక చీఁకటియొక్క స్వభావమునుగూడఁ జూపునట్లు, సత్యము (ప్రమాత్మకజ్ఞానము) స్వప్రభవలన, సత్యమన నేదియో దానినేగాక యసత్యము(అజ్ఞానము, భ్రమ) యొక్క స్వభావమును గూడ తెలియఁ జేయును.

కల్పన (ఊహ) పదార్థములకును మానవులకునుగల సంబంధమును మాత్రము విచారించును. వివేకమో ఆపదార్థములకును ప్రపంచమునకును వాని మూలకారణమునకును గల సంబంధమును తెలిసికొనును. కల్పన సర్వసృష్టికి మానవునే యధికారిగ నెంచును. మానవవ్యాపారములనే సృష్టిలోని యితరవస్తువులను కొలుచుటకు మానముగ నెంచును. వివేకమిట్టి అహంకారమును పరిత్యజించి దూరదృష్టి కలదియై శాశ్వతమైన సత్పదార్థమునకును ప్రపంచమునకును గల

సంబంధమును తెలిసికొనును. అన్ని పదార్థములకును పరమేశ్వరునకును గల సంబంధమును జూపును. అనంతమైన సత్తుయొక్క వికారములుగా గ్రహింపఁబడిన ఊహాలన్నియు (ideas) నిజమైనవి. కార్యకారణ సంబంధములేక అకస్మాత్తుగనే వ్యాపారమును జరుగనేరదని వివేకము గ్రహించును. నిజమైన కారణములను తెలిసికొనలేక అజ్ఞానులు ఒకానొక వ్యాపారము కారణము లేకుండగను అకస్మాత్తుగను, యదృచ్ఛగను, జరుగునని తలంచెదరు. కారణములేక కార్యములేదనునది సకలశాస్త్రములు గమనింపవలసిన మొదటి సిద్ధాంతము. ప్రపంచమందలి అసంఖ్యవ్యాపారములనుజూచి కల్పన భ్రమ జెందును. వివేకమో వానికి మూలకారణములు కనుఁగొని, వానినన్నిఁటిని నొక సూత్రమునందు గుచ్చును. అవన్నియుఁ బైకి భిన్నములుగ గానవచ్చినను పారమార్థికముగ నేకమేయని వివేకము చెప్పును.

ఈ మతమునందు ఇచ్ఛకు జ్ఞానమునకు నంతగా భేదములేదు. అనుకూల జ్ఞానము నుంచుకొనుటకును, ప్రతికూల జ్ఞానమును విడనాడుటకును గలిగెడి ప్రవృత్తి ఇచ్ఛయనఁబడును. ఇట్లు జ్ఞానమునకును ఇచ్ఛకును అభేదము కలదు గనుక ఒకటి యభివృద్ధి జెందిన మఱియొకటి అభివృద్ధిఁ జెందునని వేఱుగ జెప్ప నక్కఱలేదు. స్వల్ప జ్ఞానముతో స్వల్పేచ్ఛయు, ఉన్నతజ్ఞానముతో ఉన్నతేచ్ఛయు జతగా నుండును. ఇంద్రియజన్యజ్ఞానముతో సంబంధించిన కల్పనాజన్యజ్ఞానము స్వల్పమైనది. దానివలన పదార్థములయందు మనకు అనుకూల ప్రతికూల భావములు కలిగి, వాంఛ, ప్రేమ, ఆనందము, ద్వేషము, భయము, దుఃఖము మొదలైన వికారములు కలుగును. అనుకూల భావనకలవాని యందు ప్రేమయు, ప్రతికూలభావనకలవానియందు ద్వేషమును కలుగుచున్నది.

ఇఁక ఉన్నతజ్ఞాన సంబంధమైన ఇచ్ఛ లెటువంటివో చూతము. ఇచ్చట ఒకానొక వ్యాపారమువలన మనకు సుఖము కలుగునా, దుఃఖము కలుగునాయని విచారించి సుఖము కలుగునెడల దానిఁ గోరుటయు, దుఃఖము కలుగునెడల దానిని వదలుటయు తటస్థింపదు. సత్యమా, అసత్యమా అను ప్రశ్నయే ఇచ్చట ముఖ్యమైనది. ఉన్నతజ్ఞానము కలవారు సత్యమును గోరుటయు, అసత్యమును పరిత్యజించుటయు సంభవించును. ఇచ్ఛ యిట్టి యున్నతావస్థఁ జెందినంగాని లోకవ్యవహారము సుస్థిరంబుగ జరుగనేరదు.

మోక్షము మనోధర్మము. దానికిజ్ఞానమే సాధనము. ప్రపంచమును తెలిసికొనుటయే దానినుండి ముక్తిఁజెందుట. సర్వము నెరుంగుటయే పరిపూర్ణమోక్షముఁ జెందుట. మనోవికార మిట్టిదని తెలిసికొనినక్షణమునందే ఆ వికార మవికారముగా మారును. కావున జ్ఞానమునందే ముక్తిగల్గదు. భ్రమా

దికములు జ్ఞానమున కంతరాయకములుగ నున్నను, సతతప్రయత్నమును, అవిశ్రాంత శ్రద్ధయునున్నయెడల నిజమైన జ్ఞానము సంపాదింపవచ్చును. జ్ఞానమునందే ముక్తికలదు గనుక మన నీతిని కొలుచుటకును జ్ఞానమే సాధనము. అనఁగా, జ్ఞానాభివృద్ధికి అనుకూలమైనది నీతిప్రదమనియు, జ్ఞానాభివృద్ధికి ప్రతికూలమైనది అనీతిప్రదమనియుఁ జెప్పవచ్చును. జ్ఞానముయొక్క సామర్థ్యమే సద్గుణము. కొన్ని కార్యములను చేయింపఁగల్గిన మానవబలమునకే సద్గుణమని పేరు. సద్గుణ సంపన్నుఁడు బలవంతుఁడుగను ధర్మరతుఁడుగను ఉండును. దుర్గుణసంపన్నుఁడు బలహీనుఁడుగను సోమరిగను ఉండును. ఇట్లాలోచించిన యెడల ద్వేషము, కోపము, మత్సరము, అను వానినే గాక భయము, ఆశ, దయ, పశ్చాత్తాపము అను మనో వికారములను గూడ దుర్గుణము లని చెప్పవలసి యున్నది. ఆశలో భయము, దీన భావము, దయ, దుఃఖము మొదలైన వన్నియునుండి మానవ సామర్థ్యమును తగ్గించును. పశ్చాత్తాపము రెండువిధముల చెడ్డది. పశ్చాత్తాపపడువాఁడు దౌర్బల్యము కలవాఁడుగను, తన దౌర్బల్యము నెఱింగిన వాఁడుగను ఉండును. వివేకియై ప్రవర్తించువాఁడు, ఇట్టి మనో వికారముల కతీతుఁడై యుండును. వాఁడు ప్రపంచమందలి నిజమైనకార్యకారణములను సత్పదార్థ స్వభావమును ఎఱిఁగినవాఁడై ఏ వికారమునకు లోనుగాక, ఆత్మాభివృద్ధియు, లోకాభివృద్ధియు చేయుచుండును.

తత్త్వముఁ దెలిసికొనిన జ్ఞానికిఁ బ్రపంచమునందు హేయోపాదేయములు(విడువఁదగినవి. గ్రహింపఁదగినవి)ఉండవు. అన్నిటియందు నతనికి సమభావము కలుగును. సత్తును, దానియొక్క గుణధర్మములను ఎఱింగినవాఁడగుటచేనాతనికి ప్రపంచమందలి వ్యాపారములన్నియు నవశ్యముగ జరుగ వలసినవిగ నుండును. అట్లాతనికిఁ దోచుటచే నొకదానిని ద్వేషించుటకును కారణ ముండదు. ఇవన్నియు జరుగక తప్పని కార్యములన్న నిశ్చయ జ్ఞానము గలిగిన తత్త్వజ్ఞునకుభయమన్న మాట యుండదు. ఆతనికి జ్ఞానము హెచ్చినకొలఁదిని ప్రపంచముమీఁదను, పరమేశ్వరుని మీఁదను నిరపేక్షప్రేమ(disinterested love)కలుగును. ఇట్టినిర్వ్యాజమైన యీశ్వరప్రేమకును, లోకములోని వేఱువేఱు మతముల యందలి యీశ్వరులమీఁది ప్రేమకును భేదము కలదు. ఈ యీశ్వరులు కొలఁదిగనో, గొప్పగనో మానవులను పోలియుందురు. కావున వారిని ప్రేమించుట నిర్వ్యాజము కాదు. ఏదో లాభమును కోరి, గొప్పవారికి భయపడినట్లు భయపడి, ప్రేమించుట సంభవించును. భయాదికములతోఁ జేరుకొనిన ప్రేమ నిరతిశయానందమును (The perfect blessedness) ఈయఁజాలదు. కావున పై నివర్ణింపఁబడిన సత్పదార్థమును ఈశ్వరుని ధ్యానించుటలో,

తత్త్వజ్ఞుఁడు, మఱియేవిధమైన విచారమునులేక పరిపూర్ణ చిత్తశాంతి, సమాధానము, వైరాగ్యము కలవాఁడై నిరతిశయానందమును బొందును.

అట్టిసమయమున, జీవాత్మకుఁబరమాత్మకు నదివఱకున్న భేదముపోయి, యిద్దఱికిని ఐక్యభావము కలుగును. విషయి విషయములు (Subject & objects) ఒక్కటియగును. జీవుఁడు ఈశ్వరుని ప్రేమించుట యనఁగా నీశ్వరుఁ డీశ్వరునిఁ బ్రేమించుటయే. జీవుఁ డీశ్వరుఁడేగనుక, శరీరపాతానంతరము జీవము నాశము జెందినట్లున్నను, ఈశ్వరాంశము శాశ్వతమే. ఆత్మశాశ్వతమనుటవలన, ఈ శరీరమునందు నొక యాత్మవేఱుగ నున్నదనియు, నది శాశ్వతమనియు నర్థముకాదు. జీవపదార్థము ఈశ్వరపదార్థమేకావున శాశ్వతమనియర్థము. తాను ఈశ్వరాంశమే యనియు, కావున తాను శాశ్వతమనియు తత్త్వజ్ఞునకుఁ దెలియుట వలన నాతఁడు మరణభీతిని విడనాడి, సంతోషస్వాంతుఁడై యుండును. [కౌ. ల.

అద్వైతానందుఁడు. ఒక మహారాష్ట్ర పండితుఁడు. ఇతఁడు సన్న్యాసము పుచ్చుకొనిన తరువాత కాశీవాసము చేసెను. జను లాతని 'గురుస్వామి' యనుచుండిరి. ఇతఁడు 'బ్రహ్మవిద్యాభరణ' మను శాంకర వేదాంత గ్రంథమును, సదానందకృత 'వేదాంత సారము' పై టీకను సంస్కృతమునందు వ్రాసెను. మధ్వమునీశ్వరుఁడు, అమృతరాయఁడు అను మహారాష్ట్రకవు లీతని శిష్యులే. ఇతఁడు కాశీక్షేత్రమున శా. శ. ౧౬౮౦ పార్థివనామ సంవత్సరమున సమాధిస్థుఁడయ్యెను. [అర్వాచీనకోశము.

అధచ్ఛాయుఁడు. కశ్యపకులోత్పన్నుఁడైన యొకఋషి.

అధశ్శిరస్సు. లంచము తీసికొను వారికై యేర్పడిన నరకము.

అధ్యాత్మరామాయణము. ఇది బ్రహ్మాండపురాణాంతర్గతము. శివుఁడు పార్వతికి బోధించిన ట్లిందు వర్ణింపఁబడినది. ఇందు వాల్మీకి రామాయణమునందు వలెనే సప్తకాండములుగలవు. గ్రంథమునందఱువది నాలుగధ్యాయములును, నాలుగువేల రెండు వందల పద్యములు నున్నవి. మొత్తము మీఁద కథయంతయు వాల్మీకి రామాయణములోనిదే యైనను కథాభాగ మచ్చటచ్చట విచ్చలవిడిగా మార్చఁబడియున్నది. వాల్మీకమునందు రామచరిత మంతయు మానవచరితముగ వర్ణింపఁబడినది. సామాన్యమానవునివలె రాముఁడు భార్యావియోగమునకై దుఃఖించును. కాని యీగ్రంథమునందు రాముఁడు పరబ్రహ్మ మనియు, సీత (ఆది మాయ) అవిద్య యనియు, రామచరిత్ర మంతయు లీలా నటనమనియుఁ జెప్పఁబడినది. ఇందు తత్త్వము అద్వైత

సిద్ధాంతముగను భక్తి శ్రీరామభక్తిగను నుపదేశింపఁబడినవి.

పరబ్రహ్మము దేవకార్యమునకై, అనఁగా రావణ సంహారమునకై, రామ రూపమున జన్మించి ఆత్మస్వరూపమును మఱచియుండఁగా నొకనాఁడు నారదుఁడువచ్చి 'నీవు రావణ వధార్థము జన్మించినావు. నీకు రేపు పట్టాభిషేకమైన యెడల ఆరాజ్యసౌఖ్యము లో మఱచెదవు.' అనిచెప్పఁగా నాతఁడు తెలివొంది దేవ కార్యమునకై అరణ్యమునకుఁ బోవ నిశ్చయించెను. దేవతలు రాముని పట్టాభిషేకమునకు భంగము గలిగింపవలయునని సరస్వతీ దేవిని కోరఁగా నామె మంథర యందుఁ బ్రవేశించి కైకకు దుర్బోధచేసెను.

సీతా రామలక్ష్మణు లరణ్యావాసములో నుండఁగా నిఁకముందు రావణుఁడు సీత నెత్తుకొనిపోవునని దివ్యదృష్టిచే రాముఁ డెఱింగి భార్యతో 'నీవిఁకడాగి మాయాసీత నిచ్చట నుంచుము' అనిచెప్పెను. అందుపై నిజ సీత అగ్నిలోదాగి మాయాసీతను బర్ణశాలలో నుంచెను. రావణుఁడువచ్చి యెత్తుకొనిపోయిన దీ మాయా సీతనే. రాముఁడు రావణాదులతో యుద్ధాదులుచేసినది ఈ సీతకొఱకే! యుద్ధమైనతరువాత ఈ మాయాసీత అగ్నిలోఁ బ్రవేశింపఁగా నిజసీత అగ్నిలోనుండి బయలు వెడలెను.

హిందువులలోఁ బెక్కుమంది గ్రంథమును నిత్యము పారాయణము చేయుచుందురు. ఉత్తర కాండములోని ఐదవ యధ్యాయము నకు రామగీత యనిపేరు. అందు రాముఁడు లక్ష్మణునకు అద్వైత వేదాంతమును, తత్త్వమసి యను సిద్ధాంతమును బోధించెను.

ఈ గ్రంథమును తెలుఁగులోనికి కాణాద పెద్దన సోమయాజియు దూర్వాసుల రామయార్యుఁడును వేర్వేర భాషాంతరీకరించిరి. శ్రీమతి గుండు అచ్చమాంబగారును ద్విపద కావ్యముగ దీనిని తెనిఁగించిరి.

అధ్యాత్మలు. ఇవి పదుమూఁడు విధములగు వాయువులు. ఇవి పిండాండ మందును, బ్రహ్మాండమునందును ఉండును.

అధ్యాత్మోపనిషత్తు. శుక్ల యజుర్వేదాంతర్గతంబు. పరమేశ్వరుని వలన దీనిని అనపాంతరతముండను బురాణఋషి గ్రహించి పారంపర్య క్రమంబున లోకమునకుఁ బ్రసాదింప లోకము దీని బొందెనని యుపనిషదంతమునఁదు గురుశిష్య పారంపర్య నిరూపణంబువలనఁ దెలియవచ్చుచున్నయది. సాధన చతుష్టయసంపన్నులగు సర్వకర్మసన్న్యాసులకు శాస్త్రముచే విధింపఁబడిన యాత్మతత్త్వోపదేశ మిందు సంక్షేపముగను బూర్ణముగును ముచ్చటింపఁబడి యుండుటచే నియ్యది బ్రహ్మవేత్తలచే నతిపవిత్రముగ నెన్నఁబడుచున్నయది. ఇందు గ్రంథబాహుళ్యములేక పోయినను సిద్ధాంతము లన్నియు సూత్రమునఁదెలి ముత్తియములట్లు చక్కఁగ

నొకదాని వెంబడి నొకటి నిర్వచింపఁబడి యుండుటచే నియ్యది సర్వోపనిషత్సార భూతంబుగఁ బరగుచున్నయది.

అధికమాసము. ఏచాంద్రమాసమునందు సంక్రాంతి యుండదో దానిని అధికమాస మనియెదరు. సాధారణముగ సంవత్సరమునకు మాసములు పండ్రెండు. కాని యొకప్పుడు పదుమూఁడవ మాసముఁ గూడ వచ్చుచుండును. దానినే యధిక మాసమందురు. అధికమాసపుస్వభావము, అదివచ్చుటకు కారణము కనుఁగొనవలెనన్న మొదట మనము మాసమన నేమియో తెలిసికొనవలెను.

మాసమనఁగా నెల, ముప్పది దినములు కలదియని మనము సాధారణముగ వ్యవహారమందు వాడుకొందుము. కాని పంచాంగము గుణించు జ్యోతిశ్శాస్త్రజ్ఞులమతమున నాలుగు విధములైన మాసములు కలవు:- ౧ చాంద్ర మాసము, ౨ సౌరమాసము, ౩ నాక్షత్ర మాసము, ౪ సావన మాసము. మనకు నధిక మాసమునుగురించి కావలసిన విషయము బోధపడుటకై మొదటి . రెండు మాసముల స్వభావము తెలిసినఁ జాలును. మిగిలిన రెండు మాసములను గుఱించి మాసశబ్దము క్రింద వ్రాయఁబడును.

చాంద్రమాసము

చంద్రుని గమనమును బట్టి యేర్పరచుకొనిన మాసము.చాంద్ర మాసము. అమావాస్యనుండి అమావాస్యవఱకు గాని పౌర్ణిమనుండి.పౌర్ణిమవఱకుగాని.గతించుకాలమునకు చాంద్రమాసమనిపేరు. అమావాస్యతో ముగిసెడి నెలకు అమాంత్య మాసమనిపేరు. దీనినే ముఖ్యచాంద్రమాసమనియెదరు. శుద్ధప్రతిపద (పాడ్యమి) మొదలుకొని బహుళ అమావాస్యవఱకు నీమాసవ్యాప్తి. ఈచాంద్రమాసమే ఆంధ్రదేశమందంతటను వాడుకలో నున్నది. కర్ణాట, మహారాష్ట్రదేశములలోఁ గూడ దీనినే యుపయోగించెదరు. బహుళ ప్రతిపద(పాడ్యమి) మొదలుశుద్ధపౌర్ణిమవఱకు వ్యాపించియుండు మాసము గౌణ చాంద్ర మాస మనిపించుకొనును. ఇది కాశ్యాదికములైన యుత్తరదేశములలో ఇప్పుడు వ్యవహార మందున్నది. అమావాస్యయనఁగా సూర్య చంద్రాదులు కలిసి యొక ఇంటనున్న క్షణము. అప్పుడు వారికిద్దఱకుఁగల యంతరము ౦° అంశము (degree).అనఁగానిద్దఱకు నంతరమేమియు నుండదు.పౌర్ణిమ యనఁగా సూర్య చంద్రాదులకు ౧౮౦° అంశముల యంతరముండు క్షణము. ఎల్లప్పుడును చాంద్ర మాస మొకేవిధముగ నుండదు. చంద్ర సూర్యుల వేగమునుబట్టి యొకప్పు డది ౨౯ దినములు ౧౯ గంటలు ౩౦ నిమిషముల మితిగలిగి యుండును, మరియొకప్పు డది ౨౯ దినములు ౭ గంటలు ౨౦ నిమిషములు మాత్రము మితిగలిగి యుండును. మధ్యమ మాసమున చాంద్రమాస పరిమితి ౨౯ దినములు ౧౨ గంటల ౪౪ నిమిషముల ౨.౮౩

సెకనులు. ఇట్టి నెలలు పండ్రెండైన నొక చాంద్ర సంవత్సరమగును. ఆర్యభట్టుని సిద్ధాంతాను సారముగ ఈ సంవత్సరపు పరిమితి ౩౫౪, దినములు ౮ గంటలు ౪౮ నిమిషములు ౩౪ సెకనులు.

సౌరమాసము

సూర్యుని గమనమును * బట్టి యేర్పరచుకొనినది సౌరమాసము. ఇది అరవ దేశమందును బంగాళా దేశమందును వ్యవహారములోనున్నది. సూర్యుఁడు ఒక సంవత్సరములో పండ్రెండు రాసులు తిరిగివచ్చును. అతఁడొక రాసి తిరుగుటకు నెంతకాలము పట్టునో యంతకాలమునకు నొక సౌరమాస మని పేరు. సూర్యుఁడు ఒకరాసినుండి మరియొక రాసిలో ప్రవేశించుటను సంక్రాంతియందురు. ఒకసంక్రాంతి మొదలు మరియొక సంక్రాంతి వఱకుఁ గడచుకాలము సౌరమాసపరిమితి. మేషసంక్రాంతి యనఁగా సూర్యుఁడు మీనమునుండి మేషములోఁ బ్రవేశించు క్షణము. అప్పుడు ఫాల్గుణమాసము పూర్తియై చైత్రమాసము ప్రారంభమగును. వృషభ సంక్రాంతితో చైత్రమాసము పూర్తియై వైశాఖమాసము ప్రారంభమగును. ఇట్లే ఇతర మాసములనుగుఱించి తెలిసికొనవలసినది. వీనికి మీనమాసము, మేషమాసము వృషభమాసము మొదలైనపేళ్లు కూడకలవు. వీని వివరమంతయు మాస శబ్దము క్రింద వ్రాయఁబడును. చంద్రునివలెనే సూర్యుఁడు కూడ ఎల్లప్పుడును సమానవేగముతో నడవఁడు. ఒకరాసియందు శీఘ్రముగను మరియొక్క రాసియందు మందముగను పోవును. అందువలన ఒక సౌరమాసము పొట్టిగను, ఇంకొక సౌరమాసము పొడువుగను ఉండును. ఒకపొట్టి సౌరమాసము ౨౯ దినములు ౭ గంటలు ౩౭ నిమిషములు కలదిగను, ఒకపొడవు సౌరమాసము ౩౧ దినములు ౧౫ గంటలు ౨౮ నిమిషములు కలదిగను ఉండుట తటస్థించును.

సౌరసంవత్సరము

పండ్రెండు సౌర మాసములయిన నొక సౌర సంవత్సరమగును. సూర్యుఁడొక రాసి నుండి బయలుదేరి మరల నారాసియొద్దకు వచ్చుటకు నెంతకాలము పట్టునో యదియొక సౌర సంవత్సరము. సూర్యునిబట్టి సంవత్సరమును లెక్కవేయుట సహజము. ఒకఋతువు పోయి మరల నాఋతువే వచ్చిన నొక యేఁడాదియగును. ఇట్టి సౌరసంవత్సరము ౩౬౫ దినములు ౬ గంటలు ౧౨ నిముసములు 30 సెక

* నిజముగాఁ దిరుగునది మన భూమి యనియు సూర్యుఁడు తిరిగినట్లు కన్పఁబడుట భ్రమయనియుఁ జదువరులెఱిఁగియే యున్నారు. అయినను వ్యవహారమునందు సూర్యుఁడు తిరుగును, సూర్యుఁడీ ఇంటిలోఁ బ్రవేశించెను, ఆనక్షత్రములోఁ బ్రవేశించెను, అని వాడుకయున్నందున భాషా సౌకర్యార్థమై సూర్యునికి గమనము గలిగినటులే వ్రాయఁబడును. కాని సూర్యగమన మంతయు భూగమనమని జ్ఞప్తి యుంచుకొనవలెను.

నులు కలదియై యుండును. ఇది యార్యభట్టు లెక్క ప్రకారము వేయఁబడినది. క్రీస్తుశక మందలి సంవత్సరములు కూడ సౌరమాన మున నేర్పడినవే. వారి సంవత్సరము ౩౬౫ దినములు ౫ గంటలు ౪౮ నిముసములు ౯౫.౯౮ సెకనులకాలముగలది. కావున మన సౌరసంవత్సరమానమునగాని, ఇంగ్లీషు సౌర మానమున గాని సంవత్సరము లెక్క వేసి కొనుచుండిన, ఋతువులును, పండుగలును, క్రమముగ వచ్చిన తేదులకే వచ్చుచుండును.

చాంద్రమాసములకును సౌర సంవత్సరమునకును లంకె

నెలలు చంద్రునిబట్టియు, సంవత్సరములు సూర్యునిబట్టియు లెక్కించుకొనుట సకల మానవులకు సహజము. పూర్ణ చంద్రుఁడుతగ్గి మరల హెచ్చిపూర్ణ చంద్రుఁడగుటఁజూచి నెలయైనదను కొనుట, వర్షాకాలము పోయి మరల వర్షాకాలము వచ్చిన సంవత్సర మయినదనుకొనుట స్వాభా వికము. ఇట్లు మాసములు చాంద్రమానము గలవి, సంవత్సరములు సౌరమానము గలవి అయినవి. కాని పండ్రెండు చాంద్రమాస ములయిన నొక సౌరసంవత్సరము కాదు. రమారమి ౧౧ దినములు తక్కువయగును.

	ది.	గం.	ని.	సె.
సౌర సంవత్సరము	౩౬౫.	౬.	౧౨.	౩౦
౧౨ చాంద్రమాసములు	౩౫౪.	౮.	౪౮.	౩౪
అధికము	౧౦.	౨౧.	౨౩.	౫౬

అనఁగా సౌర సంవత్సరము చాంద్రసంవత్సరమునకంటె రమారమి ౧౧ దినములు పెద్దది. ఆంధ్రదేశమున వాడుకలో నున్నవి చైత్రాదికములు, చాంద్ర మాసములు. ఇట్టివి పండ్రెండైన సంవత్సరమగును. చైత్రశుద్ధ ప్రతిపదదినమున మనకు సంవత్స రాది పండుగవచ్చును. అరవదేశమున సౌర మాసములు వ్యవహరింతురు. వారికి సంక్రాంతులతో మాసములు ప్రారంభించును. మేష సంక్రాంతికి సంవత్సరాది పండుగ వచ్చును. ఒకానొక సంవత్సరమునందు అఱవ వారి సంవత్సరాది పండుగయు, మన సంవత్స రాది పండుగయు, (అనఁగా సౌరచాంద్ర మాన సంవత్సర ప్రారంభదినములు) ఒక్క దినముననే తటస్థించినవను కొనుము. మరు సటియేడు ఏమగును? రెండు పండుగలు ఒక్కసారేవచ్చునా? కావు. తెలుఁగువారి సంవత్సరాది పండుగ ౧౧ దినములు మొదలు వచ్చును, అరవవారిది తరవాత వచ్చును. మూఁడవయేట తెనుఁగువారి సంవత్సరాది పండుగ అఱవవారిదానికంటె ౨౨ దినములు ముందు వచ్చును. ఇట్లు చాంద్ర సంవత్సరము సౌరసంవత్సరముకంటెఁ బ్రతియేట రమారమి ౧౧ దినములు వెనుకకు వెనుకకుఁ జరుగును. ఇంగ్లీషు సంవత్సరములుకూడ సౌరమాన మువియగుటచే నా తేదుల నాశ్రయించి యీ సంగతి నే యాలోచింతము. తెలుఁగు సం వత్సరాది పండుగ క్రీ. శ. ౧౯౧౩ లో ౭-వ

ఏప్రిల్ దినమునను ౧౯౧౪ లో ౨౭ వ మార్చి దినమునను, ౧౯౧౫ లో ౧౬-వ మార్చి దినమునను వచ్చినది. ఇట్లీ సంవత్సరాది పండుగును వెనుకకు వెనుకకుఁ బోనిచ్చినయెడల తురకల వీర్ల పండుగువలె మన పండుగులన్నియు నొకప్పుడు వర్షాకాల మందును నొకప్పుడు శీత కాలమందును నొకప్పు డెండకాలమందును వచ్చియుండును! అట్లుగాకుండ చాంద్రమాన సంవత్సరాదిని, సౌరమాన సంవత్సరాది పండుగుకు వీలయినంత సమీపమున నుంచవలయునని రమారమి మూఁడు సంవత్సరముల కొకసారి చాంద్ర మాసములలో నొక అధిక మాసమేర్పర్చఁబడినది. అనఁగా ఆసంవత్సరమునకు పండ్రెండు నెలలుకావు ; పదమూఁడు నెలలు!

అధికమాస పట్టిక ౧

(శా. శ. ౧౮౧౬-౧౮౩౫ ; క్రీ. శ. ౧౮౯౪-౧౯౧౩)

సంఖ్య	సంవత్సరము పేరు	శాలివాహన శకము	చాంద్రమాన సంవత్సరాది వచ్చిన ఇంగ్లీషు తేది	క్రీ. శ.	అధిక మాసములు
౧	జయ	౧౮౧౬	౭ ఏప్రిల్	౧౮౯౪	
౨	మన్మథ	౧౮౧౭	౨౭ మార్చి	౧౮౯౫	
౩	దుర్ముఖి	౧౮౧౮	౧౫ మార్చి	౧౮౯౬	అధిక జ్యేష్ఠము
౪	హేవిళంబి	౧౮౧౯	౩ ఏప్రిల్	౧౮౯౭	
౫	విళంబి	౧౮౨౦	౨౩ మార్చి	౧౮౯౮	అధిక ఆశ్వీజము
౬	వికారి	౧౮౨౧	౧౧ ఏప్రిల్	౧౮౯౯	
౭	శార్వరి	౧౮౨౨	౩౧ మార్చి	౧౯౦౦	
౮	ప్లవ	౧౮౨౩	౨౧ మార్చి	౧౯౦౧	అధిక శ్రావణము
౯	శుభకృతు	౧౮౨౪	౯ ఏప్రిల్	౧౯౦౨	
౧౦	శోభకృతు	౧౮౨౫	౩౦ మార్చి	౧౯౦౩	
౧౧	క్రోధి	౧౮౨౬	౧౮ మార్చి	౧౯౦౪	అధిక జ్యేష్ఠము
౧౨	విశ్వావసు	౧౮౨౭	౫ ఏప్రిల్	౧౯౦౫	
౧౩	పరాభవ	౧౮౨౮	౨౫ మార్చి	౧౯౦౬	
౧౪	ప్లవంగ	౧౮౨౯	౧౫ మార్చి	౧౯౦౭	అధిక చైత్రము
౧౫	కీలక	౧౮౩౦	౨ ఏప్రిల్	౧౯౦౮	
౧౬	సౌమ్య	౧౮౩౧	౨౨ మార్చి	౧౯౦౯	అధిక శ్రావణము
౧౭	సాధారణ	౧౮౩౨	౧౦ ఏప్రిల్	౧౯౧౦	
౧౮	విరోధికృతు	౧౮౩౩	౩౧ మార్చి	౧౯౧౧	
౧౯	పరీధావి	౧౮౩౪	౧౯ మార్చి	౧౯౧౨	అధిక ఆషాఢము
౨౦	ప్రమాదీచ	౧౮౩౫	౭ ఏప్రిల్	౧౯౧౩	

మూఁడు సంవత్సరములల్లో నొకయధిక మాసమని పైని చెప్పినది మోటులెక్క. ఇంకను సూక్ష్మముగఁ బోయిన ౧౯ సౌర సంవత్సరములలో ౭ అధిక మాసములువచ్చును. అనఁగా ౨౨౮ సౌరమాసములు ౨౩౫ చాంద్రమాసములతో సమానము. ఈ రెంటి లోను కొంచెము హెచ్చుతక్కువగ ౬౭౩౯. ౭౫ దినములు (౬౭౩౯ దినములు ౪౫ గడియలు) కలవు. కావున సౌరచాంద్రమాన సంవత్సరములు ౧౯ సౌర సంవత్సరము లలోఁ గలిసికొని పోవుచుండును. అనఁగా నొకానొక సంవత్సరమున (చాంద్రమాన) సంవత్సరాది, సౌరమాన ప్రకారము ఒక తేదికి వచ్చిన దనుకొనుఁడు. మరల నా తేదికి సంవత్సరాది వచ్చుటకు ౧౯ సంవత్సరములు పట్టును. ఈమధ్య సంవత్సరాది పండుగు అధికమాసముల ననుసరించి వెనుకకు, ముందునకుఁ బోవుచుండును. ౧౯ సంవత్సరముల కాలములోపల ఈతిథి (చైత్ర శు ౧) ఎట్లెట్లు మారునో ప్రక్కపుటలోని పట్టికను జూచిన తెలియఁగలదు. ఇందు క్రీ.శ.౧౮౯౪ మొదలు ౧౯౧౩ వఱకు నే యే సంవత్సరమున నే యే యింగ్లీషు తేదిని సంవత్సరాది (చైత్రశు ౧) వచ్చినది చూపఁబడినది. ౧౮౯౪ లో ౭-వ ఏప్రిలు దినమున వచ్చినది, ౧౯ సంవత్సరములకు మరల ౧౯౧౩ లో ౭-వ ఏప్రిలుకు వచ్చినది. ఒకానొకప్పుడు తిథులగడియల హెచ్చుతగ్గులచే సంవత్సరాది, యొక తేది హెచ్చుగగాని, తక్కువగగాని రావచ్చును.

గణనా విధానము

౧౯ సంవత్సరములలో ౭ అధిక మాసములు వచ్చునంటిరి, సరే. కాని యేయేట ఈమాసమే యధికమని యెట్లు? ఏదోయొక మాసమధికమని యనుకొనఁ గూడదా? యని కొందఱడుగవచ్చును. మాసములకు మనవారు సంక్రాంతులనుబట్టి పేళ్లుపెట్టి యున్నారని యిదివఱకె వ్రాసియున్నాము. ఏనెల లో మేష సంక్రాంతియగునో యది చైత్రము, ఏనెలలో వృషభ సంక్రాంతియగునో యది వైశాఖము. ఈ క్రిందిపట్టిక వలన సంక్రాంతులకును, చాంద్రమాన నామములకును గల సంబంధము తెలియఁగలదు.

అధిక మాసముల పేళ్లు

మేష సంక్రాంతి	గలది	చైత్రము
వృషభ సంక్రాంతి	,,	వైశాఖము
మిథున సంక్రాంతి	,,	జ్యేష్ఠము
కర్కాటక సంక్రాంతి	,,	ఆషాఢము
సింహసంక్రాంతి	,,	శ్రావణము
కన్యా సంక్రాంతి	,,	భాద్రపదము
తులా సంక్రాంతి	,,	ఆశ్వీజము
వృశ్చిక సంక్రాంతి	,,	కార్తీకము
ధనుస్సంక్రాంతి	,,	మార్గశిరము
మకర సంక్రాంతి	,,	పుష్యము
కుంభ సంక్రాంతి	,,	మాఘము
మీన సంక్రాంతి	,,	ఫాల్గుణము

మేషసంక్రాంతిగలది చైత్రమాసమనఁగా నేమి? చైత్ర శుద్ధ ౧ లు మొదలు చైత్ర బ. ౩౦ ల వఱకు నెప్పుడైనను మేష సంక్రాంతి కావలెను; సూర్యుఁడు మీనములోనుండి మేషరాసిలోఁ బ్రవేశింపవలెను. ఇట్లే మిగిలిన నెలలను గుఱించి యెఱుఁగవలయును. ఇట్లు చాంద్రమాసముల పేళ్ళేర్పడినను, ఒకానొక చాంద్ర మాసములో సంక్రాంతి లేక పోవచ్చును. అప్పుడా నెల కేమిపేరు? అదియే యధికమాసము. ఒకానొక చాంద్ర మాసమున సంక్రాంతియేల లేక పోవచ్చునని చదువరు లడుగవచ్చును. ఒక సంక్రాంతి యొద్దనుండి మఱియొక సంక్రాంతివఱకు గడుచుకాలము సౌరమాసముగదా? శుద్ధ ౧ మొదలు బహుళ ౩౦ వఱకు గడచుకాలము చాంద్రమాసము. ఈ సంగతి జ్ఞాపకముంచుకొనిన ఈ క్రింది సంగతులు బోధపడఁగలవు.

చాంద్రమాన చైత్రమున మేషసంక్రాంతి కావలెను గదా. మేష సంక్రాంతికిని వృషభ సంక్రాంతికిని నడుమ ౩౧ దినములు ౫౬ గడియల కాలము గడుచును. చైత్ర మాసము చివరచివర సూర్యుఁడు మేషమందుఁ బ్రవేశించినాఁడను కొనుము. ఈసంక్రాంతియైన మరునాఁడు (అనఁగా ఒక రోజు లేక ౬౦ గడియలైన తరువాత) చైత్ర బహుళ ౩౦ అయి, వైశాఖ శుద్ధ ౧ ప్రతిపద వచ్చిన దనుకొందము. చాంద్ర మాసమైన వైశాఖమునకు ౨౯ దినముల ౩౨ గడియలే వ్యాప్తి కలదు. అనఁగా నింత కాలములో మరల నొక యమావాస్యవచ్చును. శుద్ధ పాడ్యమి వచ్చును. కాని యింకను వృషభ సంక్రాంతి రాలేదు. కావున ఈ చాంద్ర మాసములో ఏ సంక్రాంతియు నుండదు. ఇది రెండు సంక్రాంతుల నడుమ పడిపోయినది. కావున నిది యధికమాసము. ఇది అధిక వైశాఖము. దీనిని వైశాఖమే యని యేల అనవలయునన్న, ఈనెల కాఁగానే వచ్చునెలలో వృషభ సంక్రాంతి యగును. కావున దానికి వైశాఖ మని పేరుపెట్టుట సహజము గదా? దాని వెనుకది యిది కావున దీనిని అధికవైశాఖ మనిరి. మొదట అధిక మాసము పాటించి తరువాత నిజ మాసము పాటింపవలయునన్న నియమము పెట్టుకొనినందున దీనిని అధిక వైశాఖమనిరి. కాని మొదట నిజమాసమును, తరువాత అధికమాసమును లెక్కవేయవలయునని యేర్పాటు చేసికొన్నయెడల నిదియే యధికచైత్రమై యుండును. దీనికిఁబూర్వము వచ్చినది నిజచైత్రమైయుండును. రెండు సంక్రాంతులకు నడుమనున్న సౌరమాసములు పెద్దవిగా ఉండుటయు, ఆ సంక్రాంతుల కే నడుమనున్న చాంద్రమాసములు చిన్నవగుటయు తటస్థించినపుడు ఇట్లు అధిక మాసము వచ్చును.

౧౯౧౬-వ సంవత్సరము ౩-వ ఏప్రిల్‌తో బూర్తియైన రాక్షసనామ సంవత్సరమునందు అధిక వైశాఖము వచ్చినది. అక్లెందుకు

వచ్చినదో చూచిన యెడల ఈ విషయ మింకను స్పష్టముకాఁగలదు. సూర్య సిద్ధాంత ప్రకారము, ౧౩-వ ఏప్రిల్(౧౯౧౫)దినమున ౩౦ గడియలకు మేష సంక్రాంతి ప్రవేశ మైనది. అనఁగా సూర్యుఁడు మీనమునుండి మేషములోనికిఁ బ్రవేశించినాఁడు. ఆవేళ చైత్ర బ॥ ౧౪ మంగళవారము. ఈ తిథి సూర్యోదయాది ౨౦ గడియల ౩౦ విగడియల వఱకు నాదినమున నున్నది. ౧౪-వ ఏప్రిల్ (బుధవారము) దినమున ౨౩-౩౦ కి అమావాస్య గడియలు ముగిసి చైత్రమాసము సమాప్తమైనది. క్రొత్తమాసము (వైశాఖము) ప్రారంభమైనది*. ఈ వైశాఖమాసము ౧౪-వ మే (శుక్రవారము) దినమున ౩-౩౦ కి ముగిసినది. అనఁగా అప్పటికి అమావాస్య గడియలు పూర్తి అయినవి. ఇట్లు చైత్రబహుళ అమావాస్య మొదలు ఈ అమావాస్య వఱకు సంక్రాంతిలేదు. సూర్యుఁడు ఒక్క రాసిలోనే (మేషమందే) యున్నాఁడు. ఆ దినమే (౧౪-వ మే) ౨౬ గడియలకు వృషభ సంక్రాంతి ప్రవేశమైనది. పాడ్యమి గడియలలో సంక్రాంతి పడ్డది. కావున ఆ నెల నిజవైశాఖము. దానికిఁ బూర్వపుదియు, సంక్రాంతిలేనిదియు నైన చాంద్రమాసము అధిక వైశాఖము. ఇట్లు రాక్షస నామ సంవత్సరమున, చైత్ర శుద్ధ ౧౪ నాఁడు (౧౩ ఏప్రిల్) మేష సంక్రాంతియు, నిజ వైశాఖ శుద్ధ ౧ నాఁడు (౧౪-మే) వృషభ సంక్రాంతియు సంభవించి, నడుమ గడిచిన ఒక చాంద్ర మాసమునందు, సంక్రాంతి లేనందున అధిక మాసము వచ్చినది.

ఇంకొక విశేషము. ౧౪-వ మే (శుక్రవారము) దినమున, అమావాస్య వచ్చినది, సంక్రాంతి వచ్చినది. కాని అమావాస్య గడియ లైపోయిన తరువాత, సంక్రాంతి వచ్చినది. కావున అధిక మాసమైనది. అట్లుగాక అమావాస్య గడియల లోపుగ సంక్రాంతి పడ్డయెడల నది నిజ వైశాఖమై యుండును. అధిక మాసము లేకపోవును. కావున అధిక మాసము నిర్ణయించుటలో అమావాస్య గడియలు విగడియలును, సంక్రాంతి గడియలు విగడియలును అతి సూక్ష్మముగ లెక్క వేయవలసియుండును.

మన దేశమందలి జ్యోతిష్కులు సాధారణముగ ౨౨౮ సౌర మాసములను ౨౮, ౩౪,౩౫, ౨౯, ౩౪, ౩౪, ౩౫ నెలలుగ ఏడు భాగములుచేసి ఇన్నిన్ని నెలల తరువాత నొక్కొక అధిక మాసము వచ్చునని లెక్క వేయుచున్నారు. ౨౨౮ సౌర మాసము లనఁగా ౧౯ సంవత్సరములు. కాని ౨౨౮ సౌరమాసములకంటె ౨౩౫ చాంద్రమాస

* ౧౪-వ ఏప్రిల్ దినమున ౨౩ గడియలు, ౩౦ విగడియలు తరువాత అమావాస్య అయిపోయినను వ్యవహారమునకు ఆ దినమంతయు నమావాస్యయే. ఆ దినము చైత్ర మాసములోనిదే. గణితమునకు మాత్రము ఆ దినమున అధిక వైశాఖము ప్రారంభమగును.

ములు ౫ గంటల కాల మెక్కుడు. ఇట్లు ౪౫౬ సంవత్సరములలో ౫ తిథులు ఎక్కువ వచ్చును. కావున ౯౯ సంవత్సరములకు ౭ అధిక మాసము లన్న లెక్క కూడ వందల సంవత్సరములు గడవఁ గామారును. అందుచే నెప్పటికప్పుడు సిద్ధాంతములను దిద్దుకొనుచు లెక్క వేయవలయును.

సౌరచాంద్రమాసముల మితి (దినసంఖ్య) తెలుపుటకు నొక పట్టిక (౨) యీయఁ బడినది.* దీనివలన ఏయే సౌరమాస మేయే చాంద్ర మాసమునకు సంబంధించినదియు, ఒకటి కంటె మఱియొకటి యెంత పెద్దది యైనదియుఁ దెలియును. సౌరవత్సరము ప్రారంభమైన తరువాత నెంతకాలమునకు అమావాస్య (అనఁగా చాంద్రమాసము) వచ్చినయెడల ఏనెల యధికమాస మగు నో ౩-వ పట్టికవలనఁ దెలియును. (సౌర) మేషమాసము మితి ౩౦.౯౩౫౨౮ దినములు అనఁగా రమారమి ౩౦ దినములు, ౫౬ గడియలు, ౭ విగడియలు. ఆ మాసము జరుగుచుండఁగా వచ్చినట్టి (చాంద్ర) వైశాఖ మాసము మితి ౨౯.౫౩౦౫౯ దినములు. అనఁగా రమారమి ౨౯ దినములు ౩౧ గడియలు ౫౦ విగడియలు. ఈ రెంటికిని భేదము ౧.౪౦౪౬౯ దినములు. అనఁగా ౧ దినము ౨౪ గడియల ౧౭ విగడియలు. కావున (సౌర) మేషమాసము ప్రారంభమైనతరువాత (చాంద్ర) వైశాఖము ౧ దినము ౨౫ గడియల ౧౭ విగడియలకు లోపల ప్రారంభ మాయెనా, ఆ చాంద్రమాసము నందు మరల సంక్రాంతిరాదు. అనఁగా వైశాఖ మాసము అయిపోయిన తరువాతఁగాని సూర్యుఁడు మేషమునుండి వృషభమునకు బోఁడు. కావున సంక్రాంతి లేనిది యగుటచే వైశాఖము అధికమాస మగును. సౌర మాసము ప్రవేశించిన తరువాత ౧ దినము ౨౫ గడియలు ౧౭ విగడియల కాలము తరువాత వైశాఖము ప్రవేశించెనా అది యధిక మాసము కానేరదు. వృషభమాసము పూర్తి యగువఱకు (సౌర) సంవత్సరాదినుండి ౬౨.౩౫౫౫ దినములు (మేషము ౩౦.౯౩౫౨౮ + వృషభము ౩౧.౪౨౦౨౮ అగును. చాంద్ర మాస జ్యేష్ఠము పూర్తి యగువఱకు ౫౯.౦౬౧౧౭ దినములు(వైశాఖము ౨౯.౫౩౦౫౯ + జ్యేష్ఠము ౨౯.౫౩౦౫౮)అగును. ఈ రెండు సంఖ్యలకును భేదము ౩.౨౯౪౩౮ దినములు. కావున సౌర సంవత్సరము ప్రారంభమైన తరువాత మొదటి అమావాస్య ౧.౪౦౪౬౬ దినముల తరువాతను ౩.౨౬౪౩౮ దినముల లోపలను వచ్చెనా ఆ యేడు జ్యేష్ఠము అధిక మాసమగును. లేనియెడల కాదు. ఇట్లే యితర మాసములను గుఱించి యెఱుఁగునది.

* ఈ పట్టికయు నితర పట్టికలును దివాన్ బహదరు స్వామికణ్ణు పిళ్లెగారి గ్రంథము ననుసరించి సిద్ధము చేయఁ బడినవి. కావున ప్రస్తుత లేఖకుఁడు వారి యెడ నెంతయుఁ గృతజ్ఞుఁడు.

సారాంశము, ఒక్క సౌరమాసములో (సంక్రాంతినుండి సంక్రాంతి వఱకు) రెండు అమావాస్యలు వచ్చినయెడల మొదటి యమావాస్యకును రెండవ అమావాస్యకును నడుమనున్న నెల యధికమాస మగును. అతి సూక్ష్మముగ లెక్కరావలెనని పట్టికలలో అయిదు స్థలముల వఱకు దశాంశాంకములు (Five places of decimal) ఈయఁ బడినవి. ఈ దశాంశ సంఖ్యలు దినములో ఇన్నవభాగ మని తెల్పును. వీనిని ౬౦ తో హెచ్చించిన గడియలు వచ్చును. శేషమును ౬౦ తో హెచ్చించిన విగడియలు వచ్చును, ౨౪ తో హెచ్చించిన గంటలువచ్చును, శేషమును ౬౦ తో హెచ్చించిన మినిట్లు వచ్చును. ఈలెక్కలన్నియు సూర్య సిద్ధాంతము ననుసరించినవి.

౨,౩ పట్టికలలో చైత్రమాసము మొదట వేయుటకు మారు చివరనేలవేయఁబడినదన్న సంశయము రావచ్చును. సౌర మీనమాసమునందు చాంద్రచైత్రమాసము* ప్రారంభమగును. అనఁగా సౌర సంవత్సరాంత మాసము జరుగుచుండఁగా చాంద్రసంవత్సరాది మాసము ప్రారంభ మగును. కావున మీన మాసముతోఁబాటు చైత్రమాసము వేయఁబడినది. అట్లే యే సౌర మాసము జరుగుచుండఁగా నేచాంద్రమాసము ప్రారంభమగునో యాచాంద్రమాస మాసౌరమాసముతోఁబాటు ఒక్కపంక్తిలోఁ జూపఁబడినది.

అధిక క్షయమాసముల స్థితియన్న ౩-వ పట్టికనుబట్టి మధ్యమమానమునవచ్చు అధికమాసములను లెక్కింపవచ్చును. స్పష్టమానమునఁ గావలయునన్న సంస్కారముఁ జేసికొనవలెను. ౧౦-వ శతాబ్దమునకు పూర్వము మనజ్యోతిష్కులు మధ్యమ మానము ననుసరించియే అధికమాసములు లెక్కవేయుచుండిరి. కాని తరువాత స్పష్టమానముననే అధిక మాసములు లెక్కవేయఁ జొచ్చిరి. స్పష్టమానముతో వేసినలెక్క ప్రకారము కూడ నొకప్పుడు లెక్కతప్పును. అధికమాసముల లెక్కవేయు గణికుఁడు తన తారతమ్యా జ్ఞానమును ఉపయోగింపవలెను. కావుననే, భాస్కరాచార్యుఁడు తన సిద్ధాంత శిరోమణి యందు నిట్లువ్రాసియున్నాఁడు:-

స్పష్టోఽధిమాసః పతితోఽప్య లబ్ధో
యదాయదా వాఽపతితోఽపి లబ్ధః।
నైకైనిరక్తైః క్రమశోఽధి మాసై
స్తద్వాదినోఘః సుధియా ప్రసాధ్యః॥

స్పష్టమానపు లెక్క ప్రకారము అధిక మాసము వచ్చినను ఒకప్పుడు నిజముగా రాదు, ఒకప్పుడు లెక్కప్రకారము రాకపోయినను నిజముగా వచ్చును. కావున నధిక మాసముల సంఖ్యనుండి వీలు ప్రకారము ఒక్కటి యెక్కించిగాని, తగ్గించిగాని అహర్గణమును కనుఁగొనవలయును.

* సౌర మీనమాసమునందు చాంద్రచైత్రము ప్రారంభమగును, చాంద్ర చైత్రమునందు మేష సంక్రాంతి వచ్చును అని చదువరుల తెలిసికొనవలెను.

ఏచాంద్రి మాసమునందు రెండు సంక్రాంతులు కలుగునో దానికి క్షయమాస మని పేరు. చాంద్ర మాసము పెద్దదియు, సౌరమాసము చిన్నదియు నైనప్పుడు, ఆ చాంద్ర మాసమునందు సూర్యుఁడు ఒకరాసి దాటి యింకొక రాసిలోనికిఁ బోయి మరల దానిఁదాటి మూఁడవ రాసిలోనికిఁ బోవును. ఇట్లు ఒక్క (చాంద్రి) మాసమునందు రెండు సంక్రాంతులు వచ్చును. కావున ఆ నెలకు రెండు పేళ్లు పెట్టవలసియుండును. అందుచే నొక్క నెలను అణఁచివేసెదరు. ఇట్లు క్షయ మాసము వచ్చిన సంవత్సరము ౧౧ నెలల సంవత్సరము కావలసినదే కాని, క్షయ మాసము వచ్చినయెడ తప్పక అధికమాసము వచ్చును. కావున ఆ సంవత్సరమునందు ౧౨ నెలలు పూర్తి యగును. క్షయ మాసములు మిక్కిలి అరుదు. ౧౦౦ సంవత్సరములలో నొక రెండు క్షయమాసములు మాత్రము వచ్చును. శా.శ. ౧౭౪౪ (క్రీ. శ. ౧౮౨౨-౨౩) లో పుష్యము క్షయ మాసము వచ్చెను. మరల శా. శ. ౧౮౮౬ (క్రీ. శ. ౧౯౬౩-౬౪) లోఁ గాని క్షయమాసము రాదు. ఎప్పుడు వచ్చినను క్షయమాసములు మార్గశిర, పుష్య మాఘ మాసములలోనే వచ్చును. ఎందుకనఁగా ఈచాంద్రమాసముల కును ౨౯ దినముల వ్యాప్తిగల సౌర మాసములతో సంబంధము కలదు. ౧౯౧౫ మొదలు ౧౯౭౫ వఱకు వచ్చెడి యధిక క్షయ మాసముల పట్టిక (౪) చివర నీయఁబడినది.

(కో. ల)

క్షయమాసము

సౌరచాంద్ర మాసమితి పట్టిక ౨

	సౌర మాసము	చాంద్ర మాసము	సౌర మాసమితి	చాంద్ర మాసమితి
౧	మేషము	వైశాఖము	౩౦.౯౩౫౨౮	౨౯.౫౩౦౫౯
౨	వృషభము	జ్యేష్ఠము	౩౧.౪౨౦౨౮	౨౯.౫౩౦౫౮
౩	మిథునము	ఆషాఢము	౩౧.౬౪౪౭౨	౨౯.౫౩౦౫౯
౪	కర్కాటకము	శ్రావణము	౩౧.౪౭౫౨౮	౨౯.౫౩౦౫౯
౫	సింహము	భాద్రపదము	౩౧.౦౧౮౬౧	౨౯.౫౩౦౫౮
౬	కన్య	ఆశ్వీజము	౩౦.౪౪౧౩౮	౨౯.౫౩౦౬౦
౭	తుల	కార్తీకము	౨౯.౮౯౩౩౩	౨౯.౫౩౦౫౮
౮	వృశ్చికము	మార్గశిరము	౨౯.౪౯౦౨౭	౨౯.౫౩౦౫౯
౯	ధనుస్సు	పుష్యము	౨౯.౩౧౭౭౭	౨౯.౫౩౦౫౯
౧౦	మకరము	మాఘము	౨౯.౪౪౮౦౫	౨౯.౫౩౦౫౯
౧౧	కుంభము	ఫాల్గుణము	౨౯.౮౨౦౨౭	౨౯.౫౩౦౫౯
౧౨	మీనము	చైత్రము	౩౦.౩౫౩౪౮	౨౯.౫౩౦౫౮

అధికక్షయమాసమితి పట్టిక ౩

	సౌరమాసము	చాంద్రమాసము	సౌరమాసమితి	చాంద్రమాసమితి	సౌరసంవత్సరాది తరువాత ఎన్నిదినములకు అమావాస్యవచ్చిన అధికమాసమగును ?
	౧	౨	౩	౪	౫
౧	మేషము	వైశాఖము	౩౦.౯౩౫౨౮	౨౯.౫౩౦౫౯	* ౧.౪౦౪౬౯ ది పూర్వము
౨	వృషభము	జ్యేష్ఠము	౬౨.౩౫౫౫౫	౫౯ ౦౬౧౧౭	౩.౨౯౪౩౮ ది ,,
౩	మిధునము	ఆషాఢము	౯౪.౦౦౦౨౮	౮౮.౫౯౧౭౬	౫.౪౦౮౫౧ ది ,,
౪	కర్కాటకము	శ్రావణము	౧౨౫.౪౭౫౫౫	౧౧౮ ౧౨౨౩౫	౭.౩౫౩౨౦ ది ,,
౫	సింహము	భాద్రపదము	౧౫౬.౪౯౪౧౭	౧౪౭.౬౫౨౯౩	౮.౮౪౧౨౨ ది ,,
౬	కన్య	ఆశ్వీజము	౧౮౬.౯౩౫౫౫	౧౭౭.౧౮౩౫౩	౯.౭౫౨౦౧ ది ,,
౭	తుల	కార్తీకము	౨౧౬.౮౨౮౮౮	౨౦౬.౭౧౪౧౧	౧౦.౧౧౪౭౫ ది ,,
౮	వృశ్చికము	మార్గశిరము	౨౪౬.౩౧౯౧౬	౨౩౬.౨౪౪౭౦	† ౧౦.౦౭౪౪౬ ది పరము ౧౦.౧౧౪౭౫ ది పూర్వము
౯	ధనుస్సు	పుష్యము	౨౭౫.౬౩౬౯౪	౨౬౫.౭౭౫౨౯	౯.౮౬౧౬౪ ది పరము ౧౦.౧౧౪౭౫ ది పూర్వము
౧౦	మకరము	మాఘము	౩౦౫.౦౮౪౯౯	౨౯౫.౩౦౫౮౮	౯.౭౭౯౧౦ ది పరము ౯.౮౬౧౬౪ ది పూర్వము
౧౧	కుంభము	ఫాల్గుణము	౩౩౪.౯౦౫౨౭	౩౨౪.౮౩౬౪౭	§ ౯.౭౭౯౧౨ ది పరము ౧౦.౦౬౮౮౦ ది పూర్వము
౧౨	మీనము	చైత్రము	౩౬౫.౨౫౮౭౫	౩౫౪.౩౬౭౦౫	౧౦.౦౬౮౮౦ ది పరము ౧౦.౮౯౧౭౦ ది పూర్వము

* సౌరసంవత్సరము ప్రారంభమైన తరువాత మొదటిఅమావాస్య ఈక్రింద నుదాహరించిన దినములకుఁ బూర్వము వచ్చినయెడల ౨-వ ఇంట్లోఁ జూపఁబడిన చాంద్రమాసము ఆసంవత్సరము అధికమాసమగును.

† ఉధాహరించినట్లు కొన్ని దినములకుఁ బూర్వమును, కొన్ని దినములకుఁ బరముగను వచ్చినయెడల ౨-వ యింట్లోఁ జూపఁబడిన చాంద్రమాస మాసంవత్సరము అధికమాసమగును.

§ సౌరసంవత్సరము ప్రారంభమైన తరువాత మొదటి అమావాస్య ఈ క్రింద నుదాహరించిన దినములకుఁ బూర్వము వచ్చినయెడల ౨-వ ఇంట్లో జూపఁబడిన చాంద్రమాసము ఆసంవత్సరమే అధికమాసమగును.

అఱువది సంవత్సరముల

అధికక్షయ మాసపట్టిక ౪

(౧౯౧౫ - ౧౯౭౫)

	సంవత్సరము పేరు	ఏనెల అధికము	శాలివాహన శకము	క్రీస్తు శకము	అధికమాస మెప్పుడు ప్రారంభమై, ఎప్పుడు ముగియును?
౧	రాక్షస	వైశాఖము	౧౮౩౭	౧౯౧౫	౧౫ ఏప్రిల్—౧౪ మే
౨	పింగళ	భాద్రపదము	౧౮౩౯	౧౯౧౭	౧౮ ఆగష్టు—౧౬ సెప్టెంబరు
౩	రౌద్ర	శ్రావణము	౧౮౪౨	౧౯౨౦	౧౬ జులై—౧౪ ఆగష్టు
౪	రుధిరోద్గారి	జ్యేష్ఠము	౧౮౪౫	౧౯౨౩	౧౬ మే—౧౪ జూను
౫	అక్షయ	చైత్రము	౧౮౪౮	౧౯౨౬	౧౫ మార్చి—౧౨ ఏప్రిల్
౬	విభవ	శ్రావణము	౧౮౫౦	౧౯౨౮	౧౮ జులై—౧౫ ఆగష్టు
౭	ప్రజోత్పత్తి	ఆషాఢము	౧౮౫౩	౧౯౩౧	౧౭ జూను—౧౫ జులై
౮	భావ	వైశాఖము	౧౮౫౬	౧౯౩౪	౧౩ ఏప్రిల్—౧౩ మే
౯	ధాత	భాద్రపదము	౧౮౫౮	౧౯౩౬	౧౮ ఆగష్టు—౧౫ సెప్టెంబరు
౧౦	ప్రమాది	శ్రావణము	౧౮౬౧	౧౯౩౯	౧౭ జులై—౧౫ ఆగష్టు
౧౧	చిత్రభాను	జ్యేష్ఠము	౧౮౬౪	౧౯౪౨	౧౬ మే—౧౩ జూను
౧౨	పార్థివ	చైత్రము	౧౮౬౭	౧౯౪౫	౧౫ మార్చి—౧౨ ఏప్రిల్
౧౩	సర్వజిత్తు	శ్రావణము	౧౮౬౯	౧౯౪౭	౧౯ జులై—౧౬ ఆగష్టు
౧౪	వికృతి	ఆషాఢము	౧౮౭౨	౧౯౫౦	౧౬ జూను—౧౫ జులై
౧౫	విజయ	వైశాఖము	౧౮౭౫	౧౯౫౩	౧౪ ఏప్రిల్—౧౩ మే
౧౬	మన్మథ	భాద్రపదము	౧౮౭౭	౧౯౫౫	౧౮ ఆగష్టు—౧౬ సెప్టెంబరు
౧౭	విళంబి	శ్రావణము	౧౮౮౦	౧౯౫౮	౧౭ జులై—౧౫ ఆగష్టు
౧౮	ప్లవ	జ్యేష్ఠము	౧౮౮౩	౧౯౬౧	౧౫ మే—౧౩ జూను
౧౯	శోభకృతు*	ఆశ్వీజము	౧౮౮౫	౧౯౬౩	౧౮ సెప్టెంబరు—౧౭ అక్టోబరు
౨౦	క్రోధి	చైత్రము	౧౮౮౬	౧౯౬౪	౧౫ మార్చి—౧౨ ఏప్రిల్
౨౧	పరాభవ	శ్రావణము	౧౮౮౮	౧౯౬౬	౧౯ జులై—౧౬ ఆగష్టు
౨౨	సౌమ్య	ఆషాఢము	౧౮౯౧	౧౯౬౯	౧౫ జూను—౧౪ జులై
౨౩	పరీధావి	వైశాఖము	౧౮౯౪	౧౯౭౨	౧౪ ఏప్రిల్—౧౩ మే
౨౪	ఆనంద	భాద్రపదము	౧౮౯౬	౧౯౭౪	౧౮ ఆగష్టు—౧౬ సెప్టెంబరు

* ఈ సంవత్సరము పుష్యము క్షయమాసము. క్షయమాసమువచ్చిన సంవత్సరము అధికమాసముకూడా తప్పకవచ్చును. కావున ఈయేడు అధికమాసముకూడ వచ్చినది.

అధికారి. మళయాళ్ళ దేశమునందు గ్రామ మునసబు 'అధికారి' యనఁబడును. అగముడ యనులు, బడగలు, అను జాతి వారిలోఁ గొందఱ కధికారులను పేరుగలదు. ఓఢ్ర జాతివారిలో కొన్ని గ్రామాధికారుల కును, దక్షిణ కనరా జిల్లాలో 'స్థానిక' అను శాఖ వారికిని ఈ నామము కలదు.

అధిరాజరాజు. ఇతఁడు చోళదేశపు రాజు. క్రీ. శ. ౧౦౭౦ లో మరణము నందిన వీరరాజేంద్రుని కుమారుఁడు. రాజ్యమునందంతఃకలహములు పెక్కులుండినందున తండ్రిపోయినవెంటనే ఈతనికిని రాజ్యము స్వాధీనమైనదికాదు. విఖ్యాతుఁడగు విక్రమాదిత్య చాళుక్యుఁడీతని బావమఱఁది. ఆతని సాయమువలన 'అధిరాజరాజు' క్రీ. శ.౧౦౭౨ సంవత్సరమున చోళరాజ్యమును వశపఱచుకొనెను. కాని యాతఁడు ప్రజానురంజకుఁడుగాక ప్రజలచే ద్వేషింపఁబడి ౧౦౭౮లోఁ జంపఁబడెను.

ఈతనికే 'అధిరాజేంద్ర చోళుఁడు-అధిరాజరాజేంద్ర పరకేసరివర్మ' అను బిరుదులుండెను. ఈతనితో చోడవంశ మంతరించెనని చెప్పవచ్చును. వేంగిదేశపు రాజయిన రాజేంద్రుఁడను నామాంతరము గల ప్రథమ కుళోత్తుంగుఁడు అధి రాజేంద్రుని తరువాత చోళదేశమునకు రాజై చోళుఁడన్న పేరు పెట్టుకొనియెను.

అధిరాజ్య దేశము. భారత వర్షీయ దేశము. ఇది దక్షిణ మత్స్య దేశమునకు దక్షిణమునందుండెను. పాండవుల కాలమున నిచ్చట దంతవక్త్రుఁడు రాజ్యము చేయుచుండెను. (భార సభా. అ. ౩౧.)

అధి వంగము. గౌతమ వనమునకు సమీపము నందున్న భారత వర్షీయ తీర్థము.

అధిష్ఠాన పురము. చేదిదేశమునకు ముఖ్య పట్టణము.

అధృష్య. భారత వర్ష మందలినది. (భార. భీష్మ, అ. ౯.)

అన్. అన్ అనునది దక్షిణ బర్మాలోని క్యాక్ పూ్యా జిల్లాలోని యొకపట్టణ ప్రాంతమునకు పేరు. వైశాల్యము ౨౮౬౧ చతురపుమైళ్లు. జనసంఖ్య ౨౭౮౬౩. అడవి భాగము విశేషము, వ్యవసాయము తక్కువ. రాఁబడి రూ. ౩౧౦౦౦ లు. ముఖ్యపట్టణము అన్ అనునది. అక్కడ ౮౨౬ జనులుగలరు.

అనంగ. భారతవర్షీయనది. (భార. భీష్మ. అ. ౯.)

అనంగపాలుఁడు. ఢిల్లీ రాజు. తువర వంశములోఁ జివరవాఁడు. ఈతని కాలములోనే యాతని రాజధానికి 'ఢిల్లీ'యని పేరుగలిగెను. ఇతనికి పుత్రసంతానములేదు. ఇద్దఱు కుమార్తెలుండిరి. అందు కమలా దేవియను నామెను అజమీరు రాజయిన

సోమేశ్వరునకిచ్చెను. ఈమె కుమారుఁడే తరువాత ఢిల్లీశ్వరుఁడైన పృథ్వీరాజు. రెండవ కుమార్తెయగు విమలాదేవిని కనోజ్‌రాజైన విజయపాలునకిచ్చి యుండిరి. ఈమెయే జయచంద్రునితల్లి. అనంగపాలుఁడు ముసలివాఁడై బదరికాశ్రమమునకుఁ బోవునపుడు తనఢిల్లీ రాజ్యమును దౌహిత్రుఁడగు పృథ్వీరాజున కిచ్చెను.

అనంగభాగి. ఒక బ్రహ్మర్షి. (చూడు 'భృగువు')

అనంగ భీమదేవుఁడు. ఇతఁడు ఒరిస్సాదేశమునకు రాజు. క్రీ. శ. ౧౧౭౪ లో రాజ్యమునకు వచ్చెను. ఇప్పుడు జగన్నాథము నందుఁగల దేవాలయ మీతఁడు కట్టించెను. ఇతనిరాజ్య విస్తారమెక్కువగనుండెను. ఉత్తరమున బంగాళమువైపు భాగీరథీనది, దక్షిణమున గోదావరినది, పశ్చిమమున శోణపురపు అరణ్యము, తూర్పున సముద్రము - ఇవి యీతని రాజ్యముయొక్క యెల్లలు. ఇందు వలన నితఁడు గొప్ప రాజ్యమును పరిపాలించెనని చెప్పవలసియున్నది. వచ్చెడి యాదాయములో మూఁడవవంతు తనస్వంత వ్యయమునకై తీసికొని, మిగిలినది యతఁడు సెలవుచేయుచుండెను. ఇతఁడు పెక్కుధర్మ కార్యములను చేసెను. అఱువది దేవాలయములను, పది పెద్దనదులపై సేతువులను నిర్మించెను. ౪౦ కూపములఁ ద్రవ్వించెను. నూటయేబది రెండు నదీఘట్టములఁ గట్టించెను. ౪౫౦ గ్రామములఁ గట్టించెను, దశలక్ష పుష్కరిణులఁ ద్రవ్వించెను. ఇట్టి ధర్మాత్ముఁడైన యీరాజు కొన్ని కారణములచేఁ గొందఱు బ్రాహ్మణులఁ జంపించెను. ఆపాపముపోవుటకై యాతఁడు తపస్సుచేయఁగా జగన్నాథుఁడు దేవాలయముకట్టించు మని స్వప్నమందుఁ జెప్పెను. ౧౧౯౮ లో నీ దేవాలయము పూర్తియయ్యెను. [వి. కో.

ఇతనికే లాడదేవుఁడని నామాంతరము. కల్యాణమల్లుఁడను కవిచేనితఁడు 'అనంగరంగ' మను కామశాస్త్ర విషయక గ్రంథమును వ్రాయించెను. [అ. కో.

అనంగుఁడు. ౧ శివునిచే భస్మము చేయఁబడిన తరువాత మన్మథునకు వచ్చిన పేరు. (చూఁడు మన్మథుఁడు)

౨. రామ సేనలోని యొక వానరుఁడు.

అనంతకవి(చిత్రకవి). ఇతఁడు పెమ్మసాని చినతిమ్మరాజున కాశ్రితుఁడు. పదునేడవ శతాబ్దపు మొదటి యర్ధమున నున్నవాఁడు. ఆరువేల నియోగి బ్రాహ్మణుఁడు. చిత్రకవి పెద్దనార్యుని పుత్రుఁడు. భారద్వాజ గోత్రుఁడు. ఇందుమతీ పరిణయమను ప్రబంధమును రచించెను. హరిశ్చంద్ర నలోపాఖ్యానమునకును విష్ణుచిత్తీయమునకును టీక వ్రాసినవాఁడు. ఆంజనేయోపాసకుఁడు.

అనంత ఛందస్సు. చూఁడు అనంతామాత్యుఁడు.

అనంతపురము, మైసూరు రాజ్యమునందలి యొక పల్లె. షిమోగాజిల్లాలోని సాగర్ తాలూకాలోనిది. షిమోగాకు ౪౯ మైళ్ళమీఁదనుండును. జ న స ం ఖ్య 3౨౨. అంధాసురుఁడన్న రా జు చే నె ని మి ద వ శతాబ్దమునందు నీగ్రామము కట్టింపఁబడియె. పదునొకండవ శతాబ్దమునందు నిది చాళుక్యుల స్వాధీనము నందుండెను. ఇది 'సహస్రవి ష య ము' (మండలము)లోనిది. ౧౦౮౨లో నిది ౧౨౦౦ బ్రాహ్మణులకు నగ్రహారముగ నీయఁబడెను. ౧౦౭౯ లో నిది, రాజధానిగఁ జెప్పఁబడెను. పదునేడవ శతాబ్దమునందు, కేలడిరాజయిన వేంకటప్ప నాయకుఁడీగ్రామమునందు శివాచార మ ఠ ము ను స్థాపించెను. చంపక సరసు అను చెరువు త్రవ్వించెను. గ్రామముపేరు 'అనందపుర'మని మార్చెను. అదియే తరువాత అనంతపురముగ మారెను. హైదరు టిప్పూకాలమున నీగ్రామముపై వారిదాడులు పెక్కుసార్లువచ్చెను. ౧౮౩౦ లోని తిరుగుబాటు కాలమున నీగ్రామము దోపిడికి లోనయ్యెను.

అనంతపురము (గ్రామము). అనంతపురము జిల్లాకు ముఖ్యపట్టణము. ఇది చెన్నపట్టణమునకు వాయవ్యమూలగ ౨౧౬ మైళ్లమీఁదనున్నది. చెన్నపురి దక్షిణ మహారాష్ట్ర ఇనుపదారి మార్గముయొక్క గుంటకల్ బెంగుళూర్రు శాఖమీఁద నొకస్టేషన్. ౧౯౧౧లో నిచ్చట ౧౮౦౪౭ జనులుండిరి. ఈ జిల్లాలోనున్న మునిసిపాలిటీ యిదియొకటియే.

ఈ గ్రామమును చిక్కప్ప ఉడయర్ అనువాఁడు కట్టించెనని చెప్పుదురు. ఈతఁడు

చరిత్ర

విజయనగర రాజయిన ప్రథమబుక్కరాయలకు (౧౩౪౩-౧౩౭౯) మంత్రిగ నుండెను. ఈ ఉడయర్ ఒకపెద్ద చెరువు కట్టించి, దానికి రెండు అలుగులనుండి ఎక్కువైన నీరుపోవుటకు రెండు కత్వాలును, వానికి సమీపమున రెండు గ్రామములును కట్టించెను. అందు నొక గ్రామమునకు రాజుపేరిట బుక్కరాయ సముద్రము అని పేరుపెట్టి, రెండవదానికిఁ దన భార్యయైన అనంతమ్మపేరిట అనంతసాగరమని పేరు పెట్టెను. ఆపేరే అనంతపురమని మారెను.

విజయ నగరమందు రామరాజు ప్రభుత్వము చేయుసమయమున, హండెవంశజుఁడైన హనుమప్ప నాయుఁడనువాఁడు ఆతనియొద్ద నొక నాయకుఁడు గానుండి, తిరుగుబాటు చేసిన సలకము తిమ్మప్పను, ఓడించెను. మరియొక యుద్ధములో నైజామును ఓడించెను.* అందుమీఁద రామరాజు సంతసించి హనుమప్పకు నందేల, బుక్కరాయ సముద్రము, ధర్మవరము, కనికట్లు, అనంతపురము, బళ్ళారి,

* 'అనంతపురము కైఫీయతు' అను పుస్తకమందు ఈతఁడు నైజామును ఓడించి, చెఱపట్టి తెచ్చి రామరాజునకుఁ గానుకగా నిచ్చెనని యున్నది.

కారోడు అను గ్రామములను, పెక్కువద వులును ఇచ్చెను. హనుమప్ప కుమారుఁడు ఇమ్మడి హంపనాయుఁడు, ఆతని కుమారుఁడు మలకప్పనాయుఁడు. మలకప్ప తాళికోట యుద్ధములోఁ బోరాడినవాఁడు. విజయనగర రాజుల ప్రభ తగ్గిన తరువాత సీతఁడు గోలకొండ నవాబునకు సామంతుఁడై అనంతపురమునకుఁ జుట్టుపట్టుననుండు ప్రాంతమును జాగీరుగ సంపాదించెను. నవాబునకు ౪౫౭౭౨ కాంతిరాయ వరహాలు (రమారమి రు. ౧౩౦౦౦౦) కప్పము కట్టుచుండెను. ఈతనికి సంవత్సరమునకు రు. ౧౩౪౩౧౬ భూమిశిస్తుక్రింద వచ్చుచుండెను.

ఈ మలకప్ప నాయుఁడు బుక్క రాయ సముద్రమున నివసించుచు నొక్కనాఁడనంత సాగరమునకుఁబోఁగా ఎల్లారెడ్డియను వాఁడు తనిని తనయింటికిఁ దాంబూలమునకుఁ బిలిచెను. మలకప్ప వానియంటికిఁబోయి, తాంబూలము తీసికొని, యాతని సంతానాభివృద్ధిఁజూచి సంతసించి, యదివఱకుఁ దనకు పురుషసంతానము లేనందున, ఎల్లారెడ్డియున్న తావునతాను నివసించినఁ దనకుఁ గుమాళ్ళు కల్గుదురని తలంచి, యతనినడిగి యాస్థలముఁ దీసికొని యచ్చట రాజమందిరము కట్టించి తాను నివాసముగనుండఁ జొచ్చెను. అప్పటినుండి యాగ్రామమునకు హండే అనంత పురమన్న పేరువచ్చెను.

మలకప్పకు సిద్ధరామమ్మయను భార్యవలన నల్గురు పుత్రులుపుట్టిరి; దేవప్ప, చిన్నరామప్ప, లింగప్ప, హంపనాయుఁడు. మలకప్ప తన పుత్రులలో దేవప్పకు నంద్యాల, చిన్నరామప్పకు బళ్లారి కరుగోడు, లింగప్పకు కడప కనికల్లు, హంపనాయునకు అనంతపురము, బుక్కసాగరము, బుక్కపట్నము, ధర్మవరము ఇచ్చెను. హంపనాయుఁడు ౧౬౯౯ మొదలు ౧౬౩౧ వఱకును, అతని కుమారుఁడు సిద్దప్పనాయుఁడు ౧౬౫౯ వఱకును, ఈతని కుమారుఁడగు పవడప్ప ౧౬౭౧ వఱకును రాజ్యముచేసిరి. ఈతని ప్రభుత్వకాలమున రాయదుర్గము పాళేగారు ఈతని రాజ్యముపై దండెత్తివచ్చి కొంతవశపఱచుకొని ధర్మవరములో తనసైన్యమును కొంత ఠాణాగా నుంచిపోయెను. పవడప్ప పోయిన తరువాత ఆతని కుమారుఁడైన సిద్దప్ప బాలుఁడగుటచేఁ గొంతకాలమువఱకు పవడప్ప భార్యయైన రామక్క రాజ్యపాలనముచేసెను. ఈమె కాలమందే యీదేశము ఔరంగజేబు స్వాధీనమాయెను. ఆతఁడు వీరికప్పము తగ్గించి ౧౧౨౦౦ వరహాలుచేసి, వీరు చక్రవర్తి యుపయోగార్థమై ౧౨౦౦ పదాతులను, ౧౫౦ మంది గుఱ్ఱపు రౌతులను ఎప్పుడును ఉంచవలెనని యేర్పాటుచేసెను. సిద్దప్ప ౧౬౯౬లో మృతుఁడయ్యె.

సిద్దప్ప కొడుకు ప్రసన్ననాయుఁడు. ఈతని కాలమువఱకు ఈ ప్రాంతము కడప నవాబు

స్వాధీనమైనది. రాయదుర్గము పాళెగారును వంచుటలో నీతఁడు కడప నవాబునకు తోడయ్యెను. అందుకు నవాబు ప్రసన్నుఁడై, ఈతఁడు నవాబు నుపయోగార్థమై సైన్య మంచవలసిన యావశ్యకత లేకుండఁజేసెను. ఈతని యుంపుడుకత్తెయైన వసంతమ్మ యీతనిని ౧౭౨౦ లోఁ బొడిచి చంపెను.

ప్రసన్నప్పకుఁ గుమాళ్లులేనందున నతని తమ్ముఁడైన పవడప్పనాయఁడు రాజయ్యెను. ఈతఁడు కడప నవాబునకు కప్పము కట్టుట మానివేసినందున, నాతఁడు సైన్యముతోఁగా దానిని ఓడించెను. ఈతని రాజ్యకాలము ౧౭౨౦-౧౭౩౪.

పవడప్పకొడుకు సిద్దప్ప స్వేచ్ఛాచారుఁడై అప్పులపాలయ్యెను. ఆతఁడు మూఁడేండ్లు (౧౭౩౪-౧౭౭౦) రాజ్యము చేసిన తరువాత, నాతని యధికారులు తిరుగఁబడి, యాతని పెత్తండ్రియైన ప్రసన్నప్పకు నుంపుడు కత్తె యందుఁబుట్టిన రామప్ప యనువానిని రాజ్యముపైఁ గూర్చుండఁబెట్టిరి. సిద్దప్ప తాడిమఱ్ఱి పాళెగాని సాయముతో మరల తనరాజ్యమును సంపాదింపయత్నించెను. కాని రామప్ప మరాఠావారికి శరణుబోయి గుత్తి మురార్ రావును తోడుతెచ్చుకొనెను. అనంతపురమును స్వాధీనపఱచుకొని సిద్దప్పను చెఱఁ బెట్టెను.

రామప్ప ౧౭౭౦ మొదలు ౧౭౯౨ వఱకు రాజ్యముచేసెను. ఈతని కాలమునందు మరాఠావారు వీరి కప్పమును తగ్గించి రు. ౧౫౦౦౦ చేసిరి. ఇదిగాక రామప్ప మురార్ రావునకు రు: ౫౦౦౦లు కప్పము కట్టుచుండెను. పూర్వము రాయదుర్గమువారు స్వాధీనపఱచుకొనిన తమరాజ్యములోనిభాగమును మరల సంపాదింపవలెనని ధర్మవరము నొద్దనున్న కనుముక్కలమీఁదికి దండుపోయెను గాని యోడి తిరిగివచ్చెను (౧౭౮౦). మరుసటి సంవత్సరము రాయదుర్గమువారు ఈతని రాజ్యముమీఁదికి దండువచ్చి బుక్కపట్టణమును ముట్టడించిరి. కాని రామప్ప వారిని ఓడించిపంపెను. మరుసటిసంవత్సరము కూడ వారు మరల వచ్చి యోడిపోయిరి.

చెఱలో నుంచఁబడిన సిద్దప్ప మృతినొందెను, ఆతనిభార్య తనకు బంధువుఁడైన బళ్లారి పాళెగారునొద్దకుఁ బారిపోయెను. అచ్చట నామె సలహానునసరించి, యా పాళెగారుఁడు రామప్ప కుమారుఁడైన సిద్దిరామప్పను పెంచుకొనెను. ఒకప్పుడు బళ్లారి పాళెగారుఁడు కుమారుని పెంచుకొనిన తరువాత మిత్రత్వము నటించుచు రామప్పను చూచుటకై అనంతపురమునకు గొప్ప సిబ్బందితో వచ్చెను. అనంతపురముకోట చిన్నదియగుటచే రామప్ప తన సిబ్బందిని మఱియొక చోటకిఁబంపి చుట్టముల సిబ్బందికిఁ దనకోట లోనుండుటకు తా విచ్చెను. బళ్లారి పాళెగారుఁడిట్లు తన సిబ్బందితో అనంతపురము కోటలోనుండి, యొకదినము రామప్పనుచంపి

కోటను, చాలరాజ్యమును స్వాధీనపఱుచుకొనెను. తానుపెంచుకొనిన సిద్దప్పను చెఱఁబెట్టెను. సిద్దప్ప చెఱసాలమీఁదియధికారులను వశపఱుచుకొని, అందుండి పారిపోయి, తన బావమఱఁదియైన బసప్పతోఁగూడ మురార్ రావుకడకుఁ బోయెను. బసప్పసాహసముగల శూరుఁడు. మురార్ రావు వద్దనుండి కొంత సైన్యముఁదీసికొని, కొంతసైన్యమును తాను కూర్చుకొని బుక్కరాయసముద్రమును ముట్టడించెను. కాని బళ్లారినుండి పెద్దసైన్యము వచ్చి బసప్ప సైన్యమును వెడలఁగొట్టెను. అంత నాతఁడధైర్యపడక, కడ్డప నవాబును ఆశ్రయించి సైన్యముందెచ్చి బుక్కరాయసముద్రమును, అనంతపురమును స్వాధీనపఱుచుకొని, సిద్దప్పనురావించి పట్టాభిషిక్తుని జేసెను (౧౭౫౩).

౧౭౫౭ లో మురార్ రావు అనంతపురమును ముట్టడించెను. కొంతకాలమువఱకు లోనివారు పోరాడిరి. కాని విధిలేక మరాతా వానికి రు. ౫౦,౦౦౦ దండుగనిచ్చి, గ్రామము పాడుగాకుండ దక్కించుకొనిరి. ఇది వఱకు జరిగిన పోరాటములవలనను, ఈ దండుగవలనను సిద్దప్ప మిక్కిలి బీదవాఁడయ్యె. అందుచే బసప్ప దోపిడికివెడలి తాడిపత్రి,యెల్లుట్ల, రొద్దము మొదలైనస్థలములను కొల్లఁగొట్టెను.

౧౭౭౨ బుక్కపట్నము చెరువు తెగఁగా దానిని అపుటకు యత్నించి, ఆపరిశ్రమవలన బసప్ప కీర్తిశేషుఁడయ్యెను. ౧౭౭౫ లో హైదరు గుత్తి, బళ్లారి జయించి అనంతపుర ప్రాంతమునకును స్వామి అయ్యెను. అతఁడు అనంతపురమువారి కప్పము హెచ్చించి రు. ౬౯౦౦ లు చేసెను. ఇంత కప్పము కట్టుశక్తి ఈ సంస్థానాధీశ్వరులకు లేనందున బాకీపడఁజొచ్చిరి. అందుమీఁద హైదర్ కొందఱు భటులఁబంపి, సిద్దరామప్పను చెఱఁబెట్టించి, సంస్థానమును వశపఱుచుకొనెను. కొన్నిదినములవఱకు సిద్దరామప్పకు నెలకు ముప్పదివరహాలచొప్పున భరణమిచ్చిరి. తరువాత దానిని గూడఁజాలించిరి. ఈతనియిద్దఱుకొడుకులును హైదర్ సైన్యములోఁ జేరి యందు మృతులైరి. మూఁడవవాఁడగు సిద్దప్పనాయుని శ్రీరంగపట్టణమునకుఁ బంపిరి. ఇట్టిదుఃఖముల భరింపలేక ౧౭౮౮ లో సిద్దరామప్ప చెరలోనే మరణముఁ బొందెను.

తరువాత హండెవంశము వారెవరును లేకుండఁ జంపవలసినదని టిప్పూ సుల్తానుఁడు ఆజ్ఞయిచ్చినందున, ఈవంశమువారి నందఱిని ఆతని యధికారులు ఉరితీసి అనంతపురము నందే చంపిరి. కాని సిద్దప్ప మాత్రము తప్పించుకొని పోయెను. అనుకూలకాలము వచ్చువఱకు నాతఁడు కాలహస్తి సంస్థానమునందు డాగియుండెను. టిప్పూ చనిపోయిన తరువాత నాతఁడు ౧౭౯౯ లో అనంతపురమును స్వాధీనపఱుచుకొనెను. ఈ భాగము శ్రీరంగపట్టణ యుద్ధానంతరమున నిజాముకు

నీయఁబడినందున సిద్దప్పవార్కి క్రంకితుఁడయ్యె. ఆ ప్రభుత్వము వారీతనికి సిద్దరామపురము జాగీరుగనిచ్చిరి. ఇంగ్లీషువారి స్వాధీనమైన తరువాత మన్రో ఈతనికి పెన్షన్ ఇప్పించెను. ఈతఁడు ౧౮౧౧ లో మరణము నొందెను. ఈతని వంశజులకు ౧౮౬౦ వఱకు ఈ యుపకారవేతనము ముట్టుచుండెను.

౧౮౦౦ లో దత్తమండలములు కంపెనీ వారి క్రిందికిరాఁగా, ఆ ప్రదేశమునంతకును మన్రో అనువానిని కలెక్టరుగా నియమించిరి. అతఁడు అనంతపురమునందే తనకచ్చేరియేర్ప అచుకొనెను. ౧౮౨౨ లో కలెక్టరు కచేరీ బళ్లారికి దీసికొనిపోయిరి. ౧౮౨౩ లో మరల ఆ కచ్చేరి అనంతపురమునకుఁదేఁబడెను. ౧౮౪౦ లో కలెక్టరు కచేరి బళ్లారికిమార్చి, అనంతపురములో సబ్ కలెక్టరు ఉండఁ జొచ్చెను. ౧౮౬౯ లో ఈకచ్చేరికూడగు త్తికిఁ బోయెను. ౧౮౮౨ లో అనంతపురము స్వతంత్రముగ జిల్లా ఆయెను. అప్పటి డిచ్చటికి మరల కలెక్టరు కచ్చేరి వచ్చెను.

ఈ గ్రామవిశేషములలో రాబర్ట్ సన్ స్క్వేయర్ ముఖ్యమైనది. దీనిచుట్టు ప్రక్కన డెప్యుటీ కలెక్టరుకచేరి, తహసీలుదారు కచేరి, సబ్ మ్యాజిస్ట్రేటుకచేరి, సబ్ రిజిస్ట్రారుకచేరి, మూఁడుపాఠశాలలును, మునిసిపల్ ఆస్పత్రి, మతి వేఱుమందిరములును గలవు. అనంతపురములో కలెక్టరుపనిచేసి ౧౮౫౮ లో నచ్చటనే మరణమొందిన రాబర్ట్ సన్ అనువానిపేర ఈచౌకము (Square) కట్టఁబడినది. అతఁడు బ్రతికియుండఁగనే ఈ చౌకమునుఏర్పఱచి నడుమనున్న కోటకందకమును పూడ్పించి, నడుమ మండపమును కట్టించి చుట్టునున్న చెట్లు తనచేతితో వేసెను. దీనికు త్తరమున ప్రాతకోటయుండెను. దాని బురుజుల శేషములును, కందకపు పల్లములును ఇప్పటికిఁ గానవచ్చును. ఈ ప్రాతకోటయుండిన ప్రదేశమునసే యిప్పుడు జుబిలీ పార్కనెడి ఉద్యానమున్నది. దీనికి నుద్యానమని పేరున్నను ఇది యిప్పుడు సంతకునుపయోగపడు స్థలముమాత్రమున్నది. గ్రామము చిన్నది, స్వచ్ఛముగ నుండును, మూఁడు నాలుగు మంచి వీధులు కలవు. (కో. ల.)

అనంతపురము (జిల్లా). చెన్నరాజధానిలోనియొక తెలుఁగు జిల్లా. దత్తమండలము లనఁబడు జిల్లాలకు నడమనుండును. దీనికుత్తరమునబళ్ళారికర్నూల్ జిల్లాలును, పడమరబళ్లారి జిల్లా, మైసూరు సంస్థానమును, దక్షిణమున మైసూరు సంస్థానమును, తూర్పున కడపజిల్లాయును కలవు. పూర్వము బళ్ళారిజిల్లాలోనే యనంతపురము కూడ కలిసియుండెను. ౧౮౮౨-వ సంవత్సరములో అనంతపురము జిల్లాను వేఱుచేసిరి. దీని వైశాల్యము ౬౭౧౮ చదరపుమైళ్ళు. ఇందు పూర్వమెనిమిది తాలూకాలే యుండెనుకాని ఇపుడు నూతనముగా కదిరియను తాలూకాను గలుపుట వలన తొమ్మిదయినవి.

అనంతపురము జిల్లా సమప్రదేశముకలది కాదు, ఉన్నతప్రదేశము. ఇది మైసూరు దేశమునకు సంబంధించిన ఉన్నత ప్రదేశము (Mysore plateau) యొక్క చివరభాగము.

నిమ్నోన్నతములు

దక్షిణమువైపు, ఉన్నతముగను, పోనుబోను ఉత్తరము వైపు పల్లముగను నుండును. దక్షిణము వైపుప్రదేశము, ౨౨౦౦ అడుగుల ఎత్తుననున్నది. పోనుబోను నుత్తరమువైపు తగ్గి గుత్తియొద్ద ౧౦౦౦ అడుగుల ఎత్తుగను, ఈశాన్యమున 'తాడిపత్రి' యొద్ద ౯౦౦ అడుగల ఎత్తుగను నుండును*. జిల్లాయొక్క తూర్పు భాగము కడపవైపు గుట్టలో నిండియున్నది. ఎఱ్ఱకొండలను గుట్టలు అటువైపు సరిహద్దునకు నుత్తరమున నుండును. ఈశాన్యభాగము కొంత పొడవయిన పర్వత కందరములతో నిండియున్నదైనను సమ ప్రదేశముగ నుండి ఫలవంతమైన రేగడి భూమిగానున్నది. ఈ భాగమును గుత్తితాలూకాలోని పశ్చిమ భాగమునుదప్ప జిల్లాయొక్క మిగిలినభాగమంతయు, మిట్టపల్లములగు ఎఱ్ఱమట్టి ప్రదేశమైనందున వ్యవసాయమున కనుకూలముగా లేదు. ఈజిల్లాలోనియున్ని తాలూకాలకంటె 'మడకసి' మిక్కిలి ఫలవంతమైనది. నీటి వసతియు నెక్కువగాఁ గలదు. తాడిపత్రి, తాలూకాలో 'ముచికోట' గుట్టలుకలవు. ఇతర భాగములలోనల్లని 'మంగలకత్తిరాయి' గుట్టలుగుట్టలుగా నున్నది. పాలసముద్రము, పెనుగొండవైపు, గుట్టలు విశేషముగాఁగలవు. ఈ గుట్టలలోఁ గొన్ని ౩౦౯౧ అడుగుల వఱకెత్తుండును.

కొండలు

ఈ జిల్లాలో మిక్కిలి యున్నతము లగు పర్వతములు లేవు. గుట్టలు మాత్రము ఉన్నవి. గుత్తితాలూకా యందు గుట్టలధికము. ౧౦౦౦ అడుగులు మొదలు ౩౦౦ అడుగుల వఱకు నెత్తుగల కొండలు ఈ జిల్లాలో ముప్పదికంటె నెక్కుడుగలవు. ఇందు ముఖ్యమయినవి మూఁడు కొండలు.

౧ ఈశ్వరమలై: ఇది కదిరి తాలూకాలో నున్నది. ౩౧౬౯ అడుగుల ఎత్తుకలది.

౨ మల్లప్పకొండ: ఇది పెనుగొండతాలూకా బుక్కపట్టణమునకు కొంచెము ఈశాన్యమూలగా మూఁడుమైళ్ళ మీఁద నున్నది. ౩౦౮౮ అడుగుల యెత్తుకలది.

౩ పెనుగొండ: పెనుగొండ గ్రామమునకు దక్షిణమున అరమైలుదూరమున నున్నది. ౩౦౮౮ అడుగుల యెత్తు. దీనిమీఁద ఖిల్లా యనఁబడు పురాతన కట్టడములును, శిలాశాసనములును బెక్కులుకలవు.

కనుమలు

పెదకొండలు గాక చిన్నచిన్న గుట్టలును కనుములును, ఈజిల్లాలోఁ బెక్కులు కలవు. నేలమట్టముమీఁద ౨౪ మొదలు ౧౭౦ అడు

* ఒకానొక ప్రదేశము వేయి అడుగుల ఎత్తుననున్నదియనఁగా నది సముద్రపు మట్టమునుండి అంత యెత్తున నున్నదని యర్థము.

గులవఱకు నెత్తుగనుండు గుట్టలు డెబ్బదికిఁ బైనికలవు. ఇవి రెండు-మైళ్లు మొదలు పదునెనిమిది మైళ్ళవఱకుఁ బొడువుండును. ఇవి యీ జిల్లాయొక్క యుత్తరభాగమున కంటె దక్షిణభాగమున నెక్కువగనున్నవి. ఇచ్చటి కనుమలలో ముచ్చుకోట 'కనుమ' ముఖ్యమైనది. ఇది అనంతపురము తాడిపత్రి తాలూకాల సరిహద్దులలో నున్నది. అనంతపురము నుండి యీశాన్యముగా బుక్కరాయి సముద్రము నాయినపల్లి మీఁదుగా తాడిపత్రికిఁ బోవు బండిబాట యీకనుమలలోనుండి పోవును. ఈకనుమపొడువు ఉత్తరదక్షిణముగ ౧౭ మైళ్లు, వెడల్పు ౫ మైళ్లు. ఇచ్చట దొంగలభయ మెక్కువగ నుండును. కల్యాణదుర్గము ధర్మవరము తాలూకాలలో జిన్న కనుమ లయిదారుకలవు. కదిరితాలూకాలో దోర్నాలకనుమ, బొంతలపల్లి కనుమ, తుమ్మలమల మున్నగు భయంకరములయిన కనుమలు కలవు.

వజ్రకరూరు అను గ్రామ సమీపమున భూమిపై భాగముననే యెప్పుడైనను వజ్రములు దొరకుచుండును.

గనులు

అవి యెచ్చటి నుండి పుట్టునో తెలియలేదు. ధర్మవరము తాలూకాలో రామగిరియొద్ద బంగారు గని యొకటి తొమ్మిది యేండ్లక్రింద మారిసన్ అను పాశ్చాత్త్యునిచేఁ గనిపెట్టఁబడియె. కాని యది లాభప్రదమైనదికాదు. ఇటీవల చెన్నబావి జబ్బట్లు, మధ్యజబ్బట్లు అనఁబడు మూఁడుగనులు కనిపెట్టఁబడినవి. వీని వలన లాభ మెక్కువగానున్నది. ఇండ్ల కుపయోగపడు రాళ్ళుఅచ్చట దొరకును. తాడిపత్రి తాలూకాలో నీరాయలచెరువు నొద్ద బలపపురాయి దొరకును. వానితో పాత్రలు చేయుదురు.

ఈ జిల్లాలోఁ బ్రవహించునదులలో పెన్న ముఖ్యమైనది. ఇది మైసూరు రాజ్యమునందుఁ బుట్టి హిందూపురము

నదులు

తాలూకాలోని వియగుచొలూరు, రోడాయను రెండుగ్రామములయొద్ద, రెండుపాయలుగా ఈ జిల్లాలో ప్రవేశించును. ఈశాఖలు రెండునుపరిగియను గ్రామమున నీశాన్యమున రెండుమైళ్ల దూరములోఁదిరిగి నొకటిగాఁజేరి రొద్దము, నూతిమడుగు గ్రామములమీఁదుఁగా సూటిగ నుత్తరముదిక్కు ౮౦ మైళ్ళు ప్రవహించి, ఉడిపి (పెన్నహోబిలము) యొద్ద సర్రున తూర్పునకుఁదిరిగి కొప్పలకొండ, పామిడి, బండెల్ల దిన్నె, చిన్నపొపూరు గ్రామములనంటి, రమారమి ౫౦ మైళ్ళు ప్రవహించి, వంగనూరు గ్రామమునకు నుత్తరమున నొక మైలుదూరములో కడపజిల్లాలోఁ బ్రవేశించును. ఈజిల్లాలో ఈనది ౧౩౦-౧౮౦ మైళ్ళు ప్రదేశమున పారును. పామిడి గ్రామమునకు దక్షిణముగాఁ బారెడు ఈనదికి నడుమ నొక శివాలయము-గోపురశోభితము-గట్టఁబడినది.

చిత్రావతి:-ఇది పెన్నకు నుపనది. మైసూరు రాజ్యమునఁబుట్టి ఆగ్నేయదిక్కున ఈజిల్లాలోఁ బ్రవేశించి, హిందూపురము, పెనుగొండ, ధర్మవరము, తాడిపత్రి తాలూకాలలోనుండి ౯౨ మైళ్ళు ప్రవహించి కడప జిల్లాలోఁ బ్రవేశించును.

మద్దిలేరు:-ఇది చిత్రావతికి నుపనది. కదిరి తాలుకాలోని నున్నంపల్లి మహమ్మదాబాదు గ్రామముల సమీపమునఁ బుట్టెడి చిన్నవాగు లొక్కటిగాఁజేరి యీ యేర గును. నున్నంపల్లెకు నీశాన్యముగ ౧౫ మైళ్లు ప్రవహించి యుత్తరముగఁదిరిగి, కదిరి ధర్మవరము తాలూకాల సరిహద్దులలో చిత్రావతిలోఁ జేరుచున్నది. ఈ యేరు మొత్తము మీఁద ౫౨ మైళ్ళు పొడవు.

చెరువులు

ఈ జిల్లాలో ౧౬౨ చెరువులు కలవు. వానిలో బుక్కపట్టణము చెరువు, ధర్మవరము చెరువు, సింగనమల చెరువు అనునవి ముఖ్యమైనవి. మొదటి రెండును చిత్రావతినదికి నడ్డకట్టవేసి నిర్మింపఁబడుటచే వానికి నీటివసతి విశేషముగ నుండును. ఈ రెండు చెరువులు మిక్కిలి పురాతనకాలమున దొడ్డవడియారు చిక్కవడియారు లనఁబడు ఇద్దఱు అన్నదమ్ములచే నిర్మింపఁబడినది.

వర్షములు

మొత్తముమీఁద నీజిల్లాలో వర్షములు తక్కువ. నైరృతి దిక్కునుండి వచ్చెడి (పడమటి) మేఘవాయువు (Monsoon) గాని, ఈశాన్యమునుండి వచ్చెడి (తూర్పు) మేఘవాయువుగాని ఈ ప్రాంతమునకు నెక్కుడుగ మేఘములను దీసికొని రాదు. అందుచే వర్షములు క్రమము తప్పకుండగాఁబడవు. నైరృతి వాయువు (పడమటిగాలి) తొలకరి వానలను జూన్ నెలలోనిచ్చి జూలై, ఆగస్టు, సెప్టెంబరు నెలవఱకు వర్షము గురిపించును. ఈశాన్యపు వాయువు (North-east monsoon) అక్టోబరులో మంచివర్షము నిచ్చును. కాని ఆ తర్వాత మరల మృగశిర (జూన్) వచ్చువఱకువర్షములుండవు. ముప్పదినాలుగేండ్లలో (౧౮౭౦-౧౯౦౩) గురిసిన వాన లెక్కవేసి యావరేజి(సరాసరి)చూడగాసంవత్సరమునకు ఈజిల్లాలో ౨౩ అడుగుల (దుక్కుల) వర్షము కురియునని తేలినది. ఇంత తక్కువ వర్షము చెన్నరాజధానిలోనిమఱియే జిల్లాలోను కురియదు. సెప్టెంబరు అక్టోబరు నెలలలో నెక్కువ వర్షము కురియును. ౧౮౫౧ లోను ౧౮౮౯ లోను పెద్ద తుపానులువచ్చి, చెరువులకు, పంటలకు నష్టము కలుగఁజేసినవి.

ఎండలు

చెన్నరాజధానిలోని యితర జిల్లాలకంటె నీజిల్లాలో నెండలు మెండని చెప్పవలెను. అందుచేతనే యిది మిక్కిలి ఆరోగ్యకరమైన జిల్లాకూడనైనదని చెప్పవచ్చును. ఎండకాలము మార్చిలోఁ బ్రారంభించును; మృగశిరాప్రవేశముతో జూన్‌లో నెండలు తగ్గును.

అప్పుడచ్చట కాలమానస్థితి యితర పెక్కు జిల్లాలకంటె మనోహరముగ నుండును. జిల్లాలోని యుత్తరము వైపుభాగమునకంటె దక్షిణపు వైపుభాగము ఎక్కుడు చల్లగనుండును.

ఈ జిల్లాలో ౫౧౬ చదరపుమైళ్ళ యరణ్యముకలదు. బళ్లారి, కడపలోని పశ్చిమ తాలూకాలవలెనే యిచ్చటియరణ్యములలోఁగూడ పెద్దచెట్లు పెరుగవు. ముచుకొండ రేంజిలోను ఉత్తరపువైపు కొండలలోను పెనుకొండ హిందూపురము తాలూకాలలోను రిజర్వుఅరణ్యముకలదు. ఈ యరణ్యములలో కొద్దిగా వెదురు, టేకు పెరుగును. ఏపెచెట్లువిశేషముగ నభివృద్ధిచెందును. అనంతపురమునందు డిస్ట్రిక్టు ఫారెస్టు కచేరి కలదు. తాడిపత్రి, పామిడి, బుక్కపట్నము, మడకశిర, కల్యాణ దుర్గము, ఈ తావులలో రేంజి ఆఫీసరులుందురు.

అడవులు

ఈ జిల్లామొదట ఏడు తాలూకాలుగా విభజింపఁబడియుండెను. ఈమధ్య ధర్మవరము తాలూకా రెండుగా విభజింపఁబడుటచేతను, కడపజిల్లాలోని కదిరి తాలూకా క్రొత్తగా నిందుఁ జేరుటవలనను, ఇప్పుడిందు తొమ్మిది తాలూకాలుగలవు. ఈ తొమ్మిది తాలూకాలును నాలుగు సబ్ డివిజనులుగా నేర్పర్పఁబడినవి:—

విభాగములు

సబ్ డివిజన్	తాలూకాలు
౧. గుత్తి	౧. గుత్తి. ౨. తాడిపత్రి.
౨. అనంతపురము	౩. అనంతపురము. ౪. కల్యాణదుర్గము.
౩. ధర్మవరము	౫. ధర్మవరము. ౬. కదిరి.
౪. పెనుకొండ	౭. పెనుగొండ. ౮. హిందూపురము ౯. మడకశిర

కలెక్టరు జిల్లా అధికారిగానుండును. సబ్ డివిజనుకు అధికారిగా, సీమలో సివిల్ సర్వీస్ ప్యాసైన వాఁడుగాని, డిప్యూటీ కలెక్టరుగాని ఉందురు. తాలూకాకు నొక తహసీలు దారుఁడుండఁగా గుత్తి, తాడిపత్రి, అనంతపురము, పెనుగొండ, ఈ నాలుగు తావుల నొక్కొక్క సబ్ మ్యాజిస్ట్రేటును, యాడికి, ఉర్వకొండను చోట్ల డిప్యూటీ తహసీలుదారులును ఉన్నారు. రిజిస్ట్రేషన్, ఆబ్ కారి, పబ్లిక్ వర్క్సు (ఇంజనీరింగు) విషయమై యీ జిల్లా బళ్లారి జిల్లాలోనిదిగనే యెంచఁబడును.

ప్రభుత్వము

సివిల్ వ్యాజ్యెములు పరిష్కరించుటకై గుత్తిలోను పెనుకొండలోను మునసబ్ కోర్టులు కలవు. ఈజిల్లాకు వేఱుగ జిల్లాకోర్టులేదు. గుత్తి మునసబ్ కోర్టు మీఁద కడప జిల్లాకోర్టునకును, పెనుగొండ మునసబ్ కోర్టు మీఁద బళ్లారి జిల్లా కోర్టునకును అపీళ్లు ఉండును. సెషన్ కేసులు బళ్లారి సెషన్ కోర్టు ఎదుట

విచారింపఁబడును. గుత్తి, తాడిపత్రి తాలూకాలలోని గ్రామాదులలో కక్షలు(పార్టీలు) ఎక్కువుగ నున్నందున ఛోరీ, బందిపోటు, ఖూనీ నేరము లంత అరుదుకావు. పెనుగొండ తాలూకాలోని పూర్వభాగమునందు నేరములు చేయువారు కలరు. మొత్తముమీఁద నీ జిల్లాలో నేరమంత యధికమని చెప్పుటకు వీలులేదు. చెన్నరాజధానిలో కోర్టుల యెదటికి వచ్చెడికి్రమినల్ కేసులలో నూటికి ౨౧ మాత్రి మీజిల్లానుండి వచ్చును. కొరచలు, ఎరుకలవాండ్రు, ఒడ్డెలు అనుజాతివారు ముఖ్యముగా నేరములను చేయుచుందురు.

పోలీసు డిస్ట్రిక్టుసూపరింటెండెంటు అనంతపురములో నుండును. జిల్లాలో మొత్తము మీద ౪౧ పోలీసు స్టేషనులను, ౫ ఔటు పోస్టులుకలవు. ౬౪ గురు ఆఫీసర్లును, ౮౭౪ గురు బంట్రోతులును, ఈజిల్లా సంరక్షణ నిమిత్తమై యేర్పాటు చేయఁబడినారు. ఆఫీసర్లలో ౯ మంది ఇన్‌స్పెక్టర్లును, ౫౧ మంది సబ్ ఇన్‌స్పెక్టర్లును కలరు. ఈ జిల్లాలో ౧౦౨౭ మందికి నొక పోలీసు జవానుచొప్పున నున్నారు. ఈ జిల్లాలో జైలులేదు. ఇచ్చటి ఖైదీలను బళ్ళారి జైలుకుఁబంపెదరు. ప్రతి తాలూకాకు నొక సబ్‌జైలుకలదు. అన్నటిలోను కలిసి ౧౧౪ ఖైదీలకంటె నెక్కుడుండఁజాలరు.

తెలుఁగుదేశమునందలి యితర జిల్లాలలోఁగాన్పించినట్లు, ఈ జిల్లాలోఁగూడ మిక్కిలి పురాతన కాలమునాటివి యని చెప్పఁదగు రాతితో చుట్టు

జిల్లా చరిత్రము

నమర్పఁబడిన దిబ్బలు విశేషము కలవు. కల్యాణదుర్గము తాలూకాలోని ముదిగల్లు, దేవతులబెట్ట, అనంతపురము తాలూకాలోని మాల్యవంతము, హిందుపురము తాలూకాలోని కొండాపురము, పూలేకు అను గ్రామములయొద్ద నిట్టివి పెక్కులుకలవు.

గుహాలలోఁ గాపురముండెడు మిక్కిలి పురాతనకాలపు వారిచే గుట్టలలో తొల్వఁబడిన తావులుకూడ గుత్తి తాలూకాలో ననేకములు కలవు. కొండలలో మొదట లోయలుచేసి, ప్రక్క భాగములను నునుపుచేయవలయునన్న యుద్దేశముతో, గుంపులు గుంపులుగ జనముకూర్చుండి వానిని అరగఁదీయుచుండిరని యూహించుటకుఁ దగిన నిదర్శనములున్నవి. ఇవన్నియుఁ జరిత్రకాలమునకుఁ బూర్వపు సంగతులు. అప్పటి జనులెవరో కనుఁగొనుటకు సాధనములు లేవు. వీరియాయుధము లన్నియు శిలామయములు. వీరు శిలాయుగమువారని చెప్పవచ్చును.

ఈ కాలము తరువాత చరిత్రకాలము వఱకు నీ ప్రదేశమును గుఱించిన చరిత్రమేమియుఁదెలియదు. ఏడవ శతాబ్దమందలి యొక శాసనము మడకశిర తాలూకాలోని రత్నగిరియను గ్రామము 'నలవాది విషయము'లోనిదియని చెప్పుచున్నది.*ఇదిచాళుక్య

* 1. Bombay gazetteer - i. Pt. II. 363.

విక్రమాదిత్యునిచే (శ్రీ. శ. ౬౫౫-౬౮౦). వేయఁబడిన శాసనము. కావున నాకాల మందు నీదేశము ఆరాజుచేఁ బాలింపఁబడు చుండెనని మన మూహింప వచ్చును. ఈ చాళుక్యులు 'నలు' లను, అనఁగా ఆదేశపు రాజులను సంహరించిరని యీ శాసనము వలననే తెలియుచున్నది.

మడకశిర తాలూకాలోని హేమావతి లోఁ బెక్కు పురాతన శాసనము లున్నవి. వీనిలో గొన్నిఁటిని బట్టి చూడ ౮-వ శతాబ్దము మొదలు ౧౦-వ శతాబ్దము వఱకు 'నొలంబ వాదిద్వాత్రింశత్ సహస్ర' మనఁబడు దేశముగ నుండెననియు, నచ్చట నొలంబులను వారు రాజ్యము చేయుచుండిరనియుఁ దెలియుచున్నది. ద్వాత్రింశత్ సహస్ర విషయమనఁగా ముప్పది రెండు వేల గ్రామములు గల జిల్లా యని అర్థము. గుత్తి కూడ నొలంబ వాది దేశములోనిదే. నొలంబులు పల్లవశాఖలోనివారు. రాష్ట్రకూటులకు లోఁబడినవారు. ౮-వ శతాబ్దము మొదలు ౧౦-వ శతాబ్దము వఱకు రాజ్యమేలిరి. వీరిని గాంగులును, గాంగులను చోళులును జయించిరి. చోళులలోని వాఁడగు మొదటి రాజరాజు (౯౮౫ లో రాజ్యమునకు వచ్చినవాఁడు) నొలంబ వాదిని గెల్చినట్లు వ్రాసికొనియెను. కులోత్తుంగ చోళదేవుని శాసనము కూడ నొకటి హేమావతిలోఁ గలదు.

తరువాత పశ్చిమ చాళుక్యులు ఈ ప్రాంతమునకు రాజులయినట్టున్నారు. ఆఱవ విక్రమాదిత్యుని (౧౦౭౬-౧౧౨౬) శాసనములు గుత్తి దుర్గముమీఁదనున్నవి. చాళుక్యులను హొయసలబల్లాలులును, వారిని దేవగిరి యాదవులును గెలిచిరి. రెండవ వీరబళ్ళాలుని (౧౧౯౧-౧౨౧౨) శాసన మొకటి హేమావతిలో నున్నది. మైసూరు రాజ్యమందలి హరిహర గ్రామమున నున్న యొక శాసనములో ఈ రాజు గుత్తిని పట్టుకొనినట్టున్నది. దేవగిరిసింగణ రాజు (౧౨౧౦-౧౨౪౭) గుత్తిని స్వాధీన పరచుకొన్నట్టు కానవచ్చెడిని.*

పదునాల్గవ శతాబ్దమధ్యమున నిది విజయనగరరాజ్యమునందుఁ గలిసియుండెను. పెనుగొండ గుత్తిదుర్గములు విజయనగరరాజుల యాక్రమణలోనుండుటయేగాక, యవి శత్రుదుర్జయములని ఖ్యాతివడసియుండెను. ౧౫౬౫ లో జరిగిన తాలికోట పరాజయమునకుఁ దరువాత సదాశివరాయడును తిరుమలరాయడును విజయనగరమును విడిచి పెనుగొండ దుర్గముమీఁదికి తన రాజధానిని మార్చిరి. దానిమీఁదికి దండెత్తివచ్చిన తురుష్కులనెన్నియో పర్యాయములు పరాభవించిరి. వసుచరిత్రములోని యీక్రిందిపద్య మాంధ్రులెఱింగినదియే :-

చ. తిరుమలరాయశేఖరుని ధీరచమూభటరాజియాజి భీ
కరయవనేశ్వరప్రహితఖానబలంబులఁజక్కసేయని
ర్ధరపెనుగొండకొండలు మదద్విపచర్మకపాలమాలికా
పరికరభూషితంబులై బల్విడిఁగాన్చె గిరీశభావముల్.

* 1 Bombay Gazetteer. i. Pt II. 505.

బలహీనులయిన విజయనగరము రాజులు తరువాతఁ గొంతకాలమునకుఁ దమ రాజధానిని పెనుగొండనుండి చంద్రగిరికిమార్చిరి. గుత్తియుఁ గాలక్రమమున తురుష్కుల స్వాధీనమయ్యెను. వారియొద్దనుండి మురార్‌రావను మహారాష్ట్రవీరుఁడు గుత్తిని స్వాధీనపఱచుకొనెను. ఈకాలమునందు దేశమంతయు నరాజకమై, యొక్కరాజులేక, యెవరి కెంతభాగము చిక్కిన వారంత భాగమునకు నధిపతులగుచు, పెక్కుపాళెగారులు దేశమును ఏలుచుండిరి. ఏలుచుండి రనుటకంటె దోచుకొనుచుండిరనుట మేలు. ఇట్టి వారిలో అనంతపురము హండెవారు కొంత ప్రముఖులుగ నుండిరి. ఈ పాళెగార్లు వీలయినప్పుడు స్వతంత్రులయి వీలుకానప్పుడు పైవారికి లోఁబడి మెలగుచుండిరి. హైదరల్లీ ప్రబలుఁడైనపుడు ఈ భాగమును సులభముగ స్వాధీనపఱచుకొనెను. ఒక్క గుత్తిదుర్గము మాత్రము చాలకాలము వశముకాలేదు. చివరకు కోటలోఁ ద్రాగుటకు నీరులేనందున ౧౭౭౫లో వశమయ్యెను.

మహారాష్ట్రులు, నైజాము, ఇంగ్లీషువారు కలిసి ౧౭౯౨లో టిప్పూసుల్తానును ఓడించినపుడు, ఇప్పటి అనంతపురము జిల్లాయొక్క ఈశాన్యభాగమైన యప్పటి తాడిపత్రి, తాడమఱ్ఱితాలూకాలు నైజామున కీయఁబడెను. టిప్పు చనిపోయిన తరువాత ౧౭౯౯ లో ఆతని రాజ్యమును ఇంగ్లీషు నైజాము మొదలగువారు పంచుకొనునపుడు, ఈజిల్లాయొక్క మిగిలిన భాగమంతయు నైజామునకుఁబోయెను. ఈ రెండుతహనామాల (treaties) ననుసరించి నైజామునకు వచ్చిన రాజ్యమంతయు, నతఁడు ౧౮౦౦ లో నింగ్లీషువారికి దత్తముచేసెను. అవియేదత్తమండలములు(Ceded districts). నైజాము సంరక్షణ నిమిత్తమై యింగ్లీషు వారుంచవలసిన సైన్యము కర్చుక్రింద ఈమండలములు శాశ్వతముగ నింగ్లీషువారి కీయఁబడెను. అప్పు డనంతపురముగూడ బ్రిటిషు ప్రభుత్వమునఁ జేరెను.

మొదట దత్తమండలముల కన్నిటికి నొక్కఁడె కలెక్టరుండెను. మొదటి కలెక్టరు మేజర్ మన్రో (ఇతఁడే తరువాత సర్ పదవిని బొందెను). తరువాత దత్తమండలము రెండు జిల్లాలుగ విభజింపఁబడెను. అందు బళ్లారి జిల్లాలో నిప్పటి అనంతపురముండెను. బళ్లారి జిల్లా పెద్దది అయినందున ౧౮౮౨ లో దానిని రెండు జిల్లాలుగ విభజించి, ఒకదానికి బళ్లారి అనియు, రెండవ దానికి అనంతపురమనియు పేర్లు పెట్టిరి. కదిరితాలూకా యిటీవల-కడపజిల్లాలోనిది -ఇందుఁ జేర్చఁబడినది.

ఈ జిల్లాలోఁ బురాతన చరిత్రసూచకములు గుత్తి పెనుగొండకోటలు. తాడిపత్రి యొద్ద పెన్నయొడ్డుననున్న దేవాలయము, లేపాక్షి హేమావతి దేవాలయములు, చెక్కడముపనులచే సుశోభితములు. పల్లవులకాలమునాటి శాసనములు, హేమావతి దేవా

లయములోనున్నవి. ఈ జిల్లాలోని శాసనములలో నివి మిక్కిలి పురాతనములు.

కళలు, విద్యలు, వర్తకము

ఈ జిల్లాలో నూలుబట్టలు, పట్టుబట్టలు నేయుదురు. సాధారణముగ రైతులు కట్టుకొను ముతకబట్టలును స్త్రీలు కట్టుకొనురంగు చీరెలు ఎక్కువగ నేయఁబడును. పట్టునేత ముఖ్యముగ తాడిపత్రి, ధర్మవరము, ఉరవకొండ యను స్థలములందు జరుగును. పామిడి, గుట్టూరు అను గ్రామములలో చేతితో నద్దఁబడిన చీటీబట్టలు, కలంకారియద్దకపుదుప్పట్లు మొదలయినవి తయారు చేయఁబడును. ఇట్టి సరకు లెక్కువగ రంగూనుకెగుమతియగును. కల్యాణదుర్గ, మడకశిరతాలూకాలలో ఉన్ని కంబళ్లు నేయఁబడును.

తిమ్మన్‌చెర్ల, గుంటకల్, తాడిపత్రి యీ మూఁడుచోట్లను ప్రత్తి యేకి మూటలుకట్టు, ప్రత్తి ఫ్యాక్టరీలు కలవు. ఇవి చాలకాలము నుండి యున్నవి. వీనిలో ఆవిరితోఁ పనిచేయఁబడును. ధర్మవరము తాలూకాలోని న్యామద్దల గ్రామమునందు ముతకకాగితము చేయుదురు. క్షారమయమైన మట్టితోఁ బూర్వమీ జిల్లాలో గాజులు చేయుచుండిరి. కాని యిప్పుడావృత్తి చచ్చిపోయినది.

ఉత్తరపు తాలూకాలనుండి ప్రత్తియు, దక్షిణమునుండి బియ్యము, బెల్లము, తంగెడుచెక్క యెగుమతులగును. ఉప్పు, పరదేశపుబట్టలు, పరదేశపునూలు, పశువులు ఈ జిల్లాకు దిగుమతియగును. వర్తకమునకు హిందూపురము ముఖ్యస్థలముగ నుండెను. కాని యిటీవల ప్లేగువలన నచ్చటి వర్తకము తగ్గినది. వారము వారము చేరెడి సంతలవలన నీ జిల్లాలోని యంతరంగవర్తకము జరుగుచుండును. ఈ సంతలు లోకల్‌బోర్డువారి అధీనమందుండును. ముఖ్యమైన సంతలు హిందుపురము, తాడిపత్రి, యాడికి అను స్థలముల జరుగును.

బాటలు, రోడ్లు

ఈ జిల్లాలో బండిబాటలు, రోడ్లు పలయునన్ని కలవని చెప్పవచ్చును. కంకరు వేయఁబడిన పక్కారోడ్లు ౨౫౧ మైళ్లును, సాధారణపురోడ్లు ౫౦౮ మైళ్లును వ్యాపించి యున్నవి. బెంగుళూరునుండి సికింద్రాబాదుకు బోవురోడ్డు ముఖ్యమైనది. ఇది దక్షిణదిక్కున కొడికొండయొద్ద అనంతపురము జిల్లాలోనికిఁ బ్రవేశించి, ఉత్తర దిక్కుగఁబోయి గుత్తియొద్ద జిల్లా వెలువడును. ఇవిగాక జిల్లాలో నొకచోటినుండి మఱియొక చోటికిఁ బోవుటకు పెక్కుబాటలు కలవు. రైలుమార్గము లేని తాలూకాలలో నీబాటలను జనులు విశేషముగ నుపయోగించెదరు. జిల్లా బీదదియైనందున లోకల్‌బోర్డు వారికి నెక్కువ ఆదాయములేదు. అందుచే బాటల మరమ్మతు వివేషముగ జరుగదు.

ఈ జిల్లాకు రైలు సౌకర్య మెక్కువగా నున్నది. చెన్నపట్టణమునుండి వాడికిఁబోవు

రైలు, ఈశాన్యపుదిక్కుగా, నీజిల్లాలోఁ బ్రవేశించి గుత్తి తాలూకా

రైలుమార్గము

లోని గుంతకల్ జంక్షన్‌కు జేరును. అచ్చటినుండి నైజాము రాజ్యమందలి రాయచూరుకుఁ బోవును. ఈ రైలు ౧౮౬౮-౧౮౭౦ సంవత్సరముల మధ్యకాలమునఁ బ్రారంభింపఁబడినది. గుంటకల్లునుండి సదరన్ మరాఠా రైలు (ఇప్పుడు ఎమ్. ఎస్. ఎం.ఆర్) మూఁడుశాఖలుగ మూఁడుచోట్లకుఁ బోవును. ఒకటి బళ్లారికి, ఒకటి బెజవాడకు, ఒకటి బెంగుళూరునకు. బెంగళూరుకుఁబోవు రైలుత్రోవ ఉత్తరమునుండి దక్షిణమువఱకు జిల్లాపొడుగున నున్నదని చెప్పవచ్చును. మఱియొకశాఖ గుంతకల్లునుండి గదక్‌కుఁ బోవుచున్నది.

ఈ జిల్లాలో ౧౮౯౧ జనాభాలెక్క ప్రకారము ౮౬౨౬౪౦ జనమును, ౧౯౦౧-వ సంవత్సరపుజనాభా లెక్క

జనసంఖ్య

ప్రకారము ౯౩౩౭౫౭ మంది జనమును, ౧౯౧౧-వ సంవత్సరపు లెక్క ప్రకారము ౯౬౩౨౨౩ జనమును ఉండిరి. అనఁగానీపదిసంవత్సరములలో నూటికి ౩.౨ చొప్పున జనము వృద్ధియైనది. ౧౯౦౧-వ సంవత్సరమునకుఁ బూర్వపు పది సంవత్సరములలో (౧౮౯౧-౧౯౦౧) నూటికి౮.౨ చొప్పున జనమువృద్ధియై యుండెను. ౧౯౧౧-వ జనాభాసమయమున ౪౯౪౨౩౨ మగవాండ్రును ౪౬౮౯౯౧ ఆడువాండ్రునుఉండిరి. తాలుకాల ప్రకారముజనసంఖ్య ఈక్రిందనీయఁబడినది.

౧ అనంతపురము	౧౦౬౧౩౧
౨ ధర్మవరము	౮౯౮౪౮
౩ గుత్తి	౧౪౯౧౩౯
౪ హిందూపురము	౯౭౩౧౪
౫ కదిరి	౧౪౭౪౦౨
౬ కల్యాణదుర్గము	౮౩౧౩౫
౭ మడకశిర	౮౨౧౨౧
౮ పెనుగొండ	౯౩౮౬౦
౯ తాడిపత్రి	౧౧౪౨౭౩
మొత్తము	౯౬౩౨౨౩

తాలూకా వారిగా విస్తీర్ణము:—

	చదరపుమైళ్లు,
౧ అనంతపురము	౯౨౫
౨ ధర్మవరము	౭౩౨
౩ గుత్తి	౮౯౬
౪ హిందూపురము	౪౨౮
౫ కదిరి	౧౧౫౮
౬ కల్యాణదుర్గము	౮౧౭
౭ మడకశిర	౪౪౩
౮ పెనుగొండ	౬౭౮
౯ తాడిపత్రి	౬౪౧
మొత్తము	౬౭౧౮

పల్లెలు, పట్టణములు, ఇండ్లు;-

	పట్టణము,	పల్లెలు.	ఇండ్లు
౧ అనంతపురము	౧	౧౦౯	౨౧౦౦౭
౨ ధర్మవరము	౧	౬౨	౧౭౮౧౨
౩ గుత్తి	౩	౧౩౦	౨౭౫౧౯
౪ హిందూపురము	౧	౭౭	౧౯౬౬౯
౫ కదిరి	౧	౧౩౯	౩౦౬౬౨
౬ కల్యాణదుర్గము	౧	౭౨	౧౫౨౭౨
౭ మడకశిర	౧	౫౭	౧౬౪౫౮

౮ పెనుగొండ	౨	౯౪	౧౯౭౧౧
౯ తాడిపత్రి	౨	౯౩	౨౧౯౫౮
	౧౩	౮౩౩	౧౯౦౦౬౮

ఒక చదరపుమైలుకు జన సంఖ్య:—

౧ అనంతపురము	౧౧౫
౨ ధర్మవరము	౧౨౩
౩ గుత్తి	౧౬౬
౪ హిందూపురము	౨౨౭
౫ కదిరి	౧౨౭
౬ కల్యాణదుర్గము	౧౦౨
౭ మడకశిర	౧౮౫
౮ పెనుకొండ	౧౩౮
౯ తాడిపత్రి	౧౭౮
జిల్లామీఁద సరాసరినొక చదరపుమైలుకు	౧౪౩

ఈ జిల్లాలో, నెక్కుడు జనసంఖ్యగల పట్టణములు లేవు. అనంతపుర పట్టణమందు ౮౪౫౭ (౧౯౧౧) జనులు గలరు. జనులలో ౧౦౦ మందికి ౯౧ రు హిందువులుగను, ౮ మంది తురకలుగను ఉందురు. మతముల ననుసరించి జనసంఖ్య యీ క్రింద ఈయఁబడినది.

హిందువులు	౮౭౬౪౭౧
మహమ్మదీయులు	౮౦౦౪౮
ఆనిమష్టులు	౨౫౯౯
కిరస్తానులు	౩౬౩౬
జైనులు	౪౩౬
బౌద్ధులు	౨
పారసీవారు	౨౨
యహూదులు (జ్యూ)	౯
మొత్తము	౯౬౩౨౨౩

ఈ జిల్లాలో ముఖ్యమైనది తెలుఁగుభాష. నూటికి నెనుబదిమంది కంటె నెక్కువగాఁ దెనుఁగు మాట్లాడువారుందురు. కన్నడ దేశమును తగిలియున్న భాగమందు కన్నడము కొంచె మధికముగనుండును. కన్నడము మాట్లాడువారునూటికి ౧౦ కంటె నెక్కుడుండరు. ఈజిల్లాలోని జనులను భాషననుసరించి యిట్లు విభజింపవచ్చును.

తెలుఁగువారు	౭౮౨౩౩౨
కన్నడము వారు	౯౧౮౦౪
హిందూస్థాని మాట్లాడువారు	౫౯౬౨౩
లంబాడీలు	౧౨౦౫౭
మరాటీలు	౭౨౩౮
ఎరుకలభాష	౩౮౪౯

జనులయొక్క జాతి ననుసరించి యీ క్రిందఁ జన సంఖ్య యీయఁబడినది. అందు ముఖ్యమైన జాతులు మాత్రము ఉదాహరింపఁబడినవి. ఈక్రింది పట్టికను బట్టి చూచినయెడల నందఱి కంటెఁ దెనుఁగుకాపువారి సంఖ్య యెక్కువగ నున్నట్లు కానవచ్చును. కాపువారనఁగా వ్యవసాయమే జీవనముగఁ గల రెడ్డి వారని యర్థము. సంఖ్యలో రెండవ నెంబరు మాదిగ వాండ్రది. కన్నడ వారిలో కురబ జాతివారి సంఖ్య యితరుల కంటె నధికముగ నున్నది. కురబలు మేకల మందలఁ గాయుదురు, బొచ్చు గొంగళ్లు నేయుదురు. ౧౯౧౧-వ సంవత్సరపు జనాభాసమయమున ఈజిల్లాలో౧౮౯౦౦౦బోయిజాతివాండ్రున్నట్టు చూపఁబడినది. ౧౯౦౧ లో వాండ్ర సంఖ్య

౬౧౮౪౯. పది సంవత్సరములలో బోయిల సంఖ్య యంత తగ్గుటకుఁ గారణ మేమో సెన్సస్ రిపోర్టు వారెచ్చటను చర్చించి యుండలేదు. బ్రాహ్మణులు ౧౭౬౬౩మాత్ర మున్నారు.

జాతివారి జనసంఖ్య:

తెలుఁగువారు

ఈడిగ	౯౭౪౩
ఉప్పర	౧౨౯౬౦
ఒడ్డె	౩౮౧౫౪
కమ్మ	౪౩౦౫౬
కాపు	౧౪౩౯౧౦
కుమ్మర	౭౧౯౨
కోమటి	౨౩౭౪౬
కంసాల	౯౨౯౫
గొల్ల	౫౨౧౩౩
చాకలి	౧౯౭౫౫
దేవాంగ	౭౫౧౮
బలిజ	౫౯౩౮౯
శెట్టి	౮౪౭౩
బోయి	౬౧౮౪౯
బ్రాహ్మణ	౧౧౬౯౨
మాదిగ	౧౦౨౪౪౨
మాల	౨౫౭౧౧
మంగల	౧౩౦౯౮
సాతె	౧౧౪౮౧

కన్నడవారు

కురబ	౬౧౨౭౧
లింగాయత	౧౦౬౭౫
బ్రాహ్మణ	౫౯౭౧

ఈ జిల్లా విద్యా విషయమై మిక్కిలి శోచనీయ స్థితిలోనున్నది. ౧౯౦౧-వ సంవత్సరము నందిందు నూటికి ౪ గురు చదివిన వారుండిరి. ౧౯౧౧ లో నూటికి ౪.౬ గురు చదివినవారయినారు.

విద్యాభివృద్ధి

ఇట్లు చదివిన వారిసంఖ్య కొంచెము హెచ్చినను మొత్తము మీఁద సమాధాన కరముగ లేదు. ఇంగ్లండు మొదలయిన దేశములలో చదివిన వారు నూటికి ౯౦ - ౯౯ మందియుందురు! ఈ జిల్లా జనసంఖ్య ౯౬౩౨౨౩; అందులో ౪౫౬౨౬ మందిచదువుకొన్న వారు. వీరిలో ౪౩౧౩౫ మంది పురుషులు; ౨౪౯౧ మంది స్త్రీలు. వీరుచదువుకొన్న వారనఁగా విద్వాంసులని యర్థముకాదు. ఇందు ఓనమాలు వచ్చినవారుకూడఁ జేర్చఁబడినారు. చదువుకొన్న వారనఁగా సాక్షరులు. వీరిలో ౨౬౯౦ పురుషులును ౨౪౬ స్త్రీలును ఇంగ్లీషు చదివినవారు.

చదువుకొన్న వారి వివరము

	పురుషులు	స్త్రీలు	మొత్తము
హిందువులు	౩౭౨౫౭	౧౮౪౨	౩౯౦౯౯
ముసల్మానులు	౪౯౦౩	౨౫౯	౫౧౬౨
క్రైస్తవులు	౭౭౨	౩౮౩	౧౧౫౫
ఇతరులు	౨౦౩	౭	౨౧౦
	౪౩౧౩౫	౨౪౯౧	౪౫౬౨౬

(తాలూకువారి) విద్య

అనంతపురము	౪౨౭౪
ధర్మవరము	౩౮౮౨
గుత్తి	౮౫౬౨
హిందూపురము	౪౭౭౭

కదిరి	౫౩౦౭
కల్యాణదుర్గము	౩౫౧౨
మడకశిర	౩౮౯౨
పెనుగొండ	౪౧౯౨
తాడిపత్రి	౭౨౯౧
	౪౫౬౨౬

తాలూకాలలో గుత్తియందుఁ గొంచెము విద్యాభివృద్ధి యెక్కువగ నున్నదని చెప్పవలెను. కల్యాణదుర్గమన్నిటి కంటె వెనుకఁబడియున్నది.

౧౯౧౫-వ సంవత్సరమునందు ఈజిల్లాలో ౮౩౯ పాఠశాలలుండెను. వానిలో ౨౫౮౫౭ మంది విద్యార్థులు చదువుచుండిరి. ఈ పాఠశాలలలో మగపిల్లల కొఱకు ప్రాథమిక (Elementary) పాఠశాలలు ౭౬౮, రెండవతరగతి (Secondary) పాఠశాలలు ౪, ఆడపిల్లల కొఱకు ప్రాథమిక పాఠశాలలు ౭౦, యూరోపియనులకొఱకు ౩, బోధనాభ్యాసపాఠశాలలు ౪ ఉండెను.

విద్యార్థుల వివరము.

(i) హైందవులు	
౧ మగవారు (ప్రాథమిక పాఠశాలలలో)	౨౨౭౮౬
రెండవతరగతి పాఠశాలలో	౮౧౪
౨ ఆడవారు (ప్రాథమిక పాఠశాలలలో)	౨౦౪౩
(ii) యూరోపియనులు	౧౦౪
(iii) బోధనాభ్యాసశాలలలో	౧౧౦
	౨౫౮౫౭

పైని ఉదాహరించిన యంకెలలో హైందవుల క్రింద మహమ్మదీయ విద్యార్థులు ౩౬౫౯ మంది మగపిల్లవాండ్రును, ౯౮౦ మంది ఆడుపిల్లలును ఉన్నారు. ఈజిల్లాలో హిందువులకంటెఁ దురుష్కబాలులే యెక్కువగఁ జదువుకొనుచున్నారన్ని చెప్పవలెను. చదువుకొనఁ దగినయీడుగల పిల్లవాండ్ర సంఖ్యలోనుండి నూటికి ౫౯ కంటె నెక్కుడు మహమ్మదీయ బాలకులు చదువుకొనుచుండుటమిక్కిలిసంతోషకరమైనవిషయము. ౧౯౧౧-వ సంవత్సరము జనాభాలెక్క ననుసరించి చూడఁగా ఈ జిల్లాయందు ౧౦౦౦౦ జనులలో చదువుకొన్న హిందూపురుషులు ౮౨౯, హిందూస్త్రీలు ౪౩, మహమ్మదీయ పురుషులు ౯౩౯, మహమ్మదీయ స్త్రీలు ౬౭, క్రైస్తవ పురుషులు ౩౯౮౭, క్రైస్తవ స్త్రీలు ౨౨౫౨!

౧౯౧౬-వ సంవత్సరపు జులై నెలనుండి దొరతనమువారు అనంత పురమునందు రెండవ తరగతికాలేజి పెట్టించినారు. ఇది క్రమ క్రమముగ మొదటి తరగతి కాలేజిగా మార్చఁబడును.

వ్యవసాయము

జిల్లాయొక్క యుత్తర భాగమునందుఁ దప్ప మిగిలిన భాగము నందంతటను భూమి మిక్కిలి బీదది, ఫలవంతముకాదు. ఉత్తర తాలూకాలలోని రేగడి భూమియు నంత శ్రేష్ఠమైనదికాదు. ఈ జిల్లాలో పెద్దఆనకట్టలు గాని, ఏటికాల్వలుగాని లేవు. అందుచేత మాగాణి పైర్లు, తోటపైర్లు చెరువు లాధారమునను, బావు లాధారముననను చేయు

దురు: ఈ జిల్లాలో నిరువది వేలవఱకు బావులు గలవు. మిక్కిలి బెట్టకాలములో బావు లంతఁగా నుపయోగపడవు. మెరకపైర్లలో కొఱ్ఱ, జొన్న, రాగి, ముఖ్యమైనవి. కొద్ది భూమిచేసి, ఎక్కువ పైరును వెలగల పైరును పండించుటకు బదులుగా రైతులు ఎక్కువ భూమిదున్ని, కొద్ది పైరులను, బీద పైరులను పండించెదరు.

౧౮౭౧—౭౨ లో ౧౦౭౬౦౦౦ ఎకరముల భూమి రైతాధీనము నందుండెను. ౧౮౭౬-౭౮వ సంవత్సరమున వచ్చిన కరువు వలన పెక్కుమంది రైతులు, భూములను విడుదలపెట్టిరి. ౧౮౮౧-౨ లో ౮౯౯౦౦౦ ఎకరముల భూమిమాత్రమే రైతాధీనము నందుండెను. తరువాత క్రమ క్రమముగా విడుదల పెట్టిన భూములను రైతులు సాగు చేయఁజొచ్చిరి. ఇట్లు పదియేండ్లు గడచిన తదుపరి ౧౦౭౮౦౦౦ ఎకరముల భూమి కరువు రాక పూర్వముసకన్న నెక్కువగానే రైతాధీనమయ్యెను. ఇప్పటికిని పెక్కు బీడు భూములు ఏటేటను సాగుచేయఁబడుచున్నవి.

ఈమండలమున పచ్చిక బయళ్ళమెండుగా లేకుండుటచే, ఇచ్చటబుట్టు పశువులంత శ్రేష్ఠములైనవి కాకున్నవి. అందువల్ల నెల్లూరి ప్రాంతపు బలిష్ఠములైన కోడెలను మంచి వెలకుగొని, తీసికొని వచ్చుచుందురు. ఉన్ని కొరకీ మండలమునందు గొఱ్ఱెలు మేక లెక్కువగాఁ బెంపఁబడుచున్నవి. ఈ ఉన్నితో అనేకగ్రామములందు రత్నకంబళ్లునేయుదురు. ఒక్కొక గొఱ్ఱె వత్సరమునకు ౪ పౌండ్ల ఉన్ని ఇచ్చుచుండును.

కరువులు

ఈ జిల్లా యందు వర్షము మిక్కిలి స్వల్పముగుట వలన కరువులు సర్వ సాధారణముగా వచ్చుచుండును. వెనుకటి శతాబ్దములో మొట్టమొదట ౧౮౦౩ సంవత్సరమున కరువు వచ్చెను. అటు తరువాత ౧౮౨౪లో కరువు వచ్చు సూచనలు కనుపడఁగా గవర్నమెంటువారు సహాయపడి కరువురాకుండఁ జేసిరి. అప్పటినుండియు కరువువచ్చినప్పుడెల్ల గవర్నమెంటువారు తగు సహాయము చేయుచున్నారు. ఈ కరువులు వర్షములేమియు లేక పోవుటవల్ల పైరులు మాడిపోయినందుచేఁ గలుగు చున్నవి. ఇవి ౧౮౩౩, ౧౮౩౮, ౧౮౫౪, ౧౮౬౬, ౧౮౭౬—౭౮, ౧౮౯౨, ౧౮౯౬, సంవత్సరములలో వచ్చినవి. ౧౮౭౬—౭౮ కరువులో ౧౩౭౩౮౭ జనులు క్షామదేవత పాలఁబడకుండ కాపాడఁబడిరి.

భూమితరములు

విజయనగరము వారి క్రిందనున్నపుడు ఈ జిల్లాలోఁజేరిన వ్యవసాయపు భూములకు నెట్టి తరములుండెనో, భూము లెట్లు అమరకము చేయఁబడుచుండెనో కనుఁగొనుటకు నాధారములేదు. అప్పుడు శిస్తు ధాన్యరూపకముగ సంగోరుపాలు, శిస్తుక్రిందఁ దీసికొనుచుండిరని మాత్రము తెలియుచున్నది. గోల

కొండవారి ప్రభుత్వకాలమున కామాలుపద్ధతి ననుసరించి భూమిశిస్తు వసూలుచేయుచుండిరి. కామాల్‌పద్ధతి ప్రకారముగూడ సంగోరుపాలు ధాన్యము ప్రభుత్వమువారికిఁ బోవును. కాని యిది జమీన్‌దారుల, పాళెగార్ల ద్వారా వసూలగుచుండెను. మహారాష్ట్రుల క్రింద నున్న భాగమునందలి భూముల కేపద్ధతి ననుసరించి శిస్తు కట్టుచుండిరో తెలియదు. హైదరల్లి శిస్తులు శాశ్వతముగ నిర్ణయము చేసెను. కాని యినాములు మొదలయినవి జప్తుచేసి శిస్తు ఎక్కించ యత్నించెను. వాని కుమారుఁడైన టిప్పు సుల్తాన్ శిస్తులు పెంచ యత్నించెను. కాని శిస్తులు క్రమముగ వసూలుచేసి కొనఁగలిగిన వాఁడు కాఁడు. నైజాముకు ఈ భాగము ౧౭౯౨ లో స్వాధీన పడినప్పుడు భూమి మీఁది ఆదాయము తగ్గెను. ౧౭౯౨-౯౩ సంవత్సరములలో గొప్ప కరువువచ్చెను. అందువలన శిస్తులు తగ్గిపోయెను.

ఈ జిల్లా కంపెనీవారికి స్వాధీనపడిన తరువాత భూములు అమరకము చేయుపద్ధతి మారినది. జమీన్‌దారుల ద్వారా శిస్తులు వసూలు చేయుటకు మారుగా, రైతులతో స్వయముగా దొరతనమువారు కౌల్లు కుదుర్చుకొని, శిస్తు తామే వసూలుచేయఁజొచ్చిరి. ఈ అమరకపు పద్ధతిని రైతువారి పద్ధతి యని యెదరు. ఇది మేజర్ మన్‌రో చేసిన యేర్పాటు. గ్రామ మునసబు కరణములకు నిందువలనఁ బూర్వమున్న లాభము తగ్గినందున వారివలన శిస్తువసూలుకుఁ గొంతభంగము మొదటగలిగెను. కాని తరువాత వారును క్రమముగఁ బనిచేయఁదొడగిరి. ౧౮౦౨-౧౮౦౬ కాలములో భూములను కొల్పించి, భూములను దర్జావారిగ విభజించి, మన్రో తరముల నిర్ణయించెను. తరువాత ఇండియా గవర్నమెంటువారు, రైతువారి పద్ధతిని తీసివేసి, మొదట మూఁడేండ్లకు, తరువాత పదేండ్లకు, గ్రామాదులు ఇజారాపద్ధతి మీఁదనిచ్చిరి. ఇందువలన లాభము కలిగినది కాదు. కావున ఇజారా పద్ధతి మాని వేసి ౧౮౧౮లో మరల రైతువారిపద్ధతిని ప్రారంభించిరి.

మన్రోచే నిర్ణయింపఁబడిన రేట్లు ఎక్కువయనియు వానిని తగ్గింపవలసినదనియు ౧౮౨౦ లో దొరతనమువారి కాజ్ఞాపించిరి. కాని ౧౮౨౧ వఱకు ఆ రేట్లు తగ్గింపఁబడినవి కావు. అట్లు తగ్గింపఁబడిన రేట్లుకూడ ఎక్కువయని ౧౮౫౯ లో వానిని నింకను తగ్గించిరి. ఇట్లు రేట్లు తగ్గిన తరువాత జిల్లా కొంచెము బాగు పడఁజొచ్చెను. కాని ౧౮౭౬-౭వ సంవత్సరపు కరువు వచ్చి జిల్లానంతను మాడ్చి రైతులను బీదవారిని చేసెను. మరల ౧౮౭౯లో సర్వే ప్రారంభమై ౧౮౯౭ లోఁ బూర్తి అయ్యెను. కొత్త అమరకము ౧౮౯౦ లో ప్రారంభమై ౧౮౯౭ లో ముగిసెను. ఈ జిల్లామీఁద భూమిశిస్తుమాత్రము

పదునారు లక్షలకు మించియు, పదునేడు లక్షలకు తగ్గియు నుండును. ఇందు జమీన్‌దారీలు లేవు. ౨ ఇనాంగ్రామములు ౮౮౬ కలవు. ౧౦౦-కి౧౬ యకరములు ఇనాంభూమి గలదు. ఈ జిల్లాలోని రేట్లు మొత్తము మీఁద (ఆ వ రే జి) పల్లము య ౧-కి రు. ౪-౬-౮ (ఎక్కువ రు. ౯-౦-౦, తక్కువ రు. ౧-౦-౦) మెరక య ౧-కి ౦-౧౧-౯ (ఎక్కువ రు. ౨-౮-౦; తక్కువ ౦-౨-౦).

స్థానిక స్వపరిపాలనము

ఈ జిల్లా కంతకును అనంతపురము మాత్రము మునిసిపాలిటి గానున్నది. డిస్ట్రిక్టు బోర్డును, డివిజను కొక్కటిచొప్పున నాలుగు లోకల్ తాలుకాబోర్డులునుగలవు, పండ్రెండు యూనియనులు కలవు. (కో. ల.)

అనంతపురము (తాలూకా). ఈ పేరుగల జిల్లాలోని యొక తాలూకా. ఇది జిల్లాకు నడుమనుండును. విస్తీర్ణము ౬౨౫ చదరపు మైళ్లు. జనసంఖ్య ౧౯౦౧ లో ౧౦౮౭౩౧; ౧౯౧౧ లో ౧౦౬౧౩౧. ఈ తాలూకాలో మొత్తము ౧౦౮ గ్రామములు కలవు. భూమి శిస్తు ౧౯౦౩-౪ లో రు. ౧౯౦,౦౦౦ లుండెను. ఈ తాలూకాలోని భూమి మిట్టపల్లములు కలిగియుండును. బీడదైనందున ఫలవంతము కాదు. అందుచే పచ్చనిచెట్లు తక్కువగఁ గానవచ్చును. ఉత్తరమున నచ్చటచ్చట నల్లరేగడి భూమికొద్దిగఁ గలదు. ఈ తాలూకాకు ఉత్తరమున పెన్నయు, తూర్పున చిత్రావతీ నదియుఁ గలవు. కాని వీనివలన ఈ తాలూకాకు నేమియుఁ బ్రయోజనములేదు. పల్లపు వ్యవసాయమంతయు వర్షాధారమునే నమ్మియుండవలసియున్నది. అనంతపుర గ్రామసమీపమున నున్న చెరువు క్రీ. శ. ౧౩౬౪ లో విజయనగరరాజుల మంత్రియైన చిక్కప్ప ఉడయర్ అను నాతఁడు కట్టించెను.

అనంతఫంది. ఒక మహారాష్ట్రకవి. ఇతఁడు శా. శ. ౧౬౬౬ లో జన్మించి ౧౭౪౧ లోఁ గీర్తిశేషుఁడయ్యెను. నరక్ జిల్లాలోని సంగమనేర్ గ్రామ నివాసి. మొదట నితఁడు శృంగారాతిరేకముగల 'లావిణీ' లనఁబడు వృత్తములలోఁ బద్యములఁ జెప్పుచు మగపిల్లల వెంటఁదీసికొని వారిని ఆడించుచు జీవనముచేయు చుండెను. కాని యొక సారి అహల్యాబాయి సంగమనేరుకు వెళ్లినప్పుడామె యీతనిని బిలిపించి బ్రాహ్మణునకిది తగదనిచెప్పఁగా నామార్గము విడిచి యితఁడు భక్తిపరమైన కవిత్వముఁ జెప్పుచు హరికథలుచెప్పఁదొడఁగెను. ఇతనిచే రచింపఁబడిన చాటువులు పెక్కులుగలవు. కావ్యములలో మాత్రము మాధవగ్రంథమను నది యొక్కటున్నది. ఇందు రెండవ మాధవరావు పేశ్వామేడమీఁదినుంచి దూఁకినప్పటి నుండి రెండవ బాజీరావు రాజ్యాభిషేకము జరుగువఱకు వర్ణింపఁబడినది. రెండవ బాజీరావు, కవికి జరిగిన నిజవర్తమానము, ఉత్తర

ములు వ్రాసి, తెలిపి, యీ చరిత్ర వ్రాయించెను. ఇతనికి శ్రీపత్. ఫందీయను నామాంతరముగల సవాయి ఫందీయను కుమారుఁడుండెను. అతఁడును కవియే.

అనంత భట్టు. శివాజీ గురువైన రామదాసస్వామి సమకాలికుఁడు. సాధుపురుషుఁడు. రామదాసస్వామియొక్క పంచాయతనములో నొక్కఁడు.

అనంత భూపాలుడు (మట్ల). విజయనగర సామ్రాజ్యపు వైభవము తఱిగిన పిదప పదునాఱవ శతాబ్దాంతమున నామమాత్రులయిన రాయలయొక్క భూములయందు సర్వస్వతంత్రులుగనో కొంత స్వతంత్రులుగనో అచ్చటచ్చట రాజ్యభారము నిర్వహింపఁజొచ్చిన వారిలో నీమట్లవంశ మొక్కటిగ్గాఁ కన్పించుచున్నది. వీరిలో నొక్కండగు వరదరాజు శ్రీకృష్ణదేవరాయల యల్లుఁడు. మట్లవంశము వారు ఆంధ్రచోడులుగఁ గన్పట్టుచున్నారు. సూర్యవంశజులు, వీరి మూల పురుషుఁడు తిమ్మప్రభుఁడు. చాటుపద్యములనుబట్టి చూచినను అనంతభూపాలకృత కకుత్స్థవిజయమును, అవతారికా పద్యములు మాత్రమే గల నడిపింటి - వేంకట కవికృత అభిషిక్త రాఘవమును ఈ రెంటినిబట్టి చూచినను, మట్ల వంశోద్భవులు విద్యాప్రియులును రణప్రియులును నయి కన్పట్టుచున్నారు. అందు అనంత భూపాలుఁడు పెనుగొండకడ మల్కబలముల సాధించినట్లును గుఱ్ఱము కొండను స్వాధీన పఱచుకొనినట్లును సిద్ధవట దుర్గము నాక్రమించుకొని నట్లును రాయలచే 'సురపమాయి' బిరుదమందినట్లును తెలియవచ్చుచున్నది. మట్ల, పెనుకొండ, సిద్ధవటము, గుఱ్ఱముకొండ ఇవెల్లయు ఒండొంటికి అనతిదూరమున నుండుటంజేసి మట్లప్రభువులు విజయనగరాధీశులకు సామంతులయిన స్వల్ప సంస్థానాధిపతులని,నిర్ణయింపవలసి యున్నది. మట్ల కడప జిల్లా రాయచోటి తాలూకాలో నున్నది. అచ్చట నుండి యుద్ధవీరుఁడుగ్గను కావ్యకర్తగను బ్రఖ్యాతిగాంచిన ఈ అనంత భూపాలుఁడు ఎల్లధరారమణునకును రంగమాంబకును బుత్రుఁడు, తిరుమల శ్రీశైలస్వాచార్య శిష్యుఁడు. పదునాఱవ శతాబ్దపు నుత్తరార్థమునను పదునేడవ శతాబ్దాదిని నుండిన వాఁడు. పైనిచెప్పఁబడినరీతిని ఇతఁడు కాకుత్స్థ విజయమను గ్రంథమునురచించెను.

అనంత దేవుఁడు. ౧. ఇతఁడు సంస్కృతమును నందు 'సిద్ధాంత తత్త్వం' స్మృతికౌస్తుభం 'సంస్కార కౌస్తుభం' మొదలయిన గ్రంథములను రచించెను. సిద్ధాంత తత్త్వమనునది వేదాంత గ్రంథము. ఇతఁడు కూర్మాచల దేశాధిపతియైన బాజబహాదుర్ బంద్ వద్ద నాశ్రితుఁడగ నుండెను. ఈరాజు ౧౬౩౮ మొదలు ౧౬౭౮ వఱకుండెను. ఈ గ్రంథ కర్త తండ్రి ఆపదేవుఁడు; ఆపదేవి

(న్యాయ ప్రకాశః) అను పూర్వమీమాంస సంబంధమైన యుద్గ్రంథమునకుఁ గర్త.

౨. భాస్కరాచార్యుని వంశములోని వాఁడు. ఇతఁడు బ్రహ్మగుప్తుని సిద్ధాంత మండల ఛందశ్చిత్యుత్తర మను యధ్యాయముమీఁదను, బృహజ్జాతకము మీఁదను టీక వ్రాసినవాఁడు.

3. కాశ్మీర దేశపు రాజు. ఇతఁడు క్రీ. శ. ౧౦౨౮ మొదలు ౧౦౬3 వఱకు ముప్పదయిదు సంవత్సరములు రాజ్యమేలెను. ఇతఁడు సంగ్రామ రాజు (౧౪౦3-౧౦౨౮) యొక్క చిన్న కుమారుఁడు. ఇతని యన్న హరిహర రాజు ౨౨ దినములు రాజ్యము చేసి గతించిన తోడనే ఇతని తల్లి దుర్మార్గ వృత్తిగల శ్రీలేఖ రాజ్యము నాక్రమించుటకుఁ బ్రయత్నించెను. కాని రాజభటులీతనినే రాజ్యముపైఁ గూర్చుండఁబెట్టిరి. ఇతని పినతండ్రి కుమారుఁడగు విగ్రహ రాజీతని మీఁదికి దండెత్తి వచ్చెనుగాని గత ప్రాణుఁ డయ్యెను. ఇతని రాజ్య ప్రారంభదశయందు శాహివంశజు లయిన రుద్రపాల దిడ్డపాలు లను వారు రాజునకుఁ బ్రియులై మిక్కిలి బలవంతులైరి. రుద్రపాలుఁడు ఇందు చంద్రుఁ డను జాలంధరరాజుయొక్క పెద్ద బిడ్డను పెండ్లి చేసికొనెను. అనంత దేవుఁడా ఇందు చంద్రునియొక్క చిన్న కూతురగు సూర్యమతిని బరిణయమాడెను. ఊవరు లనువారు రాజుపైఁ దిరుగఁ బడిరి. కంపనాధిపతియగు త్రిభువనుఁడు వారికి నాయకుఁడుగ నుండెను. అనంతుఁడు యుద్ధమునకుఁ బోయి శౌర్యమును జూపి స్వయముగ త్రిభువనుని జంపెను. అట్లే అచల మంగలుఁడను రాజు ఏడుగురు మ్లేచ్ఛ భూపాలురతోఁగలిసి ఎత్తిరాఁగా రుద్రపాలుని సాహాయ్యంబున అనంతుఁడు వారి నోడించెను. రుద్రపాల దొడ్డపాలురు మరణము నొందిన పిదప అనంతుఁడు తన భార్యయైన సూర్యమతి సాహాయ్యమున రాజ్యము చేయుచుండెను. ఈమె మిక్కిలి ధర్మాత్మురాలు. పెక్కు దేవాలయములు గట్టించి దానములు చేసెను.

రాజు మాత్రము గుఱ్ఱము మొదలయిన వాని యందెక్కువ యాసక్తిగల వాఁడై ధన మెక్కువగాఁ గొల్లబెట్టుటవలన అప్పుల పాలాయెను. డల్లకుఁడను నర్మ సచివుఁడు రాజాను గ్రహమును సంపాదించి ప్రజలను దోచుకొను చుండెను. పద్మరాజను పరదేశీయుఁడు, తమలపాకు లమ్మువాఁడు, రాజున కెంతయో అప్పుపెట్టి, అతనిసింహాసనములను గుదువ బెట్టికొనెను. అపుడు సూర్యమతి తనయొద్ద నున్న ధనము నొసంగి రాజును ఋణవిముక్తిని జేసెను. అప్పటి నుండియు రాజ్యభారమంతయు భార్య సూర్యమతియే వహించెను. అనంత దేవుఁడు పేరునకు మాత్రము రాజుగా నుండెను. ఆమె ప్రభుత్వ

మున 'హాలధరుఁ'డను వాఁడు ముఖ్యమంత్రిగ నుండెను. ఇతఁడు మిక్కిలి జాగరూకతతో రాజ్యభారమును నడపెను. ఆ కాలమున అనంతదేవుఁడు శాల, కంపాది దేశముల జయించెను. ఉరశ, వల్లాపుర, దేశాధిపతు లపై దండువెడలఁబోయెనుగాని పరాజితుఁడై తిరిగివచ్చెను. అనంతదేవుఁడు మన స్థైర్యము లేని వాఁడగుటచే సూర్యమతి యనుమతిని నాతఁడు ౧౦౬౩ లో రాజ్యమును తన కుమారుఁడైన కలశున కిచ్చివేసెను. కాని కలశునకును, అనంత దేవునకును పడనందున రాజు మరల రాజ్యభారము వహించుటకు ప్రయత్నించెను. తుద కీతఁడు క్రీ. శ. ౧౦౮౧ లో కుటుంబ కలహమునకు విసివి ఆత్మహత్య గావించుకొనెను.

అనంత దైవజ్ఞుఁడు. జ్యోతిష శాస్త్ర వేత్త. మహారాష్ట్రుఁడు. విఖ్యాతుఁడైన గణేశ దైవజ్ఞుని తమ్ముడు. ఇతఁడు శా. శ. ౧౪౫౬ జయనామ సంవత్సరమున వరాహ మిహిరకృత 'లఘు జాతకము' పై టీకవ్రాసెను. అది ఉత్పల కృతమైన వ్యాఖ్యకంటె లఘుతర మైనదనియు, సులభమైనదనియు నీతని యభిప్రాయము.

అనంతనార్యుఁడు. తాళవ లింగ కవి కుమారుఁడు. గాథేయోపాఖ్యానమను ఏకాశ్వాసకావ్యమును వ్రాసెను. కృష్ణ భూపాలున కంకిత మొనర్చెను. ఈ కృష్ణ భూపాలుఁడు చిన్న ప్రభునకును కామాంబ కును బుత్రుఁడు.

అనంతవర్మ (చోడగంగ). కళింగ దేశమును పాలించిన తూర్పు గంగ వంశపు రాజులలో మిక్కిలి ఖ్యాతి చెందినవాఁడు. క్రీ. శ. ౧౦౭౬ మొదలు ౧౧౪౭ వఱకు రాజ్యముచేసెను. మిక్కిలి జయ శీలుఁడై తనరాజ్యము గంగ మొదలు గోదావరి వఱకు వ్యాపించునట్లు చేసెను. ఇతఁడు జగన్నాథ దేవాలయమును గట్టించెను.

అనంత విజయము. యుధిష్ఠి రుని శంఖము.

అనంత వ్రతము. ఒక వ్రతము. భాద్ర పదశుద్ధ చతుర్దశినాఁడు వచ్చును. అనంత పద్మనాభుఁడనుపేర విష్ణువు ఉపా సింపఁబడును.

అనంత శయనము. ఇది ట్రా వెంకూరు సంస్థానమునకు ముఖ్య పట్టణము. దీనినే తిరు అనంతపుర మనియెదరు. ప్రస్తుత వ్యవహార నామము త్రివెండ్రము. ఈ పట్టణపు వైశాల్యము రమారమి పది చతురపు మైళ్ళు. జనసంఖ్య రమారమి అఱువదివేలు. ఇచ్చట మహారాజులుంగారును, బ్రిటిషు రెసిడెంటును ఉందురు. పట్టణము సముద్రము నొద్దనుండి రెండుమైళ్ల దూరమున నుండును. ఇందు నొక భవ్యమైన దుర్గము గలదు. దాని చుట్టునుండుప్రాకారము వేయి గజముల

పొడవును(తూర్పు పడమరలు) ఎనిమిదివందల వెడల్పును (ఉత్తర దక్షిణములు) ఉండును. పట్టణము కోటకు లోపలను వెలుపల నున్నను కోటలోని భాగమే ముఖ్యమైనది. అందు రాజభవనము,రాణుల మందిరములు, అనంత పద్మనాభుని విఖ్యాత దేవాలయము గలవు.

అనంత పద్మనాభుని దేవాలయము వలననే ఈ పట్టణమునకు విశేష ఖ్యాతికలిగినది. హిందువులచే నిది యొక మహత్తర క్షేత్రముగా పరిగణింపఁబడు చున్నది. భరత ఖండమునందలి యన్ని దేశముల నుండియు యాత్రికు లెల్లపుడు గుంపులుఁ గుంపులుగా వచ్చుచుందురు. ఇచ్చట శ్రీ మహావిష్ణువు 'అనంతుఁ'డను నాగముపై పవ్వళించియుండును. ఈ క్షేత్రము మిక్కిలి పురాతనమని చెప్పెదరు. దీని యుత్పత్తిని గుఱించి పెక్కు గాథలుకలవు. అందిది యొకటి :—

'విల్వ మంగళమ్ స్వామియార్' అను నొక స్వామి మలబారు దేశమందు పెక్కు దేవాలయములను కట్టించెనట. అతఁడు కనులు మూసికొని ధ్యానము చేయునపుడొక చిన్న బాలుఁడు వచ్చి, అతని సాలిగ్రామమును తీసివేసి, పూలనెగఁజల్లి ఇతర పూజా ద్రవ్యములను చెల్లాచెదరుచేసి, పెక్కు విధముల నతనిని చిక్కుపఱచు చుండెను. అతఁడు కనులు తెఱచిన తోడనే మాయా శిశు వదృశ్య మగుచుండెను. ఒకదిన మా స్వామికి మిక్కిలి కోపమువచ్చి కన్నులు మూసికొని యుండియే తన చేతితో నాపిల్లవానిని త్రోసివేసెను. అంత వాఁడదృశ్యుఁడై నీ వెన్నడని త్రోసివేసితివో వాఁడు నీ యిష్టదేవత. ఇఁక నీకతఁడు 'అనంతన్ కడ్' అను స్థలమునందు మాత్రము కానవచ్చును, అని చెప్పెను. అంత స్వామి కన్నులు తెఱచి, తానా పిల్ల వాని నిజ స్వరూపమును తెలిసికొనఁజాల నందులకు చింతిల్లెను. అతఁడు 'అనంతన్ కడ్' స్థలము నెన్నడు వినియుండలేదు. అతఁడా స్థలమును గనుగొనుటకై పోఁగాఁ బోఁగా నొకచోట నేడ్చుచున్న తన కుమారుని భయపెట్టుటకై "నీ విట్లేడ్చిన యెడల నిన్ను 'అనంతన్ కడ్' లో వేసెదను" అను మాట వినవచ్చెను. అంత నాతఁడు, ప్రాణము లేచి వచ్చినట్లయి, ఆ స్త్రీని ప్రార్థించి, ఆ స్థలమును గనుఁగొని అచ్చటికి వెళ్ళఁగా అది శేషునిపైఁ బవ్వళించి యున్న విష్ణుమూర్తి అతనికిఁ గానుపించెను. ఆమూర్తి 'తిరువళ్ళం' మొదలు 'తిరుప్పపూర్' వఱకు వ్యాపించి తిరు అనంతపురములో దాని నడిమి భాగముండెను. ఇంత పెద్ద మూర్తికి పూజచేయుటగాని, గుడి గట్టుటగాని భక్తులకు సాధ్యము గానందున 'చిన్నవాఁడవు' గమ్మని యా స్వామి ప్రార్థించెను. అంత నా మూర్తి చిన్నవాఁడయ్యెను. ఆ దేశపు రాజు దానికి గుడి కట్టించెను.

ప్రస్తుతము గానవచ్చెడి దేవాలయము మిక్కిలి పురాతనమైనదిగాదు! దేవాలయ

ములోని కొన్ని చక్కని భాగములును, ఎదుటనుండు గోపురములును, మార్తాండ వర్మ (క్రీ. శ. ౧౭౨౯—౧౭౫౮) అను రాజు కాలమునఁ గట్టఁబడినది.

ఈ దేవాలయమునకు భూములమీఁద సంవత్సరమునకు రు. ౭౫౦౦౦ లు వరుంబడి వచ్చును. ఈ దేవాలయముయొక్క వ్యవహారములను జూచుటకై 'ఎట్టరయోగము' అను సంఘము గలదు. ఎట్టరయోగ మనఁగా ఎనిమిదిన్నరమంది కూడిక. ఎనిమిది మంది బ్రాహ్మణులును మహారాజు గారును గలిసి ఈ సంఘమగును. మహారాజుగారికి సగము 'ఓటు' మాత్రమేగలదు. దేవాలయమునకు సంబంధించి 'అగ్రశాల' అను నొక గొప్ప సత్రముగలదు. అందు బ్రాహ్మణుల కెడతెగకుండ సంతర్పణములు జరుగుచుండును. ఈ దేవున కుత్సవములు విశేషముగా జరుగుచుండును.

కోట కుత్తరమున నొక మైలుదూరమున రాజ మార్గము ప్రక్క హజూరుకచ్చేరి యనఁబడు మందిరములు గలవు. అందు దివాన్ కచ్చేరియు, హైకోర్టును, ఇతర కచ్చేరులును గలవు. అవి మిక్కిలి చక్కని కట్టడములు. వీని కుత్తరమున బాలికాబాలకులకై విడివిడిగా నిర్మింపఁబడిన ఉన్నత పాఠశాలలును, 'విక్టోరియా జూబిలీ హాలు' ఇండస్ట్రియల్ స్కూలు ఆఫ్ ఆర్ట్సు, సార్వజనిక పుస్తక భాండాగారమును, సైన్య శిబిరమును (Military Cantonment) గలవు. ఇంక నుత్తరమునకుం బోయిన నేపియరు మ్యూజియము(చిత్రవస్తుప్రదర్శనాలయము) కలదు. అది సార్వజనీనోద్యానంబునందు నెలకొల్పఁబడినది. మళయాళవాస్తుశాస్త్ర సిద్ధాంతముల ననుసరించి మనోహరముగ కట్టఁబడినది. దీనికి సమీపమునందే నక్షత్రశాల (Observatory) గలదు. అది సముద్రముపైన నూటతొంబది అడుగుల యెత్తున నున్నది. దక్షిణ దిక్కునందుఁ దప్ప తక్కిన దిశలయందెల్లను ఏఁబది మొదలు రెండు వందలఅడుగుల యెత్తుననుండు గుట్టలమీఁద నుండు గృహములును, ఎల్లకాలమును నవనవలాడుచు పచ్చిగనుండు పొలముల సౌందర్యమును, ప్రకృతి శోభను వెదజల్లుచున్నవి.

అనంతశయనము రేవర్తకమునకు ప్రఖ్యాతి చెందినదికాదు. అది చిన్న రేవు స్థలము. అచ్చటికి వచ్చెడి పడవలు స్వల్పము. అవియైనను, తీర సమీపమునకు రాఁజాలవు. సముద్రమున దూరముగా నిల్వవలయును.

అనంత సాగరము. నెల్లూరు జిల్లా ఆత్మకూరు తాలూకాలోని యొక గ్రామము. ఇక్కడ ఒకమసీదును గొప్పతటాకమును దర్శనీయములు. ఈ చెఱువునకు అనంతసాగరమనిపేరు. దీనింబట్టియే గ్రామ నామము. దీనిపైనుండు శిలా శాసనమును బట్టి దీనిని శ్రీ కృష్ణదేవ మహారాయల కాలమున క్రీ. శ. ౧౫౨౨ లో 'రాయసము

కొండ నరసు అనునతఁడు తన తలిదండ్రులయిన తిమ్మనరసు సాయయమ్మల జ్ఞాపకార్థము ఈ చెఱువును త్రవ్వించినట్లు కానవచ్చుచున్నది.


అనంతానందుఁడు: వైష్ణవ మతమును స్థాపించిన రామానందుని పండ్రెండు శిష్యులలో నొక్కఁడు.

అనంతామాత్యుఁడు: అనంత చ్ఛందస్సని తెలుఁగునఁ బేరుగన్న ఛందోగ్రంథమునకుఁ గర్త. ఈ గ్రంథము గాక యీతఁడు భోజరాజీయమను కావ్యమును, రసార్ణవమనఁబడు సాహిత్య శాస్త్రమును రచించెను.

ఈ కవి తనవంశమును భోజరాజీయము నందు సవిస్తరముగ వర్ణించినాఁడు. దానిని అనుసరించి యాతని వంశవృక్షము మీ క్రింద నీయఁబడుచున్నది:—

ఈతని ముత్తాతయగు బయ్యన్న తిక్కన సోమయాజితో సమకాలికుఁడు. సోమయాజి యీతనిని మెచ్చి 'భవ్యభారతి' యన్న బిరుదిచ్చెను. కవితల్లి యైనమల్లమాంబిక, గొప్ప వారింటి యాడఁబడుచువలెఁ గానవచ్చెడిని. ఆమెతండ్రి యొక దండనాయకుఁడని కవియే వ్రాసియున్నాఁడు. కవితండ్రి తిక్కన్న భూవసతియు, నుద్యోగమును గలిగి సుఖజీవనము చేయుచుండెను. వీరిది కౌండిన్య గోత్రము. వైష్ణవులు వీరికి గురువులుగ నుండిరి. ఈ

అనంతుని వంశవృక్షము



కవికి గోవిందచక్రవర్తి గురువు. ఈతఁడార్వేల సంతతివాఁడు. వీరార్గురన్నదమ్ములైనందునఁ గవి చమత్కారముగ నీ క్రింది పద్యము చెప్పెను:—

క. ఈయార్వుర నొక్కొక్కఁడు
వేయిండ్లకు మొదలు గాఁగ వెలయుదురని గా
దే యాఱువేల పేరిడి
రీయన్వయమునకు నెవ్వ మెఱిఁగిన పెద్దల్ [౧.౪౮.

ఆఱువేల నియోగులను గుఱించిన యుల్లేఖము గల వాక్యమిదియే ఆంధ్రవాఙ్మయమునందు మొదటిది. తెలుఁగు బ్రాహ్మణులలో ఆఱువేలశాఖ రమారమి తిక్కనకాలమువఱకే యేర్పడియుండెనని యిందువలన తెలియుచున్నది. పై సంగతులన్నియు భోజరాజీయ మందలి అవతారిక ననుసరించి వ్రాయఁబడినవి.

ఇఁక నీతని నివాసస్థానమెద్దియని మనము విచారింపవలసియున్నది. ఇందునగుఱించి భోజరాజీయమందలి యీ క్రింది పద్యము మనకు నాధారము:—

సీ. విలసితంబగు కృష్ణవేణామలాపహా
రిణిభీమరథినాఁ ధరిత్రియందుఁ
దనరు నదీత్రయాంతర్వేది యగు పావ
నక్షేత్రమున శోభనముల కెల్ల
ధరనివాసంబగు పెరుమగూరి పురంబు
నందు విద్వజ్జనానందమైన
జీవనస్థితిచేతఁ జెన్నొందు వంశక
ర్తృత్వసంపత్తిఁ బ్రభుత్వమొంది
నెమ్మిఁ బ్రత్యక్ష పరమపదమ్మనంగ
నొప్పు శ్రీకాకుళంబున కొడయఁడైన
* యంధ్రవల్లభ హారిసేవనలరుచుండుఁ,
బెక్కుభంగుల ముమ్మడి తిక్కవిభుఁడు!

ఈ పద్యమునుబట్టి చూడ నీకవియొక్క తండ్రి కృష్ణవేణా, భీమరథీ, మలాపహా యనఁబడు నదులు కలిసిన యంతర్వేదిలోనుండెనని-అట్టిస్థల మాతని స్వస్థానమని - తెలియుచున్నది. అట్టిస్థలమెద్దిః కృష్ణవేణా యనఁగ కృష్ణ, భీమరథీయనఁగ భీమ, మలాపహాయనఁగ మలప్రభానదులనుట స్పష్టము. కృష్ణానదియు, మలప్రభానదియు నైజాము రాజ్యమునకుఁ బశ్చిమ సరిహద్దునొద్ద బొంబాయి రాజధానిలోఁ గలిసినవి, ఇది యిప్పుడు కన్నడ దేశము. కృష్ణయు భీమయు నైజాము రాష్ట్రమునందు రాయచూర్ పట్టణమునకుఁ బశ్చిమమునఁ బదారుమైళ్ళమీఁదఁ గలిసినవి. ఇది తెలుఁగు దేశమని చెప్పవచ్చును. కావున

* 'ఆంధ్రవల్లభ హారిసేవ నలరుచుండు' అనఁగా నీతఁడు ఆంధ్రరాయునివద్ద నుద్యోగిగానుండె నని కొందఱర్థము చేసికొనియున్నారు. కాని యది పొరఁబాటు. 'ఆంధ్రవల్లభహారి' యనఁగా నాంధ్రవిష్ణువు; శ్రీకాకుళములోని దేవుఁడు. అతని సేవచేయుట యనఁగా నతనిని భక్తితో భజించుట. ఏగ్రామమునందే దేవుఁడుండునో ఆదేవుని ఆగ్రామాధిపతిగాఁ జెప్పుట భక్తుల యాచారము గానున్నది. ఇట్లే యీకవియొక్క 'రసార్ణవ'మందలి "శ్రీనిండఁ ధ్రువపట్టణాధిపునకిచ్చెం భక్తిపూర్వంబుగాఁ" అన్న చరణముఁ జూచి కొందఱీ గ్రంథమును ధ్రువపట్టణపు రాజునకిచ్చెనని భ్రమపడుచున్నారు. అచ్చటను ధ్రువపట్టణాధిపుఁడనఁగా ధ్రువపట్టణపు దేవుఁడని యర్థము. ఈకవి తన గ్రంథమేదియు నరాంకితము చేయలేదు.

ఈకవియొక్క నివాసస్థలము నైజాము రాజ్యమునందుండెనని మన మూహింపవచ్చును. శ్రీకాకుళపు (ఆంధ్ర) విష్ణువు (దేవుఁడు) వీరికి గులదైవము కావచ్చును.

ఈకవి 'రసార్ణవము' నందుఁ దనకాల మిట్లు వ్రాసికొనియున్నాఁడు:—

శా. "బాణానందక్షాళకవర్షముల్ ఋతుశశ
జ్యోత్స్నేందులై యొప్ప న
య్యానందాబ్దమునందు మాఘమునఁ గృ
ష్ణైకాదశీ భౌమయు
క్తానామామృతవేళ నీకృతి యనం
తాఖ్యుండు సమ్యగ్రస
శ్రీనిండం ధ్రువపట్టణాధిపున కి
చ్చెన్ భక్తిపూర్వంబుగన్."

శా. శ. ౧౩౫౬ ఆనందనామ సంవత్సర మాఘ బహుళ ౧౧ మంగళవారమనఁగా క్రీ. శ.౧౪౩౫ జనవరి ౨౫-వ తేది యగును. కావున నీకవి పదునైదవ శతాబ్దమధ్యము నందున్నవాఁడని నిశ్చయింప వచ్చును.

ఈ కవిచే రచింపఁబడిన మూఁడు గ్రంథములును దేవాంకితములు గనుక నింతకంటె విశేషము లేవియు మనమీకవిని గుఱించి తెలిసికొనుటకు వీలులేదు. ఇఁక నేతద్రచిత గ్రంథమును గుఱించి విచారింతము.

భోజరాజీయము రచించిన తరువాత ఛందస్సు రచించినట్లు, ఛందస్సుయొక్క నాల్గవ యాశ్వాసమునందుఁ గవి భోజరాజీయమును బేర్కొనుటవలనఁ దెలియుచున్నది. భోజరాజీయ మేడాశ్వాసములు గల మంచి ప్రబంధము. అహోబల నృసింహస్వామి కంకితము. ఇందు భోజరాజును గుఱించిన వింతగ్గును కథలు పెక్కుండుకలవు. ఈ కావ్యమును ౧౯౦౪-లో శ్రీ వీరేశలింగముగారు ముద్రించినారు. వారు దాని పీఠికలో నీ ప్రబంధమును గుఱించి యిట్లు వ్రాసియున్నారు:-

"ఈతని కవిత్వము సలక్షణమయి యున్న గ్గళ ధారగలదియు మనోహరముగ నుండును. కవిత్వము మాత్రమేగాక భోజరాజీయము నందలి కథలును మిక్కిలి యింపుగానుండును. కవిత్రయమువారి ప్రయోగములకంటె భిన్నములైన ప్రయోగములు భోజరాజీయమునందుఁ గొన్ని కానవచ్చుచున్నను మొత్తముమీఁద నిందలి కవిత్వము నిర్దుష్టముగను శ్లాఘ్యముగ నున్నది."

ఈ కవికి దిక్కన సోమయాజిని యనుకరింపవలెనన్న యభిలాష మెండుగ నున్నట్లు ఈ కావ్యమువలనఁ గానవచ్చుచున్నది. ఒక్క యుదాహరణ మిచ్చెదను. నిర్వచనోత్తర రామాయణమునందుఁ దిక్కన తాను కావ్యము వ్రాయుటకు నిట్లు కారణము వ్రాసెను.

సీ. సకలలోకప్రదీపకుఁ డగుపద్మినీ
మిత్రువంశమున జన్మించ ననియుఁ
జూచిన మగలైనఁ జొక్కుడునట్టి సౌం
దర్య సంపద పొంపు దాల్చె ననియు

జనహృదయానంద జనకమై నెగడిన
నగణితకీర్తి నప్రతిముఁ డనియు
మాటసేయుండొంటికి మిగులు సౌగ్యత్యాగ
విఖ్యాతకీర్తుల వెలసె ననియు
తే. వివిధవిద్యాపరిశ్రమవేది యనియు
సరస బహుమానవిరచనా శాలి యనియు
సుశ్లోకకీర్తిఁ దగు మన్న నను నృపతి
సుభగుఁ గావించుటకు సముత్సుకుఁడ నైతి.

ఈ పై పద్యమును జూచి యీ యనంత కవి తాను కావ్యము వ్రాయుటకుఁ గారణములు చెప్పఁదలఁచి యిట్లు వ్రాసెను:—

సీ. నాటిసంబయ్యుఁ బురాతన కృతులట్టి
సంతత శ్రావ్యమై జగమునఁ ననియు
నాదిరాజ సమానుఁడగు భోజనరపతి
చరిత మీ కవితా ప్రసంగమనియు
నిందుఁ జెప్పెడి కథలన్నియు నోలి బ్ర
శస్త ధర్మోపదేశంబు లనియు
సకల జగన్నాథుఁడగు సహోబిలనాథుఁ
డీ పుణ్య కృతికి నధీశుఁడనియుఁ
గీ. బృగవి నల్ల జనులు ప్రయాసశక్తి యుక్తిఁ బా
టింగుగనియు నూలుడిల్లి చేను
జగము సౌఖ్యమైన భవదాబ్ధి ముఖ్యంబు
నమ్మఁబడసి యధిక నిష్ఠతోడ. [౧. ౭౮

రసాభరణ మనునది నాలుగాశ్వాసముల యలంకార గ్రంథము. మొదటి యాశ్వాసమునందు నవరస స్థాయీభావాదులును, రెండవ యాశ్వాసమునందు రతిగుణ విభావానుభావాదులును, మూఁడవ యాశ్వాసమునందు శృంగార రస ప్రకరణమును, నాల్గవ యాశ్వాసమునందు నాయక నాయికా ప్రకరణమును వర్ణింపఁబడియున్నవి. మాకు దొరికిన ప్రతిలోఁ గృత్యాద్యాది పద్యములు లేవు. ఈ కృతియు విష్ణుమూర్తికి సర్పింపఁబడినది.

అనంతుఁడు గొప్ప లాక్షణికుఁడు. అనంతుని ఛందస్సు తెలుఁగు బాసయందు బహుకాలము నుండియుఁ బేరుగన్న గ్రంథము. లక్షణ వేత్త లందఱును దానిని గౌరవముగఁ బేర్కొని, యందుండి యెన్నియో లక్ష్యములను లక్షణములను ఉదాహరించి యున్నారు. కాని యిప్పుడీ గ్రంథము సంపూర్ణముగ దొరుకుటలేదు. దీనిని పూర్తిగ సంపాదించి యచ్చొత్తించినవారులేరు. రెండు ఆశ్వాసముల గ్రంథమ్ము ప్రాచ్య లిఖిత పుస్తకభాండాగారమునందున్నది. రెండవ, మూఁడవ, నాల్గవ ఆశ్వాసముల యసంపూర్తి ప్రతియొక్కటి మ-రా-శ్రీ మానవల్లి రామకృష్ణ కవి గారి వలన మాకు దొరకినది.

భీమన కృత మనఁబడు కవిజనాశ్రయమును విడిచినయెడల, తెలుఁగున నిదియే మిక్కిలి పురాతన ఛందో గ్రంథమని చెప్ప వలెను.

ఇందలి ప్రథమాశ్వాసములో "గద్య పద్యాది కావ్యలక్షణంబును, గురు లఘు నిర్ణయంబును, గణనిరూపణంబును, ప్రాస యతి విశేషంబులును, పరిగణ సంజ్ఞయుం" గలవు. రెండవదానిలో "నుభయ భాషా నిరూపణంబులును, గద్యవచనంబుల విధంబును, షడ్వింశతి ఛ్ఛందో నామంబులును, తదుద్భవంబులగు సమవృత్తంబులును, వృత్త

విశ్రమంబులగు నర్ధసమవృత్తంబులును, ఛందః ప్రోక్తంబగు మాలావృత్తంబులును, దదుద్భవంబులగు దండకంబులును" నిరూపింపఁబడినవి. మూఁడవదానిలో "జాతిలక్షణలక్షితంబులును, జాతుకావ్య పరిమాణంబులును,ఉదాహరణంబులును, షట్ ప్రత్యయంబులును, సప్తమ ప్రత్యయంబైన సమవృత్తంబుల వెరసుల నెఱుంగు తెఱఁగును" కలవు. నాల్గవదానిలో "వర్జంబులగు దశ దోషంబుల నేర్పఱుచుటయును,నందు దోషరహితంబులైన యాదరణీయంబులగు పట్లఁజేర్చుటయును సంధి సమాసంబులును" కలవు. ఇట్లీగ్రంథమునందుఁ గొంత వ్యాకరణ విషయము కూడఁగలదు.

ఈ గ్రంథమునకు మేము చూచిన ప్రతులలో 'ఛందోవర్ణ' మన్న పేరున్నది. అది లేఖకప్రమాదమేమో, 'ఛందోఽర్ణవ' మన్నది నిజమైన నామధేయమో యని సంశయము కలుగుచున్నది.

అనంతి. శతరూపకు నామాంతరము.

అనంతుఁడు. ౧. కామధేనువను జ్యోతిష గ్రంథముపై టీకవ్రాసినవాఁడు. 'జాతక పద్ధతి'యనునొక గ్రంథమితనిది గలదు. గార్గ్యగోత్రుఁడు. గోదావరి తీరముననున్న ధర్మపురి నివాసుఁడు. కావున, ఆంధ్రుఁడు. తండ్రిపేరు చింతామణి. కుమారులు శ్రీకంఠుఁడు, రాముఁడు. వీరును జ్యోతిష శాస్త్రము నందుఁ బేరొందిన వారు, గ్రంథకర్తలు.

౨. అంతములేనివాఁడు, పరమాత్మ.

౩. కశ్యప కద్రూసంతతియగు నాగులలో నొక్కఁడు.

౪. శేషునకు ఈపేరు గలదు.

౫. జైనులు ఇరువదినలుగురు తీర్థంకరులలో పదునాల్గవవాఁడు.

అనంద తాలూకా. ఈ తాలూకా బొంబాయి రాజధానిలోని కైరా జిల్లా మధ్యగలదు. దీని వైశాల్యము ౨౪౪ చతురపు మైళ్ళు. జనసంఖ్య ౧౪౩౩౦౫. రాబడి ఐదులక్షలు. జలవసతి తక్కువ.

అనందపట్టణము. ఇది అనంద తాలూకాకు ముఖ్య పట్టణము. జనసంఖ్య ౧౦౦౧౦. ఇక్కడ క్రైస్తవ మత సంఘములు కలవు.

అనందపాలుఁడు. లాహోరు దేశపు రాజు. గజినీ మహమ్మాదుతో హోరాహోరిగఁ బోరాడిన వీరాగ్రేసరుఁడు. ఇతఁడు బ్రాహ్మణ వంశజుఁడని ఫెరిస్తా వ్రాసియున్నాఁడు కాని 'పాల్' అను ఉప పదము వలన ఇతఁడు రాజపుత్రుఁడని తోచుచున్నది. ఇతనితండ్రి పేరుజయపాలుఁడు. జయపాలుఁడు మహమ్మాదుతోఁ బోరి యోడిపోయి క్రీ. శ. ౧౦౦౨ లో నగ్ని ప్రవేశించెను. అంత అనంద పాలుఁడు రాజ్యమునకు వచ్చెను. మహమ్మాదు ౧౦౦౫ లో ముల్తాను మీఁదికి దాడివెడలినప్పుడు, అనందపాలుఁ డాతని

సైన్యమును తనరాజ్యములో నుండి పోని య్యక అడ్డగించి నందున పెషావరు గుట్టల లో వారికి ఘోరమైన పోరుజరిగి అనంద పాలుఁడోడి కాశ్మీరమునకు పారిపోయెను. ౧౦౦౮-వ సంవత్సరము నందు మహమ్మూద్ అయిదవసారి హిందూదేశము మీఁదికి దండువెడలివచ్చెను. ముల్తాను దండయాత్ర సమయమున అనందపాలుఁడు తనను మిక్కిలి యగౌరవ పఱచినందున వానిని శిక్షించు టకై మహమ్మూదు నిశ్చయించెను. ఈ సమాచారము తెలిసికొని తురకల నీదేశము నుండి వెడలఁగొట్టుటకు గట్టి ప్రయత్నము చేయ నిశ్చయించి, అనంద పాలుఁడు హిం దూరాజుల కందఱకు మతాభిమానముగల వారందఱు యుద్ధమునకు వచ్చునట్లు చేయు టకై తనదూతల నంపెను. ఉజ్జయిని, వాలి యర్, కళింజర్, కనౌజీ, ఢిల్లి, అజమీర్ దేశాధిపతులు తమతమ సైన్యంబుతోవచ్చి అనందపాలునితోఁ గలిసికొనిరి. హిందువుల సైన్యము మిక్కిలి గొప్పదిగనుండెను. అనంద పాలుఁడే వీనికంతకు సైన్యాధిపతి యయ్యెను. హిందూ సైనికులు, 'గక్కూరీ' లనఁబడు అన మాన శౌర్యముగల క్షత్రియులు దినదినము వచ్చి హిందూ సైన్యమునఁ జేరుచుండిరి. తమ మతధ్వంసకులగు తురుష్కుల నెదిరిం చుటకై హిందూ స్త్రీలు దూరదేశముల నుండి యసంఖ్య ధనమును బంపి యెంతో సాహాయ్యము చేసిరి. బీదస్త్రీలు గూడ, దూదిని యేకియు మఱియు న్యవిధమైన కూలిని జేసియుఁ గడించి సొమ్మును బంపుచుండిరి.

ఈతడవ హిందువులు మిక్కిలి పట్టుదలతో నున్నవారని తెలిసికొని మహమ్మూదు తన శిఖరమునుజుట్టు కందకములఁ ద్రవ్వించి, హిందువు లకస్మాత్తుగఁ దనమీఁదఁబడకుండ నేర్పాటుచేసి, ఆఱువేల ధనుర్ధరులను కందక మువద్దకు రప్పించి హిందువులపై బాణముల గురిపించి యుద్ధము ప్రారంభించెను. కందక ములను లక్ష్యముచేయక ముప్పదివేల గక్కూరీ హిందూ వీరులు రెండు వైపులనుండి మహ మ్మూదు సైన్యములోఁ బ్రవేశించి, తమ బల్లెములతోను, ఇతరాయుధముల తోను, శత్రువుల యశ్వసైన్యమును చెండాడిరి. కొన్ని నిముషములలో మూఁడునాలుగు వేల తురుష్క సైనికులను వారిగుఱ్ఱములతో యమపురి కంపిరి. వారి శౌర్యోద్రేకమును జూచి భయపడి, మహమ్మూదు నాటికియుద్ధ మును జాలింపఁ దలంచెను. కాని ఇంతలో అనంద పాలుఁడెక్కిన యేనుగు బెదరి తిరిగి పారిపోఁజొచ్చెను. అది తమ పరాభవముగాఁ దలఁచి హిందూ సైనికులందఱు చెల్లాచెద రై పారిపోయిరి. మహమ్మదీయులంత వారి వెంటఁదగిలి ౮౦౦౦ వేలమందినిజంపిరి. అనంద పాలుఁడు ౧౦౧౩ లో మృతుఁడైనట్లు కాన వచ్చుచున్నది. పైన వ్రాసిన వర్ణనమంతయు ఫేరిస్తా యను తురుష్క చరిత్రకారుని గ్రంథము ననుసరించి వ్రాయఁబడినది. దీనిని

ఈ రాజధానిలో 1913-14 సం॥ అడవి నేరములు తెలియగల పట్టి

గత 1912-13 సం॥ మిగిలియున్న కేసుల మొత్తం	ఈ సంవత్సరపు క్రొత్త కేసులు						శిక్షలు		విడుదల		మొత్తము.		సంవత్సరాంతమున నిలువ కేసులు.
	అడవులను కాల్చిన	దొంగతనముగా చెట్లను నరికిన	పశువులను నిషేధించిన స్థలములో మేపిన	ఇతర నేరములు.	క్రొత్త కేసుల మొత్తము.	మొత్తము	కేసులు.	నేరస్థులు.	విడుదలైన కేసులు.	విడుదలైనవారి సంఖ్య	కేసులు.	నేరములు జేసినవారి సంఖ్య	
1	2	3	4	5	6	7	8	9	10	11	12	13	14
5238	1180	20070	9063	1480	31177	35104	27099	50618	485	1709	27584 *1780	61327 *2929	5740

* డిస్ట్రిక్టు ఫారెస్టు ఆఫీసరు లేక రివిన్యూ డివిజనల్ ఆఫీసరు వుత్తరవు ననుసరించి తీసివేసినవున్న కేసులు.

కంచెలుగాని ప్రాట్టిగోడలుగాని పెట్టుటయు క్తము. కడపజిల్లాలో కొన్ని అడవుల చుట్టును ఈప్రకారము గోడ పెట్టుటవలన ప్రజలకును అడవికినిగూడ యెక్కువ సదుపాయము గలిగినట్లు కనపడుచున్నది. జనసంఖ్యలేని చోట్ల నెట్టెసరిహద్దు గుఱ్ఱులను పెట్టుకొనినను రిజర్వు అడవులకును, అన్‌రిసర్వు అడవులకును మధ్య కాలిదారియైనను యుండుట యుక్తము. ఫక్తు డిమార్‌కేషన్ అనగా సరిహద్దులను నేర్పరుచుటకుగాను ౧౮౧౧ వ సంవత్సరపులెక్కల ప్రకారము సంవత్సరమునకు 2,31,514 లక్షలరూపాయిలు ఖర్చు అగుచున్నదని తెలియుచున్నది.

మొట్టమొదట హిందూదేశము నందలి అడవులయొక్క కొలతల పటములు అంతగా సరిగా లేకపోయినను ౧౮౭౭ వ సంవత్సరమునందు సర్వే డిపార్టుమెంటువారిక్రింద కీపని వచ్చినప్పటినుండి సర్వవిధములను చక్కని పటములు దొరకగలవు.

ఒక అడవిని వృద్ధిచేయవలెనన్న చాల కాలము పట్టును. ఫారెస్టు డిపార్టుమెంటు వారు రిజర్వు ఫారెస్టులలో ఏయే భాగములనువృద్ధిచేయ తలచుకొనెదరో ఆయడవులలో రాగల ౧౦ మొదల ౮౦ సంవత్సరములవరకు ఏప్రకారము పనిచేయవలెనో

అడవులు వృద్ధిచేయు పనులు, విధములు.

మొదటనే ఎస్టిమేటులను, ప్లానులను తయారుచేయుదురు. అందు వృద్ధి పట్టుచ దల చిన అడవియొక్క వైశాల్యము, వృక్షజాతుల యొక్క స్వభావము, పూర్వపు వృద్ధిచేయ ములు, ముందు చేయవలెనను మార్పులు మొదలగున వన్నియు తెలియ జేయు లెక్కలు తయారుచేయుదురు. అడవిలోనుండి వచ్చు ఫలసాయము ఏయేచోట్ల ఖర్చగునో ఏయేమార్గముల జేరవేయకొని పోవలెనో ఒక్కొక్క సంవత్సరమునకు ఎంతలాభము వచ్చునో విత్తనములుచల్లుట లేత మొక్కలు నాటుట అధికమైనచోట్ల కొన్ని చెట్లను కొట్టి వేయుట శుభ్రపఱచుట అగ్నినుండియు పశువులనుండియు కాపాడుట రోడ్లు వంతెనలు ఇండ్లు మొదలగునవి కట్టుట ఇవన్నియు రాగల ౨౦ సంవత్సరములకు కావలసినపనుల యొక్క తఖసీలంతయు వివరముగా తయారు చేయబడును. అప్పుడు సర్కారువారి అనుమతి పొంది ఫారెస్టుడిపార్టుమెంటువారు పనికి ప్రారంభింతురు. ఒక్కొకఅడవిలో ౨౦ లేక ౪౦ సంవత్సరములుగడచినపిమ్మట ఈపద్ధతు లన్నింటిని మార్చుకొనిపూర్ణముగా క్రొత్త పద్ధతుల నవలంబింపవలసివచ్చును. ఈప్రకారము ౧౯౧౧ వ సంవత్సరములో సర్కారు అధీనములోనుండు, ౨౪౩ వేలచదరపుమైళ్లను రిజర్వు అడవిలో ౫౩ వేల చదరపుమైళ్లను మాత్రము సరియైన ప్లానులతో పని జరుగుచున్నది.

ఒకానొక అడవియొక్క విలువ దానియందుండు కలప మొదలగు ఫలసాయముయొక్క హెచ్చుతగ్గులను బట్టియుండునని చెప్పుటకు వీలులేదు. ఏలయనగ సముద్ర తీరమునగాని, నదీ తీరమునగాని, రయిలురోడ్డు సమీపమునగాని, ఉన్న అడవులలోని ఫలసాయమునకు హెచ్చువెల వచ్చుటయు, ఎక్కడనో కొండలమీద నుండు అడవుల యందలి

రహదారీలు, ఇండ్లు.

ఫలసాయము బొత్తుగ విలువ లేకుండ నశించు పోవుటయు మనమందఱ మెరిగినదే. కాబట్టి లాభముకొఱకై అడవులను పెంచువారు ఏయేమార్గముల అడివి ఫలసాయము విక్రయ స్థానమునకు జేరునో ముఖ్యముగ యోచించు కొనవలెను. ఒక్కొక్క అడవియొక్క అంతర్భాగములో నుండు ఫలసాయము బయటికి చేరుటకుగాను రోడ్లు, ట్రామువేలు, చిన్న చిన్న రయిలువేలు మొదలగుమార్గములు ఏర్పరచవలెను. సహజముగా ఎగుడుదిగుడుగ నుండుకొండల మీదనుండి బరువైన ద్రవ్యాకు లను క్రిందికి దింపుటకు తగిన రహదారీలను నిర్మించుటకు అధికవ్యయమగును. కట్టెకరీదు కంటె కూలిహెచ్చయినయెడల ప్రయోజన మేమి? సహజముగ ఇట్టి చోటులందుండు నదీ ప్రవాహములను వర్షకాలములో నుప యోగించుకొనుచు నీటిమీద సులభముగకలపను విక్రయస్థానమునకు జేర్పవచ్చును. అడవులలో పనిచేయు ఉద్యోగస్థులకును పనివారలకును వ్యాధిరాకుండ కాపాడుట మిక్కిలి కష్టము. దోమల బాధ, చలి జ్వరములు

నీరులేమి, నివసించుటకు నివాసస్థానము లేమియు, పనివారలకు మిక్కిలి కష్టముకలిగించును. పనివారలు లేనిచోట్ల అడవియొక్క విలువయు మిక్కిలి తగ్గిపోవును. కాబట్టి తగుస్థలములయందు ఆయాతరగతుల పనివాండ్రకు తగిన ఇండ్లు అక్కడక్కడ కట్టవలయును. మన రాజధానియందలి అడవులలోని శహదారులకును ఇండ్లకునుగతసంవత్సరపు లెక్కల ప్రకారము ౩౦౭,౩౨౭రూపాయలుకర్చాయినవి.

అడవుల అభివృద్ధికి నాలుగు విధములైన శత్రువులుగలరు.

శత్రు సంహారము.

౧. మానవులు

౨. పశువులు

౩. అగ్ని

౪. వ్యాధిపుట్టించు పురుగులు.

౧౮౬౪ వ సంవత్సరములో ఫారెస్టు ఆక్టు పుట్టినదిమొదలు అడవిలోని సొత్తును చుట్టుప్రక్కలుండు వారలు అడవికి నష్టము కలుగునట్లుజేసి ఎత్తుకొని పోకుండ సర్కారువారు అనేకప్రయత్నములు చేయుచున్నారు.

మానవులు.

కాని మొదటి నుండియు అడవులుప్రజలయుపయోగార్థమే పెంచుచున్నామనియు ప్రజలకు ఒత్తుడు కలుగజేయు శాసనములను కఠినముగనుపయోగించుట తమకు ఇష్టములేదనియు ఇంపీరియల్ గవర్నమెంటు వారు తమ అభిప్రాయమును తెలిపియున్నారు. అనేకచోట్ల అడవులలోని ఫలసాయమును అడవిజనులు అనాదినుండియు అనుభవించుచున్నారు. వారనుభవింపగా మిగిలిన ఫలసాయమును అడవినుండి బయటికి తీసికొనిపోవునప్పుడు ఏదోయొక విధమున హిందూరాజులకుగాని మహమ్మదీయ సుల్తానులకుగాని ప్రజలు కప్పములు కట్టుచుండిరని చెప్పుటకు అనేక నిదర్శనములు కలవు. కాబట్టి రాజులకు పన్నుగట్టుటయు అడవులు తామనుభవించుటయు పూర్వకాలపు హిందూదేశపుప్రజలకు తెలియనిదికాదు. కాని ప్రజాసంఖ్య హెచ్చయి అడవులు శిథిలమయినచోట్ల ఆయా అడవులనెట్లు వృద్ధిచేసికొనవలయునో తెలిసికొనుటకుతగిన విద్య ప్రజలకు లేకపోవుటచేత క్రొత్తఅడవులు వృద్ధిగాక ఉన్నఅడవులు నశించుచు వచ్చెను. ఇట్టి చెరుపులను మాన్పుటకై యేర్పడిన ఫారెస్టు డిపార్టుమెంటువారు చిరకాలమునుండి అనుభవించుచుండిన ప్రజలను అడవులదరికి రావద్దని తరిమినచో వారికెంత కష్టముగానుండును. ఎంతో ఇష్టములేక చేసినను సర్కారువారు ప్రజలకువేయు శిక్షలు ప్రతిసంవత్సరము హెచ్చుచున్నవి. 1914 వ సం॥ ఈ రాజధానిలో 17,175 మంది మీద నేరములు మోపబడి, అందు ౧౦౦టిలో 90 మందికి శిక్షలాయెను. ఇవిగాక ఫారెస్టు డిపార్టుమెంటువారే నేరస్థులగు ప్రజలతో రాజీపడి వారివద్ద తాము విధించిన జరిమానాలును 44,152 మందివద్ద వసూలుచేసిరి. ప్రజలుచేసిరని

చెప్పిన నేరములలో ౨౦ వేలమంది అక్రమముగ చెట్ల ఫలసాయమును తీసికొనిపోయి రనియు, ౯ వేలమంది అక్రమముగ పశువులను మేపిరనియు, ౨ వేలమంది అక్రమముగ నిప్పు మొదలగువానిచే అడవులకు హానిగలిగించి రనియు తెలియుచున్నది. ప్రత్యేకముగ మద్రాసు రాజధానిలో గడచిన సంవత్సరము నందు ౩౯౫, ౧౧౪ కేసులలో ౯౮౯, ౬౧౮ మంది దిని శిక్షించిరనియు ౧౭౯౯ మందిని నేరస్థులు కారని విడుదల చేసిరనియు తెలియుచున్నది. దీనినిబట్టి ఫారెస్టు డిపార్టుమెంటును ఎంతవృద్ధి చేసినను నేరములును శిక్షలును హెచ్చు చునే యున్నవని చెప్పవచ్చును.

పశువులవలని యుపద్రవమునుండి అడవు లనుకాపాడుట అంతగాకష్టమైనదికాదనిచెప్ప వచ్చును. ఏలయన నిజమైన అడవులలో జన సంఖ్య తక్కువగ నున్నట్లే పశువులును తక్కు వగనే యుండును. ఇదిగాక గడ్డిమేయు

౨ పశువులు.

పశువులు ఎంతతిరిగి నను అడవులకు అంతగా అప కారము చేయవు. మేకలుతప్ప ఇతర జంతువు లేవియును అడవిచెట్లను సామా న్యముగ తినవు. వాటికి కావలసినంత మేత నేలమీద నున్నప్పుడు పశువులను అడ వులలో స్వేచ్ఛగవిడచినను అడవికినష్టము లేదు. అయినను పశువులను అడవులలో విడుచు విషయములో ముఖ్యముగ కొన్ని అంశములను గమనింపవలెను.

(౧) చెట్లు మిక్కిలి దట్టముగ నల్లుకొని సంవత్సరము పొడుగునను నీడబారియుండు నేలమీదగడ్డి అంతగా పెరుగదు. కావున-ఈ అడవులు పశువుల మేతకంతగ నుపయోగ కరముగావు.

(౨) చెట్లు తక్కువగనుండి నేల సారవం తమైన అడవులలో గడ్డి చక్కగ పెరుగును. కరువుసంవత్సరములలో ఈ అడవుల లోనిగడ్డి యొక్క విలువ పశువులకింతంతయని చెప్పన లవికాదు. ఇట్టిఅడవులలో కొంతవరకు పశు వులు తిరిగినను అడవికి నష్టముకలుగదు. కాని మేత కొంచెముగనుండి మితిలేకుండ పశువులను విడిచినయెడల అడవులు పాడగు ననుటకు సందేహము లేదు. కాబట్టి ఇట్టి అడవులలో గడ్డిపెరుగు నిమిత్తమై కొన్నిదిన ములు కొంతభాగమును మూయుచు, గడ్డి పెరిగిన తరువాత మఱికొన్ని దినములు తెఱ చుచు అడవి అధికారులు తెలివితో పనిచేసిన యెడల అడవికి నష్టమురాకుండ పశులవుకు మిక్కిలి ఉపకారము చేయవచ్చును.

(3) అడవులలో సామాన్యముగ మేక లను మేయనియ్యకూడదు. లేత అడవులలో పెద్ద మేకలమందలను విడచినయెడల అతి శీఘ్రమున అడవిని నాశనముచేయ గలవు. ౧౯౧౧వ సంవత్సరములో సర్కారువారి క్రిందనున్న అడవిలో ౯,౪౪౫ చదరపుమైళ్లు పశువులు మేయకుండగను ౨౧,౩౦౨ చద రపుమైళ్లు మేకలు మేయకుండగను మూసి వేసి యున్నారు. ఆ సంవత్సరము హిందూ దేశపు అడవులలో ౯౬,౪౨, ౧౨౩ పశు

బట్టి చూడ నెల్లప్పుడు మహమ్మూదు గెలిచినట్లును, అనందపాలుఁ డోడినట్లును, గానవచ్చుచున్నది. కాని యిట్లనుకొనుటకు వీలు లేదు. ఎందుకన, మహమ్మూదుయొక్క ఆస్థానపండితుఁడైన 'అబూరీహాన అల్. బిరూనీ' అనువాఁడు 'తారీఖు లీ హింద్' అనుచరిత్రగ్రంథమునం దనందపాలుని వంశ చరిత్ర వ్రాయుచు నిట్లని యున్నాఁడు:—

"ఈ రాజులు మిక్కిలి రాజ్యమును గలవారయ్యును, ఉత్తమ సుగుణ భూషితులుగను, ఆడితప్పని వారుగను, తమకంటెఁ తక్కువ వారియెడ ననుగ్రహము గలవారుగను నుండిరి. అమీర్ మహమ్మూదునకు నైరకాలమునందనందపాలుఁడు వ్రాసిన యీ యుత్తర మెంతయుఁ గొనియాడఁ దగియున్నది. 'నీ రాజ్యము మీఁదికి తురకలు (Turks) దండెత్తి వచ్చిరనియు, ఖురాసాన్ ప్రదేశ మందంతటను నిండిరనియు విన్నాఁడను. వలయు నెడ ౫౦౦౦ గుఱ్ఱములతోను, ౧౦౦౦౦ సైనికులతోను, ౧౦౦ ఏనుగులతోను, నీకు సాయము చేయుటకు వచ్చెదను. లేదా నీకిష్టమున్న యెడల సైనిఁ బేర్కొన్నదానికంటె రెట్టింపు సైన్యములనిచ్చి నాకుమారుని బంపెదను. నీ యనుగ్రహమునకై నేనిట్లువ్రాయ లేదు. నేను నిన్నుఁబూర్తిగఁ బరాభావించినను, అట్టి గౌరవము నాకుఁదప్ప నితరులకుఁ గలుగఁగూడదని నా యుద్దేశము"*

* *Elliot's History of India as told by its own Historians. Vol. II. pp 12; 44.*

ఈ యుత్తర మనందపా
ప్రకటింపఁబడినది కాదు.
రిచేఁ ప్రకటింపఁబడినది.
మనుటకు సందేహము లేదు.
మహమ్మూదును పరాభ
మును, అతని చేత నే
సంభవించనేని 'నేను నిన్నుఁ
నని అతఁడు మహమ్మూద
యెట్లు తటస్థించును? కావుఁ
నిజచరిత్రను చరిత్రకారు
వలసియున్నది.

అనందపుర్ (
బంగాళా రాజధానిలోని ఒ
లోఁబడిన సంస్థానములలో
కియోంఝూరులో నున్న
నై తరిణీనదియొడ్డునఁ గలద
౨౯౮౫.

అనందపుర్ (పంజ
యూర్పూరు జిల్లాలోని
లోని యొక పట్టణము. జన
సీక్కుగురువగు తేగ్ బహ
మును నిర్మించెను.
గోవిందసింగు ఔరంగ

* కొందఱు చరిత్రకారు
వాడి యున్నారు. అది
ఆనందపాలయి నప్పటికిని
'అనందపాల్' అనియే వ్రాసినం
రణమే గ్రహించినాఁము.

సైన్యముల నిక్కడనుండియె యెదిరించెను. ఈస్థానము సిక్కులకు పుణ్యక్షేత్రము.

అనందపుర్. (సంస్థానము). ఇది బొంబాయి రాజధానియందలి కాఠెవాడ్ పరగణాలలోని యొకచిన్నసంస్థానము.

అనకాపల్లి (గ్రామము). ఇది అనకాపల్లి తాలూకాయొక్క ముఖ్యపట్టణము. ఈ పట్టణము విశాఖపట్టణమునకు ౨౦ మైళ్ల దూరమున శారదాయనునదిమీఁదనున్నది. ఇచ్చటికి చుట్టుపట్టు పల్లెలనుండి వరి, చెఱుకుగడ మొదలగు పంటలు విరివిగా వచ్చుచుండుటచేత మంచివర్తకస్థానముగానున్నది. ఇచ్చటినుండి బెల్లము వరిధాన్యము ఎక్కువగా ఎగుమతి చేయఁబడుచున్నవి. ఈపట్టణము ౧౮౭౮-వ సంవత్సరమునస్థాపింపఁబడిన ఒక మ్యునిసిపలు సంఘముచే పాలింపఁబడుచున్నది. ఈపట్టణముయొక్క ఆదాయమును ఖర్చులును రమారమి ౨౫౦౦౦రూపాయలు. ఈ ఆదాయమంతయు ఇంటి పన్ను గేటు పన్నుల మూలమున వచ్చుచున్నది. రాజకీయోద్యోగస్థులందఱును ఇచ్చటనే వాసము చేయుచుందురు. తూర్పుతీరపు ఇనుపదారి ఈ పట్టణముమీఁదుగఁ బోవుచున్నది.

అనకాపల్లి (తాలూకా). ఈ తాలూకా చెన్నపురి రాజధానిలో నున్న విశాఖపట్టణము జిల్లాకు ఆగ్నేయ దిక్కున ఉ. ౧౭°౨౯'-౧౭°౫౫', తూ ౮౨°౫౭'-౮౩°.౧౫' మధ్యనున్నది. దీని విస్తీర్ణము ౭౯౭ చదరపుమైళ్లు. ఇందలి జనసంఖ్య ౧౬౫౪౭౮. ఈతాలుకాలో ౧౪౩ గ్రామములున్నవి. అనకాపల్లి ఈతాలూకా యొక్క ముఖ్య పట్టణము. ఈతాలూకా రమారమి ౧౨౨౦౦౦ రూపాయిలు చెల్లుచున్నది. ఈ తాలూకాయొక్క ఉత్తరభాగము మంచినీటి వసతిగలదియును, సారవంతమైనదియు నగుటచేత వరి, చెఱుకుగడ మొదలగు పంటలచ్చట పండును. సముద్ర తీరముననున్న భూమి ఇసుకనేలయైనందున మంచి పైరులచ్చట, పండవు. ఇది ఒక జమీందారీ తాలూకా. ఈ జమీందారీ కొన్నిభాగములుగ విభజింపఁబడి యున్నది. ఇవి గోడేవారికిని, కాశింకోట వారికిని, విజయనగరము, చీపురుపల్లి ఎస్టేటు ధార్లకును చెంది యున్నవి. పూర్వము కాశింకోట శ్రీకాకుళము సర్కారు యొక్క ఫౌజుదారీ అయియుండెను.

అనక్రియన్. గ్రీకుకవి. క్రీ.పూ. ౫౬౦ ప్రాంతమున ఆశియామైనరులో జన్మించెను. విఖ్యాతుఁడగు సైరస్ ౫౪౫ లో ఏసియాలో గ్రీకువారిక్రిందనున్న పట్టణములను ముట్టడించినపుడు, అచ్చటినుండి 'త్రేసు' పట్టణమునకుఁ బారిపోయెను. అచ్చటినుండి శామాస్‌నకుఁ బోయి 'పాలిక్రేటిస్' అను

రాజుచే గౌరవింపఁబడి యాతని యాస్థాన కవిగా నుండెను. ఆరాజు కాలముచేసిన తరువాత ఏథెన్సు పట్టణమున నధికారిగానుండి 'హిప్పార్కస్' అనువాని యాశ్రయమున నుండెను. వాఁడును చనిపోయిన తరువాత నీతఁడు తన జన్మభూమియైన టయాసునకు తిరిగివచ్చెను. ఇతఁడు ౮౫ సంవత్సరములు బ్రతికియుండెనని చెప్పెదరు.

ఇతఁడు కొన్ని దేవతాస్తుతులను రచించెను. పచ్చిశృంగారముగల భావగీతములు కొన్ని యీతని పేరున గలవు. కాని కొందఱుపండితు లవి యీతనివికావని తలంచెదరు.

అనఘ: శాకద్వీపమునందలి నది.

అనఘుఁడు: ౧. ఒక గంధర్వుఁడు. ౨. ఒక రాజర్షి.

అనచార్సిస్: సిరియన్ తత్త్వవేత్త. క్రీ. పూ. ౬౦౦ ప్రాంతమున నున్నవాఁడు. గ్రీసురాజధానియైన ఏథెన్సునకువెళ్లి సోలన్ వలన గ్రీకుజ్ఞానమంతయు నేర్చుకొనెను. ఆదేశమునందు సప్తర్షులుగా (Seven Sages) నెంచఁబడినవారిలో నొక్కఁడు. తన దేశమునకుఁ దిరిగివచ్చి తానునేర్చిన విద్యలన్నియుఁ దన దేశస్థులకు నేర్పెను. ఇతఁడు యజ్ఞము చేయుచుండఁగా నతని తోడఁబుట్టినవాఁ డీతనిని చంపెను.

అనధ్యాయము: చేయఁదగని కాలము. బడి విడువు). పూర్వకాలపు వీధి బ మాస్యకును, అమావాస్యకును చుండిరి. అట్టి దినములనే అనధ్యాయము లనిరి. ఎప్పుడెప లకు సెలవు ఈయవలసిన దన్న స్మృతికారులు మిక్కిలి సూ నియమములను జేసిరి. అన మొదట వేదాధ్యయన మని వేదము నెప్పుడు పఠింపవలయు పఠింపఁగూడదు, అన్న చర్చలో లన్నియుఁ బుట్టినవి. అవియే ములను బోధించు పాఠశా నుపయోగించినవి.

అనధ్యాయములు రెండు ములు, నైమిత్తికములు. నిశ్చి ప్పుడును ఆయా కాలములంద నవి నిత్యములు; అమా మాస్యా, చతుర్దశీ మొదలై వాస్యా గురుంహన్తి శిష్యంహ (అమావాస్యరోజు అధ్యయన గురువు చచ్చును. చతుర్దశి యనము చేసినయెడల శిష్యు అన్న వాక్యము సుప్రసిద్ధవ మనఁగా తప్పక వచ్చునదికా ణముచే నొకప్పుడువచ్చును,

ఉరుములు మెరుపులతోఁ గొప్ప వర్షము పడ్డ నాఁడు అనాధ్యాయము, పాఠశాలకు సెవ గ్గైన పెద్దలు వచ్చినప్పుడు అనధ్యాయము. 'శిష్టాగమనా దనాధ్యాయః' (పెద్దలు వచ్చినందున నాట విడుపు) అన్న వాక్యము సంస్కృత పండితు లెఱింగినదియే.

ఏవి యనధ్యాయ దినములన్న సంగతిని గుఱించి వేఱువేఱు స్మృతికారులు వేఱువేఱు విధముగ వ్రాసియున్నారు. వాని నన్నిటిని అనధ్యాయములుగా నెంచిన యెడల నధ్యయన దినములకంటె ననధ్యాయ దినములే యెక్కువయగును. మనుస్మృతిని అనుసరించి యీ క్రింద ననధ్యాయ దినముల పట్టిక నిచ్చుచున్నాము :-

అనధ్యాయకాలములు

వర్షాకాలమునందు పగలు, గాలి దుమారము వచ్చినయెడలను రాత్రిగాలి వీచిన యెడలను (౧౧౨) ; ఉరుము, మెఱుపు కలిసిన వర్షము వచ్చినప్పుడు, ఎక్కువగ నుల్కాపాతము జరిగి నప్పుడు, మరల మరుదినము ఆ కాలమువఱకు (౧౦౩) ; అకాలముగ మేఘములు వచ్చినప్పుడు (౧౦౪) ; అంతరిక్షమున ధ్వని అయినప్పుడు, భూకంపమయినప్పుడు, ఆకాశమండలి గ్రహాదులకు పరివేషము కలిగి నప్పుడు, మరునాఁడు మరల నా కాలము వఱకు (౧౦౫) ; మంచుపట్టినప్పుడు, రెండు సంధ్యాసమయములు, అమావాస్య, చతుర్దశి, పౌర్ణమాస్య, అష్టమి (౧౧౩) ; అమావాస్య గురువును చంపును, చతుర్దశి శిష్యునిం జంపును, అష్టమీపౌర్ణమాస్యలు విద్యను నాశముఁ జేయును; కావున ఆ దినములలోఁ జదువుట మానివేయవలయును. (౧౧౪) ; దుమ్ముతోఁ గలిసి వర్షము కురిసిననాఁడును, ఆకాశమెఱ్ఱగానున్న నాఁడును, నక్కలు కుక్కలు కూయునప్పుడును, గాడిదలఱచునప్పుడును, (౧౧౫) ; గ్రామములోనికి దొంగలు వచ్చినప్పుడును, గ్రామమునకు అగ్నిభయము కల్గినప్పుడును (౧౧౮) ; ఉపాకర్మ సమయమందును, ఉత్సర్గసమయమందును మూఁడు దినములు, అష్టకములకును, ఋతువుల అంతమునందును మూఁడుపూటలు అనధ్యాయము (౧౧౯); చుట్టమువచ్చినప్పుడు ఆతని సెలవుపుచ్చుకొని అధ్యయనము చెప్పవలెను (౧౨౨) ; గురుశిష్యుల నడుమనుండి పశువు, కప్ప, పిల్లి, కుక్క, పాము, ముంగిస, ఎలుక పోయినయెడల నొకపగలు రాత్రి అనధ్యాయము. [మనుస్మృతి ౪-వ అధ్యాయము

అనన్యదాసుఁడు: హిందీ కవి.

అక్బరు సమకాలికుఁడు. బికానీరు సంస్థానకాపురస్థుఁడు. కాయస్థకులీనుఁడు. భగవద్భక్తుఁడు. ఇతనికాలమునందు బికానీరు

రాజ్యమును రాయసింహుఁడను రాజు పాలించుచుండెను. అతని తమ్ముఁడగు పృథ్వీరాజు 'ఒకసారి వైరాగ్యవశుఁడై ప్రపంచమును విడిచెద ననఁగా నీకవి యతనికి సంసారమునందుండియే పరమార్థము సాధింపవలెనని బోధించెను.

అనపోత నాయుఁడు: వేంకటగిరి సంస్థానాధీశ్వరుల పూర్వులలో నొక్కఁడు. సింగమనాయని పెద్దకుమారుఁడు. ఇతఁడు క్రీ. శ. ౧౩౨౩ మొదలు ౧౩౮౦ వఱకుఁ బ్రతికి యున్నట్టు కానవచ్చుచున్నది. ఇతని రాజధాని రాచకొండ. ఇది నైజాము రాజ్యమందలి నల్లగొండ జిల్లాలో హైదరాబాదునకుఁ దూర్పుగ ౩౨ మైళ్లమీఁద నున్నది. ఈతఁడు జల్లిపల్లెకోటను ముట్టడించి యందున్న చళుక్య వంశపు రాజులను, వారికి సాయముగ వచ్చిన పెక్కు రెడ్లవారిని గెలిచెననియు, ఇనుకుర్తి కోటను ముట్టడించి యందలి రాచవారిని గెలిచెననియు 'వెలుగోటి వారి చరిత్ర' మను గ్రంథమువలనఁ దెలియుచున్నది.

ఈ యనపోతనాయఁడు ఓరుగల్లు, గోలకొండ భువనగిరి మొదలయిన దుర్గములను గెలిచెననియు, ఇప్పటి నైజాము రాజ్యములో నున్న తెలుఁగు జిల్లాలన్నియు నాతని స్వాధీనమందుండెననియు, ఆతఁడు స్వతంత్రుఁడై రాజ్య పరిపాలనము చేసెననియు, ధరణికోట సమీపమున అనపోతరెడ్డి, అనవేమారెడ్డి అను రెడ్డిరాజులతో ననేక యుద్ధములు జరుపుచు వచ్చెననియు, ఈతఁడును ఈతని తమ్ముఁడును ధరణికోటలో రెడ్డివా
చేయుచుండఁగా, తురుష్క
ఖానిపై దండెత్తివచ్చిరని
రనియు, అనపోత నాయ
వర్తికడకు రాయబారుల
రాజ్యముమీఁదికి దండెత్తి
ననియు, ఆ సంగతి తెలిసి
నయిన మహమ్మదుషా వీరి
వచ్చెననియు, అనపోత
గోలకొండ యిచ్చి సంధి చే
ఖుల చరిత్రము, ౩-వ భాగ
బడినది.* కాని యిందుల
నాధారములు చూపఁ
యింకను శోధింపవలసిన వి

అనపోతారెడ్డి:
లము నందలి కొండవీటిలో
రెడ్డి రాజులలో రెండవవా
ములో నొక్కఁడైన యెఱ్ఱా
హరివంశమును కృతినొంద
మారెడ్డి (క్రీ. శ. ౧౩౨౦-
తండ్రి. తండ్రితరువాత నీత
వచ్చెను. ఈతని తరువాత ర
మారెడ్డి (౧౩౬౨-౧౩౮౦)
కుమారగిరి రెడ్డి (౧౩౮౦-
కుమారుఁడు. రాజమహేంద్ర
ముచేసిన కాటయ వేమా

* పుట ౨౦-౫౩.

నల్లుఁడు, మేనల్లుఁడు. శాసనములను బట్టి చూడఁగా ఈతఁడు ౧౩౪౦ మొదలు ౧౩౬౧ వఱకుఁ బంద్రెండు సంవత్సరములు రాజ్యముచేసినట్లు కానవచ్చుచున్నది.*

ప్రోలయ వేమ హరివంశమును కృతి నొందువఱకు నీతఁడు పెద్దవాఁడై సైన్యాధిపతిగఁ దండ్రికిఁ దోడగుచుండెనని హరివంశమందలి యీ క్రింది పద్యమువలనఁ గానవచ్చుచున్నది:-

శా. వేమక్ష్మాధిపు సార్వపుత్రుఁడు దయా
భిభ్రాజి యవ్యాజతే
జోమార్తాండుఁడు కీర్తనీయ సుగుణ
స్తోమంబులం దేమియుఁ
గామస్వార్థికి లొచ్చుఁగాక సరియై
రాజిల్లె రాజార్చితుం
డాముష్యాయణుఁ డెందుఁ బోతయచమూ
పాగ్రేస రుండిమ్మహిన్

ఈ యనపోతారెడ్డి కృష్ణానదియొడ్డున అమరావతి సమీపమునందు 'కేసరా'జను వానితోఁ బోరాడి యాతనిని ఓడించినట్లును, ఆతని యాస్థానమందు వెన్నెలగంటివారను కవులుండినట్టును, వారిచే నతఁడు కృతులందినట్లును వెన్నెల కంటి సూరన్నచే రచింపఁబడిన విష్ణుపురాణము నందలి యీ క్రింది పద్యమువలనఁ దెలియుచున్నది :-

ఉ. ఈ నిఖిలంబు మెచ్చ నమ
రేశ్వర దేవుఁడు చూడఁగృష్ణ తీ
రేనదిసాక్షిగా నసికి
నిల్చిన రావుతుఁ గేసభూవిభుం
గానకుఁ దోలి వెన్నడిచి
కాచిన వేమయి యన్నపోత భూ
జానికి సత్ప్రబంధము
లొసంగిన వెన్నెలగంటి వారలోన్

ఈతనియొద్ద వేమన అనువాఁడు మంత్రిగ నున్నట్టు అమరావతిలోని యొక శాసనము వలనఁ దెలియుచున్నది. ఈ మంత్రి తండ్రి పేరు మల్లినాథుఁడు. ఈతఁడు ధాన్యావతి (ధరణికోట, అమరావతి)లోని అమరేశ్వరుని మరలఁబ్రతిష్ఠించెను. ఇది ౧౩౬౧ లోని శాసనము.*

ఈతని రాజ్యకాలమందు దేశాంతరముల నుండియు, ద్వీపాంతరముల నుండియు వర్తకు లీతని రాజ్యమునకు వచ్చుచున్నట్టును ఎగుమతి దిగుమతి వ్యాపార మెక్కువగ జరుగుచున్నట్టును కానవచ్చుచున్నది. బాపట్ల తాలూకాలో మోటుపల్లి యను రేవు గ్రామము కలదు. అది కాకతీయులకాలము నుండియు సముద్ర వర్తకమునకుఁ బేరొందిన రేవు.§ అచ్చట వీరభద్రస్వామి దేవాలయపు మండపమందలి నొక్క స్తంభముమీఁద అన

*కొండవీటిరెడ్ల ప్రభుత్వకాలమింకను నిశ్చయముగ నిర్ణయము కాలేదు. రెండుమూఁడు సంవత్సరములు హెచ్చుతగ్గుగ తేలినదనవచ్చును. ఇంకను క్రొత్తక్రొత్త శాసనములు వెలువడిన కొలఁదిని ఈ హెచ్చుతగ్గులు సరి కాఁగలవు.

*Local Records in the Madras Manuscript Library Vol. 38. p. 28 and vide No 258 of the Madras Epigraphical Collection for 1897.

§ No. 600 Madras Epigraphical Collection for 1909.

పోతారెడ్డి శాసనమొకటి, శా. శ. ౧౨౪౦ (క్రీ. శ. ౧౩౧౮) లో వేయించినదికలదు.* అది సంస్కృతము, తెలుఁగు, అఱవము అను మూఁడు భాషలలోనున్నది. అఱవవర్తకులు పెక్కుమంది అఱవదేశము నుండియు, సింహళముమునుండియు వచ్చుచున్నందున శాసనము అఱవభాషయందుఁగూడ వ్రాయఁబడినదని తోఁచుచున్నది. అంతకుఁ బూర్వము వర్తకులకుఁగల యిబ్బందులును ఈరాజు తొలఁగించి వర్తకము అప్రతిబద్ధముగ జరుగునట్లు చేసెను. మోటుపల్లిలోఁగాపురముండు బరదేశీయులగు వర్తకులు, దూరదూరపు దేశములతోను, ద్వీపములతోను వర్తకము చేయువారు అనేకులుండిరి. ఈరాజునకుఁ బూర్వము ఇట్టివర్తకులకు నిష్టము వచ్చినప్పుడు, మోటుపల్లికివచ్చుటకును,ఇష్టమువచ్చినప్పుడు అచ్చటినుండి వెడలుటకును వీలులేకయుండెను. అధికారులసెలవు పుచ్చుకొని గాని ఆగ్రామమునకు వారువచ్చుటకు, అచ్చటినుండివెడలుటకు వీలులేదు. ఈ వర్తకులు

*Nos. 601 and 602 of the Madras Epigraphical Collection for, 1909.

ఇందు 601 అఱవశాసనము, 602 తెలుగుశాసనము. తెలుఁగుశాసనమునకంటె నఱవశాసనమునందు సుంకముల వివరమధికముగఁగలదు. మోటు పల్లెలోని అఱవ శాసనము, తెలుగు శాసనముల నకళ్లు పంపినందులకు దొరతనమువారి శాసనశోధన శాఖకు సభ్యులగు బ్రహ్మశ్రీ రావుసాహేబు హెచ్. కృష్ణశాస్త్రిగారికి కృతజ్ఞుఁడను. ము. సం.

అపుత్రిక దండమను పన్ను చె... డెను. ఈ యిబ్బందులను తీసి... రెడ్డి యీద్వీపాంతర వ్యాపా... విహారమేర్పఱ్చెను. క్రొత్త... వచ్చువారికి నుండుటకు నివే... వ్యవసాయమునకు భూమియు... ఈశాసనాను సారముగ వర్త... ననుసరించి రావచ్చును, పో... నిష్టమున్నవానికి నిష్టమున్న... కులనమ్మవచ్చును. సరుకులు ... మునకుఁ గొంపోవచ్చును. దొరతనమువారియుద్యోగస్థు... గూడదు. ఇట్లు ఈరాజు పద... మునందు నొక విధమైన అప్ర... తత్త్వమును (Principle of ... స్థాపించెనని చెప్పవచ్చును. అ... కులను బాధపెట్టి సుంకములె... కుండ సుంకము తీసికొనవలసి... యింతకంటె నెక్కుడు తీసి... యుఁ జెప్పఁబడియున్నది. ఇట్ల... తెలుఁగుదేశము వారు ద్వీ... నవ్యాహతముగ వర్తకము ... యు, నితర దేశములనుండివచ... గూడ నన్యాయము జరుగఁ... నియమములను అప్పటి రాజు... రనియు స్పష్టముగఁ దెలియుచ... నము రాజునాజ్ఞచే నాతని ... సోమ తంత్రీస్వరునిచే వేయఁ...

అనపోతారెడ్డికి దొడ్డాంబిక యను తోఁబుట్టువుండెను. ఆమెను కాటయరెడ్డికిచ్చిరి. వారిరువురికిఁ బుట్టినవాఁడు కాటయవేమ. ఈతనికే అనపోతారెడ్డి తనకూతురైన మల్లాంబికనిచ్చెను.* ఇతనికిఁ గుమారగిరిరెడ్డియను కుమారుఁడుండెను.

"అనపోతానాయని తమ్ముఁడైన మాదానాయుఁడు దన్నాలకోటయొద్ద నన వేమారెడ్డి బంధువైన యనపోతారెడ్డితో యుద్ధముచేసి యతనిఁ దఱిమి జయమునుబొందెను" అని వెలుగోటివారి చరిత్రలోనున్నది కాని, దీనికి నచ్చటనేమియు నాధారముచూపఁబడలేదు.

సంస్కృత శాసనములందు తెలుగు శాసనములందును ఈతనిపేరు అనవోత్త, అన్నవోత, అంనవోత అనివచ్చునేగాని 'అనపోత' అని ఉండదు.

అనముగుర్తి రంగయ్య.

నందవరీకనియోగి బ్రాహ్మణుఁడు. తిమ్మయామాత్యునకుఁ బుత్రుఁడు. యాదవగిరిమాహాత్మ్యమును రచించి రావూరివేంగామాత్యున కంకితము చేసెను.

అనమసముద్రముపేట.

నెల్లూరుజిల్లా ఆత్మకూరు తాలూకాలోని యొకపల్లె. ఇచ్చట ఖాజా రహిముతుల్లా సాహెబ్ అనువానిచేఁ ౧౬౦ సంవత్సరములకు మున్ను కట్టింపఁబడిన సుప్రసిద్ధమగు మసీదు కలదు. ఈ మసీదునకు ౮ గ్రామముల ఇనాము కలదు. ఇచ్చట జూలై మాసమున పెద్ద ఉరుసు (ఉత్సవము) జరుగును.

అనమిత్రుఁడు.

౧ (సూ. వం.) నిఘ్నుని పుత్రుఁడు.

౨ (చం. వం.) యదుకులోత్పన్నుఁడైన వృష్ణియొక్క యిద్దఱు పుత్రులలో రెండవవాఁడు. నిమ్ని, శిని, వృష్ణి యనువారతని పుత్రులు.

అనరణ్యుఁడు.

(సూ. వం.) ఇక్ష్వాకు వంశజుఁడగు పురుకుత్సుని మనుమఁడు. త్రసదస్యుని రెండవ కుమారుఁడు. ఇతనికి హర్యశ్వుఁడు, బృహదశ్వుఁడు అను ఇద్దఱు పుత్రులు కలరు. ఇతఁడు అయోధ్యలో రాజ్యము చేయుచుండఁగా లంకాధిపతియైన రావణుఁడు దిగ్విజయార్థమైవచ్చి యీతనిని ఓడించెను. యుద్ధమునందుఁ గూలి యీతఁడు ప్రాణములు విడుచుచు 'నావంశమునందు జన్మించినవానిచేతనే నీవును నీవంశమును నాశముఁజెందుదురు గాక' మని శాపమొసఁగెను [వా. రా. ఉత్తర. స. ౧౯.

౨. (సూ. వం.) ఇక్ష్వాకు కులోత్పన్నుఁడైన ఋతుపర్ణుని పౌత్రుఁడగు సర్వకాముని (సర్వకర్ముని) యిద్దఱు పుత్రులలోఁ బెద్దవాఁడు. కొడుకు నిఘ్నుఁడు.

*తొత్తరమూడి శాసనము. (Epigrahi Indica vol. IV, P 328.

అనర్ఘరాఘవము. మురారి యను కవిచే రచింపఁబడిన సంస్కృత నాటకము. సంస్కృత వాఙ్మయమునందు కాళిదాస భవభూతులకుఁ గల గౌరవము ఈ కవికి లేక పోయినను, ఈతఁడు రెండవ తరగతి కవులలో నొకఁడుగఁ బరిగణింపఁబడునని చెప్పవచ్చును. ఇతనిది మౌద్గల్యగోత్రము. భట్ట శ్రీవర్ధమానుఁడను మహాకవి యీతని తండ్రి, తంతుమతి ఈయనతల్లి. ఈ సంగతు లీతని నాటకమునందలి ప్రస్తావనలోఁ జెప్పఁబడి యున్నవి.* ఈతనిది యేదేశమో తెలియదు. కాని కావ్యమాలలో నీ నాటకమును అచ్చువేసినవారు 'దీనికి కాశ్మీరమునందు నెక్కుడు ప్రచారము కల' దని వ్రాసినారు. అందుచే నీకవి యా దేశమువాఁడేమోయని కొంద ఱనుకొనిరి. కాని నాకుఁ జూడ నీకవి యాంధ్రదేశమువాఁడేమో యని సంశయము తోఁచుచున్నది. ఎందు కనఁగా, ఈ నాటకమునందు ఏడవయంకములో, శ్రీరామాదులు రావణసంహారానంతరము పుష్పకవిమానమెక్కి అయోధ్యకు వెళ్లుచుండఁగాఁ గ్రిందఁగా నవచ్చిన కొన్ని దేశములను, పట్టణములను, క్షేత్రములను వర్ణించునట్టి సందర్భమునఁ గవి

* "అస్తిమౌద్గల్య గోత్రసంభవస్య మహాకవేర్భట్ట శ్రీవర్ధమాన తనూజన్మన స్తన్తుమతీనన్దనస్య మురారేః కృతి రభినవ మనర్ఘరాఘవం నామ నాటకమ్."

ఆంధ్రదేశమందలి భీమేశ్వరుని ...
యున్నాఁడు:—

విభీషణః:-(దక్షిణతో ...
...ప్రణస్యోత్తమయి మస్థ్రి) వి...
సప్త గోదావరీహారకలాపైరి న...
వాన్భీమేశ్వరః

అర్థము:—విభీషణుఁడు:—
...వైపుచూపి) దేవా! ఆంధ్రదే...
యేడు గోదావరు లను హా...
లకు నొక్క నాయకమణియ...
వంతుండైన భీమేశ్వరునకుఁ ...
చేయుఁడి.

దీని తరువాత,యీవిభీష...
పద్యమును, శ్రీరాముని నోట...
ములును భీమేశ్వరుని స్తుతి ...
వానితో మనకుఁబనిలేదు.
యఁబడిన 'అష్టి విషయము' '...
'భీమేశ్వరుఁడు' అను పదములు...
దేశమునందు విశేష ఖ్యాతి...
క్షేత్రమును (ద్రాక్షారామమ...
యుఁజూడ నీ కవి యాంధ్రుఁడ...
మందలి యభిమానము చేత ...
ముగా భీమేశ్వరునకు శ్రీరాము...
పెట్టించె ననియు నూహింప...

కాని ఈ కవి ప్రకరణము...
రునకుఁ బూర్వము మహారా...
విదర్భలోని కుండినపురమును...
ద్రావిడ దేశమందలి కా...

వర్ణించియున్నాఁడు. కావున 'ఈ కవి ఆయాదేశముల వాఁడని కూడఁ జెప్పవలసి యుండును' అని కొందఱాక్షేపింపవచ్చును. కాని అట్లనుట సరికాదు. కుండినపురము, కాంచీనగరము భరతఖండఖ్యాతిగల పట్టణములు. కవి యెచ్చటి వాఁడైనను ఆపట్టణ నామములను ఎఱిఁగియుండును. ద్రాక్షారామము అట్టి భరతఖండఖ్యాతిగల క్షేత్రము కాదు. దానికి తెలుఁగు దేశమందుమాత్రము ఖ్యాతిగలదు. ఆఖ్యాతికిని రెండు మూఁడు జిల్లాలకంటె నెక్కుడు వ్యాప్తిలేదు. తెలుఁగు వాఁడైనఁగాని సాధారణముగ నీ క్షేత్రమును ఎఱిఁగియుండఁడు. ఒకవేళ నెవరి వలననైన విన్నను, కాంచీపట్టణమందలి మీనకేతనునితో సమానముగ భీమేశ్వరుని నాటకమునందుఁ బేర్కొనవలయుననియాతని కేల బుద్ధిపుట్టును ?

ఈ కవికాలము నిశ్చయముగఁ దెలియదు. కొందఱీతఁడు తొమ్మిదవ శతాబ్దమునకుఁ బూర్వుఁడనిరి*. కొందఱీతఁడు అర్వాచీనుఁడని తలంచుచున్నారు. కవి కాలనిర్ణయమును గుఱించి 'మురారి' శబ్దముక్రిందనవిస్తరముగఁ జర్చింపఁబడును.

'అనర్ఘరాఘవ' మను నాటకమునందు రామాయణీయకథ సంక్షేపముగఁ గలదు. అనర్ఘమనఁగా అమూల్యము, పూజ్యము, దుర్లభము. పూజ్యుఁడైన రాఘవుని కథ కలదిగనుక అనర్ఘరాఘవమయ్యె. విశ్వామిత్రుఁడువచ్చి రామునిఁదీసికొని పోవుకథాప్రసంగము మొదలు, శ్రీరాముని పట్టాభిషేకమువఱకుఁగల శ్రీరామకథ యేడంకములలో ఈ నాటకమునందు వర్ణింపఁబడినది. కథ పెద్దదియు, నాటకము చిన్నదియు నగుటచే, పెక్కుకథా విశేషములు రంగము మీఁదఁ జూపుటకువీలులేక, విష్కంభకాదులలోఁ బాత్రలచేఁ జెప్పింపఁబడినవి. ప్రథమాంకమునందు, విశ్వామిత్రుఁడు దశరథుని యొద్దకు వచ్చుట, రామలక్ష్మణులను గొనిపోవుట, ద్వితీయాంకమునందు రామలక్ష్మణులు విశ్వామిత్ర యజ్ఞమును రక్షించి రాక్షసులను శిక్షించుట, తృతీయాంకమునందు రాముఁడు శివధనుస్సును ద్రుంచుట, చతుర్థాంకమునందు పరశురాముని సత్వము హరించుట, పంచమాంకమునందు వాలివధ, సుగ్రీవాభిషేకము, షష్ఠాంకమునందు రావణునివధ, సప్తమాంకమునందు శ్రీరామాదులు పుష్పకవిమానమునెక్కి అయోధ్యకు వెళ్ళుచు క్రిందఁగానవచ్చు పట్టణాదుల వర్ణించుట, పట్టాభిషేకమును, వర్ణింపఁబడినవి. ఇందు రామవనవాసాదులు, సీతాహరణము మొదలయిన రామాయణీయ ముఖ్యప్రసంగముల సంవిధానకము (Plot) ఈ ప్రకారము కూర్చఁబడినది:-

* కావ్యమాలా, అనర్ఘరాఘవమ్, ౧-వ పుటక్రింది టిప్పణి చూఁడుము.

సీరధ్వజజనకుని యింటఁ బెరుగుచున్న అయోనిజయగు సీతను తనకిమ్మని యడుగుటకు రావణుఁడు తనపురోహితుఁడైన శౌష్కలుని జనకునియొద్దకుఁ బంపును. ఆతఁడు విఫల మనోరథుఁడగును. అంత సీతను హరించుట యెట్లన్న యాలోచన రావణుని మాతామహుఁడును, మంత్రియునగు మాల్యవంతునకుఁగలిగి, రాముని మిథిలలోగాని, అయోధ్యలోగాని ఓడించి సీతను దెచ్చుట యసంభవముగాన, సీతా రాము లరణ్యమునకు వచ్చినప్పుడు అచ్చట రాముని మోసపుచ్చి సీతను అపహరింపవచ్చునని యతఁడు నిశ్చయించెను.

ఇంతకుఁ బూర్వమే సుగ్రీవుని సాహాయ్యార్థమై శ్రీరాముని నరణ్యమునకు రప్పించుటకుగాను సంపాతి శబరిని పంపెనని యాతఁడు వినియుండెను. శబరి వెళ్ళి కైకదాసియగు మంథర శరీరమునఁ బ్రవేశించి దానిచే కైకేయికి దుర్బోధచేయించెను. అందుమీఁద రాము నరణ్యమున కంపుఁడనియు, భరతునికి రాజ్యముగట్టుఁడనియు కైక దశరథుని వరము లడిగెను. ఇట్లు సీతా రామ లక్ష్మణు లరణ్యమునకు వెళ్ళుట సంభవించినది.

ఈనాటకమున ప్రథమాంకము నందలి దశరథ విశ్వామిత్ర సంభాషణంబును, చతుర్థాంకమునందలి శ్రీరామ పరశురామ సంవాదంబును, సప్తమాంకమందలి నానాదేశాది వర్ణనలును రమ్యముగానున్నవి. ఈ నాటక

మును కీర్తిశేషులయిన ఆకుం
శాస్త్రులుగా రాంధ్రీకరించి

అనర్వ. వృత్రాసుర
నొక్కఁడు. [భా

అనల. ౧ రోహిణీ
కన్యలలో రెండవది. ఈ
కన్యకలదు.

౨. మాల్యవంతుఁడను
సుందరియను భార్యయందుఁ
విశ్వావసు రాక్షసుని భా
కుంభీనసి. [వా. రా

అనలుఁడు. ౧ ఒక
అష్ట వసువులు). ఇతనికిఁ గు
శాఖ, విశాఖ, నైగమేయు
ఈ మన్వంతరము నందితఁడు
నకు నధిపతి. [చూ.

౨ రాక్షసుఁడు. మాలి
యుని నలుగురు మంత్రులలో


౩. కుశుని వంశజుఁడగు ని
కొడుకు.

అనలురు. దేవత
నలువది తొమ్మండ్రుగురు.
వాఁడు అభిమానుఁడు.
మానశుచులను ముగ్గురు కొ
కొడుకులు నలువది యైదుగుఁ

అనవద్య. కశ్యపు
కును బుట్టిన యప్సరసలలో

అనవేమారెడ్డి. కొండవీటిలోఁ బ్రభుత్వము చేసిన రెడ్డిరాజులలో మూఁడవ వాఁడు. ప్రోలయరెడ్డి యొక్క రెండవకుమారుఁడు, అనపోతారెడ్డికిఁ దమ్ముఁడు. ఈతనికి అనవేమ, అన్నవేమ అను రెండు పేళ్లునుకలవు. శాసనములను బట్టి చూడఁగా నీతఁడు అనపోతారెడ్డి తరువాత రాజ్యమునకు వచ్చి క్రీ.శ. ౧౩౬౨ మొదలు ౧౩౮౦ వఱకును రాజ్యము చేసినట్లు కానవచ్చుచున్నది. ఈతఁడే రాజధానిని కొండవీటికి మార్చినట్లు కనఁబడుచున్నది. ఈతని తండ్రియైన ప్రోలయవేమకు 'అన్నమవేమ' యన్న పేరున్నందునను, ఈ వంశమునందుఁ బెక్కు 'వేమ'లున్నందునను పెక్కుచరిత్రకారులు ఈతండ్రి కుమారులలో విభేదము చేయలేకయు, నితర 'వేమ'లకు వీరికి భేదము చేయలేకయు నొకరిని మఱి యొకరినిగాఁదలఁచి కాలపురుష విపర్యాసములఁ జేసిరి. ఇట్టి భ్రమపోయి యీవంశమందలి రాజులపేళ్లు తెల్లమగుటకై శాసనములను, కావ్యములను అనుసరించి యీ క్రింద వీరి వంశవృక్షము నిచ్చుచున్నాము.

కొండవీటి రెడ్ల వంశవృక్షము



సూచన:—ఈ వంశవృక్షమునందు ప్రభుత్వము చేసిన రాజులకు ౧, ౨, ౩ మొదలయిన అంకెలు వేయఁబడినవి.

ఈ వంశవృక్షమును బట్టిచూడ మొట్ట మొదట కొండవీటిలో రాజ్యము చేసిన రెడ్డి అన్నమ్మపోలయులకుఁ గుమారుఁడైన వేమా రెడ్డి. ఇతఁడన్నమ్మ కుమారుఁడైనందున హరివంశము మొదటి పద్యమునందే యీతని ఎఱ్ఱాప్రగడ 'అన్నమ వేమ' యనియెను. ఇంతేకాని యీతఁడు అనవేముఁడుకాఁడు. ఇతనినిగు ర్తుగొఱకు సాధారణముగ ప్రోలయ వేమ యందురు. ఈతని కిద్దఱు కుమారులు అనపోత, అనవేమ. వీరు క్రమముగ కొండ వీటి రాజ్యమును బాలించిరి.

ఎఱ్ఱా ప్రగ్గడ హరివంశము వ్రాసి ప్రో లయ వేమారెడ్డి కంకితము చేసినకాలమందు అనవేమారెడ్డి పుట్టినట్లు కనఁబడదు. లేదా మిక్కిలి పసివాఁడుగనైనను ఉండవలెను. ఎందుకన నెఱ్ఱాప్రగడ ప్రోలయ వేముని పెద్ద కుమారుఁడైన అనపోతని వర్ణించి, అనవే ముని పేర్కొనక, యీతని పెత్తండ్రి కుమారుఁడైన కోమటిని వర్ణించియున్నాఁడు.

ఆంధ్ర నైషధమును కృతినొందినమామిడి సింగన్నకుఁ దండ్రియైన మామిడి పెద్దన్న అనవేమారెడ్డికి మంత్రిగనున్నట్లు ఆంధ్రనైష ధమునందలి ఈక్రింది పద్యమువలనఁ దెలియు చున్నది.

మ. అనతారాతి వసుంధరారమణ స
ప్తాంగాపహారక్రియా
ఘనసంరంభ విజృంభమాణ పటుదోః
ఖర్జూద్వితీయార్జునుం
డనవేమాధిపరాజ్యభార భరణ
వ్యాపార దక్షుండు
ద్దన మంత్రీశుఁడు మామిడన
తన్మాత్రుఁడే చెప్పఁగ

అనవేమారెడ్డి పేరు తె నందు విశేషముగ, నితర రె నెక్కుడుగఁ గీర్తింపఁబడును. ఉత్తరమున సింహాచల దక్షిణమున కంచివఱకును, దగ్రిము వఱకును పశ్చిమమ వఱకును వ్యాపించినట్లు కాన వరి జిల్లాయందలి కోనసీమ రులో నీతని శాసన మొక శా. శ. ౧౨౯౬ (క్రీ. శ. తన చెల్లెలైన వేమసానియొ యీతఁడుబ్రాహ్మణునకు న గోదావరి జిల్లా అమలాపుర లోని వనపల్లిలో అనవేము శాసనము దొరికినది.* అది (క్రీ. శ. ౧౩౭౭-౭౮) లోనిది డను మంత్రివరునకు నగ్రహా యిమ్మడీంద్రుఁ డప్పటి కాల వ్యవహారములలో నారితేరిన చున్నాఁడు. 'రాజులకు చేయుటయందు మిత్రుఁడు' పొగడ్తగనియె. శ్రీశైలమ

* Epigraphia Indica Vol. III
III p. 59. ఇది ౧౨౭౦ లోని శాస
కృష్ణ దీక్షితుల వారి యభిప్రాం

ముని శిలాశాసన మొకటికల్లదు.* దానిని బట్టిచూడ నతఁడు శ్రీశైలమునందు 'వీర శిరోమండపము' తన పినతండ్రియైన అన్నయ రెడ్డి గౌరవమునకై కట్టించినట్లును, రాజ మహేంద్రాది స్థలదుర్గముల ననేకములఁ బట్టుకున్నట్లును, ఈతనిది వెల్లిచేరిగోత్రమై నట్లును, తెలియుచున్నది. ఈశాసనము శా. శ. ౧౨౭౯ (క్రీ. శ. ౧౩౫౭-౫౮) లోనిది. ఈ శాసనము వ్రాసినవాఁడు బాలసరస్వతి. ఈతఁడు తూర్పుసముద్రమున కంతకును స్వభునైనట్టు కూడ నిందు వ్రాయఁ బడినది. ఇందువలన నితనికాలమందు సముద్ర వర్తకము మెండుగ నుండెనని మన మూ హింపవచ్చును. ఈతని శాసనములలో 'వసంతరాయ' 'తురికానహాయి' 'జగనొబ్బ గండ' మొదలయిన బిరుదులు ఈతనికున్నట్లు వ్రాయఁబడినది.

ఏ శాసనము వలనఁగాని, ఏ గ్రంథము వలనఁగాని యీతనికిఁ బుత్త్రుఁడున్నట్టు కాన రాదు. కాని శ్రీనాథుఁ డీతనికి నొక పౌత్రి (పుత్త్రిని కూఁతురు) ఉన్నట్టును, ఆమెను అల్లాడరెడ్డి (కాశీఖండమును కృతినొందిన వీరభద్రా రెడ్డియొక్క తండ్రి) పెండ్లాడినట్టును కాశీ ఖండమందలి యీక్రింద పద్యములోఁ జెప్పియున్నాఁడు.

మ. అనవేమక్షితిపాల పౌత్రియగు వే
మాంబామహాదేవికిన్
ఘనుఁడయ్యల్లడభూమిపాలునకు సం
గ్రామపార్థు గాండీవుల్
తనయుల్ వేమవిభుండు వీరవసుధా
ధ్యక్షుండు దొడ్డప్రభుం
డును నన్నయ్యయు బాహువిక్రమకళా
టోపప్రతాపోద్ధతుల్.

దీనినిబట్టి చూడ అనవేమారెడ్డికి నొక కుమారుఁడుండెననియు, ఆ కుమారునకొక బిడ్డ యుండెననియు మన మూహింపవలెను. కాని యీ పద్యమునందలి 'పౌత్రి' పదము 'పొరబాటు, దౌహిత్రుఁడని కవి తాత్పర్యము' అని చెప్పుచు నందులకు శ్రీచిలుకూరి వీర భద్రరావుగారిట్లు వ్రాసియున్నారు. "ఈ పై పద్యమునందలి పౌత్రియను శబ్దమునకు దౌహిత్రి (పుత్త్ర్యాః పుత్త్రి) యని యర్థము గ్రహింపవలయును. అల్లాడ దొడ్డభూపా లున కంకితము గావింపఁబడిన శివలీలా విలా సమునఁ గొమ్మ నామాత్యకవి యల్లాడరెడ్డి నిట్లని వర్ణించెను.

"మ. భరితశ్రీనిధి యమ్మహీరమణుఁడో
ప్పుకోశభక్తక్షితీ
శ్వరసూనుండగు భీమలింగసునుజే
శశ్రేష్ఠ సత్పుత్రి భా
స్వర కారుణ్య దశాజనావన విధా
సంధాత్రి వేమాంబికన్
వరియించెం బతిభక్తిగౌరవదృఢ
వ్యాపారనిత్యాంబికన్.

* Epigraphical Reports. 1914—15, p. 115.

"మఱియుం గోరుమిల్లి శాసనమున (౧౪౩౪)

"శచీవ శక్రస్య శివేవ శంభోః
సద్మేవ సా పద్మవిలోచనస్య
వేమాంబికా చోళకులేందుభీమ
భూపాత్మజా భూస్తస్యహిళాస్య జాయా"*

"అని భక్తీశ్వరచోళ నృపాలుఁపుత్రుండగు భీమభూపాలుని పుత్రియగు వేమాంబికను వివాహముఁ జేసికొని యె నని చెప్పఁబడి యుండుటచేత భీమరాజు అనవేమ క్షితినాథుని యల్లుఁడని యర్థముచేసికొనక తప్పదు."+

అనవేమారెడ్డి కాలములో శ్రీనాథుఁడున్నట్లును, ఒకసారి యాతని సభకుఁబోయి యీక్రింది పద్యముతో నాతనిఁబొగడినట్లును పరంపరాగతమైన వదంతికలదు.

అనవేమ మహీపాల స్వస్త్యస్తుతవబాహవే
ఆహవే రిపుదోర్దండ చంద్రమండలరాహవే!

అర్థము:- ఓ అనవేమభూపా! యుద్ధమునందు శత్రువులనెడు చంద్రమండలమునకు రాహువైనట్టినీ బాహువునకుశుభమగుఁగాక.

శ్రీనాథుఁడు కుమారగిరి కా
నున్నట్లు హరవిలాసములన స్పష్ట
వేమారెడ్డి తరువాతనే కుమారగిరి
నకువచ్చి నందున శ్రీనాథుఁడు
కాలమునందు నుండినను నుండవచ
యున్నట్లు నిదర్శనము లేవియులే
ప్రెగడ యాతని తండ్రికాలమం
వాఁడు; శ్రీనాథుఁడీతని కుమారు
కుమారుని) కాలమువాఁడు. కా
వరుల నిద్దఱిని ఈతఁడుచూచి
గౌరవించి యుండవచ్చును. అయి
వంశము వ్రాయుకాలమువఱకు నిత
లేదుగనుక యాతని ప్రభుత్వకాల
నెట్టనబ్రతికియుండకపో వచ్చును;
చిన్నవాఁడుగ నుండవచ్చును.
నెట్టన శ్రీనాథుఁడు పుట్టిన గిట్టిన
ములు స్పష్టముగఁదెలియువఱకు ని
చెప్పనేరము.

ఈతని తరువాత నెంతయో
నకుఁబుట్టిన వెన్నెలకంటి సూరన
పురాణమున నీతని గుఱించి
పద్యముద్రాయుట చూడఁ దెన
మందు నితనిఖ్యాతి కొన్ని వంద

*పై శ్లోకము అల్లాడ దొడ్డారెడ్డి శాసనమందుఁగూడ నున్నది. Epigraphia Indica Vol. V. p. 53.

+ ఆంధ్రుల చరిత్రము 3-వ భాగము, ౨౬3-వ పుట. శివలీలావిలాసమింకను అచ్చుపడలేదు. దాని జీర్ణమైన ప్రతియొకటి శ్రీ మానవల్లి రామకృష్ణకవి గారి యొద్ద వీరభద్రరావుగారు చూచినారఁట. కోరుమిల్లి శాసన మెచ్చటను ప్రకటింపఁబడలేదు. ప్రాచ్యలిఖితపుస్తక భాండాగారమునందు ౧౫-౬-౨౬ గుర్తుగల సంపుటమునందు 3౧౫-వ పుటలోనున్నది. దీనినే 'Elliots collection' అనిఅందురు. దీనినేదొరతనమువారిశాసనాధ్యక్షులు వేమవరము శాసనములు (Vemavaram Plates) అనివ్రాసియున్నారు. Epigraphical Reports 1900 pars 63 & 64.

* ఆంధ్ర నైషధము నంకితమందిన
గన్న అనవేమారెడ్డిమంత్రియని శ్రీయు
రామయ్యగారు వ్రాసియున్నారు (Epi. XI. p. 315, foot-note.). కాని యిది
నైషధముచివరనున్న వచనమునుబట్టి మా
మైదకోమటి వేమునియొక్క మంత్రియను

వఱకు నెక్కుడుగా నున్నట్లు మన మూహింప వలసియున్నది.

క. తనబ్రతుకు భూమిసురలకుఁ
దనబిరుదులు పంటసంశధరణీశులకున్
దననయము భూమిప్రజలకు
ననవేమనయిచ్చెఁ గీర్తివిభవుండగుచున్ [౧-వఱ,

అనసూయ. కర్దమఋషికి దేవహూతివలనఁ బుట్టిన తొమ్మిదిమందికన్యలలో నొక్కతె. అత్రిఋషికిఁబత్ని. ఈమె విఖ్యాత పతివ్రత, మహాతపస్విని. ఒకసారి దశవర్షాత్మకమైన యనావృష్టికల్గి కఠినమ్మైన కఱవు రాఁగా నీమె తనతపోబలంబుచే కందమూలఫలంబులను, ఉదకంబును నిర్మించి పెక్కుప్రాణులను రక్షించెను. మాండవ్యఋషిని శూలముమీఁద నెక్కింప నొకపతివ్రత చీకటిలో నాశూలముదాక యాఋషిబాధకు సహింపక 'తెల్లవారఁగనే నీవు విధవవగుదు' వని శాపించెను. అట్లయిన నెప్పటికిఁ దెల్లవారకయేయుండుఁగాక యని యాపతివ్రత ప్రతిశాపంబిచ్చె. ఇట్లు సూర్యోదయములేమిచేఁ జరాచర సృష్టికిఁ గీడుమూడ దేవతలందఱు నాపతివ్రతాతిలకముయొక్క స్నేహితురాలగు అనసూయయొద్దకుఁబోయి శరణననామె తన సామర్థ్యంబుచే సూర్యుఁడుదయించునట్లును, తన స్నేహితురాలికి వైధవ్యంబు రాకుండఁగను జేసెను. ఈ శబ్దమునకు 'అనుసూయ' అనురూపాంతరము గూడఁగలదు. [వా: రా. అ. స. ౧౧౭.

వనవాసకాలమ్మున సీతారామలక్ష్మణులు అత్రిమహర్షి యాశ్రమమునకుఁ బోయిరి. అప్పుడు అనసూయ సీతను మిక్కిలి ప్రేమతో నాదరించి, స్త్రీధర్మముల నేకముల నుపదేశించి, సౌమాంగల్యమునకు లోపము రాకుండునట్లు అంగరాగ మాల్యవస్త్రాభరణముల నిచ్చెను.

అనసూయుఁడు. ఒక బ్రహ్మర్షి. (చూ. ౨ కశ్యపుఁడు.)

అనస్టేషియసు. ౧ (క్రీ.శ. ౪౩౦-౫౧౮)ఒకరోమనుచక్రవర్తి. ఇతఁడు మొదట 'జీనో' రాజ్యముచేయునపుడాతని కొలువులో నొకయుద్యోగిగ నుండెను. అతఁడు మరణించిన పిదప నాతని భార్యయగు అరియడిను సాహాయ్యమున అనస్టేషియసు చక్రవర్తి యయ్యెను. పిదప అరియడి నాతనిఁ బెండ్లి చేసికొనియె.

ఇతఁడు ప్రజాను రంజకుఁడై పాలనము చేసెను. కాని, పారసీకుల తోడి యుద్ధమునను హూణులు స్లావులు అనువారివలనను దేశక్షేమమున కప్పుడప్పుడు భంగము కలుగుచువచ్చెను. ఈరాజు క్రీ. శ. ౫౧౮ లో మరణించెను.

౨. ఇతఁడొక రోమనుచక్రవర్తి. మొదలు నాతఁడు 'ఫిలిప్పికస్'అనుచక్రవర్తికిఁబ్రధానిగ నుండెనుకాని, ప్రజలే క్రీ. శ. ౭౧౩ లో. ఫిలిప్పికస్‌నురాజ్యభ్రష్టునిగాఁజేసిఅనస్టేషియస్‌ను

చక్రవర్తిగ నెన్నుకొనిరి. ఇతఁడు సేనల నిర్మించి, ఎక్కువ కట్టుబాటులోనుంచెను. ఆపీసికియారాష్ట్ర నావికులీతని నిబంధనలు సైపలేక తిరుగఁబడి 'తియడోసియస్'(౭౧౫) అనువానిని చక్రవర్తిగ నెన్నుకొనిరి. రాజధాని యైన కాన్‌స్టాంటునోపలును తియడోషియసు ముట్టడించి అనస్టేషియస్‌ను రాజ్యమునుండి దఱిమివేసెను. క్రీ. శ. ౭౧౬ లో "థెసలోనిక" కుఁబోయి సన్యాసియయ్యె. కాని సం॥ ౭౧౯ లో, తియడోషియసు తరువాత రాజ్యమునకువచ్చిన 'లియో'పై తిరుగఁబడెను. కాని తుదకాతనిచే హతుఁడయ్యెను.

3. ఈపేరుగల వారు నలుగురు రోముపట్టణమున 'పోపు' అధికారమును వహించిరి. 'పోపు' అనఁగా క్రైస్తవుల జగద్గురువు. మొదటివాఁడు క్రీ.శ. ౩౯౯ మొదలు ౪౦౧ వఱకును, రెండవవాఁడు ౪౯౬ మొదలు ౪౯౮ వఱకును, మూఁడవవాఁడు ౯౧౧ మొదలు ౯౧౩ వఱకును, నాల్గవవాఁడు ౧౧౫౩ మొదలు ౧౧౫౪ వఱకును 'పోపు' సింహాసనమును అధిష్టించిరి.

అనాగరికసంఘము. మానవజాతి యీ భూమిపైఁబుట్టి యెన్నియుగములయినదో యెవ్వరును జెప్పలేరు. ఇప్పుడు కొన్నికొన్ని దేశములలోని జనులు నాగరికత జెందినవారై పట్టణములు, మేడలు, విద్యలు, కళలు, గ్రంథములు కలవారై శోభించుచున్నారు. కాని యీ నాగరిక[...] మానవజాతికిఁ గ్రమక్రమముగ గాని యొక్కసారి వచ్చినదికాదు మానవసంఘమునకును, ఇతర పశు[...]క్షులను అంతగ భేదముండియుండ[...] మానవులు నగ్నులుగను, గుహ[...] పొదలలోగాని వసించువారుగను, మూలాదులను పచ్చిమాంసమును [...]గను ఉండియుందురు. అట్టివారు [...]ముగ నిప్పుడు మనమున్న నాగరి[...]టకు నెన్ని లక్షలసంవత్సరములు ఏయే మెట్లెట్లు ఎక్కుచు వారింత[...]రో నిశ్చయముగఁ జెప్పఁజాలముగ[...]డీభూమిమీఁద నింకను అనాగరికు[...] ఆరణ్యకజాతులయొక్క యాచార[...]ములనుబట్టి కొంతవఱకు మనమ[...] జనుల పూర్వవృత్తాంతమును [...] వచ్చును.

అనాగరికజాతు లిప్పుడు [...] మీఁదఁ బెక్కులుకలవు. వారిలోఁ[...] ఇచ్చటఁ బేర్కొనియెద:-మన య[...]మందు కోయలు, చెంచులు, ఎఱుక[...] దాసరులు, లంబాడీలును, హింద[...]దలి యితరప్రాంతములలోని య[...]దును పర్వతములందును సంచరించ[...] ఖోండు (కోదు), సవర, జాంగు [...]లైనవారు, అండమానునందలి వాసులు, సింహళమందలి వెడ్డలు;

దేశమందలి గుహానివాసులు, ఆక్కలనఁబడు వారు, ఉత్తరఅమెరికా యందలి కొల్యారెడోలు, దక్షిణ అమెరికాలోని బ్రేజిల్ వాసులు, గ్రీనులండులోని ఎస్కిమోలు అను వారు, బోర్నియాలోని డైకులు, ఆస్ట్రేలియా దేశమందలి యాదిమ వాసులు. వీరు గాక యచ్చటచ్చట విడిద్వీపములలోను, ఖండాంతరమునందలి యరణ్యాదికములలోను పెక్కుమంది అనాగరికజనులు గలరు. వీరందఱును ఒక్కతరగతి వారు కారు. ఒకరు తోళ్లుకట్టుకొనువారుగనున్న మఱియొకరు రాకులు కట్టుకొనువారుగను, మూఁడవవారు బట్టవిడిచి తిరుగువారుగను ఉందురు. ఒక్కొకరియందు నాగరికతాభావ మొక్కొకవిధముగఁ గానవచ్చుచుండును. ఈ జాతుల యాచారవ్యవహారములన్నియు నాయాశబ్దములక్రింద-వారి పేళ్లు వచ్చినప్పుడు - విరివిగ వ్రాయఁబడును. నాగరికతగల సంఘమువారికిని ఈ అనాగరిక జనుల సంఘమునకును గలముఖ్యభేదము లెవ్వియో వానిలోఁ గొన్నిఁటి నిచ్చట సంగ్రహముగ వ్రాయుదుము.

ఆహారము

మానవునకు దినమును తప్పక కావలయునది యాహారము. ఇందున గుఱించి యొకానొక సంఘముయొక్క యాచారమును మన మెఱింగితిమేని యా సంఘమెంత నాగరిక స్థితిలోనున్నది మనము చెప్పఁగలము. మొట్టమొదట మానవుఁడు పశువులవలెనే, అరణ్యమందుఁ దమంతటఁ బుట్టు శాఖాదులను భక్షించియుండవలెను. గడ్డి మొదలైనవానికంటె పండ్లు, కందమూలములు, మానవ శరీరమునకు నెక్కువ పోషకములు గనుక వానిని చెట్లమీఁదినుండి కోసికొనియు, భూమిలోనుండి త్రవ్వియుఁ దీసికొనియుండును. దీనికి 'పశుదశ' యని పేరుపెట్టవచ్చును. ఈ దశలోనే యదృచ్ఛగా దొరికిన పశువులమాంసమును తినుచుండవచ్చును. మిక్కిలి నికృష్టమైన యీదశకంటెఁ గొంచెము పైకివచ్చిన వారు వేటాడి మృగములఁజంపి భక్షింతురు. దీనిని మనము 'మృగయాదశ' యందము. పూర్వపుదశకంటె నిందుఁ గొంచెము నాగరికత కావలయును. వేటాడుటకు విల్లు, అంబు మొదలైనసాధనము లుండవలయును. ఈ సాధనములఁ జేయుట నేర్చుకొనిన పిదపఁగాని మానవునకు 'మృగయాదశ' రానేరదు. కందమూలాదులనేమి, మాంసమేమి మొదట పచ్చిగనే భక్షింపఁబడును. ఎందుకనఁగా మానవజాతికి నిప్పు శైశవావస్థయందు లభించినది కాదు. కొంచెము నాగరికత హెచ్చిన తరువాతఁగాని నిప్పును బుట్టించు నుపాయములు వారు కనుఁగొనలేక పోయిరి. నిప్పు వశమైన తరువాతఁగూడ భక్ష్యపదార్థములను అందుఁ గాల్చి తినుచువచ్చిరి. వంటకములఁ జేయు పద్ధతి కొంచెము హెచ్చుతగ్గుగ అనాగరిక స్థితి వదిలిన తరువాతనే మానవునకుఁ దెలిసినదని చెప్పవచ్చును. కందమూలములనేమి,

మాంసమునేమి కొంచెము హెచ్చుతగ్గుగ ననాగరికులందఱును పచ్చిగనో, కొంచెము కాల్చియో భక్షించుదురు. వక్వముచేయువిద్య వారంతగ్గ నెఱుంగరని చెప్పినం జెప్పవచ్చును. ఈ 'దశ' తరువాతఁ గొంతకాలమునకు 'గోపాలదశ' మానవజాతికిఁ బ్రాప్తించును. కందమూలఫలములుగాని, వేటవలనవచ్చెడి మాంసముగాని తమకువలయునంతయు వలసి నప్పుడు దొరకక పోవచ్చును. వానిని ఎక్కువగ సంగ్రహముచేసి యుంచుటకు వీలు లేదు. కావున మానవుఁడు అరణ్యమునందలి కొన్ని పశువులను, అనఁగా మేకలు ఆవులు గేదెలు మొదలైన వానిని, వశపఱుచుకొని పెంపఁబ్రారంభించెను. ఇందువలన నాతనికిఁ గావలయునెడఁ గావలసినంత మాంసాహారము దొరుకుటయేగాక, వాని పాలుపెరుగు మొద లైన రుచికర పదార్థములుగూడ తినుటకు దొరుకును. ఇట్లు గోపాలదశకు వచ్చినవారు కొంత నాగరికులని చెప్పవలెను. ఇట్టి స్థితికి రాని జాతు లిప్పటికిని ఈ భూమి మీఁదఁ బెక్కులు కలవు. మన దేశమందలి కోయ చెంచు జాతుల వారింకను గోపాలకదశను వహింపలేదనియే చెప్పవలెను. ఆసాము దేశము నకుఁ దూర్పున పర్వతప్రాంతమందు మిష్మి జాతివారుకలరు. వారు ఆవులు,ఎద్దులు మొదలైన వానినెక్కువగాఁ బెంచెదరు. అవి అరణ్యము లో స్వేచ్ఛగాఁ దిరుగుచుండును. వీరు వీనితో వ్యవసాయముచేయరు. పండుగదినమున నొక

దానిఁజంపి తిందురు. భార్య ... వీనిని ధనముగ నుపయోగించె... లకదశనుపొంది దానివలన మిక్కి... సంపాదించిన వారు లంబాడీలు. మొదలైన పశువులను విశేష వాహనములుగ నుపయోగింతుః... నకు నుపయోగింపరు. గోపాల... వాతిది 'కృషికదశ', అనఁగా వ... చేసి ధాన్యము పండించునట్టి స్థి... నొకవిత్తువేసి నూఱువిత్తులు విద్య మానవుఁడు సాధించిన గొప్పది. ఆదిమదశలో మానవు... తిరుగుచుండు స్థలములలో స్వా... బెరుగు గడ్డిధాన్యములే కోసికొ... వలెను. తరువాతఁ గొన్ని విత్తులు బడి వర్షాకాలమవి చెట్లయి ఫలిం... మానవుఁడు మొదట భూమిమీ... చల్లి వచ్చినపంటను అనుభవిం... భూమి దున్నుటగాని పాటు... యెఱుఁగఁడు. కోయలు మొదలై... జాతులవారు, భూమిని ఎక్కువగా విత్తనములు చల్లి వచ్చినపంటను తురు. క్రమముగఁ బశువులచే ... మొదలైన వ్యవసాయపద్ధతులను రీకతాభివృద్ధిఁ జేసికొనిరి.

కొందఱు అనాగరిక జాతుల... మాంసమును తినియెదరు. ఇట్ల... మాంసమును తిను మాం...

మిక్కిలి తక్కువమైనను, పూర్వముండెను, ఇప్పుడును ఉన్నవి. నరమాంసాశనులైన రాక్షసులు మనపురాణాదికములలో వర్ణింపఁబడియున్నారు. ఆత్రావాత యిట్టి యారణ్యక అనాగరిక జనులను గుఱించియే వ్రాయఁబడి యుండును. అట్టి జాతులిప్పుడు నశించి యుండును. మిక్కిలి పురాతనకాలమందు ఫ్రాన్సు దేశమందును నిట్టి జనులుండిరనుటకు నిదర్శనము లున్నవి. క్యాస్పియన్ సముద్రమునకు నీశాన్యమున దీవులలోఁ దిరుగుచున్న సితియన్ మ్యాసగేటియను జను లిట్టివారని హిరోడోటస్ మొదలయిన పురాతన లేఖకుల వ్రాతలవలనఁ దెలియుచున్నది. ప్రస్తుతకాలమందు ఆఫ్రికా ఖండముయొక్క పశ్చిమ, మధ్యభాగము లందును, న్యూగైనా, ఫిజీ, ఆస్ట్రేలియా, న్యూజీలండు, పాలినేషియన్ దీవులు, సుమాత్ర, దక్షిణ అమెరికా మొదలయిన దేశములందున్ను మాంసభక్షకజాతులు చాల కలవు. వీరిలోఁ గొందఱు క్రమక్రమముగ నీరాక్షసాచారమును విడుచుచున్నారు. కాని సుమాత్రలోని బట్టాలను వారును, ఈస్టు ఇండియన్ దీవులలోని వారును, దక్షిణ అమెరికాలోని పూర్వనివాసులును ఈ పురాతనాచారమును విడువలేదు. ఈ మాంసభక్షకులు సాధారణముగ శత్రువులను జంపి భక్షింతురు. తమ సంఘము వారిని తినరు. హిందూదేశమునందు మనుష్యభక్షకులైన యనాగరికు లున్నట్టు కానరాదు. అఘోర పంథమువారు* పీనుగులను భక్షించుచుండిరి. కాని యది మతసిద్ధాంతమును బట్టివచ్చిన భక్షణకాని యనాగరికత వలన వచ్చినది కాదు.

నరమాంస భక్షణము

సిగ్గువలనఁ గాపాడుకొనుటకు శరీరమునకు దుస్తులు కావలెను. కాని 'సిగ్గు' అను మనోవికారము మానవజాతికిఁ గొంత నాగరికత వచ్చినతరువాత నుద్భవించినది. మొదట శరీరమును చలివలనఁ గాపాడుకొనుటకు దానిని దేనితోనైనఁ గప్పవలసి వచ్చెను. అందుచే నెండ లధికముగ నుండుచోట నారణ్యక జనులు నగ్నులుగ నుండుటయు, చలి యెక్కువగనున్న చోట వారు దుస్తులను ధరించుటయు తటస్థించును. కేవలము నగ్నావస్థ యందుండు జాతులుకూడఁ గలవా యని నూఱు రూపాయలను మించినదుస్తుల ధరించు మన మనుకొనవచ్చును. కాని వస్త్రవిహీనులుగ నుండు అనాగరికులు భూమిమీఁద నిప్పుడును పెక్కులుకలరు. అరణ్యమధ్యమున నుండు కోయవాండ్రు నగ్నులుగ నుండుదురు. ఎవరినైనఁ జూడవచ్చునప్పుడు ఆకులుచుట్టుకొని వత్తురు. ఫ్యూజీ దేశజులు, ఆస్ట్రేలియా దేశజులు సాధారణముగ నేమియుఁ గట్టుకొనకయే తిరుగుచుందురు. చలి


దుస్తులు

* చూఁడు. ఆంధ్రవిజ్ఞాన సర్వస్వము ౧-వ సంపుటము 'అఘోర పంథము' అను శబ్దము.

పుట్టినప్పుడు మాత్ర మేమైనను చుట్టుకొందురు. ఇప్పుడు నాగరిక జనుల సంపర్కము వలనఁ గొన్ని జాతులవారు వస్త్రధారణము నేర్చినను బట్టవిడిచి తిరుగు నాచారము వారిలోఁ బూర్తిగఁబోలేదు. ఆఫ్రికాఖండములో భూమధ్య రేఖాప్రాంతము (Equatorial Africa) నందున్న అషిరులను (Ashiras) జనులలోను, అమెరికాయొక్క మధ్యభాగము

నందున్న చయ్‌ములు (Ch
వారిలోను, వివాహమైన స్త్రీ
ణము చేసినను, అవివాహి
చీరకట్టఁ గూడదన్న నియమ
యెక్కువగనుండె దుస్తులు
పశువుల చర్మములను వస్త్రప
దరు. ఇంగ్లండు దేశమునందు
దిమవాసులు మృగములతో

1-వ పటము



అనాగరిక జాతులు

చుండిరి. మన పూర్వపు ఋషులుకూడ (అనాగరికులు గాకపోయినను) మృగాజినములు ధరించుచుండినట్లు మనము చదువుచున్నాము. చెట్ల బెరడులు గూడ కట్టుకొను అనాగరికులు కలరు. నూలు వస్త్రములు

నాగరికత దశలో వెలిసినవిగ
దశలోనివి కావు. బట్టలనే
బూర్వము, వ్యవసాయము,
దారము వడుకుట మొదలయి
వచ్చియుండవలెను.

అలంకరణము

మోటు జాతులయొక్క మోటు తనము నాగరికజాతుల యొక్క నాగరికతయు అలంకారముల వలనఁగొంత తెలియును.

నగ్నస్థితిలో నున్నప్పుడు శరీరమునకు రంగు వేసికొని దాని చక్కఁదనమును హెచ్చింపవలయునన్న కోర్కెపుట్టుట సహజము. కావున పెక్కు అనాగరిక జనులు శరీరమునకు

2-వ పటము



పచ్చలుపొడిపించుకొనిన ఆరణ్యకుఁడు

రంగు వేసికొనియెదరు. ఆఫ్రికా దేశమందును, అమెరికా దేశమందును, మూల నివాసులైన ఆరణ్యక జాతులవారు తమ శరీరమును వేలువేలు చిత్తరువులతో నలంక

రించు కొనియెదరు. కొందఱు శరీరము యొక్క యొక భాగమందును, మఱియొకరు ఇంకొక్క భాగమందును, ఇంకొక జాతివారు శరీరమంతయు ఎఱ్ఱని, పచ్చని రంగులు చిత్తరువుల రాచుకొందురు. ఈ చిత్తరువులు చెట్లు, తీగెలు, చెక్కడములు, గళ్లు, మృగములు మొదలైనవిగనుండును. ఇది చిత్రవిద్యయొక్క ప్రథమావస్థయని చెప్పవచ్చును. కొన్ని దేశములలో శరీరమున పచ్చలు పొడిపించుకొని సింగారించు కొనియెదరు. మన దేశమునందును పచ్చలు పొడిపించుకొను నాచారము కలదు. ఈపని సాధారణముగ ఎఱుకలవాండ్రు చేయుదురు. మెలనేశియా, పాలినేశియా, న్యూజిలండు మొదలయిన దేశాంతరము లందలి మోటువారు చేతుల నిండను, కాళ్ల నిండను, ముఖమంతయు, శరీరమంతయుఁ బచ్చలు పొడిపించు కొందురు! బట్టలు కట్టు నాచారము హెచ్చినకొలఁదిని శరీరమునకు రంగు వేసికొనుట, పచ్చలు పొడిపించుకొనుట యన్న యాచారము తగ్గును.

శరీరమునకు నలంకారము తగిలించుకొనుటకు శరీరమునందుఁ జిల్లులు చేయుట అనాగరిక జనులయొక్క పెద్ద విశేషము. చెవులకు, ముక్కుకు చిల్లులు చేయుట సహజమె కదా! కొందఱు క్రింది పెదిమకుఁ జిల్లిచేసి, దానిని క్రమముగఁ బెంచి, నోటితో సమానమైనంతదిచేసి, దానికి నగలు పెట్టుదురు.

బ్రెజిల్, దక్షిణ అమెరికా,
దేశము లందలి మోటుజాతుల
రమున్నది. అచ్చట పిల్లలకు త
మన పిల్లలకు చెవులు కుట్టించి
కుట్టించి క్రమముగఁ బెంచెదర
బుగ్గలోఁ జిల్లిచేసికొని నగ ధ

3-వ పటము



మోటుగా ముక్కునగ ధరి

వీరి నగలును మిక్కిలి మో
కొందఱు చక్కఁదనమున్నకై
చెదరు. ఆడవాండ్రు ధరించు
కలతోను, సముద్రమునందలి
చములతోను, చేయఁబడియుఁ
దేశమునందు లంబాడీ స్త్రీలు
నగలు మనము చూచుచున్నా
అనాగరిక జనులలో నింతకంటె
టుగ నుండునని తెలిసికొన వ

వివాహము

మానవులు పశుదశయందున్న కాలమునం, గొంతవఱకు స్త్రీ పురుష సంబంధములు కూడ పశువులవలెనే యే నియమమును లేక స్వేచ్ఛగా జరిగియుండును. కాని యంత పశుదశయందున్న జాతులిప్పుడు కానరావు. కొంతకాలమునకుఁ గొన్ని నియమము లేర్పడినవి. మొదటినుండియు స్త్రీలను పురుషులు బానిసలుగ, తమ యుపయోగమునకై పుట్టిన సొత్తువలె చూచుచున్నందున, కొందఱు పురుషులకుఁ గొందఱు స్త్రీలకు నియతసంబంధము కలిగెను. ఇదియే వివాహవిధి. ఇది అనేకవిధములుగ నున్నది. ఒక స్త్రీకి నొక పురుషుఁడన్న నియమము మొదటినుండి యునున్నదికాదు. ఒక్కపురుషునకుఁ బెక్కు స్త్రీలును, ఒక్కస్త్రీకిఁ బెక్కు మగలును, ఉండు నాచారములు అనేక అనాగరిక జనులలో నున్నవి. బహుపతిత్వము (Polyandry) నాగరికజాతులవారమైన మనకు నెంత యసహ్యాకరముగనున్నను భూలోకమునందు నీయాచార మనాది సిద్ధముగనున్న జాతులు కలవు. సింహళమునందును, టిబ్బెటునందును, నీలగిరి పర్వతమునందును ఈ యాచారము గల జాతు లున్నవి. ఇట్టి యాచారమున్నచోట సాధారణముగ నొక్క స్త్రీకినున్న పెక్కు మగలు అన్నదమ్ములుగ నుండుదురు. అనఁగా పంచపాండవులవలె నన్నదమ్ము లందఱును ఒక్క స్త్రీకి పెనిమిటులుగ నుందురు. నీలగిరి పర్వతముమీఁద 'తోడ' లను మోటుజాతి వారున్నారు. అన్నదమ్ములలో నొక్కఁడు వివాహమాడిన స్త్రీ యందఱు తోడఁబుట్టిన వారికిని పెండ్లామగును. ఒకపెండ్లాముగల వారందఱు సాధారణముగ అన్నదమ్ములైనను ఒకప్పుడు వా రొక్కకుటుంబములోని వారుగను, అరుదుగ భిన్నకుటుంబములోని వారుగనుగూడ నుందురు. ఇట్టిస్త్రీకిఁ బుట్టిన పిల్లలకుఁ దండ్రి యెవఁడని నిశ్చయముగఁ దెలియుటకై యాస్త్రీ గర్భముతో నున్నప్పుడు ఏడవనెలలో నొకయుత్సవము చేసెదరు. అప్పుడు దానిమగలలో నొక్కఁడు దానిచేతికి నొక చిన్నవిల్లును అంబును ఇచ్చును. అట్లిచ్చిన వాఁడప్పుడుపుట్టు శిశువునకుఁ దండ్రి. మగలెందఱు నన్నదమ్ములైనప్పుడు పెద్దన్నయే సాధారణముగ విల్లు నంబునిచ్చును.

ఎఱుకలవాండ్లలోఁ గూడ నొకవిధమైన బహుపతిత్వము కలదు. ఎఱుకలసానిమగఁడు దొంగతనముచేసి కైదుకుఁబోయిన యెడల నా కాలమందు నది మఱియొకనితోఁ గాపుర ముండవచ్చును. తిరిగి మగఁడురాఁగానే యది వానిఁజేరును.

కొన్నిజాతులలో వివాహము చేసికొనిన స్త్రీ పెనిమిటి సెలవు లేక యన్యపురుషుని బొందుటతప్పుగా నెంచినను, భర్తయనుజ్ఞవడసి యట్లుచేయుటగాని, అవివాహిత స్త్రీలు తమ కిచ్చవచ్చినట్లు ప్రవర్తించుటగాని తప్పుగా నెంచరు. న్యూజీలాండులోను, ఉత్తర అరా

క్యానులోను, ఉత్తర అమెరికా, మధ్యఅమెరికా దేశములందుండు మోటుజాతులవారు కన్య స్వేచ్ఛగాఁ దిరుగుట తప్పుగా నెంచరు. అట్లు అవివాహితయైన కన్య యెవరితోను సంబంధములేకుండ నుండెనేని యది రూపసి కాదని బ్రేజిల్ దేశజు లనుకొనియెదరు. మెలనేసియా దేశమందలి జనులు తమయింటికి వచ్చిన చుట్టములయొద్దకుఁ దమ భార్యలఁ బంపుదురు.

మోటుజాతులలోఁ గొందఱు తమ తెగవారిని వివాహమాడుదురు. కొందఱు వేఱు తెగవారినిగాని వివాహమాడరు. మొదట వేరుతెగలనుండి యాఁడువారిని ఎత్తుకొనివచ్చి బలవంతముగ వివాహమాడుచుండిరి. దీనినే మనవారు రాక్షస వివాహమనిరి. ఇట్టి యాచారమింకను అనాగరిక జనులలోఁ బెక్కుచోట్లనున్నది. ఈ తెగవారు ఆ తెగవారితోనే సంబంధ బాంధవ్యముచేసి కొనవచ్చునని యున్నచోట నీతెగలోని యీతరము పురుషులందఱికి ఆతెగలోని యీ తరమునందలి స్త్రీలందఱును పెండ్లాలుగనుందురు. అనఁగా ఈ తెగలోని యిష్టమువచ్చిన మగవాఁడు ఆతెగలోని యిష్టమువచ్చినంతమంది స్త్రీలను పెండ్లి చేసికొనవచ్చును. ఇట్టియాచారము ఆస్ట్రేలియా జనులలో నున్నది. సుమాత్రాద్వీపమునందుఁ గొంతకాలము క్రిందట జగర్, అంబెల్ అనక్, సెమనడో అను మూఁడువిధములయిన వివాహములుండెను. మొదటిదానిలో

పురుషుఁడు స్త్రీనికొనును, రెం

పురుషుని గొనును, మూఁడ

పురుషు లిద్దఱును సమాన

యుందురు. మొదటివివాహప

నందునుకలదుగాన దానినివర్తి

రెండవదానిలో, పిల్లతండ్రి

చ్చును. వాఁడప్పటినుండియ

బము వాఁడె యగును. వాఁ

తయు వాని మామగారికే చె

మామగారి కుటుంబము వ

యొకవిధమైన యిల్లంటము.

కిద్దఱికిని సమానమైన హక్కు

మందు, ఇద్దఱిసంపాదనయు,

ఱికి సమానముగవచ్చును. భ

ఱునువిడిపోవలయునన్న సొత్తు

బంచుకొందురు. ఇట్లు అనా

వివాహపద్ధతులు పెక్కులుగఁ

శరీరసౌఖ్యముకొఱకు, పనిప

కొన్న వివాహములేగాని

పేరిమయనునది కానరాదు.

ముగ దాసిగ, పనికత్తెగ, భ

దరు. కావున నాగరికవివాహ

రిక వివాహములకు సాత్విక

నదియే భేదము.

చెట్టునీడ, పొదలచాటు

నివాస స్థలములు

న్యాకున

ములు.

పెద్ద గృహములు. మొద

గృహనిర్మాణ మెఱుఁగఁడు. పొదలచాటున నింకను రెండు మండలు పెట్టుకొనియు, గుహలలోను కాపురముండు మిక్కిలి నికృష్ట జాతులవారిప్పటికిఁ బెక్కులు కలరు. ఈ స్థితి నుండి లంబాడి గుడిసెల వఱకు వచ్చుటకు మానవజాతి కెన్నియో యుగములు పట్టి యుండును. వడ్రంగమువిద్య సాధ్యమగువఱకు మానవులు ఆరణ్యక స్థితిలోనుండి యీవలకి వచ్చిరి. ఇండ్లు అనుటకు వీలులేనట్టి మిక్కిలి చిన్నవిదైన కప్పులను నిర్మించుకొని కాపురముండు మోటు జాతులవారు మన దేశమునందింకను ఉన్నారు. ఎరుకలవాండ్లు, తోడ జాతి వాండ్ల గుడిసెలను జూచినఁగాని వాని దారిద్ర్యావస్థ బోధపడనేరదు. ఇండ్లే కట్టుటకు చేతఁగా నప్పుడు పట్టణాదులు నాగరిక జాతి వారికుండ నేరవని వేఱుగఁ జెప్ప నక్కఱలేదు. మిక్కిలి యనాగరికావస్థలోనున్న యారణ్యకులొక్కచోట పట్టుమని పదియేండ్లుండరు. ఎచ్చట వారికి భోజనపదార్థములు దొరుకుచుండునో యచ్చటికిఁబోయి కొన్ని దినములుండి మఱియొకచోటికిఁ బోవుచుందురు. కావున శాశ్వతమైన పల్లె నిర్మించుకొన వలసిన యావశ్యకత వాండ్రకు లేదు. దొమ్మరి గూడెములు, ఎఱుకల గూడెములు తెలుఁగు దేశము వారికిఁ దెలిసినవియే. ఈ గూడెములొకప్పుడీ గ్రామము వెలుపలను, మఱియొకప్పుడింకొక గ్రామము వెలుపలను గానవచ్చుచుండును.

మతముగూడఁ గ్రమముగ నభివృద్ధియైనదియే. అనాగరిక జనులకును, నాగరిక జనులకును దుస్థులను మతము గుఱించి యెంత భేదముండునో మతమును గుఱించియు నంత భేదముండును. మిక్కిలి పశుదశలోనున్న కొన్ని జాతులవారికి మత కల్పనలే లేవని కొందఱు వ్రాసియున్నారు. కాని యందును గుఱించి గ్రంథకారులు భిన్నాభిప్రాయులై యున్నారు. పశుదశను విడిచి కొంచెము పైకివచ్చినవారిలో, రూపములేని కొన్ని క్షుద్ర దేవతలు తమకుఁ గీడుచేయుననియు, వానిని సంతోషపెట్టి యాకీడునుతప్పించుకొనవలయుననియు, చచ్చిపోయిన తమ పూర్వులు దయ్యములై తిరుగుచుండెదరనియుఁ గల్పనలు కలవని మనకుఁ గానవచ్చుచున్నది. తనకు సంభవించెడి యాపదలన్నియు స్వాభావికముగ వచ్చుట లేదనియు, ఏదో దేవతయొక్క ప్రభావమువలన వచ్చుచున్నవనియు, ఆరణ్యకుఁడనుకొనును. అందులకై జ్వరమున కొక దేవత, దగ్గునకొక దేవత యున్నదని కల్పించుకొనును. అట్లే వృక్షమున కొక దేవత, గుట్టకొక దేవత, వాన కొక దేవత, ఉరముకొక దేవత కలదని తలంచును. ఇట్లు చెడ్డగాఁ గానవచ్చు వానికిని, గొప్పగఁ గానవచ్చు వానికిని ప్రతిగ నొక్కొక్క దేవతపుట్టును. మానవుఁడు తనయందున్న గుణములన్నియు ఈ దేవతలందు నారోపించును. ఆ దేవతలను సంతోష

పెట్టవలెను, వానికి ఘ్రాంసము పెట్టవలెను, కల్లు పొయ్యవలెను. పోఁగాఁబోఁగా నివియే ముత్తేలమ్మ పోలేరమ్మలుగాను, జాతరలుగను మారినవి. ఇట్లు మొదట చెడుదేవతలు పుట్టెదరు. తరువాత మంచి దేవతలు పుట్టెదరు. వీరు వారు కలిసి యధికమైన తోడనే వీరంద ఱుండుటకు నొకతావు కావలసివచ్చును. అదియే తరువాత స్వర్గమగును. ఈలాగు మిక్కిలి స్వల్పమునుండి మతకల్పనలు ప్రవృద్ధ మగుచుండును. ఏకేశ్వర కల్పన యెన్నియో యుగముల తరువాతఁగాని పుట్టదు. అనాగ రిక సంఘము వారు సాధారణముగ దేవత లని గుట్టలను చెట్లను మృగములను పూజించు చుందురు. ప్రయోగములు మొదలయిన వాని నమ్ముదురు. మానవులు పులులుగను, వేఱు మృగములుగను మంత్రబలము వలన మాఱుదురని తలంతురు.

ఇప్పుడు భూమిమీఁద నున్న యనాగరిక జాతులు కొన్ని బుద్ధివిషయమై మిక్కిలి నీచా వస్థలోనున్నవని చెప్పవలసియున్నది. వీరి బుద్ధి వైభవము వీరి భాష

బుద్ధి వికాసము

వలననే తెలియఁగల్గదు. కంటికిఁగాన వచ్చెడి పెక్కు పదార్థములకుఁ బేళ్ళున్నను, కనులకుఁ గానరాని జాతివాచక భావవాచక పదములకుఁ గొందఱి భాషల యందుఁ బేళ్ళేలేవు. మఱే భాషలో ఎఱ్ఱ నల్ల మొదలయిన రంగులకుఁ బదములున్నవి కాని 'రంగు' నకుఁ బదములేదు. ట్యాస్మేని యన్ భాషలో వేఱు వేఱు చెట్లకి గాని 'చెట్టు' నకుఁ బేరులేదు. ' కాఠిన్యము, వేడిమి, చల్లదనః యిన యర్థముల పదములులేవు రెన్ని యంకెలవఱకు లెక్కపెట్ట కొన్న వారియనాగరికత యొః మనకుఁ దెలియఁగలదు. ఈక్వ వారు పదికంటె నెక్కుడు లెః కాల్ఫర్డు అను శోధకుఁడు ఆస్ట్ర మందలి ముప్పదిమోటు జాతు లను శోధించి, అందెవరికిని 'న నెక్కువ లెక్క బెట్టుట చేతకాదః కేప్ యార్కర్ నను వారు నెక్కుడు లెక్కల నెఱుఁగరు. వలసి వచ్చినప్పుడు 'రెండు నొక అనవలసి వచ్చినప్పుడు 'రెండు యందురు! కావున నిట్టి వారి వికాసముఁ జెందక బాల్యావస్థ చెప్పవలెను.

మాటలాడు భాషయొక్కయ నంకెలయొక్కయు స్థితి యిట్లు జాతులవారిలో వారిత్రలేదనియు లేవనియు వేఱుగఁ జెప్పవలెనా పోయినను, కొంచెము అధికుల జాతులవారు తమ యుద్దేశముః ద్వార కొంతవఱకుఁ దెల్పెదరు.

స్త్రీపురుష సాంగత్యమువ మేర్పడును. పూర్వము కుటుం

ప్రధానములు. పిదప క్రమముగఁ బురుష ప్రధానము లయ్యెను, స్త్రీ ప్రధాన కుటుంబములనఁగా నాకుటుంబములోని జను లొకానొక స్త్రీకిని దమకును గల బంధుత్వమువలన గలిసి యుందురు. వారసత్వము మొదలైన వన్నియు స్త్రీ ని ననుసరించి వచ్చును. మానవుల యాదిమదశలోను, వివాహబంధనములు దృఢముకానపుడును సంతానముయొక్క తండ్రి యెవఁడయినది నిశ్చయముగాఁ దెలియదు. తల్లి మాత్రము తెలియును. కావునఁ బిల్లలను పోషించుభారము తల్లి మీఁదను, ఆమెబంధువుల మీఁదను పడును. మలె ఆర్చిపెలగో దేశమందలి వారు మిక్కిలి కనిష్ఠావస్థలో నున్నారు. ఒక పురుషుఁడు ఒక స్త్రీ యరణ్యమునకుఁ బోయి పొదలలోఁ గాపురముందురు. పిల్లలు పుట్టిన తరువాత పిల్లలు కొంచెము పెద్దవారగు వఱకును వారు కలిసి యొక చెట్టుక్రింద నుందురు. చెట్టుకు ఒక విధమైన ఉయ్యేల వ్రేలాడగట్టి పిల్లలను దానిలో నుంచెదరు. రాత్రి పులులు మొదలైనవిరాకుండ నిప్పుముట్టించి యుంచెదరు. పిల్లవాఁడు కొంచెముపెద్దవాఁడైన తరువాత తండ్రి యిష్టము వచ్చిన చోటికిఁ బోవును. తల్లి పిల్లలను పెంచును. అండమాను, ఆస్ట్రేలియా దీవులలోను ఇట్లే పిల్లలను తల్లి, మేనమామ పెంచుదురు. ఉత్తర అమెరికా దేశమందును ఇట్టి యాచారమే

కుటుంబము

కలదు. హిందూ దేశమందలి నాయరు జాతివారిలోని స్త్రీ ప్రధానమైన కుటుంబపద్ధతియే అమల్లులో నున్నది. అచ్చటి కుమారనకు తండ్రి యింటిపేరు రాదు. తండ్రి సొత్తురాదు. మేనమామ యింటిపేరువచ్చును. మేనమామసొత్తు వచ్చును. ఇట్టి కుటుంబమును తార్ వడ్ అందురు.

వివాహబంధనములు దృఢమైన జాతులలో పురుషప్రధాన కుటుంబము లేర్పడినవి. వీనిలోఁ బురుషునిబట్టి కుటుంబమేర్పడును, దాయభాగము వచ్చును. ఇట్టివియే మన కుటుంబములు.

సంఘమనఁగాఁ గొన్ని కుటుంబములు స్వసంరక్షణార్థమై కలిసియుండుట. మిక్కిలి ప్రారంభావస్థ యందు నేకుటుంబమునకు నా కుటుంబమే విడివిడిగానుండి స్వేచ్ఛాచారము జేయును. సింహళమునందలి వెడ్డలనంబడు జాతి వారెవరికివారు వేఱువేఱుగ నుందురు. అమెరికా దేశమందలి 'ట్యాన్ మేనియనులు' అను జాతివారిలోని వేఱువేఱు కుటుంబములు యుద్ధసమయమునఁ గలిసి యొక నాయకుని నేర్పఱుచుకొని, వాని యాజ్ఞలో నున్నను, ఆ పనియైనతోడనే యే కుటుంబమున కా కుటుంబము స్వతంత్రమై పోవును. కాని మఱియొకజాతివారు ప్రక్కనఁజేరి శత్రువులుగానున్నప్పుడు స్వసంరక్షణార్థమై యీ చిన్న కుటుంబములన్నియుఁ జేరి యొక సంఘ

సంఘము

ముకావలసివచ్చును. ఇట్టికూడి యొక్కనిఅధిపతిగనేర్పఱచుకొని వానియాజ్ఞలో మెలఁగుదురు. ఇట్లు సంఘముగా నేర్పడువారు సాధారణముగ నొక్క తెగవారై యుందురు. ఇట్టి సంఘములోఁ బెద్దపెద్ద కుటుంబములుండును. ఆకుటుంబములకు నధిపతి తండ్రి. ఆతని కుమారులు, మనుమలు, మొదలయినవారందఱును అతని యాజ్ఞలో నుండవలయును. ఆ కుటుంబమునకు నాతఁడొక విధమైనరాజు.

అనాగరిక స్థితిలోనుండువారుగూడ తమ స్వాతంత్ర్యమును కాపాడుకొని పరుల స్వాతంత్ర్యమునకు భంగము రాకుండఁ బ్రవర్తింపఁగలరనుటకు ఖురాసానులోని తిరుగుచుండెడి కొన్ని మోటు జాతులు నిదర్శనము. వీరిలో నిప్పటికిని ఒక రాజుగాని ప్రభుత్వముగాని గానరాదు. అందఱును సమానులుగనే యుందురు. వీరి సంఘములు చిన్నచిన్నవి. కొన్ని ముప్పది కుటుంబములకంటె నెక్కుడుండవు. ఒక్కొక సంఘమునకు నొక్క ముసలివాఁడు నేతగా నుండును. అతఁడు సలహా చెప్పువాఁడుగను, తగాదాలు వచ్చినప్పుడు తీర్చువాఁడుగను ఉండునే కాని యధికారిగ నుండఁడు. ఇతనికిఁ గొంత జీతమిచ్చెదరు. ఇతఁడు పూర్వాచారమును ఉల్లఘింపఁడు. 'మాకు నధికారులు లేరు. మాకు నధికారులతోఁ బనిలేదు.' అని ఖురాసానులందురు. పరులను బాధపెట్టి వారిమీఁది కేము చేయవలయునన్న ప్రవృత్తి వీరికి

లేదు. ఇతరుల స్వాతంత్ర్యవ
డును భంగము కలిగింపరు.
తగ్గినకొలఁదిని మానవ జా
దక్కువజాతుల వారిని వశపఱ
బానిసలుగ నుంచుకొని,
తాము సుఖపడవలయు నన్న

ఈసంఘములు మొదట ని
ముగనుండునవి కావు. తమ
వులకు మేత మెచ్చటదొరుకు
బోవుచుండెను. ఉత్తరదేశవ
దూ దేశమునకు వచ్చిన వ
యార్యులును ఇట్టివారే.
లంబాడీలును, అప్పుడప్పుడు
తిరుగుచు, చిన్నకత్తులు మొద
దెనుఁగు దేశమునకు వచ్చుచుం
వంటి మూకలును ఇటువంటి
కాలముగడిచిన తరువాత ఇట్టి
రమునుమాని యొకానొక ప్ర
తముగ వసతిచేయును. అప్పు
నాజనులపేరు వచ్చును. కళింగ
ద్రవిడులు మొదలయిన
పుట్టిరి. వారుసంచారముచేయు
నిలిచిపోయిన దేశములకు
ఆంధ్రదేశము, ద్రవిడదేశ
వచ్చెను. సంస్కృతమునందు
జనులనామములే వాడెదరు.
మద్రకులు అనఁగా మద్రదేశ
అనఁగా కళింగదేశము, ఆంధ్ర

ఆంధ్రదేశము అని యర్థము. ఈవిధముగ నారణ్యమునందుఁ దిరుగు వారిలో నుండి గొప్పసంఘములును, గ్రామములును, పట్టణములును, దేశములును పుట్టుచున్నవి. దీని వివరమంతయు 'సంఘమును' గుఱించి వ్రాయునప్పుడు తెలుపఁబడును. అనాగరిక సంఘమును గురించి యింకను తెలిసికొనఁ గోరువారు 'ఆదిమమానవులు', 'ఆరణ్యములు' అను వ్యాసములఁ జూచునది. [కో. ల.

అనాగ్సగోరస్. (క్రీ. పూ ౫౦౦-౪౨౮) గ్రీకుతత్త్వవేత్త.

ఇతఁడాసియా మైనరులోని క్లెజోమేనె యను పట్టణమునందు క్రీ. పూ. ౫౦౦-వ సంవత్సర ప్రాంతమున జన్మించెను. ౪౮౪-౪౮౨ ప్రాంతమున నితఁడు గ్రీసుదేశపు రాజధానియగు అథెన్సు పట్టణమునకుఁ బోయి, ముప్పది సంవత్సరముల వఱకును అచ్చటనేయుండి తన విద్యామహిమచే మిక్కిలి కీర్తివడసెను. పెరిక్లీస్, యురిపైడ్స్ అను పండితులితని శిష్యులు. సాక్రెటీసుకూడ నితని శిష్యుఁడని కొందఱి యభిప్రాయము. జ్యోతిషశాస్త్రమందును, గణితశాస్త్రమందును ఇతఁడు మిక్కిలి విఖ్యాతి చెందుటయేగాక తత్త్వవిచార శీలుఁడనియు, సదాచారసంపన్నుఁడనియు మిగులఁ బూజ్యత వడసెను. వాడుకలోనున్న మతముల నపహసించెనన్న యపరాధమును మోపి యీతనిపై నొక యభియోగము తెచ్చిరి. కాని యితని శిష్యుఁడైన పెరిక్లీస్‌యొక్క వక్తృత్వమహిమచే నితఁడు నిర్దోషియని విడువఁబడెను. అథెన్సులోనుండుట మంచిదికాదని యీతఁడు క్రీ. పూ. ౪౩౪-౪౩౩ ప్రాంతమున లాంప్సాకసుకుఁ బోయెను. అచ్చటనే యీతఁడు క్రీ. పూ. ౪౨౮ ప్రాంతమునఁ గీర్తిశేషుఁడయ్యెను.

ఇతని సిద్ధాంతానుసారముగాఁ బ్రపంచమందలి భూతసంఖ్య నాలుగుగాని, అయిదుగాని కాదు. అది యసంఖ్యము. నాలుగైదు భూతములలోనుండి యసంఖ్యవస్తుజాల ముత్పన్నమైనదనుట యసంగతము. ఇవన్నియు ననాదులనవచ్చును. మొదట నివన్నియు నొకదానితో నొకటికలిసి వేఱువేఱుగ గుర్తించుటకు వీలులేకుండఁగ నుండెను. కాని గతి (Motion) రూపమైన చైతన్య మందుఁ బ్రవేశించి, వీని నన్నిటిని విడఁదీసి సృష్టియొక్క యభివృద్ధికిఁ గారణమయ్యెను. ఏ వస్తువును నశింపదు. 'చావు' అనఁగా ఒకచోట నంతవఱకుఁ గూడియున్న వస్తువులు వేఱగుట. పుట్టుకయనఁగా నంతవఱకు వేఱుగనున్న వస్తువులు కలియుట.

అనాదిశైవమతము.

శివుఁడు గుణవికల్పుఁడుగాఁడని తెలిసికొని విభూతి, రుద్రాక్షలు, గురులింగవేషమును ధరించి అర్చించినచో ఆత్మ పరాత్పరునియందే బద్ధమై, మోక్షము కలుగునని ఈ మతసిద్ధాంతము.

అనాధృష్యుఁడు. ధృతరాష్ట్రుని యొక్క నూర్గురు పుత్రులలో నొక్కఁడు.

అనాయువు. మాఱుపేరు అనుగ. తండ్రి దక్షప్రజాపతి. మగఁడు కశ్యపుఁడు.

అనార్యులు. ఆర్యులు కానివారు. హిమాలయమునకును వింధ్యపర్వతమునకును నడుమనున్న ప్రదేశ మార్యావర్తమనియు నందుండు వారార్యులనియు, తదితరు లనార్యులనియుఁ జెప్పఁబడుచుండిరి. హిందూదేశమునందు నార్యులరాకకు పూర్వముండు మూల నివాసులను ఆర్యులు అనార్యులనుచుండిరి. ఇటీవల పారసీక పాశ్చాత్త్యులనేకులును ఆర్యశాఖవారే యనియు సిద్ధాంతీకరింపఁబడినది. గనుక, ఈ ఆర్యశాఖల్లోఁ జేరనివారిని ఇప్పటి పాశ్చాత్త్యులు అనార్యు లనియెదరు. ఆర్యులెవరు, 'అనార్యులెవరు అన్న విషయము సవిస్తరముగ 'ఆర్యులు' అన్న శబ్దమునొద్ద వివరింపఁబడును.

అనాహడ్గడతహస్సీల్ (లేక బర్నాలా). ఇది పటియాల సంస్థానమునందలి అనాహడ్గడ నిజామతులోని ఒక తాలూకా. ఈ తాలూకా వైశాల్యము ౩౪౬ చదరపు మైళ్లు. ఇందలి జనసంఖ్య ౧౦౫౯౮౯. ఇందు అనాహడ్గడము (జనసంఖ్య, ౬౯౦౫); హడియాయా (౫౪౧౪) భాదరు (౭౭౧౦) అను గ్రామములును, ౮౬ పల్లెలును గలవు. ఈ తాలూకా ౧౮౦౦౦౦ రూపా

చున్నది.

అనాహడ్గడ ...
పంజాబునందున్న పాటియా
నందలి ఒక జిల్లా. దీని వైశా
చదరపుమైళ్లు. ఇందలి జనసం
ఇందు గోవిందగడము, భాదరు
హడియాయా అను నాలుగు గ్ర
౪౫౪ పల్లెలున్నవి. ఈ జిల్లా
లేక అనాహడ్గడమునది మ
ఈజిల్లా ౭౨౦,౦౦౦రూపాయిలు

అనిగేరు. గోదావరిజి
ఏజన్సీ డివిజనులోని ఒకపల్లె. జన
రు. ౮౦ లు క్విట్రెంటు చెల్లిం
గ్రామముల ముఠాకు నిది ము
ముఠాదారు పూర్వపు జగదంగీ
వంశజుఁడు. ౧౮౪౬ లో జగద
దారుఁడు తిరుగఁబడి మన్నబు
కొనెను. అతని కుమారుఁడ
సమయమున తన యావచ్ఛ
గవర్నమెంటువారికి సాయముచే
వినియోగించినందున అతని
ప్రభుత్వమువారీ ముఠాను డచ్చ
తీసి ఈతని కిచ్చిరి.

అనితల్లి. కాటయ
గూతురు. కాశీఖండమును కృ
భద్రారెడ్డికిఁ భార్య. ఈమె తల్లి

బిక. ఈమె తండ్రియైన కాటయవేమారెడ్డి కొండవీటి యనపోతారెడ్డికి (౧౩౫౮-౧౩౬౨) అల్లుఁడు, మేనల్లుఁడు. కుమారగిరి రెడ్డికిఁ (౧౩౮౦-౧౪౦౦) చెల్లెల పెనిమిటి, మంత్రి. కుమారగిరి కాటయవేమునకు రాజమహేంద్ర వరము రాజ్యమిచ్చెను.* కాటయవేముని తరువాత నాతని పుత్రుఁడైన కుమారగిరి రాజమహేంద్రమునకు రాజయ్యెను. ఆతని తరువాత నాతని చెల్లెలైన అనతల్లిని, ఆమె మామగారైన అల్లాడరెడ్డి శత్రురాజులను ఓడించి రాజ్యముపైఁ గూర్చుండఁబెట్టెను. ఈమె మామగారైన అల్లాడరెడ్డియు, బావగారైన వేమారెడ్డియు, భర్తయైన వీరభద్రారెడ్డియు ఈమెకుఁగాను రాజమహేంద్రవర రాజ్యము చేయుచున్నట్టు గానవచ్చుచున్నది. ఈమె శా. శ. ౧౩౪౫ (క్రీ. శ. ౧౪౨౩) లో నొక బ్రాహ్మణునకుఁ గెలువచేఱువను గ్రామము దానమిచ్చుచు నొక తామ్రశాసనము వ్రాయించెను. అది యీ మధ్య బయిటఁబడినది.† దానివలనఁ బైసంగతులు వెల్లడి యగుచున్నవి. దానము తీసికొనిన బ్రాహ్మణుఁడు కళానాథభట్టు కుమారుఁడైన పరహితాచార్యుఁడు. ఇతఁడు వైద్యశాస్త్రమునందు మిక్కిలి ప్రవీణుఁడు. ఈమె ఆ సంవత్సరముననే దేవబ్రాహ్మణుల యగ్రహారముల మీఁది పన్ను తీసివేసినదని యీ శాసనమునందే వ్రాయఁబడి యున్నది. శ్రీనాథుఁడు కాశీ ఖండమునందు ఈ అనితల్లిని ఇట్లు వర్ణించియున్నాఁడు:—

 మ. మనుతుల్యుండగుఁ గాటభూవరుని వే
మక్ష్మాతలాధీశు నం
దనఁ బాణిగ్రహణంబుచేసి ప్రియమొం
దన్ వీరభద్రేశ్వరుం
డనితల్లి న్వనతామ తల్లి నుదయా
స్త్రాద్రీంద్ర సీమావనీ
ఘన సామ్రాజ్య సమర్థ సుప్రథిత సా
క్షాదిందిరా దేవతన్.

ఈ పేరునకు 'అనతల్లి' 'అన్నతల్లి' యను మాఱురూపములు కలవు.

అనియాది గణపతి దేవుఁడు.

నియోగి బ్రాహ్మణుఁడు. మూలనామాత్యుని పుత్రుఁడు. శివయోగసారమను వేదాంత గ్రంథమును రచించెను. ఇందు పూర్వోత్తర భాగములు కలిసి యెనిమిది యాశ్వాసములు గలవు. ఈకవి కాలము తెలియదు. ఇన్నూఱు సంవత్సరములకు ముందునున్నవాఁడని వీరేశలింగముగారు వ్రాసియున్నారు.

అనిరుద్ధుఁడు.

౧ కల్పాదియందు బ్రహ్మను పుట్టించుటకై నారాయణుఁడెత్తిన యవతారము.

* Epigraphia Indica Vol. IV. p. 318.

† ఈ శాసనమును కాకినాడ వాస్తవ్యులగు శ్రీ దుగ్గిరాల సూర్యప్రకాశరావుగారు క్రొత్తగా, కాకినాడ తాలూకాలోని ఆర్యవట గ్రామమునందున్న శ్రీ కాశీనాథ భట్ల సుబ్రహ్మణ్యముగారి యొద్దనుండి సంపాదించి, ఆంధ్రభారతి, ౩-వ సంపుటము, ౩౪౫ పుటలోఁ బ్రకటించిరి. అది పిదప ఆంధ్ర పరిషద్ పత్రిక, ౨-వ సంపుటము, ౯౩-వ పుటలో శాసనముయొక్క పటముతోఁగూడఁ బ్రకటింపఁబడినది. ఈ శాసనము వలనఁ జరిత్రకారులకు నూతన విషయము లనేకములు తెలిసినవి.

౨. (చం. వం.) యాదవకులజుఁడు. శ్రీకృష్ణుని కుమారుఁడైన ప్రద్యుమ్నునకును, రుక్మి కూఁతుఁరైన రుక్మవతికిని కుమారుఁడు. ఇతఁడు నాగాయుతబలుఁడు, మహారథుఁడు. రుక్మిరాజు పౌత్త్రియైన రోచన యీతనిభార్య. ఈ వివాహకాలమందు ఘోరమైనపోరు జరిగెను (చూ. 'రోచన'). ఈమెవలన నితనికి వజ్రుఁడను పుత్త్రుఁడు పుట్టెను (భాగ. ౧౦.౯౦). బాణాసురునికన్య ఉష యను నామె యీతని ద్వితీయభార్య. ఈమెను గుఱించి యాదవులకును బాణాసురునకును పోరుజరిగెను. (చూడు ఉష).

అనిర్దేశ్యము. యజ్ఞసంబంధమైన యొక అగ్ని పేరు.

అనిలుఁడు. ౧. అష్టవసువులలో నొక్కఁడు. ఈ మన్వంతరమునందు వాయవ్య దిక్కునకునధిపతి. ఈశబ్దమునకు అనీలుఁడను రూపము గూడఁగలదు.

౨. శ్రీకృష్ణునకు మిత్రవిందవలనఁ గలిగిన పుత్త్రులలో నొక్కఁడు.

అనీకుఁడు. (చం. వం.) యాదవుఁడు, వసుదేవుని తమ్ముఁడు.

అనీహుఁడు. (సూ. వం.) శ్రీరాముని వంశమునందుఁ బుట్టిన దేవానీకుని పుత్త్రుఁడు. నామాంతరము అహీనకుఁడు. [illegible]పుత్త్రుఁడు, సహస్రాశ్వుఁడు.

అనుకరణము. ఒక [illegible] కొనుట యనుకరణమనఁబడ[illegible] ణము ముఖ్యముగ రెండువిధ[illegible] కరణము, వ్యాపారానుకరణ[illegible] కరణ మనఁగా నొకరు పలికి[illegible] వ్యాపారానుకరణమనిన [illegible] చేయుట. అనుకరణము మ[illegible] మనియు, బుద్ధిపూర్వకమనియ[illegible] ములు. పిల్లవాఁడు తల్లిదం[illegible] మరలఁజెప్పఁబోవుట స్వాభా[illegible] ఇట్టిది చిలుక గోరింకలవంటి [illegible] గొంతవఱకుఁ గలదు. సంగీ[illegible] వులవారి ధ్వనివలె ధ్వనిచేయ[illegible] బుద్ధిపూర్వకము. శబ్దానుక[illegible] వ్యాపారానుకరణమునందును స్వాభావిక ప్రవృత్తికలదు. న[illegible] శిశువునకు అనుకరణ ప్రవృ[illegible] డార్విన్ అను శాస్త్రిజ్ఞుఁడు [illegible] స్వాభావిక ప్రవృత్తియే మా[illegible] విద్యలు నేర్చుకొనుటకు మొ[illegible] నది. పిల్లవానికిఁ జదువుచెప్ప[illegible] వికమైన అనుకరణ ప్రవృత్తిని [illegible] దానిని క్రమముగ నుపయో[illegible] పిల్లవానికి శీఘ్రముగను, భాషయు విద్యలును పట్టుపడ[illegible] మైన యుచ్చారణచేయలేని [illegible] నేర్చుకొనిన పిల్లల యుచ్చార[illegible] పరిశుద్ధములుగఁ జేయుట వే[illegible]

యందఱకు విదితమే. సంగీత విద్యయందును, వక్తృత్వకళయందును శబ్దానుకరణ ప్రవృత్తి యెక్కువగ నుపయోగపడును. కొంద ఱితరపురుషుల మాటలను, పశుపక్ష్యాదికముల ధ్వనులను కూడ ననుకరించెదరు. వ్యాపారానుకరణ ప్రవృత్తి భరతశాస్త్రాభ్యాసమునకు మూలాధారము. నాటకములో రసపోషణ చేయుటకై రెండు విధములయిన అనుకరణములును గావలయును. పాత్రోచితమైన భాషయు, నటనయు నుండవలయును. గ్రంథాదులలో వచ్చు జాతీయము లన్నియు ననుకరణములే. వ్యాపార ప్రవృత్తియే మానవుని స్వభావమును, ఆచరణను నిశ్చయ పఱచును. మంచి సహవాసము కలవారు మంచి వారగుటయుఁ జెడ్డ సహవాసము గలవారు చెడ్డవారగుటయు సర్వసాధారణము. పైని రెండు విధములయిన యనుకరణములు చెప్పినప్పటికి నన్యవిధములు లేకపోలేదు. స్వరూపానుకరణమే చిత్రవిద్య. ఆకు పటమును జూచి నిజమైన ఆకనియు, మానవుని పటముఁ జూచి నిజమైన మానవుఁడనియు భ్రమగలుగునట్లు చేయుటయే చిత్రకారుని యుద్దేశము.

అనుకరణప్రియత్వ మానవులయందే గాక పక్ష్యాదులకుఁ గూడ నుండును. చిలుక మొదలైనవి మనము చెప్పిన మాటలు మరలఁ జెప్పును. కోతులు మానవ కృత్యముల ననుకరించును. కొన్ని పురుగులు, శత్రువుల నుండి తప్పించుకొనుటకై, తాముండు గడ్డి యొక్క రంగునుగాని, మఱి బలవత్తరములైన పురుగుల రూపమును గాని అనుకరించును.

అనుక్రమణికలు. అనఁగా విషయసూచికలు. ముఖ్యముగ వేదములయొక్క విషయ సూచికలకు అనుక్రమణికా నామము చెల్లుచున్నది. సంస్కృతభాషలో, అనుక్రమణికలనఁగా వేదానుక్రమణిక లనియే యర్థము. సంహితాభాగములందు క్రొత్త మంత్రములు చేరకుండగను,ఉండినవి లోపింపకుండగను ఉండు నిమిత్తమై అనుక్రమణిక లేర్పడినవి. వానిలో మంత్రమందలి ప్రథమ శబ్దము ఋషి దేవత చంధస్సు మొదలగువాని పేళ్లు, మంత్రసంఖ్య జెప్పఁబడును.

వేదములయొక్క వేఱువేఱు శాఖలకు వేఱువేఱు అనుక్రమణిక లేర్పఱుపఁబడినవి. సాయణాచార్యుని కాలమునందుఁ బెక్కు అనుక్రమణిక లున్నట్లు కానవచ్చుచున్నది. అప్పుడున్న యనుక్రమణిక లిప్పుడు లోపించినవి. ఋగ్వేదమునకు ౭ అనుక్రమణికలు గలవు. అందు నైదు, శౌనకప్రణీతములు, ఒకటి కాత్యాయనరచితము. మిగిలిన దానికి గర్తయెవఁడో తెలియదు.

బృహద్దేవతానుక్రమణి అనునది శౌనకరచితము. అందు. యాస్కుఁడు పేర్కొనఁబడినందున నది యాస్కునితరువాత వ్రాయఁబడెనని యూహింపవచ్చును. యజుర్వే

దమునకు మూఁడు అనుక్రమణులు కలవు. ఆత్రేయ శాఖకొకటి, చారాయణీయ శాఖకొకటి, మాధ్యందినశాఖకొకటి.

ఆత్రేయానుక్రమణిలోఁజూడ మొదట దానిని వైశంపాయనుఁడు యాస్కునకును, యాస్కుఁడు తిత్తిరి ఋషికిని, తిత్తిరి ఉఖునకును చెప్పినట్లున్నది. సామవేదమునకు రెండు అనుక్రమణికలుగలవు. మొదటిది నైగేయానామృత్స్వర్షము, రెండవది నైగేయానామృత్కు దైవతము. శౌషోక్తమైన యనుక్రమణి యొకటి గలదు. అది మిక్కిలి పురాతనమైనది గాదని పండితుల యభిప్రాయము. అథర్వవేదమునకుఁ గేవల మొక యనుక్రమణి గలదు. దానికి బృహత్సర్వానుక్రమణి యని పేరు.

అనుగీత. వేదాంత విషయమైన గ్రంథము. భారతమునందు నశ్వమేధపర్వమున నున్నది. ఇందు ౩౬ అధ్యాయములు కలవు. అర్జునుఁడు భగవద్గీతలోని బోధమరిచితిని, మరలఁజెప్పుమనికోరఁగా శ్రీకృష్ణుఁడు చెప్పెను. బ్రహ్మగీతయు నిందే యిమిడియున్నది.

అనుఁడు. (చం. వం.) నహుష పుత్రుఁడైన యయాతిరాజునకు శర్మిష్ఠవలనఁ బుట్టిన ముగ్గురు పుత్రులలోఁ బెద్దవాఁడు. యదువువలెనే యీతఁడును తండ్రియొక్క ముసలితనముఁ దీసికొనుటకు నొప్పుకొనని నందున ముఖ్యరాజ్యాధికారముఁ బోఁగొట్టు

కొని యుత్తర దిక్కున ను
నధిపతియయ్యెను. (మత్స
పుత్రులు సభానర, చక్షు,

౨. (చం.వం.) య
యొక్క జ్యామఘ వంశాంత
మందలి కురువంశ రాజు పు
రుఁడు పురుహోత్రుఁడు.

౩. (చం. వం.) యాద
తర్గతమైన అంధక కులవ
రోముఁడను రాజునకుఁ బు
పుత్రుఁడు అంధకుఁడు.

అనుపదేవుఁడు.
యాదవుఁడు, దేవకుని కొడు

౨. (చం. వం.) యా
రుని రెండవ కొడుకు.

అనుపావృత్తము
దేశము. (భార. భీష్మ. అ.

అనుబ్రాహ్మణము
సదృశ గ్రంథములు. సా
ములకును యాజ్ఞవల్క్యాది
బ్రాహ్మణ సదృశగ్రంథము
బ్రాహ్మణము అనిపేరు.

అనుభవ సారము
సోమనాథ కవి కృతము. శై
భక్తి యుత్కర్షయే ఇందు వ

అనుభూతిస్వరూపాచార్యుఁడు:

సారస్వత వ్యాకరణమును రచించిన యతఁడని వాడుక. ఇతనిగూర్చి యొకకథగలదు. రాజసభ మధ్యమున నీతఁడొక నాఁడు అపశబ్దప్రయోగము చేయ దానికి నాధారము చూపు మన నింటికిఁ బోయి సరస్వతి నారాధించెను. ఆపె పరిసన్నురాలై యొక వ్యాకరణము నిచ్చెను.

ఈతఁడు సారస్వతవ్యాకరణము వ్రాయలేదనియు దానిమీఁద 'ప్రక్రియ' మాత్రము వ్రాసెననియు నీతఁడు క్రీ. శ. ౧౩౫౦ కిఁ దరువాతను ౧౪౫౦ కిఁ దరువాతను ఉండెననియుఁ దజ్ఞుల యభిప్రాయము.*

అనుభూతి ప్రకాశిక.

ఈ గ్రంథము సకలామ్నాయ కోవిదుండగు విద్యారణ్యమునీశ్వర విరచితము. బ్రహ్మజిజ్ఞాసువునకు నుపనిషదర్థజ్ఞానము నిస్సందియముగ సబువడుటకై యీ గ్రంథ ముపదేశింపఁబడియె.

వేదచతుష్టయ శిరోవతంసంబులగు నైతరేయ తైత్తిరీయ చాంధోగ్య ముండకోపనిషత్తాత్పర్యంబుల నధ్యాయ సప్తకంబుచేఁ బరిప్రథమంబున నిరూపించి పిమ్మటఁ బదుమూఁడధ్యాయంబులచే వేదచతుష్టయాంతర్గతంబగు నుపనిషద్ద్వాదశ తాత్పర్యంబును వ్యక్తీకరించె. ఈ విషయము విద్యారణ్యులచే ననుభూతి ప్రకాశికయొక్క యెనిమిదవ యధ్యాయమునందలి మొదటి రెండు శ్లోకములచే వివరింపఁబడియున్నది:-

"ఐతరేయే తైత్తిరీయే ఛాందోగ్యేఽథర్వణేచయత్
తత్త్వంచతుర్వేదవిద్యాప్రకాశే తత్సమీరితమ్
అనుభూతిప్రకాశేఽథ కౌషీతక్యాదినామసు
చతుర్వేదాంగశాఖాసు యత్తత్త్వం తదుదీర్యతే॥

ఇట్టులీగ్రంథ మిరువది యధ్యాయంబులఁగల్గి మృదుమధురశైలితోనొప్పు రెండువేల యెనిమిదివందలయైదుయనుష్టుపు శ్లోకములతో నతిశయిల్లుచున్నయది. ఇరువదియధ్యాయంబులచేఁ జతుర్వేదాంతర్గతంబగు నిరువది ప్రకరణంబుల్ల తాత్పర్యము వివరింపఁబడుచున్నను బ్రతియధ్యాయమును సంక్షేపంబుగనో విపులంబుగనో యద్వైతతత్త్వమునే ప్రతిపాదింపుచున్నయది. ప్రకరణ వైచిత్ర్యము శిష్యవైచిత్ర్యము ననుసరించి యున్నది గాని తత్త్వవైచిత్ర్యమువలన నెంతమాత్రమును గలుగలేదు. నాలుగవ వేదమందలి యిరువది ప్రకరణంబులు నత్యంత భిన్నంబులుగా నుండినను బర్యవసానమున నద్వైతతత్త్వమునే ప్రతిపాదించుటచే నిరువదియధ్యాయంబులును బర్యవసానంబున నొకేయంశంబగు నద్వైత తత్త్వమును బ్రకటింపుచు సర్వోపనిషత్సామరస్యంబును సకలవేదసామరస్యంబును వేయివిధంబుల సిద్ధాంతీకరింపుచున్నయవి.

మొదటి యధ్యాయంబున నైతరేయ ద్వితీయారణ్యకంబును, రెండవ యధ్యాయం

*Systems of Sanskrit Grammar by Belwelkar, p. 96.

బును. తైత్తిరీయాంతర్గతంబగు బ్రహ్మా వల్లియు, మూఁడు నాలుగైదవ యధ్యాయం బులచే క్రమంబుగ ఛాందోగ్యంబు నందలి యుద్దాలక సనత్కుమార ప్రజాపతి యుప దేశంబులును, ఆరేడవ యధ్యాయంబులచే ముండకము నందలియాంగిర పిప్పలాదోప దేశంబులును, ఎనిమిది తొమ్మిదవ యధ్యా యంబులచే ఋగ్వేద కౌషీతకి శాఖయందలి యిందాృజాత శతూృపదేశంబులును, పది యవ యధ్యాయంబున మైత్రాయణ్యుపని షత్తునందలి శాకాయన్యోపదేశంబును, పదు నొకండవ యధ్యాయంబున కఠవల్లి యందలి యమోపదేశంబును, పన్రెండవ యధ్యా యంబున శ్వేతాశ్వతరోపనిషత్తును, పదు మూఁడవ యధ్యాయము మొదలు పదునెని మిదియవ యధ్యాయము వఱకునుంగల యాఱధ్యాయంబుల యందును క్రమంబుఁగ బృహదారణ్యకాంతర్గతంబులగు మూఁడవ యధ్యాయ నాల్గవ బ్రాహ్మణంబు, నాలవ యధ్యాయము నందలి యజాతశత్రుబాలాకి సంవాదము, యాజ్ఞవల్క్య మైత్రేయ సంవాదము, అథర్వణోప దేశంబగు మధు విద్యలును, ఐదవ యధ్యాయంబు నందలి యాజ్ఞ వల్క్య శ్వేలాదుల వాదకథయు, నాఱవ యధ్యాయమందలి యాజ్ఞవల్క్య జనక సంవాదంబును, బందొమ్మిదవ యధ్యా యంబున సామవేద తలవకార శాఖయును; ఇరువదియవ యధ్యాయంబున నథర్వణోత్తర తాపినియును బూర్ణముగ యవ్వాని తాత్పర్యము సుస్థ లముగను, నిస్సంశయంబుగన గను సిద్ధాంతీకరింపఁబడినది.

అనుమతి. ౧ అంగి కర్దమ కన్య శ్రద్ధకును బుట్టిన లలోఁజిన్నది.

౨. ద్వాదశాదిత్యులలో వాని భార్య.

౩. శాల్మల ద్వీపమునంద నది.

౪. ఒక బ్రహ్మర్షి (చూ.

అనుమకొండ చూడు ఓరుగల్లు.

అనాస. ఇది ఏకదళ జేరిన యొకానొక కుటుంబము చినది. ఈ మొక్క యొక్క బమునకు సంబంధించినవి వ గానరావు. అనాస మొక్కయ నుండి పెరుగుచున్నద్ది కాదు ఖండమును గనుఁగొనిన పిదప పా, ఆఫ్రికా, ఆసియా ఖండ పడెను.

అనాస మిగుల రుచివంతవ కరమును నగు ఫలజాతులలోఁ ఫలము ప్రప్రథమమున ౧౫౧

ములో గాన్‌కేటి హార్నాండజ్ (Goncat Hernandez) అను వానిద్వారా ఐరోపా దేశమునకును, ౧౫౪౮-వ సంవత్సరములో పోర్చుగీసు వారిద్వారా బంగాళమునకును గొంపోఁబడినది. అమెరికా నుండియే తేఁబడిన బంగాళా దుంపలవలె నియ్యది ప్రారంభమునఁగూడ హేయముగఁ జూడఁబడక శీఘ్ర కాలములో దేశమంతటను వాడుకలోనికి వచ్చినది. భరత ఖండమున గల నానావిధ దేశభాషలలోఁ గూడ నంతఁగా భేదములేక యొకే సామాన్య నామముతోఁ బేర్కొనబడుట కిదియే కారణము.

అనాస మొక్కయొక్క ప్రకాండము మిక్కిలి చిన్నది. ఆకులొకదాని మొదలులో నొకటి యిమిడి గుబురుగను, వానిలోపల నీరెక్కువగా నుండుటచే దట్టముగను ఉండును. వృంతము ప్రకాండము చివరనున్నది. పుష్పములు, మిథునములు, సరాళము, పుష్పకోశము, ౩. దళవలయము, ౩. కింజల్కములు, ౬. అండకోశములు చేటికలు కలిసి కండ గలిగిన యొక మిశ్రమ ఫలమగును, గింజలుండవు. పండులో మధ్య కొయ్యవలె నున్నది వృంతము. ఇది పైకివచ్చి తిరిగి ఆకులు వేయును. ఈ తలను బాతియే తిరిగి మొక్కలను బెంచెదరు.

పంటలో కొంచెము భేదముండినను సాధారణముగ నన్ని భూములును అనాస పంటకర్హములే. కాని గరుప నేలలు మంచివి. రెండు పాళ్ళు బంకమన్ను ఒకపాలు ఇసుక గలిగిన భూములును భూమి మిక్కిలియనుకూలములని కొందఱనుభవజ్ఞుల యభిప్రాయము. సింహాచలమునందు చలువ కొండల చరియలందు, నేల నంతరములుగఁజేసి వీనిని విశేషముగ సాగుచేయుచున్నారు.

ఈ వ్యవసాయము చేయు భూమిచుట్టును, కంచగా కిత్తనారచెట్లు వేయుటవలన ఈ తోటలకు చెఱుపు గలుగ కుండుటయేగాక కిత్తనార వలన నెంతయో లాభముగలదు. భూమిని చక్కఁగ దున్ని మధ్యమధ్య రెండడుగుల వెడల్పున గోతులు త్రవ్వి మంచి యెరువువేసి అందు మొక్కలను బాతిపెట్టవలయును. అనాస మొక్కలును నాటుటకు సాధారణముగా శ్రావణ మాసము మంచి సమయము. అపుడేకాపు పూర్తియగుట వలన పిల్కలు విశేషముగ లభించును. మొక్కల మొదటగాని, కాయలమీఁదగాని కాయలమీఁద క్రిందనుగాని పుట్టు పిల్కలను గోసి నాటిన యెడల మొక్కలగును. ప్రతి అనాసపండునకును నెత్తిమీఁదనొకపిలకయు, కాడచివర అనఁగా కాయ మొదట పది పండ్రెండు పిలకలును ఉండును. ఒక్కొక్క పిలక నే ప్రత్యేకముగా పాతింపవలెను. అనాసచెట్లు తేమ యున్నంత మాత్రముననే పెరుగు స్వభావము గలవిగాన నీ రెక్కువ లేకుండునట్లు జాగ్రత్తగాఁ జూడవలెను.

శేల యెంతే సారవంతముగా నున్న వంతే పెద్దపండ్లు కాఁగలవు. చీకిన గుబ్బపు యెరువు పరిశ స్తము. ప్రతిసంవత్సరమును ఎరువు వేయు చుండుట మంచిది. ఎముకల పొడి గలుపు టయు నాచారముగా నున్నది. ఎరువు వేసిన తరువాత నీరు తఱుచుగఁ గట్టవలెను.

ఈ తోటలకు ఎలుకల బాధ తప్ప మరియే తెగుళ్ళ బాధయు నున్నట్టులేదు. సామాన్య ముగా ఈ వర్షకాలమున పాతిన మీఁదటి వేసవికాలమునకు కోఁతకు సిద్ధమగును. అనఁగా నిడిరెండేండ్ల పంట. కాపు పట్టిన తరువాత నాలేచోట కే, ౪ సంవత్సరముల కంటె నెక్కువకాల ముంచ్చినయెడల కాయలు చిన్నవయి పోవును.

అనాస పండ్ల నెగుమతి చేయునపుడు దూరము విశేషముగా నున్నయెడల పండ్ల రసమును తయారుచేసి పంపనగును. పై పెచ్చును గింజలను తీసివేసి, యంత్ర సాహా య్యమునగాని మఱియే విధముగానైనగాని రసమును పిండి, సుమారు ౧౮౦ డిగ్రీలు ఫారన్‌హీటు వేడి యెక్కువఱకు కాచి ఫ్లా నలు గుడ్డతో వడపోయవలెను. ఈ రస మును సీసాల కెక్కించి, ఏ దేశమున కయి నను పంపవచ్చును.

అనాసపండ్ల రసమును బంచదారలోఁ గలిపి త్రాగిన నిస్త్రాణను బోఁగొట్టును; కాని విస్తారము త్రాగినచో మూత్రవ్యా ధులకుఁ గారణ మగునందురు. పచ్చికాయల

రసమును, ఆకుల రసమును
జేయును. శ్లేష్మవ్యాధిగల వ
నియమప్రకారము కొంత ఈ
పుచ్చుకొనిన యారోగ్యవం

నీడను పండిన పండ్లు
విక్రయమున కనుకూలము
ఎండనఁ బండినవి మిక్కిలి
లండను పట్టణమునకు విస్తారవ
కొవరీ ద్వీపముల నుండి ఎగు
కాని పిల్లట్టు, అస్సాము అనా
లయినవి. అన్నిటి కన్నను
మారిస అను రకము మిక్కి
నది.

అనాస పండ్లలో 'క్యూ
సుప్రసిద్ధమైన జాతి. కాయ
డును. సింహళ దేశమున నీ
౨ర పౌనులు తూగినదఁట. ఈ
యాకులకు మొదట కక్కులు
౪, ౫ ఏండ్లు ఈ దేశమున
టికి, అవి బయలు దేరును.

తక్కిన చెట్లవలె ఈ అనా
ముగా పోవు భాగమేదియు లే
క్కల ఆకులనుండి మంచి నా
నార గట్టిగను, నున్నగను,
నుండునుగాని ఆకులనుండి న
కష్టము; వానిని ౧౫ దిన
నాననిచ్చి యట్టుపైన నార
అది సులభ సాధ్యంబయ్యెనా

క్కువ వాడుకలో నుండి యుండును. ౧౮౩౯ సంవత్సరములో మిస్ డేవి యను నామె డక్కా నేతగాండ్రను బోత్సాహపఱచి ఈ నారతో మిక్కిలి రమ్యమగు వస్త్రముల నేయించి వ్యవసాయ సంఘము వారి యొద్ద నుండి బహుమతి పొందెను. ఈ నారను నూలు పట్టులలోఁగూడ కలిపినేయవచ్చును. ఇది నీటిలోఁ జీకిపోకుండ చిరకాల ముండు టచే నొక్కొక్కప్పుడు, చేపలు పట్టుకొను టకు గాలముల త్రాళ్లు దానితో నేయుచుందురు. నారతో మంచి బట్టల నేయుదురు. మొట్టమొదట ఈ నార విస్తారముగా పడమటి సముద్ర తీరమునుండియు, బంగాళా నుండియు నెగుమతి యగుచుండెను. కాని దూదివర్తక మెక్కువయిన తరువాత, ఈ నార ఎగుమతితగ్గి ధోవతిగా మారుట నిలిచి పోయినది.

ఒక యకరము భూమిలో ౨౦౦౦౦ చెట్లు పట్టును. చెట్టున కొక పండువంతున ఇరువదివేల పండ్లవలన సుమారు రు ౩౧-౨ లు రాబడిగలదు. నారవలన రు ౫౦౦లు రాఁగల దట. మొత్తము మీఁద యకరమునకు ఎనిమిది వందల రూపాయల ఫలితము కనుపడుచున్నది.

అనుమానము

(హిందూ తర్కశాస్త్రము ననుసరించి)

మన నైయాయికులచే నంగీకరింపఁబడిన నాలుగు ప్రమాణములలో నిది రెండవది. ప్రత్యక్షము, అనుమానము, ఉపమానము, శబ్దము అనునవి నాలుగు ప్రమాణములు. ప్రమయనఁగా యథార్థానుభవము, నిజమైన జ్ఞానము. ప్రమకుఁ గారణము ప్రమాణము. అనఁగా నే సాధనంబులవలన మనకు యథార్థజ్ఞానము కలుగునో, వానికిఁ బ్రమాణము లని పేరు. అనుమాన మనునది సాధనము. అందువలనఁ గలుగు జ్ఞానమును 'అనుమితి' యందురు.

అనుమాన స్వభావము

మనము దూరమందున్న యొకానొక పర్వతముమీఁద, పొగలేవఁగాఁ జూచి యా పర్వతమునందు నగ్ని కలదని యూహించు చున్నాము. ఇట్టి జ్ఞానమునకు 'అనుమితి' యని పేరు. ఇందుఁ బర్వతమునకుఁ బక్షమనియు, ధూమమునకు 'హేతువు' లేక 'లింగ' మనియు, అగ్నికి 'సాధ్య' మనియు సంజ్ఞలు. ఇందుఁ బ్రత్యక్షమైన ధూమముచే నప్రత్యక్షమైన యగ్ని సాధింపఁబడినది. కావున నే వాత్స్యాయనుఁడు 'ప్రత్యక్షముచే నప్రత్యక్ష వస్తువుయొక్క సంబంధమును సాధించుట అనుమానము' అని తన వార్తికములోఁ జెప్పియున్నాఁడు.*

ఇచ్చటి యనుమానమునకు, 'హేతువు' (లేక లింగము) అనఁబడు ధూమము కారణ

*'ప్రత్యక్షేణా ప్రత్యక్షస్య సంబంధస్య ప్రతిపత్తిః' చూఁడు గౌతమ సూత్రము ౧,౧,౩ మీఁది వాత్స్యాయన వృత్తి.

మైనను, ధూమమునకును అగ్నికిని గల సంబంధముయొక్క జ్ఞానమే ముఖ్య కారణమని చెప్పవలసి యున్నది. ఎచ్చటెచ్చట ధూమముండునో యచ్చటచ్చట నగ్ని యుండు నన్న జ్ఞానమేది గలదో యది యనుమానమునకు హేతువు. ఈ జ్ఞానమునకే వ్యాప్తిజ్ఞానమని పేరు. ధూమమునకును, అగ్నికిని గల సంబంధమునకు వ్యాప్తి యని పేరు.

పైని చెప్పిన దానిని చూడఁగా 'వ్యాప్తి' యనునది అనుమాన ప్రకరణమునందు ముఖ్యమైన విషయమని చదువరులకుఁ దోఁచియుండును. కావున అందున గుఱించి కొంచెము విశదముగ వివరింతము.

వ్యాప్తి

ధూమ మున్నచోట నెల్ల అగ్ని యుండునా యుండదా యని యొవనికి సంశయము కలదో వానికి ధూమజ్ఞానముచేత నగ్నిజ్ఞానము కలుగనేరదు. అట్లు సంశయము లేక ధూమాగ్నులకుఁగల సంబంధము నిశ్చయముగాఁ దెలిసినవానికి ధూమజ్ఞానముచే నగ్నిజ్ఞానము తప్పక కలుగును. అందువలన వ్యాప్తి నిశ్చయమే యనుమితికిఁ గారణమని మనము చెప్పవచ్చును. ఈ వ్యాప్తిజ్ఞానము సాహచర్యజ్ఞానముచేఁ గలుగుచున్నది. కావుననే 'నియత సాహచర్యమే వ్యాప్తి' యని చెప్పఁబడినది. వంటయింటిలోను, ఇతర స్థలములందును మరల మరల ధూమాగ్నుల సాహచర్యము జూచుటచేత ధూమము వ్యాప్యమనియు, అగ్ని వ్యాపకమనియు జ్ఞాన

న్నది. అనఁగా వ్యాపక మెం

మునకంటె నెక్కుడు ప్రదేశ

కొని యుండును. ధూమ మ

అగ్ని యుండును. కాని అగ్ని

ధూమ ముండదు. అందువలన

ప్రదేశము లెక్కుడు, ధూమ

ములు తక్కువ. కావున ధూ

ము, అగ్ని వ్యాపకము. ఇది

విధముగఁ జెప్పవచ్చును.

మైనది వ్యాప్య మనఁబడును.

కము వ్యాపక మనఁబడును.

ధూమ ముండదు. కాని

అగ్ని యుండును. ఎట్లనఁగా

కడ్డీయందు నగ్ని కలదు. కా

లేదు. కావున ధూమము

నందు,అగ్ని (వ్యాపకము) యొక

న్నది. కాని అగ్నియందు ధూ

వ్యాప్తి లేదు. ఒకప్పుడు వ్యా

లకు సమాన వ్యాప్తి యుండవ

మాఱుగా 'పచ్చికట్టెల య

వ్యాపక మనుకొందము. అప్పు

యగ్ని' యున్నచోట నెల్ల

టయు, ధూమ మున్నచోట

కట్టెల నిప్పుండుటయుఁ దట

ఈ రెండును ఒకదాని కొకటి

వ్యాప్యము అని చెప్పవచ్చును.

అవినాభావరూప సంబంధము వ్యాప్తి యని మఱియొక లక్షణము కలదు. ఏదిలేక యేదియుండదో దానికి రెండవదానితో అవి నాభావసంబంధ ముండునని చెప్పెదరు. అగ్ని లేక ధూమ ముండదు. కావున అగ్ని యొక్క యవినాభావసంబంధము ధూమ మునం దున్నది. అగ్నియందు ధూమము యొక్క యవినాభావసంబంధము లేదు. అగ్ని లేని ధూమ ముండదు గాని ధూమములేని యగ్ని యుండవచ్చును. ధూమ ముండినం గాని యగ్ని యుండదన్న నియమము లేదు. కావున అగ్ని వ్యాపక మనియు, ధూమము వ్యాప్యమనియుం దెలిసికొనవలెను.

అగ్నికిని, ధూమమునకును గల యీ వ్యాప్తిజ్ఞానము జనులకు నెట్లు కలుగును?

వ్యాప్తిజ్ఞానమెట్లుకలిగినది

పైని ఒకచోట సూచించినట్లు నిత్యానుభవమే దీనికి ముఖ్యకారణము. వంటయింట్లో, యజ్ఞశాలలో, మఱి యితరస్థలములలోను పొగ యున్నచోట నెల్ల యగ్నిని చూచి నందున ఈ జ్ఞానము కల్గును. కాని తొంబది తొమ్మిది సారులు చూచినను నూఱవ సారి అట్లే జరుగునని యెట్లు? అందుకు అవ్యభిచారజ్ఞానముండవలయును. నియమమునకు భంగమే కలుగుట వ్యభిచార మనిపించుకొనును. ౯౯ సారులు ధూమ మున్నచోట్ల నగ్ని కనిపించియు నొక్కచోట అగ్నిలేనియెడల నది వ్యభిచార మగును. కావున నట్టి వ్యభిచారాభావము వ్యాప్తిం నిశ్చయమునకు సహకారి యగును. ఇట్లు, వ్యాప్తి జ్ఞానమునకు సాహచర్య జ్ఞానము, వ్యభిచార జ్ఞానరాహిత్యము ఆవశ్యకములు.

వ్యాప్తియొక్క వైశాల్యమును సంకుచితముచేయు దానిని ఉపాధి యందురు.

ఉపాధి

అగ్నియున్నచోట్ల నెల్ల ధూమ ముండును అన్నవాక్యము నిజమైనది కాదు. అందలి 'యగ్ని' యను పదమునకు ఆర్ద్రేంధన సంయోగము (పచ్చికట్టెలకూడిక) అన్నమాట తగిలించినయెడల నది సరియగును. ఈ 'ఆర్ద్రేంధన సంయోగ' మనునది 'ఉపాధి' యనంబడు. 'ఉప సమీపవర్తిని ఆదధాతి సంక్రామయతి స్వీయం ధర్మ మిత్యుపాధిః' అని ఉదయనాచార్యులు చెప్పియున్నాండు. తన యొద్ద నున్న వస్తువునకుం దన వర్ణమిచ్చునది యుపాధి. ఎఱ్ఱపువ్వము తన సమీప మందున్న స్ఫటికమునకుం దన వర్ణమిచ్చును. అట్లే యాకార విహీనమైన యాకాశమునకు ఘటమను ఉపాధి తన యాకారము నొసంగు చున్నది. ఇట్లే యగ్నివలన ధూమమును పుట్టించు నుపాధి 'ఆర్ద్రేంధన సంయోగము' అనంగాం బచ్చికట్టెలు నిప్పును తగిలియుండుట. కావున నడుమ నుపాధి యుండుటచే నెచ్చెటచ్చట నగ్నియుండునో యచ్చటచ్చట ధూమ ముండు నన్న వ్యాప్తికి వ్యభిచారము సంభవించినది. పొడికట్టెలు

గల యగ్ని 'యున్నపుడు పొగయుండదు. కాలిన యినుపగుండులోనున్న యగ్నికిఁగూడ ధూమముండదు. కావున నగ్నికి ధూమమునకు అవినాభావసంబంధము కలుగ వలె నన్న 'అగ్ని' యను పదమునకు 'తడికట్టెలు గల' యన్న విశేషణము చేర్చవలెను. ఇదియే యుపాధి. ఈ ఆర్ద్రేంధన సంయోగము అగ్నికి వ్యాపకము కాదు. ధూమమునకు వ్యాపకము. అనఁగా నుపాధి ధూమము కంటె నెక్కుడు వ్యాప్తి కలదిని, అగ్నికంటెఁ దక్కువ వ్యాప్తి కలదిని అయియున్నది. ధూమవ్యాప్తికిని అగ్నివ్యాప్తికిని గలభేదమును ఉపాధి సూచించును. 'పర్వతము మీఁద ధూమ మున్నది. అగ్ని యుండుటచే' నన్న సిద్ధాంతము చెప్పినతోడనే 'ఆర్ద్రేంధన సంయోగ' మను ఉపాధి యడ్డమువచ్చి యా సిద్ధాంత మపసిద్ధాంతమని చెప్పును.

గౌతమాచార్యుల వారనుమానము మూఁడు విధములని చెప్పియున్నారు(న్యాయ సూత్రము ౧.౧.౫). (౧) పూర్వవత్. (౨) శేషవత్. (౩) సామాన్యతో దృష్ట

అనుమాన విభాగములు

ములు. 'పూర్వవ దనుమాన' మనఁగా కారణముఁజూచి కార్యము నూహించుట. దీనినే 'కారణ లింగక' మనవచ్చును. కారణమే లింగముగాఁ (హేతువుగా) గలది యని యర్థము. ఇందు కుదాహరణము మేఘములఁ జూచి వర్షము కురియునని యూహించుట.

'శేషవద నుమాన' మనఁగా ... జూచి కారణమును ఊ... కార్యలింగకము. ఇందుఁ... ము (హేతువు). ఏటికి వరద... వర్షము కురిసెనని యూహిం... నుదాహరణము. పై రెండు... మానములు గాని యనుమ... మాన్యతో దృష్టానుమాన'... అనఁగాఁ గారణమునుబట్టి కా... కార్యమునుబట్టి కారణమును... మానములందు నూహింపఁబ... మానము లన్నియు సామాన్య... లని చెప్పవలసి యున్నది. ... నియతసాహచర్య ముండుట ... నొక వస్తువునుజూచి రెండవ... చుట సామాన్యతో దృష్ట... యభిప్రాయము. పృథ్వీత్వ... వేత్వమును ఊహించుట, తో... ఊహచేయుట ఇందుకు నుదా...

అనుమానము స్వార్థాను... పరార్థానుమానమన్నియు ... లుగా మర్గల విభజింపఁబడినది... మానమువలన మానవుఁడు ... దలి సంశయమును బాపు... జ్ఞానాత్మకము. పరార్థానుమ... మానవుఁడు పరుల సంశయ... ట్టును. ఇది శబ్దాత్మకము. కా... మానము మొదటిది. పరా...

రెండవది. తన మనసుకు సంశయనివృత్తి కలిగినఁగాని యితరులకు సమాధానము చెప్పుట యెట్లు ?

స్వార్థానుమానక్రమ మెట్లనిన, నొకానొకఁడు పర్వతముమీఁద ధూమమును చూచును. తరువాత నెచ్చట ధూమముండునో యచ్చట నగ్నియుండు నన్నవ్యాప్తిని స్మరించును. పిదప ఈ వ్యాప్తిస్మరణమును తనకుఁ బ్రత్యక్షముగఁ దెలిసిన పక్షధర్మతా జ్ఞానముతో(అనఁగాఁ బర్వతము ధూమవంత మన్న జ్ఞానముతోఁ) గలపఁగా, పర్వతము అగ్నివ్యాప్యముగాఁగల ధూమమును గలదియను జ్ఞానము కలుగుచున్నది. ఈ జ్ఞానమునకే యీ శాస్త్రమునందు పరామర్శ మనియు, లింగపరామర్శమనియుఁ బేళ్లు. దీనినే తృతీయ లింగపరామర్శ మందురు. ఎందుకనఁగా ఈ లింగ(హేతు-ధూమ) జ్ఞానము మూఁడుసారు లయినఁగాని పరామర్శము పూర్తికాదు. మొదట మహానసాదులయందు ధూమాగ్నుల సాహచర్యముఁజూచుట, రెండవసారిపర్వతము మీఁద ధూమమును జూచుట, మూఁడవసారి వ్యాప్తిజ్ఞానస్మరణము. ననుసరించి యీ ధూమ మగ్నివ్యాప్యమన్న జ్ఞానముగలుగుట. ఇట్లు లింగ (హేతు) జ్ఞానము మూఁడు విధములఁ గలిగినఁ గాని పరామర్శము కలుగదు. ఈ పరామర్శమే స్వార్థానుమితియని కొందఱి యభిప్రాయము. కొందఱమతమున హేతుజ్ఞానమునకే అనుమాన మనిపేరు, వ్యాప్తియొక్క స్మృతియే యనుమాన మని కొందఱి మతము. కొందఱు పరామర్శమును కరణమందురు. కొందఱు వ్యాపార మందురు. ఇట్లు నైయాయికులు భిన్నాభిప్రాయులైనను, అందఱును పరామర్శమును ఒప్పుకొని యున్నారు. పరామర్శము లేక యనుమితి కలుగ నేరదని యందఱి మతము.

పరార్థానుమాన మితరుల సంశయములఁ బాపుటకు నుపయోగపడును. ఇది పంచావయవాత్మకము.

పంచావయవములు

పంచావయవములు

పంచావయవాత్మకమైన పరార్థానుమానమునకు 'న్యాయ' మనిపేరు. దీనిని బట్టియే యీ శాస్త్రమునకంతకును న్యాయ శాస్త్రమని పేరువచ్చెను. స్వార్థాను మానమందు నెవని మనసులో వానికిఁ గలుగునట్టి పక్షధర్మతాజ్ఞానము (పర్వత మగ్ని మంత మన్న జ్ఞానము) కొన్ని వాక్యములచేఁబరుల మనసునందుఁ బుట్టునట్లు చేయుట 'న్యాయ' మనిపించుకొనును. పర్వతము అగ్నిమంత మని పరులను ఒప్పించుటకు ఈ క్రింది యైదు వాక్యములను ఉపయోగించెదరు:-

౧ పర్వతము అగ్నిమంతము (ప్రతిజ్ఞ)

౨ ధూమవత్త్వముచే (హేతువు)

3 ఏదియేది ధూమవంతమో యదియది అగ్నిమంతము, వంటయింటిలోను వలె (ఉదాహరణము)

౪ అట్లే యిద్ది (ఉపనయము)
౫ కావున-పర్వతమగ్నిమంతము(నిగమనము)

ఇందు మొదటిది 'ప్రతిజ్ఞ'. ఇందీవిషయము ప్రతిపాదింపఁబడు నని యిది తెల్పును. వక్త తాను స్థాపింపఁబోయెడి సిద్ధాంతమును ఇందు మూలకముగా ముందు చెప్పును. మొదటిదియైన ప్రతిజ్ఞతో చివరదియగు 'నిగమనము' సరిపోవలెను. అట్లు కానియెడల నది ప్రతిజ్ఞాభంగమనిపించుకొనును. రెండవది 'హేతువు'. ఈ వాక్యమునందు లింగము చెప్పఁబడును. లింగము హేతువు అనునవి సమానార్థకము లయినను వానియందుఁ గొంచ మర్థభేదము కలదు. లింగ మనఁగా గుర్తు. ఇచ్చట హేతువు అను పదమును సాధారణముగా లింగప్రతిపాదక వాక్యమన్న యర్థమునందు నుపయోగించెదరు. మూఁడవది యుదాహరణము. ఇందు లింగమునకును (ధూమమునకును) సాధ్యమునకును (అగ్నికిని) గల సంబంధము (వ్యాప్యవ్యాపకభావము) తెల్పి వ్యాప్తిజ్ఞానము కలుగఁజేయును. ఇంతియగాక వ్యాప్తిజ్ఞానమునకుఁ గారణమైన యనేకోదాహరణములలో నుండి యొక్కదానిఁ జెప్పి వ్యాప్తిజ్ఞానమును దృఢపఱుచును. నాల్గవది 'ఉపనయము'. మూఁడవ వాక్యమందలి వ్యాప్తి యిచ్చటఁగూడఁ జెల్లునని యిది తెల్పును. అయిదవది నిగమనము. పైనా... వాక్యముల నొక్కచోటఁ జేర్చి తీసిన నిగమనవాక్యము. ఈ పంచావయవాత్మకమైన అనుమాన ఫలితము.

చక్కఁగ విచారించి చూఁ... వాక్యములలో మూఁడే ముఖ... తెలియఁగలదు. 'ప్రతిజ్ఞా' 'ని... క్కటియే కావున నాలుగు వా... నవి. వానిలోను 'ఉపనయ' వాక్యము విశేషోపయోగక... కావున మిగిలినవి మూఁడు వ...


నైయాయికులు పంచావ... అంగీకరించినను మీమాంస... హేతూదాహరణములను ము... ములనే యొప్పుకొనిరి. వేదాం... మూఁడవయవములుగాని, చి... యవములుగాని చాలు ననిరి... ఉదాహరణోపనయముల... పాశ్చాత్యన్యాయశాస్త్రమునం... మునకు నవయవములు మూఁడే...

అనుమానమునకు ముఖ్యా... మును గుఱించి చెప్పవలసియు... మునే ... లింగము ... రని యి... బడినది. లింగము మూఁడు ...

* "అవయవాశ్చ త్రయ ఏవ ...దాహరణరూపా ఉదాహరణో... పా వా నతు పంచ, అవయవత్రయేణైవ ...యో రుపదర్శన సంభవేనాధికావయ...త్వాత్" [వేదాంతపరిభాషా కలక...

(౧) అన్వయవ్యతిరేకి, (౨) కేవలాన్వయి, (౩) కేవలవ్యతిరేకి. అన్వయ వ్యాప్తియు, వ్యతిరేకవ్యాప్తియుఁ గలది అన్వయ వ్యతిరేకి. హేతువునకు (ధూమమునకు) ను సాధ్యమునకును (అగ్నికిని) గల వ్యాప్తి అన్వయవ్యాప్తి. వాని అభావములకుఁ గల వ్యాప్తి వ్యతిరేక వ్యాప్తి. ధూమ మున్నచోట నెల్ల యగ్ని యుండును, వంటయింటిలోవలె ననునది అన్వయవ్యాప్తికిని, ఎచ్చట నగ్ని లేదో యచ్చట ధూమము లేదు, కొలనువలె నన్నది వ్యతిరేకవ్యాప్తికిని ఉదాహరణములు. ఇందలి రెండవ యుదాహరణములో, అగ్న్యభావమునకును, ధూమాభావమునకును వ్యాప్తి కలదు. అన్వయవ్యాప్తియందలి వ్యాప్యవ్యాపకములు వ్యతిరేక వ్యాప్తియందు మారి వ్యాపకవ్యాప్యము లగును. అన్వయవ్యాప్తిలో ధూమము వ్యాప్యము, అగ్ని వ్యాపకము. వ్యతిరేకవ్యాప్తిలో అగ్న్యభావము వ్యాప్యము, ధూమాభావము వ్యాపకము. ఇది యీ ప్రక్క పటమువలన స్పష్టపడఁగలదు.

అ ఆ ఇ ఈ యను పెద్ద చతుష్కోణము అగ్నికంటె నధిక వ్యాప్తిగల ద్రవ్య మనుకొనుఁడు. అంతకంటెఁ జిన్నది ఆ క చ ట యను చతుష్కోణము అగ్నిని సూచించు ప్రదేశ మనుకొనుఁడు. అన్నిఁటికంటెఁ జిన్నదియగు ఆ గ జ డ యను చతుష్కోణము ధూమవ్యాప్తిని సూచించును. మహానస యజ్ఞశాలాదు లందులోనివి. ధూమమున్నచోటనెల్ల అగ్ని యుండుటచే ఈ చతుష్కోణమునందుఁ గూడ అగ్నివ్యాప్తి యున్నదనియే యెంచవలెను. కావున ఆ క చ ట యను చతుష్కోణమునుండి ఆ గ జ డ చతుష్కోణమును తీయఁగా మిగిలిన క జ ట యను గోముఖప్రదేశము (Gnomon)



ధూమము లేనట్టియు, అగ్నియున్నట్టియు, తప్తాయఃపిండాదులను జూపును. అగ్ని యున్న చోట నెల్ల ధూమ ముండునన్న వ్యాప్తిని చెరుచునట్టి ఆర్ద్రేంధన సంయోగ మను ఉపాధి యీ క జ ట యను ప్రదేశము వలననే సూచిత మగును. అ చ ఇ అను గోముఖ ప్రదేశము ధూమాభావము అగ్న్యభావము కలిసియుండు స్థలమును సూచించును. ఇది విపక్ష దృష్టాంతప్రదేశము; ఎచ్చట అగ్న్యభావమో అచ్చట ధూమాభావము అన్న వ్యతిరేకవ్యాప్తిని బోధించును. ఈ పటమునందు, నగ్ని ప్రదేశమగు చతుష్కోణము (ఆకచట) ధూమప్రదేశమగు చతు

ప్రోణము (ఆగజడ) కంటెఁ బెద్దదిగాన నగ్ని వ్యాపకమనియు ధూమము వ్యాప్యమనియు, ధూమ్రాభావ సూచకమైన అజఇ అను ప్రదేశము, 'అగ్న్యభావ' సూచకమైన అచఇ అను ప్రదేశముకంటె పెద్దది గనుక ధూమాభావము వ్యాపకమనియు అగ్న్యభావము వ్యాప్య మనియు స్పష్టపడఁగలదు. కావున నెచ్చటెచ్చట నగ్న్యభావమో అచ్చటచట్ల ధూమాభావము, కొలనువలె నున్నది వ్యతిరేక వ్యాప్తికి నుదాహరణము. ఇట్లు ధూమమున్నచోట నగ్నియుండును. ఇందు కుదాహరణము మహానసము: అగ్న్యభావమున్నచోట ధూమాభావ ముండును. అని అన్వయ వ్యతిరేకములచేఁ జెప్పునది 'అన్వయవ్యతిరేకి లింగము' (హేతువు): కేవలాన్వయిలింగమునందు భావరూపోదాహరణమే యుండును గాని వ్యతిరేకోదాహరణ ముండదు. ఉదాహరణము: ఘటము అభిధేయము (పేర్కొనఁదగినది), ప్రమేయత్వ మున్నందున, పటమువలె. ఇందు లింగము (హేతువు) ప్రమేయత్వము: ప్రమేయత్వమెచ్చటెచ్చట నుండునో అచ్చటచ్చట నభిధేయత్వముండును. ఇందుకు దృష్టాంతము పటము. ఇందు ప్రమేయత్వమున్నది, అభిధేయత్వ మున్నది. కాని దీనికి వ్యతిరేకోదాహరణ ముండదు. ఎందుకనన నట్టి వ్యతిరేక వాక్యము 'ఎచ్చటెచ్చట అభిధేయత్వముండదో యచ్చటచ్చట ప్రమేయత్వ ముండదు' అనునది కావలెను. కాని

యన్ని పదార్థములకును అభి
ప్రమేయత్వమును సామాన్య
వాక్యమునకు నర్థము లేదు.
మైన 'యభిధేయత్వము' సర్వ
స్యమై యున్నది. దానికి అ
లేదు. 'కేవల వ్యతిరేకి లిం
వ్యతిరేక దృష్టాంతమే యుం
యదృష్టాంత ముండదు.
యితర ద్రవ్యములకంటె
వత్వ ముండుటచే, ఇతర
నేది భేఱు కాదో యది గంధ
జలమువలె, ఇది (యనఁగా భ
(గంధవంతము కానిది) కా
పృథ్వి యితర ద్రవ్యములకం
చ్చట నేది గంధవంతమో య
ములకంటె వేఱైనది యని
రణము చెప్పుటకు వీలులేదు
గంధవత్వము పృథ్వియందు
లేదు. ఇందు పక్షమునకు
మునకు (ఇతర ద్రవ్యములకం
భేదములేదు. అనఁగా సమా
వ్యతిరేక దృష్టాంతములు పె

పైని వర్ణింపఁబడిన ము
లలో 'అన్వయ వ్యతిరేకి' య
ముఖ్యమైన దనియు, నిత్యవ్య
నుపయోగపడునది యనియు
'కేవల వ్యతిరేకి' యనునవి
కలోనివి కావనియు చదువరు

గలరు. మీమాంసకులును, వేదాంతులును వ్యతిరేకానుమానమును ఒప్పుకొనరు. వారు 'అర్థాపత్తి' యను అయిదవ ప్రమాణమును ఒప్పుకొని వ్యతిరేకానుమానమును పాటింప రైరి.

పర్వతము అగ్నిమంత మన్న వాక్యమందు అగ్ని 'సాధ్య' మనియు, పర్వతము 'పక్ష' మనియుఁ జదువరు లెఱుంగుదురు. దేనియందు సాధ్య మున్నది లేనిది సంశయముగా నుండి చర్చింపఁబడుచున్నదో యది 'పక్ష' మనఁబడును.

పక్షము, సపక్షము, విపక్షము

సాధ్యము (సాధింపవలసినఅగ్ని)ఇదివఱకే దేనియందునున్నదని నిశ్చయముగఁ దెలియునోయది 'సపక్షము'. మహానసము (వంటయిల్లు) ఇందుకు దృష్టాంతము. దేనియందు 'సాధ్యము' లేదని మనకు నిశ్చయముగాఁ దెలియునో యది విపక్షము. కొలను ఇందుకు నుదాహరణము. ఇందు సాధ్యమైన అగ్ని లేదని మన మెఱుఁగుదుము.

హేతువు వాదమునం దుపయోగపడవలయునన్న, నది యీక్రింది యైదు నియమములకు లోఁబడి

సద్ధేతువు

యుండవలయును. అప్పు డది సద్ధేతు వనిపించుకొనును. లేనియెడల హేత్వాభాసములకుఁ గారణమగును. (౧) హేతువు (లింగము) పక్షమునందు నుండవలెను. (౨) సపక్షమం దుండవలెను. (3)విపక్షమునందుండఁగూడదు. (౪) అబాధితవిషయముగ నుండవలయును. అనఁగాఁ దీనిని పొందిన హేతువుచే నిది ఖండితము కాఁగూడదు. (౫) అసత్ప్రతిపక్షముగ నుండవలెను. అనఁగా సాధ్యాభావమును స్థాపించెడు సమానబలముగల హేతువు ఉండఁగూడదు.

అన్వయవ్యతిరేకి లింగమునందు నీయైదు నియమములును పాటింపఁబడును. కేవలాన్వయి కేవలవ్యతిరేకములయందు వానిస్వభావమునుబట్టి యొక్కొక నియమము తగ్గును. న్యాయబిందువను గ్రంథమునందు మొదటి మూఁడు నియమములే యంగీకరింపఁబడినవి.

హేత్వాభాసములనఁగా దుష్టహేతువులని యర్థము. వాదవివాదము చేయునప్పుడు

హేత్వాభాసములు

వాదిప్రతివాదులొకరిని నొకరు మోసపుచ్చుటకై యసత్యములైన హేతువులను గల్పించి నిజమైన హేతువులవలెనే యుపయోగించెదరు. అట్టి హేతుదోషములను ఎఱిఁగి యున్నఁగాని ప్రతివాదియొక్క వాదదౌర్బల్యమును కనుఁగొనుటకు వీలులేదు. మన వాదమందును ఇట్టిదోషములు రాకుండుటకు హేత్వాభాసజ్ఞాన మావశ్యకము.

హేత్వాభాసము లైదు:- ౧ సవ్యభిచారము, ౨ విరుద్ధము, 3 సత్ప్రతిపక్షము ౪ అసిద్ధము ౫ బాధితము.

దీనినే ముక్తావలీకారుఁడు అనైకాంతిక మన్నాఁడు. ఈ హేత్వాభాసము మూఁడు విధములు; సాధారణము

సవ్యభిచారము

అసాధారణము; అనుపసంహారి. సాధారణసవ్యభిచార మనఁబడు హేత్వాభాసమందు హేతువు సపక్షదృష్టాంతమందును, విపక్షదృష్టాంతమందును కానుపించును. సపక్షమం దుండుట క్రమమేగాని విపక్షమందును ఉండుటవలన ఈదోషము సంభవించినది. అనఁగా హేతువు సాధ్యమందును, సాధ్యాభావమందును ఉండును. ఇందుకు నుదాహరణము: పర్వతము ధూమవంతము; అగ్నివలన, అనెడి అనుమానము హేత్వాభాసము. ఎందుకు? ఇందలి హేతువు (లింగము) అగ్ని. ఇది మహానసాదులవంటి ధూమమున్నచోట్లను, అయోగోలకమువంటి ధూమాభావమున్నచోట్లను కానుపించును. అనఁగా ధూమమున్న చోటను అగ్నియుండును, ధూమము లేని చోటను అగ్నియుండును. కావున నిది తప్పు. అసాధారణ మను దోషమునందు హేతువు సపక్షమునందును కానరాదు, విపక్షమునందును గానరాదు. విపక్షమునందుఁ గానరాక పోవుట క్రమమేగాని సపక్షమందును లేకపోవుట వలన ఈదోషము సంభవించును. ఉ. శబ్దము నిత్యము, శబ్దత్వమువలన. ఇందు 'శబ్దత్వ' హేతువు. 'శబ్దత్వ'ము శబ్దమాత్రవృత్తి నందెన నిత్యములయందు లేదు, అనిత్యములయందు లేదు, కావున ఇ తప్పు. సాధ్యముండుచోట నుం అసాధారణ మని దీనిలక్ష నిత్యుఁడు, మనుష్యత్వము వ నిత్యత్వముండుచోట మనుష్య గనుక. అనుపసంహారి దోషము దృష్టాంత ముండదు, వ్యతి ముండదు. ఇందుచే నిఁట అన్వ ముండదు, వ్యతిరేక వ్యా ఉ. సర్వము అనిత్యము; వలన. ఇందలిపక్షము 'సర్వ అందు జ్ఞానవిషయమైన స మిమిడియున్నందున సపక్షమ ముగగాని మఱియొక దృష్టా చుట యెట్లు? ఇందు సా యత్యంతాభావము అప్రసిద్ధ

సాధ్యాభావ వ్యాప్తమైన విరుద్ధ మనిపేరు. ఉ శబ్దము

విరుద్ధము

కత్వమ కృతకత బడుట) హేతువు. కాని యి యొక్క యభావమైన. అనిత ప్తము. కృతకత్వము అనిత్య తువుగాని నిత్యత్వమునకుఁ ప్రతిజ్ఞకంటె విరుద్ధమైనదిగా మని పేరు వచ్చెను. చెరు జలమువలన,అనునది యిందు హారణము.

సాధ్యాభావమును సాధించునట్టి, వేఱు హేతు వెందుండునో దానికి సత్ప్రతిపక్షమని పేరు. ఉ. శబ్దము

సత్ప్రతి పక్షము

నిత్యము ; శ్రావణత్వ మువలన (వినఁబడుగుణ ముండుటవలన), శబ్దత్వమువలె. శబ్దము అనిత్యము, కార్యత్వ మువలన, ఘటమువలె. ఇందు సాధ్యము నిత్యత్వము. దానియభావ మనిత్యత్వము. నిత్యత్వమును సాధించుట కొక హేతువును, తదభావమును (అనిత్యత్వమును) సాధించు టకు మఱియొక హేతువును చెప్పఁబడి యుండుటచేత నిది సత్ప్రతిపక్ష మనఁబడు హేత్వాభాసము.

ఇది నాల్గవ హే త్వా భా స ము. ఇది మూఁడు విధములు:ఆశ్రయాసిద్ధము,స్వరూపాసిద్ధము, వ్యాప్యత్వాసిద్ధము. ఉ. గగనార

అసిద్ధము

విందము సువాసనగలది. అరవిందత్వము వలన ; సరోజారవిందమువలె, అనునది ఆశ్రయా సిద్ధమునకు నుదాహరణము. ఇందు గగనారవిందము (ఆకాశకమలము) ఆశ్రయము (పక్షము). ఇదియెచ్చటను లేదు. ఇచ్చట పక్షతావచ్ఛేదక ధర్మము గగనీయత్వము గాని అరవిందత్వము గాదు. ఇట్లసంభవమైన వస్తువును పక్షముగాఁ గైకొన్నందున ఈ యనుమానము తప్పు. కాంచనమయ పర్వతము అగ్నిమంతము, ధూమమువలన, అన్నదియు నిందుకు నింకొక యుదాహరణము, పక్షతావచ్ఛేదకధర్మము (ఇచ్చట కాంచనమయత్వము) పక్షమునందు లేకపోవుటయే యీదోషలక్షణము. స్వరూపాసిద్ధ మను హేత్వాభాసమునందు హేతువు పక్షమునం దుండదు. ఉ. కొలను అగ్నిమంతము, ధూమమువలన. ఇందు ధూమము హేతువు. కొలను పక్షము. కొలనులో ధూమముండదు. కావున హేతువు తప్పు. కుందేలు ఆవు, కొమ్ములున్నందున, ఘటము పృథ్వి, పటత్వమువలన అనునట్టి యుదాహరణము లిట్టివియే. ఉపాధి సహితమైన హేతువును ఉపాధి లేకుండఁగఁ జెప్పుట వ్యాప్యత్వాసిద్ధదోషము. ఉ. పర్వతము ధూమవంతము; అగ్నిమంతమగుటచే నన్నచోట 'ఆర్ద్రేంధన సంయోగాగ్ని' మంతమగుటచే నని యుండవలెను. అట్లు ఆర్ద్రేంధన సంయోగమును చెప్పినవాఁడు కాఁడు కావున దోషము. ఇంకొక యుదాహరణము. పర్వతము అగ్నిమంతము, కాంచనమయ ధూమమువలన. ఇది హేత్వాభాసము. ఎందుకన హేతువు ఉపాధిసహితము. ధూమము అగ్నివ్యాప్యమే; కాని కాంచనమయ ధూమము మాత్రము అగ్నివ్యాప్యము కాదు. 'కాంచనమయత్వ' మను నుపాధిచే నదివేఱయ్యె. ఈ హేత్వాభాసములో సాధ్యాప్రసిద్ధి, సాధనాప్రసిద్ధి ఇత్యాదిభేదము లనేకములు కలవు.

ఏ హేతువుయొక్క సాధ్యాభావము వేఱు బలవత్తరమైన ప్రమాణముచే నిశ్చితమైనదో

యది. బాధిత హేత్వాభాసము.

బాధితము — అగ్ని చల్లగ నుండును, ద్రవత్వము వలన. అనుచో అనుష్ణత్వము (చల్లదనము) సాధ్యము. దాని యభావము ఉష్ణత్వము; దానిని స్పర్శముచేఁ బ్రత్యక్షముగ మన మెఱుఁగుదుము. కావున నగ్ని చల్లనిది యన్నమాటకు బాధ కలిగెను. పక్షమునందు నుండవలసిన సాధ్యము యొక్క యభావము మొదలయినవి భాధిత మనఁబడునని ముక్తావలీకారుని మతము.

పైని హేత్వాభాసములు నవీనమతానుసారముగ న్యాయసిద్ధాంత ముక్తావలీకారుని ననుసరించి యీయఁబడినవి.

ప్రకరణ సమము — గౌతమ సూత్రానుసారము హేత్వాభాసములు నిగ్రహస్థానములలోనివియే యని వర్ణింపఁబడినవి. అచ్చట హేత్వాభాసములు అయిదు చెప్పఁబడినవి: (౧) సవ్యభిచార (౨) విరుద్ధ (3) ప్రకరణ సమ (౪) సాధ్యసమ (౫) అతీత కాలము లనఁబడునవి. సవ్యభిచార విరుద్ధములను గుఱించి యిదివఱకుఁ జెప్పియున్నాము. ఏ సిద్ధాంతమును సాధింపవలయునో దానినే హేతువుగఁ దీసికొనుట ప్రకరణసమ దోషము.

శబ్దము అనిత్యము
నిత్యత్వము లేదు కనుక

'అనిత్య' మనగా 'నిత్యత్వములేనిది'; కావున నిందు నొక్కమాటయే భిన్నరూపముగఁ జెప్పఁబడి యున్నది. దీనినే పా... యిఁకులు పెటిషియోప్రిన్సిపి... principii) అందురు.

సాధ్యసమము — సాధ్యమునకునై యీయఁ... కూడ ... ముగా (... సినదిగా) నున్నయెడల సాధ్య... వచ్చును.

నీడ యొక ద్రవ్యము (ప్రతి...
దానికి చలన మున్నదిగనుక (...

ఇచ్చట నీడ యొక ద్రవ్య... యెట్లు సిద్ధాంతము కావలయు... దట నీడకు చలన మున్నదని... కావలెను. నీడకు చలన ము... అందఱును ఒప్పుకొనునదికా... ప్రకాశాభావము. ఏద్రవ్యము... ప్రకాశమును అడ్డగించునో ... యొక్క చలనమే నీడయొక... కొందఱిచే భ్రమింపఁబడును.

కాలాతీతము — కాలమును లెక్కలో ని... చెప్పఁ... కాలాతీ... భాస మనఁబడును.

శబ్దము నిత్యము
సంయోగజముగనుక, రంగు...

ఇందు నీయఁబడిన హేతు... ఘటదీపసంయోగమువలన రంగు మనకుఁ గానవచ్చు...

ఆరంగు అంతకుఁ (ఘటదీపసంయోగమునకుఁ) బూర్వముండెను, తర్వాతఁగూడ నుండును. అట్లే ఢక్కకు (నగారాకు) దండమునకు సంయోగము గలిగినప్పుడు ధ్వని పుట్టు చున్నది. కావున నది పై యుదాహరణము ననుసరించి అంతకుఁ బూర్వ ముండెననియు, తర్వాత నుండుననియు, కావున నిత్యమనియుఁ జెప్పవలెను అని వాదియొక్క తాత్పర్యము. కాని యిది కాలాతీత హేత్వాభాసము. ఎందుకన ఈరెండు సంయోగములును వేఱు వేఱు. దీపఘటసంయోగకాలముననే రంగు జ్ఞానము జనించును. కాని ఢక్కాదండ సంయోగకాలముననే శబ్దము పుట్టదు, సంయోగమైన రెండవ క్షణమునం బుట్టును. కావున రంగునకు, శబ్దమునకు సంయోగ జననమందుఁ బోలికలేదు.

దీని తరువాత ఛలమను దోషమును చెప్పి నాఁడు. అదెట్లనిన.

అర్థాంతరము కల్పించుకొని వాదమును అడ్డగించుట ఛల మనుపించుకొనును. ఇది మూఁడు విధములు.

ఛలము

ఒకపదమునకు రెండర్థము లున్నప్పుడు వక్తయొక్క యుద్దేశమునకు భిన్నమైన యర్థమును గ్రహించుట వాక్ఛలము. 'ఈ పిల్లవాఁడు నవకంబళుఁడు' అన్నవాక్యము నందు 'నవకంబళుఁడు' అనఁగా క్రొత్తకంబళికలవాఁడని వక్తయొక్క యుద్దేశము. ప్రతివాది ఆ పదమునకు తొమ్మిది కంబళ్లు కలవాఁడని యర్థము చేసిన నది వాక్ఛలమగును. విశేషవ్యక్తిని గుఱించి చెప్పఁబడిన యర్థమును జాతిని గుఱించి చెప్పి నట్టుగా భావించి యర్థముచేయుట సామాన్య ఛలము. 'ఈ బ్రాహ్మణుఁడు విద్వాంసుఁడు' అని యొక బ్రాహ్మణుని గుఱించి చెప్పఁగా, బ్రాహ్మణత్వముయొక్క యవచ్ఛేదకధర్మము విద్వత్తయని చెప్పినట్లుగ నర్థము గ్రహించి, విద్వాంసులుకాని బ్రాహ్మణులు లేరా? విద్వాంసులైన అబ్రాహ్మణులు లేరా? యని వాదించుట సామాన్య ఛలమునకు నుదాహరణము. పదమునకు శక్యార్థము గ్రహింపక లక్ష్యార్థము వివక్షితమైనప్పుడు దాని వాచ్యార్థమును గాని, వాచ్యార్థము వివక్షితమైనప్పుడు లక్ష్యార్థమును గాని గ్రహించుట ఉపచారచ్ఛల మనఁబడును. 'మంచె లరచుచున్నవి', అనగా మంచెమీది జనులు అరచుచున్నారు, అని, 'పాగాలు పోవుచున్నవి', అనఁగా పాగాపెట్టుకున్నవారు పోవుచున్నారని యర్థము. ఇట్లర్థముచేయక మంచలే అరచుచున్నవనియు, పాగాలే నడుచు చున్నవనియు అర్థము. చేసిన యెడల నీదోషము పట్టును.

వాదవివాదమునందు మననైయాయికులు నిగ్రహ స్థానములను కొన్నిఁటిని చెప్పియు న్నారు. నిగ్రహస్థానములనగా ప్రతివాది

నిగ్రహ స్థానములు ౨౨

వాదమునందు నక్రమము చేయఁ బ్రారంభిం

చినప్పుడు, దానిని జూపి వానికి నగౌరవము కలుగఁజేసి వాదములో నోతఁడోడెనని వాదమును నిల్పివేయుట. ఇట్టి నిగ్రహస్థానము లిరువది రెండు చెప్పఁబడియున్నవి. వానిని కొద్ది కొద్దిగా వర్ణించెదను.

౧ ప్రతిజ్ఞాహాని

సాధింపవలసిన సిద్ధాంతము ప్రతిజ్ఞ. దానిని సాధింపలేక ప్రదివాది యొక్క సిద్ధాంతమును అంగీకరించుట ప్రతిజ్ఞాహాని. ఒకడు మొదట ఈ క్రిందివిధముగ తర్కించును.

శబ్దము అనిత్యము
అది ఇంద్రియ గోచరముగనుక, ఏది ఇంద్రియగోచరమో యది అనిత్యము, ఘటము వలె
శబ్దము ఇంద్రియ గోచరము
కావున శబ్దము అనిత్యము.

ప్రతివాది వచ్చి ఘటత్వాది 'జాతి' ఇంద్రియ గోచరమైనను నిత్యము, అట్లే శబ్దము ఇంద్రియగోచరమైనను నిత్యమేల కాగూడదు? అని ఖండింపగా బదులుచెప్పలేక యిట్లనును.

ఏది ఇంద్రియగోచరమో యది నిత్యము ఘటమువలె
శబ్ద మింద్రియ గోచరము
కావున శబ్దము నిత్యము

ఇట్లు తన స్వదృష్టాంతమైన ఘటమునందు అన్య దృష్టాంతమైన ఘటత్వముయొక్క లక్షణ మెప్పుకొని స్వసిద్ధాంతమును వదలుకొన్నందున నిది ప్రతిజ్ఞాహాని.

ఇట్లు పక్షము, హేతువు, సాధ్యము ఈ మూటిలో దేనిని వదిలినను ప్రతిజ్ఞాహాని కావచ్చును.

శబ్దము అనిత్యము
కృతకత్వము (చేయఁబడుట) వ
అనినతోడనే, ప్రతిపక్షి, శబ్ద
కత్వములేదని యాక్షేపింపగ
'ఘట' మేపక్ష మనుకొనుఁ
నీదోషము ప్రాప్తించును. ఇ
ములను విడుచుటనుగుఱించి

౨ ప్రతిజ్ఞాంతరము

తాను సాధింపవలసిన
న
మార్పు
జ్ఞాంతరము.

పర్వతము అగ్ని కలది
సువాసనగల నల్లని ధూమ వ

ఇందు హేతువు (ధూవ
(సువాసనగల నల్లని యను)
వ్యర్థమని ఆక్షేపింపగా

పర్వతము కృష్ణ చందనయుత మై
సువాసనగల నల్లని ధూమ ముం

అని చెప్పగా నీ దో
మొదట ప్రతిజ్ఞ 'పర్వత మ
నది, ఇప్పుడు రుజువు జేసిన
కృష్ణచందనయుతమైన అగ్నిక
ప్రతిజ్ఞమారుటచే నిది ప్రతిజ్ఞా

3 ప్రతిజ్ఞా విరోధము

ప్రతిజ్ఞకును, హేతువునకు
న్న ప్పు
విరోధ

ద్రవ్యము గుణముకంటె వేఱు ప
రూపాదికంటె వేఱుకాదు గాన

ఈ యుదాహరణమునందు, ర్యాపాదికములు గుణములే కావున, వానికంటె ద్రవ్యము వేఱు కాదని చెప్పుట ప్రతిజ్ఞకు సాధకము కాదు.

౪ ప్రతిజ్ఞాసన్యాసము

తన ప్రతిజ్ఞకు నడ్డురాగా నది తనప్రతిజ్ఞ కాదనుట. శబ్దము అనిత్యమని రుజువు చేయలేక పోయినపుడు "ఎవఁడన్నాఁడయా శబ్దమనిత్యమని?" అని తప్పించుకొనుట ప్రతిజ్ఞా సన్యాసము.

౫ హేత్వంతరము

అవిశేష హేతువునకు నడ్డు కలుగగా విశేష హేతువును ప్రతిపాదించుట.

శబ్ద మనిత్యము
ఇంద్రియగోచరము గనుక

ఇందుమీద "కేవలము ఇంద్రియ గోచరత్వము వలననే యే పదార్థమైనను అనిత్యము కాఁజాలదు. 'సామాన్య' మనుపదార్థ మింద్రియ గోచరమైనను నిత్యమే." అని యాక్షేపము రాగా, 'ఇంద్రియ గోచరము గనుక' అను హేతువునకు 'సామాన్యత్వముగల ఇంద్రియ గోచరత్వము' అని అర్థము చెప్పిన ఈ దోషము సిద్ధించును.

౬ అర్థాంతరము

మూల విషయమును విడిచి యన్యవిషయ ప్రసంగముఁ దెచ్చుట యర్థాంతరము:

శబ్దము నిత్యము
అస్పర్శత్వమువలన

అని చెప్పగా దీనికిఁ బూర్వపక్షము వచ్చి హేతువు సరియైనది కాదని యాక్షేపింపగా, దానికి సమాధానము చెప్పుటకు మారుగా "హేతుపదము 'హిని' ధాతువునకు 'తుని' ప్రత్యయము తగిలియైన కృదంతపదము, పదమనగా సుబ్ తిజంతము" అని సంబంధములేని మాటలు చెప్పఁ దొడగుట.

౭ నిరర్థకము

అర్థములేని వర్ణక్రమమును వాదమునందు నుపయోగించిన ఈ దోషమగును.

శబ్దము నిత్యము
కచటతపత్వమువలన

౮ అవిజ్ఞాతార్థము

అర్థముకాని వాక్యమును వాదమునందు నుపయోగించుట. వాదములో గెలువలేక కొందఱు అర్థములేని పదమును, భిన్నార్థపదములను, అర్థము కానట్లు త్వరగాగాని, మెల్లగాగాని యుచ్చరించెదరు. అట్టి సమయమున, ఆమాటలు మూడు సారులు ఉచ్చరించినను, సభవారికిని ప్రతివాదికిని అర్థము కాని యెడల నవి నిగ్రహస్థానము లగును.

౯ అపార్థకములు

అన్వయదోషమువలన ఒక శబ్దమునకును మఱియొక శబ్దమునకును సంబంధము లేకుండ నుచ్చరింపఁబడు వాక్య మిట్టిది. వాదములో జయింపలేక యొకానొకఁ డిట్లు హేతువును చెప్పును:—

'పది దానిమ్మపండ్లు, ఆఱు అప్పచ్చులు, భిక్షాపాత్ర,' ఇత్యాది అసంబధ వాక్యము.

చినప్పుడు, దానిని జూపి వానికి నగౌరవము కలుగఁజేసి వాదములో నాతఁడోడెనని వాదమును నిల్పివేయుట. ఇట్టి నిగ్రహస్థానము లిరువది రెండు చెప్పఁబడియున్నవి. వానిని కొద్ది కొద్దిగా వర్ణించెదను.

౧ ప్రతిజ్ఞాహాని

సాధింపవలసిన సిద్ధాంతము ప్రతిజ్ఞ. దానిని సాధింపలేక ప్రదివాది యొక్క సిద్ధాంతమును అంగీకరించుట ప్రతిజ్ఞాహాని. ఒకఁడు మొదట ఈ క్రిందివిధముగ తర్కించును.

శబ్దము అనిత్యము
అది ఇంద్రియ గోచరముగనుక, ఏది ఇంద్రియగోచ
రమో యది అనిత్యము, ఘటము వలె
శబ్దము ఇంద్రియ గోచరము
కావున శబ్దము అనిత్యము.

ప్రతివాది వచ్చి ఘటత్వాది 'జాతి' ఇంద్రియ గోచరమైనను నిత్యము, అట్లే శబ్దము ఇంద్రియగోచరమైనను నిత్యమేల కాగూడదు? అని ఖండింపగా బదులుచెప్పలేక యిట్లనును.

ఏది ఇంద్రియగోచరమో యది నిత్యము
ఘటమువలె
శబ్ద మింద్రియ గోచరము
కావున శబ్దము నిత్యము

ఇట్లు తన స్వదృష్టాంతమైన ఘటమునందు అన్య దృష్టాంతమైన ఘటత్వముయొక్క లక్షణ మెప్పుకొని స్వసిద్ధాంతమును వదలుకొన్నందున నిది ప్రతిజ్ఞాహాని.

ఇట్లు పక్షము, హేతువు, సాధ్యము ఈ మూటిలో దేనిని వదలినను ప్రతిజ్ఞాహాని కావచ్చును.

శబ్దము అనిత్యము
కృతకత్వము (చేయఁబడుట) వలన

అనినతోడనే, ప్రతిపక్షి, శబ్దమునందు కృతకత్వములేదని యాక్షేపింపగా "పోనిండు, 'ఘట' మేపక్ష మనుకొనుఁడు" అన్నచో నీదోషము ప్రాప్తించును. ఇట్లే హేతుసాధ్యములను విడుచుటనుగుఱించి యెఱుఁగునది.

౨ ప్రతిజ్ఞాంతరము

తాను సాధింపవలసిన సిద్ధాంతమునకు నష్టము రాగా అందు మార్పు చేయుట ప్రతిజ్ఞాంతరము.

పర్వతము అగ్ని కలది
సువాసనగల నల్లని ధూమ ముండుటచే

ఇందు హేతువు (ధూమము) యొక్క (సువాసనగల నల్లని యను) విశేషణము వ్యర్థమని ఆక్షేపింపగా

పర్వతము కృష్ణ చందనయుతమైన యగ్నికలది
సువాసనగల నల్లని ధూమ ముండుటచే

అని చెప్పగా నీ దోషము వచ్చెను. మొదట ప్రతిజ్ఞ 'పర్వత మగ్నిగలది' అనునది, ఇప్పుడు రుజువు జేసినది 'పర్వతము కృష్ణచందనయుతమైన అగ్నికలది'యని. ఇట్లు ప్రతిజ్ఞమారుటచే నిది ప్రతిజ్ఞాంతరము.

3 ప్రతిజ్ఞా విరోధము

ప్రతిజ్ఞకును, హేతువునకును విరోధ మున్నప్పుడు ప్రతిజ్ఞా విరోధమగును. ఉదా.

ద్రవ్యము గుణముకంటె వేఱు పదార్థము,
రూపాదికంటె వేఱుకాదు గాన

ఈ యుదాహరణమునందు, రూపాదికములు గుణములే కావున, వానికిం ఖెద్రవ్యము వేఱు కాదని చెప్పుట ప్రతిజ్ఞకు సాధకము కాదు.

౪ ప్రతిజ్ఞాసన్న్యాసము

తన ప్రతిజ్ఞకు నడ్డురాగా నది తనప్రతిజ్ఞ కాదనుట. శబ్దము అనిత్యమని రుజువు చేయ లేక పోయినపుడు "ఎవఁడన్నాఁడయా శబ్ద మనిత్యమని?" అని తప్పించుకొనుట ప్రతిజ్ఞా సన్న్యాసము.

౫ హేత్వంతరము

అవిశేష హేతువునకు నడ్డు కలుగగా విశేష హేతువును ప్రతిపాదించుట.

శబ్ద మనిత్యము
ఇంద్రియగోచరము గనుక

ఇందుమీద "కేవలము ఇంద్రియ గోచరత్వము వలననే యే పదార్థమైను అనిత్యము కాఁజాలదు. 'సామాన్య' మనుపదార్థ మింద్రియ గోచరమైనను నిత్యమె." అని యాక్షేపము రాగా, 'ఇంద్రియ గోచరము గనుక' అను హేతువునకు 'సామాన్యత్వముగల ఇంద్రియ గోచరత్వము' అని అర్థము చెప్పిన ఈ దోషము సిద్ధించును.

౬ అర్థాంతరము

మూల విషయమును విడిచి యన్యవిషయ ప్రసంగముఁ దెచ్చుట యర్థాంతరము:

శబ్దము నిత్యము
అస్పర్శత్వమువలన

అని చెప్పగా దీనికిఁ బూర్వపక్షము వచ్చి హేతువు సరియైనది కాదని యాక్షేపింపగా, దానికి సమాధానము చెప్పుటకు మారుగా "హేతుపదము 'హిని' ధాతువునకు 'తుని' ప్రత్యయము తగిలియైన కృదంతపదము, పద మనగా సుబ్ తిజంతము" అని సంబంధములేని మాటలు చెప్పఁ దొడగుట.

౭ నిరర్థకము

అర్థములేని వర్ణక్రమమును వాదమునందు నుపయోగించిన ఈ దోషమగును.

శబ్దము నిత్యము
కచటతపత్వమువలన

౮ అవిజ్ఞాతార్థము

అర్థముకాని వాక్యమును వాదమునందు నుపయోగించుట. వాదములో గెలువలేక కొందఱు అర్థములేని పదమును, భిన్నార్థపదములను, అర్థము కానట్లు త్వరగాగాని, మెల్లగాగాని యుచ్చరించెదరు. అట్టిసమయమున, ఆమాటలు మూడు సారులు ఉచ్చరించినను, సభవారికిని ప్రతివాదికిని అర్థము కాని యెడల నవి నిగ్రహస్థానము లగును.

౯ అపార్థకములు

అన్వయదోషమువలన ఒక శబ్దమునకును మఱియొక శబ్దమునకును సంబంధము లేకుండ నుచ్చరింపఁబడు వాక్య మిట్టిది. వాదములో జయింపలేక యొకానొకఁ డిట్లు హేతువును చెప్పును:—

'పది దానిమ్మపండ్లు, ఆఱు అప్పచ్చులు, భిక్షాపాత్ర,' ఇత్యాది అసంబద్ధ వాక్యము.

అవయవవిపర్యాసమువలనఁ గలిగెడి వచనము అప్రాప్తకాలము.

౧౦ అప్రాప్తకాలము

న్యాయమునకు నైదు అవయవములున్నవని చెప్పియున్నాము. వాని క్రమము, ప్రతిజ్ఞ, హేతువు, ఉదాహరణము, ఉపనయము, నిగమనము. ఈ క్రమముతప్పి మొదటఁ జెప్పవలసినది తర్వాతఁ తరువాత జెప్పవలసినది మొదటఁ జెప్పుటవలన ఈ దోషము కలుగును.

౧౧ న్యూనము

న్యాయముయొక్క అయిదు అవయవములలోఁ గొన్ని లోపించేనేని ఈదోషము పట్టును.

౧౨ అధికము

పెక్కు హేతువులుగాని, పెక్కు ఉదాహరణములుగాని ఉన్న యెడల ఈ దోషమగును. ఉదాహరణము:

పర్వతము అగ్నిమంతము
ధూమ మున్నది గనుక
వెలుతు రున్నది గనుక
కొలిమివలె

చెప్పినది మరలఁజెప్పుట పునరుక్తము (౧౩).

౧౪ అననుభాషణము

వాది, సభవారు వినుచుండగఁ దనప్రశ్న మూడు సారులు చెప్పినను ప్రతివాది బదులు చెప్పనియెడల నది అననుభాషణ నిగ్రహస్థాన మనఁబడును.

మనము చెప్పినదానిని ప్రతివాది అర్థము చేసికొనలేక పోయినన్నది యజ్ఞాన, మనెడు నిగ్రహస్థాన మగును.

౧౫ అజ్ఞానము

సభవారి యెదుట మూడుసారులు చెప్పఁగాఁగూడ ప్రతివాది యర్థము చేసికొనఁడేని యాతఁడోడిపోయినటులే. యెంచవలెను.

౧౬ అప్రతిభ

బదులు చెప్ప లేక పోవుట.

౧౭ విక్షేపము

వేఱు కార్య మున్నది, మరల వచ్చెదనని తప్పించుకొని పోవుట విక్షేపము.

౧౮ అనుజ్ఞ

తనవాదమందు నొక దోష మున్నదని యొప్పుకొనుచుఁ బ్రతివాదివాదమందుఁగూడ నాదోషమును ఆరోపించుట అనుజ్ఞ యనిపించుకొనును. 'నీవు దొంగవు' అని ప్రతివాది ఆక్షేపించిన యెడల, 'నేను దొంగను కాను' అని రుజువుచేసి కొనుటకు మారుగ 'నీవుకూడ దొంగవే' యనుట యీదోషమున కుదాహరణము.

౧౯ పర్యనుయోజ్యోపేక్షణము

నిగ్రహింపఁదగిన ప్రసంగము వచ్చినప్పుడు వాదమునందు నిగ్రహింపక యూరకుండుట యీదోషము.

౨౦ నిరనుయోజ్యానుయోగము

నిగ్రహస్థానము కానిదానిని నిగ్రహించుట నిరనుయోజ్యానుయోగము.

౨౧ అపసిద్ధాంతము

మొదట నొక సిద్ధాంతమును అంగీకరించి నడుమ దానిని వదలి మార్చుకొనుట. ఒక ప్రతివాది సాంఖ్యుఁడుగా వాదించినఁ జివరవఱకును సాంఖ్యుఁడుగనే వాదింపవలెను; నడుమ బౌద్ధుఁడుగ మాఱిపోవుటకు వీలులేదు.

౨౨ హేత్వాభాసములు

ఇదివఱకే వర్ణింపఁబడినవి.

జాతులు

నిగ్రహస్థానములుఁ గాక గౌతమాచార్యుడు 'జాతులు' అని కొన్ని చెప్పియున్నాడు.* జాతియనగా సిద్ధాంతమును పడఁగొట్టుటకై ప్రతివాదిచేయునట్టి పూర్వపక్షము. ఇది దృష్టాంతముయొక్క సాధర్మ్య వైదర్మ్యములనుబట్టి యుండును. ఇట్టి జాతు లిరువదినాలుగు చెప్పఁబడినవి. వాని నన్నిటిని గ్రంథవిస్తరభీతిచే నిచ్చట వివరించుటలేదు. ఉదాహరణార్థమై యొకటిరెంటినిఁ జూపుదును.

సాధర్మ్య సమజాతి

ఉదాహరణముయొక్క సాధర్మ్యమునుబట్టి సిద్ధాంతము చెప్పబడినప్పుడు, మఱియొక యుదాహరణముయొక్క సాధర్మ్యమునుబట్టి పూర్వపక్షముచేయుట 'సాధర్మ్యసమము' అనిపించుకొనును. ఎట్లన :—

శబ్దము అనిత్యము
కృతకత్వము వలన (చేయబడినందున)
ఘటమువలె

అను సిద్ధాంతమునకుఁ బూర్వపక్షి యీ క్రిందివిధముగఁ జేసినయెడల నది సాధర్మ్య సమజాతి.

శబ్దము నిత్యము
రూపములేనందున
ఆకాశమువలె

ఘటమునకును శబ్దమునకునుగల కృతకత్వము (చేయబడుట) అను సమానధర్మము ననుసరించి సిద్ధాంతము చేయఁబడినది. ఆకాశమునకు శబ్దమునకుఁగల 'రూపములేమి' యను సమాన ధర్మము ననుసరించి పూర్వపక్షము చేయఁబడినది. సిద్ధాంత పూర్వపక్షములు సమానములని సిద్ధాంతమును ఖండించుటయే యీపూర్వపక్షముయొక్క యుద్దేశము. కాని రెండవ యుదాహరణమునందలి సాధర్మ్యము సరియైనదికాదు. ఇందు 'రూపములేమి' నిత్యత్వమునకు హేతువుగ నీయఁబడినది. కాని రూపములేని పదార్థములన్నియు నిత్యములు కావు. బుద్ధిచిత్తాహంకారాదికములు రూపరహితములయినను నిత్యములు కావు. కావున ఈ ఉదాహరణము తప్పు.

వైధర్మ్య సమజాతి

ఉదాహరణముయొక్క వైధర్మ్యమును బట్టి సిద్ధాంతము చెప్పఁబడినప్పుడు, మఱియొక యుదాహరణముయొక్క వైధర్మ్యమును బట్టి

---

*చూఁడు గౌతమసూత్రములు, ౫-వ అధ్యాయము, ౧-వ ఆహ్నికము.

పూర్వపక్షము చేయుట వైధర్మ్యసమ మనిపించుకొనును. ఉదాహరణము :—

శబ్దము అనిత్యము
కృతకత్వమువలన
అనిత్యము కానిదెల్లను కృతకము కాదు
ఆకాశమువలె

అనుసిద్ధాంతమునకుఁ బూర్వపక్షము :—

శబ్దము నిత్యము
రూపములేమిచే
నిత్యము కానివేవియు రూపములేనివి కావు
ఘటమువలె

పూర్వపక్షసిద్ధాంతములు రెండును ఇట్లు ఉదాహరణమునకును సాధ్యమునకును గల వైధర్మ్యమును అనుసరించియున్నవిగాన నిది వైధర్మ్యసమము. ఇట్లే యితరజాతుల నెఱుఁగవలసినది. [కో. ల.

అనుమానము

(పాశ్చాత్య తర్కశాస్త్రము ననుసరించి)

పాశ్చాత్యులు అనుమానమును ఇన్ఫరెన్సు (Inference) లేక రీజనింగ్ (Reasoning) అని యెదరు. అనుమానమే పాశ్చాత్య తర్కశాస్త్రమునందలి ప్రధాన విషయము. ప్రత్యక్షాది ప్రమాణము లందు వివరింపఁబడవు. అవి యితర శాస్త్రముల విషయము లని వారి తాత్పర్యము.

పాశ్చాత్యనైయాయికుల యభిప్రాయ ప్రకారము అనుమానము రెండు విధములు : (౧) వ్యాప్తిసాధకానుమానము (Deductive Reasoning), (౨) వ్యాప్తిసాధ్యానుమానము (Inductive Reasoning). వ్యాప్తిసాధకానుమానమునందు వ్యాప్తి సాధకముగా నుండి సిద్ధాంతమును సాధించును. సిద్ధాంత సాధనకు వ్యాప్తియే సాధకము, హేతువు.

ఎచ్చటెచ్చట ధూమము కలదో అచ్చటచ్చట అగ్ని యుండును.
ఈ పర్వతమున ధూమ మున్నది.
కావున ఈ పర్వతమున అగ్ని యున్నది.

పైని ఉదాహరింపఁబడినది వ్యాప్తి సాధకానుమానము. మొదటి వాక్యమునందలి వ్యాప్తియే యీ అనుమానమునకు సాధకము, ముఖ్యహేతువు. ఇందు నధికవ్యాప్తి గల వాక్యమునుండి యల్పవ్యాప్తిగల సిద్ధాంతము సాధింపఁబడినది. ఇందుకు మఱియొక యుదాహరణము:-

మానవులందఱు మరణ మొందెదరు.
దేవదత్తుఁడు మానవుఁడు.
కావున దేవదత్తుఁడు మరణ మొందును.

ఇందు మొదటిదైన వ్యాప్తివాక్యము యొక్క వైశాల్యము మిక్కిలి పెద్దది. అందు మానవు లందఱిని గుఱించియుఁ జెప్పఁబడి యున్నది. మూడవదియైన సిద్ధాంతవాక్యము యొక్క వైశాల్యము చిన్నది. అందు నొక దేవదత్తుని గుఱించియే చెప్పఁబడియున్నది. దేవదత్తుఁడు 'మానవు లందఱి' లో నిమిడి యున్నాఁడు. కావున నిట్టి యనుమానమునం దెప్పుడును సిద్ధాంతవాక్యము ముఖ్య హేతు

వాక్యమునకంటెఁ దక్కువ వ్యాప్తి కలదిగ నుండును.

వ్యాప్తి సాధ్యానుమానము (Inductive Reasoning) నందు వ్యాప్తియే సాధ్యముగ ననఁగా సాధింపవలసిన విషయముగనుండును. వంటయింట్లో ధూమ మున్నప్పుడెల్లను అగ్ని యుండుట మనము చూచుచున్నాము. అట్లే నీళ్ళప్రొయి యొద్దను, కమ్మరి దుకాణ మందును, కంసలి దుకాణము నందును ధూమ మున్నప్పు డెల్లను అగ్ని యుండుట కానవచ్చుచున్నది. ఇట్లు అనేక స్థలములం దును ధూమమునకు అగ్నికిని గల సంబంధ మును చూచినందున, ఎచ్చటెచ్చట ధూమము కలదో అచ్చటచ్చట అగ్నియుండును అను వ్యాప్తిజ్ఞానము కలుగుచున్నది. ఇదియే వ్యాప్తిసాధ్యానుమానము. ఇందు సాధింపఁబడిన సిద్ధాంతముయొక్క వ్యాప్తి, హేతు వాక్యముల వ్యాప్తికంటెను మించినదిగా నుండును. హేతు వాక్యములన్నియు సిద్ధాంత వాక్యములలో నిమిడి యుండును.

ఇట్లు వ్యాప్తిసాధకానుమానమునందు నధిక వ్యాప్తిగల హేతువునుబట్టి యల్ప వ్యాప్తిగల సిద్ధాంతములను సాధించెదము. వ్యాప్తి సాధ్యానుమానమునందు నల్ప వ్యాప్తిగల హేతువులనుబట్టి యధికవ్యాప్తి గల్గినట్టియు, నాహేతువుల కన్నిటికిని సామాన్యమైనట్టియు సిద్ధాంతమును సాధించెదము. ఇదియే యీ రెంటికిని గల భేదము.

వ్యాప్తిసాధకానుమానము

(Deductive reasoning)

ఈ యనుమానము మన నైయాయికుల యనుమానము వంటిదే. మన యనుమాన మందలి సిద్ధాంతమునకు 'నిగమనము' అని పేరు. కావునఁ గొందఱు దీనికి 'నిగమనానుమాన' మని పేరు పెట్టిరి.

ఈ యనుమానము త్రివాక్యాత్మకమై యుండును. పదములు కలిసి వాక్యములగును. కావున అనుమానమును వివరించుటకుఁ బూర్వము పాశ్చాత్య తర్క శాస్త్రసిద్ధాంతాను సారముగా పదములను గుఱించి వాక్యములను గుఱించి కొంత చెప్పవలసి యుండును.

ఈ శాస్త్రమునందు మనకు నామపదములు (విశేష్యముల) తోడనే పనియుండును.

పదములు (Terms)

ఇతర పదములతో నంతగాఁబనియుండదు. నామపదములతో సంబంధముగల యితర పదములను నామపదాంతర్గతములుగ నెంచి వాడుదురు. పదములను నైయాయికులు పెక్కుతెఱంగుల విభజించిరి. కాని వాని నన్నింటితో మనకుఁ బ్రయోజనంబు లేదు. రూపమును బట్టి పదములు భావపదములనియు (Positive Terms) అభావ పదము(Negative Terms) లనియు రెండు తెగలుగా విభజింపఁబడినవి. భావపదము ఒకానొక గుణము (ధర్మము) కలదని సూచించును. అభావ పదము ఒకానొక గుణము (ధర్మము) లేదని

తెల్పును. సజీవము, మానుషము, మర్యాద, సద్గుణము, సౌందర్యము మొదలగునవి భావ పదములు. అజీవము, అమానుషము, అమ ర్యాద, అసద్గుణము, అసౌందర్యము అనునవి అభావపదములు. ప్రతి భావ పదమునకును ముందు 'అ' కారము నుంచిన నది అభావ పద మగును. 'జలము' భావపదము, 'అజల ము' అభావపదము. 'అజలము' అనఁగా జలముకాని దంతయు ననియర్థము. 'స్త్రీలిం గము' భావపదము. 'అస్త్రీలింగము' అభావ పదము. 'అస్త్రీలింగ' మనఁగా పుల్లింగము, నపుంసక లింగము అని యర్థము.

ఈ యభావపదముయొక్క విశేషము ఒకటి కలదు. ఒకపదమును, దానియభావ పదమును కలిపినయెడల నీ పదము లేజాతికి సంబంధించినవియో యాజాతియంతయు నీ రెండు పదములలోనే యిమిడి యుండును. ఈరెంటిలో నిమడక మిగిలిపోయిన వేమియు నాజాతియం దుండవు. మనము సృష్టివిష యమై మాట్లాడుకొనుచు 'జలము' అనియొక పదార్థమును విడఁదీసిన యెడల, 'అజలము' అనుపదముచేఁ జలముతప్ప సృష్టియందుఁగల పదార్థము లన్నియు సూచింపఁబడును. ఆ హారపదార్థములను గుఱించి మాట్లాడుకొ నుచు 'జలము'ను విడఁదీసినయెడల 'అజల' పదము నీళ్లుతప్ప మిగిలిన యాహారపదార్థము లనన్నిటిని బోధించును. పంచభూతములను గుఱించి చర్చించునెడ అజలములనఁగా పృథ్వి, తేజస్సు, వాయువు, ఆకాశము అని యర్థ మగును. కావున నొక పదము, దానియభా వము కలిసి వాదవిషయక్షేత్రము నంతను వ్యాపించును.

జాతివాచక పదముల విషయమై యొక విశేషము జ్ఞాపకముంచుకొనవలయును. మను ష్యుఁడు, చెట్టు, గుట్ట, గోవు మొదలయినవి జాతి వాచకములు. ఈపదములనుచ్చరించు నప్పుడు రెండువిధములయిన యర్థములుస్ఫురించును. ఒకటి సంఖ్యార్థబోధకము (Denotative) మఱియొకటి ధర్మార్థ (గుణార్థ) బోధకము (Conotative). మానవుఁడు అనినతోడనే లోకమందలి మానవులందఱు అని యర్థ మగును. గోవు, పశువు అనినతోడనే లోకము నందుఁగల గోవులన్నియుఁ బశువులన్నియు నని యర్థమగుచున్నది. ఇదియే సంఖ్యాబోధ కార్థము. అట్లే 'మానవుఁడు' అనిన తోడనే మానవుని గుణధర్మములు, ఏ గుణధర్మముల వలన మనము మనుష్యుని ఇతరపదార్థముల నుండి వేరుచేసి గుర్తింపగలమో యవన్నియు స్ఫురించును. గోవు అనినతోడనే చతుష్ప దత్వము, ద్విశృంగత్వము మొదలయిన ధర్మములు జ్ఞాపకమునకు వచ్చును. ఇది ధర్మార్థబోధకము. దీనినే మనవారు అవచ్ఛే దక మనిరి మెదరు.

ఇట్లు జాతివాచక శబ్దములకుసంఖ్యార్థము, ధర్మార్థము అని రెండర్థములు కలవు. ఈరెంటికి గల సంబంధ మెట్టిది? సంఖ్య హెచ్చిన ధర్మము

తగ్గును. ధర్మము హెచ్చిన సంఖ్యతగ్గును. మనుష్యుఁడు, స్త్రీ, హిందుస్త్రీ అను మూఁడు పదములుతీసికొందము. స్త్రీపదముచే మనుష్యత్వ, స్త్రీత్వములను రెండు ధర్మములు సూచింపఁబడుచున్నవి; కొంతసంఖ్యయు సూచింపఁబడుచున్నది. ఇందలి ధర్మములకు హిందుత్వమను ధర్మమును కల్పుఁడు. మనుష్యత్వ, స్త్రీత్వ, హిందుత్వములను ధర్మములు కలిసిన 'హిందూస్త్రీ' యను జాతివాచకపద మగును. ఇట్లు స్త్రీపదము కంటె 'హిందూస్త్రీ' పదమునందు నొక ధర్మము హెచ్చినది కాని సంఖ్య తగ్గినది. స్త్రీల సంఖ్యకంటె హిందూస్త్రీల సంఖ్య తక్కువగదా? అట్లే స్త్రీపదమునందుఁ గల స్త్రీత్వ, మనుష్యత్వ ధర్మములలోనుండి స్త్రీత్వ ధర్మమును తగ్గించుదము. మనుష్యత్వ ధర్మము మిగులును. ఆ ధర్మము గలవారు మనుష్యులు. ఇట్లు ధర్మము తగ్గినది. కాని సంఖ్య హెచ్చినది. స్త్రీలకంటె మనుష్యుల (స్త్రీలును పురుషులును గలసిన మానవకోటి) సంఖ్య హెచ్చును గదా.

మూఁడు సూత్రములు

తర్కశాస్త్ర సంబంధమైన యీ క్రింది మూఁడు సూత్రములును పరంపరగా వచ్చుచున్నవి. తర్కశాస్త్రము నభ్యసించువారు ఈ సూత్రములను చక్కగ నెఱుఁగవలయును. అవి యెవ్వియనగా :-

(౧) రాముఁడు రాముఁడే (A is A). ఈ సూత్రమునకు ఏకార్థకసూత్ర మని పేరు (Law of Identity). ఇది యెట్టి సూత్రమని చదువరులు వింతపడ నక్కర లేదు. వాదములో నుపయోగింపఁబడిన పదము అంతటను ఏకార్థమునందే యుపయోగింపవలెను. ఒకచోట పదమును ఒక యర్థమునందును మఱియొకచోట వేఱర్థమునందును వాడఁ గూడదు. పదమునకు నిశ్చితమైన యర్థ ముండవలయును. వాది స్వకార్యార్థము అర్థమును మార్చుచుండఁ గూడదు. వాదము ప్రారంభమగునపుడు రాముఁడనఁగా దాశరథీరాముఁ డన్న యర్థమేని, వాదమునం దంతటను ఆయర్థమె యుండవలయును గాని, ఒకప్పుడు దాశరథీ రాముఁడనియు, మఱియొకప్పుడు పరశురాముఁడనియు వేఱొకప్పుడు బలరాముఁడనియు నర్థమును త్రిప్పఁగూడదు. అట్లు చేసిన యెడల హేత్వాభాసమునకుఁ గారణమగును.

తర్కశాస్త్రముయొక్క యీ ప్రథమసూత్రమును చక్కగఁ గమనింపక పోవుటచేతనే లోకమునందు నిన్ని మతములును మతవాదములును ఉద్భవించినవి. విష్ణువు సకల దేవతలకంటె శ్రేష్ఠుఁడు అని వాదమునకుఁ బ్రారంభించునపుడు 'విష్ణు' శబ్దమునకు గరుడవాహనుఁడు, నాలుగు చేతులుగలవాఁడు, శంఖచక్రములుగలవాఁడు అని యర్థము చెప్పెదరు. కాని పోఁగపోఁగ 'విష్ణు' శబ్దము యొక్క యీయర్థము మాఱి దానికి నిరాకార సర్వవ్యాపియగు సృష్టికి నాదికారణ మన్న యర్థము కల్పింపఁబడును. ఇట్లు వాదిప్రతివాదులు

వాదాంతర్గతమైన శబ్దములయర్థమును మార్చు చుండుటవలన నెన్నడును తెగనట్టి వాదములు కలుగుచున్నవి.

(౨) రాముఁడు మానవుఁడు, రాముఁడు మానవుఁడు కాఁడు, అన్నవి పరస్పరవిరుద్ధ సిద్ధాంతములు. ఈ రెండును సత్యములు కాఁజాలవు. ఒకటి సత్యమేని రెండవది అసత్యమై యుండవలయును. రాముఁడు మానవుఁడు అన్నమాట సత్యమేని రాముఁడు మానవుఁడు కాఁడు అన్నమాట అసత్యము. అట్లే రాముఁడు మానవుఁడుకాఁడు అన్న మాటసత్యమేని రాముఁడు మానవుఁడు అన్న మాట అసత్యము. ఈ సూత్రమునకు పరస్పరవైరుధ్య విషయిక సూత్రము (Law of Contradiction) అని పేరు.

(3) పైని జూపఁబడిన పరస్పరవిరుద్ధ వాక్యములు రెండును అసత్యములు కాఁజాలవు. అనఁగా ఈ రెండును అసత్యములై మూడవ మాటసత్యమగుటకు వీలు లేదు. ఈ రెంటిలో నొకటి సత్యమై తీరవలయును. రెండవది యసత్యమై తీరవలయును. ఈ సూత్రమునకు తృతీయ పక్షాభావము (Law of excluded middle) అని పేరు.

వాక్యములు : వాక్యభేదములు

(Propositions and their kinds)

ఒక క్రియతో నన్వయించు పదసముదాయమునకు వ్యాకరణ శాస్త్రమునందు వాక్యమని పేరు. న్యాయ శాస్త్రమునందు ను వాక్యమున కీలక్షణమే చెల్లును. కాని వ్యాకరణశాస్త్రమునందలి యన్ని వాక్యములతో నిచ్చటఁ బని యుండదు. ప్రార్థనార్థకములతోడను, ఆశీరాద్యర్థకముల తోడను ఈశాస్త్రమునకుఁ బనిలేదు. స్వార్థకములు మాత్ర మీ శాస్త్రి విషయములు. వానియందైనను వర్తమానార్థకములే యుపయోగింపఁబడును. ఇతరవాక్యములను స్వార్థక వర్తమానార్థకములుగా మార్చి యీ శాస్త్రిమునందు నుపయోగించుకొనవచ్చును.

ఈ శాస్త్రిమునందు నుపయోగింపఁబడు వాక్యములు మూఁడు విధములు : నిశ్చయాత్మకములు (Categorical), సాపేక్షములు (Hypothetical), వైకల్పికములు (Disjunctive or Alternative). మానవులందఱును చచ్చువారు, కొన్ని పుస్తకములుమంచివి కావు, చింతకాయ పుల్లనిది, అనునవి నిశ్చయాత్మక వాక్యములు. వీనియందు కర్తను గుఱించి చెప్పఁబడు విషయములు అగును కాదు అని నిశ్చయముగను, స్పష్టముగను, ఖచితముగను చెప్పఁబడియుండును. వర్షము రానియెడల నాటక మాడఁబడును, పథ్యము చేసినయెడల మందు గుణమిచ్చును, అనునవి సాపేక్షవాక్యములు. ఇందు కర్తను గుఱించి చెప్పఁబడిన యంశము, మఱియొక విషయమును ఆశ్రయించి యుండును. నాటక మెప్పుడాడఁబడును ? వర్షము రానియెడల. కావున వర్షమురాకయుండుట నాటక మాడఁబడు

టకుఁబూర్వావస్థ(condition prior). అతఁడు తోటలోనైన నుండును, లేక యింటనైన నుండును అనునది వైకల్పికవాక్యము. ఇందు నిదమిత్థ మని యుండదు. అనేకపక్షములకు వీలుండును. ఈ వాక్యములన్నియు న్యాయశాస్త్రమునందు వాడఁబడినను, ఈ శాస్త్రసిద్ధాంతములు బోధచేయుటకు నిశ్చయవాక్యములే చాల వీలుగ నుండును, కావున నిశ్చయవాక్యములను గుఱించియే శాస్త్రసిద్ధాంతములఁ జెప్పినఁ జాలును. ఆ సిద్ధాంతములనే యితర వాక్యములకును అన్వయింపఁ జేయవచ్చును.

నిశ్చయ వాక్యవిభజన

(Analysis of the Categorical Propositions).

సాధారణముగా వాక్యమునందు రెండు నామపదములును (విశేష్యములును), క్రియాపదమును ఉండును. నామపదములు రెంటిలో నొకదానికి కర్తృపదమనియు(Subject), రెండవదానికివిధేయపదమనియు(Predicate), ఈ రెంటిని కలుపునది గనుక క్రియాపదమునకు 'సంయోజకపదము' (Copula) అనియుఁ జెప్పు. సంయోజకపద మెప్పుడును అగు ధాతువుయొక్క వేరు వేరు రూపములుగా నుండును. "దేవదత్తుఁడు విద్యార్థి యగును" అను వాక్యమునందు 'దేవదత్తుఁడు' కర్తృపదము, 'విద్యార్థి' విధేయపదము; 'అగును' సంయోజకపదము. "మనుష్యులు, మరణశీలురు అగుదురు." అను వాక్యమునందు, 'మనుష్యులు' కర్తృపదము, 'మరణశీలురు' విధేయపదము, 'అగుదురు' సంయోజకపదము. "మామిడిపండు పథ్యకారి కాదు." అను వాక్యమునందు 'మామిడిపండు' కర్తృపదము, 'పథ్యకారి' విధేయపదము, 'కాదు' సంయోజక పదము. కర్తృపదమునకును, విధేయపదమునకును గల సంబంధమును సంయోజకపదము తెలుపును. ఈ సంబంధము, భావరూపముగ నుండవచ్చును, అభావరూపముగ నుండవచ్చును. అగునన్నపుడు భావరూపము. కాదు అన్నపుడు అభావరూపము. తెలుఁగుభాషలో సాధారణముగ భావరూపమైన సంయోజకపదము (క్రియాపదము), అధ్యాహృతముగనుండును. అనగ లోపించి యుండును. "దేవ దత్తుఁడువిద్యార్థి" యని యందుమే గాని, "దేవదత్తుఁడు విద్యార్థి అగును," అనిచెప్పము. "మనుష్యులు మరణశీలురు" అని అందుమే గాని "మరణశీలురు అగుదురు," లేక "అయి యున్నారు" అని యనుటలేదు. కావున నిట్టియెడల సంయోజకపదము లేదని భ్రమపడరాదు. అధ్యాహృతముగ నున్నదనియే యెంచవలెను.

ఇట్లు తర్కశాస్త్రమం దుపయోగింపఁబడవలసిన వాక్యము త్రిపదాత్మకముగ నుండుననియు, ఆ మూఁడుపదములలో రెండు నామపదములుగను, ఒకటి క్రియాపదరూపకమైన సంయోజకపదముగను, నామపదముల రెంటిలో, నొకటి కర్తృపదముగను రెండవది

విధేయపదముగను ఉండవలయునని యు, చదువరులు చక్కగ గ్రహించియుందురు. మనము సామాన్యముగా వాడుకొను వాక్యములన్నియు నిట్టి రూపమును కలిగియుండవు. అయినను మన మట్టివాక్యములను, ఈరూపములకు సులభముగ మార్చుకొనవచ్చును. "సూర్యుడు ప్రకాశించును" అను సామాన్య వాక్యమును, "సూర్యుఁడు ప్రకాశవంతుడు," లేక, "సూర్యుడు ప్రకాశించువాఁడు," లేక "సూర్యుడు ప్రకాశమాన ద్రవ్యము." అనిమార్చిన యెడల, అర్థభేదము లేకుండ, కర్తృవిధేయ సంయోజకపదములుగల నైయాయిక వాక్యము సిద్ధించుచున్నది. "రాముఁడు రావణుని జంపెను." అను వాక్యమును, "రాముఁడు, రావణసంహర్త" అని మార్చవచ్చును. లేదా "రాముఁడు రావణుని జంపినవాఁడు," అని యనవచ్చును. ఇందు 'రాముఁడు' కర్తృపదము, "రావణుని జంపినవాఁడు" విధేయ పద సమూహము. అధ్యాహృతమైన 'అగును' అను క్రియ సంయోజకపదము. ఇట్లే యితర వాక్యములను బుద్ధికుశలతచే మార్చుకొనవలయును.

వాక్యముల వ్యాప్తి*

(The quantity of propositions.)

పాశ్చాత్య నైయాయికులు వాక్యములను పలుతెరంగుల విభజించి యున్నారు. అందు మన ప్రస్తుత ప్రయోజనమునకు రెండు విధములైన విభాగములు మాత్ర మావశ్యకములు.

కర్తృపదముయొక్క వ్యాప్తినిఁబట్టివాక్యములు సర్వదేశీయములు (Universal) అనియు, ఏకదేశీయములు (Particular) అనియు, ద్వివిధములు. ఏవాక్యమునందు కర్తృపదమునకు, సంపూర్ణవ్యాప్తి కలిగియుండునో, అనఁగా కర్తృపదముచే, సూచింపఁబడిన ప్రతి పదార్థమునకును విధేయపదముతో సంబంధము కలిగియుండునో యావాక్యమును సర్వదేశీయ వాక్యమందురు. కర్తృపదమునకును, విధేయపదమునకును, గల సంబంధము భావరూపముగ నుండవచ్చును; అభావరూపముగ నుండవచ్చును.

ఎచ్చటెచ్చట ధూమ ముండునో అచ్చటచ్చట అగ్ని యుండును, మానవు లందఱును మరణశీలురు, యద్దృశ్యం తన్నశ్యం, కనబడునది యంతయు నాశవంతము, ఏకీటకమును స్తనముకాదు, ఎచ్చటెచ్చట జలముండునో యచ్చటచ్చట నగ్నియుండదు,

* 'వ్యాప్తి' పదము మన న్యాయశాస్త్రమునందు యర్థమునందే యిచ్చటవాడినను, ఆశాస్త్ర మందలి యర్థమునకును ఈశాస్త్రమందలి యర్థమునకును కొంచెము ఛాయాభేదము (shades of meaning) కలదు. ఇచ్చటను అచ్చటను వ్యాప్యమనగా వ్యాప్తి కలదియేకాని మనశాస్త్రమునందు వ్యాపకముయొక్క వ్యాప్తి వ్యాప్యమునందున్నదని చెప్పుదురు, పాశ్చాత్య న్యాయశాస్త్రమందు వ్యాప్యమునకు పూర్తిగవ్యాప్తి గలదనియు వ్యాపకమునకు పూర్తిగవ్యాప్తి లేదనియుఁ జెప్పెదరు.

అనినవాక్యము లన్నియు సర్వదేశికములు. ఇందలి ప్రతివాక్యమునందును, కర్తృపదమంతయు వ్యాప్తిఁ జెంది యున్నది, కర్తృపదముచే సూచితమైన ప్రతి పదార్థమును, విధేయపదార్థముతో సంబంధము కలిగి యున్నది. చివర రెండు వాక్యములందు కర్తృవిధేయపదములకు గల సంబంధము అభావరూపమైనది. కావున, నావాక్యములందలి కర్తృపదమునకు గలవ్యాప్తి అభావరూప మయినది. మిగిలిన వాక్యములోని వ్యాప్తి భావరూపము గలది.

కర్తృపదమునకు అన్ని, అందఱు మొదలైన సర్వనామములను జేర్చినందువలన, సార్వదేశీయత్వము ప్రాప్తించు చున్నదని, చదువరు లూహించియే యుందురు. ప్రతి మొదలైన యితరపదములును, ఉపయోగింప వచ్చును. 'అందఱు' అను పదము కొన్ని యెడల విపరీతార్థము నీయ వచ్చును.

అందఱు మనుష్యులు పండితులు గారు, అను వాక్యముసర్వదేశీయము గాదు. ఈవాక్యమునకు మనుష్యులందఱును అపండితులని యర్థము కాదు; కొందఱు మనుష్యులు అపండితులని యర్థము. కావున 'అందఱు' పదము జూచినంత మాత్రమున భ్రమపడి సర్వదేశీయ వాక్యమని తలంపరాదు. వాక్యముయొక్క తాత్పర్యమును గమనించి చూడవలయును. కొన్నియెడల అందఱు, ప్రతి మొదలైన పదములు లేకయే సర్వదేశీయవాక్యము సిద్ధింప వచ్చును. శరీరములు నాశవంతములు, ఏక శరీరము నాశవంతము, అన్నచో శరీరములన్నియు నాశవంతములనియు, పక్షికి రెక్కలున్న వన్నచో, నన్ని పక్షులకు రెక్కలున్నవనియు నర్థము.

కర్తృపదముయొక్క ఏకదేశమునకు ననఁగా కొంతభాగమునకు మాత్రము విధేయపదముతో సంబంధము కలిగి యున్నట్లు ఏవాక్యమునందు వర్ణింపఁబడి యుండునో యావాక్యమునకు ఏకదేశీయ వాక్యము (Particular proposition) అని పేరు. ఇందు కర్తృపదమునకుఁ బూర్ణవ్యాప్తి లేదు, ఏకదేశవ్యాప్తి మాత్రము గలదు. అగ్నియున్న కొన్నిచోట్ల ధూమ ముండును, కొందఱు మానవులు గ్రుడ్డివారు, కొన్ని వృక్షములకు పువ్వు లుండును, కొందఱు స్త్రీలు గ్రంథములను వ్రాసిరి, అగ్నియున్న కొన్ని చోట్ల పొగయుండదు, అనునవి ఏకదేశీయ వాక్యములు. కొందఱు అనుపదముచే నీవాక్యములకు ఏకదేశీయత్వము ప్రాప్తించినది. చాల, ఎక్కువ, తక్కువ, మిక్కిలి, మొదలైనపదములచేతఁగూడ నీయర్థమే సిద్ధించును. పెక్కుజనులు విద్య నెఱుఁగరు, అను వాక్యము కూడ నేకదేశీయవాక్యమే. అనిశ్చయమే ఏకదేశీయత్వమునకుఁగారణము. కర్తృపదాంతర్గతములైన పదార్థములలో నెన్నిటికి విధేయపదముతో సంబంధము కలదో ఈ వాక్యమువలన స్పష్టముగ తెలియదు. కర్తృపద

మునందు నూఱు పదార్థము లిమిడియున్న వనుకొనుఁడు. వానిలో నొక ద్రవ్యమునకు మాత్రము విధేయపదముతో సంబంధము కలిగి యుండి తొంబదితొమ్మిది పదార్థములతో సంబంధము లేకున్నను, లేక తొంబదితొమ్మిది పదార్థములతో సంబంధము కలిగి యుండి ఒకద్రవ్యములో మాత్రము సంబంధము లేకున్నను, నది ఏకదేశీయసంబంధమే యనఁబడును. ఇంకొక విశేషముఁ గలదు. ఇట్టి యనిశ్చయస్థితిలో ఒకప్పుడు నూఱు పదార్థములు కూడ, విధేయాంతర్గతంబులై యుండనోపు. కాని యది యనిశ్చితమైనందున మనకుఁదెలియదు. నూటికి నూఱు పదార్థములు విధేయపదాంతర్గతంబులై యున్నవని నిశ్చయజ్ఞానము కలిగినప్పుడు ఆవాక్యము సర్వదేశీయమే యగును. అట్టి నిశ్చయజ్ఞానము లేక, నూటికి నూఱుండిన నుండవచ్చును లేకపోయిన లేకపోవచ్చును అన్న అనిశ్చయజ్ఞానమున్నంతవఱకు నావాక్య మేకదేశీయమే యగును.

వాక్యముల స్వరూపము

(The Quality of propositions)

వాక్యముయొక్క రూపమును బట్టిమరల వాక్యములను భావరూపములు(Affirmative) అనియు, అభావరూపములు(Negative) అనియు రెండువిధములుగా. నైయాయికులు విభజించిరి. భావరూపవాక్యమునందు విధేయపదసంబంధమైన గుణధర్మములు కర్తృపదమునకు నారోపింపఁబడును. ఇందు మూలకముగ కర్తృవిధేయపదములు కలుపఁబడి వానికి నైక్యభావము (అనగా సామానాధికరణ్యము) సాధింపఁబడును. అభావరూప వాక్యమునందు, విధేయపద సంబంధమైన గుణధర్మములు కర్తృపదమునకు నిషేధింపఁబడును. ఇందుమూలకముగా విధేయపదమును కర్తృపదమును విడదీయఁబడును. మానవు లందఱు మరణశీలురు, ఎక్కడెక్కడ ధూమమో యక్కడక్కడ అగ్ని ఉండును, అనునవి భావవాక్యములు. ఇందలి మొదటివాక్యమునందు మరణశీలురకుఁగల మరణమను ధర్మము మానవులకు విధింపఁబడినది. మరణశీలుర వర్గము మానవవర్గముకంటె పెద్దది. వృక్షములు, క్రిములు కీటకములు మొదలైనవన్ని మరణశీలములు. వాని సామాన్యధర్మము మరణము. అట్టి ధర్మము మానవజాతికి ఈవాక్యమునందు విధింపఁబడినది. కొందఱు జనులు కోపముగలవారు అనునది భావవాక్యము. ఇందు విధేయపదమైన 'కోపముగలవారి' యొక్క ధర్మము కోపము; కర్తృపదమైన కొందఱుజనులకు ఈ కోపము ఈ వాక్యమునందు విధింపఁబడినది.

'మనుజులు దేవతలు కారు.' అనునది అభావవాక్యము. ఇందు విధేయపదము దేవతలు. వారి ధర్మము దేవత్వము. ఈ వాక్యమునం దట్టి దేవత్వము కర్తృపదమైన మనుష్యులకు నిషేధింపఁబడినది. 'కొన్ని జంతు

వులు జలచరములు కావు' అను వాక్యము నందు, జలచరత్వ ధర్మము కొన్ని జంతువులకు నిషేధింపఁబడినది, కావున నది అభావ వాక్యము. అభావ వాక్యము సాధారణముగా తెలుఁగునందు అగు ధాతువుయొక్క వ్యతిరేక రూపములచే సూచింపఁబడును.

వాక్యములకు నామకరణము

ఇట్లు నైయాయికులచే వాక్యములు కర్తృపద వ్యాప్తి ననుసరించి సర్వదేశీయ, ఏకదేశీయములని రెండు విధములుగను, వాక్యరూపమునుఁబట్టి, భావాభావములని రెండు విధములుగను, మొత్తముమీఁద నాల్గు విధములుగ విభజింపఁబడినవి. ఈ నాల్గును, వాని యుదాహరణములును, వానికిఁ బాశ్చాత్యులు పెట్టిన గుర్తులును, తెలుఁగుగుర్తులును ఈ క్రిందఁ జూపఁబడినవి.

పేరు	ఉదాహరణము	ఇంగ్లీషు గుర్తు	తెలుఁగు గుర్తు
1. సర్వదేశీయ భావ వాక్యము	1. అన్ని శరీరములు నాశవంతములు.	A	య
2. సర్వదేశీయ అభావ వాక్యము	2. శరీరము లెవ్వియు శాశ్వతములు కావు.	E	ర
3. ఏకదేశీయభావ వాక్యము	3. కొన్ని శరీరములు స్థూలములు.	I	ల
4. ఏకదేశీయ అభావ వాక్యము	4. కొన్ని శరీరములు స్థూలములు కావు.*	O	వ

తర్కశాస్త్రమంతయు నీ నాలుగు వాక్యముల చర్చతో నిండి యుండును. కనుక తర్కశాస్త్రము నభ్యసించువారు మొదట నీ వాక్యముల పేళ్లను, ఉదాహరణములును, ఈ వాక్యముల స్వభావములును చక్కగ నెఱుంగవలయును. అటు లెఱింగినంగాని తర్కశాస్త్రము చక్కఁగ బోధపడఁ జాలదు. ఈ నాలుగు వాక్యముల పొడుగు పేళ్లు తేపతేప నుచ్చరించుట కష్టము గనుక పాశ్చాత్యులు వీనికి క్రమముగ, ఏ (A) ఈ (E) ఐ (I) ఓ (O) వాక్యములని పేళ్లు పెట్టిరి. మేము వీనికి యరలవ వాక్యములని నామ

* మన దేశపు నైయాయికుల సంప్రదాయాను సారముగా నీ వాక్యములకు నుదాహరణము లీయవల యునన్న ఈ క్రింది రీతిగ నీయవచ్చును. (౧) ఎక్కడెక్కడ ధూమ ముండునో అక్కడక్కడ నగ్ని యుండును. ఇది య (A) వాక్యము. (౨) ఎక్కడెక్కడ జల ముండునో అక్కడక్కడ అగ్ని యుండదు. ఇది ర (E) వాక్యము. (3) అగ్నియున్న కొన్నిచోట్ల ధూమ ముండును. ఇది ల (I) వాక్యము. (౪) అగ్నియున్న కొన్నిచోట్ల ధూమ ముండదు. ఇది వ (O) వాక్యము.

కరణము చేసితిమి. య వాక్యమనిన సర్వదేశీయ భావ వాక్యమనియు, ర వాక్యమనిన సర్వదేశీయ అభావ వాక్యమనియు, ల వాక్యమనిన ఏకదేశీయ భావవాక్యమనియు, వ వాక్యమనిన ఏకదేశీయ అభావ వాక్యమనియు నెఱుంగవలెను. ఇఁక ముందు, సాధారణముగా నీ గుర్తులే యుపయోగింపఁబడును. కావున చదువరు లీ గుర్తులను జ్ఞాపకముంచుకొన వలెను.

ప్రతి వాక్యమందును కర్తృపదమును విధేయ పదమును ఉండును గనుక, వానికి గుర్తుగా, క్రమముగ కా, వీ *, యను నక్షరములు పెట్టుకొనిన యెడల ఈ నాలుగు వాక్యములకును ఈ క్రింది నాలుగు ఉదాహరణము లేర్పడుచున్నవి.

వాక్యము	ఉదాహరణము
య	అన్ని కాలు వీ
ర	ఏ కా యు వీ కాదు.
ల	కొన్ని కా లు వీ
వ	కొన్ని కా లు వీ కావు.

వాక్యమునందు పదములకుఁగల వ్యాప్తి
(The distribution of terms in a proposition.)


పైని నాలుగు విధములగు వాక్యములు వర్ణింపఁబడినవి. ప్రతివాక్యమునందును కర్తృపదమును, విధేయపదమును ఉండుననియుఁ జెప్పఁబడినది. ఈ పదములలో నేదేపదములకు నేయే వాక్యమునందు వ్యాప్తికలదో యేయేవాక్యమునందు వ్యాప్తిలేదో మనము చక్కఁగఁ గనుఁగొన వలెను. ఎందుకనగా, అనుమాన వ్యాపారమంతయు(The process of inference) ఈ వ్యాప్తి ననుసరించియే యుండును. ఒకానొక పదముచే సూచింపఁబడు జాతియందు (వర్గమునందు,in a class) నిమిడియున్న పదార్థముల నన్నిఁటినిగుఱించి యున్నావాక్యమునందుఁ జెప్పఁబడి యుండినచో నా పదమునకు వ్యాప్తిగల దందురు. ఒకానొక పదముచే బోధింపఁబడు జాతియందుఁ గల కొన్ని పదార్థములను గుఱించి మాత్రము వాక్యమునందుఁ జెప్పఁబడి యున్నయెడలను, లేక అన్ని పదార్థములను గుఱించి స్పష్టముగఁ జెప్పఁబడక యుండినయెడలను ఆపదమునకు వ్యాప్తి లేదందురు. వ్యాప్తి భావరూపముగ నుండవచ్చును; అభావరూపముగ నుండవచ్చును. వ్యాప్తిశబ్దముయొక్క ఈ యర్థమును మనసునందుఁ జక్కఁగ నుంచుకొని మన మిక నాలుగు విధములైన వాక్యములను వేఱు వేఱుగఁ బరీక్షింతము.

'య' వాక్యమందు ననగా సర్వదేశీయ భావవాక్యమునందు కర్తృపదమునకు మాత్రము. వ్యాప్తి గలదు; విధేయపదమునకు వ్యాప్తి లేదు. "అన్ని కాలు వీ" యన్న వాక్యమువలన 'కా' లన్నియు 'వీ' లో

* కర్తృపదమునకు 'క' అనియు విధేయపదమునకు 'వి' అనియు హ్రస్వములుగ పేళ్లు పెట్టుటకు మారుగా 'కా' 'వీ' అని దీర్ఘములుగ గుర్తులు పెట్టుటకుఁ గారణము దీర్ఘాక్షరములకు ప్రత్యయాదులు పెట్టి యుచ్చరించుటకు వీలుగ నుండుటయే. 'క' కు అనుటకంటె 'కా' కు అనుట సుకరము.

నిమిడి యున్నవని యర్థము స్పష్టపడుచున్నది. కాని 'పీ' లన్నిటిఁగుఱించి మనకు నేమియు స్పష్టముగ బోధపడుట లేదు. కొన్ని 'పీ'లు మాత్రము, 'కా' లలోనిమిడి యున్నట్టు మన మూహింప వచ్చును. కాని మిగిలిన 'పీ' లు, 'కా' లలో నిమిడి యున్నవో, నుఱి వేనిలో నిమిడి యున్నవో, చెప్పఁజాలము. ఒకప్పుడు 'పీ' లన్నియు కాలలో నిమిడి యుండవచ్చును; ఒకప్పు డిమిడి యుండక పోవచ్చును. "ధూమ మున్నచోట నెల్ల అగ్ని యుండును" అనునది య వాక్యము. ఇందు ధూమమునకు వ్యాప్తి గలదు; అగ్నికి వ్యాప్తి లేదు. ధూమ మున్నచోట నెల్ల, అగ్ని యుండునే గాని, అగ్నియున్న చోటనెల్ల ధూమ ముండదు. ఇట్లు కర్తృ పదమునకు వ్యాప్తిగలదు; విధేయ పదమునకు లేదు. ధూమమున్న చోటనెల్ల పచ్చికట్టెల నిప్పుండును అనునది య వాక్యమే. ఇందు ధూమము కర్తృపదము. పచ్చికట్టెల నిప్పు విధేయపదము. ఈ వాక్యమునందు, రెండు పదములకును వ్యాప్తిగలదు. ఇట్లు య వాక్యమునందు విధేయపదమునకు ఒకప్పుడు వ్యాప్తి యుండును; ఒకప్పుడు వ్యాప్తి యుండదు; కర్తృపదమునకు మాత్ర మెల్లప్పుడును వ్యాప్తి గలదు. ఈ సంగతియే నీ క్రింది వృత్తములచే బోధింపవచ్చును.

ఒకటవ వృత్తమునందు కా, పీ లు పూర్తిగ నేకీభవించియున్నవి. ఇది, 'ధూమమున్న చోట నెల్ల, పచ్చికట్టెల నిప్పుండును,' అన్న వాక్యమునకు నుదాహరణము.




1-వ వృత్తము 2-వ వృత్తము

రెండవ వృత్తమునందు కా యంతయు పీ లో నొకభాగముగా నిమిడియున్నది, మిగిలిన పీ యంతయు కాకు వెలుపల నున్నది. ఆ వెలుపలనున్న పీ నుగుఱించి మనమేమియు నెఱుఁగము. ఇది 'ధూమ మున్న చోట నెల్ల నగ్ని యుండును' అన్న వాక్యమునకు నుదాహరణము.


'ర' వాక్యమునందు, అనఁగా, సర్వదేశీయ అభావవాక్యమునందు కర్తృ పదమునకును విధేయపదమునకును వ్యాప్తి గలదు. "ఏ 'కా' యును 'పీ' కాదు" అనువాక్యమునందు కా లన్నియు, పీ లనుండి వేఱుచేయుటలో పీ లన్నియు కాలనుండి వేఱుచేయఁబడినవి. ఇట్లు రెంటికిని అభావరూపవ్యాప్తి సిద్ధించెను. 'పక్షులు సస్తనములు కావు,' అన్న వాక్యమునందు, ఏపక్షియు సస్తనము కాదని స్ఫురించుటయే గాక, ఏసస్తనప్రాణియు పక్షి కాదన్న యర్థముకూడ స్ఫురించుచున్నది. ఇట్లుగాక, కొన్ని సస్తన ప్రాణులు పక్షులయిన యెడల నేపక్షియు సస్తనము కాకుం

డుట సంభవింపనేరదు. 'మనుష్యులెవ్వరును దేవతలు కారు' అనగానే 'దేవతలెవ్వరును మనుష్యులు కారని యర్థము స్ఫురించును. కావున పై వాక్యమునందు 'మనుష్య' (కర్తృ) పదమునకును, 'దేవత' (విధేయ) పదమునకును వ్యాప్తికలదని యర్థము. ఈయర్థమునే క్రింది రెండు వృత్తములవలనఁ జూపవచ్చును.




వేఱువేఱుగ నున్న యీ రెండు వృత్తముల వలన కా యంతయు పీ కు వెలుపల నున్నదనియు, పీ యంతయు కాకు వెలుపల నున్నదనియు, అర్థము స్ఫురించుచున్నది.

ల వాక్యమునందు, అనగా, ఏకదేశీయ భావవాక్యమునందు కర్తృపదమునకు గాని విధేయపదమునకు గాని వ్యాప్తిలేదు. "కొన్ని కా లు పీ"యను వాక్యమునందు కాకువ్యాప్తి లేదనుట స్పష్టము. పీ లన్నియు కొన్ని కాలలో నిమిడియున్నట్టుగాని, కొన్ని పీలే కొన్ని కాలలో నిమిడియున్నట్టుగాని యర్థము స్పష్టముగా లేనందున, పీకుఁ గూడ వ్యాప్తిలేదనుట స్పష్టము. 'కొన్ని పక్షులు చక్కనివి' అను వాక్యము ఈ క్రింది యొకటవ వృత్తమునందు వివరింపఁబడినది. 'కొందఱు మానవులు హిందువులు' అను వాక్యము రెండవ వృత్తమునందు వివరింపఁబడినది.




1-వ వృత్తము



2-వ వృత్తము

వ వాక్యమునందు, అనగా ఏకదేశీయ అభావ వాక్యమునందు కర్తృ పదమునకు వ్యాప్తిలేదు; విధేయ పదమునకు వ్యాప్తి కలదు. 'కొన్ని కాలు పీకావు' ఇచ్చట కాకు వ్యాప్తి లేకపోవుట స్పష్టము. పీలన్నియు చెప్పఁబడినకొన్ని కాలకు వెలుపల నున్నవని యీవాక్యమున కర్థమును చేయవలయును. అట్లుచేయక కొన్ని పీ లు మాత్రము కొన్ని కా లకు వెలుపల నున్నవనియు, మఱికొన్ని పీ లు, కొన్ని కాలతో నేకీభవించినవనియు నర్థముఁజేసిన యెడల, మూలవాక్యము యొక్క తాత్పర్యము మాఱి

పోవును. 'కొందఱు మానవులు తెలివిగల వారు కారు,' అనగా 'తెలివి గలవారు' అను వర్గమంతయు వాక్యమందుఁ జెప్పఁబడిన కొందఱు మానవులకు వెలిగా నున్నదని యర్థమగును. కావున ఈవాక్యమునందు కర్తృపదమునకు వ్యాప్తిలేదు ; విధేయపదమునకు వ్యాప్తికలదు. ఈయర్థము ఈ క్రింది వృత్తముల వలన స్పష్టపడఁగలదు.



ఇట్లు తేలిన తాత్పర్య మేమన: సర్వదేశీయవాక్యములందు కర్తృపదమునకు వ్యాప్తి గలదు; ఏకదేశీయవాక్యమునందు కర్తృపదమునకు వ్యాప్తిలేదు; భావవాక్యమునందు విధేయపదమునకు వ్యాప్తిలేదు; అభావ వాక్యమునందు విధేయపదమునకు వ్యాప్తి కలదు.

వాక్యములకుఁగల విరోధము.

(Opposition of propositions)

సమాన కర్తృపదమును సమాన విధేయ పదమును గల య, ర, ల, వ, లను నాలుగు వాక్యములకుఁ గల పరస్పర సంబంధమునకుఁ బాశ్చాత్య తార్కికులు వాక్యవిరోధ మని పేరుపెట్టిరి. వాక్యములకుఁ గల యీ సంబంధమును తెలిసికొనుటవలన, ఒక వాక్యము (య) సత్యమగునేని, లేక యసత్యమగునేని, ఆకర్తృ పదమును, ఆవిధేయపదమును గల యితర (ర, ల, వ,) వాక్యములు సత్యములగునా, లేక, అసత్యములగునా యన్నజ్ఞానము కలుగును.

మానవులందఱు మరణాధీనులు (య)
మానవులెవ్వరును మరణాధీనులు కారు (ర)
కొందఱుమానవులు మరణాధీనులు (ల)
కొందఱుమానవులు మరణాధీనులు కారు (వ)

ఇవి నాలుగును ఏక కర్తృపదమును, ఏక విధేయ పదమును గల వాక్యములు. వీనిలో నన్నియు సత్యములుగగాని, అన్నియు అసత్యములుగ గాని ఉండుటకు వీలులేదుగదా ? 'మానవులందఱు మరణాధీనులు' (య) అను వాక్యము సత్యమేని 'మానవు లెవ్వరును మరణాధీనులు కారు, (ర) అను వాక్యమును, 'కొందఱు మానవులు మరణాధీనులు కారు' (వ) అను వాక్యమును, అసత్యములై తీరవలయును.

వాక్యములకు నాలుగు విధములయిన వైరముకలదని తార్కికుల యభిప్రాయము. అవి యెవ్వి యనిన:-

వాక్య వైరములలో నిది ప్రబలమైనది. దీనిని ప్రబల వైర మనవచ్చును. ఇట్టి పరస్పర వైరము, య, వ, వాక్యములకును, ర, ల, వాక్యములకునుగలదు.

౧ పరస్పర వైరము
(Contradiction)

అనగా య సత్యమేని, వ అసత్యము. య అసత్యమేని వ సత్యము. అట్లే వ సత్యమేని య అసత్యము. వ అసత్యమేని య సత్యము. ఇట్లే ర, ల, వాక్యముల గుఱించి యెఱుంగునది. అనఁగా పరస్పర వైరముగల రెండు వాక్యములును సత్యములు కానేరవు. అట్లే రెండును అసత్యములును కానేరవు. ఒకటి సత్యము, రెండవది అసత్యము అయి తీరవలయును.


ఇది సాధారణవైరము. య, ర వాక్యముల కిట్టి వైరము కలదు. య వాక్యము సత్యమేని, ర వాక్యము అసత్యము. ర సత్యమేని య అసత్యము.

౨ వైరము
(Contrariety)

అనగా రెండును సత్యములు కాఁజాలవు. కాని రెండును అసత్యములు కావచ్చును. మానవులందఱు పండితులు (య); మానవులెవ్వరును పండితులు కారు. (ర) అను యీ రెండు వాక్యములును అసత్యములే. వీనిలో నొకటి సత్యమేని రెండవది యసత్యమై తీరవలయును. కాని యొకటి యసత్యమేని రెండవది సత్యమై తీరవలయును అన్న నియమములేదు.

ల, వ వాక్యములకుఁగల వైరమునకీ పేరు పెట్టబడినది. కించిద్వైరముగల వాక్యములు రెండును, సత్యములు కావచ్చును. కాని రెండును అసత్యములు కాఁజాలవు. ఒకటి అసత్యమేని, రెండవది సత్యమై తీరవలయును. 'కొందఱు మానవులు పండితులు' (ల), 'కొందఱు మానవులు పండితులు కారు' (వ) అను రెండు వాక్యములును సత్యములు కావచ్చును. కాని యిందు నొకటి యసత్యమయిన యెడల, రెండవది సత్యమయి తీరవలయును. రెండును అసత్యము లగుటకు వీలులేదు.

3 కించిద్వైరము
(Sub-Contrariety)



ఇది పేరుకు మాత్రము వైరము; నిజమయిన వైరముకాదు. య ల లకును, ర వ లకును ఇట్టి సంబంధము కలదు. య సత్యమేని, ల సత్యము;

ఆభాసవైరము
(Sub - alternation)

కాని ల సత్యమేని య సత్యమో కాదో చెప్పుటకు వీలులేదు. ఇట్లే ర వ లను గుఱించి యెఱుంగునది. య, ర, ల, వ వాక్యములకుఁ గల పైనిచూపఁబడిన నాలుగు విధములయిన వైరము లీప్రక్కపుటలోని చతుర్భుజము వలన స్పష్టపడఁగలవు.

పైని వివరింపఁబడిన వైరముల స్వభావమును చక్కఁగాఁ బరిశీలించితిమేని, ఒక వాక్యము యొక్క సత్యత్వాసత్యత్వములఁబట్టి యితర వాక్యముల యొక్క సత్యత్వాసత్యత్వము లీ క్రింది రీతిగా నూహింపవచ్చునని తేటపడఁగలదు.

సత్యము	య	ర	ల	వ.
య సత్యమగునేని	సత్యము	అసత్యము	సత్యము	అసత్యము
ర సత్యమగునేని	అసత్యము	సత్యము	అసత్యము	సత్యము
ల సత్యమగునేని	సంశయాస్పదము	అసత్యము	సత్యము	సంశయాస్పదము
వ సత్యమగునేని	అసత్యము	సంశయాస్పదము	సంశయాస్పదము	సత్యము

అసత్యము	య	ర	ల	వ
య అసత్యమేని	అసత్యము	సంశయాస్పదము	సంశయాస్పదము	సత్యము
ర అసత్యమేని	సంశయాస్పదము	అసత్యము	సత్యము	సంశయాస్పదము
ల అసత్యమేని	అసత్యము	సత్యము	అసత్యము	సత్యము
వ అసత్యమేని	సత్యము	అసత్యము	సత్యము	అసత్యము

వాక్యవిపర్యయము: సాక్షాదనుమానము (Immediate Inference).

మూలార్థము చెడకుండ నొక విధమైన వాక్యమును మఱియొక విధమయిన వాక్యముగా మార్చుట వాక్యవిపర్యయ మనఁబడును. దీనినే ప్రాచీననైయాయికులు సాక్షాదనుమాన మనిరి. కాని నిజముగాఁ జూచిన యెడల నిది యనుమానము కానేకాదు, ఇందు

వలన పూర్వము తెలిసిన దానికంటె నూతనజ్ఞానమేమియుఁ గలుగదని, అర్వాచీన నైయాయికుల యభిప్రాయము. వాక్యములను మూలార్థము చెడకుండ మార్చు ముఖ్యపద్ధతులు రెండు ౧-టి. పదపరివర్తనము, ౨-ది రూపపరివర్తనము.

మూలవాక్యమునందలి కర్తృపదమును విధేయపదముగను, విధేయపదమును కర్తృపదముగను, మార్చి మూలవాక్యమునందలి యర్థమును చెడఁగొట్టకుండ నూతనవాక్యమును సాధించుట పదపరివర్తన మనఁబడును.

౧. పదపరివర్తనము. (Conversion)

'మానవు లెవ్వరును దేవతలు కారు' అను (ర) వాక్యములోని కర్తృపదము విధేయపదముగను, విధేయపదమును కర్తృపదముగను మార్చి, 'దేవత లెవ్వరును మానవులుకారు' (ర) అను క్రొత్త వాక్యమును సాధింపవచ్చును, కాని వాక్యములన్నియు, నింతసులభముగా పదపరివర్తనమును పొందవు. 'మానవులందఱు సచేతన ప్రాణులు' (ర) అన్న వాక్యమునందలి పదములన్ని పరివర్తించిన యెడల 'సచేతనప్రాణులందఱును మానవులు' అను విపరీతార్థము నిచ్చువాక్యము సిద్ధించుచున్నది. ఇందుకుఁ గారణ మేమి? మొదటివాక్యమునందు విధేయపదమునకు వ్యాప్తి లేదు, నూతన వాక్యమునందా పదము కర్తృపదమై వ్యాప్తిఁజెందినది. కావున నిట్టి విపరీతార్థము నిచ్చెను. పదపరివర్తనముఁ జేయునెడ నీక్రింది సూత్రములను గమనింప వలయును.

౧. మూలవాక్యము యొక్కయు, సాధిత వాక్యము యొక్కయు రూప మొకటిగా నుండవలెను. మూలవాక్యము భావరూపమగునేని సాధితవాక్యముఁగూడ భావరూపముగనే యుండవలయును. మూల వాక్యమభావరూపముగనుండునేని, సాధితవాక్యముఁ గూడనభావరూపముగనే యుండవలయును.

౨. మూలవాక్యమునందు వ్యాప్తిఁ జెందని పదము సాధితవాక్యమునందు వ్యాప్తిఁ జెందఁగూడదు.

ఈ సూత్రముల ననుసరించి పదపరివర్తనము చేసితిమేని,

య వాక్యమునుండి ల వాక్యమును,
ర వాక్యమునుండి ర వాక్యమును,
ల వాక్యమునుండి ల వాక్యమును,

సాధింపగలము. వ వాక్యమునుండి యేవాక్యమును సాధించుటకు వీలులేదు.

మూల వాక్యము భావరూపమేని, దానిని అభావరూపముగ మార్చుటయు, అభావరూపమేని భావరూపముగ మార్చుటయు రూపపరివర్తన మనిపించుకొనును.

౨. రూపపరివర్తనము. (Obversion)

ఈ మార్పులు చేయునప్పుడు మూల వాక్యముయొక్క యర్థము చెడకుండ నుండవలయును. 'రాముఁడు సత్యసంధుఁడు'

అను వాక్యమునకు రూపపరివర్తనము కల్పింప వలయును. ఈ వాక్యమునందు 'అగును' అను భావరూపక సంయోజకపద మొకటి (Copula) అధ్యాహృతముగ నున్నదని చదువరు లెఱింగియే యున్నారు. ఈ భావరూపకసంయోజకపదమును, అభావరూపముగ మార్చవలెను. అట్లే విధేయపదమైన 'సత్యసంధుఁడు' అను దానిని 'అసత్యసంధుఁ'డన్న యభావరూపముగ మార్చవలయును. ఇట్లు 'రాముఁడు సత్యసంధుఁడు' అను భావరూప వాక్యమునకు సమానార్థకముగా రూపపరివర్తనమువలన 'రాముఁడు అసత్యసంధుఁడు కాఁడు' అను అభావరూపకవాక్యము సిద్ధించుచున్నది. రూపపరివర్తనము చేయునప్పుడు ఈ క్రిందిసూత్రములను గమనింప వలయును.

౧. సంయోజక పదమును భావరూపముగా నున్నయెడల అభావ రూపముగను, అభావ రూపముగా నున్నయెడల భావరూపముగను మార్చవలెను.

౨. విధేయ పదమును భావరూపముగా నున్నయెడల అభావరూపముగను, అభావ రూపముగ నున్నయెడల భావరూపముగను మార్చవలయును.

3. ఈ మార్పు చేయునప్పుడు పదపరివర్తనము చేయ నక్కరలేదు. మూలవాక్యములోని కర్త సాధిత వాక్యములోని కర్తగనే యుండును. అట్లే విధేయపదముగూడ విధేయ పదముగ నుండును.

పై సూత్రముల ననుసరించి వాక్యముల రూప పరివర్తనము కల్పించినయెడల సాధింపఁబడు వాక్యము లీక్రిందఁ జూపఁబడినవి.

మూల వాక్యము	సాధిత వాక్యము
(య) మనుష్యు లందఱు మరణ శీలురు.	(ర) మనుష్యు లెవ్వరును అమరణశీలురుకారు.
(ర) మనుష్యు లెవ్వరును సర్వజ్ఞులుకారు.	(య) మనుష్యు లందఱును అసర్వజ్ఞులు.
(ల) కొందఱు మనుష్యులు పండితులు.	(వ) కొందఱు మనుష్యులు అపండితులుకారు.
(వ) కొందఱు మనుష్యులు నమ్మతగిన వారు కారు.	(ల) కొందఱు మనుష్యులు నమ్మతగని వారు అగుదురు.

వాక్య విపర్యయముయొక్క పైని వివరింపఁబడిన రెండుమార్గములను నైయాయికులనేక విధముల కలిపి పదరూప పరివర్తనము (Obversion of the Converse) అనఁగా మొదట నొక వాక్యమునకు పదపరివర్తనముఁ గావించి, పిదప నా సాధిత వాక్యమునకు

రూప పరివర్తనము గావించుట, రూపపద పరివర్తనము (Contraposition or conversion of the obverse) మొదలయిన వాక్య విపర్యయ పద్ధతు లనేకములు నిర్మించుకొనిరి. అవన్నియు గ్రంథ విస్తర భీతిచే నిచ్చట సవిస్తరముగా వర్ణింపఁబడవు.

న్యాయము (త్రిపాది)

Syllogism

మన న్యాయ శాస్త్రమునందలి న్యాయమునకు నైదు అవయవములు కలవని చదువరులు చూచి యున్నారు. పాశ్చాత్యానుమానము త్ర్యవయవాత్మకము.

మానవులందఱు మరణశీలురు.
దేవదత్తుఁడు మానవుఁడు.
కావున, దేవదత్తుఁడు మరణశీలుఁడు.

పాశ్చాత్యానుమాన మిట్లు మూఁడు పాదములుగా సాధింపఁబడును. కావున, ఈ న్యాయమునకు త్రిపాది (Syllogism) యని పేరు పెట్టుదము. ప్రతి త్రిపాదియందును మూఁడు వాక్యము లుండును. అందు మొదటి రెంటికిని స్వీకృత (Premises) వాక్యము లని పేరు. మన నైయాయికుల సంప్రదాయాను సారము వీనిని హేతు వాక్యము లన వచ్చును.* మూఁడవ వాక్యమునకు సిద్ధాంత వాక్య మని పేరు. మన న్యాయశాస్త్రమునందు దీనిని 'నిగమన' మనియెదరు. చివరదానికి మొదటి రెండును హేతువాక్యములు. సిద్ధాంతమున్న కవి హేతువులు. మూఁడవది ఆ రెండు వాక్యముల కలియికచే వచ్చిన సిద్ధాంత వాక్యము. మొదటి రెండు స్వీకృతవాక్యములు అనఁగా హేతువాక్యములు సత్యములా అసత్యములాయన్న విషయముతో న్యాయశాస్త్రమునకుఁ బనిలేదు. మొదటి రెండు వాక్యములును సత్యము లయినయెడల మూఁడవ వాక్యము తప్పక సత్యమని మాత్రము న్యాయశాస్త్రము చెప్పును.

త్రిపాదియందు మూఁడు వాక్యము లుండును. ప్రతివాక్యమునందును రెండు పదము లుండును. కావున,

త్రిపాదిలోని పదములు

మొత్తము మీఁద, నాఱు పదములుండవలెను. పైని చూపఁబడిన త్రిపాదియొక్క యుదాహరణమున, ఒకటవవాక్యమునందు 'మానవులు' 'మరణశీలురు' అనునవియు, రెండవవాక్యమునందు 'దేవదత్తుఁడు' 'మానవుఁడు' అనునవియు, మూఁడవ వాక్యమునందు 'దేవదత్తుఁడు' 'మరణశీలుఁడు' అనునవియుఁ గలిసి యాఱుపదములయ్యెను. కాని వీనిలో నొక్కొక్క పదము రెండుసారులు వచ్చినది. కావున త్రిపాదియందలి పదములు మూఁడే. మన న్యాయశాస్త్రమునందు నెప్పుడును వాడఁబడు ధూమాగ్ని సంబంధమయిన యుదాహరణముఁ దీసికొందము.

* హిందూ న్యాయ శాస్త్రానుసారము మొదటి వాక్యము ఉదాహరణ వాక్యము, రెండవది హేతు వాక్యము అగును.

ధూమవంతములన్నియు అగ్నిమంతములు.
పర్వతము ధూమవంతము.
కావున పర్వతము అగ్నిమంతము.

ఇందు మూఁడు పదములు కలవు: ధూమవంతము, అగ్నిమంతము, పర్వతము. పై మూఁడు వాక్యములలో మొదటి రెండును హేతువులు (హేతు వాక్యములు), మూఁడవది సిద్ధాంతము (సిద్ధాంతవాక్యము). సిద్ధాంత వాక్యమందలి కర్తృపదమైన పర్వతమునకు గౌణ పదము (Minor term- పక్షము) అనియు, విధేయపదమైన 'అగ్నిమంతము' అనుదానికి ముఖ్యపదము (Major term-సాధ్యము) అనియుపేళ్లు. హేతువాక్యముల రెండింటిలోను కానవచ్చెడి 'ధూమవంత'మను పదమొకటి కలదు. దానిని, మధ్యవర్తిపదము (Middle-term-లింగము) అనియెదరు. ఏ హేతువాక్యము నందు ముఖ్యపదము (సాధ్యము) ఉండునో, అదిముఖ్యహేతువాక్యము(Major-premise-ఉదాహరణము); ఏ హేతువాక్యము నందు గౌణపదము (పక్షము) ఉండునో అది గౌణ హేతు వాక్యము (Minor premise - హేతువాక్యము).

రెండు హేతువాక్యములవలన నొకసిద్ధాంత వాక్యము (నిగమనము లేక ప్రతిజ్ఞ) సాధించుట త్రిపాదియొక్క పనియైయున్నది. య, ర, ల, వ, లని వాక్యములు నాలుగు తెఱంగులు. వానిలో, ఏ రెండువాక్యములను హేతువాక్యములుగాఁ దీసికొన్నను సిద్ధాంత వాక్యము వచ్చునా? రాఁజాలదు. చూడుఁడు.

అగ్ని కాలును.　　(య)
ఏ చూరును నూకాదు.　　(ర)

ఈ హేతు వాక్యమువలన, ఎట్టి సత్య సిద్ధాంతమును సాధింప నలవికాదు. కావున సత్యసిద్ధాంతమును సాధించుటకు త్రిపాదియందలి వాక్యములును పదములును, ఎన్నియుండవలయునో, ఎట్లుండవలయునో, వానిలో వానికి నుండవలసిన సంబంధ మెట్టిదో తెలియఁజేయుసూత్రములు కొన్నిగలవు. వాని నీక్రింద నుదాహరించి చర్చించెదము.

సూత్రములు

౧. ప్రతిత్రిపాదిలోను మూఁడే పదము లుండవలెను. మూఁటికంటె నెక్కుడుగాని తక్కువగాని పదము లుండఁగూడదు. ఇందలి యొక్కొక్కపదమును ఒక్కొక్క యర్థమునందే వాడవలయును. ఈ మూఁడు పదములకు ముఖ్యపదమనియు, గౌణపదమనియు, మధ్యవర్తిపదమనియు పేర్లు. ఒక్కొక పద మొక్కొక యర్థమునందే వాడక, ఒకసారి యొక యర్థమునందును మఱి యొకసారి మఱి యొక యర్థమునందును వాడిన యెడల పదముల సంఖ్యమూఁటికంటె మించిపోవును. అనుమాన మనఁగా రెండు పదములను మూఁడవ పదముతోఁ బోల్చిచూచి యా రెండుపదముల సంబంధమును నిశ్చయించుట గనుక త్రిపాదియందు మూఁడే పదము లుండవలయును.


౨. ప్రతిత్రిపాదియందును మూఁడే వాక్యములుండవలయును. మూఁటికంటె నెక్కుడుగాని తక్కువగాని వాక్యము లుండఁగూడదు. ఈవాక్యములకు ముఖ్యహేతువనియు, గౌణహేతువనియు, సిద్ధాంతమనియు నామములు.

౩. మధ్యవర్తి (హేతు) పదము రెండు హేతు వాక్యములందును ఉండి ఒక హేతు వాక్య మందయినను వ్యాప్తిఁ జెంది యుండవలయును.

ఇది ముఖ్యమయిన సూత్రము. మధ్యవర్తిపదము (లింగము) ఒకహేతువాక్యమందయినను వ్యాప్తిఁ జెందనియెడల దానితో ముఖ్యగౌణపదములను పోల్చుటకు వీలులేదు. మధ్యవర్తి పదముయొక్క యొక భాగమునకు ముఖ్యపదముతో సంబంధముండవచ్చును; మధ్యవర్తి పదముయొక్క రెండవ భాగముతో గౌణపదమునకుసంబంధముండవచ్చును. ఇట్లు ముఖ్య పదమునందు ఏకదేశాంతర్వర్తియు, గౌణ పదమునం దన్యదేశాంతర్వర్తియునగు మధ్యవర్తి పదము ముఖ్యగౌణపదములకు సంబంధము కూర్ప నేరదు. ఇది యుదాహరణమువలన స్పష్టమగును.

రాజులందఱు మానవులు (ముఖ్యహేతువు)
ప్రజలందఱు మానవులు (గౌణహేతువు)
కావున ప్రజలందఱు రాజులు (సిద్ధాంతము)*

ఈ త్రిపాది యందలి సిద్ధాంత మపసిద్ధాంతము; సరియయినది కాదు. ఈ పొరబాటునకుఁ గారణమేమి? 'మానవులు' అను మధ్యవర్తిపదమునకు వ్యాప్తిలేక పోవుటయే దీనికి హేతువు. ఈపదము రెండు హేతువాక్యము లందును య వాక్యమందలి విధేయ పదమైనందున దీనికి వ్యాప్తిలేకపోయె. ఈక్రింది చతుష్కోణముం జూడుఁడు.



పెద్ద చతుష్కోణము 'మానవులు' అనుకొనుఁడు. అందులోనియొక చిన్న చతుష్కోణము రాజులు. మఱియొక చిన్న చతుష్కోణము ప్రజలు; ఈ చిన్న చతుష్కోణములు పెద్ద చతుష్కోణము యొక్క ఏకదేశాంతర్గతము

* ముఖ్యహేతువునకు ఉదాహరణవాక్యము లేక వ్యాప్తివాక్యమనియు, గౌణహేతువునకు హేతువాక్యమనియు లేక ఉపనయవాక్యమనియు, సిద్ధాంతమునకు నిగమనవాక్యనియు, లేక ప్రతిజ్ఞయనియు పేరుపెట్టిన యెడల మననైయాయికులకు బాగుగనర్థమయ్యెడి నని తోఁచుచున్నది.

లయినను ఒక దానితో మఱియొక దానికి సంబంధములేక విడివిడిగా నున్నవి.

౪ ఒక్క హేతువాక్య మందయినను వ్యాప్తిలేని పదము సిద్ధాంతమునందువ్యాప్తిం జెందఁగూడదు.

మంచి ప్రజలందఱును రాజభక్తులు (ముఖ్యహేతువు)
మంచి ప్రజలందఱును తెలివిగలవారు(గౌణహేతువు)
కావున తెలివిగలవారందఱును రాజభక్తులు (సిద్ధాం)

ఇది అపసిద్ధాంతము. ఏల? గౌణహేతు వాక్యమునందలి 'తెలివిగలవారు' అనుపదము నకు (యవాక్యమందలి విధేయపద మగుటచే) వ్యాప్తిలేదు. సిద్ధాంతమునందు నది య వాక్యము యొక్క కర్తృపద మగుటచే దానికి వ్యాప్తి గలిగినది. కావున నిది యపసిద్ధాంత మయినది. పై హేతువులనుబట్టి 'కొందఱు తెలివిగలవారు రాజభక్తులు' అని సిద్ధాంతముచేసిన నది సరియైన సిద్ధాంత మగును.

౫ రెండు హేతువాక్యములును అభావరూపములయినయెడల వానినుండి ఏ సిద్ధాంతమును సాధింప నలవికాదు.

పక్షులు చేపలుకావు.
చేపలు పురుగులు కావు.

ఈ హేతువాక్యముల ననుసరించి మనము పక్షులను గుఱించిగాని పురుగులనుగుఱించి గాని యెట్టి సిద్ధాంతమును సాధించుటకు వీలులేదు.

౬ ఒకహేతువాక్యము అభావరూప మయ్యెనేని సిద్ధాంతముకూడ అభావరూప ముగ నుండును.

౭ హేతువాక్యములు రెండును ఏకదేశీయములయినయెడల నే సిద్ధాంతము సాధింప నలవికాదు. అనఁగా హేతు వాక్యములలో నొక్కటియైనను సర్వదేశీయముగా నుండవలయును.

౮ హేతువాక్యములలో నొక్కటి ఏకదేశీయముగ నుండెనేని సిద్ధాంతముగూడ ఏకదేశీయవాక్యముగ నుండును.

పై సూత్రములనుబట్టి ఎట్టి త్రిపాదులు సుసిద్ధాంతముల నిచ్చునో, యెట్టివి యీయవో మనము నిశ్చయింప వచ్చును.- య,ర,ల,వ, లను నాలుగు వాక్యములలో నుండి రెండు రెండువాక్యములు విడఁదీసి హేతుద్వయముగ నమర్చి, ఏయే హేతు ద్వయము సుసిద్ధాంతముల నీయఁగలదో, యేది యేది యీయ లేదో కనుగొందము. య, ర, ల, వ, వాక్యములను రెండు రెండుగా నమర్చినయెడల పదునాఱు గుంపు లగుచున్నవి.

య య	ర య	ల య	వ య
య ర	ర ర	ల ర	వ ర
య ల	ర ల	ల ల	వ ల
య వ	ర వ	ల వ	వ వ

పైని ఈయఁబడిన యేడవ సూత్రము ననుసరించి రెండుహేతువాక్యములు అభావరూపములేయైనయెడల సుసిద్ధాంతము నీయఁ

జాలవు. కావున పై జతలలోనుండి, రర, రవ, వర, వవ, అను నాలుగు జతలు మనకు అనుపయోగములు. అట్లే హేతువాక్యములు రెండును, ఏకదేశీయములైన యెడల సిద్ధాంతము నీయఁ జాలవన్న యేడవ సూత్రము ననుసరించి లల, లవ, వల, అను మూఁడు జతలు కూడ మనకు పనికిరావు. నాలుగవ సూత్రము ననుసరించి, లర, జతయు పనికి మాలినదే. ఇట్లెనిమిది జతలు పోఁగా, ఎనిమిది జతలు మిగిలినవి.

(౧) యయ (౫)రయ (౭)లయ (౮)వయ
(౨) యర ... ...
(౩) యల (౬)రల ... ...
(౪) యవ ... ...

ఇఁక నీ యెనిమిది జతలనుగుఱించి విచారింపవలయును:

శ్రేణులు (Figures) — హేతువాక్యములలోని మధ్యపదము యొక్క స్థలమునుబట్టి త్రిపాదులు నాలుగు శ్రేణులుగా విభజింపఁబడినవి. మధ్యవర్తి పదము (లింగము) ముఖ్యహేతువాక్యము నందు కర్తృపదముగను, గౌణహేతువాక్యమునందును విధేయపదముగను ఉండిన నది ప్రథమశ్రేణి.

మానవులందఱు మరణమొందువారు (ముఖ్యహేతువు)
దేవదత్తుఁడు మానవుఁడు. (గౌణహేతువు)

పై హేతుద్వయమునందు, మానవపదము మధ్యవర్తి పదము (లింగము). ఇది ముఖ్యహేతువునందు కర్తగను, గౌణహేతువునందు విధేయముగను ఉన్నది.

ద్వితీయశ్రేణి — మధ్యవర్తిపదము (లింగము) హేతుద్వయమునందును విధేయపదముగానే యుండెనేని అది ద్వితీయశ్రేణి యగును.

సత్కార్యములన్నియు
భూషణాస్పదములు (ముఖ్యహేతువు)
కొన్ని కార్యములు భూషణా
స్పదములు కావు (గౌణహేతువు)

ఇందు 'భూషణాస్పదములు' మధ్యవర్తి పదము; హేతుద్వయమునందును విధేయపదముగ నున్నది.

తృతీయశ్రేణి — మధ్యవర్తి పదము (లింగము) హేతుద్వయము నందును కర్తృపదముగ నుండెనేని అది తృతీయశ్రేణి యగు.

తిమింగిలము లన్నియు సస్తనములు (ము. హే.)
తిమింగిలములన్నియు జలచరములు (గౌ. హే.)

చతుర్థశ్రేణి — మధ్యవర్తిపదము (లింగము) ముఖ్యహేతువునందు విధేయపదముగను, గౌణహేతువునందు కర్తృపదముగను, ఉండెనేని చతుర్థశ్రేణి యనంబడును.

తిమింగిలములన్నియు సస్తనములు (ము. హే.)
సస్తనములన్నియు వంశాస్తిమంతములు (గౌ. హే.)

ముఖ్యపదమునకు పీ యనియు గౌణపదమునకు శా యనియు మధ్యవర్తి పదమునకు మా యనియు గుర్తులు పెట్టితిమేని, ఈనాలుగు శ్రేణుల నిట్లుచూపవచ్చును.

వాక్యము	ప్రథమ శ్రేణి	ద్వితీయ శ్రేణి	తృతీయ శ్రేణి	చతుర్థ శ్రేణి
ముఖ్య హేతువు	మా—వీ	వీ—మా	మా—వీ	వీ—మా
గౌణహేతువు	కా—మా	కా—మా	మా—కా	మా—కా
సిద్ధాంతము	కా—వీ	కా—వీ	కా—వీ	కా—వీ

అనుమానమునకుఁ బనికి వచ్చునని మనము పైని పెట్టియున్న ఎనిమిది జతలను ఈ నాల్గు శ్రేణులలోఁ బెట్టి, ఏది యేది యక్కరకు వచ్చునో చూతము.

ప్రథమ శ్రేణి

(౧) ఒకటవ జత యయ

య. అన్ని మా లు వీ (ముఖ్యహేతువు)
య. అన్ని కా లు మా (గౌణహేతువు)

ఈ రెండు వాక్యముల వ్యాప్తిని జూచిన నీ క్రింది రెండు సిద్ధాంతము లేర్పడుచున్నవి.

అన్ని కా లు వీ
కొన్ని కా లు వీ

రెండవ సిద్ధాంతము అనఁగా 'కొన్ని కాలువీ' అను దానిని బలహీన సిద్ధాంత మందురు. అది మొదటి సిద్ధాంతములో నన్నగా 'అన్ని కాలువీ' యన్న దానిలో నిమిడి యున్నది. కావున 'అన్ని కాలు వీ' యన్న సిద్ధాంత మే మనకు ముఖ్యము. ఎక్కువ బలముగల సిద్ధాంతమును సాధించుటకు వీలున్నప్పుడు తక్కువ బలముగలసిద్ధాంతముతో సంతృప్తిఁ జెంది యూరకుండఁగూడదు. ఇట్లు 'యయయ' అన్న త్రిపాది సిద్ధించినది. 'యయయ' త్రిపాదియనఁగా నే త్రిపాదియందు ముఖ్యహేతువు య వాక్యముగను, గౌణహేతువు య వాక్యముగను, సిద్ధాంతము య వాక్యముగను ఉండునో అట్టిదియని యర్థము.

(౨) రెండవజత యర.

య. అన్ని మాలు వీ (ముఖ్యహేతువు)
ర. ఏకాయును మా కాదు (గౌణహేతువు)

ఈ హేతుద్వయమువలన నెట్టి సుసిద్ధాంతమును సాధించుటకు వీలులేదు. ఎందుకనఁగా ఒక్క హేతువు అభావరూపము గనుక సిద్ధాంతమును అభావ రూపముగనే యుండవలయును గదా. అట్టి వాక్యములు రెండు.

ఏకాయు వీ కాదు.
కొన్ని కాలు వీ కావు.

ఈ రెంటింటిలోను వీ విధేయ పదంబగుటచే దానికి వ్యాప్తిగలదు ముఖ్యహేతువాక్యమునందు, ఈ పదమునకు వ్యాప్తి లేదు. కావున సిద్ధాంతము లపసిద్ధాంతము లని యర్థము.

(౩) మూఁడవజత యలల.

య. అన్ని మాలు పీ (ముఖ్యహేతువు).
ల. కొన్ని కాలు మా (గౌణహేతువు)
కావున, కొన్ని కాలు పీ. ఇది క్రమమయిన సిద్ధాంతము నిచ్చును. కావున యలల అనునది మన కక్కఱకు వచ్చు త్రిపాది.

(౪) నాలుగవజత యవవ.

య అన్ని మాలు పీ (ముఖ్యహేతువు)
వ కొన్ని కాలు మా కావు (గౌణహేతువు)
రెండవజతవలెనే, యీజతవలనఁ గూడ సుసిద్ధాంతప్రాప్తి కాఁజాలదు. రెండవ జత విషయమయిన కారణము లిచ్చటను వర్తించును.

(౫) అయిదవజత రయర

ర. ఏమాయు పీ కాదు (ముఖ్యహేతువు)
య. అన్ని కాలు మా (గౌణహేతువు)
ర. కావున ఏకాయు పీ కాదు. (సిద్ధాంతము)
వ. లేక కొన్ని కాలు పీ కావు. ,,

రెండవసిద్ధాంతము బలహీన సిద్ధాంతము; ఈ సిద్ధాంతము మొదటి సిద్ధాంతమునందిమిడియున్నది. కావున మొదటి సిద్ధాంతమునే గ్రహింపవలయును. ఇట్లీ శ్రేణిలోఁ బనికివచ్చెడి మూఁడవ త్రిపాది రయర

(౬) ఆఱవజత రలవ.

ర. ఏమాయు పీ కాదు (ముఖ్యహేతువు)
ల. కొన్ని కాలు మా (గౌణహేతువు)
వ. కొన్ని కాలు పీ కావు. (సిద్ధాంతము)
ఇది యీ శ్రేణిలోఁ బనికివచ్చెడి నాలుగవ త్రిపాది రలవ.

(౭) ఏడవజత లయ.

ల. కొన్ని మా లు పీ (ముఖ్యహేతువు)
య. అన్ని కా లు మా (గౌణహేతువు)
ఇందలి మధ్యవర్తిపదమునకు వ్యాప్తి లేమిచే నిందుండి సుసిద్ధాంతమేమియు వెడల నేరదు.

(౮) ఎనిమిదవజత వయ.

వ. కొన్ని మా లు పీ కావు(ముఖ్యహేతువు)
య. అన్ని కా లు మా (గౌణహేతువు)
పై కారణముచేతనే యిందుండియు సుసిద్ధాంతము వెడల నేరదు.

ఇట్లు మొదటి శ్రేణిలోఁ బనికివచ్చెడి త్రిపాదులు నాలుగు. పనికివచ్చెడి త్రిపాదులకు నైయాయికులు సుతర్కములు (సున్యాయములు-Valid moods) అని పేరుపెట్టిరి.

ప్రథమశ్రేణిలోని సుతర్కములు

యయయ, రయర, యలల, రలవ.

మిగిలినమూఁడు శ్రేణులలోను బెట్టి ఈ యెనిమిది జతలను పై విధమున విమర్శించి చూడఁగా, నీ క్రింది సుతర్కములు తేలుచున్నవి:-

రెండవ శ్రేణి

రయర, యరర, రలవ, యవవ.

మూఁడవ శ్రేణి.

యయల, లయల, యలల, రయవ,
వయవ, రలవ.

నాలుగవ శ్రేణి:

యయల, యరర, లయల, రయవ, రలవ.

పైని వర్ణింపఁబడిన నాలుగు శ్రేణులలో

మొదటి శ్రేణి సత్యనిర్ణయమునకు నుత్తమ మైనదని, దానికి పరిపూర్ణశ్రేణియన్న పేరు వచ్చెను. ఇతర శ్రేణులలోని తర్కములను (న్యాయములను) తార్కికులు వాక్యవిపర్యయము ననుసరించి మొదటి శ్రేణిలోని తర్కములుగా మార్చి వాని యోగ్యతను కనుఁగొనియెదరు.

మొదటి శ్రేణిలోని యయయ అను తర్కము నిత్య వ్యవహారమునందును, శాస్త్ర శోధనయందును మిక్కిలి యుపయోగకరము. వ్యాకరణ నియమములఁబట్టి యొకానొక పదము తప్పో యొప్పోయని కనుఁగొనునప్పుడును, వైద్యులు ఒకానొక రోగమును దాని లక్షణమునుబట్టి నిర్ణయించు నప్పుడును, న్యాయసభలలో వాదవిషయము చట్టమునకు లోఁబడినదా కాదాయని వాదించునపుడును, రేఖాగణితమునం దొక సిద్ధాంతమునుఁబట్టి మఱియొక సిద్ధాంతమును సాధించునపుడును, జనులు ఈ తర్కమునే యుపయోగించు కొందురు.

హేత్వాభాసములు

తర్కములోఁ దాను పొరపాటు పడకుండుటయు, నెదటివాఁడు చేయు పొరపాటులను కనుఁగొనుటయు న్యాయ శాస్త్రము నేర్చుకొనినందుకుఁ బరమ ప్రయోజనము. కావున మన న్యాయశాస్త్రమునందువలెనే పాశ్చాత్య న్యాయ శాస్త్రమునందును, హేత్వాభాసములను వివరించెదరు. హేత్వాభాసమనఁగా తప్పువాదమన్నమాట. పాశ్చాత్య శాస్త్రానుసారముగ హేత్వాభాసములు (Fallacies) రెండువిధములు: తర్క హేత్వాభాసములు (Logical fallacies), వస్తుహేత్వాభాసములు (Material fallacies). తర్క హేత్వాభాసములను చర్చించునప్పుడు అందలి వాక్యముల స్వరూపజ్ఞానము చాలును. అందుఁ జర్చింపఁబడిన విషయముయొక్క జ్ఞానముతోఁ బని లేదు. వస్తు హేత్వాభాసములఁ గనుఁగొనుటకు విషయజ్ఞాన మావశ్యకము. తర్క హేత్వాభాసములు మరల రెండువిధములు. కేవల తర్క హేత్వాభాసములు (Purely logical), అర్ధ తర్క హేత్వాభాసములు (Semi-logical). కేవల తర్క హేత్వాభాసములు నాలుగు:-

౧ పదచతుష్టయ హేత్వాభాసము Fallacy of four terms

త్రిపాది (Syllogism) యందు నాలుగు పదములున్న నీ హేత్వాభాసమగును. త్రిపాదియందు పక్ష (Minor), సాధ్య (Major,) లింగము (Middle) లను మూఁడు పదములే (Terms) ఉండవలెను. అంతకంటె నెక్కుడుండఁగూడదని నియమ మిదివఱకుఁ జెప్పఁబడినది. దానికి భంగము కలిగినందున ఈ హేత్వాభాసము తటస్థించును.

ఉదాహరణము:-

ధూమ మున్నచోట అగ్నియుండును
పర్వతముమీఁద నరణ్యమున్నది
కావున, పర్వతముమీఁద నగ్నిగలదు.

అనునది హేత్వాభాసము. ఏల? ఇందు నాలుగు పదములు వచ్చినవి 'ధూమము', 'అగ్ని', 'పర్వతము,' 'అరణ్యము' గనుక.

౨. అవ్యాప్యహేత్వాభాసము
Fallacy of undistributed middle.

త్రిపాది యందలి హేతుపదము (Middle term) సకుపూర్తియైన వ్యాప్తి ఒక్క వాక్యము నందైనను ఉండవలెనని చెప్పి యున్నాము. అట్లు వ్యాప్తిలేని హేతువును తర్కము నందు నుపయోగించిన యెడల ఈ హేత్వాభాసమగును.

ఉదాహరణము:

వైష్ణవులందఱు హిందువులు
శైవులందఱు హిందువులు
కావున వైష్ణవు లందఱు శైవులు.

ఇది హేత్వాభాసము, ఎందుకు? ఇందలి హేతుపదము 'హిందువులు'. అది మొదటి రెండు హేతువాక్యములలోను సర్వదేశీయ వాక్యముల విధేయముగ నుండుటచే దానికి వ్యాప్తిలేదు. ఇట్లు వ్యాప్తిలేని మధ్యపదము (హేతుపదము) ఉపయోగింపఁబడుటచే తర్కము తప్పినది. వాదవివాదములందు ఈ హేత్వాభాసము విశేషముగ వచ్చుచుండును.

3. అక్రమవ్యాప్తి హేత్వాభాసము
Fallacy Eillicit process of the major or minor term

'పక్షము' (Minor term) నకుగాని, సాధ్యము (Major term) నకుగాని, హేతువాక్యములలోవ్యాప్తిలేనప్పుడు సిద్ధాంత వాక్యమునందు వ్యాప్తికల్పించుటవలన ఈ దోషము సంభవించును.

ఉదాహరణము :

రాజులందఱు మానవులు (ము. హే.)
ప్రజలు రాజులుకారు (గౌ. హే.)
కావున ప్రజలు మానవులుకారు. (సిం.)

ఈ త్రిపాదియందు 'మానవులు' అనునది సాధ్యము. సిద్ధాంత వాక్యమునందు దీనికి వ్యాప్తియున్నది. కాని ముఖ్యహేతు వాక్యమునందు దీనికి వ్యాప్తిలేదు. కావున నిది తప్పుసిద్ధాంతము. మానవ వర్గము మిక్కిలి పెద్దది. అందు నొకవైపు రాజు వర్గమును, మఱియొకవైపు ప్రజావర్గమును ఒకరిని ఒకరు తగలక యుండవచ్చును. కావున నిద్దఱును మానవులే.

౪. అభావ హేత్వాభాసము
Fallacy of negative premises.

హేతువులలో నొక్క యభావవాక్యముండిన సిద్ధాంతముకూడ నభావవాక్యముగనే యుండును, రెండు హేతువాక్యములును అభావరూపముగ నున్న సిద్ధాంత మేదియు తేలనేరదు, అని యిదివఱకుఁ జెప్పియున్నాము. ఈ నియమములను ఉల్లంఘించిన యెడల ఈ దోషము వచ్చును.

ఉదాహరణము:-

హిందువులు క్రైస్తవులుకారు.
మహమ్మదీయులు క్రైస్తవులుకారు.
కావున హిందువులు మహమ్మదీయులు.

ఇందలి హేత్వాభాసము స్పష్టము, రెండు హేతువాక్యములు అభావరూపములయి నందున వానివలన, హిందువులకును మహమ్మదీయులకుఁ గల సంబంధము బోధపడనేరదు.

అర్థతర్క హేత్వాభాసములు ఆఱు విధములు:-

ఒక పదము నానార్థములందు నుపయోగించినందున ఈదోషము సంభవించును. ఒక పదము రెండర్థములందుఁ దర్కమునఁగాన వచ్చిన నది రెండుపదములనియే యర్థము.

(౧) పదార్థసంశయ హేత్వాభాసము
Fallacy of equivocation

ఇట్టిది పదచతుష్టయహేత్వాభాసము యొక్క రూపాంతరము.

ఉదాహరణము:

మనుష్యునిఁ జంపినవాఁడు దండనార్హుఁడు
ఉరిశిక్ష విధించిన న్యాయాధీశుఁడు మనుష్యునిఁ జంపినవాఁడు
కావున, ఉరిశిక్ష విధించిన న్యాయాధీశుఁడు దండనార్హుఁడు

ఈ తర్కమునందు 'మనుష్యుని జంపినవాఁడు' అను పదము మొదటి వాక్యమునందొక యర్థమందును, రెండవ వాక్యమునందు మఱియొక యర్థమునందును వాడఁబడినది. మొదటి వాక్యమునందు దానికి 'అన్యాయముగను అధికారము లేకుండగను మనుష్యునిఁ జంపినవాఁడు' అని యర్థము. రెండవ వాక్యమునందు అట్టి యర్థములేదు. ఇట్లు రెండర్థములు హేతువునకుఁ గలుగవచ్చును, సాధ్యమునకుఁ గలుగవచ్చును. సాధారణముగ ఈ హేత్వాభాసము మత సంబంధమైన చర్చలలోను, కోర్టు తగాదాలలోను వచ్చుచుండును.

అన్వయమునందు సంశయముగల వాక్యము త్రిపాదియందు నుండెనేని యీ దోషము సంభవించును. ఒకానొక వాక్యమునందు కర్తృపదమెద్ది విధాయక పదమెద్ది యని సంశయము కలుగునట్టుగ వాక్యముండఁ గూడదు.

౨. వాక్యార్థ సంశయ హేత్వాభాసము
Fallacy of amphibology

పదాంతర్గతములైన యొక్కొక్క వ్యక్తిని గుఱించి మొదటఁజెప్పి, మరల నా సిద్ధాంత మావ్యక్తుల కన్నిటికిఁ గలిపిచెప్పుట వలన ఈ దోషము ప్రాప్తించును. 'ఈ యింటి వాసము లన్నియుఁ బది యడుగుల పొడవు గలవి' యన్న వాక్యమునకు సాధారణముగ, 'ఈ యింటిలోని ప్రతి వాసము పది అడుగుల పొడవుగలది' యని యర్థము. మొదట ఈ యర్థమునందు వాక్యముచ్చరించి, పిదప 'ఈ యింటిలోని వాసములన్ని కలిసి పది యడుగుల పొడవు' అని యర్థము చేసినయెడల తప్పక సిద్ధాంతము తప్పిపోవును.

3 సంయోగహేత్వాభాసము
Fallacy of composition.

సంయోగ హేత్వాభాసమునకు నిది తలక్రిందు. మొదట నొకానొకపదమునకు నరిదలియన్ని వ్యక్తుల సమూహమని యర్థముచెప్పి పిదప నాపద మొక్కొక వ్యక్తినంబంధించినదని యర్థముచేయుటవలన నీ దోషము సంభవించును.

౮ విభాగ హేత్వాభాసము
Fallacy of Division

మాటలాడు వారి యుచ్చారణ భేదమును బట్టి వాక్యమునకు వేఱువేఱు అర్థముప్రాప్తించును. అట్లొకప్పుడొకయర్థము మఱియొకప్పుడు మఱియొకయర్థము చేసినయెడల ఈదోషము సంభవించును. 'పెద్దలతోడ నబద్ధమాడఁగూడదు,'అన్న వాక్యమునందలి 'పెద్దలతోడ' అను పదమును ఒత్తి యుచ్చరించిన యెడల దానికి 'పెద్దలు కాని వారితో నబద్ధమాడవచ్చు' నని తాత్పర్యము కావచ్చును.

౯ కాకు హేత్వాభాసము
Fallacy of accent

కావ్యాదుల యందు నతిశయోక్త్యాదులకుఁ జెప్పఁబడు హేతువులలో ననేకములు హేత్వాభాసములు.

౧౦. అలంకారిక హేత్వాభాసములు
Fallacies of figure of speech

వస్తు హేత్వాభాసములు (Material fallacies) ఏడువిధములు:-

(౧)ఉపాధిసహిత హేత్వాభాసము (The fallacy of accident).

(౨)ఉపాధిరహిత హేత్వాభాసము (The Converse fallacy of accident).

ఈ రెండు హేత్వాభాసములును సంబంధముకలవిగాన కల్పిచెప్పఁబడును. మొదటి దానిలో సామాన్య నియమమునుండి విశేష నియమమును సంబంధములేని యుపాధితోఁ గూడసాధింపఁబడును. రెండవదానిలో దానికి వ్యతిరేకముగ వ్యాపారము జరుగును.

ఉదాహరణము :

నిన్నఁదెచ్చిన వస్తువులన్ని నేఁడు తిన్నావు
నిన్న పచ్చికూరలు తెచ్చినావు
కావున నేడుపచ్చికూరలు తిన్నావు.

ఈ యుదాహరణమునందు 'పచ్చి' యను నుపాధి నిమిత్త మాత్రము. దానితో తర్కమునకు సంబంధములేదు. హేతువాక్యములోని 'తెచ్చిన వస్తువులన్నియు' అనుటలో 'పచ్చివి' యన్న యర్థములేదు.

ప్రతిమానవుఁడును తనమతమును అభివృద్ధిచేయవలెను.
మాజిస్ట్రేటు మానవుఁడు.
కావున మాజిస్ట్రేటు తన అధికారము నుపయోగించి తనమతమును అభివృద్ధిచేయ వలెను.

అను నది హేత్వాభాసము. మాజిస్ట్రేటు మనుష్యుఁడైనను న్యాయము చేయుటకు నొకయధికారము ఉపాధిగాఁ గలవాఁడు. ఆ యుపాధిసహితుని, ఉపాధిరహితునిగా నెంచఁగూడదు.

అన్యునిఁ గత్తితోఁ గోసినవానిని శిక్షింపవలెను
డాక్టరు అన్యునిఁగత్తితోఁ గోయును
కావున డాక్టరును శిక్షింపవలెను.

అను నదియు నిట్టిహేత్వాభాసమే.

ప్రతిజ్ఞతో (తాను రుజువు చేయఁబోవు దానితో) సంబంధములేని హేతువులను చెప్పుటవలన ఈ దోషము సంభవించును. ఇట్టి దోషము పెద్ద పెద్ద వాదవివాదములలో, వాది ప్రతివాదులు దీర్ఘకాలము వాదించి, తుదకు తాము దేనిని గుఱించి వాదించుచున్నారో దానిని మఱచియో, తప్పించియో, మఱియొక దానిని ప్రతిపాదించునపుడు సంభవించును. బలము లేని దావాలో వాదించు ప్లీడర్లకునిది యాధారము. "మంచి కేసు కాని యెడల నెదటి ప్లీడరును తిట్టు" అని యింగ్లీషులో సామెత కలదు. అది దీనికుదాహరణము. వాదములో గెలువలేక ప్రతిపక్షుని, వాని తండ్రిని తిట్టుట యీ హేత్వాభాసము యొక్క యుదాహరణమే.

(౩) అసంబద్ధహేత్వాభాసము.
Irrolevaht conclusion

రుజువు చేయవలసిన సిద్ధాంతమునే హేతువుగా గ్రహించుట. మొదటి దానికి రెండవది హేతువుగఁ జెప్పి, మరల రెండవదానికి మొదటిది హేతువుగఁ జెప్పిన నీ దోషమగును. 'ఆత్మ శాశ్వతము, వినాశములేనిదగుటచే' అన్నది యిందు కుదాహరణము. వినాశము చెందకపోవుటయు, శాశ్వతముగ నుండుటయును సమానార్థకములు. కావున తాను రుజువు చేయవలసిన మాటయే మొదట గ్రహించినాఁడు.

(౪) అన్యోన్యాశ్రయ హేత్వాభాసము
Petitio Principii

ఇట్లు పర్యాయపదములను ప్రయోగించి సిద్ధాంతములను స్థాపింపఁ జూచువారందఱును ఈ దోషమునకుఁ బాత్రులు. "ఈపని నేను చేయఁగూడదు. ఎందుకనగా అది తప్పు గనుక. అది తప్పని నీ కెట్లు తెలియును? అది చేయఁగూడదని నేనెఱుంగుదును గనుక అది తప్పు"; "శ్రీ మహావిష్ణువు అన్ని దేవతలకంటెఁ గొప్పవాఁడు. ఎందుకు? విష్ణు పురాణమునందుఁ జెప్పఁబడినది గనుక. అందునట్లేల చెప్పఁబడియున్నది? శ్రీమహావిష్ణువు గొప్పవాఁడు గనుక" అన్న వాదములు పరస్పరాశ్రయ దోష దూషితములు. ఈ దోషమునకు సిద్ధసాధనము అనియుఁ బేరు పెట్టవచ్చును.

హేతువాక్యములకును సిద్ధాంతవాక్యములకును ఏవిధమైన సంబంధమును లేనప్పుడు ఈ దోషము సిద్ధించును.

(౫) అసిద్ధహేత్వాభాసము
The fallacy of the consequent

ఆంధ్రదేశము గొప్పది
చంద్రగుప్తుఁడు గొప్పచక్రవర్తి
కావున చంద్రగుప్తుఁడు ఆంధ్రుఁడు

ఈ దోషము పైరూపముగ నున్న త్వరగా కనుఁగొనవచ్చును కాని యీ క్రిందిరూపముననున్న కనుఁగొనుట కష్టము.

ప్రతివాఁడు సుఖముగోరును
సజ్జనులు సుఖులుగనుందురు
కావున ప్రతివాఁడు సజ్జనుఁడు.

తగిన హేతువులు లేనిదే యొక కార్యమునకు నొకవస్తువుకాని, వ్యాపారముగాని హేతు

వనియెంచుట. తోకచుక్కలు భూమిమీఁద శుభా శుభములకుఁ గారణ మనుకొనుట యు తుమ్ములు, కార్య విఘ్న సూచకము లనుకొనుటయు దీనికి నుదాహరణములు.

౬ హేత్వ విపర్యాస హేత్వాభాసము
The fallacy of the false cause

కొన్ని ప్రశ్నలు కలిపి యొక్క ప్రశ్నగా నడిగినఁ గొన్ని సమయములయందు బ్రత్యుత్తర మిచ్చుటకు వీలుగ నుండదు. 'నీవు నీ తల్లిని కొట్టుట మాని తినావా?' అను ప్రశ్నకు 'అవును' అని జవాబు చెప్పినను, 'లేదు' అని చెప్పినను విపరీతార్థము నిచ్చును. 'అవును' అనఁగా నిదివఱకు కొట్టుచుంటినని యర్థము. 'లేదు' అనిన ఇదివఱకు కొట్టుచుంటిని, ఇంకను కొట్టుచున్నాను అని అర్థము. తెలివి గలవాఁడయినగాని ఈ మర్మము కనుఁగొని 'నేను ఎన్నడును మా యమ్మను కొట్టలేదు' అని జవాబు చెప్పఁజాలఁడు. సాక్షులను క్రాసు-ఎగ్జామిన్ చేయునప్పుడు వకీళ్లు ఇట్టి ప్రశ్నలు వేయుచు, 'అగును, లేదు' అని జవాబు చెప్పుమని బెదరించు చుందురు. అట్లు జవాబు చెప్ప నక్కరలేదు.

౭ అనేక ప్రశ్న హేత్వాభాసములు
Fallacy of many questions

ఇంతవఱకు వ్యాప్తిసాధకాను మానము (Deductive reasoning) నుగుఱించి చెప్పితిమి. వ్యాప్తిసాధ్యానుమానము (Inductive reasoning)నుగుఱించియుఁ బాశ్చాత్యన్యాయ శాస్త్రమందలి యితర విశేషములను గుఱించియు 'తర్కము' 'న్యాయము' అనుశబ్దముల యొద్ద వ్రాయఁబడును. [కో. ల.

పారిభాషిక పదములు

వ్యాప్తిసాధకానుమానమును గుఱించిన పారిభాషిక పదముల నీక్రిందనిచ్చెదము. ఈపట్టిక తర్కశాస్త్రసంబంధమైన పాశ్చాత్యపౌరస్త్య గ్రంథములను పెక్కింటినిచూచి సమకూర్పఁబడినది. నాగరీప్రచారిణీసభవారి శాస్త్రీయపదపారిజాతమును, (Glossory of Scientific Terms), ప్రొఫెసర్ రానడేగారి ఇరువదవ శతాబ్దాంగ్ల మహారాష్ట్ర కోశమును (Pro. Ranade's Twentieth Century English Marathi Dictionary)కూడ నుపయోగించినాము. కొన్ని యింగ్లీషుపదములకు రెండుమూఁడు పర్యాయపదము లీయఁబడినవి. అట్టియెడ నీయనుమాన వ్యాసమునందు నుపయోగింపఁబడినపదము మొదటను, మిగిలిన పర్యాయ పదములు తరువాతను వ్రాయఁబడినవి.

Affirmative భావ, విధాయక, అస్తిత్వబోధక.
,, proposition భావవాక్యము,
Between the horns of the dilemma వికల్ప జాల బంధమునందు, ఉభయసంకటములో, ఉభయతః పాశారజ్జువు
Casuist ధర్మశాస్త్రి, తర్కప్రవణుఁడు
Categorical proposition నిశ్చయార్థకవాక్యము
Conclusion సిద్ధాంతము, నిగమనము
Concomitance సాహచర్యము, సహభావము
Concomitant
absence వ్యతిరేకవ్యాప్తి
presence అన్వయవ్యాప్తి
Connotation ధర్మార్థము, గుణసూచకము, జాత్యర్థము, సామాన్యాభిధానము
Connotative గుణబోధకము, జాతివిశిష్టవ్యక్తి బోధకము

Contradiction పరస్పరవైరము
Contradictory పరస్పరవిరోధి
Contraposition రూపపదపరివర్తనము, నిషేధవ్యవస్థాపనము
Contrariety వైరము, వైపరీత్యము
Contrary వైర, విపరీత
Converse పదపరివర్తిత
Conversion పదపరివర్తనము, ఉద్దేశ్యవిధేయ పరివర్తనము
Copula సంయోజకపదము, (ఉద్దేశ్యవిధేయ) సంయోజకము
Deceptive reasoning ఛలము
Deduction నిగమనానుమానము
Deductive Logic వ్యాప్తిసాధకానుమానము, నిగమనవిద్య
Defective syllogism దుష్టానుమానము
Denotation సంఖ్యార్థము, వ్యక్త్యర్థము, విశేషాభిధానము
Destructive dilemma నిషేధాత్మకవికల్పము
Destructive Sorites నిషేధాత్మకన్యాయ శృంఖల
Dialectics తర్కశాస్త్రము
Dictum de Omni et Nullo యద్వర్గేతదేకస్మిన్
Differentia వ్యావర్తకము
Dilemma వికల్పజాలము
Disjunctive వైకల్పికము
Distribution of terms పదములకువ్యాప్తి
Exceptive proposition అపవాదకప్రతిజ్ఞ
Exclusive proposition నిరాసకప్రతిజ్ఞ
Extensive syllogism విస్తారకానుమానము
Fallacious reasoning తర్కాభాస, దుష్టతర్కము,
Fallacies హేత్వాభాసములు, నిగ్రహస్థానములు
Logical తర్క హే.
Semi Logical అర్ధతర్క హే; మిశ్ర హే.
Material వస్తు హే, వాస్తవ హే, వ్యాప్త్యాభాసము,
Amphiboly వాక్యార్థసంశయ హే. సందిగ్ధార్థత, ద్వ్యర్థకథ.
Accent కాకు హే.
Four terms పదచతుష్టయ హే.
Undistributed middle అవ్యాప్య హే.
Illicit Major అక్రమసాధ్యవ్యాప్తి హే.
Illicit Minor అక్రమపక్షవ్యాప్తి హే.
Negative premises అభావ హే.
Equivocation పదార్థసంశయ హే.
Ambiguous terms వాక్ఛలము.
Composition సంయోగ హే.
Division విభాగ హే.
Figure of speech అలంకారిక హే.
Accident ఉపాధిసహిత హే, సోపాధిక హే.
Petitio Principii అన్యోన్యాశ్రయ హే, సిద్ధసాధ్యము, ప్రకరణసమము.
Complex Question అనేక ప్రశ్న హే.
Irrelevant conclusion అసంబద్ధ హే.
Consequent అసిద్ధ హే.
False cause హేతువిపర్యాస హే.
Figure (త్రిపాది) శ్రేణులు, అనుమానవాక్యప్రకారము
Hypothetical proposition సాపేక్షవాక్యము
Immediate inference సాక్షాదనుమానము, అవ్యవహితానుమానము
Induction వ్యాప్తిసాధ్యానుమానము, వ్యాప్తిగ్రహ, ఆగమన (అనుమానము.)
Inductive Logic వ్యాప్తివాదము, వ్యాప్తి సాధ్యానుమానము
Inference తర్కము, అనుమానము

Law of న్యాయము, సూత్రము

Identity ఏకార్థక న్యాయము, తాదాత్మ్య న్యా.

Contradiction పరస్పరవైరుధ్యన్యాయము

Excluded middle తృతీయపక్షాభావన్యాయము, మధ్యమ నిరాసన్యాయము

Logic తర్కశాస్త్రము, న్యాయశాస్త్రము, అన్వీక్షికీ

Logician తార్కికుఁడు, నైయాయికుఁడు

Major premise ముఖ్యహేతువాక్యము, ఉదాహరణము, వ్యాప్తివాక్యము, అనుగమవాక్యము, వ్యాపకపూర్వావయవము

Major term సాధ్యము, వ్యాపకపదము

Mediate inference అనుమానము

Middle term లింగము, హేతుపదము, మధ్యపదము

Minor premise గౌణహేతువాక్యము, హేతువాక్యము, ఉపనయము, వ్యాప్యపూర్వావయవము

Minor term పక్షము, వ్యాప్యపదము

Moods తర్కములు

Negation అభావము, నిషేధము, ప్రతిషేధము

Negative అభావ (పదము, వాక్యము)

Obversion రూపపరివర్తనము, ప్రతివర్తనము, వ్యాప్యవ్యాపకవిరుద్ధప్రతిషేధము

Opposite side విపక్షము

Opposite term విరోధిపదము

Opposition వైరము, విరోధము, విపక్షత, ప్రతియోగము

Opposition of Proposition వాక్యవిరోధము

Particular proposition ఏకదేశికవాక్యము

Predicate విధేయము

Predication విధానము

Premise హేతువాక్యము, స్వీకృతవాక్యము

Proposition వాక్యము

Quality of a proposition వాక్యరూపము, స్వరూపము, గుణము

Quantity of a proposition వాక్యవ్యాప్తి

Ratiocination తర్కము, అనుమానము

Sorites న్యాయావలి

Sub-altern ఆభాస వైరి

Sub-alternation అభాసవైరము

Sub-contrariety కించిద్వైరము

Subject కర్తృపదము

Syllogism న్యాయము, త్రిపాది, తర్కము, అనుమానవాక్యము, త్ర్యవయవి

Term పదము

Universal proposition సార్వదేశిక, సర్వవ్యాపి, సర్వగత, సార్వలౌకిక (వాక్యము)

అనుము. (Dolichos Lablab):-ఇది చిక్కుడు కుటుంబములోఁ జేరిన యొకజాతి మొక్క. మొదటఁ గొంతవఱకు గుబ్బగ నెదిగి పిమ్మట తీగగసాగును. ఆకులు చిక్కుడాకుల వలెనే 3 ఉపదళములు గలిగి యుండును. కాయలును గొంచె మించుమించు చిక్కుడు కాయలనే పోలియుండును.

అనుము ఇండియాదేశమందంతటను సాగుచేయఁబడుచున్నది. అనేకచోట్ల వన్యస్థితియందునుగానవచ్చుచున్నది. హిమాలయములపై నేడువేల యడుగులు ఎత్తువఱకు నిది పెరుగుచున్నది. ఇండియాదేశమే యీ మొక్కకు ఆదిస్థానమని యూహింపఁబడుచున్నది. మూఁడువేల సంవత్సరములకుఁ బూర్వమే జనులు దీనినెఱిఁగి సాగుచేయుచుండినట్లు చరిత్రకారు లూహించుచున్నారు. ఇండియానుండియే యిది చీనా ఈజిప్టు

పర్సియా మొదలగు దేశములను వ్యాపించి యుండును.

ఇండియా దేశమున దీనిసాగు మధ్యమ, పశ్చిమ దక్షిణభాగములందు మెండు. ఉత్తర హిందూస్థానమునఁ దక్కువ. చెన్నపురి రాజధానిలో బళ్లారి, కడప, కోయంబత్తూరు, సేలము, దక్షిణార్కాడు, తంజావూరుజిల్లాలీసస్యము సాగుచేయఁబడు ప్రదేశములలో ముఖ్యములు.

అనుములోఁ బెక్కురకములు గలవు. గింజల వర్ణమునుబట్టి వీనిని తెలుపు ఎరుపు నలుపు తరగతులుగ విభాగించవచ్చును. బొంబాయిరాజధానిలోను కొన్నియితర ప్రదేశములందును తోటపైరుగ సాగుచేయఁబడు రకములును మెట్టసస్యముగ సాగుచేయఁబడు రకములును వేర్వేఱుగ పరిగణింపఁబడుచున్నవి.

అనుము తొలకరిలో చోడి, కంది, ఆముదములు మొదలగు సస్యములలోఁగలిపి సాగుచేయుటవాడుక. సెప్టంబరు, అక్టోబరు నెలలలో పునాస పంటకోతలకు పిమ్మట దీనిని సాగుచేయుటయుఁ గలదు. ధుంపవరి నెల్లలలో వరి కోసిన పిమ్మట జనవరినెలలో దీనిని సాగుచేయుదురు.

అనుమునకు బంకగరువులును, గరుములును అనుకూలములు. నేలను ౩, ౪ చాళ్లదున్ని నాగటిచాలులో విత్తులను అడుగున కొకటి చొప్పునవేసి కప్పవలెను. ప్రత్యేకము జిల్లునెడల ఎకరమునకు ౧౬-౨౦ సేర్ల విత్తులు పట్టును. ౫, ౬ నెలలలో పంటపూర్తియగును. సామాన్యముగ ౪౦-౬౦ కుంచములు యనుములునవి ౧ బండిబొత్తును అగును.

అనుపచేని కొకవిధమగుపేను తరుచు పట్టుచుండును. గొంగళి పురుగులును ఒక్కొకప్పుడు నష్టమును గలిగించుచుండును. ఇతర పయరసస్యములకు వలెనే దీనికిని పూతకాలమున మబ్బులును తేమగాలియుఁ బ్రతికూలము. అనుములు మనుష్యులకును పశువులకునుగూడ ఆహారముగ నుపయోగించును. సాతాళించిన యనుములు చాలచోట్ల అంగళ్ళలోవిక్రయింపఁబడుచుండును. పచ్చికాయలలోని గింజలు కూరలలో నుపయోగింతురు. అనుపగుగ్గిళ్లు పశువులకు మంచిదాణా. అనుపబొత్తు పశువులకుఁ బ్రియము.

అనుముల యొక్కయు, అనుపబొత్తుయొక్కయు పృథక్కరణ మీక్రింద వివరింపఁబడును.

	అనుములు	అనుపబొత్తు
తేమ	౯.౫౯	౧౯.౯౨
ఆల్బుమినములు	౨౧.౩౫	౧౩.౩౭
కర్బనోజ్జనితములు	౫౭.౨౩	౪౩.౦౩
చమురు	౧.౨౫	౩.౭౨
నారపదార్థము	౬.౫౭	౧౬.౧౭
బూడిద	౪.౦౧	౧౩.౭౮

అనుము పశువుల మేతకొఱకుఁ బ్రత్యేకముగ బెంచఁదగిన సస్యములలోనొకటి. పచ్చియెరు

వునక్షును దీనిగొట్టి ప్రశస్తము. ఇందు నూటికి ౦.౭౫ పాలు నత్రజనియు ౦.౧౯౬ పాలు స్ఫురత్వంచామ్లజనిదమును ౦.౫౬ పాలు పోటాషును గలవని లెక్కవేయఁబడెను.

అనుములు నలుగగొట్టి నీటిలో నానవేసిన యెడల నొకొక్కప్పుడు ఉదజసయని కామ్లము (Hydocyanic acid) అను విషద్రవ్యము జనించునని డాక్టరు వెదరుగారు కనుఁగొనిరి.

[గో. జో.

అనుయాయి. ధృతరాష్ట్రుని నూర్గురు పుత్రులలో నొక్కఁడు.

అనురాధపురము. సింహళ ద్వీప మండలియొక్క పురాతనపట్టణము, బౌద్ధక్షేత్రము. పూర్వమిది మహావైభవ మనుభవించిన పట్టణమైనను ప్రస్తుతము విధ్వంసమై జీర్ణస్థితి యందున్నది. మొత్తముమీఁద ౧౫౦౦ సంవత్సరముల వఱకును సింహళమునకు ముఖ్యపట్టణముగ నుండెను.

'గౌతమబుద్ధుఁడు నిర్వాణమునందిన సంవత్సరముననే విజయ నేనుఁడను వాఁడార్యావర్తమునుండి బయలుదేరి సింహళమునకు వెళ్ళి, యచ్చట రాజయ్యెను' అని సింహళ చరిత్రమును దెలుపు మహావంశమువలనఁ దెలియుచున్నది. ఈతఁడే యాదేశమునందు బౌద్ధమతమును వ్యాపింపఁజేసెను.

ఇతని కనురాధుఁడను తమ్ముఁడు గలఁడు. ఆతఁడు క్రీ. పూ. ౬-వ శతాబ్దమున 'అనురాధపురమ్మును' ప్రతిష్ఠించెను. ఇది మొదట నొకచిన్న పల్లె. క్రీ. పూ. ౪౩౭ ప్రాంతమున పాండుకాభయుఁడను రాజు సింహళము నేలుచుండెను. ఆతఁ డనూరాధ పట్టణమును బెంచి పెక్కుమేడలను, ఉద్యాన వనములను నిర్మించి, మహాపట్టణముగ మార్చి, తనరాజధానిం జేసి కొనియెను గావున నిది అథమపక్షమున రెండువేల నాలుగువందల సంవత్సరముల పురాతనపట్టణము. దీనిచుట్టుకొలత ముప్పదిరెండు క్రోశములు.

ఈ రాజు జయవాపియను గొప్పతటాకమును నిర్మించెను. దానినే రాజుపేర అభయవాపియనియుఁ జెప్పుచుండిరి. ఈ తటాకమిప్పటికిని గొంత వఱకుఁ గానవచ్చును. ఇప్పుడు గానవచ్చుదాని కొల్త రెండుమైళ్లు. దీని యొడ్డుననే రాజు నూతన పట్టణమును గట్టించెను. దీనికినాలుగు సిద్వార్లను, సమాధిస్థలమును, వేటవాండ్రు మొదలగు వారికి వేఱుపల్లెయు, దేవాలయములును, జైనులు ఆజీవికులు మొదలైన మతమతాంతరులకు నైమఠములును, వేఱువేఱుగ నిర్మించెను. పట్టణమున కుత్తరమున గామినీతటాకముఁ ద్రవ్వించెను. ఇప్పుడు దానిని విలాన్ తటాకమందురు.

ఈ పట్టణముయొక్క వైభవమును, శోభను, కీర్తిని పెంపుచేసినవాఁడు తిస్సరాజు. ఈతఁడు క్రీ.పూ. 3 వ శతాబ్దమధ్యమున నుండెను. కావున నితఁడు అశోకమహారాజుతో సమకాలికుఁడు. ఈ యిద్దఱురాజు లొకరి

నొక రెన్నడును జూచుకొనక పోయినను, మిక్కిలి స్నేహముగలవారై బౌద్ధమతాభివృద్ధిఁ జేసిరి. తిష్యుఁడు బౌద్ధమతము నవలంబించి బౌద్ధులకు వంద్యమగు బోధివృక్షమును ఈగ్రామమునందుఁ బాతించిదానిచుట్టు మహావిహారమును నిర్మించెను. గయలోని నటవృక్షముయొక్క కొమ్మనొకదానిని అశోకుఁడు తిష్యునకుఁబంపెనట. దానినేయాతఁడు బోధివృక్షముగఁ బాతించెను. ఇట్లు రమారమి ౨,౨౦౦ సంవత్సరముల క్రిందఁ బాతఁబడిన వృక్షమిప్పటికిని జీవించియున్నది. ఈ వృక్షమచ్చటఁ బాతఁబడినప్పటినుండియు నాస్థలము బౌద్ధులకు పుణ్యక్షేత్రమయ్యెను.

ఈ బోధివృక్షము యొక్క పీఠస్థానమునకు మహావిహారమనిపేరు. ఈ విహారమునందు రెండుమహా భవనములు కలవు. అవి మిక్కిలి మనోహరములుగ కట్టఁబడినవి. ఈ వృక్షమును జూచుటకై దూరదూర దేశములనుండి బౌద్ధులు వచ్చుచుండిరి. క్రీ. శ. ౩౯౯ లో 'ఫాహియాన్' అను చీనాపరివ్రాజకుఁడీవృక్షమును సందర్శించెను. ఈ వృక్షముక్రింద నైదుగురు బుద్ధులు సిద్ధించిరని యాదేశపువారు చెప్పెదరు.

ఈ మహావిహారమునకుఁ గొంతదూరము స్తూపాకారమైన యొకచైత్యముగలదు. ఇందు బుద్ధదేవుని అస్థులు సమాధి గావింపఁబడినవని చెప్పెదరు. ఈ చైత్యమును క్రీ. పూ. ౩౦౭-వ సంవత్సరమునఁ దేవప్రియ తిష్యుఁడను రాజు నిర్మించెను. ఈ రాజుపై బుద్ధదేవునకు నెక్కుడు కృపయుండుటచే బుద్ధదేవుని కుడివైపు అస్థివచ్చి ఈ రాజుముకుటముపై నిల్చెనట. అతఁడు దానిని భక్తిపూర్వకముగ స్వీకరించి దానిపై నీ చైత్యమును నిర్మించెనట. ఇట్లే ఇచ్చట మఱికొన్ని పురాతన నిర్మాణములు గలవు.

ఈ రాజే పట్టణమునందుఁ బదిగ్రొత్తమందిరములను బౌద్ధమతాభివృద్ధికై కట్టించి పట్టణము శోభ హెచ్చించెను. ఇవన్నియు నిప్పుడు జీర్ణములై పోయినను, ఆమందిరములలోని కొన్నిశిలాభాగములు మాత్రము తమపూర్వవైభవమును వెల్లడిచేయుచున్నవి. బౌద్ధకాలపు శిల్పకళా కౌశలమును జూపునట్టి ముఖ్యస్థలములలో నిదియొకటి. ఇచ్చట థూపారామము, మునివిహారము అనుకట్టడము లింకను గానవచ్చును. రాజకీయోద్యోగమునుండి సన్యసించిన వారుండుటకునై మునివిహారము నిర్మింపఁబడియె.

తిస్సరాజు మరణానంతరము కొద్దికాలమునకే తమిళులు (అఱవవారు) ఈ పట్టణమును స్వాధీనపరచుకొనిరి. కాని యొకశతాబ్దానంతరము, వారియొద్దనుండి దుష్టగామిని అభయుఁడను వాఁడీపట్టణమును స్వాధీనపరచుకొనెను. ఇతఁడే పట్టణమున నూతన మందిరముల నిర్మించెను. అందు కంచురాజమందిరమన్నది మిక్కిలి విఖ్యాతి వడసెను. ఇయ్యది సమచతుష్కోణాకారమైన యరుగుమీఁద వేయి

రాతి స్తంభములు నిలిపి వానిపైఁగట్టఁబడినది. ఈచతుష్కోణముయొక్క యొక్కొక్క భుజము ౧౫౦ అడుగులు పొడువుండెను. ఈ స్తంభములు నిప్పటికిని చూడవచ్చును. ఈ స్తంభములమీఁద చతుష్కోణాకారముగఁ గ్రింది దానికంటెఁబైది చిన్నదిగ నుండునట్లు తొమ్మిది యంతస్తుల మేడఁగట్టఁ బడియె! ఈ మేడక్రిందినుండి పైవఱకు ౧౫౦ అడుగులెత్తుండెను, ఈభవనమంతయుఁ గొయ్యతోఁ జేయఁబడియె. చివరయంతస్తుమీఁదఁ గంచుతోఁ జేయఁబడిన పెంకులు కప్పఁబడియుండెను. దీనికంతకును ముప్పదికోట్లు రూపాయలు వ్యయమయ్యెనని మహావంశమునందుఁ జెప్పఁబడినది (౨౭.) !

ఈ రాజే వేయికోట్లరూపాయలు వెచ్చించి 'హేమావతి' (బంగారముతోఁ జేయఁబడిన) దాగోబను మందిరమును నిర్మించెనఁట. కాని యిది యీరాజుకాలములోఁ బూర్తికాలేదు. ఈ బంగారు దాగోబము, దానిరచన, శోభ మొదలయిన వానిని విపులముగ మహావంశమను కావ్యమునందు నైదు సర్గములలో (౨౮-౩౨) వర్ణించియున్నాఁడు.

క్రీ. పూ. ౧౦౯ లో తమిళులు మరల నీపట్టణమును పట్టుకొనిరి. క్రీ. పూ. ౮౯ వ సంవత్సరమునందు సింహళ దేశజుఁడైన వత్తగామిని అనువాఁడు ఈపట్టణమును తమిళుల యొద్దనుండి తీసికొనెను. ఈతఁడు తన విజయ సూచకముగ అభయగిరిదాగోబమను మందిరమును కట్టించెను.

తరువాత కాలమునను రాజులును, మంత్రులును, ఇతర శ్రీమంతులును ఈపట్టణము నందు గొప్పగొప్ప మందిరములను కట్టించిరి. క్రీ. శ. ౪వ శతాబ్దమునందుఁ గట్టఁబడిన జేతవనాశ్రమము అనునది యింకను కొంతవఱకు మంచిస్థితియందున్నది.

విద్యా పీఠము

అయిదవ శతాబ్దప్రారంభమునందు ఫాహియాను అను చీనాపరివ్రాజకుఁడు ఇచ్చట విద్యాభ్యాసమునకై రెండు సంవత్సరములు (౪౧౧-౪౧౨) ఉండెను. ఆతని కాలమందు నిచ్చటఁ గొప్ప విద్యాపీఠ మొకటి కలదు. ఉత్తర దేశమందు 'నాలంద' విద్యాపీఠమునకు నెట్టి ఖ్యాతికలదో యట్టి ఖ్యాతియే దక్షిణమున 'అను రాధపుర' విద్యాపీఠమునకుండెను. సామాన్యజనులకై, ధర్మశాస్త్రము జ్యోతిషము, నీటిపారుదల (చెరువులు నిర్మించుట, కాలవలు త్రవ్వుట మొదలైనవిద్య) కవిత్వము; సాహిత్యము అను విషయములు నేర్పుచుండిరి. భిక్షువులకు (సన్యాసులు) పాలీ భాషలోని బౌద్ధ వేదములును, వానిమీఁది దేశభాషా భాష్యములును గురుశిష్యపరంపరగ బోధింపఁబడు చుండెను. పాలిభాషయు, వ్యాకరణమును వారిమత సంబంధమైన యోగ శాస్త్రము, నీతిశాస్త్రము, తత్త్వశాస్త్రము, మీమాంసా శాస్త్రము, భిక్షువులు నేర్చుకొను విషయములలో ముఖ్యమైనవి.

ఇట్లు ఘనతఁ జెందిన విద్యాపీఠమునకు నానాదేశములనుండి విద్యార్థులు వచ్చుచుండిరి. గయనుండి బుద్ధఘోషుఁడను వాఁడు వెళ్లి మతసంబంధమైన తత్త్వములను నేర్చికొని వచ్చెను.

నీటియేర్పాటు

బుద్ధఘోషుఁ డిచ్చట నుండిన కాలమున, ఈ పట్టణమునకు నీటియిబ్బంది లేకుండఁ జేయుటకై ధాతుసేనుఁడనురాజు క్రీ. శ. ౪౫౦ లో, పట్టణమునకు నేఁబదిమైళ్లమీఁద 'కాలవాపి' యనునొక గొప్పతటాకమును నిర్మించెను. ౧౪ మైళ్లు పొడుగుగల దాని కట్ట యిప్పటికిని ఆ యరణ్య ప్రాంతమునఁ గానవచ్చును. అప్పుడు దానిచుట్టు కొల్త ౫౦ మైళ్లేట. అందుండి పట్టణమునకు వచ్చిన కాల్వ లిప్పటికిని కొన్ని మంచి స్థితియందున్నవి. మానవులచే నిర్మింపఁబడిన తటాకములలో నాకాలమందు నింతకంటెఁ బెద్దది లేదని చెప్పవచ్చును. ఇదియే యనురాధపురమున జరిగిన గొప్పవైభవ కార్యము. ఇఁక మీఁద నీపట్టణ వైభవము తగ్గఁజొచ్చె.

ఇఁటఁ దరువాత రాజ్యమునకై పెక్కువంశముల వారు పోరాడుచు, నొకప్పుడు వీరును, మఱియొకప్పుడు వారును విజయులగుచు వచ్చిరి. ఓడినవారు తమిళుల సాయముఁదీసికొనుచుండినందునఁ గ్రమముగఁ ద్రమిళులా దేశమునఁ బ్రవేశించి దాని దోచుకొనఁజొచ్చిరి. క్రీ. శ. ౨౧౦ లో నీపట్టణము విడిచి, పులస్తిపురమను దానిని సింహళమునకు రాజధానిఁ జేసిరి. ౧౧-వ శతాబ్దమునందు దీనిని రాజధానిఁ జేయఁ బ్రయత్నము జరిగెనుగాని అది సఫలమైనది కాదు. క్రీ. శ. ౧౩౦౦ల ప్రాంతమున నిదిబొత్తిగఁ బాడుపడి పోయినట్లు కానవచ్చుచున్నది. చుట్టుపట్టు ౫౦ మైళ్ల వఱకు నరణ్యము పెరిగినది. ఇప్పుడు బోధివృక్షముచుట్టునున్న బౌద్ధభిక్షువుల రెండు మూఁడు గుడిసెలు తప్ప మఱే యిల్లును లేదు.

ఇటీవల నీప్రాంతమునుండి రోడ్లు, రైలు పడ్డందున నిచ్చటఁ గొందఱు దొరతనము వారి యుద్యోగస్థులు బంగళాలు కట్టుకొని వాసముచేయుచున్నారు. శిథిలమైన కట్టడములను దొరతనమువారు ఇంకను చెడిపోకుండ రక్షణచేయుచున్నారు.

అనురాధా. సోముని యిరువది యేడ్గురు భార్యలలో నొక్కతె. ౧ నక్షత్రము. [చూఁడు నక్షత్రములు.]

అనుల. ౧ సింహళదేశపురాజైన మహానాగుని భార్య. మహానాగుఁ డశోకచక్రవర్తికి సమకాలీనుఁడని చెప్పుదురు. సింహళమున బౌద్ధధర్మమును వ్యాపింపఁ జేయుటకు నీమె పాటుపడెను. ఈమెకు బౌద్ధమతజ్ఞాన మధికముగ నుండెను. ఈమె ఆడబిడ్డపేరు సంఘమిత్ర. ఈమెకు బౌద్ధమతమునందుఁగల విశేష జ్ఞానమునుబట్టి సంఘమిత్ర యీమెను 'ఆచార్య' యని పిలుచుచుండెను.

౨. సింహాళపతియైన కోరాంగరాజుభార్య. దురాచరణము కలది. తనపతియగు కోరాంగుని, పుత్రుఁడగు తిష్యుని, నలుగురు ఉపపతులను విషముపెట్టి చంపెను. ఈమె రాజ్యము చేయుచుండఁగ నీమె మరదికుమారుఁడైన కాలకర్ణతిష్యుఁడనువాఁడు తిరుగబడి యామెను చంపి రాజయ్యెను (క్రీ. పూ. ౯౧.)

అనులు. వేదకాలమందు పరుష్ణినదీ తటముననున్న జనులకు పేరు.

అనులోమ (ప్రతిలోమవివాహములు) ఎక్కువజాతి పురుషులు తక్కువజాతి స్త్రీలను వివాహమాడిన నది అనులోమవివాహ మనిపించుకొనును. బ్రాహ్మణుఁడు క్షత్రియ వైశ్యా శూద్రస్త్రీలను, క్షత్రియుఁడు వైశ్య శూద్ర స్త్రీలను, వైశ్యుఁడు శూద్రస్త్రీని వివాహ మాడిన అనులోమ వివాహమగును. దీనికి విరోధశబ్దము ప్రతిలోమ వివాహమను నది. తక్కువ జాతిపురుషులు ఎక్కువజాతి స్త్రీలను పెండ్లి చేసికొనుట ప్రతిలోమము. హిందూ ధర్మశాస్త్రిమతమున ప్రతిలోమ వివాహములు ఎల్లప్పుడునుగర్హితములు. అనులోమ వివాహములు పూర్వ యుగముల యందుఁ జెల్లినవి. కాని కలియుగమునందు నవియు నిషిద్ధములే. ఇప్పుడమలులోనున్న ఆచారము ప్రకారమును కోర్టువారిచే నొప్పుకొనఁబడిన హిందూ లా ప్రకారమును అనులోమ ప్రతిలోమ వివాహము లన్నియు నిషిద్ధములే. ఆచారము ననుసరించి యేజాతివా రాజాతిలోనే వివాహముచేసికొన వలెను. అట్లు చేసికొనక మఱియొక జాతితో సంబంధము కలుగఁజేసి కొన్నయెడల నావివాహము చెల్లదు. అనఁగా వ్యవహారము కోర్టుకు వచ్చినప్పుడు, కోర్టువారట్టి వివాహిత స్త్రీని దాసిగను, దాని సంతతిని దాసీ పుత్రులుగను భావించెదరు.

ఇట్లుసామాన్యముగ అనులోమ ప్రతిలోమ వివాహములిప్పుడు లేక పోయినను, ఒకవిధమైన యనులోమ పద్ధతి యిప్పటికిని హిందూ దేశము నందున్నది. బంగాళా దేశమునందు బ్రాహ్మణులలో కులీనులు, దేశీయులు మొదలయిన భేదములు కలవు. వారిలో కులీనులు అందఱికంటె నెక్కువ వారమని చెప్పుకొనియెదరు. వీరు తమకంటెఁ దక్కువ వారగు బ్రాహ్మణుల యింటి ఆడుపిల్లలను చేసికొందురు. తమ ఆడుపిల్లలను వారికీయరు. అట్లే మనదేశమందు మధ్వలు, లింగధారులయిన ఆరాధ్యులు, తామితర బ్రాహ్మణుల కంటె నెక్కువవారమనికాఁబోలు,స్మార్త బ్రాహ్మణులయింటి యాడపడుచులనువివాహమాడెదరు కాని తమ యాడపడుచులను స్మార్తులకీయరు. కావున నిది వారివారి స్వాతిశయభావము వలన నేర్పడిన యొకవిధమైన అనులోమ వివాహవిధానము!

వేఱు వేఱు జాతులవారిలో నిచ్చి పుచ్చుకొనుట నిషిద్ధమైనను, ఒక్కజాతిలోనే పెక్కు

శాఖలున్న చోట, సాధారణముగ నేశాఖవా రాశాఖలోనే సంబంధములు చేసికొన్నను, ఆవశ్యకతనుబట్టి యొక శాఖవారు మఱియొక శాఖవారితో సంబంధ బాంధవ్యము చేసికొను నాచారము హిందూ దేశమునందుఁ గలదు. బ్రాహ్మణులలో ఋగ్వేదులకు యజుర్వేదులకు సంబంధము లవిచ్ఛిన్నముగ దేశమందంతటను (ఆంధ్రదేశమునందుఁగూడ) జరుగుచున్నవి. వెలనాటి వారికి తెలగాణ్యులకుఁగూడ పెక్కుచోట్ల ఆక్షేపణము లేకుండ వివాహములగుచున్నవి. మహారాష్ట్ర బ్రాహ్మణులకును, ఆంధ్రవైదిక బ్రాహ్మణులకును చాందా నాగపురమువైపున బంధుత్వము కలియుచున్నది. సప్త గోదావర్యంతర్గతమైన ముంగొండ అగ్రహారమునుండి వెడలి పోయిన వేఁగినాటి యాంధ్రబ్రాహ్మణుల పెక్కుకుటుంబములు కాశీలోను, మధ్యపరగణా లోని బ్రహ్మణియను గ్రామమందును నివసించియున్నారు. వీరందఱును మహారాష్ట్రులతో సంబంధముచేసికొనుచు, చాలభాగ మాంధ్రము మరచి, మహారాష్ట్ర వేషభాషలతో సంచరించుచున్నారు. కాశిలో విద్వత్ సింహమని ఖ్యాతిఁగాంచి కొలఁదికాలముక్రిందనే కీర్తిశేషులైన మహామహోపాధ్యాయ గంగాధర శాస్త్రిగారిట్టి యాంధ్రులే. మన దేశమునందు ఆఱువేల నియోగులకు, ప్రాకనాటి నియోగులకు, మధ్వలకు గోలకొండ వ్యాపారులకు, ఆరాధ్యులకు నచ్చటచ్చట, అప్పుడప్పుడు బాంధవ్యము కలియుచునే యున్నది. నియోగివైదికులకంతగఁ గలియుటలేదు గాని, అట్టిసంబంధములును శాస్త్రగాలేవని చెప్పుటకు వీలులేదు. అట్లే రాజులు, వెలమలు, కమ్మలు, రెడ్లు, తెలగాలు, మొదలయినజాతులలోని యుపశాఖలలో నప్పుడప్పుడు వివాహములు జరుగుచునే యున్నవి. కావున నుపశాఖలలో వివాహములు జరుగుటకు నాచారముయొక్క యభ్యంతరమేమియు లేదు; ధర్మశాస్త్రము యొక్క యభ్యంతర మెన్నఁడును లేదు.* ఆయా యుపశాఖలవారికిఁగల స్వాతిశయభావమే యిందుకు విఘ్నకారి. ఒక కేసులో క్రైస్తవమతమునుండి హిందువుగా మాఱిన శూద్రస్త్రీని ఒకశూద్రుఁడు పెండ్లియాడఁగా నదిక్రమమైన వివాహమని కోర్టువారు తీర్మానించిరి.‡

మన్వాదిస్మృతికారులు వేఱువేఱు జాతుల స్త్రీ పురుషులకు • అనులోమపద్ధతి ప్రకారమును, ప్రతిలోమపద్ధతి ప్రకారమును కలిగిన సంతానము ఏ జాతివారగుదురో తెలియుటకై జాబితాలిచ్చినారు. కాని అందఱి జాబితా లొకవిధముగ లేవు. ముఖ్యముగ మనుస్మృతి ననుసరించి యొక అనులోమ విలోమ జాతులపట్టిక యాక్రింద నీయఁబడుచున్నది. ఇందునగుఱించి యింకను తెలిసి

* Pandaiya Telaver v. Puli Telaver 1 Mad. 478.

• Ramamani Ammal v. Kulanthai 14 Moo. I A. 346.

‡ Muthuswami Mudaliar v. Masilamani, I. L. R. 33 Mad. 342.

కొన్ని గోరువారు మనుస్మృతి ౧౦-వ అధ్యాయము చూడనగును.

అనులోమ జాతులు

బ్రాహ్మణ	క్షత్రియ	మూర్ధాభిషిక్త
,,	వైశ్య	అంబష్ట
,,	శూద్ర	నిషాద (వీనిని పారశవుఁడని కూడ నందురు)
క్షత్రియ	వైశ్య	మహిష్య
క్షత్రియ	శూద్ర	ఉగ్ర
వైశ్య	శూద్ర	కరవ.

ప్రతిలోమ జాతులు

క్షత్రియ	బ్రాహ్మణ	సూత
వైశ్య	బ్రాహ్మణ	వైదేహ
శూద్ర	బ్రాహ్మణ	చండాల
వైశ్య	క్షత్రియ	మాగధ
శూద్ర	క్షత్రియ	క్షత్రి
శూద్ర	వైశ్య	ఆయోగవ

మిశ్ర జాతులు

బ్రాహ్మణ	ఉగ్ర	ఆవృత
,,	ఆయోగవ	ధిగ్వన
నిషాద	శూద్ర	పుక్కస
శూద్ర	నిషాద	కుక్కుటక
క్షత్రి	ఉగ్ర	శ్వపాక
విదేహక	అంబష్ట	వేణ
దస్యు	ఆయోగవ	సైరంధ్ర
వైదేహ	,,	మైత్రేయక
నిషాద	ఆయోగవ	మార్గవ, దాస, కైవర్త
,,	వైదేహ	కారావర
వైదేహ	కారావర	అంధ్ర
,,	నిషాద	మేద
చండాల	వైదేహ	పాండుసోపాక
నిషాద	,,	అహిండిక
చండాల	పుక్కస	సోపాక
,,	నిషాద	అంత్యావసాయి

అనులోమ వివాహామువలనఁ గల్గిన సంతతికి నొక విశేషమైన హక్కు గలదు. బ్రాహ్మణునకును శూద్రస్త్రీకిని పుట్టినవాఁడు ఏడు తరములలో బ్రాహ్మణుఁడగును అని మనువు ౧౦-వ అధ్యాయమునందు చెప్పియున్నాఁడు.* అనఁగా బ్రాహ్మణునకు శూద్రకుఁ బుట్టిన స్త్రీ మరల బ్రాహ్మణునే వివాహమాడి, కూఁతుఁ గనును. ఆకూఁతురుగూడ మరల బ్రాహ్మణునే పెండ్లియాడి సంతానము వడయును. ఇట్లేడు తరములవఱకు జరిగినయెడల నేడవతరమునందుఁబుట్టువాఁడు బ్రాహ్మణుఁడగును. ఇట్లే బ్రాహ్మణునకు వైశ్యస్త్రీయందుఁ బుట్టువాఁడు

---

* శూద్రాయాం బ్రాహ్మణాజ్జాతః శ్రేయసాచేత్ ప్రజాయతే
అశ్రేయాన్ శ్రేయసీంజాతిం గచ్ఛత్యా సప్తమాద్యుగాత్. ౬౪.
శూద్రో బ్రాహ్మణతామేతి బ్రాహ్మణశ్చైతి శూద్రతామ్
క్షత్రియాజ్జాతమేవంతు విద్యాద్వైశ్యాత్తథైవచ. ౬౫.

అర్థము:- శూద్రస్త్రీకి బ్రాహ్మణునివలన బుట్టిన స్త్రీ బ్రాహ్మణునకే మరల సంతతిక్కన్నయెడల నేడవ తరమున నాసంతతి శ్రేష్ఠమైన జాతినిబొందును ౬౪.

అంబష్ఠుఁడు. వీఁడు అయిదు తరములలో బ్రాహ్మణుఁడగు. ఇట్లు శూద్రుఁడు బ్రాహ్మణుఁడగును, బ్రాహ్మణుఁడు శూద్రత్వమును చెందును. ఇట్లే క్షత్రియునకు వైశ్యునకుఁ బుట్టినవారిని గుఱించి యెఱుఁగునది.*

అనువాదము. నైయాయికులు వేదవాక్యములను మూఁడు విధములుగ విభజించిరి. విధివాక్యము, అర్థవాదవాక్యము, అనువాద వాక్యములు ('విధ్యర్థవాదాను వాద వచన వినియోగాత్' గౌతమ. ౨. ౧. ౬౩). విధియనఁగా విధాయకమని (విధిర్విధాయకః ౨.౧.౬౪.) గౌతమాచార్యుల వారు న్యాయ సూత్రమునందుఁ జెప్పినారు. ఇట్లు చేయవలసినది యని యాజ్ఞాపించునది విధి. 'స్వారాజ్య కామో వాజపేయేన యజేత' (స్వర్గము కోఱువాఁడు వాజపేయ యజ్ఞమును జేయవలసినది) అనునది విధి వాక్యము. ఒకానొక కార్యమును స్తుతించి, లేక నిందించి, భయము కలిగించి, పూర్వ చరిత వర్ణించి బోధించునట్టి వాక్యము అర్థ వాద వాక్యమనఁబడును.† 'పాపకారిపాపో భవతి' (పాపముచేయువాఁడు పాపిష్ఠుఁడైపోవును) అనునది అర్థవాదము. ఇందు నాజ్ఞ స్పష్టముగా నుండదు. విధి వాక్యముచేఁ జెప్పఁబడిన దానిని మరలఁ జెప్పుట అనువాదమనఁబడును.* అనువాదము రెండు విధములు: శబ్దానువాదము, అర్థానువాదము. ఇదివఱకుఁ జెప్పఁబడిన మాటల మరలఁ జెప్పుట శబ్దాను వాదము. ఇదివఱకుఁ దెలిసిన విషయమునే మరల నన్యపదములతోఁ జెప్పుట అర్థాను వాదము. 'అనువాదే చరణానామ్' (౨. ౪. ౩) అను పాణినీయ సూత్రముమీఁద టీకవ్రాయుచుఁ గాశికాకారుఁడు 'ప్రమాణాంతరావగత స్యార్థస్య శబ్దేన సంకీర్తన మాత్రమను వాదః' అని వ్రాసియున్నాఁడు. వేఱు ప్రమాణముచే సిద్ధించిన యర్థమును (సంగతిని) శబ్దముచేఁ జెప్పుటమాత్రము అను వాద మనఁబడును. 'అగ్నిర్హిమస్య భేషజం' (అగ్ని చలికిమందు) అనునది యనువాదము. ఏల? ప్రత్యక్ష ప్రమాణముచే నీ సంగతి మన మెఱుఁగుదుము. ఆ జ్ఞానమును ఈవాక్య మనువాదించినది.

అనువాదము మరల మూఁడువిధములు. భూతార్థానువాదము, స్తుత్యర్థానువాదము, గుణానువాదము. 'సదేవ సౌమ్యేదమగ్ర ఆసీత్' (ఓసౌమ్య! మొదట సత్తేఉండెను) అనునది మొదటి దానికుదాహరణము. 'వాయుర్వై క్షేపిష్ఠా దేవతా' (వాయువు క్షేపిష్ఠ

* ఇంకను వివరముగుటకునై చూడుమాండలిక సంపాదిత, యాజ్ఞవల్క్య, స్మృతి, పుట ౧౭౩.

† 'స్తుతిర్నిందా పరకృతిః పురాకల్ప ఇతి (అర్థవాదః')
[గౌత. ౨. ౧. ౬౫.

* 'విధివిహిత స్యాను వచనమనువాదః'
[గౌత. ౨. ౧. ౬౬.

ర్థమైన దేవతస్తుష్టా) యన్నది స్తుత్యర్థానువాదము. 'దధ్నాజుహోతి' (పెరుగుతో హోమముచేయును) అనునది గుణానువాదము.

వేదమును నమ్మని బౌద్ధాది పూర్వపక్షులు వేదమునందు నుండు అను వాద వాక్యములు పిష్టపేషణన్యాయమునఁ బడిన రుక్తములు గనుక వేదమునకు గౌరవహాని కలుగుచున్నది యని యాక్షేపించిరి. అందులకు గౌతమాచార్యులవారు "అను వాదములు పునరుక్తములుకావు. అవేశబ్దములు మరల వచ్చినను వానికి నర్థ భేదముండును. వ్యవహారమునందు మొదట 'గచ్ఛ'(పో)అని మరల 'గచ్ఛ,గచ్ఛ' (పో పో) అని దానినే అనువాదించినప్పటికి రెండవతడవ నుచ్చరించిన 'గచ్ఛగచ్ఛ' పదములకుశీఘ్రముగాపొమ్మనియర్థమగుచున్నది. అట్లే వైదికములగు అనువాదములకును విధి వాక్యములకంటె భిన్నార్థముండును. కావున నవి పునరుక్తములు కావు.* అని గౌతముఁడు చెప్పియున్నాఁడు.

దీనిమీఁద వాత్స్యాయనుఁ డిట్లు భాష్యము వ్రాసినాఁడు. "విహితమైన యర్థమును మరల నేలచెప్పవలెనన్న అధికారార్థము (చెప్పఁబోవు విషయమిదియని తెలియుటకు), విహితమైన దానిని నిందించుటకుగాని, స్తుతించుటకుగాని, విధిశేషముగ గాని చెప్పఁబడును. విహితార్థమునకుఁదరువాత వచ్చినది కూడ ననువాదమగును...లోకమునందును అనువాదము కలదు. 'వండువండు' అని చెప్పుట కలదు. అందుకుఁ ద్వరగ వండుమనిగాని, దయచేసివండు మనిగాని (అధ్యేషణ), తప్పక వండుమనిగాని (అవధారణ) అర్థమగును.*

పై నివర్ణింపఁ బడిన మూఁడు విధములైన వాక్యములలో విధివాక్యములే ప్రమాణములుగాని మిగిలిన రెండువిధములైనవాక్యములు ప్రమాణములు కావని కొందఱు పూర్వపక్షము చేసెదరు. అందున గుఱించి 'అర్థవాదము' అనుశబ్దములఁ జూచునది.

అనువిందుఁడు. ౧. విందుని తమ్ముఁడు. వసుదేవుని తోఁబుట్టువగు రాజాధిదేవికిని, ఆమెపెనిమిటి యవంతిరాజు జయసేనునకును పుట్టినవాఁడు. (శ్రీకృష్ణునకు మేనత్త కుమారుఁడు. భారతయుద్ధమునందు దుర్యోధనపక్షమునఁ బోరాడి అర్జునునిచేఁ జచ్చెను.

[భార. ద్రోణ. అ. (౬౬).

౨. కేకయరాజుయొక్క యిద్దఱు పుత్రులలో నొక్కఁడు. వీని అన్న విందుఁడు. భారతయుద్ధమునందుఁ బాండవ పక్షపాతియై యుండె.

* 'శీఘ్రతరగమనోప దేశవదభ్యాసాన్నావిశేషః'
[గౌత. ౨. ౧. ౬౭.

* "కిమర్థం పునర్విహితమనూద్యతే । అధికారార్థమ్ విహితమధికృత్య స్తుతిర్బోధ్యతేనిన్దావా, విధిశేషోవాఽభిధీయతే। విహితానన్తరార్థోఽపిచానువాదోభవతి।... లోకేపి చానువాదః । పచతుపచతు భవానిత్యభ్యాసః। క్షిప్రం పచ్యతా మితివా । అంగ! పచ్యతామిత్యధ్యేషణార్థమ్। పచ్యతామేవేతి వాఽవధారణార్థమ్."

౩. ధృతరాష్ట్రుని నూర్గురు పుత్రులలో నొక్కఁడు.

౪. చూడు 'విందానువిందులు.'

అనుశాల్వుఁడు. సౌభ పతియైన శాల్వుని తమ్ముఁడు. శాల్వునిఁ గృష్ణుఁడు చంప నీతఁడు కృష్ణుని నెట్లయినఁ జంపనిశ్చయించెను. ధర్మజుఁడశ్వమేధముఁ జేయునపుడు యమునఁ గృష్ణుఁడు కుటుంబ సహితముగ హస్తినాపురమునకు రాఁగా నీతఁడు సేనా సమేతుఁడై వచ్చి హస్తినాపుర పార్శ్వమున దాగియుండెను. ఒక నాఁడు కృష్ణుఁడును, పాండవులును అశ్వమును పరీక్షించుచున్న వారని విని యీతఁడచ్చటికి నెవరికిఁదెలియకుండవచ్చి క్షణములో నశ్వమును తీసికొని పాఱిపోయెను. భీముఁడు, సైన్యముతో వానిఁ దరిమికొని చనియె. ప్రద్యుమ్నుఁడు వృషకేతుఁడు వానిఁబట్టి తెచ్చెదమని ప్రతిజ్ఞఁజేసి పోయిరి. ప్రద్యుమ్నుఁడోడె. వృషకేతుఁడు అనుశాల్వునినోడించి, బంధించి కృష్ణునొద్దకుఁ దెచ్చె. వాఁడు కృష్ణునకు శరణుజొచ్చి, అశ్వమేధమునకు సాయముచేయుటకు నంగీకరించి స్వనగరమునకుఁబోయె. (జైమినీఅశ్వమేధము అ. ౧౨-౧౪.)

అనుష్ణా. భారత వర్షీయనది.

(భార. భీష్మ. అ. ౯.)

అనుసూయ. చూడు 'అనసూయ.'

అనుహ్లాదుఁడు. హిరణ్యకశిపునకు కయాధూయను భార్యయందుఁబుట్టిన నల్గురు పుత్రులలో నొక్కఁడు. భార్య సూర్మి. బాష్కలుఁడు, మహిషుఁడు అనువారు పుత్రులు.

అనూదయుఁడు. ధృతరాష్ట్రుని నూర్గురు పుత్రులలో నొక్కఁడు.

అనూపగడము. రాజపుతానాలోని బికానీరు సంస్థానమందలి యొక పట్టణము. సంస్థానాధీశ్వరుఁడగు అనూపసింగు పేర ౧౬౭౮ సంవత్సరములోఁ గట్టఁబడినకోట గలదు. ఇది బికానీరు పట్టణమునకు ౮౨ మైళ్ల దూరములోనున్నది. డెబ్బదియైదు గ్రామములకిది ముఖ్యపట్టణము. ఇందలి జనసంఖ్య ౧౦౧౭. అచ్చటి జనులు ముఖ్యముగా 'రాట్' జాతివారు. ఈ ప్రాంతమున నీరు తక్కువగానున్నను కోతగడ్డి చక్కఁగ పెరుగును. సోడా ఉప్పు తయారుచేయుటకు కావలసిన 'సజ్జ, లానా' అను చెట్లిచ్చట విశేషముగాఁ బెరుగును.

అనూపషహర్ (తాలూకా). యునైటెడ్ ప్రావిన్సెస్సులోని 'బులందర్ షహర్' అను జిల్లాలో గంగనొడ్డుననున్న నొక తాలూకా. ఇందు 'అనూపషహర్; అహర్, దిబాయి, అను మూఁడు పరగణాలు గలవు. దీని విస్తీర్ణము ౪౪౪. చదరపు మైళ్లు. ఈ తాలూకాలో ౩౭౮ పల్లెలును ౪ పట్టణము

లును గలవు. దీనిమధ్యనుండి ఉత్తరదక్షిణముగ 'చోడునది' పారుచున్నది.

ఈ తాలూకాలో జహంగ్రాబాద్ఖిదిబ్యాయి, అనూపషహార్ అను నవి పెద్ద పట్టణములు. రివెన్యూఆదాయము రూ. ౪౯౯౦౦౦ లు సెస్సులు రూ. ౮౦౦౦౦ లు.

అనూపషహార్ (పట్టణము). ఈ అనూపషహార్ తాలూకాకు ముఖ్యపట్టణము. బులందర్ పట్టణమున కిరువది మైళ్ళ దూరముననున్నది. జనసంఖ్య ౮౬౦౧. ఇది చరిత్ర సంబంధమున ప్రాముఖ్యము చెందిన పట్టణము. జహాంగీరు ప్రభుత్వకాలమున బర్గూజర్ రాజయిన 'అనూప్ రాయి' అనువాడు తనపేరిట నీపట్టణమును నిర్మించెను. ఢిల్లీనుండి రోహిల్ఖండు వెళ్లువారిచ్చటనే గంగానదిని దాటవలయును. కావున నట్టిరేవును స్వాధీనమునందుంచుకొనవలయునన్న ప్రభుత్వమువారికి పదునెనిమిదవ శతాబ్దమున నీపట్టణము ముఖ్యమైయుండెను.

మహారాష్ట్రులకు పరమశత్రువయిన అహమ్మద్షాదుర్రాణియనువాఁడు ౧౭౫౭-వ సంవత్సరమునం దీ పట్టణమును స్కంధావారము (Contonment) గా నేర్పఱచెను. తురుష్కులందఱునేకమై, పానిపత్ క్షేత్రమున ౧౭౬౧ లో మహారాష్ట్రుల నోడించిరి. ఆ యుద్ధప్రయత్నములన్నియు నీపట్టణముననే చేయఁబడెను. మహారాష్ట్రులు రోహిల్ఖండు మీఁదికి దాడివెడలఁగా వారిని నెదిరించునిమిత్తమై జౌద్వజీరుతోఁగూడి బ్రిటిష్ వారు ౧౭౭౩-వ సంవత్సరమున నీ పట్టణమును దమ సైన్యములకు నివాసస్థానముగా నేర్పఱచిరి. అప్పటినుండి ౧౮౦౬ వఱకు బ్రిటీషుసైన్యము లచ్చటనే యుండెను. ఆవల మీరటునకు మార్చబడినవి. ౧౮౫౭ సంవత్సరపు సిపాయి తిరుగుబాటు కాలమునందు రోహిల్ఖండ మందలి విప్లవకారు లీరేవును దాటకుండ జాటువారడ్డపడిరి. పూర్వము గంగానదిమీఁద జరుగు వ్యాపారమునకు నీపట్టణము ఉత్తరపరిమితిగా నుండెను. ఈస్టుఇండియా కంపెనీవారిచ్చట నొకగిడ్డంగిని స్థాపించియుండిరి. ఇపుడు వర్తకమంతగా సాగుటలేదు. శర్కర, కలప, వెదురు వ్యాపారము మాత్రము విరివిగా సాగుచున్నది. స్వల్పముగా చుట్టుపట్ల గ్రామములకుఁ గావలసిన బట్టలు, శాలువలు, జోళ్ళు మొదలగునవి ఇచ్చట తయారుచేయఁబడుచున్నవి.

అనూపదేశము. భారత వర్షీయ దేశము. రాజధాని మాహిష్మతి. ఇచ్చట సహస్రార్జునుఁడు రాజ్యము చేయుచుండెను. పాండవుల కాలమున నిచ్చట నీలరాజు రాజ్యము చేయుచుండెను. ఇతఁడు భారత యుద్ధమునందు పాండవులకై పోరాడిచచ్చెను.

అనేకల్ తాలూకా. మైసూరు జిల్లాలో నున్నది. విస్తీర్ణము, నూటతొంబది చదరపు మైళ్లు. ఈ తాలూకాలో 3 పట్టణ

ములును ౨౦౨ పల్లెలును గలవు. దాని పడమటి భాగము రాతిమయముగ నుండును.

అనెకల్ పట్టణము. పై తాలూకా

లోని ముఖ్యపట్టణము. ౧౭-వ శతాబ్దములో బిజాపూరు రాజులు 'హాస్కోటి'నుండి సుగతూరువంశము వారిని తరుముగా, ఆవంశములో నొకఁడే పట్టణమును గట్టెను. తరువాతి శతాబ్దములో నది మైసూరునకు సామంత రాజ్యమయ్యెను. ౧౭౬౦ సం॥లో హైదరాలి దానిని మైసూరులోఁ గలిపివేసె. ౧౮౭౦ సం॥ నుండి మునిసిపాలిటి యేర్పడినది.

అనేకవర్ణసమీకరణము.

భాస్కరాచార్యులవారు బీజగణితమునందు దేనికి అనేకవర్ణ సమీకరణమని పేరుపెట్టిరో దానిని పాశ్చాత్యబీజగణిత శాస్త్రమునందు సైమల్టేనిఅస్ ఈక్వేషన్ (Simultaneous equation) అందురు. దీనికి సమకాలిక సమీకరణమని యర్థము. ఏకవర్ణ సమీకరణమునందుఁ దెలియని వర్ణమొక్కటియే యుండును. అనేకవర్ణసమీకరణమునందుఁ దెలియని వర్ణములు పెక్కులుండును. వాని వెలలు మనము కనుఁగొనవలయును.

౧-వ ఉదాహరణము:-

రెండుసంఖ్యలు కలవు. వానిలో జిన్నసంఖ్యను పెద్దసంఖ్యలోఁ గలిపిన ౫౪ వచ్చును; చిన్నసంఖ్యను పెద్దదానిలోనుండి తీసివేసిన ౧౨ వచ్చును. ఆ సంఖ్యలెవ్వి?

న్యాసము:- తెలిసికొనవలసిన సంఖ్యలలో పెద్దది క అనియు చిన్నది చ అనియు అనుకొందము. కావున ఈ క్రింది సమీకరణములు* ఏర్పడుచున్నవి:-

క + చ = ౫౪ (౧)

క - చ = ౧౨ (౨)

ఈ రెండు సమీకరణములను కలిపిన యెడల ఈక్రింది రీతిగా క యొక్క వెల తెలియుచున్నది:-

౨ క = ౬౬ (3)

∴ క = 33

ఇట్లు మనకు క యొక్క వెల, యనఁగాఁ బెద్ద సంఖ్యవెల తెలిసినది. ఈవెల క కు బదులుగా ౧-వ సమీకరణము నందు గాని, రెండవ సమీకరణమందుగాని, ఉంచిన చ యొక్క వెల తేలగలదు.

క + చ = ౫౪ (క = 33)

∴ 33 + చ = ౫౪

∴ చ = ౫౪-33 = ౨౧

ఇది మిక్కిలి సులభమైన సమీకరణము. అన్ని సమీకరణములు ఇంత సులభముగ విప్పఁబడవు. ఈ క్రింది సమీకరణముఁ జూడుఁడు.

౨-వ ఉదాహరణము :-

౫ చ = ౨౩—౨ క

$$∴ చ = \frac{౨౩—౨ క}{౫} \quad (౧)$$

* ఈసమీకరణములను చదువు విధము: ౧-వ సమీకరణము, క, అధికము చ, సమానము ౫౪; ౨-వ సమీకరణము, క హీనము చ సమానము ౧౨.

ఈసమీకరణమందు క యొక్క వెల మారినకొలఁదిని చ వెల మారుచుండును. క= ౧ అయిన యెడల

చ = (౨౩—౨)/౫ = ౨౧/౫

క = - ౨ అయినయెడల

చ = (౨౩+౪)/౫ = ౨౭/౫

ఇట్లే క వెలమారిన కొలఁదిని చ వెల మారును. కాని యీక్రింది సజాతీయమైన యింకొక సమీకరణము,

౩ క+౪ చ = ౨౪

మనకుఁ జిక్కనేని దానినిబట్టి మనమీ క్రింది సమీకరణమును ఏర్పాటు చేసికొనవచ్చును.

చ = (౨౪-౩ క)/౪ (౨)

౧-వ సమీకరణమునకును, ఈ ౨-వ సమీకరణమునకును సరిపోవునట్టి వెలలు క చ లకు మనము తెలిసికొనవలెను. ౧-వ సమీకరణమందుఁ జూపఁబడిన చ యొక్క వెలయు ౨-వ సమీకరణమందుఁ జూపఁబడిన చ యొక్క వెలయు నొకటితో నొకటి సమానములై యుండవలెను.

∴ (౨౩—౨క)/౫ = (౨౪—౩ క)/౪

గుణించుటచే, ౯౨—౮ క = ౧౨౦—౧౫ క

∴ ౭ క = ౨౮

∴ క = ౪

క యొక్క యీవెల ౧-వ సమీకరణమునందు ఉంచగా నిట్లువచ్చును:-

∴ చ = (౨౩—౨ క)/౫ = (౨౩—౮)/౫ = ౧౫/౫ = ౩

∴ క = ౪

చ = ౩

కకు ౪, చకు ౩ వెలయున్న యెడలనే పై రెండు సమీకరణములు నిజమగును. లేని యెడల కావు.

అనేకవర్ణసమీకరణములను విచ్చు నప్పుడు, కొన్నియుక్తులచే నితర వర్ణములను తొలఁగఁదీసి (Eliminate) ఒక్క వర్ణముమాత్రము నిలుచునట్లుచేసికొనవలెను. అప్పుడది యేకవర్ణ సమీకరణమగును. దానిచే నొక్క వర్ణముయొక్క వెల కనుఁగొనవచ్చును. పిదప నితరవర్ణము వెల తెలియుట సులభము.

౩-వ ఉదాహరణము :

ఈ క్రింది సమీకరణములను విచ్చుఁడు:-

౩ క+౭ చ = ౨౭ (౧)

౫ క+౨ చ = ౧౬ (౨)

ఈ సమీకరణములలోనుండి క అను వర్ణమును తొలఁగింప యత్నించెదము. అది యెట్లు? ౧-వ సమీకరణమును ౫తోను, ౨-వ సమీకరణమును ౩తోను హెచ్చించిన నీక్రింది సమీకరణములు వచ్చును:-

౧౫ +౩౫ చ = ౧౩౫ (౩)

౧౫ క+౬ చ = ౪౮ (౪)

ఈ రెండు సమీకరణములందును క వర్ణములు సమానము (౧౫ క) అయినవి. కావున ౪-వ సమీకరణమును ౩-వ సమీకరణము నుండి తీసివేసిన నిట్లువచ్చును:-

$$౨౯\ చ = ౮౭$$

$$\therefore చ = \frac{౮౭}{౨౯} = ౩$$

ఈ వచ్చిన చ యొక్క వెల ౧-వ సమీకరణమునందు భర్తీచేసిన క వెల రాఁగలదు:-

$$౩\ క + ౭\ చ = ౨౭$$

$$\therefore ౩\ క + ౨౧ = ౨౭$$

$$\therefore ౩\ క = ౬$$

$$\therefore క = ౨.$$

ఇట్లు ఈలెక్కయొక్క యుత్తరము క = ౨, చ = ౩.

రెండు అజ్ఞాతవర్ణములలో నొకదాని వెల తెలిసిన తరువాత, రెండవదాని వెల కనుఁగొనుటకై రెండుసమీకరణములలో దేనినితీసికొని అందు తెలిసిన వర్ణమువెల భర్తీచేసినను, రెండవ వర్ణమువెల తెలియును. ఒకానొకసమీకరణమునే తీసికొనవలెనని లేదు. పై లెక్కలో మనము ౧-వ సమీకరణముఁదీసికొని దానిలో చ వెలభర్తీ చేసితిమి. అట్లుచేయక ౨-వ సమీకరణముఁదీసికొని యందు చ వెలభర్తీ చేసినను క వెలవచ్చియుండును:-

$$౫\ క + ౨\ చ = ౧౬$$

$$\therefore ౫\ క + ౬ = ౧౬$$

$$\therefore ౫\ క = ౧౦$$

$$\therefore క = ౨$$

౪-వ ఉదాహరణము:

ఈ క్రింది సమీకరణముల విచ్చుము :-

$$౭\ క + ౨\ చ = ౪౭ \qquad (౧)$$

$$౫\ క - ౪\ చ = ౧ \qquad (౨)$$

ఈ లెక్కలో చ ను తొలఁగించుట సులభము. ౧-వ సమీకరణమును ౨ చే హెచ్చించిన ఈ క్రింది సమీకరణ మేర్పడును:-

$$౧౪\ క + ౪\ చ = ౯౪ \qquad (౩)$$

ఇందులో ౨-వ సమీకరణమును కలిపిన చ యెగిరిపోయి, యీ క్రింది విధమున క వెల వచ్చును :-

$$౧౯\ క = ౯౫$$

$$\therefore క = \frac{౯౫}{౧౯} = ౫$$

ఇచ్చట ౨-వ సమీకరణమందలి ౪ చ ఋణము (— ఋణ చిహ్నాంకితము) ; ౩-వ సమీకరణమందలి ౪ చ ధనము (Positive) కావున ఈ రెంటిని కలపమంటిమి. ఈ రెంటిని కలిపిన సంకలనము సున్నయై చ వర్ణ మెగిరి పోవును. ఈ రెండు సమీకరణముల లోను '౪ చ' అను వర్ణము ధనముగగాని, ఋణముగగాని ఉన్నయెడల నది యెగిరిపోవుటకు నా సమీకరణములలో నొకదానినుండి మఱియొకదానిని తీసివేయవలయును.

౫-వ ఉదాహరణము:

ఈ క్రింది సమీకరణముల విచ్చుఁడు:-

$$౨\ క = ౫\ చ + ౧ \qquad (౧)$$

$$౨౪ - ౭\ క = ౩\ చ \qquad (౨)$$

౧-వ సమీకరణమువలన క వెల యిట్లు వచ్చుచున్నది.

$$క = \frac{౫\ చ + ౧}{౨} \qquad (౩)$$

ఇట్లువచ్చిన క యొక్క వెల ౨-వ సమీకరణమునందు మనము భర్తీచేసిన యెడల క లోపించును:-

$$౨౪ - \frac{౭}{౨}(౫ చ + ౧) = ౩ చ$$

$$\therefore ౪౮ - ౩౫ చ - ౭ = ౬ చ$$

$$\therefore ౪౧ = ౪౧ చ$$

$$\therefore చ = ౧$$

ఇట్లు వచ్చిన చ వెల ౧-వ సమీకరణమందు భర్తీచేసినయెడల క వెల రాగలదు:-

$$౨ క = ౫ చ + ౧$$

$$\therefore ౨ క = ౫ + ౧ = ౬$$

$$\therefore క = ౩$$

పైని చెప్పిన మార్గములను బుద్ధి సూక్ష్మతతో అవసరముకొలఁదిని ఉపయోగించిన ననేకవర్ణ సమీకరణ బీజములను (తెలియని వర్ణముల వెలలను) కనుఁగొనవచ్చును. ఒక్కొక సమయమందు గణితసంబంధమైన జ్ఞానమును చక్కఁగ నుపయోగించిన యెడల లెక్క సులభముగవచ్చును.

౬-వ ఉదాహరణము

ఈ క్రింది సమీకరణము విచ్చుము:-

$$౨౮ క - ౨౩ చ = ౨౨ \qquad (౧)$$

$$౬౩ క - ౫౫ చ = ౧౭ \qquad (౨)$$

ఇందుండి క ను తీసివేయవలయును. మనకు నొక మోటుపద్ధతి తెలియును. ౧-వ సమీకరణము నందలి క యొక్క గుణక సంఖ్య (Coefficient) ౨౮, ౨-వ సమీకరణము నందలి క గుణక సంఖ్య ౬౩, కావున ౧-వ సమీకరణమును ౬౩ చేతను, ౨-వ సమీకరణమును ౨౮ చేతను హెచ్చించిన సమాన గుణకములుగల క వర్ణము రెండు సమీకరణములలోను ఏర్పడును:-

$$౧౭౬౪ క - ౧౪౪౯ చ = ౧౩౮౬ \qquad (3)$$

$$౧౭౬౪ క - ౧౫౪౦ చ = ౪౭౬ \qquad (౪)$$

౩-వ సమీకరణమునుండి ౪-వ సమీకరణముఁ దీసివేసిన క వర్ణము లోపించి యిట్లు వచ్చును:-

$$౯౧ చ = ౯౧౦$$

$$\therefore చ = \frac{౯౧౦}{౯౧} = ౧౦$$

ఇట్లు లెక్కవచ్చినను అంకెలు పెద్దపెద్దవిగా పెరిగి లెక్కచేయుటకుఁ గొంచెమిబ్బంది కల్గినది. అట్లుగాక ౧-వ సమీకరణ మందలి క వర్ణగుణకము ౨౮, ౨-వ సమీకరణ మందలి క వర్ణగుణక సంఖ్య ౬౩, ఈ రెంటికిని అపవర్త్యము, లేక కనిష్ట సామాన్య గుణిజము (L.C.M.) ౨౫౨. ఈ సంఖ్యను ౨౮తో భాగించిన ౯ వచ్చును. ౬౩ తో భాగించిన ౪ వచ్చును. కావున ౧-వ సమీకరణమును ౯ తోను, ౨-వ సమీకరణమును ౪ తోను హెచ్చవేసిన యెడల నీక్రింది సమీకరణములు వచ్చును:-

$$౨౫౨ క - ౨౦౭ చ = ౧౯౮ \qquad (౫)$$

$$౨౫౨ క - ౨౨౦ చ = ౬౮ \qquad (౬)$$

౫-వ సమీకరణమునుండి ౬-వ సమీకరణమును తీసివేయఁగా నిట్లువచ్చును:-

$$౧౩ చ = ౧౩౦$$

$$\therefore చ = ౧౦$$

దీనిని పట్టి క వెల కనుఁగొనవచ్చును.

౭-వ ఉదాహరణము:

ఈక్రింది సమీకరణములను విచ్చుము:

$$\frac{౮}{క} - \frac{౯}{చ} = ౧ \qquad (౧)$$

$$\frac{౧౦}{క} + \frac{౬}{చ} = ౭ \qquad (౨)$$

న్యాసము:-౧-వ సమీకరణమును ౨చేతను ౨-వ సమీకరణమును ౩ చేతను హెచ్చించిన

$$\frac{౧౬}{క} - \frac{౧౮}{చ} = ౨ \qquad (౩)$$

$$\frac{౩౦}{క} + \frac{౧౮}{చ} = ౨౧ \qquad (౪)$$

(౩), (౪) ఈ రెంటిని కల్పఁగా

$$\frac{౪౬}{క} = ౨౩$$

$$\therefore ౪౬ = ౨౩ క$$

$$\therefore క = ౨$$

౧-వ సమీకరణమునందు క వెలను భర్తీ చేయఁగా వచ్చునది.

$$చ = ౩.$$

భిన్నాంకములు వచ్చినప్పుడు దానికిఁ దగు రీతి లెక్కనుమార్చి సమీకరణములను విచ్చవలెను.

రెండు అజ్ఞాతవర్ణముల వెల కనుఁగొనుటకు రెండు సమీకరణము లుండవలయునని యిదివఱకుఁ జదువరులు చూచియున్నారు. మూఁడు అజ్ఞాతవర్ణములను కనుఁగొనుటకై మూఁడు సమీకరణములు కావలెను. మూఁడు వర్ణముల సమీకరణములను విచ్చునప్పుడు, మొదటమూఁడింటిలో రెండుసమీకరణములఁ దీసికొని వానిలోనుండి యొకవర్ణమును తొలఁగింపవలయును. తరువాత మూఁడింటిలోనుండి మఱిరెండు సమీకరణములఁ దీసికొని వానినుండి యీ వర్ణమునే తొలఁగింపవలయును. ఇట్లు రెండు అజ్ఞాతవర్ణములుగల రెండు సమీకరణము లేర్పడును. వానిని పైనిచెప్పిన రీతిగావిచ్చి, ఆ రెండు వర్ణముల వెలలు కనుఁగొనవలెను. పిదప మూలసమస్యలోని యొక సమీకరణములో ఈ రెండువర్ణముల వెలలను భర్తీచేసి మూఁడవవర్ణముయొక్క వెల కనుఁగొనవలెను.

౮-వ ఉదాహరణము:

ఈ క్రింది సమీకరణములను విచ్చుము:-

$$౭క + ౫చ - ౭ట = -౮^{*} \qquad (౧)$$

$$౪క + ౨చ - ౩ట = ౦ \qquad (౨)$$

$$౫క - ౪చ + ౪ట = ౩౫ \qquad (౩)$$

న్యాసము:-ఇందుండి మొదలు క ను విడఁదీయుదము. (౨) ను ౫ తో హెచ్చింపఁగా వచ్చినది.

$$౨౦క + ౧౦చ - ౧౫ట = ౦ \qquad (౪)$$

(౧) ని ౨ తో హెచ్చింపఁగా వచ్చినది :-

$$౧౪క + ౧౦చ - ౧౪ట = -౧౬ \qquad (౫)$$

(౪) లోనుండి (౫) తీసివేయఁగా వచ్చినది :-

$$౬క - ట = ౧౬ \qquad (౬)$$

(౨)ని ౨ తో హెచ్చవేయఁగా వచ్చినది :-

$$౮క + ౪చ - ౬ట = ౦ \qquad (౭)$$

(౩), (౭) కలపఁగా వచ్చినది.

$$౧౩క - ౨ట = ౩౫ \qquad (౮)$$

* ఋణసంఖ్యములను చదువునప్పుడు ఋణము ౮, ఋణము క అని చదువవలెను.

(౬)ను ౨తో హెచ్చవేయఁగా వచ్చినది:

౧౨ క - ౨ ట = ౩౨ (౮)

(౭) లోనుండి (౮) తీసివేయఁగా

క = ౩

(౪)లో క వెలభర్తీ చేయఁగా వచ్చినది.

ట = ౨

(౨) లో క ట ల వెలలు భర్తీచేయఁగా వచ్చినది.

చ = ౩,

ఇఁకఁగొన్ని లౌకికోపయోగములైన యుదాహరణములిచ్చి యీప్రకరణము ముగించెదము.

౯-వ ఉదాహరణము.

ఒక గొల్లవాఁడుపశువులఁగొనుటకు సంతకుఁబోయెను. అచ్చటర గొఱ్ఱెలకు ౭ ఆవులకు రు ౧౩౧-౦-౦ లును, ౫ గొఱ్ఱెలకు ౩ ఆవులకు రు ౬౬-౦-౦ లును, ఖరీదు చెప్పిరి. ఒక్కఆవు ఖరీదెంత? ఒక్కగొఱ్ఱె ఖరీదెంత?

న్యాసము:- ఒక్కొక్క గొఱ్ఱె ఖరీదు క రూపాయి లనుకొందము. ఒక్కొక్క ఆవు ఖరీదు చ రూపాయలను కొందము. లెక్కను బట్టి యీ క్రింది సమీకరణము లేర్పడుచున్నవి:-

౪ క + ౭ చ = ౧౩౧ (౧)

౫ క + ౩ చ = ౬౬ (౨)

(౧) టిని ౫ తోను, (౨) ను ౪ తోను హెచ్చవేయుము:-

౨౦ క + ౩౫ చ = ౬౫౫ (౩)

౨౦ క + ౧౨ చ = ౨౬౪ (౪)

(౩) లోనుండి (౪) తీసివేయఁగా

౨౩ చ = ౩౯౧

∴ చ = ౧౭ రూపాయలు

చ యొక్క యీ వెలను (౨) లో భర్తీ చేయఁగా

౫ క + ౫౧ = ౬౬

∴ ౫ క = ౬౬ - ౫౧ = ౧౫

∴ క = ౩ రూపాయిలు

కావున ఉత్తరము, ఒక్కొక్క గొఱ్ఱెవెల రు ౩-౦-౦, ఒక్కొక్క ఆవువెల రు ౧౭-౦-౦.

౧౦-వ ఉదాహరణము.

ఇద్దఱు స్నేహితులు కలరు. వారిలో నొక్కఁడు రెండవవానితో ననును:- 'మిత్రమా! నీవు నాకు నూఱు రూపాయ లిచ్చితివేని, నీయొద్ద మిగిలిన ధనముకంటె నాయొద్ద రెట్టింపుధనముండును.' అందుపై రెండవవాఁడు మొదటివానితో 'నీవునాకు పదిరూపాయి లిచ్చితివేని నీవద్ద నిలిచియుండు ధనముకంటె నావద్ద నాఱురెట్లధనముండును' అని అనెను. మొదటివానియొద్ద నెంత ధనమున్నది? రెండవ వానియొద్ద నెంత ధన మున్నది? (భాస్కరాచార్యుఁడు) *

న్యాసము:- మొదటివానియొద్ద క సంఖ్య రూపాయిలును, రెండవ వానియొద్ద చ సంఖ్య

---

* భాస్కరాచార్యులవారీ యుదాహరణమును ఏకవర్ణసమీకరణ ప్రకరణమునందును, అనేకవర్ణసమీకరణ ప్రకరణమందును ఇచ్చియున్నారు. కాని మన మిచ్చట అనేకవర్ణసమీకరణము గిలదిగనే ఈలెక్క చేయుదము.

రూపాయిలును మొదట ఉన్నవని కొందము. ఇఁక రెండవవాఁడు మొదటివానికి ౧౦౦ రూపాయిలిచ్చివేసిన మొదటి వానియొద్ద (క+౧౦౦) రూపాయిలును, రెండవ వానియొద్ద (చ-౧౦౦) రూపాయిలును ఉండును. కావున లెక్కయొక్క మొదటిభాగము ననుసరించి అనఁగా మొదటివాఁడు చెప్పిన మాట ననుసరించి యీ క్రింది సమీకరణ మేర్పడుచున్నది.

క + ౧౦౦ = ౨ (చ-౧౦౦) = ౨చ-౨౦౦ (౧)

మొదటివాఁడు రెండవ వానికి పదిరూపాయిలిచ్చిన యెడల మొదటివానియొద్ద (క-౧౦) రూపాయిలుండును. రెండవ వాని యొద్ద (చ+౧౦) రూపాయిలుండును. కావున రెండవవాఁడు చెప్పినమాట ననుసరించి యీ క్రింది సమీకరణ మేర్పడుచున్నది:-

చ + ౧౦ = ౬ (క-౧౦) = ౬క - ౬౦ (౨)

(౧), (౨) సమీకరణములయొక్క రెండు పక్షములను (Sides) అనుకూలముగా మార్చఁగా నీక్రింది రెండు సమీకరణము లేర్పడుచున్నవి.

౨చ - క = 3౦౦ (3)

౬క - చ = ౭౦ (౪)

ఇందు (౪) ను ౨ తో హెచ్చవేయుము:-

౧౨క - ౨చ = ౧౪౦ (౫)

(3), (౫) సమీకరణములను కలుపఁగా

౧౧ క = ౪౪౦

∴ క = ౪౦ రూపాయిలు

క యొక్క వెల (3) లో భర్తీచేయఁగా చ వెలవచ్చును:-

౨చ - ౪౦ = 3౦౦

∴ ౨చ = 3౪౦

∴ చ = ౧౭౦ రూపాయిలు

ఉత్తరము-మొదటివాని వద్ద రు. ౪౦-౦-౦ లును, రెండవ వానివద్ద రు. ౧౭౦-౦-౦లును ఉండెను. [కో. ల.

అనేనా. (సూ. వం.) ఇక్ష్వాకు ప్రపౌత్రుఁడు. వికుక్షినామాంతరముగల శశాదుని పౌత్రుఁడు, కకుత్స్థుని పుత్రుఁడు. ఇతనికి సుయోధన, కాకుత్స్థ నామములు గూడఁ గలవు. పుత్రునిపేరు పృథుఁడు.

౨. (చం. వం.) పురూరవుని పౌత్రుఁడు. ఆయురాజు నైదుగురుపుత్రులలోఁ గనిష్ఠుఁడు. కుమారునిపేరు శుద్ధుఁడు. తమ్ముఁడు నహుషుఁడు.

అనేనుఁడు. ౧ ఇక్ష్వాకురాజు ప్రపౌత్రుఁడు. వికుక్షిరాజు పౌత్రుఁడు. కకుత్స్థరాజు పుత్రుఁడు. వీనికి సుయోధనుఁడు కాకుత్స్థుఁడు అను నామాంతరములు గలవు. వీని కొమార్తె పేరు ప్రథాపు.

౨ సోమవంశము పురూరవుని పౌత్రుఁడు. ఆయురాజుయొక్క అయిదుగురు కొడుకులలో కనిష్ఠుఁడు. వీని మారుపేరు శిద్ధుఁడు.

అనైమలై కొండలు. పర్వతపఙ్క్తి, పశ్చిమ కనుమలలోని యొకభాగము. అనై

మలె అనుశబ్దమునకు ఏనుఁగుల కొండలని యర్థము. ఈ కొండలు కోయంబత్తూరు జిల్లాయొక్క దక్షిణభాగమందును, ట్రావెన్‌కూరు సంస్థానమునందును ఉన్నవి. ఇవి దాదాపు నూఱు చదరపుమైళ్ళను ఆక్రమించియున్నవి. ఇవి రెండు వరుసలుగ నుండును. ఇందలి యెత్తువరుసలో అన్నైముడి, అక్క, తంగాచి (చెల్లెలు) అను మూఁడు శిఖరములు కలవు. ఇచ్చటి కాలమానస్థితి నీలగిరి కొండలమీఁదివలెనే యుండును.

ఎత్తు తక్కువగనున్న రెండవవరుస గుట్టలమీఁద నరణ్యమెక్కువగ నున్నది. ఇందు మిక్కిలి చక్కని టేకుకలపయున్న ప్రదేశములనేకములు కలవు. ఇచ్చట యొక టేకు చెట్టు ౧౨౮ అడుగులు ఎత్తును, ౨౩ అడుగుల లావును (పరిఘయు) గలిగియుండెను! ఈవృక్షమునుండి వేళ్లుపోఁగా ౫౦౦ మొదలు ౬౦౦ ల ఘన అడుగుల కల్పవచ్చినది! అరణ్యములోఁ జెట్టుకొట్టిన తరువాత నచ్చటినుండి కొంతవఱకు నాచెట్టును ఏనుఁగులు లాగుకొనివచ్చును. అచ్చటినుండి కొంతదూరము వఱకు ఎడ్లలాగునట్టి ట్రాంవే బండ్లమీఁద నీకల్పతీసికొని పోఁబడును. అచ్చట నాకల్పను తాళ్ళకుఁగట్టి క్రిందికి విడిచెదరు. ఇట్లు తాళ్ళకుఁగట్టి ౧౦౦౦ అడుగుల లోతుకుఁ జెట్లకుఁ జెట్లు పంపఁబడును. అచ్చట యంత్రముతోఁ గోయునట్టి రంపముగలదు. దానిలో నీచెట్లను వలయునంత చిన్నవిగాఁ గోసి ప్రపంచము మీఁదికి అమ్మకమునకై పంపెదరు. సుమారు ౨౦౦౮ ఎకరముల ప్రదేశమునందు నిటీవల కాఫీతోటలుకూడ వేయుచున్నారు.

ఈ యరణ్యములలో పెద్దపులులు, చిఱుతపులులు, లేళ్లు, దుప్పులు, మనుబోతు సాధారణముగా నుండును. ఏనుఁగులును విశేషముగ గలవు.

ఈ కొండలమీఁద కాదనులు, ముడువనులు, పులయనులు, మలసరులు అను అరణ్యకజాతుల వారుందురు. అరణ్యమునందుఁ బుట్టునట్టి ఏలకులు, పేము, మైనము, తేనె అమ్మకొని వీరు జీవనముచేయుదురు.

అన్నైముడి. మదరాసు రాజధానిలో తిరువాన్కూరు సంస్థానములో నీశాన్యముగా నున్నది. పడమటి కనుమలలో అనామలై కొండలయొక్క నొక్క యున్నతమైన శిఖరము. ఇయ్యది దక్షిణ హిందుదేశములో నెత్తైన శిఖరమై, సముద్రమట్టమునకు ౮౮౩౭ అడుగులు ఎత్తుగానున్నది. దానినెక్కుటకు అన్నివైపులు వీలులేక పోయినప్పటికి ఉత్తరమునుండి యెక్కవచ్చును. అంతకంటె సులభముగా తూర్పు వైపున్ననుండి యెక్కవచ్చును. ఆశిఖరపు పైభాగమునుంచి చూచిన పక్షమున కోయంబుత్తూరు, మధుర, మళయాళముల యొక్కయు, తిరువాన్కూరు, కొచ్చిన్ సంస్థానములయొక్కయు ప్రదర్శనము బహుబాగుగా నుండును. ఆశిఖరముపై నుంచి,

అడవులు, కొండలక్రిందుగా పడమటిసముద్రము కన్నులపండువుగా కనబట్టును. ఉత్తరపువైపు అనామలై పర్వతములను ఈశాన్యవైపు కోయంబుత్తూరు పల్లపుభూములును, నీలగిరి యున్నత్త ప్రదేశములును, అంచనాద్ కనుమయును, దక్షిణపువైపు పర్ మేడ్ ఆవల యున్న ఏలకుల (కొడమామ్) కొండలును, ఆగ్నేయపువైపున చోడినాయకనూరుకనుమ కొద్దిగాను కనఁబడును. అన్నైముడిచుట్టును అనేకశిఖరములు కలవు. ఒక్కొక్క శిఖరమునకు మధ్య 3౦౦౦ లేక ౨౦౦౦ అడుగుల కనుములున్నవి. ఈ కొండల యొక్క విస్తీర్ణము ౧౦౦ చదరపుమైళ్లు. ఈ కొండల యొక్కముప్పాతిక ప్రదేశము గడ్డితో నింపబడియున్నది. వీటికి క్రింద అడవులు కలవు. ఇక్కడ కాఫి, తేయాకు పైరులు వేయక ముందు ఆ భూమియంతయు షికారు కుపయోగపడుచుండెను.

అనౌపమ్య. బాణాసురుని భార్య.

అన్నంభట్టు.

సుప్రసిద్ధుఁడైన యాంధ్రనైయాయికుఁడు. హిందూదేశమునందు నంతటను న్యాయశాస్త్ర మభ్యసింపఁగోరువారీతని తర్కసంగ్రహమును మొదట నభ్యసించెదరు. ఇతఁడు న్యాయ మీమాంసా వేదాంత వ్యాకరణములను విషయములపై గ్రంథములను వ్రాసెను:-

(౧) న్యాయగ్రంథములు :-

౧. తర్కసంగ్రహః, ౨. తర్కసంగ్రహదీపికా, 3. తర్కభాషాతత్త్వబోధినీ, ర. ఆలోకసిద్ధాంజనం (ఇది జయదేవుని 'ఆలోక' మనుతత్త్వచింతామణి టీకకుఁటీక). ౫. సుబుద్ధిమనోహరం (ఇది రఘునాథ శిరోమణియొక్క దీధితి మీఁద టీక.)

(౨) మీమాంసా గ్రంథములు :-

౧. రాణకోజ్జీవనీ (సుధాసారః; సోమనాథుని రాణకముపై టీక) ౨. తంత్రవార్తికటీక.

(3) వేదాంత గ్రంథములు :-

౧. మితాక్షరా, బ్రహ్మసూత్రములపై వృత్తి, ౨. తత్త్వవివేచనం.

(ర) వ్యాకరణ గ్రంథములు :-

౧. వ్యాకరణ మితాక్షరా, ౨. భాష్యప్రదీపోద్యోతనమ్, (కయ్యటుని ప్రదీపము మీఁద టీక).

పైగ్రంథముల పట్టికవలననే యీతనికిఁగల సకలవిద్యా పాండిత్యాతిశయము వెల్లడి కాఁగలదు. ఇదివఱకు నీతని తర్కసంగ్రహదీపికలు మాత్రము సకల జనవిదితములు. కొన్ని సంవత్సరములకుఁ గ్రింద వ్యాకరణ మితాక్షరను కాశీ సంస్కృత గ్రంథమాల (Benares Sanskrit series) లో శ్రీభట్టనాథస్వామి వారచ్చువేయించినారు. మిగిలిన గ్రంథములయొక్క వ్రాతప్రతులిటీవల సంపాదించి చెన్నపురి దొరతనము వారు తమప్రాచ్యలిఖిత పుస్తకభాండాగారమునం దుంచినారు.

ఈతని గ్రంథములలోని యుపోద్ఘాతములును, పరంపరాగతే లోకవార్తలును చూడఁగా నీతనిది గొప్పపండితవంశమని తోఁచుచున్నది. ఈతని ముత్తాత లోకనాథభట్టు ద్వాదశాహయాజ్యుఁడన్న బిరుదముగలవాఁడు, మంత్రభాష్యమును, కృష్ణాభ్యుదయమను కావ్యమును రచించెను. తాత మల్లుభట్టు; అగ్నిహోత్రభట్టన్న బిరుదాంకితము కలవాఁడు; ఆలోకస్ఫూర్తియన్న న్యాయగ్రంథమును, తత్త్వవివేచనమన్న వేదాంత గ్రంథమును, మహాభాష్యటీకయను వ్యాకరణ గ్రంథమును రచించెను. తండ్రి తిరుమలభట్టు. సర్వతోముఖయాజి బిరుదాంకితుఁడు. సంధ్యావందన భాష్యము రచించెను. వీరికిమూలపురుషుఁడు రాఘవసోమయాజి. అన్నంభట్టునకు మహామహోపధ్యాయ బిరుదును, అద్వైత విద్యాచార్యుఁడన్న బిరుదును ఉండెను. ఈతనికి అన్నయుండెనని 'అత్రాస్మదగ్రచరణాః' యన్న ఆలోకసిద్ధాంజన వాక్యమువలనఁ దెలియుచున్నది.

అన్నంభట్టు గుంటూరుమండల మండలి గరికపాటి నివాసియనియు, కొండవీటిలోని పాఠశాలలోఁ బండ్రెండేండ్లు చదువుకొనెననియు, తరువాత తాను ఒకపాఠశాలస్థాపించి విద్యార్థులకుఁ దర్కశాస్త్రము నేర్పుచుండెననియు, తనకున్న దానితో సంతుష్టిఁ జెందియెన్నఁడును, ఎచ్చటికిని వెళ్లి యేరాజును ఆశ్రయింప లేదనియు, ౫౫ సంవత్సరములు వయస్సు వచ్చిన తరువాత శ్రీశైలమునకుఁ బోయెననియు తర్కమునందు మొదట సంగ్రహము, తరువాత దీపిక, పిదప ముక్తావలి చివర గదాధరి చెప్పు సాంప్రదాయము నితఁడే యేర్పఱచెననియు, ఈతఁడు శా. శ. ౧౫-వ శతాబ్దమున నున్నవాఁడనియు అర్వాచీన కోశకారుఁడు వ్రాసియున్నాఁడు. ఇందు కాతఁడేమియు నాధారమీయక పోయినను అన్నంభట్టు క్రీ. శ. ౧౪౦౦ - ౧౫౦౦ లకు నడుమ కాలముననున్నవాఁడని మనముసాధారణముగ నూహింపవచ్చును. ఇతఁడు ప్రక్రియాకౌముదీకారునకుఁ దరువాతివాఁడు, సిద్ధాంత కౌముదీకారునకుఁ బూర్వపువాఁడు.

'కాశీగమన మాత్రేణనాన్నంభట్టాయితే ద్విజః' కాశీకిఁబోయినంత మాత్రమున్న బ్రాహ్మణుఁడు అన్నంభట్టుకాఁడు అన్న వచనము ఉదాహరించి కొందఱీతఁడు కాశీకిఁ బోయి యచ్చటఁ బండితుల గెలిచి బిరుదావళులఁ బొందెనని చెప్పుదురు.

అన్నదానపట్టి. ఇది సేలంజిల్లా సేలంతాలూకాలోని యొక చిన్న జమీందారి. దొరతనమువారికిఁ జెల్లింపవలసిన పేష్కషు రు ౩౭౯౦లు. ఈ ముఖ్యస్థలము అన్నదానపట్టియను పల్లె. ఇది సేలమునకు పశ్చిమమున క్రోశడు దూరమున నుండును. ఇందు ౭౩ ఇండ్లును, ౩౦౭ జనులును కలరు. ప్రస్తుతకాలమందు నిచ్చట శ్రీయుత షడగోప మొదలియారుగారు

శ్రీయుత రాజమాణిక్య మొదలియారుగారు జమీన్దారులుగ నున్నారు.

అన్నదేవ చోళుఁడు.

భ...శ్వరుఁడను నామాంతరముగల కామరాజు యొక్క కుమారుఁడు. ఈతని తల్లి అన్నమాంబ. అన్నదేవుని భార్య యిరుగాంబిక. ఈమె సూర్యవంశజుఁడైన పిన్నుండి అనువానికిఁ దోడఁబుట్టినది. వీరిద్దరికిని వీరభద్రుఁడు కొడుకు. అన్నదేవుఁడు మహమ్మదీయులకు సఖుఁడు. ఈతఁడు కర్ణాటరాజు సైన్యములను ఓడించెను. జగ్గవాగు మొదలైన స్థలముల నాక్రమించెను. ఈతఁడు అత్తిల యొద్ద దక్షిణదేశపు రాజులతో యుద్ధము చేసి, తనకు శరణుఁజొచ్చిన పదివేలమందినిఁ గాపాడెను. గోదావరీతీరమున కాకరపర్తి యొద్ద తనబావమఱదియైన పిన్నుండి సాయమున నీతఁడు కన్నడరాజును మఱి యితర రాజులను చంపెను. తనస్నేహితుని రక్షించెను. తనకు శరణుజొచ్చిన కాటయవేముని కుటుంబమును యశఃకాముఁడై రక్షించెను. ఈతని రాజ్యమందు ముమ్మిడి పోలవరమను గ్రామము వైభవదశయం దుండెను. ఇదియె యితనిరాజధాని క్షాఁబోలు. ఇతఁడు బ్రాహ్మణులకు బంగారపు కొమ్ములుతో వేలకొలఁది గోవుల దానము చేసెను. ద్రాక్షారామ భీమేశునకు సువర్ణగోపురము కట్టించెను. ఈతఁడు పదునైదవ శతాబ్దమధ్యమునం దున్నట్టును రాజమహేంద్రవర ప్రాంతమున కొంతకాలము రాజ్యము చేసినట్టును కానవచ్చుచున్నది. గంగ (గోదావరి) యొడ్డున శిన్నసాని సంగమున కొద్దనున్న ఉత్తమగండ చోడాన్నదేవవరము గ్రామమును బ్రాహ్మణులకు దానము చేసెను.*

అన్నపూర్ణ.

పార్వతీదేవి యొక్క యొక రూపము. ప్రపంచమునకు నాహారమొసంగు దేవత. అన్నపూర్ణాదేవియొక్క యాలయము కాశిలోఁ గలదు. కాశికి నధిపతియైన విశ్వేశ్వరుని భార్య. ఆదిభిక్షువైన శివునకు భిక్షపెట్టుటకునై యీమె యీ రూపముధరించె నందురు. అన్నపూర్ణ విగ్రహమునకు నొకచేతులో పళ్లెమును గంటెయు నుండును. ఈమెవర్ణము రక్తము (ఎరుపు). చైత్రశుద్ధ అష్టమి ఈమె పూజాదినము. పూర్వపు రోమకులుగూడ 'అన్నపెరెనా' యను నొక దేవతను పూజించుచుండిరి. అది యన్నమిచ్చు దేవతయె. ఆమెపూజయు చైత్రమాసముననే చేయుదురు. [విశ్వకోశము.

---

* ఇది వఱకు నీతనిని గుఱించిగాని, యితని వంశమును గుఱించిగాని, చరిత్రకారకులకు నేమియుఁ దెలియదు. క్రొత్తగానతని తామ్రశాసన మొకటి రాజమహేంద్రవర చిత్రవస్తు ప్రదర్శనాలయమునం దున్నదని కనుఁగొనఁబడినది. దానిని గుఱించి Epigraphical Reports (Southren circle) 1912, Para 67 లో వ్రాయఁబడినది. అదియే యీచరిత్రకాధారము.

అన్నప్రాశనము. గృహ్యసంస్కార విశేషము. శిశువునకు మొట్టమొదట నన్నము తినిపించుట. మగపిల్లవానికి నాఱవ మాసమునందుగాని, యెనిమిదవ మాసమందుగాని ఆఁడుపిల్లకు నైదవమాసమందుగాని యేడవమాసమందుగాని, ఈ సంస్కారము చేయవలయునని ధర్మశాస్త్రము. మన యాంధ్రదేశమందును ఈ యాచారమే కలదు. శిశువునకు నన్నప్రాశనము మేనమామ చేయును.

అన్నభేది. (పాశ్చాత్య శాస్త్రము ననుసరించి) నూతనముగ తయారు చేసిన

స్వరూపము

అన్నభేది నిర్మలమై కొంచెము నీలవర్ణమిశ్రమైన ఆకుపచ్చని స్ఫటికపు ముక్కలవలె ప్రకాశవంతమై యుండును. గాలి జారిన కొలఁది పొడియై ఆకుపచ్చనివర్ణము కొంచెము గోధుమ వర్ణమునకు మారును. కొంచెము సిరా రుచియుండును. ఒకవిధమైన వాసన స్వల్పముగ నుండును.

ఇందుండుద్రవ్యములు

ఇందు ఇనుము, గంధకము, ప్రాణవాయువు (ఆక్సిజన్) అను మూలపదార్థములు గలవు. ఇందుప్రాణవాయువు హెచ్చుగ చేరినకొలఁది ఆకుపచ్చరంగు గౌర (గోధుమ) వర్ణముగా మారును. ఒక యణువు అన్నభేదిలో ఇనుముయొక్క పరమాణువు యొకటియును, గంధకపు పరమాణువు ఒకటియు, ప్రాణవాయువుయొక్క పరమాణువులు నాలుగును ఉండును. ఇవిగాక సాధారణముగా నిందు నీటియణవు లేదుండును. తూనిక వేసిచూడఁగా ౧౦౦. పాళ్ళ అన్నభేదిలో ఇనుము ౨౧.౧౫, గంధకము ౧౧.౦౫౧, ప్రాణవాయువు ౨౩.౦౨, నీళ్ళు ౪౫.౮౨ పాళ్ళు ఉండును. నీళ్ళు ద్రవరూపకముగా నుండక అన్నభేది స్ఫటికీకరణములలోఁ గలుగు ఘనరూపములుగా నుండును. దీనికి రసాయన శాస్త్రమందు 'లోహ గంధకితము' (Ferrous Sulphate) అని పేరు; లోగఅ$_4$ ($FeSO_4$) అని రాసాయనిక సంకేతము. ఇందు ౭ ఉ$_2$, అ ($7H_2O$) అనఁగా నీటియొక్క యేడు అణువులుకలిసి యుండును.

గుణములు

౧. వైద్యులు, ఇనుమును ఏయేవ్యాధుల చికిత్సల కుపయోగింతురో ఆవ్యాధులయందు అన్నభేదిని సాధారణముగ నుపయోగింపవచ్చును. రక్తపుష్టి లేనివారికి రక్తస్రావమును నిలుపుటకును ఇది సహకారియగును. కాని యినుముతో మిశ్రమమై తయారగు కొన్ని పదార్థములు సులభముగ జీర్ణమగునవిగను, మఱికొన్ని యట్లుగాక జీర్ణకోశమునకు నానాటికి శ్రమకలిగించునవిగను ఉన్నవి. కాఁబట్టి, వైద్యుఁడు రోగియొక్క బలమును బట్టియు, వ్యాధిబలమును బట్టియు అన్నభేదినిగాని, ఇనుముతో మిశ్రమమైన ఇతర పదా

ర్థములనుగాని ఉపయోగించ వచ్చును. ఇనుముగలమందును సేవించునప్పుడు మలబద్ధక మధికమై మలము నల్లనగును. కొందఱకు తలనొప్పి, కడుపునొప్పి, అజీర్ణము మొదలగు గుణము లినుమును సేవించుటచే కలుగును. అన్నభేది మోతాదు:- ౧ మొదలు ౫ గురిగింజల వఱకు, గ్రుక్కెడు నీళ్ళతో చేర్చి ఇయ్యవచ్చును. కాల్చిపొడిచేసి మాత్రగట్టిగూడ నియ్యవచ్చును. తక్కిన వివరములకు 'ఇనుము' అను శీర్షిక క్రింద జూడనగును.

౨. దుర్మాంసము పెరిగివచ్చు పుండ్లపై అన్నభేది రాచినయెడల కోత గుణము గలదు. నీళ్ళలో గలిపి పుండును గడిగినయెడల కోతగుణమంతగా నుండదు. మొండి పుండ్లు శీఘ్రముగ మానును.

౩. అన్నభేదియందు సూక్ష్మజీవులనునశింపజేయు గుణముగలదు. ఒకపాలు అన్నభేదిని ఆఱు పాళ్ళు నీళ్ళతో జేర్చి జలదారులను, పాయిఖానాలను, కడుగవచ్చును. ఒక మానవుడు విసర్జించు మలమును శుద్ధిచేయుటకు రమారమి రెండు తులముల అన్నభేదిపట్టును. కలరా మొదలగు వ్యాధులుగల దినములలో ఇతరపదార్థములు లేనిచో అన్నభేదిని సూక్ష్మజీవుల నాశనార్థమై ఉపయోగించ వచ్చును.

౪. పశువులకు గూడ రక్తపుష్టికొఱకును నెత్తురు విరేచనములకును, రక్తప్రవాహమును అపుటకును ఇయ్యవచ్చును. పశువుల పుండ్లకు మంచిమందు ; కాని అధికముగ నుపయోగించిన కోతకోయును. కొబ్బరి నూనెతో చేర్చి వాడవచ్చును. గుఱ్ఱమునకు ౩౦ మొదలు ౬౦ గురిగింజల మోతాదును, పశువులకు సగమును, మేకలకు గొఱ్ఱెలకు నొల్లవవంతును, కుక్కలకు ౧ మొదలు ౧౦ గురిగింజ లెత్తువఱకును లోపలకు వాడవచ్చును.

ఇతరోపయోగములు.

౧. కరక్కాయ నీళ్ళతో చేర్చి సిరాచేయుటకు అన్నభేది ఉపయోగించును (చూడు 'సిరా').

౨. నెరసిన వెండ్రుకలకు రంగువేసికొనుటకు మఱికొన్ని పదార్థములతో దీనినిగలిపి ఉపయోగింతురు (చూడు 'వెంట్రుకలు').

౩. కప్పు మొదలగు పండ్ల పొడుములలో వాడుదురు. చిగుళ్లలో నెత్తురు తగ్గించును కాని నల్లనిరంగు నిచ్చును (చూడుము 'పన్ను').

౪. రంగులు వేయుటలో అన్నభేది ఉపయోగింతురు (చూడు 'అద్దకము').

తయారుచేయువిధము

సన్నని ఇనుపతీగె ఒకతులమును, గంధక ధృతి ఒకతులమును, వాననీరు ౫ తులములును ఒక సీసాలో వేసి పెట్టినయెడల కొంతసేపటికి అన్నభేది తయారయి నీటిలో కరిగియుండును. అమ్మకమునకు అన్నభేదిని తయారుచేయునప్పుడు పైరైట్ (Pyrite) అను ఖనిజపదార్థమును గాలికిఆర్చిఇనుముపొడియునీరును జేర్చి కొంత కాలముంచి దానిసెండబెట్టగా

అన్నభేది తయారగును. సాధారణముగా దీనిని బజారులో అమ్ముదురు. [ఆ: ల.

(ఆయుర్వేద శాస్త్రము ననుసరించి)

దీనిని సంస్కృత భాషలో కాసీసమందురు. రసరత్నసముచ్చయము నందును, తదితరములగు రస

ఉపరసము, ఖనిజము

తంత్రముల యందును నీయన్నభేదిని ఉపరసములలో చేర్చుటచే రసవార్తికాచార్యులందరు దీనిని ఖనిజముగా వ్యవహరించినటులు దెలియుచున్నది. అయినను పూర్వులీ యన్నభేదిని ఇనుముతో గూడిన మిశ్రద్రవ్యము (Compound) గా పరిగణించిరనుట కాధారము లేవియులేవని ఉదయ చంద్రదత్తుగారు తమ "హిందూ మెటీరియా మెడికా" యను గ్రంథమందు వక్కాణించియున్నారు. ఖనిజముగా పరిగణించిన ఈకాసీసమును కొందరు గ్రంథకర్తలు తమతమ గ్రంథములయందు వాలుకా కాసీస మనియు, పుష్పకాసీస మనియు రెండు విధములుగలదానినిగా పేర్కొనిరి. మరి కొందరు ధాతుకాసీస మనియు, పుష్పకాసీస మనియు విభజించిరి. రస తంత్రములయందెచ్చటజూచినను రెండువిధములగు కాసీసములనే జెప్పియుండుటచే నిందు వాలుకా కాసీసమునకు ధాతుకాసీసమను నామాంతరముండి యుండవచ్చునని తోచుచున్నది. వైద్యవిశారదులందరు దీనినే అన్నభేదియను పేరున వ్యవహరించి చికిత్సలయందు తరుచుగ నుపయోగించుచున్నారు. దరదము (ఇంగిలీకము) సస్యకము (మైలతుత్తము) మొదలగునవి ఇప్పుడు రసాయనసమ్మేళనముచే తయారు చేయబడి, ఇంగ్లండు, హాలెండు మొదలగు దేశములనుండి మనకెగుమతి చేయబడు ద్రవ్యములను గురించి ప్రాచీన రసతంత్రజ్ఞులు వానియుత్పత్తి విధానమును, అవి దొరకు ప్రదేశములను చక్కగ నిర్దేశించుటచేతను, మట్టి యిసుక మొదలగు మలిన పదార్థములతో గూడియుండినవగుటచే శుద్ధి చేయక నుపయోగింప రాదని విధించుటచేతను, తాంత్రిక మహాయుగమునం దీయన్నభేదిగూడ గనులయందు దొరకుచుండెడిదేమోయని యూహింపనగు.

ఉదయచంద్రదత్తుగారు తమ హిందూ మెటీరియామెడికాయందు ధాతు కాసీసము ఆకుపచ్చని రంగుగలదిగను, పుష్పకాసీసము

కాసీస స్వరూపము

కొంచెముపసుపురంగు గలదిగను ఉండునని చెప్పియున్నారు. ఇందుకు నిదర్శనముగ

శ్లో॥ "కాసీసం ధాతుకాసీసం పాంశు కాసీసమిత్యపి,
తదేవ కించిత్పీతంతు పుష్పకాసీస ముచ్యతే"

అను శ్లోకమువలన ఆయుర్వేద ప్రకాశమను గ్రంథములో శ్రీమదుపాధ్యాయ మాధవులు పుష్పకాసీసము కొంచెముపచ్చని వర్ణముతో గూడి యుండునని నిరూపించి యున్నారు. ఇప్పుడీ కాలమందుగూడ ఈ రెండు విధములయిన వర్ణములుగల అన్న

భేదిని జూచుచున్నాము. ఈరెంటిలో పుష్ప కాసీసము మిగుల శ్రేష్ఠమయినదని వాగ్భటాచార్యులు మొదలగు నాయుర్వేద శాస్త్రజ్ఞులు "పుష్పాదికాసీసమతిప్రశస్తం" ఇత్యాది వాక్యములచే సూచించియున్నవారు. ఇందు వాలుకా కాసీసము క్షార విశిష్టమనియు, అమ్లరస విశిష్టమనియు, పుష్ప కాసీసము కషాయామ్లరస విశిష్టమనియు, వీర్యమునందు రెండును ఉష్ణవీర్య విశిష్టములే యనియుగూడ వర్ణించిరి. మరియు అన్నభేది శ్విత్రము (బొల్లి) నేత్రరోగము, శ్లేష్మరోగము, వాతరోగము, అజీర్ణము, అర్శోరోగము, క్షయరోగము, పాండువు, ప్లీహరోగము, గుల్మరోగము, మూత్రకృచ్ఛ్రము వీనిని బోకడచును. వ్రణమును శుద్ధిపరచి మాన్పును. "విషఘ్నం" అని చెప్పుటచే కృత్రిమవిషమునకు విరుగుడుగా నుపయోగించునని తోచుచున్నది. "ముఖకేశ రంజనకరం" "పటర్గం జనకం పరం" అని రసప్రకాశ సుధాకరమందు అన్నభేదియొక్క గుణకథనము గానబడుచుండుటచే దీని లేపనక్రియచే ముఖమునకు కాంతియు, కేశములకు కృష్ణవర్ణము గలుగునని తోచుచున్నది. ఇది వస్త్రములకు రంగువేయుట కుపయోగపడునట్లు గూడ తోచుచున్నది. అయితే దీని స్వతంత్రోపయోగమెచ్చటను జెప్పియుండునట్లుతోచదు. ఇతర ద్రవ్యములతో సమ్మేళనజేసి యుపయోగింపనగును.

దీనిని శుద్ధిచేయక నుపయోగింపరాదు. అట్లుపయోగించిన చర్మిపుట్టుట జూచుచునే యున్నారము. శోధనావిధానము లనేకములనేక రీతులుగా జెప్పియున్నను సర్వసాధారణముగా, 'శ్లో॥ భృంగరాజరసేస్విన్నం నిర్మలంహిప్రజాయతే' అను శాస్త్ర మర్యాదనతిక్రమింపక దీనిని వైద్యావతంసులందఱు శుద్ధిచేసియే వాడుచున్నారు. అనగా గుంటగలగరయొక్క పసరుతో దీనిని డోలాయంత్రమున వండి(స్వేదనచేసి)నచో, శుద్ధియగును. మరికొందరు గుంటగలగర్ర రసముతో ౮-౫ పర్యాయములు ఖల్వమున నూరి యుపయోగించుటయు గలదు. దీనికి మారణవిధాన మెచ్చటను గ్రంథస్థము కానరాదు. కాని వ్యవహారమునందు లఘుపుటంబులిడి దీనిని సిందూరింపజేసి వాడుట కలదు. ఇట్లు లఘుపుటములచే తయారుజేయబడిన అన్నభేదిసిందూరము శుద్ధిచేయబడిన అన్నభేదికంటె దోషరహితమును గుణాధిక్యతగలదిగను నగుచున్నది. శుద్ధిచేసిన యన్నభేదిని నిమ్మకాయరసము, వేపచెక్క రసము, కుక్కపొగాకు రసము, వీనిలో దేనిచేనయిన చక్కగనూరి బిళ్లలుగా జేసి, నీడలో నెండించి ఆ బిళ్లలను మూకుటిలో బోసి పైన మరియొక మూకుడును మూసి సంధి బంధనముజేసి ద్రవ్యపరిమాణము ననుసరించి ౫౦ మొదలు ౧౦౦ వరకు పిడకలతో పుటంబిడవలయును.

అనంతరము సాంగశీతలమునదీసి చూచినచో నందలి యన్నభేది ఖత్రగ సిందూరించి కుంకుమవలె నగును.

కాశీశసిందూరము

అద్దానిని సర్వరోగములయందును నుపయోగింపనగు. ఆంధ్ర దేశీయులగు వైద్యవరులందరీ రీతిగనే కాసీససిందూరమును తయారు జేయుచుందురు. మరియు దాక్షిణాత్యవైద్యులు కొందఱు కాసీసమునకు సమముగ సురాక్షారమును (Nitre) కలిపి పైజెప్పిన రసములలో నేదయిన నొకదానితో నూరి పుటమిడుటయు గలదు. ఈ విధానముగా తయారుచేసిన సిందూరము నెక్కువ గుణవంతమని వారి యాశయము. కాసీససిందూరముగాని, శుద్ధకాసీసముగాని ప్రధానముగాగల యోగములను గొన్నిటిని మాత్రము నిందుదాహరించెదను.

(౧) శ్లో॥ కాసీసంభస్మ కాంతస్య
చోభయం సమభాగికమ్,
వరావిడంగ సంయుక్తం
ఘృతక్షౌద్ర ప్లుతం ప్రగే,
భక్షితం హంతివేగేన
పాండుయక్ష్మాణమేవచ,
ప్లీహం గుల్మం గుదేశూలం
మూత్రకృచ్ఛ్రాణ్యశేషతః.

ఇతిరసప్రకాశసుధాకరే

అర్థము. అన్నభేది, కాంతభస్మము, సైంధవలవణము, వాయువిడంగములు, వీనిని సమభాగములుగ చూర్ణించి నెయ్యి తేనె వీనియందు గలిపి సేవించినచో, పాండువు, క్షయ, ప్లీహము, గుల్మము మొదలగు రోగములు శాంతించును. అగ్ని దీప్తికలుగును.

(౨) కాసీసం రోచనాతుల్యం
హరితాలం రసాంజనం,
అమ్లపిష్టః ప్రలేపోయం,
వృషకచ్ఛ్వాహిపూతయోః.

ఇతిచక్రదత్తః.

అర్థము. అన్నభేది, గోరోచనము, తాళకము, రసాంజనము, వీనిని కాంజికముతో నూరి లేపనము చేసినచో వృషణకచ్ఛ్వా, అహిపూతము మొదలగు చర్మరోగములు శాంతించును.

(3) సువర్ణ పుష్పకాసీసం
విడంగాని మనశ్శిలా
రోచనా సైంధవంచైవ
లేపనాచ్ఛ్విత్ర నాశనమ్.

ఇతి శార్ఙ్గధరసంహితాయాం.

అర్థము. హసపుజాజి, అన్నభేది, వాయువిడంగములు, మణిశిల, గోరోచనము, సైంధవలవణము, వీనిని సమానముగ గ్రహించి నూరి లేపనముచేసిన శ్విత్రమను కుష్ఠువు నశించును.

(౪) కాసీసం దధినాపచ
హింకాఘ్నా మధు సంయుతా.

ఇతిచక్రదత్తః.

అర్థము. అన్నభేదిని వెలగగుజ్జును సమముగ కలిపి తేనెతో సేవించిన ఎక్కిళ్ళు శాంతించును.

ఇట్లు కాసీసము ప్రధానముగాగల యోగము లనేకములు గ్రంథస్థములు గానబడుచున్నవి. [గం. దూ.

అన్నమ దేవుఁడు ఓరుగంటి

రెండవ ప్రతాపరుద్రుని తమ్ముఁడు. ప్రతాపరుద్రుని తండ్రిపేరు మహాదేవుఁడు, తల్లి పేరు ఉమ్మక్క. కావున నితని తల్లి దండ్రులును వారే యని మనమెంచ నవకాశముండును.

ఉమ్మక్క రుద్రమ్మదేవి కూఁతురు. ప్రతాప రుద్రుఁడు దిగ్విజయయాత్రవెడలి పన్రెండు సంవత్సరములు తిరుగుచుండెననియు, ఆకాలమున నితఁడు ఓరుగంటిలోఁ బరిపాలనము చేసెననియు, తురుష్కులు రాజ్యము మీఁదికి దండెత్తి వచ్చినప్పుడు ఈతఁడు సైన్యాధిపుఁడుగనుండి వారిని ననేకపర్యాయము లోడించెననియు, చివరకుఁ బ్రతాపరుద్రుఁడు పట్టు వడినకాలమున నితఁడే రాజ్యముచేసెననియు, ప్రతాపరుద్రుఁడు చెఱనుండి వెడలివచ్చిన తరువాత తానురాజ్యము చేయనొల్లక యీతనికిఁ బట్టము గట్టెననియు, ప్రతాపరుద్రుఁడు పరలోకగతుఁడైన తరువాత నితఁడు ఈశాన్యభాగంబునకై వింధ్యప్రాంతము వైపు వెడలి పోయెననియు 'ఏకశిలానగర వృత్తాంతము' * నందు వ్రాయఁబడినది. ప్రతాపరుద్రుఁడు చెరలో నుండు కాలమున నీతఁడు ప్రభుత్వము చేయుచుండఁగా విద్యానాథకవికృత ప్రతాపరుద్రీయము పూర్తి అయినదఁట. అప్పుడు కవి ప్రతాపరుద్రుని యొద్దకుఁబోఁగా నాతఁడు తన యుంగరమిచ్చి యాతనిని తనతమ్మని యొద్దకుఁ బంపెనఁట. అన్నమదేవుఁ డాతనికి గొప్ప బహుమాన మిచ్చుటయేగాక ఓరుగంటిలో నొకగొప్పపాఠశాలఁ బెట్టించి విద్యానాథుని దానికి నాచార్యునిఁ జేసెనఁట. ఈసమాచారము 'కవిచరిత్ర' 'మనుమహారాష్ట్ర' గ్రంథము నందుఁ గలదని అర్వాచీన కోశకారుఁడు వ్రాసినాఁడు. * ఈ అన్నమదేవుఁడు ఓరుగంటినుండి వెడలిపోయి బస్తరురాజ్యమును స్థాపించెను. బస్తరు సంస్థానమును నైజామువంటి స్వాతంత్ర ప్రభుత్వము. ఇది మధ్యపరగణాలలోనున్నది. దీనికి తూర్పున మన రాజధానిలోని జయపురము జమీందారియు, దక్షిణమున గోదావరిజిల్లాలోని భద్రాచలము తాలూకాయును అంటుకొని యున్నవి. అచ్చటిరాజులు ఈ అన్నమదేవుని తమ మూల పురుషునిగాఁ జెప్పుకొనియెదరు‡. అన్నమదేవుఁడు ఓరుగంటి నుండి బయలుదేరి నప్పుడు ఆతని కులదేవతయైన మాణిక్యదేవి యాతనికొక ఖడ్గమిచ్చెనఁట. అది యిప్పటి వఱకును ఆరాజులయొద్ద నున్నదట.[1] ఇతఁడు వచ్చునప్పు డాతని వెంట నొకబంటు నీళ్లు తెచ్చువాఁడు వచ్చెనఁట. వానివంశజులిప్పుడు బస్తరు సంస్థానమున ఫుట్ కేల్ జమీందారికి నధిపతులుగ నున్నారు.[2] బస్తరు సంస్థానమందు కోసా

* ఇది వ్రాతప్రతి. ఇటీవలివారిచే (బహుశః మెకంజి గుమాస్తాచే) వ్రాయఁబడినది, చెన్నపురి ఓరియంటల్ మ్యాన్యుస్క్రిప్టు లైబ్రరీలో నున్నది.

* 'అర్వాచీనకోశ' మనునది, చరిత్రాత్మక కోశము. మహారాష్ట్రభాషలో నున్నది. కర్త రఘునాథభాస్కర గోడ్బోలె. ఇందున్న యంశములున్నియు కావలి వెంకటరామస్వామిగారు ౧౮౨౯ లో కలకత్తాలోఁ బ్రకటించిన 'Dekkan Poets' అను గ్రంథమునందుఁ గూడఁగలవు.

‡ Imperial Gazetteer of India, Bastur.

1. *Central Provinces Gazetteers. Chhattisgarh Feudatory States*, p. 36. 2. *Ibid*, p. 51.

యాలను జాతివారు కలరు. వారిపూర్వులు ఓరుగంటినుండి యన్నమదేవునితో వచ్చినారఁట.[3] అన్నమదేవుఁడు విక్రమ సంవత్ ౧౪౧౭వ సంవత్సరమున నఁగా క్రీ. శ. ౧౩౬౦ లో రాజ్యాలము చేసెనఁట.[4] బస్తరు ఓరుగంటికి మిక్కిలి దూరముగా లేదు. ఈశాన్యమునందు రమారమి రెండువందల మైళ్ల దూరమున నుండును.

ఇప్పటి బస్తరురాజులు ప్రతాపరుద్రుని తమ్ముఁడైన అన్నమదేవుని సంతతి వారని చూపుటకు నాసంస్థానమందలి దంతేశ్వరి దేవాలయములో నొకశాసనము కలదు. అది బస్తరురాజుల పూర్వుఁడైన దిక్పాలదేవునిచే వ్రాయింపఁబడినది. ఇందలి సంవత్సరము విక్రమశకము ౧౭౬౦, అనఁగా క్రీ.శ. ౧౭౦౩. దిక్పాలదేవుఁ డన్నమదేవునుండి పదియవపురుషుఁడు. అన్నమదేవుని కుమారుఁడు హమ్మీరదేవుఁడు.* కాని శాసనమును సంపాదితము (Edit) చేసిన శ్రీయుత హీరాలాలుగారిందు రెండు అసందర్భములఁ జూపినారు. ఒకదానికి వారే సమాధానము చెప్పినారు. రెండవదానికిఁ జెప్పలేదు. మొదటి యసందర్భము. ఈశాసనమునందు అన్నమదేవుఁడు చంద్రవంశజుఁడుగాఁ జెప్పఁబడినాఁడు. కాని గణపతిదేవుని ఏకామ్రనాథ శాసనమునందు (Indian Antiquary vol. XXI, p. 200.) కాకతీయులు సూర్య వంశజులని చెప్పియున్నది. కాని యిదియొక యసందర్భముకాదు. ప్రతాపరుద్రుఁడు మొదట కాకతీయవంశమువాఁడు కాఁడు. దత్తతవలన కాకతీయుఁడయ్యెను. మొదట ప్రతాపరుద్రుఁడును అన్నమదేవుఁడును చంద్రవంశమునందుఁబుట్టి యుందురు. దత్తత పోయినందున ప్రతాపరుద్రుఁడు సూర్యవంశుండై యుండవచ్చును. అదియుఁగాక చంద్రసూర్యవంశములు మూలమునందెట్లు పుట్టినను, ఇటీవలిరాజులనుగుఱించి యవి కవికల్పనలేయని చెప్పవలెను. ఎవరికి నిష్టమువచ్చినట్లు వారు తమ వంశము సూర్యవంశమనియు, చంద్రవంశమనియు వ్రాయుచువచ్చిరి.

రెండవ యసందర్భము: అన్నమదేవుఁడు ౧౩౨౩ లోనున్నవాఁడు. ఇది ప్రతాపరుద్రుని జెఱపట్టుకొని పోయిన కాలము. అన్నమదేవుని వంశమందలి పదియవ పురుషుఁడు పైశాసనము వేయించినవాఁడు ౧౭౦౩ లో నుండెను. అనఁగా ౩౮౦ సంవత్సరములలో ౧౦ తరములు గడిచినవని అనుకొనవలెను. తరమొకటింటికి రమారమి ౩౮ సంవత్సరములు పడినవి. కాని సాధారణముగ తరమొకటింటికి ౩౦ ఏండ్లకంటె నెక్కుడుకాలము లెక్కవేయుటకు వీలులేదు. కావున ప్రతాపరుద్రుని తరువాత రమారమి నూఱేండ్లకు మఱియొక ప్రతాపరుద్రుఁడు, ఉండవచ్చుననియు ఆతఁడు యుద్ధమునందుఁ దురష్కులచేఁ జచ్చియుండవచ్చుననియు శ్రీయుత హీరా

3. *Chhattisgarh Feudatory States* 46. 4. *Ibid* p. 37.

* Epi. Indica. vol. IX. p. 165.

లాలుగారు వ్రాసిరి, కాని తద్గమునకు నల్లు బది సంవత్సరము లంతగా నెక్కువ కాలము కాదని మా తాత్పర్యము.

అన్నము, చూడుము ఆహారము.

అన్నయ రెడ్డి ఓరుగంటి రెండవ ప్రతాప రుద్రుని కాలమునందు సామంత రాజుగ నిప్పటి కృష్ణామండలములోని మున, గాల జమీందారిప్రదేశమును పాలించుచున్న రెడ్డిరాజు. మునగాల జమీందార్ల పూర్వుఁడై యుండును. మునగాల జమీంధ్దారీలోని తాడువాయ గ్రామమందు శిథిలమైన మల్లిఖార్జునుని దేవాలయములో నీరాజుచే వే యించఁబడిన శిలాశాసనములు రెండుకలవు. ఒకటి క్రీ. శ. ౧౩౦౦ లో నిది, రెండవది క్రీ. శ. ౧౩౦౬ లోనిది.* ప్రతాపరుద్రుఁడు రాజ్య ముచేయుచుండగనే - కాకతీయ రాజ్యవైభ వము పట్టపగలంటి సూర్యుని పగిది వెలుంగు చుండగనే - రెడ్లు రాజ్యము లేలుచున్నట్టు చెప్పెడి పురాతన శాసనమిదియే. రెడ్ల ప్రభు త్వమును సూచించునట్టి శాసన మింతకంటెఁ బూర్వపుదిలేదు.

అన్నయ్య (తెనాలి). ఈకవి సుదక్షిణా పరిణయమను నాంధ్ర కావ్యమును రచించెను. ఈకవి యింటిపేరు, తెనాలివారనియు, నీతని తండ్రిపేరు రామయయనియు నీతని కావ్య మందలి కృత్యాది పద్యములవలనఁ దేట పడుచున్నది.

విఖ్యాతిఁ జెందినట్టియుఁ, బాండురంగ మాహాత్మ్యమును రచించినట్టియుఁ దెనాలి

కవివంశము

రామకృష్ణునకు నీతఁడు తమ్ముఁడు. ఈసంగతి యాతని యన్న మనుమఁడగు, తెనాలిరామ భద్ర కవిచే రచింపఁబడిన ఇందుమతీ కల్యాణ* మనెడు కావ్యమందలి యీ క్రింది పద్య ములవలన స్పష్టపడఁగలదు:-

ఉ. మామకనవ్యకావ్యము స
మంచితమాధురి సాధురీతిగా
యామకృతి ప్రబంధ రచ
నాయతపాక చతుర్విధైక వా
ర్తామహిమోజ్జ్వలాఢ్యకవి
తాఘనతామహు మత్పితామహుల్
రామయ రామ కృష్ణకవి
రాజుఁదలంచి నుతించి మ్రొక్కెదన్

గీ. తదనుసంభవమణిని సుదక్షిణాప
రిణయముఖకావ్య రచనాధురీణు నంధ్ర
కవికదంబములోనఁ బ్రఖ్యాతిఁగన్న
యన్నపకవీంద్రు ధీసాంద్రునభినుతింతు.

కవిస్తుతిలో నిట్లువ్రాసి, కృతిపతి తనను గూర్చి యిట్లు చెప్పినట్లు లీ కవి వ్రాసి యున్నాఁడు:-

---

* Sewell's Antiquities Vol p. 43. Kistna District Manual.

* ఈకావ్య మచ్చుపడలేదు. శ్రీయుత మానవల్లి రామకృష్ణకవి గారియొద్ద నున్నది. వీరు వ్రాయించిన ప్రతి యొకటి మాకిచ్చినారు. కృతజ్ఞులము. కావ్య మంతగా నెక్కుడు యోగ్యతకలది కాదు.

సీ. ప్రౌఢి మీ పెదతాత పాండురంగాది స
త్కృతులు సేసెను రామకృష్ణసుకవి
అనుజుండన్నప్ప మీపినతాత రచియించెఁ
బరఁగ సుదక్షిణాపరిణయంబు
మీతాత శ్రీగిరి చాతురీవిఖ్యాతి
శ్రీశైలమాహాత్మ్యకృతి యొనర్చెఁ
గడిమి మీతండ్రి యిమ్మడి రామకృష్ణాఖ్యుఁ
డనకీర్తిగనె సంస్కృతాంధ్రములను
దౌరులనిపించె మీయన్న వీరరాఘు
వాఖ్యకవి సర్వకవితామహత్త్వమునను
నిన్ను నూచానకుంతాను నెన్నఁదరమె
పాజ్ఞహృదయాబ్జరవి రామభద్రసుకవి.

పై పద్యములను బట్టిచూడ తెనాలిరామ పండితునకు రామకృష్ణుఁడు, శ్రీగిరి, అన్నప్ప (అన్నయ) అనుముగ్గురు పుత్రులుండిరనియు వారుముగ్గురును కవులనియు, వారిలో మొదటివాఁడు పాండురంగమాహాత్మ్యాదికృతులును, రెండవవాఁడు శ్రీశైల మాహాత్మ్యమును; మూఁడవ వాఁడు సుదక్షిణాపరిణయమును రచించెనని తెలియుచున్నది. రామకృష్ణుని తండ్రిపేరు 'రామయ' యైనట్టు పాండురంగ మాహాత్మ్యములోని 'రామయరామకృష్ణ' యనుప్రయోగమువలన స్పష్టము.

తెనాలి రామ కృష్ణుఁడు ప్రథమశాఖా నియోగి, యనఁగా శుక్లయజుర్వేదీయ యాజ్ఞవల్క్యశాఖవాఁడనియు, కౌండిన్య గోత్రుఁడనియు 'లక్ష్మమ్మ' కుమారుఁడనియు, పాండురంగమహాత్మ్య మందలి కృత్యాది పద్యములవలనఁ దెలియుచున్నది. కావున నాతని తమ్ముఁడైన అన్నయ్యకుఁ గూడ నావిశేషణములు చెల్లునని మనమెంచుకొన వచ్చును. కాని యిద్దరి గురువులు (ముద్రాగురువులు) వేఱువేఱు. రామకృష్ణుఁడు తనగురువునిట్లు వర్ణించినాఁడు:-

క॥ వాక్కాంతా శ్రయభట్టరు
చిక్కాచార్యుల మహాత్మ శ్రీగురుమూర్తిన్
నిక్కపుభక్తి భజించెద
నిక్కావ్య కళాకలాప మీడేరుటకున్.
[పాండు. ౧.

అన్నయ్య తన గురువును గుఱించి యిట్లు చెప్పియున్నాఁడు:-

క॥ కంఢాళభావనార్యుల
నందను శ్రీరంగ గురుని నతబుధరక్షా
మందారంబు నుతింతును
మందారమరందచిందుమధురాగభటిన్. [౧. ౯.

ఇట్లీ కవికి మతసంబంధమైన గురువు వైష్ణవుఁడయినను, తనను గుఱించి యాతఁడు 'హరపదాంభోజ సౌముఖ్యుఁడ' ననియు (౧. ౧౪), ఆశ్వాసాంతగద్యమునందు 'సహజశైవాచారసంపన్న శ్రీమదన్నయ నామధేయ' యనియు వ్రాసికొనుటయు వింతగనున్నది. ఈతనికి మతవిషయమై శ్రీరంగాచార్యుఁడు గురువుగనున్నను విద్యావిషయమై పాలగుమి భీముఁడను వాఁడు గురువుగనున్నట్టు మన మీక్రింది పద్యము వలన నూహింపవచ్చును.

గీ॥ నన్నపార్యాదులను బుద్ధినన్నుతించి
పాల్గుమి భీమగురుని సద్భక్తిఁగొలుతు. [౧. ౯.

ఈ కవి రామకృష్ణుని తమ్ముఁడగుటచే నాతనికాలమే యీతనికాలము. కాని

రామకృష్ణుని కాలము నిశ్చయముగ నింకను తేలలేదు. గనుక నీతని కాలము స్వతంత్రముగ నిర్ణయింపఁ బ్రయత్నించెదము.

కవికాలనిర్ణయము

ఈప్రయత్నము రామకృష్ణకవి కాలనిర్ణయమునకుఁ గూడ సహకారి కావచ్చును.

ఈ కావ్యము (సుదక్షిణా పరిణయము) పులిజాల సోమామాత్యునకు సంకితము చేయఁబడినది. ఈ యమాత్య శేఖరుఁడు కోనేటి రామరాజు అను రాజునొద్ద మంత్రిగానుండెను. ఈరామరాజును, కృష్ణదేవరాయల యల్లుఁడైన అళియ రామరాజును ఏకవంశము వారు. ఆర్వేటి బుక్కరాజు కుమారుఁడైన రామరాజిద్దఱకును మూలపురుషుఁడు. కోనేటి రామరాజు అళియ రామరాజునకు వరుసకు మనుమఁడు. వీరిద్దఱకుఁగల సంబంధ మీక్రింది వంశవృక్షమువలనఁ దెలియఁగలదు.* ఈతఁడు వరుసకు మనుమఁడైనను అళియ రామరాజు యొక్క చివరదశయందున్నట్లు కానవచ్చుచున్నది. అళియ రామరాజు మిక్కిలి వృద్ధుఁడై యున్నవాఁడై నందున నాతనికి మనుమలు పుట్టి యుండుట యొక యాశ్చర్యము కాదు. మనుమఁడైన యీ కోనేటి రామరాజు అళియ రామరాజు నొద్దనుండి కొంత రాజ్యమును వడసినట్లు సుదక్షిణా పరిణయమందలి యీ క్రింది పద్యమువలనఁ గాన్పించుచున్నది:-

మ॥ సమరజిద్విక్రమధాముఁ డాయళియరా
మక్ష్మావరోత్తంసుచే
గురుసామ్రాజ్యధురంధరత్వ మనుఁడా
కోనేటి రామాధిప
స్థిరసైన్యాధిపుఁ డబ్బమంత్రివరియిం
చెన్ యజ్ఞమాంబాజ్ఞనో
హర భాగ్యోన్నతిఁ గంకి పాటిపురవే
ధామాత్యపుత్రీమణిన్.[౧-౪౭

రామరాజు ౧౫౬౫ లో తాళికోటయుద్ధమునందు వీరమరణము నొందుట సుప్రసిద్ధమే. కావున నాతనిచే రాజ్యముఁ బొందిన కోనేటి రామరా జప్పటికిఁ జిన్నవాఁడని అనుకొనినను ఆతని మంత్రికి సంకితమిచ్చిన కావ్యము

* ఆర్వేటి బుక్కరాజు

- రామరాజు
  - తిమ్మరాజు
    - పినకొండరాజు = కోనమ్మ
      - తిమ్మరాజు = వెంగళాంబ
        - కోనేటి రామరాజు
  - కొండరాజు
  - శ్రీరంగరాజు
    - అళియ రామరాజు

సూచన:- ఈవంశవృక్షము వసుచరిత్రమును, సుదక్షిణాపరిణయమును అనుసరించి వ్రాయఁబడినది. మొదటిదానియందు శ్రీరంగరాజు వంశము వర్ణింపఁబడినది; రెండవదానియందు తిమ్మరాజు వంశము వర్ణింపఁబడినది. ఈవంశవృక్షమునందు మనకు వలసినంత వఱకే పేర్లీయఁ బడినవి. తక్కినవి విడిచిపెట్టఁబడినవి. శ్రీరంగరాజునకు నైదుగురు కొడుకులు గలరు. వారిలోఁ బ్రస్తుత విషయమునకు నావశ్యకమని ఒక్క అళియ రామరాజు పేరు నుదాహరించి మిగిలిన పేర్లు విడిచిపెట్టితిమి.

౧౫౮౪ కంటె దిరువాతి కాలమున వ్రాయఁబడియెనని తలంచుటకు వీలులేదు. మేము చూపిన పై ప్రమాణముఁ జూపకపోయినను, ఉభయ రామరాజుల సంబంధమును బట్టియు, మఱికొన్ని ప్రమాణములను బట్టియు *శ్రీ వీరేశలింగముగారీ కవికాలము ౧౫౮౦-వ ప్రాంతమనియు †శ్రీరామకృష్ణ కవిగారు ౧౫౬౯ అనియు వ్రాసియున్నారు. కావున నీకవియేమి, యితనియన్నయైన రామకృష్ణుఁడేమి క్రీ. శ. పదునాఱవ శతాబ్దముయొక్క మూఁడవ నాల్గవ పాదములోని వారనుట స్పష్టము. నిశ్చయమున నీయేట్టనేపుట్టి ఈ యేటఁ గీర్తిశేషులైరని చెప్పుటకు వీలులేదు.

సుదక్షిణాపరిణయము ౧౫౬౭ వ సంవత్సరము తరువాతను, ౧౫౯౨ వ సంవత్సరమునకుఁ బూర్వమును రచింపఁబడెననుటకు నొక నిదర్శన మిందుఁగాన వచ్చుచున్నది. ద్వితీయాశ్వాసమునందు శివుఁడు, తపస్సు చేయుచున్న రాజుకడకు, మాయాబ్రాహ్మణుని వేషము వేసికొనివచ్చి తన నివాసస్థలము చెప్పుటలో నిట్లు చెప్పెను:-

క. పెనుగొండనిలుతుఁ దఱచుగ
మనపెనసి ధనాఢ్యుఁడొకఁడు మముఁగూడుకరాఁ
జనవున సకల జనంబులుఁ
బనిసేయఁగఁ గొదవలేనిబలగముతోడన్.

[౨. ౫౯.

ఈ పద్యమునందు 'పెనుఁగొండ' శబ్దముపై శ్లేషగలదనుట స్పష్టము. పెద్దకొండమీఁదనని యొకయర్థము, పెనుగొండ పట్టణమున నని రెండవ యర్థము. కవి యిట్లు పెనుగొండశబ్దమును ఉపయోగించుటకు నప్పుడు పెనుగొండ గొప్పపట్టణముగను, రాజధానిగను ఉండవలెను. లేనిచో శ్లేషసారస్యము కానుపించదు. పెనుగొండకు తిరుమల రాయిలు ౧౫౬౭ లో తన రాజధానిని మార్చెను. అచ్చట ౧౫౯౨ వఱకుండి యచ్చటి నుండి యాయేట చంద్రగిరికి రాజధానిని మార్చెను (Brigg's Ferista vol 3,p.141). కావున ఈ కాలములోనే యీ కావ్యమును కవిరచించి యుండవచ్చునని మన మూహింపుటకు వీలుకలదు. పై పద్యమునందలి 'ధనాఢ్యుఁడు' అనుపదము శ్లేషచేఁ గుబేరునకును, తిరుమల రాయులకును చెల్లునని కూడఁ దోఁచెడిని.

ఈ కృతిని సంకితముపొందినవాఁడు పులిజాలరామయామాత్య కుమారుఁడైన పులిజాల సోమయామాత్యుఁడు కృతిపతి (౧.౧.). కవి యీతని వంశమును, ఈతనియేలికయైన నోనేటి రామరాజు వంశమును సవిస్తరముగ వర్ణించియున్నాఁడు. కృతిపతియు, నాతని తమ్ముఁడగు అబ్బన్నయుఁ దప్ప నీ వంశమునందితరు లెవరును రాజులయొద్ద గొప్పయుద్యోగములలో నున్నట్టు కానరాదు. వీరిది కాశ్యప

* ఆంధ్రకవుల చరిత్రము, ౨-వ భాగము.

† తెనాలిఅన్నయ్య. ఆంధ్రపత్రిక సంవత్సరాది సంచిక (౧౯౧౪) ౯౯ పుట.

గోత్రము. సోమయ్యకు నేడవ పురుషుఁడు మల్లయ. ఆతని నొల్లవకొడుకు పోచన్న, ఆతని పెద్దకొడుకు సింగన్న, ఆతని కడసారి మూఁడవకొడుకు పోచన్న, ఆతని పెద్ద కుమారుఁడు దుగ్గయ్య. దుగ్గయ్యకిద్దఱుకొడుకులు; రామయ్య, వీరయ్య. రామయ్య భార్య తిమ్మాంబ. ఈదంపతులకుఁ బెద్ద కుమారుఁడు సుదక్షిణా పరిణయ కృతిపతియైన సోమయామాత్యుఁడు. ఈతనికి ఎల్లయ, అబ్బన, కోటయ, దుగ్గయలను తమ్ములుండిరి. వీరిలో అబ్బన యను నతఁడు కోనేటి రామరాజు నొద్ద సైన్యాధిపుఁడుగ నుండెను. సోమయామాత్యుని భార్య వైకుంఠమ్మ. కొడుకు వెంకటయ్య. ఇంతకంటె వీరినిగుఱించి మనకునధిక మేమియుఁ దెలియదు.

గ్రంథకర్త నివాసస్థలము గాని కృతిపతి నివాసస్థలము గాని నిశ్చయముగఁ దెలియుట లేదు. గ్రంథకర్త కృతి

నివాసస్థలము

పతిని గుఱించి వ్రాయుచు "మహాహట్టబాదాలి పట్టణ శ్రీకిరీటంబగు కొలవు కూటంబునఁ"* గూర్చుండి తనను పిలిపించినట్లు వ్రాసియున్నాఁడు (౧. ౧౨.) కాని యీ బాదాలి యెక్కడ నున్నది తెలియదు. 'బాగాలి' యను గ్రామ మొకటి బళ్ళారిజిల్లాహరపనహళ్ళి తాలూకాలోఁ గలదు. కోనేటి రామరాజు మొదలయినవారు దత్తమండలము లోనే చిన్నజమీందారులుగ నుండిరని తోఁచుచున్నది. అయినను ఇది యింకను శోధింప వలసినవిషయము.

సుదక్షిణా పరిణయము అయిదాశ్వాసముల కావ్యము. ఇందు రమారమి తొమ్మిది

సుదక్షిణాపరిణయ కావ్యము

వందల పద్యములు కలవు. ఇందు సూర్యవంశపు రాజయిన దిలీపునిగుఱించిన కథకలదు. కాళిదాసుఁడుకూడ తనరఘువంశ కావ్యమును ఈరాజు చరిత్రము తోడనే ప్రారంభించెను. కాని యితఁడు సుదక్షిణను వివాహమాడి కొంతకాలము ప్రభుత్వముచేసినతరువాతజరిగినవృత్తాంతము రఘువంశమునందుఁ జెప్పఁబడెను. ఈ కావ్యము నందు వివాహమునకుఁ బూర్వము జరిగిన వృత్తాంతము వర్ణింపఁబడినది. దిలీపునకు నిందుమతికి జరిగినవివాహముతో నీకావ్యము ముగియును. ఈ కావ్యమందలి కథ సంగ్రహముగ నీక్రింద నిచ్చుచున్నారము:-

అంశుమంతుఁడను రాజొకఁడయోధ్యాపురంబు నేలుచుండెను. అతఁడు మాళవరాజు కూఁతురగు భానుమతిని పరిణయ మాడెను. వారికెన్నాళ్ళకును సంతానము కలుగకపోయెను. అంత నంశుమంతుఁడు రాజ్యమును మంత్రికొప్పగించి, భార్యను వెంటఁగొని, మేరుపర్వతమునకేగి శివునిగూర్చి ఘోరతపమాచరింప సాగెను. అతఁడు చేయుంతపమున

* బాజను హేమాద్రి వరమునందు చింతామణిముద్రాక్షరాధి కారులచేఁగ్రంథాలయముగఁ బ్రకటింపఁబడిన సుదక్షిణాపరిణయముయొక్క రెండవ కూర్పు మేము ఉపయోగించినాము. మాతృకాప్రత్యంతరము దొరకలేదు. కావున 'బాదాలి' యను పాఠము సరియైనదికాదని నిశ్చయముగఁ జెప్పుటకు వీలులేదు.

కింద్రాదులు వెఱచి శివుని కడ కేగి, అతఁడు కోరిన వరము లొసఁగుమని వేడుకొనిరి. శివుఁడును వల్లెయని వారినంపి 'అర్థార్థి కల్పశాఖి' యగు నిజభక్తుఁజూడ రమ్మని పార్వతిని బిల్చెను. 'రాజులు దుష్టచిత్తులు. వారికి భావశుద్ధియుండ'దని యామె పలుక, 'నీ సర్ దేహమును చేర్చెదను, నాతో రమ్మ'ని శివుఁడామెను దోడ్కొనిపోయెను. అటు నంశుమంతుఁడు భోజనము జేయఁదలఁచి అతిథికొఱ కెదురుచూచుచుండెను. ఇంత లో నప్పటికి ముసలిబ్రాహ్మణదంపతుల వేషములతో పార్వతీపరమేశ్వరులువచ్చి,తమకు సంతానములేనందున వగచుచుండ నొకసిద్ధుఁడు దమ్ము కనికరించి మేరు ప్రాంతమునఁ దపమొనరించుచున్న అంశుమంతుని భార్యాసహితముగా కాళికాదేవికి బలియిచ్చిన నామె ప్రసాదించునని చెప్పె ననియు, వారున్న సెలవును జూపవలెద మనియుఁ బల్కిరి. అప్పుడా రాజదంపతులు తమ్ముఁదెల్పుకొని బ్రహ్మార్పణ తత్పరులై కపట వేషధారులను వెంబడింప సమకట్టిరి. అదిజూచి శివుఁడు సాక్షాత్కరించి, నిజభక్తునికి పుత్త్రవర మొసంగి, పాశుపతాస్త్రమును సమంత్రకముగ ననుగ్రహించి చనియె. కొన్నాళ్ళకు భానుమతీదేవి యొక్క శుభ లగ్నమున నొక సుతుఁగాంచెను. అప్పు డాకాశవాణి వానికి దిలీపుఁడని నామకరణము జేసెను. దిలీపుఁడు దినదిన ప్రవర్ధమానుఁడై యౌవన వంతుఁడు కాఁగా, అంశుమంతుఁడతనికిఁ బట్టముగట్టి తపముఁజేయ వనమున కరిగెను.

వనధర విద్యున్మాలిక లను విద్యాధరదంపతులకు గంధగజుఁడను పుత్త్రుఁడు జనించెను. ఒకనాఁ డతఁడు కొందఱప్సరసల వెంటనిడుకొని విశ్వామిత్రుని తపో వనము ప్రవేశించి, అందు స్వేచ్ఛమై విహరించి సీధు పానము జేయుచుండెను. అదిజూచి విశ్వామిత్రుఁడు మహోగ్రుఁడై రాక్షసుఁడవుగమ్మని యావిద్యాధరునికి శాప మొసంగెను. అంతట నతఁడు రాక్షసాకృతి వహించి మాయావతి యను పురమునునిర్మించి రత్న చూడాభిధానుఁడై పరగుచు, నన్ని లోకములను జయించి యింద్రుని రాజధానియైన అమరావతిపై దండువెడ లెను. మొదట నతఁడింద్రునోడించి. జయలక్ష్మీకర గ్రహణ మొనర్పనెంచెనుగాని, జయంతుఁడు విజృంభించినందున నప్పటికి మట్టడఁగాలించి, నిజపురమున కేగక బ్రహ్మనుగూర్చి జలధరాశ్రయమునఁ దపముఁ జేయఁబోయెను.

దిలీపుఁడు వైభవముతో రాజ్యము నేలుచుండెను. ఒకనాఁడతఁడు కొలువుదీర్చి యుండ ధూమకుఁడను బోయవేఁటకాఁడువచ్చి సింహ మొకటి దేశమునంత యుఁ బాడుచేయుచున్నదనియు, దాని నెట్లైన సంహ రింపవలయుననియు వేడుకొనెను. దిలీపుఁడంత వేట వెడలి, సింహమును వేటాడి బాణమేయ నది యదృశ్య మై స్త్రీరూపముఁజెంది యిట్లని తనకథను దెల్పెను: "నేను హారిణియను అచ్చరను. ఒక నాఁడింద్రుఁడు నన్నుబిలిచి వీతహవ్యముని తపముఁ జెరుపఁబంచెను. నేనును వల్లెయని యెంతఁ బ్రయత్నించినను, ఆముని నిశ్చలుఁడైయుండె, అంత నే నాతని కంఠము గిరి 'సింహముగి రెనిదుగో చూడు' మని పల్క నతఁడు కోపించి నన్ను సింహమూర్తివై సంచరింపుమని శపించెను. నేనతనివేడుకొన నతఁడు కరుణించి 'దిలీపుని వలన నీకు ముక్తి కలుగఁగలదని' చెప్పెను. ఇంతకు ముందొక నాఁడు నారదుఁడింద్రుని కడకువచ్చి 'రత్నచూడుఁ డను రాక్షసుఁడు బ్రహ్మవలనఁ దానెవ్వరిచే మృతి నొందునో, వానితల వేయివ్రక్కలగునట్లు వరముబొందె' నని చెప్పెను. అప్పు డింద్రుఁడు బ్రహ్మను బ్రశ్నింప నతఁడొకానొక కన్యను పరిణయమాడు దిలీపుఁడతని సంహరింపఁగలఁడని పల్కెను. ఆ లతాంగి ఎవ్వని పుత్రికయో వినఁబడరాదయ్యె" ఇట్లు చెప్పి నాయప్సరస యదృశ్యమయ్యెను.

అప్పుడు దిలీపుని వెదకికొనుచు నిజసైన్యములువచ్చి చేరెను. దిలీపుఁడు జరిగిన సంగతి తనమంత్రియగు సుదర్శనునికిఁదెల్పి యాకన్యనుగూర్చి యొఱుఁగుదు వే

యని యడుగ నతఁడిట్లు చెప్పసాగెను. "నేనొకనాఁ డుద్యానవనమున విహరించుచుండ నొకడేగచేఁ దరుమఁబడుచున్న చక్రవాకివచ్చి, నాశరణువేడెను. అంతట నేను చక్రవాకి కభయహస్తమిచ్చి, డేగను భస్మము నర్చితిని. డేగ రాక్షసాకారమునఁబడెను. చక్రవాకి యు స్త్రీయయ్యె. అప్పుడాశ్చర్యచకితుఁడనై తద్వృత్తాంతమడుగ నాస్త్రీ యిట్లని చెప్పెను. 'నేను సాధ్యలోకాధిపతియగు చంద్రపాలుని కూఁతురను. నాతండ్రికిని, మగధరాజగు సురధునికిని జాలస్నేహము. ఇట్లుండ రత్నచూడుఁడు మగధరాజుపై దండెత్తి చంపకావతిని ముట్టడింప, నతఁడా రాక్షసుని ప్రతాపాగ్నికి తాళలేక తొలఁగిచని, శాండిల్యముని వద్దకరిగి రత్నచూడుని సంహరింపఁజాలు పుత్రు నిమ్మని వేడెను. అంత నమ్మునియుపదేశానుసారమున సురధుఁడు గంగాతీరమున యజ్ఞముఁజేయ అగ్నిప్రత్యక్షమై యొక కన్యను ప్రసాదించి, సుదక్షిణ యని నామకరణము జేసి యదృశ్యుఁడయ్యె. కొన్ని వత్సరముల కాబాలికయు యౌవనము ప్రాప్తించె. ఈసంగతిని కలహభోజనుఁడగు నారదుఁడు రత్నచూడునకుఁ దెల్ప నతఁడు చంపకావతిపై మఱలదండెత్తి 'నీకుమార్తె నిచ్చెదవా, నీరాజధాని దహనమగుటో' యని సందేశమంపెను. అంతటఁ నతఁడు చేయునదేమియును లేక విష్ణుదేవుని ప్రార్థింపఁ నాతఁడా పురమును చీమ చిటుకుమనకుండ బ్రహ్మనివసించు శైలమునకుఁ జేర్చెను. రాక్షసుఁ డీమోసము గ్రహించి నిజపురంబునకేగి సురధుని నెలవు కనుగొన చారులఁ బంచె. నేనొకనాఁడు సురధుని సౌధమునకేగుచుండ రశ్మికేతనుఁడను రాక్షసుఁడు నన్ను బట్టిమైబట్ట రానేను చక్రవాకినైతిని, అంతనతఁడును శ్యేనమయ్యె' ఇట్లు చెప్పి యాస్త్రీ సాధ్యలోకమునకరిగె" ఇవ్విధమున సుదక్షిణను గూర్చి తెలిసికొని దిలీపుఁడు మన్మథానల తప్తుఁడయ్యెను. అప్పుడు రౌద్రవదనుఁడను రాక్షసమంత్రి వినువీధి నేగుచు 'హా! సుదక్షిణా!' యని విరహార్తిగుందుచున్న రాజుఁగాంచి 'అతఁడే సుదక్షిణనువరించు దిలీపుఁ'గా గ్రహించి, మానిసి, సుదర్శనుని తనవిమానమున నిడుకొని యేగుచుండెను. ఈసన్నఁ దెలిసి దిలీపుఁడు రాక్షసుని వధించి పుష్పకము నెక్కికొని దవ్వేగ నచ్చటనొక యుద్యానవనము గాన్పించు దిగిరి. అప్పుడు వనదేవత వారికి ప్రత్యక్షమై సుదక్షిణయచ్చట నే విరహబాధ నొందుచున్నదని తెలిపెఁగా వారు సఖీజన పరివృతయైన సుదక్షిణను గాంచిరి. అట్లు సుదక్షిణా దిలీపు లన్యోన్య సందర్శన భాగ్యమనుభవించుచుండ నొక పులి లేడిపిల్లను తరుము కొనివచ్చి నందున స్త్రీలందఱు తలకొకదారి పాఱిరి.

సుదక్షిణ కరగ్రహణ మొనరింపక పూర్వము రత్నచూడుని దునుమనెంచి, దిలీపుఁడు నిజపురమునకేగి సైన్యముల సమకూర్చుకొని మంధరశైలము మీఁదికి దాడి వెడలి, మాయావతిని ముట్టడించెను. అంతఁ ఘనములయుద్ధము ప్రారంభమయ్యెను. అందు దిలీపుఁడు రత్నచూడుని పాశుపతాస్త్రమున సంహరించి, అతని తనువును బడబాగ్ని మధ్యమున వైచెను. తరువాత నొక శుభలగ్నమున సుదక్షిణా దిలీపులకు మహావైభవముతో వివాహమహోత్సవము జరిగెను.

కావ్యవిశేషములు

ఈ కావ్యముపేరు సుదక్షిణాపరిణయము అయినను సుదక్షిణకథ చివర రెండు ఆశ్వాసములలో మాత్రము వచ్చును. మొదటి మూఁడాశ్వాసములందును దిలీపుని కథయే వర్ణింపఁబడినది. ఈకావ్యము రసముగల కావ్యములలో నొక్కటియని చెప్పవచ్చును. మహాకావ్యమనిగాని, లోకోత్తరమైనదనిగాని చెప్పుటకు వీలులేకపోయినను ఇందలి "కవిత్వము సలక్షణమై మధురమై కర్ణరసాయనముగానున్నది" యని శ్రీవీరేశలింగముగారి యభిప్రాయముతో నేకీభవించుచున్నాము. పాశ్చాత్యసాహిత్య విమర్శన శాస్త్రానుసార

ముంజూచితిమేని. ఇందు నేపాత్రయొక్కయు స్వభావోన్మీలనము కానరాదు. నాయకుఁడు దిలీపుఁడు, నాయికసుదక్షిణ, ప్రతినాయకుఁడు రత్నచూడాసురుఁడు. వీరి తరువాతఁ జెప్పఁ దగినవారు దిలీపుని తండ్రి అంశుమంతుఁడు, సుదక్షిణ తండ్రి సురథుఁడు. వీరిలో నాయిక మనకు విరహవేదన కాలమందు నొక్కసారి, మఱియు వివాహ సమయమున నొక్కసారి మాత్రము కొద్దికాలము కానవచ్చును. (౫-వ ఆశ్వాసము.) అప్పుడైనను ఒక్కమాట కూడ మాటలాడదు. కావున నామె దిలీపుని కొఱకు విరహతాపమును పడునట్టి యొక చక్కని స్త్రీ యన్నమాట తప్ప యామెను గుఱించి మన మామెమాటల వలనగాని చర్యలవల్లనగాని యేమియు నెఱుఁగఁ జాలము. ఇఁక నాయకుఁడు మాత్రము మనకుఁ బెక్కుసారులు కానవచ్చును. ఎన్నిసారులు కానుపించినను యుద్ధము చేయఁగలవాఁడు, వేటాడఁగలవాఁడు, స్త్రీని మోహింపఁ గలవాఁడుగఁ గానవచ్చును. మొట్టమొదట నింద్రుఁడు పరాజితుఁడై తనయొద్దకు రాఁగా నాతని సాయమునకుఁ బోవయత్నించుటయు, సింహము బాధ పల్లెవారికిఁ దొలఁగించుటకు వేటకుఁ బోవుటయు నాయకుని యొక్క పరోపకార చింతను గొంతవఱకు సూచించుచున్నవి. కాని యిది శృంగార ప్రబంధమని కాఁబోలు కవి యీ మనోభావమును పూర్తిగఁ జిత్రించుటకు యత్నము చేయలేదు. ప్రతివీరుఁడైన రత్నచూడుని చర్యలు నాయకుని చర్యకన్నఁ బాగుగ వర్ణింపఁబడినవి. ఇతఁ డింద్రుని పట్టణము మీఁదికి, సురథుని చంపకావతి మీఁదికి దండెత్తిపోయిన ప్రకరణములు చక్కఁగానే వర్ణింపఁబడినవి కాని భారత భాగవతములలో హిరణ్యకశిపుఁడు మొదలయిన దానవులు అమరావతి మీఁదికిఁ బోయినప్పుడు చేయఁబడిన వర్ణనములకు సరిరావు. నాయకుని తలిదండ్రులయిన అంశుమంతుని స్వభావోన్మీలనము చక్కఁగఁ జేయఁబడినది. ఆతఁడు కపటవేష ధారులైన శివపార్వతులకై తమ దేహములను సమర్పించుటకు సిద్ధపడిన ప్రసంగ వర్ణనముఁ జూచిన వారి సచ్చారిత్ర మంతయు నొక్కసారి వెల్లడికాఁగలదు. పాత్రయొక్క స్వభావావిష్కారమునకు నొక్క చిన్న ప్రసంగము చాలును. పెక్కు పద్యము లక్కఱలేదు. అంశుమంతుఁడు దిలీపునకు రాజ్యము గట్టి యరణ్యమునకుఁ బోవునప్పుడు కుమారనకుఁ బ్రజలను చక్కఁగఁ జూడుమని చేసిన బోధవలన నాతని స్వభావము వెల్లడియగుచున్నది. ఇట్టి కావ్యమునందుఁ దమగుణములచే జదువరుల గౌరవమునకుఁ బాత్రమై 'ఆహా! మంచివాం'డ్రనిపించుకొను పాత్రలు అంశుమంతుఁడు భానుమతియునను వారిద్దఱే. చదువరులకు నితరుల యెడ సగౌరవము కలుగుననికాదు; ఇతరుల విషయమై యౌదాసీన్యభావము కలుగును.

ఈకవి జాతీయములగు సామెతలను అచ్చటచ్చటఁ బద్యములం దిమిడ్చి కావ్యము

నకు శోభ తెచ్చెను. అందుకు గొన్నియుదాహరణములు:-

"పేద తెవు లింక నంగడి బెట్టకున్న తీరదు" (౨-౫౧)

"చూడంబోయెడుతీవ కాళ్లఁబడి లెన్" (౨-౬౪)

"అడంబోయెడు పుణ్యతీర్థ మెదురైనట్లు" (౨-౬౪)

"వ్రుడు నకు మ్రొక్కఁగఁ బోయిన గుడిమీఁదఁ బడినయట్లు" (౨-౭౦)

"కానఁగాచిన వెన్నలగా బ్రతుకు" (౨-౭౪)

"కతకుఁగాళ్లు ముంతకుఁ జెవులు గల్పించినట్లు" (౪-౨౫)

"కుండేటికొదమకుఁ గొమ్ముచూపునట్లు" (౪-౨౫)

అచ్చటచ్చటఁ గొన్ని విడివర్ణనలు ఔచిత్యముఁ గల్గియున్నవి. ద్వితీయాశ్వాస మందలి మాయాబ్రాహ్మణ బ్రాహ్మణి (శివపార్వతుల) చర్యలు, తృతీయాశ్వాసము నందలి బోయవేఁటగాని వర్ణనయు మాటలును, పఠనీయములు.

ఈకవి తనకంటెఁ బూర్వకవుల యొక్కయు తన కాలమువారి యొక్కయు కావ్యములను జూచి వారి కావ్యములలోని సీసపద్యముల మాదిరి కొన్ని సీసపద్యములను రచించినట్లు కానవచ్చుచున్నది. ఈక్రింది కొన్నియుదాహరణములఁ జూడుఁడు:-

సీ. ఆర్యసన్నుత మహాధైర్య నిర్జిత పంచబాణుచే రక్షిత బాణుచేత. [౧-౨.

సీ. అపరంజి బలుగట్టు యతిమనంబులగుట్టు విల్లుగా నిల్లుగా వెలయునతని. [౨-౧౧౬.

సీ. పైతృస్వర్గస వసాభ్యర్ణముల్ కర్ణముల్ మాననివాసంబు మానసంబు. [౨-౭.

సీ. వైడూర్యరుచి మించు వస్త్రాలు కన్నులు తపనీయ నిస్తార్తిఁ దాలెఁ జెవులు [౩-౧౫౬.

సీ. అది సుధాకర బింబ మానో కాదో కాదు చక్కని నెమ్మొగంబుగాని. [౫-౧౧౩.

[కో. ల.

అన్నా. ఆసియాఖండ మందలి తుర్కీ దేశములోని యొక పట్టణము. ఇది బగ్దాద్ సరిహద్దులో 'యుఫ్రిటిస్' నదియొడ్డున నున్నది. దీనియెదుట ఫలవంతములైన సుక్షేత్రములుగల చిన్నచిన్న ద్వీపములు కలవు. ఇది యెడారినడుమనున్న పట్టణమగుటచే బాటసారులు విశ్రమించుటకై మిక్కిలి యుపయోగకరముగ నుండును. పూర్వకాలముండిన నాల్గు దుర్గముల గుర్తులిచట గలవు.

అన్నా ఐవనోవ్నా. (౧౬౯౩-౧౭౪౦) రష్యా దేశమునకుఁ జక్రవర్తిని, ఐదవ ఐవన్ అను రాజునకుఁ గూఁతురు, పీటర్ ది గ్రేట్ అనువానికి సవతిచెల్లెలు. ౧౭౩౦ లో రెండవ పీటర్ చనిపోఁగా నీమె రాజ్యమునకు వచ్చెను. ఈమె స్వేచ్ఛగ నిరంకుశముగ ప్రభుత్వముచేసెను. బిరన్ అను వాఁడీమె కృపకుఁ బాత్రుఁడయ్యెను. వానికీమె మంత్రిత్వమొసంగి నందున వాఁడు ప్రజలను మిక్కిలి పీడించెను.

అన్నాకోమ్నెనా. (౧౦౮౩-౧౧౪౮) బైజంటయిన్ దేశపు రాజపుత్రి. ఈమె విదుషీ చరిత్ర గ్రంథమును వ్రాసెను. పండి

తులకు స్నాశ్రయమిచ్చెను. ప్రథమ అలెగ్సియస్ (Alexius I)అను రాజునకుఁ గూఁతురు. ఈమె భర్తపేరు నిసెఫోరస్ బ్రయెన్నిఅస్ (Nicephorus Bryennius). తండ్రిమరణసమయమునందు నీమె యాతని రాజ్యము తన భర్తకీయుమని వేడెను. కాని యాతఁడందుకు నొప్పుకొనలేదు. తరువాత నీమె తమ్ముఁడు రాజయ్యెను. ఆతనిని జంప నీమెకుట్రపన్నెను. కుట్ర వెలువడినందున నీమెయు, నీమెభర్తయు గ్రీసు దేశమునకుఁ బారిపోయిరి. తరువాత నీమె తనకాలమంతయు విద్యావ్యాసంగము నందే గడిపెను. ఆమె 'అలెగ్జియాడ్' అను కావ్యమును రచించెను. అందు తనతండ్రి చరిత్రమును వర్ణించెను.

అన్నిగిరి. బొంబాయి కోస్తాలోని ధార్వాడ్ జల్లాలోనున్న నవల్‌గుండ్‌లోని యొక గ్రామము. ధార్వాడ్‌నుండి గడగ్ మీఁదుగా బళ్లారికివెళ్లు రస్తామీఁదనున్నది. ఈగ్రామమునకు దక్షిణమహారాష్ట్ర యినుపదారియొక్క స్టేషనుకలదు. ఇచ్చట నాయధాన్యము, పత్తియొక్క వ్యాపారము విశేషముగా కలదు. ఇక్కడ ప్రతివారమున్ను సంత జరుగును. ఈగ్రామముయొక్క విశేషమేమనఁగా,ఇచ్చట నమృతేశ్వరుని దేవాలయమొకటిగలదు. దీనిని జఖనాచార్యులు కట్టించె నందురు. ఇది ౭౬ స్తంభములమీఁద నిలిచియున్నది. ౧౧౫౭ మొదలు ౧౨౦౮ సంవత్సరములలో లిఖించిన ఆరు శాసనములు దేవాలయములో నున్నవి. ౧౧౬౧ వ సం॥ లో బిజ్జలుఁడను కాలచూరియోధుఁడు పడమటి చాళుక్యుల నోడించి, అన్నిగిరిని ముఖ్యపట్టణముగా చేసికొనెను. ఆంగ్లేయ ప్రభుత్వముయొక్క ఆదియందు నీపట్టణము నిపాని ప్రభువు జాగీరులలో నొకటిగా నుండెను. అటుపిమ్మట ౧౮౩౯-వ సంవత్సరములో బ్రిటీషు వారి క్రిందికి వచ్చెను. ఈ పట్టణమందు నాలుగుపాఠశాలలు గలవు. అందులో నొకటి బాలికలకుగాను నియమింపబడినది.

అన్యాతః ప్లక్షము. కురుక్షేత్రము నందలి యొకసరోవరము.

[శతపథబ్రాహ్మణము ౧౧.౫.౧.౪.

అన్యథానుపపత్తి. మీమాంసకుల మతమున నొకప్రమాణము. ఇది అర్థాపత్త్యంతర్గతము. బలిసినభద్రయ్య పగలుభుజించఁడు. అట్లనినతోడనే రాత్రిభోజనముచేయునని యూహించుట అన్యథానుపపత్తి. బలియుటకు వేఱుకారణము లేనందున రాత్రిభోజనము చేయునని యూహింపవలసియున్నది. ఈ బలుపు మఱొకవిధముగా సాధించుటకు వీలులేదు. కావున దీనిని అన్యథానుపపత్తియందురుకాని నైయాయికులు దీనిని స్వతంత్రప్రమాణముగ నొప్పుకొనరు. ఇదియు నర్థాపత్తియు ననుమాన ప్రమాణాంతర్గతమేయని వారి భావము.

అన్యథాసిద్ధము. ఇది న్యాయశాస్త్రవిషయక పదము. కారణము కాని దానిని, దానికి నిజమైన కారణముతోఁ గల సంబంధమునుబట్టి, కారణముగ నెంచిన యెడల నది యన్యథాసిద్ధమనఁబడును. కార్యమునకు నియత పూర్వమయ్యును కారణము కానిదానిని అన్యథా సిద్ధమందురు. 'కార్యకారణములకు సంబంధమెట్టిది? కారణమెల్లపుడును కార్యమునకు నియతపూర్వవర్తిగ నుండవలయును' అను నియమమునకు సరియైన యర్థము తెలియక కొందఱు, నియత పూర్వవర్తులయిన యన్ని పదార్థములను కారణములుగ నెంచెదరు. అవి అన్యథాసిద్ధములే కాని కారణములు కావు. ఘటమునకు కుమ్మరివాఁడు కారణము. ఎందులకు? నియత పూర్వవర్తి గనుక. అట్లే కుమ్మరివానితండ్రిగూడ నియతపూర్వవర్తియే. కావున వానితండ్రి, వానితండ్రి తండ్రి, యిట్లందఱును ఘటమునకు కారణములని చెప్పఁగూడదు. మన్ను లేనిది కుండ కానేరదు గనుక మన్ను కుండకుఁ గారణము. కాని గాడిద లేనిది కుమ్మరి యామన్నును వానివద్దకుఁ దేఁజాలఁడు. కనుక వానిగాడిదయుఁ గుమ్మరి కుండకుఁ గారణమని చెప్పవచ్చునా? కూడదు. గాడిదఅన్యథాసిద్ధము. ఇట్లు కారణలక్షణము చెప్పునపుడు నియతపూర్వవర్తిత్వ మనఁగా లఘునియత పూర్వవర్తిత్వమని యర్థముచేసికొనవలయును. అనఁగా దక్కువలోఁ దక్కువ నెంతయుండిన కార్యముసిద్ధించునో యంతనే కారణమని గ్రహింపవలయును. నియతపూర్వవర్తియొక్క లఘుత్వము మూఁడు విధములు; శరీరకృతము, ఉపస్థితికృతము, సంబంధకృతము.

అన్యథాసిద్ధము లైదువిధములు:—

౧. కారణవృత్తి, లేక కారణతావచ్ఛేదక రూపధర్మము: కుమ్మరివాని దండము ఘటమునకుఁ గారణమేకాని తద్ధర్మమైన దండత్వము కారణముకాదు, అన్యథాసిద్ధము.

౨. కారణగుణము: దండము కారణమే కాని దండముయొక్క రూపము రంగు మొదలగు నితరగుణములు కారణములు కావు. కావున కారణగుణము లన్యథాసిద్ధములు.

౩. వేఱు కార్యమునకుఁ బూర్వవర్తి (కారణము) అని తెలిసినదానిని, ప్రస్తుత కార్యమునకుఁ బూర్వవృత్తిగాఁ జెప్పినయెడల నది అన్యథాసిద్ధమగును. ఆకాశము శబ్దమునకుఁగారణమని తెలిసియు నాకాశమును ఘటమునకుఁ బూర్వవర్తిగ నెంచినయెడల నాకాశము అన్యథాసిద్ధమగునే కాని కారణము కానేరదు.

౪. కారణము యొక్క కారణత్వమును నపేక్షించుట. కుండకు కుమ్మరి కారణము; కుమ్మరివానికి వానితండ్రి కారణము. కావున కుమ్మరివానియొక్క తండ్రి కారణముయొక్క కారణము. అందుచే నన్యథాసిద్ధము.

౫. ఘటమునకు కుమ్మరి వాని గాడిద కారణముకాదు. అన్యథా సిద్ధము.

ఇందును గుఱించి 'కారణము' అను శబ్దము క్రింద విపులముగాఁ జర్చింపఁబడును.

అన్యాక్రాంతము. చూడు 'ఆస్తి పరాధీనము'.

అన్వర్ ఉద్దీన్ ఖాన్. కర్ణాటిక్ నవాబులనఁబడు వారికి మూలపురుషుఁడు. ఇతఁడు మొదట ఢిల్లీ చక్రవర్తివలన కోరా జహానాబాద్ ప్రాంతమునకు సుబేదారుగా నేర్పఱుచఁబడెను. కాని యచ్చటఁ దిన్నగాఁ బనిచేయలేక యితఁడు చెప్పకుండ అహమదాబాదునకుఁ బాఱిపోయెను. నిజామ్ ఉల్ ముల్క్ (ఇప్పటి నిజామునియొక్క మూలపురుషుని) యొక్క తండ్రియైన గాజీ ఉద్దీన్ ఖాన్ ఈతనికి సూరతులో గొప్పయుద్యోగమిచ్చెను. నిజామ్ ఉల్ ముల్క్ ఈతనికి కర్ణాటకప్రభుత్వమిచ్చెను. కర్ణాటక మనఁగా వెల్లూరు, రాజమహేంద్రవరము సూబాలనియర్థము. క్రీ.శ. ౧౭౨౫ మొదలు ౧౭౪౧ వఱకు నీతఁడీపని చేసినపిదప, ఈతనికి ౧౭౪౪ లో సుబేదార్ హోదా యీయఁబడెను. ఈతఁడు ౧౦౭ సంవత్సరముల వఱకుఁ బ్రతికెనఁట. ఈతఁడు ముజఫర్ జంగుతోఁ బోరాడుచు ౧౧౬౨ హిజ్రీలో ౨౩-వ జూలై దినమునఁ జచ్చెను. ఇతనిపెద్దకుమారుఁడు చెఱఁబట్టఁబడెను. రెండవకుమారుఁడైన మహమ్మదు ఆలీ తిరుచినాపల్లికిఁ బాఱిపోయెను. అన్వరుద్దీనునాయకుఁడుగాఁగల అన్వర్ నామా యనునది పారసీలో గలదు. ఆకావ్యమునకుకవి అబ్ది. అన్వరుద్దీన్ రెండవకుమారుఁడైన మహమ్మద్ ఆలీ క్రీ.శ. ౧౭౫౦ లో నవాబ్ నాసిర్ జంగువలన కర్ణాటక నవాబుగాఁ జేయఁబడెను.

అన్వరి. ఒకగొప్ప పారసీకకవి. ఖురాసాన్ దేశజుఁడు. సుల్తాన్ సంజర్ సల్జూకి అనురాజు నాస్థానకవి. ఇతఁడు జ్యోతిషమును గూడ బాగుగ నెఱిఁగి యుండెను. ఇతఁడు బాల్ఖలో క్రీ. శ. ౧౨౦౦-వ సంవత్సరములో మృతుఁడయ్యెను. ఇతని పద్యము లన్నియు 'దీవాన్ అన్వరి' యను గ్రంథమునందు సంగ్రహింపఁబడినవి.

అన్హిల్ వాడ. ఈ రాజ్యము ప్రస్తుతము బొంబాయి రాజధానిసరిహద్దులోఁ జేరిన గుజరాత్ రాష్ట్రమునందుండెను. క్రీ. శ. ౭౪౬-౫౦ సంవత్సర ప్రాంతమున చావద రాజపుత్రులలో నొకఁడగు వనరాజు దీనిని స్థాపించెను. ఆతఁడు ౬౦ వఱకు పాలించి చనిపోయెను. ఆతని పిమ్మట అతని వంశము వారలు ఎనమండుగ్గురు పాలించిరి. ఆఖరు అతఁడు ౯౬౧ లో చనిపోయెను. పిమ్మటచాళుక్యవంశజుఁడగు మూలరాజా (౯౪౨-౯౯౬) యను నితఁడీ రాజ్యమునకు ప్రభువై, రాజ్యమును వృద్ధిజేసి, కాఠేవాడ్ కచ్, దక్షిణ గుజరాత్ దేశములలోనికివ్యాపింపఁజేసి ప్రసిద్ధిఁగాంచెను. ఈతనిచే స్థాపితమైన వంశమునకు 'సోలంకి' వంశమనీపేరు. ఈతని సంతతి వార

లిక్కడ రెండు శతాబ్దముల వఱకు పాలించిరి. వీరు శైవమతస్థులగుటచే సోమనాథ పట్టణమందలి సోమనాథుని యాలయమును గూర్చి చాల శ్రద్ధతీసికొనియెడి వారలు. అప్పటి ప్రభువగు మొదటి భీముని ఓడించి ౧౦౨౬ లో మహమ్మాదు గజనీ దేవాలయమును పడగొట్టి ద్రవ్యమును కొల్లగొనెను. గజనీవెళ్లిన తరువాత ఈగుడి భీమునిచే మరలఁగట్టఁబడెను. ఈతనిసంతతి వారలు ౧౧౪౩ వఱకు ఈ దేశమునుపాలించిరి. అటు తర్వాత మూలరాజుయొక్క జ్ఞాతులు ఈ దేశమునకు ప్రభువులై ఒక శతాబ్దమువఱకు పాలించిరి. వీరలు కాఠేవాడ్, మాళ్వాకు కూడ అధికారులై యుండుటయే గాక ౧౧౯౦ లో కొంకణ దేశముపై దండయాత్ర నడపిరి. ఈ మూలరాజు వంశము అంతరించిన పిమ్మట (౧౨౪౨ లో) ధోల్కా దేశస్థులగు 'వాఘేలులు' అనునొక తెగవార్లు లీ ప్రాంతమునేలిరి. వీరిని ౧౨౯౭లో అల్లా ఉద్దీనుఖిల్జీ తఱిమివైచెను.

అపర తంగణము. తంగణదేశమును అంటియున్న భారతవర్షీయ దేశము. (భార. భీష్మ. అ. ౯.)

అపరతాలము. తాలదేశమునంటియున్న భారతవర్షీయ దేశము. కేకయదేశమునుండి అయోధ్యకుఁబోవుచున యెడల మొదట నీదేశము తగులును. (వా. రా. అయో. స. ౬౮)

అపరదక్షిణకుంతిరాష్ట్రము. ఇంద్రప్రస్థమునకు దక్షిణమునందున్న కుంతి రాష్ట్రమును తగ్గిలియున్న దేశము. (భార. భీష్మ. అ. ౯.)

అపరదక్షిణనిషాదము. ఇంద్రప్రస్థమునకు దక్షిణమునందున్న మ్లేచ్ఛరాజుల దేశమునకు దక్షిణమునందును, పురపాదులను లోకుల దేశమునకు ఉత్తరమునందును, ఈ దేశముండెను. (భార. సభా. అ. ౩౧.)

అపరదక్షిణ పాండ్యదేశము. పాండ్యదేశము తగ్గిలియున్న దేశము. పాండవుల కాలమున నిది ద్రవిడదేశమునకు దక్షిణమునందుండెను. (భార. సభా. అ. ౩౧.)

అపరదక్షిణ మత్స్యము. ఇంద్రప్రస్థమునకు దక్షిణంబునను మత్స్యదేశమును తగిలియున్న దేశము. (భార. సభా. అ. ౩౧.)

అపరదక్షిణ సేకము. ఇంద్రప్రస్థమునకు దక్షిణంబుననున్న యొక దేశము. (భార. సభా. అ. ౩౧.)

అపర నందా. హిమాలయము మీఁది యొక తీర్థము.

అపరపూర్వవిదేహము. ఇంద్రప్రస్థమునకుఁ బూర్వముననున్న రెండు విదేహ

దేశములలో నొక్కటి. గండక దేశమునకుఁ దూర్పుననున్నది యొక విదేహము. ఇది రెండవది. ఈ రాజ్యముననే జనక వంశజులు రాజ్యముచేయు చుండిరని కొందఱి యభిప్రాయమైయున్నది. అట్లయిన శ్రీరాముని కాలమున సీతాదేవి తండ్రియైన జనకుఁడును పాండవుల కాలమున బృహదశ్వుఁడను జనకుఁడును రాజ్యము చేయుచుండిరని చెప్పవలసి యున్నది. (భా. ప్ర. కో.)

అపర పూర్వసుహ్మము. భారత వర్షీయ దేశవిశేషము. (భార. సభా. అ. ౩౦.)

అపర బల్లవదేశము. భారత వర్షీయ దేశవిశేషము (భార. భీష్మ. అ. ౯.)

అపరాంత దేశము. భారతవర్షీయమైన యొక దేశము. (భార. భీష్మ. అ. ౯.)

అపరాజిత. శాక ద్వీపములోని యొకనది.

అపరాజితుఁడు. ౧. ఏకాదశ రుద్రులలో నొక్కఁడు.

౨. శ్రీకృష్ణునకును లక్ష్మణకును పుట్టిన కుమారుఁడు.

3. ధృతరాష్ట్రుని నూర్గురు పుత్రులలో నొక్కఁడు.

అపరోత్తర కులిందము. ఉత్తర దేశమునందు రెండు కులింద దేశములు కలవు. అందలి రెండవది. ఇది కాలకూట, సుమండల దేశములకు నడుమనుండెను. (భార. సభా. అ. ౨౬.)

అపరోత్తరోలూకము. మోదాపురమునకు ఉత్తర దిక్కుననున్న భారత వర్షీయ దేశము. ఇంద్రప్రస్థమున కుత్తరమున ఉలూక దేశములు రెండు కలవు. అందు రెండవది. (భార. సభా. అ. ౨౭.)

అపరోక్షానుభూతి. శ్రీశంకరాచార్యవిరచితమైన చిన్న వేదాంత గ్రంథము. ఇందు నూటనలుబది శ్లోకములుగలవు. దీనిపై విద్యారణ్యులవారి టీకగలదు.

అపర్ణ. సతీదేవి దక్షయజ్ఞమున దగ్ధమై హిమాలయుని యింటఁబుట్టి శివునికొఱకుఁ గొన్ని దినంబులు పర్ణంబులు భక్షించి తపస్సుచేసి పిదప నా పర్ణంబులం దినుట కూడ విడిచి తపంబొనర్చి సఫల మనోరథ యయ్యెను. పర్ణభక్షణకూడ విడిచినందున నామెకు నీ పేరు వచ్చెను.

అపర్ణి. ఒక బ్రహ్మర్షి. (చూఁడు 3 అంగిరసుఁడు.)

అపలేచియను పర్వతములు. ఉత్తర అమెరికా దేశమందలి పర్వతమాలిక. ఇది యా దేశమునకుఁ దూర్పున నుండును. ఇది ౧౩౦౦ మైళ్లు పొడవుగనున్నది. ఎత్తు శిఖరములు రమారమి ౨౦౦౦ అడుగులయెత్తున

నుండును. దీని కనేక శాఖలును, శిఖరములును కలవు. ఈ పర్వతమునందు నేల బొగ్గు, ఘుట్టి నూనె విశేషముగ దొరుకును.

అపస్మారము (ఆంగ్లేయ వైద్య శాస్త్రము ననుసరించి) దీనిని వాడుకలో కొందఱు 'కాకిచమ్మ'లని చెప్పెదరు. అపస్మారములో ననేకవిధములు గలవు. కొందఱకిది చాలతీవ్రముగా వచ్చును. అకాత్తుగ స్మృతి తప్పి కాళ్ళుచేతులు విలవిల కొట్టుకొని నోటివెంట చొంగ పడును. మఱికొందఱు స్మృతి తప్పీతప్పని స్థితిలో కొన్ని నిముసములుండి కాళ్ళుచేతులు కొట్టుకొనకయే తెలివి తెచ్చుకొందురు. ఒకానొకడు తానుచేయుపని క్షణమాత్రము నిలిపి ప్రపంచజ్ఞానమంతను మఱచి, అంతలోనే తనపనిని తానుచూచుకొనును. జ్వరాది ఇతర వ్యాధులతో సంబంధములేక ఇతరవిధముల నారోగ్యముగ నున్న మానవున కకస్మాత్తుగ క్షణమాత్రమో, అధికకాలమో స్మృతితప్పి ప్రపంచజ్ఞానము బొత్తిగ లేకుండగజేయు వ్యాధికి అపస్మారమని పేరు. కాళ్లుచేతులు కొట్టుకొనినను లేక పోయినను సరే.

వ్యాప్తి

ఈవ్యాధి ప్రజలలో నెంతమందికున్నదో సరిగా లెక్కించి చెప్పుటకింతవఱకాధారములేవియులేవుగాని సామాన్యముగా నన్ని దేశములందుకూడ జనసంఖ్యలో వేయింటికి ఒకనికి ఈ వ్యాధియున్నదని చెప్పవచ్చును. కొన్ని దేశములలో నింతకంటె హెచ్చుగ నుండవచ్చును. వంశపారంపర్యముగ కుటుంబములో లేనిదే ఈవ్యాధి సంతతికి వ్యాపించదని చెప్పుటకు నిదర్శనములులేవు: కాని ఉన్మాదము త్రాగుడుగల కుటుంబములలో నీవ్యాధి గలవారలు ఎక్కువగానున్నారని చెప్పవచ్చును. చిన్నతనములో బిడ్డలకువచ్చు మూర్ఛ (చంటిబిడ్డ గుణము)కును అపస్మారమునకును, కొంత సంబంధము కానవచ్చుచున్నది. అపస్మారపు తల్లుల బిడ్డలను ౫౮ మందిని గుఱించి శోధన చేయగానందు ౩౭గురికి చిన్నతనములో చంటిబిడ్డగుణము చూపి చనిపోయిరనియు మిగిలిన ౨౧ మందిలో ౭ గురికి అపస్మారవ్యాధి యేర్పడినదనియు తెలియుచున్నది.

వయస్సునుబట్టి చూడగా అపస్మారము ౧౦ మొదలు ౨౦ సంవత్సరములలోపు వయస్సులలో హెచ్చుగా గానవచ్చుచున్నది. అందు ౧౩ మొదలు ౧౭ వఱకు మిక్కిలి తరుచుగ నీవ్యాధి అంకురించుచున్నట్లు నిదర్శనములు కలవు. కుటుంబములో ఈవ్యాధి వంశపారంపర్యముగ నున్నకొలది చిన్న వయస్సునందు అంకురించునని కొందఱయభిప్రాయము. కొందఱకు చిన్నతనమునందు చంటిబిడ్డవ్యాధి అప్పుడప్పుడు వచ్చుచు కొంతకాలమునకు అపస్మారముగ అదే పరిణమించును.

అపస్మారమునకు మనోవ్యాకులత, భయము మొదలగునవి కారణములని యనేకులు సంబంధము కల్పించుటకు ప్రయత్నించిరి.

కారణము

కాని యిట్టి సంబంధము నూటికి ౩౦ మందిలో కంటె నెక్కువ వారిలో కనపడదు. నెత్తిమీద తగిలిన దెబ్బవలన పుర్రె ఎముక లోపలికివంగి దాని ఒత్తుడువలన అపస్మారము వచ్చునని కొందఱ యభిప్రాయము కాని యొకానొకచో నట్లున్నను సాధారణ వ్యాప్తికిది కారణము కాదని చెప్పవచ్చును. అట్టి వారికి శరీరమందేదో యొక భాగమందే ఈడ్పు సాధారణముగా గన్పట్టును. ముష్టిమైథున (Masturbation) మను దురాచారము వలన అపస్మారము జనించునని కొందఱును, అపస్మారపు రోగులకిది యొకలక్షణమే కాని యిది అపస్మారమునకు కారణము కాదని కొందఱును చెప్పుచున్నారు.

త్రాగుబోతులలో వయస్సు చెల్లినపిమ్మట అపస్మారము హెచ్చుగ కానవచ్చుచున్నది. కాని యపస్మారమునకు త్రాగుడు కారణమని నిర్ణయించుటకు వీలులేదు. పైని చెప్పినట్లు త్రాగుడునకును ఉన్మాదమునకును అపస్మారమునకు నరముల సంబంధమేదో కలదు.

లక్షణములను బట్టి అపస్మారమునుమూడు తరగతులుగ విభజింపనగును.

I. ఈడ్పుతో గూడిన పెద్దమూర్ఛ.

II. ఈడ్పులేని చిన్నమూర్ఛ.

III. ఈడ్పుతో గూడిన చిన్నమూర్ఛ.

లక్షణములు

అపస్మార లక్షణములలో కొన్ని వ్యాధి పైకి కనబడక పూర్వము కొన్ని గంటలకో లేక దినములకో రోగియందు కన్పట్టును. మరి కొన్నిలక్షణములు వ్యాధి బయిటికి దెలియక పూర్వము కొద్దినిముషములకో క్షణములకో ముందుగ కన్పట్టును.ఇట్టిలక్షణములను వ్యాధి యొక్క పూర్వరూపమని చెప్పనగును.

అపస్మారపు రోగితో నివశించు వారలు రోగికి ఎప్పుడు మూర్ఛవచ్చునో సాధారణముగా చెప్పగలరు. కొందరు వ్యాధి బయల్పడక పూర్వము కొంతకాలము రుసరుసలాడుచు చీటికిమాటికి కోపపడుచుందురు. కొందరు విచారగ్రస్తముగనుండి పనితోచక ఇటునటు తిరుగుచుందురు. మరికొందరు ఎన్నడునులేని చురుకుతనము గలిగి యుందురు. కొందరువిచిత్రమైనచిత్తభ్రమలు చెందుదురు. కొందరకు మూర్ఛరాక పూర్వము ఆకలి తగ్గును. తలనొప్పి, తలతిరుగుట మొదలగు గుణములు కన్పట్టును.

పైచెప్పినవిగాక మూర్ఛరాకముందు ఒకానొకరోగికి ఒక్కొక్కరీతిని శూచనల్లు గన్పించును. ఒకడు ముందునకు పరుగెత్తిపడును. ఒకడు వెనుక వెనుకనే పరుగెత్తిపడును. మరొకడు గుండ్రముగ చుట్టుచుట్టు తిరిగి పడును. మూర్ఛరాక పూర్వమొకానొక రోగి యేదో పనియున్నట్టుగా మంచము క్రిందకు వంగి

చూచి గభీలున పడిపోవుచుండెనని యొక వైద్యుడు వ్రాసియున్నాడు. కొందఱకు ఒక చెయ్యి లాగినట్లును, తిమ్మిరపట్టినట్లును, మూర్ఛ రాకముందు సూచన గాన్పించును. కొందఱకు కడుపునొప్పి యెత్తును, లేదా తల తిప్పును. ఇట్లే ఒక్కొక్క రోగికి ఒక్కొక్క విధమైన సూచనయుండును. కొందఱకే విధమైన సూచనయు లేకయే అకస్మాత్తుగ పడిపోవుదురు.

నిజమైన మూర్ఛలో మూడవస్థలను వైద్యులు వర్ణించి యున్నారు. ౧. మూర్ఛ.

మూర్ఛ

ఇందు శరీరమునందలి కండలన్నియును ఒక్కపెట్టున బిగపట్టి స్మృతి తప్పి రోగి పడిపోవును. ఈ యీడ్పు ఒక ప్రక్కను రెండవ ప్రక్క కంటె బలముగనుండవచ్చును. అప్పుడు తల కండ్లు, ఒక ప్రక్కకు తిరిగిపోవును. శరీరమంతయు కొయ్యవలెనయి నడుము విల్లువంపుగా వంగియు మెలిక వేసినట్లగును. ఎదురురొమ్ము కండలన్నియు బిగిసికొనిపోవుటచే విచిత్రముగ మూలిగినట్లు రోగి ఒక పెద్ద కేక వేయును. మొదట ముఖము తెల్లబడి వెంటనే యెఱుపెక్కి ఇంతలో నల్లబారి కంటిలోని పాపలు పెద్దవగును. నాడి సన్నగిల్లును. ఈపై చెప్పిన మొదట యవస్థయంతయు నర నిముసములో ముగియును. పిమ్మట రెండవయవస్థ వెంటనే ప్రారంభమగును. ఇపుడు కండలన్నియు దీవ్రముగా గిజగిజ కొట్టుకొనును. నాలుక పండ్లమధ్యనుండి బయలు పడును. ఒకానొకప్పుడు తెగి రక్తము వచ్చును. మలమూత్రముల విసర్జనమగును. కనిగ్రుడ్లు గిరగిర తిరుగును. ఊపిరి క్రమము తప్పి ఆడును. ముఖము నల్లబారును. మెడయందలి నెత్తురు కాలువ ఉబ్బిపోవును. తీవ్రమైన మూర్ఛలో రోగి ఊపిరాడక చచ్చిపోవునేమోయని భయము కలుగును. కాని ఇంతలోనే ఈవస్థ మారి మూడవయవస్థ ప్రారంభమగును: రోగి కొంచెము తెలివి వచ్చునట్లు కాలో చేయో త్రిప్పుకొనును. నిట్టూర్పు విడుచును. ఒకానొకడు తిరిగి వెంటనే నిద్రపోవును. మఱియొకడు పిచ్చిపట్టినట్లు కేక వేయును. ఇంకొకడు ప్రక్కనున్నవారితో జగడమాడును. కొట్టును. పరుగెత్తిపోవును. కాని కొంతసేపటికి నిద్రబోవును.

i మొదటయవస్థ అరనిముసము లోపుగను, రెండవయవస్థ ఒకటి రెండు నిముసములును, మూడవయవస్థ అయిదు మొదలు పది దినములవఱకును సామాన్యముగ నుండవచ్చును. మూర్ఛవిడచిన తరువాత పట్టునిద్ర ఒకటి రెండు ఘంటలుండును. ఒకానొకప్పుడు రోగి దినమంతయు నిద్రమత్తులో పడియుండును. మొదటి యవస్థయందు సన్నగిలిన నాడి రెండవ యవస్థయందు దృఢమై వేగము గలదియగును. కొందఱకు మూర్ఛవిడచిన పిమ్మట తీవ్రమైన తలనొప్పివచ్చును. మూర్ఛలోనుండగా శరీర వేడిమి ఒకటి రెండు డిగ్రీలు హెచ్చవచ్చును. వెంట వెంటనే మూర్ఛ

విడిచి విడిచి వచ్చుచున్న యెడల అధిక జ్వరము రావచ్చును. కొందఱకు ప్రతిసారియు వాంతి కావచ్చును. అట్టివారలకు గొంతు కలో పదార్థము లడ్డుపడి ప్రాణాపాయము గలుగ వచ్చును.

ii. ఈడ్పులేని చిన్నమూర్ఛ. ఇది ఒక క్షణము మొదలయిదు క్షణములవఱకునుండు నని చెప్పవచ్చును. ఇది వచ్చినపుడు రోగి ముఖము ఇతరులకు విచిత్రముగ కన్పించ వచ్చును. రోగి తానేదియో మరచిపోయినట్లు మాట్లాడుచున్నవాడల్లె అకస్మాత్తుగ నిలుపును. ముఖము తెల్లబారును, కంటిపాపలు పెద్దవగును. క్షణములో నంతయు మారి యథాస్థితికి వచ్చును. రోగినడచుచున్న యెడల కాళ్ళు కొంచము తడబడును. లేదా ఒక ప్రక్కకు వంగును. కాని క్రిందబడడు. చేతిలోని వస్తువును జారవిడువడు. ఈచిన్నమూర్ఛ రాక పూర్వము రోగికేమియు సూచనలు తెలియవు. తరువాత గూడ బుద్ధి మాంద్య ముండదు.

iii. ఈడ్పుతో గూడిన చిన్నమూర్ఛ. ఇందు శరీరమునం దేదోభాగము బిఱ్ఱుగ బిగసికొనును. లేదా కొట్టుకొనును. క్షణమాత్రము స్మృతితప్పును. క్షణమాత్రము కనుగ్రుడ్లు తలనొక ప్రక్కకు దిరుగును. ఈమూర్ఛ వచ్చినప్పుడు ఒకొక్కసారి క్షణమాత్ర మున్నను ఒకదినములో ననేక సారులుగా వచ్చును. నిద్రలో వచ్చినపుడు బిడ్డలు పడక తడుపుదురు.

నిదానము

అపస్మారమును గుర్తించుట సాధారణముగా కష్టముకాదు. కాని రోగిని చూడక ఇతరులు చెప్పువర్ణననుబట్టి వ్యాధి తెలిసికొనవలెననిన కొంచెము కష్టమే. ఈక్రిందిమూడు ప్రశ్నలకును జవాబు తెలిసికొనిన యెడల కొంతవరకు సహకారి యగును.

౧. రోగి అకస్మాత్తుగ స్మృతి తెలియక పడెనా?

౨. రోగినాలుక కఱచుకొనెనా?

౩. మూత్రము పడకలో తెలియకుండ పోసికొనెనా ?

ఈమూడింటికి 'అవు'నని జవాబు చెప్పిన యెడల అపస్మారమని నిదానము చెప్పవచ్చును. కాని 'లేదు' అనిజవాబు చెప్పినయెడల వ్యాధి అపస్మారము కాదని నిశ్చయింప వీలులేదు. ఏలయన చిన్నమూర్ఛలలో పైచెప్పినమూడు ప్రశ్నలకును వ్యతిరేకపుజవాబు వచ్చినను ఒకానొకప్పుడు రావచ్చును. కాని వ్యాధి యపస్మారమే యగును కాబట్టి అట్టిచో నితరవిషయములను గమనించి అపస్మారదానమును గ్రహింపవలెను. హిస్టీరియా అనుమూర్ఛ (దయ్యము)లో ఈప్రక్క విషయములను గమనింప నగును.

అపస్మారము	హిస్టీరియా
౧. రోగి తననాలుక కరచుకొనును.	౧. రోగి తననాలుక కరచుకొనదు. పట్టుకొని నిర్బంధించువారిని రోగికరచి విడిపించుకొన ప్రయత్నించవచ్చును. నాలుకగాక తన శరీరమునందలి దిగువభాగములను తాను కరచుకొనవచ్చును.
౨. రోగియొక్క కాళ్ళుచేతులు తమంతట అవి వెనుకకు ముందుకు ఈడ్పుచేత కొట్టుకొనును.	౨. రోగి తన ఇచ్ఛవచ్చినట్లు కాళ్ళుచేతులు విదిలించి కొట్టుచు ప్రక్కనున్నవారలను తన్ని కొట్టి జగడమాడ ప్రయత్నించును.
3. అపస్మారమునందు ఈడ్పు కొన్ని నిమిషముల కంటె నెక్కువ కాలముండదు.	3. కొద్దినిమిషములు మొదలు చాలసేపటివరకు హిస్టీరియా సంబంధమైన మూర్ఛయుండవచ్చును.
౪. అపస్మారపురోగి మూర్ఛ తరువాత సామాన్యముగా నిద్రపోవును.	౪. హిస్టీరియా రోగికి నిద్ర సామాన్యముగా పట్టక మనస్సు చెదిరిపోయియుండును.

మూర్ఛవలన మరణము మిక్కిలి అరుదు. ఊపిరాడక ప్రాణము పోవునట్లు కనుపించవచ్చును కాని సామాన్యముగా అంతలోనే

సాధ్యాసాధ్య లక్షణము

వ్యాధితగ్గి రోగికి తెలివివచ్చును. నిప్పులోగాని నీటిలోగాని పడుటవలన రోగికి ప్రాణభయము కలుగవచ్చును. రాతిమీదపడి పుఱ్ఱె ఎముక పగిలి అపాయము కలుగ వచ్చును. ఒకరోగికి నిద్రపోవునపుడు మూర్ఛవచ్చి తలక్రిందుగా దిరిగి ముక్కు గుడ్డలలోనికి అణచుకొని పోయినయెడల ఊపిరాడక రోగి ప్రాణములను విడవ వచ్చును. కాని వ్యాధివల్లనే ప్రాణములు బోగొట్టికొనిన వారరుదు.

చాలకాలమువఱకు మూర్ఛ రాకుండగను, వచ్చునప్పుడు తక్కువగ వచ్చునట్లును ఒక్కొక్క మూర్ఛకును మధ్యచాలకాలము పట్టునట్లును చేయవచ్చునుగాని ఇంతటిలో వ్యాధి కుదిరినదని చెప్పుటకు వీలు

అపస్మారము కుదురునా?

లేదు. స్థలముమార్పుట వలనను వృత్తి మార్చుట వలనను గుణము గలుగవచ్చును. అపస్మార పురోగులకు కొంతకాలమునకు బుద్ధిబలము తగ్గిపోవును. కొందఱకు పిచ్చెత్తును. పగటియందువచ్చు మూర్ఛ నిద్రలో వచ్చు మూర్ఛకంటె చికిత్సలకు సులభముగ లొంగును. చిన్నమూర్ఛకంటె పెద్దమూర్ఛ చికిత్సకు లొంగును.

పొటాసియము బ్రోమైడ్ అను మందీ వ్యాధికి చాల నుపయోగకరము. పదిమొదలిరువది గ్రెయినుల

చికిత్స

వఱకు దినమునకు మూడుసారులు భోజనమైనతరువాత నొకఘంటకు నీళ్ళతోనీయవచ్చును. నలుబది మొదలు

అరువది గ్రైయినుల మోతాదు నిద్రలో మూత్రము విసర్జించు వారలకిచ్చిన గుణము కావచ్చును. సోడియం పొటాషియం, అమోనియం, ఈమూడు బ్రోమైడులును సమభాగములుగ గలిపియిచ్చినను ఇయ్యవచ్చును. మూర్ఛ వచ్చుసమయమున నిశ్చయముగా వచ్చునని తెలిసినప్పుడు ఒక మోతాదు బ్రోమైడు ఇచ్చినయెడల మూర్ఛ నిలిచిపోవచ్చును. అధికముగ బ్రోమైడు నిచ్చినయెడల బుద్ధిమాంద్యము గలిగి కాళ్లుచేతులు చల్లబడి చొంగ నోటివెంటగారవచ్చును. మాటనెమ్మదిగ వచ్చును. తల్లులకు బ్రోమైడు ఇచ్చుట వలన పాలుత్రాగుబిడ్డలకు పడకపోవచ్చును. మిక్కిలి గుణము కనిపించు రోగులకుగూడ బ్రోమైడును అఖరు మూర్ఛతరువాత రెండు సంవత్సరములు వఱకును నిలుపగూడదు. అటుపిమ్మటగూడ వారమున కొకటి రెండు మోతాదుల నిచ్చుచు క్రమముగ నిలుపవలయును. గుండెలలో వ్యాధిగల వారలకు బ్రోమైడుతోడు డిజిటాలిస్ (Digitalis) ను, నెత్తురులేని వారికి ఇనుమును, బలహీనులకు క్లాడ్లివరాయిలును జేర్చి యియ్యవచ్చును. వెలిగారము ౧౦ మొదలు ౩౦ గ్రెయినుల మోతాదు బ్రోమైడుతో చేర్చిగాని ప్రత్యేకముగగాని దినమునకు మూడుసార్లు ఇచ్చిన గుణము కలదని ఒకానొకరు వ్రాయుచున్నారు. ఇవిగాక వందలకొలది మందులను ఇచ్చి చూచియున్నారుకాని నిజమైన గుణము కానరాలేదు. అపస్మారపు రోగులకు కంటిచూపులో జబ్బు ఉన్నయెడల అద్దములను వేసికొనవలెను. [అ. ల.

(ఆయుర్వేద శాస్త్రము ననుసరించి)

సంప్రాప్తి

స్మృతి నశించునుగాన అపస్మారమనం బడును. చింత, శోకము, భయము, మొదలగువానిచే శారీర మానస దోషములు ప్రకోపించి హృదయమును సంజ్ఞావాహి స్రోతస్సులను జెంది స్మృతిని నశింపజేయును. ఇదిజనించిన తోడనే రోగికి చీకటిలో ప్రవేశించినటు లుండుట, నేత్రములయందు వైవర్ణ్యము, హస్తపాదములను విదలించుట ఇవి

సామాన్య లక్షణములు

గలిగి మోహమును జెంది జ్ఞానశూన్యుడై పండ్లనుకటకటకొరుకుచు నురుగునుగ్రక్కుచు భ్రమింబడును. దోషవేగము శమించిన తోడనే పూర్వమువలె స్వభావమును జెందును. కొంతకాలము గడచినపిదప మఱల నిటులనే మూర్ఛావికారములను జెందును.

పూర్వ రూపములు

హృదయము నందు కంపము, హృదయము శూన్యముగ నుండు నటులదోచుట, చమట, చింతనొందుట, చిత్తభ్రమ, ఇంద్రియ మోహము, నిద్రానాశము ఇవి అపస్మార రోగములకు పూర్వ రూపంబులు. అపస్మారము వాతజము, పిత్తజము, శ్లేష్మజము, సన్నిపాతజము, అని నాలుగు విధములుగ

నుండును. అందు పళ్ళుకొరుకుట, పండ్లుకొరుకుట, నోటియందు నురుగు కారుట, నిట్టూర్పులు విడుచుట, క్రూరముగ నల్లగ అరుణముగ నుండు రూపములు కంటికగపడుట నీలక్షణములు వాతజాపస్మారమునందు జనించును. నురుగు, అంగములు, ముఖము, నేత్రములు, ఇవి పసుపువర్ణముగ నుండుట, పచ్చగ ఎర్రగనుండు రూపములు కంటికగపడుట, మిక్కిలి దప్పిగలుగుట, ప్రపంచము అగ్నిజ్వాలలచే వ్యాప్తమగునట్లు గాంచుట ఇవి పిత్తజాపస్మారమునందు జనించును. నురుగు, శరీరము, ముఖము, నేత్రములు ఇవి తెల్లగ నుండుట, శరీరము చల్లగ నుండుట, వెంట్రుకలు నిక్కబొడిచి యుండుట, శరీరము బరువుగ నుండుట, తెలుపు వర్ణముతో గూడిన రూపములు కంటికగపడుట, ఈ లక్షణములు కఫజాపస్మారమునందు గలుగును. ఇందు శ్లైష్మికముయొక్క వేగము చిరకాలమునకు నివర్తించును. సన్నిపాతజమునందు వాతజాద్యపస్మారములకు జెప్పియుండు లక్షణము లన్నియు కలిగి యుండును.

చతుర్విధాపస్మారములు, తల్లక్షణములు

సన్నిపాత జాపస్మారము, క్షీణబలముగల వానికి జనించిన యేకదోషజాపస్మారము, చిరకాలమునుండి బాధించుచుండిన యపస్మారము, ఇవి అసాధ్యములు ; చికిత్సలయందు వర్జింపతగినవి. వ్యాధికి కారణములగు ప్రకుపితదోషములును సర్వదా శరీరము ననుసరించియే యుండినను వ్యాధివేగములను (Epileptic fits) అప్పుడప్పుడు జూపుచుండును. అనగా వాతికము ౧౨ రోజులకును పైత్తికము ౧౫ రోజులకును శ్లైష్మికము మాసమునకును కనబడుచుండును. ఇది సామాన్యవిధి. దోషతారతమ్యము ననుసరించి యొక ప్పుడీ నియమితకాలమునకు లోపలను రావచ్చును, అతిక్రమించియు రావచ్చును.

సాధ్యాసాధ్యములు

వ్యాధిప్రకోపకాలములు

[మాధవనిదానము ; అపస్మారప్రకరణము.]

౧. పైనిచెప్పిన, చొప్పున యపస్మారరోగస్వరూపములను గుర్తెరిగి, దోషములచే నావరింప బడియుండు బుద్ధి హృదయము మనస్సు స్రోతస్సులు వీనిని తీక్ష్ణములుగ నుండు వమన విరేచనాది కర్మలచే శుద్ధిపరచవలయును. వాతజాపస్మారము వస్తికర్మలచేతను పిత్తజాపస్మారము విరేచనములచేతను శ్లేష్మజాపస్మారము వమనంబులచేతను చికిత్సింపవలయును. అనంతరము పేయాదిగంజులను భుజింపజేసి అపస్మారరోగము శమించుటకై యీదిగువ నుదాహరించు ఘృతపానాదుల నొసంగవలయును.

అపస్మారచికిత్సావిధానము

౨. ఆవుపేడ రసము, పాలు, పెరుగు, మూత్రము, నెయ్యి వీనిని సమభాగములుగ జేర్చి ఘృతపాకవిధిప్రకారము పక్వముచేయ

పంచగవ్యఘృతము

వలయును. దీని సేవనవలన అపస్మారము, జ్వరము, ఉన్మాదము, కామిల, హరించును.

3. సరస్వతీ ఆకు రసమునకు సమముగా, పాతనెయ్యిని కలిపి వస, చంగల్వకోష్టు, శంఖపుష్పి వీనిచూర్ణ మును జేర్చి పాకము చేసి సేవించిన అపస్మారము తప్పక శాంతించును. (బ్రాహ్మీఘృతము) [౧-౨-3 చర క. చి. స్థా ; అ ౧౫.

౪. కాశగడ్డి, నేలగుమ్ముడు, చెఱుకు, కుశకడ్డి, వీనిని సమభాగములుగ జేర్చి పాదావశేషముగ కషాయముగ కాచి, వడియగట్టి అందు నావుపాలనుజేర్చి చక్కగ కాచి పానముచేయించిన అపస్మారము హరించును. (క్షీరము)

౫. కూష్మాండ స్వరసము ౮ ప్రస్థములు ఆవునెయ్యి ౧ ప్రస్థముచేర్చి యష్టిమధుక కల్కము కలిపి విధిప్రకారము పక్వము జేసి యిప్పించిన అపస్మారము శీఘ్రముగ హరించును. ప్రశస్తమయిన బుద్ధి, వాక్కు స్వరము కలుగును. (కూష్మాండ ఘృతము)

౬. కపిలవర్ణముగల ఆవుయొక్క పిత్తముచే నస్యము చేయించిన రోగికి మిగుల హితము కలుగును. (నస్యము)

౭. నువ్వుల నూనెగాని వెల్లుల్లిగాని ఆవు పాలతోడ పిల్లి పీచరునుగాని, తేనెతోమండూక బ్రహ్మీస్వరసమునుగాని చెంగల్వ కోష్టు రసమునుగాని వసనుగాని ప్రతిదిన మపస్మార రోగి కిప్పించవలయును. (౪, ౫, ౬, ౭, అష్టాంగ హృదయము, ఉత్తరస్థానము. అ. ౭.)

౮. శ్లో॥ నిర్గుండీ భవ వన్దాక
నావస్యోపయోగతః
ఉపైతిసహసానాశ మపస్మారో
నసంశయః.

యోగతరంగిణి.

వావిల చెట్టుమీద బయలుదేరిన బదనికను దెచ్చి చూర్ణము చేసి నస్యకర్మయందుపయోగించిన అపస్మారము నిస్సంశయముగ శాంతించును. (బదనిక యోగము)

౯. గోత్త్ర మూత్రము గోమూత్రము గోమయరసము వీనిని ఆవనూనెకు నాలుగురెట్లుచేర్చి తైలము కాచి అభ్యంజనము చేసిన అపస్మారము నివర్తించును.

(బృందమాధవము).

౧౦. పంచకోలములు, మిరియాలు, త్రిఫలములు, బిడాల లవణము, సైంధవ లవణము, పిప్పళ్లు, వాయువిడంగములు, వాము, ధనియాలు, జీరకము, వీనిని చూర్ణముచేసి వేడి నీటితో పుచ్చుకొనిన అపస్మారము తప్పక శాంతించును. (యోగరత్నాకరే) (కల్యాణకంచూర్ణం)

మరియు చరకసంహితలో చెప్పబడిన మహా పంచగవ్యఘృతముగూడ అపస్మారమున్నునాశనముచేయుట స్వానుభవము.

అపస్మార రోగముగల వానిని నిప్పు నీళ్లు మొదలగు వానివలన ముప్పు కలుగక, నిత్యము జాగరూకతతోడ నద్దా రక్షింపుచుండవలయును. పైని వివరించిన చికిత్సలచే రోగము తగ్గి, రోగి మనోవికారరహితుడుగనుండు, రోగితోడ 'నీవు పూర్వము నిందనీయ కృత్యంబులను జేసినా'వని చెప్పక ప్రియమును మనోహరమును అగువిషయంబులం జెప్పి వాని మనస్సున కుత్సాహమును కలుగజేయవలెను. [గం. దూ.

రోగి రక్షణావశ్యకము

రోగోపశమనానంతర కర్తవ్యము

అపస్యోముడు. ఒక బ్రహ్మర్షి. (చూడు 3 అంగిరసుడు).

అపాండువు. ఒక బ్రహ్మర్షి.

అపాంతరతముడు. ఒక బ్రహ్మర్షి (చూడు. ౧ సారస్వతుడు.)

అపాంప్రదము. భారత వర్షీయ తీర్థము.

అపినైన్ పర్వతములు. ఇటలీ దేశమునందు నుత్తరమునుండి దక్షిణము వఱకును, అచ్చటనుండి దక్షిణమున సిసిల్ వఱకును గొలుసువలె పొడుగుగఁ బ్రసరించి యున్న యొక పర్వతపంక్తి. ఇది యూరోప్ దేశమందలి గొప్పపర్వతములలో నొక్కటి. దీనిపొడువు షుమారమి ౭౫౦ మైళ్లు. ఇటలీలో నున్న యీపర్వత భాగముయొక్క యెత్తు శిఖరము 'మాంటెకోర్నో' అనునది ౧౦౦౦౦ అడుగులెత్తున నున్నది. సిసిలీలో ఎట్నా (Etna) అను శిఖరముగలదు. అది ౧౧౦౦౦ అడుగులెత్తుననున్నది. ఇదియు, నేపుల్సు నొద్ద నున్న వెసువియస్ అనునదియు నిప్పుడు జాగ్రత్తగానున్న యగ్నిపర్వతములు. మిక్కిలి యెత్తుమీఁద నీపర్వతము వృక్షవిహీనము గను, గరుగుగను ఉండును. కొంచెము యెత్తు తక్కువ ప్రదేశము వనములతో నిండియుండును. ఈపర్వతములమీఁద ఖనిజము లంతగ లేవు. కాని గృహములకుఁ బనికివచ్చు చలువ రాళ్లు మాత్రము విశేషముగ నున్నవి.

అపాలో. గ్రీకువారి దేవుఁడు. గొప్ప దేవతలలో నొక్కఁడు. తండ్రి జియస్ (Zeus), తల్లి లేటో (Leto). అర్టిమిస్ అనువాడును ఈతఁడును కవలుపిల్లలుగఁ బుట్టిరి. ఈతనిని మృత్యువున కధిపతిగను, సంగీతాధిపతిగను, పశ్వాధిపతిగను, పట్టణములకు రాజకీయ వ్యవహారములకు నధిష్ఠాతగను, సూర్యదేవతగను, భావించుచుండిరి. రోమ్‌పట్టణమునందు నీతనిగుడి మొదట క్రీ. పూ. ౪౩౧ లోఁ గట్టఁబడెను. ఆగష్టసు రాజు (క్రీ. పూ. ౨౭—క్రీ. శ. ౧౪) కాలమునందు నీ దేవతపూజ రోమక పట్టణములలో హెచ్చెను.

అపాలోనియస్. ౧. (పెర్గస్) ఇతఁడు క్రీ. పూ. మూఁడవ శతాబ్దమునందున్న గొప్ప రేఖాగణిత శాస్త్రవేత్త

('The Great geometer'). నాల్గవ, అయిదవ టాలెమీ రాజుల రాజ్యకాలమున నీతఁడు అలెగ్జాండ్రియా పట్టణమునందు యూక్లిడ్ యొక్క శిష్యుల పాఠశాలలో మొదట శిష్యుఁడుగను తరువాత గురువుగను ఉండెను. ఇతఁడు వ్రాసిన గ్రంథములలో మ్యాగ్నమ్ ఆపస్ (Magnum Opus) అనునది ముఖ్యమైనది. ఇందు దీర్ఘవృత్తములను (Conic Sections) గురించిన ౪౦౦ ల సిద్ధాంతములు కలవు. ఇందుఁ బెక్కు లాతఁడు క్రొత్తగఁ గని పెట్టినవి యున్నవి.

౨. (రోడి అస్) గొప్పకవి, పండితుఁడు. అర్గొనాటికా (Argonautica) యను మహాకావ్యమునకుఁ గర్త. ఇది మన మహాభారతము వలె క్షాత్రవీర్యమును వర్ణించునట్టిది. దీని భాష, వర్ణనాకౌశలము మిక్కిలి యుచ్చతరమైనది. వర్జిల్ మొదలయిన మహాకవులకుఁ గూడ నిది మార్గదర్శకమైన దందురు. ఈతఁడు మొదట రోడ్సులో సాహిత్యాచార్యుఁడు (Rhetoricision) గానుండి తరువాత అలెగ్జాండ్రియాలో పుస్తకభాండాగారాధ్యక్షుఁడు (Librarian) గానుండెను. ఇతని కాలము రమారమి క్రీ. పూ. ౨౪౦ మొదలు ౧౮౦ వఱకు అనఁగా నితఁడిప్పటికి రెండువేలనూట యేబది సంవత్సరముల క్రిందనుండెను.

3. (మొలన్) గ్రీకు (యవన) సాహిత్య వేత్త (Rhetorician'. క్రీ. పూ. ౧-వ శతాబ్దము నందున్నవాఁడు. సిసిరోకు సాహిత్యము నేర్పెను. (క్రీ. పూ. ౭౮).

౪. (ట్యాని అస్) పైథాగోరస్ సంప్రదాయమునందలి తత్త్వవేత్త. ఇతని కాలము రమారమి క్రీ. పూ. ౪-వ సంవత్సరము మొదలుకొని క్రీ. శ. ౯౭-వ సంవత్సరము వఱకు. ఈతఁడు ఏశియామైనర్, పార్థియ, హిందూ దేశము మొదలయిన దూర దూర దేశములు తిరిగి వచ్చెను. హిందూ దేశమునందు బ్రాహ్మణులతో తత్త్వమును గురించి సంభాషించెనని, క్రీ. శ. ౨౦౦ లో నితని చరిత్రము వ్రాసిన పిలాస్ట్రేటస్ (Philostratus) వ్రాసియున్నాఁడు. ఇతఁడు పెక్కు దైవిక చిత్రంబులును, అమానుష కృత్యంబులును చేసి చూపెనఁట.

అపోస్తలులు. ఇది క్రైస్తవమత సంబంధమైన సంప్రదాయిక శబ్దము. ఈశబ్దమునకు వార్త దెల్పుటకుఁ బంపఁబడిన దూత యని మూలార్థము. ఇట్లు పంపఁబడిన దూత కేవలము వార్తాహారుఁడు గాక, తన యజమానుని ప్రతినిధియని యీశబ్దము బోధించును. ఈపదము ముఖ్యముగ నేసుక్రీస్తు యొక్క ముఖ్య శిష్యులయిన పండ్రెండుగురిని సూచించును. క్రీస్తునకుఁ బెక్కుమంది శిష్యులుండిరి. వారిలోనుండి యాతఁడు పండ్రెండుగురిని నేరి యాంతరంగిక శిష్యులుగఁ జేసికొని వారికి నపోస్తలులని నామకరణము చేసెను.

"ఉదయమైనప్పుడు ఆయన తన శిష్యులను పిలిచి వారిలో పండ్రెండుమందినేర్పరచి, వారికి 'అపోస్తలులు' అను పేరు పెట్టెను. వీరెవరనఁగా: (౧) ఎవని కాయన పేతురు అను మారుపేరు పెట్టెనో ఆ సీమోను (౨) అతని సహోదరుఁడైన అంద్రెయ, (౩) యాకోబు (౪) యోహాను, (౫) ఫిలిప్పు, (౬) బర్తొలొమయి, (౭) మత్తయి, (౮) తోమా, (౯) అల్ఫయి కుమారుఁడైన యాకోబు, (౧౦) జెలోతే అనబడిన సీమోను (౧౧) యాకోబు సహోదరుడైన యూదా, (౧౨) ఆయన నప్పగించిన యిస్కరియోతు యూదా అను వారు."*

[లూకా. ౬]

"ఆయన తన పండ్రెండుమంది శిష్యులను పిలచి అపవిత్రాత్మలను వెళ్లగొట్టుటకును, ప్రతివిధమైన రోగమును, ప్రతివిధమైన వ్యాధిని స్వస్థపరచుటకును, వారి కధికారమిచ్చెను.......యేసు ఆపండ్రెండు మందిని పంపివేయుచు, వారినిచూచి వారికి ఆజ్ఞాపించిన దేమనగా - మీరు అన్యజనుల దారిలోకి వెళ్లకుడి,.........వెళ్లుచు పరలోకరాజ్యము సమీపించియున్నదని ప్రకటించుడి. రోగులను స్వస్థపరచుడి, చనిపోయిన వారిని లేపుడి, కుష్ఠరోగులను శుద్ధులనుగా చేయుడి, దయ్యములను వెళ్లగొట్టుడి." [మత్తయి. ౧౦]

వీరిలోఁ జివరవాఁడగు యూదా చివరకుఁ దన గురువును మోసముచేసి శత్రువుల చేతికి నప్పగించినందునఁ దరువాత నాతనికి బదులుగ మత్తయి అను వానిఁజేర్చిరి. [అపోస్తలుల కార్యములు. ౧.] యేసు సిలువమీఁదఁ జంపఁబడిన తరువాత సమాధిలో నుండి మరల లేచినప్పుడు (దీనినే పునరుత్థానమనియెదరు) ఆతనిని చూచియుండుట అపోస్తలుల ముఖ్యలక్షణము. కావున నీ పండ్రెండుమందియు పునరుత్థానమును చూచినవారు. క్రీస్తు తరువాత నీయపోస్తలులు దేశదేశములకుఁబోయి యేసు సువార్తఁ దెల్పి క్రైస్తవ మతమును అభివృద్ధిఁజేసిరి. వీరు మతాభివృద్ధికై చేసిన పనులు 'అపోస్తలుల కార్యములు' అను పుస్తకములో వర్ణింపఁబడినవి. ఇది 'క్రొత్త నిబంధన గ్రంథము' అనఁబడు క్రైస్తవుల వేద గ్రంథ మండలి యొక భాగము.

అపోహాయుఁడు. ఒక బ్రహ్మర్షి. (చూఁడు 'నీలపరాశరుఁడు').

అప్పకవి. ప్రసిద్ధుఁడగు నాంధ్రి లక్షణవేత్త. అప్పకవీయమను లక్షణ గ్రంథమునకుఁ గర్త. ఆంధ్రి పండితులలో నప్పకవీయమునకు ననమాన గౌరవము కలదు. ఇందుండి ప్రమాణము చూపినయెడల నిప్పటి

* ఈపండ్రెండ్రు అపోస్తలుల పేళ్లు మత్తయి ౧౦, మార్కు ౩, ల్యూకా ౬, కార్యములు ౧, ఈస్థలములలో నీయఁబడినవి. అన్నిచోట్లను ఈ నామములే యున్నవి. కానిఒక్క పేరుమాత్రము భేదముగనున్నది మత్తయి, మార్కు సువార్తలలో తద్దయి (లెబ్బయి) అను పేరుకలదు. లూకా కార్యములలో నందునకు బదులు యూదా పేరున్నది.

తెలుఁగు పండితులలో నాఁటికిఁ దొంబది మంది మాత్రా డక శిరసావహించెదరు. ఆంధ్ర మునందుఁ గవిత్వము చెప్పువారికిఁ గావలసిన విషయములన్నియు నిందు సవిస్తరముగఁ జెప్పఁబడి యున్నందున నింతకుఁ బూర్వమున్న ఛందశ్శాస్త్రములన్నియు వెనుకఁబడి దీనికి నింత యాధిక్యత కలిగినది. ఈకవి తన గ్రంథమును గుఱించి యాక్రింది విధముగఁ జెప్పిన మాటలు చాలభాగము నిజమనియే యొప్పుకొనవలసియున్నది:—

వ.....లక్షణ గ్రంథములు లక్షోప లక్షులు గలవందు.

క. ఒకదానికంటె మఱి వే
ఱొకటి విశేషంబుఁ జెప్పుచుండుకతమునన్
సకల గ్రంథములును జదు
వక తెలియునె లక్షణ ప్రపంచంబెల్లన్. ౧౧౧.

క. ఇది చదివిన పిమ్మట మఱి
యెదియేనియుఁ జదువ బుద్ధియేలా పొడముఁ?
బదఁపడి గ్రంథములన్నియు
వెదకి వెదకి సారమెల్ల వివరింపంగన్. ౧౧౨.

[౧-వ ఆశ్వా.

తమకాలమును నివాసస్థానమును స్పష్టముగ వ్రాసికొనిన తెలుఁగు కవులు తక్కువ.

కాలము

అట్లుస్పష్టముగ వ్రాసిన వారిలో అప్పకవి యొకఁడు. శా. శ. ౧౫౭౮ మన్మథనామ సంవత్సర శ్రావణ బ॥ ౩ (క్రీ. శ. ౧౬౫౬ ఆగస్టు 3) దినమున దేవుఁడు కలలోనికివచ్చి గ్రంథము వ్రాయుమని చెప్పెను. [ఆ. ౧. 33] దశమి గురువారము (ఆగస్టు ౮) నాఁడు కవి గ్రంథము వ్రాయఁ బ్రారంభించెను. (౧-౯౮) ఇట్లప్పకవీయము వ్రాయఁబడి యిప్పటికి ౨౬౦ సంవత్సరములయినది.

ఈతఁడు తనగ్రంథమును కామెపల్లి గోపాలస్వామి వారికి సంకితముచేసినాఁడు, కవియు నాగ్రామమునందె నివాసముగనుండె నట్లు

నివాసస్థలము

కానవచ్చుచున్నది (౧-౩౮,౩౫). కామెపల్లి యిప్పుడు గుంటూరుజిల్లాయందలి పల్నాడు తాలూకాలో నున్నది. అప్పకవి కాలమున నది తంగెడు సీమలోనిది. ఇప్పుడు తంగెడు అనుగ్రామము కామెపల్లికిఁ బశ్చిమమున పల్నాడుతాలూకాలో నున్నది. ఈ కామెపల్లి అనునది అప్పుడు అగ్రహారము. వట్టెము పెద్దనార్యునకు సాయప వెంకటపతి యిచ్చెను. (౧-౯౯,౧౦౦)

ఈకవిది భారద్వాజ గోత్రము, ఆపస్తంబ సూత్రము. ఈతఁడు వైదికుఁడు. ఇంటిపేరు

వంశము

కాకునూరివారు. ఈ వంశమువారిది మొదట కాకునూరు అగ్రహారము. అది సరికొండ సీమలో నుండెను. వీరి మూలపురుషుఁడు సోమయ్య (౧-౨౧). ఈతఁ డప్పకవి తాతకుఁ దాత. ఈతఁడు చిన్నతనముననే కాశికిఁ బోయి బ్రహ్మేంద్రులయొద్ద శాస్త్రములు చదివి గొప్పపండితుఁడై (౧-౭౩), మధురాపట్టణమునకుఁబోయి యచ్చటపండితుల వాద

ములలో గెలిచి (౧౭-౨). కాకునూరు అగ్రహారమున్ను, నిడుదవెల్లి, భోగినేపల్లి, నివఘళపురి అను గ్రామములలో మాన్యక్షేత్రములను సంపాదించెను. ఈతఁడు 'అభినవచూతసద్గ్రామము' లోఁ గాపురముండెను (౧-౨౩). అభినవచూతసద్గ్రామ మనఁగాఁ గ్రొత్త మామిడిపల్లె. మామిళ్లపల్లెయొకటి బాపట్ల తాలూకాలో నున్నది. మామిళ్లపల్లి (అగ్రహారము) యొకటి నూజువీడు తాలూకాలో నున్నది. కాకునూరీతఁడు సంపాదించినాఁడని యప్పకవి వ్రాసినను, ఈతని తండ్రి పేరు చెప్పుటలో 'కాకునూరి తమ్మన' యని చెప్పుటవలన (౧-౨౩) వీరికి సోమయ్యకుఁ బూర్వమే కాకునూరి వారన్న గృహనామ ముండినట్లు కానవచ్చుచున్నది. ఈసోమయ్యకు గంగమాంబయందు సమరేశ్వరుఁడు, కొండలయ్య, రంగప్ప, లక్ష్మణుఁడు అను నల్గురు కుమారులు పుట్టిరి. వీరిలో రంగప్ప మన కవియొక్క ముత్తాత. ఈయనభార్య కన్నమ్మ. వీరిద్దఱకు తిరుమలభట్టు, గంగన్న, పెద్దసోమయ్య, చిన్నసోమయ్య అను పుత్రులు పుట్టిరి. పెదసోమయ్య మనకవికిఁ దాత (౧-౨౭). ఇతఁడు ౯ క్రతువులుచేసెను. రొంపిచెర్లలో పెద్దనూయి త్రవ్వించెను. రొంపిచెర్ల నరసారావుపేటలోనున్నది. గుడిపాటిలో వినుకొండ మార్గమందుఁ గొప్ప తోట వేయించెను. సత్తెనెపల్లి తాలూకాలో గుడిపూడియను పల్లెయున్నది. అదియే యిదికాఁబోలు. పట్టెము

పోతనార్యుని కుమార్తెయైన కృష్ణమ్మ యీయన భార్య. పెద్దిభట్టు శాపెమఱది. పట్టెపువారు కామెపల్లి అగ్రహారీకులు. ఇట్లు వీరప్పకవి తండ్రికి మాతామహులు. అప్పకవి స్పష్టముగఁ జెప్పక పోయినను అప్పకవికిని వీరు మాతామహు లయినట్టే కానవచ్చుచున్నది. ఈయనకు వెంగన్న, కోన్నభట్టు, గందయ్య అను కుమారులును, తిమ్మక్క, రంగమ్మ, లింగమ్మ, గోపమ్మయను కూఁతులును కలిగిరి (౧-౨౦). వారిలోఁ బెద్దవాఁడయిన వెంగన్న మనకవికిఁదండ్రి. పల్నాటిలో నీతఁడు గొప్ప పండితుఁడని ఖ్యాతిఁజెందెను.

తే. పల్లెనాటను నూటతొంబదియు నాల్గు
గ్రామములనీడుగానక కాకునూరి
వెంగనార్యుఁడు వేదవేదాంగములను
బ్రస్తుతికి నెక్కె మాఱటబ్రహ్మయనఁగ.

[౧-౨౨.

ఈ వెంగనార్యునకు శేషమ్మవలన అప్పకవి, సోమనార్యుఁడు, వేంకటపతి, కృష్ణభట్టు, లక్ష్మణుఁడు అను నైదుగురు పుత్త్రులుపుట్టిరి.

విద్యాదికములు

కాకునూరివారిది మొదట కాకునూరును, పిదప క్రొత్త మామిళ్లపల్లెయైనను అప్పకవి కామెపల్లికి వచ్చి నివసించుటయెట్లు తటస్థించెను ? కామెపల్లి యాతని మేనమామల స్థలముగఁ గానవచ్చుచున్నది. తన తల్లివైపువారు ప్రబంధకర్తలనియు తనకుఁగలవచ్చిన సమాచారము తాను వారికి మఱునాఁడు చెప్పఁగా

వారు కావ్యము చేయుమని ప్రోత్సాహపఱిచి రనియు కవియే చెప్పియున్నాఁడు.

"ఘనధీయ స్వప్న విధంబంతయుఁ దేటపడ నెఱింగించిన నాకర్ణించి సకలజనంబులు నానందంబుఁబొంది రందుఁ గొందఱు మాతృసంబంధులగుమదీయ బంధువులు గూడఁ గులసింధు సౌగంధిక బంధులును, ధృత్రపరిబంధు లును నీతియుగంధరులును గావున నాకిట్లనిరి" [౧.౬౬.

అప్పకవి మేనమామల యింటిలోనే పెరిగి విద్యావంతుఁడయ్యెనని కూడ లోకవార్త వచ్చుచున్నది. కావున నీతని కుటుంబము మేనమామలఁ బట్టియే కామెపల్లికి వచ్చెనని మనము నిశ్చయింపవచ్చును.

అప్పకవికి స్వరయుక్తముగ యజుర్వేదము నేర్పినవాఁడు మూర్తి సిద్దన్న, శబ్దశాస్త్రము చెప్పినవాఁడు కాండూరిగిరి దేశికుఁడు, సిద్ధాంతములు తెలిపినవాఁడు సూరభట్టు, లక్షణవేత్తను చేసినవాఁడు మంచికంటి యోబనకవీంద్రుఁడు, స్మార్తకర్మ మెఱిఁగించిన వాఁడు కొలచలమల్ల సింగనార్యుఁడు, ఆగమముల నుపదేశించినవాఁడు రాజయోగి; వీరు విద్యాగురువులు (౧-౩౧). వీరన్యథా తెలుఁగు వాఙ్మయమునందుఁ బ్రసిద్ధిచెందిన వారు కానందున మనకు వీరిని గుఱించి విశేష మేమియుఁ దెలియదు. అప్పకవికి లక్షణము నేర్పిన మంచికంటి యోబనకవి యీ గురువులలో మనకు ముఖ్యుఁడు. ఆతని బోధ ఫలమే యప్పకవీయము. విద్యాభ్యాసమైన తరువాత నీతఁడు కొంతకాలము వఱకు శ్రీశైలముమీఁద నున్నట్లు ఈ క్రింది పద్యము వలనఁ దెలియుచున్నది.

క. శ్రీగిరిని నిలిచి నీవును
భోగివిభూషణుని పట్టపుకవీంద్రుఁడవై [౧. ౫౪.

ఈతనిచే రచింపఁబడిన గ్రంథములు

ఆపస్తంబ షట్కర్మ నిబంధనము, కాలజ్వాలార్ణవ సంహిత యను గ్రంథమునకు శ్లోకరూపమైన సంగ్రహము అను రెండుగ్రంథము లప్పకవి సంస్కృతమున రచించినట్లు కానవచ్చుచున్నది. అప్పకవీయముగాక తెలుఁగున, అనంతవ్రత కథ, శ్రీశైలమల్లికార్జునునిమీఁద శ్లేషనిందాస్తుతి గర్భిత సీసపద్యశతకము, కవికల్పకమను లక్షణ గ్రంథము, స్త్రీలకు ధర్మద్విపద, అంబికావాదమను యక్షగానము అను గ్రంథము లీకవి రచించినట్లు అప్పకవీయము లోన కవి చెప్పుకొనియున్నాఁడు (౧-౫౫). ఇందొక్కటియు నిప్పుడు కానరాదు. సూర్యుని యెదుట నక్షత్రములవలె అప్పకవీయము ముందర నవన్నియు లోపించియుండును. ఇట్లే నన్నయ తిక్కన కృతమైన చిన్నపొత్తంబులు లోపించినవి. ఇఁక మిగిలినది అప్పకవీయము.

అప్పకవీయము

ఇప్పుడు దొరకునంతవఱ కప్పకవీయ మైదాశ్వాసముల గ్రంథము. ఎనిమి దాశ్వాసముల గ్రంథము రచింపవలెనని కవి మొదట సంకల్పించెను (౧-౯౬). ఏకారణముచేతనో

అభిధానాఖ్యానములను మాత్రము వ్రాసెను. ఇది పేరునకు, నన్నయభట్టీయము మనఁబడు ఆంధ్రశబ్ద చింతామణికి టీకయైనను,నిజముగ స్వతంత్ర గ్రంథమనియే చెప్పవలసియున్నది. అప్పకవి ఛందోవ్యాకరణములను గుఱించి ఆంధ్రమున గొప్పగ్రంథము వ్రాయఁ దలఁచి, గౌరవార్థమును లోకులు ప్రమాణముగ నంగీకరించుటకును, దీనిని నన్నయ భట్టీయమునకు టీకగ వ్రాసెను. ఆంధ్ర శబ్దచింతామణియంతకుఁబూర్వము అప్పకవి కన్నదియు విన్నదియుఁగాదు. (౧. ౯౦). 'తెలుఁగున ఘనకావ్యంబొకటి' చేయవలయునని సంకల్పముచేసి కవియొకనాఁడు (శా. శ. ౧౫౭౦ శ్రావణ బ॥ ౮ నాఁడు) నిద్రపోఁగా (౧-౩౪) కలలో శ్రీమహావిష్ణువు కాన్పించి (౧-౩౬) 'నన్నయభట్టుచే రచింపఁబడిన వ్యాకరణమొకటియున్నది. అందు నెనుబది రెండార్యలు కలవు (౧-౫౨). దానిని అసూయచే భీమకవి గోదావరిలోఁ గలిపెను (౧-౪౪), రాజనరేంద్రుని కుమారుఁడైన సారంగధరుఁడు దానిని పాఠముచేసి యుండెను, అతఁడు సిద్ధుఁడై యిన్నాళ్లు జీవించియుండి మొన్నటి కీలకి నామ సంవత్సరమున (క్రీ. శ. ౧౬౫౦) ఆగ్రంథమును బాలసరస్వతులకిచ్చెను.అతఁడు దానికి తెలుఁగుటీక వ్రాసెను. అది నీకు దొరకఁగలదు, నీవు దానికిఁ దెనుఁగు చేయుము' (౧-౪౦) అనిచెప్పెను. అప్పకవి మేల్కాంచి యాశ్చర్యముఁ జెందుచుండఁగ, ముత్తంగ పర్వతప్రాంత విప్రుఁడొకఁడు నవమి నాఁడువచ్చి, ఆంధ్రశబ్ద చింతామణి గ్రంథమును, బాలసరస్వతి టీకను అతని కిచ్చెను (౧-౬౫). అంతట నప్పకవి దశమీ గురువాసరమునాఁడు, గ్రంథము వ్రాయుటకుఁ బ్రారంభించెను! (౧-౯౭).

పైని చెప్పిన కథలను మనము నమ్మినను నమ్మకపోయినను ఆంధ్ర శబ్దచింతామణి యంతకుఁ బూర్వమెన్నఁడును అప్పకవి విని కని యుండనిది యనియు, పూర్వలక్షణ గ్రంథములెన్నియో శోధించిన యప్పకవియే దీనిని అంతకుఁ బూర్వమేయుండ నందున నిది నూతనమే యైయుండవచ్చుననియు ఊహింపవచ్చును.

ఆంధ్రశబ్దచింతామణి యను గ్రంథము భారతము రచించిన నన్నయ్యచే రచింపఁబడినదా లేదా యన్నవిషయము శ్రీయుత వీరేశలింగముగారు ఆంధ్రకవుల చరిత్రములో విపులముగఁ జర్చించినారు. మేమును ఆశబ్దము క్రిందఁగొంత చర్చింపఁగలము.

ఆంధ్రశబ్దచింతామణియొక్క నిజమైనకర్త యెవ్వఁడైనను, అప్పకవి యది నన్నయభట్టారక రచితమనినమ్మి, దానిని ఆధారముగఁ బెట్టుకొని అప్పకవీయమును రచించెను. బ్రహ్మ సూత్రాదుల మీఁద భాష్యములు వ్రాయునప్పుడు శ్రీ శంకర రామానుజాదులైన యాచార్యులు, పదియక్షరములుగల సూత్రముపై నూఱుపుటలు భాష్యము వ్రాసినట్లు

ఆంధ్రశబ్దచింతామణి సూత్రములను పేరునకు నాధారముగ గ్రహించి అప్పకవి తనకిష్టము వచ్చినట్లువ్రాయుచుం బోయెను. అప్పకవిచేం దెన్గింపంబడిన మూలగ్రంథమందలి ఆర్యావృత్తములేంబది. దానివివరము:-

ఆశ్వాసము	ఆంధ్రశబ్దచింతామణిలోని ఆర్యావృత్తముల సంఖ్య	అప్పకవీయములోని తెలుంగు పద్యముల సంఖ్య
౧	౬	౨౩౭
౨	౨౦	౪౩౭
౩	౧౧	౩౯౮
౪	౫	౪౪౦
౫	౧౮	౧౯౩
	౫౦	౧౨౦౫

ఇట్లు ౫౦ ఆర్యావృత్తములకు ౧౨౦౫ పద్యములైనవి. ఆర్యావృత్తము చిన్నది. మన కంధమంతేదీ. అందు నొక భేదమే కందము. కావున ౫౦ ఆర్యలనంగా ౫౦ కంధములతో సమానమని మన మనుకొన వచ్చును. ఇంక తెలుంగుభాగమున శార్దూలాది వృత్తములును, సీసముమొదలగు విశాలాంధ్ర పద్యములును, పుటలకొలంది నిండి యున్న గద్యములును కలవు. కావున మూలమునకును, భాషాంతరమునకును ఏవిధమైన పోలికయులేదు. మూండవ ఆశ్వాసములోని

ఆద్యోవళిర్ద్వితీయో
వర్ణః ప్రాసోత్ర పాదపాదేషు
స్వస్వచరణేషు పూర్వః
పాశ్రిసస్స ర్వేషు చైక ఏవస్యాత్.*

ఈ యొక్క యార్యను ఆధారము చేసికొని యతిప్రాసలకు సంబంధించిన నియమములన్నియుం జెప్పుచు ౩౯౮ పద్యములు వ్రాసియున్నాండు. కావున అప్పకవీయము ఆంధ్రశబ్దచింతామణికి భాషాంతరమని కాని రూపాంతరమనికాని తలపంగూడదు. స్వతంత్ర గ్రంథమనియే చెప్పవలసియున్నది.

అప్పకవీయము స్వతంత్రగ్రంథమని తెలిసికొని దానిని జూడ మొదలుపెట్టిన నట్టివారికిని దానివిషయమై గౌరవము కలుగక మానదు. ఈ గ్రంథమునందు లక్ష్య లక్షణములను సంగ్రహించుటకు గ్రంథకర్త మిక్కిలి పాటుపడినాండని తప్పక చెప్పవలసి యున్నది. కవిచెప్పుకొనినట్లు 'వెతకివెతకి సారమెల్ల వివరించినాం'డనుటకు సందేహములేదు. ఇతనికాలమునకుం బూర్వము పుట్టిన లక్షణగ్రంథములన్నియు నితండు శోధించెను. లక్ష్యములకై పెక్కు కావ్యములను గాలించెను. ఇతండిచ్చిన లక్ష్యములన్నియుం గ్రొత్తవికావు. నియుం బూర్వలాక్షణికు లిచ్చిన పెక్కులక్ష్యములను ఆయా గ్రంథములలోనుండి యుదాహరించెననుటయు స్పష్టమేగ్గునను, అట్టి యుప్పుతీస్కికొనిన లక్ష్యములుగాక స్వతంత్రముగం దానుశోధించిన లక్ష్యములు గూడం బెక్కులిచ్చి యున్నాండు. ఆంధ్రలక్ష్యలక్షణగ్రంథములుగాక సంస్కృత ఛందశ్శాస్త్ర

*ప్రతిపాదము నందును మొదటి యక్షరము యతి, రెండవ యక్షరము ప్రాస, యతి చరణచరణమునకును వేఱువేఱు, ప్రాసాక్షరము నాలుగు చరణములకును ఒక్కటియే.

గ్రంథములను, శాంతవఱకు సంస్కృత ప్రాకృతవ్యాకరణ గ్రంథములను శోధించి వానిలో గావలసిన విషయములను ఈగ్రంథమునందుఁ జేర్చియున్నాఁడు. గణితశాస్త్రమందలి కఠినమైన అంకయోగ వ్యవహారములనుగూడ (Permutations and Combinations) ఛందశ్శాస్త్రమునకు సంబంధించి నంతవఱకు సంగ్రహించియున్నాఁడు. విశేషముగ జతుర్థాశ్వాసముఁ జూడుఁడు.

అప్పకవీయ మైదాశ్వాసములు కలది యని యిదివఱకే చెప్పియున్నాము. ప్రథమాశ్వాసమునకు భాషాపరిచ్ఛేదమనియు, ద్వితీయాశ్వాసంబునకు వర్ణపరిచ్ఛేదమనియు,తృతీయాశ్వాసంబునకు వళిప్రాసపరిచ్ఛేదమనియు, చతుర్థాశ్వాసమునకు పద్యపరిచ్ఛేదమనియు, పంచమాశ్వాసమునకు సంధిపరిచ్ఛేదమనియు నామాంతరములు. తత్సమ, దేశ్య, క్రియాపరిచ్ఛేదంబులనఁబడు మూఁడుపరిచ్ఛేదంబులింకను వ్రాసెదనని కవి మొదట (౧-౬౫) ప్రతిజ్ఞ చేసెను గాని యేకారణము చేతనో యవి యెచ్చటను గానరావు. వానిని వ్రాయకమునుపే కవికి నవసానకాలము ప్రాప్తించెనని తలఁపవలసియున్నది. తత్సమ దేశ్య ప్రకరణము లప్పకవి వ్రాసియుండిన యెడల నవి యాంధ్రభాషా చరిత్రమునకు మిక్కిలి యుపయోగకరములై యుండు ననుటకు సందేహము లేదు. ఇఁక నొక్కొక్క యాశ్వాసము నందలి కొన్ని కొన్ని విశేషములఁ జూపెదము.

ప్రథమాశ్వాసమునందు గవి సంస్కృతాది యష్ట భాషలను గుఱించియు, కావ్యభేదంబులను గుఱించియు, ధసభావ నాయక నాయికలను గుఱించియు, ఆంధ్రభాషాభేదములను గుఱించియు విపులముగ వ్రాసియున్నాఁడు. ఇందలి శబ్దార్థ లక్షణాలంకార సీసమాలిక, శబ్దార్థ దోషసీస మాలిక, భావ సీసమాలిక, శృంగార రస సీసమాలిక, అష్ట రస సీసమాలిక, నాయక నిర్ణయసీసమాలిక లనునట్టి మాలికలు కవియొక్క యసామాన్య సాహిత్యజ్ఞానమును వెల్లడిచేయు చున్నవి. నూతనముగా నీ విషయమును అభ్యసించువారికి పాఠము చేయుటకు వీలుగ నుండుటకునై యివి సీసమాలికలుగ వ్రాయఁబడినవి. ఇదివఱకు షడ్ భాషలనియే వాడుక. వీనికి సంస్కృతము, ఆంధ్రము కలిపి యప్పకవి అష్టభాష లనియెను. ఈ విభాగములో నప్పకవి, తన కాలమునందు వాడుకలోనున్న యట్టి హిందీ, బంగాళీ, కన్నడము, అరవము మొదలయిన అన్యదేశభాషలకు తావిచ్చినవాఁడు కాఁడు. కన్నడ వ్యాకరణము వ్రాయువారు అష్ట భాషలలోనుండి ఆంధ్రమును తొలఁగించి, దాని స్థానమందు కన్నడమును ఉంచుకొనవలయుననియు, అరవము వారు అరవమును ఉంచుకొనవలయు

ప్రథమాశ్వాసము

ననియు నప్పకవి తాత్పర్యము గాంబోలును. నాటకములలో నేయేభాష యెవరెవరికి నుప యోగింపవలసినది చూపుటకు నప్పకవి యీ క్రిందిపద్యము వ్రాసియున్నాఁడు.

సీ. క్షపణ జైనాదిక కర్మ హీనులకున్ను
బ్రాహ్మజన్ములకును బ్రాకృతంబు
క్షితిప వైశ్య శూద్ర ప్రభృతి మధ్యమాధమ
జాతుల కెల్లను శౌరసేని.
ధీవర లుబ్ధకాది వినీచజాతుల
మానవులకు నెల్ల మగధభాష
మొగిఁ బిశాచాసుర ముఖ్యుల కెల్లఁ బై
శాచికానామ భాషాద్వయంబు
గీ. పతిత చండాల యవనాది పరమనీచ
జాతి నరుల కపభ్రంశ, మాత్తెలుంగు
సీమవారికి నాంధ్రంబుఁ జెప్పవలయుఁ
గావ్యనాటకముల గోపికా భుజంగ! [౧.౧౮౬.

ఈ పద్యమునుగూర్చి కొంత ఆలోచింప వలసి యున్నది. సంస్కృత నాటకములలో భిన్న భిన్న పాత్రలకు భిన్న భిన్న భాషలు వాడుచుండేదరు. రాజు మాటలాడు భాష యొకటి, రాణి మాటలాడునది మఱియొకటి, రాజు స్నేహితుఁడగు విదూషకుఁడు మాట లాడునది యింకొకటి! ఆ నియమములను అనుసరించి యప్పకవి యీ పద్యమును వ్రాసెను. తెలుఁగు వాఁడగుటచే అందు 'ఆంధ్ర' మొకటి యెక్కుడుగాఁ గలిపెను. కాని యిందలి నియమములు లాంధ్రకావ్యములకుఁ గాని, ఆంధ్ర నాటకములకుఁగాని యెట్లు పనికి వచ్చును? తెలుఁగులో నాటకములు వ్రాయుచు నాయకునకు సంస్కృతము, నాయికకుఁ బ్రాకృతము, వైశ్యునకు శౌరసేని, తెలుఁగువానికి తెలుఁగు భాష, వాడుట పొసఁగునా? పొసఁగదు. అప్పకవి కాలమునందు, వీధినాటకములు తప్ప యాంధ్రమునందు కావ్యములనఁ దగు నాటకములు లేవు. వీధి నాటకముల భాష గ్రామ్యము. తెలుఁగులో నాటకములు వ్రాయునప్పుడు వేఱు వేఱు జాతులకును, వేఱు వేఱు వృత్తు లవలంబించు వారికిని ఏయేభాష యుపయోగింపవలయునో యది స్పష్టముగ వ్రాయక, సంస్కృత నాటకమునకుగాని, తెలుఁగు నాటకములకుగాని ఉపయోగము లేని యీపద్యమును వ్రాయుట వింతగనున్నది.

నాటకాదులలోని భాషలను గుఱించి స్పష్టముగఁ జెప్పక పోయినను, మ్లేచ్ఛభాషా పదములను, అన్యదేశభాషాపదములను జాతీయములను వలయునప్పుడు కావ్యములలో నుపయోగింపవచ్చునని యప్పకవి యీ క్రింది పద్యములలోఁ జెప్పి పెద్దన తిమ్మనధూర్జటి కవులపద్యముల నుదాహరించియున్నాఁడు:-

క. క్షితిమ్లేచ్ఛ భాష శ్రుతి గ
ర్హితమగు నట్లైన నాధరిత్రిని దానిన్
మతిరోసి విడువఁగూడదు
సతతము వ్యవహారహాని సంధిలుకతనన్.

క. నీతంబని దేశీయము
జాతీయంబును వచించు సమయమున నిజ
ఖ్యాతిగ మ్లేచ్ఛోక్తు లాదిగాఁ గూర్తురజా.
[౧-౧౬౯, ౧౭౦

దేశభాషా గ్రంథములు సంస్కృత గ్రంథములవలెనే నాలుగు పురుషార్థముల నిచ్చునని యీ కవి వ్రాసిన యీ క్రిందిపద్యము (౧. ౧౬౭), భాషాభిమానులు గమనింపఁ దగినది:

క॥ ఆయా దేశము వారికి
నాయా దేశంబు భాష నమరిన కావ్యం
బాయత పురుషార్థంబులఁ
బాయక సమకూర్చు దేవభాషయపోలెన్.

ఈకవికి శూద్రకవులయందు నసూయ యుండెను. ఈతని యభిప్రాయ ప్రకారము బ్రాహ్మణులు తప్ప నితరులు పద్యములు చెప్పఁగూడదు!

తే॥ ఉపమ గలిగిన శయ్యలనొప్పియున్న
నంఘ్రిభవుని కావ్యంబు గ్రాహ్యంబు గాదు
పాయసంబైన సంస్కార పక్వమైనఁ
గాకి ముట్టంబు హవ్యంబు కానియట్లు.
[౧.౧౨౯.

క॥ ధరణీసురుఁడు ప్రశాంతుఁడు
గురుభక్తుఁడు శుచియుఁ గల్పకుఁడు పూర్వకవీ
శ్వరవాక్ప్రయోగదక్షుఁడు
గరుణామతి యెవ్వఁడతఁడు కవియనఁ బరఁగున్.
[౧. ౧౪౭.

'ఉపమగల్గిన శయ్యలనొప్పియున్న' యను పద్యము ముఖ్యముగ వసుచరిత్ర కారుఁడైన రామరాజ భూషణుని మనసునందుంచికొని వ్రాసినట్లున్నది. అప్పకవీయమువంటి లక్షణ గ్రంథమునకు వసుచరిత్రము, హరిశ్చంద్ర నలోపాఖ్యానములవంటి కావ్యరత్నములలో నుండి యసంఖ్యములైన లక్ష్యములు దొరికి యుండును. కాని యప్పకవికి శూద్రకవుల యెడ నుండు అసూయతప్పే యా కావ్యములనుండి యాతని లక్ష్యము తీయకుండఁ జేసినది.* ఇంత పెద్దలక్షణ గ్రంథమునందు రామరాజ భూషణుని కావ్యములనుండి లక్ష్యములు లేకపోవుట యొకగొప్ప వింతయే. ఇంతియ కాదు. కవి మొదట కవిస్తుతి చేయునప్పుడు రామరాజభూషణుని స్తుతింపకపోఁగా నతని మస్తకమును తన్నినాఁడన్న అయ్యలరాజు రామభద్రకవిని

'రామరాజ విభూషణ రత్నఖచిత
చారుమస్తకలాపాదిహారి వాక్య
గౌరవము పెక్కుభంగుల గణనచేసి' [౧-౨౭.

అనుపదిపద్యాలతో స్తుతించి రామరాజభూషణుని నగౌరవపెటిచినాఁడు.

విష్ణుచిత్తీయమను కావ్యము కృష్ణదేవరాయలచే వ్రాయఁబడ లేదనియు, దానిని పెద్దనయే వ్రాసెననియుఁ దన భావమును అప్పకవి యీ క్రింది గద్య పద్యములచేఁ జూపినాఁడు:–

వ. అది యెట్లనినఁ గనియె ననవలసిన బూతార్థక్రియాపదైక వచనంబునందు వర్ణ

* తృతీయాశ్వాసమునందు నొక పద్యము (౨౭౭) వసుచరిత్రము నందుండి యీయఁబడినది. కాని యది అప్పకవి స్వయముగ నుదాహరించినది కాదు. "లక్షణ విలాసము వారు తెలియక కొన్ని యుదాహరణంబులు వ్రాసినారు, అవియును వివరించెద" నని యుపోద్ఘాతము వ్రాసి లక్షణవిలాసము వారు పడ్డతప్పును దిద్ది యున్నాఁడు. కావున నప్పకవి రామరాజభూషణుని గ్రంథమునుండి లక్ష్యము తీయలేదనియే చెప్పవలసి యున్నది.

లోపము చేసి కనెగంటయని గ్రామ్యపదముగా హాగనుశాసనులు యోచించిరిగాన నీ సది సాధకము చేసికొని యాంధ్రకవితాపితా మహుఁడు కొనియాడనుటకుఁ గానెనని చెప్పె నవి యెవ్వియనిన.

ఆదిపర్వమునఁ *

క. వనకన్యకయఁట! నేనఁట!
వనమున గాంధర్వమున వివాహంబఁట! సం
దనుఁగనెనఁట! మఱచితివఁట!
వినఁగూడునె యిట్టిభంగి విపరీతోక్తుల్.

విమర్శించి తృతీయమునందు.

ఉ. పూని ముకుందు నాజ్ఞఁగను
బొమ్మనె కాంచి యజాండభాండముల్
వానిమీఁదఁ బోవ నడు
వంగ్గానెఁ దన్నన నెఱ్ఱగనిళ్ళల
త్వానదలత్వనిష్ఠలై సమ
స్తజగంబుల జాడ్యచేతనల్
గానతికెక్కు వైన్యవతి
కాంచనవేత్రము నాశ్రయించెదన్.

రెండవ యాశ్వాసమునందు, నక్షరముల యుచ్చారణను గుఱించియు, స్వరూపమును గుఱించియు, విపుల

ద్వితీయాశ్వాసము

ముగ వ్రాయఁబడినది. లనదుచ్చారణకును, శుద్ధ లేఖనమునకును గావలసిననియమములిందు శ్రద్ధతో నీయఁబడినవి. ఆంధ్రలేఖకులు తఱుచుగాఁ జేయు నట్టి ప్రమాదములనన్నిటిని శ్రద్ధతోఁ గని పెట్టి వానినన్నిటిని దిద్దియున్నాఁడు. సాధారణలేఖకులు వత్తులు వ్రాయవలసిన చోట కొమ్ము క్రావడులును, కొమ్ము క్రావడులు వ్రాయవలసినచోట వత్తువనుడులును వ్రాయు చున్నటఁగని యప్పకవి యివి వత్తువలు, ఇవి కొమ్ముక్రారలు అని తెలుపుటకు రెండు సీసములను ఇచ్చినాఁడు. ఇట్లె పెక్కుతప్పులను సవరించినాఁడు. లోని "శుద్ధాంధ్రవిస్తులు, వీనికి లేఖనక్రమము" అనుశీర్షిక క్రింద అచ్చుల రూపములను, హల్లుల రూపంబులను, స్వరగుణితములును, విడివిడిగా వ్రాసిచూపినాఁడు. కాని లేఖకులకు అప్పకవివ్రాసిన అక్షరముల యాకారములు తెలియనందున ఈరూపములు లొక్కొక్క ప్రతిలో నొక్కొక్క విధముగ నున్నవి. అప్పకవి యెట్లువ్రాసెనో కనుగొనుటకు అప్పకవినాఁటిప్రతిగాని, తరువాతఁ గొన్నిదినములకు వ్రాయఁబడిన ప్రతిగాని దొరకవలెను. అప్పుడుగాని అప్పకవి యిచ్చిన లిపియిట్టిదియని తెలియరాదు. ఈ ప్రకరణమునందు రేఫఱకార సంబంధమైన సీసమాలికలను, పట్టికలును మిక్కిలి పెద్దవి. కవి యొక్క శోధనకును పరిశ్రమమునకును గొప్ప సూచకములు. ఈతనికిఁ బూర్వులైన తాళ్ళపాక చిన్నయ్య మొదలయిన వారు రేఫఱకారముల జాబితాలిచ్చినను తాను ఇంకను శోధించి క్రొత్తవిచేర్చితినని కవియిట్లు చెప్పుకొన్నాఁడు:-

* ఈపద్యమిప్పటి భారతమునందు నాదిపర్వమునఁ గానరాదు. పిల్లల మఱ్ఱి పిన వీరభద్రుఁడు రచితమైన 'శకుంతలాపరిణయము' అనఁబడు కావ్యమునందు నాల్గవయాశ్వాసమున నున్నది.

సీ. ఆదికవీంద్రకావ్యము లెల్లశోధించి
 క్రమతి హ్రస్వములు దీర్ఘములునైన
చేచ్చులమీఁదను హల్లులమీఁదను
 గలుగు రేఫ అకారములు వచింతుఁ
దాళ్లపాకాన్వయా దధిపూర్ణధవళకీ
 ర్తి తిరుమల వేంకటుండు
మొదలైనవారలు మునుపురచించిన
 యవియెల్లఁ జాలనాయనఁగవలదు
వండియునొకకొన్ని వదకిఁగూర్చితి గవి
 రాజులు మేలని ప్రస్తుతింప
 [౨.౧౯౬.

అప్పకవి రేఫ అకారములను గుఱించి మిక్కిలి పట్టుదలగలవాఁడు. యతిస్థానమందుఁగాని, ప్రాసస్థానమందుఁగాని మరిచియైనను రేఫ అకారములకు మైత్రిచేయఁగూడదని యీతని యభిప్రాయము (౨-౨౨౯-౨౩౭). రేఫ అకారములపట్టిక యేర్పఱుచుటలో నప్పకవి యేమార్గమును అవలంబించెనో స్పష్టముగ వ్రాయలేదు. కాని యొకానొక తెలుఁగు శబ్దమందలి 'ర' అను అక్షరము రేఫమా అకారమా యని సంశయమువచ్చినప్పుడు అదిరేఫమనిగాని అకారమనిగాని నిశ్చయించుటకు నిచ్చిన లక్ష్యముల వలన మనము కొంతవఱకు నూహింపవచ్చును. తాను ప్రమాణముగఁదీసికొనఁ దలఁచుకొన్న గ్రంథములలో సంస్కృతపదములందలి రేఫముతోఁ బ్రాసయందుగాని, యతియందుగాని మైత్రిజెందిన 'ర' అనుఅక్షరము రేఫము అని మొదట రేఫముల నేరుకొనెను. మిగిలిన వానిని అకారములనెను. సంస్కృత పదాంతర్గతమైన 'ఢ' కారముతోనైనను (తానుశోధించిన) గ్రంథములలో మైత్రిఁజెందనివన్నియు అకారములనెను. ఒకప్పుడు రేఫముతోను, మఱియొకప్పుడు అకారముతోను (పైనిచెప్పినరీతిని విడదీసిన రేఫ అకారములతోనని యర్థము) మైత్రిఁజెందిన వానికి నుభయరూపము లున్నవనెను. ఇట్లు రేఫ, అకార నిర్ణయము చేసి మరల రేఫ అకారములకుఁ బూర్వకవులు మైత్రియొప్పలేదని చెప్పుట అన్యోన్యాశ్రయ హేత్వాభాసముకాదా? అది యట్లుండె. ఈరెండు వర్ణములకును పూర్వమొకప్పుడు భిన్నోచ్చారణ యుండినను లేకపోయినను అప్పకవికాలమునాటికే యది లోపించి యీరెండు వర్ణములకును ఒక్కటియే యుచ్చారణయుండెననుట స్పష్టము. అప్పకవి వీనిని విభజించుటకు నింతకష్టపడుటయే యిందుకు సాక్ష్యము. సమానోచ్చారణగల యీ యక్షరములకు మైత్రియుండవచ్చును. అనేగా ప్రాసస్థలములలో నిది రేఫమనిగాని, ఇది అకారమనిగాని ఆలోచింప నక్కరలేదని కవిజనాశ్రయాద్ది గ్రంథకారుల యభిప్రాయమైనందున దానిని ఖండించుటకు అప్పకవి యింతపరిశ్రమ చేయవలసివచ్చినది!

అక్షర స్వరూపనిర్ణయమైన తరువాత నియాశ్వాసమందు నాగమాదుల ననుసరించి, అక్షర బీజములు, వాని లింగములు వాని బూజచేయు విధము మొదలయిన విషయములు చెప్పఁబడినవి. చివర సారస్వతౌషధ

ములని రెండవ మూఁడు నైదులు చెప్పఁబడినవి. ఇందులో నొకప్పుండు తినిన 'సూక్ష్మలు ఘటించు' రెండవవాండు తినిన 'గడియకొక పద్యశతకంబు నుడువు' సామర్థ్యము కలుగును, మూఁడవవాండు తినిన 'వాని నాలుకను గాపురంబుండు నలువ చేలువ' (౪-౨౯-౩౧).

మూఁడవ యాశ్వాసము యతిప్రాసలకు సంబంధించినది. ఈప్రకరణమునందును అప్పకవి పూర్వ లక్ష్యములను ఎక్కువగఁ బరిశోధించి, పూర్వలక్షణ వేత్తలెక్కంటె నెక్కుడు పనిచేసి యున్నాఁడు. భీమకవి పదియతులు చెప్పినాఁడు. అనంతామాత్యుఁ డిరువది చెప్పెను. అటుమీఁదఁ గొందఱు కవులు యతుల నిరువదియేడు విభాగములుగఁ జేసిరి. అప్పకవి నలుబదియొకటి విధములైన యతులను చెప్పెను (౭,౮)! ఇట్లు యతులసంఖ్య పెరిగిన దనఁగాఁ గ్రొత్తయతులు తెచ్చిపెట్టఁబడినవని కాదు. పూర్వకవులచేఁ జేయఁబడిన పెద్ద విభాగములలోఁ బరకవు లింకను సూక్ష్మములైన విభేదములును కలిపెట్టిరని యర్థము. సంస్కృత సాహిత్య వాఙ్మయమునందు నిట్లె యలంకారములసంఖ్య దినదిన ప్రవర్ధమానమైనది. అప్పకవిచేఁ జెప్పఁబడిన ౪౧ యతులలో స్వరయతులు ౭, వ్యంజనయతులు ౨౧, ఉభయయతులు ౧౨, ప్రాసయతి ౧. అప్పకవి చెప్పిన ప్రాసలు పదునేడు విధంబులు.

తృతీయాశ్వాసము

నాలుగవ యాశ్వాసమునందు ఛందంబుల లక్షణములు వివరింపఁబడినవి. చిత్రబంధగర్భకవిత్వమును గుఱించియుఁ గొంతయిందుఁ జెప్పఁబడి యున్నది. పద్యముల నల్లువారిభాగములు చక్కఁగ నల్లించుచుందురు. ఈ యాశ్వాసమునందు గద్యమును గుఱించి యొక విశేషముకలదు. అప్పకవి యిందు రెండువిధములయిన గద్యములను (వచనములను) వ్రాసి యున్నాఁడు. ఒకటి సాధారణమైనగద్య, మాసగ్రంథాదులలో వాడఁబడునది. రెండవది వ్యవహారభాషలో వ్రాయఁబడిన గద్య. కవి మొదట గద్యలక్షణ మీక్రింది విధముగఁ జెప్పి యీ యుదాహరణ మిచ్చియున్నాఁడు:-

చతుర్థాశ్వాసము

"మ. ధర సాహిత్యము గద్యపద్యము లనం
దారెండు భేదంబులై
పరఁగు న్గద్యమునందుఁ బాదనియతుల్
భావింపఁగా లేవు వా
క్స్ఫురణంబై విలసిల్లఁగా నుడువ నొ
ప్పుం గావ్యఁ డెంతేనియున్
మరుతంత్రీ మతిదీనికే వచన నా
మంబయ్యె నాంధ్రంబునన్."

గద్యము.

శ్రీవిలాసినీ వక్షోరుహ ద్వయగిరి దుర్గసంచారసంగతకు, పద్మజాండానేకభరణ దక్షదక్షు బామాతృధాత్రీప్రథమ విశాలనేత్రప్రముఖ నిఖిల బర్హిర్ముఖ ప్రస్తూయమాన శుభశీల * * * * *

వాసభరత్నాభ, వారిజనాభ, నాగారిస్యందన, నందగోపనందన, కరుణాలవాల, కాంచనచేల భుజగేంద్రశయన, ఆర్తరక్షణపరాయణ, గోవింద, ముకుంద నమస్తే నమస్తే నమస్తే.

“వ. అని యువిధంబున గద్యరూపంబుగా నాది మధ్యాంతములున్న యదున్నను సకలసద్గుణసంపన్నుండును, ...నేయుచు గోపాలభూపాలు వినుతించు జనంబులకు.............................మోక్షం బంగణంబునంగల వేల్పుటొందిక నిశ్చయంబని విపశ్చిద్వదనంబులు ప్రచురంబులై వెలయుచుండు.”

ఇఁక రెండవ విధమైన గద్యము వ్రాయుటకుఁ బూర్వమొక పద్యము వ్రాసి తేట తెల్గుగ వ్రాసెదనని చెప్పెను. ఆపద్యమును ఆగద్యమును ఈక్రింద నుదాహరించుచున్నాము.

తే. గీ. ప్రత్యయములాఱు నీదప్పు పద్యములను
దెలిసికొన నెంతవారికి నలవిగామి
వరుసనన్నింటికిఁ టీక వ్రాయవలెఁ
దెనుఁగుమాటలఁ గడుతేట తెల్లఁగాఁగ. [౧౩౪.

టీ. వృత్తసంఖ్యాప్రత్యయ మనగాను ఇన్నవ ఛందమునందు యెన్ని సమవృత్తములుపుట్టినవి అని అడిగితేను సరిజెప్పెడివిధము, వారు యెన్నవఛందమున కడిగితేను అన్ని గురువులు అడ్డవరుసగాను వ్రాసి వాటిక్రిందను ఒకటిమొదలుగాను యినుమడించుచు లెక్కలు వరుసవెంబడిన్ని కడకువెడలాను వ్రాసి తుదలెక్కలు యినుమడించితేను యెన్ని ఆయెన్ని అన్ని సమవృత్తములు ఆఛందమునందు బుట్టినవి అని చెప్పెటిది.* [౧౩౫.

ఈరెండవ విధమైన గద్యము లేఖకప్రమాదమున నిట్లు వ్రాయఁబడిన దనుకొనుటకు వీలులేదు. ఏమనఁగా నిట్టి టీకలన్నియు నొక్కవిధముగ నుండుటయు నితరవచనములన్నియు సలక్షణముగ నుండుటయు నొక్కప్రతిలోనే కానవచ్చుచున్నది. లేఖకప్రమాదమైన నన్నివచనములయందు నొక్కదోషమే కానుపింపవలయును గదా. అట్లు కానుపింపదు కావున నివి ప్రమాదజనితము కాదనియు, బుద్ధిపూర్వకమేయనియుఁ దోఁచుచున్నది.

అయిదవయాశ్వాసమునందు సంధివిషయమీయఁబడినది. కవి చతుర్థాశ్వాసముతో ఛందోవిషయమును

పంచమాశ్వాసము

పూర్తిచేసి పంచమాశ్వాసమునుండి వ్యాకరణ విషయమును ప్రారంభించినాఁడు. ఇందుఁ గళ్లు దృత

* ఇది ప్రాచ్యలిఖిత పుస్తకభాండాగారమునందలి ౧౩-౩-౨ అన్నగుర్తుగల గ్రంథమునుండి యున్నది యున్నట్లు ఎత్తివ్రాయఁబడినది. ఇటీవల అప్పకవీయము అచ్చువేసినవారు పైవచనమును సలక్షణముగ దిద్దియే యచ్చువేసినారు. కావున ఈవచనముయొక్క మూలస్వరూపము చూడవలయునన్న మిక్కిలి పురాతనములైన లిఖితప్రతులు, తాటాకు గ్రంథములు చూడవలయును. తాటాకుప్రతుల నన్నిటిలోను ఈటీకలన్నియు గ్రామ్యభాషలోనే వ్రాయఁబడినట్లు కానవచ్చుచున్నది. ఆంధ్రసాహిత్యపరిషత్తువారి సంగ్రహమునందలి తాటాకుగ్రంథమొకటియు మ-రా-శ్రీ గిడుగు రామమూర్తిగారియొద్ద నున్నది యొకటియుఁ జూచితిని. దానిలో ‘టీక’ అనఁబడిన వచనములన్నియు గ్రామ్యములుగను, ఇతర వచనములు సలక్షణములుగను నున్నవి. తామింకను పెక్కుప్రతులను జూచితిమనియు నన్నిటిలో నిట్లేయున్నదనియు శ్రీ రామమూర్తిగారు చెప్పినారు.

ప్రకృతికమ్ముల కనుగొనుటకై యీయఁబడిన పద్యములు విద్యార్థులకు నెంతయు నుపయోగకరములు.

సంస్కృతమునందు 'శకంధ్వాది' గణమునకుఁ బరరూపము చెప్పఁబడినది. అదియే తెలుఁగులోని సంధికి మూలమని యప్పకవి యొక్క యభిప్రాయముగ గానవచ్చుచున్నది. అతఁడిట్లు వ్రాసియున్నాఁడు:-

క॥ అరయ శకంధ్వాదిషు టేః
పరరూపము వాచ్యమనుచుఁ బ్రక్రియలోనన్
వరరుచివాక్యము కలిమిని
పరరూపమె వికృతిఁ గానఁబడుస్వరసంధిన్.
[౧ 3౮.

ఇతర వ్యాకరణముల మతమున ప్రథమ పురుషేకార సంధి వైకల్పికమైనను, ఆంధ్రశబ్దచింతామణిలోని 'నిత్యమనుత్తమ పురుష క్రియాస్వితః' అను సూత్రమునుబట్టి, ప్రథమ మధ్యమపురుషముల యికారమునకుఁ గూడ సంధి నిత్యమని చెప్పుచు నప్పకవి శ్రీనాథుని యంతటి ప్రామాణికకవినిగూడ నిట్లు ఆక్షేపించి యున్నాఁడు:-

క. విరచించెను శ్రీనాథుఁడు *
ధరణినిశ్శృంగార నైషధంబునఁ 'గూర్చుండిరియొండొరు'నని కానక
పరపురుషక్రియలఁ బ్రకృతిభావము కలదే.
[౧.౬౪.

సంధిపరిచ్ఛేదమునందు నాంధ్రశబ్దచింతామణిలో నప్పకవి పాఠానుసారము 'సమ్యోచ్చతో హల్యథర్వణాచార్య మతాత్' అను సూత్రముకలదు. కాని అహోబలుని పాఠమునందును ఇటీవల అచ్చుపడిన బాలసరస్వతుల పాఠమునందును ఈపాఠము కానరాదు.

ఆంధ్రశబ్ద చింతామణియందు 'సర్వత్రాజ్వత్ కార్యంజ్ఞేయం యస్యద్రుత ప్రకృతికేభ్యః' అనియొక సూత్రముకలదు. 'ద్రుతమునకుఁ బరముఁగవచ్చిన యకారమునకు నంతటను అచ్చువలె గార్యమని యెఱుఁగునది' అని దీనికి నర్థము. దీనిని పట్టి చూడఁగా నీసూత్రకారుని మతమున తెలుఁగు మాటలకు మొదట యకారమున్నదనియు, అవి ద్రుతప్రకృతికములకుఁ బరముగా వచ్చినప్పుడు సంధికర్మలో దానిని అచ్చుగ (అనఁగా 'య' వచ్చిన'అ' గ 'యి' వచ్చిన 'ఇ' గ ఇత్యాది) నెంచవలయునని స్పష్టముగఁ దేలుచున్నది. కాని యీమత మప్పకవికి నిష్టములేనందున నాతఁడీ సూత్రమునిట్లు తెనిఁగించి యున్నాఁడు:-

ఉ. ఆరయ వైకృతోక్తులఁ బ
దాదులయందు యకారముండ దా
తీరునఁబల్కు వ్రాఁత గణు
తింపఁగనచ్చగు దాని దాపలన్

---

* బలభిద్వహ్నిపరేత రాజవరుణుల్
పర్యుత్సుకత్వంబు సం
ధిలఁగూర్చుండిరి యొండొరుం గదిసి య
ర్థిం దత్ప్రదేశంబున

న్నల నాళీకమృణాళ నాళీలతికా
నవ్యప్రణాళీ మిళ
ల్లలనాలాప కథాసుధాను భవలీ
లాలోల చేతస్కులై.
[నైషధము. 3.2౮.

నీరజనాభ నాశ్రితము లెల్ల
నిల్పిన నచ్చటఁ బ్రాణసంధి చే
స్నారు నితండు చైద్యవసు
ధాధిపు నేపడగించె నేఁడనన్. [గ. శం.
[కో. ౮.

అప్పయ్యదీక్షితులు. వీరు వేలూరుజిల్లా ఆరణినగరమునకు సమీపమునందున్న అడయపాళెమను అగ్రహారమునందు జన్మించిరి. విశ్వజిద్యాగ మొనర్చి జగద్విఖ్యాత పాండిత్యమును వహించిన రంగరాజమఖి వీరితండ్రి. వీరికి శ్రీకంఠమత ప్రతిష్ఠాపనాచార్యుఁడు, చతురధిక శతప్రబంధనిర్మాత, మహావ్రతయాజి అను బిరుదములు గలవు. వీరికే అప్పాదీక్షితులనియు[1] అప్పయదీక్షితులనియు,[2] అప్పయ్యదీక్షితులనియు,[3] గ్రంథములందు వ్రాసియున్నారు. వీరు ద్రావిడ బ్రాహ్మణులు. వీరిచరిత్రమును శివానంద యోగియను యతివరుఁడు వ్రాసియున్నాఁడు. అందు వీరు కలివర్షంబులు ౪౬౫౪ (క్రీ. శ. ౧౫౫౪) స్వరియగు ప్రమాది (చ) సంవత్సరమునందు కన్యామాసబహుళ ప్రతిపత్తిథియందు ఉత్తరాభాద్రనక్షత్రమున కన్యాలగ్నమందు జన్మించినటులు వ్రాయఁబడి యున్నది.

అప్పయ్య దీక్షితులవారు సామవేదులు, భారద్వాజ గోత్రులు.

వీరు వేలూరు పురమున కధీశ్వరుఁడగు చిన్నబొమ్మ రాజుచేత హేమాభిషేకము మొదలగు సత్కారములనందుచు ఆతని సమీపమునందే తనజీవిత సమయమును వెళ్ళఁబుచ్చినటులు ఆకాలపుపండితులొనర్చిన గ్రంథములవలన తెల్లియవచ్చుచున్నది.[4] ఈచిన్నబొమ్మ భూపాలుఁడు విజయనగరా ధీశుఁడగు సదాశివరాయునకును పెనుగొండాధీశుఁడును కర్ణాటరాజునగు శ్రీరంగమహారాయునకు సామంతుఁడు. ఇతని ప్రార్థనమువలన సదాశివరాయులు శ్రీరంగ మహారాయలు ఇచ్చిన దాన శాసనములు వేలూరు జ్వరఖండేశ్వరాలయమునందున్న శిలయందు చెక్కఁబడి యున్నవి. అయ్యవి శా. శ. ౧౪౭౭, ౧౪౯౭

1. శ్లో. విద్వద్గురోర్విహిత విశ్వజిదధ్వరస్య
శ్రీసర్వతోముఖ మహావ్రతయాజిసూనోః
శ్రీరంగరాజమఖి నశ్శ్రితచన్ద్రమౌళి
రస్త్యప్పదీక్షిత ఇతి ప్రథిత స్తనూజః॥
సిద్ధాంతలేశ సంగ్రహే.

2. శ్లో. మునిరస్తి భరద్వాజః ఖ్యాతస్త్రిభువనేష్వపి
అనైశ్వర్యస్యజహారాపో౽ప్యర్ధణ్యభరణశ్రమం
తస్యాన్వయేమహాత్మాసీత్క్షీరోద ఇవచంద్రమాః
శ్రీకంఠచరణాసక్త శ్శ్రీమానప్పయదీక్షితః॥
గంగావతరణే. ౧ సర్గే శ్లో. ౩౭, ౩౯

3. అప్పయ్య దీక్షితేన్ద్రా
నశేషవిద్యా గురూనహంవందే
యత్కృతి బోధాబోధా
విద్వదవిద్వ ద్విభాజకోపాధీ
తన్త్రసిద్ధాన్తదీపికాయాం

4. హేమాభిషేకసమయే పరితోనిషణ్ణ
సౌవర్ణసంహతిమిషాద్బిన బొమ్మభూపః
అప్పయ్యదీక్షితమణే రనవద్యవిద్యా
కల్పద్రుమస్యకురుతే కనకాలవాలం.

లందు చెక్కఁబడినవి[1]. కావున జాతకమునం దుదాహరింపఁబడిన సమయమును మనము విశ్వసింపవచ్చును.

తరువాత పెనుగొండ పురాధిపతియగు తిరుమలరాయని పుత్రుఁడునగు వేంకటదేవుని సమీపమున నుండి అతని యనుజ్ఞచేత కువలయానందమను పేరుగల అలంకార గ్రంథమునొనర్చెను.[2] పిదప శా. శ. ౧౫౪౮ సరియగు అక్షయ సంవత్సరమునందు శైవులకును వైష్ణవులకునుగల వివాదమును తీర్చుటకు పాండ్య దేశాధిపతియగు తిరుమలనాయకుని ప్రార్థనముచేత మధురకు పోయిరి. వైయాకరణ శిరోమణియగు శ్రీ భట్టోజీ దీక్షితుఁడు అప్పయ్య దీక్షితులవారి సమీపమునందు వేదాంతశాస్త్రము నభ్యసించెను. ఈయంశము భట్టోజీదీక్షితుఁ డొనర్చిన తంత్రసిద్ధాన్త దీపికవలన తెలియ వచ్చుచున్నది.

అప్పయ్య దీక్షితేంద్రా
నశేషవిద్యా గురూనహంవందే
యత్కృతి బోధాబోధా
విద్వదవిద్వద్విభాజకోపాధీ.

శ్రీ అప్పయ్య దీక్షితులవారు శైవమతమును లోకమునందు వ్యాపింపఁ జేయుటకై చాలప్రయత్నించిన వారిలో ప్రధానులు. వీరిని కృష్ణదేవరాయలకు సమకాలీనులనుగా కొందఱు చెప్పునది ప్రమాణవిరహితము. శైవమతోత్కర్షను లోకమునందు వ్యాపింపఁ జేయుటకు అవతరించి గ్రంథముల నొనర్చిరి. కావున తద్భాష్యగ్రంథమగు నీలకంఠ భాష్యమునకు శివార్కమణిదీపిక యను పేరుతో విపులమగు వ్యాఖ్యానము నొనర్చిరి. అయినను శ్రీమచ్ఛంకరాచార్యమతానుసారియగు భామతియను గ్రంథమునకు పరిమళము అను పేరుతో వ్యాఖ్యానగ్రంథము నొనర్చి యున్నవారు. పూర్వోత్తర మీమాంసలందును వ్యాకరణమందును అలంకార శాస్త్రమునందును వీరికిగల పాండిత్యము సర్వతోముఖమై సమకాలికులను విస్మయాధీనులనుగ నొనర్చుచుండెను. అప్పయ్య దీక్షితులవారిని తాతాచార్యుల వారిని సమకాలికులను గాచేర్చి మనయాంధ్రదేశము నందనేకకథలు వ్యాపించి యున్నవి. వానికి తగిన ఆధారములు లభించనందున నిందుదాహరింపలేదు. అప్పయ్య దీక్షితుల వారికి పుత్రులుకొందఱు గలరుగాని వారినామములును గాని పాండిత్యమునుగాని తెలిసికొనుటకుతగినయాధారములభించలేదు. అప్పయ్య దీక్షితులవారు పాండిత్యముచేతను సదాచారపరాయణత్వము చేతను వన్నెకెక్కి సమకాలీనులగు పండితోత్తములకు నాయకమణియై ప్రకాశించుటయే గాక దేశయాత్రచేసి వారాణసిమున్నగు పుణ్యక్షేత్రములకుఁ బోయి తనపాండిత్యమును వ్యాపింపఁ

1. Vide pp. 69—75, vol. South Indian Inscriptions by Dr. E. Hultzsch.

2. అముంకువలయానంద మకరోదప్పదీక్షితః,
నియోగాద్వేంకటపతేర్నిరుపాధికృపానిధేః
కువలయానందే.

జేసిన మహామహుఁడు. ఈయనవిషయము శ్రీదీక్షితులవారి సోదరుని పౌత్రుండగు నీలకంఠదీక్షితులొనర్చిన గంగావతరణకావ్యము వలన దెలియవచ్చుచున్నది.

అప్పయ్య దీక్షితులవారు ౭౨-సంవత్సరములు జీవించిరి. చివఱకు చిదంబరమునందు నిర్యాణము నందినటులు విద్వాంసు లీక్రింది శ్లోకమును పరంపరగాఁ జెప్పుచున్నారు.

శ్లో. కాలేనశంభుః కిలతావతాపి
కలాశ్చతుష్షష్టిమితాః ప్రణిన్యే
ద్వాసప్తతిం ప్రాప్యసమాః
ప్రబంధాన్ శతంవ్యధా దప్పయదీక్షితేంద్రః
శివలీలార్ణవః. ౧-౯.

చిదంబరమిదంపురం ప్రథితమేవపుణ్యస్థలం
సుతాశ్చవినయోజ్జ్వలా స్సుకృతయశ్చకాశ్చిత్కృతాః
వయాంసిమమసప్తతే రుపరినైవభోగేస్పృహా దకించి
దహమర్థయే శివపదం దిదృక్షేపరం.

వీరొనర్చిన గ్రంథనామములు

౧ పరిమళము
(బ్రహ్మసూత్రవ్యాఖ్యానము)
అద్వైతదీపిక
౨ సిద్ధాంతలేశసంగ్రహము
౩ వేదాంతనక్షత్రవాదావళి
౪ మధ్వతంత్రముఖమర్దనము
౫ మధ్వమతవిధ్వంసనము
౬ న్యాయరక్షామణి

శివోత్కర్ష ప్రతిపాదకములు

౭ సగుణనిష్ఠ
౮ శిఖరిణీమాల
౯ శివతత్త్వవివేకము
౧౦ బ్రహ్మతర్కస్తవము
౧౧ లఘువివరణము
౧౨ ఆదిత్యస్తవరత్నము
౧౩ ఆదిత్యస్తవరత్నవ్యాఖ్య
౧౪ శివాద్వైతవినిర్ణయము
౧౫ శివధ్యానపద్ధతి
౧౬ పంచరత్నములు
౧౭ పంచరత్నవ్యాఖ్య
౧౮ ఆత్మార్పణము
౧౯ మానసోల్లాసము
౨౦ శివకర్ణామృతము
౨౧ ఆనందలహరి
౨౨ చంద్రిక
౨౩ శివమహిమకలాస్తుతి
౨౪ రత్నత్రయపరీక్షా
౨౫ రత్నత్రయపరీక్షావ్యాఖ్య
౨౬ అరుణాచలేశ్వరస్తుతి
౨౭ అపీతకుచాంబాస్తవము
౨౮ చంద్రకలాస్తవము
౨౯ శివార్కమణిదీపిక
౩౦ శివార్చనచంద్రిక
౩౧ శివపూజావిధి
౩౨ నయమణిమాల
౩౩ నయమణిమాలావ్యాఖ్య
౩౪ నయమయూఖమాల
౩౫ నయమయూఖమాలావ్యాఖ్య
౩౬ యాదవాభ్యుదయవ్యాఖ్య
౩౭ పాదుకాసహస్రవ్యాఖ్య
౩౮ వరదరాజస్తవము

న్యాయశాస్త్రములో

౩౯ న్యాయరత్నమాల
౪౦ న్యాయరత్నమాలావ్యాఖ్య

పూర్వమీమాంసలో

౪౧ నక్షత్రవాదావళి

౪౨ బిధిరసాయనము
వ్యాకరణము
౪౩ సత్తత్త్వవాదావలి
అలంకారాగమములో
౪౪ కువలయానందము
౪౫ చిత్రమీమాంస
౪౬ వృత్తివార్తికము
౪౭ రామాయణసార సంగ్రహస్తోత్రము
౪౮ భారతసార సంగ్రహ స్తోత్రము
౫౦ భస్మవాదావళి
౫౧ ప్రాకృతమణి దీపిక

మాకు తెలియవచ్చి నంతవఱకు పేరుల నిచ్చియున్నాము. గ్రంథములు దాదాపు౧౦౪ అని పలువురు పలుకుచున్నారు. [క. మా.

అప్రతిరథుఁడు: ౧. ఋగ్వేదము నందలి యొక సూక్తమును (౧౦. ౧౦౩) రచించినఋషి (ఐతరేయ బ్రాహ్మ ౧ ము. ౮. ౧౦).

౨. (సూ. వం.) ఇక్ష్వాకు కులోత్పన్నుఁడైన కులాశ్వరాజునకు నామాంతరము (భార. వన. అ. ౨౦౪.)

3. (చం. వం.) యయాతి పుత్రుఁడైన పురురాజు వంశజుఁడగు అంతిభారుని ముగ్గురు పుత్రులలోఁ జిన్నవాఁడు. పుత్రుఁడు కణ్వుఁడు.

అప్సరసలు: స్వర్గమందలి భోగ స్త్రీలు. నాట్యకర్మ వీరివృత్తి. అగ్నిపురాణమందు వీరు ముఖ్యముగఁ బండ్రెండు గురని చెప్పఁబడినది; ఊర్వశి, మేనక, రంభ, మిశ్రకేశి, అలంబుష, విశ్వాచి, ఘృతాచి, పంచచూడ, తిలోత్తమ, భానుమతి, అబల, రమ్య (గణభేదాధ్యాయము). మహాభారమునందు వేఱుజాబితా యీయఁబడినది; అలంబుష, మిశ్రకేశి, విద్యుత్పర్ణ, తిలోత్తమ, అరుణ, రక్షిత, రంభ, మనోరమ, కేశిని, సుబాహు, సురత, సురస, సుప్రియ, అతిబాహు (మహా. ఆది.). వీరందఱును దేవదానవుల వలెనే కశ్యపప్రజాపతి సంతతివారనియుఁ జెప్పఁబడినది. అప్సరసలు పదునాలుగు కులముల వారనియు, అందునొకటి బ్రహ్మదేవుని మనస్సు నుండియు, రెండవది వేదములనుండియు, మూఁడవది అగ్నినుండియు, నాల్గవది గాలినుండియు, అయిదవది అమృతము నుండియు, ఆఱవది జలమునుండియు, ఏడవది సూర్యకిరణముల నుండియు, ఎనిమిదవది చంద్రకిరణముల నుండియు, తొమ్మిదవది మేరువునుండియు, పదవది మెఱుపునుండియు, పదునొకండవది మృత్యువు నుండియు, పండ్రెండవది మన్మథుని నుండియు, దక్షప్రజాపతి కూతులయిన ముని, అరిష్టయను వారికి గంధర్వులవలన రెండు కులములు పుట్టెను అని కాదంబరిలోఁ జెప్పఁబడియున్నది. (వాచస్పత్యము)

అప్సరోయుగము: భారత వర్షీయతీర్థము.

అప్పాసాహెబు భోంసలా. (నాగపూరు)నాగపూరురాజు. రెండవరఘోజీ

ర్యాజునకు వేంకాజీయను పినతండ్రి కలఁడు. ఆతనికి సేనాదురంధరుఁడన్న బిరుదును, చాందా, ఛత్తీస్‌గడ ప్రాంతముల జాగీరును ఉండెను. ఆతని కుమారుఁడే, అప్పాసాహెబు.* ఇతనికి ముధోజియన్న పేరుండెను. కాని వ్యవహారమందు మాత్రము అప్పాసాహెబన్న పేరే కలదు. ఇతఁడు చాందాలోఁ బుట్టి కొన్ని సంవత్సరముల వఱకు నచ్చటనే పెరిగినట్టు కానవచ్చుచున్నది. ౧౮౧౧లో నీతనితండ్రి చనిపోఁగా నితనికి సేనాదురంధరత్వము ను జాగీరును ప్రాప్తించెను. రెండవ రఘోజి ౧౮౧౬లో మరణము నొందెను. ఆతని కుమారుఁడైన పర్‌సోజీ రాజయ్యెను. కాని యాతఁడు పిచ్చివాఁడగుటచే రాజప్రతినిధి (Regent) కావలసివచ్చెను. రాజుతల్లియైన బాకాబాయికిని, రాజ్యమునకు అనంతర వారసత్వముగల అప్పాసాహెబునకును ఈప్రతినిధిత్వమును గుఱించి పేచీపడెను. తుదకు రాజ్యమందలి సరదారుల యనుమతిననుసు, ఇంగ్లీషు రెసిడెంటు సాయముననను అప్పాసాహెబే రాజప్రతినిధి యయ్యెను. ఈతఁడు ప్రతినిధిగా నున్నకాలమందు నింగ్లీషువారికిని ఆతనికిని ఇట్లుసంధిజరిగెను. "ఇంగ్లీషువారు పర్‌సోజీకిసాయము జేయుటకై ఆఱు కాల్బలముల పటాలములును, కొంతగుఱ్ఱపు సైన్యమును, తోఫుఖానాయును ఉంచునట్లును, దానికి బదులుగా పర్‌సోజీ ఇంగ్లీషువారికి నేడులక్షల యేబదివేల రూపాయలు ప్రతియేడు నిచ్చుటయేగాక ౬౦౦౦ కాల్బలమును ౩౦౦౦ అశ్వసైన్యమును ఉంచవలెను".

౧౮౧౭లో అప్పాసాహెబు తనజాగీరైన చాందాకుఁబోయెను. ఆతఁడు వెళ్లిన కొద్ది దినములకే పర్‌సోజీచచ్చెను. అప్పాసాహెబే పర్‌సోజీని చంపించెనని కొందఱింగ్లీషు చరిత్రకారులు వ్రాసిరి. కాని యందునకు నాధారమేమియు లేదు. పర్‌సోజీ తరువాత అప్పాసాహెబు రాజయ్యెను.

ఈతఁడు రాజ్యారూఢుఁడై నప్పటినుండియు నీతనికి నింగ్లీషువారి యెడఁగల గౌరవము తగ్గఁజొచ్చెను. ఇంగ్లీషువారికి ప్రతికూలులగు పూనాపేష్వాతోడను గ్వాలేర్ సింధియాతోడను రహస్యముగఁ గలిసి యింగ్లీషువారిమీఁదికి యుద్ధప్రయత్నములు చేయసాగెను. మహారాష్ట్ర సైన్యముల కన్నిటికిని అప్పాసాహెబును సేనాధిపతిఁజేసి పూనా పేష్వాబాజీరావు సన్నదులను, దుస్తులను నాగపురమునకుఁ బంపెను. అంతకుఁ బూర్వమే యింగ్లీషు వారికిని బాజీరావుకును యుద్ధముప్రారంభమైనందున, నాసన్నదును దుస్తులును గ్రహింపవలదని బ్రిటిషు రెసిడెంటు ఎంతచెప్పినను వినక అప్పాసాహెబు ౨౪నవంబరు ౧౮౧౭-వ దినమునఁ బెద్దసభచేసి పూనానుండివచ్చిన యధికారమును వహించెను.

* ఈశబ్దమునకు మరాటీలో 'అప్పా' 'ఆపా' అని రెండురూపములును గలవు. ఈశబ్దము తెలుఁగు కన్నడములలోని 'అప్ప' (అయ్య) శబ్దమే కాని వేఱుకాదు.

౨౬-వ తేదిన రెసిడెన్సిలోని యింగ్లీషు వారి సైన్యమునకును అప్పాసాహెబు సైన్యమునకును యుద్ధము ప్రారంభమాయెను.

రెసిడెన్సీయనఁగా నింగ్లీషు రెసిడెంటు ఉండుస్థలము. ఇది నాగపూరు పట్టణమునకుఁ బశ్చిమమున మూఁడుమైళ్లు మీఁదనున్నది. దానికిఁ గొన్ని గజములు తూర్పున సీతాబర్డి* గుట్టకలదు. ఇందు రెండు శిఖరములుకలవు. ఒకటియెత్తుగను, మఱియొకటి దానికంటెఁ దక్కువ యెత్తుగను, ఈరెండు శిఖరములకు నడిమిభాగము ఈరెంటి కంటెను ఎత్తు తక్కువదిగను నుండును. ఈగుట్ట మొదట నెవ్వరి స్వాధీనమందును లేదు. 'ఈగుట్టను స్వాధీనము చేసికొని, దానిమీఁదినుండి రెసిడెన్సికి గురిపెట్టవలయు'నని అప్పాసాహెబు ఆలోచించెను. కాని యీసంగతి మొదటనే తెలిసికొని యప్పటి రెసిడెంటగు జంకిన్సు తన సైన్యమునుబంపి గుట్టను స్వాధీనపరచుకొనెను. పైగుట్టమీఁద ౮౦౦ భటులును, క్రిందిగుట్టమీఁద ౩౦౦ భటులును ఒకఫిరంగియు నుంచఁబడెను. రెసిడెన్సి కాపుదలకు గుఱ్ఱపుదళము లుండెను. ఇంగ్లీషువారు గుట్టనుపట్టుకొనుట కొంచమాలస్యమైయున్న యెడల నప్పాసాహెబు సైనికులగు నరబ్బీవారాగుట్టను స్వాధీనపఱచుకొని యుందురు. గుట్టకు కొంచెము దూరమ్మున వారు యజమానుని యాజ్ఞకునై యెదురుచూచుచుండిరి.

౨౬-వ తేది సాయంకాలము ౬ గంటలకు నరబ్బీ సైనికులు సీతాబర్డిగుట్టను పట్టుకొనవలయునని దానిమీఁదికి వచ్చిరి. తెల్లవారుజామున రెండుగంటలవఱకు నెన్నియో పర్యాయము లరబ్బీవా రింగ్లీషువారిమీఁదికి నొత్తుకొని వచ్చిరి. ౨౭-వ తేది యుదయము వఱకుఁ గొండక్రింద ౧౮౦౦౦ లసైన్యమును, ౩౬ ఫిరంగులును వచ్చిచేరెను. గుట్టమీఁదివారు తమరక్షణ నిమిత్తమై చుట్టు ధాన్యపుబస్తాలుపేర్చి చిన్న యడ్డుగోడనునిర్మించుకొనిరి. తొమ్మిది గంటలవఱకు నరబ్బీసైనికులు చిన్నగుట్టను స్వాధీనపఱుచుకొని యుందున్న ఫిరంగితో పైగుట్టమీఁదికిఁ గాల్పఁజొచ్చిరి. ఇంగ్లీషుసైనికులు పెక్కుమంది హతులైరి. కాని మధ్యాహ్నమువఱకు నాగుట్ట మరల నింగ్లీషువారి స్వాధీనమాయెను. అరబ్బీసైన్యమును ఫిరంగులును గుట్టయొద్దనుండి వెడలిపోయెను.

ఇట్లు పరాభూతుఁడైన యప్పాసాహెబు తన యాజ్ఞలేకయే స్వతంత్రించి యరబ్బీవారు పోరాడిరని రెసిడెంటుకు కబురంపెను. వీరికి వారికి రాయబారములు జరుగుచుఁ గొంతకాలము గడిచెను. డిసెంబరు ౧౬-వ తేదిన అప్పాసాహెబు ఇంగ్లీషువారి స్వాధీనమయ్యెను. కాని యాతనిసైనికులు మాత్రము వశులయినవారు కారు. ఆసైనికులతో

* దీనినే యింగ్లీషులో సితాబల్డి (Sitabaldi) అని వ్రాయుదురు.

నాగనదికిని షక్కర్ దరా చెరువునకును నడుమ నింగ్లీషువారికి యుద్ధము తటస్థమాయెను. అందు మరాటీవారు పరాజితులైరి. కాని అప్పాసాహెబు సేనలోనున్న అరబ్బీ సైనికులును హిందూస్థానీ సైనికులును, అప్పాసాహెబు చెప్పినను 'మేము నాగపురపట్టణమును ఇంగ్లీషువారి స్వాధీనము చేయ'మని డిసెంబరు ౩౦-వ తేది వఱకు నాపట్టణమును వశమందుంచుకొనిరి. చివరకు వారికిముట్టవలసిన జీతమంతయుఁ దీసికొని యింకఁగొంత బహుమతిపడసి, సురక్షితముగ దమశస్త్రాస్త్రముల తోఁబోవుటకు నధికారముఁబొంది వారు నాగపురపట్టణమును విడిచి వెళ్లిరి. అచ్చటి నుండి హైదరాబాదు నవాబునొద్దకుఁబోయి యాతనికొలువులోఁ జేరిరి.

ఇచ్చట నప్పాసాహెబును జనేవరి ౯-వ తేదివఱకు రెసిడెన్సిలోనుంచి యాతనిచే నీక్రింది ప్రకార మొప్పుదలలుచేయించుకొని యింటికిఁ బోనిచ్చిరి:—

"నర్మదానదికి నుత్తరమందున్న రాజ్యమంతయు, దక్షిణమందలి కొన్నిప్రదేశములును వర్హాడ్ (దీనినే యింగ్లీషులో బీరార్ అందురు), గావిల్‌గడము, శిర్‌గుజా, జష్‌పురము అను సంస్థానములపైఁ దనకుఁ గల హక్కును అప్పాసాహెబు ఇంగ్లీషువారికినీయవలయును. ఇంగ్లీషు వారాతని నిమిత్తమై యుంచునట్టి సబ్‌సిడీ సైన్యమునకును కాటింజెంటు సైన్యమునకునై యీపైని జెప్పిన ప్రాంతములు ప్రతిఫలముగ నీయవలెను. రెసిడెంటు సలహానను సరించియు, బ్రిటిష్ గవర్నమెంటువారి నమ్మకమునకుఁ బాత్రులయిన మంత్రుల యనుమతిని అప్పాసాహెబు రాజ్యము చేయవలయును. ఆతఁడు నాగపురరాజ్య భవనమునందు నింగ్లీషు సైనికుల సంరక్షణములో నుండవలయును. పైని చెప్పఁబడిన ప్రాంతములన్నియు నింగ్లీషువారిస్వాధీన మగువఱకు వారికి సబ్‌సిడీ క్రింద రావలసిన మామూలుపైకము ముట్టుచుండవలెను. ఇంగ్లీషువారాతని రాజ్యమందలి యేకోటనుకోరినను వెంటనే యదివారి స్వాధీనముచేయవలెను. యాజ్ఞవినినట్టి పురుషుని నింగ్లీషువారికి వెంటనేపట్టి యీయవలయును. సీతాబర్డీ రెండు గుట్టలును, బాజార్లును దానికిసమీపమునందలి భూమి వలయునంతయును బ్రిటిషు గవర్నమెంటువారికి నిచ్చివేయవలయును. వారికి నావశ్యకమని తోచిన పనులు, యుద్ధమునకు నక్కఱకువచ్చునవి, వారాగుట్టమీఁదఁ జేయుటకు వారికి (ఇంగ్లీషువారికి) స్వాతంత్ర్యముకలదు"*

అప్పాసాహెబిట్లు మరల రాజ్యమును పొందియునింగ్లీషువారిమీఁది వైరము మానఁడయ్యెను. ఇంగ్లీషువారి కిచ్చెదనన్న ప్రదేశములు వారికి స్వాధీనముగాకుండ యత్నించెను. బాజీరావును చాందామీఁదికి నెత్తి రమ్మని చెప్పి తానుగూడ నచ్చటికిఁ బోవ

*Atchison's Treaties, Vol. iii. pp. 109-110.

తలంచెను. అందుచే రెసిడెంటు ఆతనిని పట్టుకొని, తగినసిబ్బందినిచ్చి ప్రయాగకోట లోనుంచుటకై పంపెను. కాని త్రోవలోనతఁడు తప్పించుకొని మహాదేవపర్వతముల మీఁదికిఁ బోయెను. పెంఢారినాయకుఁడగు చిత్తూతోఁ గొన్నిదినములు కలిసి యుండెను. అచ్చట నుండి ఆషీర్ గడమునకుఁ బోయెను. తిరిగి అచ్చటినుండి పంజాబు దేశమునకుఁబోయి రణజిత్ సింగునొద్దనుండి యచ్చటనే మరణమునొందెను.

ఇప్పుడు న్యాయస్థానముగ నుపయోగింపఁబడుచున్నది. ఇతఁడింగ్లీషువారియెడ మిక్కిలి విశ్వాసముతోఁ బ్రవర్తించెను. ఈతఁడు ౧౮౭౪-వ సంవత్సరము ఏప్రిల్ నెల ౫-వ తేదిన మృతినొందెను. మరణమునకుఁ బూర్వము బలవంతరావు భోన్సలాయనుకుఱ్ఱవానిఁ బెంచుకొనెను. వానికి వెంకాజియని పేరు పెట్టెను. కాని యింగ్లీషువారాదత్తతను ఒప్పుకొనక సాతారా రాజ్యమును తమస్వాధీపఱచుకొనిరి.

అప్పాసాహెబ్ భోన్సలా

(సాతారా). సాతారా రాజులలోఁ జివరవాఁడు. ఇతనికి శహాజీ యన్న పేరు కలదు. అప్పాసాహెబ్ అనునది గౌరవనామము, వ్యవహార నామము. శివాజి పెద్దకుమారుఁడైన సంభాజియొక్క సంతతివారు సాతారాలో రాజ్యముచేయుచుండిరి. క్రీ.శ. ౧౮౩౯లో 'ప్రతాపసింగ్ నారాయణ'యనురాజును సింహాసన భ్రష్టునిఁజేసి, యాతనిమీఁదివి తమ్ముఁడైన అప్పాసాహెబును ఇంగ్లీషువారు రాజ్యము మీఁదఁ గూర్చుండఁ బెట్టిరి. ఈతఁడు రాజ్యమునకువచ్చినతోడనే స్త్రీలకు సహగమనముచేయుట ఆపివేసెను. రెండు లక్షలరూపాయిలు వెచ్చించి సాతారాకు నీటివసతి నేర్పఱిచెను. రెండులక్షలుపెట్టి వేణాకృష్ణానదులకు వంతెనలు కట్టించెను. నూతనరాజభవన మొకటి నిర్మించెను. అద్ది

అఫ్గాన్ తుర్కీస్థానము.

ఇది అఫ్గానిస్థానపు అమీరుస్వాధీనమందున్న తుర్కీస్థానములోని భాగము. అఫ్గాన్ తుర్కీస్థాన మన్నపేరు ఇంగ్లీషువారు వాడునదేకాని యీ దేశమునందు వాడుకలోలేదు. ఆ దేశమువారు తమ దేశమును తుర్కీస్థానమే అనియెదరు. ఇది అఫ్గానిస్థానమునకు మిక్కిలి ఉత్తరమునను మధ్య ఆసియా కంటుకొనియు నున్నది. దీని కుత్తరమున రుష్యా రాజ్యము గలదు. పూర్వము బదక్షాన్, వాఖాన్, కటఘాన్ అనునవి దీనిలోనివిగానే యుండెను. కాని యిటీవల ఆమూఁడును ప్రత్యేకముగా విడఁదీసి ఒకపర్గగణా నిర్మింపఁబడినది. ఇందలి కొంతభాగము పర్వతమయముగను, మిగిలినది మైదానములు కలదిగను నున్నది. దీని విస్తీర్ణము ౫౭౦౦౦ వేల చదరపు మైళ్ళు.

జనసంఖ్య ౭౫౦,౦౦౦. ఇందలి 'బాల్క్' అను ప్రదేశమును పూర్వము 'బాక్ట్రియా' నామమని యనుచుండిరి. జరతృష్ణుండు (Zoraster) తనమతమును మొదట నచ్చటనే, బోధించెనని చెప్పెదరు. ఈబాక్ట్రియానా మిక్కిలి పురాతన కాలమందు 'అకియ మేనియన్' సామ్రాజ్యములో (Achaemenian Empire) నిమిడి యుండెను. క్రీ. పూ. ౨౫౦లో థియోడోటస్ అనువాఁడు, అచ్చట 'సెల్యూసుడే' రాజునకు ప్రతినిధిగా నుండి స్వతంత్రుఁడయ్యెను. ఇతఁడు గ్రీకోబాక్ట్రియన్ వంశమునకు మూలపురుషుఁడని చెప్పవచ్చును. తరువాత క్రీ. పూ. ౧౨౬ ప్రాంతమున పార్థియనులు, శ్వేతహూణులు, కుశనల్లు మొదలయిన వారిచే నీవంశ మంతరించెను. తరువాత బౌద్ధయుగము వచ్చెను. ఇచ్చట బౌద్ధమత ప్రచారము విశేషముగా నుండినట్లు ఇప్పటికిని గనపడు విగ్రహాదుల వలన స్పష్టపడుచున్నది. అప్పుడుండిన నవ విహారమను పేరుగలది ఇప్పటికిని అచ్చట నొకటిగలదు.

ఛంగీస్ఖానుని దాడికిలోఁబడి పాడైన యీప్రదేశము మిక్కిలి దీనావస్థనొందెను. ఇది కొంతకాలము ఢిల్లీశ్వరుల స్వాధీనమందుండి తరువాత హుసేన్ బెగ్ వంశీయులచే నాక్రమింపఁబడియెను. ౧౮-వ శతాబ్దమందు నిది అహమ్మద్ ఖాను రాజ్యములోఁ జేరియుండెను. తరువాత నాతని కుమారుఁడైన తైమూరు కాలమున విడిపోయెను. ౧౯-వ శతాబ్దప్రారంభమునందిది. బొఖారా రాజ్యమునకుఁ జేరియుండెను. దోస్తుమహమ్మద్ కాలమున అఫ్గానులు ౧౮౫౦లో బాల్కు, తస్కుర్గన్ అను ప్రాంతములను, ౧౮౫౫లో, అక్చా మొదలయిన అయిదు పశ్చిమ ప్రాంతములను ౧౮౫౯లో కుందుస్ ప్రాంతములను స్వాధీనపఱచుకొనిరి. ఇందులోఁ గొంతభాగమును గుఱించి తగాదాలుండెను. కాని ౧౮౭౩ లో ఇంగ్లీషువారును, రుష్యావారును గలిసి ఒక పంచాయతి నేర్పఱచిరి. ఆపంచాయితీదారు లాప్రాంతములను అఫ్గానులకొసంగిరి. అబ్దుల్ రహిమాన్ ఖాన్ కాలమున ఈప్రాంతము అఫ్గాన్ వారికి పూర్తిగలోఁబడెను.

అఫ్గానిస్థానము.- హిందూదేశమునకు వాయవ్యపుదిక్కుననుండు మహమ్మదీయ రాజ్యము. దీనికుత్తరమున రుష్యావారి రాజ్యమును, దక్షిణమున బలుచిస్థానమును, తూర్పున హిందూదేశమందలి వాయవ్యపుఁ బొలిమేర పరగణాయును (నార్తువెస్టుఫ్రాన్టియర్ ప్రావిన్సును) పశ్చిమమున పారసీకదేశమును కలవు. ఆతూర్పువైపున కొంచెము చీనాసామ్రాజ్యముకూడ నంటియున్నది.

ఎల్లలు, వైశాల్యము

దీని విస్తీర్ణము ౨౪౬,౦౦౦ (రెండులక్షల నలుబదియారు వేల) చదరపుమైళ్లు. ఈదేశ మీశాన్యమూలనుండి నైరృతిమూలకుఁ బొడుగుగ రమారమి ౭౦౦ మైళ్లు వ్యాపించియున్నది.

వాయవ్యపుదిక్కునుండి ఆగ్నేయపు దిక్కునకు దీనిమధ్యకొలత రమారమి ౬౫౦ మైళ్ళుండును. ఈ దేశమందలి జనసంఖ్య రమారమి ౫౦,౦౦౦౦౦ (ఏబదిలక్షలు). దీని రాజధాని కాబూల్.

ఈ దేశమంతయుఁ బర్వత ప్రాంతమగుటయేగాక యెత్తుభూమి. సముద్రముకంటె

పర్వతములు

నీదేశము ౨౦౦౦ మొదలు ౪౦౦౦ అడుగులవఱకు నెత్తుగనుండును. కొన్నిప్రదేశములు ౭౦౦౦ అడుగులయెత్తుకూడ నున్నవి. అనఁగా బందరు, కాకినాడ మొదలగునస్థలములనుండువారికంటె నీదేశమువారు మైలుకంటె నెత్తుగనున్న ప్రదేశమునందురు. ఇట్లీదేశమంతయు మనదేశమునకంటె మిక్కిలియున్నతముగనుండుటయేగాక పర్వతమయమైయున్నది. ఇచ్చటి పర్వతశిఖరములు ౧౫౦౦౦ అడుగులు మొదలు ౨౫౦౦౦ అడుగులవఱకును ఎత్తుగనుండును. ఈ దేశమందలి పర్వతములలో ముఖ్యమైనది హిందూకుష్. ఇది హిమాలయ పర్వతమును వాయవ్యదిక్కున నంటుకొనియుండును. హిమాలయముయొక్క యొకభాగమనియే చెప్పవచ్చును. ఇదీ యీదేశముయొక్క నైరృతివైపు వ్యాపించినది. రెండవపర్వతమాల కోహిబాబా. ఇది హిందూకుష్ యొక్క పడమటివైపు నుండి బయలుదేరి పశ్చిమదిక్కున వ్యాపించి యక్వలంగు నొద్ద మూఁడుశాఖలుగఁ జీలినది. ఈ దేశముయొక్క తూర్పువైపునఁ బేరొందినది సఫేద్‌ఖో అనుపర్వతము. హిందూదేశమునకును ఈ దేశమునకును గల బాటలును, కనుమలును—ముఖ్యముగ కైబరుకనుమ అను నది—దీనికి సంబంధించినవే. పర్వత ప్రాంతములుగాని మైదానము అఫ్గానిస్థానములో మిక్కిలి తక్కువకలదు.

ఈ దేశమందలి ముఖ్యమైన నదులు

నదులు

నాలుగు; ఆక్సస్, హెల్మండ్, కాబూల్, గోమల్. అఫ్గానిస్థానముయొక్క యుత్తరభాగ మంతయు ఆక్సస్‌నదియొక్కయు, దాని యుపనదుల యొక్కయు జలములు పానము చేయునని చెప్పవచ్చును. ముర్ఘాబ్, హారిరూడ్ అనునదులు, కొంతవఱకువచ్చి యిసుకలో నదృశ్యమైనను వానిని ఈ నదియొక్క యుపనదులుగనే యెంచవలెను. ఎన్నియో పర్వత కనుమలనుంచి ఆక్సస్ నదికి మంచు కరిగిన నీరు వచ్చును. అది బొఖారా దేశము నుండి ప్రవహించి ఆరల్ సముద్రములోఁ బడును. హెల్మండ్‌నదియు దాని యుపనదులును అఫ్గానిస్థానముయొక్క నైరృతి భాగమునకు జలాధారములు. కాబూల్ నది ఆ పేరుగల పట్టణమునకుఁ బశ్చిమమున నలుబది మైళ్లదూరమునఁ బుట్టును. తూర్పుగాఁ బ్రవహించి అటక్ వద్ద సింధునదిలోఁ గలియును. ఇది యీ దేశము యొక్క తూర్పు భాగమునకు నాధారము. గోమల్ నది

ఆగ్నేయ భాగమునకు నీటివసతి కలుగఁ జేయును.

చిన్నవానిని వదిలినయెడల నీదేశమున రెండుపెద్ద తటాకములున్నవని చెప్పవచ్చును.

తటాకములు

ఆబ్ ఇ ఇస్తాదా అను నది గజ్నినైరృతిని ౫౫ మైళ్ళ దూరమందున్నది. ఇది ౧౭ మైళ్లు పొడుగు, ౧౫ మైళ్ళు వెడల్పు ఉండును; కాని ౧౨ అడుగులలోతు మాత్రముండును. దీనికి ముఖ్యాధారము గజ్నీనది. ఇందలినీరు ఉప్పగనుండును. రెండవది లేక్ విక్టోరియా యనునది. అచ్చటివారు దీని నేమందురో కాని యీపేరింగ్లీషువారిచేఁ బెట్టఁబడినది. ఇది రుష్యాకును, అఫ్గానిస్థానముకును గల ఉత్తర సరిహద్దుమీఁద పామీర్ అనుదేశములో ౧౩౮౦౦ అడుగులయెత్తు ప్రదేశమందుఁగలదు. పదిమైళ్ళపొడుగును మైలున్నరవెడల్పును కలిగియుండును.

దేశకాలస్థితులు; ఎండ, వాన, గాలి

ఈదేశమున ఎండకాలమెండలు విశేషముగను చలికాలము చలి విశేషముగను ఉండును. చలికాలము కాబూలులో రెండు మూఁడునెలలు వఱకు మంచుకురియుచుండును. గజ్నిలోఁగూడ నిల్చియుండును. అప్పుడు జనులు బాజారులలో సాధారణముగఁ దిరుగరు. కుంపట్లు వద్దనుంచుకొని నిద్రపోయెదరు. అప్పుడుష్ణతామాపకయంత్రమందలి పాదరసము సున్నకుఁగ్రింద ౧౫ అంశములు(ఫారన్‌హీట్) దిగియుండును. మంచు తుపానులచే గజ్నీపట్టణము సాంతము పెక్కుసార్లు వినాశము జెందినట్లు కథలుకలవు. ఎండకాలము కాబూలులో నీడలో ౧౦౦° అంశము వరకు నెండయుండును. కంచహారులలో ౧౧౦° ఉండును. ఎండకాలము వడగాలియు, దుమ్ముతోఁగూడిన సుడిగాలియు నెక్కువగవీచును. ఈదేశమందు మనకువలె నెండకాలములో తొలకరివానలు అరిది. కాబులులో సంవత్సరమునకు సరాసరి ౧౧ ఇంచిలవానకురియును. మొత్తముమీఁద సంవత్సరమున తొమ్మిదినెలలెండ బాగుగఁ గాయును.

జనులు

ఈదేశమందలి జనులనందఱిని మనము అఫ్గానులని యన్నను, వీరిలోఁ బెక్కుభేదములుకలవు. దురాణీలు లేక అబ్దాలీలు అనువారు ప్రముఖులు. ప్రభుత్వముచేయు జాతివారు వీరే. ఈదేశముయొక్క దక్షిణభాగము, నైరృతి దిగ్భాగము వీరిచే నాక్రమింపఁబడినది. గిల్చాలను వారుకూడ దురాణీలంత ప్రముఖులే. ఈరెండు జాతులవారును అచ్చపు అఫ్గానులు. దురాణీలు గిల్‌బ్యాలు కలిసి పదునైదులక్షలమందికలరు. స్వదేశవాసులు. ఇతర జాతులవారు పరదేశములనుండివచ్చి యచ్చట నిల్చిపోయినవారు. అట్టివారిని తాజీకులందరు. వీరు తొమ్మిదిలక్షలవఱకున్నారు. వీరు పల్లెలలో వ్యవసాయమును

పట్టణములలో చేతిపనులును వృత్తిగా జేసి కొందురు. వీరు అఫ్గానులను తమకంటె గొప్పవారుగ నొప్పుకొందురు. మొగల్ వంశజులయిన హజారాలను జాతివారు కలరు. హెరాత్ ప్రాంతమున చహార్ అయిమాకులను లక్ష యేనుబదివేల జనమున్నారు. యుస్‌బెకులను వారు మూడులక్షలజనము అఫ్గాన్ తుర్కిస్థానమునందుఁగలరు. నాదిర్ శాహా (౧౭౩౭) కాలమందు నీ దేశమునకు వచ్చినవారు కిసిల్ బాషీలనువారు ఏబదివేల వఱకుఁగలరు. వీరు ముఖ్యముగ కాబాలులో వైద్యులుగ, వర్తకులుగ, లేఖకులుగనుందురు. హిందూజనులు ౩౫౦౦౦ వఱకున్నారు. వీరి యొద్దనుండి మహమ్మదీయులీయ నక్కఱలేని యొక పన్ను వసూలుచేయఁబడినను మొత్తముమీఁద వీరిని నచ్చటివారు బాగుగనే చూతురు. కాపరిస్థానమందలి కాఫరులను వారు కొద్దిదినములక్రిందనే మహమ్మదీయులై అఫ్గానిస్థానపు రాజునకు లోఁబడినారు.

రూపరేఖావిలాసములు

అఫ్గాన్ దేశస్థులు మిక్కిలి బలశాలులు, దృఢకాయులు. వీరిశరీరము మిక్కిలి లావుగను, కడ్డీవలె దృఢముగను ఉండును. హిందూదేశమందు వీరినిఁబోలిన వారొక్క పంజాబివారే. తెలుఁగుదేశమందలి సామాన్యజనులు ముగ్గురైనఁగాని యొక్క కాబూల్ వారితో సమానుఁడు కాఁడనిచెప్పిన నతిశయోక్తికానేరదు. ఆకారమును మిక్కిలి చక్కఁగనుండును. వర్ణము ఎఱుపు పసుపు మిశ్రమముగ నుండును. ఇందు విషయమై కాశ్మీరదేశజులు వీరును ఒక్కటిగాఁగాన వచ్చుచున్నారు. స్త్రీలును బలముగలవారుగను చక్కని వారుగను, కొందఱు గులాబి రంగు గల వారుగను ఉందురు.

భాష

ఈ దేశముయొక్క దేశభాష పష్టు. ఇది ఆర్యభాషలలో నొక్కటి. అచ్చపు అఫ్గానులు కాని వారిలోఁ బెక్కుజనుల స్వభాష పారసీకము (పార్సి). ఈ భాషయందు మహమ్మదీయులకు గౌరవ మెక్కువగనుక నిది యెక్కువగ వ్యాపించుచున్నది. రాజకీయ వ్యవహారమంతయు నీ భాషలోనే జరుగును. హిందూకుష్ పర్వతమునకు నుత్తరముననుండు దేశవాసులభాష తుర్కి. బదక్షాను ప్రాంతమునందు పారసీక తద్భవమైన యొకభాష మాటలాడుదురు. ఇవిగాక యీ దేశమునందుఁ బెక్కు చిల్లరభాషలు కలవు.

మతము

ఈ దేశమందలి జనులు మహమ్మదీయమతస్థులు. అందును సున్నీపంథప్రభావ మెక్కువ. రాజు, ముఖ్య సరదారులు సున్నీ పంథమువారు. షీయా పంథమువారు కొద్దిగాఁగలరు. ౭-వ శతాబ్దమునందు నీ దేశమునకు మహమ్మదీయ మతదీక్ష యీయఁబడెను. ముల్లాలను వారు వీరి గురువులు.

ప్రభుత్వము

ఇచ్చటిరాజును అమీర్ అందురు. ఇతఁడు స్వతంత్రప్రభువు. ఇంగ్లీషుప్రభుత్వము వారితనికి సంవత్సరమునకుఁ బదునెనిమిది, లక్షల రూపాయిలుకప్పమిచ్చెదరు. అందుచేనాతఁడు వీరిసమ్మతిలేనిది, యితరరాజులతో రాజసంబంధమైన వ్యవహారములు నడుపఁడు. ఇతర విషయములలో నీతఁడు సంపూర్ణ స్వాతంత్ర్యముకలవాఁడు. ఇదివఱ కీతనిని బ్రిటిషు ప్రభుత్వము వారు "హిస్‌హైనెస్" అను బిరుదుతో సంబోధించు చుండిరి. ఈబిరుదు హిందూదేశమందలి స్వదేశ సంస్థానీకులకుఁ జెల్లుచున్నది. కాని కొన్నిసంవత్సరముల క్రిందినుండి అమీరును "హిస్‌మ్యాజెస్టి" అన్నబిరుదుతో సంబోధింపవలయునని తీర్మానింపఁబడినది. ఈబిరుదు మనచక్రవర్తి గారికి మాత్రము (లేక వారితో సమానులైన చక్రవర్తులకు మాత్రము) చెల్లుచుండెను.

ఈదేశము ప్రభుత్వము నిమిత్తమై అయిదు పరగణాలుగ విభజింపఁబడినది. ౧. కాబూల్ ౨. అఫ్గాన్‌తుర్కిస్థాన్ ౩. హీరత్ ౪. కందహార్ ౫. బడక్‌షాన్. ఈపరగణాల అధికారిని 'నాయబ్' అనిగాని 'హాకీము' అనిగాని అందురు. ఈహోదా మనగవర్నరు హోదాతో సమానమైనది. ఈ హాకీములు రాజ్య సంబంధమైన వ్యవహారములు గాక తమపరగణాలోని సివిలు క్రిమినలు వ్యాజ్యెములుగూడఁ బరిష్కరించుచుందురు. వీరి న్యాయస్థానమునకు 'మహాకము ఇ హాకీము' అందురు. ఈన్యాయస్థానమునకు లోఁబడిన విధము ఖాజీల అధ్యక్షత క్రిందనున్న విధము నగు న్యాయస్థానములకు 'మహాక్మ ఇ షరా' అందురు. ఒక్కొక్క ఖాజీకితోడుగా ముఫ్తీ అను వారుందురు. కాజీముఫ్తీలు భిన్నాభిప్రాయులైనపుడు ఆతగాదా కాబూలులో నున్న 'ఖాన్ ఇముల్లా' అనువాని తీర్మానమునకుఁ బంపుదురు. అతఁడును తీర్మానింపఁజాలనియెడల 'అమీర్' స్వయముగఁ దీర్మానించును. న్యాయస్థాన వ్యవహార విధానములఁ దెల్పు చట్టము లిటీవల నేర్పఱచఁబడినవి. ఉన్నతన్యాయస్థాన విధానములకు 'కితాబ్బ ఇ ప్యాకూమతి' అని పేరు. కాజీముఫ్తీల న్యాయ స్థానములకై యేర్పఱచఁబడిన చట్టమునకు 'అసాన్‌ఉల్ కజాత్' అని వ్యవహారము గలదు.

రాజ్యమేలుటకు అమీర్‌గారి సాహాయ్యార్థము ఒకసభకలదు. దానిని దర్బార్ అందురు. అందు మూఁడు రకముల సభాసదులుందురు. ౧ సర్దారులు, ౨ ఖానులు, ౩ ముల్లాలు. సర్దారులు గొప్పగొప్పభూస్వాములు, ఖానులు సామాన్యజనుల ప్రతినిధులు, ముల్లాలు మత గురువులు. వేఱువేఱు తెగలవారు (Tribes) తమలోనుండి ఖానుల నెన్నుకొనియెదరు.

సర్దారులు, ఖానులు, ముల్లాలు సభాసదులుగాఁగల సభలు రెండుగలవు. ఒకదానిపేరు దర్బారు షాహీ, అనఁగా రాజసభ. రెండవది

'ఖర్వానీ ముల్కీ' అనఁగా సామాన్య సభ. ఇదిగాక కార్యనిర్వాహక సభయొకటి గలదు. దానిని 'ఖల్వత్' అందురు. అమీరు స్వయముగా న్యాయవిచారణ చేయును. అమీరు న్యాయసభకు క్రిందిది 'కాజీ' న్యాయసభ, దానికిక్రిందిది 'కొత్వాల్' న్యాయసభ. కొన్ని పట్టణములలో వర్తక సంబంధమైన తగాదాలు 'పంచాయతీ' ద్వారా విచారించుటయుఁగలదు.

ఆదాయము

ఈ దేశము రాజుయొక్క ఆదాయము ౧౮౭౯ లో 30 లక్షలుండెను. అది ౧౮౯౮ లో ౭౦ లక్షలుగను, ౧౯౦౭ లో ౧౦౦ లక్షలుగను వచ్చెను. ఇపుడు కోటీ ఇరువది లక్షలు మొదలు కోటీ ముప్పది లక్షలవఱకు నాదాయము పెరిగినది. ఇదియునుగాక కాబూలులో విశేషముగ ధనసంగ్రహము ఖజానులో నున్నదని వాడుకగలదు.

అఫ్గానులలో 'గిల్జా' లనువారును, దురానిలనువారును మిక్కిలి శూరులు, బలశాలులు.

సైన్యము

పూర్వకాలమందు పటాలములపద్ధతి లేకయుండెను. మనసబు పద్ధతికలదు. యుద్ధసమయమందు నిందరు భటులఁ దేవలయునన్న షర్తుమీఁద రాజ్యమందలిసరదారులకుఁగొన్ని భూములీయఁబడుచుండెను. ఆ సరదారులు యుద్ధకాలమందు సైనికులను తెచ్చుచుండిరి. కాని యీపద్ధతివలన సైనికులమీఁద నమీరున్నకు తగినంత నధికారము కలుగకుండెను. యుద్ధసమయమునందు బెక్కుసారులు సైనికులు శత్రువులలోఁగలియుచుండిరి. కావున అమీర్ దోస్తు మహమ్మదు ౧౮౫౮-వ లో జీతములు తీసికొను సైనికులఁజేర్చి పటాలము లేర్పఱిచెను. అప్పుడు ౧౬ కాల్బలపు పటాలములును, 3 గుఱ్ఱపు పటాలములును, ౮౦ ఫిరంగులును ఏర్పడెను. ఒక్కొక పటాలములో ౮౦౦ సైనికులుండిరి. షేక్ అల్లీ ఖానుఁడను వాఁడు బ్రిటిషు పటాలములవలెఁ దనపటాలములకు కవాతు మొదలయినవినేర్పి ౧౮౬౯ లో వానిని అభివృద్ధిచేయ యత్నించెను. అబ్దుల్ రహిమాన్ఖానుఁడు పూర్తిగ నింగ్లీషు పద్ధతి నవలంబించి తనపటాలములను యూరోపీయ పటాలముల యోగ్యతకుఁ దెచ్చెను. ఇట్లు క్రమమైన సైనికులు ౫౦౦౦౦ మంది యెప్పుడును యుద్ధమునకు సిద్ధముగనుందురు. ఇదియుఁగాక అబ్దుల్రహిమాన్ కాలములో నొక నిబంధన చేయఁబడినది. పదునాఱు సంవత్సరములు మొదలు డెబ్బది యేండ్ల వయస్సుగలవారిలో నెనిమిదిమందికి నొక్కరు చొప్పున ప్రతిగ్రామమునుండి సైనికులను యుద్ధప్రసంగము వచ్చినప్పుడు రణమునకుఁ బంపవలెను. ఈ నిబంధన ననుసరించి వలయునప్పుడు మూఁడులక్షలవఱకు సైన్యము యుద్ధమునకు సిద్ధముగనుండునని క్రిందటి అమీరైన అబ్దుల్రహిమాన్ఖానుఁడు తన స్వీయ చరిత్రమునందు వ్రాసియున్నాఁడు. నిల్వ

య్యున్న సైన్యములు హిరత్, కందహార్, కాబూల్, మజర్ ఇషరీఫ్, జలాలాబాద్, అస్మార్ అను చోట్లను, హిందూదేశపు సరిహద్దు మీఁదను శిబిరములలో నుండును.

మందుగుండు, తుపాకులు చేయుటకు కాబూలులో నొక కర్మాగారము కలదు. అందు దినమునకు ౨౦౦౦౦ తోటాలును, ౧౫ తుపాకులును, వారమునకు ౨ ఫిరంగులును చేయుదురు. ఉత్తరపు అఫ్గానిస్థానమునందు రెండు గొప్ప దుర్గములుకలవు. ఒకటి హెరత్, రెండవది దెహదాది. ఈరెండవది బాల్కుకు సమీపమందున్నది. ఇది ఆక్సస్‌నుండి అఫ్గాన్ తుర్కిస్థానమునకుఁబోవు బాటలనన్నిఁటినిఁగాయును. ఈ కోటకట్టుటకుఁ బండ్రెండేండ్లు పట్టినది. ఈ కోటబురుజులపై క్రప్ హాచీకిస్, నార్డన్‌పెల్డ్, మ్యాక్సిమమ్ అను పేళ్ళుగల నావిక శీఘ్రశతఘ్నులు (Naval quick-firing guns) కలవు.

వాఙ్మయము

పష్టుభాషలోఁ గొంతకావ్య వాఙ్మయము కలదు. షేక్‌మాలియనువాఁడు స్వాత్ దేశమును గెలిచిన సమాచారమును వర్ణనచేయు నట్టికావ్య మీభాషలో మిక్కిలి పురాతనమైనది. ఇది పదునైదవ శతాబ్ద ప్రారంభమున వ్రాయఁబడినదిగాఁ గానవచ్చుచున్నది. ౧౪౯౪ లో కాజిఖానను వాఁడు రాజయి కొన్ని దేశముల గెల్చెను. వాఁడే యాచరిత్రను వర్ణించు గ్రంథము వ్రాసెను. అక్బరు కాలమందు బెయజిద్ అన్సరీ అనువాఁడు పష్టుభాషలోఁ గావ్యము వ్రాసెను. ఇతఁడుమతస్థాపకుఁడు. రణకర్త. పదునేడవ శతాబ్దమందలి కవియైన అబ్దుర్ రహీమాన్ అనువాఁడు ఈభాషలోని విఖ్యాతకవి. ఔరంగజేబు కాలమువాఁడును, యుద్ధప్రియుఁడును నగు ఖుషాల్ ఖానుఁడనువాఁడు గూడ లోకప్రియుఁడైనకవియే. ఈతని వంశమందును పెక్కుకవులుపుట్టిరి. అహమద్ షాహకూడ కవియని పేరొందినవాఁడు. ఈభాషలో వీరకథాగానములు (Ballads) పెక్కులు కలవు.

కలాకౌశల్యములు: వర్తకము

ఈ దేశమునందు చక్కనిపట్టు, పట్టువస్త్రములు తయారగును. ఆక్సస్‌నదియొడ్డుననుండి అఫ్గాన్ తుర్కిస్థానమందలి గ్రామములును, బొఖారా, మెషెద్ అనునవి పట్టుపనులకుఁ బేరొందినవి. హెరాత్, కందహారు పట్టణములలోఁ గూడ పట్టుపనులు జరుగును. హెరాత్ ప్రాంతమున మంచి తివాసులు నేయుదురు. గొఱ్ఱెలతోళ్ళతోఁ జేయఁబడిన అంగీలు, పోస్తీను లనఁబడునవి మిక్కిలి నిపుణతతో నీదేశమందంతటను చేసెదరు. ఒంటెలవెంట్రుకలతోడను, గొఱ్ఱెల యొక్కయు పర్వతపుమేకల యొక్కయు బొచ్చుతోనేయఁబడిన మెత్తని వస్త్రములు ఈదేశమందలి యొకవిశేషమని చెప్పవచ్చును. ఇవి మిక్కిలివెలగలవి. కందహారులో ఎఱ్ఱరాళ్ళతోటి(పూసల) జపమాలలు చేయుదురు.

రుచికరములును, శ్రేష్ఠజాతియు, పుష్టికరములును. అగు అత్తి, ద్రాక్ష, అక్రోడ్, బాదామ్, పిస్తా మొదలయిన ఫలజాతులీ దేశమునుండి యెక్కువగా నెగుమతి యగుచుండును. ఈపండ్లను ఎండఁబెట్టి నిలువచేసి దేశాంతరములకును బంపెదరు. రంగులకుపయోగపడు మంజిష్టయు నింగువయు నెగుమతి యగును. ఈ దేశమందు వేటకుక్కలను పెంచి యమ్ముదురు.

అఫ్గానిస్థానమునుండి యితర దేశములకుఁ బోవుటకు వర్తకపు బాటలు పెద్దవి నేడుకలవు. అందు మూఁడు హిందూ దేశమునకు వచ్చునవి. ఒకటి పారసీకమునకుఁ బోవునది. మిగిలినమూఁడు ఆ దేశముయొక్క యొకభాగమునుండి మఱియొక భాగమునకుఁ బోవునవి. హిందూ దేశమునకువచ్చు బాటలలో నొకటి కాబూలునుండి ఖైబరుకనుమగుండ జలాలాబాదు మీఁదుగా వచ్చును. రెండవది కందహార్ గజ్నీలనుండి గోమల్కనుమలగుండ వచ్చును. మూఁడవది కందహార్ నుండి క్వేటామీఁదుగావచ్చును. ఈమూటిలో ఖైబర్ మార్గమును క్వేటా మార్గమును మంచివి. ఇందు క్వేటామార్గమంతయు బండ్లు నడువ వచ్చును. ఖైబరు మార్గమునఁ జాలవఱకు బండ్లుపోఁగలవు. ఈ దేశమందుబండ్లువిశేషము లేవు. సరకులన్నియు గుఱ్ఱపు తట్లమీఁదను, ఒంటెలమీఁదను తీసికొని పోఁబడును.

ఈ దేశమునందున్న పొవిందా లనఁబడువారు కొందఱు తిరుగుడు (సంచార) వర్తకులుగ నుందురు. వీరు వందలకొలఁది గుంపులుగఁ జేరి గుఱ్ఱముల మీఁదను, ఒంటెలమీఁదను సరుకులు వేసికొని, దొంగలు దోచుకొననకుండ వెంటఁగత్తులను కఠారులను తీసికొని హిందూ దేశమునకు, బొఖారా ఖొరాసాన్ దేశములకుఁ బోవుచువచ్చుచు నుండెదరు. హిందూ దేశమునకు చలికాలము ప్రారంభము కాఁగానే గోమల్ కనుమత్రోవన వచ్చెదరు. పంజాబుకుఁ జేరి యచ్చటి తమ స్త్రీలను, పశువులను పంజాబు మైదానములలోనుంచి ఆయుధములను ప్రభుత్వము వారి స్వాధీనముచేసి, రైలుమార్గమున తమసరకులను బొంబాయి, కలకత్తా, కరాచీ, నాగపూర్ మొదలైన ప్రదేశములకుఁ బోయి యమ్మి అచ్చట అఫ్గానిస్థానమునకుఁ గావలసిన సరకులఁ దీసికొని వసంతఋతువు వఱకుఁ దిరిగి పోవుదురు. వీరిని ఉత్తర హిందూ దేశమందు రోహిలాలనియు, అఫ్గానులనియు నందురు. వీరేకారణముననో దక్షిణ దేశమునకు వచ్చుటలేదు.

పర్వత ప్రదేశమైనను ప్రజలు కష్టపడి సంవత్సరమునకు రెండు పంటలు పండించెదరు. మఱి యెత్తు ప్రదేశములందు మాత్ర మొక్క పంటేపండును. గోధుమలు, యవలు, కాయధాన్యములు, వఱి, జొన్న, మొక్కజొన్న, పొగాకు, ముల్లంగి, ఆముదాలు ఇచ్చట

పండును. ఇచ్చటి ప్రజల ముఖ్యాహారము గోధుమలు. కుంకుమపువ్వు పండించి విశేషముగ నెగుమతి చేయుదురు.

వ్యవసాయము, పంటలు మొదలయినవి

ఇచ్చటి ముఖ్య విశేషము ఫలములు. యూరోఫ్ దేశమందును హిందూదేశము నందును పండునట్టి యుత్తమ ఫలములన్నియు నీ దేశమందుఁ బండును. ద్రాక్షలు విశేషముగఁ గాయును. కొన్ని ప్రదేశము లన్నియు ద్రాక్షాలతలయుద్యాన వనములని చెప్పవచ్చును. నలుబది విధములయిన ద్రాక్షపండ్లు కలవు. కందహార్ చుట్టునున్న పల్లెలలో నిట్టితోటలసంఖ్యములుకలవు. విత్తులు లేని ద్రాక్షలు అత్తిపండ్లుకూడ నెక్కుడుగనుండును. ఈ దేశమువారనేకులు ఈ ఫలములను, ఈ ఫలముల రసముతోఁ జేయఁబడిన రొట్టెలనుతినియుందురు.

నీటివసతి కావలసిన పైరులకు నీరు కాలువలద్వారా పెట్టెదరు. కొన్ని కాలువలు భూమి మీఁదనుండును, కొన్ని భూమిలో నుండును. భూమిలోనున్న జలలను ఒకదానితో నొకదానిని కాలువలద్వారా కలిపి, యంతకంటెఁ బల్లపు ప్రదేశములకుఁ బారునట్లుగఁ జేయుదురు. ఇట్టివానిని నా దేశమున కరేజ్ అందురు.

ఇప్పుడు అఫ్గానిస్థానమనఁబడు దేశము పూర్వకాల మొక్క దేశముగ లేదు. వేఱు వేఱు భాగములకు వేఱు వేఱు పేళ్లుకలవు.

దేశచరిత్రము

అవి వేఱు వేఱు రాజుల క్రిందనుండుటయు సంభవించెను. మిక్కిలి పూర్వకాలమున నన్నఁగా ౨౩౦౦ యేండ్లకుఁ బూర్వమిప్పుడు కాబూల్ అనఁబడు దేశమునకు పరోపనిసడె అనియు (Paropanisadae) హెరాత్ ప్రాంతమునకు ఏరియా (Aria—హరిరూడ్) అనియు, కందహార్ ప్రాంతమునకు అరకోషియా (Archosia) అనియుఁ బేళ్లుండెను. మక్రాన్ అనుప్రాంతమునకు గెడ్రోషియా (Gedrosia) అనియు బాల్క అనువానికి బ్యాక్ట్రియా (Bactria) అనియు బేళ్ళుండెను. ఈ భాగము లన్నియు పారసీకరాజుల క్రింద ఉండెను. క్రీ.పూ. ౩౨౯-౨౮ లో నీ దేశములనన్నిటిని మహామహుఁడైన అలెగ్జాండరు*జయించెను. ఇతఁడు క్రీ. పూ. ౩౨౩లో మృతుఁడు కాఁగా నాతని రాజ్యములోని తూర్పుభాగమాతని సేనానియైన శెల్యూకస్ నికటర్ అనువానికిఁ జెందెను. ఆతని రాజ్యములోనే అఫ్గానిస్థానమందలి పై రాజ్యములుకలవు. క్రీ. పూ. ౩౦౩ లో నీతనిని ఓడించి (బాల్క రాజ్యము తప్ప) యీ రాజ్యములన్నియు మగధదేశపు మౌర్యచక్రవర్తియైనచంద్రగుప్తుఁడు స్వాధీన పఱుచుకొనెను†. కొన్ని దినములకు నీ రాజ్యములు మగధరాజులచేతినుండిపోయెను.

---

*ఈశబ్దమునకు పారసీభాషలో సికందర్ అనియు, సంస్కృతభాషలో అలకసుంతుఁడ నియు, రూపాంతరములు కానవచ్చుచున్నవి.

† V. Smith's Early History of India, 3rd edition, p. 119.

ఈ దేశములో పార్థియను లనువారు కొంతభాగమును, శకవంశమువారు కొంత భాగమును క్రీ. పూ. ౧౩౦ ప్రాంతమున ఆక్రమించిరి. గ్రీకువారి ప్రభుత్వము బాక్ట్రియాలో కొంతవఱకుండెను. రెండు శతాబ్దముల తరువాత యుహెూచి అనువారు మధ్యాశియానుండి వచ్చి గ్రీకువారిని పార్థియనులను వెడలగొట్టిరి. వీరినే కుషనవంశము వారని చెప్పుదురు. వీరిలో కనిష్కుడను వాడు మిక్కిలి గొప్పరాజు (౭౮-౧౨౩). ఈతని రాజ్యము హిందూదేశమందు గంగవఱకును, కాశ్మీరము, పెషావర్, కాబూల్, ఆక్సస్ నదీప్రాంతము మొదలయిన ప్రదేశము లన్నియు వ్యాపించియుండెను. ఈతడు బౌద్ధమతాభిమాని. ఈ వంశమువారు ౫-వ శతాబ్దమువఱకు నీదేశముపై రాజ్యముచేసిరి. ఆ శతాబ్దమునందు వారు తెల్లనివారైన హూణులచే నోడింపబడిరి. కాని వీరిప్రభుత్వ నేడవ శతాబ్దమువఱకుం బోలేదు. వీరినే షాహిరాజులందురు. వీరి కాలములో నీదేశమున బౌద్ధమతము వ్యాపించియుండెను. ఇప్పటికిని బౌద్ధమత చిహ్నము లాదేశము నందుం గానవచ్చును. ఈ షాహివంశముచివర పురుషుడు కతోర్మనుడనువాడు దుర్మార్గుడై నందున నాతనిని చంపి యాతని మంత్రియగు కలారుడనువాడు క్రీ. శ. ౮౫౦వ సంవత్సరప్రాంతమున రాజయ్యెను. వీడు బ్రాహ్మణుడనీ కొందఱుతురకలు వ్రాసినారు. కాని క్షత్రియుండై యుండునని యితర్ముల యూహ. ఈవంశమువారు క్రీ. శ. ౧౦౦౦ వఱకుం గాబూలులో రాజ్యముచేసినట్లు కానవచ్చుచున్నది. ఈ వంశమువారు "మిక్కిలి రాజ్య విస్తారముగల వారయ్యును ఉత్తమ సద్గుణ మండితులుగను, ఆడినమాట తప్పనివారుగను, తమకంటెం దక్కువవారిని దయతోం జూచువారుగను నుండిరి" అని యొక మహమ్మదీయ చరిత్రకారుడే వ్రాసియున్నాడు.*

కాబూలును జయింపవలెనని మహమ్మదీయులుచేసినప్రథమ ప్రయత్నములు సిద్ధించినవికావు. అరబ్బీవారు ౨-వ శతాబ్దాంతము వఱకు పశ్చిమవైపు అఫ్గానిస్థానమును జయించి మహమ్మదీయమతమును స్థాపించిరి. హీరాత్ మహమ్మదీయమతసంబంధమైన యొక ముఖ్యపట్టణమయ్యెను. తొమ్మిదవ శతాబ్దమునందుం గొంతకాలము వఱకు హెరాతులోను, బాల్కులోను, పారశీకులయిన సఫారిదులు రాజ్యముచేసిరి. వారి తరువాత సామానీదు లనువారు వచ్చిరి. వారిని పారదోలి గజ్నిలోని తుర్కీవంశము వారు రాజులయిరి. వీరిలో గొప్పవాడు హిందూదేశము మీందికి బదునేడుసారులు దండెత్తివచ్చిన మహామూద్ అనుమూర్తి భంజకుడు (౯౯౮-౧౦౩౦). ఈతడు గజ్నిలో గొప్పవిద్యాపీఠమునుస్థాపించెను. గొప్పగొప్ప

* Elliot's History of India as told by its own historians, Vol. II. pp. 12 & 40.

పండితులకు నాశ్రయమిచ్చెను. తనరాజధానిని బహుసౌధములతో నలంకరించెను. ఈవంశమువారిని వెడలఁగొట్టి అఫ్గాను రాజ్యమును ఆక్రమించుకొనినది గోర్ వంశము. ఈవంశమునందుఁ జేరొందినవాఁడు షహాబుద్దీన్ గోరీ (౧౧౭౩-౧౨౦౬). ఈతఁడు ఢిల్లీశ్వరుఁడైన పృథ్వీరాయుని ఓడించి హిందూదేశమందు తురుష్కుల సామ్రాజ్యమును స్థాపించెను. ఇతని ప్రతినిధులే స్వతంత్రులై బానిస వంశజులనఁబడు ఢిల్లీశ్వరులైరి. వీరు అఫ్గానిస్థానముతో సంబంధము లేకుండ స్వతంత్రులైరి. కొంతకాల మీ అఫ్గాన్ రాజ్యము ఖ్వారిజమన్న పేరుతోఁ గొద్ది కాలమున్న సామ్రాజ్యములోఁ జేరెను. తరువాత చంగీజు ఖానుని బందిపోటు మూకలీదేశమును ఆక్రమించుకొనెను. ఇందలి చాలభాగము మఱి యొక బందిపోటు నాయకుఁడగు తైమూరు వచ్చి యాక్రమించు కొనువఱకు (౧౩౯౮-౯) వారి స్వాధీనమందే యుండెను. ఇతనితరువాత నీతనిగొప్పరాజ్యము తునకలుతునకలై పోయెను. కాని హెరాత్, బాల్క్, గజ్నీ, కాబూల్, కందహార్ ప్రదేశములలో నీతని వంశజులే రాజ్యము చేయుచుండిరి. ఇతని వంశజుఁడే బాబరు. ఈతఁడు బదక్షాన్, కాబూల్, కందహారు ప్రాంతములకుఁ బ్రభువుగ నుండెను. ఆతఁడు ౧౫౨౬ లో ఢిల్లీలో రాజ్యము చేయుచున్న ఇబ్రాహింలోదీ సుల్తానును ఓడించి హిందూదేశములో మొగల సామ్రాజ్యమును స్థాపించెను. ఈమొగలులకు హిందూరాజ్యము వచ్చినతరువాత చిన్నదియగు అఫ్గానురాజ్యము స్థలగమ్ముమీఁది పప్పువలె నయ్యెను. అక్బరు ప్రభుత్వకాలమునందు తిరుగఁబడిన అఫ్గాను దేశజులను గెలుచుటకునై అక్బరు తనసేనానులగు రాజా బీర్‌బల్ రాజాతోడర్‌మల్ రాజామాన్‌సింగ్ అను హిందూ సరదారులను వాని మీఁదికిం బంపెను. రాజాబీర్‌బల్ యుద్ధమునందు పడెను. ఔరంగజేబు కాలమందు మార్వాడీదేశపురాజగు యశవంతసింహుఁడు రాజకార్యనిమిత్తమై కాబూలునకంపఁబడెను. అతఁడచ్చటనే మరణమునందెను. కొన్ని సంవత్సరముల తరువాత బదక్షానును ఉజ్బెక్కులాక్రమించుకొనిరి. కందహారును పారసీకరాజులయిన సఫవిదులు తీసికొనిరి. గజ్నీ కాబూలులు మాత్రము మొగలులకు దక్కినవి. ౧౭౩౮లో నాదిల్‌శాహ యనువాఁడు అఫ్గానిస్థానములోని రాజ్యములన్నిటిని నాక్రమించి ౧౭౩౯ లో ఢిల్లీని దోచుకొనెను. ఇట్లెన్నియో శతాబ్దములు పారతంత్ర్యమును అనుభవించి యీదేశము నాదిల్‌శహమృతినందగనే (౧౭౪౭)లో స్వతంత్రమయ్యెను. దీనికి స్వాతంత్ర్యమును జాతీయతను ఇచ్చినవాఁడు అహమదుద్‌శాహ అబ్దాలి.

నాదిల్‌శాహ తనసైన్యములో అఫ్గానులను కొందఱిని చేర్చుకొనెను. అట్లు చేరినవారిలో అహమద్‌శాహ అబ్దాలియొకఁడు.

నాదిల్ శాహా మరణమందగనే ౧౭౪౭లో కందహార్ పట్టణమందు అఫ్గాన్ నాయకులందఱుఁ గలిసి యీతనిని రాజుగ నేర్పఱచుకొనిరి. ఆతఁడు "దుర్ ఇదుర్రాన్" (ఈయుగమునకు ముత్యము) అను బిరుదమును ధరించెను. తన జాతివారికి (అబ్దాలీలకందఱికి) దుర్రానీలన్న బిరుదు నొసంగెను. ఈదుర్రానీ వంశమే ఇప్పటి వఱకును రాజ్యము చేయుచున్నది. అబ్దాలీ ప్రభుత్వమునకు వచ్చినప్పటినుండియే అఫ్గానిస్థానమునకు స్వతంత్ర రాజ్యమన్న పేరు ప్రతిష్ట వచ్చినది. అంతకుఁబూర్వమిది యీదేశమువారికి నాదేశమువారిక్రిందలోఁబడి స్వతంత్రనామమే లేక యుండెను. పానిపత్ యుద్ధరంగమూమీఁద మరాటావారిని నోడించినవాఁడు ఈ అహమ్మదుశాహ అబ్దాలియే, ఇతఁడు మిక్కిలి శూరుఁడై తనరాజ్యమును చాలవఱకు వ్యాపింపఁజేసెను. ఈతనిమరణకాలమువఱకు అఫ్గానిస్థానమంతయు నతని స్వాధీనమగుటయేగాక, ఉత్తరమున తుర్కిస్థానము, దక్షిణమున సింధు బలుచిస్థానములు తూర్పున కాశ్మీరము, పశ్చిమమున ఖురాసాను దేశపురాజులీతని సార్వభౌమత్వమును ఒప్పుకొనిరి. ఇతఁడు ౧౭౭౩లోఁ గాలధర్మము నొందెను.

ఈతని కుమారుఁడగు తైమూరు రాజధానిని కందహారునుండి కాబూలుకు మార్చెను. ఈతఁడు ఇరువదియేండ్లు రాజ్యము చేసి ౧౭౯౩లోఁ జచ్చిపోయెను. ఈతని ప్రభుత్వకాలములో సింధుదేశము వీరిస్వాధీనమునుండి తప్పెను, బాల్క్, అఫ్గాన్ తుర్కిస్థానముయొక్క యితరభాగములు చాలవఱకు స్వతంత్రములయ్యెను. ఖోరాసాన్, కాశ్మీరములలో తిరుగుబాటునకు బీజారోపణము చేయఁబడెను. తైమూరునకు నిరువదిమంది పుత్రులుండిరి. ఆ రాజ్యము గుఱించి వారిలో వారికిఁ బెక్కుతగాదాలు కలిగెను. జమాన్ అనువాఁడు అమీరయ్యెను (౧౭౯౩). ఈతని కాలములో పంజాబు వీరిచేతినుండి పోయెను. ౧౭౯౯ లో నీతనిసహోదరుఁడైన మహమూదు అనువాఁడు రాజ్యము నాక్రమించుకొనెను. ౧౮౦౩ లోఁ గొన్ని కుట్రలు జరిగి రాజ్యము ఈతని సోదరుఁడైన శాహసుజా ఉల్ ముల్క్ అన్నవానిస్వాధీనమయ్యెను. మహమూదు రాజ్యభ్రష్టుఁడయ్యెను. నెపోలియన్ పారసీకదేశపు రాజుతోఁ జేయుచున్న స్నేహమువలన బ్రిటిషు రాజ్యమునకు నష్టము రాకుండ జాగ్రతపడుటకై ౧౮౦౯లో ఇండియా దొరతనమువారు మౌంటుస్టుఅర్ట్ ఎలిఫిన్టన్ అనువానిని శాహసుజాయొద్దకు దూతగాఁబంపిరి. కాని యింతలో రాజ్యభ్రష్టుఁడైన మహమ్మూదు శాహసుజాను ఓడించి మరల రాజయినందున (౧౮౦౯) ఈదూత వెళ్లిన ప్రయోజనము సఫలము కాలేదు. మరల రాజయిన మహమూదు తొమ్మిది సంవత్సరములు రాజ్యము చేసెను. ఈతని కాలమందు నీతనిమంత్రి

యైన ఫతేఖాన్, అనువాఁడు (బెరక్‌జాయ్ వంశజుఁడు) సర్వాధికారిగ నుండెను. కాని మహమూదు ౧౮౧౮లో నీమంత్రి కన్నులు దీయించెను. అందువలన మంత్రి యొక్క తమ్ముఁడైన మహమ్మద్ ఆజీమ్ అనువాఁడును అతని సవతి తమ్ముఁడైన దోస్తుమహమ్మద్ అనువాఁడును రాజుపైఁ దిరుగఁబడి ౧౮౧౮లో నాతని రాజ్యభ్రష్టునిఁ జేసిరి.

తరువాతఁ గొంతకాలమువఱకు నిశ్చితుఁడైన రాజేర్పడలేదు. మహమ్మద్ ఆజీం కాబూలు స్వాధీనపరచుకొనెను. కాని ఇతర ప్రాంతముల గవర్నరులాతని యాజ్ఞకులోఁబడక పోయిరి. హెరాత్ స్వతంత్రమాయెను. అఫ్గాన్ తుర్కిస్థానముఁ బదక్‌షాన్ చీలిపోయినవి. పంజాబుసింహమైన రణజిత్ సింగు కాశ్మీరము, ముల్తాన్, డెరాగాజిఖాన్, అటక్ అను దేశములను ప్రాంతములను, స్వాధీనపఱచుకొనెను. నౌషహరయొద్ద ౧౮౨౩లో అఫ్గానులను పూర్తిగఁ బరిభవించి పెషావర్ గూడ లాగుకొనెను. మహమ్మదుఖాన్ ౧౮౨౩లో మృతుఁడయ్యె. అంతవారి(బారక్‌జాయ్) యన్నదమ్ములలో రాజ్యమునకై కలహములుముదిరి ౧౮౨౬లో దోస్తుమహమ్మద్ కాబూల్, గజ్నీ ప్రదేశముల స్వాధీనపఱచుకొనెను. జలాలాబాదుకూడ త్వరలోనే యతనికి వశమయ్యె. ౧౮౩౪లో శాహశుజా మరలరాజ్యము సంపాదించుటకు యత్నముచేయఁగా నాతనిని ఓడించి దోస్తుమహమ్మద్ 'అమీర్' అన్నపదవిని ధరించెను. శాహశుజా యింగ్లీషు వారియొద్దకువచ్చి హిందూదేశమునందు దాగియుండెను.

౧౮౩౭లో పారసీకరాజు హెరాతును ముట్టడించెను. రుష్యావారికి నమీరుకు స్నేహమధికముగాఁ జొచ్చెను. ఈ కారణముల చేత నిండియా దొరతనమువారికి నాందోళనముగలిగి వారు అఫ్గానిస్థానమునకు బర్న్సెస్ అను రాయబారినిపంపిరి: కాని అమీర్ వీరికి ననుకూలముగఁ జెప్పకపోవుటయేగాక యిప్పుడు వీరికి స్నేహితుఁడుగానున్న రణజీతుసింగుమీఁదికిఁ దానుయుద్ధమునకుఁ బోయెదననియుఁ, తనకుసాయము చేయవలసినదనియుఁ గోరెను. అంత, నిండియాగవర్న్మెంటువారు అఫ్గానిస్థానముమీఁదికి దండువెడలి దోస్తుమహమ్మదును రాజ్యభ్రష్టునిఁజేసితమయాశ్రయమునందున్న శాహశుజాను రాజ్యముపైఁ గూర్చుండఁబెట్ట నిశ్చయించిరి. రణజీతుసింగుకూడ సాయము చేయ నొప్పుకొనెను. కాని యంతగా సాయము చేసినవాఁడుకాఁడు.

మొదటి అఫ్గాన్ యుద్ధము ౧౮౩౮-౪౨

ఉత్తరసింధు దేశమునందు ౧౮౩౮లో అఫ్గాన్ దండయాత్రనిమిత్తమై ౨౧౦౦౦ సైన్యము సిద్ధముచేయఁబడెను. సర్ జాన్ కీన్ అనువాఁడు వారికి సేనాధిపతిగ నుండెను. ఈసైన్యము బోలన్ కనుమలోనుండి వెళ్లి ౧౮౩౯-వ సంవత్సరమునందు ఏప్రిల్ నెలలో

కందహారుని ఆక్రమించి, యచ్చట శాహాశుజాకు పట్టముకట్టెను. జూలైలో గజ్నీ వశమయ్యెను. దోస్తుమహమ్మదు పారిపోగా ౨౬-వ ఆగష్టుదినమున శాహాశుజా రాజధానిలోఁ బ్రవేశించెను. ౧౮౪౦-వ సంవత్సరమున దోస్తుమహమ్మదు ఇంగ్లీషు వారిస్వాధీనమయ్యెను. ఆతనిని ఇండియాకుఁ బంపిరి. అందఱును యుద్ధము సంపూర్ణ దిగ్విజయముతోఁ బూర్తియైనదని సంతసించిరి. శాహాశుజాకు సాయముగ కాబూలులో ౮౦౦౦ ఇంగ్లీషుసైన్యమును మ్యాక్‌నాటన్ అనువాని ఆధిపత్యము క్రిందనునిచి, బర్నిస్ అనువానిని ఇంగ్లీషువారితరఫు రాయబారిగనియమించి సర్ జాన్‌కీన్ వెడలిపోయెను. కాని మొదటి నుండియు కాబూల్ ప్రజ లీక్రొత్త ప్రభుత్వము మీఁదఁ గోపముగలవారుగనే యుండిరి. ౧౮౪౧-వ నవంబరులో ప్రజలు తిరుగఁబడి కాబూలులో బర్నిసును, ఇతరాంగ్లేయాధికారులనునరికివేసిరి. దోస్తుమహమ్మదు కుమారుఁడైన అక్బరుఖానుఁడు తిరుగుబాటువారందఱకు నాయకుఁడు. సంధివిషయమై మాటలాడుటకుఁ బోయినప్పుడాతఁడు తనచేతితో సర్ విలయం మ్యాగ్‌నాటనును పొడిచివేసెను. ఇట్లే ఇంగ్లీషుసైన్యమునకు నచ్చటఁ బెక్కు ఆపదలు సంభవించెను. ౮౦౦౦లో ౩౧౦౦ మంది యిట్లు హతులైరి. ౪౧ మంది మాత్రము మిగిలిరి. వీరును శత్రుమధ్యమున నుండుట యసంభవమయ్యె. ౧౮౪౨-వ సంవత్సరము జనేవరి ౬-వ తేదిన ఇంగ్లీషు సైన్యమంతయు కాబూలువిడిచి వెళ్లునట్లు, త్రోవలో వారికి కాబూలువారేవిధమైన యిబ్బంది కలుగఁజేయకుండునట్లును కరారునామా వ్రాసికొని, ఇంగ్లీషుసైన్యము కాబూలునుండి బయలుదేరెను. ఇట్టిసైన్యము హిందూదేశమునకు వచ్చుటకు బయలుదేరినప్పుడు ౪౫౦౦ సైనికులుండుటయేగాక, ౧౨౦౦౦ మంది సేవకులుగూడ నుండిరి. చలివిస్తారముగ నుండెను. అఫగానులు వీరికి త్రోవలోమిక్కిలి బాధ కలిగించిరి. వారిచేతనేమి, చలిచేతనేమి యీసైనికులందఱును మడిసిరి. కొందఱు చెఱఁబెట్టఁబడిరి. డాక్టరు బ్రైడన్ అనువాఁడొక్కఁడుమాత్రము మిక్కిలిదైన్యస్థితితో ఇంగ్లీషువారి పటాలమున్న జలాలాబాదుకుఁజేరెను. గజ్నీలోనున్న సైన్యముకూడఁ గాబూలువారివశమయ్యెను. కందహార్, జలాలాబాద్ ఈరెండుమాత్రము ఇంగ్లీషువారి స్వాధీనమునందుండెను.

ఇట్లు బ్రిటిషుసైన్యమునకు నఫగానిస్థానమునందుఁగల్గిన ఘోరమైనయాపత్తుకుబదులు తీర్చుకొనవలయునని, ౧౮౪౨-వ సంవత్సరపు ఏప్రిల్ నెలలో నిండియానుండి జనరల్ పొలాక్ యొక్క యాధిపత్యముక్రింద ఖైబర్ కనుమగుండ గొప్పసైన్యము పంపఁబడెను. ఆతఁడు సెప్టెంబరులో కాబూలు నాక్రమించి అచ్చటి దుర్గమును నడిమిబాజారును పడఁగొట్టి, ఖైదీలుగనున్న కొందఱు బ్రిటిషుసైనికుల

వశపఱుచుకొన్ని డిసెంబరు నెలలో హిందూ దేశమునకుఁ దిరిగివచ్చెను. ఇతరులచే దీసికొనిరాఁబడి, బలవంతముగాఁ దమకు రాజుగాఁ జేయఁబడిన శాహాశుజాను అఫ్గానులెన్నఁడును ప్రేమింపలేదు. ౧౮౪౨-వ సంవత్సరము ఏప్రిల్ నెలలో నాతఁడు చంపఁబడెను. హిందూ దేశమునందున్న దోస్తుమహమ్మదును విడిచివేసిరి. వాఁడు మరల కాబూలుకు రాజయ్యెను.

సిక్కువారికిని ఇంగ్లీషువారికిని జరిగిన రెండవయుద్ధ కాలమునందు నీతఁడు సిక్కువారిలోఁగలిసి అటక్ తీసికొనెను. ఇంగ్లీషువారీతని సైన్యములను ౧౮౪౯ ఫిబ్రవరిలో గుజరాత్ యుద్ధములో సిక్కువారితోఁగూడ నోడించిరి. దోస్తుమహమ్మదు ౧౮౫౦ లో బాల్క ప్రాంతమును స్వాధీనపఱుచుకొనెను. ౧౮౫౫ లో కందహార్ గెలిచెను. ఆసంవత్సరమునందే యతనికిని ఇంగ్లీషువారికిని స్నేహము కుదిరెను—౧౮౫౬ లో హెరాతును పారశీకులు తీసికొనిరి. ౧౮౫౭ లో పంజాబు దేశపు చీఫ్ కమిష్నరును, దోస్తుమహమ్మదును పెషావరులోఁగలిసికొని సంధి చేసికొనిరి. ఇంగ్లీషువారు అమీరునకుఁ బారసీకము నెదురించుటకునై కొంతసైన్యధనమును (Subsidy) ఆయుధములును ఈయ నొప్పుకొనిరి. తరువాత హిందూ దేశచరిత్రమునందుఁ బ్రఖ్యాతమైన సిపాయిల తిరుగుబాటు హిందూ దేశమందు సంభవించినది. ఆకాలమందు అమీరు ఇంగ్లీషువారికి స్నేహితుఁడుగనే యుండెను. ౧౮౬౩ లో దోస్తుమహమ్మదు హెరాతును ముట్టడించి పట్టుకొనెను. అచ్చటనే యాతఁడు ౧౩ దినములకు మృతుఁడయ్యె.

ఈతని కుమారుఁడు షేర్ ఆలీఖాన్ రాజయ్యెను. ఈతఁడు రాజ్యము కొఱకుఁ బెక్కుజనులతోఁ బోరాడవలసినవాఁడాయెను. కాని ౧౮౬౮ లో కాబూలు రాజ్యము మీఁద స్థిరుఁడయ్యెను. ఇతఁ డింగ్లీషువారితో స్నేహము కలిగియుండెను. ఇంగ్లీషువారాతనికి బాకీయున్న ధనము పంద్రెండులక్షల రూపాయిలును, ఫిరంగులును, ఆయుధములును, బహుమతిచేసిరి. అప్పుడప్పుడు ధనసాహాయ్యముఁగూడఁ జేయుచుండిరి.

ఇట్లుండఁ గొన్ని దినములకాతఁడు రుషియా వారికి ననుకూలుఁడుగను, ఇంగ్లీషువారికిఁ బ్రతికూలుఁడుగను మారెను. క్రీ.శ. ౧౮౭౮ లో నాతఁడు రుష్యావారి రాయబారులు కాబూలుకు రాఁగా వారిని గౌరవించెను. ఈసమాచారము తెలిసి ఇంగ్లీషు ప్రభుత్వమువారు తమ రాయబారిన్ని పంపెద మనఁగా నొప్పుకొనలేదు. అందుమీఁద ఇండియా దొరతనమువారు అఫ్గానిస్థాన్ అమీరుతో యుద్ధమునకుఁ గడంగిరి. దీనికే రెండవ అఫ్గాన్ యుద్ధమని పేరు.

రెండవ అఫ్గాన్ యుద్ధము ౧౮౭౮-౮౦

ఇంగ్లీషు సైన్యములు ఖైబరుత్రోవను కురంకనుమను ఆక్రమించెను. ౧౮౭౯ జనెవరిలో కందహారును ఆక్రమించిరి. అమీర్ కాబూలునుండి పారిపోయి ఫిబ్రేవరి నెలలో చచ్చెను. తరువాత నాలుగు నెలలవఱకును, అఫ్గానుమూకలతోఁ జిల్లరయుద్ధములు జరుగుచుండెను. ఇంకను పైకిఁబోయినయెడల దిరిగి వచ్చుట కష్టమేమోయని తమకు ననుకూలుఁడైన అమీరును రాజ్యముమీఁదఁ గూర్చుండఁబెట్టి తిరిగివచ్చుటకు నెదురుచూచుచుండిరి. ఇంతలో షేర్ అల్లీ కుమారుఁడైన యాకుబ్ ఖానుఁడు తాను అమీరునైతిననియు, సంధి చేసికొనెదననియు నింగ్లీషువారికి వర్తమానమంపెను. ౧౮౭౯ మేనెలలో గండమక్ వద్ద సిద్ధతికి సంధి జరిగెను. ఈ సంధిప్రకారము సరిహద్దుమీఁదనున్న కొండలుగుంపులపై యధికారమును, కుర్రం, పిషీన్, సిబీతావులును, ఖైబర్ మిచ్నీ కనుమలమీది స్వత్వమును ఇండియా ప్రభుత్వమువారి కీయఁబడెను. బ్రిటిషు రెసిడెంటు కాబూలులోనుండుటకునొప్పుకొనెను. ఇంగ్లీషువారి సలహాలేనిది యితర రాజులతో రాజకీయవ్యవహారములు నడుపనని సమ్మతించెను. ఇందుకుబదులుగ నింగ్లీషువారు అమీర్ మీఁదికిఁ బెరరాజులురాకుండఁగాపాడెదమని యొప్పుకొనిరి (౧౮౭౯ మే). మేజరు సర్ లూయికవగ్నరి యనువానిని కాబూలులో రెసిడెంటుగా నేర్పఱచిరి. కాబూల్ నుండి సైన్యము వెడలిపోయెను. అంతయు మనకు ననుకూలముగ జరిగెనని సంతసించిరి. కాని అఫ్గానులు మోసముచేసి సెప్టంబరు నెలలో రెసిడెంటును అతని సిబ్బందిని చంపివేసిరి.

ఈ సమాచారము తెలియఁగనే హిందూదేశమునుండి జనరల్ (తరువాత లార్డు) రాబర్ట్సను పెద్దసైన్యముతోఁ బంపిరి. అతఁడు అఫ్గన్ సైన్యమును ఓడించి ౧౮౭౯ అక్టోబరులో కాబూలుస్వాధీనపఱచుకొనెను. యాకూబ్ ఖానుఁడు ప్రభుత్వమువదలుకొని, యింగ్లీషువారిస్వాధీనమై హిందూదేశమునందు వారివలన నుపకారవేతనమునుపొందుచు నుండసాగెను. ౧౮౭౯-౮౦ సంవత్సరపు జలికాలము కాబూలుదేశమందున్న యింగ్లీషు సైన్యమునకు మరల విపత్తుసంభవించునేమో యన్న భయముకలిగెను. అఫ్గానుసరదారులు తిరుగఁబడిరి. ఎట్టకేలకు వారిని నింగ్లీషుసైన్యము లోడించెను.

కాబూలు కందహారుప్రాంతములను విడఁదీసి యింగ్లీషువారు కాబూలుకు అబ్దుర్ రహిమాన్ ఖాన్ అనువానిని, కందహారుకు షేర్ అల్లీఖాన్ అనువానిని ప్రభువులుగా నొప్పుకొనిరి (౧౮౮౦, జూలై, మే). అబ్దుర్ రహిమాను దోస్తుమహమ్మదుకు మనుమఁడు, షేర్ అలీకితమ్ముని కుమారుఁడు కందహార్ రాజయిన షేర్ అల్లీ చేతగాక రాజ్యమువదలుకొని హిందూ దేశమునందు ప్రభుత్వమువారిచ్చు పెన్షనుపుచ్చుకొనుచుండెను.

౧౮౮౦లో నింగ్లీషు సైన్యములు అఫ్గానిస్థానమువిడిచి హిందూదేశమునకుఁబోయెను.

అబ్దుర్ రహిమాన్ ఖాన్ క్రమముగఁ దనకు బ్రతికూలులైన వారిని జయించి అఫ్గాన్ దేశమునకంతకును బ్రభువయ్యెను.

ఈతఁడిరువది యొక్క సంవత్సరములు రాజ్యముచేసెను. ఇండియా ప్రభుత్వము వారితో మైత్రి కలిగి యుండెను. ఈతని ప్రభుత్వకాలములో అఫ్గానిస్థానమునకు నంతకుఁ బూర్వమెన్నడును లేని యేకఛత్రాధిపత్యము, శాశ్వతసైన్యము (Standing Army), ఇతర రాజ్యములతో సమానముగనుండు రాజ్యమన్న గౌరవము కలిగినది. ఇంతకుఁ బూర్వము సరదారులును ప్రాంతాధీశులును తమయిష్టము వచ్చిన యెడల అమీర్ ఆజ్ఞవినుటయు లేనియెడల వినకపోవుటయు సంభవించుచుండెను. ఈతఁడు తనప్రచండ విక్రమముచే నాపద్ధతులన్నియు మాన్పి వారందఱును తనయాజ్ఞలో మెలఁగునట్లు చేసెను. ఈతనికాలములోనే రుషియాకు అఫ్గానిస్థానునకుఁగల పొలిమేరలు, హిందూదేశమునకు ఈదేశమునకుఁగల పొలిమేరలు పారశీక దేశమునకు నీదేశమునకుఁగల పొలిమేరలుఁ గొల్వఁబడి సిసలు చేయఁబడినవి. ఈతనికి నిండియా గవర్నమెంటువారు సరిహద్దుసంరక్షణ నిమిత్తమై మొదట పంద్రెండు లక్షల రూపాయి లిచ్చుచుండిరి. ౧౮౯౩లో నీమొత్తము, పదునెనిమిది లక్షలు చేయఁబడినది. ౧౮౯౫ లో కాఫిరిస్థాన్ అను దేశముపై అమీరుయొక్క సార్వభౌమత్వము స్థిరపడెను. ఈతఁడన్ని వ్యవహారములలోను తన స్వాతంత్ర్యమునకు భంగము రాకుండ మిగుల జాగ్రత్తతోఁ గాపాడుచుండెను. ఏసలహాలు వినినను తనరాజ్యములో పరదేశీయులు రైళ్లు టెలిగ్రాములు వేయుదమన్న వినినవాఁడు కాఁడు.

అబ్దుర్ రహిమాన్ ఖాన్ ౧౮౮౦-౧౯౦౧

అబ్దుర్ రహిమాన్ ఖాన్ మృతినొందఁగా నాతని కుమారుఁడు హాబిబుల్లాఖాన్ అమీరయ్యెను. ఈతఁడు తండ్రిమార్గమునే యవలంబించెను. ఈతఁడు ప్రభుత్వమునకు వచ్చిన తరువాత క్రొత్తషరతులతో రాజీచేసికొనవలయునని యిండియా గవర్నమెంటువారు ౧౯౦౫ లో మిస్టర్ (ఇప్పుడుసర్) లుయీడేనును పంపిరి. కాని హాబీబుల్లా క్రొత్తషరతులొప్పలేదు. అదివఱకు నాతనితండ్రికాలమునందున్న షరతులనే యొప్పుకొనుచు సంధిచేసెను. ఈప్రసంగముననే యీతనికి "హిస్‌మ్యాజెస్టి" అన్నబిరుద మీయఁబడినది. ౧౯౦౭ లో నీతఁడు హిందూదేశము చూచుటకువచ్చెను. అప్పుడీతఁడు, ఇండియా దొరతనమువారిచే మిక్కిలి గౌరవింపఁబడెను. [కొ. ల.

హాబీబుల్లా ౧౯౦౧

అఫ్ జల్ గడ్. యునైటెడ్ ప్రావిన్సులో (ప్రయాగ రాజధానిలోని) బిజ్నూను జిల్లా, నాగీనా తాలూకాలోని యొక గ్రా-

ష్టము. జనసంఖ్య ౭౪౭౪. ఇచ్చట నొకకోట పదునెనిమిదవశతాబ్ద మధ్యకాలమున నఫ్జుల్ ఖానుడనువాడు కట్టెను. ౧౮౫౭ లో తిరుగుబాటు కాలమున ఈకోట పడగొట్టబడెను. ఇచ్చట మంచినేతబట్టలు దొరుకును.

అఫ్జుల్ ఖాన్. ౧. అక్బరుచక్రవర్తికి ప్రాణప్రియ మంత్రియైన అబుల్ ఫజల్ అనువానికుమారుడు. జహాంగీరు రాజ్యకాలమున క్రీ. శ. ౧౬౧౦ లో నీతడు బిహారుదేశమునకు సుబేదారుగ ననగా గవర్నరుగ నుండెను. క్రీ. శ. ౧౬౧౩లో ఆగ్రాపట్టణమున మృతుడయ్యెను.

౨. షీరాజ్ దేశజుడు. మొదటనితని పేరు ముల్లాషుక్రుల్లా. తండ్రిపేరు అబ్దుల్ హక్. జహాంగీరుచక్రవర్తి యీతనికి అమీర్ పదవి నిచ్చెను. ౧౬౨౮లో నీతనికి విజారత్ ఇకుల్ అను నధికార మీయబడెను. ౧౬౩౮లో ౭౦౦౦ వేల పదాతులకును ౪౦౦౦ గుఱ్ఱములకును మన్సబుదారాయెను. డెబ్బదియేండ్లు బ్రతికి ౧౬౩౯ లో ఆగ్రాపట్టణమున మరణమునొందెను. ఈతడు కవిత్వము చెప్పువాడు, అల్లామియన్నది కవిత్వ సంబంధమైన యీతనినామము.

3. విజాపుర నవాబులయొద్దనుండిన యొక సరదారు. ఇతడు మహమ్మదు ఆదిల్ శాహ యొక్క దాసీపుత్రుడని కొందఱు వ్రాసియున్నారు.* వాయీయనుప్రాంతమునకునితడు సుబేదారుగ ౧౬౪౪ మొదలు ౧౬౫౯ వఱకునుండెను. శివాజితండ్రియైన శహాజికిని వీనికిని వైరముకలదు. శహాజిపెద్ద కుమారుడును శివాజికన్నయునగు సంభాజి కర్ణాటకయుద్ధములో కనకగిరిని పట్టుకొనుటకై పోరాడుచున్నప్పుడు అఫ్జుల్ ఖానుని మోసమువలన నాతడు చంపబడెను. ఈతడు విజాపుర నవాబునొద్ద శివాజినిబట్టి తెచ్చెదనని ప్రతిజ్ఞచేసి ౧౬౫౯ సెప్టెంబరునెలలో బయలుదేరెను. అప్పుడు శివాజి రాయగడముమీద నుండెను. అఫ్జుల్ ఖానుడు పూనామీదికి రాకుండ దగినయేర్పాట్లుచేసి యాతడు ప్రతాపగడదుర్గముమీదికి బోయెను. శివాజి ప్రతాపగడముమీద నున్నాడని విని అటు వెళ్లవలెననిఅఫ్జుల్ ఖాను పంఢరపురము, తుళజాపురము, మాణకేశ్వరము, కరకముబోసే, శంభుమహాదేవము, మలవడి, రహిమతపురము అను గ్రామములమీదుగ వాయీపట్టణము జేరెను. పంఢరపురములోని విఠలదేవుని, తుళజాపురమున భవానీదేవిని విధ్వంసము చేసెను. ఇందుచే హిందువులకు నాతనిపై మిక్కిలి కోపము వచ్చెను. వాయీకి జేరి యాతడాగ్రామమునకు గులకరణి(కరణము) అగు కృష్ణాజీభాస్కరుడను వానిని శివాజియొద్దకు బంపెను. శివాజియు దనకుమాస్తా

* మరాఠీరియాసత్, (మరాఠీభాష), రెండవ కూర్పు ౩౪౨ పుట.

యైన పంథోజిగోపీనాథుని ఖానుని యొద్దకుఁ బంపెను. తాను భయపడితిననియు, విజాపుర నవాబు నొద్దకువచ్చెదననియు, శివాజి ఖానునకు వర్తమానమంపెను. ప్రతాపగడము క్రింద అఫ్జుల్‌ఖానుండును, శివాజియు మొదటఁగలిసికొనునట్లు ఏర్పాటుజరిగెను. అతిదుకై యొకమండపముకట్టఁబడెను. శివాజి నఖశిఖాంతము కవచముఁదొడుగుకొని తానాజిని వెంటఁదీసికొని వచ్చెను. ఖానుఁడును ఒక్కబంటుతోడనే పల్లకినెక్కివచ్చెను. ఇద్దరును మొట్టమొదట కౌఁగిలించికొనినప్పుడు ఖానుఁడు శివాజిని తనయెడమచంకలో నొత్తిపట్టి కత్తివ్రేటువేయఁబోఁగా శివాజి తనచేతనున్న పులిగోళ్ళతో ఖానుని పొట్టలోఁగ్రుచ్చెను. అంతమోసము మోసమని ఖానుఁడరచి శివాజినెత్తిమీఁదఁ గత్తిదెబ్బ వేసెను. కాని శిరస్త్రాణమున్నందున నాదెబ్బ వ్యర్థమయ్యెను. ఇంతలో శివాజి తనకత్తితో ఖానుని భుజముపై దెబ్బతీసి పొట్టవఱకుఁజీల్చెను. అంత ఖానుఁడు గతప్రాణుఁడై నేలఁబడియె. ఖానుని వీనుఁగును పల్లకిలో వేసికొని బోయీలు తీసికొని పోవఁజొచ్చిరి. కాని శివాజిసేనికులు బోయీలనుజంపి. ఖానుని తలద్రుంచి కోటమీఁదికిఁ దీసికొని పోయిరి.

౪. ఒకపారసీక కవి. ఇతని పూర్తియైన నామము మీర్ మహమ్మద్ అఫ్జల్. ఈతఁడు ఢిల్లీ చక్రవర్తియైన మహమ్మద్‌షా కాలమందుండెను. క్రీ. శ. ౧౭౨౩ లో మృతుఁడయ్యెను.

అఫ్సర్. బీహారులోని గయజిల్లా నవడవిభాగములోని యొకపల్లె. దీనిజనసంఖ్య ౫౦౭౨. ఇది చిన్నపల్లెయైనను పూర్వచరిత్రను గుఱించి దీనికి ఖ్యాతివచ్చెను. ఇచ్చటఁ దివ్యగుప్త రాజులు రాజ్యము చేసిననాఁటి వరాహవిగ్రహమొకటి దొరకెను. దీనిమీఁద నద్భుతమైనపనితనముచూపఁబడినది. చూచుటకు చాలసొగసుగనున్నది. ఉత్తరగుప్త రాజుల వంశమును వర్ణించు శాసనమొకటి యిచ్చట దొరికినది. ఇచ్చటఁ బాడైపోయిన పూర్వకాలపు దేవాలయమొకటి కలదు. దీనియొక్క చెక్కడముపని బీహారు దేశమునందలి యితరదేవాలయములమీఁది పని కంటె నెంతయో దర్శనీయమైగనున్నది.*

అఫ్రీడీ. హిందూ దేశమునకు వాయవ్యసరిహద్దుమీఁద కైబరుకనుమకు దక్షిణమున పర్వత ప్రాంతములందు నివసించియుండునొక యారణ్యకమానవజాతి. వీరుపఠానులు. హిందూదేశపు సరిహద్దులలోనుండు ఆరణ్యకజాతులలో వీరు మిక్కిలి బలవంతులు, స్వతంత్రులు. జనసంఖ్య సుమారు ౩౦౦౦౦. ఇందుముఖ్యజాతులారు. వీరుండు ప్రదేశమునకు తీరాయని పేరు. వీరుచూచుటకు చక్కనివారుగను పొడవుగను, కాయపుష్టిగలవారుగను నుందురు. వీరి నివాసమగు కొండల

* Inscriptions of the Early Gupta Kings and their successors by J. F. Fleet.

మ్రాఁత వీరితోఁ బోరాడుట. నెవరికిని దుస్తరము. ఇతరపటాలములలోఁ జేర్చునప్పుడు కూడ మిక్కిలి శూరులుగ బనిజేయుదురు. కాని తమకొండలనుండి వెలుపలవచ్చుటకు సాధారణముగ సమ్మతింపరు.

అబర్ క్రోంబి. (సర్ జాన్) (౧౭౭౨-౧౮౧౭) ఈతఁడు సర్ రాల్ఫ్ క్రోంబియను నతని తనయుఁడు. ౧౭౭౨లో జన్మించి ౧౭౮౬ లో సైనికోద్యోగములో చేరెను. కొంత కాలమీతఁడు ఫ్లాండర్సులోను పశ్చిమ ఇండియాదీవులలోను పనిజేసి తనతండ్రికి ఈజిప్టు దేశములో నున్నపుడు మిలిటరీ శక్రటరీగ నుండెను. ౧౮౦౩లో నెపోలియను ఈతని చెఱసాలలోనుంచి ౧౮౦౮ లో విడుదలచేసెను. ౧౮౦౯ లో బొంబాయిచేరి అక్కడ ముఖ్య సైన్యాధిపతి ఆయెను. ఆమరునటి సంవత్సరము మారిషస్ ద్వీపములను స్వాధీనపఱచుకొనుటకు వెడలిన దండయాత్రకు ఈతఁడు నాయకుడు. తరువాత ఈతఁడు చెన్నపురికివచ్చి అక్కడ సైన్యాధిపతి యగుట తటస్థించెను. ౧౮౧౩-౧౮౧౪ సంవత్సరముల నడుమను ఈ రాజధానికి గవర్నరుపని ఖాళీవచ్చుటచే గవర్నమెంటు వారీతనిని ఆపనిని జూచుటకు నియోగించిరి. ఈతనికి ౧౮౧౨ లో లెఫ్టినెంటు జనరలు, ౧౮౧౪లో కె.సి.బి. ౧౮౧౫ లో జి. సి. బి. యను బిరుదులు ఈయఁబడెను. ౧౮౧౭ లో నీతఁడు మరణించెను.

అబర్ క్రోంబీ. (సర్ రాబర్టు) (౧౭౪౦-౧౮౨౭) ఈతఁడు సర్ రాల్ఫ్ క్రోంబియను నతని తమ్ముఁడు. ఈతఁడు ౧౭౫౮ లో సైన్యములో ప్రవేశించి అమెరికా దేశములో ౧౭౬౩ వఱకు సైనికుఁడుగనుండెను. తిరిగి ౧౭౭౬ మొదలు ౧౭౮౩ వఱకు యార్కుటవ్వు అను నగరమును స్వాధీనపఱచుకొనుపర్యంతము అక్కడ యుద్ధముజేయుచుండెడి వాఁడు.

తరువాత నీతఁడు ౧౭౮౮ లో ఇండియాకు వచ్చి ఆమఱుసటి సంవత్సరమే బొంబాయి రాజధానికి గవర్నరుగను ముఖ్యసైన్యాధిపతిగను నియమింపఁబడెను. ౧౭౯౦లో మేజరు జనరలు అయ్యెను. మలబారు ప్రాంతముల కొన్ని కార్యముల నెఱవేర్చి ౧౭౯౨ లో శ్రీరంగ పట్టణమువద్ద టిప్పుసుల్తాను నోడించుటకై చేయఁబడిన ప్రయత్నములో కారన్వాలీసునకీతఁడు చాలసాయ మొనర్చెను.

౧౭౯౩ లో కారన్వాలీసు హిందూదేశమునుండి వెడలిపోవుటచే నీతఁడు ఈ దేశమునకు ముఖ్యసైన్యాధికారి అయ్యెను. అకాలములోనే ౧౭౯౭ పర్యంతము సుప్రీము కౌన్సిలులో సభ్యుఁడుగాగూడ నుండెను. ౧౭౯౪ లో రోహిల్ ఖండునందలి బాటినా యనుచోట రోహిలాల నోడించెను.

అబనో: (పైత్రోడి) (౧౨౫౦-౧౩౧౬) వైద్యశాస్త్ర విశారదుఁడు. జన్మస్థానము పడువా. పెద్దవాఁడైన తరువాత

నచ్చుటనే వైద్యశాస్త్ర విశారదుఁడుగ నుండెను. జ్యోతిశ్శాస్త్రములోను, రసాయన శాస్త్రములో నెక్కువ పరిశ్రమచేసెను. వైద్యశాస్త్రములోఁ బెక్కు గ్రంథములను రచించెను. ముఖ్యముగా విషములకుఁగల విఱుగుళ్ళనుగుఱించి చర్చించెను. క్రైస్తవ మతమునకు వ్యతిరేకాభిప్రాయములు గల వాఁడగుటచే నితనిని మతసంబంధమైన 'ఇన్క్విజిషన్' (Enquisition) అను న్యాయ స్థానమునకు సీడ్చితెచ్చిరి. వారితనికి ఉరిశిక్ష విధించిరి. కాని యీతఁడు, ఉరిశిక్షననుభ వించక పూర్వమే మరణించెను.

అబర్డీన్. స్కాట్లండు దేశములోని నాలుగవ పట్టణము. పండ్రెండవ శతాబ్దమున నుండి క్రమక్రమముగ వృద్ధినందినది. ఉత్తమ హర్మ్యములన్నియు తెల్ల చలువరాతితో నిర్మింపఁబడి యుండుటచేత నీపట్టణమునకు 'చలువరాతి ప్రోల'ను అర్థమునిచ్చు నామ మొకటికలదు. వాన వెలిసిన పిమ్మట స్వచ్ఛ ధవళిమచే నీ పురవరము మెఱయుటంబట్టి సముద్రమునుండి చూచిన నిది రజతపురంబై యుండుననియు వర్ణింపఁబడియున్నది. ఇదియే స్కాట్లండు దేశపు నుత్తరదిగ్భాగమున పేరు గాంచిన రేవుపట్టణము. ఇచ్చటినుండి ఘని తనంపుచలువరాతి వస్తువులు నానా దేశముల కెగుమతియగుచున్నవి. ఇటీవల చేపలవ్యాపా రము మిన్నయైనది. ప్రత్తి, ఉన్నివస్త్ర ములు గూడ నితర దేశములకు అనుపఁబడు చున్నవి.

ఈపట్టణమునుండి ఇంగ్లాండులోని పార్ల మెంటు సభకు నిద్దఱు సభ్యులు నిర్వాచింపఁ బడుచున్నారు. ఇచ్చటి సర్వకళాశాలయుఁ బేరైనదియె. జనసంఖ్య ౧౬౩,౦౫౪.

అబర్డీన్ (జార్జిహ్యామిల్టన్ గార్డన్-౧౭౮౪-౧౮౬౦). ఈ పేరుగల ఆర్లను సరదారులలో నీతఁడు నాల్గవవాఁడు. స్కాట్లాండు రాజధానియగు ఎడింబరు పట్టణమున జన్మించెను. రాజకార్యనిపుణుఁడు. ౧౮౧౩ లో ఆస్ట్రియాలో నింగ్లండు తరఫునరాయబారి గానుండెను. టోప్లిడ్జుసంధిపత్రము మీఁద నింగ్లీషువారి తరఫున సంతకము చేసెను. వెల్లింగ్టన్ ముఖ్యమంత్రిగా నుండినపుడు ౧౮౨౮-౩౦ వఱకు నీతఁడు విదేశాంగ మంత్రిగ (Foreign Secretary) నుండెను; ౧౮౩౪-౩౫ లో ఉపనివేశయుద్ధకార్యదర్శిగ (Colonial and War Secretary) నుండెను. పీల్ ముఖ్యమంత్రిగ నున్నపుడుగూడ నతఁడు పెక్కు రాజకీయోద్యోగములను నిర్వహించెను. ౧౮౫౨ లో ముఖ్యమంత్రియయ్యెను. ఈతని కాలములో క్రిమియన్ యుద్ధము జరిగెను. ఇది రుష్యావారికిని, టర్కీవారికిని జరిగిన యుద్ధము. ఇందు బ్రిటీషువారును ఫ్రెంచి వారును టర్కీవారికి మిక్కిలి సాయముచేసిరి. ఈ యుద్ధమునందు క్రమముగా వ్యవహార

ముల్లు జరుపలేదని యీతని ప్రతిపక్షులు ఒక సూచన (Motion) తెచ్చి బహుమతముగను బొందినందువలన ఈతఁడు ముఖ్య మంత్రిత్వమును వదలుకొనెను (౧౭౧౮). ఇతఁడు గ్రంథకర్త. గ్రీకువారి శిల్పకళలోని 'సౌందర్య తత్త్వము' అను గ్రంథమును రచించెను.

అబలాసచ్చరిత్రరత్నమాల.

చూడు అచ్చమాంబ.

అబాఖాన్. పారసీక దేశపురాజు, మొగల్ లేక తార్తర్ శాఖవాఁడు. చంగిస్ఖాన్ వంశజుఁడు. ఇతనితండ్రి ఖులాభూఖాన్. తండ్రిం తరువాత నీతఁడు క్రీ ౧౨౬౫ లో రాజ్యమునకు వచ్చెను. జూన్ ౧౯ శుక్రవారమున రాజ్యాభిషిక్తుఁడయ్యెను. ఇతఁడు ధైర్యశాలి తెలివిగలవాఁడు, ప్రజలయెడల దయగలవాఁడు, న్యాయశీలుఁడు. జెరుసలేములోనుండు క్రైస్తవుల కితనివలన కొంత బాధకలిగెను. మైకెల్ పేలియోలొగస్ అను కాన్స్టాంటినోపల్ చక్రవర్తియొక్క కూఁతునతఁడు వివాహమాడెను. ఈమెను మొదట నీతని తండ్రి వివాహమాడ నిశ్చయించి పిలిపించెను. కాని యీమెవచ్చులోపల నాతఁడు మృతినందినందున అబాఖాన్ వివాహమాడెను. ఇతఁడు పదునేడు సంవత్సరములు రాజ్యముచేసి క్రీ. శ. ౧౨౮౨ ఏప్రీలు ౧-వ తేదిని మరణమునందెను.

అబాజిత్. (ఫర్మిన్, అబాజిత్- Firmin Abauzit) (౧౬౭౯-౧౭౬౭). ఇతఁడు ఫ్రాన్సు దేశమునందలియొక ప్రసిద్ధకవి. ఇతని తండ్రి అరబ్బిజాతీయుఁడైనను తల్లిదండ్రులు ప్రొటెస్టాంటు మతస్థులు. రెండేండ్లవయస్సుననే తండ్రిచనిపోయినందున నధికారులీతనికి రోమన్ కాథలిక్కు మతమును బోధించు నేర్పాటుచేయుటచే తల్లి యీతని జెనీవా నగరమునకు పాఱిపోవునట్లు చేసెను. ఇతఁడును ఇతని తమ్ముఁడును కెవినీసు పర్వతముల మీఁద రెండు సంవత్సరములు దాగియుండిరి. ఈమెయు నింతకాలము చెఱసాల యందే యుండి తప్పించుకొనివచ్చి కొమాళ్ళనుగలిసికొనియెను. ఇతఁడు చక్కఁగాఁ జదువుకొని అనేకభాషలయందును, పదార్థవిజ్ఞానశాస్త్రమునందును, మతగ్రంథములయందును ప్రావీణ్యమును సంపాదించి న్యూటన్, వాల్టేయర్, రోసో మొదలగు విద్యాధికులమెప్పును గాంచెను. ఇతఁడు విశేషముగ దేశసంచారమును గావించి ప్రఖ్యాతుఁడయ్యెను. బైబిలులోని నవనిబంధనమును ఫ్రెంచిభాష లోనికి తర్జుమాచేసెను. మఱియు ననేక గ్రంథములను విరచించెను.

అబాక్శోర్టు. (చార్లస్ క్సేవియర్ జోసెఫ్ ౧౭౪౪-౧౮౨౨). ఇతఁడు ఫ్రాన్సు దేశపురాజయిన పదునాఱవ లూయీరాజునకు సహాయుఁడుగ నుండెను. ఫ్రెంచివిహారు రాజు

పైని తిరుగఁబడ్డి దేశమ్మును కల్లోలపఱచిన పుడు ౧౬౮౪వ సంవత్సరమున యుద్ధ మంత్రిగ నియమింపఁబడియెను. వార్సెల్లీసు నగరమునజనసమూహముచేఁజంపఁబడియెను.

అబానో (పీట్రో డీ) (౧౨౫౦-౧౩౧౬) ఇటలీ దేశములోని పాడ్వా పట్టణమున జనించి ప్రసిద్ధిగాంచిన యొక వైద్యుఁడును తత్త్వశాస్త్ర వేత్తయునై యుండెను. ఈతఁడు గ్రీకుభాష నేర్చుకొనుటకై పారీసు నగరమునకుఁబోయివిద్యాభ్యాసముచేసివైద్య శాస్త్రమునందును,తత్త్వశాస్త్రమునందును డాక్టరుపట్టమును బొందెను. ఇతఁడు స్వస్థానము చేరినతరువాత గొప్పవైద్యుఁడని ప్రఖ్యాతి కలుగుటచేతచికిత్సచేయించుకొనుటకై యనేక రోగులురాఁదొడంగిరి. అందుచేత నధికధనము నార్జింపఁగోరి యెక్కువ ధనమీయఁగలరోగులనే చేరఁదీయుచు వచ్చెను. ఇదియునుగాక, జోశ్యమునందును జోక్యము కలిగియున్నాఁడను కారణముచేత కాఁబోలు నితఁడు స్పర్శవేదిమణి కలిగియున్నాఁడనియు, మంత్ర విద్యా ప్రభావముచేత తానితరుల కిదివఱకు చెల్లించియుండిన సొమ్మంతయు మరలరాఁబట్టుకొని ధనాగారము నించుచున్నాఁడనియు యభియోగములు తేఁబడినవి. మతనియమ భంగములనుగూర్చి కాథలిక్, మతగురువులు చేయు విమర్శాసభకు రెండు సార్లు రప్పింపఁబడియెను. మొదటిసారి నిర్దోషియని విడచిపెట్టఁబడియెను గాని రెండవ సారి విచారణ ముగింపునకురాక పూర్వమే మృతి నొందెను. అట్టుచిమ్మట మతగురువులు దోషియని తీరుమానించి పాతిపెట్టఁబడిన వానిశవమును పైకిదీసి తగులఁబెట్టవలసినదని యుత్తరువుచేసిరిగాని యింతలో నతని మిత్రులు డొకఁడు దానిని రహస్యముగా తొలగించివైచెను. అయినను గురుసభవారు దండోరా మూలమున వానిమరణశిక్షను ప్రకటించి అబానోవంటి యాకారముగల బొమ్మను జేయించి దానినగ్నిహోత్రమున కర్పణము చేసిరి. ఇతఁడు వైద్యశాస్త్రమునందును తత్త్వశాస్త్రమునందును అనేకగ్రంథములను రచియించెను.

అబిచ్ (విల్హెల్మ్ హెర్మాన్ అభిచ్—౧౮౦౬-౮౬.) భూగర్భ శాస్త్రజ్ఞుఁడు. జర్మనీ దేశమునకు రాజధానియగు బెర్లిన్‌నగరమున జనించెను. డోర్పట్ అను పట్టణమున ఖనిజశాస్త్రమునందు పండితోపాధ్యాయుఁడుగ నుండెను (౧౮౪౨). కకాసస్, రుష్యా రాష్ట్రములోని ఆర్మీనియా, ఉత్తర పారశీకము, దాఘేస్థానము మొదలగు దేశములకుఁబోయి భూములన్వేషించి భూగర్భ శాస్త్రమునుగూర్చి గ్రంథములను రచియించెను.

అబిమెలెచ్. (౧). ఇతఁడు గెరారు దేశపురాజు. అబ్రహాము పొరపుచ్చినందున, 'సారా' అనునామెను దెచ్చి యంతఃపురమున నుంచెను. కాని స్వప్నములో దేవుఁడు ప్రత్య

క్షమ్ము హెచ్చరిక చేసినందున సారాను మరల స్వామి భర్తవశము చేసెననుకథకలదు. ఇట్టి కథయే ఇసాక్ రెబెకాలను గూర్చికూడ వినబడుచున్నది (జెనిసిస్. ౨౬). శచిమైట్ జాతిస్త్రీ యొక్క తెయు, గిడియోన్ యొక్క కుమారుడును "అబిమెలెచ్" ను రాజుగా గైకొనుడని ప్రోద్బలము చేయగా నితడు జోతమ్ అను వానిని దక్క తనసవతి సోదరుల డెబ్బదిమందిని చంపించెను. తుదకు శచిమైట్లు వానిపై తిరుగబడిరి. 'తీబెజ్'ను తార్కొను నప్పుడొక స్త్రీవలన తిరుగటి రాయిచేత తలబ్రద్దలు కొట్టబడియెను, కాని స్త్రీచేత చంపబడియెనన్న యవమానమునకు బాల్ప డకుండ దనకవచమును మోయుచున్న వానిని తన్నుజంపుమని యాజ్ఞ చేసెను.

అబిల్ క్లార్కు: (౧౭౮౦-౧౮౨౬) మెకార్టనే ప్రభువు చైనా దేశమునకు వెడలినపుడీ అబిల్ క్లార్కునుగూడ తన వెంట నిడుకొనిపోయెను. ఈతడు గొప్పవైద్యుడు. మెకార్టనే తరువాత అహంరస్టు ప్రభువునకు కూడ నీతడు వైద్యుడుగ నుండెను. ఈతడు ౧౮౨౬లో చనిపోయెను.

అబిషాయ్. దేవిడ్డురాజునకు మేన ల్లుడు. ఇతడు ధైర్యసాహసములు గలిగి రాజు నెడ విశ్వాసముచూపుచు నాతని వెంబడించిన వాడు. సాలుస్కంధా వారముపై నర్ధరాత్రిమున నడిపించిన దండయాత్రలో రాజునకు తోడ్పడియెను. డేవిడ్డు సింహాసన మెక్కినతరు వాత ననేకయుద్ధములలో ప్రవేశము గొనుట యెగాక ముఖ్యసేనాధిపతులలో నొకడ డయ్యెను.

అబిసీనియా. ఆఫ్రికా ఖండము నందు ఈశాన్యమునగల యొకస్వతంత్ర సామ్రాజ్యము. దీనికి హాబషా అనునది మూలనామము. ఎథియోపియా అనునది గ్రీకువారిచే పెట్టబడినపేరు. ఇప్పటియూరోపి యనులందఱును 'అబిసీనియా' అని వ్యవహ రింతురు. రాకపోకల కనుకూలముగల స్థితి యందు లేమింజేసి ఆఖండపు దేశములన్నింటి లోనిది నాగరికమున అథమస్థితియందున్నది. దీనికి నుత్తరమున ఈజిప్టు ఎరిట్రియాలును, తూర్పున ఎరిట్రియా సోమాలిలాండులును, దక్షిణమున సోమాలిలాండు బ్రిటిషుతూర్పు ఆఫ్రికాలును, పశ్చిమమున సూడాను మధ్య ఆఫ్రికాలును ఎల్లలు. విస్తీర్ణము ౨౦౦,౦౦౦ ల చదరపుమైళ్లు. జనసంఖ్య రమారమి ఒక కోటి.

విమానములో గూర్చొని ఆకాశమధ్య మునుండి ఈదేశమును చూచితిమేని అగ్ని యందు కమిలిన వంకాయ మాదిరి కనబడగలదు. ఇట్టి యాకారమునకు భూగ ర్భమున యుగములుగ బనిచేయుచుండు అగ్నిబలమే కారణమని చెప్పుదురు. అబిసీ నియా దేశము సమభూమిగాదు. అపరిమిత మయిన మిట్టపల్లములుగల ప్రదేశము. సము

ద్రముట్టమునకు ౫,౦౦౦ అడుగులు మొదలు, ౧౦,౦౦౦ అడుగులవఱకు ఎత్తుగల ఉన్నతభూములను మిక్కిలి యగాధములగు లోయలును ఈదేశ విస్తీర్ణమునంతయు నాక్రమించుకొని యున్నవి. అచ్చటచ్చట ౧౫,౦౦౦ల అడుగుల ఎత్తునకుఁ బ్రాకు పర్వతములుకలవు. కాని ఇవిక్రమమైన వరుసలుగ లేవు. ప్రకృతి వైపరీత్యమును ప్రకటించుచు నియ్యవి వంకరటింకరలై, వ్యాపించియున్నవి. ఇందు సేమెను అనుపర్వత పంక్తిమాత్రముకొంచెము నిడివికలది, ఉత్తర దక్షిణములకువ్యాపించినది. సీమోన్నతవైపరీత్యమువలననే గొప్పనదులును లేవు. ప్రదేశము సమముగ నేటవాలగు పశ్చిమోత్తర భాగమున మాత్రము మూఁడునదులు గలవు. మారెబు, అట్బారా, అబే అనునవి నైలు మహానదియందు చేరునవి. తక్కుంగలయెడములనెల్ల ఉన్నతభూములనుబడి లోయల్లోనికి దుముకు సెలయేళ్లే మెండు; ఇవి వానకాలమున ప్రవహించుచు బురదనేలలోను ఎడారులలోను కనపడకుండ పోవుచున్నవి. పేరుగల సరస్సొక్కటి మాత్రముగలదు: దానిని డెంబియా లేక సానాయని అందురు. నైలునది యందొకభాగ మిందుండి పుట్టును. ఈ కారణములచే అబిసీనియాయందు శీతోష్ణస్థితి యుఁ బెక్కువిధములుగఁ గన్పట్టును. ఉన్నత భూములు సమశీతోష్ణములుగలవయ్యి హాయినొసంగుచుండును. లోయలలో శీతోష్ణస్థితులు విపరీతములయ్యి శీతజ్వరములు మున్నగునవి ఒక్కొక్క సమయమున బాధాకరములగుచుండును. ఉన్నతభూములలో గోధుమ, అరటి, పొగాకు, నిమ్మ, దానిమ్మ, ద్రాక్ష, టెంకాయ, బార్లి, ఓట్లు, వేరు మున్నగునవియు, ఉష్ణప్రదేశములగు లోయలలో చెఱకు, ప్రత్తి, కాఫీ*, ఖీలి, చింత, అరటి, అత్తి, తుమ్మ మొదలగునవియు ఉత్పత్తియగును. ఇనుము, బంగారము, నల్లబొగ్గు, ఉప్పు, గంధకము, రాగి, వెండి, రాతిఉప్పు మున్నగు ఖనిజపదార్థములు దొరకును. ఏనుగు, ఖడ్గమృగము, నీటియేనుగు (హిప్పొపాటమసు), జీబ్రా, ఎనుము, జింక, తోడేలు, సింహము మొదలగునవి సామాన్యమృగములు. చిత్రవర్ణములుగల పక్షులనేకములు గలవు.

యుద్ధభటులుగ నుండుటయే ఉత్తమోద్యోగమని అబిసీనియనుల యభిప్రాయము. వారు చేతిపనులను వ్యాపారములను నిరసింతురు. నూలువస్త్రములను ఊర్ణవస్త్రములను నేయుటయు లోహములతో పనిచేయుటయు తోళ్లను పదును చేయుటయు అబిసీనియాలోని ముఖ్యవృత్తులు. బంగారు, పునుగు, దంతము, కాఫీ, మైనము, జిగురు ఇవి ముఖ్యములైన ఎగుమతులు. ఒంటెలు, కంచరగాడిదెలు, గాడిదెలు, గుఱ్ఱములు వాహనములుగ నుపయోగింపఁబడుచున్నవి.

* ఇది అబిసీనియా నైఋతిమూలయందలి కాఫా యను భాగమున విశేషము పంటయగుచున్నది. ఆపేరునుబట్టియే దీనిని కాఫియనుట.

జను లనేకజాతులవారుగలరు. దక్షిణ అరేబియా నుండివచ్చిన సెమెటిక్కు జాతివారు ప్రముఖులు. రెండుముఖ్య భాషలు ప్రచారమందు గలవు. అమ్హారిక్కు రాజకీయభాష. 'ఇథియోపిక్కు' అనఁబడు 'గీజు' భాష దేశభాషయున నొప్పును. ఇందే వాఙ్మయంబును గలదు.

ఈ దేశమున జనులు క్రైస్తవమతస్థులు. అయిన నిది యొకవిచిత్రమగు క్రైస్తవ మతము. వీరు రోమను క్యాథలిక్కులుగాని ప్రాటెస్టాంటులుగాని కారు. క్రైస్తవమతములో వీరిది యొకస్వతంత్రశాఖ. అలెక్జాండ్రియాలో నుండె పాట్రియార్కు అనువారిచే వీరిముఖ్య గురువు నియమింపఁబడును. వీరి మతమును మోనోఫైసైట్ (Monophysite) క్రైస్తవ మత మందురు. ఇందు కొందఱు యూభూతీ మతస్థులుగూడఁ గలరు. అఫార్, సావహోలి గల్లా ప్రాంతములలోని బహుజనము మహమ్మదీయ మతమువారు.

అబిసీనియా సామ్రాజ్యమునందు చక్రవర్తిచే స్వయముగఁ బాలింపఁబడు అబిసీనియా దేశముగాక షోవా, కాఫా, గల్ల మధ్యసోమాలీ అను సామంత రాజ్యములు గలవు. అబిసీనియా దేశము పరిపాలన నిమిత్తము ముఖ్యముగ నాలుగు మహామండలములుగా విభజింపఁబడినది. ఈశాన్యమున టైగ్రె, ౨. నడుమహమ్హారా, ౩. దానికి దక్షిణమున గోజాం, ౪. దక్షిణమునషోవా.

అనాదిగ నీదేశము నిరంకుశులగు రాజులచే పరిపాలింపఁబడుచు వచ్చుచున్నది. ప్రాచీనకాలమున ఇథియోపియాయని పిలువంబడుచుండిన ఈఅబిసీనియాకును ఈజిప్టుసామ్రాజ్యమునకును విశేషసంబంధము ండెను. కావున నీరెండు రాజ్యములు నాగరికవిషయమున పరస్పరము పోషకము లయియుండె. టాలిమీల కాలమున గ్రీకుల యధినివేశము లీదేశమున నెలకొల్పఁబడియె. క్రీ. శ. ౩౩౦-వ సంవత్సరప్రాంతమున క్రైస్తవ మతము ఈభూమింజొచ్చె. క్రైస్తవాచార్యుల పలుకుబడి రాజులవద్ద చెల్లుచుండె. కాలెబ్ అనురాజు తనమతస్థులగు క్రైస్తవులను గొందఱిని పీడింపుచుండిన ఈమెన్ దేశపురాజుపై దండువెడలి అరేబియాచొచ్చి అతనిని పరాజితునిజేసి ఆ దేశభాగము నాక్రమించుకొనెను. ఇదియె అబిసీనియా చరిత్రమున నుత్తమకాలము. ఇథియోపియనులు అరేబియాలోని సారవంత భాగమును కైవశము చేసికొనినవారై విస్తారవ్యాపారము నడుపుచు హిందూదేశము సింహళము వఱకుఁ బోవుచుండిరి. మహమ్మదీయ లేడవ శతాబ్దమున విజృంభించుటచే అబిసీనియా బలంబణఁగిపోయె. తమ మతమునకు శత్రువులగు తురుష్కుల యొత్తిడి వలన అబిసీనియాయొక్క యంతర్భాగమునకుఁ దరుముఁబడిన వారయి ఈ ఇథియోపియనులు పదునైదవ శతాబ్దాంతము వఱకును నాగరిక ప్రపంచమున కగోచరులయిరి. ఆఫ్రి

కాఫండమునందు నీశాన్యభాగమున నేదో యొక క్రైస్తవజాతి కలదని బహుకాలమునుగ గాలివార్తగ వినుచుండిన పోర్చుగీసుమతాచార్యులు క్రీ. శ. ౧౪౯౦-వ సంవత్సరమున నబిసీనియాను కనుగొనిరి. వీరికిని నీగస్తునీగసునకును (ఇది అబిసీనియా రాజు బిరుదము; రాజులకు రాజని యర్థము) స్నేహము కుదిరెను. క్రీ. శ. ౧౫౨౭ మొదలు ౧౫౪౦ వఱకును ప్రచండయోధుఁడగు తురుష్కుఁడు మహమ్మదుగ్రాగనునకును అబిసీనియా చక్రవర్తికిని జరిగిన పోరాటములో పోర్చుగీసువారు నీగసునకు సాహాయ్యపడిరి. హిందూదేశమునుండికూడ సైన్యము లనుపఁబడియెను.

మహమ్మదుగ్రాగన్ గుండుదెబ్బచే మృతుఁడగుట వలన నీగసునకు సంపూర్ణజయము కలిగె. తదనంతరము ఇతనికిని పోర్చుగీసు క్రైస్తవాచార్యుఁడు బర్ముడసునకును వివాదం బయ్యె. బర్ముడసు అబిసీనియా వదలివచ్చు వాఁడాయె. క్రీ. శ. ౧౬౩౩-వ సంవత్సరము వఱకును గొంద ఱైరోపియనులు అబిసీనియా కుఁబోయి రాజును స్నేహము చేసికొనుచు వచ్చిరి. కాని ఆతరువాత నొక శతాబ్దకాలము ఐరోపియను లెరును అబిసీనియా లోనికిఁ బోరైరి.

౧౬-వ శతాబ్ద మధ్యమునుండి ఆదేశమునకు దక్షిణము నందుండిన 'గాలాలు' అనుజాతివారు అల్లనల్లన లోనికిఁ జొచ్చి దేశము నాక్రమించు కొనిరి. ౧౮-వ శతాబ్దాంతమున చక్రవర్తి వారిచేతులలోనిజిక్కి క్రమముగ తగ్గుచువచ్చుచుండిన చక్రవర్తి బలము సంపూర్ణముగ నశించె. తత్కాలమున నేనాపతుఁడు బలవంతుఁడగువాఁడే చక్రవర్తిని వెళపఱచుకొని అతనిమంత్రియను పేరిట రాజ్యమేలుచుండెను. ఈప్రకారము ౧౮౫౫-వ సంవత్సరము వఱకు ననేక రాజులయిరి. ఆసంవత్సరమున విజ్‌కాసాయను వాఁడు మూఁడవ థియొడోరను బిరుదముతోఁ జక్రవర్తియయ్యెను. ఇతఁడు అబిసీనియాయందలి పశ్చిమభాగమునను౦డు కొరామండలమున ౧౮౧౮ లో జన్మించెను. ఇతని పినతండ్రి డంబియా, కొరా పెల్గాయను మండలములకు గవర్నరుగా నుండెను. అతని మరణానంతరము విజ్‌కాసా కొర్గా మండలమునకు మాత్రము పాలకుఁడుగ నేమింపఁబడియెను. ఇదియతనిం దృష్టి పరపదయ్యె. కొన్ని ప్రయత్నములు చేసి ౧౮౫౫లో నితఁడు రాజయ్యెను. మిక్కిలి విపరీతమగు విజిగీష గలవాఁడయి కార్యము చూపుచు వచ్చినందున నీతఁడు నాశనమునకు మార్గ మేర్పఱచు కొనువాఁడాయె. మొదటమొదట నీతనికి బ్రిటీషువారికి మిక్కిలి స్నేహముండెను. కాని ౧౮౬౩-వ సంవత్సరమున నితఁడు ఆంగ్లేయ చక్రవర్తినికి వ్రాసి పంపిన యుత్తరమునకు జవాబే రానందున సహజముగ కోపియగు నీథియొడోరు బద్ధవైరుఁ డాయెను. ఎన్ని ప్రయత్నములు చేసినను ఈవైరము మానినదిగాదు. ౧౮౬౭-వ సంవత్సర

మున నిత్రనిక్కిని ఆంగ్లేయులకును విగ్రహము ప్రారంభమాయెను. థియోడోరు బహాదుర్షాయము వారిని సంధి చేసికొనఁ బ్రయత్నించి విఫలమనోరథుఁడయి తప్పించుకొనిపోవ ప్రయత్నించి దానికిని మార్గము కానక ఆత్మహత్య చేసికొనెను. మాగ్డలా ఆంగ్లేయుల స్వాధీనమాయెను. ఈయుద్ధమునఁ వీరికి సాయముచేసిన టిగ్రీపాలకుఁడగు కాస్సయనువాఁడు జోహాన్నసు రాజను పేరిట అబిసీనియా చక్రవర్తియయ్యె. ఆంగ్లేయులంతటితో అబిసీనియా వదలిరి. జోహాన్నసు ౧౮౮౯-వ సంవత్సరమున యుద్ధమునందు హతుఁడయ్యెను. యూరోపునందు బలవత్తములగు ఫ్రెంచి, జర్మను, ఇటాలియను, పోర్చుగీసు, బ్రిటీషుజాతులవారు ఆఫ్రికా ఖండమును స్వాధీనము చేసికొనుటయందు పోటీ పడుచుండిరి. అబిసీనియా వారి యాక్రమణలకు గురియయ్యెను. తుదకు ఆక్రమణకయ్యును విభాగించికొని యుండుట తటస్థించెను. అపుడు అబిసీనియా ఇటాలియనుల భాగమయ్యె. వారిసాయమున షోవారాజగు రెండవ మెనెలిక్కు అబిసీనియా చక్రవర్తి యయ్యెను. ఇటాలి యనులకు లోఁబడినదని పేరొక్కటియకాని అబిసీనియా ఎప్పుడును వారికిఁ జెందినదిగాదు. ౧౮౯౬-వ సంవత్సరమున ఇటాలియనులనోర్చి మెనెలిక్కు సర్వస్వాతంత్ర్యము వడసెను. ౧౮౯౭-వ సంవత్సరమున ఆంగ్లేయులతో స్నేహసంధి చేసికొనియె. ౧౯౦౦, ౧౯౦౨-వ సంవత్సరములలో అబిసీనియా, ఇరిట్రియా సూదానుల సరిహద్దులు నిశ్చయపఱచుకొను సంధులు జరిగెను.

ఇది నిరంకుశ ప్రభుత్వము. అయినను ౧౯౦౭-వ సంవత్సరము నవంబరు నెలలో చక్రవర్తి మెనెలిక్కు అబిసీనియాకు ఒక విధమైన సాంకుశప్రభుత్వము నొసంగెను. చక్రవర్తి అందఱకు పై నధికారి. అతనికి సాహాయ్యముచేయుటకై యొక సభయుండును. సామంతరాజ్యములలోని రాజులును, మహామండలముల పాలకులును ఇందు సభాసదులుగనుందురు. యూరోపు దేశములందలి మంత్రిమండలముల (Cabinet) వంటి మండలములుగూడ నీరాజుచే స్థాపింపఁబడెను. ఇతని యొద్ద ౧౫౦౦౦౦ సైన్య మెప్పుడు నిలువయుండును. అందలి సైనికులు యూరోపియను సైనికులవలె యుద్ధవ్యూహములను చక్కఁగ నేర్చి నూతనశస్త్రాస్త్రముల గలిగియుందురు. ఈదేశమిదివఱకు నాగరకతలో వెనుకబడ్డను ప్రస్తుతము జాతీయభావమందుఁ జక్కఁగ వికసించినది. ఇచ్చటివారు పూర్వము విశేషము విద్యావంతులు గాకపోయినను ౧౯౦౭-వ సంవత్సరమున పురుషులందఱును తప్పక చదువ వలయునను చట్టము చేయఁబడినది.

[గా. హా.

అబుల్ ఘాజీ బహాదర్.

(౧౬౦౩-౬౩) ఇతఁడు ఖైవాప్రభుత్వమును కుమారునకు నొప్పగించి చెంగిస్ ఖాను యొక్క వంశచరిత్రమును వ్రాసెను. అయ్యది జెర్మనీ, ఫ్రెంచి భాషలలోనికి తరువాత తర్జుమా చేయఁబడినది.